THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204640
UNIVERSAL LIBRARY

OUP—730—28-4-81—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. Accession No.

Author

Title

1937

This book should be returned on or before the date last marked below.

శ్రీ

# ధర్మసారరామాయణము

కళాప్రపూర్ణ, కావ్యస్మృతితీర్థ:

జనమంచి శేషాద్రిశర్మ విరచితము

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి

'వావిళ్ల' ముద్రణాలయమున

ముద్రితము.

1937.

(సర్వస్వామ్యములు గ్రంథకర్తయధీనములు.)

మూల్యము 3-0-0.

Printed by
V. VENKATESWARA SASTRULU
of V. RAMASWAMY SASTRULU & SONS
AT THE 'VAVILLA' PRESS,
Madras.—1937.



జనమంచి శేషాద్రిశర్మగారు.

శ్రీః
శ్రీపరమేశ్వరాయ నమః

# కృతిసమర్పణోత్సవము.

నైవాకృతిః ఫలతి నైవ కులం న శీలం,
విద్యాపి నైవ న చ యత్నకృతాపి సేవా,
భాగ్యాని పూర్వతపసా ఖలు సంచితాని
కాలే ఫలంతి పురుషస్య యథైవ వృక్షాః. భర్తృహరి.

మహాశయులారా!

ప్రాగ్జనికృతతపస్సంచితములు భాగ్యములు. అవి ప్రయత్నైకసాధ్యములు కావు. కర్మసిద్ధాంతము ననుసరించి కాలమున ఫలించునవి. ఎట్టిగట్టిప్రయత్న మొనర్చిన నెందఱు తోడుపడిన నవి ఫలింపవని తెలిసికొనుట బుద్ధిమంతులలక్షణము. ప్రయత్నైకసాధ్యములే యనుకొనుట మూర్ఖులలక్షణము. దైవపౌరుషములసారము వలె నిదియు గ్రహింపఁదగినది. కొందఱు ఆస్తికాభాసులు కర్మసిద్ధాంతము నవలంబించినట్లు నటించుచు నాస్తికాభాసులవలెఁ బ్రయత్నించుచుందురు. వారు రెండింటికిం జెడినరేవణునివంటివారు. విశ్వాసమూని భగవంతునిభంగిఁ గర్మమును నమ్మి దాని నాశ్రయించుచు నల్పఫలములఁగోరక భగవత్కృపనుగోరుచుండిన నది యతని యభివృద్ధికి హేతువగును.

ఏకార్యమునకును గర్మమే యాధారము. అది యదృశ్యరూపముకదా. ఎట్లు కార్యనిర్వహణదక్షమగునని కొందఱు ప్రశ్నింపవచ్చును. "దైవమ్ మానుషరూపేణ" అనున్యాయ మిద్దానికి నుత్తరముగనే పుట్టినదని యెఱుంగుట తెఱంగు. అదృశ్యపాశములం దగిలించి యాకర్మమే పిపీలికాదిబ్రహ్మపర్యంతముగల ప్రాణిసముదాయమును ద్రిప్పుచు నాడించుచుండును. ఎవ్వరిమూలమున నేకార్య మెట్టులెక్కాలమున సాధింపవలయునో యట్లే సాధించును. కార్యవిముఖుఁడు తటాలునఁ గార్యసుముఖుఁడగుట, కార్యసుముఖుఁడు హఠాత్తుగాఁ గార్యవిముఖుఁడగుట మనము కన్నులారఁ గాంచుచున్నారముకదా అట్లేల యుండవలయును? కర్మవశమున ననియే యుత్తరము కావలయుఁగాని వేఱుపద్ధతిని రాఁజాలదు. ప్రతిపక్షముఖపిధాన మొనరించి ఏదో చెప్పిన నది సాధుసమ్మతమగుసిద్ధాంతముకాదు.

కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః,
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి.

కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః,
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః.
యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే,
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి.
స్వభావజేన కౌంతేయ నిబద్ధస్స్వేన కర్మణా,
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్కరిష్యస్యవశోఽపి సన్.

అనుగీతావాక్యములసార మెఱింగినచోఁ బైవ్రాసినది సత్యమని తోఁపకమానదు.

ఒకవ్యక్తి కొంతకాలము సర్వజనరంజకుఁడై యుండుట, కొంతకాలము సర్వజనామోదముఁ బడయకుండుట మనము గాంచుచున్నారము. అట్లేల యుండవలయు ? కర్మవశముననే యనవలయుఁగాని వేఱుకారణమున ననవలనుపడదు. పురుషునిభాగ్యము నావినమే "భాగ్యాధీనమతఃపరమ్" అని కాళిదాసు వచించెఁగదా. భాగ్యమనఁగా నదృష్టము. అది కర్మఫలముగాక మఱేమగును ? ప్రపంచమంతయుఁ గర్మనిబద్ధమనునదియే సర్వకాలైకరూపస్థితసిద్ధాంతము.

స్వే స్వే కర్మణ్యభిరతస్సంసిద్ధిం లభతే నరః,
స్వకర్మనిరతస్సిద్ధిం యథా విందతి తచ్ఛృణు. ౪౫
యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్,
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః. ౪౬

అను నీశ్రీకృష్ణపరమేశ్వరోక్తి. కర్మసిద్ధాంతతత్త్వమును దానిననుసరించుపద్ధతిని దానివలనఁ గలుగుఫలములను దెలుపుచున్నది. ఇట్లు భగవదాశయ మొప్పుచుండఁగాఁ బౌరుషము ఫలించునను విశ్వాసముకలదని వాదించు టెంతపొరపాటు ? పౌరుషము కర్మఫలముల నందుసమయమున ఫలించుటంజేసి కొందఱదియే ఫలదాయకమని పొరపడుట కవకాశము గల్గించినదని నాదృఢవిశ్వాసము.

కర్మము బ్రహ్మస్వరూపము. యోగులు తేజోరూపమునను, భక్తులు స్వాభీష్టనిర్మితరూపమునను, జ్ఞానులు జ్ఞానరూపమునను, ఉపాసకులు కర్మస్వరూపమునను భగవంతునే యారాధింతురు. ఈయారాధన భేదములన్నియు ఫలదానమున సమానములే. దృఢవిశ్వాసమున నారాధించిన వార లేమార్గము ననుసరించినను భగవత్కరుణకుం బాత్రులౌదురనుట యనిర్భేద్యసిద్ధాంతము. ఈసిద్ధాంతము నాశ్రయించియే కవు లభీష్టదైవమును భగవంతునిగా నెదనెఱనమ్మి సుశబ్దసుమంబులఁ బొందుపఱచి పద్యగద్యహారముల సమర్పించి యారాధించి కృతార్థులౌదురు. ఈ యారాధనవిశేషమునే సత్కవులు

లౌకికానాం హి సాధూనామర్థం వాగనువర్తతే,
ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽనుధావతి.

యన్న సూక్తికిం బాత్రులగుదురు. అనఁగా వాక్శుద్ధిగలవారగుదురని భావము. వాల్మీకాదిమహాకవు లట్టివారేకదా.

ఈసిద్ధాంతము ననుసరించియే నేను ధర్మసార రామాయణమును వ్రాసితిని. రామచరిత్రమునకంటె సుప్రసిద్ధమగుకథ యొండొకఁడు లేదని నానమ్మకము. ఆసేతు శీతాచల మిది వ్యాపించియున్నది. హిమాలయకందరాంతరముల నివసించుభిల్ల కుటుంబములందును శ్రీరామచరితము గేయరూపమునఁ బాడఁబడుచుండుట సార్వజనీనము. అట్టి శ్రీరామచరిత్రమును

యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః,
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే.

అనుభగవద్గీతోక్తి నాధారముగఁ గొని నాచేసిన స్మృతిపురాణేతిహాసపరిశ్రమము ఫలించునట్టు లాయాయిభాగములందు నాయాధర్మములను జేర్చితిని. జానకీశ్రీరామ చంద్రలక్ష్మణాదులవర్తనమే ధర్మశాస్త్రములు లోనగువాని కుదాహరణమనువిశ్వాసము కలవాఁడను గాన నాయోపినంతవట్టు నదలక సంచర్యముల ననుసరించి సదాచారములు మొదలగుధర్మకదంబమును వివరించితిని. మతభేదముల ననుసరించి శివ విష్ణ్వాదుల దూషింపరాదనువిషయము పలుతావుల నొక్కి వక్కాణించితిని. ఒక్క విషయమునే పలుతావులఁ జేర్కొనుట సముచితము కాదని కొందఱందురు. నిజమే కాని మరలమరలఁ దెల్పినఁగాని మనస్సులకుఁ బట్టనివిషయములు కొన్ని గలవు. వానివిషయమునఁ బునరుక్తత యనుదోషము పాటింపరాదని నిరాఘాటముగఁ జెప్ప వచ్చును. భగవన్నామసంకీర్తనముభంగి ధర్మకర్మకదంబము నెన్నిమాఱులు చెప్పినను దోషముగాక గుణముగనే పరిగణింపఁబడఁదగును. అట్లుచెప్పుట దోషమనుట యిన్ని యుపనిషత్తు లేలయన్న ప్రశ్నమువంటిది.

సీతారామాంజనేయము యోగమార్గమును దెల్పఁ గంకణముకట్టుకొన్న గ్రంథము. కలియుగమున నది సర్వజనోపకారకము కాఁజాలదు. ప్రవృత్తిమార్గమున ననేకభేదభావములు, సదాచారములు నిరర్థకములను నూహలు, శాస్త్రము లను వదించుపద్ధతు లనుష్ఠేయములు కావనుతలంపులు, కాలానుసారముగా నలవాటులను మార్చుకొనవలయు నన్నయుద్దేశములు, భగవంతునినమ్మి స్వేచ్ఛాప్రవర్తనము నరికట్టుట పురోవృద్ధికిభంగముకదా యనువాదములు పెచ్చుపెరుఁగుచున్నవి. కావునఁ బామరుల కిట్టియిక్కట్టునఁ బ్రాచీనాచారముల, భగవదారాధనక్రమములు లోనగు వానిని శ్రీరామచరిత్రము నాధారముగఁగొని శాస్త్రమర్యాదల నతిక్రమింపక

యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిం.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి.

అను భగవదుపదేశమును నమ్మి యుద్యోధించితిని. కథావిషయమున నించుక మార్పు లుండును. అవి వాల్మీకిమహర్షిమతవిరుద్ధములుగావు. ఈవిషయమంతయు గ్రంథాది భాగమునఁ బెద్దలకు విన్నవించితిని.

గ్రంథము పూర్తికాఁగా నిఁక ముద్రణ మెట్లు సాగింపఁ దగుననునూహ కలిగె. నెల్లూరుమండలపరిపాలకసభాధ్యక్షులు విద్వత్క్షవిప్రభువరవంశసంభూతులు విద్వత్సమ్మానతత్పరులు శ్రీవేంకటగిరి రాజ్యపాలకులు, ఉముదేరాజవహా లోనగుబిరుదములుగల విద్యావినోదులు నిరంతరాశ్రితపోషకులు నగు శ్రీరాజా వెలుగోటి సర్వజ్ఞకుమారకృష్ణయాచేంద్రబహదూరువారిని నెల్లూరునగరమున సందర్శించితి. ఏకాదశీవ్రతోపవాసశ్రములయ్యు నాయాశయము నెఱింగి తమపాఠశాలలకు నారచించిన సత్ప్రవర్తన మనుపొత్తముం గొన నవధరించి యుపాధ్యక్షులు, పరోపకారతత్పరులు విద్యాపక్షపాతులు నగు మ-రా-రా-శ్రీ, పొణకా గోవిందరెడ్డిగారి కావిషయముం దెలిపిరి. వారు సంతోషమున నంగీకరించి యుత్తరువు నొసంగిరి. తత్కాలమున రెండువందలయేనుబదిరూప్యములు నాకు లభించె. వానికిం బత్త్రములం గొని వావిళ్లముద్రణాలయమున ముద్రించితిని. ఏతద్విషయమున మ-రా-రా-శ్రీ, వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారిసాయ మపారము. దీనివెంట నిట్లే కలివిలాసము నెల్లూరుమండలపాలకసంఘసహాయమున ముద్రింపఁబడియె. ఏతద్విషయమున శ్రీశ్రీశ్రీ మహారాజులుగారికిని శ్రీయుత పొణకా గోవిందరెడ్డిగారికిని దక్కిన తత్సభ్యమహాశయులకు నాకృతజ్ఞతం దెలుపుకొనుచు వారిని సంస్మరించుచుందునని విన్నవించుచున్నాఁడను.

ఆచారముననుసరించి ముద్రణముపూర్తికాఁగాఁ దరువాతిపని కృతిసమర్పణోత్సవమని యెల్లరయుల్లములఁ బల్లవించువిషయమే. రామాయణము శాంతిగ్రంథమని పెద్దలయాశయము. దీనాంధబధిరకుబ్జులకు నన్నదానము చేయవలయుననునూహ నాకుఁగలుగుటకు శ్రీమద్రామాయణమునఁగల

ప్రదేయాంశ్చ దదౌ రాజా సూతమాగధవందినాం,
బ్రాహ్మణేభ్యో దదౌ విత్తం గోధనాని సహస్రశః.

యీశ్లోకమే కారణము ఇక్కార్యము నెఱవేఱు టెట్టులని యూహాలుపొడవుగాఁ బొడమసాగెను. కడపపురమున నిక్కార్యము సాగింపఁదలంచితినిగాని కాలమును భావముల ననుసరించి మానుట మంచిదనితోఁచె. ఒక్కతఱి నేకాంతమునఁ గూరుచుండి యూహించుచుండఁ దటాలున బళ్లారినగరము స్మృతిగోచరమయ్యె. వెంటనే యుదారస్వభావులు భాషాపక్షపాతులు ధార్మికులు నాయం దత్యంతప్రీతిగలవారు

రసికాగ్రగణ్యులునగు మ-రా-రా-శ్రీ, టి. రాఘవాచార్యులు, బి. ఏ., బి. యల్., గారికిని, నగురూరు నారాయణరావు, బి. ఏ., బి. యల్ , గారికిని, వ్రాసితి. కొలఁది దినములకే సంతోషముం దెలుపు నుత్తరమువచ్చెను. బాహుమూలములఁ దట్టితిని. వారు నధ్యక్షునిర్ణయమునఁ గొంతకాలము గడపవలసినవారైరి. తుదకు నాంగ్లశకమున 9-1-38 అనఁదగు కాలమునకుఁ దుల్యమగు నీశ్వరసంవత్సర పౌషశుక్లాష్టమీ భానువారమని నిశ్చయింపఁబడియె. కథ శ్రీరామచంద్రునిది. దినము సదాశివునిది. వారము కర్మసాక్షియగుమార్తండునిది. ఈమూఁడును గలియుటుత్తమమని భావించితి. మఱిమఱి సంభావించితి. ఏతత్సభాధ్యక్షులు మహామహోపాధ్యాయ కళాప్రపూర్ణ కవిసార్వభౌమాంధ్రవ్యాసబిరుదాంచితులు మహాభారతాదిశతాధికగ్రంథకర్తలు శ్రౌతస్మార్తకర్మాచరణనిరతు లుదారస్వభావులు పరోపకారనిరతులు నగు బ్రహ్మశ్రీ, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులుగారని తెలియవచ్చెను. ఇట్లు కుదురుట ప్రాగ్జన్మసుకృతఫలమని తలంచితిని. ఏతత్సభాకార్యనిర్వాహకులు పురపాలకోన్నతపాఠశాలాప్రధానోపాధ్యాయులు పండితాదరణస్వభావులు విద్యాధికులు దేశభాషాభిమానులునగు శ్రీమాన్ మ-రా-రా-శ్రీ, కే. యస్. వేదాంతము, బి.ఏ.,ఎల్.టి, గారుగా నేర్పడుట మఱింత శ్రేయోదాయకమని సంతసించితి. అధ్యక్షులు కృష్ణమూర్తులు కార్యనిర్వాహకులు వేదాంతులు నగుటకంటె వాంఛింపఁదగిన దేద్ది? ఇక్కార్యమున బద్ధాదరులఁ జేరొక్కంటినిగదా.

ఆయుత్సవమునకుఁ బ్రధానము బీదలకు సన్నదానమని తెలిపితినిగదా. ఆమహత్తరధర్మకార్యమునకుఁ బూనినవారు మ-రా-రా-శ్రీ, విట్టా శేషప్పశ్రేష్ఠిగారు వీ రార్యవైశ్యకులసంభవులు. అనేకసంస్కృతాంధ్రగ్రంథపరిశోధకులు. అనేకధర్మకార్యము లొనరించువారు. నిరంతరరామాయణ మహాభారతపారాయణాసక్తచిత్తులు. దత్తాత్రేయాదిభగవదవతారార్చనాదరులు. ప్రతివత్సరకృతభగవదారాధనవిశేషసమయమ్మృష్టాన్నసంతర్పితసహస్రాధికసద్ద్విజులు నగుదురు. అట్టివా రిక్కార్యమునకుఁ బూనుటయు మహానందజనకమే.

కవివారమహోత్సవము గురుశుక్రశనివారములు సాగెను శ్రీకృష్ణదేవరాయ ధర్మవరకృష్ణమాచార్య కోలచల శ్రీనివాసరాయకవిశేఖరులవర్ధంత్యుత్సవములు విశేషోత్సాహమున జరగెను. శ్రీకృష్ణమూర్తిశాస్త్రులుగారే యధ్యక్షులు. నేను నాయుత్సవములం దిలకించితిని భానువారముదయము ఎనిమిదిగంటలకు శ్రీవిట్టా శేషప్ప శ్రేష్ఠిగారి హర్మ్యమునుండి శ్రీరామచంద్రరూపచిత్రితపటము ధర్మసారరామాయణ కలివిలాసగ్రంథద్వయము విప్రప్రవరవేదనాదములతో మంగళవాద్యపురస్సరముగా నుత్సవముసాగెను. ఉన్నతపాఠశాలను జేరెను. మ-రా-రా-శ్రీ, టి. రాఘవాచార్య ప్రభృతులు న్యాయవాదులు పౌరప్రముఖులు పెక్కండ్రు శ్రీయుత యం. గోపాలస్వామి మొదలియారుగారు లోనగుమాన్యులు నందుఁబాల్గొనిరి. అధ్యక్షులు మహా

మహామహోపాధ్యాయాదిబిరుదాంచితులు బ్రహ్మశ్రీ, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులుగారు తమపీఠము నలంకరించిరి. వైదికపద్ధతిఁ బూజించి శ్రీరామచంద్రునిమ్రోలఁ గృతిసమర్పింపఁబడియె. పౌరాణికాగ్రగణ్యులు విజయనగరనివాసులు బ్రహ్మశ్రీ, సుబ్రహ్మణ్యశాస్త్రులుగారు రామావతారకథ నుపన్యాసమున "వీనులవిందైయమృతపుసోనల పొందై" యన్నట్లు శ్రోతలానందసాగరమున నోలలాడుచుఁ జిత్రప్రతిమలవలెఁ జూపట్టునట్లు సులలితవాగ్గుంభనలఁ జక్కఁగాఁ జెప్పిరి. వారివాగ్ధాటి గంగాప్రవాహమువలె నతినిర్మలమై శ్రోతలమనస్సుల నానందపరవశముల నొనర్చెను. శ్రీ రాఘవాచార్యులయనుమతి నందందుఁ గొన్నిపద్యములు చదువఁబడియె. కృతిసమర్పణోచితముగ నధ్యక్షమహాశయులు ముచ్చటించిరి. శ్రీయుత విట్టా శేషప్పశ్రేష్ఠిగా రమూల్యకౌశేయాంబరప్రదానమున గ్రంథకర్తను సమ్మానించిరి. ఉద్యోగమునుండి విశ్రాంతినైకొనిన మ-రా-రా-శ్రీ, డబ్ల్యు గోవిందరావు బి. ఏ., గారు, కౌశేయవస్త్రము లొసంగి కృతికర్తను సత్కరించిరి. పదునొకండుగంటలుకాఁగా నధ్యక్షమహాశయులు సభనిలిపి మరల సాయంకాల మైదుగంటలకు సాగఁగలదని సెలవిచ్చిరి. తొలిదినమునఁ బాఠశాలాప్రధానోపాధ్యాయులు శ్రీవేదాంతము గారును, ఆదినము ప్రధానాంధ్రపండితులు సరసకవులు కావ్యతీర్థ: విద్వాన్ బ్రహ్మశ్రీ, రావాడ వేంకటరామశాస్త్రులుగారు నుత్సవమునకు విజయంచేసిన పండితులకు నితరులకు మృష్టాన్నదానమున సంతృప్తిఁగావించిరి. కృతిసమర్పణసమయమునసే దీనానాథాంధబధిరకుబ్జులకు సంతృప్తిగ నన్నదానమొనర్చి శ్రీవిట్టా శేషప్పశ్రేష్ఠిగారు ధన్యులయిరి.

సాయంకాలము మహాసభ యారంభమయ్యెను. అధ్యక్షమహాశయులు ధర్మసార రామాయణ కలివిలాసములగుఱించి చక్కఁగా ముచ్చటించిరి. పిదప పాఠశాలా ప్రధానాంధ్రపండితులు కవిశేఖరులు కావ్యతీర్థ విద్వాన్ బ్రహ్మశ్రీ, రావాడ వేంకటరామశాస్త్రులుగారును సంస్కృతోపాధ్యాయులు వేదాంతశిరోమణులు వేదాంతశాస్త్రవిషయకగ్రంథకర్తలునగు బ్రహ్మశ్రీ, కొరటమద్ది వేంకటరామశాస్త్రులుగారును గ్రంథద్వయసారముంగూర్చి విపులముగ నుపన్యసించిరి. నటకచక్రవర్తియని మహామహోపాధ్యాయ కళాప్రపూర్ణ కవిసార్వభౌమాంధ్రవ్యాస శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రులుగారిచేఁ గోరి పిలువంబడిన మ-రా-రా-శ్రీ, టి. రాఘవాచార్యులుగారు దేశభక్తులలోఁ బ్రధానులుగాఁ గవులు పేర్కొనఁదగినవారని సోదాహరణముగ నిరూపించుచునుపన్యసించిరి. రావుబహదూర్ జొన్నలగడ్డ పాపయ్యశ్రేష్ఠిగారిపుత్రరత్నములు మ-రా-రా శ్రీ, వీరన్నశ్రేష్ఠిగారు రజతపాత్రము సంధ్యావందనాదికమునకు నుపయోగింపఁ బారితోషికముగ నొసంగిరి. పాఠశాలయందు సహాయోపాధ్యాయులు సరసకవులునగు మ-రా-రా-శ్రీ, కప్పగల్లు సంజీవమూర్తిరావుగారు పద్యపంచరత్నములం బఠించి యంతకుముందుఁ దాము మహాకవి బమ్మెరపోతనపై రచించినపద్యరత్నముల నధ్యక్షులయు సభ్యులయు నానతింగొని పఠించి సభ్యుల నానంద

పరవశులనుగా నొనరించిరి. వారికవితాప్రౌఢిమ కెల్లరు మెచ్చిరి. బళ్లారిపురమున నిట్టి కవివతంసములున్న వారుకదా ఈనగర మెంతధన్యమో యని యధ్యక్షమహాశయులు కడుంగడు మెచ్చుకొనిరి.

### మహారాజశ్రీ కప్పగల్లు సంజీవరాయకవిగారు, బళ్లారి.

తే. శ్రీకరంబగువాణీ కృపాకటాక్షమునకుఁ బాత్రుఁడవగు భాగ్యమును గడించి
క్రాలు జనమంచి శేషాద్రి కవివతంస!, పశమగునె మాకు నీప్రతిభను గణింప. ౧

మ. పలుగ్రంథంబుల వ్రాసి, నల్దెసల శుభ్రఖ్యాతి వెల్గించి, యాం
ధ్రులపై తీరనిభార ముంచి, విబుధస్తోమంబు లగ్గింప భూ
స్థలిపై నిల్పితి; నీదుపే రొరుల కాదర్శంబుగా రాజిలన్,
గలరే పల్వురు నిన్నుఁబోలుకవు లీ కాలంబునన్ ధీనిధీ!. ౨

సీ. నీదివ్యధిషణ బ్రహ్మాదిముఖ్యపురాణవారంబు రచియింపఁ గారణంబు
నీరామమూర్తిపై నెనరు రామాయణం బారీతిరచియింపఁ గారణంబు
నీభక్తిభావ మీ వాభాగవతము నాతీరునరచియింపఁ గారణంబు
నీలోకహితచింత యాంగ్లకవిభునవతారతత్త్వము వ్రాయఁ గారణంబు
తే. నీకళాప్రపూర్ణతయె యనేకలలిత, కావ్యరాజంబుల రచింపఁ గారణంబు
ఇట్టి నీవు రాయలసీమ నెసఁగుచుండు, ఘనత మాకందఱకు గర్వకారణంబు. 3

ఉ. పెక్కుకృతుల్ రచించి పృథివిన్ వెలయించితి వానిలోన నొ
క్కొక్కటికిన్ సమర్పణమహోత్సవజృంభణ ముల్లసిల్లె; నం
దొక్కటిరెంటిఁ గొల్చు శుభయోగము మాపురి కిన్నినాళ్లకున్,
దక్కెఁ గొఱంతలేటెఁ గడుధన్యతఁ గాంచె బళారి నేఁటికిన్. ౪

ఉ. ఆయతగౌరవంబు, విబుధాదృతి, సజ్జనకోటిమన్ననల్
మాయనికీర్తి నీ'కలి విలాస' కుమారియు, 'ధర్మసారరా
మాయణ' పుత్త్రియున్ గని సమానముగాఁ దమతోడఁబుట్టుల
ట్లీయవనిన్ రమేశుదయ నెప్పుడు వర్ధిలుచుండ్రుగావుతన్. ౫

### బ్రహ్మశ్రీ ఘూళీ కృష్ణమూర్తిగారు, విద్వాన్, మునిసిపల్ హైస్కూలు, సహాయాంధ్రపండితులు, బళ్లారి.

ఉ. పాయక వేదవార్ధి స్మృతిపర్వత ముంచి పురాణధర్మశా
స్త్రాయత రజ్జుబంధముల నట్టె మథింపఁ గళాప్రపూర్ణ ల
క్ష్మీయుత ధీవిలాసములఁ జేకొని పుట్టినధర్మసారరా
మాయణమన్ సుధారసము మాకొసఁగన్ గవిరాజుఁ గొల్చెదన్. ౧

ఉ. మానితవర్ణ దివ్యపద • మాన్య సుభూషణయుక్త దిగ్దశా
స్థానసభాభిసన్నుత బుధార్పిత సర్వశుభార్థ ప్రాభవా
నూన వచోవిలాస సుమ • నోహర పావనగాథ చూపె మే
లౌనన నీకవిత్వరమ • యద్భుతమౌ కలిదౌవిలాసమున్. ౨

ఉ. వాణియె నీముఖాబ్జమున • వాసము చేసిన దట్లుగాక యే
ప్రాణికినైన నానఁగ • వ్రాయఁగ శక్యమె యిన్ని కావ్యముల్,
బాణవిశిష్ట మీజగము • ప్రాయను నాఁబడె న్వాఁడు; నేఁడు నీ
వాణికి శిష్టమయ్యెఁ గవి • వల్లభ! తెన్గుజగం బిదంతయున్. 3

ఉ. సోమునికాంతి భాస్కరుని • సో విభవంబును, సోమయాజిదౌ
నేమము, శబ్దశాసను న • నేకముఖోద్గత కావ్యరీతులున్,
గామిత కల్పుఁడైన సిరి • నాథుని సంపదలెల్లఁ గొల్లయై
నీమహితోక్తి నిల్చినవి • నీకిల సాటిగలారె ధీవరా! ౪

తే. ఇట్టి కావ్యాళి మముఁ దని • యించుకొఱకు, నిట్టికావ్యాళి నీక రచి • యించుకొఱకు
నీమహామహుఁ జిరకాల • మిలను వెలయఁ, జేసి రక్షింపఁగా భక్తి • శ్రీశుఁ దలఁతు. ౫

పిదప నధ్యక్షమహాశయులు గంభీరోపన్యాస మొసఁగి సభ్యమహాశయుల నానంద సాగరరంగత్తరంగడోలికల నూఁచి వెలయఁ జేసిరి. ఇట్లు లీకృతిసమర్పణమహోత్సవము జయప్రదముగా సాగించి పాఠశాలా ప్రధానోపాధ్యాయులు మ-రా-రా-శ్రీ, కే. యమ్. వేదాంతము, బి. ఏ., ఎల్. టి., గారు సభాధ్యక్షులకు సభ్యమహాశయులకుఁ గృతజ్ఞతం దెల్పుచు నుపన్యసించి యధ్యక్షులను గౌశేయాంబరమునను విద్యార్థికృతశిల్పసమన్వితహస్తాలంకారభూతదండవిశేషమునను, దద్విద్యార్థిసుకృత వ్యాసపీఠ ప్రదానమునను సన్మానించిరి. రాత్రి యెనిమిదిగంటలకు సభ పూర్తినొందింపఁబడియె.

## కృతజ్ఞత.

ఏతద్విషయమునఁ దొలుత ముద్రణముసాగ నెంతయుఁ దోడ్పడిన శ్రీశ్రీశ్రీ రాజా వెలుగోటి సర్వజ్ఞకుమారకృష్ణయాచేంద్ర బహదూరువారును మ-రా-రా-శ్రీ, ఖాణకా గోవిందరెడ్డిగారును దక్కుంగల మండలపాలనసంఘసభ్యమహాశయులును సంస్మరింపందగినవారు. వారిసాయమే లేకయున్న నీముద్రణకార్యమే నెఱవేఱదు. మఱియు భాషోద్ధారకులు ఆశ్రితపోషణతత్పరులు నగు మ-రా-రా-శ్రీ, వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారు నాకృతజ్ఞతాపూర్వకవందనములకుఁ బాత్రులు. వారి యనుగ్రహమువనే నేనొకఁడనుగా గణింపఁబడుచున్నవాఁడను. వారిసాయ మపార మనుటకంటె నెక్కుడు వ్రాయుభాష నాకురాదు తరువాత నీయుత్సవము సాగింప నవకాశముకలదా యని వ్రాసినంతనే యద్దాని కంగీకరించి ప్రయత్నించిన

మ-రా-రా-శ్రీ, సగురూరు నారాయణరావు, బి. ఏ., బి. యల్., గారును నటకచక్రవర్తి మ-రా-రా-శ్రీ, టి. రాఘవాచార్యులు, బి. ఏ, బి. యల్, గారును వంద్యులు. ఈకార్యభారమును శిరస్సున ధరియించి చక్కఁగా నిర్వహించి ఖ్యాతిఁగాంచిన పురపాలకపాఠశాలాప్రధానోపాధ్యాయులు సుగుణమణిగణభూషణభూషితులు శ్రీమాన్ కే. యస్. వేదాంతము, బి. ఏ., ఎల్. టి., గారు నానమస్కృతివితతిపాత్రులు. ఈకార్యమునకుఁ బ్రధానాంగమనఁబఱుపది బీదలకన్నదానము దానిం జక్కఁగా నెఱవేర్చి యంతటఁ దృప్తినొందక కృతిసమర్పణోత్సవపరికరముల నొసగి వేదనాదపురస్సరముగ నుత్సవమునుసాగించి యమూల్యకౌశేయముల నన్నలంకరించి యీనంబింపుమహాగోష కారకరణబద్ధకంకణులు. సంస్కృతాంధ్రభాషాకోవిదులు భక్తాగ్రగణ్యులునగు మ-రా-రా శ్రీ, విట్టా శేషప్పశ్రేష్ఠిగారు విశేషించి సంస్తవ్యులు. వారికిని జిఱుతప్రాయముగలవారయ్యు బుద్ధిని వృద్ధులై విద్వద్విశ్వాసమున నలరారుచు నాకుఁ బారితోషికమున నలరించిన మ-రా-రా-శ్రీ, జొన్నలగడ్డ వీరన్నశ్రేష్ఠిగారికిని దదనుజశ్రేష్ఠితల్లజులకును నాకృతజ్ఞత నేతన్ముఖమున విన్నవించుకొనుచున్నాను. పెక్కుసంవత్సరములనుండి నన్నాదరించుచు నెన్నియోవిధములఁ దోడుపడుచు సమయమొదవినపుడెల్ల వస్త్రముల నమూల్యముల నొసంగి గారవించు మ-రా-రా-శ్రీ, డబ్ల్యు గోవిందరావు, బి. ఏ., గారు నాకు వంద్యులు. వీరుద్యోగమునుండి విరమించి వేదాంతగోష్ఠిని గాలముపుచ్చు భక్తాగ్రగణ్యులని మఱియొకసారి నమస్కరించెదను. ఏతత్కార్యభారమునఁ గొంతపాలుగొని నన్నాదరించుటయే తమ్మాదరించుటయని భావించి వెలయు కావ్యతీర్థవిద్వాన్ బ్రహ్మశ్రీ, రావాడ వేంకటరామశాస్త్రులుగారు నాకు వంద్యులు. మఱియు మ-రా-రా-శ్రీ, ఉన్నతపాఠశాలపండితులు సంజీవమూర్తి ప్రముఖకవివతంసులు నాకు నిరంతరమువంద్యులు. ఇట్టు లిప్పట్టున బళ్లారిపురమహాశయులకు నాకృతజ్ఞతం దెలుపుకొనుచున్నాఁడను. పరమేశ్వరుఁడు వీరలకు నిరంతరారోగ్యభాగ్యాదుల నొసంగి కాపాడుచుండుఁగాక. త్రిలింగదేశమున నెల్లకాలము బళ్లారిపురవరవిఖ్యాతి నిష్కళంకతుహినమయూఖుని నీసడించుచు వృద్ధినొందుచుండుఁగాక. ఈగ్రంథముద్రణసమయమునఁ దప్పులుదిద్దుట లోనగుకార్యములకు నెంతయుఁ దోడుపడి కవియు గ్రంథపరిశోధకుఁడు సోదరుఁడు కడప పురపాలకపాఠశాలయందుఁ బ్రధానాంధ్రపండితుఁడునగు చి॥ కావ్యపురాణతీర్థ విద్వాన్ జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మ కేతన్ముఖమున నితోఽధికవిద్యాసంపదాయురారోగ్యములుగలుగఁ బరమేశ్వరు నెదనిల్పి యాశీర్వదించుచున్నాఁడను. ఆరాత్రి నేనొక్కఁడనయుండ నీముద్రణమునకని పదునైదురజతముద్రికల గుప్తదానముగ నొసంగిన మ-రా-రా-శ్రీ, అయ్యగారి బుస్సెట్టిగారికి నాకృతజ్ఞతం దెలుపుకొనుచున్నాను. వీరు కణేకల్లు వాస్తవ్యులు. ఆర్యవైశ్యులు. పరోపకారనిరతులు. నే నేగ్రంథమువ్రాయుచున్నవాఁడనని తెలిపినను దోడ్పడుచుందురు. వీరికి భగవంతుఁడు సుఖసంపదఁగూర్చుఁగాక,

సాహసించి ధర్మవేత్తవలె నీగ్రంథమును వ్రాసితిని తూలనాడక శిష్య వాత్సల్యమునిచ్చి నాతప్పుల నెమకి నాకుఁదెలిపి నామూలమునఁ జక్కఁబడఁజేయ మహనీయమతివిశేషభూషితులు కరుణానీరధులు నగు పండితాఖండలుల నంజలిఁబట్టి వేఁడుచున్నాఁడను. ఈసభాకార్యమును జక్కఁగా నిర్వహించి నన్నాశీర్వదించిన మహామహోపాధ్యాయులు కళాప్రపూర్ణులు సుకవి సార్వభౌములు శతాధికగ్రంథ కర్తలునగు బ్రహ్మశ్రీ, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులుగారి నెంతయుఁ బ్రార్థించు చున్నాఁడను. నాలోపములమన్నింప సమస్తవిద్వత్కవివతంసముల వందనపూర్వక ముగఁ బ్రార్థించుచున్నాఁడను. ఇంతకంటె విశేషించి వ్రాయఁదగిన విషయములు నాకు లేవు. పరోపకారసంతతవ్రతుల నింతకంటెఁ బ్రార్థింప నక్కఱయు నుండదు.

ఇట్లు విన్నవించు విద్వత్కవిపాదభక్తుఁడు,

జనమంచి శేషాద్రిశర్మ.

శ్రీ శ్రీ శ్రీ

# పీ ఠి క

బ్రహ్మశ్రీ, కావ్యస్మృతితీర్థ కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రిశర్మగారు బ్రహ్మాండపురాణ శ్రీమద్రామాయణ బ్రహ్మపురాణాదులు పద్యాత్మకములుగా నాంధ్రీకరించియు, శ్రీకృష్ణావతారతత్త్వ శ్రీరామావతారతత్త్వాదులగు గద్యాత్మకకృతులు నిర్మించియు ఖ్యాతిగడించినవారనుట యాంధ్రలోకమునకు విదితము. శ్రీరామకృష్ణభక్తులును మాతృభాషాసేవాలాలసులు నాంధ్రకవిత్వదీక్షితులు నగు శ్రీశర్మగారిపుడు నూతనముగాఁ దెలిఁగించి యాంధ్రపాఠకలోకమునకు సమర్పించిన యీమహాకృతి ధర్మసారరామాయణము.

తారకమంత్రమైన శ్రీరామనామ మెపుడు భూమిపై వెలసెనోకాని, అది నాఁటినుండి నేఁటిదనుక నొక్కరీతిగా భారతఖండమంతట భక్తులను గవులను బరవశులను గావించుచునే వచ్చుచున్నది. తొల్లి సంస్కృతమునందును, పిదప వివిధదేశభాషలందును బూర్వు లెందఱో శ్రీరామచరితమును వర్ణించియున్నను, తరువాతివారును వారితరువాతివారును గాలక్రమమున శ్రీరామగుణకీర్తనము నెన్నిభంగులనో కావించుచు వచ్చుచున్నారనుటయే తారకనామ మప్రతిమాన మనుచు దాని మహత్త్వమును జాటుచున్నది. అందుకే మురారిమహాకవి యనర్ఘరాఘవమున నిట్లని యున్నాఁడు.

"యది క్షుణ్ణం పూర్వై రితి జహాతి రామస్య చరితం,
గుణై రేతావద్భి ర్జగతి పున రన్యో జయతికః."

రామకథాశ్రయములై యసంఖ్యాకములుగా నుదయించిన బహువిధకావ్యములమాట యటుండ రామాయణనామమున నావిర్భవించిన వెన్నో కనఁబడుచున్నవి, వినఁబడుచున్నవి. ఆనందరామాయణమనోహరకాండము, రామాయణములెన్నియని ప్రశ్నింపఁగాని వాల్మీకిరామాయణము తరువాతవెలసిన యోగవాసిష్ఠ హనుమ దధ్యాత్మ నారద లఘు బృహ దగస్త్య ధర్మసార వృత్తబ్రహ్మ భరద్వాజ శివ భరత దేవీ గుహ్యక మంగళరవి పులస్త్య విశ్వామిత్ర సుతీక్ష్ణ సుగ్రీవవిభీషణాది సంజ్ఞలవెలసిన ముప్పదిరామాయణములను బేర్కొని,

"ఏవం సహస్రశ స్సంతి శ్రీరామచరితాని హి,
క స్సమర్థోఽస్తి తేషాం హి సంఖ్యాం వక్తుం సవిస్తరమ్."

అనుచు రామాయణములు వేలకొలఁది వెలసినవని వక్కాణించినది. ఇట్లు వెలసిన వన్నియు వసిష్ఠవిశ్వామిత్రభరద్వాజాదులపేళ్ల నస్యులాయాకాలముల రచియిం

చినవని యూహింపఁదగునుగాని, పేళ్లనుబట్టి యీవసిష్ఠవిశ్వామిత్రాదులే తత్తద్రామాయణకర్తలని భ్రాంతిపడరాదు. బహువిధములైన యుపపురాణములవలెనే యసంఖ్యాకములైన రామాయణములును, క్రీస్తుపూర్వ మొకటిరెండుశతాబ్దులు మొదలుగాఁ గ్రీస్తుశక మాఱేడుశతాబ్దులలోపల భిన్నభిన్నకాలముల నుదయించినవని నిరాక్షేపముగా భావింపవచ్చునుగాని, వీనిలో నేది ముం దేదివెనుక యనువిషయముమాత్ర మభేద్యము. వీనిలో నొక్కొక్కదానియందు భక్తిజ్ఞానవైరాగ్యాదివిషయములలో నొక్కొకటి విశేషముగా వర్ణితమైనను, అన్నిటిలోను బ్రధానమైనది రామచరితమే. అట్టి యీయర్వాచీనరామాయణములలోనిదీధర్మసారరామాయణము. వీనికన్నిటికిని మూలము శ్రీమద్వాల్మీకిరామాయణము.

"వాల్మీకినా కృతం యచ్చ శతకోటిప్రవిస్తరం,
తత్సర్వేషామాదిభూతం మహామంగళదాయకమ్,
శేషభూతం చతుర్వింశత్సహస్రం ప్రథమం స్మృతమ్."

అనుచు వాల్మీకిమహర్షి తొలుత శతకోటిగ్రంథమైనరామాయణము రచియించి, తరువాత దానికి శేషముగా, ఇరువదినాలుగువేలగ్రంథముతోడి శ్రీమద్రామాయణము నిర్మించెననియు, తక్కిన నానారామాయణములకిది ప్రథమమనియు, వాయుపురాణాదులును, ఆనందరామాయణాదులును జెప్పుచున్నవి. కాని, వాల్మీకి శతకోటిగ్రంథరామాయణ మొకటి మొట్టమొదట రచియించె నన్నమాట విశ్వాస్యము కాదు. అది రామకథామహత్త్వప్రశంసాపరము. ఈవాల్మీకిరామాయణము క్రీస్తుపూర్వము పన్నెండవశతాబ్దిలో నుదయించిన దనుచు, దీనికాలము కథాసంవిధానము పాత్రౌచితి మొదలగుబహువిషయములను నాపచియించిన సంస్కృతవాఙ్మయచరిత్రద్వితీయసంపుటములో సవిస్తరముగాఁ జర్చించి నిర్ణయించియున్నాను. సర్వరామాయణజీవభూతమైన దీనియుదంతమును బాఠకులందఱవలోకింతురుగాక. కాని, ఇందొక్కవిశేషవిషయము:—

వేదములకుఁ దరువాత నూతనచ్ఛందోరచనాపరమై యాదికావ్యమని ప్రశంస కెక్కిన వాల్మీకిరామాయణమున కితిహాస మనెడిపేరు పురాణాదిప్రసిద్ధము. ఇతిహా=పారంపర్యోపదేశః, అస్మిన్నాస్తే, ఇతిహాసః. అనఁగా గురుపరంపరచే నుపదేశింపఁబడుచువచ్చిన పురావృత్తమని యర్థము. వాల్మీకిమహర్షి, రామకథ నితిహాసమనుటం బట్టి యిది యతనినాఁటికే బహుపురాతనవృత్తమై యతనికి గురుపరంపరోపదేశమునఁ దెలియవచ్చినదని భావింపవలెనుగాని, ఉత్తరకాండవృత్తాంతమును విశ్వసించి వాల్మీకి శ్రీరామునినాఁటివాఁడనిమాత్రము భావింపరాదు. మఱియు, ఋగ్వేదదశమమండల తృతీయసూక్తములోని

"భద్రో భద్రయా సచమాన ఆగాత్ స్వసారం జారో అభ్యేతి పశ్చాత్,
సుప్రకేతైర్ద్యుభిరగ్నిర్వితిష్ఠన్ రుశద్భిర్వర్ణైరభి రామమస్థాత్."

అను తృతీయఋక్కున కొందఱు సీతారామరావణపరముగా నర్థము చూపి, రామాయణకథ ఋగ్వేదమునకుఁ బూర్వ మనెడి యభిప్రాయము సూచించిరిగాని, యది సరిగాదు. పై ఋక్కు, అగ్నిస్తవసూక్తములోనిది. శ్రీసాయణాచార్యులు దీని కగ్నిపరముగానే భాష్యము వ్రాసిరి. అదిగాక, వేద మకర్తృకము స్వయంప్రకాశ మనాది యనెడిపూర్వమీమాంసయు, వేద మీశ్వరప్రణీత మనాది యపౌరుషేయ మనెడి యుత్తరమీమాంసయుఁగూడ, వేదమునకుఁ దరువాత వెలసిన భౌతికసృష్టి లోని విషయమందు వర్ణింపఁబడియున్నదనుట కంగీకరింపవుకదా! సృష్టిప్రతికల్పము యథాపూర్వముగా సిద్ధమగుచుండును గావునఁ బూర్వకల్పములోని రామోదంత మీకల్పమున వేదములో వర్ణితమైయుండునని యుక్తిచెప్పుదురేమో కాని, ఈశ్వర నిశ్వసిత మగుటచే వేదమునకుఁ గల్పానుసారముగ మార్పు లంటఁగట్టితిమేని దాని నిత్యత్వమునకే భంగము వచ్చును. శ్రీరాముఁ డీశ్వరుఁడే యైనను దతనివృత్తము వేదమున వర్ణితమైయుండుట కాశ్చర్యమేమని యందురేమో కాని, శ్రీరాముఁ డీశ్వరావతారముకాని సాక్షాదీశ్వరుఁడు కాఁడు. అదిగాక యతనివృత్తాంతమంతయు నుత్తమమానవచరిత్రమై మర్త్యలోకమున సాక్షాత్కరించినదిగా భావించుచున్నాము గాని, యదృశ్యమైన స్వర్గీయమనియో వైకుంఠీయమనియో భావించుటలేదు. అందుచే నీశ్వరనిశ్వసితమను నామముతో నిది వేదములోనిదనుట పొసఁగదు. కావున శ్రీరామకథ మనయూహ కందనంత యతిపురాతనమైనను వేదములకుఁ బూర్వమన్నచో నాక్షేపము రాకపోదు.

శ్రీరామకథ యెప్పటిదని తెలిసిననేమి తెలియకున్ననేమి? వాల్మీకినోట వెలసినయది లోకమునకు మఱియొక వేదమైనది.

"వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా."

అనుచుఁ బారాశర్యపురాణాదులు దీనిని వేదముగా స్తుతించినవి. అందులకుఁ గారణ మందు వర్ణితమైన రామపాత్రమే. శ్రీకృష్ణావతార మాశైశవముగా నెడనెడ నాత్మమాయాలీలలఁ జూపుచు శ్రీకృష్ణుఁడు భగవంతుఁ డనెడిభక్తిభావమును బ్రాజ్ఞలోకమునకుఁ గలిగించినది. శ్రీరామావతార మట్లుగాక, యుత్తమమానవ శీల మెక్కుడుగాఁ జూపుచు సజ్జనులకు రాముఁడు భగవదవతారమనుబుద్ధి పుట్టించినది. పితృవాక్యపరిపాలనము, భ్రాతృప్రేమము, ఏకపత్నీవ్రతము, శిష్టరక్షణము దుష్ట

సంహారము మొదలుగాఁగల ధీరోదాత్తనాయకలక్షణములే యతఁడు సత్త్వమూర్తి ధర్మస్వరూపుఁ డనుటకు హేతువులు. ఆసుగుణసంపదచేతనే యతఁడు జగదుదాహరణమైన యుత్తమమానవపాత్రమయ్యు జగదారాధ్యమైన భగవదవతారమయ్యెను. అందుచేతనే వసిష్ఠవిశ్వామిత్రాదిమహర్షు లతనిని బైకి శిష్యునిగా భావించినను మనస్సున దైవముఁగానే స్మరించిరి.

మహావీరుఁడు మహోదారుఁడునైన శ్రీరాము నట్లు సకలసద్గుణపుంజముగాఁ భగవద్భావగంభీరముగా నభివర్ణించిన వాల్మీకిరామాయణ మాధారముగా నుదయించిన బహురామాయణములలో నధ్యాత్మవసిష్ఠరామాయణాదులు కొన్ని రామకథచాటునఁ బరతత్త్వమును బోధించినవి. వాల్మీకిరామాయణమందు వ్యంగ్యముగా నున్న ధర్మము నీధర్మసారరామాయణము వాచ్యముఁగావించి తనపేరు సార్థకము గావించుకొన్నది. ఇందు సీతారామాద్యుత్తమపాత్రముల యెల్లమాటలందును సమాచరణయోగ్యమైన ధర్మము మూర్తీభవించి గోచరించుననుటయే యిందలివిశేషము. ఇఁక గ్రంథవిస్తరమేల ?

గ్రంథవిషయమా జగత్ప్రసిద్ధము. గ్రంథకర్తయగుశర్మగారా త్రిలింగదేశమునకుఁ జిరపరిచితులు. శర్మగారికవిత్వము ధారాశుద్ధిగలిగి మృదుమధురముగా నుండునని చెప్పుట సిద్ధకథనము. విశ్రాంతిగోరుచున్నవయస్సులో భక్తిశ్రద్ధలతో నింతపెద్దగ్రంథము నిర్మించుట యాంధ్రభాషభాగ్యము. భాషాభిమానులందఱును దీనిం జదివి, స్వయముగా భక్తులై భక్తులకు రామకథామృత మిట్లు పంచిపెట్టుచున్న శ్రీశేషాద్రిశర్మగారియుద్యమమును సార్థకముగావింతురు గాక.

విశాఖపట్టణము,
14-9-37

మల్లాది సూర్యనారాయణశాస్త్రి,
ఆంధ్రవిశ్వకళాపరిషత్కళాశాలాసంస్కృతాంధ్రాధ్యాపకుఁడు.

శ్రీ

# నవీనసమాలోచన

లోకోపకారమే భగవత్సేవ. అది యెఱింగియే కాఁబోలు మహర్షులు భావికాలముఁదలంచి, యందలి మానవుల తత్త్వమరసి, యిది చేయఁదగు కార్యమని నిశ్చయించి పరమాత్మయొక్క నిశ్వాసరూపములని, వాసిఁగాంచిన వేదములఁ బురస్కరించుకొని స్మృతిపురాణేతిహాసముల సురచించి మనకుఁ బ్రసాదించిరి. ఆమ్మహనీయులి కార్యముం జేయకయుందురే నింతకేమైయుండుమో చెప్పఁదరముకాదు. ఆవి మానవులఁ జక్కఁదిద్దఁజాలు ననిరి. వేదశాస్త్రములు కథారూపములుగామిఁ జదువరుల నాకర్షింపఁజాలవని యెంచియో, సామాన్యులవ్వానిఁ జలింపఁజాలరనియో, యందలి ధర్మసూక్ష్మములనే గథారూపములుగ వ్రాసిన నెల్లరుఁ జదివి తత్సారమును గ్రహింతురనితలంచియో, పురాణేతిహాసములను రచించిరని యూహింపవచ్చు. కావ్యసృష్టికిం గడంగినవారిలోఁ దొలుతఁ బేర్కొనఁదగినమహనీయుఁడు వాల్మీకి మహర్షియని పెద్దలభావము. ఇమ్మహాముని ముఖకమలనిర్గళవినిస్సృతమకరంద ప్రవాహమే రామాయణము. దీనిమహత్త్వమును బలువురు పలువిధముల వక్కాణించిరి. చతుర్వేదము లందుఁ గలవనిరి. కాదిది చతుర్వేదసారమని కొందఱనిరి. ఎట్లైన నేమి? ప్రజల కాధ్యాత్మికసుఖము నిడఁజాలి భారతవర్షమునకుఁ బ్రపంచకవాఙ్మయమునం దధికగౌరవము స్వీకరించిన గ్రంథరాజిలో, నిది మొదటిదన్నఁజాలు.

అట్టిరామాయణము దేవభాషయందుండుటచే నెల్లరకు సుబోధముగామి మహాత్ములితరభాషలకు దాని మార్చిరి. తెనుఁగున శ్రీరామచరిత్రములు పెక్కులు గాన్పించుచున్నవి. భాషాంతరీకరణమున నొక్కొక్క రొక్కొక్కపద్ధతి నవలంబించి వారివారికిం దోఁచినట్లు వ్రాసిరి. కాని మూలమునకు సరియగు భాషాంతరీకరణము, లేయొకటి రెండో గలవు. అందు గోపీనాథరామాయణము, ఆంధ్రవాల్మీకిరామాయణము, ఆంధ్రశ్రీమద్రామాయణము ననిచెప్పవచ్చును. ఇందేదిసరియగుభాషాంతరీకరణ మనుట ప్రస్తుతముకాదు.

ఈరామాయణములలోఁ గడపటిది యగునాంధ్రశ్రీమద్రామాయణమును రచించినవారు కావ్యస్మృతితీర్థులు, కళాప్రపూర్ణులు నగు నభినవాంధ్రవాల్మీకి బ్రహ్మశ్రీ, జనమంచి శేషాద్రిశర్మగారు. వీరాంధ్రలోకమునకుఁ జిరపరిచితులు. వారిం గూర్చి నేఁ బొగడ్తపాలముఁ ద్రొక్కక ప్రకృతము వారిచే రచింపఁబడిన యీకృతి

రత్నాకరమున నాకు దొరకిన గుణరత్నములనే పాఠకలోకమునకుఁ గాన్కఁగా సమర్పింపఁబూనితి.

పీఠికాకారులు దొలుతఁ గవిచరిత్రాదులం దెలుపు టాచారమయ్యె గ్రంథకర్తలు నెఱజాణలగుటచేఁ దమగ్రంథములన్నిటియందును దమచరిత్రమును, దాము రచించిన గ్రంథనామమును గ్రమముగ వ్రాసికొని భావికాలపుఁజిక్కులం దొలంచికొనిరి. కాన నే నప్పనికిఁ గడంగలేదు.

ఇమ్మహాకవులు శ్రీరామచరిత్రము నెంతసంగ్రహించి వ్రాయవలెనో అంత సంగ్రహించియు, ఎంత పెంచి వ్రాయవలెనో అంత పెంచియు రెండుకార్యముల నీవఱకే నెఱవేర్చిరి. మరలఁ జర్వితచర్వణముగ నీరామాయణరచనకేగడంగు టేసరసమని పలువురకు శంక గలుగకపోదు. ఆసంశయనివృత్తికే యీచిన్నిపీఠిక.

శర్మగారు తొలుత వ్రాసిన గద్యసంగ్రహరామాయణము బాలురకే యుపయుక్తము. రెండవదియన్ననో మూలమును వ్యాఖ్యానాభిప్రాయములనుగూడ గర్భీకరించుకొన్న విపులపద్యగ్రంథము. రామావతారతత్త్వవచనము నట్టిద. ఇయ్యవి మూలముం దొరయుటచే స్వాతంత్ర్యమును గోలుపోయినవి. కవి తాఁ దెలుపనెంచిన సద్విషయము లన్నిటికందుఁజోటు దొరకదు. కాన నే కథను సంగ్రహించియు, సందేహముల విమర్శించియు, పాఠకులసౌలభ్యముకొఱకుఁ బద్యములుగా నుండుట మేలనియెంచి వెండియుఁ గడంగిరచించిన దీ

# ధర్మసార రామాయణము.

ఇందలికథ రామాయణకథయే. కాని అందందుఁ దాము లోకులకుఁ దెలుపనెంచిన సద్విషయముల కనుగుణముగఁ గొంత మార్చిరి.

ఈకృతినిర్మాణమునందు వీరిముఖ్యోద్దేశము లివియని నాయల్పమతికిం దోఁచిన వానినిం దెలిపెద.

1. చరాచరాత్మకమైన ప్రపంచమంతయుఁ గర్మమునకు లోఁబడినది. కర్మము ననుసరించి శరీరము, దాని ననుసరించియే వాంఛలు. కర్మమునుబట్టియే సుఖదుఃఖాదులు. దానిఁ దిరస్కరించి పో నెంతవారికేఁ దీఱదు. విధియన్నను, గాలమన్నను నదియే. అదియె దైవమని పెక్కుతావుల సిద్ధాంత మొనర్చిరి. ఇందులకు—

బాలకాండము 32, 247, 48, 49, 220, 221, 224, 441

అయోధ్యాకాండము 354, 351, 356

ఆరణ్యకాండము 142 నుండి 146 వఱకు 339, 342 నుండి 355, 420, 421 వఱకు

కిష్కింధాకాండము 43 నుండి 55 వఱకు, 203 నుండి 227 వఱకు

యుద్ధకాండము 388 నుండి 96 వఱకు 869

పై పద్యముల నరసిన వీరి కర్త్రాసక్తి తెల్లమగు.

2. హరిహరసరసిజాసనులు ప్రకృతివశంగతులు. ఆమెయె సర్వకారణకర్త్రి, ప్రకృతిసంసర్గమునఁగాని పరాత్పరుఁడు కార్యక్షముఁడు గాఁజాలఁడు, ప్రకృతిపురుషుల కవినాభావసంబంధము, పరాత్పరున కేరూపమో ప్రకృతికి నద్దియే రూపము, శబ్దమునుబట్టి లింగభేదమేకాని వస్తువునుబట్టి కాదు. రూపమంతయుఁ బ్రకృతిమయమే. అన్నిమతములును శాక్తమున నంతర్భూతములే, ఎల్లరుశాక్తులే, యనుటను జర్చించి తత్త్వముఁ దెలియక మతద్వేషములుపుట్టించు స్వార్థాకర్షణాభైరవోపాసకుల యుపదేశములను దూలఁగొట్టిరి. కనుఁడు.

బాలకాండము 324, 325, 627, 662 వఱకు

ఆరణ్యకాండము 502, 517 వఱకు 717 నుండి 724, వఱకు 733

సుందరకాండము 623, 24, 25 వఱకు

యుద్ధకాండము 855, 860 వఱకు

3. శివకేశవులకుఁ దారతమ్యము లేదు. ప్రకృతివశంగతుఁ డగుటచేఁ బరాత్పరుఁడు త్రిగుణమయుం డనఁబడును. అత్తఱి నతని సత్వరజస్తమోగుణములచే సరసిజాసనహరిఫాలనేత్రు లుద్భవించి సృష్టిస్థితిసంహారకార్యములఁ బ్రపంచక్షేమము కొఱకు నాచరింతురు. అందొక్కఁ డల్పుఁడు వేఱొక్కఁ డధికుఁ డన వీలులేదు. వారిలో నెవరికార్యము జరగకున్నను బ్రపంచవ్యవహారములు సాగవు. లోకసంగ్రహార్థము వారొండొరుల ధ్యానింతురు.

బాలకాండము 492, 495 వఱకు

అయోధ్యాకాండము 532, 568 వఱకు

యుద్ధకాండము 921, 932 వఱకు 910, 919 మఱియు 934

4. యోగము. యోగాభ్యాసమున మనోనియతిఁ గాంచిగాని భగవంతుఁ జూడదరముకాదు. యోగి అందఱికంటె నుత్తముఁడు. అతనిమేన విషమువ్యాపింపదు. అగ్నిదహింపదు.అతని కసాధ్యకార్యములులేవు. అలవడని సిద్ధులులేవు సమయమతమే యోగమతము. అల్పఫలప్రదమగుబాహ్యపూజ (విగ్రహారాధనము) గావించు వాఁడు యోగి కాఁడు. యోగి సర్వసమత్వముగలవాఁడు. భక్తి, కర్మ, జ్ఞానములు మూఁడును జేరినఁగాని సంపూర్ణఫలము నీఁజాలవు. అది యన్యోన్యాశ్రయముల నిరూపించి భక్తి యెక్కడున్న ముక్తియున్నదని బోధించు వొంగదాసుల పల్కుల గర్హించిరి. చూడుఁడు.

బాలకాండము 478, మరల 481 నుండి 506

అయోధ్యాకాండము 357, 375 వఱకు
ఆరణ్యకాండము 133 నుండి 136
కిష్కింధాకాండము 284, 285, 303 నుండి 310
సుందరకాండము 47, 51 వఱకు
యుద్ధకాండము 842 నుండి 852 వఱకు 904

ఇందివి ముఖ్యములని చెప్పవచ్చును. తక్కినధర్మవిశేషములు లేవనరాదు. కథననుసరించి సమయము చిక్కినప్పుడెల్ల పెక్కునీతులను, ధర్మములను, మంత్రతంత్ర రహస్యములను, జక్కఁగఁ దెలిపియే యున్నారు.

సనాతనాచారతత్పరులును, లోకజ్ఞానసంపన్నులును బహుశాస్త్రవేత్తలునగు శర్మగా రిప్పటియత్యాచారములు సమంచితములుగావని నిరూపింప నిందుఁ బతివ్రతా ధర్మములును, స్త్రీల నిత్యకృత్యములును, వారికిఁగల స్వాతంత్ర్యములను, సతియందుఁ బతి యునుపఁదగు సద్భావమును, సతిపతు లెట్లున్న సంసారమున నానందసౌఖ్య ములు గలవనుటనుగుఱించి యుపన్యసించిన తావులఁ గాంచి యువయువతీజనంబు లవ్వానిశిరంబులధరింతురే నిహపరంబులఁ బరమసౌఖ్యములం బడయు టబ్బురమే ?

బాలకాండము 443 నుండి 456 వఱకును 467 నుండి 474 వఱకును, 608 నుండి 624 వఱకును

అయోధ్యాకాండము 5 నుండి 12 వఱకును, గలవానిఁ దిలకింపుఁడు.

సీతనమ్మికకై రామునిగుఱుతులు చెప్పఁబూనినమారుతి కేవలము "త్రిస్థిరస్త్రి ప్రలంబశ్చ" యని మొదలిడి సాముద్రికమునంతయు నప్పఁజెప్పక, సదాచారము, కృతజ్ఞత, సత్యము, వినయము, ఆస్తిక్యత, పౌరుషము, త్యాగము, మృదుత మొద లగువానిఁ బ్రశంసించుచు నివిగలవాఁడును, దుర్నీతి, దుస్సాంగత్య, దుర్వ్యయదురా చారదుశ్శీలాదులం దెగడుచు నవిలేనివాఁడును, శ్రీరామచంద్రుఁడని తెలిపిన ఘట్ట మునుబరికింప స్మృతిపురాణతాత్పర్యములెల్ల నొక్కచో నిక్కవివరు లెట్లుచేర్చిరో బుద్ధిమంతు లూహింప నవకాశముగలదు. ఇట్టివిషయములెల్ల విస్తరించి చెప్పుటే యీకావ్యముయొక్క ముఖ్యోద్దేశమనియుఁ దెల్లముకాకమానదు. రామావతార తత్త్వమున నివియెల్ల నిచ్చోఁజేర్ప వీలులేదు.

## రా వ ణుఁ డు.

ముక్తికొఱకు సీతాపహరణమును గావించెనే కాని కాముకుఁడై కాదు. ప్రకృత్యుపాసకుఁడు సనత్కుమారునిబోధ మఱువనివాఁడు మహాభక్తుఁడు జ్ఞానియే కాని మూర్ఖుఁడు కాఁడు.

ఆరణ్యకాండము 714, 724 వఱకు

సుందరకాండము 272, 351 వఱకు గమనింపుఁడు.

ఇవిగాక, జంతుహింసనుగూర్చి సుందరకాండము 57 నుండి 75 వఱకు
వినయములేనివాఁ డింద్రుఁడైన నశించునని సుందరకాండము 104, 117 వఱకు
ఉపాసకధర్మములనుగుఱించి అయోధ్యాకాండము 630 నుండి 648 వఱకు
గంగాప్రభావము శిష్టాచారశాస్త్రాచారములనుగూర్చి
బాలకాండము 521, 526 వఱకు
శైవవైష్ణవాదిషణ్మతతత్త్వమునుగూర్చి
బాలకాండము 669, 711 వఱకు
ఆశీర్వాదప్రభావమునుగుఱించి-
కిష్కింధాకాండము 269, 279 వఱకు

భగవద్ధ్యానకాలము ఉపాసనాభేదములు, తపస్సిద్ధులు, ఆకర్షణము, అస్త్రలంభపద్ధతులు, తదధిదేవతులు, తత్ప్రయోగోపసంహారములు, శాబరమంత్రములు, యక్షిణీదేవతలు, అభిచారహోమము, వీనింగూర్చి

సుందరకాండము 436, 457 వఱకును

యుద్ధకాండము 109, 127 వఱకును 182 నుండి 193 వఱకును 405, 424 వఱకును 549 నుండి 558 వఱకును 789, 900 నుండి 904, 959, 977 వఱకు విపులముగఁ జర్చించిరి.

శాంతిప్రయోగము, భావనాబలము, మంత్రసిద్ధి, బీజాక్షరములు, మనుసిద్ధికై జపహోమాదులు మొదలగువానింగూర్చి

కిష్కింధాకాండము 370 నుండి 383 వఱకును
సుందరకాండము 626 నుండి 645 వఱకును

జిత్తగింపుఁడు.

ఓషధులయొక్క ప్రయోజనమహత్త్వతత్త్వములనుగుఱించి
యుద్ధకాండము 462 నుండి 479 వఱకు
గమనింపుఁడు.

అకార్యములంగూర్చి సుందరకాండము 83 నుండి 92 వఱకును జూడనగు.

## ఆ ది త్య హృ ద య ము.

తనకొకహేత్వంతరములేనిపరాత్పరుఁ డాదిత్యునిఁ గొల్చెనన్న నవ్వనివా రుండరు. కాన నయ్యది ప్రక్షిప్తమని దూలనాడుమహాత్ములకు నుత్తరమీఁబడిన ఫక్కిఁగాంచుఁడు. ఇందాదిత్యునిమహిమానువర్ణన మతిశ్లాఘ్యము.

యుద్ధకాండము 737 నుండి 757 వఱకు

రావణవధానంతరము శంకరుఁడు రామునకు దశరథునిఁగనఁబఱచుటయు నత నికిఁ బూర్వస్మృతియుండుటయు సుతాదులపై వ్యామోహముండుటయు గలదా యని నవనాగరికు లులికిపడి ప్రశ్నింతురేమో యని యుద్ధకాండము 863, 64, 65, 66 వఱకు సమాధానమువ్రాసి 867, 68 పద్యములలో, చచ్చినవారు మరల జనించుట లేదు. కర్మము లేదనివాదించు పాషండమతము నిరాకరించి 869 లో కర్మగతిందెలిపిన భాగమును గాంచఁదగు.

ఇట్టు లాయాయితావులఁగలసార మేమని చర్చించి సప్రమాణములుగా యథా మతి వ్రాసి కృతినామము సార్థకమగునటులు శ్రీశర్మగారు తమపాండిత్యప్రకర్షము గనఁబఱిచి పాఠకులకృతజ్ఞతకుఁ బాత్రులైరి.

ఇందన్ని ధర్మములునుగలవా ? ఈపరిశ్రమమున లోకమున కేమేమేలుగలదా ? యనరాదు. ధర్మములన్నియు నిం౦ు లేకున్నను సకలధర్మముఃసార మింగుఁగలదనియే నానమ్మకము. ఇఁక లోకమునకుమేలుగలదా ? యన్నఁ గొందఱకైనఁగలదుకదా ? యనుటయే సదుత్తరము. కర్మగతులంబట్టి మనోగతులు తాఱుమాఱగుచుండు. దాన నొక్కనిచిత్తమునకు నచ్చినమార్గము నింకొక్కఁ డీసడించుటయు, దాని వేఱొక్కఁడా క్షేపించుటయు, మఱియొక్కఁ డద్దానిఖండించుటయుఁ జూచుచునే యున్న వారము. కాన దానికై పెంచివ్రాయుటేల ?

సత్కర్మములు సలుపుటవలనఁ బుణ్యముకలుగును ధర్మాచరణముచేఁ జిత్తశుద్ధి లభించుటేగాక పరమపదంబునకుఁ బరంపరాసాధనంబగును. అర్థకామంబులు ధర్మ విరుద్ధముగ ననుకూలముగనుండునటులు పాటింపవలయు. పురుషార్థచతుష్టయమును బడసి సుఖించుటకై మానవులు కాలానుగుణముగను వర్ణాశ్రమానురోధంబుగ ననుష్ఠింపవలయువిధుల నన్నిఁటిని విపులముగఁదెలుపు వేదశాస్త్రపురాణేతిహాసముల యొక్కసారాభిప్రాయ మీధర్మసారరామాయణమని మఱియొక్కమా టనుటకంటె నింకొక్కమాటఁ బలుకఁజాల.

ఇఁక నిందలికవిత్వముంగూర్చి నాలుగుమాటలు. సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యమును గడించి, శ్రుతినయనత్రిభాగగోచరులై, మంత్రఖండసర్వస్వ వేత్తలై, యోగశాస్త్రమర్మజ్ఞులై, వేదాంతము నభ్యసించి, స్మృతితీర్థులై, తెనుఁగున ననేకకృతు లీవఱకె వ్రాసి యశోవిభూషితులగు వీరికవనమునుగూర్చి నే నేమి వ్రాయఁగలను ? గ్రంథమంతయు శాంతరసమునఁ బెనుపొంది శబ్దాడంబరము లేక, సర్వథా ద్రాక్షాపాకవిలసితమై, ఓజఃప్రసాదమాధుర్యాదికావ్యగుణముల విలసిల్లి, సాత్వతీప్రధానమై సహజానర్గళధారాపరిశోభితమై మొదటినుండియుఁ జివరవఱ కొక్కపోలిక గలిస్ఖలనముం బొరయక నివ్వటిల్లుచుఁ జదువరుల డెందమున కమితా

నందముం గూర్చుచున్నది. వేదాంతవిషయములను, ధర్మసూక్ష్మములను, మంత్రాది శాస్త్రరహస్యములను దెలుపునట్టులందుఁగూడ నిరక్షరకుక్షులుగాక భాషాజ్ఞాన మే మాత్రమైన నున్నవారికిఁగూడ సుబోధమగునట్టులు బెడంగుగఁ దిద్దినపద్దెములఁ గాంచిన వీరికవితానైపుణి యెట్టిదో తెలియకపోదు.

ఇమ్మహనీయు లేటేట నిద్దఱిద్దఱ నిట్టికృతికన్యలఁ గాంచు టబ్బురముఁగొలుపు. ఇప్పటికే పలువురు జామాతలైరి ఈవత్సరమునకుఁ గలివిలాసముతో నిద్దఱుకన్యలైరేమొ. ఇంతకే విరామముఁగల్పింప వలసునదనట్లున్నది. శర్మగారి కపుడే గర్భదోహదలక్షణములు గాన్పించుచున్నవి. పురుషపుంగవులయ్యు వీ రీఖిలముగాని సంతానముఁ బడయుటెట్టులని శంకనొందఁబనిలేదు. వీరు శాక్తులనిగదా లోపల భావము. లింగభేదము శబ్దమునుబట్టియే గాని వస్తువునుఁబట్టి కాదనికూడ వీరిమత సిద్ధాంతము. కాననేపుంరూపమొందినవీరు ప్రతివత్సర మిట్టిసుగుణకలాపలఁ గూఁతులం గాంచుచున్నారు. కానిండు "మృష్టాన్నమిత రేజనాః" యనుసూక్తికిం జేరినవారము మనము మహోత్సవములం దది తప్పకఁ జరగుఁగదా ? కొఱంతయేమి?

ఇందలిశంకలు——

సముద్రముసుత్తరింప హనుమను మార్గాయాసమపనయింపఁ బొమ్మని మహేంద్రుఁడు మైనాకునిఁబురికొలిపినఘట్టమున హనుమజ్జననాదికకథను గిష్కింధాకాండము 290 నుండి 414 వఱకు నిర్మాత్రుఁడు దెలుపుచు కాలవిలంబముఁగావించుట సమయజ్ఞతకులోపమేమో ? యనుకొంటిని. తుద కిట్లు నిర్ణయించుకొనఁగలిగితిని. ఇది కథాప్రధానముగా వ్రాయఁబడినదికాదు సూక్తులనువిస్తరించి చెప్పుటే యీకృతిముఖ్యోద్దేశము. అట్లగుట దీనికి దోషమేల పొసఁగు ? పొసఁగునందురేని భారతసంహితలోని పదునెనిమిదధ్యాయముల గీతగల పట్టున కగుసమాధానము దీని కేటి కన్వయింపక పోవు నని తనిసితిని.

మైనాకదర్శనము, సురసాగమనము, సింహికాహననములనుమూఁడును శ్రీమద్రామాయణమున సుందరకాండాదినివర్ణింపఁబడియుండ నిందేటికో కిష్కింధాకాండాంత్యమునఁ జెప్పిరి. ఈమార్పుచేఁ గలుగుప్రమాద మేమియుఁ గన్పడదని నాయూహ.

ఇక నిక్కవిచంద్రులశైలి నింపుకవిమాడక మానవయితిగాదు. గతిచెడక బిగువుదప్పక భావశబలతగలిగి రసనిష్యందకములై నిసుపారినవీరి కతిపయపద్యము లిందుఁ బొందుపఱచెద. అవియు నీతి నుపదేశించునట్టివానినే దడవెద.

చ. పురుషుఁడు తానె కర్తనని • పొంగుచు నుండును జ్ఞానహీనతన్
బరశివుఁ డీతఁ దక్షుఁడు ద్విపాదములుండు లులాయము చుఁ దా

నరయుఁ జనుండుఁ గర్మమను•నద్దియు ముందుగ హెచ్చరింపకే
వరుస ఫలాళిఁ గూర్చుచు న•భంగురశక్తిని బొల్చు నద్దిరా! బాల. కాం. 83

చ. ఒకతఱి మోహవేగమున • నొక్కనిపత్నిని బట్టుకొన్న వే
ఱొకతఱి స్వీయదారల మ•హోద్ధతి నొక్కఁడు బల్మిఁ బట్టి యీ
డ్చుకొనుచుఁ బోవుచుండఁ గను•చున్ దపియించుచు నూడఁగావలెన్
బకబకనవ్వి చేయుగురు•పాతక మేద్వఁగఁ జేయుఁ బిమ్మటన్. బాల. కాం. 188

చ. పురమునఁ బల్లెలందు రఘు•పుంగవుఁడౌ యువరాజు; తన్మహం
బరుదుగఁ జెల్లు రేపె యను•నట్టిసువార్త చెలంగెఁగాదె? య
త్తరుణమునందు విఘ్నమెది • దార్కొను నే విరమింతు నంచు నె
వ్వరు వినఁ బల్కలేదుగద • భాస్కరవంశపయోధిచంద్రమా! అయో. కాం. 379

ఉ. ఎక్కడ నేర్చుకొంటివొకొ • యీపలుకుల్ సహజన్మ! యెవ్వరే
నిక్కడ నిట్లుపల్కుమని • యీ తెఱఁగంతయు నేర్పలేదుగా
ముక్కున కెంతొ చాయఁగను • బోఁదగు నన్నసనాతనోక్తి నీ
వొక్కపుడేని విన్నయటు • లూహయొ కల్ల దదేమిచిత్రమో! అయో. కాం. 405

ఆ. నిన్నఁగాక మొన్న • నీవు జన్మించితి, వింతలో భవాబ్ధి నెట్లు మున్గి
వంతగుంచినావొ • భావింపఁగాఁ జాలఁ, బెద్దవారికంటెఁ బెద్దవైతి. అయో. కాం. 406

సీ. బొమముడిఁ గాంచినఁ • బొక్కులోకములెల్ల, నితఁ డేమిచేయునో • యింక ననుచుఁ
గనులు త్రిప్పినయంతఁ • గడగడవడఁకుదు రమరు లెల్లరు నేమి • యగునొ యనుచుఁ
బయనము సాగింపఁ • భయపడుచుందురు, మునులెల్ల నెవనిఁ జంపునొ యటంచు
నడుగిడఁ బూనిన • యంత వడంకును శేషుఁడేమగునొకొ • చిక్కు లనుచుఁ
గీ. నడవి నడుగిడ వ్యాఘ్రాదు • లడలు వీసి, యాఁకలికి నేది యాహార•మగునొ యనుచుఁ
బ్రళయకాలాంతకుండె యీ•వపువుఁ దాల్చి, వచ్చినాఁ డని తలఁతురు • వనదివిజులు.
అరణ్యకాం. 83

చ. కరణము ఖడ్గధారగను • గర్తసుమిత్రసుతుండుగా భయం
కరదితిజాంగనాభిమత•కర్మము హేతువుగాఁగ సర్వని
ర్జరశుభమే ఫలంబుగను • సాగెను దచ్ఛ్రుతినాసికైకసం
హరణము సాక్షిమాత్రుఁ డగు•నప్పరమేశునిచెంత నత్తఱిన్. అరణ్య. కాం. 421

చ. ఒరులకు సాయమే నయితి • నొక్కపుడే నొకహానిచేయ నె
వ్వరికిని దష్టకాల మిది•వచ్చె నదెట్టులొ నాకు నంచుఁ బా
మరులు తలంత్రు పూర్వజని•మత్కృతకర్మఫలంబె యిద్ది యి
క్కరణిని మార్చఁ గాలము నిఁ•కన్ వగపేలని యెన్నఁ డొక్కఁడున్. కిష్కింధ, కాం. 14

క. ధనమిచ్చిన నైశ్వర్యం,బున దీర్ఘాయుర్దాయమునను • బొలుతువుగాకం
చును దీవించెదుజాల్మువచనములు ఫలియించు టెట్లు సన్మతులారా ! కిష్కింధ. కాం. 275

ఉ. తావియెలేనిపువ్వము నితంబినిలేనిగృహోత్తమంబు స
ద్భావములేనిపల్కు ఫలభారవినమ్రముగాని భూరుహం
బేవిధి కందనట్టి బహుశేష్టదకర్మమునాఁగ సర్వభూ
తావితథానుకంపఁగన • నట్టిగుణావళి నిష్ఫలంబెయా. సుందర. కాం. 63

ఉ. చిత్తము శాంతమైనయెడఁ • జేకుఱు నవ్వినయంబు నెప్పుడు
న్మత్తతఁ గాంచుఁ జిత్త మణుమాత్రము నిల్వక యాగుణంబుపో
దుత్తలపాటునొందు; మఱియొక్కయుదాహరణం బిఁకేల స
ర్వోత్తమమంచుఁ జెప్పటయె • యొప్పఁగ దావినయంబ గట్టిగన్. సుందర. కాం. 112

క. కాకులను జంపి గ్రద్దల,యాఁకలిఁ దీర్పంగ గోరునటు లుత్కోచం
బేకొని దానం బిడు పలు,గాకులఁ జెండాడ నెంచుఁ • గమలదళాక్షీ ! సుందర. కా. 291

చ. తనపని కన్యకార్యసముదాయము హాని గనంగఁజేయుచున్
ఘనత వహించుకార్య మదిగాఁ దలపోయుచు నుబ్బుచున్ దనుం
గనుఁగొన నీసడించునొరుఁ • గాంచి హసించుచునుండు క్రూరచి
త్తునిఁ దలపోయ రాదనుచుఁ - దోఁచెదు నంచు వచించు నిచ్చలున్. సుందర. కాం. 293

తే. గృహిణి ప్రాచీనపద్ధతిఁగ్రహణతత్వ, రత్వమునసుండ మాన్పించరాదు దాని
వలన సత్ఫల మం చొగిఁబలుకు క్రూర,మతిని గన్నెత్తిచూడ నేమాడ్కిఁగ నను.
సుందర. కాం. 325

చ. జనులకు వెన్క మృత్యువు పొసంగ వసించియె యుండు దానిసిం
గనుఁగొనఁజాల రెవ్వ రది కాలమురాఁ దనమూర్తిఁ జూప వ
చ్చును; క్షణమైన నిల్వఁదగుచొప్పును గాంచదు కర్మసంగతిం
గొని చనువానికిన్ ఫలముఁ గూర్ప స్వతంత్రతలేదు దానికిన్. యు. కాం. 230

చ. అరిగెద యుద్ధభూమికిఁ జయం బొడఁగూర్పఁగఁ బోరువాఁడ నే
మరలి భవత్పదాబ్జముల • మస్తకమానఁగఁజేసి మ్రొక్కి ఘోరసం
గరమును జెప్పఁగల్గుదునొ • కాలభటుల్ పిలువంగ వారితో
నరుగుదునో యెఱుంగ మనమారఁగ మ్రొక్కెదఁ గౌఁగిలింపుమా. యు. కాం. 276

మ. చిరకాలంబుగ నన్నుఁ బెంచితివి; లక్ష్మీసత్కృపం గల్గున
ట్లరయం జాలితి; వింతదాఁక నిను నేనర్థింప నెద్దాని నే
దరుణంబిద్ది దురంతమైతగుట నర్థంబేదియేఁ గోరఁగాఁ
బురికొల్పెన్ మది కౌఁగిలింపు మదియే • పూర్ణార్థ మం చెన్నెదన్. యు. కాం. 277

ఉ. అందఱికంటెఁ దానధికుఁడై మఱి యందఱు తానెయయ్యుఁ దా
నందఱియందునుండి యెవరైనను దన్నెఱుఁగంగ రానిదౌ

చందమున న్మెలంగుచు న•సంగతరూపుఁడు తానెయౌచు నొ
ప్పందగియుండు వాఁడు ననుఁ • బౌరుషమొప్పఁగఁ దాఁకుఁ గావుతన్. యు. కాం. 362

చ. తలఁపఁగ వచ్చునయ్య! యిటు • తమ్ముఁడు కుందుచు వల్కలాజినం
బుల ధరియించి నాకొఱకు • భూరితరంబగురాజ్యసంపదల్
గలుగఁగ వీడి నన్న నెడు • కాంక్షల జెప్పులువాయఁ జూడఁగాఁ
దలఁపక వాని నిందు సుఖ • ధామములన్ వసియించు టోసఖా ! యు. కాం. 884

చ. ధనమున కాసపూని యనృ • తంబులు పల్కుచు సాధుకార్యముల్
పనివడిఁ బాడుచేయఁ బలు • బాములకైన సహించి యత్నముల్
పొనరిచి యవ్వి సెగ్గినఁ బ్ర • మోదమునొందెదు కుంతలున్ మహా
వినయముచూపి సత్కృతికి • విఘ్నముచేసి హసించు దుర్మతుల్. యు. కాం. 1021

ఇట్లే వ్రాయఁదలఁచిన మానఁదగినపద్యము లీకృతిఁ గాన్పింపవు. విస్తరభీతిచే విరమింపవలసినదే.

ఇప్పరమలాక్షణికుల కావ్యముంగూర్చి వ్రాయఁదగునంశము లింకను బెక్కు లున్నను, వానినన్నిటిం దడవి చర్చింప నుభయభాషావేత్తలగునంతర్వాణులకుఁ గాక నాయట్టి జడమతి కేలసాధ్యమగు? నాయల్పమతికి గోచరించిన విషయములఁ దడవితి. నాకుఁదెలియక మానినవానిని బాఠకలోక మెఱింగికొని నన్ను మన్నించుఁగాక!

గ్రంథోత్పాదకులు శేషాద్రులు, ముద్రాపకులు వేంకటేశ్వరులు, మహోత్సవ కర్తలు రాయలసీమవాసులు. దేని కేకఁగొఱంత? ఎల్లకాలము నిట్లే జరపుచుంట కేతత్కార్యత్రయకర్తల కతులైశ్వర్యాయురారోగ్యములఁ బ్రసాదింపఁ బరమేశ్వరు నొక్కపరి మనఃకంజాతమున ధ్యానించెద.

ఇందు నాయసామర్థ్యముచేఁ గలిగిన ప్రమాదాదులను దోషజ్ఞులగుపెద్దలు మన్నింప వినయముతోఁ బ్రాంజలింగూర్చి యింతతో విరమించెద.

ఓం శాంతిః.

బేవినహళ్లి.
ఈశ్వరాశ్వయుజ బహుళ
౧౦ భార్గవవాసరము
28-10-1937.

ఇట్లు,
విద్వద్భక్తచరణదాసుఁడు,
క ర ణ ము కృ ష్ణ రా వు.
శ్రీ. శ్రీ. శ్రీ.

# విషయసూచిక.

## బాలకాండము.


| విషయము. | | పుట. |
|---|---|---|
| కథారంభము | ... | 1 |
| రాజవర్ణనము | ... | 2 |
| కైకను దశరథుఁడు పెండ్లాడుట | ... | 3 |
| దేవతలు బ్రహ్మతో రావణునిదుండగములఁ జెప్పుట | ... | 20 |
| దేవతలు వైకుంఠమున కరుగుట | ... | 24 |
| వసిష్ఠుఁడు దశరథునకు శ్రీరామునిమహిమ తెలుపుట | ... | 36 |
| శ్రీరాముఁడు లక్ష్మణసహితుఁడై మునివెంట నరుగుట | ... | 39 |
| శ్రీరాముఁడు తాటకను వధించుట | ... | 41 |
| విశ్వామిత్రుఁడు రాముని వినుతించుట | ... | 44 |
| శ్రీరాముఁడు మారీచసుబాహులతో యుద్ధముచేయుట | ... | 47 |
| విశ్వామిత్రుఁడు శ్రీరామునకు శివధనుస్సునుగుఱించి తెల్పుట | ... | 48 |
| అహల్యాశాపవిమోచనము | ... | 50 |
| గౌతముడు శ్రీరాముని నుతించుట | ... | 53 |
| శ్రీరాముఁడు హితములఁ దెల్పుట | ... | 54 |
| గంగానదీమహత్త్వము | ... | 59 |
| శ్రీరామలక్ష్మణవిశ్వామిత్రులు మిథిలఁజేరుట | ... | 62 |
| శ్రీరామాదులు జనకునియజ్ఞభూమి జేరఁబోవుట | ... | 63 |
| జనకుఁడు శ్రీరామునకు శివధనుస్సును జూపుట | ... | 64 |
| హరధనుర్భంగము | ... | 66 |
| జనకుఁడు సీతకు ధర్మములం దెల్పుట | ... | 69 |
| విశ్వామిత్రకృతరామస్తుతి | ... | 77 |
| కాండాంతము. | ... | 86 |


## అయోధ్యాకాండము.


| | | |
|---|---|---|
| సీతారాము లయోధ్యలో సుఖముండుట | ... | 87 |
| దశరథుఁడు పౌరులతో నాలోచించుట. | ... | 90 |
| శ్రీరామునకు దశరథుఁడు పట్టాభిషేకమునుగురించి తెల్పుట | ... | 94 |
| శ్రీరాముఁడు సీతతోఁ బట్టాభిషేకవిషయము దెల్పుట | ... | 95 |

| విషయము. | | పుట. |
|---|---|---|
| కైక దశరథుని వరము లడుగుట | ... | 97 |
| శ్రీరాముఁడు తండ్రినిఁజూడఁ గైకగృహంబున కరుగుట | ... | 98 |
| కైక శ్రీరామునకు వరములను దెలుపుట | ... | 99 |
| శ్రీరాముఁడు సీతతోడను దమ్మునితోడను నడవి కరుగుట | ... | 100 |
| భరతుఁ డయోధ్యకువచ్చుట | ... | 101 |
| కైక భరతునకుఁ దనకార్యముం దెల్పుట | ... | 102 |
| భరతుఁ డన్ననుజూడ నరణ్యమున కరుగుట | ... | 104 |
| గుహుఁడు సైన్యముల సిద్ధపఱచుట | ... | 105 |
| భరతుని గుహుఁ డాహ్వానించుట | ... | 107 |
| సౌమిత్రి భరతాగమనము రామునకుఁ జెప్పుట | ... | 110 |
| రాముఁడు సౌమిత్రికి హితోపదేశముచేయుట | ... | 111 |
| రాముఁడు తండ్రికిం దర్పణముచేయుట | ... | 116 |
| శ్రీరాముని భరతుఁడు రాజ్యముఁజేయరమ్మని కోరుట | ... | 119 |
| శ్రీరాముఁడు భరతునకుఁ గర్మసిద్ధాంతమును దెల్పుట | ... | 121 |
| భరతుఁడు శ్రీరామునితోఁ దనవిన్నపముఁ దెల్పుట | ... | 124 |
| జాబాలి రామునకు ధర్మముల దెల్పుట | ... | 130 |
| శ్రీరాముఁడు జాబాలికి నుత్తరం బిచ్చుట | ... | 134 |
| జాబాలి శ్రీరామునితో విన్నపంబుసేయుట | ... | 137 |
| వసిష్ఠముని శ్రీరామునకు ధర్మోపదేశముచేయుట | ... | 139 |
| శివపూజోపదేశము | ... | „ |
| వసిష్ఠముని రామునకుఁ ధర్మములఁ దెల్పుట | ... | 145 |
| రాముఁడు వసిష్ఠునకు ప్రత్యుత్తరము చెప్పుట | ... | 148 |
| భరతుఁ డడవులకు వత్తుననుట | ... | 149 |
| రాముఁడు భరతున కుపాసకధర్మములఁ దెల్పుట | ... | 150 |
| భరతుఁడు పురికరుగ నొప్పుకొనుట | ... | 154 |
| దండకారణ్యవర్ణనము | ... | 159 |
| కాండాంతము | ... | 166 |


## ఆరణ్యకాండము.


| | | |
|---|---|---|
| విరాధశాపమోక్షము | ... | 169 |
| శరభంగమునిచరిత్రము | ... | 178 |
| రాముఁడు లక్ష్మణున కుపాసనమహత్త్వ మెఱింగించుట | ... | 180 |
| సీతకు రాముఁడు స్వాభిప్రాయముం దెల్పుట | ... | 186 |

| విషయము. | | పుట. |
|---|---|---|
| మాండకర్ణివృత్తాంతము | ... | 187 |
| తపోబలవర్ణనము | ... | 189 |
| శ్రీరాముఁ డగస్త్యాశ్రమమున కరుగుట | ... | 191 |
| జటాయువు రామునితో సంభాషించుట | ... | 198 |
| కాలమహత్త్వవర్ణనము | ... | 200 |
| శూర్పణఖవచ్చుట | ... | 203 |
| రాముఁడు సౌమిత్రి కప్పటినిమిత్తములఁ దెల్పుట | ... | 208 |
| ఖరాదులు యుద్ధమునకువచ్చుట | ... | 210 |
| శ్రీరాముఁడు తమ్మునకు గర్తవ్యముఁ దెల్పుట | ... | 214 |
| రావణుని శూర్పణఖ పురికొల్పుట | ... | 221 |
| రావణుఁడు మారీచునికడ కరుగుట | ... | 227 |
| సౌమిత్రి రాక్షసమాయ యని రామునకుం దెల్పుట | ... | 231 |
| సన్న్యాసివేషమున రావణుఁడు సీతకడకు వచ్చుట | ... | 235 |
| జానకి రావణునకు బదులిచ్చుట | ... | 237 |
| శ్రీరామలక్ష్మణులు సీతను వెదకుట | ... | 240 |
| జటాయువు సీతవార్తం దెల్పుట | ... | 241 |
| కబంధముక్తిప్రధానము | ... | 245 |
| రాముఁడు తమ్మునకుఁ దపోనియమములఁ దెల్పుట | ... | 249 |
| **కిష్కింధాకాండము** | | |
| సుగ్రీవుఁడు రాముఁ గాంచి భీతిల్లుట | ... | 253 |
| హనుమంతుఁడు రాముం గానఁబోవుట | ... | 254 |
| సుగ్రీవుఁడు రాము నుపదేశంబు నాలకించుట | ... | 257 |
| వాలిసుగ్రీవుల తొలియుద్ధము | ... | 259 |
| తార వాలికి హితము తెలుపుట | ... | 261 |
| తారకు వాలి ప్రతివచనం బిచ్చుట | ... | 262 |
| శ్రీరాముఁడు వాలిని వధించుట | ... | 264 |
| వాలి రాముని ప్రశ్నించుట | ... | ,, |
| శ్రీరాముఁడు వాలికి సముత్తరము లిచ్చుట | ... | 267 |
| వాలి రాముని నుతించి కర్తవ్యముం దెల్పుట | ... | 270 |
| సుగ్రీవపట్టాభిషేకము. | ... | 271 |
| శ్రీరాముఁడు సుగ్రీవునకు సంసారయాత్రాపద్ధతిం దెల్పుట | ... | 273 |
| సుగ్రీవుఁడు వానరులఁ బంపుట | ... | 275 |
| సంపాతి వానరులకడకు వచ్చుట | ... | 277 |

| విషయము. | | పుట. |
|---|---|---|
| ఆశీర్వచనఫలములను హనుమంతుఁ డెఱింగించుట | ... | 280 |
| సముద్రుఁడు మైనాకుని హనుమంతునకు సాయపడఁబంపుట | ... | 281 |
| హనుమజ్జననము | ... | 282 |
| హనుమంతునకు దేవతలు వరములిచ్చుట | ... | 285 |
| భావనాశక్తి | ... | 289 |
| సురస హనుమంతుని బరిశీలించుట | ... | 295 |
| హనుమ సింహికం జంపుట | ... | 297 |


## సుందరకాండము.


| | | |
|---|---|---|
| హనుమంతుఁడు లంకను జంపుట | ... | 300 |
| యోగమహత్త్వము | ... | 304 |
| అహింసాతత్త్వము | ... | 305 |
| అకార్యములు | ... | 308 |
| వినయమహత్త్వము | ... | 310 |
| హనుమ దేవతలవేఁడుట | ... | 312 |
| హనుమ జానకిం గాంచుట | ... | 315 |
| ధ్యానకాలము | ... | 317 |
| సీతారావణసంభాషణము | ... | 318 |
| త్రిజట స్వప్నముం దెల్పుట | ... | 321 |
| సీతామహత్త్వము | ... | 322 |
| హనుమంతుండు శ్రీరాముని గుణములం దెల్పుట | ... | 327 |
| సీత హనుమంతునితో సంభాషించుట | ... | 337 |
| సీత హనుమంతునకు శిరోరత్న మిచ్చుట | ... | 341 |
| అస్త్రవిద్యోపాసన | ... | 343 |
| హనుమ వనభంగము చేయుట | ... | 348 |
| ఇంద్రజిత్తు హనుమ బంధించి తెచ్చుట | ... | 350 |
| హనుమ రావణునకు హితముఁ దెల్పుట | ... | 355 |
| విభీషణుండు రావణునకు నీతిఁ దెల్పుట | ... | 356 |
| హనుమను సీత యగ్ని బాధకలుగకుండఁ జేయుట | ... | 363 |
| శాంతిప్రయోగతత్త్వము | ... | 364 |
| అంకాదపాదము | ... | 367 |
| అనుకూలనిర్మాణప్రకరణ | ... | 368 |
| వానరులు మధువనముఁ గొల్లగొట్టుట | ... | 371 |
| రాముఁడు సాగరుఁ బ్రార్థించుట | ... | 373 |

| విషయము. | | పుట. |
|---|---|---|

## యుద్ధకాండము.

| | | |
|---|---|---|
| అభయప్రధానము | ... | 377 |
| యక్షిణీదేవతాప్రభావము | ... | 388 |
| సుగ్రీవరావణులయుద్ధము | ... | 390 |
| యుద్ధారంభము | ... | 392 |
| రాత్రియుద్ధము | ... | ,, |
| ఇంద్రజిత్తు రామలక్ష్మణుల నాగపాశబద్ధులఁజేయుట | ... | 393 |
| గరుత్మంతుఁడు వచ్చుట | ... | 395 |
| నాగపాశప్రయోగవిధి | ... | 396 |
| ధూమ్రాక్షాదులు మృతినొందుట | ... | 398 |
| కుంభకర్ణుని మేలుకొలుపుట | ... | 400 |
| కుంభకర్ణుఁడు రావణునకు హితముఁదెలుపుట | ... | 403 |
| కుంభకర్ణునియుద్ధము | ... | 408 |
| రాముఁడు కుంభకర్ణుం జంపుట | ... | 410 |
| అతికాయుండు మృతినొందుట | ... | 413 |
| పౌరుషమునకంటె దైవ మధికము | ... | 419 |
| ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమున రామాదుల మూర్ఛిల్లఁజేయుట | ... | 420 |
| అభిచారహోమరహస్యము | ... | 421 |
| ఓషధులమహాత్త్వము | ... | 427 |
| వానరులు లంకం గాల్చుట | ... | 430 |
| ఇంద్రజిత్తు హోమముచేసివచ్చి రామాదుల నొప్పించుట | ... | 431 |
| ఇంద్రజిత్తు మాయసీతను జంపుట | ... | 434 |
| మాయాసీతావధరహస్యము | ... | 436 |
| చైత్యనికుంభిలావృత్తాంతము. | ... | 437 |
| దేవతావర్ణఫలములు | ... | 438 |
| విభీషణుఁడు లక్ష్మణునిఁబంప రాముని వేఁడుట | ... | ,, |
| మూలబలంబుల రామమూర్తి దునుమాడుట | ... | 444 |
| రావణుని రెండవయుద్ధము, లక్ష్మణమూర్ఛ | ... | 448 |
| రామరావణులమహాసంగ్రామము | ... | 453 |
| అగస్త్యముని యాదిత్యహృదయమును రామున కుపదేశించుట | ... | 458 |
| ఆదిత్యహృదయతత్త్వము | ... | ,, |

| విషయము. | | పుట. |
|---|---|---|
| రావణుఁడు శరీరమువదలుట | ... | 461 |
| రావణశిరస్తత్త్వము | ... | 464 |
| విభీషణపట్టాభిషేకమహోత్సవము | ... | ,, |
| సీత శ్రీరామునిం జూచుట | ... | 466 |
| శ్రీరాముఁడు సీతను బరీక్షించుట | ... | ,, |
| సీత సదుత్తరములిచ్చి యగ్నిం బ్రవేశించుట | ... | 467 |
| అగ్నిదేవుఁడు సీతను శ్రీరామున కర్పించుట | ... | 470 |
| అగ్నిపరిశోధనరహస్యము | ... | 471 |
| ప్రకృత్యుపాసన | ... | 472 |
| శంకరుఁడు దశరథుని రామునకుఁ జూపుట | ... | 473 |
| విమానమహత్త్వము | ... | 478 |
| రాముఁడు శివలింగముఁ బ్రతిష్ఠించుట | ... | 479 |
| భరద్వాజాశ్రమమున రామాదులు నిలుచుట | ... | 485 |
| తపః ప్రభావము | ... | 486 |
| హనుమంతుఁడు గుహునకు భరతునకు రామునిరాకఁ దెల్పుట | ... | 488 |
| శ్రీరామచంద్రపట్టాభిషేకమహోత్సవము | ... | 491 |
| రామరాజ్యము | ... | 493 |
| ఫలస్తుతి | ... | 495 |


---

శ్రీ ర స్తు.

శ్రీమత్త్రిపురసుందర్యై నమః.

# శ్రీధర్మసారరామాయణము

## ఇష్టదేవతాస్తుత్యాదికము.

శా. శ్రీమాయాపరికల్పితాంగము జగచ్ఛ్రీవృద్ధిదంబై కృపా
ధామంబై వెలయంగ మానస మిలన్ ధర్మైకరక్షోల్లస
త్కామంబై కనుపట్టఁ జూపుగుమి భక్తవ్రాతవాంఛాప్రదా
నామేయాకృతిఁ గాంచ నొప్పు జగదంబాధాను సేవించెదన్. 1

మ. జలజాక్షుం డని శంకరుం డనుచు విజ్ఞానాంగుఁడౌ బ్రహ్మయం
చెలమిం బల్కుచు నిష్టదైవమని యెంతే భక్తిమై నెవ్వనిం
గొలువం గల్గిరొ సజ్జనుల్ మతవిధుల్ గూడంగ నాదైవమున్
లలితాకారుని రామచంద్రుని నిరాలంబున్ భజింతున్ మదిన్. 2

ఉ. ఏయెడ నెట్టికార్యముల నెవ్విధి లోకహితైకకాంక్షచేఁ
జేయఁగ నౌనొ రూప మెది చేకొన నౌనొ తలంచి యట్టులే
మాయతనున్ శరీరిగ నమర్పఁగఁ దత్ఫలమెల్లఁ గూర్చి ని
ర్మాయుఁ డనంగ వెల్గు మునిమానసపద్ముఁడు రాముఁ డోముతన్. 3

మ. కమలావాస యటంచు వాణి యనుచున్ గాత్యాయనీదేవియం
చమితానందముమీఱ జాతిమతధర్మాళిప్రయుక్తిన్ నితాం
తము దన్నుం గొలువంగ వారివగుపుణ్యాం బెన్ని వాంఛాప్రదా
నమునం బ్రోచుచు నుండువిశ్వజననిన్ నారాయణిం గొల్చెదన్. 4

ఉ. సుందరి యన్నపేరు కడుఁజోద్యముగాఁ గనుపట్ట మౌనిరా
డ్బృందము హృత్సరోజమున నెంతయు భక్తిని నిల్పి కొల్వ నీ
శుం దనశక్తిరూపయుతి శోభిలఁ జేయుచు జ్ఞానదాత్రియై
యెందును జూడఁ దాన యయి యేర్పడకుండు పరాంబ నెన్నెదన్ 5

చ. అనుపమసత్త్వయుక్తిని గరాంగుళిమంజునఖాళినుండి కం
జనయనపంచకద్వయము సంభవ మందఁగఁ జేసి దుష్టులౌ
దనుజవరేణ్యులం దునిమి తద్వరగర్వము మాయఁ జేసి మిం
చిన శివకామసుందరి భజించెద భూతనయాకృతిన్ మదిన్. 6

సీ. మాణిక్యనిర్మితవీణాస్వనామోదపీయూషవారాశిపృథులవీచి
కాడోలికాకేళిఁ గాంచుచు గేయచక్రశతాంగసంస్థితిఁ గాంచి యలరి

యాశ్రితసంరక్షణాదృతిఁ బెంపొంది భవ్యనీపాటవీవసతిఁ గాంచి
మంజులవాక్ప్రౌఢిమమున నెంతయు మించి మాహేంద్రనీలసమాన కాంతి
తే. భాసమానాంగమునఁ దగి పాదపద్మ, నఖరభామిళితాదిత్యసార్థ హారిహా
రాదిమకుటమణిద్యుతి యగుచుఁ దనరు, శ్యామలాదేవి నిల్చుత నామదిఁ దమి.7

సీ. సత్త్వగుణంబు రజస్తమోగుణములు నొగిఁ బ్రధానంబులై యుండ లోక
రక్షణసృష్టులు శిక్షయు ననుకార్యములు ముఖ్యవృత్తులై చెలఁగుచుండఁ,
జక్రంబు వేదంబు శాతశూలము కార్యసాధనములుగా నొసంగుచుండ,
శ్రీవాగుమాఖ్యలచే మించు శక్తులు కార్యభారంబుల నిర్వహింప
తే. నచ్యుతబ్రహ్మశివులను నాహ్వయములు, ఖ్యాతి మించఁ ద్రిమూర్తుల నఖిలలోక
భారవాహుల మాయ యేర్పడ సృజింప, నలరు నాలోకనాథుల నాత్మఁ దలఁతు.

చ. ఉరమున వక్త్రపార్శ్వముల నొప్పఁగ నిల్పి రమాసరస్వతీ
గిరివరజాతలన్నుడి కీర్తిదమై తగనూహ వాక్ శౌ
ర్యరమ నొసంగుచున్ హరిస్వయంభువు శూలిని గార్యదక్షతం
బరినుతిఁ గాంచఁ జేయుగుణభాసురలన్ భజియింతు మాతలన్. 9

చ. మతిని దలంచినంతనె సమస్తవిధంబుల నంతరాయసం
తతి పొడచూపకుండఁగ నితాంతదయామతి నాశ్రితాళికా
ర్యతతుల సాగఁజేసి ప్రమథాధిపవర్యుఁడుగాఁ జెలంగు దై
వతము గణాధిపాహ్వయము భద్రదమున్ మది నిల్పి కొల్చెదన్. 10

ఉ. దైవము రోషముం గనఁగఁ దాఁ గృపఁ గాచును శిష్యునిం గురుం
డావిధి రోషముం గనిన యప్పుడు దైవము పూన్కి మీఱఁగాఁ
గావఁగఁ జాలఁ డంచు విధికాండముఁ దెల్పెడు నట్టిసద్గురుం
బావనుఁ గొల్తు రాజ్ఞికులవార్ధిసుధాంశు నృసింహయజ్వనున్. 11

మ. శ్రుతినేత్రం బననొప్పు జ్యోతిషమునా శోభిల్లుశాస్త్రంబు ము
వ్వితముల్ గాఁగ మహోపకారకముగాఁ బేర్గాంచుదానిన్ దమిన్
సుతుగాఁ గన్గొని నేర్పినట్టిగుణభూషున్ శిష్యసంతానసం
వృతునిన్ వేంకటరామదైవవిదు సేవింతున్ హృదబ్జంబునన్. 12

మ. వనవాసంబున ధర్మసంహితతపోవాంఛన్ శ్రుతిప్రోక్తక
ర్మనికాయాచరణప్రమోదమున వైరాగ్యంబునన్ సర్వరూ
పనిమగ్నాత్మకళావిభూషణలసత్పాదాంబుజధ్యానని
ష్ఠను బెంపుంగనుమౌనివర్యుల నమస్కారంబులం గొల్చెదన్. 13

చ. పతి భగవంతునట్లు తలఁపందగి తద్ధితవర్తనంబునన్
క్షితిని బ్రసిద్ధిఁ గాంచి గుణసింధువులై తగి శాపమీయ న

ద్ధతగులకుండఁ ద్రిప్పఁదగు । ధీవిభవంబు చెలంగ శీలభూ
షితలయి వెల్గు సాధ్వులకుఁ । జేసెద నంజలి భక్తిమీఱఁగన్. 14

చ. ఇనుఁ డుదయింపకుండెడు నిదేమదుదారతపోబలంబుచే
నని పలుకంగఁజాలి త్రిదశాధిపు లెల్లరు వేఁడఁ బ్రీతిచేఁ
దనఁదగుపూన్కి మాని క్షితిధర్మము వృద్ధినిఁ గాంచఁజేయఁ బూ
నిన యనసూయ లోనయిన । నిర్మలమానసలన్ భజించెదన్. 15

## కవిస్తుతి.

చ. తనవదనంబునుండి కవితాతనయామణి యుద్భవిల్లి భూ
మినిగలపాపజాలముల । మేదురశక్తిని రూపుమాపి వే
దనిచయతుల్యతం గనుచుఁ । దానలరాఁగఁ బుట్టఁ బుట్టి స
న్మునియయి యొప్పు నాదికవి । భూతహితాత్మునిఁ బ్రస్తుతించెదన్. 16

చ. నరులకు మేలు గూర్పఁగ మనంబున నెన్ని శ్రుతిత్రయంబునం
బరఁగిన యర్థసారమును । భారతమం దిముడించి దేవతో
త్కరమును గొల్చుపద్ధతులఁ । దద్దయుఁ దెల్పఁ బురాణరాజినిం
గరుణ రచించినట్టి మునికాంతుని వ్యాసుని సన్నుతించెదన్. 17

చ. జనభయదాకృతిం బొలిచి । శాతకృపాణముఖాయుధాళి హ
స్తనికరమందుఁ గానఁబడ । దానవసంహరణప్రయత్నముల్
కనఁబడ నుండుకాళికను । గమ్రతమాంగముఁ దాల్చి కోర్కెలే
మని యడుగంగఁ జేసినమహాత్ముని గొల్చెదఁ గాళిదాసునిన్. 18

చ. శ్రుతిహితముల్ కులార్హములు । శుద్ధఫలంబులు నైనకర్మముల్
జతనము మీఱఁజేసి కవిసంతతి మేటి యనంగఁజాలి దే
వి తన కితండు భక్తుఁ డని । వెల్లడిచేయఁగఁ బొల్చు సత్కవీ
మతి భవభూతినాఁ జెలఁగుమాన్యుని నిల్పి సతంబు గొల్చెదన్. 19

చ. లలితపదాభిసంధికి నిలం దనయంతటివాఁడు లేఁడనం
బొలిచినదండి సాధుకవిపూజ్యుని, నిర్జరభాషఁ గ్రక్కె యొం
గిలిగ నొనర్చి యొక్కఁడగు కీర్తి గడించిన బాణు నింకనుం
గలకవివర్యులం గొలుతు । గాఢతదీయకృపం గనందమిన్. 20

ఉ. నన్నయభట్టునాఁ దెలుఁగునాటను వాగనుశాసనుండుగా
నెన్నికఁ గన్నవానిఁ గవు । లివ్విధిఁ బేర్గనఁజాలువార మే
యన్నతలంపుగల్గి తను । నన్వహమున్ స్మరియింప నొప్పున
భ్యున్నతశక్తిసంయుతు మహాత్ముని దైవమటంచుఁ గొల్చెదన్. 21

చ. తెలుఁగుకవిత్వ మిట్టిదని । తీర్పును జెప్పినయట్లు భారతం
బలరఁగఁ జేసి బ్రహ్మ యనునాహ్వయముం గలబ్ధపూర్వ మీ

యులఁ దనయంతఁ దన్ను వరియింపఁగఁ బొల్చెడు తిక్కయజ్వని
ర్మలహృదయున్ స్వకర్మరతు మాన్యతమున్ భజియింతు భక్తిచేన్. 22

ఉ. భారతశేషభాగము నపారమతిప్రతిభావిశేష మొ
ప్పార రచించి పెక్కులు మహాకృతు లుర్వర సత్కవీశ్వర
స్ఫారనుతిం గనందగినపద్ధతిఁ బూన్కి నొనర్చి శంభుపూ
జారతి గాంచి మించు కవిసత్తముఁ గొల్చెద శంభుదాసునిన్. 23

చ. మనసున సూక్తికాయములమార్పను నద్దియె లేక యేకతం
గను నటు లూహ సత్య ముపకారమునాఁ దగునవ్వి యేర్పడం
దనరియెదతమ్మి రాముఁడు ముదంబున వాసముచేయఁ బొల్చుపో
తనకవిచంద్రు భాగవతతత్త్వవిదున్ భజియించెదన్ మదిన్. 24

చ. పలికెడుపల్కు లన్నియును బద్మజురాణి వచించినట్టులై
వెలయ విపశ్చిదోఘము, కవిప్రవరుల్ విమలాత్మహృత్సుధో
ర్మిల నవగాహముల్ సలిపి మోదభరంబున విస్మృతాంగులై
చెలఁగుచునుండఁ బొల్చు కవిశేఖరు నైషధకర్తఁ గొల్చెదన్. 25

సీ. సోమనాథునిఁ గవిసోముని గొనియాడి కవితాపితామహఖ్యాతిగన్న,
యలసాని పెద్దనార్యమణిని బ్రార్థించి వసుచరిత్రగ్రంథవర మొనరిచి,
స్థిరయశంబును గన్న శ్రీరామరాజభూషణుని జిత్తంబున సంస్మరించి,
మృదుతమపదయుక్తసదమలకవితావినిర్మితి విఖ్యాతి నెఱి ఘటించి
తే. తనరు నాముక్కుతిమ్మన మనసునందు, నిలిపి యర్థించి ధూర్జటిని దలంచి
తక్కినట్టి మహాకవితల్లజులకు, నంజలిఘటించువాఁడ భక్త్యతిశయమున. 26

చ. జననివలెన్ స్వభాషను బ్రశాంతమనంబునఁ గొల్చుచుండు టే
జని ఫలియింపఁజేయుటని చక్కఁగ నమ్మి మహాప్రబంధర
త్ననికరయుక్తిఁ గొల్చు నధునాతనసత్కవులన్ భజించెదన్
మనమునఁ గృష్ణమూర్తి ముఖమాన్యుల భూరిదయాంతరంగులన్. 27

క. అని యిష్టదేవతాప్రార్థనముం గావించి గురువతంసుల భక్తిన్
గొనియాడి సాధ్వులకు వందనముం గావించి భక్తితాత్పర్యములన్. 28

మ. సురభాషం గృతికర్తలై యశమునన్ శోభిల్లువిద్వత్కవీ
శ్వరులన్ భక్తిని సంస్మరించి సురభాషం దల్లిగా నెంచి యు
ర్వర భాషాతతి మేటిగా తెలుఁగునన్ గ్రంథాళి నిర్మించి కీ
ర్తిరమం గాంచినసత్కవీశ్వరుల నర్థిన్ వేఁడి హృష్టుండనై. 29

చ స్మృతులఁ బురాణరాజముల జిత్తమునం గలసంశయంబులన్
సతము నడంచు నయ్యుపనిషత్తులఁ జక్కఁ బఠించి సారము

వితమని సంగ్రహించి యవివేకిత నిష్టమురీతిఁ బోవున
జ్ఞతతికిఁ దెల్పువేడుక యొసంగఁగ నొక్కకథాచ్ఛలంబునన్. 30

చ. తెలుపుట మేలటంచును మదిం దలపోయుచు విశ్రుతంబుగా
నిలఁ దగు రామచంద్రుకథయే యగు దీనికి నర్హమంచు ని
మ్ములగ్రహియించి తత్కథను బొందుగ నయ్యయితావులందు నే
ర్పలవడఁ జేసి యొక్కకృతి పర్వఁగఁజేయఁగ నిశ్చయించితిన్. 31

సీ. ఇక్కలికాలమం దెన్నియో ధర్మముల్ నామమాత్రములుగ భూమి నిల్చి
యున్నవి; మఱి వినాశోన్ముఖము లగుచుఁ గొన్నియున్నవి నిల్చియున్నవియును
జక్కనియాచారసరణి నొందక యెట్లొ జరగుచున్నవి వానిసార మెంతొ
వ్యత్యయం బగు నిర్ణయముఁ గాంచుచున్నది కావున మంచిమార్గమున దానిఁ
తే. బామరులమానసములకుఁ బట్టఁజెప్పఁ,దలఁచినాఁడఁ గథాభాగములను సుంత
మార్చి యట దీనికిం జోటుఁగూర్చినాఁడ,సైఁపఁదగుఁ బెద్ద లీనాదుచపలతకును. 32

క. తెనిఁగించితి రామాయణమును మున్నే కాన నందుఁ బొలుచుకథల మా
ర్చినవాఁడ సుంత యీధర్మనిచయముం బొందుపఱుప మన్నింపఁదగున్. 33

తే. మంచియుద్దేశమునుచుఁ గర్మములభక్తి,మంత్రజపమును దేవతామండలముల
భావన మొనర్చుపద్ధతిఁ బరమపురుషు,ధ్యానమును జేయువిధి యోగధర్మములను.

సీ. స్త్రీపురుషుల కనుష్ఠేయసదాచారముల నింక నెన్నియో భూరిఫలద
ము లగుమార్గంబులఁ దెలుపుచు ముఖ్యకథాభాగమును మానితల్లజమత
మున కవిరుద్ధముగను సాగునట్లుగ వ్రాసిన మేలన్న భావ మూని,
కృతి రచింపంగఁ బూనితి సాధుమతులార! రామాయణమున ధర్మంబు లివ్వి
తే. గలవె యని ప్రశ్న చేయక కలియుగమున, నిట్టివే యుండఁదగునంచు నెన్నినాదు
యత్న మిది సార్థముగ వెలయంగ నాశిషముల నిడుదురుగా కది సాజమగుట.

ఉ. రామచరిత్ర మిద్ది కవిరాజులపాలిటి కల్పవృక్షమే
యౌ మఱి పాపతూలశకలాళికిఁ బ్రజ్వలదగ్ని తుల్యమే
యౌ మునివర్యసంతతికి నాత్మను ధ్యానముచేయ నర్హమౌఁ
గామముఖారివర్గవనకర్కశభూరికుఠారధారయౌ. 36

ఉ. అట్టిచరిత్ర మూఁతగ మహాత్ములవాక్కులచొప్పు దెల్పఁగా
నుట్టిపడంగఁ జూచుచు మహోన్నతపుణ్య మొసంగఁజాలుచున్,
గుట్టెఱుఁగంగనీక తగి కోర్కు లొసంగుచుఁ బాపపంక్తిఁ బోఁ
దట్టుచు వెల్గుచుండు స్మృతిధర్మములం దెలుపంగఁ బూనితిన్. 37

సీ. మాంత్రికులము మేము యంత్రతంత్రంబులఁ గార్యసిద్ధి నొసంగఁగలమటంచుఁ
దెలుపుచు శిష్యులవలన విత్తముఁ గొంచు హాయిగా వర్తించునట్టిఖలుల

చెంతకుఁ బోవంగఁ జేటువాటిల్లెడునంచుఁ బ్రాచీనదేవాలయముల
నుద్ధరింతుమటంచు నుర్వీసురులకు మార్గమునఁ గష్టంబులు గలుగకుండ
ఆ. నన్నమిడుదుమంచు నధ్వగులకుఁ దృష్ణ, యడఁగ శీతలజల మిడుదుమంచు
ధనముఁ గూర్చుచుండు దాంభికులను నమ్మఁ, జేటు గలుగు నంచుఁ జెప్పఁ దలఁచి.
క. శ్రీరామునిచరితంబున, నేరీతిన్ వీనిఁ జేర్ప హితమగునో యం
చారసి యర్హైతావులఁ, గోరియె చొప్పించినాఁడఁ గోవిదులారా! 39
క. అరసి సదాచారంబుల, నురుశుభఫలదంబులంచు నొగిఁ దెల్పుచు ని
ర్భరదుఃఖదంబుల దురా, చరణంబుల నిట్టివంచుఁ జాటితిఁ జూండీ. 40
సీ. కలికాలమున మంచిఫలముల నొందంగఁ దపముఁ గానలనుండి ధర్మయుక్తి,
నొనరుప శక్య మెట్లూహించినం గాకయుండుటఁ దలఁచి యత్యుత్తమమఖ,
మంచు గీతాశాస్త్ర మనువదించినయట్లుపాసనయే మహాఫలదమంచు
నది యిష్టదేవతాన్యాదివిజదూషణరహితమై యుండుటే విహితమంచుఁ,
తే. బరమతత్త్వంబె కారణాంతరముననిటు, లెన్ని యొరూపములఁ దోఁచు నెద్దియందుఁ
దనమదికి నొప్పియుండు నద్దాని నెన్ని, జపము చేయంగఁదగునంచుఁ జాలఁ బూన్కి.
క. పునరుక్తిత యనుదోషం, బునకున్ గుఱి నౌదునంచు బుద్ధి నెఱిఁగియున్
జను నిట్లు చెప్ప దానన్, గన నగుసత్ఫల మటంచు గాటపుఁబూన్కిన్. 42
క. మరలన్ మరలన్ దెల్పితి, గురుతరధర్మజ్ఞు లౌటఁ గోవిదు లీనా
యరయమి మన్నింపకపో, వరటంచెదఁ గల్గుతలఁపు బలిమి గడఁగితిన్. 43
క. కనుకం బునరుక్తిత యిం, దనూనమోదావహంబె యగుఁ బెద్దలకం
చును విశ్వసించినాఁడన్, జనులకు మేలొదవఁ జేయుచందం బగుటన్. 44
తే. ఇదియె యీగ్రంథమును రచియించుపక్కి యిందు నెందైనఁ గన్పడు నెల్లదోష
ములను సైరింపఁ బ్రార్థింతు బుధుల నెల్ల, సహనమది వారికెన్న నైజంబె యగుట.

## భాషోపాసన.

సీ. స్వస్థానవేషభాషలయందు నభిమతమొప్పియుండందగు నుర్వినెల్ల
వారల కదె సదాచార మనందగు నద్దియే లేదేని యంఘ్రియుగళ
పశువులే యని పిల్వఁబడఁదగుదురు సదాచారమూలమున నె సంపదతగుఁ
గావున వానినిఁ గడఁగి పూజింపనౌ భాష విద్యాధిదేవత యయి తగు,
తే. శారదయె గానఁ దల్లినిఁ గారవించు, నంతకంటె మన్నింపనౌ నామెమూల
మునను జ్ఞానాభివృద్ధులు తనరు వాని, వలదనెడువార లుందురే వసుధ నెందు.
చ. జనని సమూల్యవస్తువుల సంతతమున్ భయభక్తులొప్పఁ బూ
జనములఁ దృప్తినొందఁగ నొసంగెడు వేడ్కన్ నొనర్ప భద్రముల్
తనియఁగ నబ్బుఁగాని దృఢదారువులం జదియంగ మోఁదన
బ్బునె శుభముల్ మహాత్ము లిదిపోలునటంచు వచింప నెంతురే. 47

సీ. పామరజనులతో భాషించునట్లుగా నియమంబు గానలేనిపదపంక్తిఁ
గూరిచి లోకోపకారమీయది యని సులభమార్గం బిది చూడుఁ డనుచు,
బోధించి కృతికన్యఁ బోషించు నెపమున దూషితగాఁ జేయఁదొడరునొక్కొ,
యశమ దెవ్వరికే నియమము లేకుండిన నెయ్యది సాగదం చెఱుఁగవలదె,
ఆ. భాష జననిగాఁగ భావించి పూజించు, పద్ధతుల నెఱింగి పరమనియతి,
నర్చలను నితాంత మలరింపఁదగు దాన, నిహము పరము వాణికృపను గలుగు

చ. తెలుఁగున నున్న గ్రంథవితతిన్ గడుమాన్యము భారతంబ యం
దలవడు సుప్రయోగములు హారితరంబులు పండితప్రకాం
డులు తలలన్ ధరింపఁదగి నూత్నవికాసము నొందుచుండు న
య్యలఘుపదప్రయోగముల నాదృతిఁ గైకొను టొప్పు నెప్పుడున్. 49

ఉ. ఎవ్వరికేఁ బ్రమాదమను టేర్పడియుండును దానివంక నే
యెవ్వియొ దుష్ప్రయోగముల వెంచొ కనంబడుచుండు దానిచే
నివ్విమలాంతరంగుల మహాకృతిపూగమపూజ్యమౌనొకో
యెవ్విధిఁ జూచినన్ దలఁప రింతయు వానిని సాధుమానసుల్. 50

ఉ. అట్టి ప్రయోగమే శరణమంచు గ్రహింపక తత్ప్రమాదముం
బట్టి తదీయపాండితికి భంగము గల్గమి నిశ్చయించి యే
పట్టుననైన దానిఁ గొనఁ బర్వులుపెట్టక సత్ప్రయోగముల్
పట్టుదలన్ గ్రహించి తగుభంగిఁ గృతిన్ వెలయింపనౌ ధరన్. 51

ఉ. భ్రాంతిని గానకుండ నల బ్రహ్మకునైనఁ దరంబుగామి సి
ద్ధాంతముగాన సత్కవికృతంబులు వ్యాకృతిదుష్టమౌపదం,
బెంతయు భ్రాంతి నొక్కెడ నదెట్టులొ చేర్పఁగ దానిఁ గొంట పూ
బంతిని మాని కంటకము వాంఛను గైకొనునట్టిదే యగున్. 52

చ. కనుకఁ దదీయసాధుపదకాండముఁ జక్క గ్రహించి భారతిన్,
దనుపఁగ యత్నమూనుటగు తత్కృపఁగాంచఁగ సాధుమార్గమై
వినుతికిఁ బాత్రమౌచుఁ దమి వెన్కటివారికి మార్గదర్శనం,
బున కనుకూలమౌ సుయశముం గనవచ్చును దాన నిద్ధరన్. 53

మ. ఇదియే వాగ్జననీపదాబ్జములఁ నెంతే భక్తి సేవించు త్రో
వదమిం దత్పథ మాశ్రయింప యశముం బ్రాపించు సర్వార్థసం
పద చేకూరు మహామతుల్ సతతమున్ భద్రాత్మగా నెంతు ర
య్యదియే కాదె తపఃఫలంబన నభీష్టార్థంబునా నెత్తఱిన్. 54

మ. అని ధీరుల్ పచియింపఁగా విని తదీయం బైనసిద్ధాంతమే
మనమం దెప్డు తలంచుచున్ సుగతికిన్ మార్గం బదే యంచు దా

నిని వీడం దగదంచు నెంచి కుమతుల్ నిందించినం జేలె యా
నను తాత్పర్యమునూని యీసుకృతి వ్రాయంబూనితిం శ్రద్ధతోన్. 55

ఉ. ఒక్కఁడు దూఱినంతఁ గృతి యొప్పమిఁ గాంచదు సంస్తుతింపఁగా
నొక్కరుఁ డున్నతిం గనఁగ నోపఁడు సాధువిమర్శకాగ్రణుల్
చక్కఁబఱించి యందుఁగల సారము గైకొని తృప్తినొందఁదా
నెక్కడనైన ధన్యమని యెంచనగుం గృతిమండలంబునన్. 56

చ. ఎవి పురుషార్థసంఘమున నెంతయు శ్రేష్ఠమనంగ నొప్పుచుం
మొదటఁ దుదం జెలంగుచు విభుత్వము శాశ్వతసమ్మదంబు నీ
యఁదగునొ ధర్మముత్తమపదాఖ్యమునాఁ దగు నాద్వయంబు నె
య్యది తెలియంగఁ జేయునదె యా ధర సత్కృతి నిశ్చయంబుగన్. 57

క. అని తలఁచి యీకృతీంద్రము, గొన నర్హుఁడు ధర్మరక్షకుం డగురాముం
డని తలఁచి యీయఁబూనితిఁ, గొనవయ్యా! రామచంద్ర! గుణగణసాంద్రా!

చ సురుచిరవర్ణయోగమున శోభిలి సాధుగుణప్రపూర్ణతం
బరమయశంబుఁ గాంచి మృదుపాకయుతిం దనరారి దోషలే
శరహితమై సురీతుల నొసంగి మనోజ్ఞగతిం జెలంగి సుం
దరత గనంగఁ బొల్చు కృతితామరసాక్షిఁ బరిగ్రహింపుమా. 59

వ. అని భక్తిభరంబునం బ్రార్థించి. 60

## కృతిసమర్పణము.

క. శ్రీకరునకు భూతౌఘద,యాకూపారునకు దేవతాధిపమకుట
ప్రాకటమణిరుచియుతపు,ణ్యాకరపదపద్మునకు మహాప్రతిభునకున్. 1

క. హరిహరసరసిజభవముఖ, సురదుర్విజ్ఞేయవిభవశోభితునకు దు
స్తరభవవారిధిమగ్నో,ద్ధరణాదరునకుఁ బవిత్రతత్త్వమయునకున్. 2

క. జ్ఞానాకారునకు మహా, మానిస్వాంతాంబుజాతమధ్యవసతికిన్
జానక్యంచితతనునకు, శ్రీనాథున కఖిలభక్తచిత్తౌకునకున్. 3

క. కరధృతశరచాపునకున్, నిరంతరామోఘధర్మనిశ్చలమతికిన్
బరమామోదప్రదునకు, దురితద్రుమపరశువునకు ధూతాఘునకున్. 4

క. పురుషార్థచతుష్టయదా, నరతమనోజ్ఞాహ్వయునకు నారదగానా
దరునకు మాయావిలసిత, శరీరునకు జానకీశ శశికిన్ హరికిన్. 5

వ. సమర్పితంబుగా నాయొనర్పంబూనిన ధర్మసారరామాయణ మహాప్రబంధంబునకుఁ
గథారంభం బెట్టిదనిన. 6

శ్రీరస్తు.

# శ్రీధర్మసారరామాయణము

## బాలకాండము.

### కథారంభము.

శ్రీరమణీనివాసమయి సిద్ధసుపర్వగణప్రపూజ్యమై
చారుతరోన్నతప్రకటసద్మసమూహసమావృతంబునై
వైరుల కెన్నఁడైన గెలువంగఁ జొరంగ నశక్యమై మహో
దారనృపాలపూతమయి ధాత్రిఁ జెలంగు నయోధ్య యెంతయున్. 1

చ. అనుపమచిత్రరత్ననిచయాంచితసౌధరుచుల్ నిరంతరం
బును దమముల్ హరింప శశిపూషులు స్వేచ్ఛమెయిం జరింత్రు రా
త్రిని దినమందుఁ బద్మజని దిట్టముచేసిన యాజ్ఞ దాఁట నె
మ్మనములు సమ్మతింపమిని మాటను దాఁటరుగాదె సజ్జనుల్. 2

ఉ. ఆపురి దివ్యరత్నసదనాగ్రములం దమి సంచరించుచో
దాపున వ్యోమయానసముదాయములన్ విహరింపఁ బోవు స్వః
కోపసు లట్టె తమ్ముఁ గని కోరిక నిల్వఁ గటాక్షదృష్టిమై
నోపికఁ గాంచి మందమధురోక్తుల నాడుదు రంగనామణుల్. 3

మ. వరణాగ్రంబున నిల్చి భూసురులు దేవస్తోమవంద్యున్ మహే
శ్వరు నారాయణుఁ బూజచేయుతమితో స్వఃపత్తనారామభా
సురకల్పద్రుమవల్లికావితతిపై శోభిల్లుపుష్పాళి నా
దరణం బొప్పఁగఁ గోయుచుండ్రు శ్రుతినాదస్ఫూర్తికుబ్బన్ సురల్. 4

శా. ఆయామంబు విశాలముం గలుగు వీథ్యాళిన్ లసత్కాంతసం
స్త్యాయంబుల్ గగనంబుఁ దాఁకుటను సప్తాశ్వుండు శీతాంశుఁ డె
న్నో యత్నంబుల వీథికాళిఁ బయి నెట్లో పోవఁగాఁ దద్గతిన్
న్యాయజ్ఞుల్ వచియింతు రంతకకుబేరాశాయనాఖ్యం గడున్. 5

చ. అరుదగురత్నదీపముల నభ్రపథంబులనుండి కాంచి ని
ర్జరు లుడురాజియే యనెడు భ్రాంతిని దారు వసించునద్ది గ

హ్వారియని యొంచి పైఁగనుచు । నం దలరారెడుతారకావళుల్
వరుసఁ గనంబడం బ్రమద । వార్ధిని దేలుచుఁ బోదు రిండ్లకున్. 6
క. పుణ్యజనసమావృతమై, పుణ్యజనాగమ్య మగుచుఁ । బొలుచుచు సంప
ద్గణ్యంబై దీనౌఘశ, రణ్యంబై యాపురంబు । రాణించు ధరన్. 7

### రాజవర్ణనము.

ఉ. ఆపురవర్య మేలును ది । గంతలసన్మదదంతికుంభసం
దీపితచారుకీర్తిమయ । దివ్యదనర్ఘమణీవిభూషణుం
డాపతదస్త్రజాలనిహ । తారిగణుండు మహాగుణుండు దీ
క్షాపరతంత్రుఁ డార్యజన । కాండమహాప్రమదుండు దాంతుఁడై. 8
చ. వినయము తోడునీడఁగను । విస్తృతధర్మము రక్షకంబుగాఁ
దనునెపుడాశ్రయింపఁ బ్రమ । దంబునఁ దేలుచునొజ్జలందు భ
క్తిని విడనాడ కాశ్రితులఁ । దీయనిపల్కుల నర్థరాశినిం
దనుపుచు రాజ్య మేలె వసు । ధాసతి యొల్లెడ హాయిచెందఁగన్. 9
ఉ. పూర్వపురాజులందుఁ గల । పూతగుణంబు లవెల్ల వచ్చి తా
నుర్విని బ్రోచువేళ నొకఁ । డొక్కఁడుగాఁ దను నాశ్రయింపఁగా
శర్వముఖామరేశ్వరుల । సాధుసపర్యలఁ దన్పుచున్ మనో
గర్వములేక ధాత్రిసతిఁ । గాచెను బంక్తిరథుండు పూన్కిమైన్. 10
చ. సురలు మునీశ్వరుల్ తనిసి । శుభ్రతరాశిపంక్తి నీయ న
ధ్వరములు సత్రయాగములు । ధర్మము పేర్మి నొనర్చె లెక్కఁడం
దర మెటుగానిచందమునఁ । దస్యుభయం బనుమాట కోశమం
దరయఁ గనంబడంగ సుగు । ణాధికతన్ గురుశౌర్యసంపదన్. 11
చ. పలుకఁడు క్రూరవాక్య మొక । పట్టుననైన నసత్యవాక్యముం
గలనయినన్ వచించినటు । గాని వినందగినట్లుగాని లే
కలఘుతరప్రభావమున । నాయవనీశుఁడు శాస్త్రరీతి ని
ర్మలతరధర్మమార్గమున । రాజ్యరమాసతిఁ గొల్చెఁ బ్రీతితోన్. 12
తే. వృష్టిలోపంబు లే కతి । వృష్టి లేక, శలభశుకమూషకముల బాధ లన లేక
చెంత రాజున్న వాఁడను । చింత లేక, జనులు హాయిగ నుండి రాసమయమందు.
మ. పరభూభృత్తతి యానృపేంద్రుని మహా । ప్రౌఢాసివజ్రాహతిన్
గర ముగ్రంబగు స్వీయపక్షబల మిం । కన్ దీనతం బొంది స
త్వరమొప్పం బ్రవహించు నశ్రుఝరబృం । దచ్ఛద్మ మొప్పన్ మముం
గరుణం జూడు మటంచు వేఁడునట నె । క్కాలంబు దా నిల్చుచున్. 14
చ. మునిపతియౌ వసిష్ఠగురు । ముఖ్యుఁడు లోనగుమంత్రు లష్టసం
ఖ్యను దనుఁ జేరి ధర్మపథ । మారసి తెల్పఁ బ్రజాహితంబు నె

మ్మనమునఁ గోరి యానృపతి మండనుఁ డర్మిలి రాజ్యమేలె నిం
పునఁ బ్రజలెల్లఁ దండ్రిఁగను పోలికఁ దన్గని కొల్చుచుండఁగన్. 15

మ. చతురంగంబులఁగూడి యొక్కపరి చంచద్విక్రమస్ఫూర్తి ది
గ్వితతిం బోల్చునృపాలశేఖరులఁ దాఁకన్ వారు పెన్భీతిమై
రతనంబుల్ వడి, గాన్కపెట్టి మము సంరక్షింపుమా యంచుఁ బా
దతలంబుల్ దలసోఁక మ్రొక్కుదురు దోర్దర్పంబు వెన్కంబడన్. 16

చ. అరివరులన్ జయించి ప్రియమారఁగఁ దెచ్చిన యాయనర్ఘ్యసుం
దరమణిరాసులన్ గృహావతంసములెల్లను నిండఁ దన్మహా
పురవర మంబురాశి దగు పూజ్యమహోన్నతరత్నరాశి నాఁ
బరఁగు మహాఖ్యఁ గీడ్వఱచి భాసిలుచుండును నిస్సమానతన్. 17

కైకను దశరథుఁడు పెండ్లాడుట.

మ. చిరకాలంబు ధరిత్రి నేలి శుభసంసిద్ధుల్ తనుం జెంద నా
ధరణీశుం డొకనాఁడు కేకయమహీదారుం గనన్ బోయె స
ద్గురునాజ్ఞం గొని వంశము న్నిలుపుకోర్కుల్ తొంగలింపంగ నీ
శ్వరుఁడాగామిమహాప్రయత్నమునకున్ స్వాంతంబు ప్రేరేపఁగన్. 18

ఉ. కేకయనాథుఁ డావిమలకీర్తిధురంధరుఁ గాంచి భీతిచేఁ
గాక ప్రియంబుతో నతిథికల్పునిగాఁ దమి సత్కరించి నీ
త్యాకలితోక్తులం బలికి యాగమనంబున కేమిహేతువో
శ్రీకలితుండ వీవిచటఁ జేరుట ధన్యుఁడనైతి రాడ్వరా!. 19

చ. అని మరియాద యుట్టిపడునట్లు వచించిన రాఘవుండు నె
మ్మనమున మోదమంది తనమానసవాంఛ ఫలించినట్టులే
యని పరితృప్తిఁ బొందె నపుడాప్తవరుండు సుమంత్రుఁ డమ్మహీ
శునిమదిఁ గల్గుకోర్కె నొకచొప్పునఁ దెల్పెను వాగ్విలాసతన్. 20

ఉ. దానికి మోదమంది వసుధావరుఁ డిట్లనిపల్కె రాఘవా!
మానసవాంఛ దీర్తు నసమానము నొందకు మొక్కమాట ని
ష్ఠే నిను వేఁడువాఁడను మదీప్సిత మియ్యది దీర్ప నీ విటం
బూని ప్రతిజ్ఞ సేసినను బుత్రిక నిచ్చెద నద్ది యేమనన్. 21

ఉ. ఎందఱో భార్య లుందురు మహీపతి కందఱిలోనఁ బుత్త్రుఁ డా
నందము మీఱ రాజయి యనంతవిభూతి నెసంగుచుండు నే
సుందరి రాజమాతయను శుభ్రయశంబును గాంచు నామెయే
యందఱిలోన ధన్యయగు నట్టియదృష్టము నాకుమారికిన్. 22

చ. కలిగినచో వయోమితిని గాని మఱొక్కటిగాని యెన్న కే
సులలితసద్గుణాభరణశోభిత నాసుత నీకొసంగుదున్

బలుకుమ నీయభీష్ట మనఁ । బంక్తిరథుండు మనఃప్రమోదమున్
జలనిధివేలదాఁటి నృపసత్తమ! నాపలు కాలకింపుమా. 23

చ. ముదుసలినైతిఁ బూర్వభవపుణ్యవశంబున నాయు వెక్కుఁడై
పొదలెను దత్ప్రమాణమును । మున్నె మహర్షులు దేవవర్యులెం
తో దమిని నాకుఁ దెల్పి రెదఁ । దోఁచినమాట వచింతు నీదుపు
త్రి దనుజవైరిసత్కరుణ । దివ్యగుణాకరుఁ బుత్త్రుఁ గాంచినన్. 24

చ. తనయులు లేకయే మిగులఁ । దాపము నందెదు నాకు నట్టిస
త్తనయునిఁ బట్టభద్రునిగ । ధర్మవిధిన్ బొనరింప నబ్రమే
మనమునఁ గోంకుమాను మను । మానవభర్తవచస్సులన్ ముదం
బున విని వేడ్కఁ బొంగఁ దన । పుత్త్రికఁ గైక నొసంగె సమ్మతిన్. 25

మ. సకలక్ష్మావలయంబు నేలు సుగుణాంచత్పుత్త్రునిం గాంచు భా
గ్యకళం గూడుట యింక నాకొదువ నిక్కం బబ్బె జామాత భూ
మికళత్రేంద్రుఁడు రాఘువుండు నను భూమిన్ మించఁగాఁజాలు నే
యిఁక నేవాఁడు నటంచుఁ గేకయధరిత్రీశుండు హర్షించుచున్. 26

చ. విధివిహితంబుగా సుతకు । వేడ్కను బెండిలిసేసి యాధరి
త్రిధవునకున్ మహార్ఘమణిదివ్యవిభూషణరాజి నిచ్చి వే
వధువును బంపెఁ; గైకయు విభాసురభర్తృరథంబు నెక్కి తూ
ణధనువు లంతికంబున ననారతముం గనుపట్టఁ బోయెఁ దాన్. 27

ఉ. కైకను జూచి భూమిపతి కాంతుఁడు స్వాంతమునందుఁ బొంగి భా
గ్యాకలితుండనైతి నిటు । లాత్మ తనూరుచి వెల్గు కాంత లీ
లోకములందు మూఁడిటను । లోకబహిస్థలులందు లేరిదే
గాక విచిత్రసృష్టి యనఁగాఁదగు నం చెద మెచ్చుచుం ద్వరన్. 28

మ. సుదతిం దోడ్కొని యాయయోధ్యకుఁ జనెన్ । క్షోణీవరోత్తంసుఁ డ
మ్మదదంతావళయాన భర్తృహిత మాత్మం గోరియే చేయుచున్
సుదతీరత్నమనంగ సాధ్వియనఁగా । స్తుత్యవ్రతాచార నా
విదితఖ్యాతిఁ జెలంగె నెల్లతరుణుల్ । వేడ్కం దనుం బాడఁగన్. 29

శా. కాంతారత్నముఁగూడి యాదశరథక్ష్మాపాలచంద్రుండు ది
క్కాంతామస్తకభూషణం బయినవిఖ్యాతిన్ జగం బేలె దు
ర్దాంతస్ఫారపరాక్రమార్జిత లసద్రత్నాకరం బౌచు శు
ద్ధాంతం బొప్పఁగ నీతిసారగరిమన్ । ధన్యాత్ముఁడై నిచ్చలున్. 30

మ. చిరకాలం బటు లాధరాధిపతి ప్రాచీనక్షమాధీశు లె
వ్వరున్ భూసతిఁ గొల్చిరో ప్రజల నేభంగిం దమిం గాంచఁ జే

సీరో యాచందము తప్పకుండ జగతిం జెల్లించె స్వీయాజ్ఞ ను
ర్వర యన్ నామము సార్థకంబె యని సంభావించి రుర్విన్ జనుల్. 31

శా. కాలం బివ్విధి సాగుచుండఁ బ్రజ లింకన్ మంచికాలం బదే
లీలన్ వచ్చు నటంచు నిర్భయగతిన్ లేమల్ చరింపంగఁ దా
రోలిన్ గాంచి మహీశునిం బొగడ నెంతో యాదృతిన్ మించ భూ
పాలుం డేలె ధరిత్రి నించుకయు లోపం బుండ నట్లొప్పగన్. 32

సీ. ఇట్లు కాలం బేగ నెంతయు ఘోరమై, మృగసమూహము మనుజగణమెల్లఁ
దత్తఱపడునట్లు దారుణాకృతిమీఱ, జనపదములపయి సత్వరగతిఁ
బాఱి స్వేచ్ఛగఁ జరింపఁగఁ జాలభీతులై, తద్వ్యాళదంష్ట్రలఁ దగిలి కొంద
ఱవ్వాని తీక్ష్ణనఖాగ్రసంస్పర్శము, చేతఁ గొందఱు మృతిఁజెంద మిగిలి
ఆ. నట్టివారు భీతి నంది చేతులఁ బ్రాణ, వితతి నునుచుకొని నృపతి యిఁక మన
కెల్ల దిక్కటంచు నెడలఁ దలంచుచు, వగలఁ బొగులుచుండ వారియార్తి.

క. నలుదెసలన్ వ్యాపింపఁగఁ, గలవిలపాటొందె భూమిఖండం బెల్లన్
విలయం బిది మృగసంతతి, వలనం గల్గెగద యంచుఁ బ్రబలెన్ వార్తల్. 34

ఉ. అత్తఱిఁ జెంచులెల్ల మృగయారతి జేనికిఁ గల్గఁజేయుటే
యుత్తమ మంచు నెంచి వనినున్న ఫలంబులు వంశధాన్యమున్
మెత్తని జింకచర్మములు మేలుగనున్న మధుస్రవంతియు
న్మత్తకరీంద్రదంతములు మానసమోదమునింపు వస్తువుల్. 35

క. పరిమళమార్జాలమనో, హరమదము జవాది యాదియావాని మహో
దరమునఁ గైకొని నృపకుం, జరు దశరథుఁ గనెడుకోర్కెఁ జని రాతురతన్.

చ. చనిచని యాయయోధ్యఁ గని సారజలంబుల నొప్పుజాఱి పా
వనతరకీర్తిగాంచి చెలువంబుగఁ గన్పడు సైకతస్థలుల్
తనమహనీయతం దెలుపఁ దానె సరిద్వరయంచుఁ బేరుగాం
చిన సరయూనదిం గడచి చిత్రగృహాళిని గాంచు చెంతయున్. 37

మ. పరమానందమునొందుచున్ జెలఁగుచున్ భాషించుచున్ వన్యవా
సరతిం జొప్పడుచేష్టలన్ మెలఁగుచున్ క్ష్మాపాలుప్రాసాదమున్
గర ముత్కంఠఁ జొరంగ బాఱి రెదలం గన్పట్టు పన్వేడ్కలన్
బురవాసుల్ గని వింతచూడ్కులను దమ్ముం జూచుచున్ నిల్వఁగన్. 38

చ. చొరఁబడి ద్వారపాలకులు చోద్యమునన్ దము నిల్వరింప భూ
వరునకు మేము వచ్చినది వైళమ తెల్పుఁడటంచు వేఁడ వా
రరిగి మహాప్రభూ! యడవియందు వసించెడు చెంచులెల్ల వ
చ్చిరి ప్రభువర్యదర్శనము చేయు కుతూహల మట్టె యుబ్బఁగన్. 39

ఉ. వారలరాకఁ గాంచిన జవంబున దర్శనమీయవచ్చు నం
చారయనయ్యె నేమిసెలవన్నఁ గటాక్షములన్ బ్రమోదమున్
వారిఁ బ్రవేశపెట్టుఁడనుభావము తోఁపఁగఁ జేయ నంత దౌ
వారికు లేగి వారిఁ జనవచ్చు నన్ ద్వార సందడింపఁగన్. 40

తే. మందిరాభ్యంతరంబున మనుజవరుని, దివ్యసింహాసనస్థుని దీప్యమాన
రూపుఁ గని దూరమునసుండి యాపరాని, సంతసంబున మ్రొక్కిరివింతరీతి.

క. మొక్కేము సామి నీవే, దిక్కని యిటు పాటివచ్చితిమి యేలొక్కవే
చక్కనిమాపబువా యని,నిక్కఁపుఁబ్రేమమునఁ బల్కి నృపునంతికమున్. 42

ఆ. చేరి తెచ్చినట్టి సారవస్తువులను, ముందుఁబెట్టి మరల మ్రొక్కి నిల్చి
యున్న చెంచువారి నురుతరకరుణను, గాంచి దశరథుండు మించువేడ్క.

సీ. కరములు జోడించి కడుభక్తిఁ బల్కిరి, సామి మేకంబులు చాలరేఁగి
పైరుపచ్చల మేసి పాడొనరించుచే, గాక యూళ్ళంబడి కండక్రొవ్వు
నను మానవులఁ బిల్లలను వారితల్లుల, మ్రింగె నేమనుచుఁ బల్కంగఁ గలము
దేవరా! పొలమెల్ల దీవరమయ్యె నీ, మెకములగుంపుచే మీరు వచ్చి
తే. వానిఁ జంపినఁగాని యీబాధపోదు, ప్రజలు పెనుభీతిఁ గుందిరి ప్రజలమొఱ్ఱ
వినఁగఁజాలకవచ్చితిమనఁగ వారి,యాశయంబెల్ల నెఱిఁగి యాయవనివిభుఁడు.

క. వారిడిన కానుకలన్, గారవమున సంగ్రహించి క్ష్మాపాలుఁడు మీ
రీరీతి నాతురంపడి, చేరఁగ రాఁ గారణంబుఁ జెప్పుఁడటన్నన్. 45

క. వారికిఁ దగినవిధంబునఁ, గారుణ్యమ్ముట్టిపడఁగఁ గడురమ్యములై
సారములౌ వస్తువులను, గోరికమీఱంగ నిచ్చి కొదువలుపాపన్. 46

చ. మనమున నెంచి యిట్లనియె క్ష్మాపతి మీరిటు లేగుదెంచుటన్
ఘనముద మొప్పఁజేసెడి నిఁకం ద్వరగాఁ జనుదెంతుఁ గాననం
బున కటనున్న వ్యాళమృగపూగము క్రొవ్వడఁగించి గ్రామ్యులౌ
జనుల భయంబుఁ బాపెదను సాధ్వస మూనకుఁ డింక మీరలున్. 47

ఉ మీదగురాజభక్తికిని మెచ్చితి నింకఁ జనుండు వేఁటకై
నాదగురాక వేచియె వనంబునఁ బోఁదగుమార్గమెల్ల నిం
పై దళుకొత్తఁ జేయుఁడిదె పాపెదఁ గ్రూరమృగార్తినంచు నా
మేదినిపాలుఁ డంపఁగఁ దమిం జెలువారుచుఁ జెంచులెల్లరున్. 48

చ. చెలఁగుచుఁ గాననాధ్వముల సిద్ధము చేయుచుఁ గంటకద్రుమం
బులఁ బరశుప్రహారముల భూస్థలి డొల్లఁగఁజేయుచున్ స్థలం
బులఁ దగుహెచ్చుతగ్గులను బొల్పమరంగ సమీకృతంబులై
వెలయ నొనర్చుచున్ నృపతిపుత్రుల రాకకు వేచియుండఁగన్. 49

చ. నృపతిలకుండు వేఁటతమి ఽ నెమ్మనముం ద్వరపెట్ట లాఘవం
బు పరఁగ భీతికృన్మృగసమూహము నేర్పునఁ గూడఁబాఱి ము
ట్టి పడఁగఁ గొట్టి చంపెడు కఽడిందిమగంటిమి గల్గువేఁటరుల్
కుపితమృగేంద్రతుల్యములఁ ఽ గుర్కురవర్యములన్ సుజాతులన్. 50

చ. కొని తనవెంట రాఁ గదలి ఽ క్రూరతరాకృతి విశ్వకద్రువుల్
మునుచనుచున్ వనాధ్వములఁ ఽ ముక్కుల వాసనచూచి తెల్పఁగాఁ
జనిచని చెంచులం గనియె ఽ సాధ్వసమున్ వినయంబునొప్ప నా
మనుజపు సత్కరించిరి సమస్తసపర్యల నిండువేడ్కలన్. 51

మ. తరుశాఖాయత పత్రసంవృత లసత్స్థానంబులం గాంచి కా
పుర ముండం దగునంచుఁ దోఁచెడువిధంఽబుం గన్పడం జేయ నా
దర మొప్పంగ నటన్ వసించి ఫలసంఽతానంబుఁ గందమ్ములన్
వరమాధ్వీకము మాక్షికంబు మొదలౌఽవన్యార్హవస్త్వోఘమున్. 52

క. వనచరులు తెచ్చియీయఁగ, జననాథుఁడు ప్రీతిమీఱ ఽ సద్వస్తువులం
చును గైకొని యారేయిని, వనమున సుఖనిద్రఁ గడపి ఽ భానుఁడు పొడువన్.

ఆ. మేలుకాంచి నదులఽమేటిజలంబుల, స్నానమాడి విధులఽసల్పి భుక్తి
చేసి వేఁటకొఱకు ఽ సిద్ధముచేసిన, వస్త్రములను గట్టి ఽ వాజినెక్కి. 54

సీ. తోలుకుళ్ళాయను ఽ గీలించి శిరమునఁ, బటువైనయీఁటెను ఽ బట్టి కత్తి [బడ
మొలయందు వ్రేలనఽబులుగలపొదులు రెం,డును బాహువుల వెన్కఽలనుగనఁ
సవరించి దృఢమైనఽచాపంబు ధరియించి, వేఁటకుఁదగినట్టి ఽ వివిధశస్త్ర [గు
ములనుగైకొని యొంటఽరులు వెన్కఁ బ్రక్కల,ననుసరించుచు రాఁగఽనద్భుతమ
తే. వేఁటతమకంబుపొంగ నుఽర్వీధవుండు, భూరిగహనాంతరాళంబుఁఽజేరి మృగయు
లకును జుట్టుకొనందగు ఽ నీఁక వనంబు, నెల్లతావుల మీఱ రనిఽహెచ్చరించి 55

క. తానును మార్గముదరిఁ గెం, పూనిననేత్రములఁ జూడ్కుఽలొప్పఁగ నుండం
గా నైజపౌరుషంబులు, గానంబడ మృగయులెల్లఁ ఽ గడుజవ మలరన్. 56

క. మొక్కెము దేవరా నీ, విక్కడనే యుండు మేము ఽ నీవనమెల్లం
జక్కాడి వాడికోఱల, నిక్కెడు మెకములను జంప ఽ నీవె కనుదులే. 57

వ. అనునంత నొక్కండు. 58

చ. తెగువను బూని పైకిఁ జనుఽదెంచు మెకంబుల హుంకరించుచుం
జగడముచేయ రమ్మనెడుఽచందము గన్పడఁ గత్తి చూపి ముం
దుగఁ జెయిఁజాఁపి యగ్గలికఽతో నది మ్రింగను రాఁగ నద్భుతం
బుగఁ గరవాలఘాతమున ఽ భూమిఁ బడంగ నొనర్తు దేవరా! 59

చ. అనుటయుఁ గాశ్యపీవిభుఁ డఽహార్యముదంబును బొందె నంత నిం
కనొకవనాలయుండు పిడిఽకత్తిని జూపి యిదే విభూ! మదిం

చినమగపంది కోఱఁ గయిఁ జిత్రగతుల్ తగఁబట్టి యీడ్చి క
త్తిని నొకప్రక్క నాటి వడిఁ దెచ్చెద నూపిరి సుంతయుండఁగన్. 60

వ. అనునంత నింక నొకయాటవికుండు శౌర్యాటోపంబున. 61

ఉ. వేఁటయనంగఁ బల్చనయె వింతగతుల్ కనుపట్టునట్లుగా
బోటులఁగూడి వచ్చునొకభూరికరీంద్రము నిల్వరించి యా
రాటము నొందఁ దొండముఁ గరంబునఁ బట్టుచు డొక్కలోన నీ
యీఁటెను నాటెదం గను మహీపరిపాలక! దీనరక్షకా! 62

క. అనవిని దశరథుఁ డాతనిఁ, గనుఁగొని మేల్మే లనంగఁ గానన మెల్లన్
ధ్వనిచేసె నాఁగఁ జెలఁగెను, నినాద మాతేనిఁ జూచి నిబ్బర మొప్పన్. 63

చ. పటపట పండ్లుగీటుచును బల్కెను దేవర! యేటిమాట లీ
యటవిమృగంబులం బొడుచు టబ్బుర మే పయిఁబాఱుడేఁగ నొ
క్కటఁబడ నమ్మునేసి గుఱిగన్పడఁ జేసెద నాదుసామి నే
ర్పిటఁ బరికింపుఁడీ యనియె నెంతయు సంతస మందె భూపుఁడున్. 64

సీ. చెవిఁబట్టి యీడ్చి తెచ్చెద నీదు చెంతకు, మేటిబెబ్బులినైన మేదినీశ!
యీటెనుజూపి యీరెండకుఁ గోఱనుబట్టి వడిఁదెత్తుఁబందిని వసుమతీశ!
పిడిబాకుఁ జూపి యేర్పడఁ దొండముంబట్టి, వెంటఁదెత్తును హస్తిఁబృథ్వినాథ!
నిద్రించుసింహంబు నిర్భరహుంకృతి, లేఁపి దోడ్కొనివత్తు భూపవంద్య!
తే. తక్కనట్టిమృగావళి లెక్కయే మహాత్మ! మాశక్తి చూడు మంచాటవికులు
బీరములు పల్క నాలించి ధారణీశుఁ, డాత్మ హర్షించి వారలనపుడె పంచి.

వ. వేఁటతమకంబు మదిఁ బొంగి పొరలి ప్రవహింప వేఁటరుల నలుదెసలఁ బరికించి మృగంబుల నొక్కతావునకుఁ దోలుండని యాజ్ఞాపించి తాను నొక్కచో ద్వారంబుగా నేర్పఱుపఁబడినతావున సంసిద్ధుండై యుండె. అంత వేఁటరు లొనరించు భయదాట్టహాసంబులు భూరివాద్యధ్వానంబులును రోదోంతరాళంబుల నిండ నా ప్రచండరవంబు శ్రుతివివరంబులఁ జొరఁ బెండుపడి యుద్దండసంరంభంబున నిరుకుదారులంబడి వాలంబులు పైకెత్తి యుత్తలంపాటున నెందుఁబోవను దోఁపమి నిట్టట్టుపాఱి పొదలం దూఱి కంటకశాఖల నొత్తిడిఁబడి యంగంబులనుండి నల్లఁ గాఱ లెక్కసేయక యెక్కడెక్కడికో సత్వరంబుగఁ బరుగిడుచునందుఁగలమృగయూల యులివులు వినంబడ మరలుచుఁ జొచ్చినచోటులఁ జొచ్చుచు నచ్చటనుండఁజాలక యెచ్చటికో పోవఁదలంచుచుఁ దనబలంగము ముంగలంబరుగువాఱుచుండఁ దాను దానిం జేరఁబాఱుచుఁ దుదకు లుబ్ధకుల చెంతకుం బాఱి వారిప్రేటులకు గుఱియయి ప్రాణంబుల నర్పించుశార్దూలంబులును, హాతాత్సంజనితశ్రవణ వివరభేదనచణ వాద్యనిస్వానంబుల కులికిపడి తమ గుంపునుండి విడివడి యొంటిఁ బరుగిడుచు నందందుఁ గ్రందుగ వినంబడునాట

వికులమాటలకు మతిచెడి మరలి వచ్చినదారిం బోయిపోయి యాచాయనె తమకరిణులు కనంబడ వానిగతి నారయుధైర్యంబులేమి నాయారాటంబునc బాలుకుంజరనికరంబులును, మఱియు ననేకమృగంబులిట్లే తల్లడంపడ నావేcట మహాభయంకరాకృతిం దాల్చె. అప్పుడు పరుగిడువ్యాళమృగంబుల నిలువరించుచు నీcటెలం బొడుచువారును,మార్కొను మెకంబులకు వామహస్తం బొసంగి దక్షిణకరంబునందు మెఱయు నిశితనిస్త్రింశంబున డొక్కలం గ్రుమ్మువారును, దూరంబుగాc బాఱు వన్యమృగంబుల లక్ష్యశుద్ధి యరుదుగc గనంబడ వాలమ్ములేసి యటc బడcజేయువారును, భీతిం బాఱిపాఱి కోపాటోపంబున మరలి యురవడి మీcదికివచ్చు ఘోరమృగావళి నవలీల భల్లమ్ములం బరేత రాజగృహంబున కనుచువారును నైరప్పు డావనంబు మృతమృతప్రాయకళేబర బహుళంబగుట బీభత్సరసంబునకును, బలాయితభూరితరమృగగణంబగుట భయానకరసంబునకును, విక్రమితవీరమృగయుగణంబగుట వీరరసంబునకును, విచిత్రతర వన్యమృగయుతంబగుట నద్భుతరసంబునకును, మృత్యుభయసమాక్రాంత దీనమానసహరిణాది సాధుమృగయుతంబగుటc గరుణారసంబునకు, హఠాత్సమాక్రాంతలుబ్ధక కఠోరగళనాద భీతమృగేంద్రంబగుట హాస్యరసంబునకును, దర్శనమాత్రవిత్రాసకర వన్యద్విపగాత్రంబగుట రౌద్రరసంబునకును, విరహితవ్యాళంబగుట శాంతరసంబునకును, భూరితరభూరుహ శాఖాశిఖాశరణ్య శాఖాశరణ్య మృగపతత్త్రితతియుతంబగుట శృంగార రసంబునకును నుదాహరణభూతంబై కనుపట్టె నట్టియెడ 66

సీ. శరవరమ్ముల సింహశరభంబులను గూల్చి, భల్లంబులc గజావళిని ద్రుంచి
కరవాలమున వ్యాఘ్రగణమును ఖండించి, యీcటెను బందులc దాcటి చంపి
మార్గణంబుల ఖడ్గమండలి మ్రందించి, గదవ్రేటులను భల్లుకములc దునిమి
పరశుధారలను గాసరములc బొరిపుచ్చి, శూలాహతుల హరిణాళిc జెండి
తే. మఱియుc బెక్కుమృగంబుల మండలాగ్ర
సంహతుల సంయమనగేహ సరణి కనిపి
వనము సుగమముగాc జేసి తననివాస
మునకుc బోయెను మృగయులు ముందు నడువ. 67

చ. చని వనయోగ్యవాసమున స్వర్ధునిc బోలుతరంగిణిc విధిc
మునిcగి తదర్హకృత్యముల భూపతి తీర్చి యథేష్ట మిష్టభో
జనమునc దృప్తినొంది వనసత్ఫలముల్ దిని వేcటరుల్ సుభు
_క్తినిc బరితృప్తి నొందcగ మృగీమృగచర్మము లెన్నొ వన్నెలన్. 68

క. పరికింపcగ యోగ్యములై, పరమార్హములునయి యొప్పబాపురె యనుచున్
గరమున నిమురుచు మృదుతన్,సురుచిరతనుజాలc బొగడుచున్ దశరథుcడున్.

చ. మృగయులకెల్ల నాదృతి సమిద్ధపదార్థము లిచ్చి చర్మరా
జి గొనుచుఁ బత్తనోత్తమముఁ జేరుఁడు నే నిదె వచ్చువాఁడ వే
డ్క గలదు శబ్దవేధిశితకాండములన్ గుఱి తప్పకుండఁగా
మృగములఁ జంపి యందొదవుమేలగుచర్మములన్ గ్రహించుచున్. 70

క. చనుదేరఁ గలదు కోరిక, యన వారలు చిత్త మనుచు నరుగన్ మితసం
ఖ్యను వేటకాండ్రు గొల్వఁగ, జనపతి తమసాఖ్యనదికిఁ జనె వేగమునన్.

ఉ. చారుతరంగహస్తముల సజ్జనవారము రమ్ము రమ్ము సం
సారగభీరసాగరముఁ జయ్యన దాటఁగ వచ్చు నాదుగం
భీరజలంబులన్ మునుఁగ భీతి గనం బని లే దటంచు నిం
పారఁగఁ జెంతఁ జేర్చుకొనునట్లుగఁ జాటుచు నున్న యన్నదిన్. 72

చ. కని యటఁ బ్రొద్దు క్రుంకుదనుకన్ వసియించి మహత్తరాకృతిం
గనఁబడు నొక్కగుల్మమును గాంచి యిదే తమసాతటంబునం
దనువును దాఁప నర్హమయి తద్దయు దట్టముగా నెసంగు నిం
దు నిలిచి నీరుగ్రోలుఁ దమిఁ దోఁచినధూర్తమృగాళిఁ జెండెదన్. 73

చ. ఉరుతరమైన ధ్వాంతమున నుద్ధతిమీఱఁగ గుంపుగూడి ని
ర్ఝరగతి వచ్చి యీధునిని వారిని గ్రోలెడు సత్వరాజి చే
యురవము లక్ష్య మం చరసి యుగ్రతరాంబకసుప్రయోగతన్
బొరిగొనువాఁడ వేటరులు పొంగుచు నౌర! యటంచు నెన్నఁగన్. 74

చ. అని తలపోసి వేటపయి నంతకునంతకు హెచ్చుచున్న ప్రీ
తిని బొద నిల్చి కార్ముకము తీవ్రశరాంకముగా నొనర్చి ని
ల్చెను దొలిజాము పోవఁగనె చేరెను రెండవయామ మంత నొ
క్క నినద మామహీరమణుకర్ణపథంబును జొచ్చెఁ జెచ్చెఱన్. 75

చ. ఋతముగ నద్ది నీరుగొన నేర్తెఱఁ గుండను ముంపఁగల్గు నే
వితమున నిస్వనం బటులు వింతగ వీనులఁ జొచ్చెఁ దాని నా
క్షితిపతి నీరుఁగ్రోలు మదజృంభితదంతిరవం బటంచు స
న్మతిని దలంచి తీవ్రమగునారసమున్ ధ్వనిలక్ష్యశుద్ధిచేన్. 76

చ. పరువడి వైచెఁ దీక్ష్ణమగుబాణము వే చని మౌనిసూనుదా
సురమునఁ గాఁడెఁ; బాత్ర మపు డొయ్యన నెత్తిని బెట్టికొంచు స
త్వరగతిఁ బోవనెంచు మునిదారకుఁ డక్కట! చచ్చితింగ దే
శరమిటు లర్ధరాత్రమున సాధువులం బొలియించు పూనికన్. 77

తే. వైచె నెవ్వఁడొ యిట్టిదుర్వర్తనంబు, గంటిమే యెందునైన నాగతి యిఁకేమి
యౌనొ యనిబిట్టువిలపించునర్భకుగళ, నినద మొగిఁగర్ణములఁజొచ్చి నరపతియు,

సీ. తొలుదొల్తసాధ్వసంబొలయఁదత్ఫలముగ, మాటదోఁపకయుంట మ్రానుపడియెఁ
బిదప నేత్రములకు | నొదవినశక్తికి, ఫలముగ సృష్టియభ్రముగఁ దోఁచె
నవలఁ జిత్తముసుంతగ వికాసమొంద దానికి ఫలమ్ముగఁ జింత నెలవుగాంచెఁ
దరువాత బుద్ధి కుదురుపాటు గనఁబూనఁ, దత్ఫలముగ దీనతయుఁ జెలంగె;
ఆ. నంత హృదయ మదరె | నట్టితాపము పొంగెఁ, దనదుకృత్య మద్దిదగదటన్న
భావ మంకురించె బ్రహ్మమానీంద్రుఁడ, యేమొ యన్న యూహయెట్లొ పొదలె.

చ. తనయొనరించినట్టిదగు | దారుణకర్మము దుష్ఫలంబుఁ గూ
ర్పను వదనంబు విప్పుకొని | వచ్చుచునున్నదటంచు దానిమా
ర్పను విధికే నశక్యమని | భద్రము లింకను గల్గవంచు నె
మ్మనమునఁ దోఁచె దాన ననుమానము లెన్నియొ గల్గె నత్తఱిన్. 80

తే. వేఁటతమకంబు పైకొన | విధివశమున, వచ్చి యంతట మృగయులఁ | బంపి యేల
యిటకు వచ్చితి? వచ్చితినెట్లొ యిట్లు, త్వరపడి శరంబు నేలవైవ మతి పొడమె?

చ. మనుజులఁ దోలుబొమ్మలటు | మాననిక్రీడల దైవ మెన్నియో
పనుల నొనర్పఁ ద్రిప్పు గుణపాశములం దగిలించి యవ్వి యొ
వ్వనికిని దోఁపకుండు బలవంతము లవ్విధిచేష్ట లింక నే
మనుకొనినన్ ఫలంబు గలదా పరితాప మొకండు దక్కఁగన్. 82

చ. పురుషుఁడు తానె కర్త నని | పొంగుచునుండును జ్ఞానహీనతన్
బరశివుఁ డీతఁ డజ్ఞుఁడు ద్విపాదము లుండులులాయ మంచుఁ దా
నరయుచునుండుఁ గర్మ మనునద్దియు ముందుగ హెచ్చరింప కే
వరుస ఫలాళిఁ గూర్చుచు నభంగురశక్తిని బొల్చు నద్దిరా! 83

చ. తెలిసిన దిప్పు కర్మగతి | ధీరులకే నెఱుఁగంగ రానిదై
వెలయుచు స్వేచ్ఛ నంచు విధి | వింతగ దానినిగూడి సాక్షియై
తెలియనివానిభంగి నొకతీరున నుండుఁ దదిచ్ఛలేకయే
ఫలముల నీయఁజాల దొకపట్టుననైనను గర్మ మీక్షితిన్. 84

చ. తొలిజనిఁ జేసినట్టిఘనదుష్కృతి యెట్లొ యదృశ్యపాశపం
క్తులఁ దగిలించి కంధరకు | ఘోరగతిన్ నను నీడ్చి తెచ్చి యీ
స్థలమున నిల్పి వేడుకను | శాతశరంబును వైవఁజేసి దు
ష్ఫల మొనఁగూర్ప నెంచెనని | స్వాంతము తెల్పెడు నాకు నిత్తఱిన్. 85

చ. జనుఁ డొకపుట్టువుం దగిలి | సజ్జనసంగతి లేకహంకృతిన్
దన కెటుతోఁచు నవ్విధిని | దా నొనరించును ఘోరకర్ముల్
తన కవి యెప్పుడే ఫలవితానము నీయమి భీతి నొందకుం
డు నవలిజన్మ మందవియునన్ ఫల మీయఁ దొడంగఁ గుందెడున్. 86

చ. ఫలము లొసంగుకర్మముల ప్రాక్తనరూప మెఱుంగలేక జ్ఞా
నలలితదేహుఁడై సకలనాయకుఁడై తగునాపరాత్పరుం
గలుషహరున్ గృపాకరుని గ్రన్నన దిట్టును గాని స్వీయదృ
ష్టుల మరలించి కర్మములచొప్పుఁ దలంపఁగ లేఁడు సుంతయున్. 87

చ. జననము లెన్నిగల్గెనొ పొసంగఁగ నున్నవొ యింక నెన్నియో
జననము లిప్డు గల్గినది చక్కనికర్మఫలంబు నొందనో
జననమొ కుత్సితంపుఫలసంతతి నొందఁగఁ జాలునట్టిదో
జనియొ యెఱుంగ శక్య మగుజ్ఞానములేమిని దిట్టు దైవమున్. 88

ఉ. జ్ఞానములేని యట్టి దగుజన్మము గాంచినవాఁడె దైవమున్
మానక తిట్టుఁ గర్మమనుమాట తలంపఁడు స్వీయదోష మే
మేని పొసంగకున్నవిధి యీవెతలం గుడువంగఁ జేసె నిం
కే నెటుపోదు నంచు నరుఁ డెన్ని తెఱంగులనో తలంచెడున్. 89

ఉ. కావున నాదుకర్మము నికామము వంతలఁ బెట్టనెంచి న
న్నీవిధిఁ బ్రోత్సహింప నిటు లిచ్చటఁ జేరితిఁ బాపకర్మమున్
జేవఁదలిర్పఁ జేసితిని చిత్తముపొక్కిన నేమిలాభ మిం
కేవరుసం దొలంగి చన నెంచినఁ దప్పదు ముప్పు నాకిఁకన్. 90

మ. అని చింతించుచు బ్రహ్మమానితనయుం డౌనేమొ యంచార్తుఁడై
ధను వల్లల్లన నెక్కుడించి మది సంతాపంబునం గుందఁగాఁ
జనియెన్ హాయనుశబ్ద మేస్థలమునన్ జన్మించె నచ్చోటికిన్
దనపాదంబులు ముందుఁ బోవఁ దలఁపుల్ తన్వెన్కకున్ లాగఁగన్. 91

చ. చనిచని యందు నీటిదరి స్వాంతము దూలఁగఁ గుండనీ రొగిం
దనవసనంబునుం దడుప దారుణసాయకవిక్షతాంగుఁడై
పనవుచు నేదురాత్మకుఁడొ పాప మటం చెద నెంచకిట్లు వై
చెను శర మంచు దీనతను జేడ్పడి పల్కుచు నున్నబాలకున్. 92

చ. గురుశరబాధ తన్నలమి కుందఁగఁ జేయుచునుండ దీనుఁడై
శరణ మొకండు లేమిఁ దనజాడ నె యెన్నుచు వారికై మహా
త్తరపరితాపతప్తు లగుతల్లిని దండ్రిని లోఁ దలంచుచున్
బరుషశరప్రయోక్తఁ బలుభంగుల దూఱుచు నున్న దీనునిన్. 93

చ. బ్రతుకుట యన్నమాటయె యబద్ధము నిల్వవు ప్రాణవాయువుల్
మదిఁ గలయూహలెల్ల మటుమాయములై చనుచున్న వింక నే
సదయుఁడు కన్పడున్ దనదు చావును దెల్పి జలంబు లిచ్చి యా
ముదుసలులన్ మనం బలుకుపుణ్యుఁ డెవండని యెంచునాతురున్. 94

చ. పితరులసేవ చేయుటయె పృథ్విఁగలట్టిమనోజ్ఞధర్మసం
తతి నధికంబు; దానికిఁ గలన్ సరిపోలవు తక్కుధర్మముల్
శతధృతియాజ్ఞ యీయడియె సర్వము నీడ్యమునా నదెన్న నే
వితమున నాకు నబ్బదని వింతగ నాత్మఁ దలంచుధీరునిన్. 95

చ. జగమిది మిథ్య; యాప్రకృతి సర్వముఁ గన్పడఁజేసి యేక్షణం
బొ గనఁగరాకయుండునటు లోపు నొనర్పఁగ; దానిచేష్టలె
ల్ల గణన మొప్పఁజేయఁగఁ దలంపఁగ సాధ్యమె బ్రహ్మకైన; నే
మిగతికిఁ బోదునో యనుచు మించువ్యథన్ దపియించురుగ్ణునిన్. 96

ఉ. ఏకలి మున్ను చేసితినొ యీగతి దిక్కొకయింత లేనిదౌ
నీకడ కేగుదెంచితిని నెవ్వఁడొ యీనడు రేయిఁ గ్రూరుఁడై
యాకతినంపుముల్కి గొని యేసి యురం బగులించె నక్కటా!
యేకరణిం దలంగు వ్యథ యింక నటం చొగి నేడ్చు చంచలున్. 97

ఉ. ధర్మము నాశ్రయింప నది ధన్యుని జేయునటంద్రు వారిదౌ
నిర్మలవాక్య మెప్పటికి నిష్ఫల మెవ్విధినైనఁగాదు పా
పోర్ములు వానినిం దగుల నూల్కొన వంచుఁ దలంచి కొల్చితిన్
ధర్మము దాన దుష్ఫలమె దాఁకెను నన్నని కుందునర్భకున్. 98

మ. జనసంఘాతముఁ గూడియుండఁ జనదే చందంబునన్ మౌనికం
చనుసద్వాక్యము నమ్మి యీగహనమం దావాసముం జేయుచున్
మునివృత్తిం దగుతల్లిదండ్రులను సమ్మోదమ్మునం గొల్చునా
కు నిటన్ దుర్గతి గల్గెఁగాదె యనుచుం గోపించు మందాత్మకున్. 99

మ. నను సేవించినవారి కెట్టితఱినైనం గల్గునే యాపదల్
కనుచుందున్ సతతంబు తత్కుశలయోగంబుల్ మహాశ్రద్ధతో
నని యీశుండె ప్రతిజ్ఞచేసె నిఁక నేమౌ నాకు నం చాశ్రీ
శుని సేవింపఁగ నిట్టులయ్యె వగ లంచున్ దూఱుక్రూరాత్మకున్. 100

ఉ. సందియమేల యెందుఁ గనఁ జక్రియె కన్పడునంచు భక్తులా
డం దగ విందు నానుడి యొడందను నమ్మితి నింతపుట్టె నే
మందు నిఁకంచు సాధువచనాళి ననాదృతిమైఁ దలంచు నా
మందమనీషుఁ దీవ్రతరమార్గణభిన్నహృదంతరాళునిన్. 101

చ. మనుజులపొందుఁ బాసిన నమంగళముల్ పొసఁగంగనేర వం
చనెడుదురూహ పట్టుపడె నయ్యది తప్పిదె కర్మమే ఫలం
బును గలిగింపఁజాలు నని పోలవచించెడు నర్ధరాత్రమం
దనుపమబాణసంహతిని నంచు వెతం గనుదీనమానసున్. 102

మ. పరమేశా! నిను నమ్మితిన్ బరుఁడు నన్ బాలింప లేఁ డొక్కఁ డీ
ధరణిన్ సత్కృప దిక్కులేనిజనకుం దల్లిన్ విధిం గొల్వ నెం
తు రమానాయక! నీకు మ్రొక్కెదను నా దోషాళి మన్నించి యీ
శరబాధన్ మరలింపవే యనుచు నాశాబద్ధుఁడౌ బాలకున్. 103

మ. జననీ! నీవెకదా సమస్తజగముల్ శాసింపఁ బాలింపఁగా
జననం బందఁగఁ జేయఁజాలుదువు నీచందం బెఱుంగం దరం
బన శక్యంబె యనాథు నీపదములన్ ధ్యానించు నన్నున్ గృపం
గనుమా యంచు క్షణంబు లెంచునియతున్ గన్గొంగు ముగ్ధాత్మునిన్. 104

ఉ. ఎవ్వరు గాచువార లిఁక నెవ్వరు నాదుదురంతవార్త నా
యవ్వకుఁ దండ్రికిం దెలుపు నాదృతిఁ గాంతురు; దీనబాలకా!
యెవ్వరు నీకు నిట్టివెత నిచ్చుటఁ గూర్చి రటంచు నడ్గువా;
రెవ్విధిఁ గాంతుఁ బ్రాణముల నిం కిట నంచుఁ దలంకుబాలిశున్. 105

చ. కనుఁగొని యాధరాధిపతి కన్నులనుండి జలప్రవాహముల్
తనదుప్రయత్న మాపి చనఁ దద్దయుఁ జిత్తము చంచలింప నే
మని పలుకంగ నేరక మహామునిపుత్రకు నేసితిన్ శరం
బున నితఁ డేగు నూర్ధ్వపదముం గన నంచు మహార్తినొందుచున్. 106

ఉ. ఊరకయున్న నాగ్రహము నొంది శపించునొయేమొ యంచు లో
నారసి దుఃఖ మాపుకొని యార్య! మునీంద్రకుమార నే నిదే
భూరమణుండ వచ్చితిని బోలఁ గనుంగొను మేను నిన్నిటన్
నీరము ద్రాగవచ్చిన యనేకప మంచుఁ దలంచినాఁడఁ జూ. 107

చ. కరమున నీరముం గొనెడుగంధమతంగజశబ్ద మంచు నే
నరసితిఁ గుండ ముంచునపు డయ్యెను నిష్ఫల మట్టులే మహా
త్తరశర మేసినాఁడ నదిదారుణపుంఖయుతంబు నీహృదం
తరమున నాటె దైవగతి తప్పదుగాదె య దెంతవారికిన్. 108

సీ. శబ్దవేధం బనఁజను నొక్కయభ్యాస మద్దాని నే నుంతయభ్యసించి
తిని దానిఁ బరికింపఁ జనుదెంచి యీపొదయందు వసించి జలాంతరమున
నుదయించినట్టి నినదము గజంబులు నీరాను వేళ జనించునట్టి
దగుట దానింబట్టి యంబక మేసితి దైవవశంబునఁ దాఁకె నిన్నుఁ

ఆ. దెలియఁజాలనైతిఁ దొలిజాము మీఱెను, గాన నరులువచ్చు కాలమేగె
మృగగణంబులిపుడు మెదలునుగావున, నదిగొయున్నయూహ నాకుఁగలిగె.

క. ఈయర్ధరాత్రమందున, నీయడవిన్ నరులువచ్చు టెట్లు తలఁచినన్
నాయెదఁ దోఁచనికతమున, నీయంబక మేసినాఁడ నిది విధిగతియా. 110

తే. దశరథుండని నాపేరు ధాత్రిఁ బిల్వఁ బడును భూపాలకుఁడ మృగవారహనన
కర్మ మర్హము మాకెల్లఁ గాన నిట్లు, వచ్చినాఁడను విధిచేష్ట వఱలె నిట్లు.

క. తెలియక చేసినయపకృతి, నిలుపందగ దెదను మీరు నిశ్చలచిత్తుల్
ఖలులంగూడం దిట్టకు!, తలంతు రాత్మాకృతులుగ ధరఁ బ్రాణులనున్. 112

సీ. తప్పొనర్పఁగ లేదు ధరణీశులకుఁ దగు,మృగయ దానికి నేను మించువేడ్కఁ
జనుదెంచినాఁడ నీ శరమును నీయంగ,మీస్థలంబునఁబడు నిట్టి కాల
మున నంచు విధి వ్రాసెమును పెయట్టులెసాగెఁ గార్యంబిఁకేమనఁగలదుఫలము
క్షమియింపుమా చేయఁజాలు కార్యంబున్నఁ బంపుము చేసెదఁ బ్రాజ్ఞవర్య!
తే. యనుచుఁబ్రార్థింపనామునియక్షియుగము,నల్లనన్ విప్పిభూమీశునచటఁగాంచి
విధివశం బంచు రోజించి విషమగతికి, వగచి యింకేమి ఫలమని తగవచించె.

చ. తనువునఁ బ్రాణవాయువులు తర్లఁగ నున్నవి చెప్పఁబూన నే
మని వచియింపఁగాఁదగునొ యాత్మను దోఁపదు నిన్నుఁ దిట్టి రే
పనినొనరింపఁ బూనుదు నృపాలక! చయ్యనఁ గుండ దీనినిం
గొనిచని నాదుతల్లికిని గూర్మినిబెంచిన యట్టితండ్రికిన్ 114
క. మును పేమియుఁ బల్కక యే, పనివడి యాజలము పోసి పదపడి యీనా
కునుగల్గిన మృతిచరితం,బును జెప్పుము దాపకుండ భూపలలామా! 115
తే. ఉన్న దున్నట్లు చెప్పుమా యురుతరమగు, కోప మొందక వారలు కూళవిధిని
దూఱుదురు గానినిన్ను నుదూఱరనుచు,మదిఁదలంపుము సత్యంబెమహిని గాచు.

చ. వచనచమత్కృతుల్ నెఱపి వారిఁ గలంపఁగఁబోకు మాత్మజుం
డెచటనొ చచ్చె నన్న విని యెంతయుఁ గుందుచు దివ్యదృష్టినీ
దుచరిత మెల్లఁగాంచి నినుదుష్టునిగాఁగఁ దలంచి శాపమి
చ్చి చనుదు రూర్ధ్వలోకమును జేరఁగఁ గావున సత్య మాడుమీ. 117
మ. మునిశాపం బననేమొ యంచు మదిలో భూపాల! చింతింతువే
మొ నినున్ నీదుకులంబుఁ గాల్చునని నీవూహింపు మాపైన నీ
మన మెకార్యము చేయఁబంచు నటులే మన్నించి చేయంజనుం
దనువుంబాసి యసువ్రజంబు చనుఁ గానన్ సుంత భాషించితిన్. 118

మ. దురితం బిద్ది భవద్యశంబు ధరయందుం గుందఁగాఁజేయు భూ
వర! యేమాత్ర మెఱుంగఁజాలవని నాస్వాంతంబు విశ్వాసత
త్పరమై యున్నది గాన దుర్యశము నిద్దానన్ నినుం బొందకుం
డు రయంబొప్పఁగ నేగు; మందుఁ దలిదండ్రుల్ కుందుచుందుర్గడున్ 119

చ. పరుషతరాంబకంబు వడిఁ బాయఁగఁ జేయుము పూన్కిచే హృదం
తరముననుండి చెప్పఁగల ధర్మముఁ దెల్పితిఁ దల్లిదండ్రు లా
తురులయి యుందు రీజలముఁ దోడనె కైకొనిపోయి పోయి మే
నరిగెద నూర్ధ్వలోకమున కం చొగిఁ గన్నులఁ దేలవైచినన్. 120

చ. మనుజవిభుండు స్వాంత మనుఽమానమునన్ వ్యథఁ గాంచుచుండఁ జ
య్యన శర మూఁడదీసె నపుఽడంగముఁ బాసి యసువ్రజంబు పో
యెను దనుకాంతి మాసె ముఖఽమేర్పడఁ జూడఁగఁ దోఁచెఁ గ్రొత్తగన్
మునిసుతుదేహ మిట్టు లొకఽపోలిక భీతిదమై కనంబడన్. 121

చ ఘనతరరత్నకాంతులనుఽ గన్పడుబాలకు మోముఁ గాంచి యా
తనిదగు ఫాలభాగమునఁఽ దద్దయుఁదోఁచు త్రిపుండ్రరేఖలం
గనుఁగొని వెచ్చనూర్చి యిఁకఁ ఽ గాలముఁ బుచ్చుట చేయరానిదౌ
పని యని యచ్చటం దొరలుఽపాత్రముఁ గైకొని నీట నింపుచున్. 122

చ. మునిముదుకండు తద్గృహిణిఽ ముందుగ మాతనయుం డదేలరాఁ
డని ననుఁ బ్రశ్నచేసినటుఽలైన సదుత్తర మేమియిత్తుఁ బోం
కినయెడ దివ్యదృష్టిఁ గనిఽ కేవలపాపునిగాఁ దలంచి చ
చ్చునటులు శాపమియ్యరొకొ ఽ సూనునిపైఁ గలకూర్మి పెంపునన్. 123

ఉ. కావున నేది యెవ్విధినిఽ గాఁదగియుండునొ యద్దియట్టులౌ
జేవఁజెలంగి యెంచి మదిఁఽ జేసినకార్యము దుష్ఫలంబు నీ
కేవరుసం దొలంగు నిపుఽడెంచినచో ఫలమేమి యంచు నా
భూవిభుఁ డార్తుఁడై యరిగెఽ భూసురబాలుఁడు దెల్పినట్టులే. 124

చ. చనిచని సుంతదూరమునఽ క్ష్మారుహకోటరసీమనుండి ని
స్వన మొకఁ డల్లనల్లన నొఽసంగతభావముగా వినంబడన్
విని యిదియే యగున్ గొడుకుఽ వేగమ రాఁ డిదియేలయంచు నా
ర్తిని గనునట్టిచిహ్నము ఖిటఁఽ దెల్పెడు నిస్వనరూపతం గటా! 125

చ. మునితనయుండు చెప్పినటుఽ ముందుగ నీటినొసంగి దాఁప కా
తని మరణంబు నాదయినఽతప్పును జక్క నెఱుంగఁ దెల్పుదున్
వనజజునాజ్ఞ యేవిధినిఽ వర్తిలు నట్లు భవిష్యదర్థముల్
మనుజులకున్ ఫలించు, ననిఽ క్ష్మాపతి యల్లనఁ బోయెఁ జెంతకున్. 126

చ. చరణనినాద మల్లనఁ బ్రఽసంగవశంబుననున్న యమ్మునీ
శ్వరు శ్రుతిరంధ్రయుగ్మమునఽ సాధ్విశ్రవోవివరంబుఁ జొచ్చినన్
గరుణచెలంగ నోకొడుక! ఽ క్రన్నన రాక యిదేల యింతసే
పురుతరవాహినిం గడపితో జలముం గొనిరాక చెప్పుమా. 127

క. కడుదప్పి మమ్ము నేఁచెడు, వడిగాఁ జని తమసయందుఽ వారిం గొనిర
మ్ముడుపుము మాయార్తిని నని, కొడుకా! తెల్పితిమిగాదెఽ కొంకక నీతోన్.

క. ఒకనాఁడు నిట్లు చేయవు, సకల మ్మెఱుఁగుదువు మాకుఽ సంతోషము గా
ర్పక మాన విట్టినీ వే, లొకొ తడసితివనుచుఁ బల్కుఽచున్న మునిసతిన్. 129

క. కనఁగోరి యల్లనల్లనఁ, జని తరువివరంబుఁ గాంచి చంద్రోదయమహా
టను సుంత వారిఁ గన్గొని, మనుజేంద్రుఁడు వారినొసఁగి మ్రాన్పడునుడులన్.

క. మునివర మీకొమరుఁడఁ గా, నినవంశోద్భవుఁడ భూమిభృత్తను నన్నుఁ
జనులెల్ల దశరథాహ్వాయ, మునఁ బిల్తురు వేఁటలాడు బుద్ధి పొడముటన్. 131

చ. పరిజనులెల్ల రాఁ గదలి పర్వతభాగముఁ జేరి దుర్మృగో
త్కరములఁ జెండిచెండి తుదిగాననివేఁటతమిన్ నిశార్ధమం
దొరులు గనంగరానివిధి నుద్ధతకేసరి ముఖ్యజంతువుల్
తిరుగుచునుండ వానిధ్వనితీరును బట్టి వధించునూహలన్. 132

చ. నినదము వచ్చుచక్కటికి నేర్పున బాణము వైవ లక్ష్యమున్
దునుమఁగఁ జాలుశక్తి గడు దోఁచుట దానిని జూపఁబూని యో
మునికులచంద్ర! గుల్మమునఁ బొంచి నదీజలమందు నొక్కని
స్వన మరుదేరఁగా విని విశాలగజధ్వనియన్న యూహచేన్. 133

క. బుడబుడ యనుశబ్దము వినఁ, బడినంతనె నారి దిగిచి బాణము వైవం
గడుదీనత హాయను చప్పుడు వీనులఁ బడియె నొక్కపోలిక మౌనీ! 134

క. ఇది యేమనెడువిచారము, మదిఁ గలవిలపాటుఁగూర్ప మ్రాన్పడి యేమో
యొదవె నదెవ్వరికో యాపదయని పరుగిడితిఁ దొట్రుపడునడకలచేన్. 135

క. చని నీటిదరిని బాత్రము, దనచెంతం దొరలుచుండ దారుణబాణం
బునహృదయమగలహాయను, మునితనయునిఁ జూచినాఁడఁ బొగులుమనముతోన్.

తే. పలుకరించితి నపరాధపథముఁ దెలిపి, దాని కాతఁడు వగవక తల్లిదండ్రు
లకు మహాత్తరచింతాకులహృదయుఁడయి, జలముఁగొనిపోయినామాతజనకుఁ [గాంచి.

చ. వనజజుచేత మార్ప నెటువచ్చును జింతిల నేమి గల్గునో
జననిరో! తండ్రి యింక నను స్వర్గమునం గనవచ్చునంచు మీ
కును ననుఁ జెప్పఁబంచి మదిఁగుందుచు మీకయి ప్రాణపంచకం
బును విడనాడె మౌనివర! బొంకొకయింతయు లేదు దీనిలోన్. 138

చ. అనుపలుకుల్ వినంబడెడునంతటిలో జలపాన మొప్పఁజే
సిన మునిదంపతుల్ ధరణిఁ జేర్చిరి దేహము లింద్రియంబులన్
మనసు జవంబునన్ వదలుమాడ్కిని మూర్ఛయు వారిఁ బైకొనెన్
జనపతి యప్డు వారితనుసంగతిఁ బ్రాణము వీడినట్లుగన్. 139

క. తలపోసె నంత మెల్లనఁ, దెలివిం గని మౌనివరుఁడు తెగియెఁ దనూజుం
డలఘునృపాలశరంబున, జలములచెంతనె యటంచు స్వాంతమునందున్. 140

తే. తోఁచుటయుఁ దిక్కులెల్లను దోఁపకుంట, సుంతయూరకయుండియా క్షోణిపాలుఁ
డడలి యందుంటఁ దెలిసిదుర్దైవతంత్ర, మాత్మఁ జింతించియతనికిట్లనియెఁ గ్రుధను.

ఉ. ధీర!నృపాల!నాతనయుఁ ǂ ద్రెంచినయాశరవర్య మేసి యీ
నారిని నన్నుఁ ద్రుంపుము గన్ వడిఁబోదుము పుత్త్రరత్నముల్
గోరిక నీకుఁదీఱు వగఁగుందఁగఁజాలము సూనుఁ డొక్కఁడే
దూరముపోవఁ జాలఁ డిటఁ ǂ దోఁచునె సూనునిఁబాసి యుండఁగన్. 142

చ. శరముల వైచు లెట్టులని ǂ చక్కఁ దలంచెదునీకు నాసుతుం
డురుతరలక్ష్యమయ్యెఁ గన ǂ నొప్పెను నీకును లక్ష్యశుద్ధి యు
ర్వర భవదీయకీర్తిశశి ǂ వర్ధిలుచుండును సాధుకార్య మి
క్కరణి నొనర్చినాఁడవు తగంగ నొనర్పుము శిష్టకార్యమున్. 143

ఉ. అంతట వేఁట నాఁబడుమహాత్తరకేళి ఫలించు స్వేచ్ఛ నే
చింతయులేక నీపురికిఁ ǂ జేరఁగవచ్చు నటంచు నంతలో
స్వాంతముఁగోయు నెవ్వగలఁ ǂ జండతరస్వనమొప్ప నేడ్చెఁ ద
త్కాంతయుఁ దెల్విఁగాంచి తమకంబున నేడ్చెఁ గలస్వనంబునన్. 144

క. ఆరవము రాజహృదయముఁ, గారుణ్యాంబుధిని ముంచెఁ ǂ గాననమున నా
చేరువనుండిన ఖగమృగ,వారము తపియించెఁ గరుణ ǂ వర్ధిలుచుంటన్. 145

ఆ. నాకుమార! యని జనకుఁడు నాపుత్త్రకా!, యనుచుఁ దల్లియును నసహ్యదుఃఖ
జలధిమునిఁగి యట్టి ǂ విలపించి విలపించి, సొమ్మసిల్లి పడిరి ǂ క్షోణిపైన. 146

చ. కని రఘువంశమౌళిమణి ǂ క్రన్నన వారల నేద దేర్చి యో
మునివర! నీదుసాధ్వి వగమున్గెను గావున నూఱటంగన్
గొనకొని న్యాయవాక్కులఁ దగుల్ హితబోధ మొనర్పఁజింతిలన్
గను ఫలమేమి? యవ్విధికిఁ ǂ గల్గదుగా సుతుపై ముదంబనన్. 147

చ. ధరణిపుమాట లట్టె మది దారుణదుఃఖమునందు ముంపఁగాఁ
దరుణిని లేపి పుత్త్రకుఁడు ǂ ధర్మనికేతన మొందఁబోయెడిన్
ద్వరఁ జని కూడుటొప్పు నిఁక ǂ వందురి లాభము లేదు నాతిరో
ధర మనుకాల మింక విధి ǂ తప్పఁగఁ జూచుటఁ బోయె నక్కటా! 148

క. కన్నీటిచేత నే మన, యన్నకుఁ దర్పణముచేసి ǂ యతివేగమ వి
ద్వన్నుతు నాతనిఁ జేరఁగ, నెన్నఁగఁ జనుటొప్పఁగాదె ǂ యింతీ! యనినన్ .149

చ. పురపురఁ బొక్కుచున్ సుతునిపోకకు దైవము దూఱుచున్ నిరం
తరము వినీతచిత్తుఁడయి ǂ తల్లినిఁ దండ్రిని గొల్చుసద్గుణా
కరుఁ బొలియించితే కుమతిఁ ǂ గైకొని కన్నులమంట తీఱనే
ధరణిప! యంచు నూఱడక ǂ తాల్మివహింపక యేడ్చుచుండఁగన్. 150

చ. మునిపతి సాధ్వితోడ వగమున్గిన నింకను లాభమేమి చ
య్యన సుతుఁడున్నచక్కటికి ǂ నాతుర మొప్పఁగఁ బోవుటొప్పు నా
జనకుల కేమిదిక్కనుచు స్వాంతము దూలఁగఁ బొక్కుచుండు నా
తనయుఁడు వానిఁ జూడఁ జనఁ ǂ దత్తరమందెను జిత్త మిత్తఱిన్. 151

చ. అనుచుఁ గలఁగుచిత్తమున నానరపాలుని గాంచి భూమిపా!
నిను శపియించు టొప్ప దవినీతిని బాసి యథార్థమెల్లఁ జె
ప్పినకతనన్; నిశార్ధమునఁ బెంపు చెడన్ బొదమాటు నుండియే
సునిశితబాణ మేసితివి సూనుఁడు దాననె కూలె నొక్కటన్. 152

తే. తెలిసియేవైచియుండినఁ గులమువిలయ, మొందశపియింతునదితప్పొనుర్వి మాకుఁ
గన్నులవలెం జెలంగువిఖ్యాతసుగుణ, గణునిఁ గొమరుని జంపితి గాన మేము.

క. తనయుని గూడఁగఁబోవం, గనుదగు దిక్కెవరు లేనికతమున నెట్టి
నను మాకుఁ దిక్కుఁ జంపితి, వనునది సైపంగరానిదై యేర్చెడుఁ జూ. 154

క. కనుక నిను శాపదగ్ధునిఁ, గను జేయకయుండ నైతి కాదు కనుక నీ
వును బుత్రవిరహమున మృతిఁ, గనుదవుగాకంచు మౌని కాంతాయుతుఁడై.

చ. తనువుఁ ద్యజించి భవ్యసురధామముఁ జేరఁగఁ బోయె నంత నా
జనపతి వంశనాశనము సల్పెడుశాపము నీయకుండ న
మ్ముని చనె నింత చాలునని మోదమునందుచు వారి కగ్ని యి
చ్చి నిజభటావలిం గలిసి చేరె నయోధ్యను లోనఁ గుందుచున్. 156

మ. చిరకాలంబు మనోహరక్రమమునన్ శ్రీవృద్ధిమై రాజ్య మా
దర మొప్పం బటుశక్తి లేనిమడి సంతానంబు లేకున్న చిం
త రహిం గ్రమ్మఁగ సర్వమున్ మఱచి కాంతారంబు చేరంగ స
త్వరుఁడై యొప్పు టెఱింగి సారథి యమాత్యశ్రేణిగణ్యుండు నై. 157

క. దూరాలోచనయొనరుప, నై రాజానుగ్రహంబు నంది వెలయుచున్
జేరువ మెలఁగుచు నెప్పుడు, ధారణినాయకుని మేలు దలఁచుసఖుండై. 158

క. తనరుసుమంత్రుఁడు నరపతి, మనమునఁగల చింత నెఱిఁగి మహితోత్సాహం
బొనఁగూర్చుపల్కు చెప్పం, గనుగొరి రహస్యగోష్ఠిఁ గమ్రతరోక్తిన్. 159

సీ. పలికె భూనాయక కలదొక్కవృత్తాంత, మదియు సనత్కుమారాస్యగళిత
మగుదానిఁ దెల్పెద నవధరింపుము నీకు, వయసు చెల్లఁగఁ బుత్రవరులు నల్వు
రుద్భవింతురు మునిభ్యుండు ఋష్యశృంగుఁ, డనుమౌని యధ్వర్యుఁడై సవిధిని
బుత్రకామేష్టిని బూని చేయింపఁగ, సుతులుద్భవింతురు సూనృత మిది

ఆ. యనుచు మౌని పలికె నశ్వమేధము చేసి, యవల నిష్టి చేయ నర్హ మనుచు
నతఁడె తెలిపెఁ గాన నట్లు చేయం బూన, వయ్య కొఱఁత వాయునట్లు గాఁగ.

చ. అని తెలుపంగ మంత్రివరుఁ డాదృతిఁ దెల్పినసాధుభాషణం
బునకు ముదంబు నొంది రఘుభూపకులాగ్రణి యాతుసంబునన్
మునిపతులన్ వశిష్ఠముని ముఖ్యులఁ బిల్వఁగఁ బంచి వారిచెం
తను వినిపించె దేవముని తల్లజుసూక్తిని వేడ్క మీఱఁగన్. 161

శా. ఆవార్తల్ విని యావశిష్ఠముఖు లత్యామోద మేపార స
ద్భావంబుల్ తగ నట్లె చేయఁదగు సంభారంబులం గూర్పఁడీ
వేవే యంచని కృత్యమెల్లఁ దెలుపన్ విశ్వంభరేశుండు శాం
తావామాక్షిని ఋష్యశృంగుఁ గొనిరాఁ దాఁ బోయి యంగాధిపున్. 162

క. కనుఁగొని కార్యము చెప్పిన, విని జామాతను గుమారి వేడుకఁ బంపన్
జనపతి వారలఁ దోడ్కొని, చనుదెంచె నయోధ్య కాత్మ సంతసమలరన్.

సీ. యజ్ఞదీక్షకుఁ బూనె నధ్వర్యుఁడాదియౌ,ఋత్విజుల్ విధి విచారించి సుంత
కొఱతఁ గాంచనియట్లు కోవిదశ్రేణితో, నిత్యకృత్యంబుల నేర్పుమీఱ
జరపుచుండిరి యాదశరథుఁడు శుక్లయ,జుర్వేదిగావున శుభతర మను
సత్కీర్తిగన్న వాజసనేయశాఖకుఁ, జేరినవాఁడయి చెలగుచుంటఁ

ఆ. బదియు నెనిమిదియును బ్రస్తారముల నొప్పు, నట్టి లాస్థలంబు నమరిచిరటఁ
గ్రతువు చేయఁబడియె గ్రమ్మఱఁ బుత్రకా,మేష్టి చేయఁబూనె నెంతొ పూన్కి.

క. మునివరుఁడు ఋశ్యశృంగుఁడు, మనమున ధ్యానించి పల్కె క్ష్మాపాలమణీ!
తనయుల నల్వురఁ గాంతువు, ఘనులై యవ్వారు క్షితిని గ్రాలుదురు సుమీ.

చ. అని వచియించి శాస్త్రవిధి నధ్వర మాయది చేయఁబూని వే
ల్చెను జతనంబుమీఱ నిటు సిద్ధమఖంబది సాగుచుండ నె
మ్మనముల నిర్జరుల్ తలఁచి మంచి దిదే సమయం బటంచు నా
వనజజుపాలికిం జని సుభక్తిని మ్రొక్కి వచించి రీవిధిన్. 166

దేవతలు బ్రహ్మతో రావణునిదుండగములఁ జెప్పుట.

మ. అరవిందాసన! నీవర ప్రబలగర్వాయత్తుఁడై రావణా
సురుఁ డెవ్వారిని జేరికిం గొనక సంక్షోభంబు నొందించుచున్
సురనారీమణులన్ హరించె మఱి యక్షుల్ కిన్నరుల్ సాధ్యకిం
పురుషుల్ తద్గృహసీమ సేవకులు నిప్పుంగూడ నున్నారుసూ. 167

ఉ. అంతియ కాదు వారు కనునట్లుగ వారలపద్మనేత్రలం
జెంతనె నిల్చి పాదసరసీజము లొత్తుఁ డటంచుఁ బల్కు నా
కాంతలు దిక్కుమాలి తమకాంతులు చూడఁగఁ జావఁదన్ను నేఁ
గాంతుఁడ మీకనున్ బలుకఁగాఁగలదే యిఁక నొండు పద్మజా! 168

చ. పలుకఁగనేల యాసతులు ప్రక్కనె యుండఁగఁ గొల్వుచేయ నే
తులువలుగాని యిట్టులు సతుల్ వగఁ గుందఁగ నవ్వుచుందు రే
తలఁచిన గుండె నీఱగును దారుణవహ్నివిషాంబువుల్ దమ్ముం
బొలియఁగఁజేయఁ జాలమికిఁ బొక్కుదు మోకరుణాసుధోదధీ! 169

చ. అమృతముఁ ద్రాగఁజేసితి మహాపురుషా! మును రాక్షసాళిచే
నమృతులుగాఁగఁ బొల్చునటు లప్పటి సత్కృప నేఁడు చూపుమా

యమరులదైన్యముల్ దొలఁగునట్టియుపాయము చూడవయ్య స
త్యము నశియింపకుండఁగ నయంబు మృతిం గనకుండఁ గావుమీ. 170

చ. క్రతువులమాటలేదు మునిరాజతపస్సులు గానరావు కా
మితములఁ గోరియే వ్రతములేమేలని చేయఁగరాదు భామినీ
ప్రతతికి మానరక్షణము పట్టుదలం గొనిచేయఁజాలు స
ద్వ్రతుఁ డెటనైన దీపమునుబట్టి కనుంగొన లేఁడ యొక్కఁడున్ 171

చ. జననము గాంచనట్టి జలజాతవిలోచన మృత్యుమందిరం
బున వసియించునంగనయు భూరిజరాయుతయైనసాధ్వియుఁ
గన రవమాన మాదనుజకాంతునినుండి మఱొక్కకాంత యా
తని కయిఁదాఁకకుండఁగ వ్రతంబున నున్నదిలేదు లేదుసూ. 172

చ. పురుషులమాట యేటికిఁక భూతవిభూ! మముఁ ద్రుంచుమృత్యువుఁ
ద్వరగ సృజించుటో దనుజపాంసను ద్రుంప నుపాయ మెన్నుటో
సరియని యిందు నీదయినస్వాంత మదెయ్యది నిశ్చయించు స
త్వరముగ దానిఁ జేయుము కృతంబుల నెంచకు మేల జాగిఁకన్. 173

చ. వలదు మఱేమి చెప్పుదురొ వాసవముఖ్యులు దాని విందమ
వ్వల నొనరింపఁగాఁ దగినభంగి నొనర్పఁగవచ్చు నంచు నూ
హలు పెనుపొందఁ జేయఁ; గరుణార్ణవ! మాకన దిక్కునీవె యా
ర్తుల మదెగా కశక్తులము రూఢము రూఢము రూఢ మీనుడుల్. 174

మ. వరముల్ దొల్తనె యిచ్చినాఁడ నిపు డవ్వానిన్ మరల్పంగ నా
తరమే యంచు వచింతువేమొ శుభసంధానైకదక్షా! మహా
పురుషా! యొక్కటి విన్నవింతుము వరంబుల్ గోరునవ్వేళ వా
నరజాతిన్ నరజాతిఁ జేర్కొనఁడు దానన్ విన్నపం బిద్దియే. 175

శా. సారాచారుఁడు దీనరక్షకుఁడు చంచద్బాహుసారార్జిత
స్ఫారానంతయశుండు ధర్మమతి సత్పాత్రుండు దీనోత్కరా
ధారుం డీడ్యుఁడు సూర్యవంశఘనముక్తారత్న ముర్వీపతి
ప్రారంభస్ఫుటగణ్యనాముఁడును నైహార్వాందు నొక్కండిలన్. 176

చ. ఖరకరవంశభూషణులుగాఁ దగురాజులలోన మేటి భా
సురగుణపేటి యొక్కఁ డగు క్షోణివిభుండు గలండు భక్తి న
ధ్వరములు పెక్కుచేసి బహుభంగుల దానములిచ్చి సద్యశ
స్స్ఫురణతమించునాఘనుఁడు పూజ్యతమంబగు కోసలంబునన్. 177

తే. దశరథుండని యతని నందఱును బిల్తు, రామహామహుఁ డిత్తఱి నశ్వమేధ
యాగమును జేసిమునివర్యులనుమతింపఁ,బుత్రకామేష్టిఁ జేయంగఁబూనినాఁడు.

చ. అని సుర లట్లు తెల్ప విని యంబుజసూతి స్మరించి సుస్మితం
బొనరిచి మేలు మేలు సమయోచితభంగి స్మరింపఁ జేసినా
రనితరసాధ్యకీర్తి యని యానరవర్యు నెఱుంగుదుర్ మహా
ఘనమతియాను బాత్రుఁ డనఁగాఁ దగు విక్రమసంయుతుండగున్. 179

చ. దనుజుఁడు సత్తపోనిరతిఁ దా మును నన్నుఁ బ్రమోదచిత్తుఁగా
నొనరిచెఁ దత్తపోహుతవహుం గని భీతిలి మీరు వచ్చి న
న్నును ద్వరపెట్టలేదె మిమునుం గొనియేకద వానిచెంతకుం
జని వరమిచ్చినాఁడ నది సర్వముఖంబునఁ బోయుతీరమ
య్యెను గురుచింతఁ బూన నిపుడేమి ఫలంబగు దానఁ గావునన్. 180

చ. సురరిపునాయకుండు పటుశూరత నొప్పెడు భూరిదానవో
త్కరములఁ గూడి నాదువరగర్వమునన్ మితిమీఱి మిమ్మికా
దరసిన మూఁడులోకముల నార్తిని ముంచుచునున్న వాఁడు సం
గరమున నెవ్వఁడే నతనిగర్వ మడంపఁగ లేఁడు చూచితిన్. 181

మ. సురలున్ దైత్యులు లోనుగాఁ గలమహాశూరుల్ ఫణీశోత్తముల్
గరుడుల్ కిన్నరసిద్ధకింపురుషులున్ గంధర్వు లిం కెందఱో
దురమం దాతని మార్కొనన్ విశిఖముల్ తోడ్తోఁ బ్రయోగింప ని
ర్భరశౌర్యంబున నిల్వరింపను జయింపం జాల రేరీతినిన్. 182

ఆ. ఇంక నేమి చేయ నెంచితి వందురో, వినుఁడు శ్రద్ధమీఱ విబుధులార!
యెవని నేని యతని దేయగు కర్మము, పొడవడంచు నొరుఁడు పొడువ లేఁడు.

సీ. సత్కర్మ మాయువు సమధికముగఁ జేయు, దుష్కర్మ మాయువుఁ ద్రుంగఁ జేయు
నీవిధం బెఱుఁగక యితరుల భూషింత్రు, దూషింత్రు జ్ఞానంబు తొలఁగియుంట
పురుషుఁడు కర్తయే పోకార్ప దుష్ఫల,ముల నస్వతంత్రుండె తలఁప నతఁడు
సత్కర్మములఁ జేయ స్వాతంత్ర్య మెట్లబ్బుఁ? గావున రెంటను గాఁడు వలఁతి
ఆ. యిట్టులౌట నొకని నేల దూషింపంగ, దుష్ఫలములఁ గుడువఁ దొడరుతఱిని
వాని ననుభవింప వలయుఁ గాదె యిది, నియతమనుచుఁ గనవలయును మీరు.

చ. పరులను బెక్కుబాధలకుఁ బాల్పడఁ జేసిన దుష్టకర్మమే
నిరతము పీడలం గుడువ నేర్పునఁ జేయును దానిమాని యొ
క్కరుని నతంత్రునిన్ దెగడఁ గాంచుఫలం బన శూన్యమే కదా
సురవరులార! యొక్క దనుజున్ దెగనాడఁగ నేల యింతగన్. 185

చ. ఎవరికిఁ బీడఁ గల్గునటు లెత్తఱిఁ జేసితిరో తదీయమై
యవితథమౌ ఫలం బటులె యార్తినిఁ గూర్చెడు మీకుఁ దప్పనొ
క్కొ వలయునంచు దుష్టకృతు లొప్పుగఁ జేసినఁ దత్ఫలంబు మా
కు వలదటంచుఁ బల్కినను గొబ్బునఁ బొందక పోవ నెట్టులో? 186

చ. చెలఁగెడువేడ్క నొక్కరుని చేడియ వంచన చేసి యెట్టులో
వలదని చెప్పుశాస్త్రముల వంకఁ గనుంగొన కిచ్చగింపక
ర్మిలి గొనినట్టి దుష్ఫల మమేయ మగుంగద దాని నొందకే
తొలఁగి చనంగ నెట్టులగు ధూర్తతఁ బాపఫలం బొసంగదే. 187

చ. ఒకతఱి మోహవేగమున నొక్కనిపత్నిని బట్టుకొన్న వే
ఱొకతఱి స్వీయదారల మహోద్ధతి నొక్కఁడు బల్మిఁబట్టి యీ
డ్చుకొనుచుఁ బోవుచుండఁ గనుచున్ దపియించుచు నుండఁగావలెన్;
బకపక నవ్వి చేయుగురుపాతక మేద్వాఁగఁ జేయుఁ బిమ్మటన్. 188

చ. జగమునఁ గర్మమార్గమె నికామఫలం బొడఁగూర్పఁజాలు నం
చు గణనచేయఁగావలయు శూరత దాని నడంపరాదదె
న్నఁగ సుకృతంబొ దుష్కృతమొ నైజఫలం బొడఁగూర్చుచుండ దా
ని గడచిపోవ నెవ్వఁడగు నేర్పఱి యంచుఁ దలంపుఁ డాత్మలన్. 189

చ. పరులు మహాశ్రమంబులకుఁ బాల్పడుచుండఁగఁ జూచి నవ్వుచుం
బరహితముల్ దలంపనికృపారహితాత్మునిఁ గర్మబంధముల్
వరుసగఁ జుట్టి కట్టి బలుబాములఁ బెట్టఁగ నప్పుడైనఁ బా
పరతికి నీఫలం బనుచుఁ బల్కక దైవముఁ దిట్టు నజ్ఞుఁడై. 190

చ. పలుకు లిఁకేల మీరొరులభార్యలఁ జింతలఁ గుందఁ జేయుటం
గలిగెను దుష్ఫలంబు నిజకాంతలు కుందుచునుండఁ జూడఁగా
ఖలుఁడు పరిగ్రహింప నొకకార్యమునైనను జేయఁజాల కి
ట్టులు తపియింపఁగా నిఁకఁ గడున్ వెతగుందఁగ నేల? మానుఁడీ. 191

చ. ఒరులు వగంగనంగనుచు హాయని యార్చుచునున్న దుష్ఫలం
బురుతరరీతి నిట్టివెత లొందఁగఁజేసెను దాని సైపుఁ డో
సురవరులార! యాదనుజు స్రుక్కఁగఁ జేయఁగ నోపుకార్యమీ
తరుణమునందె చేయఁదగు దానిని దెల్పెద నాలకింపుఁడీ. 192

చ. జగములకెల్ల నాయకుఁడు సాధుజనావనతత్పరుండు మో
క్షగతిని జూపువేలుపు విశాలకృపామలదృష్టిపాతదూ
రగతనిజాశ్రితార్తితతి రమ్యతమాంగుఁడు క్షీరవార్ధిసం
ప్రగతనివాసుఁ డీశ్వరుఁడు పద్మదళాక్షుఁడు గాఁడె యెన్నఁగన్. 193

చ. వరదుని శాంతమూర్తిని భవప్రముఖాకృతిరాశిఁ బొల్చుసుం
దరముఖచంద్రు శ్రీపతినిఁ దత్త్వవిదుత్తమపూజితాంఘ్రిసం
కరహుని దీనరక్షకు నగాధతరాత్ముని విష్ణు నవ్యయున్
బరమముదంబునం గొలువఁ బాయవె కష్టము లెన్నియేనియున్. 194

తే. ఆపదుద్ధరణక్షముం డతఁడు కాఁడె, వేయికరుఁ డుండనోపునే విబుధులార
రండు ననుఁగూడి క్షీరవారాశికందు, భక్తిఁ బ్రార్థింతమా పరాత్పరునిగురుని.

## దేవతలు వైకుంఠమున కరుగుట.

కవిరాజవిరాజితము.—

అని యిటుపల్కిన నయ్యమరోత్తము లప్పుడె వాక్పతిహర్షమునం
మునుఁగఁగ లెమ్మికఁ బోవుద మాహరి పూనివసించెడుభూమికి నం
చని త్వరపెట్టఁగ నయ్యజుఁ డయ్యమరావళిఁగూడి మహాంబుధినిం
గనఁ జని యందొక క్రమ్రమహీస్థలి గాఢపుభక్తి తగఁగ నియతిన్. 196

ఆ. కనులుమూసి నిలిచి కరముల జోడించి, కాంచనాంబరా! వికారరహిత!
కమ్రరూప దేవ కరుణాపయోనిధీ, యార్తిహరణ! కావవయ్య మమ్ము. 197

సీ. వేదవేదాంతముల్ విమలశాస్త్రంబులు, స్మృతిపురాణాదు లున్నతభవద్వి
భూతి నెన్నఁగఁజాల కాతతభక్తిని, వందనంబు లొనర్చు వాసుదేవ
యవ్యయుండవు చేతనాధారుఁడవు సర్వ,భూతాంతరాత్మవు భూతభావ
నుఁడవు సదాశంకరుఁడవు చిద్రూపివి, పరమేశ్వరుండవు బ్రహ్మమయుఁడ

ఆ. వాదిదేవుఁడవు సదానందమూర్తివి, ప్రణవరూపుఁడవు పరాత్పరుఁడవు
నిన్ను నమ్మువారి కెన్న భవార్తులు, కలుగకుండుఁగాదె కమలనాభ! 198

క. దానము ప్రతిగ్రహంబును, మానసమున నెన్నిచూడ మాధవ! నీవే
గాన సమస్తము త్వన్మయ, మౌనని తలపోయుదురు మహాత్ములు సతమున్.

క. దాతయుఁ బ్రతిగ్రహీతయు, హోతయు నధ్వర్యుఁ డగ్ని హోత్రియు సవదీ
క్షౌతంత్ర మెల్ల నీవే, పూతచరిత్రా! మహాత్మ! పుణ్యనిధానా! 200

చ. కలఁడని పల్కుచుంద్రు నినుఁ గానఁగరాక చెలంగుచుంట నే
స్థలముననైన లేఁడనుచుఁ దత్పరులై వచియించుచుంద్రు వే
దవిదితవాక్కు లిద్ది యిటు తథ్య మటం చొగిఁ బల్కలేక యే
తెలియఁగరాదు బ్రహ్మమని తెల్పెదు నీదు మహత్త్వ మెట్టిదో. 201

ఉ. ఎందుఁ గనంగఁ దోఁచెద వదేటికొ కానఁగరాకపోదు వి
ళ్లొందును దోఁచి కానఁబడ కెట్లొ యదృశ్యతఁ గాంచనేలొకో
సుందరరూప! జ్ఞానమయ! చోద్యముగాదె భవన్మహత్త్వ మి
ళ్లొందఱొ యూహచేయఁదగి యెట్లుతలంచినఁ దోఁపకుండెడున్. 202

క. కలఁ డావైకుంఠంబునఁ, గలఁ డాగోలోకమందుఁ గాంతాయుతుఁడై
కలుములనొసఁగుచు ననుచుం, బలుకుదు రొగిఁ దత్త్వశాస్త్రపారంగతులున్.

క. యోగీంద్రులమానసమున, భోగీంద్రశయానుఁడుండు భూరిమహిమతో
భోగివిభూషణనుతుఁ డా, యోగాత్ముఁడె యంద్రుజ్ఞాను లోగి సర్వేశా. 204

క. జ్ఞానము జ్ఞేయము జ్ఞాతము, సూనాంబకజనక నీవె ౹ చూ తలపోయన్
నీనిర్మలపాదాబ్జ,ధ్యానము తక్కంగ నొండు ౹ తగునే యెఱుఁగన్. 205

చ. సురలకుఁ గల్గుబాధలను ౹ ఘోరత వాపఁగ నీవెకాదె యా
శరు లొగి దేవతావళులఁ ౹ జాల బడల్పడఁ జేయుచున్న వా
రురుకరుణాసముద్ర! త్రిదశోత్తమవందితపాదపద్మ నీ
చరణసరోరుహద్వయమె ౹ శాశ్వతశర్మదమంచు నెంచుచున్. 206

ఉ. దిక్కఁక నీవెయంచు వెతఁదీర్పఁగఁ జాలుదువంచు సుంతయే
నక్కఱగల్గి పిల్చిన మహోత్తరమోదముమీఱ వచ్చి యిం
పెక్కఁగ దానిఁదీర్చి హిత ౹ మెల్లవిధంబులఁ గూర్తువంచు నో
చక్కనినల్లనయ్య సురసత్తమ వచ్చితి మూర్తిఁ గుందుచున్. 207

శా. ఏమే ముల్లములం దలంచితిమొ మిమ్మే సాయముంగోరి యీ
భూమానందకరాంబురాశిసవిధంబుం జేరి నామో విభూ!
శ్రీమత్పద్మదళాక్ష! నీకె తెలియుం ౹ జెప్పంగ నేలా త్వరన్
నీమూర్తిం గనఁజేసి కావఁగదవే ౹ నీవే కదా దిక్కనన్. 208

చ. అని యిటు పంకజప్రభవుఁ ౹ డయ్యమరావళిఁ గూడి వేఁడ నం
బునిధిని దోఁచెఁ దేజము సముద్రము దాన మహానలాకృతిం
గని నటు తెల్లమయ్యె నది ౹ క్రమ్మఱ దివ్యము దర్శనీయమున్
వినుతమునై చెలంగె నొకవింతఁగ దానిని గాంచి రందఱున్. 209

ఆ. దానియంతరమున ౹ ధవళాబ్జపత్త్రనే,త్రములు వెలయఁ జక్రదరములంబు
జాభయములు నాల్గుహస్తంబులం దగ, దివ్యమూర్తి యెదుటఁ ౹ దేజరిల్లె.

సీ. సవ్యపార్శ్వంబున ౹ జగదేకమాతయుఁ, గన్పడె నామూర్తిఁ ౹ గాంచినంత
నారాయణుం డనునామంబు గలదేవుఁ, డీతఁడే యని వారికెల్లఁ దోఁచె
నంత నారాయణుం ౹ డాదరంబున మేఘ,గంభీరనిస్వనకలితవాక్కు
లలర నిట్లని పల్కె ౹ నబ్జాసనా! దేవ,తలఁగూడి నీవిటు ౹ తరలి రాఁగఁ
ఆ. దగినకార్యభంగిఁ ౹ దలపోసినాఁడను, సమయ మరుగుదెంచె ౹ శత్రుసమితి
సమయఁ జేయననుచు ౹ స్వాంతముత్వరపెట్టు,చున్నదిపుడెమీరలురుభయార్తి.

క. చనుదెంచితి రభయంబిదె, మనమున నేసందియములు ౹ మాని చనుఁడు నే
మనుజతఁ గైకొని దుష్టా,త్ముని రావణు సంగరమునఁ ౹ ద్రుంతుం గడిమిన్. 212

చ. దనుజుఁడు లోకభీకరుఁడు ౹ దారుణబాహుబలాఢ్యుఁ డెంతయున్
మునులను బాధపెట్టెడిని ౹ మూర్ఖుఁడటంచు నెఱుంగుదున్ జవం
బున నెదిరించి చంపఁదగుఁ ౹ బో వనజోద్భవ! నీవరంబె యా
తని చిరకాలజీవిగ నితాంతబలాఢ్యునిగా నొనర్చెఁ జూ. 213

చ. తప మొనరించునప్పుడె యతండు మహోగ్రవిధాన మొప్ప శీ
ర్షపటలముం గ్రమంబున నిశాతతరచ్ఛురికాహతిన్ గృశా
నుపరమకీలలన్ వయిచి నూత్నతరాశల నిన్ను వేఁడఁగా
నపుడె సమస్తవాంఛల మహాముదమొప్పఁగ నిచ్చితే గదా. 214

చ. ఇతనిమహోగ్రకృత్యమిది యెట్టులుగాఁ జరియించునో జన
ప్రతతికి నేమికీ డొనరుపం దపమూనినవాఁడొ దాని నే
వితమున మాన్పఁగాఁదగునొ వీనిప్రయత్నము చేఁ బురంధ్రులే
గతిని జరింతురో యనుచుఁ గంజభవా! తలపోయఁ జాలితే. 215

మ. వరసంతాన మొసంగి ఖేచరుల నీభంగిం దపింపంగఁజే
సి రమాకాంత! యటంచు నన్ బిలువ నేఁ జేయంగనౌయత్నమే
కరణిం జేయఁగనౌనొ చక్కనగుకాలం బేదొ యోజింపకే
త్వర పూనందగునయ్య నీవలననే దైన్యంబు గల్గెంజుమీ. 216

మ. సురలం దోలిన దోలనిమ్ము పటుదోస్స్ఫూర్తిన్ సురేంద్రాదులం
బరిమార్పం జననిమ్ము యతివితతిన్ బారుష్యమేపార సం
గరరంగంబున భూరియత్నమునఁ గాంక్షల్ మీఱఁ జక్కాడునా
తురతం బొందగనిమ్ము సైపఁదగు నీధూర్తత్వ మబ్జాసనా! 217

ఉ. ఎన్నిటినైన నోర్వఁదగు నిట్టిప్రయత్నములం దలంప నిం
కెన్నిటినైనఁ జేయ శమ మేర్పడ నూరకయుండవచ్చుఁ గా
కెన్నఁగ సాధుశీలముల నెంతయుఁ బొల్పుపతివ్రతల్ మహా
పన్నతఁ గాంచుచుండఁ గని వారిజసంభవ! యోర్వవచ్చునే? 218

మ. మునులన్ బాధలపాలు చేయుటయొ సమ్మోదంబు మీఱంగ భ
ర్త నుపాసించుపురంధ్రిఁ గావరమునన్ దా బల్మిఁ గైకొంటయో
దనుజేంద్రుం డొనరించులే నెఱుఁగుదున్ ద్వద్వాక్యముంగావ నో
ర్చిన నన్నున్ బురికొల్పనేల? యిదె నేఁ జెండాడెదన్ రావణున్. 219

ఉ. కాలము నాస్వరూపమయి క్రాలుచునుండును దాని నెవ్వఁడే
నోలి భజించువాని నెటులోర్వఁగ వచ్చును నీకు నైన; నా
కాలము రావణాసురునిఁ గాఱియపెట్టఁగఁ బూన దింకఁ బా
పాళులు వానిదౌష్ట్యము నహర్నిశముం బెనుపొందఁ జేయుటన్ 220

ఉ. కాలము పక్వమై వెలయఁగా నసురేంద్రుని ద్రుంపనౌ మహా
భీలత నుండు కాలుఁడును బెంపఱఁ జేయఁగ నుంతయేనియుం
జాలఁడు కావునన్ వనజసంభవ! యిన్నిదినంబు లోర్చితిన్
బాలిశు రావణాసురుని బల్మి నడంచెద నింకఁ జూడుమా. 221

చ. సురదనుజాసురప్రముఖశూరులనుండి యదెట్టిభంగినిన్
మరణము నొందకుండఁగను మామకవాక్య మొకండుగల్గ నె
క్కరణి వధింతు వీవనెదొ కంజభవా! వరదానమప్పు వా
నరుల మనుష్యులన్ దనుజనాథుఁడు పేర్కొనఁ డించుకేనియున్. 222

చ. కనుకనె మానవాకృతిని గాంచి వధించెద వానరాళి నా
వెనుకనె విక్రమింపఁ జను వింతగ నెల్లరు చూచుచుండ నో
వనజభవా! వినంగఁ దగు వాక్య మొకండు వచించువాఁడఁ గ
ర్మనియతి మీఱరా దదియె మామకమై తనరారుచుండుటన్. 223

చ. తొలిభవమందు నేజనుఁడు ధూర్తతఁ జేసినకర్మభేదముల్
తలఁగక మీఁదిజన్మమునఁ దార్కొనుఁజుమ్ముచితక్రమంబునన్
బలువెతలం బడల్పడెడుభంగి నొనర్పఁగ సంస్మరించుచుం
గలుషములేల చేసితినొ కాలవిపర్యయ మంచుఁ బల్కెడున్. 224

ఉ. అంతియకాని యాత్మ నిఁక నట్టివి నేనొనరింప నంచు సి
ద్ధాంతము చేయఁబూనఁడు విచిత్రతరాయతకర్మపాశసం
క్రాంతమనస్కుఁడౌటఁ గలకాల మిదేగతి యంచు నెంచుమా
సుంతయుఁ దా స్వతంత్రుఁడుగఁ జూడఁగ నా జనుఁ డుండనేర్చునే. 225

చ. కనుకఁ బులస్త్యపౌత్రుఁ డొకకర్మముచేసి తదీయవైభవం
బున నిల నింతకాలము విభూతులనెల్లఁ జెలంగె నింకమీఁ
ద నతఁడు స్వేష్టముం గనెడు ధర్మ మొనర్పఁగఁజాలఁ డింతయే
నని మొన వానిఁ జెందుదు నహంకృతి మానఁగ మానవుండనై. 226

చ. మనుజులు స్వల్పులంచు నొకమాడ్కిని దన్ను జయింపఁజాలరం
చును మదినెంచె వానరుల క్షోణిని లెక్కగొనంగనేల యం
చును దలపోసెఁ గానఁ గడుశూరతమై నరవానరాళిచే
తనె యనిఁ గూలఁజేయు టది ధర్మము కర్మము పేర్మి నబ్జజా! 227

క. నరుఁడనయి పుట్టి గురువా,నరబలములు తోడుపడ వినాశము గూర్తున్
సురవైరులకెల్లను భీ,కరసంగరరంగమందుఁ గంజజ! గనుమా. 228

ఉ. చింతలఁబాసి యార్తులగుసిద్ధసుపర్వుల నూఱడించి యే
వంతలఁ గాంచరింక సుకవర్యు లటంచుఁ దలంచుచున్ గడున్
సంతస మొప్పఁ బొమ్ము సురసత్తమ! వాక్పతి నేను మానవ
స్వాంతము కన్పడంగ సురవైరి నడంచెదఁ బూన్కి మీఱఁగన్. 229

చ. అని పలుకంగ ధాతయుఁ బ్రహర్షమునన్ సురరాజముఖ్యులం
గని యిఁక యుష్మదంశములు క్ష్మాస్థలి వానరకోటిఁ బుట్టఁగా

నొనరుపుఁ డంచుఁ బల్కి హరి§యూహలఁ దెల్పి విహంగమోత్తమం
బనఁజను హంసనెక్కి చనె § నాత్మపదంబున కెంతో వేడుకన్. 230

చ. సురలును స్వాంశయోగముల § శూరుల వానరవర్యులన్ మహా
త్తరతనుధారులన్ వినయ§ధర్ములఁ బుట్టఁగఁజేసి; రంత శ్రీ
హరియును రావణాసురుని§యంతము చెంతకు వచ్చుచుంటఁ గా
వరమున వాఁడు స్వేచ్ఛమెయి § వర్తిలుచుంట దలంచి పూనికన్. 231

చ. మనుజత నొందుయత్నము స§మస్తవిధంబులఁ జేయుచుండె; మే
దిని మునిసత్తమాదృతిని § దీక్షవహించి రఘూత్తమాన్వయుం
డనవరతంబు హోమవిధి § నయ్యనలుం బరితృప్తుఁజేయుచుం
డెను సుతకాంక్ష పైకొనఁగ § నిర్మలమై మనసొప్పుచుండఁగన్. 232

క. పరమేశ్వరాజ్ఞ హుతవహుఁ, డురుకృప మీఱఁగ నప్డు § హోమానలునం
తరసీమనుండి వెల్వడి, యరుదెంచెన్ జూచువార § లచ్చెరువందన్. 233

చ. కరమున హేమపాత్రమునఁ § గమ్రతమంబగుపాయసంబు భీ
కరదనుజాంతకాత్మజని§కాయదమై తనరంగఁ దాల్చి యా
దరమున నారఘూద్వహుని § ధర్మరతున్ గని యిట్లు పల్కె భూ
వర! వరసంతతిప్రదము § పావనపాయస మిద్దియే సుమీ. 234

మ. సుతులం గోరుచు నిష్టిచేసితి విధిన్ § క్షోణీశ! మేలయ్యెడున్
జతనం బొప్పఁగ దైవదత్తమయి స§త్సంతానభాగ్యప్రదం
బతులం బుత్తమపుణ్యలబ్ధమును నై § హర్వొందు నిద్దాని సం
చితభక్తిం గొని నీసతీత్రయము భ§క్షింపంగ నిమ్మా! తమిన్. 235

చ. అనియిటు హేమపాత్రము మ§హాదృతినిచ్చి యదృశ్యుఁడయ్యె; నా
జనపతి దానిఁ బ్రీతిఁగొని § సాధ్వులకెల్లను బంచి యిచ్చె! నా
మునివరు లెల్ల యాగవర§మున్ బరిపూర్తిని గాంచఁజేసి మ
న్ననలను బొంది యేగిరి వి§నాశము దైత్యుల కెల్లఁ గోరుచున్. 236

మ. క్రతువాటంబును వీడి భూమిపతి కాం§తారత్నముల్ తోడరాఁ
గృతకార్యుండయి యాయయోధ్యఁ గనఁగా § నేగెన్ బురంధ్రీత్రయం
బతిమోదంబునఁ జూలుదాల్చి పతి య§త్యంతంబు పొంగన్ మునీం
ద్రతతుల్ హర్షమునొందఁ గాంచిరి సుత§వ్రాతంబు దేవాంశతన్. 237

సీ. రాముఁడు నవల భ§రతుఁడును లక్ష్మణ, శత్రుఘ్నులనువారు § మిత్రవంశ
ముక్తామణికిఁ బ్రియ§పుత్త్రులై రందు రా,ముఁడు లక్ష్మణుఁడుభర§తుఁడుసుమిత్ర
చిన్నికుమారుండు§చేరియుందురు భావి,కార్యార్థమయి ప్రీతి§కలితచిత్తు
లగుచు నుద్దులుగాఁగ; § నంటఱఁ గని జను, లుప్పొంగువేడ్కల§నొప్పుచుండ

ఆ. రంత నావశిష్టుఁ డాసోదరుల కతి, ప్రీతి విద్యలెల్ల నీతి తొలుతఁ
గలుగునట్లు తెల్పె నెలమి వారును గురు, భక్తియుక్తులగుచుఁ బరిఢవిల్లి.

వ. ఇట్లాసోదరులు శుక్లపక్షశశాంకరుచాడ్పున దినదినప్రవర్ధమాను లగుచు. 239

సీ. అశ్వరత్నమ్ముల నారోహణము చేయు, నేర్పున విఖ్యాతిఁ గూర్పఁ గల్గి
సకలవేదంబుల శాస్త్రంబులను నేర్చి, విద్వాంసు లౌనన విమలకీర్తి
గడియించి ప్రజల నిష్కామము రంజిల్లఁ, గా జేయుచును దండ్రి కరము పొంగఁ
దల్లులు మిగుల మోదమున నుప్పొంగంగఁ, దమచరిత్రము లోకతతులు పొగడ

ఆ. నేకమనసు లొప్ప నేకరణిని జూడ, గొఱఁత సుంతయైన గోచరింపఁ
కుండ సోదరులు మహోత్తమసంపద, వెలసి రెల్లబుధులు వినుతిచేయ 240

చ. ఉపనయనాదికంబు లగునుత్తమకర్మము లొప్పఁ జేసి వే
దపటల శాస్త్రసంఘములఁ దద్దయుఁ బండితులై నరేంద్రవం
శపరమమౌక్తికంబులయి క్ష్మాస్థలి నిర్మలచంద్రతుల్యులై
కపట మెఱుంగ కెల్లరకుఁ గమ్రసుఖావహులై చెలంగుచున్. 241

ఉ. శాంతియు దాంతియుం గలిగి సర్వగుణాకరులంచు సత్ప్రజా
సంతతి తమ్మొగిం బొగడఁ జక్రధర ప్రతిమానకృత్యముల్
వింతగఁ జేయఁజాలుదురు వీ రని మానులు నమ్మియుండ నే
చింతయు లేక సోదరులు చిత్రముగాఁ బెనుపొంద రత్తఱిన్. 242

ఉ. వారలసత్క్రియాభిరతి వారలదౌవినయంబు పూన్కియున్
వారలసత్ప్రభావము సభాభవనంబుల నొప్పురీతి యె
వ్వారలు గాంచినన్ బ్రమదవార్ధిని దేలుదురన్న నింక నా
ధారణిపాలవర్యుఁడు ముదంబునఁ బొల్చుట యబ్బురంబొకో? 243

చ. తనయులు చారుసద్గుణవితానులునై యిల నొప్పుచుండినన్
జనకుఁడు వారలం బొగడ స్వాంతమునం దలపోయరాదు నాఁ
జనువిధి నెంచియున్ నిలుపఁజాలనిపూన్కి నొకప్పు డౌర! నా
తనయులు బుద్ధిమంతు లని తాఁ బలుకున్ సభలోన వింతగన్. 244

చ. దశరథుఁ డోలగంబునఁ బ్రధానులఁ బౌరులఁ గూడియుండఁగాఁ
బ్రశమితచిత్తలైరి సమవాయులు మానులు పెండ్లిచేయు మో
దశరథభూమిపాలకవతంసమ! యంచు వచించుచుండ్రు దు
ష్టశరధిబాడబాకృతులు క్ష్మావరపుత్రకు లంచు నెంచుటన్. 245

చ. సమయము సుప్రసన్నమయి సర్వవిధంబుల నొప్పె నిప్పుడే
ప్రమదల సద్గుణాకృతులఁ జారుతరాంగులఁ దెచ్చి పెండ్లిచే
యుము ధరణీశ! యంచు సభయందుఁ జెలంగెడుపౌరులెంతొ మో
దమున వచించి రా నృపతితల్లజుఁ డౌనని యొప్పె దానికిన్. 246

క. బలవంతులలో విధియే, బలవంతము దానిమిగులు బలముగలది యీ
యిల లే ద దెందులేదని, తెలియుదు రఖిలార్థవిదులు ధీరవంతసుల్. 247

చ. అది కుశికాన్వయోదధిహిమాంశుని గాధితనూజుఁ జేరి స
మ్మద మొదవంగ రాముని నమానుషవిగ్రహుఁ గోరితెచ్చి భీ
తిదదనుజాళిఁ గూల్పఁ దగుఁ దెప్పున నన్నసదూహ పుట్టఁ జే
యఁ దరలె నాయయోధ్యకు మహోత్తరయాగకుతూహలంబునన్. 248

క. విశ్వామిత్రుం డట హరి, దశ్వాకులాంభోధిచంద్రుఁ డగుదశరథునిన్
శశ్వత్తర్పితయాచకు, విశ్వాసిని గానఁబోయె విధి తనుఁ బంపన్. 249

చ. సుతులకుఁ బెండ్లిచేయు మరిసూదన యంచు బుధుల్ వచింప స
మ్మతి బదులాడువేళఁ దనమంత్రులు దానికి సంతసించుచుం
డుతఱిని ద్వారపాలుఁడు కడుంగడుఁ దొందఱమీఱ వచ్చి యో
క్షితిపవతంస! ద్వారమును జేరినవాఁడు మునీంద్రుఁ డిప్పుడే. 250

క. నా రాక దశరథక్షితి, దారునకుం దెల్పు మనియెఁ దన్ముఖతేజం
బారార! యనఁగ నొప్పెదు, భూరమణా! గాధిజుఁడఁట పుత్తునె యిటకున్.

మ. అనువార్తల్ శ్రుతిరంధ్రముల్ చొరఁగ నత్యాశ్చర్యమగ్నాత్ముఁడై
మునివర్యుల్ తను వెంబడింప ఘనమాపూజాపదార్థాళిఁ గొం
చును వేగంబ రఘూద్వహుండు చని తేజోరాశియై యొప్పునా
మునినాథున్ గుశికాన్వయుం గనియె సమ్మోదంబు దీపింపఁగన్. 252

చ. అతిథికిఁ జేయఁగాఁదగినయట్టి సపర్యల నాచరించి మి
త్రత వెలయంగ రమ్ము మునితల్లజ! యంచు బహూకరించిమా
నితతులు నల్లె పల్కఁగ మునిం గొనివచ్చి సభాంతరంబునం
దతులితపీఠవర్యమునయం దుపవిష్టుని జేసి యాదృతిన్. 253

మ. సతతంబున్ నిను సంస్మరింతు నోగి విశ్వామిత్రమునీంద్ర! సం
తతి ధన్యంబయి యొప్పె; నాగృహము పూతంబయ్యె; నావాంఛలు
న్నతిమించన్ ఫలియించె; నేనె తలఁపన్ నావారిలో నెల్ల ధ
న్యతరుండన్ గురుభాగ్యవంతుఁడఁగదా యాశ్చర్యమే యున్నఁగన్. 254

క. తలవనితలఁపుగ నోముని,తిలకా! మీరాకయొప్పె దివి మేఘంబుల్
చెలఁగక యుండఁగ వర్షం, బిలఁ దన్పినయట్టులయ్యె నిదె భాగ్యమనన్.

చ. మనవి యొనర్తు దాని బహుమానముగా గ్రహియింపుఁ డోమునీం
ద్రనికరపూజితా! యిదియె రాజ్యము వీరె ప్రధానులివ్వియే
ధనములు వాహనాదులివె దాసుఁడు వీఁడె గ్రహించి యెవ్విధం
బునఁ బనిగొందువో యటులె పూనుము చేయఁగ సత్యమా నిదే. 256

క. నిను నధిపతిగాఁ గైకొను, టన సామాన్యంబె భాగ్యమౌఁగద యదియే
మునితిలకా! యేపనిచే,య ననుజ్ఞయొ దాని వినఁగ నాత్మఁ దలంతున్. 257

చ. అనృతము కాదు మీపనిచినట్టి దదెట్టిదియైనఁ జేయువాఁ
డననుచు బాసచేయుదును డంబము లివ్వి యటంచు నెంచినన్
ననుఁ గృపఁ జూడనట్టులగు నామసవిన్ గ్రహియించి యాజ్ఞనే
సిన శిరసావహింతు నని చేతులు మోడ్చి వచించె భక్తితోన్. 258

మ. ధరణీనాయకుఁ డివ్విధంబున మహాధర్మంబు నర్థించి భ
క్తిరతిం బల్కిన నాలకించి మదిలోఁ గించిత్తు యోజించి మే
ఘరవం బొప్పఁగఁ బల్కె నిట్టులు మహీకాంతోత్తమా! నీవు భా
స్కరవంశాగ్రణి వౌటఁ బల్కఁదగు విఖ్యాతంబు నీవంశమా. 259

చ. కులగతశాస్త్రసంవిదితకోవిదమానిత పద్ధతుల్ సతం
బలయక యాచరింపఁదగు నవ్వియె వంశపరంపరాగతం
బులనుచుఁ బేరు గాంచినవి పో యవియేలని ధిక్కరించువా
రలు కలుషాత్ములం చొగి ధరావలయంబునఁ బేరుగాంత్రు సూ. 260

శా. ఏదేశంబున నెట్టియాచరణమం దేధర్మముల్ గల్గునో
యేదేశంబునఁ బెద్ద లివ్వి తగవీయారీతు లే మేలటం
చాదేశింతురొ యవ్వి చేయఁదగు నాయాచారముల్ మానఁగా
మోదం బబ్బదు దైవ మొప్పదు పరంబుం గల్గ దెల్లించినన్. 261

చ. మనసునఁ దోఁచినట్టులుగ మార్చుచు వానిని జేయుమానుచున్
జనులకుమాత్రమే దెలుపజాలిన క్షుద్రులు వంచకోత్తముల్
కనఁబడుచుందు రట్టిఖలకాండము తెప్పినచొప్పుఁ జేయఁగాఁ
జనునె యిహంబునుం బరముఁ జాలదె వానికి ముప్పుగూర్పఁగన్. 262

ఉ. ఏమిగఁ దోఁచునో మదికి నెవ్విధి దుష్టులు పల్కువారొ తా
నేమి యొనర్పఁగాఁగలఁడొ యింపయి యెయ్యది కాననౌనొ య
ట్లే మఱి చేసినన్ మనుజుఁడే పశుతుల్యుఁ డటంచుఁ జెప్పనా
భూమిపతీంద్ర! శాస్త్రహితముం బొనరింపఁగ మేలు చేకుఱున్ 263

ఉ. ఎన్నియొ పాపజాలముల నెంచక చేసిన చిత్తమందు జ్ఞా
నోన్నతి యెట్లు చొప్పడును; నొప్పని తోఁచిన దెట్టులుర్వి వి
ద్వన్నుతమా; ఖలప్రతతి పల్కిన దెవ్విధి మేలొసంగు; నా
పన్నగశాయి తృప్తిఁ గను పద్ధతి యెట్టులు దానఁ గల్గెడున్. 264

చ. కనుకనె శాస్త్రచోదితముగాఁ దగి సాధుసమాదృతంబునై
తనరెడు ధర్మజాలములఁ దప్పక మానవుఁ డాచరింప నిం

దును బయిన౯ శుభంబుఁగను । దోయజబాంధవవంశవర్ధనా!
ఘనులయి నీదుపూర్వులు స్వకకర్మము లాదృతి నాచరించుటన్. 265

ఉ. భానుఁడు చంద్రతారకలు । పర్వతముల్ ధర యుండుదాఁక స
న్మానవము స్తథార్యమగు । మంజుయశంబు చెలంగుచుండు నీ
పూనిన వేడ్క నాపథమె । యొప్పని పూనితి వింతె చాలు నా
మానస మెంతొ తృప్తిఁగనె । మాట మఱొక్కటి యాలకింపుమా. 266

చ. తనకును జేయశక్యమయి । తా నొగి దాని నొనర్పఁ గీడునుం
గనునని తోఁచిన౯ బలుకఁ । గాదనకే యొనరించువార లు
ర్విని బలుగుండ్రు గల్గుదురు । వింతగ వారలబాస లొప్పు నీ
వునటులె బాస యిచ్చితివె! । బొంకక యింకొకమాఱు చెప్పుమా. 267

చ. పలికెదు కాలమందు నొక।పల్కును బొంకగునట్టు లెవ్విధిం
బలుకని సూనృతవ్రతుని । భవ్యయశస్కుని జక్రవర్తులం
దొలుతటివాని నెమ్మదిని । దోడనె చక్కఁగ సంస్మరించుచుం
బలుకుము ప్రల్లదంబులను । బల్కకుమా కులకీర్తి నెన్నుమా. 268

క. ప్రాచీనంబయి వెలసెడు, నాచారము సార్థకముగ । నలరింపుము భూ
పా! చతురత్వం బయ్యదె, యాచకులను దృప్తిచేయు।నది యయ్యదియే. 269

వ. ఇంత చెప్పనేల యంటివేని 270

క. సంకటములు తోఁచిననె వి,శంకటవృత్తిని జరింత్రు । జనులు గనుక ని
శ్శంకగఁ బల్కుము తప్పిన, నింకం గష్టములు గల్గు । నినకులతిలకా! 271

క. చంద్రమతింగూడి హరి,శ్చంద్రుఁడు కాననములందు । శ్రమఁబడు టరయ౯
సాంద్రానృతభీతికె భూ,పేంద్రా! యోజించి పలుకు । మెది యుక్తంబో. 272

క. సత్యమె సర్వశ్రేయము, నిత్యము పరమేశుమాడ్కి । నెఱిఁ గ్రాలునదే
యత్యయములందు విడువక, కృత్యంబని గొల్వ నొసఁగు। గేవలముక్తిన్ 273

చ. శ్రుతులు పురాణముల్ చదివి । శుభ్రఫలప్రదదేవతావళిం
గ్రతువు లొనర్చి తృప్తిగనఁ।గా నొనరించి విభూతిమీఱఁగా
వ్రతము లొనర్చి దానము ల।వారిగ నిచ్చిన నేఫలంబొ సూ
నృతమునె యాశ్రయించినఁ బ।దింతలు దానికి మించి యబ్బెడున్. 274

క. అని పలికెదు విశ్వామి,త్రుని గని రఘువీరుఁ డనియెఁ । దోయధులెల్లం
జనుఁగాక సీమమీఱుచు, మునివర నే మాటఁదప్పఁ । బూనను జుమ్మా. 275

క. కలిగిన వస్తుప్రతతిని, దలపోయఁగ రాముఁ డధిక।తముఁడని యెన్న౯
వలయు నలరాముతోడుగఁ, బలికినయటు చేయువాఁడ । బ్రహ్మమునీంద్రా!

ఉ. ఇంతకుమించినట్టి పలుఽ కెయ్యది లేదని నిశ్చయించి యా
వంతయు శంకనూనక మహాఽముని! నెమ్మది నేమికోరుదో
యంతయుఁ జెప్పుమా యనిన ఽ రాఘువంశపయోధిచంద్రు సం
క్రాంతమహాదరుం గనుచు ఽ గాధికుమారుఁడు పల్కె నీవిధిన్. 277

చ. జనవర! చాలకాలముగ ఽ సత్క్రతు వొక్కఁ డొనర్పఁ బూన్కినె
మ్మనమునఁ గల్గియుండునది ఽ మానదు సుంతయుఁ గాన దానిఁ జే
యను దొరకొంటి నయ్యది సుఽరావళికిన్ హిత మాచరించుఁ గా
వున నసురేంద్రు లోర్వమిని ఽ బూనినదాని నడంతు రెంతయున్. 278

చ. ఇరువురు దానవుల్ ప్రబలు ఽ రెంతయుఁ గ్రూరమనీషులై బలో
త్కరములఁగూడి శాంబరిని ఽ గైకొని మిన్ను ననుండి రక్తముల్
గురియఁగఁజేసి హవ్యవహాఽకుండము నిండఁగ మాంసరాశిఁ గా
వరమున వైచి రందున సవంబు నొనర్పఁగఁ జాలకుండితిన్. 279

చ. ఒకపరి మాని పూన్కిని ఽ మఱొక్కతఱిన్ జతనంబు దీర్ప నే
నకలుషచిత్తులై తగుమహాఽర్షులఁ గూడి నిరంతరాయమై
సకలవిధప్రయత్నముల ఽ సాగు నటంచును బూనితిన్ విభూ!
యిఁక వచియింప నేమిగల ఽ దెప్పటియట్టులె క్రూరదానవుల్. 280

చ. పటపటఁబండ్లు గీటుచు సెఽబాసుర! యిమ్ముని చేయుఁగాక యు
త్కటవిధి దీన రాక్షసులఽగర్వ మడంచునుగాక! దేవతా
పటలము వేచుగాక మము ఽ బ్రాహ్మణతేజ మజేయమై మహిన్
దిటవుగ నుండుఁగాక యని ఽ తెంపున నవ్వుచుఁ గాఱులాడుచున్. 281

క. దివినుండి రక్తమాంసము, లవిరామముగాఁ బడంగ ఽ ననలుఁడు చల్లా
ర విభూ! యొనరించిరి ద్వా,న వితథయత్నుండనై మఽనం బార్తి గనన్. 282

మ. మరలన్ యత్నముచేసితిన్ నియతిమై ఽ మౌనీంద్రులే సాయమై
పరఁగన్ దోడనె పూర్వరీతి నసురుల్ ఽ ప్రధ్వంసనప్రక్రియా
దరులై రంతట వారి నాపఁదగు భూఽదారేంద్రుఁ డెవ్వండొ యం
చరయన్ బూనితి నాత్మఁ దోఁచుట మహాఽహర్షంబునన్ వచ్చితిన్. 283

చ. కనుక భవత్తనూభవునిఁ ఽ గమ్రగుణాకరు రామభద్రునిం
బనుపుము తత్సహాయమున ఽ వారల నిర్వరఁ జెండి విఘ్నమేఁ
గనక సవం బొనర్తు ననుఽగాధితనూజునిపల్కు లత్తఱిన్
వినఁబడ సొమ్మసిల్లి రఘుఽవీరకులాగ్రణి యూరకుండెఁ దాన్. 284

చ. తెలివి మహాప్రయత్నమున ఽ దేవతలెల్లఁ దలంప వచ్చినన్
బలుకుల వానినిం దలఁచి ఽ పల్కను దోఁపమి నూరకుండి యి

మ్ముల మునిశక్తి నెన్ని నృపముఖ్యుఁడు దైన్యము మోమునందు ని
ట్టలముగఁ దోఁప నెంతయు నడంకువ మీఱఁగ సంభ్రమంబునన్. 285

చ. మునిపతిఁ గాంచి పల్కె నిసుమున్ గణియింపఁగవచ్చుఁగాని నే
నొనరిచినట్టి నోముల మహోన్నతదానములన్ గడింప నె
వ్వనికిఁ దరంబుగాదు; గురువర్యు వసిష్ఠుని బ్రశ్న చేయ నీ
ఘనుఁడె వచించు నన్నిటిని గౌశిక! వానికి సత్ఫలంబుగన్. 286

చ. అఱువదివేలయేండ్లు చన నార్తినిగుందిన నాకుఁ గల్గి రి
త్తఱిని గనంగనౌనె సుతతల్లజులన్ జతనం బిదేల యం
చఱమఱలేక యెల్లజను లాడఁగ నేనొకయిష్టి చేయఁగా
నుఱవగుభాగ్యశేష మన నొప్పిన సూనులు నల్వురో మునీ! 287

క. పసికూనలు వారలు; తాపసవర్యా! పెక్కులేల పలుకఁగ లోకం
బు సరణి నెఱుఁగరు విద్దెల, పసఁదెలియక యాడుచుంద్రు బాలురతోడన్.

క. పదునాఱేండ్లే లేవని, యెదఁ దలఁపుము జ్యేష్ఠసుతున కేమే లోకం
బిదియని మంచియుఁ జెడ్డయు, నిదియని యెఱుఁగఁడు మునీంద్ర యేమందునికన్.

ఉ. చెప్పినకార్య మేదయినఁ జేయుటకైనను జేతఁగాదు మా
యప్పకు రామచంద్రునకు నయ్యది యట్టులె యుండనిమ్ము నా
కిప్పుడు దృష్టిపాటవ మదెంతయుఁ బొంపిరివోయె బుద్ధియుం
దప్పుచునున్న దూహ లొకతావున నిల్వక పాఱెడుం గటా! 290

ఉ. ఇప్పుడు పల్కినట్టి పలుకెయ్యది యో యని యెన్నుకాలమే
యొప్పెడు భావికార్యముల నొయ్యన నెంచెదు చొప్పు లేదు నే
రొప్పదదెట్టికార్యముల నో మునిచంద్ర! తలంపు చిత్తమం
దిప్పటిభంగినిం గనిన నే సుతుఁ బాయఁగఁ జాలువాఁడనే. 291

మ. శరసంధానము బాణమోక్షణము లక్ష్యచ్ఛేదనోల్లాస మ
ట్లరిమాయాగురువాగురావిఘటనవ్యాసక్తి యాత్మావనా
దరముల్ మున్నగు సద్గుణప్రతతి సత్యం బెన్న లేదో మునీ
శ్వర! మారామునిసాయ మేల మదిలో వాంఛించితో యివ్విధిన్. 292

చ. పలుకులు వేయునేల? తొలిపట్టియె ప్రాణములన్న నాకు నో
యలఘుకృపాకరా! వినుము యాతనివీడి క్షణంబు నిల్వలే
నల రఘురాముఁ గోరక మహత్తరవస్తువు దేనిఁ గోరినన్
బలుకక యొక్కపల్కును జవంబున నిచ్చెద నాదుపల్కుపై
నలుక వహింపఁబోనకు జనాతురుఁడన్ గద! తాల్మిఁ బూనవే. 293

క. వినర మునిచంద్రా! నా, సూనుని మాటయిపు డేలఁ శూరత్వమునన్
నీనియతిఁ జెఱుపఁ బూనిన, దానవు లెవ్వారొ తెల్పఁదగు నది వినినన్. 294

క. నాచే నైనసహాయము, నే చేయఁగఁ బూనువాఁడ నెఱిఁగింపు మిఁకన్
నీచేయు నధ్వరంబున, కే చేటుం గూర్ప నేల యెంతయుఁ బూన్కిన్. 295

చ. అని వినయంబునం బలుకు నాతని వాక్కుల నాలకించి యి
ట్లనియెను గాధినందనుఁ డవార్యబలుండనఁ గీర్తికెక్కు నా
దనుజుని రావణాహ్వయు నితాంతదురాత్మకు వింటివే కదా
మనుజపతీంద్ర! యామనుజమర్దనుచుట్టము లెన్ని చూడఁగన్. 296

ఉ. రావణుఁడే తనంతన పరాక్రమ మొప్పఁగ వచ్చి యధ్వరం
బెవిధిఁ గూల్పఁబాడగునొ యేచినపూనిక నట్లు చేయఁ డో
భూవర! వానిపన్పనని భూరిభయంకరరూపులైన ర
క్షోవరు లిద్ద ఱొక్కమొగి శూరనిశాచరవారసంయుతిన్. 297

మ. క్రతు వేనాఁ డొనరింపఁబూనుదునొ లగ్నంబేది యద్దాని కు
న్నతిమీఱం దగియుండునో యెఱిఁగి లగ్నంబింతయే మీఱ క
ప్రతిమాటోపము పూన్కియుం దనర నభ్రచ్ఛన్నరూపంబులన్
జతనంబొప్పఁగ రక్తమాంసముల యజ్ఞంబెల్లఁ బాడొనటుల్. 298

క. ఒనరింతు రెల్లెఱుంగుదు, రనఁబోకుము మాయ పేర్మి నసురు లెఱుంగం
జనదట్టివేవి యుండవు, వినుమా యవ్వారిచరితఁ బృథ్వీనాథా! 299

సీ. మారీచుఁడనువాఁడు మఱి సుబాహుండను,వాఁడు నీయిర్వురె వారిలోన
నగ్రగణ్యులు గాన నాయిద్దఱిం జెండఁ,గా నోపు నీరఘుకాంతుఁ డనుచు
వచ్చితినన విని వసుధేశ్వరుం డల్లి, మాటలాడక సుంత మ్రాన్పడినటు
లుండి యించుక తెల్వినొంది యివ్విధిఁ బల్కె, సుందోపసుందులన్ శూరదనుజ
తే. వరుల తనయులుగారె మీపల్కినట్టి, వారు? పేరులువినినంత భయముమదిని
గదిరెడున్ మార్కొనంగ నెక్కరణిఁజాలు,వాఁడనవ్వారిఁ జెండాడు వాఁడెసు

శా. అయ్యో! వారలతోడ యుద్ధమును జేయన్ బంపుమన్నంత నో [తుఁడు.
యయ్యా! ప్రాణములేగఁ జూచెడిని బ్రాణాళిన్ దగన్ మించు నా
యొయ్యారంబులయిక్క రాఘవుని నోహూ! గాధిజుంగూడి పో
వయ్యా! రక్కసు లున్న హారఁట యటం చాడంగఁ జాలంజుమీ. 301

క. ఏమన్న ననుము శీర్షం, బోమౌనీ! వంచువాఁడ నొగి నీకడ కీ
రాముని బంపంజాలను, భూమిని నయశంబు గలుగఁ బొగులంజుమ్మీ. 302

ఉ. వైరులు బక్కరక్కసులు వారల మార్కొని నేనె పోరి దు
ర్వారయశంబు గాంతు ననువాంఛ చెలంగెను దొల్తఁ; గాని య

వ్యారలనామముల్ వినినఁ । బాఱెను దూరముగాఁగ నద్దియేఁ
బోరఁగఁజాల నాకొడుకుఁ । బుచ్చఁగఁజాల నిజంబు మౌనిపా! 303

చ. అనృతము వల్క భీతిఁగన । కాడెదవే బదులంచుఁ బల్కె దో
మునివర! సంకటం బొలయ । బొంకఁగవచ్చు నటంచుఁ బల్కె న
మ్మనువె, పఠించినాఁడ మును । మౌనులయొద్దనె యామనుస్మృతిన్
గనుక మహాపదల్ గలుగఁగా నిపు డాడితి నన్ను సైపుమా. 304

మ. పరమేశుం డిడెఁ దొల్తఁ బుత్రులను ప్రాగ్భాగ్యంబునం జేసి యు
త్తరుణంబందున నీవొసంగు సుతబృందంబుల్ గృపాసాగరా!
మరణం బెన్నఁడువచ్చునో యనుచు నాత్మన్ భీతి లెక్కింతునీ
జరునిన్ జ్ఞానవిహీను మన్ననలఁ గాంక్షన్ గావుమా గాధిజా! 305

చ. అసురులమాట నాత్మ నిసుమంత దలంచినఁ బోవునేమొ నా
యసువులటంచుఁ దోఁచెడి గురూత్తమ! నాపయిఁ గల్గునెమ్మిమై
వెసఁ జని వారిఁ జంపఁదగు । వీరుని నొక్కరు నెన్నికొమ్ము నా
దుసుతుని బంపఁజాలఁ గడుధూర్తుల నోర్వఁగఁజాలఁ డాతఁడున్. 306

మ. అని యిట్లోపికఁ బల్కునాదశరథాఖ్యక్ష్మాపతిం గాంచి యిం
తనివర్ణింపఁగరాని క్రోధమున దేహంబెల్లఁ గంపింప నొ
య్యన నోష్ఠద్వయముల్ వడంక క్షణ మత్యాశ్చర్యమగ్నాత్ములై
జనులెల్లం దనుఁ జూడ భ్రాన్పడినయాచందంబు గన్పట్టఁగన్. 307

తే. ఎట్టులో జతనంబున । నట్టెలేచి, మాట తడఁబడుచుండంగ । మౌని పలికె
దశరథక్ష్మాపతీంద్ర సత్యవ్రతా మహాత్మ! యిదె పోయివచ్చెద । ననుమతిమ్ము.

వసిష్ఠుఁడు దశరథునకు శ్రీరాముని మహిమ తెలుపుట.

చ. తనయులఁగూడి సంతస ముదారముగాఁ బొలయంగ హాయినిం
గనుచుఁ జెలంగుమా యనుచుఁ । గ్రమ్మఱు వేళ గతాగతంబులన్
మనమునఁ జక్కఁగాఁ దెలియుమాన్యుఁడు జ్ఞానివరుండు శాంతమే
ధనముగఁ గల్గుమౌనిపతి । తత్త్వవిదుండు వశిష్ఠుఁ డాదృతిన్. 309

చ. సమయ మదుత్తమం బనుచు । స్వాంతమునం దలపోసి గాధికిం
గొమరుఁడు లోకపూజితుఁ డకుంఠితశక్తిధనుండునై ప్రపం
చమునకు మేలుచేయుటకు । జన్మముఁ గాంచినబ్రహ్మమౌని కో
పమునకుఁ గారణం బెఱిఁగి । పంతము మానెడుపల్కు లొప్పఁగన్. 310

మ. పలికెన్ మౌనివరేణ్య! యాగ్రహము మాన్పం బూనుమా నానుడుల్
తలపోయం జను మాధరాధిపతి సత్యం బింతయేఁ దప్పకే
యిలఁ బాలించెడుమేటి వార్ధకముచే । నీపాటియూహల్ మనం
బులఁ జేయండని యెన్నుమా మఱియు రాముం బుత్త్రుఁగా నెన్నుచున్. 311

ఉ. చెప్పినమాటలన్ మఱచె ౹ శ్రీపతియంచుఁ గుమారు నెన్నకే
యిప్పగిదిన్ వచించె నయ౹హీనుఁ డటంచుఁ దలంపఁబోకు నే
నొప్పుగ బోధచేయుదు గు౹ణోత్తర రాము నెఱుంగునట్లు త
ప్పొప్పుల మిమ్ముఁబోలు మును౹లోర్తురుగాదె రవంత తప్పినన్. 312

చ. అని మునివర్యుఁ డూఱడిలు౹నట్టులుగా నొనరించి రాజచం
ద్రునిఁ గని శాంతవాక్యముల సు౹తున్ భగవంతునిగా నెఱుంగుచొ
ప్పున వచియింపఁ బూనె; నృప౹పుంగవ! వచ్చినవాఁడు గాధినం
దనుఁడని యెన్నకే పలుక౹ ధర్మమె నీతిపథంబె యిద్దియున్. 313

మ. వినుమా రాముఁడు సాధురక్షకుఁడు దు౹ర్వృత్తావళిం జంపఁగా
మనుజత్వంబును దాల్చినాఁ డజరుఁడౌ౹మానాథుఁడౌ నిర్గుణుం
డని బ్రహ్మంబని నిర్వికారుఁడని బ్ర౹హ్మాండేశ్వరుండౌ నిరం
జనుఁ డంచున్ సనకాదు లెన్నుదురు సూ౹జ్ఞానైకసంధానతన్. 314

చ. ఒకపరి సృష్టిచేసి జగ౹మొప్పుగ వెల్గఁగఁజేయుచుండు నిం
కొకతఱి దానిఁ బెంచుటకు౹నూహయొనర్చుచునుండు శక్తిచే
నొకతఱి దానిఁ ద్రుంచుటకె౹యుద్ధతిఁబూనును వీనిపొంటె బ్ర
హ్మ కమలనాభుఁ డీశుఁడను౹నాఖ్యలఁ దాల్చును వేడ్కమీఱఁగన్. 315

చ. జగముల నాత్మకుక్షితల౹సంగతిఁ గాంచఁగఁజేసి క్షీరవా
ర్ధిగతవటాఖ్య భూమిరుహ౹దివ్యపలాశతలంబె మంచిశ
య్యగ నిజయోగనిద్రఁ గొని౹యట్టి పరుండును బ్రహ్మమన్న యా
ఖ్యగలుగు నప్పుడే ప్రకృతి౹యాతనియందె యడంగి యుండెడున్. 316

ఉ. అత్తఱి నిర్వికారుఁ డగు౹నంచు నిరంజనుఁ డద్వితీయుఁ డం
చుత్తమరూపుఁడంచు శ్రుతు౹లొప్పుగ సన్నుతిచేయుచుండు రా
జోత్తమ! యాపరాత్పరుఁడె౹యుర్విని ధర్మము గావఁబూని యి
ట్లిత్తఱి నీకుమారుఁ డని౹యెల్లజనుల్ తలపోయఁ బుట్టెఁగా. 317

ఉ. మానవమాత్రుఁగాఁ దలఁచి౹మామకసూనుఁ డితండటంచు భూ
జానివరా! ప్రియం బెసఁగఁ౹జయ్యన రార! కుమార! రాఘవా!
మౌనులు వచ్చినారు బహు౹మానముమీఱఁగ మ్రొక్కుమంచు న
జ్ఞానముమించఁ బల్కెదవు౹చక్రి యితండని యెన్న వెప్పుడున్. 318

చ. తెలియఁ దరంబె యీవిభుని౹తీరిదియంచు సురాళికిన్ మునీం
ద్రులు మొదలైనవారలకు౹రుద్రవిరించులు గూడఁ జక్కఁగాఁ
దెలియఁగలేరనంగ నిఁకఁ౹దెల్పెడి దేమి మనుష్యసంఘముల్
నిలుకడమీఁద నించుకగ౹నీవె యెఱుంగుదు వీపరాత్పరున్. 319

చ. ప్రకృతి కతీతుఁడై పరమభాస్వరతేజమె రూపమై తగన్
సకలము దానయై తెలుపఁజాలక వేదము లూరకుండ నిం
చుక సనకాదులున్ దెలియుచొప్పు నటింపఁగ జ్ఞానమూర్తియై
ప్రకటగుణాభిరాముఁడయి భాసిలుఁజుమ్ము మహీధవేశ్వరా! 320

చ. కలఁడనవచ్చు లేఁడనుచు గట్టిగఁ జెప్పఁగవచ్చు నేమియో
తెలియ దనంగవచ్చు నెటు తెల్పనుగూడ నెసంగుచర్యలన్
వెలయునితండు శాశ్వతుఁడు విష్ణుఁడు సర్వము దానయై సదా
చెలఁగుచునుండుఁ గారణము చెప్పఁగఁజాలరు యోగివర్యులున్. 321

చ. సుతుఁడను భ్రాంతిఁ బోవిడువు క్షోణిపతీంద్ర! పరాత్పరుండు న
చ్యుతుఁడు ననంతుఁడున్ విమలయోగిమనోజలజాంతరస్థుఁడున్
సతతము ధర్మరక్షకుఁడు చక్రియు నంచుఁ దలంపు మాత్మలో
నితఁ డెఱుఁగంగ నోపని పనివెట్లలరారును విద్య లెచ్చటన్. 322

ఆ. విశ్వరూపుఁ డగుట వేదాదు లీతని, వలనఁ గలిగెఁగాని తెలియవితని
కేవిశేషముండు నెంచుమా మదిసుంత, పనుపు లోకభారమును హరింప. 323

ఉ. ఈమహనీయునిచ్ఛయె పరేశ్వరి నాఁదగి యీమునీంద్రు ను
ద్దామతపోవిశేషుఁ బరితస్సమలంకృతదివ్యతేజు నేఁ
డీమెయిఁ బ్రోత్సహింప వడి నీతఁడు వచ్చెను నిన్నుఁ జూడఁగా
దే మహిమాఢ్యుఁడో నితనికెన్న సురాపులమాట లెక్కయే. 324

ఉ. కాలము ప్రాప్తమయ్యె సురకాంతులకష్టపరంపరన్ వడిం
దోలఁగ నీకుమారకుని తోరపుఁగీర్తి జగంబు నిండు న
ట్లోలి నొనర్పఁ గావున మఱొండు విచారము నెమ్మనంబునం
గీలుప కింకనైన మునికీర్తితవిక్రము రాము నంపుమా. 325

శా. ఏయేవేళల నెవ్వరెవ్వరి నదేయేకార్యముల్ చక్కఁగాఁ
జేయంగా నియమించునో ప్రకృతి యాచిత్రం బెఱుంగందరం
బె యాదిత్యమునీంద్రకోటికిని క్షోణీశేంద్ర! యుద్వాహముల్
జేయంబూని తలంచునిన్ను నిటు పంచెన్ రాముని బంపఁగన్. 326

శా. కానన్ రాముని మౌనివెంటఁ బనుపంగా నొప్పు; మార్పల్క నె
ట్లో; నింకేల విచార; ముత్సవముగా నాత్మం దలంపందగున్
మౌనిన్ వేఁడుము కోపమున్ వదల నోక్ష్మాపాల! సంతోషమే
యౌ నిక్కార్యము చేయ మీఁద ననుచున్ హర్షంబునం బల్కఁగన్. 327

తే. ఆవసిష్ఠునిమాటల నాలకించి, భక్తిఁ గౌశికుఁ బ్రార్థించి బాలు గూఢ
శీలు సద్గుణజాలు విచిత్రకార్య,సాధనాలోలు మౌనీంద్రసంఘపాలు. 328

క. పిలువఁగఁ బంచి వత్సా!, ఖలు లగుదనుజాళి నోర్వఁ గ్రతువును గావన్
బిలువన్ వచ్చెను నిను ముని, కులతిలకుఁడు గాధిసుతుఁడు కోరికమీఱన్.

చ. మునిపతి యావసిష్ఠుఁడు ప్రమోదముమీఱఁగ సమ్మతింపఁ బం
చెను సచివాదు లుత్సుకతఁ జెందినయట్టులె యున్నవారు నా
మనమునఁగల్గు సంశయము మానె శుభంబులు నీకుఁ గల్గునం
చని మదిఁ దోఁచె నన్నిట శుభావహచిహ్నములే కనంబడెన్. 330

చ. సురరిపు లధ్వరంబు చెడుచొప్పు నొనర్పఁగఁ బూన వారిభీ
కరశరజాలముల్ బఱపి కాలునిప్రోలికిఁ బంపఁజాలు దీ
వరయఁగనంచు గాధిసుతుఁ డక్కఱమీఱఁగ వచ్చెఁ గాన నీ
వరిగి భయంకరాసురుల నాహవమందునఁ గూల్పు మెల్పునన్. 331

ఉ. ఎట్టిప్రమాదముం గనక యేర్తెఱ వారల గెల్చి యధ్వరం
బట్టె సమాప్తినొందునటులే యొనరించి జగద్ధితార్థివై
కట్టడికార్యమైన వడిగా నొనరించెను రాముఁ డన్న పే
రిట్టిమహాత్మ్యమాలమున నెల్ల రెఱుంగఁగఁ గాంచి మించుచున్. 332

క. మంగళములఁ గాంచుచు నా, చెంగటికిన్ రమ్ము నీకు శ్రీపతి తోడై
యంగద గూర్పక కాచు న,భంగప్రమదంబుఁ గాంచి వైళమ రమ్మా. 333

క. విజయశ్రీసహితుఁడవై, ప్రజ నిన్నున్ మెచ్చిచూడ బాంధవు లలరా
ర జగత్కల్యాణముఁ గూ,ర్చి జవంబున రమ్ము పొమ్ము సిద్ధము జయమౌ 334

చ. అని మఱియుం గుమారునకు నాహవపద్ధతు లెల్లఁ దెల్పి పం
పిన మునివెంట రాఘవుఁడు పిన్నసహోదరుఁడైన లక్ష్మణుం
డును జని రారఘూత్తము సమానవిధిం గొలువంగఁ బుట్టిన
ట్టి నయవిశారదుండయి కడింది మగంటిమిఁ గీర్తితుండునై. 335

శ్రీరాముఁడు లక్ష్మణసహితుఁడై మునివెంట నరుగుట.

క. సుగుణంబుల ప్రోవగు నా, ఖగవాహనుశయ్య యగుచుఁ గ్రాలుసఖుఁడునై
పొగడొందు సుమిత్రాసుతుఁ, డగణితమహిమాఢ్యుఁ డైనయన్న పిఱుందన్.

క. చనియెను వారలఁ గని సుర,మును లామోదంబు నొంది పుట్టుకకు ఫలం
బును జూపఁ జనుట కిదె మొద, లని యెంచిరి గాధితనయుఁ డాదృతిమీఱన్.

మ. ప్రతిపక్షప్రకటప్రతాపగహనప్రధ్వంసనాత్యుగ్రదీ
ధితిమద్ధవ్యవహుల్ రఘూద్వహులు చింతింపంగ నివ్వారిచే
క్షితిభారంబు తలంగఁ జేయనగు నీసిద్ధాత్మకుల్ నాపురా
కృతసత్కర్మఫలంబుగా దొరకి రింతే చాలదే భాగ్యమున్. 338

చ. అని మది నెంచి మార్గమున నప్పుడు తోఁచినవార్తలెల్ల రా
మున కెఱిఁగించుచున్ నిగమమూర్తులు వారలటంచు నెన్నుచున్

ముని సరయూయమాశఁ గల౹పూతమహీస్థలి నిల్చి నీరముం
గొను మిఁక రామభద్ర యని౹కోరికఁ బల్కిన రామమూర్తియున్ 339

చ జలముల సంగ్రహించి ముని౹సత్తము చెంగట నిల్వఁగా బలా
బల లను విద్యలం దెలిపి౹వానిఫలంబును జెప్పఁబూని వి
ద్యలివియు నేశ్రమంబయిన౹నంటక యుండఁగఁజేయు దేహ ము
జ్జ్వలముగ నుండఁజేయు నొక౹భంగియు మార్పడఁజేయకుండెడున్. 340

తే. ఎట్టియిక్కట్టులందైన౹నేసు రారి, గ్రైన నిను నొంపఁజాలక౹యవలఁ బోవుఁ
గావునన్ వీనిజపియింపుఁ క్ష్మాపతీంద్ర,తనయ!యీమంత్రములశక్తి౹వినుముసుంత

సీ. నియతిమై జపియింప౹నిన్నుమించెడువాఁడు,ముజ్జగంబుల నుండఁ౹బోఁడుసుమ్ము
సద్గుణంబులనెల్ల౹సమకూర్చు నివి మఱి, యఖిలార్థలాభంబు౹నందఁజేయు
మననమాత్రమ్మునఁ౹దనభక్తుఁ గాపాడుఁ, గావున మంత్ర మన్౹ఖ్యాతి గల్గె
క్షుత్పిపాస లుపాసకున కుండకుండఁగఁ, జేయు నీమంత్రముల్౹సిద్ధ మిద్ది
తే. బ్రహ్మ నిర్మించె వీనిఁ బ్ర౹భావ మొప్పఁ, దగినపాత్రమ వీవౌటఁ౹ద్వర నొసంగఁ
దగును బాత్రుండు గానిచోఁ౹దగ దొసంగ, నిచ్చినన్ ఫలముండదె౹ల్లన్నికనిన.

క. తనుఁ బ్రార్థింపక యున్నను, మనుజుఁడు పాత్రుండటంచు౹మదిఁదోఁచిన నా
తనిఁ బిల్చి చెప్పఁగాఁ దగు, ననుమానము లేక సుజను౹ఁడగు గురు వెలమిన్.

చ. ధనమును గోరియేని ప్రమాదంబుననేని యపాత్రుఁడైన య
మ్మనుజున కిట్టివౌమహిత౹మంత్రముల౯ వచియింప యోగినుల్
మనమునఁ గ్రోధమూనుదురు౹మంత్రము దాన ఫలింపకుండుఁ గా
వున నుపదేశ మిచ్చుతఱిఁ౹బూజ్యమతిం బరికించి యీఁదగున్. 344

సీ మంత్రంబులొగిఁజెప్పి౹మరియాదఁగనఁజూచు,పాపాత్ముఁడొందుదు౹ర్భరనిరయము
శిష్యుల వంచించి౹చేరంగఁదీయుచు, లాభంబు నెదఁ గోరి౹లాలనములఁ
దన్పి మంత్రంబులఁ౹దాఁ జెప్ప నెవ్వఁడు, వానివంశంబును౹వసుధ నిల్వ
కుండఁజేయుఁ బరాంబ౹యురుపరీక్షలఁజేసి, నిర్మలాత్ముండని౹నిశ్చయించి
తే. మంత్రముపదేశ మిచ్చిన౹మానవుండు,నిహపరంబులసుఖమొంది౹యెలమి గనుచు
భగవదురుతరకరుణకుఁ౹బాత్రుఁడౌను, ధనము గోరంగరాదు మం౹త్రప్రదాత.

క. కాసంతయేని శిష్యుని, మోసము నొందంగఁబల్కి౹బుద్ధివిభవతన్
వేసారి ధనము గొనునా, భూసురునకు సుగతి కల్గఁ౹బోలునె యెపుడున్. 346

చ. ధనము నొసంగి మంత్రసము౹దాయము నేర్చినవాని కించుకై
న సవియు సత్ఫలం బిడక౹నాశము నొందఁగఁజేయు; మంత్రముల్
గొనెడునతండు నిచ్చుటకుఁ౹గొంకనియాతఁడుఁ బావనాత్ములై
ఘనతమదైవభక్తి చెలఁగ౹గన్ విలసిల్లిన మేలు గల్గెడున్. 347

సీ. ఆచారహీనున కబ్బవు మంత్రమ్ము, లబ్బిన సత్ఫలం బందనీయ
వాత్మఘాతముకో యకట్టిదుర్నీతిని, మంత్రముల్ గ్రహియించు మనుజుఁడొనరఁ
దానె యత్నము చేయఁదగదు బెబ్బులితోడఁ, జెలిమి యొనర్చినఁ జేయవచ్చుఁ
గాని మంత్రమ్ములతో నెట్టులైనను, బోరాడఁగా రాదు భూపతీంద్ర!
తే. యవియదృశ్యరూపములయ్యు నాత్మపాశ,ములనుదగిలించిదుర్మనుజులఁగలంచు
దుదకు నంతము నొందించు మది నెఱింగి, ధర్మముల నవ్వలం గొనఁదగును వాని.

క. గురువనఁగ సాధుతరమై, పరఁగెడు నాచారమందుఁ బరమాదృతినె
త్తరుణమునఁ గనుచుఁ గరుణా,పరతంత్రుం డగుచు శిష్యపటలహితుండై. 349

చ. ధనమున వాంఛఁబూనక నితాంతము ఛాత్రుల నుద్ధరించు కాం
క్షనె మదిఁ బూనియుండఁదగుఁ గానియెడన్ దురితంబు నొందు నా
తనికడ మంత్రముల్ గొనఁగఁ దప్పదు కీడు రఘూద్వహా! మనం
బున నిటు మంత్రధర్మములఁ బోల నెఱింగి జపింపు మాదృతిన్. 350

క. అని బోధించిన రాఘవుఁ, డనూనభక్తిన్ మునీంద్రు నానతి నక్లే
మనమున జపించె నాఁకలి,యును దప్పియుఁ దొలఁగిపోయె నొయ్యన నపుడే.

క. ఆరాత్రి యానదీతట, భూరుహములనీడఁ గడపి ముని బోధింపన్
శ్రీరమణుని స్మరియించుచు, నారమ్యతటంబు విడిచి యనుజయుతుండై. 352

మ. మునియున్ ముందుగఁ బోవుచుండ సహజన్ముల్ వెంటనే పోవుచున్
ఘనగాథల్ వచియింపఁగా వినుచు నుత్కంఠంబునన్ సారముం
గొనుచుం జేయఁగఁబూనినట్టికృతి యొప్పొల్కన్ సమాప్తింగనున్
ముని యేరీతిని మోదమందు ననుచున్ బుద్ధిన్ సదా యెంచుచున్. 353

ఉ. తమ్మునిఁ గూడి పోయి యొకదారుణకానన మీక్షణంబులన్
జిమ్మని-చీకటుల్ గలుఁగఁ జేయుచుఁ దోఁచిన నద్దియేమి ఘో
రమ్ముగఁ గన్పడున్ భయ మరాతిసమూహమునుండి గల్గిన
ట్లుమ్మలికంబు గల్గె మది నోమునిచంద్ర! యెఱుంగఁ జెప్పుమా. 354

శ్రీరాముఁడు తాటకను వధించుట.

క. అన విని విశ్వామిత్రుం, డనఘా! వినవయ్య తాటకాఖ్యదనుజకా
మినియొర్త గల దరణ్యా,ని నిటన్ దేవతలఁగూడ నిర్జించుఁజుమీ. 355

శా. ఘోరాకారముఁ బ్రాణిహింస సతమున్ గోరంగ నౌ చిత్తమున్
గారుణ్యం బనలేని శీలము మహాఘవ్యూహముల్ గల్గు కా
ర్యారంభంబు మనుష్యమాంసముల నిత్యంబుం దినం గోర్కి దు
ర్వారస్ఫారపరాక్రమంబు సహజవ్యాపారముల్ గాఁ దగున్. 356

తే. పేరు విన్నంతనే సురల్ § భీతినొంది, పాఱిపోవంగ మౌనులఁ § బాఱఁదోలు
వాంఛ యలరారఁ దాటక § బాణకుంత,శక్తిముఖసాధనముల నా§సక్తిఁ బూని.

చ. తిరుగుచునుండు నీయడవి § తేఱి కనుంగొన లేవు దేవతో
త్కరములు రామభద్ర! ముని§కాంతులు దీనికి నోడి దూరమౌ
ధరణికిఁ బోయియున్ మదులఁ § దాటక తోఁచిన భీతిచెందుచుం
దురు మనుజప్రచార మిటఁ § దోఁపదు చూడు మిదెట్టు లున్నదో. 358

చ. శ్రుతులు తదుక్తకర్మములు § క్షోణి నడంగఁగఁ జేయునట్టి దు
ర్మతులను హింసచేయఁగను § రా దఘమంచు వచించు శాస్త్రముల్
వితతపురాణముల్ కరుణ § వీడి వడిం జనుదెంచుతాటకన్
మృతిఁగనఁ జేయుమా తడయ § నేచును నన్నును నిన్ను నీతనిన్. 359

క. తొలికబళంబె నగుదును, వెలఁదిని వధియింపఁ బోలయు § వితతాఘము లె
ట్టులు చంపుదుఁ దాటక నని, జలజాక్షా! తలఁతువేమొ § చన దటు లెన్నన్.

సీ. ధర్మముల్ నాల్గుపద్ధతులుగఁ దనరారు, బ్రాహ్మణధర్మముల్ § వైశ్యశూద్ర
ధర్మముల్ క్షత్రియ§తల్లజులకు నొక్క,తఱిఁ జెల్లవంచు ను§త్తములు పలికి
రందు రాజేంద్రుఁడ § వగునీవు దుష్టశిక్షణమును శిష్టర§క్షణము చేయ
నవతరించినవాఁడ§వౌట స్త్రీహత్యను, గలపాపమును మది § గణనచేయ
తే. కీడురాత్మకురాలిని § హితమె యనుచు, వేగ మ్రంకింపుమాయ దో§విపులధూళి
రొగయుచున్నదివచ్చెడు§నిదెయటంచుఁ, దెలుపునాచిహ్నమే శర§ములనుధనువు.

చ. దుర మొనరింపఁ దాల్పుము వి§ధూతసమాశ్రితతాప! భూప! సో
దరుఁడు పిఱుంద నుండఁదగు § దారుణరూపము గాంచి భీతి నా
తురుఁడగునేమొ యంచు ముని§ధూర్జటి పల్కనఁ దాటకాఖ్య యె
వ్వరిసుత భర్త యెవ్వఁడిటు § బాహుబలం బెటు లబ్బె దానికిన్. 362

తే. తెలుపుమా వినువేడుక§గలిగె ననిన, మునివరుం డిట్లుపల్కె రా§మునియుదార
భావ మూహించివరమున§వఱలె వేయి,మదగజంబులబలము రామ§గుణధామ!

క. యక్షుండొకఁడు సుకేతుం, డక్షయబలశాలి గుణగ§ణాఢ్యుఁడు గలఁ డా
యక్షుఁడు సంతానార్థము, రూక్షతపం బూని వేద§రూపుని ధాతన్. 364

క. అలరించిన సుత నిచ్చెను, జలజాసనుఁ డధికబలవి§శాలన్ ఘనదోః
ఫలభూతయుద్ధశీలన్, ఖలదేవవిరోధివీర§గణసంపాలన్. 365

తే. అదియెతాటకసుందుని§యనుఁగుఁబత్ని, యయ్యె మారీచుఁడను వాని§నాత్మభవునిఁ
గాంచెనాసుందుని దురాత్ముఁ§గనలిచంపె, నాయగస్త్యమునీంద్రుఁడ§హార్యశక్తి.

చ. పతిమృతిఁ గాంచి తాటకయుఁ § బాపమనీషుని బుత్త్రుఁగూడి సా
ధుతపసి మ్రింగఁబాఱఁ గని § ధూర్త! నిశాచరతం జెలంగుమా

క్షితి నిఁక నంచు శాపమిడి చిత్తజుబాణ మనంగనొప్పు నా
యతివను జూచి దివ్యమగునందము వీడి కురూప మొప్పఁగన్ 367

చ. మనుజుల నెప్పుడున్ దినుచు క్ష్మాస్థలి నుండు మటంచు శాప మి
చ్చెను; ముని యీవనంబున వసించుట దీనిని బాధుచేయువాం
ఛను గని యిందు సంతతము సాధ్వసరూపముతోఁ జరించు నా
వనితను దేవమానులకు భద్రముగోరి వధింపు రాఘవా! 368

చ. నరపతి ధర్మరక్షకయి నాలుగుజాతులవారియందు నె
వ్వరు వరధర్మహానికయి వర్తిలుచుందురొ వారిఁ జంపి స
త్పరినుతకీర్తిఁ గాంచు నిదె పద్ధతి కావున స్త్రీయటంచుఁ బా
మరుఁడు తలంచుభంగి ననుమానము నూనక చంపుమా ధృతిన్. 369

తే. ధర్మహాని నొనర్చునిర్దయు దురాత్మ, నని వధించినఁ బాపంబు నందదండ్రు
వనిత యని జంక నేల దేవతలకార్తిఁ,గూర్చునది కానఁజంపుమా క్రూరహరణ!

క. జనసామాన్యాచారము, జనార్దనున కెన్న లేదు సర్వము నీకే
మనమునఁ దోఁచు నొకప్పుడు, జనియిది యది తోఁపఁ జేయఁజాలదుసుమ్మీ.

క. పరమాత్మా! శ్రీరామా, కరుణాసాగరుఁడ వీవు ఖలహారణమునన్
ధర ధర్మము నిలుపంగా, నరరూపత వెలసియుంట నారి వధింపన్. 372

క. కలుగదు పాపము; శుచియం, దొలయు నెచెద లెన్నఁబూరుషోత్తమ! యనుచుం
బలికెడుతటిఁ గురియించిరి, చెలఁగుచుఁదమిఁబుష్పవృష్టి శీఘ్రమె యమరుల్.

ఉ. ఆసమయంబునన్ రఘుకులాగ్రణి మౌనివరేణ్యునానతిన్
భాసురచాపదండమున బాణముఁ గూర్పఁగ నెంచి లోన ను
ల్లాసము మించ జ్యాలతఁ జెలంగెడు వేడుక మ్రోగఁజేయ నా
యాసురిగుండె లల్లె యవియంగ నెసంగె రవంబు ఘోరమై. 374

ఉ. ఆరవ మెల్లదిక్కుల మహాత్తరభీతిని గల్గఁజేయుగం
భీరమునౌ బ్రతిధ్వనిని విశ్వము నిండఁగఁ బర్వఁగా మహా
భూరుహసన్నిధిం జెలఁగి భూతభయావహశీలయైనయా
క్రూరనిశాచరాంగనయుఁ గోయని యార్పుచుఁ గ్రీడ సల్పుచున్. 375

క. ఆకస్మికముగఁ బర్విన, భీకరనినదంబు విని గుబేలున దిక్కుల్
వేకనుచు రవముపుట్టిన, యాకడకుం బాఱుతెంచె నోడు కఱచుచున్. 376

సీ. ఇందీవరంబుల నీసడించెడుమనో,హరనయనంబుల నలరువాని
మంగళదేవతామహితనివాసమౌ, వెడఁదయురంబున వెలయువాని
గనకమహీధరజనిత కోమలలక్ష్మ, నవ్యబాహుయుగంబువాని
సురుచిరకాంతిసంశోభితాంబుజముల, మించు దివ్యాంఘ్రుల మెఱయువాని

తే. కోటిమన్మథులను లెక్కగొనని సుంద, రాకృతిం దగువాని మహానుభావు
దివ్యగుణజాలు వందితదేవపాలు, రాము నభిరాము దైత్యవిరాముఁ గనిరి.

ఉ. మానివరేణ్యశాపము సమాప్తిని బొందెడుకాలమాట నా
దానవి హుంకరించి భయదంబగుపద్ధతి మ్రింగఁబోట నో
హో! నిముసంబులో నడఁపకున్న మహాపద వచ్చునంచు భూ
జానిని హెచ్చరించె మునిశక్రుఁడు లోకహితార్థి గావునన్. 378

ఉ. అత్తఱి రామచంద్రుఁడు నిజాత్మను దానవిశాపముక్తి కా
యత్తపడం దలంచుట సమంచిత మంచుఁ దలంచి వింతద
ళ్కొత్తు మొగంబుతోడ నసితోత్పలనేత్రయుగంబుతోడ నా
బిత్తఱి యార్తిఁ బాపఁదగువేడుకతోడఁ జెలంగుచుం గడున్. 379

ఉ. కాలము సుంత లేదు ఘనకాయము మోయఁగ లేదు గాన నిం
కేలొకొ యాలసించుటని యెంచి మహత్తరబాణ మొక్కఁ డా
భీలగతిన్ దదంగము ద్రవింపఁగఁ జేయఁగఁజాలునం చెదన్
జాలిని బోవఁదోలి రఘుసత్తముఁ డార్చుచుఁ గూర్చి వైచినన్. 380

మ. ఇదె నీఘోరతరాఘకర్దమము నెంతేఁ బూన్కి నింకింప వ
చ్చెద ఘోరానలరూప మూని యనుచుం జెప్పంగ నుంకించు న
ట్లుదయంబొంది శరాసనంబు విడి యెంతో వేగమే పోయి త
ద్ధృదయం బట్టె పగిల్చి వీఁపువను బోయెన్ బాణ మత్యుగ్రతన్. 381

చ. శరము చనంగ దేహమును జయ్యనఁ బాసి విచిత్రతేజ మెం
తొ రయమమీఱఁగా రఘుకులోత్తమునందుఁ జొంగఁబాఱె నం
బరమున నున్నసిద్ధమునివర్యులు చూచి యయారె! పుణ్య మీ
సురరిపుకాంతదే యగును జొచ్చెను శ్రీహరిదివ్యదేహమున్. 382

చ. అని కొనియాడి రంతఁ గుశికాన్వయనీరధిశీతభానుఁ డా
ఘనతమతేజ మట్లడఁగఁ గాంచి మహాత్ముని దీనరక్షకున్
మునిజనవంద్యపాదయుగు మోదమయాత్ముని సత్కృపాకరుం
గనుఁగొనుచున్ భజించె మదిఁ గల్గినజ్ఞానము పేర్మి నెంతయున్. 383

విశ్వామిత్రుఁడు రాముని వినుతించుట.

క. విశ్వాకారా! దేవా!, శశ్వద్బ్రహ్మాండసృష్టిచతురా! వియద
గ్నిశ్వసనాదిమహాభూ, తేశ్వర! నీతేజమున కివే మ్రొక్కు లజా! 384

క. తేజోరూపుఁడవని ని, న్నీజగతిఁ దలంపలేక యెల్లరు వివిధ
వ్యాజములను భజియింతురు, తేజమె నీరూపమనుచుఁ దెలిసికొంటిఁగా. 385

క. ఏజనులు నిన్ను నాద్యుం, దేజోరూపునిగ నాత్మఁ దెలిసి కొలుతు ర
వ్యాజప్రీతిన్ వారలె, యోజగదాధార! ముక్తి నొందఁగ నర్హుల్ 386

క. ఓంకారము నీరూపమె, శంకరమా నీదునామసంస్తవ మెన్నన్
సంకటహరణా! నీనుడి, శంకయె లేదిందు సుంత సరసిజనాభా! 387

క. నీకంటెం బర మెయ్యది, లోకంబులయందుఁ గనఁ గలుగునొకో యభవా!
యాకరణి మానవాకృతి, శ్రీకాంత ధరించి మించి చెలఁగితి వౌరా! 388

ఉ. ఏజని సుంతపుణ్యలవ మే నొనరించినవాఁడనో విభూ!
యీజగదేకసుందరము నీశ్వరతత్త్వము సర్వసంపదు
త్తేజకమున్ నిరంజనము దివ్యము నిర్మల మద్వయంబు స
త్తేజమునైన రూపము నతిస్థిరపుణ్యవిభూతి గాంచితిన్. 389

చ. వ్రతములు భూరిపూజ లుపవాసము లింకనుగల్గు పుణ్యకా
ర్యతతులు చేయఁ గాంచఁ దరమౌనె మహామహిమాఢ్య! నిర్మల
స్తుతుల నొనర్చుమానవులె చూడఁగ నోతురు దివ్యసుందరా
కృతిని విముక్తిదం బన నిదే యగు నిక్కము నిక్క మెన్నఁగన్. 390

చ. ఉపనిషదోఘముల్ శ్రుతులవ్యూహము నిన్ను నుతింపఁబూని నీ
దుపరమతత్త్వముం దెలుపఁ దోపమి "నేతి"యటంచుఁ బల్కెడున్
గృపణుఁడ బాలిశుండ నొకయించుకయైన నెఱుంగనేర్తునే
కృప దళుకొత్తఁ బ్రోవు మిపుడేమియెఱుంగ నటన్న యంజలుల్. 391

ఉ. ఒక్కెడఁ బ్రాణులం గలిసియుండఁగఁ జేయుదు వేటికో మఱిం
కొక్కెడ వైరమూని దురితోత్కర మొందఁగఁ జేయుచుందు విం
కొక్కెడ భూరిహర్షమున నుద్ధతులై తగునట్లొనర్తు వో
చక్కనినల్లనయ్య! పలుచందములం దగుభావ మేదియో. 392

ఉ. కర్మము నీస్వరూప మనఁగాఁ జనుఁ గర్తవు నీవె యాదు పీ
కర్మము పెక్కురూపములఁ గానఁబడున్ బలుగుండ్రు కర్తలై
కూర్మినిఁబాసి యొక్కయెడఁ గూడియు నొక్కెడ నుండ్రు దీనిదా
మర్మ మనంగ నేదొ గుణమాన్య! పరాత్పర! నాకుఁ జెప్పవే. 393

ఉ. కొందఱు యోగ మెక్కుడని కొంకొకయింతయు లేక పల్కఁగాఁ
గొందఱు జ్ఞాన మెక్కుడని కూడ వచింతురు వీనియందు నే
చంద మనం గనంగ నిది సార మసార మి దంచుఁ బల్కఁగా
డెందము చాలకున్నది కడిందివిచారము దీనిఁ బాపవే. 394

చ. ఫలములు పత్త్రపుష్పములు భవ్యసుశీతలమాధురీలస
జ్జలములు శక్తికిం దగినచందమునన్ గడుభక్తి నీయ ని

ర్మలఫల మొందువార లనుమాట యథార్థము పెక్కు లధ్వరం
బుల నొనరించుటేల యని పొంగుచుఁ బల్కెడు రేది కృత్యమో. 395

చ. ఎవరికి నేది చేయఁదగు నెవ్వరు దేనికి శక్తు లట్టివా
రు విధిగ నద్ది చేయఁ గని రూఢఫలంబును గాంతురంద్రు! దే
వవరసుపూజితాంఘ్రియుగ వారిజ! యిందుఁగలట్టిసత్య మే
మివిధమొ దానిఁ దెల్పి కృపమించఁగ నన్నుఁ దరింపఁజేయుమా. 396

ఉ. మానసమందు నిన్ను నొకమాటు తలంచినయంతఁ జాలు నా
మానవు నుద్ధరింతు వనుమాట యథార్థమయేని పాపులే
రైనను నొక్కమాటు నిను నాత్మఁ దలంపనివార లుందురే
జ్ఞానమయాంగ! దీనఁగలసత్యము తెల్పుము తీర్పు శంకలన్. 397

ఉ. మాయకు నీవు లోఁబడెదుమాట యథార్థ మటంద్రు కొంద ఱా
మాయయె నీకు లోఁబడును మానుగనంచు వచింత్రు కొంద ఱా
మాయయొ నీవొ లోఁబడుట మామకచిత్తము సంశయాస్పదం
బేయయి యున్న దీవిధ మదెట్టిదొ తెల్పుమ దానవాంతకా! 398

మ. కరుణాసాగర! నిన్నుఁగాంచిన జనుల్ కల్యాణముల్ పొందు ట
బ్బురమే చంపఁగవచ్చి యార్చి యిపుడే పొందెంగదా ముక్తి యా
సురి యింకన్ నిను దేవదేవునిగ నేశుద్ధాత్ముఁ డెంచున్ మన
స్సరసీరుట్పదమందు నిల్పు నతఁ డెంచన్ దేనిఁ బ్రాపించునో. 399

మ. తరమే బ్రహ్మముఖామరోత్తములకున్ దత్త్వంబు శ్రీరామ! శం
కరుఁడే నిన్ను జపించుచుండునఁట యింకన్ జెప్పనేలా మనో
హరరూపా! నిగమాంతవేద్య సురసంఘాద్యక్ష! నీతత్త్వ మా
దర మొప్పంగ నిదిట్టులంచుఁ దెలియన్ దథ్యంబ వాంఛించెదన్. 400

మ. అని యిట్లాకుశికాన్వవాయుఁ డడుగన్ హర్షంబు పైఁబొంగ ని
ట్లనియెన్ శ్రీరఘురాముఁ డోమునివరా! యాలించితిన్ నీవొన
ర్చినసంప్రశ్నగణంబు నుత్తరము నేఁ జెప్పంగ నిచ్చోటుగా
దనుమానింపకు కాల మున్నయది సత్యంబున్ వచింపన్ దగన్. 401

మ. కృతకృత్యుండనుగాఁ దలంచెదను మౌనీశా! భవన్మూలమై
జతనంబెల్ల ఫలింపఁగాఁదగు మహోత్సాహంబు వాటించి యు
ద్ధతులౌ దైత్యులఁ ద్రుంచువాఁడ నిపుడీతత్త్వంబు ప్రశ్నింప కా
దృతి సాగింపుము కార్యభార మన నాయిక్ష్వాకువంశాగ్రణిన్. 402

చ. కని మది నిల్పి తచ్చరణకంజములన్ జతనంబు సాగఁజే
యను దలపోసి వారిఁ గొని యాశ్రమసీమను జేరఁబోయి స్వ

యనియతిఁ బూనె; సోదరు లవార్యబలంబునఁ జాపముల్ ధరిం
చి నిశితబాణముల్ గొని విచిత్రగతుల్ చెలఁగంగ నొప్పుచున్. 403

చ. మునిపతి హెచ్చరింపఁగఁ బ్రమోదముమీఱ నతండు నధ్వరం
బొనరుపఁ బూనె మౌను లొగి హోమము చేయుచునుండి రంత భీ
తిని గలిగించుదానవులు తెంపున నభ్రమునుండి యాగ్రహం
బునఁ గురియించి రొక్కమొగిఁ బూనిక రక్తము మాంసపంకమున్. 404

శ్రీరాముఁడు మారీచసుబాహులతో యుద్ధము చేయుట.

సీ. తాటకామృతిఁ గని దానవాంతకునకు, దివ్యాస్త్రజాలంబు దివ్యమంత్ర
సహితంబుగాఁగ విశ్వామిత్రుఁ డిచ్చిన, వాఁడుగావున రఘువరుఁడు వాని
ధనువున సంధించుతఱిఁబూని లక్ష్మణా!, యజ్ఞ మారంభించి యైదుదినము
లయ్యె నేయంతరాయము లేకసాగెను, షష్ఠదిన మ్మిది సకలవిఘ్న
తే. ములకుఁదావలమనవచ్చు బలిమినసురు, లుద్ధతులుగాఁగురియించుచున్న వారు
రక్తమాంసపంకంబులు రంధ్ర మెఱిఁగి, వీరిఁ బొలియింతు దివ్యాస్త్రవితతిఁబఱపి.

క. అని పలికి మానవాస్త్రం,బును నారిం గూర్చివైచెఁ బోయి యదియు దు
ర్జను మారీచుని జంపక, పనిగలదని యెఱిఁగి జలధిఁ బడఁగం జిమ్మెన్. 406

ఉ మానవనామకాస్త్ర మదమర్త్యులనైన వధించునట్టిదే
యైనను గాల మాతనికి నప్పుడు తీఱమిఁ జంపలేక యా
దానవు సంద్రమందుఁ బడఁ దా నటుచిమ్మెను దానవాఁడు ప్రా
ణానిలయుక్తుఁడై వివశుఁడై పడియుండెను గొంతకాలమున్. 407

శా. మారీచుం డిటు సంద్రమందుఁ బడఁగా మాయావియై కృత్రిమ
ప్రారంభుం డగునాసుబాహువు మహాహంకార మేపారఁగా
ఘోరాకారత నశ్మవృష్టి గురియన్ గుర్తించి నేర్పొప్పఁగా
శ్రీరాముం డనలాస్త్రసంహతి మృతిం జెందించె నొక్కుమ్మడిన్. 408

చ. ఇరువురు సోదరుల్ పడుట కెంతయుఁ గుందుచు నున్న రాక్షసో
త్కరముఁ బ్రభంజనాస్త్రమునఁ గాలునివీటికిఁ బుచ్చినన్ మునీ
శ్వరులును గాధినందనుఁడు సంతసమంది నిరంతరాయమై
పరఁగఁ గ్రతూత్తమం బొనరుపంగను జాలిరి సాధుపద్ధతిన్ 409

చ. కొలఁదిదినంబు లం దనుజుఁ గూడి సుఖంబుగ రాముఁడుండ మౌ
నులు పరమాదరంబొదవ నూత్న విధంబున నొప్పియుండి; రా
జలరుహమిత్రవంశజులు సార మెఱింగిన గాధినందనుం
డలరి విదేహభూపతిగృహంబున కేఁగఁగ నెంచె నాత్మలోన్. 410

చ. హరునిశరాసనం బచట నర్చన లందుచునుంట నొక్కయ
ధ్వర మట సాగుచుంట ప్రమదంబున జానకి శ్రీశుఁ గూడ నా

తురపడుచుంట లో నరసి తోరపువేడుక తొంగలింప భూ
వరమణిపుత్త్రులం గని ప్రభావము యుక్తియు మీఱ నిట్లనున్. 411

విశ్వామిత్రుఁడు శ్రీరామునకు శివధనుస్సునుగుఱించి తెల్పుట.

చ. జనకమహీధవుం డొకఁడు సద్యశుఁ డుండు విదేహరాజ్యమం
దనఘుఁడు జ్ఞానిశేఖరుఁడు నచ్యుతపాదసరోజపూజనం
బున సమయంబు పుచ్చు మునిపుంగవసన్నుతుఁ డిద్ధకీర్తి శ్రీ
ఘనుఁడు నగున్ దదర్చితము కామహరప్రియచాప మొప్పెడున్. 412

మ. చిరకాలంబుగ నావిదేహనృపతుల్ శ్రీకంఠుచాపంబు ని
ర్భరభక్తిం గొని పూజచేయుదురు శ్రీరామా విదేహాక్ష్మే
శ్వరుఁ డుర్విన్ మఖవర్య మొం డొనరుపన్ జక్కంగ శోధింప శ్రీ
తరుణింబోలు కుమారి యందలరఁగాఁ దాఁ గాంచి ధన్యాత్ముఁడై. 413

క. సీతయను నామమిడి సంప్రీతిం గొనివచ్చి యింటఁ బెంచుచుఁ దద్భూ
జాతకుఁ దగువరు నరయుచుఁ జేతస్సునయందుఁ దలఁచె శ్రీపతిభక్తిన్. 414

క. వెనువెంటఁ దోఁచె నీభూతనయకు నర్హుండు సుగుణధాముఁడు లోకా
వనదక్షుఁడు నగుభూపతి, యని యట్టిం డెవ్వఁ డనుచు నవ్వల నెంచెన్. 415

క. శ్రీకంఠచాపవర్యం, బేకరణిన్ మాగృహమున నెసఁగెడు దానిం
జేకొనరా దెవ్వరికిని, గైకొని సజ్యంబుచేయఁగాఁ దర మెటులో. 416

ఉ. చాపవరంబు దానిఁ గొని సజ్యముచేయఁగలాఁడు విష్ణువే
తోఁపరు తక్కుభూమిపతిధూర్జటు లెవ్వఁడు దీని నెక్కిడున్
శ్రీపతియో తదంశమునుజెందినవాఁడో యగుంగదా యతం
డీపగిదిం బణంబొకటి యేనిది చూచెద నంచు నెంచె లోన్. 417

వ. ఇట్లు నిశ్చయించి. 418

చ. జనపతి యెవ్వఁడేని శివుచాపము మద్గృహమందునుండి పూ
జనముల నొప్పు దానిఁ గొని సజ్యముచేసిన వాని కిత్తు సీ
తను క్షితిజాత నంచు వివిధక్షితినాథుల కెల్లఁ దెల్లమై
తనరఁగఁ జాటఁబంచెఁ బ్రమదంబును బొందిరి దాన నెల్లరున్. 419

శా. సీతాభామిని సౌకుమార్యమున గుణశ్రీలన్ లసద్జ్ఞానమున్
జేతస్స్ఫూర్తియు విన్నవారె యగుటం జిత్తంబు లుప్పొంగ వి
ఖ్యాతశ్రీబలశక్తియుక్తులగుభూకాంతుల్ త్వరం బోయి యా
భూతేశోరుశరాసనంబుఁ గని యుద్భూతప్రమోదంబునన్. 420

ఉ. చెంతకుఁబోయి చూచి యిది శ్రీగళచాపము పూజనీయ మా
వంతయు నెత్తరా దనుచు నాత్మబలంబును జూప కేగి ని

శ్చింతలనుండి రయ్యదియు సీత కరంబున నెత్తిపెట్టఁగా
నింతట నంతటన్ జరుగు నింకెవరైనఁ గదల్పఁజాలమిన్. 421

సీ. మఱికొంద ఱరుదెంచి మర్యాదపోవంగ, నెత్తఁజాలక చలియింపఁజేయ
నైనఁ జాలక పోయి; రంతఁ గొందఱు జన, కావనీపతి వంచనాధికుండు
కావునఁ బణ మిట్లు కావించె సాధ్యమే, దేవతలకునైన దీని నెత్త
ననుచు నాక్షేపించు చరిగిరి; రాఘవా!, రావణాసురుఁడును భూవిభుఁగన

తే. నొకట నరుదెంచి శంకరుగురుతరధను, పట్టె పరికించి యిదియెంతయనుచునవ్వి
వింశతికరంబులం బట్టివిపులనుండి, యెత్తె నంగుష్ఠమాత్రంబోయేమి చెపుదు!

చ. తనబలమెల్లఁ జూపి యిఁక దర్పము నిష్ఫలమంచు నెంచె నం
త నదియు వానిపాదములు దద్దయు నొచ్చెడునట్లుగాఁ బడెన్
దనుజుఁడు దానిఁ ద్రోయఁదగుదర్పము లేకయె కుందుచుండఁగా
వనితలు చూచి నవ్విరి సెబాసని యొక్కమొగిన్ రఘూద్వహా! 423

ఉ. అక్కట! వాఁడు రాక్షసగణాధిపుఁ డంచు నెఱుంగరైరి; వాఁ
డక్కజమైనభూమివిభు నాకృతి యెల్లరకుం గనంబడన్
జక్కఁగమూతి నిర్వదిభుజంబులు రెండుగఁ దోఁచుచుండె న
ట్లక్కితవుండు పోల్చి యవమానము నొందె నదృష్టహీనతన్. 424

చ. పదములపైని శంకరునిభవ్యశరాసన మట్టె యుండ దా
నిఁ దొలఁగఁజేయఁజాలకయె నిర్భరబాధల నొందుచుండఁగా
మదిఁ గరుణారసం బొలయ క్ష్మాపతి యజ్జనకుండె వచ్చి ప్రీ
తి దనర నీశునిం దలఁచి తీవ్రధనుస్సుఁ దొలంగఁజేయఁగన్. 425

చ. మనసున సిగ్గుదోఁచినను మానవభక్షకుఁ డాగ్రహంబునుం
గని తనుఁగాంచి నవ్వుజనకప్రభుపుత్రికఁ జూచి దీని నేఁ
గొని చనువాఁడ నెత్తఱినిగాని యటంచుఁ బ్రతిజ్ఞచేసె నె
మ్మనమున నప్పుడే దివి నమానుషశబ్ద మొకండు చెచ్చెరన్. 426

చ. వినఁబడె రావణాసురునివీనుల కార్తిని గూర్చునట్టిదై
దనుజ! సతీనిమిత్తమున దారుణసంగరమందు భూమిజే
శునిశరపంక్తిసంహతిని జొప్పడు మృత్యువు నీకు నంచు నా
ధ్వని విని రావణాసురుఁడు దైవగతిం దలపోసి యార్తుఁడై. 427

తే. తరలిపోయెను లంకకు ధాత్రినాథు, లెవ్వరే నెత్తఁజాలనియాశుధనువు
పూజలందుచు నున్నదాభూపునింట, రామ! కనఁదగు నాధనుసురాజ మింక.

చ. క్రతు వొనరించువాఁడు జనకక్షితినాథుఁడు దానిఁ జూడ స
మ్మతిగొనుమా నృపాలకులు మన్ననమీఱఁగఁ బిల్వఁ బోవుటం

చితమగుమార్గమే యనుచుఁ జిత్తమునందుఁ దలంతు నైనను
గ్రతువును బిల్వకుండఁ గనఁగాఁ జనఁగాఁ దగునండ్రు కోవిదుల్. 429

చ. పరిణయముఖ్యకార్యములపట్టునఁ బిల్వఁగఁ బోవు టొప్పునం
దురు మతధర్మవేత్తలు కుతూహలమొప్పఁగఁ దత్క్రతూత్తమం
బరుదుగఁ గాంచి యందలి శరాసనముం గనినన్ ముదంబగున్
ధరణివరేంద్రపుత్త్ర! మదిఁ దాఁకెను నా కిది యుక్తమం చొగిన్. 430

## అహల్యాశాపవిమోచనము.

చ. అనిన రఘూత్తముండు స్మితమాస్యమునన్ నటియింప మీరు పం
చినయటు చేయనౌ ననుచుఁ జెప్పెను మజ్జనకుండు నట్టులే
యొనరుతు నన్న మౌనివరుఁ డూహ చెలంగఁగ భావికార్యముల్
మనమున నెన్ని మౌనిగణమండనుఁడై పయనంబు చేయఁగన్. 431

ఉ. రాముఁడు లక్ష్మణుండు మునిరాజుల వెంబడిపోయి రంత నా
భూమిని గొంతదూరమునఁ బోవుచునుండఁ గనంబడెన్ మహా
భీమవనంబు దానఁ గనువిం దొనరించెడుతావు కన్బడెన్
గోమలవృక్షవల్లరులకూటము వేడుకఁ గూర్చుచుండియున్. 432

మ. జనశూన్యంబయి యాశ్రమం బచటఁ దేజస్సాంద్రమై పక్షిని
స్వనభూరిప్రమదాకరంబగుచు నభ్రప్రాంశుభూజాళియై
తనరన్ రాఘవుఁ డో మునీశ్వర! విచిత్రం బిందు నొక్కండునుం
గనరాఁ డీయది యాశ్రమంబనుచు నిక్కం బెన్నఁగా నయ్యెడున్. 433

ఉ. కారణమేమొ మౌనివర! కాండవిహీనత నొంద నన్న నా
భూరమణాత్మజన్ముని ప్రమోదము వృద్ధినిఁ జేయనెంచి గం
భీరతరోక్తులం బలికె వింతగ నొప్పును దీనిగాథ ముం
దారయఁగాఁ దగున్ నడువు మం దొకచిత్రచరిత్ర మేర్పడున్. 434

మ. భవదీయాగమనంబుఁ గోరుచు మృదుస్వాంతంబు దైన్యంబు గాం
చ వరారోహ యొకర్తు భర్తృవచనాంచత్పాశబద్ధాత్మయై
వివిధాధుల్ తనుఁ గుందఁజేయ నటవీవీథిన్ మహాదుఃఖముల్
తపులంగా నిను నాత్మనెంచెడుఁ గృపాధామా! వడిం గావుమా. 435

మ. నినుఁ జింతించుచు నీదునామజపమున్ నిత్యవ్రతం బట్లుగా
నొనరంజేయుచు నుండు ప్రాణితతి నోహా! యంచు నిన్నెంచఁగా
ననుమానింపక కాచు టొప్పు నని యాయాచోటులం జూపుచుం
జని పాషాణ మొకండు చూప రఘురాట్చంద్రుండు సంతుష్టుఁడై. 436

చ. మునివరపూజితంబులయి భూరిశుభంబుల నీయఁజాలు ప
ద్వనజము లక్ష్మముం దగులుభంగి నొనర్పఁగ దివ్యతేజ మొ

ప్ప నొకసతీలలామ కడుభక్తిఁ జెలంగఁగ రాముఁ జూచి వం
దన మొనరించి నిల్చెఁ బ్రమదంబును లజ్జయు సందడింపఁగన్. 437

శా. రామక్ష్మాపతి గాంచె నామునిసతిన్ రమ్యాంగసంశోభితన్
గామస్ఫారశరాగ్నిదగ్ధనిజసత్కర్మౌఘసంలబ్ధదు
ర్వ్యామోహార్జితపాపకార్యఫలభూతాత్యంతదుష్పారశా
పామిత్రప్రబలార్తిభిన్నమతి నత్యాశ్చర్యమగ్నాత్ముఁడై. 438

ఉ. ఆమె యొనర్చుపూజలకు హర్షమునొంది మునీంద్రుఁ డాదృతిం
గామిని కెట్లు శాపమది కల్గెనొ తెల్పిన నాలకించి నె
మ్మోమున సుస్మితం బొలయ మోహముఁ బాపెడుభాషణాళిచే
నామె మదిం గలంచువగ నప్పుడె వాపి వచించె నివ్విధిన్. 439

చ. తెలియక తప్పొనర్చి మఱి తెల్విని దాని నెఱింగి యింక ని
ట్టు లొనరుపన్ నిజం బని కడున్ గడు జ్ఞానము నొంది పల్కినన్
గలుగదు దాన దుష్కృతము కర్మఫలంబులు తప్ప వెట్టులే
నిలపయి వానిఁ బొందనగు నిందులకున్ దురపిల్లరాదుసూ 440

చ. జననము సాధువంశమున సంగతి సజ్జనవర్యుతోడ నై
నను దొలిమేనఁ జేసినది నాశమునొందక వేచియుండు దా
నిని మరలింపరాదు విను నీరజగర్భునకైనఁ జక్రికై
నను శశిధారికైన నిఁక నాశము దానికి నెట్లొ తెల్పెదన్. 441

ఆ. కొంతయనుభవించి కోవిదులను గొల్చి, వారిభాషణముల వలనఁగల్గు
భక్తిభరముచేతఁ బరమేశు సేవించి, శేషమును హరింపఁ జెల్లు నమ్మ! 442

సీ. పాపకర్మంబుల నీపగిదిం జేసె, నీతఁడు దుష్టాత్ముఁడే యటంచుఁ
జెప్పుచుండెడువారు చేసినపాపంబు, నందుఁ గొంత హరింతు రందు రార్యు
లంతియ కాక పాపాత్ముఁ డీతండని, సత్కార్యములు చేయుసమయమందు
నెవ్వారు దూషింతు రవ్వారె మిగిలిన, భాగమ్మునం గొంతభాగ మాహ
తే. రించికుడుతురు మిగిలిన దించుకయును, దానుసులభంబుగా నొందఁదగును గాన
నొరుల కర్మంబులం గూర్చి స్మరణచేయ,రాదు ధర్మసూక్ష్మం బిది రాజవదన!

క. ఏపగిదినైనఁ బశ్చాత్తాపము పాపము హరించుఁ దప్పదని స్మృతి
వ్యాపార మెఱుఁగుపండితు,లోపికఁ బల్కుదురు తత్త్వ మొగి నెఱుఁగుటచేన్.

ఉ. కావునఁ జింతలన్ వదలి కాంతరొ! నీవిభుఁ గూడి సుంతయే
నీవిభుఁ డాడుమాటలకు నేమియు నుత్తర మీక చేయుచున్
భావమునందు భర్తృహితపద్ధతి నెన్నుచు నుండుమింక ని
న్నేవిధినైన దుర్యశము నింతయు నొందక యుండెడున్ ఱుటిన్. 445

క. మరణాంతములౌ వైరము, లరయఁగ శాపానుభవమె యంతముగ నఘో
త్కరమండ్రు సూరిజను లో,తరుణీ! యామాట వీడఁదగు నిఁక మీఁదన్.

ఉ. చేసినయట్టిపాతకము చెందినదుష్ఫలయుక్తిఁ బోయెఁగా
వేసర నేమియౌ నిటులు వృత్రహరుండు ఫలంబునొందెఁగా
మోసము చేయమాను నిఁక ముందు నతండును వేయునేల యో
భాసురగాత్రి! నీప్రియునిఁ బాయక సేవలొనర్పు నేర్పునన్. 447

చ. పతియగు దైవ మంచు మదిఁ బాయనిపూనిక సేవ చేయఁగా
నతిశయమోద మబ్బుఁ బతియాదృతిఁ గాంచనిపూవుఁబోఁడి యా
తతిని బరంబునన్ యశముఁ జెందక పుణ్యసుఖంబు నొంద కు
న్నతమతు లేవగింపఁగ వినాశము నొందును నిశ్చయంబుగన్. 448

చ. పరపురుషాళితో సరసభాషలఁ బల్కుచు స్వేచ్ఛమీఱఁగాఁ
దిరుగుచు నోలగంబుల మతిప్రభ గన్పడ మాటలాడుచున్
బరసుఖమున్నదే యనుచుఁ బాము లెంతు రటంచుఁ బల్కుసుం
దరి కిహముం జెడున్ బరము తప్పు నటంచును జెప్ప నేటికిన్. 449

సీ. విదుషీమణినటంచు విఱ్ఱవీగుచుఁ బతి, నవమతిఁ గాంచెదు నంబుజాక్షి
నిర్ధనుం డీతఁడు నేరఁ డార్జింపఁగ, నని పతిఁ బల్కెదు నతివమిన్న
విద్వాంసుఁడే గాఁడు వెర వెఱుంగఁ డటంచుఁ, బతిని దూషించెదు వామనయన
నాకంటె నేమిట నాపతి హెచ్చంచు, గర్వంబునం బల్కు కలికిమిన్న

తే. భర్తలేనితఱిన్ స్వేచ్ఛఁ బరునితోడఁ, బరిహసించుచు భాషించు పడఁతి పుంశ్చ
లీసమాఖ్యను గాంచు నిహమునందె, యపయశంబును గష్టంబు నందుఁ జుమ్ము.

చ. నిరయముఁ గూర్చు నెల్లపుడు నెమ్మి మనంబునఁ దోఁపకుండ దు
స్తరబహురూపకష్టములసంతతిఁ గల్గఁగఁ జేయుఁ గారణం
బరయఁగఁ జాలనట్లు హృదయంబున కార్తిని గూర్చుఁ బూరుషో
త్కరమున కేవగింపు గలుగంగ నొనర్చును స్వేచ్ఛ నాతికిన్. 451

క. దూరపుటాలోచనయే, యారయ లేకుండు స్త్రీల కందఱకు మహా
ప్రారంభ మంత్య మల్పము,గా రమణులకృత్యమందుఁ గన్పడుఁ జుమ్మీ. 452

క. లోకంబున కుపకారం, బీకరణిం గల్ల బ్రహ్మయే శాసించెన్
గాకున్న జగము చెడదే, యోకాంతా! మదిని వదలు ముమ్మలికంబున్. 453

క. వయసును రూపము దాన, వ్యయపద్ధతి శీల మిట్టివన్నియుఁ బతి కె
న్న యువతికిఁ దుల్యముగ నున్న యెడన్ సుఖ మబ్బునండ్రు నయవిద్వర్యుల్.

మ. తరుణీ! నీపతి వృద్ధుఁడౌట మరియాదన్ వీడి నీచిత్త మొ
క్కరియందుం దగిలెన్ బురాకృతము దుష్కర్మంబు ప్రేరేప నా

తురతన్ దుష్కృతి నీవొనర్చితివి దో । డ్తోఁ దత్ఫలం బబ్బె ను
ర్వర నింకన్ బహుకాలముండుదువు సూ । భద్రంబులం గాంచుచున్. 455

చ. అని వరమిచ్చె నంతట మహాముని గౌతముఁ డీశ్వరాజ్ఞచేఁ
దనమది శాపముక్తిఁ గని । తన్ను స్మరించెడు నాయహల్య తోఁ
చిన హిమవద్గిరీంద్రమును । జెచ్చెరఁ బాసి తపోవిశేషసం
జనితవియద్గతుల్ పొలయ । స్వస్థలముం గన వచ్చె నత్తఱిన్. 456

గౌతముఁడు శ్రీరాముని నుతించుట.

చ. మునివరు రాకఁ గాంచి సతి । మోదము నొందుచుఁ జేరఁబోయి మ్రొ
క్కిన గత కల్మషన్ విమలకృత్య మొనర్చి చెలంగుచున్న భా
ర్యను గని వర్ధిలంగఁ దగు నాశిష మొప్పఁగ నిచ్చి రాముఁ గాం
చెను నిగమాంతవేద్యు సురసిద్ధముఖార్చితపాదపంకజున్. 457

క. మనమున ధ్యానించెను శ్రీశుని వేదసమూహగమ్యు । శుభగుణనిలయున్
ఘను జ్యోతిర్మయరూపునిఁ, దనహృజ్జలజాంతరస్థుఁ । దత్త్వనిదానున్. 458

క. పరికించి సమ్మదంబునఁ, దొరగెడు బాష్పాంబుకణతతులు గండములన్
వరుసఁ బ్రవహింపఁగ నమస్కరణము లొనరించెఁ దనదుస్వాంతమునందున్.

క. అత్తరుణంబున రఘుపతి, చిత్తము పొంగంగ మ్రొక్కి । చేతులుగూర్చెన్
బత్తిని లోకులు మదులన్, హత్తింపఁగఁ జేయుకోర్కి । ననఁదగియుండెన్. 460

చ. మునిపతి గౌతముండు రఘుముఖ్యుని జూచి కృతార్థజన్మునిం
గను దను నెంచుచున్ బలికెఁ । గంజవిలోచన నిన్నుఁ గాంచి నీ
యనుమతి చేయఁ గోరుచు హిమాలయమందుఁ దపంబు చేయుచుం
టిని ఫలియించెఁ గోర్కులు గడించి విచారము మానె నిత్తఱిన్. 461

చ. జనిఫల మన్న నీదుపదసారసయుగ్మము గాంచు టేకదా
యని తలపోయువాఁడ నది । యస్మదుదాత్తపురాకృతైకపు
ణ్యనియతకర్మశేషమున । నంతయుఁ జేకురె నింకఁ గోరఁగా
ననువగునద్ది యేదొ మఱి । నారయఁ గన్పడకున్న దేమియున్. 462

తే. ఉపనిషత్ప్రతిపాద్యుఁడ । వపగతాఘ, శోకమోహాదికుఁడవు నీచొప్పెఱుంగఁ
దరమె కౌశికునకుఁ దక్క । ధరణిభార, మడఁపఁ బుట్టినయాదినారాయణుఁడవు.

చ. నినుఁ గొనియాడ నాతరమె । నీదగుతత్త్వము తెల్ప లేక వే
దనికర మూరకున్న దఁట । ధాత్రి జనించి తమోమయాత్మతం
దనరిన నే నదెట్లెఱుఁగఁ । దత్త్వమిదంచు వచింప నేర్తు నో
ఘనకరుణాసముద్ర! ననుఁ । గావు మహల్యను బ్రోవు మాదృతిన్. 464

ఉ. తప్పొనరించె నీసుదతి । తాలిమిమాని శపించినాఁడ నో
యప్ప! త్వదంఘ్రిసేవన మిదబ్బెను సర్వకళంకకర్దమం

బిప్పుడు తావకీనకరు।ణేనమరీచుల నింకిపోయెఁ ద
ప్పాపములజాడఁ దెల్పఁగను। నోపుదు వీవె యిఁకన్ బరాత్పరా! 465

ఉ. తారకమంత్రరాజ మగు। దానవభంజన! నీదునామమే
కోరి గిరీశుఁ డయ్యజుఁడు। కోర్కులపంట యటంచు మానసాం
భోరుహమందు నిన్నునిచి। పూజలొనర్చి జపించుచుందు రో
శ్రీరఘురామ! భక్తజన। చిత్తమనోహరధామ! కావుమా. 466

శ్రీరాముఁడు హితములఁ దెల్పుట.

చ. అని వినుతించుగౌతమమ।హాముని నాదృతిమీఱఁ గాంచి యి
ట్లనియెఁ బరాత్పరుండు విన।వయ్య! సమస్తపురాణసంహితల్
గనుఁగొని వానియర్థములఁ। గల్పనచేయఁగఁజాలి యోగవి
ద్యనెఱిఁగి మించునీవె మరి। యాదను నెమ్మది నెంచ కివ్విధిన్. 467

క. వనిత శపింపఁగ నగునే, వినవే శిక్షయది ధర్మ।విహితంబుగ నుం
డను జను ఘోరతరంబుగఁ, జన దాదేశింప ననెడు।శాస్త్రనియమమున్. 468

క. తరుణియుఁ బతివశమున నె, త్తరుణంబుననైన నుండఁ।దగుఁ గావున నె
వ్వరుసన్ వదలితివో స్నా,నరతిన్ బోరానితటిని। నదికిం జనితో. 469

క. సురపతి చేసినకైతవ, మరయం దగదే మునీంద్ర!। యదిగాక తప
శ్చరణ మ్మసమయమున నీ,కరణి నొనర్పంగఁ దప్పు।గాదో యరయన్. 470

చ. పతి సతి నెట్టిభావమునఁ। బల్మఱు చూచునొ యట్టిభావమే
సతిమది నొప్పు నిమ్నగల। సంద్రముగాంచిన నిద్ది తెల్లమౌ
హితవచనంబులం దనిపి। యెంతయుఁ బ్రీతిని జేరఁబిల్చి సం
గతి మెలఁగంగ నాయువతి। కాంతున కింపొనఁగూర్పఁ జాలెడిన్. 471

చ. సరసవచస్సుమంబులను। జారుతరాభరణంబులన్ మనో
హరతరచేష్టితంబుల నొ।యారముమీఱఁగఁ గాంతచిత్తముం
గరఁగఁగఁ జేసి కోరినసు।ఖంబులఁ గూర్చిన మోదమంది య
త్తరుణి పతిన్ రమేశునిగ। భావనచేయున టన్నఁ జిత్రమే! 472

క. ఇతరేతరంబు సతియుం, బతియుం దమి నెల్లకార్య।భారంబుల స
మ్మతిఁ దీర్పఁ బూనుటొప్పగు, హిత మెట్లగు నట్లు లేక।యే యున్నయెడన్. 473

ఉ. కావున దంపతుల్ మిగుల। గారవ మొప్పఁ బరస్పరంబు స
ద్భావములూని సంసృతని। భవ్యగతిం జరియించు టొప్పుగా;
నేవిధినైన నద్ది తగ। కేచరియింప భవంబె కూపమౌ
పావనచిత్త! మౌనిగణ।పాలక! గౌతమ వేయునేటికిన్. 474

చ. అని రఘురాముఁ డెంతయు ఘ।నాదృతిమీఱ వచింప గౌతముం
డను బరమేశ! నీవెఱుఁగ।నట్టివి లోకములందుఁ గల్గునే

మనమున నెన్న కే నబహుమానమునన్ సతిఁగాంచియున్న దా
నిని నొకతప్పుగాఁ గొనక నిర్మలభావముమీఱఁ బ్రోవుమా. 475

మ. పరమేశా! భవదంఘ్రినీరజములన్ భావించి ధ్యానించెదన్
గరమాత్మం గృపఁబూని దంపతులకుం గళ్యాణముల్ గూర్పని
ర్భరసాంసారికతాపసంతతుల నొంపం గర్మపాశాలి స
త్వరమే త్రుంప వలంతి వీవ రఘునాథా! దీనమందారకా! 476

మ. గిరులం బోలినపాపసంతతి భవత్కీర్తిస్ఫురద్గాథ నా
దరణంబొప్పఁగ నొక్కసారి వినినం దాత్పర్యమేపార భ
క్తిరతిన్ మీఱఁ బఠించినన్ భసితమౌఁ గీర్తించుచున్ గాలమున్
జరపన్ ముక్తిపదంబు చేరుటకు నేశంకల్ పొసంగున్ విభూ! 477

చ. మనమున భక్తిగల్గ ననుమానము లేక భవాబ్ధి దాఁటనౌ
నని యొకకొంద ఱండ్రు మఱి యార్యులు కొందఱు కర్మమూలమై
తనరును జ్ఞాన మయ్యది నితాంతము నెమ్మది నిల్పకున్న దాఁ
టను భవకంథి శక్యమనుటల్ నయహీనవచస్సు లండ్రొగిన్. 478

చ. స్మృతులు పురాణముఖ్యములు చెప్ప ననేకవిధంబులన్ జన
ప్రతతికి నింద నెద్ది హితపద్ధతియో యెఱుఁగంగఁ జెప్పుమా
క్షితి భవదీయవాగమృతశీకరమే శ్రుతిమూల మౌఁగదా
హితకర రామచంద్ర! పృథివీశకుమార! విలాసలాలసా! 479

చ. అనియిటు గౌతముండడుగ నమ్మహితాత్ముఁడు సంయమీంద్రుతో
ననియెను జ్ఞానకర్మముల కట్టులె భక్తికి యుక్తమైనత్రో
వను వినిపింతుఁ దొల్దొలుత స్వాంతము నిర్మలరీతినుండఁగాఁ
జను నది లేకయున్న నెటు జ్ఞానము భక్తియుఁ గల్గఁజాలెడున్.

మ. పరమేశున్ మదినిల్పి తత్ప్రియ మెదన్ భావించి తత్ప్రీతికిన్
తరుణంబందున నిట్టికర్మమును శ్రద్ధాభక్తు లొప్పారఁజే
య రతింబూనితి నన్న భావన సముద్యోగంబునన్ గర్మముల్
జరపంగానగు మానవుండు నవియే సత్కర్మముల్ నాఁబడున్.

క. వానికి సాయంబయి తగు, మానికృతాచారములు సమస్తవిధములన్
వానిని బాసినవారికి, మానసపంశుద్ధి కల్గుమాట యనృతమే. 432

సీ. మానికృతాచారమండలి పెక్కురీ,తులఁ బొలుపారును దోషజాలఁ
ములఁ దొలఁగించు నిమ్ముల నన్నిమార్గముల్, తీర్థయాత్రయు మఱి దేవవరులఁ
బూజించుటయు సాధుపూగముఁ గొల్చుట,యును దీనమానవులను గడంగి
కావఁబూనుటయును గామ్యకర్మంబులఁ, జేయకుండుటయును మాయఁబూన

తే. కాత్మఁగలమాటపలుకుట§యాగమముల,నిగమములనట్లయితిహాస§నికరములబు
రాణములనమ్మటయుద్విజ§ప్రవరసూక్తి,యందుమక్కువయును మొదలైనవెల్ల.

క. మనమును శుద్ధముచేయం,గను జాలినత్రోవలగును § గడు స్వేచ్ఛమెయిన్
జనుఁడు చరించిన నిర్మల,తను గాంచుట కల్ల యిదియె § తత్త్వము సుమ్మీ. 484

చ. మునివర! సాధుకర్మములఁ § బూని యొనర్చి తదుత్థపుణ్యపా
వనత మనంబు నిర్మలత§భాసిలఁగాఁ గృతకృత్యుఁడౌను జ
న్మనిశము మానవుండును గుణాకరుఁడై ప్రియకర్మముల్ విధిం
బొనరిచి తత్ఫలంబులను § బొందఁగఁ గోరకయుండఁగాఁ దగున్. 485

మ. వరకర్మంబులఁ జేయుచున్ ఫలములన్ § వాంఛింపకే శ్రద్ధమైఁ
బరమేశార్పణ మంచు నెంచుచు జగ§ద్వారంబు వర్ధిల్లఁగాఁ
గర మర్థించుచు నుండువారిమనసుల్ § కాంక్షావిహీనంబులై
పరఁగున్ నిర్మలరీతి నంచెఱుగుమా § బ్రహ్మర్షిసంఘోత్తమా! 486

తే. కర్మముల మాని తోఁచినగతిఁ జరించు, వారికిన్ స్వాంత మెవ్విధి§భవ్యరీతిఁ
బొల్చువారికి భక్తి యొ§ప్పోల్కిఁ గుదురు, జ్ఞాన మెవ్విధిఁ బనుపడ§జాలియుండు.

మ. నిజకర్మంబుల మాని స్వేచ్ఛమెయిఁ బూ§న్కిన్ సంచరింపంగఁ బూ
నుజనుల్ భక్తియు జ్ఞానమున్ వలచునే § నూత్నోత్సవం బొప్పఁగా
సుజనుంగాఁ దలపోయునే; సుకృతినా § శోభిల్లునే యాతఁ డు
ర్వి జనుల్ మెచ్చఁగ సంచరింపఁగలఁడే § విప్రర్షిసంఘోత్తమా! 488

ఆ. విహితకర్మములను § వేడుక నొనరించి, యితరజనులుచేయు § జతనమొప్పఁ
జేసి సాధువృత్తి§ భాసురుం డగువాఁడు, పరమపురుషకృపకుఁ § బాత్రుఁడగును.

చ. జడలు ధరించి యోగివర§చందమునన్ దిరుగంగ నేర్చి యి
ప్పుడు శివుఁ డిట్టుచున్ మనుజ§పూగముఁ గూర్చి యుపన్యసించుచున్
గుడువఁగరానిచోటులను § గుడ్చుచుఁ విష్ణువె యొక్కఁడంచు నీ
శుఁడు హరిసేవకుండె యను§చున్ వచియించుచుఁ బెక్కుభంగులన్. 490

మ. ధనమార్జించుచు నీచమానవులకుం § దత్త్వంబు మంత్రంబులన్
ధనలోభంబునఁ జెప్పుచున్ దనమదిన్ § దామోదరున్ నమ్మిన
ట్లనువాదంబున దెల్పుచుం దిరుగు నీ§చాచార్యుఁ డొక్కమ్మడిన్
గనుఁబో నారకయాతనావళిని నొ§క్కం బిద్ది మౌనీశ్వరా! 491

మ. హరియందున్ హరునందు భేదమును బొట్లాలోచనల్ చేసినన్
దరమే కన్గొన వారియం దొకఁడెపో § దైవం బటంచొచు నా
తురుఁ డిందుం బయినన్ మహాపయశమున్ § దోడ్తోడనే కాంచువా
రరయంగా నొకతత్త్వమే తనుయుగం § బరార్థమే కాంచుటన్. 492

చ. ఇరువురియందు భేదమది । యేర్పడఁజాలదు భక్తుఁ డాత్మ నొ
క్కరిపయి లక్ష్యముంచి కల । కాలము భక్తిరతిన్ భజింపనొ
వరము లొసంగునాతఁడె స్వ । భక్తునకున్ మఱి యాద్వితీయునిన్
వరదుఁడు గాఁడటంచుఁ బలు । భంగులఁ దిట్టినభక్తుఁ డెట్లగున్. 493

చ పరశివుఁడున్ గదాధరుఁడు । భవ్యవరంబుల నీయఁ బ్రోడవై
పరఁగుదు రందు నేరిపయి । భక్తిచెలంగునొ వారిసేవ యా
దరమునఁ జేయనొ నదియె । ధర్మము రెండవవారిఁ దిట్టనె
వ్వరుస నుపాస్యదైవము భ । వప్రతిబంధముఁ బాప నెంచెడున్. 494

మ. హరి దూషించిన శంకరుం డెగడినన్ । యావత్పురాపుణ్యము
ర్వర వ్యర్థంబగు, దాన మేలు గలదే । రాజచ్ఛశాంకార్ధశే
ఖరుఁడే విష్ణువు విష్ణువే శివుఁడు నిక్కం బిద్దియే సన్మునీ
శ్వర! యం దెవ్వరిఁదిట్టినం గలుగు దుర్వారాఘపంకస్థితుల్. 495

చ. వినయముగల్గి విద్యతగ । వీతభవప్రతిబంధుఁడైన వి
ప్రునియెడ గోవునందు గురు । భూతముగాఁదగు హస్తియందునన్
శునకమునందు దానిఁ దిను । వొక్కపుమాలనియందు నొక్కరూ
పున వెలుఁగొందు దైవమును । బోలఁగఁ జూచెడువారె పండితుల్. 496

ఆ. ఎల్లయెడల వెలుఁగు । నీడ్యుఁ బరాత్పరు, నెఱుఁగఁజాల రొకనియెడ గురుత్వ
మొకనియెడలఘుత్వ । మూహించువారెట్లు, భక్తులగుదు? రెట్లు । పరముఁ గాంత్రు?

చ. ఒకయెడ నుండు వేఱొకట । నుండఁ డటంచు వచించువారెపో
వికలమనీషు లెల్లెడల । విష్ణువు వెల్గుచునుండు నంచు న
మ్మికగలవారె సాధువులు । మించెడుజ్ఞానముచేత దైవమున్
సకలవిదుం గనుంగొనఁగఁ । జాలుదు రెంతయునంచు నమ్ముమా. 498

ఉ. భావ ముపాస్యదైవతము । పాదసరోజయుగంబునందుఁ బ్రీ
త్యావహితంబుగా నిలుచు । నట్టు లొనర్చి తదీయమంత్రముం
బావనపద్ధతిన్ జపముఁ । బాయక సల్పుచు నున్న మౌనిపా!
యావిలభావమున్ వదలి । యచ్ఛతరంబగు మానసం బిలన్. 499

క. మనసు సదాచారంబునఁ, బొనుపడఁగాఁ జేసి మిగులఁ । బూనిక మలినం
బును గాకయుండఁ జేయం, జను నది లేకున్న విమల । సరణి యెటు తగున్. 500

సీ. ఆచార మది లేక । యాత్మ శుద్ధంబగు, ననియెంచు టజ్ఞాన । ముననె గాక
జ్ఞానంబుచే నని । మానితమతు లెంచఁ, దగదు సదాచార । ముగ గణింపఁ
బడెడుశిష్టుల నడ । వడి నాశ్రయింపనొ, నంతమాత్రమె గాక । యమలయోగ
మభ్యసింపంగనొ । నల్లి పరాత్పరు, కథలఁ బఠింపనొ । గాశికాది

తే. పుణ్యతీర్థంబులకు నేగి । పూతమతిని, నందుఁగలపుణ్యజలముల । నాడి మూర్తి
మంతమగు బ్రహ్మతేజంబు।మహితయోగ,నియతిఁగాంచియుపాసింపనిర్మలుఁడగు.

ఉ. అంతియకాని జ్ఞానమనునట్టి దొకండు చెలంగుచుండు మా
చెంత నటంచు వంచకులు । చెప్పుచు యోగులపోల్కి నంతటన్
వింతగ సంచరింత్రు పదివేలతెఱంగుల నెన్ని చూడ నా
క్కింతయు సత్యమందుఁ గలదే చెడిపోవరె యట్టిమాటలన్. 502

ఉ. మౌనివరేణ్య! శిష్టజనమండల మాదృతి నాచరించునే
యేనియమంబు లవ్వి విహితేష్టఫలంబుల నిచ్చునంచు స
మ్మానమునన్ గ్రహించి తనమంచికిమాత్రమె సాధుకర్మసం
తానము చేయ కెల్లరహితంబునకై యవి యాచరించుచున్. 503

ఆ. యోగనిష్ఠమెఱయ । నొక్కతెఱంగునఁ, గాల మేగునట్లుగాఁ బ్రవర్త
నమ్ము గలిగి పంచనను దూరముగఁ దోలి,యున్న జ్ఞానమబ్బునో మునీంద్రా!

చ. గురువుల మే మటంచు నొకకొందఱు విత్తము సేకరింపఁగాఁ
దిరుగుచు ద్వాదశాక్షర మతిస్థిరపుణ్యఫలప్రదంబు ని
త్తరుణమునందె కైకొనుము । దాని నెఱింగిన ప్రోఁడ నేను నా
దరమునఁ జెప్పువాఁడనని । దస్యులు భూమిఁ జరింత్రు స్వేచ్ఛఁగన్. 505

క. వారలమాటల నమ్మక, ధీరాజితులై చెలంగుదేశికులను వి
ద్యారణ్యుల భక్తిం గని, వారిం బ్రార్థించి విధిగ । వారిడుదానిన్. 506

క. కోరికమై జపియించుచు, ధారణిపై ననుభవింపఁ । దగుఫలములనుం
గోరక జపఫలమును శ్రీ, దారాంఘ్ర్యబ్జార్పణమని । తలఁపఁగవలయున్. 507

క. జపఫలమును గోరనియా, ప్రపుణ్యమతిఁ గాంచి హరియుఁ । బ్రముదంబందన్
జపఫల మదియే కద మోక్షపదం బవ్వానిహస్తగత మగు టరుదే. 508

చ. అని యుపదేశమార్గమున । నమ్మునిదంపతిప్రశ్నరాజికిన్
జనపతిరూపుఁడై తనరుచక్రి రఘూత్తముఁ డార్యధర్మపం
క్తిని వచియించి చెప్పఁదగుతీరున వారికి బుద్ధిచెప్పి యా
మునిపతిసంశయంబులను । బోవఁగఁజేయుచుఁ గౌశికుండు రాన్. 509

చ. అనుజునిగూడి యజ్జనకు నధ్వరవర్యముఁ జూచువేడ్కమైఁ
జనియెను గొంతదూరమున । స్వర్ధుని తోఁచెఁ దదీయతీరభూ
మిని నడుమంగ శీతలత । మించుసమీరకిశోరముల్ మహా
త్మున కెదురేగుదెంచెఁ గృపతోఁ జనుదెమ్మని వేఁడుకైవడిన్. 510

చ. తరువరముల్ ప్రసూనసముదాయము లెంతయుఁ బ్రీతి శాఖలన్
కరములఁ దాల్చి సూర్యకులకంధిశశాంకుని మస్తకంబుపై

వరుసఁగఁ జల్లి వంగి పదవారిజముల్ స్పృశియించి స్వాగతం
బు రమణఁ బ్రశ్న చేయువిధముం దెలిపెన్ మధులిన్మృదుధ్వనిన్. 511

మ. కరుణాసాగర! వేదవేద్యవిభవా! కంజాతపత్రాక్ష! శ్రీ
వర! నన్నుం గృతకృత్యఁ జేయవలె నన్వాంఛన్ సరోజాతసుం
దరరంగద్గురువీచిహస్తముల సాంద్రప్రీతిమైఁ జాఁపి రా
మరమాకాంతునిపాదపద్మముల సన్మానంబునం దాఁకఁగాన్. 512

చ. దరిఁ దరియించి వచ్చి; నృపతల్లజుఁ డత్తటి లోకపావనిన్
సురనది గాంచి యచ్చెరువు చొప్పడఁ గేల్మొగిడించి మ్రొక్కి సో
దరయుతుఁ డౌచు గాధిజుఁడు తల్లి! నమజ్జనకల్పవల్లి! నీ
కురుతరభక్తి మ్రొక్కెదను సుద్యమమున్ ఫలియింపఁ జేయుమా. 513

గంగానదీమహత్త్వము.

క. అని వేఁడె నంత రాఘవుఁ, డనూనమగు తన్మహత్త్వ మడుఁగఁ దలఁచి యి
ట్లనియెన్ లోకహితంబునె, తనమదిఁ గోరుటను గాధితనయ! మహర్షీ! 514

ఉ. గంగనుబోలు పుణ్యనది కానఁగరాదు జగత్త్రయంబునం
దుం గలనిమ్నగావికచతోయరుహాననలందు నంచు విం
దుంగద దీనిదౌ మహిమనున్ వినిపింపుము బ్రహ్మమానిస
త్సంగము సర్వసంశయవిదారణదక్షము గాదె యెయ్యెడన్. 515

చ. జనులొగి నీమహానది విశాలచరిత్రము విన్నమాత్రఁ బ్రా
గ్జనికృతకల్మషోత్కరముఁ జయ్యనఁబాసి మహేంద్రలోకమం
దనుపమభోగసంతతుల నందుచునుందు రటంచుఁ బెద్దలే
యని విననాఁడ దీనిమహిమంబును దెల్పఁగదే కృపానిధీ! 516

మ. అనుచుం బ్రశ్న మొనర్చు రాఘవుని దివ్యస్వాంతతాత్పర్యమున్
విని యగ్గాధిజుఁ డాత్మఁ బొంగుచు నదీవృత్తాంతసారంబు దె
ల్పను యోజించి మహామతీ! వినఁదగున్ భవ్యస్రవంతీనితం
బిని దివ్యచ్చరితంబు పావనము సంవీతాఘమౌఁ గావునన్. 517

మ. తొలుతన్ దీనిమహత్త్వమున్ వినుము దోర్దండం జరిత్రంబునుం
బలుకంబూనితి గంగ గంగ యని యెవ్వం డైన సద్భక్తితోఁ
బలుకుం దోడనె వానిఘోరతరపాపంబుల్ పటాపంచలౌఁ
గలుగున్ స్వర్భువనాతిసౌఖ్యములు నిక్కం బిద్ది రాజోత్తమా! 518

చ. తెలతెలవాఱునప్పుడు మదిన్ బదిసారులు జాహ్నవీపదం
బలయక యుచ్చరించిన మహాఫల మబ్బుట యొక్క వింతయే
ఖలహరణా! మదిం బొడము శంకల నెల్లను గాంచు; సత్య మీ
పలుకులు శ్రద్ధ నెమ్మదిని బాదుకొనందగు సత్ఫలాప్తికై. 519

చ. అనవరతంబు శ్రద్ధయనునట్టిపదార్థ మనర్ఘ మద్ది యె
వ్వని మదియందుఁ జొప్పడదొ వాఁ డొనరించెడుసాధుకర్మముల్
ఘనఫల మీయఁజాలవని కంజభవుండు విధించెఁ గాన శ్ర
ద్ధను దగి పుణ్యకార్యములఁ దా మనుజుం డొనరింపఁగాఁదగున్. 520

క. ఆచారం బెది శ్రద్ధా,ప్రాచుర్యము నొందియున్న ఫలదంబగు దు
ష్టాచారమువలె నిష్ఫల,మై చను శ్రద్ధావిహీన మైయున్న ధరన్. 521

సీ. ఒకఁడు సదాచార మొప్ప వర్తించును, గాని తన్మతి శ్రద్ధ కలుగకుండు
నొక్కఁ డాచారంబుఁ జక్కఁ బాటింపక, వర్తించు మది శ్రద్ధ భాసిలంగ
నీయిర్వురందు నేయెవ్వనియింట సజ్జనుఁడు భుజింపనో యనుచు మున్ను
బ్రహ్మలోకంబునఁ బ్రశ్నముచేయఁగ, నుత్తరం బిచ్చు దేవోత్తము లొగి
ఆ. నిర్వురందు దోషమే యొక్కఁ డుండుట, సమత గాంతురనుచుఁ జక్కఁబల్కి
రారయంగ నేర కఖిలధర్మపథంబు, లందు సూక్ష్మమెద్ది యనుచు నంత. 522

చ. వనజభవుండు దేవసమవాయము పల్కిన దాలకించి యి
ట్లనియెను శ్రద్ధ నాఁబడు పదార్థ మమూల్య మదెట్టివానియం
దొనరఁగ నిల్చియుండు నతఁ డొక్కఁడె పూజ్యుఁడు వానియింట భో
జన మొనరింపఁబోలు నని చాటెను నిండుసభన్ రఘూత్తమా! 523

క. కేవలశిష్టాచారం, బీవిధిఁ జెలువారు ననుచు నెన్ని పలుకుచున్
బావనశాస్త్రాచారము, పోవిడుతురు కొంద ఱవని మూఢులు నగుచున్. 524

క. ఒకదానికంటె వేఱొకఁ, డకలంకపథంబు గలుగునని ధర్మములన్
సకలవిధంబుల నారసి,యొకనుం గొనఁ దగును సూక్ష్మ మెయ్యదియనుచున్.

ఉ. అంతియ కాని తోఁచినటు లాసమయంబున కెద్ది చేయఁగా
సంతఫలంబు గల్గు నదె యర్హమటంచు వచింపఁబూనువా
రంతకుపత్తనంబున మహాఘఫలంబును గాంత్రుసుమ్ము భూ
కాంతకిరీటరత్నరుచికల్పితపాదకలాప! రాఘవా! 526

మ. వినవయ్యా! తరువాతిపావన సరిద్వ్రాత్రాంత మత్యంతభ
క్తి నదేమానవుఁ డెందునుండినను సంకీర్తించునో జాహ్నవీ
జనయిత్రిన్ సరిదంబుపూరమునఁ దా స్నానంబుగావించి న
ట్లొనరన్ జిత్తమునం దలంచునొ యతం డూహింప ధన్యాత్ముఁడౌ. 527

క. శతయోజనదూరంబున, నతిదీనత నుండియైన నాత్మన్ శ్రద్ధా
రతిఁగల్గి గంగఁ దలఁచినఁ, జ్యుతపాపుండై దివంబుఁ జూరఁగొనుఁజుమీ. 528

చ. హరిపదభక్తి జాహ్నవిని నన్వహముం దలపోయుచుంట శం
కరుఁ దమిఁ బూజనంబుల నికామము తృప్తుని జేయుచుంట నాఁ

బరఁగెడుసాధుకార్యముల వారకచేసెడువాఁడెపో వసుం
ధరఁ గృతకృత్యుఁ డన్న నరనాథతనూభవ! నిశ్చయంబుగన్. 529

శా. గంగాతుంగతరంగశీకరతతుల్ కాయంబు సోఁకంగ ను
ప్పొంగుం బుణ్యము జహ్నుకన్య యదియే. భూపాలమౌళిస్ఫుర
త్తుంగామర్త్యమణికిరీటఘనదీప్తుల్ మించ నొప్పారునీ
సింగారింపఁగఁ బద్మముల్ గొనుచు వచ్చెం జూడుమా రాఘవా! 530

చ. అళికులఝుంకృతిప్రతతి స్వాగతవాక్కులుగాఁగఁ దుంగభం
గలలితహస్తసంగతిని కామమనోహర పంకజాదికం
బులుఁ దమి నర్ఘ్యవస్తువులఁ బొంకముగాఁ గొని నీపదాబ్జముల్
గొలువఁగ వచ్చుచున్నయది కోమలి జహ్నుకుమారి చూచితే. 531

మ. జననస్థానము చూచువేడుక యదే చందమ్మునం గల్గెనొ
న్నిన సాజంబగు నన్న యాచరణముల్ నీరేజపత్రేక్షణా!
కనుమా జాహ్నవి తెల్పుచున్నది భవత్కమ్రాంఘ్రిపంకేరుహం
బును దాఁకం జనుదెంచుమార్గమున నే పోలుంగదా రాఘవా! 532

మ. పరికింపం జను రాఘవా! త్రిపథగాభామాలలామంబు నీ
చరణప్రచ్యుతిఁ గాంచి లోకముల సంచారంబు గావించుచున్
దురితం బాశ్రితకోటి నేచ నటు తోడ్తోఁ జెందుచున్ దావకా
జ్ఞ రహిన్ శీర్షమునన్ ధరించుట మనోజ్ఞంబైన దృష్టిం దగన్. 533

క. గంగా! గంగా! యనుచుఁ దరంగిణి నిద్దానిఁ బిలువ రయమునఁ బరువె
త్తుం గలుషమ్ములు పెనుభీతిం గని శ్రీరామ యిదియె దీనిమహిమమహా. 534

చ. అని యెఱిఁగింపఁ దన్మహిమ మాత్మ నెఱింగియు రామచంద్రుఁ డా
మునివరుభాషణంబులఁ బ్రమోదభరంబున నొప్పుచిత్త మొ
ప్పునటులు గారవించి విని పూజ్యతరంగిణి కెంతొ భక్తి వం
దన మొనరించె నాస్యమునఁ దాండవమాడెడు సుస్మితంబుతోన్. 535

ఉ. కోరికమీఱ లక్ష్మణుఁడు కోర్కెల నెల్లనొసంగు ప్రోదినీ
సారసనేత్ర కంజలిని సన్నుతిపూర్వముగా ఘటించి బృం
దారకపూజితాంఘ్రియుగ తావకసత్కృపచేఁ గృతార్థతన్
ధారుణిఁ జెందునట్లు నను దద్దయుఁ గావుము నేర్పుమీఱఁగన్. 536

చ. అని వినుతించె నంతఁ గుశికాన్వయమౌళి రఘూత్తమద్వయం
బును దమిఁగూడి జాహ్నవికిఁ బూజలొనర్చి కృతావగాహుఁడై
యనుపమకందమూలముల నత్తటినీతటమందుఁ దృప్తిమైఁ
దిని యటనుండి పోయెను మదింగల వాంఛలు సందడింపఁగన్. 537

## శ్రీరామలక్ష్మణవిశ్వామిత్రులు మిథిలఁ జేరుట.

చ. చనఁజనఁ దారకానికరసంతతఘర్షణదక్షహర్మ్యసౌ
ధనిచయమై ఖరాంశుకరతాపనిగూహనశక్తిరాజితా
త్యనుపమ సద్విమాననివహాంచితమై మిథిలాపురంబు రా
మునకు సుమిత్రపట్టికిని మోదము నించెను జూడఁజూడఁగన్. 538

చ. పురమును గాంచి మౌనిపతి భూపకుమారవతంసమా! మనో
హరమయి ధర్మపాలనమహాద్భుతి మించినరాజపాలనం
బరుదుగఁ గాంచి యీనగర మయ్యమరావతి ధిక్కరించు భూ
సురమునిపుంగవాఢ్యమయి శోభిలి భూరిసుఖాకరంబునై. 539

సీ. నిరతసుఖస్థాననియతిఁ జెన్నొందుట, నాకపురంబె యనంగఁదగును
సతతముధర్మైకసాధువాసం బౌట, స్వర్గలోకఖ్యాతిఁ బరఁగఁదగును
భోగిలోకోన్నతిఁ బొలుపారుచుండుట, నింద్రలోకంబన నెసఁగఁ దగును
గురువరాంచితమయి కొమరారుచుండుట, సురలోకసత్కీర్తి శోభిలఁదగు
తే. నమృతవాక్సిద్ధి నెసఁగుట నమరలోక, మనుచుఁ జెప్పంగఁదగుఁ జుమ్ము మనుజనాథ
మకుటతటఘటితకిరీటమణివిభూషి,తాంఘ్రిపంకేజ! యీమిథిలాఖ్యపురము.

చ. జనపతి ధర్మశాస్త్రవిధిఁ జక్కఁగ నేలుట నీతిబాధ లిం
దు నిలువఁజాలకే పఱచుఁ దోయజబాంధవవంశరత్నమా!
మును జనులీమహామతిఁ బ్రమోదమునం గనవచ్చుచుంద్రు జ్ఞా
ననిధియె యాట నీతనిఁ గనం జను టొప్పదె యెన్నిభంగులన్. 541

చ. పురనికటంబునందు మఖభూమి మహాధ్వరదీక్షఁ బూని యా
ధరణివిభూత్తముం డిపుడు ధాత్రిసురర్షులఁ గూడి యున్నవాఁ
డరయ విచిత్రవార్తఁ దెలియందగు నీకు రఘూత్తమా! మనో
హరమగు నద్ది మున్నొకపు డధ్వరకాంక్షను భూవిశుద్ధికై. 542

చ. జనపతి తా హలంబు గొని చక్కఁగఁ దున్నుచునుండ మందసం
బనునది కన్పడెన్ నృపతి యద్భుతమందుచు దానిఁ దీయ నం
దనుపమసుందరాంగి కననయ్యెను బుత్రికగా గ్రహించి క
న్యనుఁ దమిఁ బెంచె సీతయన నాఁగటిచాలగుఁ గాన నామెకున్. 543

క. సీతయను పేరుపెట్టి మ,హీతలపతి యామెఁ బ్రీతి యెసఁగం బెంచెన్
జేతోముద మొసఁగుచు నా,నాతియు సుగుణాతిశయమున వర్ధిల్లెన్. 544

క. ఆసరసిజనేత్రకుఁ బతి, నేసరణిం గూర్పనౌ నహీనగుణాఢ్యుం
డై సకలమహీపశిరో, వ్యాసక్తపదుండుగాఁగ నతఁ డుండఁ దగున్. 545

చ. అని మది నిశ్చయించి గృహంబునందుఁ గులక్రమరీతిఁ బూజలం
దనియుచు నత్యభేద్యమయి దారుణరూపమునం గనంగనౌ
ననుపమశైవచాపము మహత్తరమౌటను దాని నెత్తుస
జ్జనునకు సీత నిచ్చెదను సాధ్విగ నంచుఁ బ్రతిజ్ఞఁజేసెఁ దాన్. 546

మ. హరిచాపంబది యప్రమేయమహిమాఢ్యంబై కదల్పంగ నె
వ్వరికే శక్యముగాక మందసమునన్ భాసిల్లుచుం బూజలన్
నిరతంబుం గొనుచుండు సీతయును దానిం జుల్కఁగా నెత్తు భూ
వరకంఠీరవ! చాపవర్యమును భాస్వత్తేజముం జూడుమా. 547

చ. అదికన నద్భుతంబు గన నాజనకక్షితిపాలుఁ జూడఁగా
ముద మొనగూడునంచు నినుఁ బోలఁ దలంచియె తోడి తెచ్చితిన్
సదమలమానసా! నృపతిసత్తముఁ జూడఁగఁ బోయి యందె శ్రీ
లిదమగు శైవచాపము మహిం దగు వేడ్కను జూడఁగాఁ దగున్. 548

శ్రీరాములు జనకునియజ్ఞభూమిఁ జేరఁ బోవుట.

చ. అని వచియింప రాముఁడు మహర్షిని గాంచి వచించెఁ గౌశికా!
జనపతిఁ జూడఁబోవుదము జ్ఞానధనుం డతఁడౌట నందు శం
భునిదగు చాపవర్యమును బూజ్యతమంబును గాంచు టొప్పు నా
విని ముని వారిఁ దోడుకొని వేడుకఁ బోయెను యజ్ఞభూమికిన్. 549

తే. హోమధూమము ధ్వజపట్టుకలొప్పుమిగిలి, యంబరమునకుఁబోవంగ నాసగొనిన
యట్టు లుండంగ ఋత్విజులఖిలవేద, మంత్రముల దేవతలఁబిల్వ మది నలరుచు.

చ. సుర లరుదెంచి భాగములఁ జోద్యముగాఁ గొనుచుండ నెంతయున్
సురుచిరరీతి నొప్పెసఁగు క్షోణివిభూత్తమయజ్ఞమండపం
బరుదుగఁ దోఁపఁ గౌశికమహాముని ముందట వెన్క రాఘవే
శ్వరుఁడును లక్ష్మణుం డతనిసంగతిఁ బోయిరి లోని కొక్కటన్. 551

ఉ. వారలఁగాంచి వేడ్కఁ బరివారయుతుండయి యాధరేంద్రుఁ డౌ
రౌర! విచిత్ర మియ్యదియె యస్మదుదారతపంబు పండె సం
సారభయంబు లెల్ల నొకసారియె తూలెఁ బ్రమోద మబ్బె నా
కోరికలెల్ల సత్ఫలము గొబ్బుగఁ బొందెను మాట లేటికిన్. 552

చ. నరపతివయ్యు సత్తపమునన్ మునివై విజితేంద్రియుండవై
ధరణిసురర్షివై సకలధర్మవిదుం డన లోకరక్షణా
దరుఁ డనఁ గీర్తిఁగాంచి మునితల్లజులెల్లను గొల్వ నొప్పుమీ
రరుదుగ నిందుఁ జేరుటయె యభ్యుదయం బగుఁ దాపసోత్తమా! 553

చ. అవనిఁ జరింపవచ్చిన యహస్కరశీతమయూఖులో మహో
త్సవముల భూమిఁ దన్పఁగ నొసంగెడు వేడుక వచ్చినట్టి య

శ్వవిబుధులో యనంగఁ గనువిందు పొనర్చెడువీర లెవ్వరో
సువిహితరూపశీలముల । శోభిలువీరి నెఱుంగఁ జెప్పుమా. 554

చ. అనుపమభూమిపాలకులమందు జనించినవార లంచు నా
మనమునఁ దోఁచె సాధుగుణమండితులై వరరాజలక్షణా
ళినిఁ జెలువొందువీరిని గుణాలీనుల నాకెఱుఁగంగఁ జెప్పుమా
వినవిన వేడుకయ్యెడిని । వేదవిదుత్తమ మౌనిసత్తమా! 555

సీ. అనుటయు గాధినందనుఁ డాదృతిం బల్కె, దశరథభూజానితనయవర్యు
లమలచిత్తులు వీరు । లతిశయభూతద,యాపరుల్ శ్రీరాముఁ । డనఁగ లక్ష్మ
ణుండన నొప్పుచు నుండువారలు నాదు,మఖరక్షణము చేయ । మహిపునాజ్ఞ
ననుఁగూడి వచ్చుచు । వనమధ్యమంబునఁ, గ్రూరతాటక నొక్కశరకోలఁ గూల
తే. సేసి నాజన్నమును గాచి । యేపుమీఱి, దుష్టకార్యము లొనరింపఁ దొడరు నట్టి
రక్కసులను బెక్కండ్రను మ్రందఁ జేసి,యిచ్చటికి వచ్చుచున్ శక్తియేర్పడంగ.

క. గౌతమపత్ని నహల్యను, భీతిదశాపంబు చేతఁ । బెంపఱి శిలయై
యాతపవర్షము లేచఁగ, నాతతతాపంబు నందునంగనఁ గరుణన్. 557

క. శ్రీరాముఁ డీతఁ డంఘ్ర్యం,భోరుహసంస్పర్శముననె । పొలఁతిం జేసెన్
భూరమణ! నీగృహంబున, భూరిశరాసనముఁ జూచుపొంతె నిచటికిన్. 558

క. చనుదెంచె నానుజుండయి, ననుఁగూడి చరిత్ర మిదియె । నరనాయకస
త్తనయులరంచు వచించిన, విని జనకక్ష్మావరుండు । వేడుక పొంగన్. 559

## జనకుఁడు శ్రీరామునకు శివధనుస్సును జూపుట.

చ. మునిపతికిన్ రఘుక్షితిపముఖ్యకులాభరణంబులైన యా
యనఘులకున్ విధిప్రహితమై తగు పాద్యము నర్ఘ్యమాదియౌ
ననుపమపూజనంబు లిడి । యాసనవర్యము లిచ్చి హెచ్చువే
డ్కను మరియాద చేసి రఘుకాంతులఁ జూచుచునుండె సమ్మతిన్. 560

చ. క్షితిపతిఁ గాంచి మౌనిపతి । చిత్రశరాసనవర్యముం గనన్
మతిగల దీకుమారునకు । మానక దానిని దేరఁ బంపు మొ
క్కటెఱుఁగుఁ గాంచఁగాఁగలఁడు । కార్ముక మయ్యదటన్న నెంతయున్
స్మితము నటింప మోమున వచించె గభీరతరార్థ మొప్పఁగన్. 561

చ. మునివర! యాశరాసనము । మున్ను సురేంద్రులు మాకొసంగి ర
ర్చనముల మామకాన్వయవిరాజితులై తగుపూర్వరాజు లె
ల్లను బొనరించి రేను నొకలాగునఁ బూర్వులరీతి దానిఁ బూ
జనములఁ దన్పుచుండు నది । శైవ మమానుషమై చెలంగుఁజూ. 562

చ. సురలును దానవుల్ మఱియు శూరశిఖామణులైన భూపశే
ఖరులును దాని నెత్తఁగను గాని కదల్పను గాని చాల రో
ధరణిసురర్షిచంద్ర! విను తథ్యము నే యిట విన్నవింతు ను
ర్వరఁ గనుపట్టె నొక్కతఱి వారిజనేత్ర! మహాద్భుతాకృతిన్ 563

మ తొలిమేనం బొనరించినట్టి సుకృతస్తోమంబునం జిక్కెఁ దొ
య్యలి యిం దిట్టు లటంచు నెంచి తమిఁ బద్మాస్యన్ వడిన్ దెచ్చి యి
మ్ములఁ బోషించితిఁ బుత్రికాప్రతికృతిన్ భూపాత్మజుల్ వచ్చి యా
లలనం గోరిరి పెండ్లియాడ మది నుల్లాసంబు పైఁబొంగఁగన్. 564

ఉ. నేనును దొల్తనే వనజనేత్రకు నర్హుఁ డెవండొ భర్త యం
చూనినశ్రద్ధమైఁ దలఁచి యుర్విఁ గలట్టి నృపాలవర్యస
త్సూనులయందు నొక్కనిని శుభ్రగుణాకరుఁ గానఁజాలకే
మానసచింతనుండి యొకమాట వచించితి దైవసత్కృపన్. 565

చ హరునిశరాసనం బెవఁ డహార్యభుజాబలమొప్ప వంచునో
ధరణిపసూనుఁ డాతఁడె నితంబిని గైకొనఁ జాలు నంచు మా
నిరమణ! యేమి చెప్పుదును సీత నెఱింగిన రాజపుత్రు లా
తురమున వచ్చి వేడుకను ధూర్జటికార్ముక మట్టె చూచుచున్. 566

చ. అనుపమసాహసంబలర నాధను నెత్తఁగఁ బూని సుంతయై
నను గదలింపఁజాలక మనంబునఁ బొంగెడు వ్రీడఁ బల్కకే
చని రొకకొంద ఱద్దిఁ గని సాధ్వసముం గని; రొక్కకొంద ఱా
ధనువున కట్టె మ్రొక్కి తమదారిని వే చని; రొక్కకొందఱున్. 567

చ. హరుఁడు గురుండు మాకును శరాసన మీయది మద్గురుస్వమా
నరయఁగ మాకుఁ బూజ్యమగు నయ్యది యెక్కిడఁ బూన దోసమా
హరునివిధంబునం గొలువనర్హమె యంచు వచించి మ్రొక్కి పో
యిరి స్మరియింపకే తమయహీనకులక్రమపౌరుషాదులన్. 568

ఉ వచ్చుచుఁ బోవుచుం గనుచు బాహుబలంబున నెక్కుపెట్టఁగా
ముచ్చటఁ గాంచుచుం బొదలు మూఢతఁ జెంతకుఁ జేరి నారి నే
ర్పచ్చుపడంగఁ గోటికిని నల్లనఁ జేర్పఁగ నిశ్చయించుచున్
హెచ్చినసాహసంబు మెయి నేడ్తెఱఁ ద్రుంగఁగఁ జేయఁబూనుచున్. 569

తే. ఏపనియుఁ జేతఁగామికి నీసడించు, చును బ్రతాపమ్ము తగ్గంగఁ జోద్యమందు
చును ననుం గాంచి కోపంబుఁ గనుచుఁ బోయి, రొక్కకొందఱు రాట్సుతు లుక్కడక్క.

చ జనపతు లొక్కకొందఱు విశాలమతుల్ చెడ నన్ను దూఱుచున్
జనిరి; మునీంద్ర! యీయదియె శంకరచాపమహత్త్వ మింక నీ

మనమున నెట్లు తోఁచునొ సమస్తవిధంబుల నట్లు చేయఁగాఁ
జనుఁగద నాకు నేమి యిఁక।శాసనమం చని దోసిలొగ్గినన్. 571

మ. జనకక్ష్మాపతిశేఖరుం గని కుశి।క్ష్మాపాలవంశాబ్ధిచం
ద్రునిరీతిం గనుపట్టుమానిపతి తో।డ్తోఁ బల్కె; జ్ఞానాంబుధీ!
ఘనుఁ డీరాముఁడు రాజమాత్రుఁడని ని।క్కం బెన్నఁగా వాఁడు శం
భునికోదండముఁ జూపినన్ ఫలమె య।బ్బున్ బల్కులేలా యిఁకన్. 572

చ. పలుకఁగ నేల యీఘనుని।బాహుబలం బిటువంటిదంచు ని
స్తులుఁడు చరాచరంబులను।శుభ్రగుణాకరుఁ డీడ్యుఁ డీతఁడా
నిల నవతార మొందెఁ బర।మేశ్వరుఁడే యని నమ్మి చాప మి
మ్ముల నిటఁ జేర్పఁగాఁ బనుపు।మోద మెసంగెడు దానిఁ జూడఁగన్. 573

చ. త్వరపడి యిట్లు పల్కు కుశి।వంశపయోనిధిశీతరశ్మి వా
గ్వరతి నెఱింగి వేగమ ప।విత్రమహేశశరాసనంబుఁ దే
నరుగుఁ డటంచుఁ గింకరుల।కాజ్ఞ యిడం జని వార లామహే
శ్వరుని ధనుర్వరంబు బహు।భంగుల యత్నములొప్పఁ దెచ్చినన్. 574

హరధనుర్భంగము.

మ. జనకోలాహల మట్టి రేఁగెఁ బెలుచన్।సర్వాశలం గప్పి నిం
గిని బర్వెన్ మునినాథుఁ డారఘుపతిం।గీర్తించి వే లెమ్ము; దీ
నిని మోపెట్టుము; రాజవర్య! యశమున్।నిల్పంగ నీవేకదా
జననం బందితి; వన్న రాఘవుఁడు చం।చద్విక్రమం బొప్పఁగన్. 575

సీ. ఉత్తరీయంబు మహోద్ధతి నడుమున, బిగియించి యెంతయు।వేడ్కమీఱ
శివునికోదండము।చేరువకుం జని, దానియాకృతిఁ గాంచి।తత్తఱిలక
లఘుతరమని యెంచి।లక్ష్మణుఁ గాంచుచు, నొకకరంబున దాని।నొనరనెత్తి
జ్యావల్లి గోటితో।సంధింపఁజేయంగ, యత్నించునంతలో।నతనిబలిమి
తే. నోర్వఁజాలక శంకరు।నుగ్రచాప, మట్టె రెండయ్యెఁ బెనురవ।మఖిలదిశలఁ
బ్రతిఫలింపఁగఁ జేయంగఁ।బ్రమద మంది, రపుడు కౌశికముని జన।కావనిపులు.

ఉ. ఆనినదంబు భూతనయ।కాత్మముదం బొనఁగూర్పఁజాలె దు
ర్మానమునం జెలంగు సుర।రాజవిరోధుల కార్తినిన్, మహా
మానుల కాత్మహర్షమును,।క్ష్మాపతిసంతతి కాత్మశాంతినిన్,
జానల కాత్మసమ్మదముఁ।జక్కఁగ నొక్కక్షణంబులోపలన్. 577

చ. హరుని శరాసనం బొగి ద్వి।ధాకృతి మించినఁ గాంచి రామునిన్
బరినుతిచేసి రభ్రమున।భాసిలునిర్జరవర్యు లెంతొ యా
దరమునఁ గౌశికుండు గురు।ధాముని రామునిఁ గాంచె భూమిభృ
ద్వరుఁడు మునీంద్రపూజ్యఘన।తం దగునాజనకుండు పొంగె లోన్ 578

చ. మునివరు లొక్కటన్ శ్రుతిసమూహవచస్సుల నాశిషంబులం
దనిపిరి; రామభద్రు నటఁ దత్పరతం గనుచున్న సాధ్వి లీ
వనరుహపత్రనేత్రుఁడు సుభావపవిత్రచరిత్రయైన భూ
తనయకు నర్హుఁడౌ పతియె ధర్మము వర్ధిలు వీరియాదృతిన్. 579

క. అని మంతనంబు సల్పిరి, వినిపించిరి వార్తదాని వేగమ భూమీ
తనయకు హర్షాంభోనిధి, మునిఁగెన్ సీతయును రామమూర్తిఁ బడయుటన్.

ఉ. అత్తటిఁ గౌశికుంగని ప్రహర్షరసంబు తనంత పొంగ భూ
భృత్తముఁడైన యాజనకుఁ డేమిఁక నాజ్ఞ వరించుగాక నా
చిత్తము చల్లఁజేయు గుణశీలసమన్విత సీత రాముఁడీ
యుత్తమకార్యమయ్యె సుగుణోత్తమ! నీదు ప్రయత్నసంపదన్. 581

చ. అనుటయు గాధినందనుఁ డహా! చరితార్థుఁడ సచ్చరిత్రుఁడన్
జననము సార్థకంబె వ్రతచర్య ఫలంబును గాంచె నిఁక నో
జనకనృపాలశేఖర! విశాలయశుండగు రామతండ్రి కొ
య్యనఁ దెలియంగఁ జేసి త్వర నర్హవిధిం బొనరింపు పెండిలిన్. 582

క. కొలఁదిదినంబులలో మంచిలగ్న మొప్పారు నపుడు చేయుమ యీ పెం
డిలి లోకహితముఁ గోరుచు, నిలాధిపా! యన్న సట్టులే యగు ననుచున్. 583

ఆ. దశరథునకు నప్డు తచ్ఛుభవార్తలఁ, దెలుప నాశ్వికులను నెలమిఁ బంచి
స్వీయకృత్యములను జేయుచుండె నయోధ్య, కేగి వారు తెలుపహితమెఱింగి.

చ. క్షితిపతి యట్లు రాఘవుఁడు చేసిన కార్యము లోఁ దలంచి స్వీ
యతరుణులెల్ల రాఁగఁ జతురంగబలంబులఁ గూడి పోయె స
మ్మతి మిథిలాపురంబునకు; క్ష్మాపతిరాక నెఱింగి వే పురో
హితయుతుఁడై యెదుర్కొని సమిహితపూజలఁ దన్పి యంతటన్. 585

మ. జనకక్ష్మాపతి వారిఁ దోడుకొని వస్త్రశ్రేష్ఠముం జేర్చి చ
క్కనిమర్యాదలఁ దన్పి యెల్లియ యగుం గల్యాణ మం చొప్పఁజె
ప్పిన నాపంక్తిశతాంగుఁ డెంతయును సంప్రీతుండుగా నొప్పుచున్
దనయస్తోమముఁ గౌఁగిలించుకొని యే ధన్యుండనం చెంచుచున్. 586

క. గురువర్యుఁ గాంచి కృత్యము, జరపందగునంచు వేఁడ సన్మానియు భూ
వరునానతి గోదానా, ద్యురుతరకర్మములఁ జేసె నొగి విధియుతిగన్. 587

సీ. ఉద్వాహసుసమయ మొక్కట నేతేర, జనకమహీపతి చారురీతి
శాస్త్రోక్తపద్ధతి సజ్జనసమ్మతి, నొనరింపఁగాఁబడియున్న పెండ్లి
వేదికపై విధి వీతిహోత్రునిఁ బ్రణయించి భూపుత్రిని నెదుట నిల్పె;
రామచంద్రుఁడు సోదరత్రయసంయుతి, వేదికపై నిల్చె; భూదయితుని

తే. తనయ యూర్మిళయును జనకునను జాతు,తనయలిర్వురు వేదికాంతరమునందు
సీతతో నిలుచుండి రీరీతిఁ బెండ్లి, మండపం బెంతో వింత నమరి చెలంగె.

క. జ్వలనుఁడు ఘృతపరిమళసమ్మిళితాంగుం డగుచు వెలిఁగె మించినవేడ్కన్
సులలిత మీకల్యాణం, బిల కనెడు విధంబుఁ దెలుప నెంచినరీతిన్. 589

ఉ. అత్తఱి మైథిలుండు కమలాప్తకులాభరణంబు రాముని౦
జిత్తముపొంగఁ గాంచి గుణశేఖర! యియ్యది సీత నెమ్మి నే
నుత్తమపుత్త్రిగాఁ దలఁచి యొప్పుగఁ బెంచితి నింతకాల మ
త్యుత్తమరూపశీలసుగుణోజ్జ్వలయాఁ దలపోసి చూచినన్. 590

క. నీకు సహధర్మచారిణి, యేకరణిఁ దలంపనా నభీష్టప్రదయా
నీకన్నియకరమునుఁ గైఁ,గైకొమ్మా భద్రము లొగిఁ గల్గుత! నీకున్. 591

క. లోకంబులెల్ల సంతో,షాకలితములౌను నీమహంబున నిఁక నీ
భూకన్యకఁ గూడియె య, స్తోకసుఖశ్రీల నొందిశోభిలు మిలలోన్. 592

క. నీరాజ్యంబున దానవ, వీరుల మాయలు నశించి విమలసుఖము చే
కూరఁగ సుఖులై ధర్మ, ప్రారంభులునగుచు సత్ప్రభావము లలరన్. 593

క. జను లొప్పుచుంద్రు గావుత!, నిను నాకొమరితను సాధునిర్మలయశమున్
వినుతాయతకీర్తియుఁ బొం,దును గాక చిరంబుగా మనుఁడు ధాత్రిపయిన్. 594

చ. అని వచియించి సాధుమతి నాజనకక్షితినాయకుండు రా
మునకు నిజాత్మజాతకు నమూల్యమనోహరరత్నరాసులన్
గనకవిభూషణంబులను గాంచనశృంగఖురాళి నొప్పు ధే
నునికరమున్ శతాంగములనున్ గజవాజుల నిచ్చె వేడ్కతోన్. 595

ఆ. లక్ష్మణాదిసహజులకు నూర్మిళాదిక, న్యలనొసంగె వారు హర్షసాగ
రమునఁ దేలి రంత రాజర్షి జనకుండు, దశరథుండు పురికిఁదరలనెంచ. 596

క. పరికించి కొమరితలలో, నిరుపమలావణ్యసుగుణ నీరధి యనఁగాఁ
బరినుతిఁ గాంచిన సీతా,తరుణీరత్నంబుఁ గాంచి తనమది నెంచెన్. 597

చ. అరుదుగదా ధరాతలమునందున నిట్టికుమారియుంట నే
వరుసగ నెన్నిజన్మముల వారకపుణ్యము సల్పినాఁడనో
యరయఁగఁ జాల సత్యముగ నాజగదంబయె యిట్లు పుట్టె ని
ద్ధరణికుమారగా నిఖిలదానవసంహతి సంహరింపఁగన్. 598

ఉ. ఈరమణీమణిం గలిసి యీరఘురాముఁడు క్రూరదానవ
స్ఫారబలంబుఁ జెండి సురసత్తముకార్యములెల్లఁ దీర్చి యీ
ధారణి ధర్మముల్ నిలిపి తత్త్వవిదుత్తమసేవితాంఘ్రిపం
కేరుహుఁడౌను శ్రీపతియె కేవల మీతఁ డటంచుఁ దోఁచెడున్. 599

ఉ. రాముని దివ్యపత్న్యుటసారఃప్రభవద్వయ మాశ్రయించినన్
శ్రీమహితంబు శాశ్వతము సిద్ధితపఃఫలభూతముల్ మహో
ద్ధామసుఖాకరంబుఁ బ్రమోదస్థితిమూలము నైనముక్తి స
ద్ధామము చేకుఱున్ మరల ధాత్రిని జన్మము గల్గదెమ్మెయిన్. 600

మ. అనుచున్ నిశ్చయ మాత్మఁ జేసికొని యత్యంతప్రియం బొప్ప న
ల్లునకున్ గాన్కలొసంగి ధ్యానరతిమై లోలంబుగా నొక్కరీ
తిని జిత్తం బొగి నిల్ప శ్రీపతిగ నాదేవాదిదేవున్ దలం
చి నిజావాసముఁ జేరి యాదినముఁ బుచ్చెన్ బంధుయుక్తంబుగన్. 601

జనకుఁడు సీతకు ధర్మములం దెల్పుట.

సీ. ఉదయమె లేచి కాలోచితకృత్యముల్, నెరవేర్చి బాంధవనికరము పయ
నమునకు సిద్ధమైనం గని యెంతయుఁ, బ్రియముసంధిల్లఁ బుత్త్రికను సీతఁ
గనుఁగొని పయన మాదినముననే యంచు, వచ్చిన వార్తను వరుసఁ దెల్పి
చెంతఁగూర్చుండుమా చింతిల్లకుండుమా, తనయామణీ! యంచు ధారలుగనె
తే. జాలు కన్నీటి నాపంగఁ జాలకుండి, యెట్టులో యత్తవారింటి కేగునట్టి
పుత్త్రికిం జెప్పఁదగునట్టిబుద్ధిఁ గఱపఁ, బూనియిటుపల్కె జనకభూజాని యెలమి.

ఉ. పెంచితి నిన్నినాళ్లు కడుఁ బ్రీతిని గాంచితి; నిన్నుఁ గాంచుచున్
మించినలోకమాన్యత సమృద్ధయశంబును గీర్తిఁ జక్కఁగాఁ
గాంచితి; బంధుసంతతిని గౌరవమొందితి; దివ్యకన్యరో!
యెంచిన నీకతంబుననె యిన్నియుఁ గల్గెను భాగ్యసంపదన్. 603

మ. కనులంగాంచిన కానుపాటనుగదా కల్యాణి! నిన్ బాసి యొ
క్కనిమేషంబును నిల్వఁజాల నను కాంక్షం గంటి నెట్లైనఁ గ
న్యను బ్రాణేశునివాసభూమి కనుపన్ న్యాయంబు వర్తించుఁ గా
వున నిన్నుం బనుపంగఁ బూనితిని బూవుంబోఁడి యింకేమనన్. 604

చ. జనకుఁడ నంచు నన్ దలఁచు జాల్ముఁడఁ గావున నాకుమారివై
తనరెద వంచు నీయశము దప్పక కోరెదఁ గానఁ గాపురం
బునకుఁ జనంగఁ బూనునిను బుద్ధులఁ దెల్పియె పంప నెంచితిన్
వినఁదగు నీ వెఱుంగనివి విశ్వమునం గలవే తలంచినన్. 605

చ. ధర నవతారమందితి నితంబిను లెల్లను నీ ప్రవృత్తినే
యొరవడిగా గ్రహించి యశ మున్నతిఁ గాంచఁగలా రటంచు నీ
వరసిరియొ యాదిలక్ష్మివి కదా తలపోయఁగ నట్టి నిన్ను నే
నిరతిని బుత్త్రిగాఁ దలఁప నేర్చితిఁ బ్రాగ్జనభాగ్య మెట్టిదో. 606

క. తెలిసియొ తెలియకయో నేఁ, బలికెద స్త్రీధర్మములను పరవర్ణినిరో!
తలఁపుము దాని నుదాహృతి, నిలనొందునటంచుఁ జక్కనింకన్ వినుమా 607

చ. తరుణి జనించుటాది మృతిదాఁక స్వతంత్రత నొందరాదటం
చరసి వచించె నామను మహార్యతపఃప్రతిభాభిరాముఁడై
పరఁగుట నస్వతంత్రతయె భామిని కర్మము; బాల్యమందునన్
గురుమతి తండ్రి కావఁగఁ దగున్ మఱి జవ్వనమందు నాథుఁడున్. 608

తే. వార్ధకంబునఁ బుత్రులు వరుసఁ బ్రోవఁ, దగుదు రంతియ కానిస్వాతంత్ర్యమతివ
కెట్టితఱి నుండరాదుగా యెవతెయైన, నియమమును దీని విడరాదు నిశ్చయంబు.

చ. కులమును దన్ను విత్తమును గొప్పతనంబును గావ నెంచు వా
రలు తమధర్మపత్నులను రంజిలఁ జేయవలెన్; సరోజనే
త్రలు తగఁ గుందిరన్ జెడును దప్పక వంశముఖంబులెల్ల; న
ట్టులగుటఁ బ్రాణనాథులు కడుం దమిఁ బ్రోవఁగ నొప్పు దారలన్. 610

చ. పెనిమిటియే పరాత్పరుఁడు ప్రేయసి కాతనిమించుబంధువుల్
గనఁబడ రెన్నిభంగులను గాంచిన నట్లగుటన్ సతంబు భ
ర్తను గొలువంగఁ బూనఁదగుఁ దామరసాక్షియు నించుకేని యా
తనిమదిఁ గుందఁజేసిన నితాంతము నారకమొందు టబ్రమే! 611

చ. తొలుతను బెన్మిటన్ బ్రియముతో విధిమీఱఁగఁ బూజచేసి య
వ్వలఁ జనుదెంచునర్థులకు భక్తిని బూజయొనర్పఁగాఁ దగున్
జలమున శాస్త్రమార్గమును జయ్యన వీడియె పూజలం దగన్
సలిపిన నిష్ఫలంబగుటచాలక పాపము గూడఁ జొప్పడున్. 612

సీ. ప్రాణనాథుఁడు తెచ్చుపరికరంబుల నెల్ల, దాఁచి పెట్టుటయును దగినభంగి
వ్యయ మొనర్చుటయు గృహంబును జేరిన, బంధుల నర్థులఁ బరమముదము
నను బరామర్శించి యనువుగ వారికి, స్నానభోజనముఖసత్క్రియ లొగి
జరగునట్లుగఁ జేసి సామవాక్యంబుల, ననునయించుటయు దేవార్చనములఁ
తే. సమయమును దాటకుండఁగఁ జక్కనమరఁ, జేయుటయు భర్తకుందగు సేవలెవరి
వలన నెయ్యవి యెట్లు కావలయు నట్ల, జరగ నియమించుటయు నివి సాధ్విపనులు.

క. ధనమార్జించెడు నప్పని, పెనిమిటి; దద్దాని వ్యయము పెట్టుపని యగున్
వనితకు గృహాధిపత్యం, బనునది యా స్త్రీయధీనమనిరి మునివరుల్. 614

ఆ. గృహిణియనఁగ నర్థమిదియే కుమారిరో!, యెల్లపనులు సతికిఁ జెల్ల వెపుడు
కాని విధికి హితములైనవాని నొనర్ప, కున్నఁ బాప మొదవు నుర్వియందు.

క. ఇట్టివి శాస్త్రంబులఁ జూ, పట్టెడు మఱికొన్ని వానిఁ బలుకఁగ నేలా!
పట్టీ! నీవ యెఱుంగుదు, వట్టులె యైనన్ వచింతు నటఁ గొన్నింటన్. 616

సీ. పరగృహవాసంబుఁ బతిమాని చేయ రా, నట్టులె యాత్రకు నరుగ రాదు
పరపూరుషులతోడఁ బలుకంగ రాదు ప్రాణేశునిసన్నిధి నేని పరుల

తోడఁ జమత్కృతిఁ గూడిన పల్కుల, భాషింపఁగా రాదు; పరజనపద
ములయందు వసియింప బుద్ధి నెంచఁగ రాదు; పానంబు చేయుట పాడిగాదు;
తే. సభలకుం బోవఁగా రాదు సత్యహీన,ముగను బతితోడనుం బలుకఁగను రాదు
దుష్టవనితలసంగతితో నదెందు, జనఁగ రా; దివ్వియెల్ల దోషంబులగుట. 617

సీ. ఒంటరిగాఁ దనయింటనే నుండఁగాఁ, జనదనియెఱుఁగు; మో తనయ! పరుల
యిండ్లవార్తలు తా నదెప్పుడేఁ బలుకంగఁ, దగదు; ద్వారముకడఁ దాను నిల్చి
దారిఁ బోయెడునట్టి పూరుషులం జూచు, చుండఁగా రా; దెప్పు డుద్ధతిమెయి
బాలురతోనేని భాషింపఁగా రాదు; ప్రల్లదంబుల నెప్డు పలుకరాదు;
తే. తగనివేషం బదెట్టులేఁ దాల్పరాదు, మగనికంటెను మును భుజింపఁగను రాదు
నిదురపోవుట వెనుకఁ దా నిద్ర లేచు, టవలఁ జేయంగఁ దగునందు రువిదమిన్న!

చ. కలిగినయంతలోన శిశుకాండము భర్తను జక్కఁ బ్రోచి యే
పలుకును గాని ఘోరము సభవ్యమునై తగఁ బల్కఁ బూన కి
మ్ములఁ గృప తొంగలింప గృహముం గనవచ్చినయాచకవ్రజం
బులఁ దనివొందఁ జేయనగుఁ బూజ్యచరిత్రము తెల్లమౌనటుల్. 619

చ. పతిని సతంబు దూఱుచును భావవిశుద్ధి యనంగ లేక యే
వితమునఁ దోఁచు నట్లుగనె వేడుక మీఱఁగ సంచరించుచున్
హితముఁ ద్యజించి స్వేచ్ఛగనె యెల్లెడ నెల్లరఁ గూడియుండుచున్
గృతముఁ దలంప మానుదురు హీనమతుల్ గలవార లక్కటా! 620

చ. పెనిమిటికంటె ముందుగనొ పెంపుగ నంబడఁ గూడనో భుజిం
పను దగదన్న ప్రాక్తనపుఁ బల్కును మీఱుదు; రంతకంటె నిం
కను గలదే యఘంబు కులకాంతకు నో ప్రియపుత్త్రికా! తనం
తన లభియించుపుణ్యమును దా వలదంటఁగదా! తలంపఁగన్. 621

సీ. గృహశుద్ధిగావించు నింతులగని పెట్టి, భాండశుద్ధి నొనర్చువారి నరసి
వస్త్రములంగూర్చు వారలఁ బరికించి, కలపంబు లందిచ్చు నెలఁతలఁ గని
రత్నభూషణరాజి రమణ నందిచ్చెడు, పూవుఁబోడులవృత్తి పోలఁగాంచిఁ
కానుకలంగొని వాని నొక్కటనుంచు, సరసిజాక్షులమరిఁ జక్కఁ దెలిసి
తే. బంధువుల నాదరించునప్పని యొనర్చి, నన్ను మిన్నలవర్తన మాత్మ నెమకి
వారలను జక్కదండించుభంగి నెఱిఁగి, వర్తిలఁగఁ బోలు నిల్లాలు వారిజాక్షి!

సీ. అత్తమామల మరియాద సేవింపుము, గురువుల నతిభక్తిఁ గోరి కొల్వు
మతిథుల మఱియు నభ్యాగతులను బర,దైవతంబును గాఁగఁ దలపు మెప్డు
బంధువులం గన్నఁ బరమాదృతిం జూపు, మెలమి సేవకుల మేలెపుడు కోరు
మాత్మతుల్యులుగాఁగ నరయుము తోడికో,డండ్రను సఖుల మనంబులలర

తే. వర్తిలుము బీదజనుల ద్రవ్యంబొసంగి, సంతసమునొందఁ జేయుమో సత్కుమారి
పుట్టినిల్లును మమతచే మెట్టినిల్లు, విమలయశమున వెలయఁ జేయుము సతంబు

చ. అమలగుణాఢ్యయౌ తనయ । యన్నివిధంబులఁ బ్రాణనాథువం
శమునకుఁ బోలెఁ దండ్రిదగుసంతతి కెంతయుఁ గీర్తిఁ దేఁదగున్
విమలతమంపువృత్తిఁ గొని । విశ్వనుతిం గనఁగాఁ దగుంగదా
క్షమపయి నట్టికన్యకలఁ । గన్నయదే గద భాగ్య మన్నచోన్. 624

చ. సకలగుణాభిరామవయి । శ్లాఘ్యలిఁ బావనకీర్తిఁ గాంచి స
ర్వకళల నాఱితేఱి మునివర్యులకుంగల సంశయంబులన్
బ్రకటమతిప్రభావగురుపాండితిఁ బాపఁగఁజాలు నీకు నే
మి కలవు నేర్ప నర్హములు । మిక్కిలిప్రీతిని బెంచినందునన్. 625

చ. తెలిసిన కొన్నినీతులను । దెల్పితి సర్వము నే నెఱింగిన
ట్లిలఁ గొనియాడ నర్హవయి । యెల్లరుమెచ్చఁగ నొప్పునీవు నా
పలుకుల నాదృతిన్ వినఁగఁబాల్పడి తింక వచింపనేల? యి
మ్ములఁ జనవమ్మ సజ్జనసమూహము గావఁగ భర్తతోఁ దమిన్. 626

చ. నిను సకలామరప్రవరనిత్యనమస్కృత పాదపంకజా
తను బ్రకృతిన్ మహేశ్వరినిఁ । దా నెదఁ దాల్పకయున్న నేమిచే
యను దగుశక్తిలేక పరమాత్మయు నుండును నిన్నుఁగూడి నం
తనె క్షణమాత్ర లోకసముదాయము నిర్మితిఁ జేయఁజాలెడున్. 627

మ. పరమేశీ! సకలంబు నీవె సృజియింపం బెంపఁ ద్రుంపన్ మనో
హరరీతిన్ వెలయింప వేల్పొకఁడుగా । నద్దాని మార్పన్ నిరం
తర మల్లే నిలుపన్ క్షణాంతరమునం । దత్త్వాంతరం బొందని
ర్భరశక్తిన్ జరపన్ సమర్థవు కదా । పల్కంగ నేలా యికన్. 628

చ. అనుపమయుష్మదంఘ్రిజలజాత్తరజఃకణ మొండు శీర్షమం
దు నిలిపి యవ్విరించనుఁడు । తోరపుశక్తిఁ జెలంగి సృష్టిచే
యను దగుయోగ్యతం బొదలు । నంబుజనాభుఁడు దానిఁదాల్చి ప్రో
వను లయమొందఁ జేయ వృషవాహనుఁడున్ దగియుండు రోసతీ! 629

చ. జలరుహపత్రనేత్ర! విను । సత్త్వగుణంబున విష్ణునామమున్
గలితరజోగుణంబునను । గంజభవాఖ్యఁ దమోగుణంబునన్
విలయకరాహ్వయంబుఁ గడువింతగ దాల్తువు నీవె స్వేచ్ఛమైఁ
బలుకఁగలాఁడు కల్గునొకో । పావనతావకవర్తనం బిలన్. 630

చ. హరిహరులున్ విరించనుఁడు । నయ్యమరాధిపుఁ డింకఁగల్గుని
ర్జరులును మౌనిరాట్టులును । సంతతముం దమిపొంగ శ్రద్ధచే

శిరములయందు వెల్గుమణి।చిత్రితసాధుకిరీటపంక్తిఁ ద్వ
న్నిరుపమదివ్యపాదయుగ।నీరజరేణువుఁ దాల్తు రద్దిరే. 631

మ. పరమేశుం డఖిలేశుఁడై గుణయుతిన్ । భాసిల్లుచుండన్ మహే
శ్వరివా నీవె సమస్తకార్యముల స్వే।చ్ఛం జేయుచున్ బ్రీతిపై
హరవిష్ణ్వబ్జజులం ద్రిమూర్తులుగ సం।హారావనోత్పత్తికా
ర్యరతిం బొందఁగ నాజ్ఞ చేసి యసమ।ఖ్యాతిం బ్రవర్తింతుగా. 632

మ. నిను వీక్షింప భవద్యుతుం దనుధరున్ । నీభర్త దర్శింప మా
నినికాయంబు నమర్త్యవర్యులు నిలన్ । నింగిన్ బ్రతీక్షించుచున్
మనసుల్ వ్యాకులతం గనం జిరముగా । క్ష్మాపుత్త్రిరో యున్నవా
రన నింకేటికిఁ బెక్కుమాటలు సమ।స్తార్థజ్ఞవౌ నీకడన్. 633

క అవినాభావ మనంజను, సువిహితసంబంధ మలరుఁ।జుమ్మిరువురుగా
భువిఁ బరఁగుమీకుఁదల్లిరో, వివిధగతుల్ మీఱు నుంద్రు । విమలాత్మేచ్ఛన్

చ దనుజులు నీనెపంబుననె । తారని మ్రందఁగలారు పూరుషుం
డని యిలఁ గీర్తినొందు పర।మాత్ముని చేనిది వింటి మున్నె యా
సనకసనందనాదులగు।సర్వవిదుల్ వచియింప నీకు రాఁ
జను శ్రమసంతతుల్ తలఁప । సత్యము లెట్లగు? శర్మదంబులే. 635

మ. పలుమాటల్ పనిలేదు నీనెపమునన్ । బద్మాక్షి! శ్రీరాముఁ డీ
యిల దుర్మార్గులనెల్లఁ బోనడఁచు నీ।వింకం ద్వరంబూని మా
నులకష్టంబులు వాపఁగాఁ దలఁపు మా।నుల్ నిన్నె ధ్యానించుచుం
గలకాలంబు భవన్నుతిన్ సలుపుచుం । గాలంబు పుత్తుర్గదా. 636

శా. భక్తశ్రేణికిఁ గల్గుశర్మమె మహా।భద్రంబు నాకంచు సం
యుక్తానూనమనోభిలాషముననే । యున్నట్టి నీకింక నో
శక్తీ చెప్పఁగనేల నైన సుత యన్।స్వాంతంబుతో నున్న నీ
భక్తుం డీతఁడు పల్కునాశయ మెదన్ । భావింపుమా చక్కఁగన్. 637

క. నీదగుతేజోరూపం, బౌదల ధరియించి తాఁ గృ।తార్థుఁడుగాఁగన్
వేదనిధియైన హుతవహుఁ, డో దేవీ! సతము తలఁచు।చుండున్ మదిలోన్ 638

క. అతనిదగు ప్రార్థనం బో, సతి వత్సరమున్ ఫలింపఁ।జాలు విధమునన్
మతిఁ దలఁపవమ్మ విని నే, నతిశయమోదంబుఁగనుదు।నన్వహమాత్మన్. 639

మ. నిను సేవించినఁ దిర్యగాదులు మహా।నీత్యన్విత స్వాంతముల్
గని యేకార్యమునైనఁ జేయఁగల వీ।క్ష్మాభాగమం దన్న నీ
తిని విఖ్యాతము చేయఁబూని జననీ! । దేవౌఘముల్ స్వాంశముల్
తనుతం బొందఁగఁజేసినారు కపిసం।తానాదులౌ జాతులన్. 640

తే. వానిసాయంబుగొని రఘువల్లభుండు, దుష్టరాక్షసపంక్తులఁ ద్రుంచు నిన్నుఁ
గారణంబుగఁ గొని దీని కల తెఱంగుఁ, దెలిసి పల్కిరి మౌనులు దివ్యదృష్టి.

చ. అనుచు వచించి యిట్లను మహామతి యజ్జనకుండు తల్లిరో
విను మిట లోకవర్తనము విస్తృతిఁ జేయ వచించినాఁడ నీ
కు నెఱుఁగఁ జెప్పునంతటి యకుంఠితపాండితి గల్గువాఁడనే
యని ప్రమదాశ్రువుల్ దొరఁగఁగ నత్తఱి నూరకయుండె సీతయున్. 642

క. పితృపాదులు వచియించిన, హితవాక్యము లాలకించి యెలమిమిగుల నీ
గతిఁ బల్కెను బ్రియజనకా,సుతఁ బొగడం దగునె యిదివసుంధర గలదే

ఉ. ఏగతి నన్నుఁ బెంచితివొ యెట్టిహితం బుపదేశ మిచ్చితో
బాగుగ నే నెఱుంగుదును బ్రాజ్ఞలలాముఁడవై ననీవు న
న్నీగతి సన్నుతింపఁ దగునే యిది యేని మహత్త్వ మున్నచో
భోగులు రాగులుం దెలియఁబూనకయుండఁగ దాఁపఁగాఁ దగున్. 644

మ. పరమేశుం డొకఁడే సమస్తవిదుఁడై భాసిల్లు నాయీశుఁ డె
క్కరణిన్ లోనఁ దలంచు నవ్విధముగాఁ గార్యంబుసాధింతు నీ
శ్వరి యన్నామము లోకకార్యములలో వర్తించు నాకాలమం
దు రహిన్ జెల్లును నాకుఁ దోఁచినగతిన్ దోడ్తోఁ బ్రవర్తిల్లుదున్. 645

ఉ. జ్ఞానమయాంగుఁడీశ్వరుఁడు సర్వముఁ జేయఁగలాఁడు కానితా
నౌను గదా నిరంజనసమాహ్వయుఁ డేమి యొనర్ప నెంచునో
మానసమందునప్పుడె సమస్తము నేనె యొసంగఁ జేయుదున్
గానె సజ్జనుల్ ప్రకృతిగా నను నెంతురు చిత్తసీమలన్. 646

ఉ. కొందఱు ముగ్ధులౌ నరులు కొంకొకయింతయు లేక నేనె లే
దందురు వారికింటె నొకఁడైనను మూర్ఖుఁడు భూమి నుండఁ డా
నందమె నాదురూప మని నామము లన్నియు నాకుఁ జెల్లు నం
చుం దగ వారెఱుంగ రిది చోద్యముగాదె తలంచి చూచినన్. 647

చ. అనలునినుండి వేఁడిమి సుధాంశునినుండియు శైత్యమున్ దొలం
గ నొనరుపంగ శక్య మెటులగాదొ ననుం బరమేశునుండి వే
ఱొనరుప నట్లశక్యమగు నోజనకా! శ్రుతిసార మిద్దియే
యనుచు నెఱుంగఁజాల రకృతాత్ములు కొందఱు భూస్థలంబునన్ 648

చ. శ్రుతులు తదంతముల్ స్మృతులు శోభిలునప్పరమాత్మతత్త్వ మీ
వితమని తెల్పుదర్శనముల బృందము భవ్యపురాణసంతతుల్
హితముగ నాచరిత్రము నదెంతగఁ దెల్పిన దానిసార మీ
గతియని సుంతయేని యెఱుఁగం డకృతాత్ముఁడు మానవుం డహో! 649

చ. ప్రకృతియె యీయజాండములఁ బర్వఁగఁజేయు నదొక్కవేళ నొ
క్కొకయపు డంతమొందునటు లొప్పఁగఁజేయు నిరీహుఁ డీశ్వరుం
డొకటియుఁ జేయఁబూనఁడు మహోత్తమమా ప్రమదాంబురాశివీ
చికలను దోఁగుచుండు నని చెప్పునుగాఁ దగ సాంఖ్యయోగముల్. 650

సీ. ఆనందరూపుఁడై యలరుపరాత్పరు, నిచ్ఛయే ప్రకృతి నా నెసఁగు దాని
కాపరాత్పరునకు నరయ భేదంబెట్లు, చెప్ప శక్యంబగు నెప్పుడేని
ప్రకృతికార్యంబన్నఁ బరమేశునిచ్ఛయే, యట్టిదౌ ప్రకృతి సహార్యవిభవ
మహిత నారాధింప మది నిచ్ఛగింపని, పురుషునిఁ బ్రోచునే పరమతత్త్వ
తే. మింతమాత్రమూహింపకయే కరములఁ, ద్రిప్పుచుఁ మాటలాడు సుధీరవరుల
పూర్వజన్మకృతాఘంబు భూరితరము, గాకయుండునె జనకభూకాంతమౌళి.

చ. సరసిజయోని విష్ణువును శంకరుఁ డీమువ్వురే త్రిమూర్తులం
చురుతరకీర్తిఁ గాంతురిటు లొక్కయజాండమునందె గాక యుం
దురు సకలప్రపంచముల ధూర్తులు కొందఱు వీరియందు నొ
క్కరుని బరాత్పరుం డనుచుఁ గాఱులు పల్కుదు రేమి చిత్రమో! 652

తే. వీరలే కాక యిట్టింద్రు వేలకొలఁది, నాదుసంకల్పముననె జన్మమును గాంచి
వెలయుచుందురు కార్యంబుగలుగుదనుక, వలదనితలంపమృతినొందువారుసుమ్ము.

చ. జలములయందు బుగ్గలటు జన్మము వృద్ధి లయంబు గాంచు వీ
రల మఱి యందునొక్కనిఁ బరాత్పరుగాఁదలపోయువారి నే
పలుకుల మెచ్చఁగాఁ దగునొ పార్థివవర్య! యెఱుంగరాదు నీ
చులు గతశంకులై యొకనిఁ జుల్కనసేయుచు దూఱుచుంద్రోగిన్. 654

చ. తలఁచినయంతనే హరియు ధాతయు శంకరుఁ డోయటంచు వే
పలుకుచు నాదునానతి నభంగురరీతిని మౌళిఁ దాల్తు రా
జలరుహనాభముఖ్యులనె శాశ్వతులంచుఁ దలంచి కొందఱి
మ్ముల వరముక్తిదాత లని పోరుదు రోలగమందు నజ్ఞులై. 655

చ. ఉపనిషదోఘకీర్తితమహోన్నతశక్తియుతుం డనంగ నొ
ప్పు పరమతత్త్వ మొక్కఁడె ప్రభుండన నాతఁడె వేఱొకండు కాఁ
డపరిమితప్రభావుఁ డగునామహనీయుని యిచ్ఛ యేన నా
కృపఁ గొనియే హరిప్రముఖులెల్లఁ జరింతురు లోకనాథులై. 656

శా. ఏరూపంబున నెట్టినామమున నేయేరీతి భేదాళిచే
నారాధించిన నన్నె గొల్చినటులేయౌ సందియం బేల భూ
పా! రూపంబు గలట్టిదేదియు మదీయం బంచు భావింపు మా
ధారం బెన్నఁగ నేనె కాన నను జెందంజాలు సర్వార్చలున్. 657

ఉ. రూపము దేనినో గలుగ। రూఢి నొనర్చి ననున్ భజింప హృ
త్తాపము లాఱునే మది ని। తాంతము శ్రద్ధదలిర్ప నాఱుగాఁ
దాపసకీర్తితంబులయి। తత్తదనూనశుభంబు లీయఁగా
నోపినయట్టి చక్రముల। నుత్తమవైదికపద్ధతిం దగన్. 658

క. పావనతేజస్సే నా,దా వపువౌ నంచు నెంచి। యల్లన యోగ
ప్రావీణ్యము తగ నియతిం, బావనమగు ధ్యానమునను। భజియింపఁదగున్. 659

క. ధ్యానమె పూజాపద్ధతి, మానస్మె తదంగమౌను। మాట లిఁకేలా
దానిని మించినమార్గము, గానంగారాదు నాదు। కరుణఁ బడయఁగన్. 660

తే. బాహ్యతీర్థప్రతతికంటెఁ। బరమమౌను, మానసంబను తీర్థమ। మ్మాడ్కి బాహ్య
పూజకంటెను త్తమమయి। పొల్చుఁగాదె, యంతరర్చన యెఱుఁగంగ। నగును [దీని.

ఉ. మానసికార్చనాఖ్య యను। మానము లేక ననున్ ప్రమోదముం
గానఁగఁజేయు భూమిపతి। కాంత మఱొక్కవిధంబు లేదు సూ
మానవు లల్పకర్మరతి। మానుదురీసుగమంపుఁద్రోవ న
జ్ఞానమె దానికారణము। జక్కమదిం దలపోసి చూచినన్. 662

చ. అని వచియించి పామరుని। యట్టులె యశ్రుజలప్రవాహమున్
గనుఁగవనుండి సంతతము। గాఁ బ్రవహింపఁగఁ దన్నుఁ గాంచునా
జనకుని నూఱడించె నట। సాగె ముహూర్తము మౌనివృత్తి చే
తనె పిదపన్ దనూజఁగొని। తాఁ జనియెన్ రఘురాము చెంతకున్. 663

తే. చేరఁదగినట్టివారెల్లఁ। జేరి రచట, సంతసమున నవోఢలు। చెంతనుండి
రత్తలట్టులె వరచతు। ష్కాంతికమున, దశరథుండుండె నెలమి నా। తరుణమందు.

మ. తనయత్నంబు ఫలించెనంచు మది మోదం బట్టె వృద్ధింగనం
దను ధన్యుం దలపోయుచుం బనియిఁకం। దాఁ జేయు భూజాతయే
యని స్వాంతంబున నెంచి గాధిసుతుఁ డ। వ్యాజానుకంపాకలా
పుని మాయేశుని రామచంద్రుఁ గనుచున్। బొల్పారుభక్త్యున్నతిన్. 665

చ. నిరుపమమంగళంబు లిడ। నిర్భరకష్టపరంపరల్ మహా
కరుణమెయిం దొలంగునటు। గా నొనరింప మునీంద్రకోటి క
బ్బురమగు ముక్తినీయఁ దగి। పూజ్యతమంబయి యొప్పుభూసు తా
వరుని శరీరముం గనుల। బాగుగఁ గాంచుచు లోఁ దలంచుచున్. 666

ఉ. అంతకు నంతకుం గనఁగ। నద్భుతమౌ గతి వృద్ధినొంది యా
వంతయుఁ జర్మచక్షువుల। కారయరానిదె యై చెలంగి దై
త్యాంతకమై వితర్కమున। కందక యొప్పెడు భూరితేజమున్
వింతగఁ గాంచి మైమఱచి। వేస్మృతినొంది భయంబు పర్వఁగన్. 667

చ. ఫలమిదె నేనొనర్చిన తపస్సులకెల్ల నటంచు నెంచి లో
పల నిముడంగలేక పయింబై వెలికుబ్బెడు సంతసంబునం
బొలిచి దృగంబుజద్వయము మూసి మనఃపదమందు రాముని
స్తులరుచిమూర్తి నిల్పి కడతుర్ భవవార్ధినటన్న యాహలన్. 668

విశ్వామిత్రకృతరామస్తుతి.

మ. పరమేశా! నినుఁ గాంచితం గనుక దివ్యంబయ్యె నాజన్మ మి
క్కరణిన్ సంతతముం నినుంగనెడు కాంక్షం బూనితిన్ రాఘవే
శ్వర! యిప్పాపర మెంతయుం గరుణమై సర్వేశ్వరుం డన్న పే
రరయం జెల్లును నీకె కాదె గతమోహభ్రాంతుఁడం జుమ్మికన్. 669

ఉ. నీదగు దివ్యతేజము వినిర్మలమూర్తిని గంటిఁ దృష్టిగా
నాదగు పూర్వపుణ్యము ఘనంబని తోఁచెడు సత్కృపానిధీ
శ్రీదయితుండ వీవె విధుశేఖరధాత లనంగ నీవె నీ
వాదిమపూరుషుండ వగుటారయఁ జాలరు మాదృశుల్ జనుల్. 670

మ. మునిసంఘం బురుయోగనిష్ఠల సతంబున్ స్వీయహృత్పంకజం
బున నిన్నున్ నెలకొల్పి నీపదయుగంబుం బూన్కి వీక్షించుచున్
మన మానందసముద్రవీచికల నేమంబొప్పఁ గ్రీడింపఁగా
ననిలాఘాతవిహీనదీప మటులే హర్షించు నిశ్చింతతన్. 671

ఉ. కొందఱు జ్ఞానరూపునిగఁ గొల్చుచు నిన్ను మహామునీంద్రసం
వందితపాదపద్మ భవవార్ధిఁ దరింతురు తైజసాకృతిం
గొందఱు ధ్యానయోగమునఁ గోరి భజించుచు ముక్తిఁగాంతు రి
క్లెందఱవెన్ని రూపముల నిచ్చఁ దలంచిన నాదు వట్టులే. 672

శా. ఏరూపంబును నీకొసంగి మది నెంతే భక్తి ధ్యానించినన్
గారుణ్యంబున నట్టిరూపముననే కానంబడంగోరు దీ
వో రామా! లలితావతారునిగ నిన్నొప్పారుసద్భక్తిచే
నారాధింతురు శాక్తులర్హవిధి నీభవవ్యాధిఁ బ్రేమింతుసూ. 673

తే. గాణపత్యులు నిన్ మహాగణపతిగనె, కొల్తు రట్టులె కాపాలికులును భైర
వునిగఁ బూజింత్రు వైష్ణవులును గరంబు, భక్తి శ్రీవిష్ణువుగనెంత్రు పరమపురుష.

క. శైవులు పరశంకరునిగ, భావించి యజింత్రు మఱియు భాస్కరునిగ నిన్
దేవా! సౌరులు తలఁతురు, పావనమతిఁ దలఁచువారిఁ బరికింతు వజా! 675

సీ. షణ్మతములె వేదసమ్మతములుగాని, యొక్కొక్కదోషమం దొప్పుచుండు
లింగధారణము చక్కంగన శైవంబు, నం దగుదోష మనంగఁదగును
జక్రాంకమద్ది వైష్ణవమునఁ గల్గిన, యట్టిదోషము శాక్తమందు మద్య
మాంసముల్ దోషముల్ మఱియుఁ గాపాలిక, మందుజటాస్థులనర్హములవి

తే. దాల్చుటయె దోషమగు సూర్య౹దైవతమగు, మతమున౯ రక్తతర్పణ౹మితరమైన
గాణపత్యమునందు ని౹క్కముగ దోష, మొక్కయుచ్ఛిష్టమే యగు౹నో మహాత్మ.

క. ఈమతషట్కమునందో, రామా! యీదోషతతి మ౹రల్చినఁ దత్త్వం
బీమహి నొకవిధమునఁ గన, నౌమాన్యులు దానిగొందు ౹ రాత్మేచ్ఛమెయిన్.

క. అన్నిఁట నీవె యుపాస్యుఁడ, వెన్నఁగ నొక్కొక్క రొక్క౹హితనామమున౯
నిన్నె స్మరింతురు వారలఁ, గ్రన్నన రక్షింతు వీవు ౹ కరుణానిధివై. 678

క. ఎవరెవ రేయేరూపం, బవధానముమీఱ నీకు ౹ నలవడఁగాఁ జే
సి వఱలుభక్తిని గొల్తురొ, భవతాపములెల్ల వారి ౹ బాధింపవుసూ 679

మ. నినుఁ బాషండులు గొంద ఱజ్ఞతమెయి౯ ౹ నిర్లిప్తుగా నెన్న గొ
క్కనివాసంబున నొక్కరూపమున ని౹క్కం బున్నవాఁ డంచుఁ ద
క్కిన దేవేశ్వరులెల్లఁ దత్పదములం౹గీర్తించుచు౯ గొల్చుచుం
డినచందంబునఁ బల్కుచుందు రకటా! ౹ నీరేజపత్రేక్షణా! 680

ఉ. నీదగురూప మిద్దియని ౹ నిర్ణయ మొప్పఁగఁ జేయలేక యే
యాదలలట్టె వంచి శ్రుతు౹లల్లన మౌనము దాల్చియుండెడు౯
శ్రీదయితా! యిఁకెవ్వ రిదె౹చెల్వగురూపము నామ మంచు స
మ్మోదముమీఱఁ జెప్పఁగల౹పూరుషపుంగవు లుందు రెందు నేన్. 681

చ. సకలము నీవయై వెలసి ౹ సర్వము నేనని తెల్పఁజాలు స
త్ప్రకటమహత్త్వమొప్ప నొక౹భంగి వెలుంగుచు నిన్నునీవె యె
ప్డు కనుఁగొనంగఁ జాలి జగ౹ముల్ ప్రకృతిస్థిరశక్తిఁ బొల్చుటల్
వికలత నొందుటల్ గనుచు ౹ వేడుక నొందుచునుందు వచ్యుతా. 682

చ. సరసిజపత్ర మంబువుల ౹ సంగతిఁ గాంచియుఁ గాంచకుండు న
క్కరణిగ లోకసంగతిని ౹ గాంచియుఁ గాంచనియట్టు లుండు ని
ర్జరమునిపూజితాంఘ్రి జల౹జాతయుగా భవదీయతత్త్వ మె
వ్వరికి నెఱుంగ రా దనుట౹వాస్తవమే యెటులేఁ దలంచినన్. 683

మ. అవివేకుల్ నిను నొక్కరూపముననే ౹ హర్వొందువాఁడంచు నొ
క్కవిశేషోజ్జ్వలదివ్యహర్మ్యమున ని౹క్కం బుండువాఁడం చొగి౯
వివరింపంగఁ దలంతు రట్టికుమతుల్ ౹ విష్ణూ! సమస్తంబునం
దు వసింపందగు నీమహత్త్వమును దో౹డ్తో నెన్నఁగా నర్హులే? 684

చ. వినయముచేత నొప్పెసఁగు౹విద్యను బొల్చెడు విప్రునందును౯
ఘనమగు నేన్గునందు నుప౹కారమెచేసెడు గోవునం దొగి౯
శునకమునందు నీచుఁడని౹చూడఁగ నొప్పుశ్వపాకునందు స
జ్జనులు సమానదర్శనులు ౹ సర్వగతు౯ భగవంతుఁ గాంచుటన్. 685

తే. పాత్రభేదంబుచేత దీపంబుభిన్న, వర్ణముగఁ గానఁబడునట్లు పరమతేజ [క్తి.
మాత్మరూపంబు గాఁదగు నవ్యయుండు, కానఁబడుభిన్నముగఁ బ్రాణికాండయు

క. స్త్రీపున్నపుంసకములనఁ, జూపట్టెడుశబ్దములను క్షోణీస్థలిపైఁ
దాపసులు భిన్నరీతుల, నోపరమా నిన్నుఁ గొల్చుచుందురు భక్తిన్. 687

క. ఎవ రేరూపంబున నిను, సవిధిగ ధ్యానింతు రట్టిసాధుమతులకున్
వివిధఫలంబుల నొసఁగుదు, పవితభక్త్యానుగతుల నరసి మహాత్మా! 688

క. వేదాంతమ్ము లరూపునిఁ, గాఁ దగ వర్ణించు నిన్నుఁ గాని సగుణుగా
నేదలఁచి సపర్యల విధి, గాఁ దన్పుదు రెల్లజనులు కాంక్షలుపొంగన్. 689

క. నీవో యర్చారూపము, వేవే గైకొనుచు వార లిచ్చుసపర్యల్
పావనములు గైకొందువు, శ్రీవల్లభ! నీప్రవృత్తి చిత్రము సుమ్మీ. 690

సీ. అక్షరుండని మఱి యమృతుండనియుఁ బర, మేశ్వరుండనియు నిరీహుఁడనియు
నచ్యుతుండనియు నిరంజనుఁడనియును, జ్ఞానమయుండని సర్వసాక్షి
యనియ ప్రతర్క్యుఁడం చనియుఁ దేజోరూపుఁ, డనియ ఖండుండని యనుపమానుఁ
డనియనంతుండని యఖిలగతుండని, సర్వము దానయై నిర్వికారుఁ
ఆ. డై యొసంగునని యమలాత్మ! యోదేవ, బహువిధముల నిన్నుఁ బ్రస్తుతించు
నుపనిషత్తు లెట్టు లూహింపఁ దరమగు, నిట్టివాఁడవనుచు నెఱిఁగినట్లు. 691

చ. శ్రుతు లోకరీతిఁ దెల్పక యరూపునిగాఁగ సరూపుగాఁగ వే
గతుల నెసంగఁబల్కు ననఁగాఁ బరమేశ్వర శ్రుత్యతీతమా
గతిఁ దగువాఁడవంచు నెఱుఁగందగుఁగాదె మనుష్యమాత్రుఁ డే
వితమున నీదుతత్త్వము సువిస్తృతముం దగ నిర్ణయించెడున్? 692

చ. కనుక మహాత్మ! రామ! నినుఁ గాంచితిఁ గన్నులఁ దృప్తిదీఱ నీ
యనుపమరూపమే మదికి హాయిని గూర్చుచునున్న దింక నేఁ
జని హిమశైలశృంగమున సాధుమునీంద్రులగోష్ఠి నుండి పా
వనతమదివ్యరూపమును భక్తిని గాంచుచు నుందు నెప్పుడున్. 693

చ. ప్రకృతినిగూడినాఁడ విఁక రావణముఖ్యులఁ బూర్వభక్తులన్
సకలమునీంద్రు లౌననఁగఁ జంపుము దాన నధర్మవర్తనం
బికఁ దగదంచు నీజగతి నెల్లరు నేర్చుకొనంగలారు నీ
దుకృతి నిరంతరంబు సుకృతుల్ పఠియింపఁగఁ బర్వు నెల్లచోన్. 694

చ. హరుఁడన నీవె చక్రియన నంబుజసూతియటన్న నీవె ని
ర్జరనరముఖ్యజీవతతిఁ జక్కఁగ నెల్లుదు వంతరాత్మవై
నిరుపమమూర్తి! నీదయిన నిర్మలనామము నేస్మరించుచున్
గురుభవవార్ధిఁ దాఁటఁగను గోరెద నాకు ననుజ్ఞ యిమ్మికన్. 695

చ. జనకజయంచుఁ బేర్గనిన । శక్తి జగత్తతిమాత ఛాయభం
గిని నినుఁగూడి యుండెడు నకృత్రిమశక్తిఁ జరాచరంబులన్
జననము నందఁజేయు మఱి । సమ్మదమందఁగ వృద్ధిచేయుఁ ద్రుం
చు నియతిఁ గర్మసంగతిని । జోద్యముగాఁ గనుచుందు వీవాగిన్. 696

క. నీవన నిర్లిప్తుఁడ వో, శ్రీవల్లభ! యిచ్చగింతు । చిత్తమ్మునయం
దావరుసఁ బనులఁ దీర్చును, బో వారక నీదుమాయ । పూన్కి మెఱయఁగన్.

క. హరిహరశతధృతిముఖని,ర్జరవర్యుల మునుల భూతజాలము నెల్లం
పరికింపం గల్పించును, సరసిజజాండముల నొక్కసరణిన్ రామా! 698

క. ఏమియొనర్చినఁ బ్రకృతియె, స్వామీ! నీవనఁగ సర్వసాక్షివి గానన్
భూమానందాంబుధివీ,చీమాలాడోలికల వసింతువు స్వేచ్ఛన్. 699

చ కనుక నమేయసత్వయుతఁ । గాంక్షితదాత్రి మహేశ భక్తి నె
మ్మనమున నిల్పి కొల్చిన సమస్తమనోరథముల్ ఫలించు నా
జననిఁ దలంప కెట్లు నిను । జాల్ములు గాంతురు? క్షుద్రబుద్ధులౌ
మనుజులె మాయగెల్తు మని । మాటలఁ దెల్పుదు రెంతొ లీలఁగన్. 700

తే. మంత్రిమూలమువంగాదే క్ష్మాపతీంద్రు, దర్శనముచేయఁదగు నట్టిధర్మము విడ
నాడ ఫలసిద్ధిలేనిచందమున దైవిఁ, గొలువకుండిన నినుఁగనుఁగొనుట యెట్లు?

చ. తెలివియొలేక మానవులు । తేటగఁ దత్త్వ మెఱింగినట్లుగాఁ
బలుకుచు మాయగెల్చితిమి । భక్తిమెయిం బరమేశు శ్రీపతిన్
గొలిచి యటందు రట్టులనఁ । గూడునొకో యనియైన నించుకేఁ
దెలియరు పూర్వదుష్కృతము । దృప్తులఁ జేయఁగ మిట్టిపాటునన్. 702

తే. ప్రకృతిపురుషులనాదులై పరఁగుదురను,భగవదుక్తినిదలఁపరు ప్రకృతియనఁగఁ
గామినీవ్యక్తియని పలుకంగఁగలుగు, టరయనజ్ఞానమునఁగాదె యక్కటకట!

ఆ. పురుషునుండి ప్రకృతిఁ । బూన్కి వేఱొనరింప, బ్రహ్మకైనఁదరమె పరమపురుషు
నిచ్ఛగాదె ప్రకృతి । యెట్లు వేఱగు దాని, గెలిచితి మనుటెల్లఁ । దెలివిలేమి.

క. హిమకరచంద్రికలకు నుష్ణమునకు నగ్నికిని గల్గుసంబంధమె దై
వమునకుఁ బ్రకృతికిఁ గలదని, విమలజ్ఞానులు తలంత్రు । విశ్వాఘుపతీ! 705

ఆ. వేఱుపఱుప నెట్టివిధమున నగువాని, నట్లుచేయఁ బూను । నల్పమతుల
కెన్ని జన్మములకు । నిద్ధభవత్పాద, కమలదర్శనంబు । గలుగ దరయ. 706

ఉ. భేదము భ్రాంతిమూలకము । వింతలు దోఁచును దాన నెన్నియో
కాదన కట్టిభేదమునె । కైకొని సర్వ మెఱింగినట్లుగా
వాదమునందు నిల్చుటయె । వారికిఁ గల్గిన మాఢ్యమానుగా
శ్రీదయితా! యిఁకన్ సెలవు । చేకొని పోయెద నిన్నె గొల్వఁగన్. 707

క. ఏకాంతస్థలమున నీ,యాకృతిఁ దేజోమయంబు నమలతమస్వాం
తాకాశంబున వెలుఁగఁగన్, శ్రీకాంతా! చేసికొనుచు సిద్ధుఁడ నగుదున్. 708

క. సమయమతారాధనమూ, ర్గ మిదేకద? దానినూని గమ్యస్థానం
బమలతమమైన త్వత్పద,కమలయుగము నొందువాఁడఁ గరుణాశరధీ! 709

చ. అని వినుతించి రాఘవపదాబ్జములం దమిఁ గాంచి నెమ్మనం
బున నిముడంగఁజాలకయె పొంగెడు మోదరసాబ్ధిమజ్జనం
బొనరిచి కైమొగుడ్చి పురుషోత్తమ! కోరినయప్డు దర్శనం
బును దయచేయుమా యనుచుఁ బూనిక వేఁడి యెసంగుభక్తితోన్. 710

తే. కనులనుండియానందాశ్రుకణము లెడతె,గకయె రాలుచునుండ రాఘవపదాంబు
జములఁగన్గొనిమదిఁ బదిలముగ వాని, నిలిపి సెలవొంది తాను జనియెనియతికి.

ఉ. కౌశికుఁ డిట్లు రామపదకంజములం దమిఁ గొల్చి తా నుదీ
చ్యాశకుఁ బోవఁగా దశరథావనిపాలునియాజ్ఞ చేత భూ
మీశలలాముఁ డాజనకుఁ డెంతయు వేడుక సాగనంపఁగా
దాశరథుల్ కళత్రసహితంబుగ నూనులఁగూడి యప్పుడే. 712

క. పయనము సాగించిరి వే, యయోధ్యకున్ భూపమానియా జనకుం డ
వ్యయు రామచంద్రు ననుపము, నయమూర్తిని బరము నెమ్మనంబునఁ దలఁచెన్.

క. జామాత యనెడుభ్రాంతి న,దేమాత్రము పూన కాత్మహితమె తలఁచి ని
త్యామోదదు ధ్యానించుచుఁ, దా మరలె వసిష్ఠు ననుమతంబున నెట్లో. 714

ఆ. ఉదకములను దాఁటు టొప్పగు నాఁ దగు, విధిని మీఱరామిఁ బృథ్వినాథుఁ
డాదరించి పనుప నాత్మజలం గాంచి, చెప్పఁదగిన నుడులఁ జెప్పి మరలె. 715

చ. జనకమహీశుఁ డిట్లరుగఁ జయ్యన వృద్ధమహీశుఁ డెంతొవే
డ్కను జతురంగసైన్యయుతిఁ గ్రమ్మగతిన్ బయనంబుచేసె; నం
త నెదుర ఘోరరూపముగ ధ్వాంతము దోఁచె రజఃప్రయుక్తమై
గనుఁగొన శక్య మెప్పగిదిఁ గాకయె యుండెను సూర్యబింబమున్. 716

క. ఖగము లపసవ్యగతిచే, గగనంబునఁ దిరుగసాగె గతి యయ్యది ముం
దుఁ గలుగునశుభఫలం బని, తగఁ దెల్పుచునుండె మృగవితానం బపుడున్.

చ. క్షితిపతికిం బ్రదక్షిణముచేయుచుఁ బోయెను దుర్నిమిత్తసం
తతులను వానిఁ గాంచి మునితల్లజుఁడైన వశిష్ఠుతోడ నీ
వితమునఁ దోఁచుఁ జిహ్నములు పీనిఫలంబు వినంగఁ గోరుదున్
మతివెతఁ బాయఁ దెల్పుమన మౌనిమహేంద్రుఁడు పల్కె నీవిధిన్. 718

మ. వినవయ్యా! క్షితినాథ యీశకునముల్ వే సాధ్వసం బొందు న
ట్లొనరించున్ మఱి మేలుగూర్చునను నీయూహన్ జనింపంగఁ జే

యును సంతాపముపీడుమాయనియె నాయుర్వీసురేంద్రోక్తులన్
విని తాపంబును వీడె రాజపుడె వే వీచెన్ మహావాయువుల్. 719

మ. తరుశాఖల్ ధరనావరించె; వడఁకెన్ ధాత్రీతలంబెల్ల; భా
స్కరబింబంబు మహాంధకారవృతమై కన్పట్టకేయుండె; భూ
మిరజం బట్టె చెలంగ రాట్పృతన ప్రేమించెన్ విసంజ్ఞాస్థితిన్
ధరణీశుండును దత్తనూజులు మునుల్ దక్కంగఁ బెన్భీతిచేన్. 720

మ. చనుదెంచెం బరశుప్రకంపన మహాసంతోషవారాశివీ
చిని కాయామలడోలికాంతర లసచ్చిత్తుండు దుష్టావనీ
ప నితాంతాయతవీర్య గర్వదళనప్రవ్యక్తరోషుండు మా
నినుత ప్రాంచితయోగవైభవుఁడు జ్ఞానిశ్రేష్ఠుఁ డచ్చోటికిన్. 721

మ. జమదగ్ని ప్రియనందనుండు మది నుత్సాహంబు పొంగంగఁ దూ
ణములన్ వైష్ణవచాపమున్ వెలయ వింతల్ గాంచుచిత్తంబు క్రో
ధము గ్రక్కం దలపోయుచున్నటులు గన్పట్టంగఁ దాఁ జేయుచున్
శ్రమమున్ లెక్కిడకే పరాత్పరుని గాంచంబూని భక్త్యుద్ధతిన్. 722

మ. తనకార్యంబు ఫలించె నింక ధరపైఁ దాఁ జేయఁగా నర్హమౌ
పని యేదేనియు లేదటంచు నెదలోఁ బల్మారు చింతించి యా
వనజాక్షుండు జనించె నం చెఱిఁగి దుర్వారప్రతాపాఢ్యులౌ
దనుజశ్రేష్ఠులఁ ద్రుంపఁబూనుటయు స్వాంతంబందు లెక్కించుచున్. 723

క. తనయందుఁ బూర్వకాలం,బుననుంచిన విష్ణుతేజమున్ మరలన్ రా
మునియందుఁ జేర్పఁ దగుటన్, మనమున నూహించి వచ్చె మౌనులు కనఁగన్.

క. అరుదెంచిన యా రామునిఁ, బరశుధరుం గాంచి మౌనివర్యులు పూజా
పరికరములఁగొని యెదురే,గిరి పూజ గ్రహించె నంత క్షితిపతి భీతిన్. 725

చ. మునివరులెల్లఁ జుట్టు దగ మోమున దీనత గ్రమ్మ నెమ్మనం
బున భయమట్టె గ్రమ్మఁ గడుఁబొక్కుచు భార్గవరాముఁ జేరఁగాఁ
జని పదపద్మముల్ ముకుటసంగతరత్నచయంబు సోఁక మే
దినిఁబడి మ్రొక్కె నీవె యిఁక దిక్కను భావము తోఁచునట్లుగన్. 726

చ. నతు లొనరించి కేల్మొగిచి నన్నుఁ గృపం గనవయ్య భార్గవా!
క్షితిపతులం గ్రమంబున విజృంభితశక్తి వధించి తెన్నిసా
ర్లా తుదకు శాంతమూని సకలోర్విని గశ్యపమౌని కిచ్చి స
మ్మతిని మహేంద్రశైలమున మౌనులఁగూడి తపం బొనర్చుచున్. 727

క. ఉన్నాఁడవుగద! యిత్తఱి, నన్నుం గనవచ్చితేల నాపుత్త్రకులం
గన్నుల నిప్పులు రాలఁగ, నెన్నఁదగని రీతిఁగాంచు టేలొకో చెప్పుమా. 728

ఉ. శాంతమె భూసురేంద్రులకుఁ ఽ జక్కని ద్రవ్యమటం చెఱింగి యా
వంతయు శాంతమూనకయె ఽ యర్భకులం గనఁ బాడియే నను౯
వంతలపాలుసేయక యఽవంధ్యకృపం గనవే మహాత్మ ని
న్నెంతయు వేఁడువాఁడ ననుఁ ఽ నిత్తఱిఁ గాచుట నీకు ధర్మమా. 729

క. ముదివగ్గు ననుచు నీశ్వరు,ని దయం బుత్త్రులను గంటి ఽ నేనంచు నెఱుం
గుదువీవు కాన వారల, సదయుఁడ వై కావవయ్య ఽ జమదగ్నిసుతా! 730

క. నేఁడో రేపో మృత్యువుఁ, గూడం గలవాఁడ నన్నుఁ ఽ గుందింపక కా
పాడుట యుక్తము నీకో, బాడబ! ప్రార్థించువాఁడఁ ఽ బదదాసుఁడఁజూ! 731

మ. శరచాపంబులు మాని మౌనివగుచు౯ ఽ శైలంబునందుం దప
శ్చరణం బొప్పఁగనుండి సాయకములం ఽ జాపంబునుం దాల్చి భీ
కరరీతిం దగునట్టియీపరశువుం ఽ గైకొంచుఁ గ్రోధంబున౯
బరుగుల్ వారుచు వచ్చినాఁడవె మునీ! ఽ వాక్రువ్వుమా సత్కృపన్. 732

క. ఏదియెటులున్న నుండుం, గాదనక మదార్తివాయఽగాఁ జేయుటయే
నీదగుధర్మము నా విని, యాదశరథుమాటలెల్ల ఽ నాలింపకయే 733

చ. వడివడిఁ బోయి రాముఁ గని ఽ పల్కె ను శ్రీరఘువంశరత్నమా
వెడవెడ వింటి నీదయిన ఽ వీర్యము చాలఁగ మెచ్చనౌనుఁగాఁ
బుడమి నశక్య మెక్కిడఁగ ఽ భూమిపతీంద్రున కేనికైన నం
చుడుగక దేవతల్ పలుకఽనొప్పెడు శంకరుచాప మేత్తెఱన్. 734

చ. కరములఁబట్టి యెక్కిడుటఽగాక కలంబముగూర్చి లాగి ని
ష్ఠురనినదంబు గల్గునటు ఽ చోద్యముగా శకలద్వయంబుగా
ధరఁబడఁజేసినాఁడ వని ఽ ధాత్రిసురర్షులు పల్క వింటి; ని
త్తరుణమునందె నిన్నుఁ గని ఽ ధన్యుఁడఁగా మదిఁ గోరి వచ్చితిన్. 735

మ. హరకోదండము నెక్కుపెట్టఁ దరమే ఽ యాశౌరికిం దప్ప నొ
క్కరి కెవ్వారికినైన నం చరసి దైఽత్యారాతియే యిప్పుడు
ర్వరఁ గార్యార్థము పుట్టియుండనగు దుఽర్వారప్రతాపాఢ్యు న
ప్పరమేశు౯ గని ధన్యజన్ముఁడనుగా ఽ భావించి యే వచ్చితిన్. 736

ఉ. నీదగుతత్త్వముం దెలియఽనేరనివారల కించుకంత యో
శ్రీదయితా! యెఱుఁగఁగను ఽ జేయఁదలంచితి నేఁ గృతజ్ఞుఁడం
గాఁదగుఁగాదె యింక నధిఽకంబుగఁ బల్కఁగ రాదు శౌర్యమే
యూఁది వచించువాఁడ జనుఽలొప్పఁగ నిన్ను నెఱుంగరామిచేన్. 737

క. క్షమియింపుము నాయపరా, ధము నిన్నే స్వాంతమందు ఽ ధ్యానింతునుగా
యమలాత్మ! వచ్చుచున్నా,రు మునుల్ సేవకులు భూవరుండును భీతిన్. 738

ఉ. కావునఁ బ్రాకృతోక్తుల నఽఖండతరాప్రతిమానదేవసం
భావితతావకప్రకటఽపౌరుషముం దెగడంగఁబూను నా
యీవితథప్రయత్నము నఽదెట్టులో సైఁపుము దానిచేత నా
భావము సిద్ధిఁగాంచునని । పల్కుచుఁ గృత్త్రిమకోప మూనుచున్. 739

మ. పలికెన్ భార్గవరాముఁ డోనృపసుతా! । ప్రాక్కాలమం దింతదు
ర్బలతం గాంచియుఁ జీకియున్నహరచాఽపంబున్ మహాపౌరుషం
బలరం ద్రుంచుట గొప్పగాదు; దనుపుఽత్త్రానీకముం జెందుని
స్తులశక్తిన్ విలసిల్లు నీహరిధనుఽస్సున్ జూడుమా పూనికన్. 740

చ. తనయవతారసత్ఫలము । దాననె కల్గెడుఁ గాన స్వీయమౌ
ధనువును దానిఁ గైకొనుచుఁ । దన్మునిదేహగతాత్మ తేజమున్
గొనియె నమర్త్యులెల్ల రదిఽగో భగవత్కళ చేరె రామునే
యని కొనియాడి; రంత భృగుఽనన్వయరత్నము కేలుమోడ్పుతోన్. 741

ఆ. న్యాసరూపవస్తు । వధిపతి కాదృతి, నిచ్చునట్లు నేఁటి । కీశ్వరా! మ
దంగనిహితతేజ । మర్పించుకొన్నాఁడ;, జని ఫలించె నిద్ది । సాఽరసాక్ష! 742

చ. త్రిదశవరేణ్యు లింకఁ బరిఽతృప్తిని గాంతురు స్వాభిలాషముల్
కొదువయొ లేక పండునని । కోమలనీరదనీలగాత్ర! యిం
కఁ దరలి దండకాటవినిఁ । గాపురమున్న నిశాటకోటినిం
బొదలి వధించి సీతనెపఽముం గొని రావణుఁ బూన్కిఁ జంపుమా. 743

మ. తనకున్ బ్రహ్మవరంబు లిచ్చెనని యాఽత్మన్ సుంతయే భీతిగాం
చని జాల్మున్ గఠినాత్ము దుర్నయుని రఽక్షస్స్వామి నా రావణున్
గని భీతిల్లుదు రెల్లదేవతలు తఽత్కర్మంబు వారెన్న రో
వనజాక్షా! జగమందుఁ గర్మమనఁగా । వర్తిల్లు నీయాజ్ఞయే. 744

ఉ. ఒక్కనివంక నెందఱికొ । యుగ్రతరార్తులఁ గూర్చుచుండు; నిం
కొక్కని మూలభూతునిగ । నొప్పుగఁ జేయుచు వానిఁగూల్చు; ని
ట్లొక్కని జంపఁ బెక్కురకు । నూహచెలంగఁగఁ జేయుచుండు వా
రొక్కని ద్రుంపలేనియటు । లోపికఁ జేయు ననంతశక్తిచేన్. 745

ఉ. తా రొనరించుకర్మములె । తమ్మొగిఁ ద్రిప్పుచు నున్నవంచు నే
వా రెఱుఁగంగఁజాలుదురొ । వారె భవత్కరుణైకపాత్రులై
ఘోరభవార్ణవంబుఁ గడఽకుం దరియింతురు కాని కర్మముల్
సారములేనివం చనెడుఽజాల్ములు నీకృప కెంతొ దూరులే. 746

ఉ. కర్మమె బ్రహ్మమంచు నొడిఽకంబున నద్ది ఫలంబు లిచ్చెడున్
శర్మమొ కష్టమో తెలుపుఽసత్కృతి దుష్కృతిరూపమైన యా

కర్మ మిదంచుఁ దత్ఫలముఁ గావలె నంచుఁ దలంప కెవ్వరా
ధర్మము నాచరింతురో నితాంతము ధన్యులు వారె రాఘవా! 747

చ. ఫలముల నీదుభవ్యతమపాదములం దిడి సాధుకర్ముల్
తెలివియొసంగఁ జేయుసుమతిప్రకరంబు భవార్ణవంబు ని
మ్ములఁ దరియించు టబ్రమె విభూ! ఫలకాంక్షలఁ జేయుకర్మరా
సులు తరియింపఁ జేయవనఁ జోద్యమె స్వల్పఫలంబు లిచ్చుటన్. 748

ఉ. ఓరఘువంశమౌక్తికమ! యోపురుషోత్తమ! భక్తలోకమం
దారమహీరుహంబవు కదా! నిను నెన్నఁగ నెంతవాఁడ నా
చారము మానరా దెపుడు సత్త్వమునీయది చూడఁగోరు చు
న్నారు భవద్భటుల్ కనుక నన్ను జయించినరీతిఁ దెల్పుమా. 749

చ. జనులకు నీదుతత్త్వమును జక్కఁగ నిప్పుడె తెల్పరాదుగా
కనుకనె క్రోధమూనినటుగా నటియింపుము నేను బోవుదున్
వనజదళాక్ష! నీప్రతిన వైళమ తీర్పుము ధర్మసేతువున్
దనుజుల ద్రుంచి నిల్పుమనఁ దద్వచనంబుల నాలకించుచున్. 750

శా. శ్రుత్యంతప్రతిపాదితాత్మమహిమన్ శోభిల్లు సర్వేశ్వరుం
డత్యంతక్రుద్ధుఁ బూనినట్లు నిజవక్త్రాంభోరుహం బెట్టినై
నిత్యానంతపరాక్రమంబుఁ దెలుపన్ నింగిన్ సురవ్రాత మో
సత్యాకార! యటంచుఁ దన్నుఁ బొగడన్ జ్యావల్లి మ్రోయించుచున్. 751

మ. పలికెన్ భార్గవరామ! యెక్కిడినయీబాణంబుచే నీపదం
బులఁ జక్కాడు మటందువో సుకృతులం బొల్పారి యూర్ధ్వంబునం
జెలువారందగు లోకవారములనుం జెండాడఁ గాంక్షింతువో
తెలుపంగాఁ దగునంచు మేఘరవమున్ దెల్పంగనౌ వాక్కులన్. 752

మ. వినిపింపన్ జమదగ్నినందనుఁ డాగెన్ భీతిల్లిన ట్లింతయుం
దనువెల్లన్ వడఁకంగ నిట్లను బరంధామా! మదీయోర్ధ్వలో
కనికాయంబు భవచ్ఛరంబునకు నొక్కం బిడ్డె లక్ష్యం బగుం;
జనఁగా నోపఁ బదంబులన్ నలుకఁ; గాంక్షం దీనిఁ దీర్పం దగున్. 753

మ. మునుపేఁ గశ్యపమౌనికిద్ధర సవంబుం జేయుచున్ ధారవో
య నతం డింక మదీయభూమి యిది యౌ నట్లౌట నీ వుండరా
దనియెన్ గాన సముద్రు వేఁడితి నతం డామోదసంపూర్ణుఁడై
తనలోఁ గొంత యొసంగె నాస్థలమునన్ దాత్పర్య మేపారఁగన్. 754

క. నివసించువాఁడ నీధర, పవలే నేఁ దిరుగువాఁడ వాగ్దానం బి
ట్టివిధంబున మునిచేసెను, దివిజేశ్వర! రాత్రులిందుఁ దిరుగఁగ రామిన్. 755

క. చరణములఁ గొట్టకుండఁగ, వర మిమ్మా వేగపోవ ◦ వలయు నపరభూ
ధరమును రవి చేరక మును, పురుషోత్తమ యనిన రామ ◦ మూర్తియుఁ గరుణన్.

ఆ. శరము వైచి పరశు ◦ ధరసమార్జితపుణ్య, లోకములను జెందె ◦ నాకపతియు
మునులు పొగడి రంత ◦ మునిపతి రాముఁడు, చనియె సెలవునొంది ◦ స్వస్థలికిని.

క. అంతట దశరథధరణీ, కాంతుఁడు తెల్వొంది సుతులఁ ◦ గలిగి భటవరా
క్రాంతమహీభాగుండయి, యెంతయు జవ మొప్పఁగఁ జని ◦ యెం బురి కెలమిన్.

క. కొడుకులు కోడండ్రును దమి, నెడబాయక యుండఁ గొన్ని ◦ యేండ్లు సుఖముగాఁ
గడపె నయోధ్యాపురమునఁ, బుడమిఁ గడు ధన్యునిగఁ దన్నుఁ ◦ బొగడంగ జనుల్.

క. శ్రీరామమూర్తియును సీ, తారూపము గాంచి ప్రకృతి ◦ తన్నుఁ గొలువఁగా
నారోపితమర్త్యసుఖుం, డై రాజిలె సర్వసాక్షి ◦ యై జను లలరన్. 760

కాండాంతము.

క. వేదాంతసముదయప్రతి, పాదితనిజతత్త్వవేశ ◦ పరమేశ శశాం
కాదిత్యనయన త్రిభువన, మోదావహవర్తనా వి ◦ భూ సురవంద్యా! 761

చ. హరిహరధాతృశక్రదివి ◦ జాధిప ముఖ్యసమస్తజీవసం
భరితనిజాంశ, జ్ఞానమయ ◦ భాసురరూప మహామునీంద్రహృ
త్సరసిజదివ్యపీఠసత ◦ తప్రియవాస నిరంజనా భయం
కరదనుజేంద్రమర్దన ◦ నికామఫలప్రద జానకీధవా! 762

మాలిని—

అనుపమగుణజాలా ◦ హారిసంపద్విశాలా!
ప్రణుతవిమలరూపా ◦ భంజితాదిత్యతాపా!
కనకమృగవిలోలా ◦ క్రమ్రహేమాభచేలా!
ప్రణతసుజనపాలా ◦ భద్రదానైకశీలా!

గద్య. ఇది శ్రీమత్త్రిపురసుందరీకరుణావాప్త గీర్వాణాంధ్రకవితాప్రాభవ కాశ్య
పాన్వయప్రభవ శ్రీజనమంచివంశాంబురాశికుముదినీమిత్ర సుబ్రహ్మణ్యమనీషి
పుత్త్ర తాండవకృష్ణాపరాభిధేయ శేషాద్రినామధేయవిరచితంబైన కృతుల
యందు శ్రీధర్మసారరామాయణంబునందు బాలకాండము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ ర స్తు

# శ్రీధర్మసారరామాయణము

## అయోధ్యాకాండము.

శ్రీమత్పరాంబికాకృత
ధీమత్పరిపాలనైక దీక్షాదక్ష
శ్రీమూర్తీ! ధర్మోద్ధర
ణామోదస్వాంతవిహరణా! పరమేశా! 1

వ. మహాప్రభూ! తరువాతికథాసారము నాలకింపుము. 2

### సీతారాములయోధ్యలో సుఖముండుట.

చ. ప్రకృతియె సీతనాఁ బరఁగి రాడ్వరధర్మసమాశ్రయైకవృ
త్తికలితుఁగా నొనర్పఁ బరితృప్తుఁడు నద్వయుఁ డార్యసమ్మత
ప్రకటమహావిభూతియు నభంగురశర్మయుతుండునయ్యుఁ దా
సకలవిదుండునయ్యు నొకచందమునన్ ధరఁ గుంటురీతిగన్. 3

క. పరమేశుఁడు రఘురాముఁడు, ధరణీసురముఖ్యసుజనతతిమోదదుఁడై
పరమేశ్వరత్వగూహన, పరతన్ వర్తిల్లుచుండెఁ బండ్రెండేఁడుల్ 4

సీ. తాను ముందుగ లేచి తగినవిధుల్ దీర్చి, పతినిబ్రబోధించి యతిముదమున
నతఁడు నిద్రను వీడియటునిటు పొరలంగ, మంచిమాటల నాథుమానసంబుఁ
గరఁగించి తత్కాలకరణీయములఁదీర్పఁ, బ్రార్థించి సేవకు లరుగుదేఁగఁ
దా స్నానమొనరించిధవుఁడుకృత్యంబులఁ,దీర్చిస్నానము చేసి ధ్యానగృహము
ఆ. చెంతకరుగ ధౌతచేలంబులందిచ్చి, వస్త్రపూతమధురవారిపూర్ణ
భర్మపాత్రమునిచి పరమాసనంబున, నతఁడు కూరుచుండ నాదరమున. 5

ఉ. ప్రక్కన నిల్చి కమ్రకరపంకరుహోజ్జ్వలకంకణస్వనం
బక్కజమీఱ నాథుహృదయాంబుజముం గరఁగించుచుండఁ దా
నొక్క మనోజ్ఞచామరము నూని యొకించుక గాలిసోఁకున
ట్లక్కటికంబునన్ విసరి ధ్యానసమాధి నతండు గూడఁగన్. 6

చ. కదలకయుండి శర్మమయ కాలమునందు హృదంబుజాతమన్
సదనమునందు నాత్మఘన చారుతమద్యుతిఁ గాంచుచుండి స
మ్మదమయ బాష్పముల్ వెడల మానితయోగము మాని తా బహి
ర్వదనుఁడుగాఁ జెలంగునెడ భర్తకు స్వేదము వాయ వీచుచున్. 7

చ. తనుఁగని పల్కరింప విహితప్రతిభాషల హాయిఁగూర్చుచున్
ఘననియమంబుఁ దీర్పఁదగు కాలము చెల్లెఁగదా యటంచు నీ
శు నడుగుచున్ స్మితంబుననె చొక్కపుటుత్తర మీయ సంతసం
బున నెలవంది జానకియుఁ బొంగుచుఁ బోవుచునుండు నిచ్చలున్. 8

చ. ఇదియె పతివ్రతావితతి కెప్పుడొనర్పఁగ నర్హకార్య; మీ
యది యొకఁడే విభూషణ; మిదారయ శాశ్వతసౌఖ్యదంబుఁ గీ
ర్తిదము నగున్ జగంబున నరిప్రకరాటవిదావవహ్నియం
చెదల సతుల్ తలంపఁజను నేర్పడ నం చెఱిఁగింపఁ బూనియే. 9

ఉ. జానకి తానె నిత్యము యశస్కరమైతగు నిద్దియంచు నే
మేనివచింప కాచరణమే తగురీతిని దెల్పునంచుఁ దా
మానసమందు నెంచి యొకమార్పును బూనక చేయుచుండఁగాఁ
జానలు దానిఁ గాంచి విని స్వాంతములం దలపోసి యాదృతిన్. 10

ఉ. సీతనుబోలి భర్తృపదసేవ యొనర్పఁగఁబూని; రిట్లు సం
జాతమహానురాగమున సాధ్వులుగాఁ దగునట్లు వర్తిలం
జేతములందు నిశ్చయము చేసికొనం బనిపూనుచున్న స్త్రీ
వ్రాతము నూహలెన్ని మది వర్ధిలుప్రీతిని బొల్చె సీతయున్. 11

మ. ఒకులన్ సత్పథమందు వర్తిలఁగఁ దారొప్పారఁగాఁ జేయ నె
వ్వరు యత్నింతురొ వారలెల్లఁ దొలుతన్ వాక్యంబులం దెల్ప కా
చరణ[1]ద్వారమునం బ్రబోధనము సంజాతానురాగంబునన్
జరపంగాఁ దగు నన్న యూహ ధరణీజాతేష్టమై యొప్పటన్. 12

మ. తనదౌ నెమ్మది నెంచి రాఘవుఁడు మోదం బొందుచుండెన్ మహా
మును లజ్ఞుండువలెన్ మహాత్ముఁడగు నా భూజానిపుత్త్రుండు ధ
ర్మనికాయంబును బ్రశ్నచేయ విని, శాస్త్రప్రక్రమం బొప్పఁగా
వినిపింపం బనిపూని రాదిమునిగా విశ్వేశుగా నెన్నియున్. 13

శా. సర్వజ్ఞుండయియున్ సనాతనసదాచారంబుఁ బాలింపఁగా
నిర్వాతస్థలదీప మట్లెసఁగు నానీరేజపత్త్రేక్షణుం
డుర్విం బ్రాకృతురీతిఁ బెద్దలను మోహార్చిచ్ఛటల్ గప్పుచున్
దుర్విజ్ఞేయనిజప్రభావులను దోడ్తోఁ జేయుచున్ స్వేచ్ఛమై. 14

1 ద్వారము=ఉపాయము.

శా. ఏరీతిం దను నెవ్వరే నెఱుఁగఁగా ఽ నింతైన యోజింపకే
శ్రీరాముండన నొప్పుదాశరథిగాఁ ఽ జింతింపఁగాఁ జేయుచుం
దా రాజిల్లు స్వకీయమాయ దగువృత్తం బెంచుచుం బ్రీత్యపా
పారంబం దొగి మున్గుచున్ వెలసె నుర్బ్బన్ బ్రహ్మముఖ్యామరుల్. 15

కవిరాజవిరాజితము —
తనదగు సచ్చరితంబును గాంచుచు ఽ ధర్మవిదుల్ ప్రమదక్షితిభృ
ద్ఘనతరకూట ముఖంబును బొందఁగఁ ఽ గాలవిదుండయి ఽ కార్యములన్
బనివడిచేయఁగ ఽ బ్రహ్మముఖుల్ తనుఁ ఽ బ్రస్తుతులం దనుపంగ మనం
బునఁ గడుఁ జక్కనిపూనిక నెంచెను ఽ భూమిభరంబునుబోనడఁపన్. 16

శా. ఆసంకల్పమె శక్తి నాఁబరఁగుఁబో; ఽ యాశక్తియే మాయ నా
భాసిల్లున్; దదభేదతన్ వెలయుచున్ ఽ బ్రహ్మాదిదుర్జ్ఞేయయై
యాసర్వేశ్వరి రూపవంతునిగఁ జేయంబూను నెక్కాలమం
దా సర్వప్రభు నప్పుడే సగుణుఁడై ఽ యాతండు ప్రఖ్యాతుఁడౌ. 17

మ. తనదౌ నిచ్ఛయె మాయగా వెలయ నద్దానిన్ స్వభిన్నంబుగా
జను లెవ్వారు తలంతురో యలమనుష్యవ్రాతమున్ సజ్జనా
వనదక్షుండగు నాపరాత్పరుఁడు సంభావించు నజ్ఞంబుగాఁ
గనుకం దద్ద్వయ మేకతం దలఁపనౌఁ ఽ గళ్యాణసూ దానికేన్. 18

చ. జనకజ యీశ్వరాశయము ఽ స్వాంతమునం దలపోసి మామంగా
జనవిభు సంస్మరించె; నలసంస్మృతి యాతనిఁ బ్రోత్సహించెఁ; బు
త్రుని యువరాజుఁ జేయఁదగుఁ ఽ దోడనె యన్న యభీష్టవంతుఁ
జనులనఁ గర్మదాసులని ఽ సాధువు లందురు గాదె యుర్వరన్. 19

ఉ. ఆదియు నంతముం గలుగ ఽ దారయ దేనికి; నద్ది కర్మ
చాదిమునీంద్రు లందు; రది ఽ యప్రతిమానము; దానిసాటిగా
నేదియు లేదు; మాయదగునిచ్ఛయె యయ్యది చసన్నుతం
బైదగు నద్దియే ఫలద ఽ మయ్యదియే యగు బల్కు లేటికిన్. 20

ఉ. అద్ది ఫలంబులీయఁగ సురాసురముఖ్యులవాని నొందఁగా
నిద్ది యిటంచు నెంచకయె ఽ యీశ్వరుఁ డెప్పుడు సర్వసాక్షియై
[1]యొద్దియ యంచుఁ గొంచెమనియుం దలపోయక కాంచుచుండురీ
[2]సుద్ది యెఱుంగ కందు రల సూనృతరూపుని బక్షపాతి నాన్. 21

క. దూషించిన నత్యంతము, భూషించిన నీశ్వరుండు ఽ బుద్ధిని సుంతే 22
దోషమ్మని పుణ్యంబని, భాషింపక చూచుచుండుఁ ఽ బ్రాజ్ఞుఁడు కానన్.

1 ఒద్దియు=సమృద్ధి. 2 సుద్ది=వృత్తాంతము.

క. ఆశర్మమె పురికొల్పఁగ, నాకేకయరాజపుత్త్రి । యాత్మభవుండై
శ్రీకలితుండగు భరతుఁడు, వే కదలెం దాతఁ జూచు । వేడుక పొంగన్. 23

క. ఆతనితో శత్త్రుఘ్నుఁడు, ప్రీతిం దెలుపంగఁ బోయెఁ । బిత్రనుమతిచే;
భ్రాతృయుగం బీరీతిగ, నాతఱిఁ బోవంగ రాముఁ । డనుజాన్వితుఁడై. 24

క. జనకుని సేవించుచు మాతృనికరమును గొల్చుచుండె । నించుకయేఁ ద
న్మనసులఁ గొఱంత దోఁపని, యనువున సౌమిత్త్రి ఛాయ । యటు తో నుండన్. 25

క. సుతులిర్వురు దూరస్థిత, క్షితి కేగ సుమిత్త్రయేని । కేకయభూభృ
త్సుతయేని చింతనొందరు, ప్రతిలేని నయంబుఁబూని । రాముఁడు కొల్వన్. 26

క. తనయాత్మజుండె రాముం, డని పంక్తిస్యందనాంగ । నావళి తలఁపం
జనియెం గాలము సుంతగ, జనపతి యొకనాఁడు మంత్రి । సంతతితోడన్. 27

క. తలపోసి వారుసమ్మతి, దెలుపఁగ సమ్మోదమంది । తీవరమునఁ బౌ
రుల జానపదుల మానులఁ, బిలిపించెన్ వారిదౌ । నభిమతము నెఱుఁగన్. 28

## దశరథుఁడు పౌరులతో నాలోచించుట.

క. ప్రతినిధి రా జన లోకవితతి కెల్లను గాన వారి । తలఁ పెట్టిదో స
మ్మతమే నొనరింపంగా, నితరమ్మైనం ద్యజింప । నెంచఁగ నొప్పున్. 29

క. అదియే స్మృతిసమ్మతమై, పొద లెడుధర్మంబు దానిఁ । బోవిడువంగాఁ
గుదురదు సౌఖ్య మదెప్పుడు, విదితంబిది పూర్వ భూమి । విభులకు నెల్లన్. 30

క. ఆయాచారము దశరథుఁడే యెఱుఁగున్ స్వానుభూతి । నిచ్చుట దానిన్
జేయన్ సఫలమ్ముగ సభ, జేయింపం బంచె స్వీయ । సేవకతతికిన్. 31

చ. క్షితిపతి యాజ్ఞఁ బ్రీతిమెయి । శీర్షములన్ ధరియించి భూమిభృ
ద్వ్రతతియుఁ బౌరవర్యులును । వేడుకఁ గూర్చెడుబంధువార మా
ఱితిఁ గలపల్లెలందు నివ । సించుమహామతు లెల్ల వచ్చి రే
మితలఁచి పిల్వఁబంచెనొకొ । మేటినృపాలుఁ డటంచు నెంచుచున్. 32

చ. ధర ప్రసవించెనో యనఁగఁ । దత్పుర మెల్ల జనావృతంబుగా
నరుదుగఁ గన్పడెన్; క్షితిపు । నానతిచేత నయోధ్య దేవపూ
ర్వరమును మించఁజేయుగతి । రమ్యముగాఁ గయిసేసి రత్తఱిన్
నిరుపమబుద్ధివైభవము । నిండఁగఁ గర్మకరుల్ జవంబునన్. 33

చ. పురమది యద్భుతాకృతిని । బొల్పెసలారఁ జెలంగె నత్తఱిన్
గురుకవిసన్నిధానమునఁ । [1]గుంభభవద్విజరాజ సౌమ్యసం
వరణత, మానికాండయుతి । భాసుర[2]సద్వితతిప్రసక్తిఁ [3]బు
ష్కరమువలెన్ [4]విమానవర । కాండమనోజ్ఞత నిస్సమానమై. 34

1 కుంభభవుఁడు=అగస్త్యుఁడు. 2 సద్వితతి=నక్షత్రగణము, సజ్జనబృందము 3 పుష్కరము=ఆకాశము. 4 విమానములు=రాజగృహములు.

చ. నృపమణి మంత్రివర్గయుతి నెమ్మి సభాభవనంబుఁ జేరి యి
చ్ఛపాదల నందుఁగూడిన ప్రశస్తగుణోత్కరచారుభూషణా
ళిపరమచిత్తపంకజుల లీలఁ జెలంగెడు పౌరముఖ్యులన్
గపటవిదూరులన్ నృపశిఖామణులన్ బరికించి యాత్మలోన్. 35

చ. పిలిచినయంతనే మిగులఁ బ్రీతిని వచ్చిరి వీరలెల్ల; నా
కలఁత యడంగు; నింక గుణౌకమువిభూషణు రామచంద్రు ని
స్తులయువరాజసత్పదముతోఁ జెలువారఁగఁ జేయఁ జాలుదున్;
గలతెఱఁగెల్లఁ దెల్పుటకుఁ గాలము మంచిదటంచుఁ దోఁచెడున్. 36

ఉ. నేనిటఁ రాఁగ నీజనులు నీరధిచాడ్పున సంప్రమోదవా
స్వానమునన్ నిజేష్టములఁ జక్కఁగఁ దెల్పెదుజాడ దోఁచెడున్
గాన మదాశయంబు నికఁ గాలముపుచ్చక తెల్పువాఁడనా
సూనుని వర్తనంబు కడు సూరిజనస్తవనీయ మౌఁ గదా! 37

ఉ. రాముని రాజ్యమందు యువరాజుగ నిల్పుదుఁ, బాలనంబు నెం
తో మరియాద సల్పు ననుసూహ గలాఁడను; మీయభీష్టమున్
నీమము మీఱఁ గైకొనఁగ నేఁ బిలిపించితి మిమ్ము నన్న శ్రీ
రాముని సత్వరంబ యువరాజును జేయు మటందు రీజనుల్. 38

మ. అని నాచిత్తమునందుఁ దోఁచెడి నహో యిమ్మాడ్కి సంతుష్టులై
జను లివ్వారు చెలంగుటే శుభము నాస్వాంతంబు నిశ్శంక నొ
ప్పెను గానన్ వచియింతు నంచుఁ దలఁచెం బృథ్వీశుఁ; డంతన్ మహా
మునిముఖ్యుల్ తగుపీఠరాజి నృపుసమ్మోదంబునన్ జేరఁగన్. 39

మ. కరతాళధ్వను లభ్రమందు వెలయన్ రాజవర్యుండు సుం
దరగంభీరమృగేంద్రపీఠమున నానాకేశ్వరుండో యనన్
బరఁగెన్; దజ్జను లంత మౌనమునఁ దద్వాక్యంబు లాలింప సుం
డిరి చిత్రప్రతిబద్ధరూపములు రాణింపన్ క్షణం బివ్విధిన్. 40

ఉ. ఓలగమద్ది భంగరహితోదధిచాడ్పునఁ జూడనొప్పె; నా
వేళ దశాస్యవైరి యన విశ్వముఖం బొడసూపి యాత్మజుం
డై లలిమించు రాఘవుని నాత్మఁ దలంచుచు వృద్ధరాడ్వరుం
డోలి వచించె నిప్పగిది నో నియతవ్రతులార! యిత్తఱిన్. 41

ఉ. ఎవ్వనిచేత మార్పఁబడునే యన దేనికి నెప్డు లేదొ యే
[1]చివ్వఁ బలాయనం బనుట చిత్తమునం దెవ యెప్డెఱుంగదో
[2]మవ్వ మనంగ నిట్టి దనుమాటయె యెద్దియెఱుంగదో కటా!
యవ్విషవృక్ష మట్టిజర యంగమునం బొడసూపి యేఁచెడున్. 42

1 చివ్వన్=యుద్ధమందును. 2 మవ్వము=కోమలత్వము.

చ. దురములు పెక్కు సూచితిని దోర్బలమూని యరాతిభూధవో
త్కరమును బాఱఁ దోలితిని గార్ముకధారులమేటి యీతఁడం
చురుమతు లెన్నఁ బొల్చితి; మహోగ్రశరాస్త్రములెల్ల నేర్చితిన్
జర నడఁపంగ నించుకయుఁ జాలక చిక్కితి దానిబారికిన్. 43

చ. మతివిభవంబుఁ బోనడఁచి మానవతీమణిగౌరవంబు ని
ర్వృతి గనఁజేసి యంగముల నేర్పడియుండిన పాటవంబు సం
గతి గననీక చెండి ముఖకాంతిని రూపఱఁజేసి మించి న
న్నతివలు చూడనైనహృదయంబుల నెంచనిమాడ్కిఁ జేసెఁగా? 44

ఉ. ఏమని తెల్పువాఁడ మదిరేక్షణ లింతకుముందువోలె న
న్గోమలముగ్ధవీక్షణ వినూత్నసుమంబులఁ బూజసల్పకే
మోములు ద్రిప్పుకొంచు జవమున్ గనఁజేయుచుఁ బోవుచుండఁగా
నేమని పల్కరింతు? వచియింపుఁడు మీరలె యోంచి యాత్మలన్. 45

సీ. శత్రువీరులనుండి సారహీనుం డను, వాక్య మోష్ఠము దాఁటి వచ్చుదనుక
సచివులీవిభుతను జాలించి వని కేగు, టర్హ మౌఁగాదె యంచాడుదనుక
జను లింకనైన నూతనవిభుఁ డేతేరఁ, దగును మేలం చాగిఁ దలఁచుదనుక
సుందరీరత్నముల్ చూచి క్రోధారుణ, దృష్టి పర్వఁగఁ జేయ నెంచుదనుకఁ
తే. గాలమును బుచ్చ కెంతయు గౌరవమున, రాజ్యపాలనమును జేయ రాముఁ బూన్చి
విశ్రమింపఁగ నెంచితి విహిత మిద్ది, యిప్పటికి నని మీ రానతీయ నేను. 46

ఉ. మీరును నాపయిం దనరు మేలిమి ప్రీతి సితాతపత్రమం
భోరుహమిత్రవంశజుల పాలిసుభాగ్యము నన్నుఁ గూడి పెం
పార సమాశ్రయించి సుఖహర్షము లొందితి రింతదాఁక నే
సారవిహీనుఁడన్ గనుకఁ జాలను మిమ్మికఁ బ్రోవ నెంతయున్ 47

క. మేలో కీడో కనుచుం, గాలము పుచ్చితిరి నన్నుఁ గలిసియె; నేనున్
మీలోన నొక్కఁడనుగా, నేలితి భావించి రాజ్య మిద్దాని విధిన్. 48

క. సమయానుకూలముగ శాస్త్రము చూపినమార్గ మేను దాఁటక మీశ
ర్మము గోరి పాటుపడితిన్, క్షమియింపుఁడు తప్పులున్న సజ్జనులారా! 49

క. నలువుర నొక్కపథంబునఁ, గలుపుచు నడిపింప ననువు గాదని మీకుం
దెలిసియె యుండు నటంచుం, దలపోయుదు నింక నాదు తలఁపును వినుఁడీ. 50

చ. అఱువది వేలయేండ్లు తగునట్టులు విక్రమసంపదాశ్రయం
బుఱవు చెలంగ భూరమణి నొక్కటఁ బ్రోచితి శాస్త్రరీతిఁ బెం
పఱ రిపురాజి శిష్టజను లౌనన నొప్పితిఁ జాలు నింక సం
దెఱఁగితి నంగపాటవము హీనతఁ గాంచఁగ సాధుసేవ చేన్. 51

చ. మనవి యొకండు నాయది యమానుషవిక్రమశాలి రాఘవుం
డనునది తాటకాదుల మహాటవి నొక్కఁడె చంపుటే జగం
బునఁ దెలుపంగఁ జాలుఁ గద పూజ్యపదార్చ్యుఁ డార్యసమ్మతుం
డని వచియింపనేల యిఁక నందఱెఱుంగుట నట్లుగావునన్. 52

చ. మనమున నెన్నియో గలుగు మార్పులు కాలముపుచ్చకుండఁ జే
యనుదగుఁ గార్య మంచు విదితాత్ములు పల్కుదు రట్టిసూక్తులన్
మనమునఁ జక్కఁగాఁ దలఁచి మామకపుత్త్రుని జ్యేష్ఠుఁ బాలనం
బున కభిషిక్తుఁ జేయఁగను బూనెద మీరలు సమ్మతించినన్. 53

ఉ. పెండిలియైనదాదిగ విభీతజనావనదక్షు రాము ను
ద్దండపరాక్రమార్జితనితాంత పవిత్రయశోవిరాజితున్
జండసురారిసూదనుని శత్రునృపాలభయంకరున్ ధరా
మండలనాథుఁ జేయమికి మామక కారణ మిట్టు లొప్పెడున్. 54

చ. తనదగుబాహుశక్తి శివుధన్వముఁ జెండి పరాక్రమార్జితం
బనఁదగు కన్యకాధనము నర్హవిధంబునఁ గాంచెఁ; గాన నా
ధనసుఖ మంతరాయములు దాపునఁ జేరకయుండ నొందఁగాఁ
జనుఁగద భూధవత్వమునఁ జాలునె యట్టులు పొంద దానినిన్. 55

చ. అని తలపోసి యర్కసమహాయనముల్ పని దేనిఁ జెప్ప కా
తని సుఖసంపదం గుడువఁ దాలిమిఁ బూని తలంపకుంటి; నిం
కనయిన యౌవరాజ్యమున గాదిలిపుత్త్రుని బూన్పకుండఁ బా
లనమును జేయఁజాలక తలంచితి నప్పని నప్పగింపఁగన్. 56

మ. ఇదియర్హంబని మీకుఁదోఁచిన సరే యిట్లే యొనర్పంగనౌఁ
గద యంచుం దెలుపుండు; వేఱుగను మీకాంక్షల్ ప్రవర్తించునే
నిది గాదిట్లని తెల్పుఁ; డిన్నిటికి మీయిష్టంబు నే నాచరిం
పఁ దగుం గా యని యూరకుండె ధరణీపాలుండు సంతుష్టుఁడై. 57

చ. నరపతివాక్యజాలము మనంబుల కెంతయు హాయి ఖేదముం
బరఁగఁగఁ జేయ నెల్లరును బల్కక యే క్షణముండి పెద్దలం
ద్వరపడి హెచ్చరింప జనవారము పంపునఁ బల్కి రిట్టులో
ధరణిపవర్య! మీదయి నదాపున నుండితి మింతకాలమున్. 58

క. తులలేని సిరి సుఖమ్మును, దొలఁగక చేకొంటి మిట్టితోడు విడువఁగాఁ
దలఁతుమె మీసన్నిధి శ్రీకలితుఁడు రాఘవుఁడు ప్రోవఁగలఁ డీమమ్మున్. 59

క. మీ రిరువురు పాలింపఁగ, నేరీతి సుఖంబు లబ్బు నెల్లర మిపు డా
హారిసుఖంబుల నొందం, గోరుదు మిదె రాజవర్య! కోరిక మాడా. 60

క. ఘనుఁడగు రాముఁడు పాలన,మునన్నైనన్ మిమ్ముఁగూడ బోలుచుం గీర్తిన్
మనుజేంద్ర! కావునన్ రా,ముని యువరాజుగ నొనర్పఁబూనుము మేలౌ. 61

మ. అవనీశా! క్షణమాత్రమైన నిఁక నీ వాలస్యముం జేయకే
యువరాజున్ రఘురాముఁ జేయుమని మా యుద్దేశమౌ నంచు నొ
క్కవిధిం బల్కఁగ నాలకించి తన కాంక్షల్ వే ఫలింపంగఁ జే
యువచస్తోమ మిదౌ నటంచు మదిలో నూహించి ధ్యానించుచున్. 62

మ. పరమేశుం డిది సార్థకంబగు నదెబ్భంగిన్ జవంబార నం
తర మింతైనను లేక సాగుగతి స్వాంతంబందు నూహించుఁగా
క రఘుక్ష్మాపతి గోత్రమాత్మజుని వంకన్ బాలసంద్రంబు పో
ల్కి రహిన్ వర్ధిలుఁగాక! యంచు మది సంకీర్తించి సంతుష్టుఁడై. 63

మ. స్మిత మాస్యంబునఁ జిందులాడఁ బలికెం జిత్తంబులం జక్కఁగా
హిత మూహించి వచించినార; లిటులే యిష్టే యొనర్పంగ స
మ్మతి నేఁ గాంచితి రేపా మాపా సచివుల్ మానుల్ సమాలోచనా
దృతినిం గాంచి ముహూర్త మిప్పుడని మీ రెల్లన్ బ్రయత్నంబునన్. 64

క. తెలియంజేయుదు రిఁక మీ, నెలవుల కేగంగవచ్చు నెమ్మిన్ మరలన్
లలితగతి నుత్సవంబున, బలుభంగుల సాయపడఁగ వాంఛలుపొంగన్. 65

క. వత్తుకుగాకని దశరథుఁ, డత్తఱి సెలవీయ మిగులు హర్షంబున రా
జోత్తముఁ బొగడుచుఁ జని రా,యుత్తమమహ మెప్పుచూతు మోయను కాంక్షన్.

ఆ. జానపదులు పెక్కు చందాల దశరథు, నాశయము నుతంచు చరిగి; రంత
మౌనివరుల నెల్ల మంత్రుల లగ్న ప్ర,యత్నముల నొనర్ప నగు నటంచు. 67

క. ఆనతి యొసంగి తమి నా,భూనాథుం డంతిపురికిఁ బోవఁ దదాజ్ఞన్
మౌనులు మూరుత మిడ్డని, మానసముల నిశ్చయించి మంత్రివరులకున్. 68

### శ్రీరామునకు దశరథుఁడు పట్టాభిషేకమునుగుఱించి తెల్పుట.

మ. తెలుపన్ వారును భూధవాజ్ఞఁగొని పృథ్వీభాగమం దెల్లనా
పలుకుల్ వెల్లడిచేసి; రంత ధరణీపాలుండు శ్రీరామునిం
బిలువంబంచి కుమార! పుష్యభము సంప్రీతిప్రదం బెల్లి రాఁ
గలిగెన్ సీతను గూడి సువ్రతపు దీక్షం బూను టొప్పుంజుమీ! 69

మ. కలకాలంబు వ్రతంబులన్ సలిపి యొక్కాలంబునం బుత్రకుం
డలరం జూడఁగ నోఁతుమో యనుచు నాయర్థాంగులున్ నేనుజా
పులు నొవ్వన్ దగ వేచియుంటిమి; తుదిన్ బుత్రేష్టదంబై మహా
ఫలదంబౌ క్రతుసంతతిన్ బొనరుపం బట్టీ! నినున్ దమ్ములన్. 70

క. కన నోచితి మిప్పలుకుల,కును ఫల మీయుత్సవంబె కుతుకంబున నీ
వును సీతయు నుపవాసం,బును బూనుఁడు నియమమునకు మూలం బదియౌ.

మ. ఉపవాసంబు సమస్తదోషతతి నోహో! యంచుఁ గీర్తింప దూ
రపథంబందును నిల్వకుండఁ దలుముల్ | రామా! మహర్షివ్రజం
బుపవాసవ్రత మూని శుద్ధమతులై | యొప్పారుచున్నారు నీ
వు పరేశుల్ మది నిల్పి పూనుము వ్రతంబుల్ సీతతో నిప్పుడే. 72

చ. అనుజులు దూరదేశమున | యందు వసింపఁగ నీమహోత్సవం
బు నిచటఁ జేయు టెట్టులని | పూనకు సంశయ మాత్మలోన ని
ప్పుని జరపంగ నెంచుటకుఁ | బర్వెను బుద్ధి యదెట్లొ; దైవమే
యనఁజను కారణంబు తగునట్లు వచించెద మీఁద నన్నియున్. 73

శ్రీరాముఁడు సీతతోఁ బట్టాభిషేకవిషయము దెల్పుట.

సీ. యువరాజుగా నిన్ను | నొనరించి కన్నుల,పంటగా మహాముని | బాఱఁజూడఁ
గాంక్షింతుఁ గావున | గడఁగుము వ్రతమున, కన రామచంద్రుఁడ | ప్పనియొనరుపఁ
గలకారణంబులఁ | గడఁగి మున్నే మది, నాఁసియుండుట | నప్పు డేమి
బదులు వల్కక తండ్రి | పాదంబులకు మ్రొక్కి, జనకజయింటికిఁ | జక్క నరిగి
తే. జనకునానతిఁ దెల్పిన | జానకియును, సుస్మితము మోమునం దోఁప | శూరవర్య!
మనజనికిఁ దగుఫల మిప్పు | మహి కనంగఁ, జేయఁదగుఁగాదె ప్రస్తుండఁ | జెల్లుఁగాదె

క. పురికొల్పితిఁ గార్యంబును, జరపఁగ నిఁక రేపె మనము | సౌమిత్రియుతిన్
బుర మిద్దానిన్ విడిచియె, యరణ్యముల కేగవలయు | నప్పని కెల్లన్. 75

క. కారణభూతులుగాఁ దగు, వారిం బురికొల్పుదానఁ | బరమాత్మా! నీ
వూరక చూచుచునుండుము, ధారణి నెద్దెద్ది యెట్లు | తనకై తానే 76

ఆ. కృత్యవితతి సాగు | నీవన సాక్షిమా, త్రుఁడవుగాదె నీకుఁ | దోడునీడ
గాఁ జెలంగు నేన | కావింతు సర్వంబు, నీదుపార్శ్వమందు | నిలిచి నాథ! 77

క. మనరాకకొఱకుఁ గొందఱు, దనుజులు శాపంబుఁ దొలఁగి | తమప్రాక్పదముం
గనఁబోవ వేచియున్నా, రనఘా! తత్కర్మగతుల | నరయఁగవలదే? 78

క. మునిచంద్రులు నీదర్శన,మును జేసి దివంబునొంది | భూరిసుఖంబుల్
గనఁ గోరియున్నవారలు, చనవలదే వారిఁ జూడ | సమయంబునకున్. 79

క. వేదంబులె నీవాక్కులు, వేదోక్తము కర్మమగును; | విశ్వేశ్వర! నీ
వాదివిభుండవు గావున, వేదంబుల నిల్పవలయు | విచ్యుతములుగన్. 80

క. ఫలముల నొసఁగును గర్మం,బులు సమయము తప్పకుండ | భువిఁ దత్ఫలముల్
గలుగంగఁ జేయవలయును, దలఁపుము నీయాత్మ దీని | తత్త్వం బెల్లన్. 81

క. తలఁపేదియు నీయాత్మం, గలుగదు; నేనన్నఁ దలఁపు | గాదే నీకున్
జలజాక్ష! నాహితోక్తులఁ, దలఁపుము సర్వజ్ఞుఁడవు | గదా నీ వన్నన్. 82

క. నే నాడించిన తెఱఁగున, నే నీవాడుదు వటంచు | నెంతురు కుమతుల్
నేనన నీవాడించెదు, దానఁగదా కాదనంగఁ | దగునె మహాత్మా! 83

క. మనయిర్వురకున్ భేదము, కనఁబడునే యెప్పుడైనఁ § గంజాయతలో
చన! చంద్రచంద్రికలకున్, ధనంజయజ్వాలలకును § దగునె వియుక్తుల్. 84

చ. జనులకుఁ జూడఁగా మనయ§సంగతి తోఁచెడు; నద్ది యజ్ఞతన్
జననముఁ గాంచు; యోగితతి § శాశ్వతమౌ మనసన్నిధానవ
ర్తనమును గాంచఁగాఁగలదు § రాఘవ! యింక వ్రతంబుఁ బూనఁగాఁ
జనఁదగు నన్న నవ్వచన§సారము నాత్మ నెఱింగి యంతటన్. 85

చ. పకపకనవ్వి రాముఁడను § భామిని! నీచతురత్వ మెంతొ మె
ప్పు కలుగఁజేయుఁజుమ్ము; రిపు§పుంజము సజ్జనరక్షణార్థమై
యిఁకఁ దునుమంగఁ జేయు మది§యేకద నాసగుణత్వసత్ఫలం
బు కదలువాఁడ; నింక నినుఁ § బూనియె సద్వ్రత మాచరింపఁగన్. 86

చ సరసిజలోచనుం డిటులు § జానకితోడ క్షణంబు భావికా
ర్యరతి రహస్యగోష్ఠిఁ జెలు§వారఁగఁ బుచ్చి స్వకీయ చారుమం
దిరమున కేగి మిత్రులకుఁ § దెల్పి తదుద్యమమెల్ల వారొగిం
బురికొలుపంగ సువ్రతముఁ § బూనెను సీతయుఁ దోడఁ బూనఁగన్. 87

చ. క్షితి శయనించి రిర్వురును § జేయఁగలట్టిస్వకార్యసంతతిన్
మతులఁ దలంచుచున్; వివిధ§మంత్రవిదుత్తమురాలుగాన భూ
సుత నడిరేయి లోఁ దలఁచె § సూనృతవాఙ్నిరతుండుగాన భూ
పతిని వరద్వయం బడుగఁ § బంతముపూనఁగఁ గైకఁ జేసెదన్. 88

మ. తనయుద్వాహమునాఁటి వాక్యమును స్వాం§తం బందొకప్డైన నెం
చని యా కేకయరాజపుత్త్రి కిదియే § సంతోషకాలం బె లె
మ్మని ప్రోత్సాహము మంథరాముఖమునన్ § హర్షింపఁగాఁజేసి దా
ననె కార్యంబు సమస్తమున్ విఫలతం§త్రంబై చెడం జేసెదన్. 89

ఉ. మామకు దేహబాంధవము § మానెడుకాలము చేరవచ్చె; శ్రీ
రాముఁడు చెంతనుండ నది§రాదు; వియోగమె కారణంబుగా
నామృతి శాపయోగమున § నయ్యెడుఁ; గావున రేపె రాఘవుం
డీమహి నుండకుండ వెలి§కేగెడునట్లు లొనర్తుఁ జక్కఁగన్. 90

మ. అని యోజించుచునుండు నంతటఁ బ్రభా§తానూనచిహ్నంబు లొ
య్యనఁ గన్పట్టె మహాజనుల్ నియతసం§ధ్యావందనాదిక్రియా
లిని దీర్పం బనిపూని రానిశను వా§ళిం గైకకుం దానొన
ర్పను యత్నించినకార్య మెల్లఁ దెలుపన్ § రా జేగె నిశ్శంకుఁడై. 91

మ. మును దాఁ బెండిలిఁగోరి కేకయ మహీ§పున్ వేఁడ నాపుత్త్రికిన్
జననం బందినవానికే సకలరా§జ్యం బీయ వాగ్దాన మి

చ్చిన నిత్తు౯ సుత నన్ను నవ్విధముగాఁ ౹ జేయంగ వాగ్దానము౯
మునిసంఘం బెఱుఁగంగఁ జేసె నది యాభూపాలుఁ డేమాత్రమున్. 92

చ. చిరకాలంబుగ నెన్నఁడయ్యె మదిలోఁ ౹ జిత్రం బిదే కాదె; యీ
శ్వరితంత్రం బిదె; కైకయు౯ మఱచెఁ; గౌసల్యాదు లివార్త నే
తరుణంబందు నెఱుంగ; రట్లగుటఁ జింతంబూన కారేయి భూ
వరుఁ డుప్పొంగెడుకాంతుఁ గేకయసుతావాస్తవ్యంబుఁ జేరె౯ వడిన్. 93

చ. తెలియఁడు తద్గృహంబు తనదేహవినాశనదక్ష మంచునా
తొలి పగలందె మంథరయుఁ ౹ దొందఱమీఱఁగ రాణిఁ జేరి నీ
విల బ్రదుకంగ నోచుటయు ౹ హీనమె కోసలరాజపుత్త్రి కి
మ్ముల మముఁగూడి దాసివయి ౹ పొక్కుచు నూడిగ మింకఁ జేయనా. 94

క. అని యేమేమో తెల్పిన, విని కేకయరాజపుత్త్రి ౹ విమలాత్మయౌ య
య్యును రామునందుఁ బ్రీతిం, గనినదియేయయ్యును విధిగతి హృతమతియై.

కైక దశరథుని వరములడుగుట.

క. పతిరాక వేచియుండఁగ, హితకృత్య మెఱుంగఁ జెప్ప ౹ నెంచిన ధాత్రీ
పతి యేగె నంతకు౯ మును, పతివయుఁ గోపాలయమునఁ ౹ బడియుండె ధరన్.

చ. సతి నటఁగానకార్తిఁగని ౹ క్ష్మాపతి కోపగృహంబుఁ జేరి యం
దతిశయదుఃఖ మొందినటు ౹ లత్తఱిఁ జూడఁగ నొప్పు కైక నా
దృతిఁగని కోపకారణ మదేమని ప్రశ్న మొనర్చి యెన్నియో
హితవచనంబులాడి తుద ౹ కిట్లనియె౯ విధి ప్రోత్సహింపఁగన్. 97

క. ఏమడిగిన నిచ్చెదఁ దుద, కీమేనంగల్గు ప్రాణమే నిచ్చెద నీ
కీమెయిఁ గోపము రాఁగా, నేమో కారణముఁ దెల్పు ౹ మింతీ! యన్నన్. 98

ఆ. సందుదొరకె ననుచుఁ ౹ జంచలమతియాట, సత్యవచనుఁడయిన ౹ క్ష్మావిభుఁ గని
వరయుగంబుమాట ౹ బవరంపువార్తను, స్మృతికిఁ దెచ్చి కోర్కిఁ ౹ జెప్పఁదలఁచి.

ఉ. ఇప్పుడె రాముని౯ వనికి ౹ నేగఁగఁబంపుము మానివృత్తి; నా
యొప్పులకుప్పయౌ భరతు ౹ నున్నతిమీఱఁగ రాజుఁ జేయు; మి
ట్లిప్పని చేయకున్నఁ ద్యజియించెదఁ బ్రాణము; లింక నేమియుం
జెప్పకు చాలుఁజాలు మదిఁ ౹ జెందినకృత్రిమ మిప్డెఱింగితిన్. 100

క. అని ధిక్కరించి పల్కిన, విని చేడ్పడి కొంతసేపు ౹ విషమావస్థం
గనియుండి యెన్నియో చక్కనిమాటల నూఱడించి ౹ కఠినోక్తులనున్. 101

ఉ. కోపనచిత్తవృత్తి దనకుం బ్రతికూలము గాకయుండఁగా
నేపగిదిం బొనర్పఁదగు ౹ నిష్టవిపత్తుల నంచు నెంచి రా
జాపగిదిం గడుంబలికి ౹ యయ్యదియు౯ ఫలకారిగామి శో
కాపహృతాంతరంగుఁడయి ౹ యత్తఱి మ్రాన్పడియుండె; నవ్వలన్. 102

చ. తెలతెలవాఱఁజొచ్చె; రఘు।ధీరుఁడు స్నానముచేసి దేవతా
వళులను వేడి చేయఁదగు।వానిఁ దలంచుచునుండె; నంతటన్
జలరుహనేత్ర జానకియు। స్వాంతమునన్ స్మరియించె; దానినే
కలిగె మహర్షిచిత్తముల। గాఢతమోగుణ మప్రతర్క్యమై. 103

క. కాలత్రయ వర్తనముల, చాలు నెఱింగినమహర్షి।సంఘుం బట నా
లీల ధరాసుత తలఁపం,గా లఘుబుద్ధిని గలంగి। కార్యగతులనున్. 104

క. ఇసుమంత తెలియఁజాలక, వెసఁ బంక్తిస్యందనుండు। విపులాభర మా
సుసమయమున రామునిపైఁ, బ్రసరింపం జేయునంచు। భావించి మదిన్. 105

చ. తనపనులందు శ్రద్ధగొని। తత్సుముహూర్తము వచ్చు నెప్పుడం
చును గనిపెట్టియుండె; నిది। చూడ మహాప్రకృతిప్రయత్న మెం
త నిబిడశక్తిసంయుతమొ। ధాతకునైనఁ దలంపరానిదే
యనునది తేటతెల్లమగు; । నంత సుమంత్రుఁడు రాజు రామికిన్. 106

మ. కతమేమోయని స్యందనంబుఁ గొని యా।కైకేయిగేహంబుఁ జొ
చ్చి తనుంగాంచి బహూకరింపక కడుం। జింతించుచున్నట్టిభృ
త్యతతిం గన్గొని కారణంబెదియొ యం।చాలోచనల్ పర్వ భూ
పతి దర్శింపఁగఁ బోయి యార్తుఁడగుచున్। బల్యంకమం దొక్కటన్. 107

క. తలవాంచి యశ్రుజలకణ,ములు ధారలుగా శరీర।మున నంతటఁ బ
ర్వ్వలు వాఱఁ దూలియుండఁగఁ, జలమునఁ గైకయును సుంత। సన్నిధినుండన్.

శ్రీరాముఁడు తండ్రినిఁ జూడఁ గైకగృహంబున కరుగుట.

సీ. పరికించి యిదియేల। పాటిల్లె దురవస్థ, యంచుఁదలంప నా।చంచలాక్షి
యాసుమంత్రునిజూచి।యార్య! శ్రీరాముని, గనఁగోరుచున్నాఁడు।కాంతుఁడిపుడె
తోడ్కొనిరమ్ము, నీ।తో మాటలాడఁగాఁ, దలపోయఁ డిత్తఱిఁ। దా నటంచుఁ
బల్కిన నతఁడేమి। పలుకక వేగంబ, చని రాఘవునకు నా।చరితమెల్లఁ

తే. దెలుపకయ రాజునిన్గనఁ।దలచెనిగియె, స్యందనమటన్న నుత్సాహ।సాంద్రుఁడగుచుఁ
బ్రకృతిశక్తిని బొగడుచు। రథము నెక్కి, చనియెఁదండ్రినిదుదిసారి।గనఁగఁగోరి.

ఉ. అంతిపురంబుఁ జేరి జను।లంతటనంతటఁ బోవఁ గాంచి లో
నెంతయు భేద మందినటు। లెల్లరకుం దెలుపంగఁగోరి యా
వంత ముఖంబు వంచి తన।యంఘ్రులఁ గాంచుచుఁ బోయె లోని కే
చింత లెఱుంగనట్టి హరి। శీఘ్రమ కర్మనిబద్ధదేహుఁడై. 110

చ. చనిచని కోపగేహమున। సాంద్రమనోవ్యథఁ గుందుతండ్రినిం
గని తదుపాంతికంబున స్వ।కార్యరతాత్మగ నొప్పుకైక నా
య్యనఁ బరికించి తల్లి! యిటు।లార్తిని దండ్రి కనంగనేల యం
చని యడుగంగ నందుకొని। నట్లు వచించె వికారవక్త్రయై. 111

కైక శ్రీరామునకు వరములను దెలుపుట.

చ. సురలకుఁ దోడుగాఁ జనుచు । సూనృతవాది యితండు నన్ను నా
దురమునుజూడఁ దోడుకొని । తోరపువేడుకఁ బోయె నేను నం
దరిశరవిద్ధదేహుఁడయి । యల్లన మూర్ఛిలియున్న నీపితన్
బరిజనహీనుఁ గాచితిని । బౌరుష మూని రఘూత్తమా! యటన్. 112

ఆ. నిశితసాయకముల । నీల్గె సారథి యట్టి, తరుణమందు నేను । ధైర్యమూని
కాచితి నిటు మరలఁ । గదన మ్మొనర్చియు, మూర్ఛమున్గె నరిస।మూహ మార్య.

క. వెండియు సారథికృత్యము, నిండా రెడుశక్తిఁ జేసి । నేఁ గాచితి నా
ఖండనమున దానికిఁ బ్రీతుండయి వరయుగ్మ మిచ్చెఁ । దోడనె రామా! 114

క. సమయమువచ్చిన నడిగెద, సమరాంగణమందు నేల । క్ష్మాపాలక యం
చమరులు నుతింపఁ బల్కెఁ, జుము రామా! యిప్డు కోరఁగ।జొచ్చితి వానిన్.

క. అనృతప్రియుఁడని దండ్రిని, జనులకుఁ దోఁపింపఁ జేయఁ।జాలనివానిం
గను నిన్నుఁ దలఁతు రామా!, విను మా వరయుగ్మమునకు । విపులవ్యాఖ్యన్.

క. మునివృత్తి నీవు కాననమున నుండుట యందునొకటి; । మోదమ్మున నీ
యనుజుని రాజ్యమునకు నొడయనిఁ జేయుట రెండవవర । మగు రఘురామా!

క. వీనినె నే నిమ్మంటిని, భూనాథుఁడు నీకు దెలిచి । పొగులుచు నున్నాఁ
డీనావరములు ఫలయుతిగా నెగడం జేయవయ్య! । కమ్రగుణాఢ్యా! 118

క. పదునాలుగేండ్ల కాలము, వదలక యిటు సాగుటగద । వరములభావం
బిది సాగఁజేయుభారము, చెదరక నీతలను నిల్చె । శ్రీరఘురామా! 119

చ. జనకునిఁ బాపపంకయుతిఁ । జాలఁ దపింపఁగఁ జేయువాఁడవో;
యనృతపుబాధ మాన్పి సుఖ।మందఁగఁ జేయుదువో; తలంపుమా
యని మొగమోట మింతయిన । నత్తఱిలేక వచించుతల్లితో
ననియె రఘూత్తముండు వద।నాబ్జము సుస్మితయుక్తి వెల్గఁగన్. 120

ఉ. అమ్మరో! తండ్రివాక్య మిది।యైనను గాకయునున్న నొక్కఁడే
సుమ్ము విచారమేల? వనిఁ । జొచ్చుట నాకుఁ బ్రహర్షదంబె; నా
తమ్ముఁడు రాజ్య మూనుట ని।తాంతము మోదదమే; సవిత్రివా
క్య మ్మనఁ దండ్రివాక్యమె; త।గఁగన్ దలపోసిన సత్య మిద్దియే. 121

క. తెప్పింపుము వల్కలముల, నిప్పింపుము ప్రీతిమీఱ । నింటి కరిగి నే
నిప్పుడె వచ్చెద నని తమి, యొప్పఁగఁ జని సీతతోడ । నొయ్యనఁ బలికెన్. 122

చ. అరిగెద దండకాటవికి । నందు మహర్షులఁగూడి హాయిగా
జరపెదఁ గాల మేను మను।సంఖ్యశరత్తులు మౌనివృత్తి సుం
దరి! మరియాదమీఱఁగను । దల్లిని గోసలరాజపుత్రి నా
కరణిని గొల్చుచుండుము సు।ఖంబును నాకగునట్లు కోరుమా. 123

చ. అని యిఁక నేమి యో తెలుప నాత్మఁ దలంచెదు రాముఁ గాంచి యి
ట్లను! నను వీడ నేపనికి నర్హుఁడ వౌదువొ సుంత లోఁ దలం
చిన నిటు పల్కఁ బూనుదువె చెప్పుము నీవె; యటన్న నవ్వుచున్
వనరుహపత్త్రలోచన! భవద్ధృదయాభిమతం బెఱుంగఁగన్. 124

చ. తలఁచియె యిట్టు లంటి; నెది తావక వాంఛయొ నాది; యద్దియే
కలుగునె యెట్టికాలమునఁ గాని వియోగము నీకు నాకు; నీ
వలనఁ గదా ప్రపంచసమవాయము గల్గుఁ జెలంగుఁ ద్రుంగు; నే
దలఁచుట నీవు తీర్చుట సదా తగుధర్మమె యిద్ది కావునన్. 125

శ్రీరాముఁడు సీతతోడను దమ్మునితోడను నడవి కరుగుట.

క. సాగింపుము పయనంబును, జాగేల యటన్నఁ జాలసంతసమున నా
భూగర్భవాస యత్నము,తోఁ గదలెన్ నాథుఁ గూడి ధూర్తులఁ జెండన్. 126

క. సౌమిత్త్రియు శ్రీరాఘవు, భూమిసుతం గూడి వనికిఁ బోవం దరలెన్;
శ్రీమంతులు చేరిరి వడి, భూమీశుం డున్నవస్త్యమును జను లేద్వన్. 127

సీ. దశరథక్షితిపుపాదములకు వందన,మర్పించి కైకకు నభిమతముగ
మ్రొక్కి రా జేడ్చుచుఁ బోవలదని వేఁడ, స్వీయకార్యముఁ జక్కఁ జేయుకోర్కి
శ్రీరాముఁ డరిగెను సీతయు సౌమిత్త్రి, తనవెంట రా నయోధ్యాపురంబె
యతనివెంటం జనునట్లుండె; నత్తఱి, నెల్లర వారించి యెంతొ వగచు

తే. చున్న కౌసల్య స్మరియించియోగినగరము, దాఁటి గుహుఁడను వనచరధవుని మిత్త్రుఁ
గాఁగ భావించి రాజ్యభాగమును గడఁచి, చిత్రకూట మహాటవిఁ జేరెనంత.

చ. మునిపతి యావసిష్ఠుఁ డిటు మూరుత మెవ్విధి నిశ్చయించ? నీ
తని కెటు దివ్యదృష్టి తగు? దా నెఱుఁగండు ముహూర్తశాస్త్ర; మం
చు నితరు లాడఁగా మునియుఁ జూడఁడు వారి మొగంబులన్; త్రపం
గని తనయజ్ఞతం దెలిసి కాలబలంబని దాని దూఱుచున్. 129

ఉ. అంతియ కాని సర్వజగదీశ్వరి యాపరశక్తి యెవ్విధిన్
స్వాంతమునం దలంచునో యభంగురశక్తిని జేయ నెంచునో
సుంత కొఱంత గాంచ కది చోద్యము మీఱఁగ నట్టె సాగు; సి
ద్ధాంత మిదే యటంచు నొకఁడైనఁ దలంపఁడు చిత్ర మిద్దియే! 130

ఉ. అందఱమానసంబుల మహాతమ మెంతయుఁ బర్వఁ జేయ నా
నందము గాంచు దైవియె యనందగు మాయ ప్రపంచమెల్ల నే
చందమునం జెలంగెడినొ సారససంభవుఁడే యెఱుంగఁ డ
న్నం దరమే తదన్యము జనవ్రజ మావిషయం బెఱుంగఁగన్. 131

క. జనులు తమున్ దూషింపఁగ, మునులు వసిష్ఠాదు లట్టి మోహముల వంపం
గనుబూని; రంతె కాని నరనికరము శపింపరైరి రాజ్ఞి మహాజ్ఞన్. 132

చ. సరసిజమిత్రవంశమణి । సత్యరతుండగుటం గుమారునిన్
మరలుపకుండి కైకపయి । మానసముం గనియున్న ప్రీతి స
త్వరమ మరల్చుకొంచుఁ దొలి । భార్యగృహంబున కేగి మున్ను తా
నరయక చంపినట్టి ముని । నాత్మఁ దలంచి విచారమగ్నుఁడై. 133

క. తనచేసిన పాపమునకు, మునియిచ్చిన శాపమునకుఁ । బోలుఫలం బా
తనయవియోగ ముఖంబునఁ, గనఁదగుఁ గా యంచుఁ దలఁచి । కాలము దానిన్.

క. మది నెఱిఁగి పెద్దభార్యకు, నిది యిట్లని తెలియఁజెప్పి । యిఁక గుణరత్నా
స్పదు రాముఁ జూచుభాగ్యం, బొదవదటంచాత్మ నెంచి । యార్తిఁ బొగులుచున్.

క. సుతు సుగుణాన్వితు రాముని, మతిఁదలఁచుచుఁ దద్గతైక । మానసుఁ డగుచున్
మృతిఁగాంచి దివ్యపదముం, బ్రతిలేని సుఖప్రదంబుఁ । బ్రాపించె వడిన్. 136

క. ఆవార్త నెఱిఁగి మంత్రులు, క్ష్మావరు దేహంబు తైల । సంసర్గమునన్
వావిరి కాపాడుచు నిఁక, నేవడువునఁ జేయవలయు । నీపాలనమున్. 137

తే. అనుచు యోజించి మానీంద్రు । నాశ్రయమును, గొనుచు జంఘాలురగు సేవ । కులనుఁ జేరి
తగినపద్ధతిఁ దెల్పి సత్వరమ భరతుఁ, బిలుచుకొని రాఁగఁ బంపి । రవ్విధిని బంప.

ఉ. వారలు కేకయక్షితిపు । ద్వారము చెంతఁ జెలంగునట్టి దౌ
వారికులం గనుంగొనుచు । వచ్చిన కార్యముఁ దెల్ప వారలా
భూరమణాజ్ఞచే భరతు । ముందట నిల్పిరి వారి; నాతఁడున్
సారవిహీనవక్త్రుల వి । చారమనస్కుల వారిఁ జూడఁగన్. 139

క. తొలినాఁటి రేయివచ్చిన, కలకున్ ఫలమిప్డు కల్గె । గాఁ గల దనుచున్
వెలవెలఁబాఱుచు వారల, వలనన్ సందేహయుక్త । వార్తల నెఱిఁగెన్. 140

చ. మునిపతి పంపెఁ దమ్మనుచు । భూపతివార్త లెఱుంగమంచుఁ దె
ల్పినకతనన్ మనస్సు కద । ళీతరుపత్త్రము వాతసంహతిన్
గనుచపలత్వ మట్లు వణఁ । కన్ బ్రియసోదరుఁ జేరి వెంటనే
చనఁగఁ దలంచె యాన మది । సాగె మహత్తరవేగయుక్తమై. 141

## భరతుఁ డయోధ్యకు వచ్చుట.

చ. పురుషుని పూర్వకర్మఫల । ముల్ మునుమున్నె యెఱుంగఁజేయు ని
క్కరణిగనుండునంచు నపె । గావె నిమిత్తము లన్న వాని నీ
శ్వరుపయి భారముంచి యిటు । సాగును వీని స్వరూపమంచు ని
త్తరుణమునన్ ఫలించునని । తజ్జ్ఞులకే తెలియం దరంబగున్. 142

ఉ. ఎల్లర కొక్కరీతిగనె । యేర్పడఁ దెల్పును గర్మరాజి యి
ట్టుల్లసిలున్ ఫలంబు లని । యోర్పుఁ గనందగు నంచు; వానినే
యెల్లజనుల్ నిమిత్తము ల । వే యని వాదుదు రివ్వి యిప్డు రాఁ
జెల్లునటంచుఁ గట్టడిని । జేయఁదరం బెటుగా ద దేరికేన్. 143

చ. కనుక దురూహమై తనరుఁ గర్మపథంబని యోగశాస్త్రమే
వినఁబడఁ దెల్పుఁగాదె; పృథివిం దగుపామరు లట్టివానిఁ జ
క్కనిగతిఁ గాంచియున్ వినియుఁ గానక వానిమహత్త్వ మిట్టిదా
నని మరియాదఁ జూప; రది యజ్ఞతకున్ ఫలమే యగుంగదా? 144

ఉ. ముందుగ నానిమిత్తములమూలమునన్ దనపూర్వకర్మ మీ
చందమునన్ ఫలం బొసఁగఁజాలు నటంచుఁ దలంచి శాస్త్రవి
ద్బృందము వంతయేఁ బ్రమదమేఁ గనకుండును; బామరుల్ వగం
గుంది యనిష్టమైనఁ దమిఁ గూరుదు రయ్యది యిష్టమై తగన్. 145

తే. శకునసంతతియున్ భవిష్య మిటులంచు, నెల్లరకుఁ దెల్పు చుండు నిల్లెల్లకడలఁ
గర్మసిద్ధాంత మెప్పుడు గ్రాలుచుండు, భరతుఁడద్దాని నెఱుఁగును బ్రాజ్ఞుఁడగుట.

సీ. ఎడనెడఁ దోఁచు నహీనదుష్ఫలదాయ, కనిమిత్తములకు నెమ్మనము కలఁగ
నిదియేల యిబ్భంగి నీనిమిత్తంబులు, కనఁబడుచున్న విక్కాలమందు
వచ్చినవార్త యీవరుసగనున్నది, రామాదులకుఁ గీడు రాకయుండుఁ
గాక! యంచు రమేశుఁ గడుభక్తిఁ దలఁచుచుఁ, దమ్మునకానిమిత్తముల తెఱఁగుఁ
తే. దెలియఁజెప్పుచు వార్తాహరులనుగూడి, చొచ్చె నగరంబు నయ్యదిశూన్యహర్ష
ముగఁ గనంబడె నద్దానివగలుగదుర, నంతిపురిఁ జొచ్చె నెంతయునార్తుఁడగుచు.

## కైక భరతునకుఁ దనకార్యముం దెల్పుట.

చ. తనయునిరాక కెంతయు ముదం బిగురొత్తఁగ నుబ్బి కైక పా
దనళినయుగ్మమందు ముఖతామరసంబును జేర్చి మ్రొక్క నా
తనయుని లేవనెత్తి కడుధైర్యముమీఱ వచించె; నాయనా!
వినుము త్వదర్థమై యనుభవించినకష్టము నీకుఁ దెల్పెదన్. 148

క. మాతామహునింటికి నీ, వాతఱిఁ బోవంగ సుసమయం బిదియంచున్
నీతండ్రి కుమతులం గొని, యేతఱి నెవరేని మేలిదే యనని పనిన్. 149

క. కావింపఁగ యోజించెను, బ్రావీణ్యముమీఱు మంత్రివర్గం బళ్లీ
కావింపఁబూని రయ్యది, భావింపం గృత్రిమంపుఁబని యని తోఁచున్. 150

క. ఉన్నట్టులుండి రామున, కున్నతి యువరాజపదము నొప్పించెదుకాం
తున్నగరంబును గైసేయ, న్నరపతి యాజ్ఞచేసె నయ్యది సాగెన్. 151

క. రేపే యభిషేకోత్సవ, మోపడఁతీ! సాగు నంచు నుర్వీపతి నా
కాపలుకుఁ జెప్పవచ్చెను, దాపమ్మది దుస్సహమయి తార్కొనె నన్నున్. 152

క. నీవింటలేని యప్పు డిది, కావింపఁగనేల? గొప్పకార్యము దీనిన్
నీవున్న నేదో విఘ్నం, బావహిలం గలదటన్నయది లేకున్నన్. 153

క. ఈకృత్రిమకార్యంబే, నాకెంతో యాగ్రహము మనంబునఁ దగు న
ట్లోకొడుకా! చేసెను. నే, నాకార్యము మాన్పఁ బూన్కి నాత్మం గొంటిన్.

క. రాముని నిన్నుఁ గనఁ దలఁతుం, గా మది నిందాక నీవు కనకుండువె నా
ప్రేమ మదెట్టిదొ యట్లా, భూమీశుఁడు కృత్రిమంబుఁ బూనినకతనన్. 155

క. తగినట్టి పాచితముఁ జే, యఁగ నెంచితి మాయికులసముత్కంబున న
ట్లుగనె యమాయికుఁ డుండం, దగునని పల్కుదురు నీతిశతత్త్వజ్ఞు లిలన్.

చ. కనుకనె కృత్రిమంబయిన కార్యము నాశమునొందునట్లు చే
సిన నుపకారమా ననుచుఁ జిత్తమునం దలపోసి పూర్వమి
చ్చిన వరయుగ్మ మిమ్మనఁగఁ జెప్పుము కోర్కి నటంచుఁ బల్కె; నా
తనయుని రాజుఁ జేయుమిటు తప్పక రామునిఁ బంపు కానకున్. 157

చ. పదిపయి నాల్గువర్షములు బ్రహ్మమునిప్రియవృత్తి రాముఁడుం
డఁ దగును; రేపె పంపు నరనాథ! మహాటవి కంటి; దానికిన్
బదులుగ నేమియో పలికెఁ బట్టునువీడక యుండి నేను న
య్యదనున రామునిం బిలువనంపితి; వచ్చె నతండు చెచ్చెరన్. 158

చ. తెలిపితి నాదునిర్ణయముఁ దృప్తిగ రాముఁడు సమ్మతించి చిం
తిలకయె వల్కలంబులను దీరుతొలంగక తా ధరించి తో
లలనయు రాఁగ నావెనుక లక్ష్మణుఁడున్ మునివృత్తిరాఁగఁ గా
నల నివసింపఁ బోయె నరనాథుఁడు పెన్వగఁ జేరె స్వర్గమున్. 159

క. చేసినదుష్కృతకర్మం, బేసరణి ఫలింపకుండునే? ప్రియతనయా!
యీసర్వంసహ నేలుము, చేసిననాయత్నమెల్ల సిద్ధింపంగన్. 160

చ. అనుచు నిఁకేమొ చెప్పఁగఁ బ్రయత్నముచేసెడు కైకఁ గాంచి యో
జనని! మహాపవాద మను సంద్రమునన్ నను ముంచి మున్గితీ
వును; బలుమాటలేల? యసువుల్ చనకున్నవి మేననుండి; రా
మునిశ్రమ మిట్లు కర్ణయుగముం జొరఁ నిల్చిన నేమి చెప్పుదున్. 161

చ. పతిహితచర్యయే తలఁప వామకుఁ జెల్లును గాని నాథునిన్
మృతి గనఁజేయు కార్య మది మిక్కిలిపాప మటంచుఁ దెల్పు నా
స్మృతుల నెఱుంగఁజాలియును జేసితి విట్లఘ మిచ్చుకార్య; మీ
క్షితిఁ గలకాల మీమనకుఁ జెందినదుర్యశ మట్లె నిల్చుఁగా! 162

చ. అని తెగనాడి మంథరయె యప్పని కెల్లను మూలమంచు న
మ్మిన యనుజన్ముఁ డాగ్రహము మించఁగఁ దర్జనభర్జనంబులన్
వనిత నలంప నేల? యఘవారవినిర్మితదేహ ముట్టరా
దనుచుఁ బ్రశాంతుఁ జేసి యట నంబను జూడఁగ నేవగించుచున్. 163

క. వగ పెనఁగులాడ వేగం, బుగఁ జని సచివాళి యప్డు భూపతికిం జే
యఁగఁదగిన కార్యమును జక్కఁగఁ జెప్పిన నట్లె చేయఁగా నూల్కొనియెన్.

ఉ. శైలనిమగ్నదేహమును ధర్మమురీతి వసిష్ఠునానతిన్
జాలఁ దపించుచున్ దహనుజ్వాలల కాహుతిచేసి పెన్పొగం
దూలుచు నూర్ధ్వలోకములఁ దోరపుశర్మము నొందఁజేయఁగాఁ
జాలిన కర్మశేషమును శాస్త్రహితంబుగఁ జేసి యవ్వలన్. 165

ఉ. పౌరులు మంత్రులున్ హితులు బ్రహ్మమునుల్ చనుదెంచి యీధరా
భారముఁ బూను మర్హవిధి భద్రముఁ గూర్పు జనాళికెల్ల నీ
వారలు చూపినట్టి హితవర్త్మము నీవు సమాశ్రయింపు; మీ
ధారణి యెప్డరాజకత దైన్యము గానఁగరాదు సుంతయున్. 166

ఉ. రాముఁడు కాన కేగెఁ గద! రాణ్మణి పంక్తిరథుండు పుణ్యలో
కామలశర్మముల్ కనఁగ నాత్రిదివంబున కేగెఁగాదె? యీ
భూమి భవద్భుజాశ్రయతఁ బొల్పఱకుండఁగ నిల్చుటొప్పు నో
ధీమహితా! ప్రజాహితముఁ దీర్పఁగఁ జేర్పుము ప్రీతి దానిపై. 167

చ. వలసినయర్హవస్తువు లవారిగఁ గూర్చితి మగ్రజన్ము ని
స్తులయువరాజపీఠమునఁ దోడని నిల్పఁగఁ గోరి వానితో
నిలుపుదు మీనినున్; బొసఁగ నిల్చి భరింపుము మమ్ము నెల్లరన్
లలితగుణైకభూషణ! యిలాపతిధర్మవిదుత్తమా! యనన్. 168

భరతుఁ డన్నను జూడ నరణ్యమున కరుగుట.

ఉ. కన్నులనుండి యశ్రుకణకాండము గండములందుఁ బాఱఁగా
నన్నకుఁ జెందఁగాఁదగినయట్టి పదంబున నన్ను నున్ప మీ
రెన్నుట న్యాయమంచు మదినించుక తోఁపదు; నాదు ప్రార్థనం
బున్న యమారఁగా వినుఁడు పూనుఁడు దానిని నిర్వహింపఁగన్. 169

చ. వనముల కేగి రామపదవారిజముల్ శరణంబు వేఁడి యా
తని నిటఁదోడి తెచ్చెదను ధాత్రిని గావఁగ; రాకయున్న నా
తనికడ నుండువాఁడ; నిదె ధర్మము నాయది; తత్ప్రయాణ మొ
క్కనిముసమైనఁ బుచ్చక నికామజవంబునఁ జేయఁగాఁ దగున్. 170

చ. భరతుని యాసువాక్యము లపారముదం బొదవంగఁ జేయ న
క్కరణిని జేయువార; మని కానలకుం జనుత్రోవ లెల్లఁ గుం
జరములు లోనుగాఁగలుగు జంతువు లేగఁగ నర్హమా గతిన్
ద్వరపడి చేయఁగాఁ బనిచి వార్తను దానిని విన్నవింపఁగన్. 171

క. జననీత్రయ మింకనుగల, జనకుని పత్నులును దోడఁజనుదేరఁగ మం
త్రినికరము వెంటరా న,శ్వనాగరథపత్తివితతి బయలు వెడలఁగన్. 172

క పత్తనమెల్లఁ బ్రయాణం, బత్తఱిఁ జేసినవిధంబు నగపడియె నటన్;
జిత్తము శ్రీరామపదా,యత్తముగా వెలయ భరతుఁ డంతం గదలెన్. 173

క. అనుజుఁడు శత్రుఘ్నుఁడు తోఁ, జనుదేరఁగ నియతి నగ్రజన్ముని గానం
జనియెఁ భరతుఁడు న్యాయ్యం,బున నన్నం బట్టభద్రుఁ బూని యొనరుపన్.

### గుహుఁడు సైన్యముల సిద్ధపఱచుట.

చ. అడవులఱేఁడు విక్రమధనాఢ్యుఁడునౌ గుహుఁ డంత నవ్విధం
బెడనెడ నాలకించి తన కేర్పడఁ బూర్వము లక్ష్మణుండు త
మ్ముఁడె యని నమ్ము రాఘవుఁడు మోస మెఱుంగఁ డటంచు నొంటిగాఁ
గడఁగి వచించినట్టి నుడి కారియ పెట్టఁగ దాఁచె లోపలన్. 175

ఉ. ఆనుడి సంతతంబు మదియందె తలంచుచునుండె; సత్యమే
యౌనె యటంచు నర్హమగునట్టియుదాహరణంబు చిక్కినం
గాని యి దిట్టులంచు వెలిగా నొనరింపఁగరా దటంచు సుం
తైన వచింపకుండెఁ దనయంతికమందు వసించువారికేన్. 176

క. కైకేయితనయు సైన్యము, లాకాననమెల్ల నిండి యరుదేరఁగఁ దా
నాకులతం గని నిశ్చయ,మే కాదే లక్ష్మణోక్తి యిప్పనివలనన్. 177

క. వనములకు రాముఁ డేగఁగఁ, దనతల్లియె కారణమని తానెఱుఁగఁడొకో
పనిపూని యపకృతిఁ రా,మున కింకం జేయఁబూని పోవఁ దలఁచెనో. 178

క అగ్రజుఁ దోడ్కొనిరాఁగ న, నుగ్రహముం బూనినాఁ డనుచుఁ దలఁపఁగ నీ
యుగ్రద్విపముఖబలము స,మగ్రముగాఁ బోవనేల యనుశంక తగున్. 179

క. కొదువయన లేనియోధస, ముదయము దుర్వృత్తినూని పోవు నటంచుఁ
హృదయమునఁ దోఁపఁ జేసెడు, నిదమిత్థమ్మనుచు నిశ్చయింపఁ దరమెటౌ. 180

తే. అనుచుఁ బలుమఱు యోజించి యాత్రపడుట, మేలుగాదని తలపోసి కాలుదూత
లట్టియోధులఁ బిల్చి మీరఖిలయుద్ధ, సాధనమ్ములఁగొని యుద్ధసమయమునకు.

క. కనిపెట్టియుండుఁ డంచని, వినిపించుచుఁ గర్ణధారవితతిం గని నా
యనుమతి లేకుండఁగ నుడు,పనిచయ మవ్వలికిఁ బోవఁ బనుపకుఁ డింకన్. 182

చ. అరిబల మేగుదెంచెడుఁ బ్లవావళిఁ గావఁగ జాగరూకులై
సురసరిదంబుపూరమునఁ జొప్పడుమార్గములందు నిల్చి యె
వ్వరు చనకుండ నిల్పుఁడు; ప్లవంబులఁ గన్పడకుండఁ జేయుఁ; డా
భరతుఁడు రామచంద్రునకు వైరిగదా తలపోయ నిత్తఱిన్. 183

మ. అని కైవర్తులఁ బిల్చి రాజులకు యోగ్యంబైన మత్స్యావళిఁ
గొని సిద్ధంబుగ నుండుడం చనిపి యుగ్రుండౌచు సేనాధిపుఁ
గని ధాత్రీరుహవాటి నెవ్వరికిఁ గానఁ రానిచందంబునఁ
మనయోధవ్రజ మంతనంత గడఁకఁ మార్గంబులం జూడఁగన్. 184

తే. నిలిపియుంచుము యుద్ధంబు నేఁడుగలుగు,నట్లుతోఁచెడు; శ్రీరామునందు గల్గు
భక్తిఁజూపంగఁ దఱియిది ప్రాప్తమయ్యె,నంగముల దాఁపనిదిసమయంబుగాదు.

క. ఈల వినంబడు నెత్తఱిఁ, గోలల నుఱుమాడవలయుఁ గొంకక క్షోణీ
పాలుని రాణువ నంతయు, వ్యాళంబులఁ జెండు తార్క్ష్యుభంగిం బెలుచన్. 186

ఉ. రామునిమిత్తమై సకలరాజ్యము పోయినఁ బోవుఁగాక! యీ
నా మెయిఁ బాసి యయ్యసుగణంబు చనంజనుఁగాక! యింక నే
మేమి విపత్సమూహ మెటులే ననుఁ గ్రమ్మినఁ గ్రమ్ముఁ గాక! యీ
భూమిధవాత్మజన్ము వనిఁ బోవఁగనీయఁ బరాక్రమంబునన్. 187

మ. ఇపుడే మార్కొన నాజ్ఞ చేయఁదగదే యేలా యిఁకాలస్యమం
[1]చపలాపంబునఁ బల్కెదేమొ? భరతుం డత్యంతభక్తుం డటం
చెపుడో వింటి యథార్థ మద్దియగునే నింపారఁ బూజింపనోఁ
గపటంబూనునయేని మార్కొన నగుంగానక్ క్షమం బూనెదన్. 188

మ. పరికింపంజనుఁ దొల్తవర్తన మదేబ్భంగిం బ్రవర్తిల్లు నం
చరయంగా నది సన్నుతింపఁదగునే నర్హుండు పూజింపఁ గా
పురుషాభీష్టదమైనచో నదియుఁ బోపొమ్మంచు వర్జింపనో;
సరిగా నొప్పెడుమార్గ మిద్దియె పరీక్షాకార్యమం దెప్పుడున్. 189

ఉ. వేసముఁ జూచి వీఁడు గుణవృద్ధుఁ డటంచుఁ దలంపరాదు; పే
రాస ధనంబునం దొలయ నతుల విప్పుచు మాయుచుందు; ర
భ్యాసములన్ మఱుంగుపఱుపన్ జరియింతురు వేషభాషలన్
దోసము లేమి దెల్పుచును దుర్జను లెందఱొ భూతలంబునన్. 190

ఉ. దాసులమంచుఁ గొందఱు నితాంతధనాశ మదిం జెలంగ, స
న్న్యాసులమంచుఁ గొంద ఱొగి హాటకరాశినిఁగూర్ప, నింక నె
న్నోసరణుల్ తగన్ గపటమొయ్యన దాఁచి చరింత్రు; వారిదౌ
మోస మెఱుంగ కజ్ఞులు సుపూజ్యులె యంచుఁ దలంతు రాత్మలన్ 191

చ. కనకముఁ గూర్చుమార్గములు కల్గు ననేకము లర్థకాంక్షమై
కొనఁ జుబుకంబుఁ బెంచి ధరఁ గొందఱు యోగులమాడ్కిఁ గచ్ఛడం
బును ధరియించి కామినులపూగము సేవఁజేసి మంత్రదీ
క్షను గొన వెంబడింపఁ దమకంబును దాఁచి చరింత్రు స్వేచ్ఛగన్. 192

తే. అట్టివారల నెఱుఁగంగ నర్హమైన, దొక్కవర్తనమే; దాని నుద్యమమున
నరసి దుష్పూర్వమైనచో నపుడె పూన్కిఁ, దాడనంబునమర్యాదతగునొనర్ప

క. నడవడియె మంచిదైనన్, దడయక యవ్వారిపాదతామరసము లే
యిడుకొనఁదగినవి తలపైఁ, జెడుగుణముల నవ్వి పోవఁజేయుం జుమ్మా! 194

క. కావున భరతునివర్తన, మేవిధముగ నుండునొక్కొ యెఱిఁగినపిదపం
గావింతమర్హకృత్యము, నీవును బనివినుమ బలము నిల్పఁ గడంకన్. 195

---

1. అపలాపము = ప్రీతి.

భరతుని గుహుఁ డాహ్వానించుట.

చ అని వచియించి సైన్యపతి యప్పనికిన్ నియమించి మంత్రులం
గొని భరతుం గనుంగొనెడుకోర్కి చెలంగఁగఁ బోయి మేలివ
స్తునిచయమెల్లఁ గాన్కనిడి దోసిలియొగ్గి మహాత్మ! నీగృహం
బనియె తలంపు నాగృహము; నాదృతి రమ్మని ప్రీతి వేఁడినన్. 196

చ. మునుపె సుమంత్రుమూలమున భూరిగుణాధికుఁడౌ గుహుండు రా
మునకు ననుంగుమిత్రుఁడని పూర్ణముగా వినియున్నవాఁడ కా
వున మరియాదలం దనిపి [1] బోగుతగన్ రఘురాముగాఁగ నిన్
మనసున నెన్నువాఁడ గుణమండన! నీదగుపుణ్య మెన్న నౌ. 197

చ. పరమపవిత్రుఁడై సుజనభద్రదుఁడై తగురామచంద్రు ప
త్సరసిజయుగ్మముం గొలువఁ జాలితి; వీనినుఁ బోలుపుణ్యసం
భరితమనస్కుఁ డుండునె? తపంబులు దానము లెన్నియేని యు
క్కరణిఁ దలంచినన్ గనవు గా త్వదుపార్జిత పుణ్యసామ్యమున్. 198

క. ఎవనిశిరంబున శ్రీరాఘవుపాదసరోజరజము ప్రాలు నతండే
ప్రవిమలచిత్తుఁడు ముక్తిప్రదవాసమున కర్హుఁడంచుఁ దలఁపంగఁ జనున్.

క. అని రఘురాముని స్మరణంబునఁ గన్నులనుండి యశ్రువులు క్రందుగ భూ
మినిఁబర్వఁ బలుకనేరక, వనటం గనుచున్నయట్టి భరతుం గనుచున్. 200

క. తలఁచె గుహుఁ డిట్టులీతని, పలుకులఁ గరుణారసంబు ప్రవహించెడుఁ జూ
డ్కులు తెల్పు నిష్కపటతన్, ఖలవర్తన మితనియందుఁ గలుగదు సుంతేన్.

క. శ్రీరాఘవు పావనపదవారిజసంసక్త చిత్తబంభరుఁ డనుచున్
సారగుణాన్వితుఁడనియును, గారుణ్యరసాబ్ధియనియుఁ గనుఁగొంటి నిటన్.

క. వేషమునన్ మృదుతమసంభాషణమున రామచంద్రుఁ బరికించిన లే
యీషణ్మాత్ర విభేదము, భూషణములనైనఁ గనఁగఁ బోల దితనిమై. 203

క. ఔరా! రూపాతిశయం, బీరాజకుమారునందు నెఱుఁగంబడు నా
శ్రీరామునందుబలె దుశ్చారిత్రం బెట్లు నిల్వఁజాలు నితనిలోన్. 204

క. అని యిట్లు బహువిధంబులఁ, దనమదిఁ దలపోసి ప్రీతిపల్లొత్తఁగ ని
ట్లనియెన్ భూపవరేణ్యా, చనుదె మ్మస్మద్గృహంబుచక్కటి కింకన్. 205

చ. కలిగినయంతలో మధురకల్పములై తగు భక్ష్యరాజి మి
క్కిలిరుచిగల్గు మాంసములఁ గేవలకాననలభ్యసత్ఫలం
బుల బహువారుణీరుచిరపూతనృపోచిత పానకంబులన్
వలనుగ భోజనంబు పరివారయుతంబుగఁ జేయ వేఁడెదన్. 206

చ. తలఁపకు వేఱుగాఁగ నను దాసుఁడ శ్రీరఘువంశవార్ధిశీ
తలరుచి నాఁగనొప్పి నిజధర్మము నూనినరామమూర్తికిం

---

1 బోగు=బూనికి.

గలపరిచారికావళి నోకండనుగా నను నెన్ని మంగళం
బులఁ గలిగింప నాదుగృహాముం గన రమ్మన సంతసించుచున్. 207

క. ఆతని వినయాదిగుణ, వ్రాతంబున కెంతొ యలరి యర్హావిధమునన్
బ్రీతి బయల్పడ నిట్లను, భూతలపతి రామమూర్తి పోయి వనములన్. 208

చ. మునిజనవృత్తినుండ క్షితిపుత్త్రియు లక్ష్మణుఁ డామహాత్ముచెం
తను బరితప్తచిత్తముల దారుణదుఃఖము లొందుచుండ నే
మని భవదాలయంబుఁ జొర నాదృతి గాంతు; మహీధవార్హాభో
జన మొనరింతు నెవ్విధిని శర్మములం గనువాఁడఁ జెప్పుమా. 209

చ. జటలను దాల్చి దాశరథి చారుతరాంబరముల్ త్యజించి యు
త్కటపరితాపమీయఁదగు దారుణవల్కలముల్ ధరించి యే
యటవులనో వసింప మృదులాంబరముల్ ధరియించి సౌఖ్యమున్
గటికతనంబునం గనుదు గాదిలితమ్ముఁడనయ్యు నోసఖా! 210

ఉ. రాముని దోడితెచ్చి వరరాజ్యపదంబున నిల్పి యవ్వలన్
గోమలతత్పదాబ్జములఁ గొల్చుచు నంతటఁ బూర్వరీతిగా
నేమముమీఱ నుండుదును నీదగు ప్రార్థనమున్ ఫలింపఁగా
నేమెయిఁ జేయఁజాలుదు? వచింపుము నీవె రఘూత్తమప్రియా! 211

క. నామాట చెల్లుదనుకన్, రామునివలె మౌనివర్తనంబున నుండన్
నీమముఁ బూనితి వేఱుగ, నీమదిఁ దలపోయవలదు నిర్మలధిషణా! 212

చ. నను వడి సాగనంపు జతనంబును బూనుము సేవకవ్రజం
బునకును మంత్రిముఖ్యులకు భోజనమున్ సమకూర్పు; నీగృహం
బునకు మనోరథంబు ఫలముంగను నే మరలంగ వచ్చుచో
ఘను రఘునాథుఁగూడి కడఁకన్ జనుదెంతును నమ్ము మీనుడిన్. 213

క. భరతుం డిటుపల్క వనేచరనాథుఁడు గుహుఁడు మించుసమ్మదమున భూ
వరపుత్త్రు నాత్మఁ బొగడుచుఁ, బరిజనముఖ్యులకుఁ దక్కువారికి నెల్లన్. 214

ఆ. ఉచితభోజనంబు నొదవు నట్లొనరించె, నాఁటిరేయి భక్తిపాటవంబు
భరతునందునుంటఁ బరికించి మేల్కని, యతనిఁగూడియుండి యంత వేగ.

సీ. కర్ణధారులఁ బిల్చికడువడి నౌకల, సిద్ధముచేయించి శీఘ్రయాన
ముల వారి గాంగాంబువుల దాఁటఁగాఁజేసి, భరతుని సెలవంది మరలివచ్చు
దనుక నాసురసరిత్తటమున నుండంగఁ, దలఁచె నాగుహుఁడునిర్మలమనీషుఁ
డంతట భరతుఁ డుగ్రాటవిఁ బోవుచు, శ్రీరామచంద్రుని సీతఁ దమ్ము
తే. నిం దలంచుచు శత్రుఘ్నునిఁ గని యిట్లు, పలికె నీచోటనే జటాపటలి రాముఁ
డవధరించెను లక్ష్మణుఁ డట్లచేసెఁ, గంటివె తమ్ముఁడా! క్రూరఖగగతులను.216

క. ఇవిగో శ్రీరామునిపా,దవనజచిహ్నంబు లిట్టి । దారుణవనభూ
మి వఱలెడునీనిఁ గాంచినఁ, బ్రవిభిన్నముగాదు మనము । గ్రావమయమొకో?

చ. అని పలవించుచుం జనియె । నాతనిసైన్యము లమ్మహాటవిన్
జనుచు భయంకరార్భటుల । సామజముఖ్యమహామృగవ్రజం
బును బరుగెత్తఁ జేయుచును । బోయెను దూరము; చిత్రకూటమం
చు నుతినిగన్న క్ష్మాధరము । సుందరరత్నమయంబు గన్పడెన్. 218

ఉ. దానియుపత్యకం దలఁప । దారుణమై చొరఁబాఱ శక్యమే
గాని మహావనంబు గురు । కంటకవంశముఖోన్నతద్రుసం
తానము కాననయ్యె నర । నాథుబలంబులు దానియాకృతిం
బూనికఁ గాంచి యచ్చెరువుఁ । బొంది చలించిరి దానినిం జొరన్. 219

క. అది పోవఁబోవ నున్నతిఁ,గఁ దగున్ ద్విరదోత్తమతుర । గంబులు పోవం
బెదరుగనున్ గిరిసన్నిధి,నిఁ దగినవార లొగిఁ జూడ్కి । నిగుడించినచోన్. 220

క. కనఁబడును గ్రిందిభాగం,బుననున్న మృగావళులును । బూరుషసంఘం
బును గాన నంగె దశరథ, తనయునిదగు పర్ణశాల । తగిన విధమునన్. 221

క. నివసింపయోగ్యమై శా,స్త్రవిధానము నాశ్రయించి । రాజార్హంబై
పవమానచాలనంబున, వివిధసుఖంబుల నొసంగు । విధ మమరంగన్. 222

క. ఉన్నతనతా స్థలమున భూ, భృన్నిర్గత నిమ్నగాళి । యేత్తెఱఁ బ్రవహిం
ప న్నలుదిక్కులు ధ్వనిసం,పన్నములై వెలయ వృక్ష । పటలము లలరన్. 223

క. ఏరికి నదృశ్యమై తగి, సారఫలద్రుమవిశేష । సంవరణమునన్
జారుతరంబై కడు వి,స్తారతఁ గనఁ దగుచుఁ బర్ణ । శాల యది తగున్. 224

ఉ. ఆరుచిరోటజంబున మ । హామతి రాముఁడు భూకుమారియుం
జారుగుణుండు లక్ష్మణుఁడు । సంగతిఁ బాయకయుండ స్వర్ణదీ
వారితరంగశీకర । నివారిత హృత్పరితాపుఁడైన యా
మారుతుఁ డాశ్రయించి బహు । మానమునం బరిచర్య సేయఁగన్. 225

శా. సీతానాథుఁడు సోదరద్వితయముం । జిత్తంబునం దెన్నుచున్
వీతాంతఃకరణోత్థతాపుఁడయి యు । ర్వీభారనిర్వాసన
ప్రీతుల్ పొంగఁగ నుండె;నాదినము నిర్భీతుండు సౌమిత్రి యున్
బ్రాతఃకృత్యము లొప్పఁదీర్చి ఫలపర్ణస్తోమముం దేఁ జనన్. 226

చ. తలఁచుచు రామునాజ్ఞఁ గొని । తా వనికిం జనువాఁడు సర్వది
క్కులకును బాఱుచున్ దిగులు । గొన్న మహామృగభూరినాదముల్
బలుగతులన్ నభస్థలిని । బాఱెడుపక్షిరుతంబులున్ శ్రవ
స్సుల వెతపాలుచేయుటయుఁ । జోద్య మిదే మని యెల్లదిక్కులన్. 227

## సౌమిత్త్రి భరతాగమనము రామునకుఁ జెప్పుట.

తే. దృష్టి సారించి కారణ మెఱుకపడమి, నొక్క భూరివనస్పతి నెక్కి కాన
నాంతరంబున గజతురగాళి భటని,కాయముల్ స్యందనంబులఁ గని జవమున.

చ. తనమదిఁ గోపతాపములు దార్కొన నాతరుశాఖనుండియే
ఘనగళనాద మొక్కగతిఁగా రఘునాథుని నేఁచు నట్లుగా
వినఁబడఁ బల్కె రామ! పరవీరకృతాంత! శరాసనంబు గై
కొని జవమార జ్యాలతికఁ గూర్చి శరంబులఁ జేర్చి చక్కఁగన్. 229

మ. కరమూలంబులఁ దూణముల్ పొదలఁగా ఖడ్గాదులం దాల్చి దు
ర్భరశౌర్యంబు గనంగఁ జేయఁ దగుసంగ్రామంబు చేయంగ నీ
వరుదెమ్మా! గిరికందరమ్మున మహాయత్నంబు మీఱంగ నా
ధరణీపుత్త్రిని నిల్పి కాచెద మొగిన్ దర్పంబు కానంబడన్. 230

ఉ. ఊరకయుండెదేల? కరుణోదధి వౌటనె యింతపుట్టె గం
భీరమదుక్తి విన్న యెడ వింతలు నిట్టివె పుట్టకుండు నీ
యోరిమి యింత తెచ్చె; విరోధోక్తుల కియ్యది వేళగా; దిదే
చేరఁగవచ్చె దుష్టమతి సేనలతో భరతుండు క్రూరతన్. 231

ఉ. కాలము దుష్టమౌను రిపు కల్పులఁ జేయును మంచివారినేఁ
జాలఁగఁ బ్రోత్సహించి గురుసత్తములన్ వధియించిరైనఁ ద
చ్ఛ్రీలహరింపఁ బంపు నని చెప్పితి; నే మును నోరునొవ్వఁగా
నేల వినంగఁబూను దిటు లీవనిఁ గష్టపడంగ నోచుటన్. 232

ఉ. తమ్ముఁడు తమ్ముఁడంచు గురుధర్మవిదుం డతఁడంచు నెవ్వరే
నిమ్మహిఁ దత్సమానగుణు లేతఱి నుండరటంచు సర్వకా
ర్యమ్ముల నావలెన్ జరప నర్హుఁ డటంచు వచింతు వీవు; ని
క్కమ్మది నేఁటికయ్యెఁగద క్ష్మాపతిపుత్త్రుఁ డతండె సేనతోన్. 233

ఉ. సంగరరంగమందు నినుఁ జంపియొ పాఱఁగఁ ద్రోలియో సమ
స్తాంగములం గొఱంతగననట్లుగ రాజ్యము గైకొనంగ వ
చ్చెం గడు వేగ లెమ్మిఁక విజృంభితవిక్రమ మొప్పఁ; నీవు యు
ద్ధాంగణమందు బాణముల నస్త్రములన్ వధియింపు మాతనిన్. 234

చ. పగతుని బాము నింటనిడి బాగుగఁ గాపురముండ నెంచున
ల్పుగతిని జిక్కినప్డె పోరి పుచ్చుట మేలగుఁగాని న్యాయ్యమై
తగినపథంబునన్ నిలిచి దా జయమొందఁగ వచ్చునెట్లు? రా
జుగ జనియింపఁగా నెతగుఁ జుమ్మిదఁ దక్కులధర్మ మూనఁగన్. 235

చ. అరిజనశేష మప్పుగొనియంతయుఁ దీర్పక సుంతశేష మ
క్కరణి వ్రణంపుశేషమును గాదని నిల్పఁగ రాదు; చేలికిం

దొరకినయప్పుడే తెగువఁ ǂ ద్రుంపఁగ నౌనని తెల్పుశాస్త్రముల్
సరిగఁ దలంచి యవ్విధిని ǂ సల్పఁగ నొప్పదె లక్ష్మి సుస్థితిన్? 236

### రాముఁడు సౌమిత్రికి హితోపదేశముచేయుట.

క. అనుచుం గోపము శూరత, తను నేమోపల్కరింపఁ ǂ దగునిది తగ ది
ద్దనుచుల్ దలంప కాత్రం, బునఁ బల్కెడు లక్ష్మణోక్తి ǂ భూసుత వినుటన్ 237

క. చిత్తము సాధ్వసమున కా,యత్తము కాఁగాఁ దపించు ǂ ననునూహతగల్
దత్తఱపాటిసుమంతయు, నత్తఱినొందకయె రాముఁ ǂ డల్లనఁ బలికెన్. 238

క. సౌమిత్రీ! యుచితజ్ఞుఁడ, వై మాన్యులగోష్ఠిఁ బెరిగి ǂ యఖిలశ్రుతివా
క్యామలసార మెఱింగియు, నీమాడ్కిం బల్కెదేల ǂ యిచ్చో సహజా! 239

క. వచ్చెడువాఁ డెవ్వాఁడని, యిచ్చటి కేకారణమున ǂ నేతేరఁగఁ దా
ముచ్చట గాంచెదు ననియుల్, సచ్చరితా! యింగితజ్ఞ! ǂ చనదే తలఁపన్. 240

క. త్వరపడి యివ్విధి దూఱిన, భరతుని సద్భావ మిందు ǂ బయలుపడు నెడల్
దురపిల్ల వలయుఁగాదే, పరనింద మహాఘ మన్న ǂ పలుకు వినవొకో. 241

క. చతురంగబలములం గొని, క్షితినంతయు నన్ను గెల్చి ǂ చేకొనుతమిమై
నతులితధర్మం బెఱుఁగుభ,రతుఁడే యేతెంచునేని ǂ రాజ్యం బిత్తున్. 242

క. ఎవనిమనం బేరీతిల్, సవరింపగ సాధ్యమగునొ ǂ సారజ్ఞుం డ
ట్టివిధంబున సరిపెట్టుట, ప్రవిమలమగు నీతిశాస్త్ర ǂ పథ మదియెసుమీ! 243

క. దుష్టుల నవ్విధిఁ గాచుట, శిష్టులధర్మంబె యనెదొ ǂ చెప్పెద శాస్త్ర
మిష్టముగాఁ ద్రిప్పంగ న,నిష్టమె చేకూరు; నిదియె ǂ నియతి కుమారా! 244

క. నాతమ్ముఁడు భరతుం డీ,భూతలమున శిష్టబృంద ǂ ముననో, కుజన
వ్రాతముననొ, చేర్పందగు, నీతలఁపుం దెల్పవయ్య ǂ నిర్మలధిషణా! 245

క. జననం బాదిగ నెవ్వని, మన మేమార్గమున నడువ ǂ మైకొను దానిం
గని సుజనదుర్జనత్వము, లను భేదము లప్డు సుజను ǂ లకుఁ దోఁచుఁజుమీ! 246

క. కనుకల్ ధర్మజ్ఞుఁడ వం, చనూనవిఖ్యాతిఁ గనియు ǂ నార్యులు నవ్వం
గను నిష్కారణముగ నా, యనుజన్ముని దూఱె దేల? ǂ యాత్మ నరయకే. 247

క. శ్రుతికటువాక్కుల వెడలిం,చితి విది పాపంబుగాదె ǂ చెప్పెదునది సూ
నృతమయ్యు నప్రియంబై, మతికిం దోఁచిన నఘంబు ǂ మానక కలుగున్. 248

చ. శ్రుతిహితమయ్యు వాక్య మెది ǂ సూనృత మెన్నఁగఁ గాదొ, యద్ది స
మ్మత మనరాదు పెద్దలకు; ǂ మాట హితంబుగ సూనృతంబుగా
క్షితిఁ దగునేని యార్యనుతిఁ ǂ జెందెడు నయ్యది యంచు శాస్త్రవి
స్తృతమని యున్నమా మదిని ǂ దెల్పితి నీపయిఁ బొల్చుప్రీతిచేన్. 249

మ. ననుఁ జూడంగనె వచ్చువాఁడు మరల్ ǂ నన్నుం బురిం జేర్చువాం
ఛను మంత్రిప్రముఖుల్ ధరాభరము నాసక్తిం దనుం బూను మం

చును వేఁడఁ గురువృద్ధముఖ్యులను గొంచుఁ నన్నుఁ బ్రార్థింపఁగాఁ
జనుదెంచెఁ భరతుం డటంచుఁ దలఁతుఁ స్వాంతంబునఁ బాలకా! 250

చ. తెలియవు సాధువృత్తములఁ దెల్వి ప్రకాశము కాఁగ శాస్త్రముల్
తెలిసియు వ్యర్థమౌ నదియె తెల్లముగాఁ దెలియంగరానిచోఁ
గలఁత మనంబునం జొనుపఁగాఁ దగ; దియ్యెడ శాంతమూని యి
మ్ముల భరతాశయం బెటులు పూజ్యతమంబొ పరీక్ష చేయుమా. 251

ఉ. చిన్నటనాఁటనుండి గుణసింధువుగాఁ దగునాసహోదరుఁ
గన్నులు తృప్తినొందునటు గాంచియు సంగతినుండియుఁ సుధీ
సన్నుతవర్తనంబుఁ బలుచందము లొప్ప నెఱింగియుండియుఁ
నన్నురక్తిఁ గొల్చియును నాయెదుటం దెగనాడు టర్హమే? 252

తే. సాధుజనసేవ సంతతశర్మదంబు, గాఁగ బెద్దలు వచియింత్రుగాదె యనుజ!
దాన నీవాఱితేఱియుఁ దారుణోక్తు, లాడఁ జెల్లునె సజ్జనుఁడైన భరతు. 253

క. మతిమద్వర్యుఁడు నియతం, బ్రతుఁ డెంతయు సాధుపాదభక్తుఁడు భరతుం
డతిశయముగ మనకుశలం, బె తగం గోరెడుమహాత్ముఁ డిది తెలియవొకో?

క. శ్రుతియుగమును భేదించుచు, మతి కలవిలపాటు నొందుమాడ్కి నొనరుపఁ
జ్యుతిలేనిశక్తిఁ దగువా, క్తతి నీయది నిశితశస్త్రతతి మించుఁగదా? 255

క. దానికి నోర్వంగల్గితిఁ, గాని యిఁకం బల్క నన్నుఁ గాఱియపెట్టుం
గాన నదిమాన వన్నా!, మానితగుణజాల! జ్ఞానమండితశీలా! 256

క. ఇఁక నాచెంతకు రమ్మా, సకలము నీకెఱుకపడెడుచంద మొనరుపఁ
బ్రకటజ్ఞానిగఁ జేయఁ, సుకరంబగువిధము నేనుజూచితి సహజా! 257

క. ఓరుపె యనియది భూమిం, బేరొందు మహర్షు లెల్లవిధముల దానిం
గోరి యుపాసింతురు సమ,కూరఁగ ధ్యానైకఫల మగుంగద యదియే. 258

క. సర్వసుకర్మఫలం బన, నుర్విం దగియుండు నదియె యుత్తము లెల్లఁ
సర్వజ్ఞు శంకరుఁ. శివు, గుర్వవతారుఁ భజింత్రు కోరియె దానిన్. 259

క. తపములు యోగాభ్యాసము, లపరిమితక్షేత్రసేవ లాదిగఁదగు న
ట్టిపరమకృత్యంబుల కో,రుపె యాఫలమంచు నమ్ము రూఢిగ మదిలోన్.

క. అని యుపదేశించిన రా, మునివాక్కుల కాత్మనున్నమూఢత తొలఁగఁ
ఘనతరువునుండి దిగి యొ,య్యన రాముని జేరి మ్రొక్కి యంఘ్రియుగళికిన్.

చ. చరణసరోరుహద్వయముసన్నిధి శీర్షముఁ జేర్చియున్న సో
దరుఁ గరుణార్ద్రచిత్తమున ధన్యునిగాఁ దలపోసి లెమ్ము; నా
కరుణకుఁ బాత్రభూతుఁడవుగా యని లేవఁగనెత్తి నాయనా!
త్వరపడి యేదిగాని యనఁబాడియె గాదని తెల్పఁబూనితిన్. 262

ఉ. అంతియగాని నీపయి మదాత్మను వేఱొకభావ మన్న దా
వంతయు లేదు సుమ్ము! మదిహర్షముఁ జొన్పుము; కూరుచుండు నా
చెంతనె; సోదరుండు గురుసేనలతోఁ జనుదెంచు వేలొకో
వింతగఁ గాంచుచుండు మఱివీరులొ? సేవకులో? కనంబడున్. 263

మ. అనుచుం జెప్పుచునుండ భూసురమునీంద్రాగ్రేసరుండౌ వసి
ష్ఠునితో విన్నఁదనంబునే తెలుపునశ్రువ్రాతముంగూడు మో
మునసైన్యంబుల వీడి సోదరయుతిన్ భూరిశ్రమమ్మున్ గణిం
పనియత్నంబున వచ్చి కైకకొడు కాపన్నావనప్రీతునిన్. 264

ఉ. రాముని జేరి యశ్రుకణరాజి ముఖంబును గప్పుచుండఁగా
భూమిని గౌఁగిలించుకొను పోలికఁ బాదసరోజసన్నిధిన్
నామము గోత్రమున్ మనమునన్ స్మరియించుచు దక్షిణశ్రుతిన్
నీమముమీఱఁ దాఁకి నతినిం దగుఁ జేయ నటన్న శాస్త్రమున్. 265

క. స్మరియింపనైనఁ జాలక, త్వరపడి ధరఁబడియె నట్టివరుసఁగనె సహో
దరుఁడున్ మ్రొక్కెను; శ్రీరఘు,వరుఁడా సోదరులఁ జాల వాత్సల్యమునన్.

చ. కరములనెత్తి కౌఁగిటను గ్రక్కునఁ జేరిచి సత్వరంబుగా
శిరముల మూరుకొంచు వగఁజెందఁగ నేలొకొ వత్సలార! నా
పరిసరసీమ కిట్టితఱిఁ బర్విడి రాఁ గతమేమి? యశ్రులి
ట్లురలగ నేమికారణమొ యోజనచేసినఁ దోఁప దింతయున్. 267

చ. మిముఁగన నామనంబు వగమించఁగ నేమియు నెంచఁజాల కీ
సమయ మదెట్టి వార్తలను జాలఁగఁ జెప్పి కలంచునో యటం
చమితములైన సందియము లందఁగ నున్నది; తండ్రులార! క్షే
మముల వచించి సంతసము మాకు నొసంగుఁడు చింతమానుఁడీ. 268

సీ. అనిపల్కి మఱియు నిట్లనియె సహోదరా!, భరతా! యయోధ్యను బాసియిప్డు
హాటవికిని వచ్చు నంతఁ గారణమేమి?, తండ్రికి బాసట తనయుఁడె కద?
రాజ్యభారముపూని పూజ్యభంగిని బ్రోచి, జనకుఁడూఱటనొందఁ జాలునట్లు
వర్తింపఁ దగుఁగాదె యార్తి నొందఁగనేల?, పౌరులు సౌఖ్యసంపద చెలంగ
తే. నున్నవారుకదా రాజ్యమన్న నెట్టి, పాలనంబున వర్ధిల్లుఁ బంతమూని
యట్టిపరిపాలనంబున నలరఁజేయ, కార్తిఁబ్రుంగుచు వనికి రా నగునె యిట్లు?

క. పరికింపఁగ నీకేమో, భరింపరా నట్టిచింత పర్విన దని యి
త్తరుణమునఁ దోఁచుచున్నది, భరతా! వచియింపు మేలవచ్చితి విటకున్? 270

ఉ. పెద్దలచెంతనుండి యిది ప్రీతికరంబగు వర్తనంబొ? యే
సుద్ది వినంగనౌనొ? యెటుసూనృత మెత్తఱిఁ జెప్పనౌనొ? యి

ట్లార్ద్రికమీఱఁగాఁ బ్రజల నోమఁగనౌనా? యెఱుంగ నౌఁగదా?
యద్ది త్యజించి యివ్విధి మహార్తిని నన్నన నేలవచ్చితో? 271

ఉ. దాఁపక చెప్పవన్న సతతప్రియసూనృతవాది తండ్రి యే
పాప మెఱుంగఁ డెంతొ జరఁపర్వఁ జరింపఁగఁ గష్టమొందు ని
న్నే పరిపాలనంబున గడించెను దక్షునిగాఁగ; నట్టిదా
భూపరిరక్షణంబు విడి పూనిక వచ్చుట న్యాయమౌనొకో? 272

క. పరిపంథిమారణంబును, ధరణీసంరక్షణంబు ధాత్రీపతికిన్
సరియైన ధర్మములుగద, భరతా! నీవేల వానిఁ బాటింపవొకో? 273

చ. దొరకునె సందు మాకనుచుఁ దోరపువేడుకనుంద్రుసుమ్ము భీ
కరపరిపంథు లొక్కమొగిఁ గ్రమ్మఁగఁ జూచుచునుంద్రు; దానికిం
దరుణమువచ్చు నెప్పుడని తండ్రియు వృద్ధుగదా తలంప; నో
భరత! యదెట్లు తండ్రివిడి వచ్చితొ? యిక్కడి కిట్లుచెప్పుమా. 274

చ. జగతి యరాజకంబయిన శత్రుమహీపతు లడ్డె తత్ప్రజా
ళి గదిసి రాజునం దొగి విలీనముదంబు గలట్టివారిగాఁ
దెగి యొనరింతు; రద్దినృపాధీరుఁడు మాన్పఁగ శక్య మెట్టులోఁ
దగుసమయంబునందు నిజదర్పము సూపక యొందొ యుండినన్. 275

మ. మతిమంతుండ నటంచు నిన్ను మదిసమ్మానించి కౌసల్యకున్
హితముం దెల్పుచు నాకుమాఱుగను నీవింటన్ సుఖంబుండ న
న్నతిసంతృప్తునిగా నొనర్ప జనకున్ హర్షాంబుధి న్ముంపఁగా
జతురత్వంబును జూపు దంచు మునివేషంబూని నే వచ్చితిన్. 276

క. నావెంటం జనుదెంచితి, వీవిధమున వారినేమ మింకెవ్వరు నా
కేవగ కల్గకయుండం,గా వలఁతులు చేయఁ జెపుమ కడువడి నాకున్. 277

చ. జనకునిమాట సూనృతయశస్స్థిరసంపద లొందఁజేయఁగా
వనముల కేగుదెంచితిని పౌరముఖుల్ నను వెంబడింప నా
యనుజుఁడు నావలెన్ మిముఁ బ్రహర్షము నొందఁగఁ జేయుచుండు నం
చని సహజన్మ! వెంబడినె యప్పునిదీర్పక వచ్చి తేలొకో? 278

మ. మనవంశంబునఁ దండ్రియాజ్ఞ మదిలో మన్నింప కాత్మేచ్ఛతోఁ
జనువా రింతకుమున్ను కల్గినటు నాస్వాంతమ్మునం దోఁప ద
ప్పని నీవే యొనరించి కీర్తి ధరనిల్పం బూనఁ గాంక్షించితో
వని నున్నట్టి ననుంగనంగ నిటురా వాంఛింప నేహేతువో? 279

మ. తెలియంజెప్పుము సుంత దానివిని నాధిసంగతార్తిన్ విడం-
దలఁతున్ వేఱొకమాట నిన్నడుగ నుత్సాహంబు నా కిత్తఱిం

గలిగెం గారణమీయ దంచుఁ దెలుపంగా నేరకున్నాఁడ ని
ర్మలచిత్తా! మునివేషముం గొనఁగ శాస్త్రంబేది తోడయ్యెనో? 280

క. నిను రాజ్యంబును బూనన్, నను ఘోరాటవిఁ జరింప న్యాయ్యంబనియే
జనకుం డాజ్ఞాపించె వ, చనమది శీర్షమునఁ దాల్పఁజనుఁగద యనుజా! 281

క. దానిన్ మన్నింపంగాఁ, బూనక నీ వివ్విధమున మునివేషమునం
గానలకు వచ్చినాఁడవు, గానం దలపోయువాఁడఁ గడు దీనునిగన్. 282

ఆ. వేదవిహితమైన విధియె ట్లలంఘ్యమో, తండ్రిమాట యట్లె దాఁటరాని
దని వచింత్రు పెద్ద లమ్మాటగొనమి నీ, తలఁ పదెట్టి దనుచుఁ బలుకవలసె.

క. అన్నన్నా! మున్నెన్నఁడు, నిన్నుం బోలినమునీంద్రనిచయ మ్మిలలో
నున్నట్లు గానరా దే, నెన్నివిధంబులుగనో మదినెంత దలఁచినన్. 284

ఆ. పలుకుచుంద్రు బుధులు "బాలాదపి సుభాషి,త"మ్మటంచు దానిఁదలఁచి చూడఁ
జిన్నవాఁడవైన నన్న! సుభాషిత, మీవుపలుకఁ గొనఁగ నేఁ దలంతు. 285

చ. అడిగెడునాతఁ డన్నయని యాతని ప్రశ్నము నాలకించి త
మ్ముఁడు తగుధర్మముం దెలుపఁబూనినవాఁడని లోకులెల్ల ని
న్నుడుగక దూఱువార లని యోసహజన్మ! తలంపబోకు; మె
వ్వఁడు స్మృతిసమ్మతంబుగను బల్కునో యయ్యది గ్రాహ్యమేసుమీ! 286

క. అనఘా! నీదగు రాకకుఁ, గనుపట్టదు కారణంబు గలఁతంగను నా
మనమును గావునఁ జెప్పం,గను బోలును దీని కున్నకారణ మెల్లన్. 287

చ. అనియిటు రామచంద్రుఁడు మహామతియయ్యును దమ్మునోట నే
వినఁ దగునన్న వాంఛ గతవృత్తము నంతయుఁ బ్రశ్నచేయఁగా
విని భరతుండు లజ్జయును భీతియు నొక్కటఁ బైకొనంగ మో
మును సగమెత్తి భక్తిభరముం గనుపట్టఁగఁ బల్కె నివ్విధిన్. 288

చ. శ్రుతులు తదర్థముం దెలుపఁజూచు! స్మృతుల్ మఱియుంద దర్థమే
హితముగఁ గర్ణరంధ్రముల నెంతయుఁ జొన్పఁ; గథాచ్ఛలంబునన్
క్షితి వెలయింపఁబూనుచుఁ బ్రసిద్ధినిగాంచు పురాణముల్; మహా
మతి వగునీదువాక్కులె సమస్తము నీవ యెఱుంగు దోవిభూ! 289

చ. ఎఱుఁగనియట్లు నన్నడుగ నేటికి? నే నన మూఢుఁడన్ గదా
మఱుగుపడంగ నీదగు నమానుషశక్తిని జేయఁబూని యి
ట్లఱమఱ గల్గియున్నయటు లాడి ననుం గలఁపంగ బూను టిం
దఱకడ నేటికయ్య! సుజనప్రియ! జ్ఞానిహితైకనిర్ణయా! 290

చ. తెలుపుము నీదుభావమని తీక్ష్ణతరార్థవిశేష మొప్పఁగాఁ
బలికితి; రీపదాంబురుహబంభరచిత్తుని వీని దాసున్

దలఁగక నీదుసేవల సతతంబును జేయఁదలంచు తమ్మునిన్
సులలితభాషణా! సకలసూరినుతా ప్రతిమానవర్తనా! 291

ఉ. చంచలచిత్త నాజనని సత్యరతున్ జనకున్ మహాజ్ఞతం
గొంచక నీమహత్త్వమునుగూడ నెఱుంగక యిట్లు నేను భా
షించిన నవ్వరే సుజనశేఖరు లంచుఁ దలంపకే వరం
బంచుఁ గఠోరవాక్యముల నార్తిని ముంచె యశంబు పోవఁగన్. 292

చ. నరపతి యేమిపల్కుటకు నాలుకయాడమి నూరకుండ స
త్వరముగ నిన్నుఁ బిల్చి తనవాంఛలు రెండును దెల్ప నీవు భూ
వరుని సదాశయం బెదియొ సజ్జనసమ్మత మెద్దియో యటం
చరయక వల్కలాజినము లప్పుడె కైకొని జానకీయుతిన్. 293

క. పరిచారకుఁడై పుణ్యాకరుఁడౌ లక్ష్మణుఁడు వెంటఁ గడువడి రాఁగాఁ
బరువెత్తి వచ్చితివి దుర్భరతాపము నాకుఁ గూర్ప రఘువంశమణీ! 294

క. జనకుం డాజ్ఞాపించెనె, జననియు సెలవిచ్చెనే యసంగతవృత్తిం
జను సవతితల్లి మాటను, గొనఁదగు నని వచ్చితీవు కోరియె రామా! 295

ఉ. పౌరులు తల్లడిల్ల, గురుపంక్తి యిదే మని యార్తిమున్గ, నె
వ్వారును సమ్మతింపక యవార్యమహాపదలందు మ్రుంగఁగా
సారథిఁ దొందరించి పురసత్తమ మొయ్యన దాఁటి యెవ్వరిం
జేరఁగనీక వచ్చితివి శీఘ్రమ యుందువసించు కోర్కెమై. 296

క. మాటాడలేక నరపతి, మాటికిమాటికిని నిన్నె మదినిఁ దలఁచుచున్
బోటిని నిందించుచు హరి, వీటికిఁ దాఁబోయె నీవు వెడలినక్షణదన్. 297

క. అనుమాట కర్ణయుగళంబును జొచ్చినఁ గన్నతండ్రి! పోయితె ననుఁ గా
ననిదుఃఖంబున ననుచున్, మనమార్తిన్ మ్రుంగ వ్రాలె మహి రఘుపతి తాన్.

ఆ. లక్ష్మణుండును విప్రులను బడె జానకిమామమృతికి వగచి మ్రాన్పడియె; స
కలవిదుండెయయ్యునిల మానుషత్వమ్ము, గనుట యనెడు నొక్క కారణమున.

క. జనకునిమృతివార్తను మించిన దుర్భరతాపదంబు క్షితి లే దరయన్
దనయులకు సాధుమతులకు, నని తెల్పఁగఁ బూని రాముఁ డాసమయమునన్.

క. పరికింపందగు మనుజులు, పరమాత్ముం డెట్లు ధర్మపథమును దగఁ బా
మరులకు బోధించెనొ యొక్కరణిన్ వర్తించెనో నికామం బాత్మన్. 301

రాముఁడు తండ్రికిం దర్పణముచేయుట.

చ. మనసుకలంగ నొక్కక్షణమాత్రము రాముఁడు నిర్వికారతం
గని స్మృతిరాఁగ లేచి నృపకాంతుని బంక్తిరథున్ స్మరించుచున్
దనయుఁడనయ్యు నీమృతిని దాపున నుండఁగఁజాలనట్టి ని
ర్ధనుఁడ నిఁకేమి చేయుదును ప్రాజ్ఞనిఁ బాప మొనర్చితిం గటా! 302

ఆ. అమలమతులు "పుత్ర । మంతేచకర్మణి", యనుచుఁ బలుకువార । లట్టిపుణ్యా
మునకుఁ బాత్రభూతుఁ । డను నేను గానైతి, నింక నేమియన్న । నేమిఫలము.

క. పితృయజ్ఞము సొంతముగా, సుతుఁ డెవ్వఁడు చేయఁగల్గు । క్షోణి; నతండే
కృతకృత్యుఁ డనఁగఁ బరఁగెడు, నితరుఁడ నేనైతి వగవ । నిపు డేఫలమా? 304

మ. జనిగల్గన్ మృతిగల్గు టారయఁగ నా । శ్చర్యంబు గా దైన వృ
ద్ధుని బ్రాణాధికుగాఁగ నన్ దలఁచుచుం । దోడ్తోన చూడంగఁ జా
లనిచోఁ గుందుమహా । కృపాంబునిధి నన్ । లాలించుచుం బ్రొద్దుపు
చ్చునినాఁ డార్తినిగాంచు మంజులమతిన్ । సద్ధర్మునిం దండ్రినిన్. 305

ఉ. కాలమునందు సన్నిధిని । గాంచుచు సేవలఁ దన్పుచున్ సువా
గ్జాలము కర్ణరంధ్రములఁ । జక్కఁగఁబర్వ నొనర్చుచున్ బ్రజా
పాలన మింతయేని స్మృ । తిపద్ధతి మానక సాగుచుండు నీ
కేల విచార మంచు వచి । యించుచుఁ నుండనిజాల్ముఁడం గటా! 306

ఉ. ఏసమయంబునందు సుతుఁ । డెవ్విధిఁ దండ్రిని బ్రీతుఁజేయనౌ
నాసరణిం బ్రవృత్తిగన । కన్యపథంబును ద్రొక్కినాఁడ; నా
యాసము నిప్పుడొంది హృ । దయంబున నెంచిన నేఫలంబునా
కౌ సరివారిలోనఁ బరి । హాసముపాలయితిం గువృత్తిచేన్. 307

చ. జనకుఁడె దేశికుండు గురు । సత్తముఁడున్ బరమేశ్వరుండు నౌ
ననుచు వచింతు రార్యజను; । లయ్యది చక్కఁగ నాలకించియున్
మనమున నమ్మియున్ సుజన । మాన్యుఁడనై చరియింప నెంచియున్
మునుపటిపాపకర్మమునఁ । బూజ్యుని బాసియె వచ్చితింగదా? 308

చ. పలుకులు వేయు నేల? కృత । పాపఫలంబును బొంద కీయిలా
స్థలమున సంచరింప నొక । జంతువు చాలదు నిక్క మిద్దియౌ
నలువుర మాత్మజన్ములము । నాయన కుండియు నంతమందు ని
మ్ములఁ బరిచర్యలం దనుపఁ । బూనఁగ లేమికి నాత్మఁ గుందెదన్. 309

చ. జరగినదాని కిట్లు కృషి । సల్పక పోయితిమంచుఁ జింతిలన్
దొరకు నదేమి? కృత్య మిఁకఁ । దోడనె చేయుటగాదె యుత్తమం
బురుతరపుణ్యనీరముల । నొప్పువియద్ధుని కేగి స్వర్గపూ
స్థ్నిరసుఖదంబు తర్పణము । చేయఁగనౌ నని పల్కి లేచినన్. 310

ఆ. అతని వెంటఁ దమ్ము । లందఱుఁ జన లేచి, రంత భూమిజాత । యార్తిగనుచు
భర్తవెంటఁ జనియెఁ । బరమభాగిరథీ, సలిలముల మునుంగ । స్వాంత మొప్ప.

క. కులపతియైన వసిష్ఠుఁడు, కులపూర్వుల యాచరణము । కోరికమీఱం
దెలుపం దిలతర్పణరీ, తులనుం దెల్పంగఁ జనియె । తోడనె నదికిన్. 312

సీ. కుశపవిత్రముఁ గైకొని మంత్రయుక్తిని, సలిలతటంబున సైకతమగు
స్థలమునఁ గూర్చుండి తిలతర్పణమును శాస్త్రప్రకారము వసిష్ఠముని వారి
చేతఁ జేయించె; నా శ్రీరామచంద్రుండు, జనకునకున్ స్థిరసౌఖ్యములను
గలుగునట్లుగనె సంకల్పించె; భావనా, బలమె సిద్ధి నొసంగు గలుషహారణ
తే. దక్ష మయ్యెదె వేదమంత్రములు పలికి, నంతమాత్రన ఫలసిద్ధి నందరాదు
భావనయు మంత్రసంయుక్తిఁ బ్రబలెనేని, పూర్ణఫలమిచ్చునందురు బుధులు తెలిసి.

క. జలతర్పణ మొక్కఁడె సత్ఫలముల నిడఁజాలునె యని ప్రశ్నించెడు వా
రలకున్ శాస్త్రము రాముని, పలుకులె యని తెలియవలయుఁ బ్రాశ్నికు లెల్లన్.

క. అనిశము స్వర్గసుఖంబులఁ, గనుచుఁ బునర్జన్మమేను గాంతున నెడు చిం
తనుమాని యుండుమా యని, జనకునిఁ దలపోసి మదిని సంభాషించెన్. 315

క. తలఁదడుపుకోడలును దిల,జలముల విడువంగఁజాలు సత్పుత్రుండున్
గలుగం దగునని కోరుట, యిల సాజము తండ్రులైన యెల్లరకుఁ దగన్. 316

క. పితృయజ్ఞ మంతయుం దన,సుతులం దొక్కండు చేయ సురపదమందుం
బితరుం డుండఁగఁజాలునె, హితమే తక్కిన కుమారు లేది చేయమియున్? 317

క. అనుప్రాశ్నికులకుఁ జక్కని, దనఁబడు నుత్తరము రాముఁ డాచరణం బే
యనవచ్చు; దూరభూమిని, దనయులు నివసింపఁ జెంతఁ దగు తనయుండే. 318

ఆ. ఔర్ధ్వదైహికమ్ము లనఁబడు క్రియలను, జేయఁ బిదప విన్న శిష్టపుత్త్రు
లంబుతర్పణంబు నాచరించినఁ జాలు, ననుచుఁ బూర్వగాథ లనువదించు. 319

సీ. క్షత్రియాదుల సదాచారమీయఁదియగుఁ, బూర్వకాలంబునఁ బూన్కి బుధులు
తెల్పి రీసరణిని దెల్లముగానని, రాముని దగు నాచరణమె తెల్పుఁ;
గాలానుసారముగా సదాచారముల్, మార్పునొందుచునుండు; మానులెల్ల
స్మృతుల నెల్లను జక్కఁ జెప్పిరి; కావున, వారిమాటల నమ్మి భక్తిమీఱఁ
తే. బితృమఖముఁ జేయఁ దగు నది ప్రీతి నొసఁగు
చుండుఁ బితృదేవతలకు వా రొక్కరె కద?
వంశవృద్ధిని గోరెడు వారు సతము
వారిఁ బూజింపకున్నచో వంశ మడఁగు. 320

క. కులదేవత లనఁబడు వా,రలు నట్లే పూజ్యులని సురప్రవరులె లో
కులకుం దెల్పిరి వారల, పలుకులె యాచారమందుఁ బ్రబలుచునుండున్. 321

క. అనిలోకు లెఱుఁగుదురుగా,కని రాఘవుఁ డెంచి స్వీయమగు వర్తనముం
గనఁజేసె నెల్లవారికి, జను లద్దానిన్ గ్రహింపఁ జను నెల్లపుడున్. 322

చ. క్షితిసుతఁగూడి రాముఁడు వసిష్ఠుఁడు తమ్ములు వెంటరాఁగఁ బె
న్వేత తను నేఁచునట్లు జనబృందముఁ గాంచఁగఁ జేయుచున్ ముని

ప్రతితకి యోగ్యమై వెలయు॥పర్ణగృహంబును జేరునంతలో
వితతబలంబు మంత్రులును ॥ వేగమ వచ్చిరి రాముచెంతకున్. 333

ఉ. తల్లులకెల్ల మ్రొక్కి, ముని॥తల్లజులంగని వందనాళిచే
నుల్లములెల్ల సంతసము॥నొందెడు నట్లొనరించి, ప్రీతిరం
జిల్లఁగ మిత్రసత్తములఁ ॥ జెందినవేడుకఁ గౌఁగిలించి, యు
త్ఫుల్లసరోజనేత్రములఁ ॥ బూజ్యులఁ బౌరుల నాదరించుచున్ 324

తే. మంత్రివర్యులతోఁ బ్రీతి॥ మాటలాడి, యెవ్వరెవ్వరి నెట్టెట్టు ॥ లెలమిఁగాంచఁ
జేయఁగాఁ దగు నవ్విధిఁ ॥ జేసి వార, లెల్లఁ గూర్చుండఁగా దాను॥నెల్లరఁ గని.

చ. సమయమునందుఁ బల్కఁదగు॥చందమునన్ మరియాద కేమిభం
గము కలుగంగనీనిగతిఁ ॥ గ్రమ్మ వచస్తతి పర్వఁజేయుచున్
గ్రమముగఁ గొంతకాలము వి॥రామము కన్పడకుండఁ బుచ్చి త
మ్ము మరలఁ బ్రశ్నచేసె గత॥మున్ వచియింపుము శిష్టభాగమున్. 326

శ్రీరాముని భరతుఁడు రాజ్యముఁజేయరమ్మని కోరుట.

మ. అని ప్రశ్నింపఁగ నాలకించి భరతుం డా॥హా! మహాత్ముఁడు నా
మనవిం గైకొనుచంద మింత తెలిపెన్; ॥ క్ష్మానాథువృత్తాంతమున్
జననీవృత్తముఁ దెల్పినాఁడఁగద? యా॥చందంబుగా మీఁదసా
గినవృత్తాంతముఁ దెల్పి నెమ్మదిని గ॥ల్గింతున్ మృదుత్వం బిఁకన్. 327

తే.అనుచు యోజించిదీనత్వ॥మాస్యమందుఁ,గానఁబడుచుండఁగాఁబల్కెఁ॥క్ష్మావిభుండు
చావ నీవట్టు లడవికిఁ॥బోవ మంత్రు, లామహీపతిఁ దైలంబు॥నందు నునిచి.328

క. చారులఁ బంపిరి వారును, నేసుపుమీఱంగఁ బల్కి ॥ నృపువార్తలనుం
దా రెఱుఁగనట్లు కులపతి, యే రమ్మని దెల్పుఁడన్న ॥ నెంతయు వడిగన్. 329

తే. వచ్చినారము వేఱొక॥వార్తమాకుఁ, దెలియదనసందియములు॥న్నలముకొనఁగఁ
దమ్మునింగూడివచ్చితిఁ॥ దరలియపుడె,పత్తనముఁజొచ్చితిని॥రామభద్ర!యదియు.

క పతిలేనినాతిగతి నా, కతితాపముఁ బుట్టజేసె ॥ నంతకు మునుపా
గతినుండఁ జూడమిన్ నా, మతియంతయు దుఃఖజలధి॥మగ్నం బయ్యెన్. 331

క. పురిఁజొచ్చి యంత నంతఃపురముం గనఁబోవు నంతఁ ॥ బొక్కుచు జను లా
తురతం బాఱిరి ననుఁగని, తరమే దురవస్థదానిఁ ॥ దగువిధిఁ జెప్పన్. 332

క. కైకయుఁ దాఁజేసినఘన, మౌ కార్యము నాకుఁ దెల్పె ॥ నవ్వాక్కులు నం
జీకాకుపఱుప నుండం, గాక వసిష్ఠాదిమంత్రి॥కాండముఁ గంటిన్. 333

సీ. వారు చెప్పినయట్లె ॥ ధారణీపతికి శా,స్త్రోక్తకృత్యంబులు ॥ నొక్కరీతి
జరపితి; నంత వా॥రరయక రాజ్యంబుఁ, బూనుమంచున్ ॥ నాకు బోధచేసి;
రామాటలను విన॥కందఱిఁ దోడ్కొని, వచ్చుచో గుహుఁ గాంచి॥వాని సంది
యముల నెల్లనుబాపి ॥ యాతనిమైత్రికి, నచ్చెరువందుచు ॥ నటవినున్న

ఆ. నిన్నుఁ గానవచ్చితి న్నను దయమీఱఁ, గావవలయు దీనకల్పభూజ!
రమ్యకీర్తివిజితరాకాలసద్ద్విజ,రాజ! భాజితదినరాజతేజ! 332

ఉ. నాదగుప్రార్థనంబును మనంబునఁ జక్కఁగ నెన్ని సజ్జనుల్
మోదమునొంది మెచ్చుకొన భూతములెల్లను దృప్తినొందఁగా
నీదయయుండు రాజ్యరమ నీతిపథంబునఁ బ్రోవ రమ్మయో
ధ్యాదయితుండ వీవెకద యాశ్రితరక్షక! దుష్టశిక్షకా! 335

చ. ఇనకులమందు మున్ను జనియించినవారలయందు నెవ్వఁడే
ననుజుని రాజుఁ జేసి విపినావళిలోఁ జరియించినట్లు నే
విననది నీవెఱింగినది వేడుకకైనఁ దలంపలేదు; జ్యే
ష్ఠునిదిగ రాజ్య ముండుటయె చొప్పడియుండినధర్మ మెత్తఱిన్. 336

చ. పరధనహర్తఁ జోరునిగఁ బల్కుదు రార్యులు; నీదుసొమ్ముగాఁ
బరఁగిన రాజ్యముం గొనుట పాడియె? చౌర్య మనంగ నద్దియే;
పరమనయం బెఱుంగఁదగుపండితు లెల్లరు దీని నెంతొ మె
త్తురుగద? యట్టిపాపమునఁ ద్రోయక న న్ననుకంపఁ గావవే. 337

ఉ. నీపదపంకజాతముల నెమ్మి నిరంతర మేను గొల్చుచుఁ
బాపలవంబు నేఁ గననిపద్ధతి మీఱఁగ జీవయాత్ర నే
నోపిక సాగఁజేయఁగనె యూహలు గల్గినవాఁడఁగాన నీ
ప్రాపుననుండువాఁడ; నిదె పల్కితి సత్యహితంబుగా నిటన్. 338

చ. పరమకృపాపయోనిధివి భక్తహృదంబుజభాస్కరుండ వీ
వురుతరశౌర్యధుర్యుఁడ వయోగ్యజనాంతకుఁ డంచుఁ బండితో
త్కరనుతి గాంచిధర్మసముదాయము నేర్చి చెలంగుప్రోడ వో
సురపతితుల్య! నాపలుకు సూనృతమంచు గ్రహించి కావుమా. 339

చ. త్రికరణశుద్ధిగాఁ బలికితిన్ మునులెల్ల వినంగ రాఘవా!
యిఁక బదులెద్దియుం బలుకనెంచక వే దయచేయవయ్య! యెం
చకు మలకైకమాటల నసంగతతద్ధృదయైకవర్తనం
బకలుషచిత్త! నీకు నిదె యంజలిచేయుదుఁ బ్రీతిమీఱఁగన్ 340

క. చోరుం డనుదూఱది న,న్నే రీతిం బొందకుండ నీవె యొనరుపం
గారుణ్యాబ్ధీ! తగుదువు, ధారుణిఁ బాలింపరమ్ము ధర్మ మ్మదియే. 341

క. అనిప్రార్థించుచుఁ బ్రీతిం, గనుఁదమ్ముల నశ్రుకణనికాయము ప్రవహిం
ప నిఖిలమంత్రులు బ్రహ్మ, ర్షినివహముల్ చూచుచుండఁ జేమోడ్పులరన్ .341

మ. ధరణిం గాంచుచు నున్నయాభరతు సంతాపంబు చూడంగ దు
ర్భరమై కన్పడె; రాఘవుం డపుడు తన్ బ్రార్థించుసోదర్యునిం

గగుణం జేరఁగఁ దీసికొంచుఁ బలికెన్ ఽ క్ష్మాపాలపుత్త్రుండవై
ధరఁ బాలించెడుశక్తిగల్గ నిటు స్త్రీధర్మంబుఁ గైకొంటివే? 343

### శ్రీరాముఁడు భరతునకుఁ గర్మసిద్ధాంతమును దెల్పుట.

మ. తగునయ్యా! దురపిల్లఁ గర్మమది పొందం జేయు నెద్దాని దా
నిఁగడుం దృప్తిగ సంగ్రహించి తనదౌనీత్యున్నతుల్ మించ నొ
క్కగతిం గాలముపుచ్చు మానవుని దుఃఖం బెద్దియేఁ జేర్పఁగాఁ
బగఁ బాటింపక కాచుచుండునని చెప్పం బెద్ద లాలింపవో! 344

ఉ. తానొకసాక్షిమాత్త్రుఁడుగ ఽ దైవము శర్మమొ దుఃఖమో స్వక
ర్మానుగుణంబుగా మనుజుఁడల్లనఁ బొందఁగ సంతసింపకే
మానసమందుఁ గుందక యమానుషవర్తన మూనియుండు న
ద్దాని మరల్పరా దనెడు ఽ ధర్మమెఱుంగవె నీవు చక్కఁగన్? 345

తే. ఎట్టికాలంబునం గర్మ ఽ మెట్టిఫలము, నెవఁడు పొందంగఁదగునొ యదెట్టిరీతిఁ
గలుగవలయునొయటుముందె ఽ తలఁచియొదవఁ,గానొనర్చునుమాన్పంగఁగా

క. ఈసిద్ధాంత మెఱింగియు, నీసరణిన్ వంతనొందనేలొకో? యనుజా! [దెవరికి
యేసమయంబున కేఫల, మాసించున్ జనుఁడు నొంద ఽ నది యెటు కలుగున్.

క. తొలిమేన నెట్టికర్మం,బులఁ జేసినవాఁడొ వానిఁ ఽ బోలినఫలముల్
కలుగున్ మఱుపుట్టువునన్, దొలఁగింపం దరమె కడఁకతో నెటులైనన్. 348

మ. వినవయ్యా! యిసుమంత చిత్తమున నీవృత్తంబు నూహించి యి
ట్లనుమానింపక తెల్పినట్లుగ మదీయాత్మం దలంపంగ లే
ననుజా! కర్మగతుల్ దురూహములె యాఽనం జైన నూహింప నే
రనియప్రాజ్ఞుఁడవైతి వేలయను నర్థం బెన్నుచుం గుందెదన్. 349

ఉ. వేదము లాగమంబు లభివృద్ధినిఁగాంచఁగఁజేయఁజాలి దు
ర్వాదము లంత మొందఁ బటువాగ్మిత నిచ్చుననేకశాస్త్రముల్
కాదన కర్హులై వెలయుక్ష్మాసురవర్యులు తెల్ప నేర్చియున్
బ్రోదిగ వానితత్త్వమును ఽ బుద్ధినెఱింగియు నిట్టు లాడుదే? 350

మ. పదునాల్గేండ్లు ధరాధిపత్వము వహింపన్ నీకు నన్నేండ్లుదు
ర్మదులౌ రాక్షసు లుండుకాననములన్ ఽ మౌనీంద్రున ట్లుండ నా
కుఁ దలన్ వ్రాసెను బ్రహ్మ కర్మఫలముల్ ఽ గూర్పంగ నోతమ్ముఁడా!
వదలన్ శక్యమె వాని నేవరుస నే ఽ భావింపుమా నెమ్మదిన్. 351

మ. నొసటన్ వ్రాసినవ్రాఁతకన్నఁ గలదా ఽ నూఱేండ్లుచింతింప నం
చసమానప్రతిభావిశిష్టు లగునార్యగ్రామణుల్ పల్కుచుం
డ సగర్భ్యా! వినవో యొకప్పుడయినన్ ఽ నాతోడ నిట్లాడ నీ
కు సమాధానమె యెన్నుమా మదిని సంకోచింప కావంతయేన్. 352

చ. మనసున నాపరాత్పరు నమానుషరూపముగల్గువానిగా
నొనరిచి నిల్పి కొల్చుచు మహోద్యమ మొప్పఁగఁ గర్మమే ఫలం
బును గలిగించుదాని నతిమోదమునం గుడువంగ నెంచుచున్
జనకునియాజ్ఞ మౌళినిడి । సంతతమున్ సమయంబుఁ బుచ్చుమా. 353

ఉ. నాదియె రాజ్యమంచు జతనంబున దానిఁగొనంగఁ జౌర్యమే
కాదగునంచుఁ బూర్వు లిటు । కార్యము దేనిని జేసినట్టులే
లేదని యేదొ ధర్మమవలీలగఁ దెల్పితిఁగాదె తమ్ముఁడా!
నాదగునేని రాజ్య మది । న న్నెడఁబాయక యుండునేకదా. 354

చ. ఎపుడెపు డెవ్వఁ డేలఁదగు । నీభువి నంచొగి దైవ మెంచునో
యపుడపు డాతఁ డేలుఁజుము! । హర్షముమీఱఁగ దాని కేకొలం
త పొసఁగఁజాల దెవ్వరుసఁ । దథ్య మిదంచుఁ దలంపు మంతటం
దపమునఁ బాపసంఘ మటు । తామె తొలంగును సంశయావళుల్. 355

తే. కర్మసిద్ధాంతమునె సర్వ । కాలమీవు, తలఁచుచుండుమ యయ్యదె । దైవమనుచుఁ
దోఁచు; నద్దాన నిను శంక । లేఁచకుండు, నట్లుతలఁచుటకుపమ నే । ననువదింతు.

క. భరతా! మానస మనునది, నిరంతరము చంచలత్వ । నియమంబునఁ దాఁ
బరివర్తించును; దానికిఁ, బరిపంథియె యోగ మనఁగ । బ్రఖ్యాతంబౌ. 357

క. యోగంబనఁ జంచలతం, దాఁ గాంచు మనంబు నొక్క । తఱినే నొకచో
బాగుగ నిల్పెడుసాధన,మై గణుతింపంగఁబడున । దౌ నని యాత్మన్. 358

క. తలపోయవయ్య! సహజా!, ఫలము తదభ్యాసమునకుఁ । బరమపదంబున్
గలుగంగఁజేయు ధ్యానమె, సులలితకర్మాళి కదియె । శుభమార్గ మగున్. 359

ఆ. భక్తిలేనికర్మ । పటలము జ్ఞానయు, క్తంబుగానిభక్తి । తగు విరాగ
తను బొసంగనట్టి । దనఁబడు జ్ఞానంబు, నిష్ఫలంబు లనుచు । నిపుణు లండ్రు. 360

క. వినవయ్య! యోగభేదము, లనంతములు వానియందు । ధ్యానమె యగ్ర్యం
బనఁదగు నని సద్విద్యా, ధనులందురు దీని నీవు । తలఁపం దగదే? 361

ఉ. ధ్యానమునా నభీష్టమగు । దైవతరూపము నిచ్చమీఱఁగా
మానసఫుల్లపంకరుహ । మధ్యపదంబున నిల్పి భక్తిమై
దానినె చక్కఁగాంచుచు నిఁ । కన్ మఱియొద్దియుఁ దోఁపకుండఁగాఁ
దా నలరారుటే యనిరి । తత్త్వవిదుత్తము లౌమహామతుల్. 362

క. చిరకాలాభ్యాసంబున, నిరుపమసత్ఫలదమౌచు । నెగడెడుధ్యానం
బురుతరకష్టఫలంబుగ,భరతా! లభియించుఁ గర్మ । ఫలమన నదియే. 363

సీ. అట్టియోగాభ్యాస । మం దసమర్థులై, వేదాంతవాక్యముల్ । వినుచు వాని
యర్థం బదెట్టులో । యార్యులు చెప్పంగ, గ్రహియించి దుర్వృత్తి । కలితులయ్యుఁ

బామరులకుఁ దెల్పఁ బాలయి తన్మూలమున నర్థసంగ్రహమున నిపుణత
నార్జించి యదె పరమార్థ మంచుఁ దలంచి, శిష్యకూటమ్మును జేర్చికొనుచుఁ
తే. దిరుగుచుం యోగ మేలని తెగిపలుకుదు, రట్టియలసుల కీలోకమందును బర
లోకమందును సౌఖ్యంబ దేకరణిని, గలుగకుండు జగద్వంచకులుగ నుంట.

క. చిత్తంబేకాగ్రతఁ గన, నెత్తఱినే యోగశక్తియే తోడ్పడనా
నుత్తమయోగిగ నుండక, చిత్తము లోఁబడెడునట్లు చేయఁ దరమెటౌ? 365

చ. అలసులతత్త్వవాక్యముల నావలఁద్రోలి పరాకుమీఱి ని
మ్ముల గురుసేవచేసి ధనముం గొనుబుద్ధిని నిగ్రహించి ని
స్తులమగు యోగమార్గమునఁ దోరపుశ్రద్ధ వహించి యెంతో చం
చలమగు చిత్తముం దనవశంబున నుండఁగఁ జేయఁగానగున్. 366

క. పలుభంగుల నాచిత్తము, నిలుకడఁగనకుండఁ బాఱునిర్భరగతి యో
గులు దాని మెల్లమెల్లన, నిలుపం యత్నంబు చేయనేర్తురు సహజా! 367

ఉ. మందమనీషు లావిధము మాని వృథాశ్రమ మాపథంబునం
బొందఁగ నేల యంచు శ్రుతిపుంజమునం గలకొన్ని మాటలం
గ్రందుగఁ బల్కుచుం గుజనకాండము లోఁబడఁ జేసికొంచు నా
నందము హాటకార్జనమునం గనుచుందురు దుష్టవృత్తులై. 368

ఉ. వారలచెంతఁ జేరక యభంగురభక్తిని యోగమార్గముం
జేరఁ దలంచి దానిఁదగుసిద్ధిని గాంచుశ్రమంబు నొంది దు
ష్పారముగాఁ జెలంగుచును బండితసత్త్వము నొంచు నొప్పు నా
సారతరైకయోగపదసంగతి గాంచిన ముక్తి యబ్బెడున్. 369

ఉ. దొమ్మరివిద్య యోగ మని ధూర్తులు పల్కుదు రట్టివారివా
క్యమ్ములఁ గర్ణయుగ్మమునయందుఁ జొరంబడనీక శాస్త్రముం
నమ్మి యనేకకష్టముల న్యాయ్యములంచు సహించి యోగశా
స్త్రమ్మునఁ జెప్పియుండుగతిఁ దా నొనరింప నరుండు సిద్ధుఁడౌ. 370

ఉ. చిత్తము నిశ్చలత్వముగఁ జేసి పరాత్పరునందు నిల్పి య
త్యుత్తమతత్పరిభావితతి నొప్పెడుదృష్టిని గాంచుచుండుటే
యుత్తమపూజ యయ్యెడియె యున్నతసమ్మద మియ్యఁజాలుఁ జు
మ్మెత్తఱినైన నట్టిది మఱెయ్యది లేదని నమ్ము తమ్ముఁడా! 371

ఉ. చిత్తవిశుద్ధిలేక యెది చేసిన నిష్ఫలమే యటంచు నీ
విత్తఱినైన నమ్మఁదగు నింతకుఁ బూర్వము నమ్మకున్నచోఁ
దత్తఱపాటుమాని విహితంబగు కర్మఫలంబు దైవసం
పత్తిని బ్రాప్తమైనతఱి బాగుగ నొందుము న్యాయ్య మద్దియే. 372

చ. తికమకనొందు నెప్డు మది । తీక్ష్ణముగాఁదగు కర్మసంగతిన్
సకలవిధీడితక్రియలు । చాలఁగ దుష్ఫలదంబులంచు నో
పికగన నప్డు దోఁచు నిదె ప్రేష్ఠమతిం దిలకించి తెల్పు దే
శికులనుడుల్ వినంగఁ దగుఁ । జెప్పితి ధ్యానమహత్త్వ మివ్విధిన్. 373

క. అనుజా! ధరణీభారం,బును నేఁ బూనంగఁజాలఁ । బూనుము నీవే
యనఁబోకు మింక; వంశం,బున కది దుష్కీర్తికరము । పొమ్ము నగరికిన్. 374

క. తెలియనివిషయముఁ జక్కం, దెలిసినయ ట్లభినయించుటెంపు గనకు; మి
ప్పలుకులె భీతుఁడవౌటం, దెలుపుంగద యద్ది కులము తీరే తలఁపన్. 375

భరతుఁడు శ్రీరామునితోఁ దనవిన్నపముఁ దెలుపుట.

చ. అనియిటు న్యాయనిష్ఠురము । లర్థమునం గననౌ తెఱంగునన్
మును లరుదందఁ బల్కుటయుఁ । బోలు నివౌ నని యెల్లవారు నె
మ్మనముల నెంచుచుండ రఘుమండను రామునిఁ గాంచి భక్తియున్
వినయముతోఁప నిట్లనియె । వింతపడన్ భరతుండు మెల్లఁగన్. 376

మ. భవదీయోక్తులు వేదసారములనన్ । వచ్చున్ మహాత్మా! భవ
త్సవిధం బందొకవాగ్మినై పలుకఁగా । శక్తుండనే యైన నా
క్కవిధిం దెల్పుదుఁ బెద్దలే స్మృతులఁ జక్కం గాంచి బోధించి రే
నవధానంబున సంగ్రహించితిని రామా! యార్తరక్షామణీ! 377

ఉ. సూనృతవాది తండ్రికడ । సూరిజనావృతమౌ సభాస్థలిన్
బూనికమీఱ నిన్నవనిఁ । బూనఁగఁ జేసెద నంచుఁ దెల్పఁగా
మౌనిపతుల్ తదర్హముల । క్ష్మాపతికృత్యములన్ విధిన్ నినున్
బూనఁగఁ జేసినారు కద । పూనితివే కద వాని నీవునున్. 378

చ. పురమునఁ బల్లెలందు రఘుపుంగవుఁడౌ యువరాజు; తన్మహం
బరుదుగఁ జెల్లు రేపె యనునట్టి సువార్త చెలంగెఁగాదె? య
త్తరుణమునందు విఘ్న మెది । దార్కొనునే విరమింతునంచు నె
వ్వారు వినఁబల్క లేదు గద । భాస్కరవంశపయోధిచంద్రమా! 379

చ. తొలిదిన మిట్టిసూనృతముతోఁ దమిఁ గాలము పుచ్చెఁ దండ్రి; యా
వలిదిన మూరకుండె నొకవాక్కును బల్కక యైతువంబు త
న్నలముకొనంగ నుండు నుపలాకృతి; నెంతదయాసముద్రుఁడో
పలుకఁగఁజాల నిట్టులని । బాలిశతం దగియుంట నే నిటన్. 380

చ. పతిహిత మెద్ది యంచుఁ దనభావమునం దలపోసి వృత్తిఁ ద
ద్ధితమును వెల్లడించునదియే పొగడొందును సాధ్వినాఁగఁ ద
న్స్మృతి కనుకూలమై తగినవృత్తి నెసంగుమహాత్మురాలు కీ
రితి గనుఁబో పతివ్రతలశ్రేణిని దాఁ దొలుతన్ గణింపనై. 381

ఉ. అట్టిమదీయమాత పతి౹యార్తిని మున్గియె యూరకుండ ని
న్నిట్టి దురంతతాపముల ౹ నెల్లను గాంచఁగఁ జేయఁజాలి యే
కట్టిఁడియే వచింపఁ ద్వర౹గాంచనిపద్ధతిఁ బల్కె; దానిఁ జే
పట్టియె పౌరు లేద్వ బ్రియ౹బంధువులెల్ల వగం దపింపఁగన్. 382

క. పాటింపక యీయది యే, పాటినయంబో యటంచుఁ ౹ బటుతరబుద్ధిన్
గాటముగా యోజింపక, దాఁటితివి పురంబు తండ్రి ౹ దైన్యమునొందన్ 383

చ. జనకునిమాట దాఁట నెటు౹చాలనివాఁడవె యయ్యుఁ దండ్రియున్
వనములకేగవయ్య! రఘు౹వర్య! యిదే సమయంబునందు నీ
వని నది లేదుగాదె? ముఖ౹మార్తిని వంచి నిరంతరాశ్రుధా
రను బృథివీస్థలిం దడుప ౹ రామ! ప్రయాణముచేసి తక్కటా! 384

తే. భర్తృసన్నిధినే యాజ్ఞ౹భార్య చేయఁ, దగదుగద? సాధుసర్ణ్యవృ౹త్తమది కాదు
గాదె?యట్టిదురాత్మకై౹కయెదిపల్కె, నద్ది త్యాజ్యమెగాని గ్రాహ్యమెటుగాదు.

క. ఇది ధర్మమంచుఁ బెద్దలు, మది సందేహంబు మాని ౹ మాటలఁ దెలుపం
గఁదగుదురుగాదె; యెవరే, నిది తగునని పల్కరేమొ ౹ యెఱిఁగింపు విభూ!

క. అంగీకరించి రాజ్యం,బుగడుఁ జేకొందు మౌని౹ముఖ్యులు నిపుడై
నం గడఁగి చెప్పినం ద్వా,త్సంగతి నాశింప కేగఁ౹జాలుదుఁ బురికిన్. 387

క. ఇంకొక్కవిషయమును మఱి, శంకింపక పల్కువాఁడ ౹ సద్గురువులప
త్పంకజములకడఁ గపటం, బింకన్ హాసోక్తులాడ ౹ హితమనిరి బుధుల్. 388

సీ. కాలానుసరణము౹గాఁ గర్మగతి నెద్ది, ప్రాప్తించినన్ దానిఁ ౹ బ్రమదమొప్ప
ననుభవింపందగు ౹ నంటి రింతకు మును; పట్టిసిద్ధాంతము౹బట్టి యపుడు
నీకుఁ బ్రాప్తించిన ౹ నిఖిలరాజ్యముగొని, పాలింప కద్దానిఁ ౹ బాసి వనికి
దయచేయ హేతు వృ౹త్తమరీతిఁ దెల్పిన, నంగీకరింతు నే ౹ ననఘ! దాని
ఆ. వినఁగఁగోరువాఁడ ౹ వినిపింపవయ్య! వే, పెద్దవారియట్ల ౹ పిన్నవారు
చేయుచుంద్రు గాన ౹ నీయెడ నీదుసి,ద్ధాంత మేనుభక్తిఁ ౹ దల ధరింతు. 389

క. తనమాట తనకె బాధక, మవఁదగ నట్లుండవలయు ౹ నన్నా! మనకా
జనకుండు రాజ్యవిపినము,ల నొసంగెనె నేలు తిరుగు ౹ లలి నని చెపుమా.

క. ఆతండ్రి కహితముగనే, నాతల్లి వచించె నదియె ౹ న్యాయ్యం బని నీ
వే తెగిపల్కితి విటఁ గల, యేతాపసులైన నొప్పి౹రే రఘునాథా! 391

చ. జనులకు రంజకుండుగ నె౹సంగునతండె చెలంగు రాజునా
ననఘ! యదెట్టియత్నమున౹నైనను నే నిపు డీజనంబులన్
జనపదవాసులన్ ధనమొ౹సంగియు సంతస మొందఁ జేయఁజా
లునుగద? యిద్ది నిశ్చయ మి౹లాతల మేలఁగ నాకు శక్యమే? 392

ఉ. ఊరకమాటలాడక నిజోత్తమకార్యముగాఁ జెలంగునీ
ధారణి రక్షణంబను నితాంతమహాభర మూని సర్వథా
త్రీరమణుల్ సెబా సనఁగ శ్రీరఘునాయక! మమ్మునెల్ల నిం
పార భరింప రమ్ము జనకాజ్ఞ యదేగద మూఁడుసార్లకున్. 393

ఆ. సవతిమాట పితృవచనతుల్యమని యెందుఁ, గానరాదు స్మృతిని గాయమందుఁ
బెక్కుమాటలేల? నిక్క మీరాజ్యమ్ము, నీదెకాని నాదికాదు రామ! 394

చ. జననియు నిర్భరార్తిగని చాలఁ గృశింపఁగఁ బౌరులెల్ల నిం
గనక వగం గడుంబొగులఁగా మునికాండము చెప్పఁబూనియున్
వినఁ డితఁడేటికో యనుచు విహ్వలతం గనఁ గాననాంతరం
బునఁ దపియింపనేలొకో మముం గృపఁ గావఁగరావె శ్రీపతీ. 395

తే. కర్మసిద్ధాంతములు పెక్కుకలవుగాని, యేమిపనిలేని తఱివాని నెల్లమనము
చర్చచేయుద మిత్తఱిఁ జాలదూర, మునకు వానిని ద్రోయుద మనుపమయశ!

ఉ. ఉల్లమునందుఁ దండ్రి దగునుద్యమ మెవ్విధి శీర్షధార్యమో
తల్లిసదుద్యమంబు నటుధార్యమె కాదొకో శీర్షమందు; నీ
వెల్లస్మృతుల్ పురాణము లహీనమహత్త్వముగల్గువేదముల్
పెల్లుగ నేర్చినాఁడ విది పెంపుతగం బరికింపు మా మదిన్. 397

చ. మనసు విచంచలత్వమున మానితమై తగుమాడ్కిఁ జేయ నొ
ప్పినయది యోగమే యగును; ప్రీతిని మీకడ ముందె నేర్చుకొం
టిని సతతంబు నీదయిననిర్మలపాదసరోరుహంబు నె
మ్మనమున నిల్పి కొల్చెదను మాధవ! ధర్మభృతైకభూధవా! 398

ఉ. నీదగుమూర్తి ధర్మమను నిర్మలనామమునం జెలంగి యీ
మేదిని గాచుచున్నయది మించెడుశక్తి నిరంతరంబుగా
నేదియు దాని మించునదియే జనియింపదు సృష్టియందు; ను
ర్వీదయితా! తదర్థమయి వేఁడెద రమ్మని నిన్నుమన్ననన్. 399

ఉ. జ్ఞానులమంచుఁ గొందఱు ప్రసంగములం దమశక్తిఁ దెల్ప న
జ్ఞానుల మోసపుత్తు రలస్వర్ణము గోరియె యంచెఱుంగుదున్
బో నెపుడట్టి దుర్జనులపొంతకు సుంతయు నంతరాత్మయుం
బూనదు వారిఁ గాంచఁ దమి భూధవవందితపాదపంకజా! 400

మ. నిను దర్శించుచు నీపదాంబుజములన్ నిత్యంబు పూజించుచున్
మనమున్ వాక్కులు కాయకర్మములు నీమన్నించుకార్యంబులే
యనిశంబుం గడు శ్రద్ధఁ జేయఁగ ననూనానందముం బొందుచున్
మునివృత్తిం జరియింప నెంచెదు ననున్ బూతాత్మకా! కావవే. 401

చ. భవజలరాశివీచికలపారము గాంచఁగలేక యవ్విపై
కవిసిన దిక్కుదోఁపదని కాచెదువా రెవరంచు నెంచి నీ
ప్రవిమలపాదపంకరుహరమ్యరజస్సు శిరస్సుఁజేర్పఁగా
వివిధభయంబు లొక్కతటి వింతగఁ ద్రుంగు నటన్న నమ్మికన్. 402

చ. వనములనున్ననిన్నుఁ గన వచ్చితి; వేఱొకభంగి నన్ను నె
మ్మనమున నెంచ కింక నొకమాఱును బొమ్మిల నేలుమంచు నన్
బనుపఁగ నూహ చేయకయె భక్తుఁడు వీఁడని తోఁచునేని నీ
వనుపమవత్సలత్వము బయల్పడఁ గావుము దీనపాలకా! 403

చ. అనుటయుఁ బిన్ననవ్వొలయ నాయనుజన్ముని జేరఁదీసికొం
చనఘ! భవాబ్ధిమున్గితివె? యంతము దాని దిదంచుఁ గాన లే
క నిలిచియున్నవాఁడవె? నగం గడుఁజిక్కితివే? సెబాసుర
య్య! నినుఁ గనంగఁజాలిఁ గనునామన మెంతయు నిప్డు తమ్ముఁడా! 404

ఉ. ఎక్కడ నేర్చుకొంటివొకొ యీపలుకుల్ సహజన్మ! యెవ్వరే
నిక్కడ నిట్లు పల్కుమని యీతెఱఁగంతయు నేర్పలేదుగా
ముక్కున కెంతొ చాయఁగనుబోఁదగు నన్నసనాతనోక్తి నీ
వొక్కపుడేని విన్నయటు లూహయె కల్గ దదేమి చిత్రమో! 405

ఆ. నిన్నఁగాక మొన్న నీవు జన్మించితి, వింతలో భవాబ్ధి నెట్లుమున్గి
వంతగుందినావొ భావింపఁగాఁజాలఁ, బెద్దవారికంటెఁ బెద్దవైతి. 406

క. ఇంతటివిద్వాంసుఁడ వని, యింతటిదాసుండ వనుచు నే నెఱుఁగఁజుమీ
యింతటిలోనే భరతా, వింతగ నేర్చితివి శాస్త్రవితతిం జక్కన్. 407

మ. మతిమంతుల్ విన నవ్వరే యనుచు నేమాత్రంబు చింతింప కి
ట్లతిలోకంబగు నీతిఁ దెల్పితివి సత్యస్ఫారసిద్ధాంత మీ
విత మంచుం దెలియంగఁజేసితివి నీవిజ్ఞానముల్ మెచ్చితిన్
గృతకృత్యుండవు పిన్నవాఁడవయినన్ గీర్తింపవచ్చున్ నినున్. 408

చ. అని కొనియాడునట్లు తనయాశయ మచ్చటివారి కెల్లభీ
తిని గలిగింపఁజేయ రఘుధీరుఁడు సుంత హసించి తమ్మునిం
గనుఁగొని వత్స! యిట్లనుట కానితెఱం గగుఁజుమ్ము తండ్రినిన్
జననిని దూలనాడితివి సత్యము తత్త్వ మెఱింగినట్లుగన్. 409

చ. తెలియవు ధర్మసూక్ష్మముల తీ రిటులుండునటంచు శాస్త్రముల్
తెలిసినవాఁడవయ్యును సుధీజనసంగతి చాలలేమి ని
ప్పలుకులఁ దెల్పినాఁడ వని భావమునం దలపోసితింజుమీ!
యలుగను నీపయిన్ మది భయంబును బొందకు మించుకంతయున్. 410

ఉ. సూనృతతత్త్వ మిట్టిద।నుచొప్ప నెఱుంగవు; తండ్రిపై వృథా
మానులచెంత నజ్ఞత।ను మానక మోపితి; వింతె కాక స
త్సూనుఁడవయ్యుఁ దల్లియెడ।ఁ జొక్కపుఁ బ్రీతిని జూపమాని యే
నానయు లేక క్రూరత వి।నందగనట్టులు తిట్టితే కటా! 411

చ. జనకుని మ్రోలఁ దల్లి పరు।షంబులు పల్కక సాధువాక్కులన్
దనవరయుగ్మముం దెలిపె। దానికిఁ దండ్రియు మాఱుపల్కకుం
డె నదియు సమ్మతంబె యని। నేఁదలపోసితి; నవ్వరద్వయం
బు నొసఁగ లేమ నే ననఁడె। పొల్లయినం దలపోయ వింతయున్. 412

చ. తనకు నొసంగినట్టి వర।దానము సార్థకమై చెలంగఁజే
యనుదగు నంచుఁ గైక నృపుఁ। బ్రార్థనచేయుట తప్పటంచు నీ
వనదగునయ్య! నవ్వరము। లవ్వలఁ ద్రోయుచు నిన్న మొన్న చె
ప్పినయటు తండ్రిచేయుట య।భిజ్ఞహితంబను టెన్నఁ బాడియే. 413

ఆ. కన్నతండ్రి యన్ని।కార్యంబులకుఁ గర్త, యతఁడు చేయుదాని।కడ్డుపెట్ట
నాత్మజులకు నెట్టి।యధికారమును లేదు, స్మృతులసారమిద్ది।యే తలంప 414

చ. ఇరువుర కింతదాఁక నివి।యే పనులంచుఁ బరిష్కరించె; నం
దురుతరకాననంబుల మ।హోద్యమ మొప్పఁ జరింప నాకున్
బురమునుండి రాజ్యరమఁ। బూనఁగ నీకును; దమ్ముఁడా! పరా
త్పరుననుభావముం గొనియె। భద్రము లబ్బఁగ విజ్ఞు లుబ్బఁగన్. 415

చ. తనయులనెల్ల నొక్కగతిఁ। దాఁ దలపోయును గాని తండ్రియొ
క్కనిపయిఁ బ్రీతి యట్టె యధి।కంబుగ నొక్కనియందు సుంతగా
నునుచునె? యట్టియూహ మది।నుంచుట యర్హమె? నాయనా! యఘం
బని తలపోయు మెప్పుడు మ।దాత్మయు నట్లుగనే తలంచెడున్. 416

సీ. ప్రజలయాదృతికిఁ బా।త్రంబగునట్లుగా, వర్తింపఁదగు నంచు।బలికితీవు
న్యాయమేయది నేను।నద్దానిఁ బాటించ,వాఁడనే; వారును। బహువిధముల
ధర్మసమూహంబుఁ। దలపోసి వర్తింపఁ, దగుదురు రాజు స।త్యరతుఁ జేసి
యతనియాజ్ఞం గొని। యట్లు మెలంగఁగాఁ, దగుదురు గానితో।చుగతి నెల్లఁ
తే. దిరుగఁదగుమరె యెల్లర।తీరు లెఱిఁగి, మెలఁగ ధాతకుశక్యమే। పలుకవయ్య!
తెలిసి యిద్దాని తత్త్వంబు। నలుకగొనక, శాస్త్రభావ మదెట్టి ప్ర।సక్తిగనునో.

చ. నను విడనాడఁజాలని మ।నంబులఁ బౌరులు రాజవర్తనం
బనఁగ నదెట్టిదంచు నిసు।మంతయు నెంచక కర్మవృత్తిఁ దా
ననిహతశక్తికం బనుచు। నారయ కెంతయు నార్తినొంది రం
చని తలపోయువాఁడ నిది।యంతయు నారయుమా మదిం గడున్. 418

క. పితృపాదుల దూఱకు; మెవ్వితమున నేఁ దల్లిమాట వితథంబని యె
ట్టితెఱఁ బల్కకు; మిట్టులు, జతనముఁ బూనకుము నీవు సాధింపంగన్. 419

ఉ. అన్నను నేను నీకుఁ దగునట్టులు ధర్మముఁ దెల్ప నర్హుఁడన్
మన్ననమీఱ నాదయినమాటను దాఁటక వర్తిలంగ నీ
కు న్నెఱి భద్ర మబ్బు; నిది కూడదు కా దిది త్రోవ యంచు నీ
వన్న మతేమియుం బలుక కార్తిని బోయెదఁ గాఱుకానకున్. 420

చ. నను మరలింప బ్రహ్మకయినం దరమెట్టులుగాదు; నీమనం
బునఁగల సంశయంబులను బోవఁగఁ జేయక కాల్గదల్ప నా
మనసు రవంతయే నిపుడు మైకొన; దీద్వయమెట్లు సిద్ధిగాం
చునొ భగవంతుఁడే యెఱుఁగుఁ జొప్పిదియం చెదఁ దోఁప దిత్తఱిన్. 421

చ. అసువులకంటె నెక్కుడు ప్రియంబగు వస్తువ వీవు; నిన్నన
న్వెస నరుదెంచు దేహమును వీడిన ప్రాణము లంచుఁ జెప్పనౌ
నసమగుణాఢ్య నిన్వదలి యాయమరావతి నేలుభాగ్యము
ల్లసిలునయేఁ గొనంగను దలంపను సత్య మనుంగుఁదమ్ముఁడా! 422

క. నీపై నాపై జనకుని, దౌపరమయశంబు నిప్పు డాధారపడెన్
గాపథముఁ ద్రొక్క నది చెడు, భూపతి సత్యాత్ముఁ జేయఁ బోలుచుం జమ్మీ.

క. పదునాల్గు వత్సరము లెం,తో దడవుగాకుండ నొకముహూర్తమువలెఁ జె
ల్లుఁ దగున్ రాజ్యము పూనం,గఁ దండ్రియిష్టంబు చెల్లఁగాఁ బ్రియసహజా!

చ. అడవులనుండి వచ్చి ప్రియమారఁగ రాజ్యముఁ బూని మిమ్ము నె
ప్పుడు విడనాడకుండుదుఁ; బ్రభూతముదంబున నన్నుఁగూడి యే
ర్పడఁ జిరకాల మీవుఁ బ్రియబంధుయుతంబుగ సోదరద్వయం
బుడుగక కొల్చుచుండ సుఖమొందఁ గలావు నిజంబు నమ్ముమా. 425

చ. ఇరువుర మొక్కరీతి జనయిత్రికిఁ దండ్రికి నిష్టసిద్ధియౌ
వరుసఁ జరింపఁగా వలయు వారెదలం బరితృప్తినొందనీ
శ్వరుఁడును సంతసించు; నదెభావిశుభోదయ మంచు వేదవి
ద్వరులగు సాధుపుల్ పలుకువారు తలంపుము దీని సోదరా! 426

చ. వినుము మఱొక్కమాట పృథివీపతి యేపనికై జనించునో
పనియది తీర్పకుండఁగ శుభంబులఁ బొందఁగఁ గోరరాదు; వా
నిని బురికొల్పుఁ బూర్వపుజనిం బొనరించినకర్మమే తదా
జ్ఞను జరియించునాతఁడు నిజం బరయంగ స్వతంత్రుఁ డెట్లగున్. 427

సీ. యోగవిద్యాభ్యాస మొనరించితిని నీదు, చెంత నంచని నీవె చెప్పితివిట
సంతసించితి నీదుసద్భావమున కాత్మ, సహజన్మ! సన్మనీషగలవార

లం దుత్తముఁడవంచు నదియె తెల్పును గాదె, యైన నించుక తెలియంగవలయు
నింతతో సంతృప్తినే కాంచరాదుసు, మ్మనుపమ యోగంబు నభ్యసించి

తే. కర్మసిద్ధాంతతత్త్వ మిక్కరణి ననుచు, నిశ్చయించి ఫలం బెద్ది నియత మనుభ
వింపఁదగినదొ యద్దాని విడువఁ బూనఁ, దలఁపకుండంగ నుండుట తగుఁ గుమార!

క. విధియించె మున్నె నొసటన్, విధి రాఁగల ఫలము లిట్టివి యిపుడు తగ నీ
విధమునఁ బొందు నటంచున్, గ్రథియించెన్ వాని మార్పఁగలమె తెలుపుమా.

చ. పురముననుండి రాజ్యభరమున్ భరియింపుము; నేనుఁ గానఁ గ్రు
మ్మరుచు క్షణంబు గాఁగ నియమంబును దీరిచి వత్తుఁ దమ్ముఁడా!
మరల యథార్థపద్ధతి క్షమాభరముం గయికొందు; నంతటన్
గరము సుఖంత మెల్లరముఁ గైకొనుమా హితమంచు దీనినిన్. 430

క. అని కరము హితము మీఱఁగ, మనువంశసుమౌక్తికంబు క్ష్మాపాలనమం
దనురక్తిని గల్గించుచు, ననుజునకుం దెల్ప విన్నయందఱు మదులన్. 431

ఆ. ఆశలంతరింప నట్టె ప్రాన్పడియుండి, రంత రాము నాశయంబు నెఱిఁగి
బదులు చెప్పమాని భరతుఁ డశ్రువులను, ధరణిఁ దడుపుచుండె దైన్య మొప్ప

చ. భరతుని మోముఁ గాంచి రఘువర్యుఁడు తాఁ గరుణాబ్ధియౌట సో
దరుఁ గనుచున్ మఱేమియును ధర్మముఁ దెల్పఁగఁ జాలకుండె; న
త్తరుణమునందు వారిముఖతామరసంబులు వింతగాఁ దగన్
బరిసరవర్తులైన మునివల్లభులుం గడునార్తి మున్గుచున్. 433

చ. ఎవరిని ధర్మమార్గమున కిద్ది హితంబగు నెట్టులంచు, శా
స్త్రవిహితమిద్ది దీనిఁ గొనరాదె యటంచును హెచ్చరింపఁగా
వివరణరీతిఁ దెల్పఁ బది వేలవిధంబుల నెంచి చూడఁగా
నెవరికి నేనశక్యమగు నెంచుచు మౌనము దాల్చియుండఁగన్. 434

క. జాబాలి యనెడు మునిపతి, తాఁ బంతము పూని వేగ దాశరథి నదె
ట్లేఁ బురికి మరల్పందగు, నో బలు నీతులను దెల్పు నుద్యమ మెట్లో. 435

క. అని తలఁచి వేదముల శా, స్త్రనిచయముం దూలనాడి తగు మార్గ మిదే
యని తెలిపి చిత్తమతిమృదు, తను గాంచఁగఁ జేయఁ బూని తగ నిట్లనియెన్.

### జాబాలి రామునకు ధర్మముల దెల్పుట.

క. జననీజనకులు జన్మం, బునకే హేతువులు గాని జ్ఞానముఁ దెలుపం
గన రహ్మాతః జ్ఞానప్రదుఁ, డనఁబడు నగ్గురుని పక్కె యగు గ్రహియింపన్.

చ. తనమది కెద్ది యోగ్యమని తప్పక తోఁచునొ యద్ది గైకొనం
గను దగు; దానిఁబట్టియె నికామశుభంబులు గల్గు; నింక నొ
క్కనిపలు కాలకింపఁ గొఱగాని ఫలంబులె కల్గుచుండుఁ గా
వున మతిమంతు లాత్మకును బోలినయట్లె చరింత్రు రాఘవా! 438

చ. శ్రుతితతు లర్థవాదములె సుమ్ము రఘూద్వహా! న్యాయ మెద్ది నీ
మతిఁ బొడకట్టు దానినె సమస్తవిధంబుల భద్రమంచు న
మ్మి తగఁ జరింపు తండ్రికగు మేలని నీ విడుమల్ మహాటవీ
స్థితి గుడువంగఁ జన్నె సుఖసిద్ధినిమానుట యెన్న న్యాయ్యమే? 439

చ. తనువిది ధర్మసాధనని దాన మటంచు వచింత్రు కొందఱా
ప్తవచనంబె యయ్యదగు బాలిశులే యటుపల్కుచుందు; రే
లన నలసత్వమూనియె పరార్థములం గొనువాంఛఁ జేసి య
ట్లనృతము లాడుచుందు, రదియర్హముగాఁ గొనరా దదెప్పుడున్. 440

చ. కలుగును ముందు జన్మమునఁ గర్మసుఖంబులటంచుఁ బల్కుదు
ష్టులపలుకుల్ గణించుచుఁ గసుం బొడకట్టెడు నాత్మశర్మముల్
వలయునటంచు మానుకొనువారలె యజ్ఞులు; వారియట్ల ని
ర్మలగుణరాశినీవు రఘురామ! సుఖంబును బాయు టర్హమే? 441

క. తొలిజని కర్మఫలంబులు, కలుగుట నిక్కం బదెట్టిగతిఁ బూన్కిమెయిం
దలపోసినఁ బొడకట్టదు, ఖలులాడెడుపల్కులఁ గొనఁ గలుగునె సుఖముల్?

తే. కరతలామలకంబుగా ధరణి నీకుఁ, దక్కియుండఁగ దానిని దండ్రిమాట
మీఱ రాదనునజ్ఞత మించ వదలి, వచ్చుటిదియేమి వెట్టియో వసుమతీశ!

ఆ. అప్పుచేసియైన నాజ్యంబు ద్రాగుమం, చార్యులండ్రు; మరల నవనిఁ బుట్టి
చెడుఫలములఁ గుడువఁజెల్లునా యనుభీతి, వదలవయ్య! యద్ది వట్టిదగుట.

క. మంచితనంబున మనఁగా, మంచిఫలంబులె లభించు మానినఁ జెడుగా
నెంచిన నిదియే సారం, బంచుం దలపోయవయ్య! యవనీనాథా! 445

సీ. మహిని బ్రత్యక్షప్రమాణంబె యంగీకరింపఁగాఁ దగు; నదె శ్రీకరంబు
బుద్ధికిం దోఁచినపోలిక వర్తింప, నర్హమెట్లగునద్ది యఖిలజనుల
కొకరీతినుండక యొక్కొక్కరికి నొక్కవిధముగాఁ దోఁచుట విశ్వసింపఁ
దగకయె యుండు నీతనువునఁ జేసిన, మంచియో చెడుగో యమ్మఱుసటిజనిఁ
తే. గలుగునంచు వచించువారలకు దాని, తత్త్వమిసుమంతయే మఱి దాకియుండ
దనఁగఁ జెల్లును మఱుజన్మమనఁగఁ గలదె, విశ్వసింపఁగవచ్చు నేవిధమునది.

క. రామా! వినుమా చక్కఁగఁ, నామాటల నీకునెద్ది న్యాయ్యంబని యెం
తోమంచి దనుచుఁ దోఁచునొ, యామాడ్కి మెలంగవయ్య! యార్యహితమదే.

చ. శ్రుతులను నమ్మరా; దవియు సూరికృతంబులెగాని తామె యే
క్షితితలమందొ పుట్టి హితసిద్ధికి మార్గ మెవంచుఁ దెల్పునా
ధృతిగని యున్నవంచు మదినెంచుకయే స్మరియింపఁబోకు మ
ప్రతిమమనీషఁ దోఁచినటు రామనృపాలక! సంచరింపుమా. 448

చ. మరణము నొందువారలకు మంచిసుఖంబులు గల్గునట్టు లీ
ధరణి నొనర్చుదానములు దార్కొను టెట్లొకొ వారినంచు నీ
వరసినఁ దోఁచు రిత్తయని యవ్వి చనం దగుమార్గ మెందు నె
వ్వరు పనిఁబూని యేర్పఱుపఁ బొల్పడిరో వచియింపఁ జాలుదే. 449

ఉ. సోమరిపోతు లెల్ల నొకచొప్పునఁ గాలముఁ బుచ్చనెంచి యే
మేమొ వచించి రర్థవిధు లీయవి యంచు మతిప్రభావమ
న్నామమె లేని యయ్యు లవి న్యాయ్యములే యని నిశ్చయించి యెం
తేమహిఁ గీర్తిఁ గాంచ ధనమెల్ల వ్యయింతురు దానరూపతన్. 450

క. జననీజనకులఁ బేర్కొని, యొనరింతురు దానముల నోహో యని శరులె
ల్లను వినుతింపఁగ నాఫల, మనఘా! చని వారిఁ జేరునఁట చిత్రమిదొ. 451

క. ధనమార్జింపఁ దలంచిన, మనుజులలో మేటు లిన్ని మార్గంబులఁ జూ
పిన వారి మోసమెఱుఁగని, ఘనులట్టులె చేయుచుంద్రు గద శ్రీరామా! 452

తే. తండ్రి నన్నృతదోష మ్మదితగులకుండఁ, జేయనడవులలోన వసింప నీవు
తరలి వచ్చితి విదినీకు ధర్మమగునె, మృతున కన్నృతదోష మ్మెటులు మించి తగులు.

క. మృతినొందిన దేహిని నే, గతిఁ దండ్రియటంచు నెంచఁగా దగు రామా!
తతిఁ దనువుపడినయంత నె, చ్యుతిఁ గాంచును బంధుతయు నదొప్పునె మరలన్?

చ. నిను యువరాజుఁ జేయుటకు నిశ్చయ మొప్పఁగఁ జేసఁగాదె; నీ
జనకుఁడు దానిమానిన నసత్యభవంబగు దోష మబ్బదో
మును వరమిచ్చి మాన నఘముల్ గను దేహి యటందు రిప్పు డి
చ్చినపలుకెల్లఁ బొల్లయినఁ జేరదు దోస మదంట యొప్పునే. 455

క. ఏతనువున నెవి చేసిన, నాతనువె శుభాశుభంబు లగు ఫలముల నా
యాతఱులఁ బొందఁదగు వే, ఱొతను వవ్వానినొందు సన రాదనఘా! 456

తే. పాంచభౌతికదేహంబు పడినయంత, భూతపంచక మొయ్యనఁబోయి కలియుఁ
దమ్ముఁ గావునఁ గష్టసుఖమ్ము లెట్లు, పడయు నయ్యవి కర్మానుభవముకొఱకు?

క. మరలంగ వానికూడిక, పరఁగుఁ వేఱొక్కరీతి బంధుత్వం బె
క్కరణిఁ వానికిఁ బూర్వపు, వరుసఁ యోజింపవలదె వానికలయికన్. 458

సీ. కర్మమనాదిగా గడియింపఁబడుచుండుఁ, బ్రాజ్ఞులమనుకొను వారిచేత
నాదియే లేకున్న నదియుండు టెట్లొకో, దానికి లోఁబడరాని దెద్ది
లేకుండు దాని నిర్లిప్తులు దాఁటుదు, రందురు గాని యయ్యదియు యుక్తి
సాధ్యమే కానిదా శాస్త్ర మొక్కటియె ప్ర,మాణమంచును బుద్ధిమంతులెల్ల
తే. దానిమీఱఁగ రాదంచుఁ దలఁతు రలసు, లెద్ది యుక్తి కసాధ్యమై యొసఁగు నద్ది
వదలవలయును గాని విశ్వాసపాత్ర, ముగను గ్రహియింప రాదని తగు నెఱుంగ.

క. సరసోక్తులఁ దెల్పఁగ నె, వ్వరు శక్తులుగారో యట్టివారలె శాస్త్రో
క్తక్రమముల నమ్ముదు రయ్యవి; సరిగావని తోఁచియున్న క్ష్మాపాలమణీ! 460

క. ఇన్నింటిని యోజింపుము, మన్నింపుము యుక్తి కెద్దిమంచిది యో దా
నిన్నియతిమీఱఁ గైకొను, మున్నతి గాంచెదవు దాన నోశ్రీరామా! 461

క. భగవంతుఁ డొసఁగు సర్వము, తగునట్టులు కర్మమునకుఁ దగినట్టులె యం
చొగిఁ బల్కుచుంద్రు కొందఱు, పగవారలె వారు వృద్ధిపథమున కరయన్.

సీ. సర్వేశ్వరుఁడు కృపాసాగరుఁడునగు నా, భగవంతుఁ డెల్లరఁ బాలనంబు
చేయఁగాఁ దగుఁగాని చేడ్పడఁ గొందఱ, సిరితులతూఁగుచుఁ బరమసుఖము
లనుభవింపఁగఁ గొందఱను జేయ నేటికో, కర్మానుసారముగా నొనర్చు
నేని యాతని దేమియున్నది కరుణైక, ఫలమిందుఁ; గర్మమే ఫలదమేని
తే. యీశ్వరునితోడి పనియేమి యెవరు చేసి, కొనినదానికి ఫలముగా ననుపమాన
శర్మమో దుర్భరంపుఁ గష్టనికరంబొ, కలుగు నేనస్వతంత్రుఁ డొక్కఁడుగలుగునె.

క. ఈవిషయంబుల తత్త్వము, భావించిన నొకటికొకటి బంధుత్వంబే
యేవరుస లేకయుండుం, గావునఁ జర్చింపవలనుగా దనిరి బుధుల్. 464

ఆ. ఎవ్వరైన నిద్ది యెటులని ప్రశ్నింప, గా ననాదికర్మమా నటంచు
నదియతీంద్రియజ్ఞు లైనట్టివారల, కెఱుకపడునటంచు నేమొ పలికి. 465

ఆ. నోరు తెఱచి యార్చి గాపవ మెడలంగఁ, బలికి పలికి సుంత తెలియకుండ
ముఖపిధానకర్మమునఁ దమకున్నట్టి, శక్తిఁ జూపుచుంద్రు శఠులు ధరణి. 466

ఉ. వారలపల్కులెల్లను నిబద్ధిగ నుండునటంచు నెన్నుచున్
ధీరహితుల్ తరింతుమని తృప్తిగ నట్టులె యాచరింతు; రో
శ్రీరఘురామ! ధర్మమయచిత్తుఁడ వీయువి నీ వెఱుంగవె
ధారణిభారముం గొని ముదంబునఁ బ్రోవుము మానవావళిన్. 467

క. పినతల్లిమాటలం గొని, వనముల సాధ్వీమతల్లి వనటం గుందం
గను దమ్ముండు శ్రమంపడ, జననియు నలదనఁగ నేల చరియింప విభూ! 468

క. సమయోచితముగ సూనృత, మమరున్ సత్యేతరముగ నస్నృతముతగు స
త్యముగా దీని నెఱింగియు, క్షమ నేలుదు రవనిపతులు శౌర్యస్ఫూర్తిన్.

చ. జనసముదాయధర్మములు క్షత్రియధర్మము లోకరీతిగాఁ
గనుఁగొన రావు వెలుగన కిప్పుడుఁ గేవల సత్యయుక్తవ
ర్తనము నృపాలయోగ్య మనరాదు; స్మృతుల్ వచియింప నిట్టులే
మనమున నూహ చేసిన క్షమాధవ! యట్టులె తోఁచెదుం గదున్. 470

సీ. తమగుట్టు శత్రుభూధవులకు సుంతయుఁ, దెలియంగరానియట్టులుగ నునుపఁ
దగుఁగదా నృపులకు దానివచించినఁ, గార్యముల్ చెడుచుండుఁ గదనమందుఁ

ప్రాణిహింసయె ధర్తవర్తన మగుఁగాదె, యదిపాప మనవచ్చునయ్య! యితరు
లకుఁబోలెఁ గావున నెకద రాద్ధర్మంబు, లితరులకుం దగు నెట్టులంచుఁ
తే. దెలుపుచున్నాఁడ రాజేంద్ర! తెలియవాక్కు, నీనితత్త్వమ దెల్ల నీవిధము జ్ఞాని
గమ్యమే గాని పామరకాండమునకుఁ, దెలియరానిదియే సుమ్ము పలుకు లేల.

మ. చనుదెమ్మా రఘువర్య! రాజ్యరమ నీచక్కిన్ మెలంగన్ మనం
బున వాంఛించెడు నామెకోరికను సంపూర్ణంబు గావింప నీ
కొనుటే యుక్తముగాదె; పౌరతతికోర్కుల్ మీఱ నీరాక నే
యనిశంబున్ గురుభాగ్యమంచుఁ దలపోయన్ వారిఁ గావంగదే. 472

క. నీమేలే తనమేలుగ, నీమంబునఁ గోరుపౌరనికరంబు నిఁకం
బ్రేమభరంబునఁ గావన్, భూమీశా! రాఁగదయ్య పూర్వరమునకున్. 473

క. పురలక్ష్మి నీవియోగము, భరియింపంజాల కార్తిఁబడలెడు దానిన్
వరియించి కావఁగాఁదగు, సరగున దయచేయవయ్య సర్వజ్ఞ! విభూ! 474

క. మనవియిది నాదు కార్యం,బును ఫలియింపంగఁ జేయుపూనికఁ గాదో?
మనుజేంద్ర! సర్వహితమును, ననుజాతహితంబుఁ గోరి యని యెన్నఁదగున్.

క. శ్రుతులం బరిశీలించితి, స్మృతులన్ బలుసార్లు త్రిప్పి యెదిసారం బీ
క్షితిపులకు నంచు మది నెం,చితి దానినె తెల్పినాఁడ శ్రీరఘురామా! 476

ఉ. నావచియించుధర్మములు నైజము బుద్ధిని జక్కనెంచి నీ
వేవిధి సంచరింపఁ బరమార్థము చేకురు నట్టిమార్గమే
నీవిపు డూను; మీసహజునిం గృపఁ జూడుము; బాలిశోక్తిసం
భావన చేయఁబూనకుము భాస్కరగోత్రమహాబ్ధిచంద్రమా! 477

## శ్రీరాముఁడు జాబాలికి నుత్తరంబిచ్చుట.

చ. అని తను హెచ్చరింప వినియతులనుండి రుడగ్నికీల లో
క్కనిముసమేని యంతరము గానఁగ రానటు వెల్వడంగ న
మ్ముని నభిమానవంతునిగ బుద్ధి నెఱింగి యశాస్త్రయుక్తరీ
తిని వచియించి మౌనితకుఁ దీరనియంకముఁ గూర్చె నక్కటా! 478

క. క్షమియించు టొప్ప దీవచ,నములకుఁ బ్రాచితము నేఁత న్యాయ్యంబని సుం
తమదిని దలంచి యిట్లని,యె మునీ! చార్వాకునట్టులె పల్కితిటన్. 479

చ. ధరణిసురుండవయ్యు నతిదాంతుఁడవై తపమొప్పఁ జేసి యీ
శ్వరుకరుణం గనంగ బహుశుభంగులఁ గోరుచునుండియున్ నిరం
తరము శ్రుతిప్రయుక్తఫలదానచణామల కర్మజాల మా
దరణము మీఱఁ జేసియును ధర్మవిదుండవునయ్యు నీగతిన్. 480

చ. శ్రుతులకు వేఱుప్రువ్వగను రూఢములై తగు ధర్మశాస్త్రసం
తతులకు నాశనంబుగను దక్షులకెల్లను విన్నయంతసం

తతగురుతాపదంబుగను నాకు మహార్తికరంబుగా వినన్
హితమును గాకయున్నయటు లిప్పగిదిన్ వచియింపఁ జెల్లునే? 481

ఆ. జ్ఞానహీను లైన మానవులకు నీదు, పలుకు లెన్న దుష్టపథముఁ జూపఁ
జాలియున్న విద్ధసన్మునీ! పలుకంగఁ, దగునె చెడదె దీనధర్మ మెల్ల? 482

క. తనకుం దోఁచినయట్టులె, మనుజుఁడు వర్తింప మేలు మానక కలుగున్
జననీజనకుల పల్కులు, విన నేటి కటంచు నీవు వివరించితివే. 483

క. లోకజ్ఞానము వీడిన, శ్రీకరములుఁనగుచు శాస్త్రసిద్ధములును నై
ప్రాకటధర్మపథంబులు, నేకగణిం గనిచను ఫలియింపవు మౌనీ! 484

సీ. అదియెట్టులన్న చో నజ్ఞులముందటఁ, దెలుపఁగాఁదగు ధర్మము లొకకొన్ని
మఱొకకొన్ని వచింపమానుట మేలగు, బుద్ధిభేదము గల్గుఁబోల్కిఁ బలుక
రాదనుటే సుకారణము దానికినని, నరయంగవలదె నీవన్నయట్లు
సంచరించిన గురుచ్ఛాత్రభేదము పితృ,తనయవిభేదము దారభర్తృ
తే. భేద మడుగంటు; దాన లభింప దొక్క, లాభ మెవ్వారికైన నిలాతలమునఁ
బెద్దయని పిన్నయనియెడు భేద మొదవ, దేని సాగదు లోక మింతేని మౌని!

ఆ. తనకు నెట్లుతోఁచుఁ దా నట్లువర్తింప, మేలుగలుగునయ్య యేల యిట్లు
పలికినాఁడ వనుచు భావించుచున్నాఁడఁ, జెడదె లోక మట్టిచేఁతవలన. 486

క. వేదస్మృతిశాస్త్రగణం, బేది హితంబంచుఁ దెలుపు నిది యదె యనుచుం
దాఁ దెలిసికొనుటకే మది, నాదైవం బిచ్చె నంచు నరయందగదే? 487

క. కామాద్యుపహతమగుచున్, ధీమహిమము మాఱుచుంటఁ దెలిసియు నదియే
మేమితలంపులఁ జనునో, యామాడ్కిన్ వర్తిలంగ నగు నంటిగదే. 488

క. సితవస్త్రము పీతంబుగ, నితరులకుం దోఁపకున్న దృగ్దోషముసం
గతిఁ దోఁచు నట్టినేత్ర, ద్వితయము గనునట్టి దెట్టితెఱఁగున నిజమా? 489

తే. కలరు ప్రత్యక్షవాదులు కాని వారు, ప్రత్యగాత్మ నెఱుంగ నేరరు మునీంద్ర!
యాగమానుమానములు ప్రత్యక్షమట్లె,తగినయుపపత్తియును నాల్గుధర్మ మెఱుఁగ.

తే. అర్హములయిన త్రోవలౌ ననిరి పెద్ద, లందు మూఁడవదే చాలు నఖిలమునకు
ననుచుఁబల్కితి విదితగుణనయ్య! నీకు, ధర్మవిదులెందు నిద్దానిఁదగు ననుదురె.

క. ఇలపై నాస్తికు లనువారలె ప్రత్యక్షమె ప్రమాణరాజిఁ బ్రథమమై
చెలఁగెడు నయ్యది యొక్కఁడె, ఫలదంబని పల్కుచుంద్రు బాలిశు లగుటన్.

సీ. కర్మ మప్రతిహతగతిఁ బర్వు లిడుచుండ, సర్వసాక్షిగ మహేశ్వరుఁడు వెలయఁ
బరవశుండయి యెట్లు నరుఁడు ప్రత్యక్ష ప్ర,మాణంబుకొలఁది తేమమును గాంచు

స్థిరబుద్ధి యివ్విధిఁ జేకూరుఁ గర్మోప, హతుఁడౌట నతనికె ట్లమరు సుఖము
శాస్త్రపద్ధతిమాని జనుఁ డదేకర్మము, నాచరించిన ఫలమబ్బ దనుట
తే. సత్యమేసుమ్ము; దీని నేసరణిఁ గాద,నంగ వచ్చును? బ్రహ్మర్షినాథు లెల్ల
వినఁగఁ దోఁచినయట్లుగ జనునె పలుకఁ, బాపభయమైననుండంగవలదె చెప్పుమ

మ. పరదేశంబున నొక్కనాఁడు క్షుధ త న్బాధింప నన్నంబ దె
వ్వరుసం జిక్కకయుండఁ బ్రాగ్జని నదేవ్వాఁ డాఁకటన్ వేఁడ నా
దరణంబొప్పఁగ రమ్ము నాయన! యిదే తత్క్రాన్న మీసుంతయే
దొరకెం గైకొను మంచుఁ బెట్టని మహాధూర్తుండనౌ నా కిటన్. 494

ఆ. అన్న మెట్లు దొరకు నప్పుడు పెట్టినఁ, గాదె యిపుడు కలుగుఁగా యని తన
యంత తానె తోఁచు నదియె పూర్వజ్ఞాన, మొకరు చెప్పకున్న నుద్యమమున.

క. దానికిఁ బ్రత్యక్షంబనఁ,గా నెగడు ప్రమాణరీతిగా వర్తిలినన్
గానంబడు మే లంటివి, మౌనీ! న్యాయ్యంబె యట్టిమాటలు పలుకన్. 496

సీ. నయనంబులకును గానఁబడనియాత్మత్త్వ, మీవాదమున నిల్వదెట్టు లరయఁ
గనుక నాస్తికవాద మనవలయుంగాదె, నౌర్ధ్వదైహికమను నట్టికర్మ
మందుఁ జేయంబడు నాదానములఫల, మందున్న దేహి కెట్లంటు ననుచుఁ
బ్రశ్న మొనర్చితి; బాలిశుల్ నమ్మంగ, జాబాలిమునివర్య! సాధుజనులు
తే. చింతనొందుదు రిద్దానిఁ జెప్పినంతఁ,గర్మఫలముల నెటు దేహి కాంచునో యను
సందియం బెటు నీదగు స్వాంతమునకుఁ, గలిగెనో చింత నామది నెలకొనియెడు.

చ. అలరెడుఁ దంతువొక్కటి యహార్య మదౌ నెవనిం గుణించి యీ
యిలపయి నెట్టికర్మముల నెవ్వరు చేసినఁ దత్ఫలంబులన్
జెలఁగెడు దైవశక్తి గొని చేర్చును వారల; నట్టులౌట మ
ర్త్యులకును దైత్యవైరులకు నొప్పెడుఁ జుట్టఱికంబు దట్టమై 498
క. ఘనములు ధ్వనించినంత న,వనిఁ బొడము శిలీంధ్రము లనుబంధ మదెట్లో
కనుఁగొనఁగలవే? మౌనీ!, వినిపింపుము తెలిసియున్న విందుం బ్రీతిన్. 499

చ. సరసిజమిత్రుఁ డస్తమయశైలము దాపున కేగనంతనే
సరసిజముల్ ముడుంగు వికచత్వమునొందును గల్వ లివ్విధిన్
వరుసఁగ రాఁగఁ గారణము బ్రహ్మమునీ! తెలియంగనోపుదే
పురుషుల కెట్టులేఁ దెలియఁబోలనికారణ మొండుతక్కఁగన్. 500

క. ఆరీతిఁ గర్మఫలములు, నేరికిఁగనఁబడనిత్రోవ నేగి పొలయు నా
పూరుషు నటంచు నెన్నుము, ధారణిదివిజేంద్ర! సత్పథం బిదె సుమ్మీ 501
క. పామరులు గాఢభక్తిన్, నేమంబున నిష్టదైవనిచయము గొల్వన్
గామితములు ఫలియించుట, నీమదికిం దోఁపదొక్కొ? నిజముఁ దెలుపుమా.

తే. ఇట్టియుపదేశముల వారి నెల్ల నాస్తికులను జేయంగఁబూనికఁ గొంటి వీవు
శాస్త్రవేత్తవునయ్యు నీచందమూనఁ, జెడదె లోకంబు మఱియు నేఁ జెప్ప నేల?.

తే. వేదమార్గంబు మఱి శాస్త్రవిహితపథము, నీదుమార్గంబుచే నతినీచములుగఁ
జేయఁబడియెను గావున శిష్టులెల్ల, దూఱుకుందురె నిను మౌని! తోఁచినట్లు.

ఉ. ఎన్నఁడుగాని శాస్త్రహిత మిద్దియటంచు వచించు టొప్పు; నే
మున్నది శాస్త్రమందు నెటు లూహాలుసాగునొ యట్టు లేగ వి
ద్వన్నుతమౌ నటంచు నెద భావనచేయఁగరాదు మానవుం
డన్నఁ బ్రచంచలాత్మకుఁడె యాఁటను మూఢుఁడె కృత్యమెన్నఁగన్. 505

చ. పురుషుఁడు శాస్త్రపద్ధతులఁ బోల నెఱింగియె యందు నెంత తా
జరపుకొనంగ శక్తుఁడగు స్వాంతమునం దది యూహచేత నే
యరసి యొనర్చుటొప్పు నిది యౌను సమంచితమార్గమంచు భూ
సురమునివర్య! నీమదిని సూనృతమంచును నిశ్చయింపుమా. 506

శా. ముం దెన్నండును బల్క నిట్టులని సంభూతప్రమోదంబు సొం
పొందంగా శపథంబు చేయు మఘముల్ పోవుం జుమీ! మౌనిరా
డ్బృందంబుల్ ముదమందు నీశ్వరుఁడు హృద్వీథిం బ్రమోదించు దా
నం దప్పుల్ మఱిచేయ నూల్కొనెఁడు స్వాంతం బంతయుం మాఱెడున్. 507

చ. మునివర! యొక్కమాట వినఁబోలును నీకుఁ బరాత్పరుండు నా
వినుతిని గాంచునట్టిఁడగు విశ్వవిభుండును శాస్త్రబద్ధవ
ర్తనమునఁ గాలముం గడపుఁ దాను స్వతంత్రుఁడ నంచుఁ దోఁచురీ
తిని జరియింప నూల్కొనఁడు ధీమహిమంబున మించియుండియున్. 508

తే. తన ప్రవృత్తినిఁ గాంచి యితరులుగూడ, శాస్త్రవిధుల నుల్లంఘింపఁ జాలియుందు
రనుచుఁ గావున నీవంటియతఁడ దెట్టు, లిచ్చకొలఁదిని వర్తింపవచ్చుఁ జెపుమ.

క. మును లే శాస్త్రము మీఱిన, జనులెల్లను మీఱకుండఁ జరియింతురె దా
నను లోకవృత్తమెల్లను, గనదొక్కో మార్పు శుభము కల్గునె దానన్? 510

జాబాలి శ్రీరామునితో విన్నపంబు సేయుట.

చ. అప్రియమౌఱ శాస్త్రహిత మౌ విధమొప్పఁగ హెచ్చరింపఁగా
విని మునివర్యుఁ డెంతయును విస్మయమొంది వినీతియొప్పఁగా
ననఘ! మహాపరాధమున కాలయమైతిని జ్ఞానహీనుఁడం
చనఁదగు దూఱు నొందుటకు నర్హుఁడనైతిఁ గదే క్షమింపవే. 511

ఉ. శ్రీరఘువర్య! నిన్ను నభిషిక్తుని జేయఁగఁ గోరియే మునుల్
పౌరులు చింతనొంద మదిఁ బాటిలుదుఃఖము పెంపునం స్మృతి
స్ఫారవచస్తతిం దెగడి పల్కితిఁగాని శ్రుతిప్రజోక్తగం
భీరతరాశయంబులను వీడెడినై వలదంచుఁ బల్కఁజూ! 512

ఆ. శిష్టులైనవారు చెప్పినచొప్పున, వర్తిలంగ గురుశుభంబు లొదవు
నంచు నెఱుఁగుదును మహాప్రభూ! నీరాక, మదిని గోరి యిట్టి మాట లంటి.

మ. సతతంబున్ భవదంఘ్రిపంకజములన్ స్వాంతంబునన్ నిల్పి నీ
యతులామోదము నొందఁగోరి తప మేనత్యంతభక్తిన్ ఫలా
యతసక్తిన్ విడనాడి సల్పుదు సదాహర్షంబు నీసేవయే
మతి నన్వేఱుగ నెంచఁబోకుము కృపన్ మన్నింపు మో శ్రీపతీ! 514

సీ. చార్వాకమతము నీజనులకు బోధించు, నాదృతి గలవాఁడనంచుఁ దలఁప
కుండంగఁ బ్రార్థింతు నోపరాత్పర! కృపాశరధి! దాశరథి! నీచరణపంక
జములయాన నటంచు శపథంబు చేయుదుఁ,ద్వత్పాలనమున యోధ్యాపురంబు
వలచియున్న దటంచుఁ బలుకంగ నింతయే, సంకోచమును మాని స్వాంతమందుఁ
తే. గలుగు హర్షంబు పెంపునఁ బలికినాఁడ, సత్యధనుఁడవు సర్వవిశ్వప్రభుఁడవు
దేవదేవోత్తముఁడవు నీతీరుఁ దెలియ, శక్యమే యేరికైన నోసరసిజాక్ష! 515

మ. అని ప్రార్థించిన శ్రీరఘూద్వహుఁడు నెయ్యంబార వీక్షించి య
మ్మునిదౌనాశయ మాత్మ నెంచి నగరంబుం జేర్చి తన్ భూపుగా
నొనరింపం బనిపూని యట్టిదగునుద్యోగంబు గావించె నం
చనుమానం బొకయింతలే దనుచు భక్తాగ్రేసరుండం చొగిన్. 516

ఆ. నిశ్చయించి పలికె నీయాశయం బేను, నాత్మ నెఱిఁగినాఁడ నట్టులైనఁ
బామరులు వినంగఁ బాటిలుఁ గీడంచుఁ, దెలిసికొనియొ యిట్లు పలుకవలసె.

ఉ. ఇంచుక విద్యనేర్చి తమ కెల్లశ్రుతిస్మృతులందుఁ బాండితిన్
మించిన యట్లు పల్కుచు నమేయమతిప్రబలప్రశస్తినిం
గాంచినయట్లు ప్రేలుచు నికామయశంబును గాంచఁగోరున
వ్వంచకు లాడుమాటలను బల్కితివే యని చింత నొందితిన్. 518
తే. నాస్తికుఁడ వంచుఁ బామరనరులు తెల్విఁ,గనుదు రనునాశ నవ్విధిఁగా బలికితి;
నంతెకాని యెఱుంగనే యార్య! నీదు, చిత్తవృత్తివిశేషంబుఁ జెప్పనేల ?

మ. నినుగోపించితి నంచు నెంచకుము మౌనీ! నీమనీషన్ మునీం
ద్రనికాయంబు వినంగ నిట్లుపలుకన్ రాదంచు వైధేయులే
యనుమానంబును మాని యీపథమునన్ హర్షంబునం బోవ నూ
ల్కొనువా రంచుఁదలంచి కోపమును బల్కుల్ దెల్ప నీరీతిగన్. 520

ఆ. పలికినాఁడఁ గాని బ్రహ్మమౌనీ! నిన్నుఁ, దెగడఁదలచి కాదు తెలియుమిద్ది
సత్యమనుచు; మున్ను సత్యేతరముఁ జెప్ప, నింకఁ జెప్పఁబూన నిది నిజంబు.
ఉ. చెప్పినమాట తప్ప కటుచేయుట యాశ్రితరక్షణం బదే
ముప్పుపొసంగనున్న నొకపోలికఁ దా నడుపంగఁబూను టొ

క్కడప్పుడు నాచరిత్రమునఁ గానఁబడం దగునంచు నిశ్చితం
బెప్పుడొ చేసినాఁడను మునీంద్ర! యెఱుంగుము నాయుదంతమున్. 522

చ. జనకుని చెంతఁ బల్కినది సత్యహితంబుగఁ జేయు టొక్కఁడే
మనమునఁగల్గు వాంఛితము మౌనివరేణ్య! యదెంతకష్టమై
కనఁబడినం బొనర్తు నిది కాదిసుమంత యసత్య మిట్టులం
చును శపథంబు చేయుదును సూర్యశశాంకుల నాత్మ నెంచుచున్. 523

చ. పురుషుఁ డొనర్చుపాపగణముం గనుచుందురు సూర్యచంద్రులా
దరమున ధర్మముఖ్యులును దానినె కాంచుచునుందు రెవ్వరే
నరయఁగఁ జాలరంచుఁ దనయాత్మకుఁ దోఁచినయట్టు లేయఘో
త్కరములఁ జేయువాఁడు చిరకాలము నారకమందు నుండెడున్. 524

చ. పలుకులు పెక్కులేల నగుబాటగునట్లు చరింపఁబూనఁ గా
నలఁ బదునాలుగేండ్లు సుజనప్రియవృత్తిఁ జరించి ధూర్తులై
చెలఁగుసురారివీరులను జెండి మునీంద్రులు హర్షమంద మీ
రలుగకయుండ వచ్చెదను రాజ్యరమం గొనియేలుదున్ మునీ! 525

క. అనిపలికిన జాబాలియు, మనమలరఁగ నింక నెట్టిమాటలు పలుకన్
జనదని తృప్తింగని శ్రీశుని గాంచుచు నూరకుండెఁ జోద్యంపడుచున్. 526

వసిష్ఠముని శ్రీరామునకు ధర్మోపదేశము చేయుట.

ఉ. అంత వసిష్ఠమౌనిపతి యామిధిలేశ్వరపుత్రికావిభున్
జింతయొకింత లేని మృదుచిత్తుని గాంచి వచించె నిట్లు భూ
కాంతశిరోమణీ! దివిజకాంతమణీమకుటాగ్రభాగసం
క్రాంతపదాంబుజుండ వయి రాజిలు దైవమ వీవు కావునన్. 527

క. నీకొక్కరుండు తెల్పెడు, ప్రాకటధర్మం బదెట్టిభంగి వెదకినన్
లేకున్నదైన నిత్తఱి, నీకడఁ దెలుపందలఁచితిని గురుకృపాఢ్యా! 528

క. మునిపతి జాబాలికి నిచ్చినయుత్తరములను వినితిఁ జెందితిఁ బ్రమదం
బు నయిన నొక్కవిశేషంబునె తెల్పఁగ నిర్భయముగఁ బూనితి రామా! 529

క. కులగురువన్న సమాఖ్యం, గలిగించినవారు దేవకల్పులు మీపూ
ర్వులు గానఁ గొన్ని వాక్యంబులఁ దెల్పక యూరకుండఁ బోలదు గాదే. 530

తే. కా వినిపింతు నాచారకాండవిధుల, ధర్మసూక్ష్ములఁ గొన్నిఁటిని సర్వధర్మవిదుఁడ
వయ్యు నాయెడఁగల్గు దయావిశేష, ముననె వినఁదగు శ్రీరఘుభూపవర్య!

శివపూజోపదేశము.

చ. పరమశివుండు నీకుఁ గనుపట్టును పాస్యుఁడుఁ గాఁగ నీవు శం
కరున కుపాస్యదేవతవుగాఁ గనుపట్టుదు విద్ది సజ్జనో

త్కరమున కల్గె యజ్ఞులకుఁ । దద్దయు మే లొనఁగూర్చునంచు మీ
రిరువురు నిర్ణయించుకొని । యే యొనరింతురు దానిపద్ధతిన్. 532

క. పరమేశ్వరుఁడేకద మీ, యిరువురుగాఁ బొడమె విశ్వ।హితమునకై భూ
వరతనయ! యొక్కతత్త్వమె, పరికింపఁగ నిర్వురుగఁ బ్ర।భవ మందెఁజుమీ!

చ. తెలివియె లేని యట్టికుమ।తివ్రజ మీవును శంకరుండు వే
ఱలఘుతరప్రభావమున । నారయ నీ వధికుండవంచు నే
ర్వలరఁగ నజ్ఞు లందురు మ।హాత్ముఁడు శూలియె మిన్నయంచు ని
ట్లలరుచుఁ గొంద ఱజ్ఞులు న।హంకృతిఁ బల్కుచునుంద్రు రాఘవా! 534

క. ఇరుతెగలకుఁ జేరినయీ, దురహంకృతి దూషితు లగు।ధూర్తులు వీరే
ధరణిం గలపామరులను, వరుసఁగ నిరయాంధువునను । బడఁద్రోతు రహో! 535

మ. నిను దూషించిన ఫాలలోచనుని దు।ర్నీతిప్రదుండంచు నే
యనుమానంబును లేకతిట్టినను బ్రా।యశ్చిత్తమే లేక యిం
తని చెప్పంగఁ దరంబుగాని యఘసం।తానంబు ప్రాప్తించునం
చును బోధించు శ్రుతిస్మృతివ్రజము లో।క్షోణీధవాగ్రాత్మజా! 536

ఉ. నీవన విష్ణుమూర్తివి వి।నింద్యచరిత్రులఁ ద్రుంప ధర్మముఁ
భావనపద్ధతిఁ నడుపఁ । బ్రాజ్ఞులనెల్ల బహూకరింపఁగా
నీవసుధఁ జనించితి వ।హీనపరాక్రమ! దేవసంఘసం
భావితదివ్యకీర్తిశశి।భాసమలంకృతదిక్కదంబకా. 537

ఉ. ఐనను మానుషాకృతి మ।హాధృతిఁ దాలిచి యర్హకృత్యముల్
పూని యొనర్పనున్న నినుఁ।బోలు మహాత్ముల కివ్వి కార్యసం
తానములంచుఁ దెల్పుట య।నర్హమె యైనను దెల్పువాఁడనో
సూనృతభాషణా! రిపువి।శోషణ! సజ్జనబృందపోషణా! 538

చ. సరసిజనేత్ర! యెవ్విధిని । సాధుఫలప్రదకర్మజాల మీ
వురుతరభక్తిఁ జేయుదువొ । యుర్విపయిఁ వసియించునెల్ల ర
క్కరణి నొనర్తు రట్లగుటఁ । గర్మము లయ్యవి యుండుటొప్పు నీ
నరులకు శ్రద్ధగల్గఁగ నొ।నర్పఁదగుంగద నీకు నెప్పుడున్. 539

చ. కలవుగదా యనేకవిధ।కర్మము లందును భక్తిఁజేయ స
త్ఫలము లొసంగుచుఁ దుద క।పారసుఖంబును గల్గఁజేయ ని
మ్ములఁదగి కష్టమే యిడక । పొల్చెడు శంకరపూజ యుత్తతిం
దెలిపెద దాన నెల్లరును । దృప్తిని గాంతురు శ్రీరఘూద్వహా! 540

చ. ప్రతిమను బూజచేయుటది । పామరలోకహితంబు; దానసు
న్నతఫల మబ్బు; దట్లగుట । నైజహితంబును గోరువారు త

త్రవ్వితిమల జోలి మానఁదగు రాఘవ! శంకరు లింగమూర్తిగాఁ
బ్రతిదిన మర్హరీతిగను భక్తిభరంబునఁ గొల్వ శ్రేయమౌ. 541

చ. తొలిదిన మేగి యేటిదరి ధూర్తపృథాకువిహీనవల్మికం
బులఁగని యందు రెండిటనొ మూఁడిటనోఁ గలమంజుమృత్తికన్
గలశజలంబుఁ జల్లి కొనఁగాఁదగు శంకరు నెమ్మనంబునం
దలఁచుచు దానిఁగొంట యుచితంబని యాగమముల్ వచించెడున్. 542

మ. ఇది నీపూజకు నర్హ మంచెఱిఁగియే యీశాన! యీవల్మికం
బుదరిం జేరితి మృత్తు దీనిఁగొనితిన్ భూతేశ్వరత్వంబునం
బొదలం జాలిననీదుకార్యమునకున్ బుట్టింపగా విఘ్నముల్
మదినేవారు తలంతు రీకృమితతిన్ మన్నించి కాపాడవే. 543

సీ. ఈమృత్తికంగొన నేభూతములకైన, హానిపుట్టిక యుండునట్లు చేయ
వలయు విశ్వేశ్వరా! భద్రదా! యనివేఁడి, మనలఁ బ్రోక్షించి నిర్మలజలముల
నింటికిం జనుదెంచి యింపైనచోట నా,మృత్తిక నునిచి తానిష్టకార్య
ములను దీరిచి వేఁగ భూతవిభున్ మది,స్మరియించుచున్ లేచి చక్కఁ గాల్య
తే. కృత్యములఁదీర్చి ప్రాదినికేగ సలిల,ములకు నెదురుగ నాభియుముసుఁగునట్లు
నిలిచి సంకల్పపూర్వకనియతి స్నాన, మాచరింపంగఁదగు సమయమ్మునందె.

ఉ. నీరమునుండి ధూమమది నింగికిఁ బోవుచునుండు బాష్పమే
యారయఁ దెల్లవాఱునపు డాసలిలంబులనుండియే జవం
బారఁగఁ బోవు నింగి కదె యాసమయంబు జలంబులాడఁగా
సారము దేహమందు జలసంగతిఁ గల్గు నటండ్రు కోవిదుల్ 545

తే. సకలరోగంబులం బాపఁజాలునప్డు,స్నానముం జేయ నయ్యది మానసమున
గల్గుచింతలు పోవుట ఘనమె దాన; శ్రీరఘూద్వహా! సద్భక్తచిత్తగేహా!

శా. అంగవ్రాతముగల్గునట్లు దివిజౌఘారాధ్యు భావించుచున్
సాంగంబై తగునట్టు లర్చనల భక్త్యావేశ మొప్పార శ్రీ
సంగత్యుత్తమకంఠునిం దనుప నంచద్భూరిలాభోత్కరం
బుం గాంచంగ నగర్హుఁ డెన్నివిధులన్ బూన్కిన్ విచారించినన్. 547

క. లింగాకృతి నారాధింప,సం గల్గుమహార్హములగుఫలములు మోక్షం
బుం గల్గించు మఱియు నది, సంగతసత్యాభిరామ! శాత్రవభీమా! 548

సీ. వామలూరూద్భవశుభవ్యమృత్తిక చేత, శివలింగ మొనరించి చెలఁగుభక్తి
సవిధి నారాధింప సకలసత్ఫలములు, లభియించుఁ గష్టంబులం దొలంగి
శర్మముగల్గును జంవనంబున లింగ, మొనరించి పూజింప వినుత యశము
దిక్కులవ్యాపింపఁ దేజరిల్లు నతండు; గోమయంబునఁ గాలకూటకలిత

తే. గళుని నట్టులె పూజింపఁ గలుగు శత్రు, సంహరణరూపశర్మము స్వర్ణలింగ
ముగను శంకరు నర్చింపఁ బొసఁగు సుదనము, మెఱయు దేహంబులభియించుఁ గమిహిర తేజ!

క. గంధమ్మున గోరోచన,ముం దగులం జేసి లింగమును బూజింపన్
సందేహమేల? సకలా,నందంబులు గల్గు దేవనాయకవినుతా! 550

తే. విమలవల్మీకమృత్తిక నమలచంద, నాంచితమ్ముగ నొనరించి యథవులింగ
ముగ నొనర్చి యారాధింపనగణితఫల,ములుతమంతన పొందుఁ బోకుకాలిక నేల?

క. శివలింగపూజనంబున, వివిధములౌ ఫలము లబ్బువిశ్వేశ్వర! మా
నవులకు దేవతలకు నీ, శివలింగారాధనంబు శివదముసుమ్మా!. 552

తే. క్షణికపూజ యటందు రీశంభుపూజ, కరతలంబున శంభులింగంబు నునిచి
భక్తిమీఱఁ దిలాక్షతల్ బైల్వదళము,లొగిని గొనివచ్చి పూజింపఁదగును విధిని.

సీ. సలిలాభిషేకంబు లలితగంధాద్యుప,చారముల్ శాస్త్రసరణి నడపి
తాత్కాలికమ్మునఁ దగినట్టి నైవేద్యంబు, సాగించి ప్రార్థించి జలములందుఁ
దల్లింగవరము సుద్వాసనాపూర్వక,ముగ నున్పదగు నిట్టి పూజయొక్క
గడియలో సాగించి కామారిఁ బ్రార్థించి, ధన్యుఁడ నే నంచుఁ దలఁపవలయు
తే. నిట్టు లనుదినమును జేయ నెల్లక్రతువు, లఖిలదానంబులును జేసినట్లియగును
సకల పాపనికృంతన క్షమము గాఁగఁ, బల్కుదురు దీనిఁ బరమపావనమతులిల.

చ. వనములకేగి యందు మనువత్సరముల్ నివసించు నీవు దీ
నిని దృఢభక్తిఁ జేయుము విశనిర్మలకీర్తియశంబు లబ్బు భీ
తిని గలిగించు దానవులు తీవ్రభవచ్ఛరపంక్తిఁ దూలి చ
య్యన జమునింటి కేగుదు రపార్యపరాక్రమ మొప్పు మీఱెడున్. 555

క. రామా! నీనామజపం, బేమఱక యొనర్చు నీశుఁ డీవు సతము త
న్నామజపం బొనరింతువు, ధీమహిమము పొంగ సన్నుతింపఁగ దివిజుల్. 556

క. మీరిర్వు రిట్లు చేయుట, యారయ భేదంబు సుంతయైనన్ మీకుం
జేరఁదటంచుఁ దెలుపన్, సారజ్ఞులు దీనిఁ దెలియఁజాలుదు రనఘా! 557

శా. హీనస్వాంతులు దీనితత్త్వమిది యంచే మాత్ర మూహింప కీ
శానుం డెక్కుఁడు చక్రి కంటె ననుచున్ సాంఘ్యంతోడన్యతన్
గానం జేయుచుఁ బల్కుచుందు రది నిక్కం బంచొగిన్ బాలిశుల్
శ్రీనాథున్ నినుఁ దూలనాడుదురు కించిద్జ్ఞత్వ మొప్పం గడున్. 558

చ. హరుఁడు మురారికంటెఁ గడునల్పుఁడు తత్పదసేవకుండు ని
ర్జరగణమందు నొక్కఁడని చాలఁగఁ బల్కుదు రట్టివారి నా
దరణము మీఱఁ గొల్చి సుదంబును గాంచఁగఁ గోరునల్పులా
వరుసనె శంకరుం దెగడఁ బొల్పడుచుందు రో రఘూత్తమా! 559

సీ. విను సగుణ బ్రహ్మమనఁగఁ గీర్తింగాంచు, సర్వాత్మ ప్రకృతివశతనుగనుటఁ
ద్రిగుణమయుం డగు శ్రీరామ! యాతని,దౌరజోగుణమె బ్రహ్మయనఁ బుట్టె
దత్సత్త్వగుణమె దైత్యద్వేషియననొప్పు, విష్ణువుగాఁ బుట్టి వెలసె నతని
దగుతమోగుణమె మహాదేవుఁడుగఁ బుట్టె, సర్గపాలనములు సంహరణము
ఆ. ననెడుపనులు సాగ నందఱుఁ దత్పర, బ్రహ్మగుణమయులుగఁ బరఁగుచుందు
రెవరి కార్యమద్ది యెద్దియో దానినే, చక్కఁ జేయుచుంద్రు నిక్క మిద్ది. 560

క. ఈమూఁడుకార్యములునున్, క్షేమమ్ము ప్రపంచమునకుఁ జేకుఱఁ జేయం
గా మాయయె నిర్మించెను, మీమూవుర నిద్ది నిజము మిత్రకులపతీ! 561

ఆ. ఒకరికార్య మింక నొకరు చేయఁగఁబూన, రన్నిపనులు చేయ నందఱరయ
దక్షులగుదు రనుచుఁ దలపోయఁ దగుఁగాన, భేదమిందు నెట్లు వెదకవచ్చు.

క. పాదచతుష్కవిభాసుర, మైదగు ధర్మంబు జగములందున్ నిల్పం
గాఁదలఁచి ప్రకృతి యధికృతు, లౌదమ్మున్ నిల్పెఁ జిత్తమం దారసియే. 563

ఆ. మూఁడు కార్యములివి పోడిమి సాగించు, చున్న యట్టి మీరలొకటియని
తలఁపఁజనును గాని తారతమ్యముగల, వారిగాఁ దలంప వచ్చునెట్లు? 564

సీ. ఈకార్యములయందు నెద్దియే లేకున్న, సాగుఁ బ్రపంచ మేచందమునను
దలఁప నల్పంబె దుత్తమ మెద్ది మధ్యమ, మెద్ది? యీయది నిశ్చయించు టెట్లు?
దానికి మేమంచుఁబూను వారెట్టింద్రు, కావలయును రఘుక్ష్మాపతీంద్ర!
తరమె యేరికి వీనితత్త్వ మ్మిదనుచుఁ దెల్పంగ మహామాయ ప్రబలశక్తి
ఆ. నిర్ణయింప నోపు; నేర రొరుల్ దీని, తత్త్వమెఱుఁగ సమతఁ దగుదు రీర
లనుచుఁ జెప్పవచ్చు నందు భేదముగనఁ,బడుట కల్లగాదె ప్రభువరేణ్య! 565

క. మీశక్తి యిట్టిదనుచున్, దాశరథీ! చెప్ప నుంతదర మెట్లుం గా
దాశరుల నడఁపఁ బుట్టితి, కేశవ! నీచరిత సురులుకీర్తింతు రజా! 566

చ. వనముల నుండువేళలను భర్గుని లింగమయాంగుఁ జేసి య
ర్చనలను దృప్తుఁ జేయు; మది చాలు మహాపద లాప, సంగరం
బున జయమల్లె కూర్పు, యశమ్ముం బొలుపొందఁగఁ జేర్పు, శౌర్యకీ
ర్తినిగలిగింప, రాక్షసులఁ దీర్పఁగ దాశరథీ! కృపానిధీ! 567

ఆ. సాధుగుణవిశేష "సర్వతఃపాతుశంకర" యటన్న సూక్తి క్షమ వెలయుట
నీవెఱుంగవాక్కొ! నీకుఁ దెల్పుట పరి, హాసపాత్రముగద యనియెతేఁగియు.

చ. కులపతి నన్నగర్వమునఁ గోర్కె యొసంగుట నిద్ది యిట్టులోఁ
దెలియుమటంచుఁ దెల్పితి సుధీగణసన్నుతిపాత్ర! నీవుశ్రీ
గళుని భజింప నెల్లరును గామహరున్ భజియింత్రు!; శంకరుం
దలయక నిన్ స్మరించుట జనాళికి భక్తిని నేర్పఁ గాదొకో. 569

చ. కరతలలింగపూజ స్మృతికాండనుతంబని కీర్తిగాంచు; దు
ర్భరరిపుతూలపావకము వాంఛలనీయఁగఁ గల్పభూరుహం
బురుతరపాపపుంజముల నొక్కటభస్మము చేయఁజాలు; శ్రీ
కరము నగుఁ రఘూద్వహా! యిఁకఁ బనిపూనుము నిర్వహింపఁగన్. 570

చ. ఇతరుల మేలుగోరుకృతియే సఫలంబని పెద్దలందు రీ
క్షితిపయి ధర్మసంస్థితిని జేకుఱఁ జేయఁగ నుద్భవించి తో
శతదళనేత్ర! సుంతయు నసాధ్యపుఁగార్యము లేకయున్న న
జ్ఞతతికి భక్తియోగమున శ్రద్ధ పొసంగఁగఁ జేయుమీ దయన్. 571

మ. నినులక్ష్యంబుగఁ జేసికొంచు మనుజుల్ నీవెట్లులింగార్చనం
బును భక్తింబొనరింతువో యటులు తాముంగూడఁ జేయంగ వాం
ఛను గాంతుర్గద! దానికేగద ధరన్ జన్మించు టో రామ! నీ
కును దెల్పందగు నట్టి దేదియును నాకుంగల్గునే శ్రీపతీ! 572

చ. కరతలపూజకంటెఁ గనఁగా నెదియైనను శ్రేష్ఠమంచు నె
వ్వరు వచియింపఁజాలరు; ధ్రువంబిది; విగ్రహపూజనంబు శం
కరుఁ బరితృప్తుఁజేయ నెటుగాని రవంతయుఁ జాల దోమహీ
వరపరిపూజితాంఘ్రియుగ! వాస్తవమీయదటం చెఱుంగవే? 573

సీ. నలువదిదినము లంధకరిపుఁ బూజింప, వాంఛితార్థములు జవమునఁబండు;
మాసత్రయింబు నుమామాధవు నర్చింప స్వర్గంబు కరతలసంగతమగు;
నాలుమాసములు మహాదేవు భజియింప, గంధర్వలోకంబు గాంచగల్గు;
సంవత్సరంబు శ్రీశంకరుఁ గొలువంగ, సత్యలోకము నివాసముగఁ దనరు;
తే. మఱి ప్రదోషములందు శ్రీమండితగళు, భక్తినారాధనముచేయఁబరమపదము
దొరకుఁజుమ్ము మహాదేవు కరుణచేత, శంభులింగార్చనఫల మీసరణి వెలయు.

క. అమరుఁజతుర్విధపురుషార్థము లీశివలింగపూజఁ దప్పక జరపన్
విమలాంతఃకరణా! నిత్యము దీనిం జేయవయ్య! యార్తులు మాయన్. 575

చ. మనుజుఁ డెవండు నోట నొకమాఱయినన్ శివ! చంద్రశేఖరా!
యని ప్రియమార భక్తితగ నార్తిహరుండగు భూతనాథునిన్
ఘనకరుణామహాంబునిధిఁ గామహరున్ స్మరియించినంత నా
తని కరుదే యభీష్టసముదాయము చేకుఱుటల్ మహాప్రభూ! 576

తే. తొలుతఁబంచాక్షరినిభక్తికలితుఁడగుచు, శక్తికొలఁదిజపించిశాస్త్రహితమొప్ప
నట్లు శివలింగమఱచేతియందు నునుచు,కొని సమర్పింపనగుశక్తికొలఁది రామ!

చ. ఫలములఁగోరి యివ్విధి నఖండతపఃఫలదానదక్షమై
వెలసెడు శైవపూజనము వింతఁగ జేయుదు రెల్లవారు; శ్రీ

కలితహృదంబుజాత! నృప। కాండశిరోమణి! రామచంద్ర ని
స్తులఫల మీశ్వరార్పణము। తోరపుభక్తి నొనర్చుపూనికన్. 578

క. హరినారాధింత్రు మునీ,శ్వరు లొకకొందఱు సతంబు। శాస్త్రవిహితమా
కరణిఁ వారల శివుఁడే, కరుణం గాపాడు జ్ఞాన। కలితులఁ జేయన్. 579

ఆ. విను ఫలాభిసంధి।విరహితంబుగఁ జేయు,పూజ కివియె సుఫల।ములగు ననుచుఁ
బల్కువాఁ డెవండు। పరమేశుఁ డొక్కండె, చెప్పఁగల్గు నేమొ। చిత్ర మిద్ది.

తే. ఇట్టిఫలములు గావలె। నిపుఁ డటంచు, దుష్టసంకల్పమును జేయ।శిష్టు లొప్ప
రద్దికామ్యం బటన్న యూ।హను ఫలాభి,సంధిరహిత మెశ్రేష్ఠమగు।సరణియెఱఁగి.

ఉ. కావున నీదుచిత్తమునఁ। గాంక్షయొకండును లేకయుండినన్
బావనమార్గ మిద్దియని। పామరరాజి కెఱుంగఁ జేయఁగా
నీవిపు డీవ్రతంబు విధి।నిర్మలరీతి నొనర్పఁ బూనుమా
యావృషభధ్వజుండు నిను।నట్టులె భావన చేయుచుండుఁ గా. 582

మ. నిను దూషించెడువారు భూతవిభునిన్। నిందించువారల్ దమం
తన పాపాంధువునందుఁ గూలుదురు స।త్యంబిద్ది మీయిర్వరం
దును భేదంబు గడించుపాపమతు లిం।దుల్ గాని యందైన భీ
తిని గల్గించుదుఃఖంతకష్టముల నం।ధీభూతులై కాంచుచున్. 583

క. ప్రతిదినము మున్ను చేసిన, వితముం దలపోసికొనుచు। వెతలఁగుడుతు రో
క్షితిపతిశేఖర! యీవిధి, హితమని బోధించినాఁడ। నింతగఁ గడఁకన్. 584

## వసిష్ఠముని రామునకుఁ ధర్మములం దెల్పుట.

క. అని మఱియు నిట్లు తెలిపెన్, మనువంశవిభూషణా! స।మస్త మెఱుఁగు నీ
శుని నిన్ను నెఱిఁగియుండియు, వినిపింపఁ దలంతు ధర్మ।వితతుల నహహా! 585

చ. చను వదియెట్టిదో త్రిదశ।సన్నుతుఁడౌ భగవంతు చెంత నే
ర్చినయటు తెల్పఁబూనుగతిఁ। జేయుచునున్నది రామచంద్ర! నీ
వనగమనం బగమ్య మెది।వాంఛితమో తెలియంగ నెట్టులో
ముని నగుటన్ వచింపఁగను। బూనినవాఁడ నెఱింగినట్లుగా. 586

తే. దండకారణ్యవాసులై। తప మొనర్చు, వాంఛలను బొల్చుమునులను।వరుసఁబట్టి
కొనుచుఁ గఠినంపుశిక్షల।నొనరుచు దను,జులను శిక్షింపఁ దగుఁదొలు।దొలుతరా

ఉ. దానవు లేగుదెంచి ననుఁ। దాఁకిన నుక్కడఁగింపవచ్చు నా [మ.
మానుల నార్తిముంతురను।మాటకునై వధియింపవచ్చు నే
మానవనాథ ధర్మముల। మాటదలంపక యంచు నందువో
మానసమం దెఱుంగుము క్ష।మాపతి దిక్పరిపాలకాంశుఁడౌ. 588

చ. ధరణిఁగలట్టిదుష్టసము।దాయముఁ జెండి విశిష్టశిష్టులన్
స్థిరసుఖయుక్తులై మనఁగఁ। జేయుట భూపతి ధర్మ మంచు శ్రీ

వర! స్మృతులెల్లఁ దెల్పెడిని వన్యమృగంబులఁ దీవ్రసాయకో
త్కరమునఁ జంపులెల్లఁ దముఁ దార్కొనుటంగద నాఁ దరంబొకో. 589

ఉ. పాప మడంప ధర్మమును బాదుకొనందగునట్లు నిల్పఁగా
భూపరిపాలకుండు తగుపోలిక యత్నముచేయు టొప్పు నా
కేపరిపంథి లేఁడనుచు నెన్ని సుఖంబున నుండఁ గూడునే
శ్రీపతి! యట్లుగాన వనిఁ జేరి దురాత్ములఁ జంపుమీ త్వరన్. 590

క. నీరాక యెప్పుడో యని, సారెకుసారెకును గర్మసంగతి దోఁపన్
గ్రూరాసురరూపంబులఁ, జేరిరి సుర లావనంబు శ్రీరఘురామా!. 591

క. శాపవశంబున భీకర,రూపంబులఁ గానఁబడుచు రూపింపంగా
నేపగిదిఁ దరముగాని మ, హాపురుషులు నిన్నుఁ జూచు నాదరణమునన్. 592

చ. నినుఁదలపోయుచున్ మదిని నిల్వక జ్ఞానము పోవుచుండఁగా
దనుజత కర్మ మాపనుల దారుణరీతి నొనర్చుచున్నవా
రనుపమతేజ! నీవు చని యాశరరూపుల దేవవర్యులం
గనుఁగొని శాపమోక్షము నికామకృపన్ వడి నిమ్ము వారికిన్. 593

ఉ. వారల దుష్టకర్మసమవాయమె శాపము నొందఁజేసె; నో
శ్రీరఘురామ! సాధుఫలసిద్ధిని గూర్పఁగ సాధుకర్మమే
కోరికమీఱ నిన్నుఁ బురికొల్పుచునున్నది దానికోర్కి నిం
పారఁగఁ దీర్పఁగాఁదగుదు వయ్యదియున్ భవదీయరూపమే. 594

ఉ. నీదగుశాసనంబె ధరణిం బొలుపారును గర్మరూపతన్
శ్రీదయితా! దదీయగతిఁ జెప్పఁగనేర రి దిట్టిదంచు నెం
తేఁ దపమొప్పఁజేసి యశ మెంతయుఁ గాంచిన మౌని వర్యులే
వాదములందుఁ గీర్తిగని వర్ధిలుపండితులే రవంతయున్. 595

ఉ. కానల నీవు వర్తిలుచుఁ గర్మగతుల్ పరికించి వారికిన్
దేన ననుత్తమంపుగతి తేటపడున్ వడి దానిఁగూర్చి నిన్
ధ్యానముచేయుమౌనులకు దర్శన మిచ్చుచు సంగరంబులన్
దానవవీరసంతతుల దర్పమడంగ నొనర్పుమా విభూ! 596

ఉ. రక్కసులందుఁ గొందఱు పరాక్రమమొప్పఁగఁ జూపఁజాల కే
యొక్కపుడెంతో మోసమున నోరఘుపుంగవ! నిన్ను గెల్వఁగాఁ
జెక్కరు యత్న మూనుదురు భీకరతావకశస్త్రరాజి త
మ్ముక్కఱఁజేయు నంచెఱుఁగ రున్మదవృత్తులుగాఁ జెలంగుటన్. 597

ఉ. వారలు చేయుయత్నములవంక జగంబున కప్డు హానిచే
కూరినయట్లు తోఁచినను క్షోణికి నవ్వలఁజాల మేలు క్షో

ణీరమణా! పోసంగు నని నిర్జరమౌనివరుల్ తలంతు ర
వ్వారికి మేలుఁగోరికద వర్షము దీనిని దాల్చి తీవిలన్. 598

ఉ. భూరిపతత్త్రిజాతియును భూరుహశాఖల సంచరించుచున్
సారభుజాబలంబున నొసంగుచు నిర్జరకార్య మన్న నె
వ్వారెని లెక్కసేయక యవార్యగతిం బఱతెంచి సాహ్య మిం
పారఁగఁజేయు కీశనివహంబును దోడగుఁజుమ్ము రాఘవా!. 599

చ. అతిబలవంతులయ్యు దురహంకృతిమైఁ జరియింతురేని దు
ర్మతులొగి నల్పజంతునికరంబులచేఁ బడువారలంచుస
న్మతులువచించు న్యాయము క్షమాస్థలిఁ దేటపడంగఁజేయఁగాఁ
బతగవలీముఖప్రతతి బాసటయై తగు నీకు రాఘవా!. 600

మ. బలవంతుండను నాకు నెవ్వ రిలసంపాతంబునం దుల్యులం
చెలమిం బొంగుచు దుర్మదాంధ్యమున నే యెవ్వారి లెక్కింప కా
ర్తుల ముంపం దలపోయు నాకు మతి యింద్రుండైనఁ గీడొందఁగాఁ
గలఁడంచుం దెలుపంగ నల్పబలుసఖ్యం బబ్బు నీ కోవిభూ!. 601

సీ. నీదర్శనార్థమే నిలిచియుండెడు పరి,పక్వజీవుల నెల్లఁ బరమపదము
నొందఁగాఁ జేయుచు సుగ్రాహవంబున; శతమఖునైన నిర్జితుని జేయఁ
జాలినదుష్టరాక్షసబృందమును మహా,ర్తంబున విబుధసంఘంబు లలర
వధియించి యచ్చటివనము నిష్కంటక,ముగ నుండఁజేయుచు మునిశతముఖు
తే. లొసఁగు కాన్కలఁ గైకొని యుగ్రకాన,నాంతరంబున వసియించియఖిలకష్ట
సుఖము లొక్కటియేయనుచున్ సమయము,జరపుమో రామ రాక్షససంఘభీమ!.

క. పరమేశ్వరు నెడఁబాయదు, పరమేశ్వరి యగ్ని వేఁడిభంగిన్ రఘుభూ
వర శేఖర! యొక్కొకతఱి, విరహము వారలకుఁగల్గువిధము కనఁబడున్. 603

క. అది లోకదృష్టికే యని, సదమలచిత్తులు తలంత్రు; సామాన్యుల క
య్యది సత్యమంచుఁ దోఁచును, గద? యియ్యదె యజ్ఞతతికిఁ గలలోపమిలన్.

ఆ. నీప్రవృత్తియందు నీరజాక్షా! యది, కలుగుచుండు ననుచుఁ దలఁపఁదగును
దానఁ జింతనొంది మానవుల్ నీవిష,యమునఁ జెప్పుకొందు రార్తు లగుచు.

క. నీరాకను లోపాము,ద్రారమణుఁడు మౌనివరుఁడు తత్పరమతియై
కోరుచునుండును దానిని, శ్రీరమణా! తీర్పవలయు సిద్ధిద మదియా. 606

క. తనదివ్యతపఃఫలముగ, ననిశము పూజించుచున్న యతిదృఢచాపం
బును దివ్యేషుధియుగళం,బును దత్ప్రార్థన గ్రహింపఁబోలు మహాత్మా!. 607

క. ఆకార్ముకవర్యమె నీ, దౌకార్యము ఫలయుతముగ నత్యుగ్రంబౌ
నాకృతిఁ గనఁబడు ననిమొనఁ, గాకుత్స్థా! చేయుఁజుమ్ము కడుఁ జిత్రముగన్.

మ. మునులున్ దేవతలున్ భవద్వ్రతము సమ్మోదంబునన్ సాగున
ట్లనుమానింపక తోడుసూపుటకు నత్యంతత్వరం బూనుచుం
గనుచున్నా రెపు డెప్పుడంచుఁ దగ నక్కాలంబు రానున్న దో
మనువంశాగ్రణి! దేవకార్యమిది యుష్మచ్ఛక్తిసాధ్యంబె యౌ. 609

మ. నిను సేవించెడివార లల్పులయినన్ నీపాదసంసేవచే
తనె యత్యద్భుతశక్తి మించి గురుభూతశ్రేణియం దెంతొ కీ
ర్తిని జెల్వారెదుదానినే మిగుల బంధింపంగ నేర్వెంతయుం
గనుచున్ బొల్తురు వారిమూలమున నెక్కం బొప్పు నీగాథయున్. 610

క. నీవవతరింతు వీధరఁ, బావనరవివంశమందు భద్రములెల్లన్
దేవతలకీయ నంచని కోవిదులెల్లరు తలంత్రు గోపతివినుతా! 611

క. వారలవాంఛలు పండఁగ, ఘోరాటవులన్ వసించి కుమతులు మునిహిం
సారతులునైన దానవ,వీరులఁ బొలియింపు లోకవితతి యలరఁగన. 612

ఉ. ఇంక వచింప నేల జగదీశుఁడవై పురుషోత్తమాఖ్యతన్
సంకటహర్తవై యఖిలసజ్జనరక్షకతం జెలంగుచున్
బింకమువీఱ ధర్మమును వీడినవారి నడంచుచున్ బ్రమో
దాంకముచే నెసంగు పరమాత్మ! హరీ! కరుణాంబుధీవిభూ!. 613

చ. అని పరమప్రమోదమున నాత్మను శ్రీరఘునాథు నెంచుచున్
మునిపతి మోదబాష్పకణపూర్ణితనేత్రసరోజయుగ్మఁడై
కనుఁగొన నద్భుతం బొదవఁగాఁ దగుతేజముతో వెలింగె;
మునిముఖపంకజం బపుడపూర్వముగాఁ గనుపట్టె నెంతయున్. 614

చ. వనముననుండు దేవతలు వైష్ణవతేజము రూపవంతమై
కనఁబడునట్టు లొప్పురఘుకాంతుని గాంచి సురేంద్రుకాప్య మిం
కను ఫలియించు నంచు నొడికంబునఁ దమ్ముని సాగనంపె తాఁ
జను గహనంబునన్ నిలువ క్ష్మాపతి యీతఁ డటంచు నెంచుచున్. 615

క. పరమామోదము నొందిరి, సురపతి యమ్మౌనివరుని సురుచిరవచనో
త్కరమును నుతియించుచు శ్రీ, వరునుత్తర మాలకింప వాంఛలు తగఁగన్.

క. బరుల కగోచరులై యుం,డిరి రాముఁడు భక్తిశ్రద్ధ నేసపు తగ నె
ల్లరువిన భావము చక్కఁగ, స్ఫురియింపకయుండఁ బల్కె సురలు నుతింపన్.

రాముఁడు వసిష్ఠునకు ప్రత్యుత్తరము చెప్పుట.

చ. కులగురువర్య! నీదుపలుకుల్ పరమార్థమనోహరంబులై
వెలసెడు వానిభావమును వీడఁడినాట నెఱుంగ నేర్తునే

తెలిసికొనంగఁ జాలుదురు దేవమునీంద్రులు మర్త్యనాశయం
బులఁ దగునాకుఁ దేటపడఁబోలునె యీయది మీరెఱుంగరే?. 618

చ. జనకులయాశయం బెదిరియొ చక్కఁగ దానిని జేయనెంచి యీ
వనముల కేగుదెంచితిని భావిశుభంబులు మీమహాశిషం
బున ఫలియింపఁగావలయుఁ బోయెద నింక మహాటవీస్థలం
బున నివసింపదుష్టులను బోర నడంచెద శక్తి పంపునన్. 619

చ. భరతుఁడు పట్టుపట్టి తనపాలిటి రాజ్యము నాకు నిచ్చునా
దరముననున్నవాఁడు తనధర్మ మెఱుంగఁడు మూర్ఖరీతి ని
బ్బరమునఁ గూరుచుండి తనపంతము చెల్లిన మోక్షలక్ష్మి చే
కురునని యెంచువాఁ డతనికూరిమి నన్నుఁ గలంచివైచెడున్. 620

మ. అదియే నాకిపుడున్నకిష్టములలో నాద్యమ్మై తగున్ దాని నే
ర్పొదవన్ మాన్పఁగఁ జేయు టెట్టులనియే యూహించుచున్నాఁడ నె
య్యదియో త్రోవ నెఱుంగఁ జేయుఁ డిపు డోయార్యా! యనంగా నిదే
యద నంచుం దలపోసి యాభరతుఁ డాత్యార్తిన్ సుడుల్ తొట్రిలన్. 621

భరతుఁ డడవులకు వత్తుననుట.

మ. పలికెన్ రామనృపాల! నిక్కమిది నాపల్కుల్ భవన్మానసం
బలరం జేయక చింతఁగూర్చునవియే నత్యంతభక్తిన్ ద్వదం
ఘ్రుల సేవించుచు నిన్నుఁగూడి తిరుగన్ గోరంగనున్నాఁడఁ గా
నల నాయీమనవిన్ గ్రహించి రఘుభూనాథా! ననుం గావవే. 622

మ మనపూర్వుల్ సచివాళి రాజ్యభరముల్ మర్యాదగా నేలున
ట్లునుపంజాలి తపోవనంబులకు నెంతో పూన్కిమైఁ బోవుటల్
వినమే నీపదసేవయే తపముగా వీరున్మహాసాధరం
జిని సంవాదము చేయువాఁడను మునిశ్రేణుల్ ముదంబందఁగన్. 623

ఉ. ఎండకు వానకోర్చి దనుజేంద్రులభీతిని గొల్పువారి ను
ద్దండపరాక్రమాఢ్యులను దారుణభూరిమృగాళిఁ గాంచుచున్
భండనభీమ! లక్ష్మణుఁడు భార్యను దల్లిని బాసి త్వద్యుతిన్
దండక కాననంబున ముదంబున నుండఁగ నేను నట్టులే. 624

చ. వదినెను నిన్నుఁగొల్చుచు నభంగురశక్తిని దావకాజ్ఞను
న్మదులగు రాక్షసాధముల మ్రందగఁ జేయుచు మౌనిరక్షణం
బెద ననిశంబుఁగోరుచుఁ ద్విజప్రీతకార్యము లెల్లఁ జేయుచుం
డెద ననుజన్మునట్లు నను నికడనుండ ననుగ్రహింపవే. 625

మ. కరుణానీరధి నీవు నిన్నుఁ గనుచున్ గానన్ వసింపంగ నా
దరముం గాంచెదు నామనం బొగి సుమిత్రాపుత్రుచందంబునన్

బరమాత్మా! నినుఁ గొల్చుచుండెదను నీ ప్రాపున్న నింకొక్కఁడే
వరమిమ్మా యని కోరఁ జుమ్ము పదివేల్ వచ్చుంగదా దాననే. 626

సీ. ఏకాంతసేవకే యేర్పడియున్నవి, కాననంబు లటంచు నేను దలఁచు
వాఁడ నో శ్రీరామ! భక్తుని గా నన్ను, నంగీకరించి యీ ప్రార్థనావి
శేషము దయ మెయిఁ జిత్తగింపు మటన్న, భరతునాశయమును స్వాంతమందుఁ
దలపోసి యాతని దైవంబును దలంచి, కరుణ మైకొనఁ బల్కె భరత! నీవు
తే. విద్య లెఱిఁగిన ప్రౌఢవు విమలభక్తి, సాంద్రుఁడవు కాన నామాట శాసనముగఁ
దలఁపఁదగు నింక వేఱొక పలుకుఁ బలుక, వలదు నాతోడు గా నని వలికె నిట్లు.

రాముఁడు భరతున కుపాసకధర్మములఁ దెల్పుట.

చ. వనముల నన్నుఁ గూడి మునివర్యులు మెచ్చఁ జరించుభాగ్య మీ
వొనరుప లేదటంచు మది నూహయొసంగెదుఁ గానఁ బత్తనం
బునకు జవంబునన్ సకలభూపతులం గొనిపొమ్ము; మంత్రులున్
జనులు నిన్నుఁ గూడి పురసత్తమముం గనవచ్చువారిఁకన్. 628

ఉ. పౌరులు పల్లెలందుఁ దగు భవ్యమనీషులు నాదునాజ్ఞ ని
న్నే రఘురాముఁ డంచు జపియించుచుఁ గొల్చెదువారు; నీవు నా
గౌరవరక్షణార్థ మటఁ గాపుర ముండుము; మానసంబునన్
గోరిన కాంక్షలెల్ల నొక కాంతకొఱంతయు లేక పండెడున్. 629

మ. నను సేవించుట యన్న నో భరత! కానన్ నిల్చి నాసంగతిం
గనుచున్ మూలఫలాదికంబుల నదే కాలంబునం గోరినం
దనివొందంగ నొసంగుచున్ గరుణ నొందం గోరుటల్ కాదు నె
మ్మనమందున్ సతతంబు నన్ గనుచు మన్మంత్రంబుఁ జింతించుటే. 630

మ. తలఁపన్ మంత్రజపంబు సిద్ధిదము మంత్రం బెంతొ భక్తిన్ మదం
ఘ్రుల సేవించిన నిత్తు మంచుఁ గడు ధూర్తుల్ పల్కువా; రట్టివా
క్కుల నమ్మందగ; దర్థలుబ్ధులయి కోర్కుల్ మీఱ రండంచు శి
ష్యుల నాసక్తిని బిల్చుచుందురు దాసుల్ వారె యర్థాళికిన్. 631

ఉ. వారలపొంతఁ బోక గురువర్యుల సాధుమనీషులన్ ముదం
బారఁగ శిష్యవాంఛితము లారసి తీర్పఁగఁ జాలి ద్రవ్యముం
గోరక భక్తిఁ బంపుగనఁ గూడునొ యేజతనంబుచేత స
ట్టారసి చేయుచున్ వెలయునట్టి మహాత్ముల నిష్కళంకులన్. 632

చ. వెదకి యభీష్టసిద్ధికయి వేఁడి తదుక్తపథంబునన్ ముదం
బొదవఁగ మంత్రముం గొనుచు నూనిన శ్రద్ధ జపించుచున్ వర
ప్రదమగు నర్థ మిద్దియని భావన చేయుచు మంత్రదేవతా
సదమలకల్పితాకృతిని స్వాంతసరోరుహమందుఁ జేర్చుచున్. 633

చ. మనసు విచంచలంబయిన మాడ్కిఁ జెలంగఁగ గాంచుచున్ జపిం
పనుజను; ధ్యాననిష్ఠ కడుం బాటిల నాజప మంతరాయముం
గనినను సిద్ధికిం గొఱంత కల్గదు; ధ్యానమె ముఖ్యమౌట న
ప్పనికి జపంబు సాధనము బాగుగ నౌనని శాస్త్ర ముండుటన్. 634

మ. భరతా! మంత్రజపంబు మానినను భవ్యంబైన ధ్యానంబునం
బరతంత్రుం డగుభక్తుఁ డొక్కఁడె కనం బాత్రుండు మంత్రాక్షరో
త్కరముం బల్కుచుఁ జిత్త మెట్లొ చనఁగాఁ గావించు నాయాజపం
బరయన్ స్వల్పఫలప్రదం బనుచు నీ యాత్మం దలంపం జనున్. 635

ఉ. కావునఁ దీర్థయాత్రలును గల్పగణప్రతిపాదితార్చనల్
కావు మదాత్మతృప్తికి నికామనిమిత్తము లొక్క ధ్యానమే
పావన మంచు నమ్ము మిఁక భద్రము లబ్బఁగ నన్నుఁ గొల్చుచున్
నీ వెటనున్న నచ్చటనె నేను వసించెదఁ ద్వత్ప్రియార్థమై. 636

ఉ. విగ్రహపూజ చేయకుము వీఁడెడివై యది జ్ఞానవృద్ధికిన్
బ్రగ్రహబంధనంబువలె బాధకమై తగు దానిమాని నీ
వుగ్రమరీచిమండల గతోజ్జ్వలతేజము నాదుమూర్తిగా
నే గ్రహియించి దానిఁ గన నెంతయుఁ బూనుము కోర్కి పండెడున్. 637

చ. అడవులనున్నవాఁడు సమయంబును దీర్పఁగ నాసహోదరుం
డుడుగనికష్టముల్ గుడుచుచుండుఁ గటా! యని వెఱ్ఱిచింతలన్
బడలకుమా; యొనర్పఁదగు పద్ధతిఁ దెల్పితి; నన్నుఁ గూర్చి యె
ప్పుడు నిటు లేనిచింతలను బూనకు; మీనుడి నుంచుకొమ్మెదన్. 638

చ. పరమపవిత్రమై యలరు భంగిని స్వాంతము నుండఁ జేసి యో
భరత! ననుం దలంపు మతిభక్తిని; తత్క్షణమే త్వదంతికం
బు రహితపాపపంకమయి పొల్చుట నేను వసించువాఁడ; సో
దర! ననుఁ గాంచవచ్చును సదా ప్రమదం బిగురొత్తుచుండఁగన్. 639

ఉ. కాననమందు నన్గనుచుఁ గమ్రగతిం జరియించుచుండ నా
మానస మెంచుచున్న దనుమానము నొందకు మంచు వేఁడెదో
మానుము తత్ప్రియత్న మది మంచిదిగా దిపు డన్న! దూరమం
దే నివసించు నిన్గదిసి యేను వసింపఁగ నాత్మఁ గోరుదున్. 640

ఉ. ఎల్లెడనుండునన్ను నెపు డెవ్వఁ డదెచ్చటఁ గోరినన్ మనం
బుల్లసిలంగఁ గన్పడుదు నొక్కెడ నాకుఁ బ్రమోద మొక్కచో
నల్లది లేకయుండు నను టారయ బాల్యము; దానిమాని నీ
వెల్లెడనుండు నన్నుఁ గను మేర్పడ సర్వశుభంబు లొప్పెడున్. 641

మ. ఎదియేఁ గన్పడునద్ది నే ననుచు, నేనే సర్వమందుండు నం
చెదియున్ మద్విరహంబు గాంచునది యెందే నుండ దంచున్ సుఖ
ప్రదమై యొప్పెడు నిట్టిజ్ఞానము సగర్వార్భ్య! చక్కఁగా గల్గి నీ
వెదియుం బల్కక సమ్మతించి చనుమా యీసేవకుల్ గొల్వఁగన్. 642

మ. మునివృత్తిం బదునాలుగేండ్లు సమయంబున్ దీర్ప నేనున్న రీ
తిని నీవుండఁ దలంతు వంచెఱుఁగుదుం దృప్తిన్ గనం జాలితిన్
వినుతంబైనభవద్వ్రతంబునకు నిన్వీక్షించుచుందున్ సదా
యనుజా! పొమ్మిఁక నొక్కమాటయును నీవాడంగ రాదిచ్చటన్. 643

క. నావౌ పాదుకలం గొని, నీవేగి ధరాభరంబు నిల్పుచు జనులం
బావనమతిఁ గాపాడుచు, నావిధ మెఱిఁగింపు వీనియంతికమందున్. 644

క. అనుదిన మీవిధమున నే, యొనరింపుము దాన నీకు నురుశుభములు గ
ల్గును నాదు కృపకుఁ బాత్రుఁడ, వనఘాత్ముఁడవు నయి పొల్తు వనుజా! ధరలో.

క. సతతము నీవలె వర్తిం,చుతమిం గనువార లవనిసురమానులు నీ
వతులజ్ఞానాంబుధివై, హితుఁడ వగుచునుందు నిర్జరేంద్రాదులకున్. 646

చ. వర మెదియైనఁ గోరుకొన వాంఛ యొసంగునయేని తెల్పు సో
దర! ననుఁగూడియుండు టది తప్పు మఱెయ్యది యైన నిత్తు నా
దగమున నిన్నుఁగూడి పురతల్లజమందు వసింతుఁ జుమ్ము వ
త్సరములు నాలుగుం బదియు దాఁటినయంతన పూన్కిఁ దీరఁగన్. 647

తే. ఒక్కక్షణమైన నాలస్య మొదవకుండ, నీకడం జేరువాఁడ నానియమమిద్ది
తప్పదని నమ్ముమా యని తనయుభంగి, గౌఁగిటం జేర్చి పల్కె నక్కాలమందు.

క. సురదుందుభినాదంబులు, పరఁగెన్ వ్యోమంబునందు భవ్యసురతరూ
త్కరపుష్పవృష్టి నెల్లెడఁ, గురిసెఁ 'దథాస్తు'నెడు దేవకోటులపలుకుల్. 649

క. వినఁబడియెను; వనదేవత, లనూనహర్షంబు పొంగునట్టులు శ్రీరా
మునిగుణముల భరతుని దా, వినయంబు నుతించి రిద్ధి విస్మయ మనుచున్.

శా. ఆవింతల్ గని యందునుండుమునివర్యస్తోమ మారా! యిదే
దేవవ్రాతము సమ్మతించినటులే తెల్పెన్ సుచిహ్నంబులే
యీవార్తల్ విని విశ్వసింపనిది యున్నే భూతమేదేనియం
చావిశ్వాత్ముని వృత్తముం గనుచు హర్షాంభోధి మగ్నాత్మునై. 651

చ. జరుగునె యింక నేమనుచు జ్ఞానదృగున్నతులయ్యు నమ్మునీ
శ్వరు లలసోదరద్వయముఁ బాయకయుండిరి: రాముఁ డంత సో
దర! యిదె పాదుకద్వయము దానిపయిన్ క్షితిభార ముంచి నీ
వరయుచు నెల్లకార్యముల న్యాయ్యపథంబున సంచరించుచున్. 652

ఉ. పాదుకలందు రాజ్యగురుభారము మోపి దినాంతమందు నే
దేది యొనర్పఁగాఁబడెనొ యెల్లి యొనర్పఁగనుండు నెద్ది యో
గాదన కవ్వియెల్ల నొడికంబున విన్నప మీవు చేయుచున్
నాదగునాజ్ఞ మస్తకమునన్ ధరియించి జనాళిఁ బ్రోవుమా. 653

చ. ఒకనికి హానిగల్గునెడ నొప్పునొ నేమము తక్కువారికిన్
బ్రకటగుణాఢ్య! హానియది వాయఁగఁ జేయఁగఁ బూన కుండుమా
సకలమనుష్యశర్మమునె క్ష్మాపతి కోరఁగ నర్హుఁడౌట నో
పిక నదిగూర్ప యత్నమును బీరముపొంగ నొనర్పు తమ్ముఁడా! 654

ఉ. పెక్కురు సజ్జనోత్తములు ప్రీతి వహింతురు దేనిఁగోర; నీ
వక్కఱ మీఱ నట్టిపని నప్పుడె చేయుము; రాజధర్మ మి
ట్లక్కటికంబు మీఱఁ దెలియంగను జేయును; దాని మీఱ నీ
కొక్కఁడు తోడ్పడం దలఁపఁ దుర్వినటం చెద నిశ్చయింపుమా. 655

చ. జనహితకార్యతత్పరుఁడు సాధుమనీషుఁడు సూచకవ్రజం
బును దనచెంతఁ జేర్పఁగను బూనఁడు సూనృతవాక్యసమ్మతుం
డని నిను విశ్వసించి జనులాదృతిఁ గొల్వఁగ రాజ్యపాలనం
బున నిరతుండవై మనుము పొమ్మిఁక ధర్మము నాశ్రయింపుమా. 656

చ. అదె ననుఁ జూపుచుండు మఱియాదగ దానినె యాశ్రయింప స
మ్మదమె నిరంతరంబుఁ గనుమాడ్కి నొనర్చును; మత్స్వరూప మ
య్యదియె యటంచు నమ్ముదు రహార్యతపోధను లద్ది తృప్తిచేఁ
బొదలిన నెల్లదేవతలు పొల్తురు తృప్తులునై సహోదరా! 657

చ. క్షితిపయి నెంతకాలము ప్రసిద్ధికిఁ గారణమైనధర్మము
న్నతమతి నాశ్రయించు నరనాథుఁడు వర్ధిలు నంతదాఁక రా
ట్సుత! యిదివిశ్వసించి మదిఁ జొన్పి నిరంతరభక్తి దానినీ
హితముఁ బ్రజాహితంబుఁగన నెంతయుఁబూనిక నాశ్రయింపుమా. 658

మ. పరదైవంబని దాని నెన్నుటయె భూపాలుండు ధర్మంబు ని
ర్భరభక్తిన్ భజియించుటం చొగిఁ దలంపన్ నీకు నొప్పుం జుమీ
భరతా! యివ్వె మదీయపాదుకలు నీస్వాంతమ్మునం దోఁచుభూ
భరమున్ వీనిపయిం దగన్ నిలుపుచుం బాలింపుమా రాజ్యమున్. 659

చ. మనమునఁ దోఁచుశంక లణుమాత్రము నిల్వఁగనీకఁ దోలుఁ జ
య్యన నివి విన్నవింపఁగనె; యట్లగుటన్ భవదీయభీతి నిం
క నిలువఁ జాలదంచుఁ గడఁకం దలపోయదు ధీరతన్ మదిం
జొనిపి పురంబుఁ జేరు మని చొక్కపుఁబ్రీతి శిరంబు మూర్కొనన్. 660

ఉ. అందలిమౌనులెల్ల నితఁ। డాత్మకళం జొనిపెం దదాత్మయం
దుం దగు సందియంబు లిఁక।దోఁపక యుండఁగఁ జేయనంచు నా
నందమునొంది; రంత రఘు।నాథునితమ్ముఁడు రాము తేజముం
బొంది మఱింత వెల్గె సుర।పూగము లచ్చెరువంది చూడఁగన్. 661

చ. గురు వుపదేశకాలమున।కుం దగునట్టులు దేవతాపదాం
బురుహయుగంబు నాత్మఁ దల।పోయుచుఁ దద్గతదివ్యతేజ మా
దరమున శిష్యమస్తక।తంబగు బ్రహ్మబిలంబునందు ని
ర్భరగతిఁ జొన్పు హస్తమును। భద్రము లబ్బు నటంచు నెంచుచున్. 662

తే. హస్తమస్తకసంయోగ।మన్న న్యాయ, మదియెయంచు నెఱుంగ నౌ।నంత రాముఁ
డూరకుండంగ భరతుఁడు।ద్యోగ మలర, రామచంద్రునియాజ్ఞ శీర్షమునఁ దాల్చి.

చ. మును తనకున్న భావముల। పొంతకుఁబోవక రామచంద్రుప
ద్వనజయుగైకసంస్మృతిని। బాయక చేయుచుఁ బాదుకాద్వయం
బును దలపైని బెట్టుకొని। పొంగుచు నాడుచు సాంద్రమోదముం
గనుచు వసిష్ఠముఖ్యముని।కాంతులఁ జూచి వచించె నివ్విధిన్. 664

క. నేనొకటి తలఁప దైవము, పూనిక నింకొకటి తలఁచె। బుధవరులారా!
కాన మదీయాగ్రభవుం, డానతి యిచ్చిన తెఱంగె। యగు శరణ మిలన్. 665

భరతుఁడుపురికరుగ నొప్పుకొనుట.

ఉ. పాదుకలందు రాజ్యగురు।భారము నిల్పి తదీయసన్నిధిన్
నాదగు కార్యజాతము దిన।సంబు తుదిన్ వినుపించుచున్ దలం
పేదియు లేక సర్వమున।కీశ్వరు రాము నె నమ్ముచున్ నయం
బూది చరించువాఁడ ముని। కుండువిధంబున వృత్తి యొప్పఁగన్. 666

చ. ఇదియిటు లంచు నాజ్ఞనిడి।యెం గద రాముఁడు నాకు; దాని నిం
పొదవఁగ శీర్షమందు నిడి। యున్నతసంపద లొందునంచు నా
యెదఁ దలపోసి వర్తిలుదు। నింత నిజంబు; మఱొక్కమాటఁ జె
ప్పెద రఘువంశనాయకుఁడు। ప్రీతి ననుం గని పల్కినట్టులే. 667

సీ. పదునాల్గువర్షముల్। పరమకష్టంబున, సాగింతు నవలివర్షంబునందుఁ
దొలిదినంబున నాకుఁ। దోఁపక శ్రీరాముఁ, డెందేవసించిన। నేను రెండు
యామముల్ వేచి హు।తాశనుఁ బ్రణయించి, యందుమదీయాంగ।మర్పణంబు
చేసి ధన్యుండనై। శ్రీరాము నెంచుచుఁ, జనియెద నింద్రని।సదనమునకు;

ఆ. నిది ప్రతిజ్ఞగాఁగ। నిందఱు నమ్ముఁడీ, మాటఁ దప్పననుచు। మరల రాము
పదసరోరుహములపయి। వ్రాలి యుండంగ, భరతుఁ జూచి కరుణ। పర్వుచుండ.

క. శ్రీరాముం డిట్లనియెన్, గోరితివో యెట్లు నీవు। కొదువపడనియ
ట్లే రమణ వర్తిలుదునం, చీ రాజులు మంత్రిముఖ్యు।లిందఱు వినఁగన్. 669

క. ప్రతిన యొనర్తు భరతా!, మతి నించుకయైన శంక మలయఁగనీ కా
దృతిఁ బూని యుండు మెప్పటి, వితమునఁ బరిపాలనంబు వెలయఁ జరపుమా.

ఉ. ఇంచుకయైనఁ గీడు జను లెప్పుడు పొందకయుండునట్లు గా
వించుచుఁ బాలనంబు రిపువీరులఁ జెండుచు దీనులం గృపం
గాంచుచుఁ దోడుసూపఁ దగు కాలమువచ్చునొ యెప్పుడంచు భా
వించుచు నాదురాకకయి వేచియె యుండు ప్రియానుజన్ముఁడా!. 671

చ. పదిఁయి నాలు గబ్దములు బాహుబలంబున దండకాటవిన్
బదిలముగా వసించి సురవైరుల మానిజనాపకారులన్
గదనమునన్ వధించి సురకాంతునకుం బ్రమదంబుఁ గూర్చివ
చ్చెద క్షణమాత్రమే నచటఁ జేయను వ్యర్థము నుక్తదిష్టమున్. 672

చ. నినుఁ గనకుండఁ జాలుదునె నేనొకమూర్తముమాత్రమైన నో
యనుజ! వచించినట్లు సమయంబును దీర్చుట సమ్మతంబె నీ
కునగు నటంచు నమ్మెదఁ; దగుం బ్రకృతుల్ నినుఁగూడిరాఁగఁ బ
త్తనమున కింకఁ జెప్పఁదగుధర్మము లెవ్వియు లేవనుక్తముల్. 673

క. అనిపలికి మంత్రులం దక్కినరాజులఁ గాంచి పృథులకీర్తిం గనఁజా
లిన నాతమ్ముఁడు భరతుం, డనూనధర్మంబుమీఱ నవనిం బ్రోచున్. 674

క. నారాక పంచదశవర్షారంభమునందె యాఁగదా యందాకన్
మీ రితనియాజ్ఞ చొప్పున, గారవ మిసుమంత కొఱఁత గాంచక యుండన్.

క. మెలఁగంగ వలయు; నాపయిఁ, గలకూరిమి తేటపడెడుఁ గా యద్దానన్
గలిసికొనువాఁడ మిమ్ము మ,రల సాకేతం బనునగరమునం దెలమిన్. 676

చ. అని స్మితభాషణంబుల మహాదృతిఁ జూపుచు నంతలో విరా
ధునకును శాపమోక్షమును దొరపుశక్తి ననుగ్రహించున
ప్పని మదిఁదోఁప నిట్లనియె బ్రహ్మమునీంద్రులఁగూడి మంత్రులున్
జనపదవాసులెల్లరు నెసంగెడువేడుక రాఁగఁ దమ్ముఁడా!. 677

చ. అరుగుము పూర్వరం బనెడుఖ్యాతినిగన్న యయోధ్య కింక స
త్వరముగ నిందునుండుటయు ధర్మముగాదు బహూపకారముల్
ధరణి కొనర్పఁగాఁదగును దైవముఁరతిగ దాని నెంచు లే
పరమశుభంబు లొందఁదగుపద్ధతి యంచుఁ దలంపుమా మదిన్. 678

క. అని తొందఱింప భరతుం, డనుమానములెల్లఁ బాయ నప్పాదుకలం
గనుఁగొని వలగొని శీర్షం,బున భక్తిం బెట్టుకొనియె మును లౌననఁగన్.

ఆ. కుసుమవృష్టి గురిసె వేస దుందుభిధ్వను, లంబరమునఁ బరఁగె నట్టిశుభని
మిత్తములకుఁ బొంగిమిహిరాన్వయుండు,భరతుఁడన్న సెలవుఁబడసియంత.

క. నీవన్నయట్లు నాదగు, భావంబున నుండవలయుఁ । బరమాదృతిమై
రావలయు మాటతప్పక, వేవిధముల నిల్లి నేను । వేఁడుదు నిన్నున్. 681

చ. మఱితపమ్ముఁ బ్రజ్వరిల్లునటు । లుద్యమ మొప్పఁగఁ జేసి నీదుప
చ్ఛుతదళయుగ్మ మాత్మనె యొసంగఁగఁ జూచుచు నభ్రమధ్యమం
బు తపనుసంయుతిం గనఁగ బూనిక నాతను విత్తు నగ్ని కా
హుతిగనుఁ దప్ప నీయది నృపోత్తమ! శ్రీరఘురామ! నమ్ముమా. 682

చ. అని తెగనాడి పాదుకల । నాదృతిమైఁ దలఁదాల్చిపోవఁ బూ
ను ననుజుఁ గౌఁగిలించుకొని । నూత్నముదంబునఁ బొంగివచ్చు న
శ్రునిచయ మెట్లొ యాపుకొని । చోద్యమునొంది మునుల్ గనంగ ని
ట్లనియె వడంకుచున్న గళమట్టె ప్రయత్నము తెల్పుచుండఁగన్. 683

మ. భరతా! నే నిలమీఁదఁ బ్రాణయుతి నీల్వన్ బ్రజ్వలద్వహ్ని నిం
జొరఁగానిత్తునె మాటఁ దప్పఁ డెపుడంచున్ నమ్ముమీ నన్ను; భా
స్కరశీతాంశుగతుల్ రవంత నియతిం । గాదంచు మారొందఁగాఁ
దరమా నాదగుమాట మార్ప గన దీర్ఘాత్రిన్ గులోద్ధారకా!. 684

మ. అని దీవించి దయారసం బుబుక నార్యా! పొమ్మిఁకన్ నాదు నా
జ్ఞను బాలింపుము ధర్మమార్గమున రాజ్యంబంచుఁ బల్మాఱు చె
ప్పి నితాంతవ్యథ సాగనంప జనుల్ । ప్రేమాశ్రుపూర్ణాక్షులం
దనుఁజూడన్ గయిమోడ్చి లోని కరిగెన్ । ధర్మంబుఁ జింతించుచున్. 685

ఉ. రాముఁడు పర్ణశాలను జొరన్ భరతుండు ప్రయాణభేరికా
స్తోమమహారవంబు గురుతోయధులం బ్రతిశబ్దమిచ్చుచున్
వేమఱు ఘూర్ణిలంగఁ గడువింతగఁ జేయఁగ మంత్రిపుంగవుల్
భూమిధవుల్ మహర్షిగణముల్ తనవెన్కనె రాఁ జనెం ద్వరన్. 686

క. శ్రీరాముని యాశ్రమ మది, దూరముగా నున్నయట్లు । తోఁచినదనుకన్
ఘోరారణ్యపథంబునఁ, దా రాముని పాదుకలును । దలపై నుండన్. 687

తే. కాలినడకనె పోయె భూకాంతునతని, వెనుకొనుచుఁ బోయి రెల్లరువిస్మయంబు
పొదల నవ్వల రథమెక్కిపోయె భరతుఁ, డెల్లరును వాహనంబులనెక్కిచనిరి.

సీ. కొలఁదిదినంబుల । కలయయోధ్యాపురిఁ, జేరి యెల్లర నందుఁ । జేర్చి మంత్రు
లందుండి భూపాలనాదికార్యంబుల, నప్రమత్తతసాగునట్లు చేయఁ
బంచి యప్పురికిని । బరిసరంబుననున్న, యట్టినందిగ్రామమందుఁ దాను
నివసించి రఘురామ । నెఱి నెదలో నిల్పి, తత్పాదుకలపైన । ధరణిభార
తే. మునిచి తత్సేవ చేయుచు । దినము తుదిని
సకలవిషయంబులను వానిసన్నిధాన

మందుఁ దెల్పుచు మునివృత్తి యలరనుండె
రామకార్యాభిరతుఁడు భరతుఁడు హితుఁడు. 689

చ. తనదని దేనినేఁ దలఁపఁ డాఁ దలపోయక సర్వముం దయా
వననిధియైన రామజనవల్లభ మాళిదె యంచు నెంచుచున్
దనమదిఁ దత్పదాంబురుహతల్లజసంగతి నొప్పనుండె రా
మునిదగురాక నెన్నుచును భూతహితంబుల నెప్డు కోరుచున్. 690

ఆ. చిత్రకూటమందుఁ జిన్నియాశ్రమమున, నధివసించియున్న యఖిలగురుఁడు
రామచంద్రుఁ డాభరతుఁ డట్లు పోయిన, పిదప నెలమినుండెఁ బ్రియనుగూడి.

ఉ. జానకి చిత్తపద్మమున శాపవిముక్తికి వేచియుండు నా
దానవునిన్ విరాధుని నితాంతము గుండెదువాని నెంచి స
న్మానులఁ బ్రోత్సహించె నృపమండను శ్రీరఘురామునిన్ సదా
మానససీమ నిల్పి బహుమానము మీఱఁగఁ గాంచుచుండియున్. 692

ఉ. దైవి తలంపు తమ్మొగి వితాకుపడన్ వడిఁ జేయ భక్తియు
గ్భావము తాఱుమాఱగుడు వర్తము మాఱఁగ రాముపంక నే
వేవిధులన్ మహాపదలు వేమలు కల్గుట సంభవించె నం
చావిలచిత్తముల్ గలిగి యెంతయుఁ బ్రాజ్ఞత యంతరింపఁగన్. 693

క. సీతాపతిఁ గాంచినతఱిఁ, బ్రీతివిహీనంపుదృష్టి వెలయించుచు సం
జాతురుషన్ మోములఁ తీ, రేతఱిఁ గననట్టు లొప్పు నెటకో నడచుచున్. 694

క. తమచిత్తములంగల తాపముఁ దెల్పిరి చెయ్వులను నృపాలవరుఁడు చి
హ్నములను వానింగని భావము తేటగఁ గానఁబడఁగఁ బలికె సహజుతోన్.

ఉ. కంటివె లక్ష్మణా! మును లకాండరుషం గొని నన్ను నిన్ను నుం
గంటకు లట్లుగాఁ దలఁచి క్రమ్రవచస్సులమాని యీసు లో
నుంట యెఱుంగఁజేయఁ దగునుగ్రవచస్సులఁ దూలపుచ్చుచున్
మింటికిఁ బోవుచందమున మేటిమహీధ్రము నెక్కు రీతులన్ 696

క. కుటిలభ్రూకుటులం దమ, పటుకోపము దెల్పుచున్న పద్ధతి గనఁగా
నిట మనముండుట తమ కల్పసటలం గల్పించువన్న జాడ తెలిసెడున్. 697

క. కారణమేమో యింతయు, నేతులఁ దలఁపఁ దోఁపదిట నుండక వే
ఘోరాటవులకుఁ బోవుట, యారయఁగా మంచి దనుచు నాత్మం దోఁచెన్.

క. ఉన్నారము సుఖముగ నిటఁ, గన్నారము సహజమంత్రిగణముల నిఁక నో
యన్నా! లక్ష్మణ! ఫలసం,పన్నాటవి కేగుటయె శుభం బగుఁ జుమ్మీ. 699

ఆ. మనలనాదరించుమానులకే శ్రద్ధ, గలిగెనంచుఁ దెలుపఁగలిగె గుఱుతు;
లతిపరిచయమున నె యవమతివాటిల్లు, ననెడు కింవదంతి యర్థ మెసుము.

క. దీనికిఁ గారణ మేమో, మౌనీశ్వరు నొకని నడుగ । మనసయ్యెడు నం
చూచిన శ్రద్ధం బల్కఁగఁ, దానుగ నేతెంచె నొక్క । తాపసుఁ డటకున్. 701

చ. మునివరు రాకఁ గాంచి మదిఁ । బొంగెడు వేడుక నట్టె లేచి వం
దనమిడి యాతిథేయములఁ । దాపసవర్యు బహూకరించి యీ
జననము ధన్యమయ్యె మునిసత్తమ! మీ రరుదేర నంచుఁ బ
ల్కిన వినయోక్తి దానివిని । కీర్తియశోధనధాము రామునిన్. 702

తే. దృష్టిఫలమబ్బెఁగాఁ గని । యిదియె జన్మఫలమనుచు నమ్మి యిట్లని పలికె; దేవ!
నీదు సందర్శనమె తపోనిధి నాసంగు, సకలపుణ్యైకఫల మనఁ । జాలియుండు.

ఉ. ఐన వచింతు నీవిచట । నాశ్రమముల్ విధియుక్తి గట్టి యీ
మౌనులఁగూడి యుండునది । మానక చూచి మహోగ్రహంబునన్
దానవులెల్లఁ జేరి యొక । తప్పును జేయని మౌనిసూనులం
గానకుఁ బండ్లు తేరఁ జనఁ । గా వధియించి రిఁ కేమి చెప్పుదున్. 704

ఆ. ఇట్టిబాధ లనుచు । నెఱిఁగింపఁగా రాని, యిడుమ లెల్ల గలుగఁ । గడఁగి చేయు
చున్నవారు రామ! । యుగ్రదైత్యులు వారి, బాధ లడఁగు నట్టి । పథము లేదు.

క. కావున వేఱొకవనికిం, బోవం దలపోయువారు । భూసురమును లం
చీవిధమునఁ దెలుపఁగ విని, భూవరుఁ డనుజన్ముఁ జూచి । మునినుడి వింటే.

క. ఇంతకు మును పేఁ దెల్పిన, దంతయు నిశ్చితమయయ్యె । ననుజా! మన మీ
ప్రాంతములనుండ రాదు వనాంతరముల కేగు టిప్పు । డర్హము సుమ్మీ. 707

క. మన కీమునివర్యులు తో, డనుచున్ వీరలను జంప । నసురులు పూనికం
గని రంచుఁ దోఁచెడున్ జవమునఁ బోదము వేఱగువన । మునకుం గడఁకన్.

క. ఒరులకు నపకృతి తమవంక రహిం గలుగంగ నున్న । కాలంబున నె
వ్వరు చూచు చూరకుందురొ, పరికింపఁగ వారెసుమ్మీ । పాపు లనంగన్. 709

క. ఇది శాస్త్రసమ్మతంబై, పొదలుట మన మొందుకడకుఁ । బోవుట మేలం
చెదఁ దోఁచెడు నప్పాపులఁ, జెదరంగాఁ గొట్టుద మని । చెప్పఁ గడ గెదో.

క. దొంగలవలె నిందలిముని, పుంగవులం జంపుచున్న । మూర్ఖదనుజులన్
దొంగవలె నేను మార్కొనఁ, గం గడఁగిన నవ్వరొక్క । కను వారెల్లన్.

క. మనచేతఁ జచ్చువారినె, యని మొనఁ జెండాడవలయు । నదియుంగా కీ
మునులను మనకొఱకే చంపసుబూని రటంచు మౌని । పలుకులె తెలిపెన్. 712

క. మన మొండువనమ్మునకుం, జనినన్ వీరలకు దైత్య । సంహతివలనన్
జనియింపదు మృత్యువు కావున నిప్పుడె పోవుదము ద । వులఁగల వనికిన్. 713

చ. అని హితముప్పతిల్లునటు । లారఘురాముఁడు పల్క లక్ష్మణుం
డనియె నిదే సమంచితమ । యంచుమనంబున కిప్డు తోఁచెడున్

జనకమహీధవాత్మజయు సమ్మతిఁ గాంచునయే జవంబునన్
జనుదము మీరు చెప్పినటు సల్పుటయే విధి నాకు నగ్రజా!. 714

క. సౌమిత్రి యిట్లు పల్కిన, నామాటల నాలకించి యజ్జనకజ యి
ష్టేమునులకుఁ బ్రమదము సు, త్రామాద్యమరేశులకుహితముఁ గూర్పఁదగున్.

క. అరుగుదము రాము ననుమతిఁ, బరిసరవిపినాగ్రమునకుఁ బయనము సాగిం
పు రయమునన్ సౌమిత్రీ!, పరికింపం గోరుదాన భవ్యాటవులన్. 716

చ. మనదగురాకఁ గోరుచు సమంచితయోగరతిం జెలంగుచున్
మునిపతు లెందఱో విపినభూముల నుండఁగ దుష్టదానవుల్
చని వెస యోగవిఘ్నము లజస్రము చేయుదు రన్నవార్త నే
విని పరితాపమందుదును వేగ తగుంగద వారిఁ గావగన్. 717

క. పరగున వేఱొక కానకు, నరుగుద మని ప్రోత్సహింప నారాముం డ
త్తరుణి దగుభావ మాత్మం, బరికించి సహోదరునకుఁ బయన మొనర్పన్. 718

క. ఇదె సమయమన్న భావము, పొదలంగాఁ జేసె; నంతఁ బూజ్యమతిశ్రీ
సదనుఁడు లక్ష్మణుఁ డటు స,మ్మదమున శ్రీరాముఁ డన్నమాటలు వినుచున్.

తే. వస్తువారముఁ గైకొని వారిఁ బయన, మునకుఁ బురికొల్పె శ్రీరాముఁ డును ధరాత్మ
జాతయును దండకారణ్యసరణిఁ బట్టి, నడువ సౌమిత్రియున్ వెంటనడుచుచుండె.

చ. చనుచును జిత్రకూటగిరిసత్తమముం గొనియాడుచున్ మునీం
ద్రనికర మార్తినొందుటకుఁ దాపము నొందుచు దండకాటవిం
గనుఁగొను వాంఛబోయి; యటు క్ష్మాపతివర్యుఁడు రాఘవుండు ముం
దును క్షితిపుత్త్రి రాఘవునితోడను లక్ష్మణుఁ డామె వెన్కనున్. 721

చ. అరిగిరి కొంతదూర; మిటు లారఘువీరుఁడు ధర్మపత్ని సో
దరుఁడును వెంటరాఁ జనఁగ దారుణకానన మంత నక్షి గో
చరమయి యొప్పె;నవ్వనము చాలవిశాలము భీతికృన్మహా
తరువరషండమండితము దానవసంతతి సన్నివాసమున్. 722

## దండకారణ్యవర్ణనము.

ఉ. భూమిరుహంబు లొండొకటి పొంకముగాఁ గనుపట్టుశాఖలన్
కోమల దీర్ఘబాహువులఁ గూరిమిసంగతి నొందఁజేసి శ్రీ
రామున కాతిథేయములు రమ్యములై తగఁగూర్ప సన్నలన్
వేమఱు తెల్పుచున్నగతి వింతగఁ జూడఁగనై మనోజ్ఞమై 723

ఉ. ఘోరనిశాచరవ్రజము క్రూరమృగంబులు వేనవేలుగాఁ
జేరి చెలంగు నిందు నృపశేఖర! వేగమ రమ్ము; నీదుదు
ర్వారశితాస్త్రసంతతుల వాని వధింపుము నీదురాక నే
కోరుదు మంచుఁ దెల్పుగతిఁ గోకిలముల్ పలుకంగ నొప్పుచున్. 724

ఉ. ఎన్నియొ నాళ్లనుండి పృథివీశుఁడు రాముఁడు వచ్చుఁ గన్గొనన్
నిన్ననిపల్కు బ్రహ్మమునినీరజమిత్త్రుల మాట లెన్నియే
నెన్నుచు నున్నదాన నని యెంతయు సంతసమొప్పఁ దెల్పున
ట్లున్న విహంగకూజితము లొప్పఁగ వింతలు గ్రుమ్మరించుచున్. 725

చ. సరసులఁ గేళిసల్పఁ దగుసారసనేత్త్రలసంగతిన్ వియ
చ్చరు లొగి వ్యోమయానముల చారుగతుల్ వెలయంగ రా వసుం
ధరఁదగు వానినీడలఁ బతత్త్రులె యంచుఁ దలంచి శ్యేనముల్
తొరపడి వ్రాలి యవ్విచనఁ దోడనె పర్విడఁ జూడఁ జిత్త్రమై. 726

మ. చనుదెంచెన్ జగదేకవీరుఁ డిదె యీసాంద్రాటవిం గాన భా
ర్యను సోదర్యునిఁగూడి నేత్త్రఫల మీరామాదులం గాంచు టే
యన నో కండని యొక్క రొక్కరుని బ్రేమార్ద్రాంతరంగంబులన్
దనివాఱం బిలువంగ దిగ్వదితశబ్దం బొప్ప గంభీరమై. 727

మ. గురువాతాహతి వృక్షశాఖలు ధరన్ గూలంగ నందున్న సుం
దర నీడోద్భవసంతతుల్ చెదరి యార్తధ్వానముల్ చేయనో
కరుణాసాగర! రమ్ము దానవులు దోర్గర్వంబునన్ మించి రీ
ధరణిం గ్రాలెడువీరిఁ గూల్పు మనుచందం బెన్ననై యుండఁగన్. 728

మ. ఇదిగో రాఘవుఁ డేగుదెంచె నిట నెంతేమించి దేవాళి నేఁ
చుఁదమిం బూనినదూషణాదులను ద్రుంచున్ వేగమేయం చొగిన్
హృదయాభీష్టముఁ దెల్పుచున్నగతి శాఖింద్రాగ్రసంవాసతన్
బెదరుంగాంచని పత్త్రివర్యములు వేవే పల్క రాజిల్లుచున్. 729

చ. సరసుల నీదులాడి వరుసం బ్రియురాండ్రనుగూడి వేడ్కనం
బరమునఁ బిందుగట్టి తమవాసముఁగూర్చి మనోహరంబుగాఁ
బరుఁగిడు రాజహంసమృదుపక్షదళచ్యుతవారిబిందువుల్
వరుసగ రామచంద్రునకుఁ బాద్య మొసంగెడురీతి నొప్పఁగన్ 730

ఉ. ఎచ్చటనుండియో మదికినింపుగ వేదరవంబు వీనులన్
ముచ్చట నొందఁజేయువిధముం గనుపట్ట వినంబడంగ భా
గ్యోచ్చయ మొప్పఁగాఁ దిరుగుచుండు వియచ్చరదంపతుల్ ముదం
బచ్చుపడంగ నిల్చి వినునాదృతిఁ గాంచఁగ వర్ణనార్హమై. 731

ఉ. వీనుల కెంతో విందు నొదవించును సామసమాఖ్య వేదస
ద్గాన మటంచుఁ బల్కుబుధకాండవచస్తతి సార్థకంబుగాఁ
గానము వీనులంబడఁగఁ గన్నులు మూసి మహామునీంద్రుచం
దాన శుకవ్రజంబు ప్రమదంబున నట్టులె నిల్వఁ జూడనై. 732

చ. లతలు మహాద్రుమంబుల విలాసము మీఱఁగఁ గౌఁగిలించుకొం
చితరసహాయహీనముగ నెత్తఱినే మరియాదయొప్పఁగా
బ్రతుకుట దుర్లభం బనెడు పద్ధతి స్త్రీలకు నీతిఁదెల్పు న
వ్వితమున నొప్పఁ జూడఁ గడు వింతగ నుండఁగ దర్శనీయమై. 733

చ. ధరణిధరేంద్రశృంగ జనితంబయి ధాత్రి మహాబలాఖ్యయై
వ్వరుసనుజూడ సార్థకత వర్తిలఁగాఁ జెలరేఁగి వీచున
మ్మరుదధిపప్రతాపమున మ్రాఁకులశాఖలు వ్రాలఁగా లతా
తరుణులుకూడ వ్రాలి సతిధర్మము లివ్వని తెల్పఁ జూడనై. 734

చ. గురుతరదేహమూర్తి నొడఁగూర్చు మహాధ్వని యేవగింపు స
త్వరమ కనంగజేయు శవవారముఁ బట్టిన దీర్ఘబాహువుల్
సురలకునేని భీతిగను చొప్పుఁ గనంబడఁజేయు రాక్షసో
త్కరము చరించుచుండఁగ నితాంతభయం బొదవింప నర్హమై. 735

ఉ. కొండలసందులన్, భయముఁగూర్చు మహాశిల లొప్పుతావులన్
జండమరీచిభానువులు చాల శ్రమంపడి యైనఁ జేరరా
కుండ నొనర్చు పెన్గుహలఁ గ్రూరతరాకృతి నొప్పుచుండు భే
రుండము లట్టిచాయ విన రూక్షముగాఁ దగ దుష్ప్రవేశ్యమై. 736

ఉ. ఒండొకచోట నుండి,పవనోరుజవంబున లంబమానవే
దండయుగంబుగాఁగ భయదంబయి పాదయుగం బెసంగ ను
ద్దండపతత్త్రులుం బఱవఁ దచ్ఛదచాలనజాత వాతముల్
బెండగిలంగఁజేయఁ బడువృక్షములం గడు భీకరంబునై. 737

ఉ. ద్వీపివరంబు లాఁకలి వివృద్ధినిఁగాంచఁగఁ బొంచిపొంచి సం
దీపితకోపవహ్ని లొగి దృష్టుల వెల్వడ నప్పథంబునం
దే పఱతెంచు భల్లముల నెంతయుఁ బూనికమీఱఁ బట్టఁగా
రాపడి దీనతన్దగి విరావము లెట్టులొ చేయ దుర్గమై. 738

చ. కదలఁగనైన లేకవిధికల్పితశక్తిని మర్త్యనిస్వనం
బిదియని పోల్పనైనయటు లెంతయు నార్వఁగఁ దజ్జిఘాంసమై
ముదమునఁజేర రా నిదియపో యశనంబని బెబ్బులిన్ బలం
బొదవఁగఁ బట్టి నాచిలువ నుక్కడగింపఁగఁ జాల కద్ది భీ
తిదముగ నార్వ నారవము తీవ్రముగా వినరా నగమ్యమై. 739

చ. పరమలతాప్రసంగమునఁ బావనమై తగుగాలిసోఁక నె
వ్వరుసను మాన్పరాని వగువ్యాధులచే దురపిల్లు నామృగో
త్కరములు హాయిచెంది తిరుగాడుచునుండఁగ జూచునట్టి ఖే
చరు లొగి విస్మితాత్ములయి సంతసమందఁగ సంప్రవేశ్యమై. 740

ఉ. శైవలినుల్ మనోజ్ఞజలసంగతి మించుచుఁ దీరభూములన్
బావనతం జెలంగునటు భవ్యగతిం బ్రవహించుచుండఁ ద
జ్జీవనసేవనప్రమదసిద్ధిని గాంచుచు సంచరించు భూ
దేవమునీంద్రు లొప్ప వినుతింపఁగ నర్హముగా నెసంగుచున్. 741

మ. చనుదెమ్మా రఘునందనా! జగతి నీజన్మంబునన్ గావనే
యను విశ్వాసముగల్గియున్న యది దైత్యశ్రేణిఁ జెండాడి యీ
మునులం గాచుటె నన్ను గాచు టని నిన్బూజింపఁ గాంక్షింతు నం
చనుమోదంబు, లతాశయంబులను నిర్వ్యాజంబునం దెల్పుచున్. 742

ఉ. చారులతావితానముల సౌరభమున్ వెదఁజల్లుపుష్పసం
భారములన్ సమీరణవశంబుల నర్చనచేసి రమ్మిఁకన్
శ్రీరఘునందనా! యిచట జిష్ణుపరుల్ వసియింతు రంచు గం
భీరపతత్త్రినాదముల విన్నప మొప్పఁగఁ జేయునట్టులై. 743

వ. భూరితరమహీరుహశాఖావరుద్ధ ఖచరగణంబై వీథ్యాయిత వీరుత్సమావృత విపుల విటపి విటపసంరుద్ధ ఖరనీహారకర కిరణనికరంబై, వివిధవర్ణ విచిత్ర పత్త్రకలాప సంలక్షితహారీతప్రముఖ పత్త్రరథవితాన సమాక్రాంత తరువర సాంద్రంబై, మృగేంద్రపుండరీక వేదండ ఖడ్గభల్లప్రముఖ మహాసత్త్వ భయంకరారావ సంవృతధరాధర కందరకదంబకంబై, వియచ్చుంబి పలాశి ప్రకాండ కాండ లంబమాన విషహుతవహ జ్వాలామాలాభీల భోగిసంఘాతంబై, చదుకంబులం బొంచి పొంచి రాకపోకలుచేయువారిం బట్టుకొని నెట్టన మట్టువెట్టి చంకఁబెట్టుకొని యాఁకలిపెల్లున దురపిల్లురాకాసు లెల్లఁ బెల్లురేఁగి పైఁబడి యవ్వాని మానక లాగికొనఁ బూన నవ్వానిక వీటఁబుచ్చం దలంచి పెచ్చుపెరుఁగు మచ్చరంబున నుచ్చైస్స్వరంబున నదలించుచుం బాఱిపోవం బోవనీక పెనంగఁ గఠినాట్టహాసంబుల బెండుపడంజేసి మండుచుండు కడుపుఁజిచ్చు నచ్చటనె శాంతింపఁజేయు నుద్యమంబుంబూని తొందఱపడి వానిందినుచు నాసందున నించుక లాగుకొని తిను పెఱరాకాసులఁ గ్రూరగర్జనల నధఃకరించుచుఁ బాఱుచుండు దారుణభూతవ్రాతంబులచే నిబిడంబై, కొంచెమేని కరుణయొఱుంగనిసురారి నికరం బిందు సంచరించుఁ గాన సాధుజనులకు బాధయగుం గాన రావలదని ఝంఝామారుతంబు సోఁక సంచలించుచు నవ్యక్తస్వరంబున హెచ్చరించు మహాద్రుమ శాఖాగ్రంబుల భయంకర దృశ్యంబై మహీరుహంబులఁ బెనంగి దాంపత్యచరిత్రంబుం దెలుపం బూనిన నవీనప్రతాననీ మంజులపత్త్రసవర్ణపతత్త్రి ప్రకరంబులు హఠాత్సంజాతభీతికృత్ప్రభంజన సమాకృష్యమాణ శాఖాప్రశాఖాగ్ర సంలగ్నత వానివెంటం

బోవుచు వచ్చుచుండి సమాసన్న భూరుహాంతరశాఖావళిం బ్రమాదంబునం బొంది యవి యథాపూర్వస్థలంబునకుం బోవఁ దమబంధుపత్త్రంబులు దూరంబున నుంటం దలంచి మించినచింతాభరంబున నెమ్మనంబులు సంచలించుచుం ద్వారపెట్టుచుండఁ మరల వాయువక్రగమనంబునఁ దమకొమ్మ లచ్చటికిం బోవ సమ్మదంబునఁ స్వజాతిపక్షులం గలిసికొని సులలితవచనంబులఁ దమవిచారంబుం దెలుపుచు నొండొంటిఁ గలయం బలికికొనుచు విలాసంబులం దేలు బహువిధ నీడోద్భవనివహ సంవేష్టితంబై, శైలాగ్రవినిస్సృత, ప్రభిన్న ప్రస్తర ప్రకర, భూభాగనిర్భేదనాయత ప్రమోద, జవవిజితమరున్మానస, తరంగిణీతట నికట పాథస్సమ్మగ్న, జలపానాగతజంతుసంతాన గ్రహణనిపుణగ్రాహసమూహబహుళంబై, తరువరవివర విలీన కాలవ్యాళసమాకృష్యమాణ పాద పతద్దీన నినాద ప్రతినాదిత కందరబృందంబై, రాణ్మందిరంబుభంగి [1]పున్నాగపూగంబై, మహేంద్రప్రాసాదంబుభాతి [2]నైరావతభూషితంబై, శతానందసౌధంబుకరణి [3]శారదాభిరామంబై, కమలాంతఃపుహర్మ్యంబురీతి [4]లక్ష్మీవిభూషితంబై, మహాదేవగేహావరంబుతెఱఁ [5]బార్వతీమనోహరంబై, శింశుమారచక్రంబువలె [6]జీవప్రధానంబై, పాతాళలోకంబుబలె [7]వ్యాళసంకీర్ణంబై మహాత్తరంబై తోఁచుటయు రామచంద్రుఁడు సీతాదేవిం గాంచి యిట్లనియె. 744

ఉ. మానిని! దండకాటవి సమస్తమృగోరగపక్షిదైత్య సం
తాననిరంతరం బగుచు నైజమహత్త్వము గాననీక యెం
తేని భయంకరంబుగనె యెల్లరకుం బరికింపనై తగుం
గాన నిటం జొరంగఁ దమకిం బెసలారెడు నాకు నిత్తఱిన్. 745

చ. భరతముఖుల్ ననుం గనెడువాంఛ నిఁకం గనకుండ నీభయం
కరవనమందుఁ గాపురము కార్ముకవర్యమె తోడుగా శరో
త్కరములు మిత్త్రవర్గములుగా ననుజన్ముఁడు పల్కుదోడుగాఁ
దరుణిరో! నీదువాంఛితముఁ దప్పక తీర్పఁగఁ జేయ నెంచెదన్. 746

చ. మన మిచటం దపోధనులమాటల నెంతయుఁ దృప్తిమీఱఁగా
వినుచుఁ దదీయకష్టముల వేగమ వాపుచుఁ దీర్ఘరూపపా
వనభగవత్ప్రియస్థలుల వాంఛలఁ జూచుచు నీమనుష్యసం
జననము ధన్యమౌ నటులు జానకి! చేయుట న్యాయ్యమౌఁగదా! 747

మ. భవదీయాశయ మెట్టిదో తెలియఁగా వాంఛింతు నారీత నీ
భువి వర్తిల్లఁగఁ బూనువాఁడ; నని రాముం డిట్లుపల్కంగఁ ద

1 పున్నాగము = సురపొన్న. 2 ఐరావతము = నారదబ్బ. 3 శారద = విడాకులరేటి. 4 లక్ష్మి = ప్రేంకణము. 5 పార్వతి = అందుగు. 6 జీవ = వేగిస. 7 వ్యాళ = పెద్దపులి.

ద్భవగూఢాశయ మాత్మ నెంచి మునులన్ బాలించి దేవారిరా
ణ్ణివహంబున్ వధియింప నెంచి పలికెన్ నేర్పొప్ప న్యాయ్యంబుగన్. 748

మ. పరమాత్మా! భవదీయచిత్తమున నెబ్బంగిన్ మహాకార్యముల్
జరగింపం దగునంచుఁ దోఁచునొ యదే చందంబునన్ సాగు; నె
వ్వరు దానిన్ మరలింపఁజాల; రిఁక సర్వప్రాణిశర్మార్థ మీ
ధర వర్తింపఁ దలంపు; మియ్యదియె నాతాత్పర్యసారం బగున్. 749

చ. తలఁచినయంత నే యవితథంబుగఁ గార్యము సాగఁ జేయ ని
మ్ములఁ దలపోసి తావకవిభుత్వము నే శిరసావహించి వ
ర్తిలుదు సుమిత్రపట్టియును ధీరతఁ దోడయి యుండుఁ గాన నే
ర్పలవడ దండకాటవి విరాక్షసమై తగునట్లు చేయనా. 750

చ. ఒకయెడ నెవ్వరేఁ దలఁప నుద్యమముల్ ఫలియించుచుండ వే
ఱొకయెడఁ బ్రాజ్ఞులే జరప నుద్యమ మెంతయుఁ జేయఁ బొల్లగున్
సకలవిధప్రయత్నములు సాగును నీవు తలంచినంత నే
వికలతగాంచునెట్లు పృథివీభరముం దొలఁగించు నీకృతుల్. 751

చ. ఎవరెవ రెట్టిరీతుల నదెప్పుడు త్వత్కృప నొందఁ బాత్రులై
భువిఁ జెలువారు చుందురొకో భూతపతీ! సమయంబునందు నీ
ప్రవిమలమూర్తి వారికడ రాజిలుఁజు; మ్మదె సాధుకర్మసం
భవఫల మంచుఁ జెప్పుదురు పండితు లోరఘువంశభూషణా! 752

చ. వనమిది భీతికృద్దనుజవారయుతంబగుఁ గాని యిందు ని
తనువునుగాంచి యెంతయును ధన్యులుగాఁ దగువార లుందు రం
చును దలపోయుదాన; గురుశూరతఁ జూపఁగ నొప్పు నిందు నీ
యనుజుఁడు తోడ్పడంగ సమయం బిదె చేరువనున్న దంచనన్. 753

చ. ధరణికుమారి కాహృదయతత్త్వము నెమ్మదిఁ జక్కఁదోఁప ని
ర్భరకుతుకంబు సుంత వెలిఁబర్వఁగ నీయకయుండ నాపుకొం
చు రవికులైకభూషణుఁడు శూరునిఁ దమ్మునిఁ జూచి లక్ష్మణా
యరసితివే కదా జనకజాత్మజపల్కుల భావ మెంతయున్. 754

చ. పురుషులకంటె నారులకు బుద్ధిబలం బధికం బటంచు ను
ర్వరఁ దగియుండు నానుడి యబద్ధముగా దనితోఁచు నాకు నీ
తరుణితలంపురీతి మదిఁ దట్టెడు నియ్యెడ నింతలోన భీ
కరదనుజేంద్రదర్శనము కాఁదగు నంచు సుమిత్రనందనా! 755

ఉ. వింటిని మున్నె రూపములు వింతగ భీతినిగొల్పుచుండ వా
ల్గంటుల ప్రాణముల్ వెడలఁగా నొనరింపఁగఁ జాలియుండఁగాఁ

దుంటరులైన రాక్షసులు । తోరపువేడుక నీయరణ్యమం
దుంట మహామునుల్ పలుక; । నొప్పదె యానుడి విశ్వసింపఁగన్? 756

ఉ. జానకిఁ గాచుకార్యమె ప్రశస్తముగాదె తలంపు మీఁమె కే
దేని శ్రమంబుగల్గనటు । లేపునఁ జూచుకొనంగ నోఁగదా?
నేను ధనుర్ధరుండనయి । నిర్జరవైరుల జూడఁ గాంచుచున్
మానిని వెన్కనుండ గమనంబును సాగఁగఁ జేయ నీవునున్. 757

చ. వెనుక నధిజ్యచాపుఁడవు । వీతభయుండవునై సురారులం
గనుఁగొను శ్రద్ధఁబూని జనకప్రియనందన భీతి వాయురీ
తిని నడువంగనొఁ దనువునదృశ్యయమై తగియుండు టొప్పు; నీ
వనమన దండకాఖ్యమను । వాక్కుఁ దలంచుచు నుండుటే తగున్. 758

క. సీమంతిను లెంతయు విద్యామహిమ గలార లయ్యుఁ । దమపూరుషు ల
త్యామోదంబునఁ గావఁగ, నే మన్ననఁ గాంత్రు లత మహీజయుతివలెన్.

క. పురుషుని సంగతిఁ బాసినఁ, బరిరక్షణ మొండుభంగిఁ । బర్వదు; తామే
సరి గాచుకొనఁగఁ జాలరు; మరియాదయుఁ బోవు దాన । మాట లిఁక కేలా. 760

క. త్వరపడి పురుషుల నవమతి, కిరవుగఁ గావించి తామె । యెల్లపనులఁ జే
యురతిం గాంచినఁ దుద క, త్తరుణులె దిక్కెడలి చెడుట । తథ్యం బనుజా!

చ. లతలు మహీరుహంబుల విలాసము మీఱఁగ నాశ్రయించి యా
దృతిఁ బరిరంభణంబునకు । నీకొనువానిని గౌఁగిలించి పెం
పుతగఁగ వృద్ధినొంది పరిపూర్ణమహత్త్వసుఖంబులం గనున్
శతదళనేత్ర లట్లె ‘పురుషస్ఫుట’సంయుతఁ గాంత్రు వానినిన్. 762

చ. పతియుతి మాని స్వేచ్ఛ గనుపట్టఁగఁ బొందితి యొప్పునన్న దు
ర్మతిఁ దిరుగంగ గౌరవము । రాదనుటే యగు; సూనృతంబునా
హితమగు బోధ మిద్ది; యని । యేర్పడ నీమదినుంచి యువ్వనం
బతులితసత్త్వసాంద్ర మని । యర్థముగాఁ జరియింపఁ బూనుమా. 763

చ. శరముల నారిఁగూర్చి బలశాలుర దానవులన్ వధించు ని
ర్భరకుతుకంబు నెమ్మదిని । బాటిలఁగా వడిఁ జేర్చి నానుడుల్
స్మరణపథంబునందుఁ బలుసారులు నిల్వఁగఁ జేర్చి యింక సో
దర! వెనువెంట రమ్ము పరితఃప్రవిచాలత దృష్టియుండపై. 764

క. అనిపలికి యాత్మ మాయయొ, యనఁగాఁ బ్రఖ్యాతిఁగాంచి । యక్షలేశ్వరి నా
వినుతింగను భూతనయం, గని సుస్మితరూపవాక్యగరిమ వెలయఁగన్. 765

ఆ. స్వాశయంబుఁ దెలిపె; । జానకి రాఁబోవు, కాలగతుల నరసి । కాయ మితరు
లకు మఱొక్కనూత్న । లలనఁగఁ గన్పడఁ, జేసి నడచుచుండె । శ్రీశు వెనుక.

## కాండాంత్యము

క. మాయాక్రాంతజగద్వ్రజ!, న్యాయారూఢా! సమస్తయతివితతిమనో
జ్ఞాయతహృదయాంబుజధా, మా! యబ్జాండైకనాథ! హతసురబాధా!

చ. శతదళసంభవాద్యమరసత్తమ! సాధుమనోరథార్థసం
గతనరదేహ! బ్రహ్మమునికమ్రహృదంబుజగేహ! విక్రమా
ర్జితజగదోఘసంయుత! విచిత్రయశఃపరిపూర్ణతారకా
పతి! చరణాబ్జసంయుతవిపక్షశిరస్తతి! రామభూపతీ!

మాలిని.

అమరవినుతనామా! హారితేజోభిరామా!
సమయవిహితశౌర్యా! సాధుహృద్ధారితార్యా!
అమలగుణసముద్రా! ప్రాజ్ఞవిన్యస్తభద్రా
సమయమతవినోదీ! శత్రుసైన్యౌఘభేదీ!

గద్య. ఇది శ్రీమత్త్రిపురసుందరీకరుణావాప్త గీర్వాణాంధ్రకవితాప్రాభవ కాశ్యపాన్వయప్రభవ శ్రీజనమంచివంశాంబురాశికుముదినీమిత్ర సుబ్రహ్మణ్యమనీషిపుత్త్ర తాండవకృష్ణాపరాభిధేయ శేషాద్రినామధేయవినిర్మితంబైనకృతులయందు శ్రీధర్మసారరామాయణంబునందు అయోధ్యాకాండము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ ర స్తు

# శ్రీధర్మసారరామాయణము

## ఆ ర ణ్యా కాం డ ము.

శ్రీసంకల్పసమావృత
భాసురవిధ్యండజాతపరమాదరణా!
శాసితసురరాడ్వైరీ!
వాసంతోత్సవవినోద! భక్తాభయదా! 1

తే. చిత్తగింపు మహాప్రభూ! చిత్రవిమల, భద్రదం బగు తావకవర్తనంబు
విన్నవించెదఁ దోఁచినవిధమున; నటు, దాశరథి ప్రేయసియుసుమిత్రాతనయుడు.

క. తనవెంటరాఁగ ముందటఁ, గనఁబడుచున్నట్టి భయదకాననమును జొ
చ్చెను వనదేవత లాదరమున నర్ఘ్యంబిచ్చినట్లు పూవులు రాలెన్. 3

ఉ. అందలిమౌనివర్యులు మహాత్ముఁడు రాముఁడు నేటి కిందుఁ జొ
చ్చెం దనమానుషాకృతిని జిష్ణుహితం బొనరించి మోదముం
బొందియెసంగఁజేయఁ బనిపూని యటంచు మహాశిషంబులన్
సుందరపత్రిసంఘముల శోభనవాక్కులఁ దెల్పి రెంతయున్. 4

చ. లత లరరే! సురారివరులన్ బొరిపుచ్చఁగఁ గారణంబు ను
న్నతమతు లెల్లఁ దా ననియె నమ్మఁగ నాపరదేవి మానవా
కృతి నరుదెంచెఁగా యని యకృత్రిమభక్తిని జారుపుష్పసం
తతిఁ గురియించి పూజ విహితంబుగఁ జేసి చెలంగె నత్తఱిన్. 5

చ. భ్రమరము లార్తరక్షకుఁడు రాఘవుఁ డియ్యదె దండకాటవిన్
సమయముఁ బుచ్చ వచ్చె; మునిసత్తములార! తొలంగు నింకఁ గ
ష్టము లొగి మీకు నయ్యమరసంతతికిన్ బ్రమదంబు గల్గునం
చమలమనోజ్ఞఝుంకృతుల నత్తఱిఁ దెల్పెను నేర్పు మీఱఁగన్. 6

చ. ఇదె భవదీయదర్శనము నియ్యెడఁ జేయఁగఁ గాలమెంతొ వే
గ దరలుమా యటంచు నాడికంబునఁ దన్ బురికొల్పఁ గ్రూరుఁడై

మదమున విఱ్ఱవీఁగుశతమన్యువిరోధి విరాధుఁ డీతఁ డీ
పదవిని బట్టివచ్చె ననుభంగిని గేకిరవంబు వెల్వడెన్. 7

సీ. మందసమీరకుమారుండు పొలయుచు, మనసుసంతోష వారినిధి ముంప
శుకశారికాదికశుభపతద్వచనమ్ము, లామోదమాత్మయం దట్టిపెంప
సవ్యాపసవ్యఖేచర మృగగతి విశేషము లుదర్కశుభంబుఁ జక్కఁ దెలుపఁ
జారువీరుద్విజప్రస్తసుమావళు, లర్ఘ్యరూపాతిథేయమును జరప
తే. రమ్ము రమ్మిఁక శ్రీరఘురామ! వైరి,వీరనికరవిరామ! సద్వృత్తధామ!
యనుచుఁ దరుశాఖికాగ్రములలరికదలు,చునునిజాశయమును దెలుపునటులుండ.

చ. చరణసరోజచిహ్నము లెసంగఁగ మెల్లనఁ జొచ్చె నంత భీ
కరనినదం బొకండు వెసఁ గర్ణములం జొరఁబాఱె; రాముసో
దరుఁడు విదేహరాజసుత తత్తఱిలుం గద దాని కంచు లో
నరసి ప్రియాగ్రజన్మునకు స్వాశయ మి ట్లెఱిఁగించె నేర్పుమై. 9

చ. దనుజుఁ డెవండొ వేడ్క నినదం బొనరించినయట్లు లిప్డు మే
దిని రవముఱ్ఱ నిగుడ్చె; నిది తెల్లముగాదె భవన్మనీష; కీ
నినదము ధీరతం దెలుపు నిర్భరతాపపరీతుఁ డెవ్వఁడో
చనియెడు వీనిఁ గూల్చు మనుజాడను దోఁపఁగఁజేయు నిత్తఱిన్. 10

ఉ. స్వానముదీని నారయఁగ శాపవశంబునఁ గ్రూరజాతిలో
దా నెటులో జనించినవిధంబుఁ గనంబడుచున్న; దార్యని
ధ్యానము నిమ్నమైన శుభభావముగల్గినవాని దంచు స
న్మానసు లెన్నఁగాఁ దగు నొనఱ వినియుండుదుఁ దండ్రి చెంగటన్. 11

ఉ. పెద్దలపల్కు లెత్తఱిని బెంపఱఁజేయక సత్యసంచయం
బొద్దికమీఱఁజేయుటకు నోపి చెలంగును; రామచంద్ర! నీ
వుద్దవిడిం దలంపు మెదియో తెలియంబడు దాన దీనిచే
నెద్దియు మార్పు గల్గదని యేఁ దలపోయుదు నన్న నాతఁడున్. 12

ఉ. భీతమృగాక్షి! మున్నె తెలిపెంగద యావిపినస్వభావ మి
ద్ధీతఱినే యెఱుంగఁబడియెఱ మన చేతఁ బ్రియానుజా! మహా
భూత మదెందొ సంచరణముం గడుఁజేయుచు నున్న జాడ నా
చేతము తెల్పుచున్నది; విశేషము లెవ్వియు నుండ విక్కడన్. 13

ఉ. కొంచెపుఁబిట్ట బిగ్గఱఁగఁ గూయు ననంజను నానుడిఱ్ఱ వినం
గాంచమె? దీన భీతిఁ గనుఁగా జనకాత్మజ యంచు నుంతయే
నెంచకు; ధీరురాలుగద యీనృపపుత్త్రిక, జాలమేల యీ
యంచల నుండ దెద్దియు భయప్రదచిహ్న మటంచు నమ్ముమా. 14

చ. అది రొదిరైనఁ దూణముల నక్షయసాయకరాజియుండ నే
మి దిగులు గల్గు నొక్కవడి మేరువు పైఁబడవచ్చినన్ గన
త్ప్రదరములన్ రవంతలుగ ధాత్రిపయిం బడఁజేయవచ్చు నె
మ్మదిఁ బయనంబుఁ జేయుదము మౌనిహితాచరణైక దీక్షచేన్. 15

**— విరాధశాపమోక్షము. —**

చ. అనియిటు లాత్మభావముఁ బ్రియానుజు చిత్తముపల్లవింపఁ దె
ల్పిన విని సంతసం బలర క్షేమ వెసం జనుదేరనున్న య
ద్దనుజుఁ దలంచి రామునకుఁ దా నపు డిట్లను గర్మమార్గముం
గనఁగ నగమ్య మన్న నుడి కాదు మహాత్మక! వ్యర్థ మెత్తటిన్. 16
చ. గరువము పెద్దగల్గి తనకంటెను హెచ్చనలే దటంచు నె
వ్వరు చరియింతు రట్టిరకు వంతలు తప్పవుగాదె? నవ్వుచున్
బరులకు హానిచేయ నదె పాపఫలంబులఁ గూర్ప నేడ్చుచున్
ధరఁ గుడువంగ నౌనుగద తప్పదుగా విధి యెంతవారికిన్. 17
క. పరమేశ్వరుఁడవు శ్రీరఘు, వర! నీచే మేలుగాంచ వాంఛించిన వా
రరుదుగ శుభములఁ గాంతురు, దరమే నీకరుణ నెన్న ధాతకు నైనన్. 18
క. భీకర కార్యం బేదో, యేకరణి నొనర్చనొక్కొ యెక్కాలమునం
దో కుడుచుచున్న దిప్పుడు, నీకృపకుం బాత్రమగుచు నేతేరంగన్. 19
క. తలపోయుచు సత్కర్మం,బులు తన్నుం బొమ్మటంచుఁ బురికొల్పంగాఁ
బలుభంగుల నార్చుచు ని,మ్ముల వచ్చెడుఁ దొల్త భీతిపాలయ్యెన్ మనకున్.
క. పదపడి శుభములు గల్గును,గద యంచుం దెల్ప జనకకన్యపలుకు ల
య్యదనునఁ దనుఁ బురికొలుపం,గఁ దలంపం బూనినట్లుగా మదిఁ దోఁపన్. 21
క. ఎలనవ్వు మోమునందము, వెలయింపం జేయుచుండ? విశ్వేశ్వరుఁ డి
ట్టులు పల్కె లక్ష్మణా! ప్ర,క్కలఁ జూచుచు రమ్ము త్రోవ కంటకయుతమై. 22
క. అడుగిడఁ దరంబుగా కుం,డెడు దీనిం జక్కఁజేయ నేఁబూనుదు నీ
వుడుగక దృష్టుల వడి నె,ల్లెడలం బర్వంగఁజేయు టే పనిఁగాఁగన్. 23
క. జనకజఁ గాచుచు రమ్మా, యనఁగా సౌమిత్రి రిపువధాదృతిఁ గని మిం
చిన నారాచము గొనయం,బునఁ జక్కంగూర్చి శౌర్యమునఁ బొల్చె యనున్.
క. ఇరుపక్కియలం గాంచుచు, నరుదెంచెద సుంతయే భయంబు వదినె భీ
కరవనమున నిటఁ గాంచక, యరుదెంచుం గాక యనియె నత్తరుణమునన్. 25
సీ. త్రోవకడ్డము గాఁగఁ దొరలుచుండిన పెద్ద, పొదలు పాదాహతిఁ జదియుచుండఁ
దనగతి కెదురుగాఁ దగుతరువరములు, వక్షంబు తాఁకున వసుధఁబడఁగ
దూరంబు వ్యాపించి సారముగలవిటపములు గదాస్పర్శనమున విఱుగఁ
గరుల లెక్కింపని కాలుదున్నలపిండు, హుంకారరవమున జంకి యడఁగఁ

తే. బదము లిడునప్పు తద్భాగవసుధ తగ్గ, నడక చప్పుడు మేఘనినదము మించ
దివిజభీకరమయి క్రూరదేహ మొప్ప, నరుగుదెంచెను రక్కసుం డప్పథమున.

క. దక్కినమున కేగెడువా, రక్కజపడిచూచుచుండ నయ్యసురుఁడు పే
రుక్కున వారలఁ గన్గొని, పక్కన నవ్వుచును నిల్చె భయదుండగుచున్. 27

ఉ. అక్కితవుండు మూఁపున మహాగద దాలిచి సవ్యహస్తమం
దొక్కమహాసి రక్తయుతి నుజ్జ్వలమై కన దారుణంబుగాఁ
బెక్కుమృగంబులం జదిపి ప్రేఁగులు చుట్టుకొనంగ నొప్పఁ బెం
పెక్కినగర్వ మూని యొకయింతయు నోర్పనలేక యుండఁగన్. 23

ఉ. భీతకురంగనేత్ర! యటవిం గనఁ గ్రొత్తగ నున్నయాయుధ
వ్రాతయుతాంగముం గనుచు వానిభయంకరపూర్వకర్మ సం
జాతఫలంబె యిద్దియని స్వాంతమునం దలపోసి స్వాశయం
బాతఁడె దెల్పె రామునకు నద్ది మఱందికిఁ దోఁప కుండఁగన్. 2:)

ఉ. శ్రీరఘురామ! ప్రాగ్జనిని జేసినపాపఫలంబె యిద్ది యె
వ్వారికినేని భీతినిడుభంగిని దోఁచెడు; నాకుఁ జూడ దు
ర్వారమృగాంతకంబయిన వర్ష్మముగాఁ దగునంచుఁ దట్టె నీ
భూరికటాక్షపాతమునఁ బొందునొకో త్రిదివంబు నిత్తఱిన్. 30

ఉ. నీవెనుకన్ వసించుటను నే నిటనుండఁగఁ జాలితిం బ్రభూ!
నీవలె నెల్లవారలు వినీతుల రక్షణమందుఁ దత్పరుల్
గా వసుధం జెలంగుదురెఁ గ్రన్నన వీనిఁ దొలంగిపోవు టె
ట్లో వెస నూహచేయు మిఁక నొప్పదు జాలము సేయ నంచనన్. 31

ఉ. ఆవిపులాత్మజాత హృదయంబు నెఱింగి విముక్తినీయఁగా
నీవె కదా యటంచుఁ దను నేర్పు మెయిం బురికొల్పుచున్న దీ
భావము కర్మసంభృత మభంగుర ముత్తమసమ్మతంబు నా
గావునఁ జేయువాఁడఁ గుతుకంబున నిందులకే జనించుటన్. 32

ఉ. ఐనను వీనినుండి యొకఁడైనను దోషము కల్గకుండఁగా
నేనెదియే నొనర్పఁ జన దీయెడ నూరకచూచుచుండు నీ
దానవుఁ డూరకుండఁ డిదె దర్పముఁ జూపఁగనున్నవాఁడు నా
మానిని బట్టుకొం చరుఁగు మామకశక్తి నెఱుంగఁ జాలమిన్. 33

ఉ. మారుత మొక్కఁడే యితనిముక్తికి నంతర మున్న దిప్పుడే
శూరతమీఱ భూతనయఁ జూడఁగఁ బ్రీతిని బూనెఁ గాలముం
జేరువ కేగుదెంచెడిని సిద్ధపథంబునఁ బోయి స్వర్గముం
జేరి సుఖింపఁ జేసెదను జిత్రశరంబుల వైచి యేపునన్, 34

చ. అని మదినెంచుచుండఁగనె యాతనిఁ గర్మము ప్రోత్సహించె నా
దనుజుఁడు వింతన వ్వాలయఁ దన్విని సోదరయుగ్మముం గనుం
గొని భయదాట్టహాసమునఁ గోపముఁ దెల్పుచు రక్తనేత్రముల్
దనయనుభావముం దెలుప ధాత్రికుమారిక యుండుచోటికిన్. 35

చ. వడిఁ బరుగెత్తె నాదనుజువర్ష్మము క్రూరమృగాంగసంహతిన్
జడిగొని కాఱురక్తమున స్నాన మొనర్చినయట్టు లుండె న
ప్పు డతని దీర్ఘబాహువులమూలములందు భయంకరంబులౌ
నడవి మృగంబు లుండె నవి యాతనిచే నిహతంబు లేపునన్. 36

తే. కొన్నిటిం దినిమఱియును గొన్నిటిఁ దిన, నెంచిచంక నెళవముల నుంచుకొనియె
నవియె భీతికరంబులై యమరు నింక, నతనియాకృతి యెట్టిదం చరయనేల.

సీ. బొమముడిఁ గాంచినఁ బొక్కు లోకము లెల్ల, నితఁ డేమి చేయునో యింకననుచుఁ
గనులు త్రిప్పినయంతఁ గడగడ వడఁకుదు, రమరులెల్లరు నేమియగునొ యనుచుఁ
బయనము సాగింపఁ భయపడుచుందురు, మును లెల్ల నెవనిఁ జంపునొ యటంచు
నడుగిడఁ బూనిన యంతవడంకును, శేషుఁ డేవగు నొక్కొ చిక్కు లనుచు
తే. నడవి నడుగిడ వ్యాఘ్రాదులడలు వీని, యాఁకలికి నేది యాహారమగునొ యనుచుఁ
బ్రళయకాలాంతకుండె యీవపువుఁ దాల్చి, వచ్చినాఁ డనితలఁతురు వనదివిజులు.

క. కనుకనె వానిం గాంచిన, మనుజులు తత్క్షణమ ప్రాణమారుతము లొగిం
జన నల్లి పడుదు రిలపై, దనుజుం డట్టిఁడు నితాంతదర్పము పొంగన్. 39

చ. జనకజయున్న చక్కటికి సత్వర మేగి సహోదరద్వయం
బును గని లెక్కసేయకయె పొంగెడు వేడుక నెత్తికొంచు సీ
తను బరువెత్తె; రాఘవుఁడు తద్విధముం గనుచుండెఁ గాని బా
ణనికర మేయఁ బూనఁడు మౌనంబునఁ గాలము నెన్నుచుండుటన్. 40

చ. నిముసము ముందువెన్క లన నేరరు కర్మఫలాళి లబ్బుచో
వనరుహసంభవాది సురవర్యులు భేదము కల్గవచ్చునం
చనితరసాధ్యశక్తి కలయట్టిది కర్మము బ్రహ్మరూపమౌఁ
గనుక నెదుర్కొనం జగక క్రమ్మఱఁ జేయఁగ నేరకే తగున్. 41

తే. రాముఁ డవ్విధ మెఱిఁగి దుర్వారశక్తి, మానుషుఁడయ్యును వానిని స్రుందఁ జేయఁ
బూనఁడయ్యె స్వదనమాటఁ బొల్లువోవఁ, జేయఁ బూను నెయెవఁడైన నక్షితితలమున

ఉ. జానకిఁ జంక నుంచుకొని శాత్రవభీకరు రామచంద్రునిం
దా నొకమర్త్యమాత్రునిగ దర్పవిహీనునిగాఁ దలంచుచుం
గానల మున్ను వాఁడు లేఁ గ్రాలెడువారలఁ జూడకుండుటన్
మానసవాంఛ యుప్పతిల మానినితోఁ బరువెత్తి యంతటన్. 43

ఉ. దూరముగాఁగఁ బోవుటకుఁ ఽ దోఁపమి నిల్చి భయంకరారవం
బారఁగ మీర లెవ్వరో మఽహాశమును లట్లుగ నొప్పు వేషముల్
పౌరుషసారముం దెలుపుఽ బాణశరాసనఖడ్గముల్ తగన్
జేరితి రీవనంబును బ్రఽసిద్ధసురారినివాసముం గటా!
యారయ వేషభిన్నమగు ఽ నాయుధధారణ మెన్నఁ జిత్రమా. 44

చ. అనుపమమానిధార్యములె ఽ యాఁగద యీయజినాదికంబు లీ
సునిశితబాణచాపములఽచొప్పు నెఱుంగరుగాదె మౌను లీ
వన మిటు చిత్రవేషములఽ భామిని వెంబడిరాఁగఁ జొచ్చి నా
రనయులు మీరలంచు మనఽమందుఁ దలంపఁగ నయ్యె నియ్యెడన్. 45

క. పాపాచారుల మిమ్ముల్, రూపఱఁజేయం దలంతు ఽ రూఢి యిది మహా
తాపసభీకరుఁ డనుఁగా, నేపునఁ జరియించువాఁడ ఽ నిందు సతంబున్. 46

క. దనుజేంద్రుండ విరాధుం, డనఁగాఁ బేరొందినాఁడ ఽ నని మొన నన్నుం
జెనకంగఁ జాల రెవ్వరు, వినఁగోరుదు మీచరిత్ర ఽ వివరింపుఁ డనన్. 47

క. శ్రీరాముఁ డట్లుపల్కెడు, ఘోరాసురుఁ గూల్చునట్టిఽకుతుకముఁ గొన క
వ్వారిజలోచన దుస్థితిఁ, గారణముగఁ జేయనెంచి ఽ కాలహరణమున్. 48

క. అనుజన్ముఁ గాంచి పలికెన్, కనుచున్నాఁడవుగ సీత ఽ కలవిలపాటుం
గనురీతి నిట్టికష్టం,బును గాంచునె నేను జెంతఁ ఽ బొడఁగనుచుండన్. 49

క. ఘోరాసురుభీకర దో,స్సారము బడలంగఁజేయ ఽ సరసాంగి వగం
గూరెడు నే నిటఁ జూచుచుఁ, బౌరుషమే లేని వానిఽవలె నున్నాఁడన్. 50

చ. ఒరులకు హాని యించుకయు ఽ నొక్కపు డేనియుఁ జేయనెంచ నె
వ్వరు శరణంబు వేఁడినను ఽ బ్రాణములైన నొసంగి కాచుత
త్పరతను గాంచువాఁడ నొకఽపల్కు నసత్యముఁ జెప్పఁబూన ని
వ్వరుసఁ జరించు నాకు నడుఽవం దగనట్టిశ్రమంబు వాటిలెన్. 51

చ. మనుజులఁ గాచు ధర్మ మనుఽమాట యపథ్య మటంచుఁ బల్కు న
మ్మనుజులు నీచబుద్ధులని ఽ మామకకష్టమె తెల్పుచున్న దీ
జనకజ కిట్టి కష్టతతి ఽ సంభవమౌ నని స్వప్నమందు నే
ననుకొనియున్నయట్టులు మఽదాత్మకుఁ దోఁపఁగ లేదు లక్ష్మణా!. 52

చ. ఒకతఱిఁ గాచు ధర్మ మది ఽ యున్నతకష్టములం గలంచి వే
ఱొకతఱిఁ గావఁజాలక నిఽజోరుమహత్త్వ మడంగ నుండు న
ట్టి కడఁకనుండు టారయఁ గఽడిందివిచారము పుట్టఁజేయుటన్
సుకరముగాదు లోకులకు ఽ సూనృత మిద్దని నమ్మఁ జెప్పఁగన్. 53

ఉ. కొందఱు ధర్మమార్గమునఽకున్ విముఖత్వముఁ జూపుచుండఁగాఁ
గొంద ఱధర్మమే ఫలముఽగూర్చుట స్వానుభవంబుచే వచిం

పందగు నంచుఁ బల్కె నిది పద్ధతి దీని కటంచుఁ జెప్పి స
ద్బృందము పామరాళి నెటు లింతయుఁ దృప్తిని గాంచఁ జేయనౌ! 54

మ. అనుజన్మా! విధి యెంతయుం బ్రబల మీయర్థంబునం దంచు నా
మన మెంతైనను నమ్ముచున్న యది దుర్జ్ఞానంబు పోఁదట్టి యే
మనుజుం డైనను స్వీయకర్మగతులన్ మన్నించి స్వాతంత్ర్యముం
గన కుర్విం జరియించు టొప్పునని యీకార్యంబు మూలంబునన్. 55

చ. పరమపతివ్రతాత్వమున భాసిలు నీజలజాక్షి నే నిటన్
శరవితతిన్ శరాసనము శౌర్యముగల్గినయట్లు తాల్చియుం
డ రహితభీతి నీదనుజనాథుఁడు కైకొనిపోయె నేమనం
దరమగు నింక నోయనుజ! దైవమె యెక్కు డదెట్లు చూచినన్. 56

చ. దనుజుఁ డొకండు రాఘవునిదర్పము నెంతయుఁ జుల్కఁజేసి యా
తని సతిఁ గొంచుఁ బోవునటు దైవము లోఁదలపంగ నే శవం
బనఁజన నున్నవాఁడ నని యాత్మఁదలంపు మటంచు దీనతం
గనినటు పల్కుచున్న నృపకాంతునిఁ గాంచి సుమిత్రపట్టియున్. 57

ఉ. పట్టఁగరానిక్రోధమునఁ బల్కె రఘూద్వహ! చింతఁబూను టీ
పట్టున నొప్పునయ్య! ననుఁ బంపుము రూపఱఁ జేయువాఁడ నీ
కట్టడిదానవుండు జనకప్రియనందనఁ బట్టుకొంట పై
నిట్టులు మాటలాడుటయు నెంచిన సిగ్గగుచున్న దెంతయున్. 58

క. అనుచుండు నంతలో నా, దనుజేంద్రుం డిట్టులనియె దర్పంబున వా
క్కును వినకయున్నవారలు, వినఁగోరితి మీర లెవరొ వినిపింపుఁ డనన్. 59

క. తనుఁగూర్చి ప్రశ్న చేసెడు, నని రాఘవుఁ డిట్టులనియె నార్యకులమునన్
జనియించినవారము; కాననములఁ దిరుగంగ వచ్చినారము స్వేచ్ఛన్. 60

క. నరపతులము మనుజహితా, చరణుల మీయదియె మాసుచరితం బిఁక నీ
చరితము వినఁగోరెద మీ, యరణ్యమున నుండ నేల యన్వయ మెదియో. 61

క. తెలియం బలుకుము నా విని, కలకల నవ్వుచును బల్కెఁ గ్షత్రియుఁడా నా
కులముఖముల వినఁగోరెదొ, తెలిపెద నాతండ్రి జయుఁడు తీవ్రబలుండౌ. 62

క. జనని శతహ్రద నాయకి, దనుజకులంబౌను నన్ను దానవవరు లె
ల్లను బ్రీతి విరాధుండని, వినుతింతురు తపము చేసి విధి దయఁ గంటిన్. 63

క. ఆర్జించితి శస్త్రంబుల, నిర్జించితి దేవనరుల నే శౌర్యమునన్
దుర్జయుఁడ సంగరంబుల, భర్జించితి మానివరులఁ బల్కు లిఁ కేలా? 64

ఉ. మీరిఁక నీపడంతిపయి మించెడునాశను మాని యింటికిం
జేరఁగఁబొండు నీయతివ చిక్కుట మిమ్మిటఁ జంపమానితిన్

నా రఘురాముఁ డిట్లను మనంబునఁ గుందుచు నిస్సిరో! దురా
చారము దీనిఁ బూనితివె చచ్చితి విప్పుడె పాపసంగతిన్. 65

ఉ. సంగరరంగమందు నినుఁ జంపెడువారలె లేకయుండ శ
క్తిం గనినాఁడవో కనెదు తీవ్రమదంబకసత్త్వ మిప్పుడే
బంగరుపింజలం జెలఁగు బాణము లియ్యవె నీదు రక్తముం
బొంగుచుఁ ద్రావుఁగాక! రణభూమిని నిల్వుము సుంత యం చొగిన్. 66

చ. గురుతరబాణసప్తకముఁ గూర్చి గుణంబును లాగి వైవ నా
శరములు దానవాంగమును సత్త్వము పొంగఁగఁ జీల్చికొంచు వే
పరుగిడి భూమిఁ జొచ్చె నిటు బాణము లేగఁగ రక్తపూరముల్
శరములతోడఁ బాఱెఁ దమసఖ్యము వానికిఁ దెల్పుకోర్కి నాన్. 67

ఉ. అంత మహాసురుండు విపులాంబకపాతమునం గలంగి దు
ర్దాంతరుఁ డుగ్రమూర్తియయి ధాత్రి కుమారిక డించి శూలసం
క్రాంతమహాభుజుం డగుచు రాఘువులన్ వధియింపఁ బాఱె నా
యంతకురీతి వక్త్రగుహ యార్తిని జూపఱ కట్టె నింపఁగన్. 68

మ. తమపైకిం బఱతెంచు దానవుని నంతంబుం గనం జేయు బా
ణము లాయిర్వురు వైవఁగా దనుజుఁ డానారాచసందోహపా
తము లెక్కింపక యట్టె నవ్వుచును గాత్రం బెల్ల జృంభించు కా
ర్యమునన్ నిల్వఁగ వీడి బాణము లొగిన్ జ్యాభాగమందుం బడెన్. 69

చ. అదిగని యారఘూద్వహుఁ డహార్యబలంబున నగ్నిరీతి భీ
తిదమగు బాణయుగ్మమునఁ దీవ్రమహాకృతి నొప్పుశూలమున్
జదియఁగఁ జేసె; వాఁడు ఘనసత్త్వము పొంగఁగఁ బైకిరాఁగ న
య్యదనున కర్హమానటు మహాసిలతల్ గొని కొట్టి రిర్వురున్. 70

సీ. కౌక్షేయకహతు లొక్కటఁ దనయంగంబుఁ, జీల్చుచుండఁగ వానిఁ జిత్తమందు
సుంత లెక్కింపక సురవైరి వారల, వడి నెత్తుకొనిపాఱెఁ బౌరుషంబు
భయదరూపముఁ దాల్చి పరుగిడుననితోఁచె, వనదేవతల కెల్ల దనుజుఁ డంత
వారలఁ గొని యొండువనముఁ జేర్పఁగ నెంచె, నని తోఁచునట్లుగ నరుగుచుండఁ
తే. దమ్మునింగని శ్రీరఘుతల్లజుండు, పలికె నీతఁడు మన మేగుపథమునందె
పోవుచున్నాఁడుగద యిట్లుపోవ నిత్తె, మఱియు నస్మద్గతికి సహాయంబె సుమ్ము.

మ. అనుచుండంగ విరాధుఁ డర్భకులఁగా నాయిర్వురం గొంచు న
వ్వనముం బాసి చనంగఁ బూనె నది తా భావించి యాపక్కసుం
బనుపంగాఁ దగుఁ బూర్వలోకమునకున్ వచ్చెంగదా కాలమ
ప్పనికంచుం దెలుపంగఁ బూని యనియెం బద్మాక్షుఁ ఛద్మంబుగన్. 72

చ. ఇతరులకున్ సహాయపడుటే తనకార్యముగాఁగ ధర్మమే
హితమగు దోడుగాఁగఁ దనయాశ్రితమే శరణంబుఁ గోరుస
ద్వితతికి మేలుఁగూర్పఁ దగు విస్తృతభద్రముగాఁగ నివ్విధిన్
క్షితిఁ జరియించు రామునకుఁ జెల్లునె యీదురవస్థ పాటిలన్. 73

మ. సమయజ్ఞుండగు శ్రీరఘూద్వహుఁ డిదేచందంబొ యిట్లూరకే
గమనంబుం దమిఁ జేయువాఁడు నను నింకం గాంచి యేమిట్టు లీ
శ్రమముం గాంచెద వంచు నాదృతిమెయిం బ్రశ్నించు వారెవ్వ రీ
సమయం బెట్టిదొ ప్రాణనాయకుఁ డెదన్ సంధించు టొప్పుంగదా!. 74

ఉ. కాలము దాపరించుట నఖండమతిప్రతిభా విశేషతం
గ్రాలు రఘూద్వహుం డెద నిఁకం దలపోయకయుండఁ జెల్లునే
వేళకుఁ గర్మసంతతి వివృద్ధ తదర్హ ఫలాళి నీయఁగాఁ
జాలు నటంచుఁ బల్కుదురు సాధుమతుల్ వినియుంటి నీవిధిన్. 75

చ. అని తను హెచ్చరించుసతి యాశయ మాత్మ నెఱింగి లక్ష్మణా!
జనకజ యార్తయైనటు వచస్తతిఁ దెల్పెడు నింక నీవి రా
ధుని వధియించు టొప్పు నన ఘాతరిపుం డగు లక్ష్మణుండు ఖ
డ్గనిహతి సవ్యహస్తమును గ్రన్ననఁ ద్రుంచెను సాహసంబునన్. 76

చ. రవికులనాథుఁడై వెలయు రాముఁడు దక్షిణహస్త మంతలో
జవమున ఖడ్గసారమున శౌర్యము పొంగఁగఁ ద్రుంచె; నంత వాఁ
డవనిపయిం బడెన్ మఱియు నాతనిఁ బెక్కువిధంబులన్ గడుం
బవిసదృశాత్మముష్టిగురుపాదసమాహతులన్ మహాక్రుధన్. 77

ఆ. ముద్దచేసి రంత మూర్ఖుఁ డాదనుజుండు, వార లెంతకఠినబాధలు గనఁ
జేసినను స్వకీయజీవముఁ బాయక,యుండు టెఱిఁగి రాఘవుండు పలికె. 78

క. అనుజన్మా! యితఁడు తపం,బును జక్కనొనర్చెఁగాన బూనిక నేసా
ధనములఁ గొట్టినఁ జావఁడు, గనుకన్ వ్యర్థంబు వీనికడ నీశ్రమముల్. 79

క. ధరణిం ద్రవ్వి కళేబగ, మురుతర మిద్దాని వైచి యొక్కమొగి నదె
వ్వరికిం గనరాకుండెడు, కరణిన్ మృత్తికను జక్కఁ గప్పద మంతన్. 80

క. మృతినొందును వీఁ డనఁగా, దితిజేంద్రుం డాలకించి దివ్యపురుషుఁ గా
మతినెన్ని పలికె దేవా!, దితిజాంతకుఁడవగు నిన్నుఁ దెలియకయుంటిన్. 81

చ. ఇపుడు దివాకరాన్వయము నెంతయు ఖ్యాతిని గాంచఁ జేయు వాం
ఛపొడమ రామనామమున సంభవ మందితి వం చెఱింగితిన్
గృపకు నిధానమీవు జనకేంద్రుని పుత్రిక యాదిలక్ష్మి నీ
యపరశరీరమే యితఁ డహార్యబలుం డనుజుండు నాఁ దగున్. 82

క. కలరూ పెఱిఁగితి నిత్తఱిఁ, గలిగెఁ జ్ఞానంబు సుంత । కరుణాసింధూ!
తెలిపెద నాచరితం బి,మ్ములఁ దుంబురుఁ డనఁగ ఖ్యాతిఁ । బొల్చెడువాఁడన్.

సీ. గంధర్వుఁడను దేవ।కాంతలమిన్నయా, రంభను బ్రేమించి । రాజరాజు
కొలువుఁ జాలించితిఁ । గోపించి యు త్తేశుఁ, డసురుండ వగుమని । యంత శాప
మొసఁగె; దానం జేసి।యురుదుఃఖ మొప్పఁగ, బహుళభంగులంబతిఁ । బ్రార్థనంబు
చేసితి; నద్దాన । నీసుమాని యతండు, దశరథసూతి యే।తరుణమందు
తే. నిన్నుఁ జంపునొ యప్పుడె । నిజతనుయుతి, స్వర్గ మొందంగఁ గలవని। శాపము క్తి
నట బ్రసాదించె నేఁటికి । నదిఫలించెఁ, జనియెదఁ స్వీయలోకంబు।గనఁగ రామ!

క. మంగళమగుతఁ నీకునె,సంగుత విజయంబు సకల। శత్రువితతిఁ జె
ప్పంగం దగునొక నుడి శర,భంగ మహా।మాని! పరమ।శాంతుఁ డిచటికిన్. 85

క. ఒకయామడపై గవ్యూ,తికలుగు దూరంబునందు । దివ్యతపోభా
గ్యకలితుఁడు సూర్యతేజుఁడు, సకలజ్ఞుం డలరుచుండు । శాంతధనుండై. 86

క. ముని నతనిం గనఁ బొమ్మా, నినుఁ గాంచినయంతము క్తి।నిం గాంచును మీ
కొనరిచి యుత్తమలాభం, బనఘా! నన్నింకఁ బూడ్చు।మా యిచోటన్. 87

క. దనుజులశవములు పూడ్పం, జను నను నాచార మొకఁడు । సాధుహితముగాఁ
దనరుఁ దానఁ వారలు, చనుదురు స్థిరసుఖము లబ్బు।స్థానంబులకున్. 88

క. మరియాద దానిఁగాచుట, సరియొకదా నీకు రామ।చంద్రా! యనుచుఁ
శరనిహతి శీర్ణతనువుం, ద్వర వీడి యతండు చనియె । స్వర్గంబునకున్. 89

క. ఆతఁడు వచించినట్లే, యాతనువుఁ శ్వభ్రమందు। నం దుంచి శిలా
వ్రాతాదికములఁ గప్పిరి, భూతనయయు దానిఁ గాంచి । పొల్చెం దమతోన్.

క. అంతఁ రఘుపతి లక్ష్మణ!, వింతగదా యద్ది యంచు । పెఱఁగందకుమా
పంతమునఁ దెలియఁదగుఁ బయిఁ, జింతింపం దగును గర్మ।సిద్ధాంతంబున్. 91

సీ. సృష్టిభేదంబులం । దెందు నేజంతువు, లేకర్మమును జేయ।నెఱిఁగి యొండె
నెఱుఁగకయొండె న।శెల్లఁ గాలంబున, ఫలముల నీయంగ । వలసియొండె
వాంఛింపకయ యొండె । వానినిబొందెడు, నేనొల్ల ననుమాట । నెపుడుఫలము
గనఁజాల దనుచు నీ।మనసున నునుపు మ,ఖండగర్వంబునఁ । గాన కొరులఁ
ఆ. గష్టపడఁగఁ జేయు । కట్టిఁడి మనుజుఁడు, తత్ఫలంబు నాకుఁ । దగ దటంచుఁ
బలుకఁగలఁడె ఫలము।గలుగునే దాన దే,వతలుగూడ నట్లు । పలుకఁ దగరు.

చ విడువదు కర్మ మెవ్వరిని । వృత్రహరుండని యెన్న దెద్ది యె
ప్పుడు కలుగంగఁ జేయఁ దల।పోయునొ యప్పుడె కల్గఁజేయు భీ
తుఁ డితఁడు వీఁడు ధీరుఁడని । దోషముచేసినఁ బక్షపాత మొ
క్కఁడను గొనంగఁ బూన కెది । యీఁదగు నాఫల మిచ్చి తీఱెడున్. 93

చ. కొలఁదిగనైన బాపములకును గుఱియైతగు కర్మ మెద్దియేఁ
దలఁపను జేయ నా కిపుడు దారుణకష్టము లిట్లువచ్చె నం
చలయక పల్కుచుండు; నది వ్యర్థము ప్రాగ్జని సంస్మరించి త
త్ఫలములె యివ్వి యంచుఁ దలఁపం జను వాఁడు వివేకి యైనచోన్. 94

క. ప్రారబ్ధము భోగంబున, నారయ నశియించు నందు రార్యులు సహజా!
యీరక్కసుఁడే దీనికి, సారంపుటుదాహరణము చక్కఁ దగుఁజుమీ. 95

సీ. కొన్ని దుష్కర్మముల్ మన్నించి తొలఁగును, ఫలమునీయక యని పలుకుచుందు
రొక్కకొందఱు విను మోగుణాకర! దాని, తాత్పర్య మేమనఁ ధర్మకార్య
బాహుళ్యమున మహాల్పఫలదములగుదు,ష్కర్మముల్ నశియించుఁ గాని యవియు
నజ్ఞానకృతములైనవై యుండవలయుఁజు, మ్మెుండొక విధమైన నొప్పదదియుఁ
ఆ. గాన హెచ్చరికను బూని కర్మంబుల, సాధుసమ్మతముల శాస్త్రనియతి
వదలకుండఁ జేయవలయును దత్ఫల,ములను దానె పొందవలయుఁ గాన. 96

క. ఎవ్వరిమూలంబునఁ దా, నెవ్వని కేఫలముఁగూర్చు నెంచునొ కర్మం
బవ్వడువునఁ గూర్చును వా, రెవ్వరొ యొండొరులబూర్వ మెఱుఁగకయున్నన్.

చ. విను మనుజా! మహర్షు లటవిం జరియించుచుఁ దోడుసూపు నీ
మనలను బ్రోత్సహించి; రభిమానము నొందనిమాటలం గటా!
యని తలపోసి యీయడవియందుఁ జరింపఁగ వచ్చినార మీ
పనికయి కర్మమే మునులఁ బాల్పడఁజేసె నసూయ నొందఁగన్. 98

ఆ. మనల నెంతొ మున్ను మన్నించువారలు, సాగ నంపఁ బూనుచందము గల
పలుకుగముల నొప్పిపడఁ జేయఁగా నేల, యపుడు తలఁపమైతి మార్య! దీని

క. వారలకుం గర్మమె చెడు, కోరికఁ గల్గించి మనలఁ గోపంబున న
ట్లూరక పల్కం జేసెను, నేరము మున్నదియెఱుంగ నేనును నీవున్. 100

క. మనవలననుండి కష్టము, మునులకుఁ గల్గంగ నేల పోవుదమని యీ
వనిఁ జేరితి; మీతని వధ,మున కే కర్మమ్ము మునుల మూలమ్ముననే. 101

తే. మనలఁ బురికొల్పె నివ్వనమునను శాప, ముక్తి గాంచఁగ సంసిద్ధముగ నెసంగు
వానికొఱ కేగుఁడని యిప్పు డీనిదాన, మూహ చేయంగఁ గనఁబడెనో కుమార!

క. భగవంతుఁ డొక్కఁడే క, ర్మగతుల నెఱుఁగంగఁ జాలు మాయఁ గొనుతఱిఁ
జగముల నెవ్వరు దెలియం, దగరుసుమీ విష్ణుహరశతధృతులుగూడన్. 103

క. ఈవిధ మెఱిఁగినవార ల,దే వారిఁ దూఱకుండు రిది యెఱుఁగమిఁ గా
దే వైరి వీఁడు నాకని, భావించుట సాజమయ్యెఁ బరిపాటియదే. 104

క. సర్వమునకుఁ గారణమై, యుర్వర నెవ్వరి కెఱుంగనొప్పెడు నను నా
గర్వము దూలించు చొగిఁ, సర్వేశ్వరి యుండుఁ దద్విశాలమహిమమున్.

క. కనుఁగొన నామెను బ్రార్థించిన సుంతయెఱుంగుచొప్పు చిత్తంబునఁ దోఁ
చును గాని వేఱుపాయము, నను దోఁపదు సత్యమిది యనందగు ననుజా!. 106

క. శరభంగుఁ డన్నమౌనీశ్వరుఁ జూడఁగఁ బోవఁ దగు జనంబున నని యా
శరవరుఁడు తెల్పెఁ గాదే, యరుగుద మామౌనిచంద్రు నాశ్రమమునకున్.

క. అమ్మౌని మనలఁ గని మోక్షమ్మును బొందంగఁ బోవఁ గాంక్షించెడు నం
చమ్మనుజాశనుఁ డనుచు దివమ్మునకుం బోయె సత్యవచనం బదియా. 108

క. అదియేమిచిత్రమో కనఁగఁ దగుం గద వేగ పోవఁగాఁ జెల్లు నటం
చెదఁ గల్గుభావ మొకరీ, తిఁ దమ్మునకుఁ దెల్పి తనసతిం గూడి చనెన్. 109

క. అటవిం గల చిత్రంబులఁ గుటిలాలక కెఱుఁగఁ జెప్పఁ గుతుకము గనుచున్
విటపాంతరమార్గంబుల, నెటొ పోయి రఘూత్తముం డతిహీనతపమునన్. 110

క. వెలుఁగొందఁ జేయుచుం గానల నెల్లను క్రూరమృగగణంబును శాంతిన్
విలసిల్లఁ జేయుచున్ వర్తిలు నా శరభంగమునిపతిన్ దర్శింపన్. 111

క. వేడుకయుప్పొంగఁగ నన్ బోఁడియు సౌమిత్రి వృక్షముల సాంద్రముగాఁ
గూడిన లతలం గాంచుచు, వీడనియుత్సాహ మొప్ప వెనుకం జనుచున్. 112

## శరభంగమునిచరిత్రము.

క. వీరుద్విశేషముల రఘు, వీరుని బ్రశ్నించుచున్ సువృత్తమహితు దే
వారిభయంకరతేజుని, సారజ్ఞానాంబురాశి శరభంగమునిన్. 113

క. కనుఁగొను నెపుడను కుతుకంబును గాంచుచుఁ జొచ్చి రత్తపోవనమును; దే
వనికాయయుక్తుఁడై యమ్మునిఁ గానఁగ వచ్చియుండెఁ బురుహూతుండున్.

చ. మునివరుతోడ నెంతయుఁ బ్రమోదము మీఱఁగఁ బల్కుచుండె; నం
త ననుజుఁ గాంచి పల్కె గుణధాముఁడు రాముఁడు దేవవర్యస్యం
దనమును జూపుచున్ దివి నితాంతము వెల్గెడు నారథంబు జి
ష్ణునిదని యెన్నుమా మునిని జూడఁగ వచ్చిన యట్లు తోఁచెడున్. 115

ఉ. నీవిట జానకిం గనుచు నిల్వుము; నే మునిఁ గానఁ బోయి యం
దేవిధి దేవవర్యునకు నిమ్మునికిం దమి సాగుచున్నదో
యేవిషయంబుఁ గూర్చినదొ యింపగు వాదము సారభూతమౌఁ
గావున నాలకించి వడిగాఁ జనుదెంచెద సాధుభావనా!. 116

ఉ. ముప్పదియేండ్లప్రాయమె విభూషణమై కనుపట్టుఁ దమ్ముఁడా!
యెప్పటికీసురాలి నని యెన్నుమ నీమది భూరితేజ మ
ట్లొప్పుచునుండు వీరియెడ నున్నతపుణ్యఫలంబ దెప్పుడుం
దప్పదు గాదె యిట్టిసురతల్లజులం గన నెంత్రు సన్మునుల్. 117

చ. దొరకిన దట్టి సన్మహామునితోడనె వచ్చెద నంతదాఁక నీ
ధరణిని నిల్వుమం చరిగెఁ । దా రఘుభూపతిచంద్రుఁ డాశ్రమాం
తరమున కింద్రునింగను ముదంబున; నవ్విధ మాత్మ నెంచిని
ర్జరపతి మౌనితోడ నిదె । రాముఁడు వచ్చెడుఁ గంటె యాతనిన్. 118

చ. ఇతఁ డొనరింపఁగాఁదగిన । వెన్నియొయున్నవి దేవకార్యముల్
మతివిభవంబుమీఱఁగ నమానుషవిక్రమలీలఁ దీర్చి య
ప్రతిమయశంబుఁగాంచి పిదపన్ ననుఁ గాంచెడుఁ గాక! యిప్పుడే
నతిజవమొప్పఁ బోయెద శతాంగముతో నని యేగె నంతటన్. 119

చ. అరదము వ్యోమమం దరుగు । టారసి రాముఁడు జానకిన్ సహో
దరుఁ గరసంజ్ఞఁ బిల్చి మునితల్లజుఁ జూడఁగ వారితోఁ జనెన్!
నిరుపమభక్తి నచ్చట మునిప్రవరుండు సుపాశ్రితానలుం
డు రహితతామసుండుఁ బరిసుత్తమనోవికృతుండునై మదిన్. 120

చ. అనలునియందుఁ జొచ్చుటకు । నాదరమొప్పఁగనుండె రాఘువుం
డనుజుఁడు సీతయుం జని మహాత్ముని యంఘ్రులఁ బట్టుకొంచు వం
దనము లొనర్చి రంత మునినాథుఁడు చెప్పఁగఁ గూరుచుండి రిం
ద్రునిదగువార్త యేమనుచుఁ । దోరపువేఁడుక రాముఁ డడ్గినన్. 121

క. శరభంగమౌని యిట్లనుఁ, బరమంబగుతపము నొనరుపన్ దానికిఁ గా
వరదుఁడు దేవేంద్రుఁడు నా,పరిసరమున కేగుదెంచి । బ్రహ్మపదమునన్. 122

క ననుఁ దోడ్కొనిచని యట ని,ల్పనువచ్చెను; జెంతనుండు । పరమేశ్వరు నిన్
గనకుండఁ బోవ రా దని, నిను నతిథిం బూజసేయ । నిల్చితి రామా!. 123

సీ. ధర్మరక్షణమునఁదత్పరత్వముమించఁ, బురుషోత్తముఁడనుచుఁబొల్చుఖ్యాతి
యసదృశమై తగ । నవనీభరము వాప, నవతరించినపరమాత్మను నినుఁ
గూడియుండుటయె నాకోరినయట్టి బ్ర,హ్మానందసౌఖ్యము । ననుభవించి
నట్టిదయగు; స్వకర్మార్జితసుకృతము, చేత నాలోకంబుఁ జెందువాఁడ
తే. రఘువరాన్వయజలధిచంద్ర! విను రామ, తపముబలిమినిస్వర్గాదిసుపదములను
నేను సాధించినాఁడ నవ్వానినెల్ల, నీకు నర్పింతుఁ గైకొనుమా కరుణను. 124

చ. అని మునిపల్క రాముఁ డనునట్టులె కైకొనువాఁడ నీపదం
బునకు సమీపమందె యొకభూమిని నిల్వఁగఁ గోరువాఁడ; దా
నిని దలపోసి చెప్పఁదగు । నిల్చెద నం; దన మౌనివర్యుఁ డి
ట్లనియె సుతీక్ష్ణుఁ డన్ముని మహామతి దాపుననే వసించెడున్. 125

ఉ. ఆతఁడు మౌనివాసమున । కర్హముగాఁ దగునేప్రదేశమం
చాతతయోగశక్తిమెయి । నారసి తెల్పెడు మీర లమ్మునిం

బూతచరిత్రుఁ గాంచుటకుఁ ౹ బోఁదగు మే లటఁ గల్గుమీఁకు; నీ
భూతలసన్నికృష్టమునఁ ౹ బొంగుచుఁ బాఱెడు గంగఁ జూఁడుమా. 126

చ. పడమరనుండి తూర్పునకుఁ ౹ బాఱెడు నీనదియున్ రఘూత్తమా!
పడమరకే చనందగును ౹ బద్ధతి దీని సమాశ్రయించియే
పుడమి నిఁకన్ శరీరమును ౹ బూనిక నిల్పఁగ రాదటంచు నె
న్నఁడు మది నిశ్చయించితినొ ౹ నాథ! తదాదిగ నిస్గనుంగొనన్. 127

చ. తలఁచుచు నింతదాఁకఁ దను౹ధారణ మెట్టులొ చేసినాఁడ నీ
లలితపదాంబుసంభవము౹లన్ గనఁ జాలితి నిప్డు వాంఛలున్
ఫలములఁ గాంచెఁ గుప్పసముఁ ౹ బాము త్యజించెడురీతి నిన్ను ని
మ్ములఁ గనుచున్ మహాముదముఁ ౹ బొందుచు వీడెద దీని నో ప్రభూ!. 128

మ. అని ప్రార్థించుచుఁ బ్రజ్వలజ్వలనునం ౹ దత్యంతభక్త్యున్నతిం
దనువున్ వైచి ముహూర్తమాత్రమున నూ౹త్నంబైన దివ్యాంగముం
గని దేవాళి నుతింప బ్రహ్మపదముం ౹ గానంగఁ బోయెన్; హుతా
శనుఁ డయ్యంగముఁ బావనంబనుచు భ౹స్మప్రాయముం జేసెఁ దా. 129

రాముఁడు లక్ష్మణున కుపాసనమహత్త్వమెఱిఁగించుట.

చ. అది గని లక్ష్మణుండు మది ౹ నచ్చెరువందుచు రామచంద్ర! యీ
యదనున నొక్కసంశయము ౹ నాత్మకుఁ దోఁచెడు నిందు ప్రాణముల్
గొదువ యొకింత లేక తన౹కున్ సుఖధామము చిక్కనంచుఁ బా
యఁదగునె యీతపస్వి యిది ౹ న్యాయ్యమె దుర్మృతి యిద్ది గాదొకో?. 130

మ. మనమిచ్చోఁ గనుచుండి యగ్నిశిఖలన్ ౹ మ్రందెంగదా యాత్మహ
త్యను గావించుకొనెన్ మహర్షి యిపు డీ౹ట్లెంచుం దలంపంగనౌ
నని ప్రశ్నించెడు లక్ష్మణుం గని కృపా౹ర్ద్రాస్థానమంచున్ మునుల్
వినుతింపందగి యొప్పు రాఘవుఁడు స౹ద్వృత్తప్రియుం డిట్లనున్. 131

సీ. వినవయ్య! యీశంక ౹ విడువంగ నొనరించు,పద్ధతి యెఱిఁగింతుఁ౹బరమమునుల
నాత్మహత్యాదోష ౹ మంటునే యెఱుఁగవే, యింతమాత్రంబెని౹హితమనీష
నొప్పియుండియుఁ బెద్ద౹లొగిఁ దెల్పవినియుని,ట్లనుమానముం గాంచు౹టర్హమగునె
రైన నెఱింగింతు ౹ మౌనులు యోగవి,ద్యాభ్యాసమునఁ దమ౹యాత్మ వశ్య
తే. ముగ నెసంగఁగ సుందురు ౹ బుద్ధియెపుడు
తనువు విడనాఁడఁదగునంచుఁ ౹ దలఁచునో యపు
డహీయుఁ గంచుకమును వీడు౹నట్లు బ్రహ్మ
వివరభేదనమునఁ బ్రాణ౹వితతి వదలి. 132

క. అనుపమతేజోరూపం, బున వాంఛకుఁ దగినయట్టి ౹ పుణ్యపదములం
గనఁ బోవుదు; రది హత్యయె, యనఁబడునొకొ నీవె తలఁపు౹మా గుణవార్ధీ!.

చ. తలఁచినయంతనే తనువుఁ దత్త్వపదంబును గాంచునట్లు నే
ర్పలవడఁ జేయు యోగవిధియందు సదాభ్యసనంబు గల్గువా
జ్యులు తమి బ్రహ్మరంధ్రము మహోజ్జ్వలశక్తిఁ బగుల్చి సూర్యమం
డలమును దాఁటి పోవుదు రనంతసుఖాస్పదమైన ముక్తికిన్. 134

చ. అదియొకలోకమంచు నట నంబురుహాత్మజముఖ్యు లుందు రం
చది గనినంత నెవ్వరికినైనఁ బునర్భవ ముండ దంచుఁ బ
ల్కుదు రొకకొంద; రయ్యదియుఁ గోరికఁ గుంతుల కొప్పఁ జేయువాం
ఛ దగుల నంచు నెన్నఁదగు సాధుమనీష! మఱొండు గాదుసూ. 135

ఉ. అక్షయమైనలోక మదియారయ నుండునె సృష్టియందు నె
ట్లక్షయవస్తు వుండఁదగు నట్టిదియున్న దటంచుఁ బల్కుటల్
దక్షతఁ బామరాళికి నితాంతము భక్తిని బుట్టఁజేయ నా
సాక్షి మఱొక్కఁడేల స్థిరమైనది బ్రహ్మ మొకండె యెన్నఁగన్. 136

ఉ. కావున నిట్టిపల్కులకుఁ గర్ణయుగంబునఁ జోటుఁ జూపకే
భావమునందు యోగవిధి పావనమంచుఁ దలంచుచుండుమీ
యావరమౌని నన్నుఁగని యగ్నిముఖంబున మేను వీడఁగా
నీవఱ కెప్డొ చేసిన యహీనసుకర్మఫలంబు నిత్తఱిన్. 137

క. తా ననుభవింపఁ జాలెను, గాననె దేవేంద్రుఁ డెంతొ గారవమున ర
మ్మా! నిను శతధృతిపదముం, గానంగాఁ జేయుదు ననఁగా నీమునియున్. 138

క. రామునిఁగని వైశ్వానరు, మోమున నిమ్మేనువైచి పోయెద దేవేం
ద్రా! మామక పుణ్యానుభ,వామలలోకంబులకని యతనిం బంపెన్. 139

క. మనకుఁ దర్శన మీయం,గను బూనియె నిల్చె నితనిఁ గంటిమి సుకృతం
బును గంటిమి పోవుద; మి,మ్ముని తెల్పిన జాడ ననినఁ బొంగెడు వేడ్కన్. 140

ఆ. అగ్నికుండమునకు నమ్మౌనిఁ దలఁచుచుఁ, మూఁడుసార్లు తిరిగి మ్రొక్కి రాముఁ
డరుగ వెంటనంటి యరిగిరి జనకజా,తయును లక్ష్మణుండు నయము మెఱయ.

క. వరుణాశఁ గూర్చి పోవుచుఁ, దరుణీమణితోడ నందుఁదగు వింతలు మౌ
నిరమణుల తపశ్శక్తియుఁ, గర మబ్బురపడఁగఁ దెలియఁగాఁ జెప్ప చొగిన్. 142

క. ధునివెంటఁ గాలితెరువునఁ, జనుచు మహామౌని యుండుశాంతాశ్రమముం
గనుపండువు చేయఁగఁ జని,యెను రాముఁడు మౌనిఁ గనఁగ నెంతయుభక్తిన్.

తే. అరిగి వైరం బనంగ నోట్లవనినుండు, ననియు నెఱుఁగని క్రూరమృగాళిఁ గనుచుఁ
దరుణికిం దమ్మునకుఁ దద్విరోధంబుఁ దెల్పు, చును సుతీక్ష్ణుని మునిపతిఁ జూచెనచట.

క. శ్రీరాము రాక మున్నే, సారజ్ఞానమున నెఱిఁగి సంయమి వారిం
గారవమునఁ బూజించెను, దారతఁ దదనుగ్రహంబుఁ దాఁ గోరి మదిన్. 145

చ. మునికృతపూజ లంది గుణపూర్ణపయోనిధి రామచంద్రుఁ డ
వ్వనమున వాసయోగ్యమగుభాగ మెఱుంగఁగఁగోరి వేఁడ ని
ట్లనియె సుతీక్ష్ణుఁ డంబుజదళాక్ష! వసింపఁగ నర్హమైనతా
వును దెలియంగఁ గోరెదవె బుద్ధికిఁ దోఁపనియద్ది యేదొకో?. 146

ఉ. రావణుఁజంపు వేడుక ధరాస్థలి మానవరూపధారి వై
నీవెలుఁగంగఁ జాలని వినిర్మలభాగ మదెందు నుండునే
యీవిపినంబునందె వసియింపుము రాఘవ! నీదుసేవచేఁ
బావనచిత్తులై యిచటి బ్రహ్మమునుల్ తరియింతు రం చనన్. 147

ఆ. ఆసుతీక్ష్ణమౌని యాలాపముల కాత్మ, నలరి యాతిథేయములకుఁ దృప్తిఁ
గాంచి యాదినంబు గాననమున నటఁ, బుచ్చి మౌనియాజ్ఞఁ బొంది యపుడు.

చ. పనివిను నప్పు డిట్లనియె బ్రహ్మమునీశ్వర! మేము కాననం
బున నిట నున్న వన్యమృగపూగము లంతమునొందు; నద్ది మీ
మనమున కార్తినించు ననుమానము లే దిటఁ గానఁ బోవఁగా
ననుమతిఁ గోరినారము మహర్షులఁ జూడఁగఁ గాంక్ష గల్గుటన్. 149

క. అరుగం దలఁచితి మొండొక, వరుసం దలపోయరాదు భవ్యమతీ! మీ
కరుణన్ వసింతు మెందో, యరణ్యముననిం దెయంచు నారఘుపతియున్. 150

చ. వరమతియా సుతీక్ష్ణుపదవారిరుహంబుల సంస్పృశించి భీ
కరమృగరాజి దానవులఁ గార్ముకముక్తశిలీముఖంబులన్
ఖరకరపుత్త్రుగేహమునఁ గాపుర ముండఁగఁ జేయువాఁడ; మా
నిరమణు లింకనీయడవి నిర్భయులై చరియింపఁ జేసెదన్. 151

చ. వినిహతవిఘ్నసంతతిని విశ్వహితంబుగ మీతపంబు సా
గు ననుచు నేఁ దలంతు మునికుంజర! దీవన లిచ్చి పంపుమా
యనురఘురాము వాక్యములు హర్షమునింపఁగ నాసుతీక్ష్ణుఁ డా
మనుకులవార్ధి శీతకరు మాన్యుని జక్కఁగఁ జూచి ప్రీతితోన్. 152

చ. పరమమునుల్ నినుంగనఁగఁ బల్మఱుఁ గోరుచునున్నవారు భూ
వరశశిశేఖరా! చనెడువర్త్మము మంగళదాయకంబుగాఁ
బరఁగెడుఁ గాక నా విని యభంగురమోదము నొంది రాఘవుం
డరిగె ధరాత్మజాతయు మహామతి లక్ష్మణుఁ డేగుదేరఁగన్. 153

మ. చనుచుండన్ గడు దాపునం జనెడునాక్ష్మాపుత్త్రి శ్రీరామ! నీ
వనుమానింపక మౌని చెంత శపథం బన్నట్లుగాఁ దోఁపఁ జే
యునుడుల్ సందియ మొందఁ జేసె మది నోయుర్వీశ్వరా! దానినే
వినిపింతున్ బదులెట్టు లిత్తువొకొ నే విందున్ మనస్తృప్తిగన్. 154

క. నీవిపు డూనినమునినియ, మావర్ణ్యము శాస్త్రవిహితమా గద దీనిం
గోవిదు లెంతయు మెత్తురు, పావనమని సూక్ష్మధర్మపథ మిది యనుచున్. 155

చ. పురుషులు సూక్ష్మధర్మపథముల్ తగుభంగిని జర్చచేసి యం
దురుతర ముత్తమంబునయి యొప్పెడుధర్మము నాశ్రయించి యీ
ధరణి సుఖంబుఁ గాంతు రిదితథ్యముగాఁ దలపోయుదాన; నె
వ్వారు వ్యసనాళి మానుదురో వారలె యర్హులు ధర్మ మూనఁగన్. 156

సీ. కామజంబు లనంగ గలవు ప్రసిద్ధముల్, వ్యసనముల్ మూఁడ దేవ్వరుసఁగనిన
నందు నసత్యంబె యధికమౌ ననితేలు, దానిమించును బరదారగమన
మవ్వానికిం దుల్యమనఁదగుఁ బగ లేని, పరుల హింసించుట ప్రాణనాథ!
యనృత మింతకుఁ బూర్వ మాడినదే లేదు, ముందును బల్కంగఁ బూనవీవు

తే. నీదువర్తనమే దీని నెఱి నెఱుంగఁ, జేయు; రెండవపాపంబుఁ జేయ వనుచుఁ
బల్కఁగా నేల; ధర్మరూపంబ వీవు, నిన్నుఁగని ధర్మమి దని మునివ్రజంబు.

క. తలపోయుచుండు రంచుం, దలఁచెద; మఱి యొక్కమనవి దనుజులఁ జంపం
దలఁచుట యేటికో? వారలు, తలపరు నీపైనఁ బగ; వధం బనునదియున్ 158

క. అతిరౌద్రకర్మ మనఁదగు, క్షితిపయి నజ్ఞానులెల్ల జేయఁదలఁతు రు
ద్ధతియన నజ్ఞానజమౌ, మతిమద్వర్యా! తలంపు మామకసూక్తిన్. 159

తే. హింసయను కర్మ మెవ్వారికేని తగక, యుండు నీవంటివారి కదొప్పు నెట్లు?
దండకారణ్యవాసులఁ దాపసులను, గావ దైత్యుల వధియింపఁగా సమయము

క. ఒనరించితిగాదే యది, మనుజాధిప! నీకు నీసమయమునఁ దగ దం
చును దలపోయుదు మనమిం,కను ఘోరంబైనయట్టి కాంతారమ్మున్. 161

క. కన లేదు; దాని మొద లిది, యని తోఁచెడుఁ జాపధరులరై మీరలు కా
ననమును దానిం జొచ్చిన, దనుజులు దృక్పథమునందుఁ దగులుదురుగదా.

చ. సమయముఁ జక్కఁదీర్ప గురుసాయకముల్ పరఁగించి వారలన్
యమునిపురంబుఁ జేర్పఁగఁ బ్రయత్నము చేయుదు రగ్ని చెంత ని
ధ్మములును బోలె బాణసముదాయము కార్ముకముల్ మఱింత వి
క్రమమును బ్రోత్సహించుఁగద కావునఁ బల్కెద నాయుదంతమున్ 163

తే. దండకారణ్యవాసంబు దగ దటంచు, నందుఁ జొచ్చినఁ గష్టంబులలముకొనుట
దప్ప దంచును యోజించుదాన; నొక్క, చిన్ని గాథ వచింతును జిత్తగింపు.

క. పతగములు మృగము లెంతయు, వితతగతిన్ సంచరింప విషమంబగు కా
న తగెన్ భూస్థలి నొక్కట, మతిమద్వర్యం డొకండు మౌనియు నందున్.

సీ. సత్యరతుం డుండె నిత్యశుద్ధాచార, తత్పరుం డగుట నాతండు గ్రామ
వాసంబు వదలి యెవ్వరు లేని యవ్వనమున నిల్చి తపమును బూన్కిఁ జేయు

చుండంగ నోర్వ కోఖండలుఁ దద్దాని, భంగమ్ము నొందఁ జేయంగఁ గోరి
భటరూపమునఁ బోయి పటుతరఖడ్గంబు, న్యాసంబుగానిడియడవిఁ జొచ్చి
తే. మరల రాకుండె నమ్మునిమండనుండు, తలఁచె విశ్వాసముననుంచెదాని నచట
ననుచు; నంతట గందమూలాదులఁ గొని, తేరఁజనునప్పు డెల్ల నిస్త్రింశ మద్ది.

చ. కరమున నుండఁగా ధనముఁగాచినయట్లని యెంచె నిట్టు లా
ధరణిసురుండు ఖడ్గమును ఽ దాల్చుట మానఁగఁ జాలఁ డయ్యె; నా
పరుషతరాయుధంబుఁ దగుభంగిని దాల్చుటఁజేసి చిత్తముం
బరుషతఁ గాంచె దాననె తపశ్చరణంబునఁ గల్గుశ్రద్ధయున్. 167

చ. క్రమముగఁ దగ్గసాగె నదే కారణమై తగ హింసచేయుమో
దముఁగనె దాన దుర్గతియె ఽ దాపుర మయ్యె నటంచుఁ బల్కఁబూ
ర్వము వినుదాన భీకరశరంబులసంగతి యగ్నిహోత్రు స్నే
హాముపలెనే వికారిత హృదంతరమం దొలయంగఁ జేసెడున్. 168

ఉ. నీపయి నాకు నెప్పుడగు ఽ స్నేహబలంబున నీవు నాపయిన్
జూపుచునుండు గౌరవముచొప్పున నీవిషయంబు నీకు వి
జ్ఞాపన మేనుజేసెదను ఽ సర్వవిదుండ వటం చెఱింగియున్
గోపతిముఖ్య శీర్షధృతకోమల దివ్యపదాంబుజా! యజా! 169

ఉ. వైరమెలేక చాపశితబాణములన్ ధరియించి యెంతయుం
బౌరుషమూని యాగహనభాగమునన్ దగు రాక్షసావళిన్
మారణమేను జేయుదును ఽ మానులఁ గావఁగ నన్నబుద్ధినిన్
శ్రీరఘురామ! పూనకుము ఽ చేసెద విన్నప మిట్టు లిత్తఱిన్. 170

మ. అపకారం బొకయింతచేయని యమర్త్యారివ్రజంబున్ మహా
కృప దూరంబుగఁ బెట్టి చంపుటకు నూహింపంగ రాదంచు వి
న్నపముం జేసెదఁ జిత్తమం దునుపు మోనాథా! యహింసావ్రతం
బపరిత్యాజ్యముగాదె నిన్నుఁ గని యత్యంతప్రమోదంబునన్. 171

మ. జనులెల్లన్ గురుధర్మ మీయదియె యభ్యాసంబు చేయంగ మే
లని యోజింతురుగాక! చాపమిఁక నేలా యంచుఁ బ్రశ్నించెదో
యనఘా! కాననమందు నుండి తప మర్హంబంచు శాస్త్రోక్తరీ
తిని సాగించెడుమౌనివర్యులను బాధింపంగ నే రెంతురో? 172

ఉ. వారలఁ బాఱఁదోలి భగవంతుని గొల్చెడువారి కాపదల్
చేరఁగనీక విఘ్నములఁ ఽ జెండుచు నుండుటె రాఘవా! ధను
ర్ధారణసత్ఫలం బనుచు ఽ ధర్మమహాశయ మిద్దెయంచు నా
చారముగల్గ నియ్యదియె ఽ చక్కని హేతు వటంచు నెంచెదన్. 173

చ. అది కులధర్మమం చనెదొ యారయఁ దాపసవృత్తి నూనియే
పదిపయి నాల్గువర్షములు ప్రాణిహితం బొనఁగూర్చుచున్ మహా
పదలకు స్థానమౌ విపినభాగములందు వసింపగాదె యీ
యదనున వచ్చినార మిపు డాకులధర్మము లేటికో యిటన్. 174

క. వనవాసమేడ క్షాత్రం, బనఁజను ధర్మం బదేడ యనఘా! యెందుం
డిన నాదేశాచారం,బును ధర్మము నాచరింపఁ బోలును జిష్ణూ. 175

క. తనవాస మెందొ యందలి, జను లెయ్యది ధర్మమనుచు సాధ్వాచారం
బనుచుఁదమి నాచరింతురొ, యొనరుపఁదగు దానినే మహోత్తమ మనుచున్.

ఉ. అంతకుమున్ను తా జనపదాంతరమందు వసించి యెద్దియ
త్యంతఫలప్రదం బయినధర్మ మటంచుఁ దలంచియుండు దే
శాంతరమందు నయ్యది సమాచరణార్హము గాదుసుమ్ము! స
త్సంతతి యెద్ది ధర్మమని యందు వచింతురొ యద్ది చేయనౌ. 177

సీ. ధర్మముల్ బహువిధద్వారంబులై యుండు, నేదేశముననుండు నెల్లపెద్ద
లందు నెద్దాని నర్హంబందురో దాని, నాచరించుట మంచిదనుచు నాకుఁ
దోఁచెడుఁ; దన కెద్దితోఁచిన నద్దాని, నందున్న పెద్దల నడుగ నేల
యనుగర్వమూని చేయంగఁ బాపంబబ్బు, దేశధర్మంబులతీరు తెలియఁ
ఆ. దగియెయుండు ననుచుఁ దత్త్వజ్ఞు లందురు, మావిషయమునందు నేవిధముగ
నాచరించువార మట్టులె యిటఁ జేయు, వార మనుట మూఢవాద మరయ.

చ. మనమిటనుండి శీతగిరిమాన్యుని జూడఁగఁ బోయి భాస్కరుం
గని మనదేశభాస్కరుఁడు కాఁ డితఁ డెంతయు శీతభానుఁడౌ
నని తలపోయు టెంత మరియాదయొ యట్టులె దేశధర్మముల్
గనక స్వకీయదేశమునఁ గల్గినధర్మము నాశ్రయించుటల్. 179

ఆ. అడవినుండు వారి కర్హమైనది తప, స్సౌకఁడె రాజధర్మ ముత్తమంబె
యనుచు నిపుడు దాని నాచరింపఁగ రాదు, తజ్జనపదమునకుఁ దగని దగుట

చ. శ్రుతియె వచించు నెందుఁగలసూరివరేణ్యులు ధర్మమంచు ని
వ్రతమున నాచరింప నభివృద్ధి యొసంగు నటంచు దేని నా
దృతి వచియింతురో యదియె యెల్లరకుం దగు నాచరింప; ధ
ర్మతతిని నీ వెఱుంగవొకొ రాఘవ! యీవిధ మెల్ల నాత్మలోన్ 181

చ. శరములపొందు చిత్తగతశాంతము రూపఱఁజేయుఁ జుమ్ము! పూ
ర్వరమున కేగినంతనె శరంబులఁ బూని స్వజాతిధర్మమా
దరమున నిర్వహింపుము; సతంబును నీమది ధర్మమందె సు
స్థిరతను గాంచియుండు సుఖసిద్ధి పొసంగును గాదె దానసే. 182

తే. అర్థము తదాశ్రయంబగు నండ్రు పెద్ద, లవ్వి యి వ్వన నేల? ధర్మాభిరతిని
గలుగు సర్వంబు; గావున నిలను సార, మనఁగ ధర్మంబె యని పండితాళి పలుకు.

క. అమితప్రయత్నములను వ్రతములఁ జేయుటను స్వీయతనువు వరుసఁ గా
ర్శ్యమునొంద ధర్మమనువి,త్తము నార్జింతురు ప్రపంచ తత్త్వజ్ఞవరుల్. 184

క. మనువంశభూషణా! సుఖ,మున సుఖ మెప్పటికిఁ గల్గఁబోదు నిజము; కా
వున నీవు నిత్తపోవన,మున ధర్మము సేకరింపుము విమలమతివై. 185

క. వనితలకుం జాంచల్యం, బనునది నైజంబు; దానియాశ్రయమున నీ
కును దేటపఱిచితిని ధర్మనికాయము సర్వ మెఱుఁగుమాడ్కిన్ రామా. 186

సీతకు రాముఁడు స్వాభిప్రాయముం దెలుపుట.

చ. అనుచు విదేహరాట్తనయ యావిషయంబున స్వాశయంబు ని
ట్లని యొరు లెవ్వరే నెఱుఁగనట్లు వచించిన ధర్మవార్తలన్
విని పరమేశ్వరుం డనియె భీతమృగాయతనేత్ర! నీవెఱుం
గనియది లోకమం దెదియుఁ గానను నాదగు మేలుఁగోరుచున్. 187

చ. హిత మెఱిఁగించి తీవు సకలేశ్వరి నాఁదగు ఖ్యాతిమించి యె
వ్వితమున నెప్డు వర్తిలిన వృత్త మదెంతయు సాధుసంఘసం
స్తుతి గనునట్లు వర్తిలెదు చొప్పెఱిఁగించితి వం చెఱుంగుదున్
మతిగలయాశయం బిపుడు మానిని! నీ కెఱిఁగింతు నంతయున్. 188

సీ. నరనాయకులు వసుంధర నార్తశబ్దంబు, విని యూరకుండ రాదనుచుఁ జాప
మును దాల్చియుందురు మును లిందుఁగలవార, లేతెంచి నను వేఁడి రిందుఁగల్గు
బాధల మాన్పి తపంబుల కేవిఘ్న,ములు గల్గకుండ నిమ్ములనొనర్పు
మిదియె యభ్యర్థనమిద్దాని గొనుమని, శరణుచొచ్చిరి వనస్థలి నిచటను
ఆ. భయదదనుజు లెప్డు పరువిడుచున్ ధర్మ,హాని చేయుకాంక్ష మౌనివరులఁ
బట్టి తినుచునుంట బహుభంగులన్ వింటి, యందసత్య మనెడునదియె లేదు.

ఉ. జానకి నీవెఱుంగుదువు సర్వము ధర్మ మనంగ నెట్టిదో
దాని నొనర్పఁగాఁ గలుగుతత్ఫల మెట్టిదొ దాని రూపఱం
గా నొనరింప నెవ్విధి జగంబు జయించునొ నీకుఁ జెప్పఁగాఁ
బూనఁగ నేల సర్వవిధముల్ తెలియం దగియుందు వెప్పుడున్. 190

క. భూసురమానులు వేఁడం, జేసితి నేశపథ మిట్లు క్షితి ధర్మంబుం
గాసిలఁ జేయఁగఁ బూనిన, యాసురరిపులన్ వధింతు నని భూతనయా! 191

క. అన్నిటికంటెం బ్రాణము, లున్నతములు వానినైన నురుధర్మార్థం
బెన్నక వదలుదు సోదరుఁ, డన్న ద్వితీయంపుమూర్తి యాఁగద యరయన్.

క. ఆతని వదలుదు నీవన, నాతనువున నర్ధభాగ ఽ మగుదువుకద య
బ్జాతాక్షీ! యట్టి నిన్నుఁ, జేతం బెటులున్న విడుతుఁ ఽ జేసినప్రతినన్. 193

క. తప్పంగఁజాల సనుచుం, జెప్పెద ముమ్మాఱు నీకు ఽ సీతా! మౌనుల్
చెప్పకయున్నఁ ధర్మముఁ, దప్పినవా రంచుఁ జంపఁ ఽ దగుదురు దనుజుల్. 194

క. ఇల ధర్మము నశియింపఁగ, ఖలు లెల్లరు చెలఁగుచుంద్రుఽగాదే? మునివ
ర్యులమూలంబున ధర్మం, బలరెడుఁ బరమేశ్వరుఁ డన ఽ నదియే కాదే. 195

క. నీ తెలిపినయది వేద, వ్రాతహితంబైన నందు ఽ వఱలెడుసూక్ష్మం
బై తనరు మార్గ మీయది, సీతా! వేఱొండుగాదు ఽ సిద్ధముసుమ్మీ! 196

మ. తరుణీ! వేఱొకమాటఁ జెప్పెదను నేధర్మంబు నెద్దాని నా
చరణంబందును జొన్పనెంతునొ మహాఽసంతోష మేపార నీ
ధరణిఁ వానిని నిండఁజేయునటు యఽత్నం బీవె చేయంగనోఁ
బరమాహ్లాదము నీదుమూలమున సంఽప్రాప్తించు నా కెల్లెడన్. 197

చ. మనసున నెంచులే తడవు ఽ మానిని! యప్పని నీవు తీర్తు వం
చనుదిన మేనెఱుంగుదుగఽదా మఱి చెప్పఁగ నేల? దుష్టులౌ
దనుజులు దండకాటవిని ఽ దస్యులువోలె వసించి మానిమం
డనులకు బాధగూర్చుచును ఽ నాయకులై చెలరేఁగి రెంతయున్. 198

ఉ. ఇంకను వామసింపఁ జెడు ఽ నెల్లవిధంబుల ధర్మకర్మముల్
శంక యొకింతమాని సురఽసత్తమమోదముఁ గూర్చుపొంటె నే
ణాంకముఖీ! మనంబునఁ బ్రఽయత్నము చేయుము కార్యసిద్ధి నీ
వంకనె కాఁదగుఁ మఱియుఁ ఽ బల్కఁగ నేటికి నింత చాలదే? 199

మాండకర్ణివృత్తాంతము.

చ. అని తనసర్వసాక్షిత బఽయల్పడకుండఁగ గూఢభంగి నా
జనకజ కాత్మయత్నమును ఽ జక్కఁగఁ దెల్పుచుఁ బోవుచుండ నొ
క్కనెలవునఁ దటాకము నిఽకామముదం బొనఁగూర్పఁ జాలి పు
ష్పనికరసాంద్రమై కనులఽపండువు చేయఁగఁజాలె నం దొగిన్. 200

క. గీతధ్వనియును వాద్య, వ్రాతస్ఫుట నిస్వనంబు ఽ భవ్యంబుగఁ గ
ర్ణాతతమోదం బొసఁగుచు; నాతఱి వినవచ్చెఁ గాని ఽ యగపడ రెవరున్. 201

క. తెలిసియు జనులకు సుంతయుఁ, దెలియనివిధి నుండువేడ్కఁ ఽ దిరిగెడు రాముం
డలరుచు ధర్మభృతుం డను, నిలాసురవరేణ్యుఁ గూడఽనే వచ్చుమునిన్. 202

క. పరికించి యిట్లుపలికెఁ, బరమాద్భుత మిద్ది వినఁగఁఽబడుచుండు మనో
హరగీతాడకరవ మ్మొక్కరుఁడుం గానంగ రాఁడుఽగద మునివర్యా! 203

క. ఇదియేమి చిత్రమో చెప్పఁదగుఁ గూఢంబుగాక । పలుకం దగునే
నిది వినఁగోరెద ననుస, మ్మదముం గానంగఁ జేయ । మౌనియుఁ బలికెన్. 204

క. వినవయ్యా! నృపవర్యా!, విన నీవెంచుటయె గొప్పవింతకదా? స
న్ముని మాండకర్ణి పూర్వం, బనూనతప మొప్పఁజేసె । నయుతాబ్దంబుల్. 205

క. వాయువె యాహారముగా, నాయనఘుం డాత్మనిశ్చయంబునఁ దపమ
ట్లీయంభస్సుల నిల్చియె, పాయక యొనరించె దానఁ । బావకముఖ్యుల్. 206

క. పరితప్తచిత్తులై యొక్కరహస్యస్థలమునందుఁ । గడుఁబూనికఁ జే
రిరి తలపోసిరి తప మిక్కరణిఁ మనపదముఁ బొందఁగాఁ జేయునొకో. 207

క. కాకున్న నింతపూనికఁ, గైకొనునే తపము చేయఁగా నని వార
స్తోకవిచారము సల్పుచు, నేకరణిఁ దానిమాన్ప । నెఱుఁగక పిదపన్. 208

ఉ. అచ్చరమిన్నలం బిలిచి । యందమునం దగి గానవిద్యలో
నెచ్చగు కీర్తిగాంచి మఱియొట్టి మహామతినైన మాటలన్
ముచ్చటలూర లోఁబడి విభుత్వము పోవఁగఁ గింకరత్వముం
మెచ్చుచుఁ దాల్పఁజేయు పెరిమెం దగియుందురుగాదె మీరలున్. 209

ఉ. మౌనియొకండు మాపద మమానుషశక్తిని బొందఁ గోరియే
కానఁ దపం బొనర్చెడిని । గామినులార! తపంబు దాని నె
ట్లైన నడంచి రావలయు । నన్నుఁ బ్రసాద మటంచుఁ బల్కి యా
చానలు తత్త్వవేత్తయగు । సంయమిచంద్రునిఁ జేరి నేర్పునన్. 210

క. అది యేమిమాయపన్నిరొ, మదిరాక్షులు మాండకర్ణిమౌని వశుండై
యెది చెప్పిన నదిచేయం, గఁదగిన యట్లుండఁజేసి । కాంక్షలుతీఱన్. 211

క. అతనికిఁ బ్రియపత్నులుగా, సతతము సేవింప నున్న । చందమ్మున నొ
ప్పి తటాకాంతరమున మౌ, నితపఃఫలభూత చారు । నివసన వరమున్. 212

క. అలరింపఁ జేసి స్వతపో, బలమున యౌవనము నట్టి । ప్రాపించిన ని
ర్మలు మాండకర్ణిసౌఖ్యం, బులఁ దేల్చుచు నృత్తవాద్య । ముల సతతంబున్. 213

క. మన మానందాంభోనిధి, మునుఁగంగ నొనర్చుచున్ ప్రభూ! యిం దున్నా
రనయము వినఁబడుగాన, న్వన మెంతయు వీనులకును । బండువు చేయన్. 214

క. తరుణీపంచకయుతుఁడై, నిరంతరము సౌఖ్యవారినిధి భూరిగృహాం
తరమున విహరించెడు భూ, సురమౌనివరుండు రామ! । సుగుణస్తోమా! 215

క. అని యిట్లు ధర్మభృతుఁడా, స్వనచరితముఁ దెల్ప రామచంద్రుండును ద
క్కినవారు విస్మయంబునఁ, గనుపట్టి రచేతనముల । కరణి క్షణంబున్. 216

క. అంతట భూపుత్త్రియు న,త్యంతాశ్చర్యంబుపొంగ । నల్లన రఘుభూ
కాంతుం గని యిట్లడిగెన్, వింతగదా మాండకర్ణి । విమలచరితమున్. 217

తపోబలవర్ణనము.

తే. శక్యమే యిట్లుగాఁ దపశ్శక్తిగేహ, వరముసలిలాంతరమున భవ్యముగఁగట్ట
నందు నివసింప నామది సందియముగ, నున్న దిద్దానిదొలఁగింపుమన్ననతఁడు

చ. ధరణికుమారిఁ గాంచి విను తావకసంశయముల్ దొలంగు ను
త్తరమువచింతు సాధుజనతాపరినుత్యముగాఁగ; దైవముం
స్థిరహృదయస్ఫుటాంబురుహ సిద్ధపదంబున నిల్పుచుం నిరం
తర మది లక్ష్యమై యలరఁ దత్పరతం భజియింత్రు సన్మునుల్. 219

మ. చిరకాలం బిటు లిష్టదైవముఁ దమిం సేవింపఁ దద్దైవసుం
దర తేజంబు నిజాత్మయందు నమరుం దానం మహాతేజుఁడౌ
దరుణీ! తన్మునిచిత్తమంతఁ బరిశుద్ధస్ఫారతేజోయుతిం
బరమంబై తగు సర్వసిద్ధులును దత్ప్రాణిస్థముల్ నమ్ముమా, 220

క. సంకల్పమాత్రమున నా, పంకజసూనువలె లోకపటలంబున నే
శంకాతంకము లోలయని, బింకంబున నెద్దియైన వెలయించు సతీ! 221

తే. ఆకసంబున నిర్మించు నమలసౌధ, మద్ది కదలకయే యుండు నతనిదైన
యమలసంకల్పబలమున నట్టివాని, కెదియసాధ్యంబుగావంచు నెఱుఁగు మెదను.

క. మునిపతి విశ్వామిత్రుఁడు, జనకసుతా! సృష్టిచేయఁ జాలఁడె? తత్సృ
ష్టిని గాంచి భీతనొందరె, వనజాసనుఁ డాదియైన వా రనివినవే? 223

చ. సరసిజనేత్ర! వశ్యమయి స్వాంతమె యుండినఁ జెప్పనేల యే
పరికరమైన లేక యల పంకజసూనుఁడు సృష్టిచేయువై
ఖరిఁ దనవాంఛ కెన్న సరిగాఁ దగిఁయుండఁగ సృష్టిచేయు యో
గిరమణుఁ డాతనిం దలఁపఁ గృత్యములెల్ల ఫలించు నప్పుడే. 224

చ. మునిపతు లెల్ల రిట్టిఫలముల్ తమిఁబొందఁగఁ జాల కిట్లు కా
ననముల నుండనేల యని నాతి వచించెదవేమొ సత్తపం
బును బహుకష్టసాధితము భోగనిమిత్తముగా వ్యయింప లే
క నియమ మూని కష్టములఁ గాంచుచు నుందురు ముక్తికై సతీ! 225

సీ. ఐహికసుఖవాంఛ నందరు గావునఁ, బరమహాత్ములు తపఃపరమధనముఁ
బ్రాణాంత మగునట్టిపనియందును వ్యయింపఁ, దలపోయ రైహికఫలము లల్ప
సుఖదముల్ వానిని జూడ నెంచఁగ రా ద,టంచు యోజించు నచంచలమతి
ధనులుగా నుండుటఁ దరుణీమణీ! కాన, నడవులనుండి కష్టాళి తమ్ము

తే. నెంతబాధించుచుండిన నెవ్వరేమి, పల్కినం శాంతమూనుచు బదులుపలుకఁ
బూనకుందురు స్వీయతపోనిధి యిసుమంత తఱుఁగంగ నీయని చింత యమర.

క. భూషించినఁ దమిఁ బొంగక, దూషించినఁ గోపమూని తొనఁకక యొల్లే
భాషించిన మన కేలని, యీషన్మాత్రంబు కదల నెంచని మదితోన్. 227

క. తమనియమము సాగించుచు, సుమహిత విజ్ఞానగరిమ ఽ శోభిల్లుచు నుం
డ్రు మునుల్ శీతాతపవా, తములకుఁ జలియింపకుండు ఽ ధరవరములు నాన్.

ఆ. మాండకర్ణి యితఁడు ఽ మహానులనియమంబుఁ,దొలుతఁబూనెఁగానిఽతోయజాక్షు
లలరఁజేయ దానిఽనవ్వాలఁ బోఁదోలి, యైహికసుఖమందెఽయాత్మ నిలిపి. 229

తే. చాలకాలంబు బహుకష్టఽసంతతులకు
నోర్చి చేసిన తపమెల్ల ఽ నోలతాంగి!
క్షుద్రసుఖముల నొందెడుఽకోర్కి యలర
వ్యయమొనర్చెను జూవ్వె యే ఽ మనఁగవచ్చు? 230

చ. ధరణిధరంబులట్లు మునిఽతల్లజు లెమ్మెయిఁ గష్టసంతతుల్
పరిపరి బాధలెన్నొ కుదుఽపం బయిఁ గ్రమ్మిన వాని కోర్చి ని
బ్బరమగుధైర్య మూని విధి ఽ పంచినయట్టులె సాగునంచు నీ
శ్వరుపయి భారముంచి యెద ఽ శాశ్వతమోదము నొందఁ గోరుచున్. 231

చ. అమలతపంబుఁ జేయుదు రఽయారె! యటంచు నమర్త్యు లెన్ని చం
దములనొ సంస్తుతింప శ్రుతిఽతత్త్వ మెఱింగినవారలౌటఁ దు
చ్ఛములగు సౌఖ్యముం గనఁగ ఽ స్వాంతములందుఁ దలంప కెల్లక
ర్మముల ఫలంబు లీశునకు ఽ మానక యప్పన మొప్పఁజేయుచున్. 232

క. ననబోఁడీ! యీమార్గమ్మును నెమ్మది నిల్పు మీవు ఽ పోవుద మింకన్
మునులం గనఁ దద్దర్శనమున వాంఛలఁ బండఁజేయఁఽబూనిక మీఱన్. 233

చ. అని తనయాశయంబుఁ దగుఽనట్టులుగా నెఱిఁగించి యావనం
బున వసియించు భూమిసురఽపుంగవులన్ గురుయోగనిష్ఠ నొ
ప్పిన మహనీయులం గనఁగఁ ఽ ప్రేయసియున్ సహజుండు వెంట రాఁ
జనియెను రామచంద్రుఁ డట ఽ సంయమివర్యులు భక్తిమీఱఁగన్. 234

క. పరమేశ్వరుఁడే యీరఘు, వరుఁడని పూజించి రిట్లు ఽ వరుసగ మౌనీ!
శ్వరు లుండుచోటులం గని, మరలి సుతీక్ష్ణాఖ్యు నాశ్రమంబును జేరెన్. 235

చ. పురమును వీడి బ్రహ్మమునిఽపుంగవులం గనుఁగొంచు వారిదౌ
పరిసరమందుఁ గాపురము ఽ భద్రద మంచు నొనర్చుచున్ వనాం
తరమున నుండఁగాఁ దగినఽతత్సమయంబున నెట్లొ చెల్లె వ
త్సరదశకంబు; నంత నృపఽచంద్రుఁడు రాముఁడు నాసుతీక్ష్ణుతోన్. 236

తే. కష్టమనునది యెఱుఁగనిఽగతి వసించి
కొంతకాలము గడుపంగఁ ఽ గోరి యొక్క
దినము మునితోఁడ బలికె నీఽవనమునం ద
గస్త్యమునిచంద్రుఁ డుంట పెక్కండ్రు తెలుప. 237

తే. ఆలకించితి నట్టి మహాత్ముఁ గాంచి, శక్తికొలఁదిగ సేవింపఁజను నటంచుఁ
దలఁతు నమ్మునియాశ్రమస్థలమదెందుఁ, గలదొ యెఱిఁగించి పంచినఁ గదలువాఁడ.
ఉ. ఆమునివర్యపాదకమలార్చన యెప్పుడు చేయఁగల్గునో
నేమము మీఱ నంచు మదినిం దలపోయుచు నున్నవాఁడ; మీ
రామహనీయు నాశ్రమము నచ్చటి కేగెడుమార్గముం దదీ
యామలపాదసేవఁ దగునట్లు లొనర్చెడు భాగ్యకాలమున్. 239
చ. తెలియఁగ జెప్పుమీ యన సుతీక్ష్ణమహాముని సంతసంబునం
జెలఁగుచు నిట్లు పల్కె మునిశీతమయూఖునిఁ గానఁబొందు మీ
రలఘుమనీషులార! యని యామునిచందముఁ దెల్పుచుండ మీ
రలె ననుఁ బ్రశ్న సేసితిరి రామ! యదృష్ట మనంగ నిట్టిదే 240
క. ఈనాయాశ్రమమున క, మ్మౌనీంద్రుని యాశ్రమము శమనుదిక్కున నో
భూనాథ! నాలుగామడ, లౌ నెలవునఁ గలదు మీరలరుగుఁ డచటికిన్. 241

## శ్రీరాముఁ డగస్త్యాశ్రమమున కరుగుట.

క. వన మయ్యది దివ్యమునీంద్ర నికరజుష్టంబు సత్త్వరాజినిబిడ మిం
తని చెప్పరానిమహిమం, బున బొల్చును జుమ్ము పొమ్ము భూపవతంసా! 242
క. ఆతనియనుజన్ముఁడు సం, ప్రీతిం వసియించు నందుఁ బృథుతరతేజుం
డై తగు సుదర్శనుండును, ఖ్యాతింగను మౌనివర్యుఁ డాతనిచెంతన్. 243
క. ఒకరాత్రి పుచ్చి వేఁకువ, సకలజ్ఞు నగస్త్యమౌనిసత్తముఁ గనుఁగో
రికఁ బయనము సాగింపుము, ప్రకటతరువ్రాతనిబిడపథమున రామా! 244
ఆ. దక్షిణముగఁ బోవఁ దగునటనుండి యోజనము; కాననగును వనము మిగుల
సంతసంబుఁ గూర్పఁజాలును శ్రీరామ!, యట నగస్త్యమౌనియాశ్రమమ్ము.
చ. కనఁబడుఁ బోవ నిచ్చమదిఁగల్గినఁ బొమ్మన నాసుతీక్ష్ణునె
మ్మనమున నెంచి రాఘవుఁడు మౌనివరేణ్యుని గాంచుకోర్కెమైఁ
జనియెద నాజ్ఞ నిమ్మని వెసం బ్రణమిల్లిన నట్లె పొమ్ము య
మ్మునివరుఁ జూడు మవ్వల విభుత్వము నొందెద వంచుఁ బల్కఁగన్ 246
సీ. జాయామణియు సహజన్ముఁడు చనుదేరఁ బయనమై, యమ్మౌని పల్కినట్టి
గుఱుతులం గాంచుచుఁ గొలఁకులఁ జూచుచు నందున్న పక్షుల నమలరుతము
లెదకు హాయినొసంగ నెంతయుఁ గోర్కెమైఁ జని యాసుదర్శనుసమ్ముఖమున
నొకదినంబును బుచ్చి సకల మెఱింగిన ప్రౌఢయయ్యను రఘుభూపవరుఁడు
తే. మానవత్వము ప్రకటింపఁగా నెఱుంగ, నట్టు లమ్మునిఁ బ్రశ్నించి యతఁడు చూపు
మార్గమునఁ బోయి యుక్తలక్ష్ములచేత, నమ్మునీంద్రుని యాశ్రమ మనుచు దెలిసి
చ. అనుజునితోడ నిట్లనియె నమ్మునివర్య మహత్త్వ మెంతయుం
వినుతికి నర్హమై తగును వేయిశిరంబులుగల్గు శేషుఁడై

నను వచియింపఁ జాలఁడ యనంగ మఱొక్కఁడు చెప్ప నేర్చునే
మునిమహిమంబు సుంతవిని । మోదమునొందితి దానిఁ దెల్పెదన్. 248

క. ఈదెస వాసార్హం బే, కా దెప్పు డగస్త్యమౌనికాంతుఁడు శక్తిం
గాదె నివాసార్హముగా, నాదిత్యులు మెచ్చఁజేసె । ననుజ! తెలియుమా. 249

క. వాతాపియు నిల్వలుఁ డను, ఘాతుకులౌ దైత్యవరులు । కాన నిట సుఖం
బాతతముగఁ గనుచుండిరి, భీతిదులే భూతములకుఁ । బృథుబలు లగుటన్.

మ. కరుణాలేశవిహీను లాదనుజు లకాలంబునన్ భూమిని
ర్జరరూపంబులఁ దాల్చి దేవతలభాషం బల్కుచున్ శ్రాద్ధమి
త్తరుణంబం దిట లెండు రండనుచు మోదం బొప్పఁగాఁ బిల్చి భూ
సుర లమ్మాటల నమ్మి రాఁ గుడువఁ గూర్చుండంగఁ బీఠంబులన్. 251

తే. అలవరించుచు వారట్టి యాసనములఁ, గూరుచుండంగ వాతాపి కోర్కి మేష
తనువుఁ దాలుచు నన్నయు । దానిఁ జంపి, వండి పెట్టును దృప్తిగ వారుగుడువ.

సీ. ఇల్వలుం డెలుఁగెత్తి యిఁక రమ్ము వాతాపి, యనిపిల్చు నంతలో నతఁడు వారి
కుక్షుల భేదించుకొని వచ్చు, వారల భక్షింతు రిర్వురు పాపమతుల
వారలఁ బోకార్ప వాంఛించియె యగస్త్యముని వచ్చె; వారలు భక్తి వెలయ
శ్రాద్ధభోజన మిందు । సల్పఁగాఁ దగునని యర్థించి రా యిర్వురల్లె యనుచు
తే. మునియు నంగీకరించె నద్దనుజుఁ డెల్ల, వారలం బోలె నమ్మునివర్యుఁ దలఁచి
యనుజు నింజంపి వడ్డించె నతఁడు దినియె, నంత వాతాపి వాతాపి యనుచుఁ బిలువ.

క. మునిపతి యిల్వలుఁ గని కుక్షిని మెల్లనఁ దడవుకొనుచు । జీర్ణించెను నీ
యనుజుఁడు నా కుక్షిని నా, దనుజుం డెద ఘోరకోపతాపము పెరుఁగన్ 254

ఆ. హుంకరించె; మునియు । హుంకారమాత్రన, యతని భస్మరూపమై చెడంగఁ
జేసె; నిట్టి మహిమఁ । జెలఁగును లక్ష్మణా!, సాటి యెవ్వరింక । క్షమ నతనికి.

చ. అనవిన లక్ష్మణుం డనియె । నార్యవరుండగు నాయగస్త్యుఁ డ
ద్దనుజుని మాంస మెట్లుతినెఁ । దద్దయుఁ బాపము దానరాదె? శం
కను దొలఁగింపు దీని ననఁగాఁ జిఱునవ్వున మోము వెల్గ ని
ట్లనియె రఘూద్వహుండు వినవయ్య! యథావిధిఁ జెప్పు నానుడిన్. 255

చ. యుగములయందు ధర్మము లనొప్పును వేఱువిధంబులన్ ద్విజుల్
తగిన విధంబు శాస్త్రసముదాయము తెల్పినవానిఁ గైకొనం
దగుదురు; మాంసభక్షణము । ధర్మముగాదని శాస్త్రజాల మే
యుగమున నిర్ణయించు నపు । డొప్పదు శాస్త్రవిరుద్ధమాటచేన్. 257

చ. క్షితిసురు లెట్టిమాంసములచేఁ బితృదానవవైరి కార్యముల్
హితముగఁ జేయవచ్చునని । యుత్తరశాస్త్రము నిర్ణయించు బ

చ. క్షితిసురు లెట్టిమాంసములఁ జేఁ బితృదానవవైరి కార్యముల్
హితముగఁ జేయవచ్చు నని యొత్తఱి శాస్త్రము నిర్ణయించుఁ బ
ద్ధతియది యుక్తమంచు మునితల్లజు లొప్పి చరింతు రట్లు త
త్కృతములు వారి దేవతలఁ దృప్తులఁ జేయఁగఁజాలి యుండెడున్. 258

సీ. ఇల్వలవాతాపు లిద్దఱు క్రూరులై, శ్రాద్ధనామమ్ము వ్యాజముగ మునుల
భుక్తికై పిల్చుచుఁ బొలియించుచుండుట, నాత్మ నెఱింగి యయ్యసురవరుల
జంపంగఁదలఁచి తాఁ జనుదెంచె నాత్రోవ, నందఱియట్టులే యతని నెంచి
తమ్ముని మేషరూపమ్ముఁ దాల్చినవాని, వండి పెట్టఁగఁ గుక్షినిండ దాని
ఆ. దినినయట్లు మౌని కనఁబఱచెను గాని, కోపదహనుశిఖలకున్ దనుజుని
నాహుతిగ నొసంగె నని యెన్నుమా సహజన్మ! యన్నఁ బిల్వఁ జచ్చె ననియె.

క. అనుజన్ముఁడు జీర్ణించెన్, దనుజాధమ! కార్యమెల్లఁ దప్పెంగా చే
యనఁ గోపంబున మౌనిని, దినఁబోవం జచ్చె నతని తీవ్రధ్వని చేన్. 260

తే. అనుచు నీరీతి మౌని మహత్త్వ మనుజ, నకు నెఱింగించుచుం బోయి యకలుషాత్ము
లుండు నట్టి యగస్త్యవాసోత్తమంబు, గా నెసంగెడు పావన కాననంబు. 261

క. కనఁబడినన్ మది విస్మయ, మున మున్గఁగ రఘువుండు పూజ్యమనీషున్
దన తమ్ముని గని యిట్లనియె నాయనా! యీమహర్షి యెంతఘనుండో? 262

చ. తెలిపెద నీకు మౌని ఘనదివ్యచరిత్ర మనుత్తమంబు ము
న్నొలసిన పూన్కి వింధ్యమన నొప్పుగిరీంద్రము తీవ్రభానుమం
డలమును సంస్పృశింపఁగ మనంబున నెన్నినయట్టు లట్టి వ
ర్ధిలఁగ సుపర్వముఖ్యు లాకరీతిగ దానిని మాన్ప నెంచియున్. 263

క జతనంబు చేసియున్ విఫలత గాంచుచు సాధుమౌనులం గూడి వెసన్
క్షితిఁ జేరి యీయగస్త్యుని, మతిమంతుని వేఁడఁ గరుణ మైకొనుచుండన్. 264

క. వారాణసి వదలి వెసం, జేరి మహీధ్రంబు నతఁడు చెచ్చెఱ మ్రొక్కన్
భూరిమహీధర! మరలన్, నారాకం గాంచి లెమ్ము నా కిది ప్రియమౌ. 265

క. గురువులమాటను దాఁటని, పరిపాటిగలట్టి గోత్రపాలకుఁ డట్లే
మరలన్ మిము దర్శించియె, పెరుఁగం గాంక్షింతు ననుపుఁ బ్రియవాక్యములన్.

చ. ముని నలరించె; దేవహితమ్ముం దమి నీవిధిఁదీర్చి దక్షిణం
బున కరుదెంచి రాక్షసులపూగము స్వీయతపోమహత్త్వయు
క్తిని నడఁగించి యుత్తరపుదిక్కునకుం జనఁబూన కిందె యుం
డిన మహనీయు నీయనఘుని గని ధన్యులమై నితాంతమున్. 267

చ. ధరణిసుపర్షిఁ గూడి పరితాపములం గడువీడి యిందె కా
పుర మొనరింపఁ గౌతుకము పొంగెడు లక్ష్మణ! యంచుఁ దెల్పుచున్

ధరణికుమారిఁగూడి ముని తల్లజు నాశ్రమసీమఁజేరి సో
దర! మనరాక మాని మదిఁ దార్కొనఁజేయుము నా వినీతుఁడై. 268

తే. శిష్యునొక్కనిఁ గరసంజ్ఞ చేతఁ బిలిచి, రామచంద్రుఁడు దశరథ రాజసుతుఁడు
పత్నిసోదరుఁగూడి యీ పజ్జనున్న, వాఁడు మీదర్శనముసేయ వలయు ననుచు.

క. అని యెఱిఁగింపుము నావిని, చని యావటు వగ్నిహోత్ర సదనంబున మిం
చినతేజమొప్ప నుండెడు, మునిగని యెఱిఁగించె భూప ముఖ్యులరాకన్. 270

ఆ. బ్రహ్మచారిపోయి వార్తలఁ దెల్పి య,మ్మౌని పల్కుఁ దెలుప మరలివచ్చు
నంతలోనఁ దమ్ముఁ డన్న నిట్లనివేఁడెఁ, గొండ యట్టె పెరుఁగు కోర్కి గనుట.

ఉ. దానవె భీతిఁజెంది సుర తల్లజు లిమ్ముని నాశ్రయించుటల్
మానసమందు నెన్న ననుమానముతోఁ జెడుఁ దీర్పవయ్య య
ద్దాని ననంగ సోదరుని ధర్మమతిం గని యిట్లు పల్కె నీ
దౌనను మానముల్ వదలునట్లుగ నుత్తర మేను జెప్పెదన్. 272

ఉ. కొండలనంగ నీకనుల కుం గననయ్యెడు ప్రస్తరంబులే
యొండొకరీతిఁ గా పనుచు నూహ యొనర్చుటఁజేసి లక్ష్మణా!
యొండుగఁ దోఁచుచుండు నెది యొప్పని నమ్ముఁగనీక యుండు ని
ట్లుండుట సాజమే జనుల కుర్విని; దెల్పెద దాని సత్యమున్. 273

క. తరుపాషాణాదులకున్, సురలీశులు గల్గియుంద్రు చూడఁ దగకయుం
దురు; వారు గూఢమూర్తులఁ, బరికింపఁ గనంబడుదురు వారు మునులకున్.

సీ. వృక్షాధిదేవతల్ వీరెగా యనిమాను, లవ్వారిఁగాంచి భక్త్యతిశయమున
గొల్తురు తత్సురల్ కోరినఫలపుష్ప, కిసలయంబుల వారికిన్ వలసిన
తఱి నొసంగుచునుంద్రు ధరణీధ్రముల కట్లె, యధిదైవతామరు లలరుచుంద్రు
వారిని బూజింప వాంఛించి తద్బాహ్య,తనువులౌ కొండలఁ దగినరీతిఁ

ఆ. బూజచేయుచుంద్రు బుధులెల్ల నిదితత్త్వ, మనుచు నెఱుఁగనట్టి జనులు తాలఁ
బూజచేయుట యనమూఢత్వమే యని, బలుకుచుంద్రు తెలియవలయు దీని.

ఉ శైలవరంబులం గొలువజాలిన వారధిదైవతంబులన్
వ్రాలినభక్తిలోఁదలఁచి వారలబాహ్యకళేబరంబులై
గ్రాలు మహాశ్మరాసులను గప్రసుమంబులఁ బూజచేయ దే
వాళి ముదంబుఁగాంచి హృదయాభిమతంబుల నిచ్చుఁ దమ్ముఁడా! 276

ఉ అంతియగాని ప్రస్తరము లర్హము లర్చనచేయ నంచు లో
సంతస ముబ్బఁ బుష్పముల సంతతమున్ గడుఁబూజచేయఁగా
నుంతయు లాభముం గలుగుచొప్పు గనంబడకుండు నింకనున్
వింతగఁ దోఁచుచుండు నదె వెఱ్ఱులదూఱున కర్హమై తగున్. 277

ఉ. తమ్ముఁడ వింధ్యభూమిధర! దైవము కారణ మొక్కఁడుంటచే
నమ్మెయి వృద్ధినొందఁదగు నంచుఁ దలంచెఁ దదాశయంబె భీ
మమ్మని తోఁప దేవతలు మౌనివరుండగు నీయగస్త్యు యో
గమ్మున శక్తిమంతుఁడయి క్రాలుట వేఁడిరి దాని నాపఁగన్. 278

క. ఈమౌనియుఁ దన్నిర్జర, మానసవాంఛితము సర్వమాన్యము గామిన్
లో నెంచి యతనికడకుం, దా నేగెన్ మౌనిచింతితం బాతండున్. 279

క. తలపోసి యితని గురువుగఁ, దలఁచుట నప్పునిని మానె దానినె కథగా
నలరించిరి సత్కవులీ, యిల నెల్లర కెఱుకపడుట హిత మనుచింతన్. 280

క. కత విని నయంత నిటఁగల, వితమేదని యెన్న వలయు వేగపడక త
ద్గతసార మెఱింగి జనులకు, హితమా కాదా యటంచ నెంచఁగ వలయున్.

క. తనకుం దోఁచినయట్టులు, జనులకుఁ దెల్పంగఁబూనఁ జన దద్దానన్
దనరు ననర్థం బొకచో, ననుజా! యోజింపవయ్య యాత్మన్ దీనిన్. 282

తే. అనుచు శ్రీరాముఁ డనఁగ సోదరుఁడు తనిసి
తెలిసికొంటిని దత్త్వంబు గళితమయ్యె!
సందియము లంచుఁ బలికెడు సమయమందె
వచ్చె మునిశిష్యుఁ డాతఁడు వారికడకు. 283

ఆ. మాన్యులార! మిమ్ము మౌనీశ్వరుం డగ, స్త్యుండు వేగ ప్రీతిఁ జూడఁగోరెఁ
గాన రావలయును గమ్రాశ్రమాంతర, మునఁ జెలంగు మౌనిఁ గనఁగ ననిన.

క. ఆమునితనయుని వెంటన్, రాముండు ధరాత్మజయును రామానుజుఁడున్
గామితములు ఫలియించున్, నేమం బిటసాగు నన్నినిశ్చయ మొప్పన్. 285

ఆ. అరిగి రగ్నిహోత్రనాలయమున నున్న, యాయగస్త్యు సవిధి కంత మునియు
సాదరమున వారి కర్ఘ్యాదు లిప్పించి, గారవించె వేడ్క గ్రమముమీఱ. 286

చ. కరములు మోడ్చి నిల్చి రఘుకాంతుఁడు వాని గ్రహించి భక్తిని
ర్భరమతియౌచు గోత్రమును వ్యాపృతిగాంచిననామముల్ మృదు
స్వరమున నుచ్చరించుచును వందన మంఘ్రులఁదాఁకి చేసె సో
దరుఁడు ధరాత్మజాతయును దద్విధి సల్పిరి శాస్త్రరీతిగన్. 287

క. మునియున్ వానప్రస్థుల, కనుచితధర్మం బదెద్దొ కోరిక దానిం
దనయాచారము తెల్పఁగ, వనజములగు ఫలముఖములు వారికి నొసఁగెన్. 288

క. కరయుగ్మముఁ గూరిచి యా, ధరణిందగు నాసనమున ధర్మాకృతియై
పరదుర్జ్ఞేయవిభూతిన్, బరఁగెడు శ్రీరాముఁ గాంచి పలికె న్మునియున్. 289

తే. అనఘ! వైశ్వదేవమ్ము సమాచరించి, యతిథిఁ బూజింపఁదగు నన్నయమలధర్మ
మాశ్రయింపంగఁదగుఁగా దోయద్దివదలు, నట్టిమౌనియుఁ బాపంబులనుభవించు.

క. తనమాంసము దుస్సాక్షియుఁ; దినురీతిం బరమునందుఁ దినునంచు విధుల్
వినఁబడుచున్నవి రామా!, కనుకం దత్కార్యము వెనుకన్ నీకుఁ దమిన్. 291

ఆ. అతిథిపూజచేయు నవధానముం గంటిఁ, బరమపూజ్యుఁడవు కృపాసముద్రుఁ
డవు సురేశపూజ్యుఁడవు నగు నిను గంటి, బరమభాగ్యఫలముఁ బడయఁగంటి.

చ. అనుపమధర్మనిర్మితశరాసన మీయది వైష్ణవంబు దే
వనికరశిల్పినిర్మితము భాస్కరరీతి వెలుంగుచున్ భయం
బును రిపురాజికిం గలుగఁ బొల్చి యమోఘమునౌచుఁ బూర్వమా
వనరుహసూతిదత్తమయి భద్రదమా శరవర్య మిద్దియే. 293

క. శరపూర్ణము లక్షయములు, పరమమ్ములునై వెలుంగు భవ్యేషుధు లా
సురపతి యొసంగె వీనిని, హిరణ్యకోశావృత మగు నీఖడ్గంబున్. 294

క. శతమఖుఁడే యొసఁగెన్ మును, శతపత్త్రాక్షుండు దీనిఁ జాపవరము నా
దితిజులఁ జంపం గొని తత్కృతి సాగినవెనుక దీని నిచ్చెన్ నాకున్. 295

చ. శరము శరాసనం బిషుధిసత్తమముల్ గురుఖడ్గ మిత్తఱిన్
బరతతులన్ జయింప రఘువర్య! యిదే కొనవయ్య! భూరిసం
గరమునఁ గ్రూరదానవనికాయముఁ జంపి జయంబు సర్వది
గ్వరనుతిఁ గాంచవయ్య గుణవర్య నిరంతరధర్మరక్షకా! 296

చ. అని కొనియాడి వానిని మహాశిషముల్ దగనిచ్చి నెమ్మనం
బునఁ దగు ప్రేమముబ్బ రఘుభూపవరా! విను మొక్కమాట నీ
వనముల కీవు రాఁగఁ గడుభక్తిని జానకి వెంబడించివ
చ్చెనుగద కోమలాంగియగు సీతను బోలిన నాతి యుండునే? 297

ఉ. చూడ దొకప్పు కష్టములఁ జూడ్కులనైన సుఖంబు లెన్నఁడే
వీడదు స్వాంతమందు నటవీస్థల మిట్టిదటం చెఱుంగఁగా
నాడదు నీదుమాట కెదురాత్మ నొకానొకవేళ నేనియున్
గూడదు సాధ్వి యీమె నినుఁ గూడి మహాటవిఁ జొచ్చె నద్దిరా. 298

ఉ. ఈమెను దండకాటవికి నిట్టులు చేర్చిన దాత్మనాథుపై
నీమెయినుండు ప్రేమమె మఱెద్దియుఁ గాదని నిర్ణయించితిన్
గోమలగాత్రి కష్టములకుం దగనట్టిమహీశపుత్త్రి యీ
భూమినిగల్గు స్త్రీవితతిఁ బూజ్యయయై తగియున్న దోవిభూ! 299

క. ఈపడఁతిం గనిశీలం, బీపగిదిగ నుండు ననుచు నెల్లవనితలున్
జూపట్టు శ్రద్ధ నేర్వఁగ, వేపూనఁగ వలయు నంచు వేడ్కఁ దలంతున్. 300

చ వనితలు భాగ్యరూపముల భాసిలునాథుని గారవింతు రా
తనిదశ సుంతమార్పుఁగనఁ దద్గతి నమ్మరియాద తగ్గున

ట్లొనరుతు రిద్ధి సర్గమున। నొప్పును నైజముగాఁగ రాఘవా!
విను మిది స్త్రీలచిత్తములు। వేగమ పోవు తటిల్లతాభముల్. 301

తే. వెనుకముందును జూడక। వెలఁదు లెప్పు,డెద్దితోఁచునో యటు చేయ। నెంచుచుంద్రు
గాని పూర్వాపరంబులో। కార్యములను, దలఁచి పని చేయరిది వని। తలకు వృత్తి.

క. తరుణులచిత్త మ్మరయఁగ, గరుడానిలవేగమును ద। గన్ మించుచు ను
ర్వర సంచరించు లోకాం,తరములఁ జరియించునంచుఁ। దలఁపంగఁ జనున్.

చ. జనకమహీశ్వరాత్మజయు। సాధ్వులమేటి యనంగఁ జెప్పనొ
ప్పును సహధర్మచారిణి వి।భూ! ప్రతిజన్మమునందు నీ కరున్
వనితల కిట్టివర్తనము। బా గని తెల్పఁగఁ జాలుశీలమున్
మునిజనచిత్తపద్మములఁ। బొల్చెడు తేజముఁ జెల్వమీఱఁగన్. 304

చ. పలుకులు వేయునేల నినుఁ। బట్టి మహత్తరకష్టజాలముల్
గలుగఁగ వాని సైఁచి యవె। గాఢసుఖంబు లటంచు నెంచుచున్
వెలయునుజుమ్ము నీదునభి। వృద్ధికి హేతు వనంగనీమెయే
కలిమియు లేమియున్ బొదలఁ। గారణ మీమెయె నీకు నో ప్రభూ! 305

చ. హరిహరపద్మజుల్ శతమ। ఖాదికనిర్జరవర్యులున్ నినున్
సురుచిరమూర్తిగాఁ గొలువఁ। జూచుట కీమెయె హేతు వో పరా
త్పర! నిను రూపవంతునిఁగ। బల్మఱు చేయుచునుండు శక్తి నాఁ
బరఁగెడునీమె కాదె నిజ। భక్తులపాలిటికల్పశాఖయే. 306

చ. తలఁచినయంతనే తగువి। ధంబున లోకగణంబు పుట్టుచున్
వెలయుచుఁ ద్రుంగుచుండు ధర। విచ్యుతధర్ముల రాక్షసావళిం
గలనునఁ ద్రుంపఁ బుట్టి నినుఁ। గాంతుని బుట్టఁగఁ జేసె నీమహా
లలితతనూవిలాసగురు। లక్షణశోభిత యీమెయాఁ బ్రభూ! 307

వ అని తెలుపంగ రామవిభుఁ। డమ్మునిపల్కుల నాలకించి యో
మునివర నీదుసంగతిని। బొందుట ధన్యులమైతి మింక నీ
వనమున నెందు నాశ్రమము। వారిసమృద్ధిని గందమూలపా
వనతరుపీరుదుజ్జ్వలత। భాసిలునట్టులు కట్టనొప్పునో. 308

ఉ. అందు వసించి శిష్టసమ।యంబును బుచ్చఁగ నెంచువాఁడ దా
మిందుల కెట్టు లాజ్ఞ యిడ। నెంతురొ యట్టులె చేయువాఁడ నీ
సుందరి యల్లకోరెడిని। జొక్కపుఁ బ్రీతిఁ దలంచి యాజ్ఞచే
యందగు నంచు నాదశర। థాత్మజుఁ డెంతయు భక్తి వేఁడఁగన్. 309

తే. ఆయగస్త్యమహర్షి యు।నాత్మలోము,హూర్తమాత్రము ధ్యానించి। యురుతరంపుఁ
గార్యజాలము తోఁచుట। కారణముగఁ బలికె నిట్లని గంభీర। భణితి మెఱయ.

సీ. వినవయ్య యోనృపవీర! నీ వానరింపఁ, దగుకార్యములకెల్లఁ దగినచోటు
కలదు యోజనయుగ్మకలితదూరంబున, బహుపక్షిమృగరాజిభవ్యమగుచు;
నంభఃప్రపూర్ణమహానది యొప్పంగ, నాహారవస్తుభాగ్యమున మించి
పావనపవమానభవ్యమై తగి పంచవటి నాఁ బ్రసిద్ధమై వాసయోగ్య
తే. మునయి రాజిల్లు; నందు నీవనుకొనినటు, సమయశేషంబుపుచ్చి రాజ్యంబునొంది
ప్రజలఁ బాలింపు;మా చోటు భవ్యకార్య,సత్ఫలంబుల నొసఁగంగజాలునీకు.

క. వనమది యిచ్చోటికిఁ జెంతనె యున్నది; నన్నుఁగూడి నాయాశ్రమసీ
మను నివసించుటకంటెను, గనుఁగొన నది శర్మదంబుగాఁ దోఁచె మదిన్. 312

క. ఆవనముదాపునన్ గోదావరి ప్రవహించుచుండు దానిం గనుచున్
నీవరవర్ణిని యీమెయు, భావము వికసింపఁ బ్రీతి వర్ధిల నుండున్. 313

తే. ఆర్తరక్షణరూప కార్యపరతంత్ర, చిత్తుఁడవు గాన నందె వసించు టొప్పు
మానులం బ్రోవ దారుణదానవాళి, నడఁప వనమదె తగియుండు ననఘ!నీకు.

ఉ. దానికిఁజెంతఁ బర్వత ముదారతరుప్రవికీర్ణమై తగుం
గానయు సర్వకాలఫలకందయుతంబయి పుష్పవృక్షసం
తాననిరంతరంబునయి తద్దయు శర్మదమై తనర్చు నం
దూనినశ్రద్ధ నుండుము సమున్నతకీర్తియశస్సు లొప్పెడున్. 315

చ. పతగవరేణ్యుఁ డందు నొకభంగిని నీకును దోడుసూపు నే
వితమునఁ జూచినన్ గలుగు వింతలు దోఁచుచునున్న; వవ్వనీ
కతులితకీర్తి నిచ్చు మరియాదను గన్పడఁజేయు ధర్మసం
తతి; కిఁకఁ జెప్పనేల గుణధామ! మనోహరనామ నిర్మమా! 316

చ. పరమగభీరభావయుత భావికృతిప్రతతిప్రబోధనా
దరరమణీయవాక్కులను దన్నొగి నమ్ముని హెచ్చరింప సో
దరుఁడును సమ్మతిం గనఁగ దారయుతిం జన నెంచి యమ్మునీ
శ్వరునకు వందనంబులను శాస్త్రవిధిం దగున ట్లొనర్చుచున్. 317

తే. పంచవటిఁ జేరఁబోయి మీపలుకు లెప్పు
డాత్మఁబొదలంగ వర్తింతు నార్యవర్య!
యనుచుఁ బనివిని యాతని యానతిమెయిఁ
గానఁబడుచిహ్నములనందుఁ గనుచుఁ బోయె. 318

జటాయువు రామునితో సంభాషించుట.

చ.. అరుగుచునుండఁ బంచవటి యంతికమం దొకచో మహాకళే
బరము తగంగ గృధ్రకులపావనుఁడై యలరారుచుండు వి
ష్కిరపతి యొక్కఁడుండె నొకసిద్ధవటద్రుమమందు; వానిభీ
కరసురవైరిగాఁ దలఁచి గాఢరవంబున నాసహోదరుల్. 319

తే. పలికి రిట్లని యామఱ్ఱిపై వసింప, నేల యెవ్వఁడవో వచియింపు మనిన
నాదరముఁ దెల్పు వాక్తతియలర వత్స! దశరథావనిపతికిమిత్రమను నేను.

చ. పితృసఖుగా నెఱింగి ననుఁ బ్రీతిని జూడు మనంగ రాముఁడున్
జతనముమీఱఁగా నతనిచారుచరిత్ర మెఱుంగఁగోరి యో
పతగకులైకభూషణ! కృపామతిఁ దెల్పుము వంశ మన్న నా
క్షితిపతిపుత్త్రవర్యునకుఁ జెప్పఁగబూని కులంబు నిట్లనున్. 321

క. వినతయుఁ గద్రువయు ననన్, వనితామణు లిర్వు; రందు భాసురకీర్తిం
గనువినత యనూరుండను, తనయునిఁగనె గరుడుఁడతనితమ్ముఁడు సుమ్మీ. 322

క. శ్యేనియనం జనునింతియె, భూనాథ! యనూరునకును బొలఁతి యగును; నే
సూనుఁడ సంపాతియనం,గా నొక్కఁడు పుట్టెఁ దొలుతఁ గడుబల మలరన్.

క. నా పేరు జటాయువుగా, భూపకుమారా! యెఱుంగఁబోలు న్నీకున్
దాపసజనసంజుష్టం, బీపథ; మిం దెందునుఁడు దేఁ దోడ్పడుమున్. 324

క. వనవాసమందు సాయం,బును జేయుదుఁ దోఁచినంత భూరిబలాఢ్యుల్
దనుజులు వసింత్రు మృగగణ,మును జరియించున్ భయంబుఁబుట్టించుచొగిన్.

ఉ. తమ్మునిగూడి యెచ్చటికిఁ దారుచనన్ గృహమందునుండి యీ
యమ్మను గాంచు చుండెద మహాబలమొప్పఁగ రామచంద్ర! నీ
వెమ్మెయి సంచరించిన నదేపని కేగిన నింటిచింత చి
త్తమ్మున సుంతయైన నెటుతాఁకకయుండఁగఁ జేయుదున్ విభూ! 326

చ జనకసఖుం డితం డనెడుసంతస మొప్పఁగ రాముఁడాపత
త్త్రినికరవర్యుఁ గాంచి కడుధీరుఁడ వీ వని గారవించి తో
డ్కొని యసురాళివిక్రమము గూలిచి ధర్మము నిల్పుకోర్కి పై
కొన గహనంబుఁ జేరె మునికుంజరుఁ డెన్నినచోట నిల్వఁగన్. 327

క. పంచవటిం గని యట ఖగ, సంచారము వేడ్కనింపఁ జారుసుగంధా
భ్యంచిత వీరుత్తరువర, సంచయముల నింపుగుల్కు స్థలమందున్. 328

తే. ఆశ్రమమ్ము నిర్మింపఁగ నాత్మ నెంచి, సహజుఁ గన్గొని లక్ష్మణా! శాస్త్రరీతిఁ
బర్ణశాలను గల్పింపవలయు నిందుఁ, గట్టినన్ మే లటం చెదఁదట్టె నాకు.

క. అనునంతలో సుమిత్రా, తనయుండును వాస్తుశాస్త్రధర్మంబులఁ బా
యనిపూన్కిఁ బర్ణగేహం,బును గట్టె నివాసమునకు బోలినయట్టుల్. 330

ఆ. వాస్తుపూజసల్పి వరుస గేహప్రవే,శమునఁ జేయఁదగినపరణిఁ గర్మ
ముల నొనర్చి యన్న కెలమి దానిం జూపఁ,జక్కఁ గాంచి రామచంద్రుఁ డనియె.

క. అమరించినాఁడ విటు గే,హము వాసార్హముగ సోదరా! నా కెంతో
ప్రమదము నిండారెడు నీ, చమత్కృతిన్ మెచ్చవచ్చు సర్వవిధములన్. 332

మ. అని కొండాడి రఘూద్వహుండు తిలకాన్యాయుక్తుఁడై యాగృహం
బును జేరెన్ సహజుండు తోడుపడఁ సమ్మోదంబు మీఱంగ రా
మునిఁ దత్సోదరు సర్వలోకజననిన్ బూజించె గోదావరీ
ధుని యందుం బ్రసరించి శీతలగతిం దోడ్తో సమీరార్భకుల్. 333

ఉ. శీతమరుత్కిశోరములు చెందినవేడుక రామచంద్రుపై
సీతపయిన్ దదంఘ్రిసరసీరుహసేవను సర్వకాలసం
పూతమనంబునన్ వెలసి పూజ్యుఁడునైన సుమిత్రపట్టిపై
నాతతి వీచి ధన్యములెయయ్యె నదెంతటి పూర్వపుణ్యమో. 334

క. హేమంతకాలమగుటన్, శ్రీమంతుండైన రాము సేవించినచోఁ
గామితము లబ్బు నని శుచి, తా మది యోజించి చెంతఁదప్పకయుండెన్. 335

సీ. ఒకనాఁడు సౌమిత్రి సకలజ్ఞుఁడగు రామచంద్రుని గాంచి యీసమయమందు
మునులెవ్వరును రారు మునువచ్చుచునున్న యట్లు కారణమేమొ యరయఁజాలఁ
దండ్రి మిత్రము పక్షితల్లజుఁ డౌ జటాయువుమాత్ర మీచెంతనుండి మనకుఁ
దగినకాలమునఁ దోడగుదు నంచువచించి, వచ్చుచుఁ బోవుచు నిచ్చటనె ని

తే. వాసము నొనర్పుకున్నాఁడు భూసుతయు న
తనిపయిం బ్రీతి యునిచి నిత్యమును బల్కు
చున్నయది యాతఁడుం దప్ప నొక్కమునియు
వచ్చిచూడఁ డదేలొకో యిచ్చదనర? 336

కాలమహత్త్వవర్ణనము.

ఉ. నీమది కేమితోఁచినదొ నేనెఱుఁగంజుము తెల్పవచ్చునే
నామదిఁ గల్గుసంశయగణంబులఁ బోవఁగఁ దోలవయ్య! శ్రీ
రామ! యటన్నఁ దమ్ముని నరాతిభయంకరశౌర్యసారునిం
బ్రేమముపొంగఁ గాంచి వివసింపఁగ రామిఁ దలంచి యాత్మలోన్. 337

చ స్మితము ముఖాంబుజంబునకుఁ జెల్వముఁ గూరుప నిట్లుపల్కె నో
మతివిభవాభిరామ! గుణమండన! చక్కఁగ నాలకింపుమా
శతధృతిముఖ్యదేవవరసంతతికైనను గాలమొక్క ప
ద్ధతిగను సాగకుండు ననఁ దక్కినవారల కేల చెప్పఁగన్. 338

చ. ఒకతఱి నెల్లరన్ గుమిగనుండఁగఁ గూరుచు నట్టులుండ నిం
కొకయెడ వేఱువేఱుగనె యుండగ నూహజనింపఁజేయు నిం
కొకక్షణంబునందుఁగడు నుగ్రముగాఁ గలహింపఁజేయు నె
ల్లకడలఁ దానె కర్తయయి లాస్యముఁ జేయును గాల మద్దిరే! 339

చ కలియుట వీడిపోవుటయుఁ గాలవశంబుననే యటంచు ని
మ్ముల మది నమ్మఁగావలయుఁ బోలదు చెప్పఁగ నీడు దానికీ

యిల నిదియంచు దేనిని; సహింపదు దానికిఁ గాలమంచు నీ
పలు కనృతంబు గా దనుచు భావన చేయుము నీవు తమ్ముఁడా! 340

చ. ఎపు డెది చేయఁగాఁ దగునొ యెట్టులొ యన్నది తోఁపకుండు నే
నెపముననైనఁ దోఁచినటు నేర్పుమెయిన్ నటియింప వారిదౌ
కపటము తేటతెల్లమగుఁ గాకయ దెవ్విధి నిల్వనేర్చుఁ గా
లపరమతత్త్వముల్ మతిబలంబునఁ జెప్పఁగరాద దేరికేన్. 341

మ. పరమేశుం డనఁ గాలరూపుఁడె యగున్ భావింతు రిట్లే తపో
నిరతుల్ లక్ష్మణ! యీవిధం బెఱుఁగుమా నీయాత్మసందేహముల్
స్థిరతం గాంచక వే తొలంగిచను నీసిద్ధాంతరీతిన్ మునీ
శ్వరు లిం కెవ్వరుగాని రా రిచటికిన్ బత్తీశ్వరుం డొక్కఁడే. 342

తే. తండ్రిసంబంధమునఁ జేసి తమి చెలంగ, వచ్చుచుం బోవుచుండు నీసచ్చరితుని
వదలఁగూడదు ముదుసలి వరమతియును, ధర్మనిరతుండు నౌట నెత్తరుణమందొ.

క. మన కుపకారము చేయును, మనముం గూడం దలంచి మాన్యుం డని యె
ప్పునినైన నుపకృతిగనే, యొనరింపవలసియె యుండు నో సుగుణాఢ్యా!. 344

క. ఇతరేతరోపకారము, సతతము చేయంగ ధర్మశాస్త్రమె తెల్పున్
మతిమంతు లెల్లఁ దమకప,కృతి చేసినవారికి నుపకృతిఁ గూర్తు రహా!. 345

క. అదెయగు నేర్పన దానన్, మది మందాత్మంబు పొడమ మఱి యెదిచేయం
గఁ దలంపక యాదినమే, మొదలుగ ధీమంతులగుచుఁ బొలుతురు ధరణిన్.

తే. సుంతశాంతంబు గని దోషవంతులైన, వారిసాధువులను జేయవచ్చుఁ జుమ్ము
మాఱుచేయంగఁ బూనుట మఱియుఁ గోప,మినుమడింపఁగఁ జేయుట కేయనఁ దగు.

తే. ఎట్టివేళల నేకార్య మితనివంక, మనకుఁ జేకూరవలయునో యని యెఱుఁగము
దాని నెఱుఁగును గాలంబు మాననీయ,చరిత! కావున మన చెంతఁ దిరుగు నితఁడు.

క. జనకజ చెంతన్ మసలుట, గనుఁగొనఁ గా నితనినుండి కావలసిన దె
ప్పుని యో యుండును దెలియదు, మనకది కావున నె శంక మదులం బొదలెన్.

ఆ. చిత్ర మిదియె కాదె చెప్పంగ రానిదై, యలరు కాలమహిమ మాత్మ లందుఁ
దలఁపఁ జాలకుండ్రు ధాతృముఖ్యులు కూడ, మనమనంగ నెంత మాత్ర మనుజ.

చ. మునివరు లింతదాఁక మన ముందట నుండుచు నిష్ఠ రామి కే
మని తగుకారణం బరయ నొఁగద యద్ది దురూహమే యనం
జను నటులైన నామది నోసంగెడునూహ వచించు నెద్దియో
కననగు దుష్టకర్మఫల కాండము తప్పదు సుమ్ము లక్ష్మణా! 351

క. ఖలులకు సౌజన్యంబే, యలవడినన్ దౌష్ట్య మబ్బె యమలమతులకుం
గలిగిన విపత్తునకె య, ట్లలవడుట యటంచు నార్యు లందురు సహజా!. 352

క. పతగము తోడ్పాటునకున్, జతనంబును బూనుటయును సాధుమునీంద్ర
ప్రతతు లుదాసీనులవ, ద్ధతి గైకొంటయుఁ దలంపఁ దత్త్వం బెదియున్. 353

క. కనఁబడకున్నది కాలం, బనుమాటయె చెప్పఁదగు సహజ! మఱి యొకఁడే
వినిపించెద దుష్ఫలముల, మనలం గుడిపింప నీసమయ మెన్నఁ జుమీ. 354

క. నాకుం గనఁబడుచున్నవి, కాకాదులరుతము లెన్నొ కష్టము లిడ నె
ట్లో కాలశేషమున్ మన, మీ కానన్ గడపుదము సహించి శ్రమములన్ 355

ఉ. దానవనైజ మెత్తఱి నితంబినులన్ గ్రహియింప నుండు నీ
మానినిరూపశీలము లమానుషముల్ గద? దండకాటవిన్
గానఁగవచ్చు నప్పుడె కనంబడెఁ గాదె విరాధువర్తనం
బీనలినాక్షిఁ దొల్త గ్రహియించుతఱిన్ వివరింప నేటికిన్? 356

తే. ఈయరణ్యాని వారల కిక్కగాఁగ, వింటి మెన్నియొ సారులీవిధ మెఱిఁగియు
కాఁదగునగస్త్యమునివర్యుఁ డాధనుశ్శ,రాదికంబుల నొసఁగియుద్ధాంగణముల.

క. అసురేంద్రులఁ జెండాడుచు, నసమానయశంబు గొనుమ యంచును దీవిం
చె సకలవేత్తయగుం గను,క సమరసాధనము లిచ్చెఁగా యని తలఁతున్. 358

ఉ. కావున ముందు రాక్షసనికాయముతోడ భయంకరాహవం
బెవిధి నైనఁ గాఁదగినదే యనితోఁచెడు నాశరంబులన్
జేవ తొలంగ స్వర్గమనసిద్ధిని గాంచఁగలట్టి క్రూరులౌ
దేవవిరోధు లిందలినదీతటిభూరుహవాటికావళిన్. 359

తే. కాపురంబుండు వారని తాపసేంద్రుఁ, డెఱిఁగియే పంచవటియందె యింపుదనర
నుండుఁడని సాగనంపె నేమోయటంచుఁ, దలఁచుచున్నాఁడ నీవెట్లు తలఁతువొక్కొ.

క ఏదేది యెట్టులున్నన్, నీదగుదోర్వీర్య మొకఁడు నియతి భజింపన్
మోదము నిడు ధర్మ మొకం, డాదితిజుల నోర్చుశక్తి నమరుచు నాకున్.361

క. అని తలపోయుదు నిప్పుడు, వనమం దిట నేమఱకయె వసుధాపుత్త్రిన్
గనుచుండవలయుఁ జుమ్మీ, యనుజన్మా! నీవొ నేనొ యాశ్రమమందున్.362

ఆ. పక్షిరాజు గలఁడు బాధ యేమని మన, మనవధాన మూని యరుగరాదు
సత్ప్రయత్నములను జనుఁడు కర్మము చేయ, వలయునన్న సుజనవాక్కెఱుఁగవె.

క. దైవమె బలవంతమ్మని, యేవాఁడు స్వకీయధర్మమే చేయఁడొ యా
ధీవిభవహీను నర్థము, పోవిడచుం జూడనైనఁ బూనదు మరలన్. 364

తే. యత్నపరుఁడైన మానవు నాశ్రయించు, శ్రీమహాదేవి యనిగాదె సిద్ధవాక్య
మలరు నుద్యోగమున ఫలమబ్బదేని, యందుఁ గలదోష మేమొకో యరయఁజాల.

ఉ. దైవముపైన భారము నితాంతము వైచి స్వకీయధర్మమై
పావనమైన యత్నము నభంగురరీతి నొనర్చుమానవున్

గావలె నంచుఁగోరి యొడికంబున శ్రీసతి యాశ్రయించుఁ బో
యావిధి మానుమర్త్యునకు నాపదలే కలుగుంగా నిజం బిదా. 366

చ. జనకకుమారిమూలమున శర్మమొ కష్టమొ సాధుకీర్తియో
జనులముఖాళి నానుటయొ శ్మాస్థలిఁ గల్గు నటంచు నమ్మి యీ
వనమున నెట్టులుండిన శుభంబగు నట్టులు వర్తనంబు చే
యను జనుఁ జెప్పినాఁడ హృదయంబునఁ దోఁచిన దెల్లఁ దేటఁగన్. 367

సీ. ఉత్పాతములు కొన్ని యర్వీజములువియ,ద్భవములభ్యంతరభవములనెడు
మూఁడురీతులుగాఁగఁ బొల్చుఁనట్టివి కానఁ, బడుచున్న వెన్ని యోభయదముల
సహజన్మ యీపెనుగహనంబునన్ నాల్గు, వత్సరంబులు పుచ్చవలసియుండు[యి
గాన నోపికగల్గి కాపాడవలయు నీ, భూపుత్త్రి నంచు రాముండు విశద
తే. భణితి బోధించి లక్ష్మణుఁ బంపి తాను, నిర్వికారుఁడెయయ్యును సర్వమునకుఁ
గారణంబయ్యుఁబామరుకరణినుండెఁ,బంచవటియందుసౌఖ్యానుభవముగనుచు

ఉ. అన్నియు వించు సీత హృదయాబ్జము మోదరసార్ణవంబుగా
నున్న తెఱంగుఁ గానఁబడకుండఁగ జానపదాంగనన్ స్వవృ
త్తి న్నెఱి మించుచున్ బతికిఁ దృప్తిగఁ బల్కుచు భావికాలకా
ర్యోన్నతి లోఁ దలంచుచు నిజోదయలాభముఁ గూర్ప నెంచుచున్. 369

చ. తనమదిఁ బొంగుభావమువిధం బిసుమంతయు నేర్మికైనఁ గ
న్గొనఁగఁ దరంబుగానియటు గూఢముచేయుచు స్వీయశక్తినిం
గనఁబడకుండ దాఁచి రఘుకాంతునివంక నెసంగఁజేయు కో
ర్కెని జెలువారుచుండె శుచిరీతిని బంచవటిన్ విలాసతన్. 370

శూర్పణఖవచ్చుట.

క. పురుషునకుం బ్రకృతికి నెవ్వరుసం దలఁపుల్ చెలంగు వాని నెఱుఁగ నె
వ్వరికిన్ వశమగు? వార లొ, కరితో నొక్కరును జెప్పఁగాఁ దలఁప రెదన్.

క. ఎవ రేది తలంచిన నొ,క్కవిధంబున నిర్వ్యరకును గాన నగున్ జ్ఞా
నవసతులుగాఁ జెలంగుట, నవగతతత్త్వలయి యుంట నవిరహు లగుటన్.

క. ఈరీతి వారలుండియుఁ, గారణసంలబ్ధవిమలకాయులగుట సా
ధారణు లట్లుగ మసలుచు, నేరకి దుర్జ్ఞేయమహిమ మెంతయు నొప్పన్. 373

క. చరియించుచుండి; రొకనాఁ డరిమర్దనుఁడైన రఘుకులాభరణము సో
దరుఁడు ధరాసుత వెంబడి, నరుదేరన్ గౌతమికి మహాద్యుతి నరిగెన్. 374

తే. స్నానసంధ్యాజపాద్యనుష్ఠానవిధులఁ, జక్కఁగాఁ దీర్చిమరలియాశ్రమముఁజేరి
యిష్టగాథలఁ జెప్పుచుఁ నెలమి నొరులు, చెప్పఁగా నాలకించుచుఁ జింతలేమి.

ఉ. జానకి చెంతనుండి సరసంపునుడుల్ పలుకంగ లక్ష్మణుం
డూనిన శ్రద్ధ ద్వారముననుండి తమిన్ వినుచుండ రామభూ
జాని నితాంతమోదమున స్వాంతము మున్గఁగ నుండె; నంతలో
దానవియోర్తు శూర్పణఖ దారుణచిత్త చెలంగు స్వేచ్ఛచేన్. 376

మ. అరుదెంచెన్ గుణరూపశీలములఁ ఘోరందంగ నెక్కాలమం
దరయం జాలనిభీమగాత్రి వికటాస్యం బెంతయుం జూడఁగాఁ
దర మెవ్వారికిఁగాక యుండఁదగు క్రోధస్వాంత లంకేశుసో
దరి యాత్రోవను బోవుచుండి క్షితిజాతన్ రామచంద్రుం గనెన్. 377

ఉ. పున్నమనాఁటిచంద్రమునిఁ బోల్మిఁకఁ బోల్మని యీసడించుచున్
మన్ననఁ గాంచఁజాలి మహిమంబుల కిక్కగు రామువోము సం
పన్నిలయంబులై తగి కృపాజలరాసు లటంచుఁ గీర్తినిం
గన్న విశాలనేత్రములఁ గాంచి యటం జన నంప్రు లాడమిన్. 378

క. నిలువఁబడి చూచెఁ జక్కఁగఁ, గలఁతంగనె వెంటనే నికామము పూన్కిన్
జలజారిమేనయల్లుఁడు, ఖలదానవిచిత్త మెంతో కాఁతియ పెట్టెన్. 379

క. విరిశరముల నొగిఁ జిత్తము, పరితాపం బంద నేమిపలుకం దనకుం
దరమేగామి శిలాకృతి, స్థిరముగ నిలిచెన్ మనంబు దిటవు తొలంగన్. 380

చ. జనిమొద లింతదాఁక సురజాలమునందును జూడరాని రా
మునిదగు సోయగంబు తనమూర్తిని ముంపఁగ నేమిదోఁపమిం
గనుఁగొనుచుండి యంతఁ దమకం బొగిఁ దన్ బురికొల్పఁ జెంతకుం
జని నిలుచుండి యిట్లనియెఁ; జాపశరంబులఁ దాల్చి యువ్వనిన్. 381

చ. మునివలె నొప్పువేషమును బూనియుఁ గాముకురీతి భార్య చెం
తనె యలరార క్ష్మాపతివిధంబును రూపము తెల్పుచుండఁగాఁ
దనుజులు సంచరించునిటఁ దద్భయ మింతయు లేకయుండఁగాఁ
జనునె త్వదీయవార్త విన సంతస మందెదఁ దెల్పు మీయెడన్. 382

ఉ. ఉన్నదియున్నచందమున నొప్పుఁ జూమీ వచియింప నన్న దా
ని న్నెటఁ గాంచి రాఘవుఁడు నేర్పుతగన్ వచియించె మానినీ!
యెన్నఁడు సూనృతేతర మదింతటిదాఁక వచింపఁ బల్కఁగా
నెన్న నికన్ వచింతు విను మేను రఘూత్తమవంశజాతుఁడన్. 383

తే. దశరథుం డనునృపునకుఁ దనయుఁడ నతఁ
డనుజుఁ డగునాకు లక్ష్మణుం డందు రతని;
రాముఁ డని నన్నుఁ బిల్తురు కామినీ! యిది
నాకళత్రంబు సీత యనంగఁ బరఁగు. 384

ఉ. తల్లియుఁ దండ్రియుం బనుప । ధర్మము నమ్మియె వచ్చినాఁడ న
న్నెల్లపు డించుకే వదల । కెంతయుఁ గొల్చెడు వీరు వచ్చినా
రెల్లవనంబులం దిరిగి । యిక్కడఁ జేరితి మేము సుందరీ!
చెల్లెఁ ద్రయోదశాబ్దములు । చేసినయాసమయంబునం దొగిన్. 385

తే. ఇంచుమించుగ వత్సర । మిందునుండ, నెంచియున్నార మోసాధ్వి! । యొపతవీవు
వనములంజూడనీమది । వాంఛయేని, యొంటరిగవచ్చుటరయంగ । నొప్పునొక్కొ.

క. ఎందు నివాసము పేరెది, యిందునిభాస్యా! కులం బ । దెయ్యదో వివరిం
పం దగు నా విని రాముని, యందము తక్క బ్రోత్సహింప । నది యి ట్లనియెన్.

క. రావణుఁ డను పౌలస్త్యుని, ధీవిభవాఢ్యుని దివస్ప । తిప్రముఖమహా
శావిభు భీతిప్రదునిన్, నీ వింతకు మున్నె తగ వి । నినియె యుండుకదా?. 388

క. లంకానగరనివాసము, శంకారహితాత్మ పౌరు । షకలాపము స
ర్వాంకవిజయమోదము తన, కంకములుగ నుండ రావ । ణాసురుఁ డలరున్. 389

క. అనుజాత రావణునకున్, నిను నెల్లరు శూర్పణఖ య । నం జను పేరన్
వినుతింతురు కామగమన, మున లోకత్రయముఁ జూడఁ । బోవుదు రాజా! 390

క. సతతంబు నిద్రఁ బోయెడు, జతనంబు గలట్టి ఘోర । సత్త్వముఁ డత్యు
ద్ధతుఁడు నగు కుంభకర్ణుఁడు, మతిమంతా! సోదరుఁ డగు । మహితగుణుండై. 391

క. దనుజులవర్తనమే లే, క నిరంతరధర్మవృత్తి । గ్రాలుచు శాంతం
బునఁ బొల్చు విభీషణుఁ డో, జననాయక! సహజుఁ డగును । సత్త్వాధికుడై. 392

క. ధర ఖ్యాతిమించి యుండెడు, ఖరదూషణముఖులు; శత్రు । గణ శమనులు సో
దరు; లవ్వారికి నమరులు, శిరముల్ వంతు రని వేఱ । చెప్పఁగ నేలా?. 393

చ. పురుషవరేణ్య! నిన్ బ్రియుని । బొందఁగఁ గోరితి; నాకు భర్తవై
కరమనురాగ ముప్పతిల । గా సుఖియింపుము మున్న దెప్డు నీ
సురుచిరదేహసంపదకు । జో డనిచెప్పఁగఁ జాలియుండు నే
పురుషులఁ జూడ లే దనుచు । బొంకక చెప్పెద మాటిమాటికిన్. 394

ఉ. సుందరి నాకు నున్న యది । శూర్పణఖా! యని భూపవర్య! నీ
వందువొ యేమొ కామగమ । నాదికశక్తి నెసంగు నేను నీ
వెందు సుఖింపఁగోర నటు । లే యొనరించుచు నీమనీష కా
నందము నిచ్చునాకృతి గ । నం దగియుందును నేర్పు పెంపునన్. 395

చ. అనవరతంబు తగ్గనివ । యస్సున మించఁగఁజాలు నన్ను నీ
వనితను మాని చేకొనుము । వానిని దీనిని బట్టి మ్రింగుదున్
జనవర! నన్నుఁగూడి గురు । శైలములందు వనాళియందుఁ గా
ననముల నెందునుండఁగ మ । నం బగునో విహరింపు మం దొగిన్. 396

క. అసురాంగన యీరీతిగ, నసమశరావిద్ధచిత్తయై పల్కఁగ దా
నిసహజ మెన్ని పరంతపుఁ, డసదృశవాగ్వైఖరి నిటు । లల్లనఁ బలికెన్. 397

ఉ. దానిమనంబు నిస్పృహతఁ । దాల్పకయుండఁగఁ జేయుసుస్మితం
బాననమందు సుంత నట।నాదృతిఁ గాంచఁగ నోతలోదరీ!
చానను దీనిఁ గొంటి మును । శాస్త్రవిధిన్ ననుఁ బ్రీతిఁ గొల్చునీ
మానిని! మానరాదు పలు।మాట లిఁకేటికిఁ బ్రొద్దుపోవఁగన్. 398

ఉ. భార్యలు పెక్కురైనయెడ । బాధయుఁ గల్గదటంచుఁ బల్కెదో
యార్య! యనుత్తమాంగి వను।ఖ్యాతిని గాంచిన నిన్నుఁ బోలుసౌం
దర్యకలాపయుక్తలగు । తన్వుల కెన్న మఱొక్కయింతి సౌ
దర్యయునైన నుండుట గ।నన్ మరియాదయెగాదు ధాత్రిలో. 399

తే. కాన వచియింతు నొకమాట । కాంతుఁ డకృత
దారుఁ డిప్పుడు సుందరీ! । దారసుఖమె
యెఱుఁగకున్నాఁడు భార్యనె । యెన్నువాఁడు
నీకుఁ దగువాఁడు నాకంటె । నేర్పుకాఁడు. 400

క. ద్వారంబుననున్నాఁ డది, గో రమణీ! నాకుఁ దమ్ముఁ । డొప్పుగ నతనిం
గోరుము వాఁ డొప్పినఁ జే,కూరును నీసోయగము।నకున్ ఫలమెల్లన్. 401

ఆ. సవతిబాధ లేక । చల్లగాఁ గాలంబు, పుచ్చవచ్చుఁ గోర్కె । పుట్టకుండు
నింక నొకటియైన । నింగితజ్ఞ వటంచుఁ, దోఁచెఁ బొమ్మటన్న । ధూర్తయగుట.

క. అందలిభావం బెఱుఁగక, యందముగల దానిగాఁగ । నాత్మఁ దలఁచె రా
ణ్ణందనుఁడని యుప్పొంగుచు, సందియ మన్నదియె లేక । సౌమిత్రిఁ గనన్. 403

క. అరిగి తనయాశయంబుం, ద్వరపడి యెఱిఁగించి నీదు।భ్రాతయుఁ జెప్పన్
స్మరకేళిఁ దేలు నన్గొని, ధరణీధరశిఖరములను । దమి యుప్పొంగన్. 404

క. కాననముల విమలతరో,ద్యానంబుల మఱియు నెందు । నాత్మవలచు న
చ్చో నెల్లను విహరింపుము, నే నన్నుం గామరూపిణిఁగదా నాథా!

క. ఏరూపము నీ కిష్టమొ, యారూపము నొంది సుఖము।నంద నొనర్తున్
మారాకారా! నన్నుం, గోరిక భార్యగ గ్రహింపు । కొంకకు మింకన్. 406

క. అతఁ డన్నగాన జ్ఞాతియె, యతివయుఁ నేమనిన నట్లె । యనువర్తించుం
గృత మెన్నఁడు జ్ఞాతియనన్, మతిమంతా! వినవె జనుల।మాటను మున్నే. 407

క. కనుకన్ నావచనంబును, వినుమా! వేగంబ నేను । వీరి నిరువురం
గనుచుండ నీవు భక్షిం,తును బాధయె లేమి నవలఁ । దోఁచినరీతిన్. 408

క. ఇరువురమును దోఁచినటు వి,హరింత మెచ్చోటనైన । ననుమాటలు లోఁ
జొరఁబడ నిస్సీ! యని రఘు,వరునాశయ మింత యెన్ని । భాషించెనిటుల్.

క. ఇంతీ! తొందఱపడకుముఁ, స్వాంతమ్మునఁ దలఁపు మీవె చక్కఁగ నీకుఁ
గాంతుఁడు కాఁడగు రఘుభూ,కాంతుఁడె; నే సేవకుండఁగద యాతనికిన్.

ఆ. ఎవనిభార్య యీమె యిచ్చట నుండు నం,చడుగఁ గింకరునకు ననుఁగుఁబల్కి
యనెడు మాటవిన్నయంత నెట్లుండునో, తలఁపు మీవె నేనుబలుక నేల?. 411

క. పరవశత దుఃఖకారణ, మరయంగా ననెడుపల్కు నాలింపవో సుం
దరి నిన్ను వదలఁగలఁడే, స్మరరూపుం డతఁడు నీదుస్వాంత మెఱుంగన్.

క. తలపోసి నాదుకడకుఁ, జలజాక్షీ! పంపె నిన్ను సరసములకుదృ
ష్టులఁ ద్రిప్పుకొనఁగఁ జాలక, యలమటపడుచున్న వాఁ డహహా! యదె కనుమా.

చ. మనమున నిన్నుఁ గోరుటయె మానిన నిన్నొఁగిఁ జూడనేల యో
వనరుహలోచనా! మరల భ్రాంతినిమాని సమీపభూమికిం
జని సరసోక్తులం బలుకుజాడ గనంబడనీక గట్టిగా
మనసునఁ గల్గువాంఛితము మానక చెప్పుము చూత మవ్వలన్. 414

ఆ. మరల నాదుదరికె నుసలకపంపినఁ, గార్య మేమిచేయఁగలదొ దానిఁ
జేసి నీదుకోర్కెఁ జెప్పఁగనేల యం,తయును దీర్తు నిజము తప్ప ననిన. 415

శా. ఆమాటల్ విని న్యాయసమ్మతములే యం చెన్ని మోదంబునన్
రాముం గానఁగఁబోయి యిట్లనియె; ఘోరంబైన రూపంబునన్
బ్రేమమ్మున్ నశియింపఁజేయు మొగమున్ భీతిప్రదంబౌచు నో
రామా! యొప్పు మహోదరంబుగల యీరామన్ విసర్జింపుమా. 416

చ. వదలఁగ నిచ్చలేనియెడ బాహుబలంబునఁ జిక్కఁబట్టి యీ
సుదతిని మ్రింగుదాన నని చొక్కి రుషం జనె సీతపైకి; నం
త దనుజనారి హుంకృతినినాదమునన్ నిలువంగఁజేసి చెం
తఁ దనరు లక్ష్మణుంగని నితంబిని దీనిని గంటె తమ్ముఁడా!. 417

చ. శమనునిపాశమట్లు పరుషంబుగఁ బల్కుచు భూమిపుత్త్రిఁ జం
పుమదిని బోవుచున్న దిది పొంకముగా వచియించుటొప్పు దీ
యమరవిరోధికాంత వికృతాననయాఁగద యింకనున్ వికా
రముగలదానిఁ జేయుము పరాక్రమ మొప్పఁగ దుర్జయా! యనన్. 418

ఉ. అన్నముఖంబునుండి నుడు లత్తఱి వెల్వడుచుండునంతలో
బన్నిన కోపవేగమునఁ బార్శ్వమునంగల ఖడ్గ మెత్తి స్త్రీ
యన్నవిచార మూనక భయంకరహుంకృతి మించునట్లు కో
సె న్నిఖిలామరుల్ పొగడఁ జెచ్చెరఁ గర్ణయుగంబు నాసికన్. 419

ఆ. ఖడ్గధారయందె క్రవ్యాదవనితదౌ, పూర్వకర్మ మెల్లఁ బూన్కి నిలిచి
స్పర్శమాత్రముననె శ్రవణద్వయము నాస, తెగిధరంబడంగనొగినార్చె.

చ. కరణము ఖడ్గధారగను కర్త సుమిత్రసుతుండుగా భయం
కరదితిజాంగనాభిమతకర్మము హేతువుగాఁగ సర్వని
ర్జరశుభమే ఫలంబుగను సాగెను దచ్ఛ్రుతినాసికైకసం
హరణము సాక్షిమాత్రుఁ డగునప్పరమేశుని చెంత నత్తఱిన్. 421

ఉ. సీతయనంగ నాప్రకృతి చిత్తమునం దిది యిట్లు సాగనా
నీతఱి నంచు నెంచ నటులే పనిసాగుఁ గొఱంతలేక యీ
రీతిఁ గనంగలేక బహురీతులఁ బామరు లాడుచుంద్రు; సం
కేతము దీని మార్ప హరకేశవులైనను జాలరించుకే. 422

తే. కత్తి తాఁకినయంతనే కర్ణయుగము, ముక్కు మొదటికే తెగిపోయె నిక్కుచుండు
శూర్పణఖ యార్తిచేత నచ్చోటు విడిచి, పఱచె ఘోరరవం బొగిఁ బర్వుచుండ.

సీ. అనవగతార్థంబులగు పల్కులొప్పంగఁ, గాననం బెల్ల భీకరరవంబు
చేతనిండఁగఁ దాను జేసినయత్నంబు, విఫలమాటయగాక విశ్రవణత
గతఘోణతన్ స్వీయకాయసౌందర్యము, నశియించినట్లు దానవి తలంచి
తనదుదుష్కృతఫల మనిదానిఁ దలఁపక, యొరులు దుష్కార్య మిట్లొనరిచిరని

తే. దానికిం దగు ప్రతిచేయఁ దగు ననియును, స్వీయకర్మంబులం జావసిద్ధపడుచు
నుండుసోదర్యులకుఁ జెప్పనూహఁ జనియె, జమునిపాశంబుపోలె వేగమున నపుడు

క. అంతకు నించుకమును పే, పంతంబున దనుజవర్యపటలము తన్నుం
జెంతం జేరి కొలువఁగ దు,రంతపరాక్రమము సురభయంకరము తగన్. 425

క. ఖరుఁడను పేరం దనరుచు, సురవరులం బెక్కుసార్లు సునిశితబాణో
త్కరవృష్టి ముంచి తోలిన, సురారివీరుండు పొల్చుచుం బ్రీతి మెయిన్. 426

క. పరుషములు పలుకుచున్ ది, గ్వరులం జెండాడినట్టి భాషలు కర్ణాం
తరములఁ జొర నాలించుచు, మరణము దాపున నెసంగు మాట తెలియకే. 427

తే. శాశ్వతంబుగ దేవతాసమితి గెల్చి, పడసియున్నట్టి జయపరంపరల నమ్మి
సంతతానందముం బొందఁజాలుదు నను, భ్రాంతి యెంతయుఁ బైకొనఁ సంతసమున.

క. తనుఁగొల్చెడు దానవులన్, గనుచున్ బీరముల చేతఁ గాలముగడుపన్
మనమున నూహించుచు నుం,డెను శూర్పణఖయును దాఁ జనియె నట్టితఱిన్.

### రాముఁడు సౌమిత్రి కప్పటినిమిత్తములఁ దెల్పుట.

ఉ. దానవి యార్చుచుం జనినఁ దమ్మునితో రఘురాముఁ డిట్లనున్
గానఁ ద్రయోదశాబ్దములు గాదిలితమ్ముఁడ! పుచ్చినార మె
ట్లో నిఖిలాసురాళి మనయున్న తెఱంగు నెఱుంగకుండ నీ
చాన మహాపదల్ మన కొసంగఁగ వచ్చె నటంచుఁ దోఁచెడున్. 430

క. నేనుం బరిహాసోక్తుల, మానిని నలయించినాఁడ క్ష్మాపుత్రిపయిన్
బూనెను గ్రోధము దానవి, దానం గోపంబు గదుర దారుణశిక్షన్. 431

క. చేయించితి నీచే నది, యీయడవిం గల్గుదానవేశుల కడకుం
బోయె నటంచుఁ దలంచెద, నాయసురులు చుప్పనాక యవమతి గన్నన్. 432

క. ఊరకయుందురె తమ్ముఁడ!, ఘోరాహవమునను మనలఁ గూల్పఁగ నెదలం
గోరుచు వత్తురు దెస చే,కూరెడు నీవంక నె మనకున్ నిక్కముగన్. 433

క. నీవున్ యోజింపు నిమి, త్తావళి ఘోరాహవము సురాళికి భయదం
బై వర్తిల్లుంజు మ్మని, వేవిధములఁ దెల్పుచున్న వి నిమిత్తంబుల్. 434

క. సీతను గాపాడుటయుం, దైతేయులఁ జంపుటయును దగుఁ గార్యములం
జో తమ్ముఁడ! తలపోయుదుఁ, జేతస్సే తెల్పు నిద్ది సిద్ధాంతముగన్. 435

సీ. సందేహపదములౌ సకలవస్తువులందు, నరయఁ బ్రమాణంబు లనఁగఁబడును
సత్యసంవర్ధిత సాధుజనాంతఃక,రణ సంప్రవృత్తులే రమ్యరీతి
నని చెప్పుచుండు శాస్త్రాళి యోతమ్ముఁడా!,యీకార్యయుగ్మమం దేది నీదు
తలపైనఁ బడునొ నాతలపయి నెయ్యది,పడునొ యిత్తఱినె చెప్పంగవలను
ఆ. పడదు; ముందుఁ జేటు పడు నైన నొక్కటి, తెలియఁబడుతు; సీత తీరు గనిన
సంశయంబె తోఁచు సౌందర్యగరిమ నీ,యబల యెల్లకాంతలందు మిన్న.

ఉ. కంటివి కాదె నీవు మును కాననముం దరియంగవచ్చుచో
మింటికి మంటికిం దగిన మేటిశరీరము గల్గియేరి నేఁ
గంటునఁ గాంచినంత మృతిఁ గాంచఁగఁ జేయఁగఁజాలు రక్కసుం
డొంటరి కాఁడు వచ్చి తమి యొప్పఁగ సీతను గొంచుఁ బోవుటన్. 437

చ. దనుజు లనంగఁ గాముకులు ధర్మము సుంతయు లోఁదలంప కే
వనితలు కంటి కింపుఁగను వర్తిలువారలొ వారిఁ గొంచుఁబో
వనె తలపోయుచుందు; రిది పాడుక వారిది; దండకాటవిన్
మనమున నెన్నఁగా నసురమండలవాసముగాఁ దలంపనొ. 438

ఉ. కేకయరాజపుత్రి నొకకీడు దలంపని యుత్తమాంగనన్
జేకొని యామె మూలమునఁ జేసెను గాననమందు నుండఁగా
నీకృతి కర్మరూపమున నెల్లరకుం గనరాకయుండు న
ప్రాకృతదైవమే యనుచు భావమునం దలపోయఁగాఁ జనున్. 439

ఉ. ఏమిదలంచి యిచ్చటికి నీమనలన్ విధి చేర్చెనో కటా!
భామిని లోఁదలంప నొకభంగి విచారము పుట్టుచున్న; దా
కామినిరాక యేకతమొ కర్ణయుగాదికకర్తనక్రియో
ద్దామమనఃప్రమోదము నితాంతము కల్గుటయన్న నేలొకో?. 440

మ. మనమూలంబున దైత్యసంతతి ననిన్ మ్రందింపఁగా భీతికృ
ద్దనుజవ్రాతమువంక నీమనకు దుర్దాంతాపదల్ కూర్పఁగా

మనమందుం దలపోసి కర్మ మనుచున్ మానుల్ ప్రబోధింప నొ
ప్పిన దైవంబె తలంచెనేమొ సహజా! పేర్కొందు నే నెవ్విధిన్. 441

ఉ. మొత్తముమీఁద కైకదగుబుద్ధిని మార్చినకర్మ మొక్కఁడే
యిత్తఱి నిన్ని రూపముల నీమనలం జరియింపఁజేయుచున్
గ్రొత్తగఁ దోఁచుచుండు నటు కోర్కులఁ బుట్టఁగఁజేయుచున్న దో
యుత్తమచిత్త! నీదుమది నూహలు పర్వనొ సుంతపల్కుమా. 442

చ. ఒకఁ డొకగొప్పకార్యమున నుద్యమ మింతయుఁజేయ రాదుగా
సకలజనాదరంబుఁగొని సాగఁగఁజేయఁగఁ బూనుటొప్పు; నే
సకలవిదుండ నంచు గురుసత్త్వుఁడ నంచు వచింపఁజాలువాఁ
డిఁక జనియింపఁ డిప్పు డిల నెందుఁ గనంబడఁ డల్లె పూర్వమున్. 443

క. అనిపలుక లక్ష్మణుం డి, ట్లను రామా! చింతయేల యాయుధములు దీ
ప్తినిచయ మెల్లెడఁ జల్లెడు, దనుజులు చనుదేర వారిదర్ప మడంతున్. 444

క. కనుఁగొను చుండుము భయకృ, ద్దనుజేంద్రులు యుద్ధమందుఁ దార్కొని రేనొ
క్కనిగూడ బ్రదుకనీయను, ధను విది సాయంబెయున్న దనుజుఁడు మనునే?.

ఉ. సందియ ముండ నీమదిని స్థాన మొసంగక రామచంద్ర! యే
కుందును బొందకుండు మిఁకఁ గ్రూరత రాక్షసు లెత్తివచ్చిరే
నిందుఁ జొరంగనీక మిథిలేశ్వరుపుత్త్రిని సాధ్వసంబు చే
రం దగనట్టిపద్ధతి శరంబులఁ బంపియె పాఱఁద్రోలెదన్. 446

క. నెమ్మదినుండుము సత్కర్మ, మ్మది ఫలమీయకుండు మాట యనృతమౌ
వమ్మయిపోవదె దుష్కర్మ, మ్మెయ్యెడఁ బలుకులేల రఘుకులనాథా!. 447

ఉ. చిన్నతనంబునుండియుఁ గుచేష్ట యొకించుకయైన లేక వి
ద్వన్నుతవర్తనంబు చెలువంబుగ నొప్పెడు నీకు లోకమం
దెన్నఁడుగాని వైశస మదే క్రియయందును గల్గదంచు నే
నెన్నుదు సీతతోడ వసియింపుము నేదనుజాళి నోర్చెదన్. 448

చ. అనుటయు లక్ష్మణుం దిగిచి యర్మిలిఁ గౌఁగిటఁజేర్చి రాముఁ డి
ట్లను దగుదీవె యప్పనికి నంచు నెఱుంగుదు, నైన నీమనం
బును బరికింప ని ట్లడుగఁబూనితి; వేఱుగ నెన్నఁబోకుమా
యనుజుఁడ వీవు చెంత నలరారఁగ నేమికొఱంత నాకిఁకన్. 449

తే. కర్మసిద్ధాంతమున నీకుఁగల్గు శ్రద్ధ, మెచ్చఁదగినది యీవిధి నిచ్చగలుగు
వారలెల్లను ధన్యులై వర్ధిలుదురు, నమ్ము మీమాట ముమ్మాటి కిమ్మగు మది.

### ఖరాదులు యుద్ధమునకు వచ్చుట.

క. అనిపలికి యాశ్రమంబున, జనకజయు సహోదరుండు చక్కని పల్కుల్
వినిపింప నుండె రాఘవుఁ, డనుమానము తోఁపకుండు నట్టి విధమునన్. 451

ఆ. శూర్పణఖయు ముక్కు చొప్పు లేకుండఁగఁ, గర్ణయుగము మున్ను గలిగియున్న
పోల్కి తెలియకుండఁ బోవుట కెంతయు, వగచుచున్ గడున్ జవమునఁ బాఱి.

క. దిక్కులు ప్రతినిస్వనముల, నిక్కంబగు నార్తి దెలుప నిజసోదరు లే
యిక్కఁ జెలంగుదురో యట, కొక్కపడిం బాఱె దానవోత్కరయుతునిన్. 453

చ. ఖరుఁడను సోదరోత్తమునిఁ గాంచి తటాలున నేల వ్రాలి పైఁ
దొరఁగెడు రక్తధారలను దోఁగఁగ భూస్థలిఁ జేయుచున్ మహా
త్తరనినదంబునన్ వగచెఁ దద్విధ మింతయెఱుంగ కున్కిభీ
కరదనుజేశ్వరుండు తమకంబునఁ జెల్లెలి నూఱడించుచున్. 554

క. లెమ్మా సోదరి! నిన్నెవఁ, డిమ్మాడ్కి విరూపఁ జేసె నెఱిఁగింపుము వాఁ
డిమ్మహిఁ దిరుగం జాలక, యుమ్మలికం బొందఁ దలఁచి యురుధైర్యమునన్. 455

క. నిను నవమానించెనుగద, మనుజుండో నిర్జరుండొ మానక చెపుమా
పనిపెద జమునింటికి వానిని గావఁగ నెవరువచ్చి నిల్చునఁ దరుణీ!. 456

చ. హరిహరులబ్జసూతియు సహస్రదృగున్నతుఁడైన యింద్రుఁ డా
శరులు నమర్త్యులింకఁ గల సాహసికుల్ గుమిఁగూడి ఘోరసం
గరమున నిల్చి యాశరుని గావఁగఁ బూనినఁ జెందువాఁడ మ
చ్ఛరముల వారిశీర్షములు క్ష్మాస్థలిపైఁ బడ నోసహోదరీ!. 457

మ. చిరకాలంబుగ నాశితాంబకఫణిశ్రేణుల్ మహాయుద్ధమం
దరివీరప్రకరోత్తమాంగముల దేవాళుల్ భయంబంది యం
బరమం దుండి కనుంగొనంగఁ జని కోపస్ఫారతన్ ద్రుంచి నె
త్తురు ద్రావం దలపోయుచున్నయవి తీర్తున్ వానికోర్కుల్ త్వరన్. 458

చ. అలసటనొంద నేల సహజా! ఖరుఁ డితఁడు రిత్తమాటలం
బలుకఁడు కార్యసిద్ధియనఁ బాణితలస్థమె యంచు నమ్మి యే
ఖలుఁ డిటు నిన్నుఁ గిడ్పఱచి క్రాలుచు నెందు వసించువాఁడొ వే
తెలుపుము వానిఁ జెంది పగఁదీర్చెద నీకు సుఖంబు గూర్చెదన్. 459

చ. అనుటయు దండకాటవి మహోత్తర బాణశరాసనాదిసా
ధనములఁ దాల్చి మౌనులకు దానవులం బొరిపుచ్చు నవ్వరం
బునొసఁగి రామలక్ష్మణులు పొల్చుట తన్ను విరూపఁ జేయుటల్
పనివడి తెల్పె నుగ్రరుష పర్వఁగ దేవత లెల్ల నవ్వఁగన్. 460

శా. ఆమాటల్ చెవిసోఁకినంత ఖరుఁ డుద్యద్దావవహ్నిక్రియన్
భీమాకారముఁ దాల్చి లోకవితతుల్ భీతిల్ల నుగ్రధ్వనుల్
వేమాఱుల్ వినిపింప నేత్రరుచు లాభీలంబులై పర్వ ను
ద్దామప్రక్రమ మానుమృత్యువు క్రియన్ దర్పించి గర్వోన్నతిన్. 461

శా. లెం డో దానవులార! యీ మనల నీలీలం బ్రవర్తించును
ద్దండాభీలపరాక్రమార్జిత దిగంతవ్యాప్త సత్కీర్తులం
జండారాతిసమూహ నిర్మథననిస్తంద్రైక దోస్సారులన్
జెండాడన్ దలపెట్టి యున్నరిపులన్ శీఘ్రంబె మాయింపఁగన్. 462

మ. ధరణీశాత్మజు లంట యప్రతిహతోత్సాహంబునం బొల్చుశౌ
ర్యరమానాయకులంట దానవుల శౌర్యం బెల్లమాయింప ని
ర్జరులన్ శ్రీయుతులం బొనర్పఁగఁ బ్రతిజ్ఞల్ సేసినారంట యి
ర్వురు సోదర్యులెయంట యింక నెటులోర్వం బూనఁగా వచ్చునో?. 463

మ. మరియాదం గనినార మింతదనుకన్ క్ష్మామండలిన్ నిర్జరే
శ్వరచూడామణిరోచిరుజ్జ్వలిత దివ్యశ్రీసమృద్ధాంఘ్రి పం
కరుహుల్ దానవు లంచు నెల్లెడల విఖ్యాతిం గడుం గంటి మ
ట్టిరహిం బాయఁగవచ్చునే తలఁపుఁడీ డెందంబునన్ మీ రొగిన్. 464

మ. మనకుం బూర్వులు చాలఁ గష్టములకున్ మా ఱొడ్డుచున్ శాశ్వతం
బనఁగా నొప్పు యశోధనంబు తమిమై నార్జించి రట్లొప్పుస
ద్ధనమున్ దానిని గావఁగాఁ దగినయాధైర్యంబు నుత్సాహమున్
గనియున్ వైరులు కైకొనంగఁ దలఁపంగా నోర్వఁగా వచ్చునే. 465

ఉ. ఇప్పుడె లెండు; పోయి యని నిద్దఱ రూపడఁగించివచ్చి య
ప్పప్ప! యటంచు శూర్పణఖ యాత్మను దృప్తిని గాంచఁ జేసి మా
యప్పలయప్పుఁ దీర్ప నిపుడాయుధముల్ ధరియింతు; మీరు న
ట్లొప్పి చనంగఁ గార్యమది యొక్కక్షణంబున నే ఫలించెడున్. 466

చ. అని ఖరదానవుండు చటులాగ్రహమూని వచింప దానవుల్
మనువులఁబోలి యార్గు రెనమండ్రు తటాలున లేచి భక్తివం
దనము లొనర్చి మీరలు చనందగునయ్య మనుష్యయుగ్మముం
గొని చనుదెంతు మియ్యెడకుఁ గొంకక యొక్కక్షణంబులోపలన్. 467

చ. పనియిది చాల నల్పమగు బంటులమే చని తీర్పఁజాలు ని
ప్పనికయి మీరు వచ్చుటయు భావ్యము కాదు; పరాక్రమంబునం
జని యలరాజపుత్త్రుల నొసంగెదు వేడుకఁ బట్టితెచ్చి మ్రో
లను నిలుపంగ నేర్తుము విలాసము మా కిది దానవేశ్వరా!. 468

ఆ. దైత్యవితతిఁ జంప ధాతకు వశమానె, యాలసింప నేల యానతిచ్చి
యాశిషంబుల నిడి యనుపుఁడీ యనుటయు, ఖరుఁడు సంతసించి గర్వమలర.

క. ఆనతి నొసఁగితి; వేగమ, మానవు లున్నెడకుఁ బోయి మార్కొని వారిం
దే నోపినఁ దెం డిటకున్, దానవులారా! మఱొండు తలఁపు గలిగినన్. 470

క. పోనీయక పొరిపుచ్చెదు, కానన మిది నిర్మనుజతఁ ౹ గ్రాలవలయు నం
చూనిన శౌర్యమదమ్మున, మానిని ముదమందఁ బల్కె ౹ మాఱనిపూన్కిన్.

ఆ. హెచ్చరించి పంప ౹ నెసఁగు వేడుకఁ జుప్ప,నాక త్రోవఁజూప౹వీఁక మెఱయ
నసురసప్తకద్వ౹యము రామునాశ్రమ,సీమఁ జొచ్చి యందుఁ౹ జేర వెఱచి.

క. నిలువం బడియుండఁగ దృష్టులనుండి రుడగ్నిశిఖలు ౹ చూపఱులకు గుం
డెలదిటవు వాప దానవి, కలయన్ వీక్షించి వారి౹కంటెన్ ముందే. 473

క. శ్రీరాముని యాశ్రమమును, జేరంజని యనుజుఁగూడి ౹ చెలఁగెడు ధర్మ
ప్రారంభు రామచంద్రుని, ధారణిసుతఁ గూడియున్న ౹ దైవముఁ గనియెన్. 474

చ. దనుజులక్రూరకర్మ మది ౹ తన్ను మఱింతగఁ బ్రోత్సహింప వ
చ్చినపదునల్వురన్ దనుజ౹శేఖరయోధులఁ బిల్చి చూపె రా
ముని నలలక్ష్మణున్ జనక౹భూపతికన్యను; వార లంత శూ
రనికరమందు మేటియన౹రాజిలు రాముని గాంచి భీతులై. 475

ఉ. చూచుచు నూరకుండ నృప౹శూరశిఖామణి రామమూర్తి యి
ట్లేచినవిక్రమంబు మెఱ౹యింపఁగ వచ్చినరాక్షసావళిన్
జూచి సుమిత్రపట్టిఁ గని ౹ క్షోణితనూజను గాచుచుండు మీ
నీచులఁ ద్రుంచి వచ్చెదను ౹ నిర్జరులెల్లరు సుంతసింపఁగన్. 476

చ. అని తగునట్లుపల్కుచు శ౹రాసన మక్షయబాణతూణముల్
గొని యుటజంబుముందటను ౹ ఘోరనిశాచరిఁగూడి తన్నుఁ గాం
చు నియతినున్న యోధులను ౹ జూచి నయోక్తులఁ బల్కె నిట్టు లో
దనుజభటేంద్రులార! నృప౹ధర్మముతప్పక వచ్చి యివ్వనిన్. 477

తే. మునులవర్తనమూని యి౹ప్పోల్కి నున్న, మమ్ము హింసింప రానేల౹యిమ్మహికిటు
నిలువుఁ డందె ధర్మంబిది ౹ నిలువ కిందు,వత్తురేఁ బ్రాణముల నుండ౹వచ్చునెట్లు?.

చ. అనిపలుకంగ రామునుడు ౹ లత్తఱిఁ గోపము రేఁప దానవే
శునిమది నాగ్రహంబునకుఁ ౹ జో టొనఁగూడఁగఁ జేసితీవు ని
న్నని వధియింప కుండుదుమె ౹ న్యాయముగా యది మాకు నింక ర
మ్మని మొనఁ దీవ్రబాణముల ౹ నంతకుచెంతకుఁ బంతు మేత్తెఱన్. 479

క. అని తెగనాడుచు భల్లాదినిఖలసాధనము లేయ ౹ ధీరుండగు నా
జనపతి వారల నశ్రమమున సాయకవితతిఁ బ్రాణ౹ముల విడఁ జేసెన్. 480

క. పదునలువురు భూమింబడి, కదలని వృక్షములరీతిఁ౹గా నుండంగా
మది రెట్టింపుగఁ గ్రోధము, గదురన్ శూర్పణఖ పోయి ౹ ఖరుమ్రోలఁ బడెన్.

చ. కుడుకనగోలునందుఁ గల౹కూరిమి పెంపున మేదినీస్థలం
బదరఁగఁ ద్రెళ్లియున్న తన౹యర్మిలిసోదరిఁ గాంచి యాఖరుం

డుదయదివాకరాభ మననొప్పుముఖంబు తగంగ నిట్లనుఁ
గదలుదు నిప్డె యాహవముఖంబున వైరులఁ జంప లెమ్మికన్. 482

చ. కదలు నిశాచరేంద్రభటకాండము గాంచిన యంతమాత్రనే
త్రిదశులు తత్ప్రభుండు కడుదీనత నొందుదు రవ్విధంబు నీ
మదికిని గ్రొత్తదే చెపుమ మాటలు పెక్కుఁక నేల; లెమ్ము; నీ
వుదిలదొలంగి ముం దరుగు మో భగినీ! వెనువెంట నేనునున్. 483

క. బలములు సోదరులును బెం,పలవడ నేతెంతు మెందు నరులుందురొ యా
స్థల మిదె యని కనఁబఱపు మ, వలఁజూడుము వారిగతి జవంబునఁ దరుణీ!

తే. తీర్చుకొందుము నీఋణ మోర్చుకొనుము
క్షణము మార్గముఁ జూపంగఁ గడఁగు మనిన
నప్పలుకులెల్ల శ్రుతులకు నమృతమయము
లైనయట్లుగ నున్న యాయబల లేచి. 485

క. దనుజేంద్రచతుర్దశకం,బును జంపినవిధము సూక్ష్మముగఁ దెల్పి జవం
బున ముందు నడువఁ జొచ్చెను, దనుజేంద్రులు తోడనడువఁదలఁచిరి కడఁకన్.

శ్రీరాముఁడు తమ్మునకుఁ గర్తవ్యముఁ దెలుపుట.

ఉ. అక్కడ రామచంద్రుఁడు భయంకరయుద్ధము సాగనుంట యం
దొక్కఁడుకూడ రక్కసుఁడు సూత్కరముం గని నిల్వఁజాలు పెం
పెక్కనవాఁడు చిత్తమున కేమియుఁ దోఁపకయుంట లక్ష్మణుం
బ్రక్కన నున్నవానిఁ గడుఁ బంతమునం దిలకించి యిట్లనున్. 487

శా. సౌమిత్రీ! భయకారణంబు తలఁపఁ సంగ్రామమేయాఁ గదా
భీమం బీయటవీస్థలం బనుట చూపించుఁ నిమిత్తంబు లీ
భూమీశాత్మజ భీరు వంచుఁ బలుకంబూనంగ నేలా విప
ద్గ్రామం బెంతయుఁ జెంతనున్నటు లెఱుంగం జేయునీచిహ్నముల్.

ఉ. పక్షులచర్యలం గనిన భారరణం బిదె చెంతనున్న దీ
రాక్షసు లీర్ష్యఁ బూనిరి సురప్రవరార్థము వీరిఁ జంపి ధ
ర్మక్షతి గాకయుండ మునిమండల మెంతయు సంతసింప నీ
వీక్షణమే యొనర్ప మనుటేర్పడఁ దోఁచెడు నాకుఁ దమ్ముఁడా!. 489

సీ. మృగముల గమనంబు ఖగగణమురుతంబుఁ,బరికింపఁగ మహాహవముపొసంగు
టేర్పడుచున్నది యింక జాగుసేయుట, తగవు కాదంచు నేఁదలఁచువాఁడఁ
గర్తవ్య మెఱిఁగింపఁ గడఁగెద నిదెచూడుము మత్కార్ముకము హేతిమండలమ్ము
గ్రక్కుచున్నది; తీవ్రకాండముల్ ఘణుఁట్లు, బుసకొట్టుచున్నవి భూరిభయము

తే. జూపఱకుఁ గల్గ నొనరించుచుఁ; మదీయ,చిత్త మరిమర్దనము చేయఁ జెలగుచున్న
దట్లుగావునఁ ద్వరపడి యవనితనయఁ, బిలుచుకొని యల్ల భూధరబిలముఁ జేరి

ఉ. సీతకు సుంతయేఁ గలఁతఁ జెందనిచిత్తము నిల్చునట్లు నీ
నీతిఁ జేయఁగాఁదగు నహీనగుణాకర! యేను నిల్చి యా
నాతి దురుక్తులన్ విని మనంబులఁ గ్రోధముపొంగ వచ్చుదు
ర్నీతుల రాక్షసేశుల విరించియుఁ దోడయినన్ వధించెదన్. 491

ఉ. చేతులతీటవోవఁగ నృసింహునిరీతిఁ బరాక్రమించి వి
ఖ్యాతశరావళిం బఱపి యాశరవీరులఁ గాలువీటి కే
నీతఱి దేవతావితతులెల్ల విచిత్రమి దంచుఁ బల్కఁ సం
జాతరుషన్ ముహూర్తమున సాగఁగఁ బంపెద శంక మానుమా. 492

ఉ. ఎందఱు వత్తురో సమర మెవ్విధి సాగునో యెప్పకాలమం
దందఱఁ జంప నెట్టులగు నంచుఁ దలంపకు మో ప్రియానుజా!
తొందరపాటులేక రిపుధూర్తులఁ గోటులనైన మాని రా
డ్బృందము మేలు మే లనఁగ భీమశరంబులఁ ద్రుంచి వైచెదన్. 493

చ. అనిమిషులుం దదీశుఁడు మహాబలు లింకనుగల్గువార లే
పునఁ జనుదెంచి కాచినను బోర వధించెదఁ; గావు మన్నచో
నని వధియించు టెట్టులని యాత్మను సందియ మందఁబోకు; మో
యనుజ! తదీయకర్మ మది యట్టులె యున్నదటంచు నమ్ముమా. 494

ఉ. ఆవిషయంబుఁ జెప్పఁ సమయం బిదిగాదు జవంబుమీఱ నీ
భావినిఁ దోడుకొంచుఁ జని పర్వతకందరమందు నెమ్మదిన్
భావిశుభంబులం గనెడువాంఛ చెలంగఁగ నుండు మింతలో
దేవవిరోధు లుర్వరను ద్రెళ్లుట నీ కెఱుఁగంగ నయ్యెడున్. 495

ఉ. దూరమునందుఁ గానఁబడుధూళి తదాగమనంబుఁ దెల్పు నీ
భీరువుఁ గొంచుఁ బొమ్ము పరవీరుల మార్కొనునప్డు నన్ను నీ
సారసనేత్ర చూచుట ప్రశస్తము కాదని తోఁచుచున్న; దో
వీరవరేణ్య! మాటలకు వేళ కనంబడ దిప్డె తర్లుమా. 496

చ. కనుఁగొనఁ గన్గొనంగ లయకాలమహాబలధూతభూరజం
బనఁదగి రాక్షసేశ్వరభటాగమనంబును దెల్పుధూళి, చెం
తను గనఁజేయుచున్న దిఁకఁ దామరసాయతనేత్రఁ గొంచుఁ జ
య్యనఁ జనవయ్య లెమ్మనిన నగ్రజునానతి మౌళిఁ దాల్చుచున్. 497

క. ధరణితనూజయు బదు లెక్కరణిని వచియింపఁ బూనకయె తో నడువన్
శరచాపధారి లక్ష్మణుఁ, డరిగెన్ గిరికందరమ్ము నంతికమునకున్. 498

క. భూరితరచ్ఛాయాద్రుమ, వీరుద్గేహావృత మయి వెలయు గిరిగుహా
ద్వారము కడనిల్చి మహావీరుఁడు సౌమిత్రి గ్రావవేదికమీఁదన్. 499

క. వదినను గూర్చుండంగా, సదమలవాక్యముల భక్తిసరణిన్ వేడన్
మది సంతసంబు వింతగఁ, గుదియించుకొనంగఁ జాలి కోమలి యచటన్. 500

క. వేదికపయిఁ గూర్చుండెను, సాదరముగ లక్ష్మణుం డహార్యబలుఁడు త
న్మేదిని నిలువంబడి యా, శ్రీదేవిని గాచుచుండెఁ జెలఁగెడుభక్తిన్. 501

ఉ. జానకిచూపు లప్పు డొకచందముగాఁ గనుపింప లక్ష్మణుం
డీనిముసంబులోనఁ దరశేక్షణవీక్షణముల్ మహోగ్రవై
శ్వానరకీలలట్లు చెలువంబును బాసి భయంకరంబులై
కానఁబడంగ నేలొకొ ముఖం బొకరీతిగ మార్పునొందెడున్. 502

ఉ. కారణ మిద్దియంచు నెఱుఁగం దర మెట్టులుగాకయున్న దీ
సారసనేత్ర మున్నువలెఁ జారుతఁ గన్పడ కింతలోన దు
ర్వారపవిక్రియం గనఁగరాక వెలింగెడు హేతువిద్ది యం
చారయఁజాల నీమె జననాదిక మద్భుతమై వినంబడెన్. 503

ఉ. ఇప్పటిచొప్పుఁ జూడ ధరణీశ్వరపుత్రిక యీమెయంచు నే
ర్పొప్పఁ దలంపఁజాలు నతఁడుండఁడు భూస్థలినంచు నెంచెదన్
దప్పక మృత్యుదేవతయొ తా నిట సీత యనంగ నొప్పువే
రిప్పుడమిం బ్రసిద్ధముగ నేర్పడఁ బుట్టె నటంచుఁ దోఁచెడున్. 504

ఉ. కన్నులనుండి క్రోధశిఖగాఢశిఖల్ వెడలంగఁ గారణం
బెన్నఁగ నిద్దియౌ ననుచు నెంత తలంచినఁ దోఁపకున్న దీ
యన్నులమిన్న నుండుము గృహంబున నంచు వచించెఁగాదె మా
యన్న వనప్రయాణసమయంబున నిల్వక వచ్చె నీమెయే. 505

చ. తొలుత విరాధుఁ డీమెఁ గొని తోరపువేడుకఁ బాఱిచచ్చె; న
వ్వల ననసూయ యీసుదతిఁ బ్రస్తుతిచేసెను బెక్కుసారు; లీ
లలన యనేకనీతుల విలాసమునం బలుకంగ వింటి నేఁ
దలఁపఁగఁజాలనైతి వనితామణి కారణజన్మ యంచెదన్ 506

చ. ఇపుడిపు డొక్కటొక్కటిగ నీయమశక్తిలవంబు లల్లనం
గపటపటంబు వెల్వడుచుఁ గన్పడుచున్నవి వీని నెన్న నీ
చపలవిశాలనేత్ర! సురసత్తముకార్యము నిర్వహింపఁ గా
శ్యపి జనియించె మాయ యనఁజాలుపరాత్పర యంచుఁ దోఁచెడున్. 507

మ. పరమేశుండు జనించె రాముఁడుగఁ దీర్పన్ మేదినీభార మి
త్తరుణంబం దనితోఁచెదన్ ప్రబలులై దైత్యుల్ మునీంద్రావళిం
గరమార్తింగనఁజేయ వారిదగుదుఃఖంబున్ దొలంగించి యు
ర్వర ధర్మచ్యుతి గాకయుండ నిలుపన్ భావించి శ్రీదేవియున్. 508

క. భగవంతు సర్వసాక్షిత, తగు నిట్లని తెల్పఁబూని తాఁ బ్రకృతి దృఢం
బగుపూన్కి జనకునకుఁ బుత్త్రిగ నయ్యెనటంచు నెమ్మదిని దోఁచెఁ గడున్.

తే. అల్లకాకున్న నీయింతి యాకృతి యిటు, సాధ్వసావహమై తగుచంద మెట్లు
సంగతంబగు నీమె వర్ష్మ మిపుడు గ్రతమము గామాఱుచున్న దెంత యుఁగడంక.

క. ప్రతినిమిషము కనఁజాలని, వితమున మాఱెడు నిదేమి వింతయొ నేనీ
యతిమాత్ర భయదతను వేగతిఁ గాంచంజాలువాఁడఁ గా నగుదునొకో?

చ. తలఁపగ నిర్వికారుఁడనఁ దద్దయు నొప్పినరామమూర్తిచేఁ
గలనున దైత్యవీరుల నికామపరాక్రమ మొప్పునట్లుని
ర్మలయశ మబ్బుచందమున మ్రుందఁగఁజేయఁ దలంచి సర్వశ
క్తులుగలయాపరాంబ యిటు కోరి ధరాత్మజ యయ్యె నేమొకో? 512

చ. సమయ మిదౌట రామునకు సాహసముం గలిగింపఁ దాను రౌ
ద్రమనఁగఁ జాలురూపమును దాల్చుచు నున్న దొయేమొ యంచు నెం
తు మది నటంచు లక్ష్మణుఁడు ధూతకళంకుఁడు సంశయించుచుం
దముఁ దలపోసి యాప్రకృతి తత్పరతం దనమాయఁ గప్పినన్. 513

క. ముందు దలంచిన దేదియొ, సందియ మందంగఁజేయఁజాలిన దెదియో
డెందమున నెన్నఁజాలని, మందునివలె లక్ష్మణుండు మ్రాన్పడియుండెన్. 514

క. శరచాపధారియై రఘు, వరుపత్నిని గాచునట్టి పౌరుషమునఁ గం
దరసీమ నుండె లక్ష్మణుఁ, డరయంగల రే త్రిమూర్తులైనఁ దదిచ్ఛన్? 515

చ. స్థిర నొకసాధ్వి యాహరిని శ్రీగళు ధాతఁ గుమారు లట్లు సం
చరణము చేయఁజాలెనఁట శాశ్వతమోక్షనిధానదానద
క్ష రహితనాశ యాప్రకృతి చాలదె లక్ష్మణు నజ్ఞుఁ జేయ భీ
కరరిపునాశనోద్యమని కామరతాత్ముని రాముఁ జేయఁగన్. 516

ఉ. ఒక్కముహూర్త మిక్కరణి నుర్వికుమారిక క్రోధమూర్తియై
యుక్కు చెలంగ నున్న దనుజోత్తములం బొరిపుచ్చు నాత్మలో
నొక్కట నెన్నఁగా నచట నుగ్రరఘూత్తమసాయకాళి కై
పెక్కినయట్లు బాఱె దనుజేంద్రులఁ దద్బలమున్ మహోగ్రతన్. 517

చ. పాడవడఁగంగఁ జేసె సురపుంగవు లచ్చెరువందిచూడ న
ల్యెడ గజఘోటకాళి రథబృందము వీరభటవ్రజంబు నొ
క్కఁడుఁగనరామి సంగరముఖం బది శూన్యముగాఁ గనంబడెన్
వడివడి గృధ్రరాజి నడువం దొడఁగెన్ భయదాకృతుల్ తగన్. 518

చ. దనుజసమూహ మంతయును దాశరథిప్రియదర్శనంబునన్
దనువులు పావనంబులయి దారుణతన్ విడనాడి దివ్యకాం

తిని గని స్వర్గముం జొరఁగఁ ǂ దీక్షిత యొందొ చనంగ శాంతముం
గనఁబడఁ జేయుమోమునఁ దǂగం గనుపట్టెను సీత యత్తఱిన్. 519

చ. స్మితము ముఖాబ్జరంగమునఁ ǂ జిందులు ద్రొక్కఁగ సాగె; నీక్షణ
ద్వితయమునుండి వత్సలత ǂ వెల్వడఁ జొచ్చెను దంతువట్టు; లా
వితమున నున్న సీతఁ గని ǂ వీరుఁడు లక్ష్మణుఁ డిట్లుపల్కె; నా
దితిజులయార్పు లిత్తఱి శ్రుǂతిద్వయముం జొఱఁబాఱ వేమొకో. 520

చ. మనుకులనాథు కార్ముకము ǂ మంత్రయుతిన్ నిదురించునాగ మ
ట్లనుదితఘోరనాదమయి ǂ యారయ శాంతిని గాంచినట్లుగా
మనమున కిప్డు తోఁచెడిని; ǂ క్ష్మాపతిచంద్రుని గానఁబోవు లే
మన కిఁకఁ గృత్యమౌ ననిన ǂ మానిని యట్టులె చేయనౌ ననన్. 521

చ. ఇరువురు మంద వేగమునǂ కే తగు కంటకమార్గమందు భూ
వరపరిపాలకుం గనఁగ ǂ వాంఛలు పొంగఁగఁ బోయి; రందుభీ
కరపరిపంథిమృత్యు వనǂ గ్రాలెడు రాముఁడు సుంతయే శ్రమం
బు రణమునందుఁ గాంచనటు ǂ పొల్చుచు సీతను లక్ష్మణుం గనన్. 522

క. తలపోయుచుండె; నంతట, జలజాయతనేత్ర సీత ǂ సౌమిత్రియు ను
జ్జ్వలతేజు రాముఁ గాంచెదు, తలఁపులు మిన్నందవచ్చి ǂ దనుజాంతకునిన్.

చ. దనుజులఁ బూర్వజన్మసుకృǂతంపుఫలంబును గాంచఁ జేయు సా
ధనముగ యుద్ధరంగమునఁ ǂ దాను జెలంగుచుఁ జంపివైచి వా
రనుపమసౌఖ్యవార్ధి నమǂరాలయసీమను నిష్కుటంబులం
గనుచుఁ బ్రమోదమంద మదిǂ గాంచుచు సంతసమందు ధీరునిన్. 524

ఉ. కుమ్మరపుర్వు వోలె క్షితిǂగోళమునం జరియించుచుండఁగా
నెమ్మెయి నెద్ది తాఁకినటు ǂ లెల్లరకుం గనుపట్టుచుండినన్
నెమ్మదిగల్గు విజ్ఞులకుǂ నింగివలెన్ స్పృశియింప కెద్ది దూ
రమ్మున నున్నయట్లు గనǂ రాఁగ నెసంగెడు శుద్ధరూపునిన్. 525

చ. కనుఁగొని; రంత రాముఁడు నిǂశాముదంబున నాపరాంబికం
గనుఁగొనలన్ స్వపౌరుషము ǂ గాదిలి ప్రేమను దెల్పఁబూనురీ
తిని దిలకించె; నామెయు మǂతిం దలఁచెం బనిసాగె నీదువం
కనె యిట నన్న యర్థ మదిǂ కాంతుఁ డెఱుంగునటం చెఱుంగుటన్. 526

ఉ. అంతట లక్ష్మణుం గని మǂహాబలవంతులు రాక్షసేంద్రు లా
వంతయు జాలిపూననియǂహంకృతిఁ గూడుటఁ జచ్చిరింక నే
వంతయు మానిసంతతికిఁ ǂ బాటిల దీవనవాటి నంచు నా
స్వాంతమునందుఁ దోఁచెడు నǂభంగురవిక్రమ! సోదరా! యనన్. 527

ఉ. అన్నహృదంబుజాత మపు డాయతహర్షరసైకపూర్ణమై
గ్రన్నన విచ్చివెల్గ స్మితరమ్యముగా వచియించె దుష్టు లిం
క న్నినుఁ జూడఁగోర రని క్ష్మాపతిమౌళి! తలంతు; జీవితే
చ్ఛ న్నెటి గాంచు క్రూరులకుఁ జక్కనిపాత మి దౌఁ గదా ధరన్. 528

క. గతకర్ణనాసయగు నా, దితిజాంగన గానఁబడెను దీనత నింకే
గతిఁ బోవునో యన రాముం, డతనికి భావ్యర్థ మిట్టులగు నని తెల్పెన్. 529

క. వినవయ్య సోదరా! యా, దనుజాంగన యిందుఁగల్గుదనుజేంద్రులచా
వునకు నిమిత్తము దా న,య్యెనుగాదె మఱెందుఁగల్గు నెవరికి నగునో? 530

క. తలపోయ దీనివంక నె, విలయము రక్కసుల కౌట విస్పష్టంబే
పలికెద నిప్పుడె చూడం,గల వింకన్ నీవె వానిఁ గాలమునందున్. 531

క. ఈనారి యింక నేయే,దానవులం బ్రోత్సహించి తనభంగము నె
ట్లైనను దొలఁగించుకొనం,గా నెంచునటంచు నెన్నఁగాఁ దగుఁగాదే? 532

క. ఎవరెవరికి మృతికాలము, సవిధంబై యుండు వారు చను దెంతురు న్యా
యవిధం బిట్టిదియని స్వీ,యవృత్తిచేఁ దెల్పు మనల నని మ్రందింపన్. 533

క. ఇంతకుఁగారణ మీనా,కాంతయె యని నమ్ము మిది నికషశిలవలె దు
ర్దాంతాస్మదీయపౌరుష, మింతయె యని తెల్పఁ బుట్టె నని యిల తోఁచెన్.

క. కనుకం దిటపూని మదిం, గనుచుందము ముందు సాగు కార్యమ్ముల శ్ర
ద్ధనుబూని యరయఁ దగుఁగద, యనుజ! యుదర్కమునఁ గాలమది మిన్నఁగదా?

క. కాలమె భగవద్రూపం,బై లయసృష్ట్యవనములను నక్కార్యములన్
బోల నొనరించుఁ గావునఁ, గాలసమారాధనంబె కార్యముసుమ్మీ! 536

క. సమయోపాసన యనఁగా, నమలాత్మతఁ జేయఁదగిన యప్పని తగు కా
లమున నొనర్పుటె యని శా,స్త్రము తెల్పు నటంచు నమ్మఁ జను మన కనఘా!

క. ఎది యపుడు చేయఁదగు నా, యదనుం దప్పించి కార్య మాదరమునఁ జే
యు దరిద్రు మోసపుచ్చును, దుదిఁ గాలమె యని యెఱుంగు దోషజ్ఞవరా!

తే. శాస్త్రమునఁ జెప్పియున్నట్టి చందమున నె,దైవముం గొల్చితిమి గాని తగినఫలము
కలుగ లేదని భావింత్రు కాలయాప,నముఁ దలంపరు ధీరులైనన్ జగమున. 539

తే. పాచితమె లేకయుండఁగఁ బండితాను,
మతిని జేసియుఁ గర్మములతులితఫల
ముల నొసంగకయుండుట కలదు; దాని
కారణము కాలమెన్నమిఁ గాఁ దలఁపుము. 540

తే. వస్తువారముఁ గూర్చుట వలసినంత, యత్నమున సభ్యులం గూర్చుటల్లకర్మ
మర్మిలిం జేయుటయుఁ జాలదనఘ! తగిన, కాలమునఁ జేయుటొక్కండు గలుగకున్న.

ఆ. ఎన్నికర్మముల నఽహీనదానంబులఁ, బూనిచేసిన వినుఽ పూర్ణఫలము
కలుగ; దెవఁడు మంచిఽకర్మమ్ములను గాల, మెఱఁగి చేయుఁ బొందుఽసిద్ధఫలము.

చ. కలదిఁక నిందు నుండఁదగుఽకాలము వత్సరమాత్ర మం చెదం
దలఁపకు మింతలోపలనెఽ దైవ మదెట్టిశ్రమాళి శర్మముం
గలుఁగఁగఁ జేయఁబూనినదొఽ గాదిలితమ్ముఁడ! యె ట్లెఱుంగనౌ
ఫలముల నొందువేళ గనుఽపట్టు నదెట్టిదియో జనాళికిన్. 543

ఉ. మానులు భద్రయోగమహిఽమంబున రాఁగలకాల మిట్టిదం
చూనినశ్రద్ధచే నెఱుఁగఽనోపుదు రంచుఁ దలంతువేమొ; య
జ్ఞానులఁబోలి వారలునుఽ జాల రెఱుంగఁగ నాపరాత్పరుం
గానఁగ శక్య మెట్టులగుఽగాలము తన్మయమౌట నల్లియా. 544

తే. సర్వకారణ మాపరాఽశక్తియౌటఁ, దద్వశంబున నున్నయుఽత్తమపురుషుఁడు
శక్తిహీనుండెగదయంచుఽ స్వాంతమందుఁదలఁపఁబోకుము దానిదౌఽతత్త్వమిట్లు.

క. పరమేశు నిచ్ఛయేగద, పరఁగుంజుమ ప్రకృతియనఁగఽ పరమేశాజ్ఞం
దిరుగునది తద్వశంబునఁ, జరియింతు రతండు తద్వఽశంబున నెపుడున్. 546

క. అతఁడు తలంచినయంతఁ బ్రకృతియుఁ బ్రహ్మాండవితతిఁఽ గించిత్కార్య
ప్రతిమానముగా నలరించి తమిం బోషించి తుది నఽశింపంజేయున్. 547

క. తలఁచుట యాతనిపని యి, మ్ముల దానిఁ గానఁబడెడుఽపోలికఁ జేయం
గలుగుట మాయాకార్యము, దెలియందగుఁ దత్త్వ మి దనిఽదీనిఁ సహజా! 548

క. ఇదిమాత్రము తెలిసిన నే, మొదవుఁ ఫలమంచు నెంతుఽవో యాతత్త్వం
బెద నెఱిఁగిన యాధీరుఁడు, విదితాఖిలవేదశాస్త్రఽ విమలార్థుండౌ. 549

తే. భేదభావంబు తొలఁగు నీఽవిశ్వ మెట్టి
దనుచుఁ దెలియంగఁబడుఁ బరఽమాత్మ యనఁగ
నెందు నుండునో? ప్రకృతినాఽ నెట్టిదగునో?
యెఱుఁగఁబడు సంశయము వానిఽ కెట్లుకల్గు? 550

క. ఎన్నిశ్రుతుల్ శాస్త్రంబులు, విన్నఁ బఠింపంగఁ గల్గుఽవిజ్ఞానం బో
యన్నా! యిద్ది యెఱింగినఁ, గ్రన్ననఁ జేకూరు ముక్తిఽకాంత లభించున్. 551

చ. అని తనయాశయంబుఁ దగుఽనట్టులు తెల్పెడు రామచంద్రునిం
గని జనకాత్మజాత స్మితఽకాంతుల వెల్వడఁజేయుచుఁ స్తుతిం
పను జను నీదుమాటలనుఽ భావము తెల్పి మఱొండు పల్కకుం
డెను; రఘురాము వాక్కులనుఽ నిండిచెలంగెడు నర్థరాశినిన్. 552

తే. అల్పపాత్రముఁబోలు హృఽదబ్జమందు, నిల్పుకొనఁ దావు లేమి దాఽనిని నికామ
దూరదృష్టిని జూచి యాఽతురతనొంద, కూరకుండెను మాయపైఽనొలసియుంట.

చ. అనిమొన సాగినట్టివిషయంబులఁ దెల్పుచు రామచంద్రుఁ డా
జనకకుమారి లక్ష్మణుని । సంతసమొందఁగఁ జేయుచుండె; నం
త నిజసహోదరాళి యని । నాశము నొందుటఁ జుప్పనాతి తాఁ
గనుఁగొని యాపరాభవము । కాఱియ పెట్టఁగఁబోయె లంకకున్. 554

## రావణుని శూర్పణఖ పురికొల్పుట.

ఉ. సీతతలంపు శూర్పణఖ । చిత్తముఁ జాలఁగలంచివైవ దు
ర్నీతిని బూని రావణుని । నిర్మలచిత్తముఁ గామతత్పరం
బై తగవుం దలంపనటు । లత్తఱిఁ జేయఁగ నిశ్చయించె న
జ్ఞాతభవుండెయైన నొక । భంగిని మాయను మీఱఁజాలునే. 555
చ. హరిహరులే తదంఘ్రియుగ । మాదృతి మస్తములందుఁ దాల్పఁగా
నొరులను దెల్పనేల యిఁక । నొండువిధంబున సంచరింతు రం
చరయఁగ నాజగజ్జనని । యాశయ మెట్టులొ కార్యమట్లె ని
ర్భరగతిమీఱి సాగుఁ దల । పంపులె మీఱుదు మంచుఁ బల్కుటల్. 556
మ. జగతిన్ ధర్మము సాధుకర్మముల సం । స్థాపింపఁగాఁ బూనియే
భగవంతుం డమిఁగూడి మానవతఁ దే । ల్పంజాలు నాకారముం
బొగడొందం దగునట్లు కాంచినమహా । పూతన్ జగద్ధాత్రి దే
వగణంబుల్ సతతంబుఁ గొల్చుఁ దమహృ । ద్వాంఛల్ ఫలింపం గడున్. 557
తే. అట్టిబ్రహ్మాండనాయిక । యిట్లుచేయ,వలయు ననిసంస్మరింప నెవ్వరు తలంగఁ
జాలువారలు? దానవ । శమదమములఁ, దెలియఁజాలని యజ్ఞాన । కలితచిత్త. 558
క. జనకజ స్మరించినంత,న చని రావణునకును సీత । సౌందర్యంబున్
వినిపించి యామెఁగొని చనఁ,గను జేయఁ దలంచె వాని । కర్మమువలనన్. 559
క. సంగరమున రావణునకు, భంగము వాటిల్లు ననుచు । భావించి జవం
బుం గనుగమనమునం బో,యెం గాంక్షలు సఫలము లగు । నిఁక ననునాశన్.
క. లంకం గాంచి యిదేమొకొ, శంకింపం దగినయట్టి । చందంబున నీ
లంకాపురి కనుపట్టెడు, నంకిమ్మైదో కల్గియున్న । యట్లిత్తఱినిన్. 561
క. దనుజుల నెవ్వరిఁ గాంచినఁ, గనుజంటలనుండి యశ్రు । కణములు తొరఁగం
గనుపట్టు నట్టు లిత్తఱి, ననుమానమె లేక తోఁచె । నక్కట నాకున్. 562
క. సిరితొలఁగుసమయమున సుం,దరిమో మెటు కాంతిహీన । తం గనఁబడు న
క్కరణిన్ లంకాపుర మీ, తరుణంబున హీనసంపదం గనుపట్టెన్. 563
క. నామదిఁ గలచింతాజ్వర, మేమఱఁగాఁజేసి నాకు । నీనగరవరం
బీమాడ్కిఁ గాంతిహీనత,చే మార్పుం గనినయట్లు । చేసెనొ కనఁగన్. 564
క. అని బహువిధముల నెంచుచుఁ, జనిచని ప్రాసాదమందు । స్వాంతమ్మున నే
వనితలఁగూర్చియొ చింతం, గనుచున్నసహోదరాగ్ర్యుఁ । గని యద ననుచున్.

మ. చరణద్వంద్వమునందు మస్తకము స్పర్శస్ఫారసౌఖ్యంబు గాం
చురతిన్ నిల్వఁగ వందనమ్ము తనయస్తోకార్తులం దెల్పిన
క్కరణిం జేసి యెఱుంగ శక్యమెటు లేఁ గానట్టి వాక్యంబులన్
నరు లిట్లార్తిఁ గనంగఁ జేసి రసురేంద్రా! నన్ను రక్షింపవే. 566

మ. కులమర్యాదకు నిట్టు లార్తిఁ గనితిన్ గొం కింతయే లేక మ
ర్త్యులు మీ రేల వసించినా రిచట నేయుద్యోగముం జేయఁగాఁ;
బలుకుం డంచడుగంగ నేమియును జెప్పంబూనకే ఖడ్గధా
రల నాసాశ్రవణంబులన్ నఱికి రో రక్షఃపతీ! శ్రీపతీ! 567

ఉ. ఏటికిఁ బోయి తచ్చటికి నీవని యందునో యొందునైన నే
బోటులు రూపమందుఁ దనుఁబోలెడు వారలె లేకయుండ నీ
సాటియటంచుఁ బల్కుటకుఁ జాలినవారలె లేకయుండఁగాఁ
గోటికినైన నచ్చరలకూటముఁ గైకొననట్టి సుందరిన్. 568

తే. దండకాటవి నుండెడుదానిఁ బొగడ, వినుచు నెట్లుండునో చూతమనుచుఁ దగిన
దంచుఁ దోఁచిన నీకు భార్యగ నొనర్ప, నచటి కరిగితి నాకు నిట్లయ్యె నయ్య!

క. నాకిటులైనం గానీ, నీ కాసౌందర్యరాశినిం గూర్పంగా
లేకునికికె చింతించెద, నాకేశార్చిత! నిశాటనాథా! యనినన్. 570

ఆ. అన్నుమిన్న చెన్నులన్నమాటలు చెవి, పెన్నిధులను బోలి క్రన్ననఁ జొర
నులికిపడుచు నాసహోదరి వీక్షించి, దానిపరిభవంబుఁ దలఁప కతఁడు. 571

చ. తెలుపుమ దెవ్వనిం బ్రియుని ధీరుఁ డటంచెద నమ్మి భీతిచేఁ
దలఁకక దండకాటవులఁ దాఁ దిరుగం దలపోసి వచ్చెనో
కలరొ సహాయ మావికచకంజసునేత్రకు నెవ్వ రందు నే
చెలువయు దాని కీ డనుచుఁ జెప్పఁగ నొప్పనికుల్కులాడియే. 572

తే. ఆలసించి వచింతువే నంతదాఁకఁ, దనువునం బ్రాణములు నిల్వఁ దలఁప కున్న
వెవరి కేమని చెప్పుదు వవలఁ జెపుమ, సైఁపఁజాల నాలస్యంబు నో పురంధ్రి.

చ. అనుటయుఁ జుప్పనాతి హృదయంబున నాశ జనింప నింక నీ
తనిఁ బురికొల్పవచ్చు నలతన్వినిఁ దెమ్మని పల్కవచ్చు నా
మనమునఁ బాయకున్నయవమానము దీర్చుకొనంగవచ్చు ని
ప్పని కొనసాగునే ననుచు భావమునం దలపోసి యిట్లనున్. 574

చ. అలరుమిటారి యోర్తు మనుజాన్వయజాతయె కాని దేవతా
లలనలఁ బాదపంకజములం దగుధూళికి నీడు సేయఁగాఁ
గలవగలాడి మన్మథుని కాండ మనందగు కుల్కులాడి కా
నలఁ జరియింపవచ్చిన యనంగుని యన్నులమిన్న యో యనన్. 575

చ. మగఁడు తదీయసోదరుఁడు మానులవేషములుఙ ధనుస్సు ల
త్యగణితబాణముల్ వెలయ నామెను గాచుచునుండ్రు; కాపురం
బుగఁ దగుఁజుమ్ము! పంచవటి భూరిబలాఢ్యులు వారలౌటఁ జె
ప్పఁగఁ దగుఁగాదె నీయశము బాగుగఁ గోరెదునాకు రావణా! 576

చ. ఖరుఁడును దూషణుండు మఱికల్గిన దానవవీరులెల్ల నా
పరిభవ మడ్డె తీఱునటు పంచవటిం దగువారి మార్కొనం
బరుగిడి రంతెకాని క్షణభంగుర మీతనువంచుఁ దెల్పు న
క్కరణి ముహూర్తమాత్రమునఁ గానఁగఁబోయిరి దేవలోకమున్. 577

మ. కనులారం బ్రవిదారణంబు నచటం గంటిఙ సురారీంద్ర! యే
మని వర్ణింతును రామశౌర్య మది లోకాతీతమే యంచుఁ జె
ప్పను జంకంజుము! తమ్మునిఙ సుదతి నాభాగంబునం గాన నెం
దనిసాగఙ వసియింతురో యొకఁడె యన్నా! చంపె సోదర్యులన్. 578

క. వినుము పదునాల్గువేలుగ, దనుజులు లెక్కింప నుండ్రు తద్గణమం దొ
క్కనిఁగాని జీవములఁ గాం,చినవానిం జూడ నేమి చెప్పుదు నీకున్. 579

క. ఇఁక నిల్చిన నాతనువుఙ, వికలత్వము గాంచకున్నె వేగమ చని లం
కకు నన్నుఁ గాంచి చెప్పుదు, సకలంబని వచ్చితిఙ విశంకటగతి చేన్. 580

ఉ. కాలము చెల్లె వారలకుఁ గావునఁ దద్విషయంబునందు నిం
కేల విచార మింకఁ దగు నెట్టులు చేయఁగ నన్న దొక్కఁడే
చాల విచారముఙ సలుపఁజాలిన దౌఁగద? దేనిఁ జేసినఙ
మేలుపొసంగు నం చొకనిమేషము చిత్తమునం దలంపుమా. 581

క. నీయాశయ మేమని న,న్నే యడుగం బూనుదో యహీనబలుండౌ
నాయసురాంతకు మార్కొను టేయనువున హితముగామి నెఱిగింతుఁ బ్రభూ!

చ. సమరములందు దుర్జయుల శక్రభయావహులఙ ఖరాదులఙ
సుమహితబాణజాలముల క్షోణిపయిం బడఁజేసెఁగా ముహూ
ర్తమున నె యట్టివీరుని సురప్రవరార్థము రామనామయో
గమున జనించినట్టి యలకాంచనచేలుని నోర్వ నెట్లగున్. 583

చ. ఒరుఁడెవఁడైనఁ నాఖరుని నోర్వఁగలండె తలంపు మింతయే
సురలహితంబు గోరి మధుసూదనుఁడే యిల రాముఁడై మహా
శరుల నడంపఁ బుట్టె నని స్వాంతమునం దలపోయుదానఁ; ద
త్తరుణియె లేకయున్న మృతిఁ దప్పక గాంచెదు నాతఁ డప్పుడే. 584

సీ. ఆతనిజీవిత మాయమ చేతిలో, నున్నదటంచు నోయన్న! తలఁపు
మటుగాన వంచన నామెను దెచ్చిన, సులువుగా నాతఁడు విలయమొందు;

నతనిసోదరుఁడు నయ్యెదనుననే చచ్చుఁ, దక్కను నీకలతన్వి దాన
నాపరితాప మంతయుఁదీఱు నీకును, శాశ్వతసౌఖ్యము సరగ దొరకు

తే. జన్మసాఫల్యము లభించు సకలలోక, విభుత యలవడినట్టులే వెలయు; ననిన
ననుజపలుకులు శ్రవణపేయంబులగుచు,హర్ష మొదవింపనప్పుడిట్లనియెనతఁడు.

క. ఏతత్పర్యంతము నా, చేతోగతి యొందు కార్యచింత మునుఁగుటన్
నీతో మాటాడుచు నా, భూతలపతిసుతుల శౌర్యమును బ్రశ్నింపన్. 586

క. తెలిసె ఖరాదులు రణమునఁ, బొలియుట, యద్దాన భీతిఁబొందితి ననుచుం
దలఁపకు శూర్పణఖా! వా,రల మార్కొనకుండునొక్కరావణుఁ డెల్లే. 587

క. తనమేన నసువు లుండెడు, దనుకన్ శత్రువులఁ జంపుతమి గాంచెడు నీ
దనుజేంద్రుఁ డంచు నమ్ముము, విను మొక్కరహస్యవార్తవినిపింతు నిటన్.

చ. సులువగునట్టిమార్గమున శూర్పణఖా! మనకార్య మంతయున్
ఫలయుత మౌనయేని తగుభంగిని దానిన పూనమేలు; నీ
కెలమి ఘటింపఁజేయుటకె యిన్నివిధంబుల నెన్నువాఁడ వా
రలను జయించుపద్ధతి ఖరప్రముఖుల్ తలపోయఁ జాలమిన్. 589

చ. అనిమొన నీగ్గి రట్టిపనియందుఁ జొరంబడ కొక్కయుక్తిచే
వనితను దెచ్చువాఁడ రఘువర్యుఁడు దాన నశించు నంచు నీ
వనినటులే తలంచితి నిదంతయు వేగమ సాగఁజేయఁగా
మనమున నెంచువాఁడ క్షణమాత్రముగూడ నిఁ కాలసింపఁజూ! 590

చ శ్రుతియుగనాసికాదళనరూపమహాపకృతిం బొనర్చి యా
క్షితిపకుమారుఁ డెంతయునుజెందెనొయేమొ ముదంబు దాననే
యతిశయ శత్రుదానవగణాధిపునింట వసింప దుఃఖమ
గ్నతఁ గృశియించుచున్ మృతిని గాంచెదుఁగాక సగర్భ్యసంయుతిన్ 591

చ. జరగినదానిఁగూర్చి యిఁక స్వాంతమునం బరితాప మందినన్
మరల సహోదరీ! యవి క్రమంబునఁ బూర్వపురీతి నొప్పఁగాఁ
దరమగునే నగన్ మఱచి దానవనాథు జయంబుఁగోరి మం
దిరముననుండుమా కనుమ తృప్తిని దైవము నమ్మి యిత్తఱిన్. 592

తే. పంచవటి కేగి మారీచుపల్కుల విని, మరలివచ్చితి సోదరీ! మనయకంప
నుండు ఖరముఖదానవమండలంబు,తెగుటయింతకుఁబూర్వమే తెలియఁజెప్పె.

క. అత్తఱి నే నేగుటకుం, జిత్తంబున కెక్కనీవు చెప్పినపిదపన్
బిత్తఱిఁ దేనేగుటకు మ,హాత్తరభేదంబు గాననగు శూర్పణఖా! 594

క. చనుమా నీవిఁక సంశయ,మునుమాని త్వదీయచిత్తమును రంజింపం
గ నెదియొ తెరువని యోజిం,పను బంచితి; బుద్ధి యట్టిపని సాధించున్. 595

చ. మునుపె సనత్కుమారుఁ డనఁ బొల్చుమహాముని నాకుఁ దెల్పెఁ జ
క్కనిహిత మద్ది యిత్తఱి సుఖంబొనఁగూర్పఁగఁ జాల వేడుకం
గనినటుతోఁచు చున్నయది కారణముల్ దగినట్లు దానికిన్
ననుఁ బురికొల్పుచున్నయవి నాతిని దేఁ జను నంచు సారెకున్. 596

ఉ. మొత్తముమీఁద దానవసమూహము పేరును గాంచి భూమియం
దుత్తమకీర్తిఁ గాంచి తలలొగ్గి సురల్ నతు లొప్పఁ జేయఁగా
చిత్తము హర్షమొందఁగ వసించుటొ చచ్చుటొ యౌను గాని సం
పత్తి యశంబు వాయఁగ శవంబటు లుండ దటంచు నమ్ముమా. 597

ఉ. ఇందుల కీవె కారణ మదింతట నంతటఁ బోదు శాశ్వతా
నందముఁ గూర్ప నెంచినటు నామదిఁ దోఁచెడు మాటలేల యో
సుందరి! కార్యభారమునఁ జొక్కినచిత్తముగల్గు నన్ను నిం
కం దడ విందు నిల్చి పలుకన్ దలపోయకుఁ బొమ్ము లోనికిన్. 598

క. అనవుడు శూర్పణఖయు నా,తనిమాటలఁ గల్గుభూరితత్త్వ మిదియటం
చు నెఱుంగఁజాల కతఁడే,పునఁ దెచ్చున్ జనకరాజపుత్త్రిక ననుచున్. 599

క. ఎంచుచు మందోదరినిం, గాంచంగా నరిగె; దనుజకాంతుం డపుడే
వంచన సీతనుగొని చను,దెంచుట మేలంచు నెమ్మదిం దలపోసెన్. 600

క ఏకాంతసౌధమున లం,కాకాంతుఁడు కూరుచుండి కాఁగలకార్యం
బేకరణి సాగునో జ్ఞా,నాకృతి పరదేవి లంక కరుదెంచు టెటో? 601

క. తనదగు సత్కర్మఫలం, బనుభవమునఁ గానఁబడుటయనునది యెపుడో
జనియిది శ్రీదేవీపద,వనజార్చనధన్య మగు దివసవర్య మెదో. 602

మ. పరదేవిన్ భవవారిరాశితరణిన్ భక్తవ్రజానందదా
నరతన్ గామకళాంబ నాఁబరఁగి ధన్యస్వాంతపీఠస్థయై
పరమధ్యేయ యనంగ నొప్పుజననిన్ భక్త్యున్నతిం గొల్చు టె
త్తరుణంబందొ మదీయభాగ్యము ప్రమోదం బిచ్చుకాలం బెదో. 603

మ. మది సాదాఖ్యకళాంబికాచరణపద్మద్వంద్వమున్ జ్ఞానదృ
ష్టిఁ దగం గాంచుచు సంతసంబుఁ గనుచుంటిన్ నేఁటిపర్యంత మీ
యదనుం గాంచినబాహ్యకర్మముల నత్యంతాపకీర్తిన్ క్షితిం
బొదలం గాంచినఁగాని యీతనువునుం బోనాడరా దేమిటన్. 604

మ. అనుచుం దోఁచెడుఁ బూర్వకర్మఫల మొక్కటైనన్ భుజింపంగ మా
నను శక్యంబెటుగా దటన్నుడి యేనాఁడైన సత్యంబుగా
దనఁగావచ్చునె సీతవంక ధర దుర్ధాంతంబుగా నొప్పుదు
ర్జనతం గాంచినఁగాని దుష్టముగుకర్మం బద్ది పో దెవ్విధిన్. 605

చ. ఇతరుల కేవగింపు జని।యించిన మానె; న దాత్మవృద్ధికిన్
గతమగునేని చాలదె యిఁ।కం దలపోయఁగనేల తల్లిగా
మతిఁ దలపోయుచున్ గడుసు।మాటలఁ దూలఁగనాడుచంద మే
యితరులకుం గనంబడఁగ । నే నొనరించెద ముక్తిఁ గోరుచున్. 606

క. సీతాదేవియు నాదగు, చేతస్సు నెఱుంగకున్నె । చేడ్పడినట్లే
భీతిల్లుచున్నయట్లే, యాతఁడె వర్తిల్లు సర్వ । మాత్మ నెఱుఁగుటన్. 607

క. తనమూలంబుననే రా,మునిచే మృత్యువని నాకు । బుద్ధి నెఱుఁగుఁ గా
వున నా దేవిని భగవతిఁ, గొనివచ్చెద నాకు ముక్తిఁ।గోరియె యిటకున్. 608

క. పరమేశ్వరుఁడౌ రాముఁడు, పరమేశ్వరియైన సీత । భక్తుని నన్నే
కరణినయినఁ గృపచేతం, దరియింపఁగఁ జేయుదురని । తలఁచెద మదిలోన్ 609

మ. శ్రుతులన్ నేర్చి తపం బొనర్చి యమర।స్తోమంబు తృప్తింగనన్
వితతశ్రద్ధను సప్తతంతుగణముల్ । విధ్యుక్తరీతిం బొన
ర్చి తగన్ దానము లిచ్చి యీశ్వరులఁ దా । సేవించినన్ భక్తిచే
నతిమోదమ్మును గాంచిన ట్లితరక।ర్మాళిన్ దమిం గాంతురే. 610

సీ. కర్మముల్ మానినఁ । గాదుసంతోషంబు, పరమేశ్వరుల కని।భక్తుఁ డెఱిఁగి
భక్తివిజ్ఞానసం।పత్తితో సత్కర్మ,ముల నాచరించుచు । ఫలము వారి
పాదాంబుజముల క।ర్పణము చేయుచు సర్వ, మీశ్వరమయమని । యెఱిఁగి యెల్ల
వస్తువులందు నీ।శ్వరదర్శనంబునఁ, గృతకృత్యునిఁగ దన్ను । నెఱుఁగు నతఁడె
తే. తత్కృపాపాత్రుఁడౌ నని।తలఁపవలయు, నట్లు సేవించు నాకు నె।య్యమున వారు
ముక్తి నొసఁగుట యబ్రమే।పోయి యిపుడె, జానకిం దెత్తు రాముండు।సరగ వచ్చు.

ఉ. జానకి దెచ్చుటన్న నది।శక్యమె యేరికినైన నంచు నా
మానసమందు సంశయము । మాటికిమాటికిఁ దోఁపనీక యా
మానిని బాహ్యరూపమును । మానవు లందఱుఁ గాంచుడానిఁ బెం
పూనినశక్తిఁ దెచ్చెద న।హో! యని దానవులెల్ల మెచ్చఁగన్. 612

తే. ప్రకృతియీరూపమున నుండుఁ । బట్టనొప్పు, నామె నిట్లని యోజించు।నల్పమతియె
సర్వరూపము లాపర।శక్తివె యగు, నన్నమాట మహాత్ముల।యాదృతిఁ గను.

ఉ. రాముని బాసి భూతనయ । రావణునింట వసించియున్నదం
చీమనుజుల్ తలంతు రది।యేగద నాదగు కార్యసత్ఫలం
బౌమనుజాకృతిన్ వెలయు।నట్టి మహాత్ముఁడు దేవదేవుఁడౌ
రాముఁడు లంకఁ జేరి శఠ।రాక్షసులన్ ననుఁ జంపు సీతకై. 614

ఉ. ఇందులకే జగజ్జనకుఁ । డీయిల మానవరూప మొందె; నే
సందియ మొందనేల? యిదె । జానకిఁ దేఁ జనువాఁడ నాదువం

కం దెగువార లెందఱొ యిఁకం గననోఁగద? వేగపోయి రా
ముం దొలఁగించి యొంటిదగు భూతనయన్ జగదేకమాతనున్. 615

క. కొనివచ్చెదఁ దన్మూలం,బున నాథవమెల్ల సుకృతములకాలయమై
తనరారఁగలదు శ్రీరా,మునిచేఁ దెగునంతకంటె ముక్తిమఱి యెదో? 616

రావణుఁడు మారీచునికడ కరుగుట.

క. నాకతమున మారీచున, కాకానన్ మృతి లభించు ననియూహింతుం
గాకున్న యద్ది తొలుతనె, శ్రీకాంతాగమనకార్యసిద్ధి మఱి యగున్. 617

క. నామూలంబున నెవ రెవ, రామాధవుచేతఁ జావ నర్హులొ వారల్
నామాటకు లోఁబడుదురు, భూమిన్ మరలన్ జనింపఁబోరు మఱెపుడేన్.

క. ఇందఱ కిన్నివిధములన్, జెందంగా ముక్తి నేను జేయుటకే శ్రీ
సుందరి నాజనయిత్రి న,మందానందప్రదాత్రి మానక తెత్తున్. 619

క. అనునిశ్చయమున రావణుఁ, డనహంకృతిమీఱఁ బయనమై వ్యోమచరం
బనుపమమునౌ శతాంగం,బు నెక్కి మారీచుకడకుఁ బోయెం బూన్కిన్. 620

శా. మారీచుండును రావణాగమ మెఱన్ మన్నింప కత్యార్తుఁడై
యోరక్షోగణనాథ! వే మరల నీయుగ్రాటవిం జేరరాఁ
గోరం గారణమేమి? దుర్మతులు నీకుం గూర్చువారల్ వలెన్
జేరన్ వచ్చి మహావిపత్తులొదవం జేయం బ్రబోధింపఁగన్. 621

ఉ. వారలపల్కులన్ వినెడు వాంఛ యొసంగఁగ నాలకించి దు
ర్వారదురుద్యమం బొకఁడువారక చేయఁగఁబూని వచ్చితం
చారయుచున్నవాఁడ నను నజ్ఞునిగాఁదలపోయ కింక నీ
కోరికఁజెప్పుమా వినఁగఁగోరెద నీదగుమేలుకోరుటన్. 622

ఉ. ధీరులకైన నాపదలఁ దెచ్చుప్రబోధము లాలకింపఁగాఁ
గోరికపుట్టు నొక్కపుడు క్రూరతరంబగుకాల మప్డు చే
కూరె నటంచు నమ్ముఁ డనికోవిదులందురు మాటయద్ది యో
శూరవరా! త్వదాగమనసూనృతభావము నొందు నేమొకో. 623

చ. వినవిన నాదుకర్ణములు వేడుకఁగాంచెడు రాక్షసేశ్వరా!
యని మరియాద ప్రీతి వినయంబులు నుట్టిపడంగఁ బల్క నా
దనుజవరుండు నేత్రములు దారుణరీతిఁ జెలంగుచుండ ని
ట్లనియెను దాటకాతనయ న్యాయవిదుండన నీవెగా! యిలన్. 624

క. నీమాత్ర మే నెఱుంగను, ధీమంతుఁడ వన్న నీవె తెలిసితి నింకన్
వేమాటలఁ బనిలే దిట, స్వామిహితం బాచరింపఁ జనుదువొ లేదో? 625

ఆ. తెలుపు మొక్కమాటఁ దెలియందగును నీకె, నాదువిక్రమంబు నా నతండు

మది నెఱింగి యతనిమాటల యర్థంబు, కరయుగంబుఁ జేర్చి ప్రభణితి. 626

క. పలికెన్ దానవనాథా! యలుకం బూనంగ నేల? యరిభావం బే
కలుగదు నీయెడ నాదగు, తల నిమ్మన నిచ్చువాఁడఁ దప్పక యిపుడే. 627

క. మేలుం గోరుదు నీ కెపు, డాలింపఁగ నిష్టమైన నాత్మకుఁ దోఁపం
జాలిన నీతులఁ దెల్పెదఁ, జాలు నన్ నిల్పి యాజ్ఞ జరపెద నెమ్మిన్. 628

క. రక్షించిన ననుకంపన్, శిక్షించినఁ గోపమూని చెప్పఁగ నేలా
రక్షఃప్రవరా! నీవే, యీక్షితి నాకేడుగడ యిదే శర ణనినన్. 629

చ. స్మితము ముఖాంగణంబునను జెల్వువహింపఁగ దానవేంద్ర! నా
హితమె భవద్ధితం బనుచు నెంచెడువాఁడ వటం చెఱుంగనే
మతిఁగలయూహఁ దెల్పెదను మానక యల్లెయొనర్పు మిద్దియున్
హితమగునే యటంచుబదు లేదియుఁ జెప్పకు మాలకింపుమా. 630

చ. సురుచిరచిత్రవర్ణములఁ జూడఁగ నెల్లరుఁ గోరునట్లుగా
హరిణశరీర మూని యిపు డారఘురాముని యాశ్రమంబునం
దిరుగఁగఁ బొమ్ము; నిన్గని మదిం దలపోయక పట్టితెమ్ము సుం
దరహరిణంబు దీని నని ధాత్రికుమారికఁ గోరు నంతటన్. 631

మ. శరచాపంబులు పూని రాఘవుఁడు నీచందంబు సౌందర్యముం
బరమామోదముఁగూర్పఁ బట్టుకొనరాఁ బ్రాల్మాల కేతెంచు, న
త్తరుణంబందు భవన్మహాచతురతన్ దాఁ గాంచి నీవెంబడిం
బరువెత్తంగ నొనర్పు చిక్కనిది యన్ భావంబు గల్గించుచున్. 632

ఉ. దూరమువచ్చినాఁడ నిదితోఁపదు చిక్కెడురీతి నంచు నా
భూరమణుండు లో నరసి భూరిశరం బరిఁబోయురీతి నీ
వారసి జాగరూకత నహార్యమహాద్భుతశాంబరీచమ
త్కారము నూని చాపమును గాండము వీడిన యంతనే త్వరన్. 633

చ హరిణశరీరమున్ వదలు మప్పుడు లక్ష్మణ! జానకీ యటం
చురురవ మాశ్రమాంతరము నొందఁగ దైన్యముతోఁపఁ నార్చి నీ
వరుగుము పూర్వదేహమున నాశర మాహరిణంబుఁ గూల్చున
వ్వరుస రవంబు వీనులను బర్వఁగ జానకి దుఃఖితాత్మయై. 634

క. చనవయ్యా! సౌమిత్రీ, యనుజన్మునిరాకఁ గోరి యతిదైన్యమునన్
ధ్వనిచేసె నీదు జ్యేష్ఠుం, డనుమానముమాని యనుచు నామెవచించున్. 635

చ. త్వరపడిపోవు లక్ష్మణుఁడు తన్విని దిక్కనలేనిదానిఁ జె
చ్చెరఁ గొనిపోదు లంకకును జేకుఱు దాన మదీయవాంఛితం
బరుదగునీచమత్కృతికి నందఱు మెత్తురు రాక్షసావళిం
బొరిఁగొనినట్టి పాపమునఁ బోవు నతండు నతండు నంతటన్. 636

తే. ఆలసింపకు మన్న నయ్యెదనునందు, నేమి చెప్పినను జెవి కెక్కదనుచుఁ
దీటె నేటికి నాకు నీదేహమునకుఁ,గల్గు సంబంధ మనుచు నిక్కమిదియనుచు.

క. తలపోసి మదిని నందుం, గలభూరుహముల లతానికాయంబుల వే
డ్కలుపొంగఁ జూచి మనకుం, దొలఁగెఁ సంబంధ మనుచు దోసిలియమరన్

క. మనమునఁ దలఁచుచు నిదిగో, చనియెద రాజేంద్ర! రాముశరమునఁ బడ కీ
తనువున్న మరలఁ జూచెద, నిను లేదే నిదియె మ్రొక్కు నీ కిక కొసదా. 639

చ. తలఁపుము నన్ను నాకొఱకుఁ దాఁ జని దేహముఁ బాసె సౌఖ్యముల్
గలుగ దివంబునందుఁ జిరకాలము తాటకసూనుఁడుండఁగా
వలయునటంచుఁ గోరు మిదె వాంఛిత మొండొకఁ డేఁ దలంప ని
ర్మలమతిఁ బోవువాఁడఁ బలుమాట లిఁకేటికి దానవేశ్వరా! 640

క. మారీచుఁడు చెప్పినయది, యీరీతియె గద యటంచు నెన్నుదువు తుదిన్
శ్రీరాముని గాంచినయపు, డో రాక్షసనాథ! యేగుచున్నాఁడ నిదో. 641

క. అనిపల్కి రాముచేఁ జచ్చిన మోక్షము గల్గు; దనుజుచే నీల్గుటకం
టెను గోటిరెట్లు మేలగు, నని తలఁచుచుఁ బోయె రామునాశ్రమమునకున్.

క. ఘోరతరకర్మ మది యా,మారీచుని నెమ్మనమున మలయుటఁ ద్రిదశేం
ద్రారాతికార్యభరమును, నేరుపునం దీర్పఁబూను నియతిం బెంచెన్. 643

క. ఎంతయొ జ్ఞానముగల్గిన, సంతతముం దపముసల్పఁ జాలినఁ బ్రాగ్దు
ర్దాంతమహౌఘఫలం బది, శాంతింపదు భోగకలన సమయక యున్నన్. 644

క. సోదరుఁ జంపినవైరం, బాదనుజుని మదికిఁ దోఁచె నప్పుడు వాఁడా
శ్రీదయితు మోసపుచ్చం,గాఁ దలఁచుచు మంత్రశక్తి కనఁబడుచుండన్. 645

క. కనియే వినియే నెఱుఁగని, తనురుచి వెలయంగ హరిణతల్లజ మగుచున్
జనుదెంచె రాము నుటజం,బునకుం దనుఁ జూచి దేవపూగ మ్మలరన్. 646

క. ఇదియేటిమృగమొ సృష్టిం, బొదలెడుమృగజాతియందుఁ బూన్కిఁ దలఁప ని
ట్టిది యున్న జాడ కనఁబడ, దిది మాయయొ కాని నిజమదెవ్వరుస నగున్. 647

చ. దనుజులమాయయో మును పితామహుఁ డిట్టిమృగంబు సృష్టిచే
యను దలపోసి విస్మృతి నదంతయు మానియొ యుండి యిప్పు డ
ప్పని నొనరింపఁబూని నవపద్ధతి దీని సృజించెనేమొకో
యని వనదేవతల్ తలఁప నాహరిణం బుటజంబుఁ జొచ్చినన్. 648

ఉ. అంతకుమున్నె సీత హృదయంబు సుమాపచయంబునందు నిం
తింతనరానివేడ్కఁ గనుఁగొంచి రఘూత్తముఁ డామెతోడ న
భ్యంతరసీమ వీడి హరిణాగమనం బెదఁ గోరుచుం బ్రఘూ
కాంతలసత్ప్రతానముల యంతికభాగమునం జెలంగుచున్. 649

చ. సురుచిరభాషణంబులను క్షోణితనూజయు సంతసించున
ట్లురణి నొనర్చుచున్ శుకపికప్రముఖాండజవాఙ్నినాదముల్
నిరతిమెయిన్ వినందలఁచి నిల్చినయట్టులు గానవొచ్చు నా
హరిణముఁ జూచు నెప్పుడను నాశయ మొప్పఁగనుండె నేర్పునన్. 650

శా. వైదేహీవిమలాంతరంగమ్మృదు దీవ్యత్క్షేత్రసంపత్ఫల
ప్రాదుర్భూత మనోరథాకృతిలతాగ్రస్పర్శనాకృష్ట హృ
ద్వాదుండై దశకంఠునాజ్ఞ జరపన్ దాఁ బూని మారీచుఁ డెం
తే దగన్ గాంచి వియచ్చరుల్ పొగడ సుద్వృత్తిన్ మనోజ్ఞాకృతిన్. 651

క. సీతయు రాముఁడు భూభృ, ద్వ్రాతప్రసవములఁగోయుపనియందు మదుల్
ప్రీతిం గాంచినరీతిగ, నాతఱినుండంగఁ బోయె హరిణ మచటికిన్. 652

మ. నవరత్నంబుల సప్తకాంతులు స్ఫురన్నవ్యాత్మదేహైకసం
భవముల్ చూడుఁడు వేఱుగా ననుచుఁ జెప్పంబూని యేతెంచిన
ట్లవలోకించు తెఱంగుఁ దెల్పఁగ మహీజాంతఃప్రరోహల్లతా
నివహాభ్యంతరసీమఁ జొచ్చి కనియెన్ నీరేజపత్రేక్షణన్. 653

మ. కనినంతన్ మదిఁ దోఁచె నీమెయి జగత్కళ్యాణియా మాయ, యీ
వనితారత్నమువంక దానవులకున్ వచ్చున్ మహాభీతి, రా
మునితో నిత్తఱిఁగూడి నన్నుఁ గనఁగా బుద్ధిప్రభావంబునన్
దనివారం దలపోయుచున్నది జగత్తంత్రజ్ఞయై పొల్పుటన్. 654

సీ. ప్రకృతిపూరుషు లనఁబరఁగు వీరల నిందుఁ, గాంచితి నాజనికడు ఫలించె
నీరాముఁడే నన్ను నిషువునఁ జంపును, రావణునాజ్ఞ నే నేవిధమున
నైనఫలింపఁ జేయకతప్ప దీనాతి,కంటనేఁ బడియెదఁగాంచినంత
ననుఁ గోరునంతట నాథునిఁ బంపును, జీవితాంతము దాఁకనీవిపినము
ఆ. నందుఁ జిక్కెడు నను నాశఁ గల్పించుచు, దూరభూమి కేనుదోడుకొనుచుఁ
బోవు టొప్పు నదియెపో నాకు నుదరింప, దారిచూపు ననుచుఁ దలఁచి తలఁచి.

చ. తరువులపొంత నిల్చుచుఁ బ్రతానసులన్ స్పృశియించుచున్ మనో
హరగతులొప్ప నట్టునిటు లాదృతిమీఱఁగ దాఁటుచున్ ధరా
వరసుత ప్రీతిఁ జూచునటు వర్ణ్యముగాఁ దగు నంగమొప్పఁగాఁ
దిరిగెను; గాలసంయుతి విదేహనృపాత్మజ చూచె దానినిన్. 656

ఉ. వచ్చెను మంచికాల మిటువంటి మనోజ్ఞమృగంబుఁ గాంచ నా
ముచ్చటలెల్లఁ బండు నని బుద్ధిఁ దలంచుచుఁ బ్రేమ మొప్ప నో
సచ్చరితా! కనుంగొనుము చారుశరీరము గల్గునేణమున్
గ్రచ్చఱ నాకు తోడుకొనఁగాఁ దగునన్న మనీష యొప్పెడున్ 657

చ. కనుఁగొన నీశరీరమును గాంచినదాదిగ నిట్టిదాని మున్
వినినదికూడ లేదు వనవీథుల నున్నటులైన నాయకా!
చను మిపుడే మదర్థమయి చాపశరంబులఁ దాల్చి ప్రాణయు
క్తిని గ్రహియింప శక్యమని దేవరయాత్మకుఁ దోఁచునే నటుల్. 658

చ. హరిణముఁ బట్టి తేఁదగు; వనాంతరమం దది సాగకున్న నె
క్కరణినొ దీనిచర్మమును గాని మదర్థము తేఁదగుంగదా?
కరుణచెలంగ నిష్ఠై చని కాంచనదేహము రత్నకాంతులం
గురియఁగఁ జేయునంగములఁ గూడినదీనిని దెమ్ము నాకుగాన్. 659

చ. ఇదెకద కారణంబగు నహీనకృపారసమొప్పు సీతపై
వదలక రామమూర్తి కనువాణి జగంబుల నిండ దీనిచేఁ
గద ఫలియించు యాత్రయిది క్రమ్మఱఁ దెల్పఁగనేల? తెల్పితిన్
మొదటనె భూతనాయక! విమోహవినాశక! దేవపోషకా! 660

మ. మృగమూలంబుగ నీయశంబు ధరణిన్ మీఁదన్ భుజంగాలయం
బుగ లెక్కింపఁగనొప్పు క్రింద వెలయుంబో రామచంద్రా! యికం
దగుఁగాదే పయనంబుచేయ నను నంతస్సంస్థితంగాఁ దలం
పఁగనా బాహ్యసమాగమంబు మరలం బాటిల్లుదాఁకం బ్రభూ! 661

ఉ. నన్నెడఁబాయకుండెడు ననారతమున్ భవదంతరంగ మి
ట్లున్న తెఱంగు బోధపడ దొక్కపుడే మునిరాజికైన నీ
విన్నప మిప్డు చేయు టిదివింతగదా యనితోఁపవచ్చు నం
చెన్ని వచించుదానఁ బరమేశ్వర! కార్యము సంస్మరింపఁగన్ 662

చ. అనుపమరూపసంపద నహో! యని మెచ్చఁగఁ జేయు దీనినిం
గనుఁగొను; మేను గోరుటకుఁ గల్గినకారణ మెట్టిదంచు నీ
మనమె తలంచుఁ; గాల మిదిమంచిది యీమనరాక కెన్న నిం
కను బయనంబుఁ జేయఁ దగుకాలము చేరువయయ్యె నోవిభూ! 663

సౌమిత్రి రాక్షసమాయయని రామునకుం దెల్పుట.

ఉ. జానకి హెచ్చరింప విని క్ష్మాపతిపుత్త్రుఁడు రామచంద్రుఁ డె
ట్లైనను దీనిఁబట్టెదను హారితరంబగు దీనిరూప మం
చూనినశ్రద్ధఁ జాపము మహోత్తమసాయకముల్ గ్రహించి సుం
తైనను సంశయింపక ప్రయాణము చేయఁగఁ జూచి యంతటన్ 664

ఉ. దూరమునందునుండి యలధూర్తమృగంబును గాంచి రాక్షసుం
డారయ వీఁడు గాని నిజమైన మృగం బిది గాదటంచు గం
భీరనిజాత్మ నెన్ని రిపువీరభయంకరు రామచంద్రునిం
జేరఁగవచ్చి యత్న మది చిత్రముగాఁ గనుపట్ట నిట్లనున్. 665

మ. పరమస్వాంతుఁడవయ్యు నిత్తఱిని విభ్రాంతుండునాఁ జెప్పఁగాఁ
దరమా పద్ధతి దీనిఁ బట్టుకొని రా। దాత్పర్యముం గాంచు ట
చ్చెరువౌఁజుమ్ము! మృగంబు గా దిదియు సృష్టిం గంటిమే వింటిమే
ధర నెందైనను బూర్వ మీతఁడు సురేంద్రద్వేషి మారీచుఁడే. 666

ఆ. మాయపన్ని మనల। మ్రందింపఁ జూచెడు, దీనిఁబట్టు జతన। మూనవలదు
చూడు మిట్టిమృగము। క్షోణి నుండినయట్లు, చెప్పనైన వినము। శ్రీరఘువర!

క. సీతయు దీని నెఱుంగక, యే తెమ్మని కోరెనేమొ। యిది మాయయె దు
ర్జాతుఁడు మారీచుఁడె సు, మ్మేతీరుననైన మనల। నేఁచెడుకాంక్షన్. 668

క. హరిణాకృతి దాల్చెను శాం,బరిచే; నిది సత్య మనుచు। భావింపుము; భీ
కరులగు రాక్షసు లీవన, కురుకష్టము లొసఁగఁ జూతు। రుద్ధతు లగుటన్. 669

తే. సకల మెఱిఁగిన ప్రోడవు। చక్క నిప్పు, డిట్లు వచ్చినహరిణ మి।దెట్టి దంచుఁ
దలఁపవలదే మహాత్మ! నిస్తులపరాక్ర,మాధికా! మాటయియ్యది।యాత్మ నెన్ని.

క ఖరదూషణాది దనుజో,త్కర మెల్లను దెగిన నింకఁ। గార్యమ్మును శాం
బరిచేతనె సాధింపఁగ, సురవైరులు పూని రంచు। సొరిదిఁ దలఁపుమా. 671

క. జానకి యీవిషయము తన, మానసమున నెఱుఁగ కిద్ది। మంచిమృగం బం
చూనెను శ్రద్ధను దెమ్మని,యే నిన్నుం గోరె నంచు। నెన్నెద మదిలోన్. 672

క. మారీచుఁడె యీహనమం, దేరీతినొ దాఁగియుండి। యెల్లమునులకుఁ గీ
డూరుచు నహితంబని ముని,వారమె చెప్పంగ వింటిఁ। బలుసారు లిటన్. 673

తే. ఒండు మార్గంబునం బగఁ। బండ జేయ, శక్య మెవ్విధిఁ గామి నీ।చందమునను
మనల బాధింపఁగా వచ్చె।ననుచు దలఁతు, మీకుఁ దెల్పంగ శక్య మే।నాకు ననుచు.

క. హితమును సత్యమ్మును నయ,హితమ్మునౌ మాట లిట్టు। లెన్నియొ పలుకన్
క్షితిజాపతి విని మోమున, స్మిత మొప్పం బల్కె నిట్లు। సీతయు వినఁగన్. 675

క ప్రియసోదరా! త్వదుక్తిని, చయ మాదృతిపాత్రమె యగుఁ। సందియ మే లే
దయినన్ వినుమీ నానుడిఁ, బయిసాధ్యం బెద్ది యనుచు। భావింపు మెదన్.

చ. దనుజుఁడెయైనఁ గార్ముకవతంసము కోరిక లే ఫలించు; జ
క్కనిహరిణం బెయైన నొడికంబునఁ బట్టెదఁ; జిక్క దేని తూ
పునఁ బొరిపుచ్చి చర్మమును। బొందుగఁ దెచ్చి మహీజ కిత్తు; నో
యనుజ! తలంప నిప్పటిప్రయత్నము పండును రెండుభంగులన్. 677

సీ. మారీచుఁడేయైన। మనయత్న మిది రొట్టె,విఱిగి నేతిని బడు।విధమున ఫలి
యించుఁ గావునఁ నిప్పు। డేనుగార్ముకమూని, తీవ్రనారాచము।లోదీప్తుల వన
మెల్లను వెలిఁగింప। నేగెద; జానకీ, వాంఛిత మ్మిది తగు।భంగి సఫల
మౌనట్లు చేసెద। ననుజ!సమాహితచిత్తుండవై యిందు। సీత కేమి

తే. భయము గల్గకుండఁ బాణపాణివయి, యుండు మీవొ నేనొ యండనుండ
గలఁత నొందకుండుఁ గ్రవ్యాదవరతతి, చేర వెఱచు మఱియుఁ జెప్పనేల?.

చ. మెలఁకువమీఱ నుండుము నిమిత్తము లెంతయు భీకరంబులై
పొలయుచునున్న యిత్తఱిని భూసుతఁ జక్కఁగఁ గాచుటొక్కఁడే
తలపయినుండు కార్య మిది తమ్ముఁడ! నీకును భాగ మిందునుం
గలదని నమ్ము మేమఱకు కాఁగలదానికి దైవ ముండెడున్. 679

మ. నలుప్రక్కల్ నిజదృష్టికిం దగిలియున్నం జాలు నేభీతి రాఁ
గలుగన్ సోదర! నిన్నుఁబోలు సుమతుల్ కార్యానుకూలస్థితుల్
తలఁపంజాలుదు రైనఁ బెత్తనము వాత్సల్యంబు నీ రెండు నన్
బలుకం జేసెడుఁ బోయివచ్చెదను; నీభారంబు సర్వం బిటన్. 680

క. అనిపలుకుచు జానకినిం, గనుచుం దత్తేజమెల్లఁ గడుఁ జిత్రముగాఁ
దనలోఁ జొచ్చిన రాముఁడు, చనియెం గోదండ మూని క్ష్మాభరమూర్పన్. 681

క. వైదేహియుఁ దన తేజం, బాదయితునియందె నిల్పి యనుపమమాయన్
బ్రోదిగ ఛాయారూపం, బాదేహమె యిద్ది యనెడునట్టులు తాల్చెన్. 682

క. జానకి కాదిది నూతన, మై నెగడుశరీర మనుచు నారయ నెవ్వా
రైనను జాలని రీతిగ, నానెలఁతయు వెలసె స్వీయమై తగుశక్తిన్. 683

క. తలఁపఁ జరాచరరూపం,బులఁ దగుబ్రహ్మాండజాలముల నిర్మింపం
గలిగిన పరమేశ్వరికిన్, లలితాంబకు నిద్ది యొక విలాసము కాదే. 684

క. సౌమిత్రిని గనుఁ బ్రాముట, యామాయకు నెంతపని? విహాయసముఁ దగన్
భూమిగ మేదిని దివిగా, దా మార్పం గల్గుఁగాదె తతనిజశక్తిన్. 685

క. ఆతన్విని గని లక్ష్మణుఁ, డాతఱి నేమాత్రమైన ననుమానంబుం
జేతము పొందనియట్లుగ, సీతావననిరతి నుండెఁ జిత్ర మిదె కదా! 686

క. ఇసుమంత కాల మిట్లా, వసథంబున వారలుండ వచ్చినపని యె
ట్లు సమకుఱునో యను చింతన్, బిసరుహభవవంశవరుఁడు వేచియె యుండెన్.

చ. వనమునఁ జాల దూరము విభంగురశక్తినిబట్టి సీతనె
మ్మనమున కింపుఁగూర్ప రఘుమండనుఁ డెంచి మృగంబు వెంబడిం
జనిచని చేతఁ జిక్కినటు చయ్యనఁ బోయినయట్లు తన్నువం
చనమెయి దూరభూమికి నొసంగెడుమాయను జేర్చు నేణమున్. 688

క. పరికించి యుటజమున సోదరుఁ డేమని చెప్పె నట్లె తప్పక సాగెన్
హరిణం బిది దానవుఁడే, శరముననే సాధ్య మనుచుఁ జక్కఁ దలఁచుచున్.

చ. శర మరిఁబోసి రాఘవుఁడు చచ్చితి వింక నటంచు వైవనా
శరుఁడు తదీయవజ్రసమసాయక భిన్నహృదంతరాళుఁడై

హరిణశరీర మెట్లొచన । నాత్మశరీరము కన్పడంగ దు
ష్కరతర పూర్వజన్మకృత।కర్మవశంబున ధూతపాపుఁడై. 690

తే. తనువు వీడుచు శ్రీరాము । తలఁపు నెల్ల,సఫలముగఁ జేయఁబూనిన।చందమున ను
టజమునం జక్క వ్యాపింప । నిజపతిగళ, నినద మే యని సీత న।మ్మునటులపుడు.

క. హాసీతా! హాసీతా!, హాసౌమిత్రీ! యటంచు । నార్చి రఘువిభు
శ్రీసదనపదసుదర్శన, మాసక్తి నొనర్చుచుఁ దన।యసువులఁ బాసెన్. 692

చ. తనువుననుండి ప్రాణములు । తర్లుతఱిఁ రఘునాథునందె నె
మ్మనము విచంచలత్వమును । మానక నిల్వఁగఁ బ్రాణపంచకం
బును విడనాడి యెప్పటికిఁ । బుట్టువు రాని పదంబు నొందె నా
తని దగుపాటు చూచి ప్రమదంబున శ్రీరఘునాథుఁ డాత్మలోన్. 693

క. అవతారఫలం బిఁకఁ జె,చ్చెరఁ గన్పడఁ జేయు నదను.। చేకుతె ననుచుం
ద్వారపడక యొక్కశరమున, హరిణము వేఱొక్కదాని । నట వధియించెన్.

ఆ. దానిమాంసము గొని।తరలె నాశ్రమమును, గనఁగ; నంత నచట । జనకతనయ
గళరవంబు విన్న।కతన దుఃఖాంబుధి, మగ్నుఁడైనయట్లు । మార్పు నొంది 695

చ. పలుకులు తొట్రుపాటుఁ దెలు।పఁగ గనుఁదమ్ములనుండి యశ్రువుల్
జలజలరాల లక్ష్మణ! వెసం జనవయ్య మహాత్ముఁ డెంతొ యా
ర్తులఁబడి నన్ను నిన్ను వెత।తోఁ బలుసారులు పిల్చెఁగాదె య
ప్పలుకుల నీవుఱఁ వినియుఁ । బాటుతలంప వదేమి హేతువో?. 696

తే. ఎవరికర్మము వారల । కెట్టిఫలము, నీయఁదగియుండు దానినే । యిచ్చుచుండు
గాన నాకేల యీఘోర।కాననైక,వాసమని యెంచుచున్నావొ । మోస మూని.

చ. అని యిఁక నెన్ని యోగతుల । నాడిన లక్ష్మణుఁ డంబ! రాఘవుం
డన నొకమాయకుఁ దొరకు।నట్టిఁడె యేమిటి కీవిచార మం
చు నియతి నింక నేమొ రణ।శూరతఁ దెల్పఁగఁ బూనునంతలో
గినుక వహించి యమ్మఱఁది।కిఁ గడు నేవము దోఁచుమాటలున్. 698

చ. పలికిన నక్కటా! యనుచుఁ । బల్మఱుఁగుందుచు నిట్టిఘోరవా
క్కుల విసఁజాలు దుష్కృతిని । గొంకక ప్రాజ్ఞునిఁ జేసినాఁడనో
యలుక వహింపఁగూడ దిది । హానిని దేనినొ కల్గఁజేయఁగాఁ
దలఁచిన దేదొ కర్మ మని । తాఁ దలపోయుచు దుఃఖితాత్ముఁడై. 699

ఉ. జానకి పాదపద్మముల।సంగతి చూడ్కి చెలంగఁ దల్లి! నీ
యానతి నొదలంగొనుచు । నారఘురాముని గానఁబోయెదం
గానల నొంటినుండు నినుఁ। గాచెడివా రిఁక నెవ్వరంచు నా
మానస ముత్తలంపడెడు । మాటలు పెక్కిఁక నేల నీకడన్. 700

చ. చనియెద నిప్పుడే ఖలనిశాచరవర్గము నిన్ను నేఁచకుం
డను వనదేవతల్ దివిజనాథుఁడు లోనగుదిక్పతుల్ కృపా
వననిధులౌటఁ గావఁ దగువారు మహాత్ముఁడు రాముఁ డౌటనా
తనిదగునాజ్ఞఁ బూని నినుదానవబాధలు చేరకుండఁగన్. 701

తే. కాచుచుందురుగాక! వేగమున మేము
వచ్చునందాఁక యనిపల్కి వసుమతీసు
తోక్తులకు వెఱగందుచు నుగ్రవనము
దరియఁజొచ్చెను శ్రీరాముఁదలఁచుచు వగ. 702

సన్న్యాసివేషమున రావణుఁడు సీతకడకు వచ్చుట.

చ. ఉటజము వాసి లక్ష్మణుఁ డరయో! యిదియేమి ధరాత్మజాత యి
ట్లటమటఁ జెందెఁ గారణ మిదంచుఁ దలంపఁగఁ జాలఁ గర్మమే
యిట బలవత్తరం బనుచు నెంచఁగనౌ రఘునాథుఁ డేడ? యీ
యటవి భయంబు గాంచఁదగున ట్లగుటేడ? తలంపఁ జిత్రమౌ. 703

చ. సమయము దుష్ఫలంబు లిడఁజాలిన దంతికమందునున్నఁ జి
త్తము తగినట్లు వర్తిలఁగఁ దానె తలంచును విష్ణుశంకరుల్
కమలభవుండు నింకఁగలగాఢపరాక్రము లెవ్వరైనఁ గ
ర్మము ఫలమీక యుండఁగ మరల్పఁగ నేరరు సుంతయేనియున్. 704

క. ఈసిద్ధాంతము తప్పద, దేసరణిం గనిన నిప్పు డీకార్యమునన్
గాసింబడఁజేయంగా, నాసక్తిం బూనెఁ గర్మమని తలఁపనగున్. 705

చ. జనకకుమారి సాధుమతిసంపద గల్గినయన్నుమిన్న య
య్యును ననుగాసిపెట్టుటకె యోపికఁబూనెను గర్మసంగతిన్
వినఁదగనట్టిమాటలను వేలకువేలుగఁ బల్కె నక్కటా!
మనమున వీని నెన్న ననుమానము తోఁపదు కీడుమూఁడఁగన్. 706

ఉ. ఎన్నఁడుగాని యొక్కపలుకేనియు నాడదు కర్కశంబుగా
నిన్ని శరత్తు లయ్యెఁగద యీవనవాసము చేయుచుండఁ జా
చె న్నను బుత్త్రున; ట్లిపుడు చిత్తముకుందఁగఁ బల్కెఁ గర్మమీ
సన్నుతశీలఁ గీడ్పడ స్వశక్తి నొనర్చె నటంచుఁ దోఁచెడున్. 707

ఉ. రామునిగూడి యిచ్చటికి రాఁగ విదేహనృపాత్మజాత యీ
భూమి వసించియుండి ముదముం దళుకొత్తగ నేమొపల్కితిన్
నామదినప్డు రామగళనాదము కుందునుబొందఁజేసె నీ
వేమియు నావిచారమున నించుకకుందకు మంచుఁ బల్కుచున్. 708

క. కాకుత్థ్సవరునితో నపు, డీకరణిం బల్కవలసె నిదిదానికి నో
భూకాంత! కారణం బని, వాకొనఁగా విందునా? స్వభాగ్యవశమునన్. 709

ఉ. ఏమియుఁ దోఁపకున్నయది ౹ యీసమయంబునఁ దోఁచుచిహ్నముల్
భూమికుమారి నార్తిగమి ౹ బ్రుంగఁగఁ జేయఁగఁ బూనినట్టులే
వేమఱు తెల్పుచున్నయవి ౹ వింతగఁ దోఁచెడుఁ గాలశక్తి యిం
కేమనువాఁడ రాముకడ ౹ కేగెద నావెత దీఱ నచ్చటన్. 710

చ. అని తలపోయుచుం జనియె ౹ నారఘురాముని చెంతం; ౹ కంతటం
దనపని పండురాల మిదె ౹ దాపుననున్న దటంచు నెంచుచున్
దనుజవరుండు రావణుఁడు ౹ దానవరూపముఁ బాసి భిక్షుతం
గనఁబడఁ జేయురూపమును ౹ గైకొని జానకి యుండుచోటికిన్. 711

ఉ. అల్లనఁబోయె; జానకియు ౹ నాతనిరాకనె కోరుచుండి యు
త్ఫుల్లసరోజలోచనయె ౹ పోయని తోఁపఁగఁ జేయు చూడ్కులన్
మెల్లఁగఁ జూచె; రావణుఁడు ౹ మేలుపొసంగు నటన్నయూహ సం
ధిల్లఁగ నాశ్రమాంతరము ౹ ధీరతఁ జొచ్చెను గర్మసంగతిన్. 712

ఉ. సీతయు నాశ్రమాంతరముఁ ౹ జేరిన రావణుఁ గాంచి సత్కృపా
పూతదృగుత్పలంబులను ౹ బూజ లొనర్చెడుభంగిఁ జూచె; సం
ప్రీతమనస్కుఁడై యతఁడు ౹ పెద్దలమాటలు లోఁదలంచి భూ
జాత యొసంగుచక్కటికి ౹ సాధుతఁ గన్పడఁ బోయి యంతటన్. 713

చ. మునివరుపల్కు లప్డు తన ౹ మ్రోలశరీరముఁ దాల్చి ప్రోత్సహిం
చినయటులైన రావణుఁడు ౹ సీతనుగాంచి మహార్థసంయుతం
బనఘమునైన భాషణము ౹ నాయమ ముందటఁ జేయనెంచి యి
ట్లనియె మహాగుణాఢ్య యగు ౹ నార్యవొ వాణివొ విష్ణుపత్నివో!. 714

ఉ. అమ్మలకెల్ల నమ్మయగు ౹ నట్టి పరాత్పరవో యిఱుంగ; నే
యమ్మలు నిన్నుఁబోలరని ౹ యాత్మఁదలంచితి దర్శనం బిదే
యిమ్మహిఁ బుట్టినందులకు ౹ నిత్తఱి నయ్యెను; మున్ను గాన నీ
విమ్మెయి నిందునుండుటకు ౹ హేతువ దేదొ యెఱుంగ వేఁడెదన్. 715

ఉ. పాపులపెం పడంచి పద ౹ భక్తులఁగా నొనరించి వారివా
తాపములెల్లఁ దీర్చి ప్రమ ౹ దస్థితిఁ జేకురఁజేయు కాంతుతో
నీపుడమిన్ జనించిన మ ౹ హేశ్వరి వీవగు దంచు నెంతు నా
తాపములెల్లఁ దీఱె నినుఁ ౹ దత్పరతం గనినంతనే సతీ!. 716

మ. కరుణింపంజను నన్ను శూరుఁడని దోర్గర్వంబునన్ విష్ణునీఁ
గి రమాధీశునినైన లెక్కగొనకే ౹ క్రీడించుచందాన సం
గరముం జేయఁదలంచు జాల్ముఁడని చక్కం జిత్తమం దెంచి యీ
శ్వరివౌటం దగుశిక్షచేసి మఱి యీజన్మంబు రాకుండఁగన్. 717

చ. నిను గృహనాయికామణిగ నేఁ డొనరించి కృతార్థతం గనన్
మనమున నెన్నువాఁడ; సుకుమారివి కావున నిందునుంట చ
క్కనిపని కాదు లంకయనఁగాఁ ద్రిజగంబుల ఖ్యాతిగాంచు ప
త్తనమది నానివాస మట దానవరాజ్యరమన్ భుజింపుమా. 718

మ. యతివేషంబిది శాంబరీమహిమ నర్వాంబయ్యె నిన్ గానఁగా
నతివా! రావణుఁ డన్నపేరు మును వే యాలించియేయుందు; వ
ప్రతిమప్రాభవశాలినై మనుదు; నా పల్కుల్ మది న్నమ్మిన
న్నితరుంగాఁ దలపోయ కిత్తఱి మదీయేష్టంబుఁ దీర్పం జనున్ 719

ఉ. కాలము దుర్నిరీక్ష్యమయి కానఁబడుంగద దాని వ్యర్థమై
కూలెడురీతిఁ బుచ్చుటది కూడని కార్యము లోన నెన్నుమా
పాలితసర్వలోక వన భాసిలు నీవిటనుండు టొప్ప దా
ప్రోలు భవన్నివాసమునఁ బూతచరిత్రముగాఁ జెలంగుతన్. 720

మ. ధనముల్ ధాన్యములున్ విచిత్రమణిసంతానంబు వేర్గన్నయిం
కను రాజిల్లు విభూతి భార్యలను నీకమ్రాంఘ్రిపంకేరుహా
ర్చన మత్యాదృతిఁ జేయుపొంటె సకలారాధ్యా! మహాప్రీతి న
ప్పన మొప్పారఁగఁ జేయువాఁడ దయచేఁ బాలింపు నన్నార్తునిన్. 721

మ. వినుతాచారవిభూషితాంగి వనుచున్ వింటిన్ మునుల్ చెప్పఁగా
మును పే, దర్శన మెప్పుడౌనో యనుచున్ ముంగొంగుబంగారుగాఁ
దనివొందం దగు నెప్పుడో యనుచు నేతత్కాలపర్యంత మో
వనితారత్నమ! వేచియుంటి నిపు డావాంఛల్ ఫలించెం జుమీ!. 722

ఉ. నీదగువార్త యిత్తఱిని నే వినఁగోరెదఁ దెల్పవమ్మ నీ
వీదనుజాకరాటవి నహీనభయంకరసత్త్వనాదముల్
చీఁదఱఁగల్గజేయ నివసింపఁగ నేల? సరోజనేత్ర! ప్రా
సాదములందుఁ గ్రుమ్మఱఁగ స్వాంతమునం దలపోయుమా యిఁకన్. 723

మ నిను సేవింతురు నావధూమణులు దీనిన్ నమ్ము మో సుందరీ!
ననుభర్తన్ గ్రహియింపుమా వలదు చింతం బూన; నీనాథుఁ డే
పున నిన్నుం గొనిరాఁగ నోపఁ డనుచున్ బుద్ధిం దలంపం జనున్
నను నోర్వంగలఁడే మనుష్యుఁ డెవడైనన్ మూఁడులోకంబులన్. 724

జానకి రావణునకు బదులిచ్చుట.

చ. దితిజవతంసుఁ డివ్విధి నతిప్రియపూర్వక భాషణంబులన్
మతిఁగల వాంఛలం దెలుప మానిని యాతని భావికర్మమున్
జతనము మీఱ నెంచి తనసంగతి ముక్తినొసంగు నంచు నా
దృతిమెయి నిశ్చయించి బదులీయఁగ లోనఁ దలంచి యిట్లనున్. 725

ఉ. దానవనాథ! యల్పమగుదర్పమునన్ నిను నీవెఱుంగ కి
ట్లూనినశక్తిఁ బల్కితి వి దొప్పునె; రామునిధర్మపత్ని యె
ప్పైన నిజేశుఁబాసి నగరాంతరమందు వసింప నెంచునే
కానవు భావికర్మఫలకాండము నీవ వివేకి వౌటచేన్. 726

చ. దహనుని బాసి వేఱొకట దాహికయుండని యట్లు శ్రీరఘూ
ద్వహు నెడఁబాసి నే నిలువఁబాల్పడుదాననె? యేటిమాట లీ
యిహసుఖ మల్పమౌట విడి యెంతయు శాశ్వతమౌసుఖంబు నీ
దుహృదయమందు నొందఁ దమితో జతనంబు నొనర్పుమా కడున్. 727

సీ. విను నాదువృత్తాంత మనఘుఁడు జనకుండు, నాదఁగు రాజర్షి నాదుజనకుఁ
డనఁబడుఁ; దల్లి లోకనిచయముం దాల్చు, ధాత్రియే యగు; భూమిధవుల మేటి
యగుపంక్తిరథుఁడు నాకగు మామ తజ్జ్యేష్ఠ,తనయుఁడు శ్రీరాముఁ డనజగముల
ఖ్యాతనొంది మహేశుకార్ముకఖండన,మునఁ బేరుఁ గాంచినఘనుఁడు నాదు
తే. ప్రాణనాథుఁడు; తండ్రిశపథముఁ దీర్ప, నడవి కేతెంచు శ్రీరాము ననుసరించి
వచ్చితిని నామఱందియౌ వార్యవిక్ర,మాఢ్యుఁడగు లక్ష్మణుఁ డటంచు నాత్మఁ దలఁపు.

చ. అనుపమవర్ణహారి యగునట్టికురంగ మొకండు కన్పడన్
మనమునఁ గోరి వేఁడితిని మామకవాంఛను దీర్పఁ గోరి యే
చనియెను దానిఁబట్టుకొన జాపధరుండయి రామచంద్రుఁ డా
తనిగళనాదమో యనెడుధ్వానము వీనులఁ జొచ్చె నంతటన్. 729

ఉ. రాముని జాడఁ గన్గొన నరాతిభయంకరు లక్ష్మణున్ బలో
ద్దాముని బంపితిన్ వినుము దానవనాయక! వారువత్తు రి
ప్డే మృతినొందఁ గోరకు మహీన రఘూత్తమసాయకంబులన్
భీమజవంబులన్ గనఁగ వీఱిఁడివై తలపోయ కేగుమా. 730

మ. ననుఁ గొంపోవఁ దలంతువేమొ దనుజేంద్రా! యద్దియే నీకుఁ జ
య్యనఁ బంచత్వముఁ గూర్చుఁజుమ్ము రిపుసంహారార్థ మేతెంచె నీ
వనికిన్ రాముఁడు; దుష్టదానవులు దుర్వాంఛారతిన్ మ్రంది రొ
క్కని మేషంబునఁ బెక్కురవ్విధము నిక్కం బాత్మ నెన్నం జనున్. 731

ఉ. నీముఖలక్షణంబు లవినీతుఁడవంచొగిఁ దెల్పుచున్న వో
తామసవర్తనా! చని ముదంబున రాజ్యము నేలు మింక నీ
కామము తీఱుకాల మలకర్మవశంబున దాఁపరించునే
రాముని పత్నిఁ గోరెదవు రాక్షసరాజ! తలంచుకొమ్మెదన్. 732

ఉ. ఒక్కతె యున్నదిందు నని యూహ చెలంగఁగ నెంతువేమొ నే
నొక్కతెగాఁ గనంబడుదు నున్న దదంతయు నేనెగాదె? నా

యిక్కఁ దలంపరాదు పరమేశునకైన ని దిట్టిదంచు నీ
వొక్కఁడ వేటి లెక్క? చను మూరికి వచ్చినదారి రావణా!. 733

చ. అనుచు విదేహరాజతనయామణి పల్కెడునంతలోన నా
దనుజుఁడు పంక్తికంఠుఁడయి దారుణరూపముతోఁప నిల్చె; భీ
తినిగనినట్లు సీతయును ద్రెళ్లె ధరాతలమందు; నంతటన్
దనదగుభాగ్యలక్ష్మియని ధాత్రియటంచుఁ దలంచి మ్రొక్కుచున్. 734

చ. ధరణిని బెల్లగించి తనదర్పము గన్పడఁ జేయుచున్ మహా
త్తరజవమొప్పఁగాఁ జనియె దానవనాయకుఁ డంతలోన సం
గరమొనరించి కీర్తిఁగనఁగాఁ దగుకర్మ మొనర్చియున్న ప
క్షిరమణు లోఁదలంచుకొని సీతయు దీనతతోఁప నిట్లనెన్. 735

క. రాముని దేవిని జానకి, నీమెయిఁ గొనిపోవుచుండు నీనీచమతీ
భీమబలుం దలఁపడఁగా, నేమాన్యులు లేరొ యొక్కరే నీవనిలోన్? 736

చ. అనఘులు ధర్మమార్గరతు లాపదలం దొగిఁ బ్రాణబంధులై
చని యఘమార్గవర్తనులఁ జూపి నయంబును నిల్పుచుండు రం
చనుదురు లోకులిత్తఱి నహా! యొకఁడైనను రాఁడు వీనినా
పను ననుఁగాచి ధర్మమును బావనరీతిని నిల్ప నేలొకో?. 737

ఉ. ఆనుడి కర్ణరంధ్రములయందుఁ జొరన్ వడి మేలుకాంచి యో
దానవనాయకా! నిలువు ధర్మము గాదిటుసేయ నీకుఁ బెం
పూనినవంశమందు జనినొందితి వెల్లశ్రుతుల్ పఠించి తీ
మానితశీల దాశరథిమానిని దోడ్కొనిఁ బోవఁ బాడియే?. 738

ఉ. నీవిటుచేయ నెల్లరును నీవలె నిట్టియకార్యజాతముల్
కావలె నంచుఁ జేయుదురు గాదన నీకును శక్యమౌనె? పా
పావిలచిత్తవృత్తిఁ గొనననౌనె భవాదృశభూపరాజికిన్
బోవిడు మింకనైన రఘుభూపవరేణ్యుని నీ వెఱుఁగవో? 739

చ. తలఁచినయంతలోఁ బ్రకృతి తాఁ బొడసూపి తదిచ్ఛనెంచి రం
జిలఁగ నొనర్చులోకములఁ జిత్రగతుల్ దగఁ బెంచుఁ ద్రుంచు; ని
శ్చలుఁడయి సర్వసాక్షియయి సర్వఘనుండయి యద్వితీయుఁడై
జలరుహసూతిముఖ్యసురసత్తమపూజ్యుఁడునై చెలంగుచున్. 740

ఆ. నిర్వికారుఁ డనఁగ నెగడుచుండునుజుమీ, రాముఁ డట్టిఁడనుచు రాక్షసేశ!
తలఁపవయ్య! యతని ధర్మపత్నిని హరియింపఁ దలఁచు టనఁగ నెట్టిదగునొ?.

క. మనమునఁ జింతింపుము నీకు నెఱుంగంజాల నట్టిగూఢార్థమ్మున్
వినిపింప నేను బూనుట, దనుజేంద్రా! హాసమునకె తార్కాణ మగున్ 742

ఆ. ఆజటాయు విట్టులనునయవాక్కులు, పలుకుచుండ వినక పాఱుచున్న

దనుజు నిల్వరించి దర్పముచూపినఁ, గనలి యతఁడు రెక్కల నసిహతుల.

సీ. పడఁగొట్టి దుష్కర్మఫలము నొందఁగఁ జేసి, పోవంగ జానకి భూపవరుల
కాత్మమార్గముఁ దెలియంగఁ జేయఁగఁబూని, చీరచెఱంగును జించి యందు
రత్నభూషణములు రమ్యకాంతులనీన, ముడిచి యందొకచోటఁ బడఁగవైచెఁ
గపివరుల్ కొందఱు గడుఁ దేజములఁ బొల్చి, కూరుచుండుటఁ గాంచి కువలయేశు
తే. లచ్చటికి వత్తు, రామాట నందఁ జేయ
జాడ నెఱుఁగుదు రని యెంచి సరిగ వైవ
దానిఁగొని వార లొకచోట దాఁచియుంచి;
రంత లంకాపురముఁ జేర్చి యసురవరుఁడు. 744

చ. పరమపవిత్రమైన యొకభద్రవనంబునయందు శింశుపా
తరువునధఃప్రదేశమున దాంతిని గల్గ నొనర్చుతావునన్
నిరుపమసూక్ష్మసైకత వినిర్మలభూతలమందు నిల్పె; నా
శరవరుఁ డద్ది యర్చనకుఁ జాలినతా వనునమ్మకంబునన్. 745

ఉ. సీతయు రామురాకఁ దనచిత్తమునం దలపోయుచున్ బదా
బ్జాతయుగంబు నెమ్మది నెసంగెడు భక్తిఁ దలంచుచున్న య
బ్జాతభవాత్మజన్మసుతసంభవు రావణుఁ బ్రోవ నెంచి సం
జాతమహార్తిఁ గుందుగతి సర్వసురాళికిఁ దోఁపఁ జేయుచున్. 746

చ. దినములు పుచ్చుచుండెఁ దనతీరిది యంచు నజాదులే నెఱుం
గని కరణిన్; నిశాచరనికాయవిభుండును నిత్యపూజలం
దనుపుచుఁ జూచువారలకు దారుణవృత్తి గనంబడంగ నొ
య్యనఁ జరియించుచుండెఁ దనయాయువు తీఱెడుకాల మెన్నుచున్. 747

## శ్రీరామలక్ష్మణులు సీతను వెదకుట

సీ. ఘోరకాననమునఁ గూల్చి రాక్షసునిగఁ, దలపోసి యార్తనాదంబు వినిన
జానకి యెంత శోకానలదందహ్యమానమానసయయి క్ష్మాతలమునఁ
బడి పొర్లుచుండునో పాపాత్ముఁ డీరక్కసుఁడు నాదుగళరవ మడరునట్లు
పలుసారు లార్చె నీమ్ముల సోదరుఁడు పల్కె, నిది మాయ యగు నని యతని పలుకు
తే. లాదరింపక వచ్చితి నద్ది యల్ల
తగియె "బాలాదపి సుభాషిత" మ్మనంగ
నొప్పుస్మృతివాక్య మాలింప నోపనైతిఁ
గలుగఁగల దార్తి ముందు నిక్క మని తోఁచె. 748

చ. అని తలపోయుచున్ వడిగ నాశ్రమముం గనవచ్చుచుండఁగాఁ
గనఁబడియెన్ సహోదరుఁడు కార్ముకమానియు విన్ననైన మో

మునఁ జను దేరఁ జూచి తనముందటియూహయు తథ్యమైనరీ
తిని దలపోసి యిట్లనియెఁ దెంపరివై యిటు రాఁగఁ జెల్లునే?. 749

చ. పలికితిఁ గాదె హెచ్చరిక । భామిని గాచుచు నుండుమంచు నా
పలు కిసుమంతయైన జరపం దలపోయక రాఁగ నేల? వే
తెలుపుమ లక్ష్మణా! యనిన । దీనత మోమునఁ జిందులాడఁగాఁ
దెలిపె సమస్తవార్తలను । దెల్లముగా రఘునాథుఁ డంతటన్. 750

సీ. తా నెంచినది సాగెఁ । దమ్మునివగఁ దీర్పఁ, దగు కార్యమే చేయఁదగిన దంచు
యోజించి తనకు నెంతో దుఃఖమున్నట్టు, లభినయించుచునుండి యంతలోనఁ
దెలివొంది నట్లుగా దీనుఁడై నిలుచున్న, తమ్మునిఁ దనదు చెంతకును దిగిచి
వగ నొంద నీవంటి వానికిఁ బాడియే, యనుభవింపఁగఁ గలయవ్వి తప్పి
తే. పోవునే కర్మమార్గము । నీవెఱుఁగవె?
మున్నె తెల్పితిఁ గద కాలమును గుఱించి
తోఁచునట్టి నిమిత్తముల్ । తోడనె ఫల
మియ్యఁదగి యున్నవంచు నీ । వెఱుఁగవొక్కొ?. 751

ఉ. చింతిల నేమికల్గు నిఁక । సీతను గాంచుట కష్టమే యటం
చెంతయుఁ దోఁచుచున్నయది । యీసమయంబున దాని కీడుగా
వింతగఁ దోఁచుచున్నయవి । వేలకొలంది నిమిత్తముల్ మన
స్సంతయుఁ జేయివెట్టి కలయంగను ద్రిప్పినయట్టు లయ్యెడున్. 752

చ. త్వరపడిపోవు టొప్పు ఖలదానవు లెవ్విధి బాధఁగూర్చిరో
తరుణికి నంచు మార్గమునఁ । దాఁ జరియించినదెల్లఁ జెప్పుచున్
బరగునఁ బోయె రాఘవుఁడు । పర్ణగృహంబున; కద్దిశూన్యమం
దిరమటు తోఁచె లక్ష్మణునితీరు గనుంగొనఁ గోరి విన్ననై. 753

చ. హతరిపుఁడయ్యు రాముఁ డనయంబు విభీతుఁడునయ్యు నత్తఱిన్
గృతకవిచారముం గొనుచుఁ । గేవలపామరునట్టు లెంతయున్
వెతలఁ దపించుచున్ సహజువెంబడిఁ బోవుచు నిందునందు స
త్వతతుల కోడకే వెదకె । దారను గోల్పడినట్టు లార్తుఁడై. 754

### జటాయువు సీతవార్తం దెల్పుట.

సీ. ఆమహారణ్యంబునందు నాలుగుదెస, లాసీతఁ బరికించియవలఁ జనుచు
ఘోరపర్వతమట్లు । గూలినగృధ్రరా,జును గాంచి దితిజమాయనుగ నెంచి
శర మరివోసి లక్ష్మణ! చూడుమా దీని, నిపుడ గూల్చెదనన్న । నించుక విని
రఘురామ! నేదశరథునకు మిత్రుండ, నెఱుఁగవే నన్నుఁ బక్షీంద్రునిగను
తే. జానకిని బల్మిఁ గొంపోవు దానవేంద్రు, రావణుని నిల్వరించి ధర్మములఁ దెలిపి
సంగరముచేసి యిట్లైతి శరణ మీవె, నిల్వ వసువులు నామేన । నిముసమైన.

క. నీ కీవార్తం దెలుపం, గాకేమి శరీరమందు । గష్టంబున నె
ట్లోకదలకుండ నసువుల, నీకరణిన్ నిల్పినాఁడ । నిఁకఁ జను నవియున్. 756
క. తొలిమేనఁ జేయుపుణ్యము, బలిమిన్ నీదర్శనంబు । భవబంధగణం
బులఁ బాపఁ గల్గఁజేసెను, విలయము చెంతకును వచ్చె । వెడలెడు నసువుల్.
క. తావకకరసరసిజముల, నావపువుం దాఁకవయ్యా! । నా కిఁక జన్మం
బేవిధమున లేకుండును, బోవుదు సుఖధామమునకుఁ । బుణ్యనిధానా!. 758
క. రావణుఁ డవినీతుండై, నీసతిన్ బల్మిమీఱ । నీతులనే నె
న్నేవిధములఁ జెప్పిన విన; డావరవర్ణినియు నేడ్వ । నభ్రపథమునన్. 759
క. కొనిపోయె లంకకున్; నేఁ, జనియెద నీకరుణ స్పర్శ । శర్మముఁ జక్కం
గనుచున్ ముక్తిస్థానం, బున కని తేలంగనేత్ర । ముల వైచుటయున్. 760
క. సౌమిత్రి చెంతకుం జని, ధీమహితా! చెప్పు మతని । తెఱఁగెల్లఁ బురం
బేమహి నున్నదొ చేరఁగ, నేమార్గమొ తెల్పుమన్న । నిది యిట్లనుచున్. 761
క. పలుకంగఁజాల కతఁ డిమ్ముల రామునిఁ జూచునంత । మోము కృపకుఁ దా
వలమౌట రఘువరుం డిటు, పలికెన్ బక్షీంద్ర! ముక్తి । పథమునఁ బొమ్మా 762
క. నాదుకరస్పర్శంబున, నీదేహము తాపముక్తి । నెఱి నొందుచు నా
మోదంబుఁ గాంచుఁగావుత, మేదుఃఖము నిన్ను నొంద । దిఁక ననుచు దయన్.
క. కరమున మేనును నిమురుచు, నిరుపమసుఖధామమునకు । నీ వరుగు మిఁకన్
ధరఁ బుట్టువు లేకుండఁగఁ, వర మిదె నీకొసఁగినాఁడఁ । బక్షివరేణ్యా!. 764
క. మన మాపరాత్పరునిపై, నునుపుము ప్రాణాళి వెడల । నుంకించుతఱిన్
విను మదియె నీకు మోక్షం,బును గూర్చున్ వేఱుచింత । వూనకు మాత్మన్ 765
క. ఎట్టిండైనన్ మృతియం, దట్టిట్టు గదలక యుండ । నప్పరమాత్మన్
నిట్టలపుభక్తిఁ దలఁచుచు, నెట్టనఁ బ్రాణములఁ బాయ । నేర్చునయేనిన్. 766
క. పునరావృత్తివిహీనం, బనఁ దగుపద మొందు; నద్ది । యలవడుట యనం
దనప్రాగ్జనిసుకృత ఫలం, బని యెన్నం దగును గాదె । యమలమనీషా!. 767
క. కన్నుల నించుక విప్పుము, నన్నుం గనవయ్య! పక్షి । నాయక! దానన్
బున్నెము పండు నటంచనఁ, దిన్నఁగఁ గనుదోయి విచ్చి । దీవ్యద్రూపున్. 768
క. దాశరథిఁ గాంచి యత్యం,తాశన్ మాటాడఁబూని । యది మృతికాలం
బై శక్తి నడఁపఁ జూచుచు, శ్రీశా! నన్నేలు మనుచుఁ । జింతించు చెదన్.769
క. అసువుల వదలెను; రాముఁడు, వెస లక్ష్మణుఁ గాంచి కంటె । వీనితనువు ముం
దసదృశ గరుదోఘరుచిన్, విసుమానము గల్గఁ జేయు । విధమున నుండెన్. 770
క. ఇపుడెంతొ వెగటుపొడమఁగ, వపువు గనంబడెదుఁ జూడ । వచ్చున్ నీవీ
విపరీతపుఁ బరిణామము, బ్రపంచనైజంబ యయ్యెఁ । బరఁగు నవంబై. 77

క. జ్ఞానుల కిది విదితంబే, యైనను బామరులఁ బోలి యార్తు లగుదు రే
కాని మనంబునఁ గుందరు, దీనికి నై భేద మిదియె ధీరాజ్ఞులకున్. 772

క. సుకుచిరనయనంబులు భీ,కరములుగాఁ గానఁబడెడుఁ గంటివె సహజా!
పరమాత్మకళ తొలంగిన, శరీర మిది తుచ్ఛమంచుఁ జనుఁగాఁ జెప్పన్. 773

క. భూతహృదంతరమునఁ గల, శ్రీతరుణీ సహచరుఁడు వసించిన దనుకన్
బ్రీతి యలరారనుండున, దేతఱి నతఁడేగు నపుడె హీనతఁ గాంచున్. 774

క. కనుక నశాశ్వత మగునీ, తనువును బ్రేమించి శాశ్వతంబగు సుఖముం
గనఁజేసెడు నాముష్మిక,మును గోరందగు నటంచు బుధులందురుగా. 775

క. అప్పటిసుఖమునఁ గలతమి, నెప్పటికో వచ్చుననుచు నెంచుచుఁ బరమం
దుప్పతిలునాశఁ గనుటయె, తప్పని వచియింత్రు జ్ఞానధనహీను లిలన్. 776

క. ప్రతినిముసంబున మారెడు, గతిగల యీదేహము చిరకాలము నిల్వన్
జ్యూతిఁ గాంచకుండఁగాఁ దగు,నిత మెద్దియటంచు నెంచు విజ్ఞత లేమిన్. 777

క. కాయం బిదియే తగ నన,పాయంబని యజ్ఞు లట్టిపల్కుదు రింతే
న్యాయంబిది యని తలఁపగ, నేయనువున నేర రిద్ది యిటఁ గంటివిగా. 778

క. అంగం బదియేకద? మా,ర్పుంగన నేకారణంబు పొడకట్టు క్షణం
బుంగనిన నిద్ది స్పష్ట మ,గుంగద వాదంబు లేల కోరి యొనరుపన్. 779

క. బొడ్డున జందెముఁ దోఁపుచు, నడ్డముగాఁ బ్రశ్నముల మహానందముతో
నొడ్డుచు వాదించెడు నా,యొడ్డియలన్ బాగుచేయ నెవఁ డోపు ధరన్. 780

క. కనులకుఁ దోఁచుచు నుండినఁ, గనఁబడ లేదనుచు మించు గర్వంబున మా
ర్పును బొంద దీశరీరం, బనువారలకంటె నెవ్వ రజ్ఞులు తలఁపన్. 781

క. మన మీపుణ్యాత్మునకున్, బని దేని నొనర్చి మేలు పాటిలఁజేయం
గను జాలువార మోయని, మనమునఁ దలపోయ నొక్క మార్గముఁ దోఁచెన్.

క. జానకి జాడం దెల్పెను, దానవునిన్ నిల్వరించి దర్పముపొంగం
గా నెఱిఁ బోరాడి చనెన్, మానీంద్రులు పోవునట్టి మహితవసతికిన్. 783

క. కావునను యుత్తమర్ణుం, డీవిమలాత్మకుఁడు శాస్త్రహిత మిది మనమో
భావింపఁగ నధమర్ణుల, మేవిధమునఁ దీర్పఁదగుదు మీఋణము నిఁకన్. 784

క. తగునుపకృతి యోజించిన, నగపడ దేమాత్రమైన నట్లగుటఁ గృతం
బు గణించుచు నీతనువు వి,ధిగ దహియింతము సతంబు ధీనిధి నితనిన్. 785

క. స్మరియించుచుండ మీయొక, సరణియె ఋణమం దొకింత సమయింపఁగ నా
కరయం దోఁచినయది సో,దర! యింకొక తీరు లేదు ధర్మవితతులన్. 786

క. అనిపలికి లక్ష్మణునితోఁ, జనిశుష్కేంధనముల నొగి సమకూర్చి మనం
బునఁ బొంగుకరుణతో నా,తని కాయము నందుఁ జేర్చి తమి నిట్లనియెన్. 787

క. యాగంబుల ఫలకాంక్షం, బోఁగొట్టి యొనర్చినట్టి పుణ్యాత్ములకున్
యోగులకున్ యతివర్యుల, కేగతి తగియుండు నీకదే యలవడుతన్!. 788

క. పరమతముల దూషింపక, పరమేశ్వరుఁ డెల్లకడల భాసిలు ననుచున్
గురుమతిఁ దలఁచుచుఁ గర్మో,త్కరములఁ గావించువారిగతి నీకగుతన్!. 789

క. సర్వస్థలములఁ దగునా, శర్వుని హృదయారవిందసంస్థునిగాఁ దా
సర్వావస్థలఁ దలఁచుచు, నుర్వివదలువారిగతియె యొప్పును నీకున్. 790

క సతత మహింసావ్రతమే, మతిఁ బూని యొనర్చుచున్ సమస్తస్మృతిస
మ్మతసద్వ్రతములు సమములె, క్షితి నని తలపోయుచుండు ధీరులగతియా.

క. పరమాత్ముని తేజోరూ, పరమున్ సేవించుఁబూన్కి పాయక యంతః
కరణమునఁ దనరఁ బోల్చెదు, వరమతులకుఁ గల్గుసుగతి వఱలుత నీకున్.290

క. పంచమహాయజ్ఞంబుల, నించుకయున్ నియతిమానకే చేయుచు ధీ
చంచలత లేని విద్వ,త్సంచయముల కలరుసుగతి సమకుఱు నీకున్!. 793

క. పరపురుషుల స్వీయసహో,దరు లనుచుం దలఁచి తనదుధర్మముఁ బాలిం
చురతిం బూనినయుత్తమ,తరుణికి నగుసుగతి నీకుఁ దప్ప కలరుతన్!. 794

క. పతిసేవయె పరమేశ్వర,హితసేవ యటంచు నమ్మియెద దానికి నే
చ్యుతికల్గకుండ మెలఁగెదు,సతి కేసద్గతియె నీకు సమకుఱు నదియే!. 795

క. అనిపలికి యాశిషంబులఁ, గని యుత్తమలోకమునకుఁ గడుజవమునఁ బో
మ్మని పల్కుచు శుచి నిడి త,మ్మునితో నందుండె ధ్యానమున నియతుండై.796

క. అత్తఱి దివ్యజ్యోతి వి,యత్తలమున కెగసి భాస్కరాంగముఁ జొర నా
యుత్తమమండల మపుడే, యెత్తినభీతిన్ బథంబు నీయఁగ వెడలెన్. 797

క. ఎందుం జొచ్చెనొ యదియెఱుఁ,గం దరమే దానివిధముఁ గని లక్ష్మణుఁ డా
నందమ్మెదఁదోఁచిన రఘు,నందనునిం గాంచి యను వినయ ముట్టిపడన్. 798

క. పతగశరీరమునుండియె, యతిచిత్రజ్యోతిఁ యొక్కఁ డంబరమున ను
న్నతగతిఁ బర్వెన దెందే,వితమున నడఁగెన్ వచింపుమీ కరుణమెయిన్.

క. ధ్యానాసక్తిని నీవిం,దేనిలిచినదనుక దృష్టిహిత మగుచుండెన్
దానిని నీవున్ మానినఁ, గానంబడదయ్యె నేమికతమో తెలియన్. 800

క. అనుతమ్ముని గని రాఘవుఁ, డనియెం బుణ్యాత్ములెల్ల నంబుజసఖుఁ బె
ల్చనఁ జిల్చుకొంచుఁ బోవుదు, రనఘా! జ్యోతిస్స్వరూపమంది సుగతికిన్.

క. పక్షిగదా సుగతియె యని, వీక్షింపఁగఁ దగదు జాతివిషయ మ్మల్పం
బీక్షితి శీలమె ముఖ్యము, సాక్షిని బ్రశ్నింపనేల యది యెఱిఁగితిగా. 802

క. కులభేదము వ్యవహారం,బులకుం గా నేర్పడియె విముక్తికి నది యే
ఫలము నొసంగం జాలదు, సులలితశీలంబె ముక్తిచొ ప్పెఱుఁగఁదగున్. 803

క. జాతియు ద్రవ్యము సుగుణ,వ్రాతము గల్గంగఁ జేయ । వలనుగలవి యం
చేతఃకిఁ దలంపఁజన దొక, చేతశ్శుద్ధియె ఫలంబుఁ । జెందఁగఁ జేయున్. 804
క. మనమున నీవిషయంబును, దనివారఁగ నిల్పవయ్య । తమ్ముఁడ! యని యా
తనిశంక వాపి నీడజ, తనువున్ శుచిఁ బూదిచేయుఁ । దానిం గనుచున్. 805
క. వలగొనియె; నంతటన్ దివి,జులు పూవులవాన రాము । చుట్టుం జితిపై
నలరుచుఁ గురియించిరి రవ,ములు దుందుభివితతినుండి । బోరన వెడలెన్. 806

కబంధముక్తిప్రదానము.

సీ. అంత రాముఁడు తన । యనుజన్మునిం గూడి, జలతర్పణము చేసి । సాధుపక్షి
యుత్తమలోకము । లొందుఁగాకని పల్కి, జానకి వెదకునా । సక్తిఁ బూని
యందందు వెదకుచు । నవ్వలఁ జని యొక,భయదకాంతారము । వరుసఁ జూచు
చరుఁగుచుండంగ గుహయు నొక్కయెడఁ దోఁచె, నందుఁ బరీక్షింప । నాసఁ గొనిరి
తే. ముందుఁ బోయెడు లక్ష్మణు । నందునుండు, భయదదానవి యోర్తుక । వైళమ గని
నేన యయోముఖి యనుదాన । నిన్నుఁ గంటి, రమ్ము ననుఁ గూడి క్రీడింపు । సమ్మదమున.
క. నేనీకుఁ దగినదానను, గానన్ ననుఁ గూడి రమ్య । కాననముల నె
చ్చో నీకు నిష్టమో యట, జానుగ విహరింపుమన్న । సక్రోధుండై. 808
క. దనుజాంగనఁ గని విహరిం,పను గలదే మన సటంచుఁ । బటుతరఖడ్గం
బున దాని కర్ణనాసా,స్తనముల ఖండించె నదియుఁ । దత్తఱపడుచున్. 809
ఆ. వచ్చినట్టిదారిఁ । బట్టి పర్విడె; నంత, నందునందు వెదకి । యవలఁ జనుచు
సాధ్వసంబుఁ గూర్పఁ । జాలు నరణ్యానిఁ, గాంచి చొచ్చి వెదకఁ । గాఁ దొడంగి. 810
క. తరువరగుల్మసమూహాం,తరముల వెదకుచును బోవు । తఱిని నిమిత్తో
త్కరములు దుష్ఫలదములై, పరఁగం గని లక్ష్మణుండు । భ్రాతకు ననియెన్.
శా. అన్నా! యీయెడ దుర్నిమిత్తములు దు । ర్వ్యాపారుఁడౌ రక్కసుం
డున్నాఁడిందని తెల్పుచున్నయవి; యో । హో! చూడఁ జూడంగ ము
న్నెన్నండే వినిచూచినట్టివిగ లే । దిన్నాళ్లకుం దోఁచె నిం
దెన్నన్ సజ్యధనుర్మహేషువులమై । యేపుం గనం జేయఁగన్. 812
క. సిద్ధంబుగ నుండందగు, యుద్ధము సమకూరుఁ దప్పు । దుగ్రాటవిలో
నుద్ధతదానవు లుండుటఁ, బద్ధతి యిది దుర్గమ మను । పల్కు నిజమయా. 813
మ. అనుచుండన్ భయదాట్టహాసము కఠో । రాకారదైత్యాననం
బున వేవే జనియించి యెల్లకడలన్ । భూతాళికిన్ మృత్యువే
చనుదెంచెం గద యన్నయూహ గలుగన్ । జక్కంగ వ్యాపించె రా
మునిమోముం గని యింకనుం బలికె నో । భూపాల! యోజింపఁగన్. 814
క. ఈకడఁ దోఁచునిమిత్తము, లేకరణినొ కీడు నాకె । యిచ్చెడు ననుచున్
బ్రాకటముగఁ దెల్పెడు నీ,వో కార్ముకధారి వగుచు । నుండుము పూన్కిన్. 815

క. అని మఱియు నిట్లనుం బక్షినినాదము లట్టె యాలోకింపఁగ మనకే
వెనుక శుభం బొనఁగూడెడు, నని తెల్పెడు నన్న రాముఁ డాతనితోడన్.

తే. అచ్చటికిఁ బోయి యొకపాదనతివిశాల, వక్షమొప్పఁగఁ బెద్దదోవపువుతనర
నున్న దనుజునిగని చెంతకున్నెఱిఁజనఁ, గడుపులో నోరుగల్గురక్కసుఁడతండు

సీ. వక్షస్స్థలంబున వదనంబుగన్పడ, నందు నేత్రం బొక్కఁ డగపడంగఁ
జిత్రరీతిగనుండెఁ; జేతు లామడయంత, విరివిగా నమరంగ వివిధజంతు
పక్షుల లాఁగుచు భక్షించుచుం జెంతఁ, జేరినలక్ష్మణుశ్రీరఘువరుఁ
బట్టంగఁ దలపోసి పథమున కడ్డము,గా నిల్చె; నంత రాఘవులు క్రోశ

తే. మరిగి నిల్చిరి; వారి నిర్వురను గేలు, జంట నదుమంగఁ బూనె దాశరథులంతఁ
బరవశతఁ గాంచియుండ నవ్వడిదక్షణమ్ము,ననె మహీజాధవుండువిన్ననగుసహజు.

క. కనుఁగొనఁగా నాతండును, దనుజునకుం జిక్కినాఁడ ధర్మజ్ఞవరా!
నను వదలు మీతనికి నీ,వు నుపాయము గాంచి పోవఁ బోలుం జుమ్మీ. 819

చ. క్షితిసుతఁ గాంచి పత్తనముఁ జేరి నయంబునఁ బూర్వరాజరా
డ్వితతివిధంబునం బ్రజల విక్రమసంపద నీతిభాగ్యముల్
స్తుతికిని బాత్రమై తనర క్షోణిని బ్రోవుము సర్వకాలముల్
మతి నను సంస్మరింపు మిఁక మాటలుపల్కక పొమ్ము నీ వనన్. 820

శా. ఆమాటల్ శ్రుతులం జొరంగ మహితఖ్యాతిన్ విరాజిల్లుశ్రీ
రాముం డోసహజా! భయంపడకు వీరశ్రేణిఁ దొల్దొల్త నీ
నామం బే స్మరియింప నౌనుగద! దైన్యం బొందఁగా నేల? యు
ద్దామప్రక్రముఁ డీతఁ డేజతన మాత్మం జేయఁగా నెంచెనో?. 821

క. కనుఁగొంద మనఁగ నంతన్, దనుజుం డవ్వారిఁ గాంచి ధరణిప సుతులై
ధనువుల శరములఁ బూనుచు, వనమున కేకారణమున వచ్చితిరొక్కో?. 822

క. నాకాహారం బైతిరి, భీకరమద్బాహువులను బీడించి మిముల్
జేకొందుం జిఱుతిండిగ, నీకడ దప్పించుకొనఁగ నెటు శక్యమగున్. 823

ఆ. అనఁగ నాలకించి యాత్మఁ బొంగెడుదుఃఖ, మాపుకొనఁగ లేనియన్నఁ గాంచి
పలికె లక్ష్మణుండు భవ్యమతీ! రామ!, కరయుగంబుఁ దీవ్రఖడ్గనిహతి. 824

క. దునుముద మన రాముండును, సునిశితఖడ్గంబుఁ దీసి క్షోణీసురమా
నినిచయభక్షకుఁ డగునా, దనుజుని దక్షిణభుజంబుఁ దా ఖండించెన్. 825

క. అదిగని సౌమిత్రియు దుర్మదు సవ్యభుజంబుఁ ద్రుంచె దారుణరీతిం
బొదలెడు నసిధారను; దానఁ దనుజుఁ డత్యంతవేదనం గని యంతన్. 826

చ. కరయుగ మస్మదీయము నికామబలంబునఁ ద్రుంచియున్న మీ
రిరువురు నిందు రాఁగఁ గత మెయ్యది? యెవ్వరు మీరు తెల్పుఁడం

చురునినదంబుమీఁదఁ దము నొక్కటఁ బ్రశ్నముచేయు నాశరుం
బరమవిషాదచిత్తుఁ గని పల్కెను లక్ష్మణుఁ డాత్మవృత్తమున్. 827

చ. విను చతఁ దూరకున్న రఘువీరసహోదరుఁ డయ్య! నీవు కా
ననమున నిట్లు నీచమె యనందగుదేహము దాల్చి భూరజం
బునఁ బొరలాడుచున్ మృగసమూహముఁ బక్షులఁ జిక్కినట్టియె
వ్వానినయినన్ గ్రసించు ఘనవక్త్రమురంబున నొప్పుచుండఁగన్. 828

క. వికృతములగు నవయవములు, సకలజనోపద్రవంబు సమకూర్పఁగ ని
ట్లు కఠినకంఠస్వనమున, నికుంజమున నుండ నేల నీ వెవ్వఁడవో?. 829

క. తెలుపుము మాకని యడిగిన, పలుకులు శ్రుతులం జొరంగఁ బ్రాక్తనపుణ్యం
బు లలి ఫలింపఁగ శతమఖు, పలుకులు స్మరియించునట్టిభాగ్యము పొదలన్.

ఉ. శాపముతీఱుకాల మది సన్నిహితంబయియుంట నాతఁ డో
భూపకుమారులార! తొలిపుణ్యవశంబున మిమ్ముఁగంటి మీ
ప్రాపున శాపమోక్షము సుపర్వతఁ గాంచునదృష్టముల్ గనం
జేపడియెన్ గరద్వయ మసిం దునుమాడితి రిందుకోసమే. 831

మ. వినుఁడీ నాదునుదంత మోరఘువరా! వీరా! మనోజ్ఞంబనం
జను రూపంబున నొప్పువాఁడ నయియున్ సౌజన్యమున్వీడి భీ
తిని గల్పించు శరీరముం గొని మహాధీరత్వ మేపారఁగా
మునులన్ భీతి గనంగఁజేయుచు వనంబుల్ వేశ్మతం గాంచఁగన్. 832

క. తిరుగుచునుండితి నట్లొక, తరుణంబున స్థూలశిరుఁడు ధాత్రీసురమా
నిరమణుఁడు వనులఁ దిరుగఁగ, నరుదేరఁగ నతఁడు తెచ్చినట్టి ఫలములన్ 833

ఆ. మూలములను బుష్పముఖముల హరియించి, నాడ; దాన మానినాయకుండు
కోపమూని హేయరూపంబు దీని నే, ప్రీతి నొందు మని శపించె నంత. 834

ఉ. భీతిలి నేను మౌని నిటు వేఁడితి నాయపరాధ మిద్ధియా
నీతతిఁ బాచితంబు భవదిచ్ఛయె కావున నింకమీఁద నే
నేతతిఁ బూర్వరూపము గ్రహింతునొ దాని నను గ్రహింపు మీ
చేతము సంతతంబు దయచేత సుశీతలమౌఁగదా యనన్. 835

చ. క్షితిసురమౌని యిట్లనె వసింప మహాటవి కేగుదెంచి శ్రీ
పతిరఘురాముఁ డెట్టితఱి బాహుయుగంబును ద్రుంచి యగ్నికా
హుతిగను వేల్చునీతనువు నొయ్యనఁ జేపడు నీదురూప మ
ప్రతిమము నంచుఁబల్కెను గబంధత గల్గినకారణం బిఁకన్. 836

క. వినిపించువాఁడ రామా!, తనువిటు ఘోరంబుగాఁగఁ దగియు న్నపుడే
వనజాసనుగూర్చి తపం, బొనరిచితి మహేంద్రు గెల్చునూహ చెలఁగుటన్.

క. శతధృతిప్రత్యక్షంబై, వితతాయువు నాకొసంగె వీరవరేణ్యా!
యతిబలగర్వమ్ములు నజ్ఞత నాకుఁ గల్గె నంత శతమఖుతోడన్. 838

క. అనిసేయఁ బోయితిఁ దాన నతం డాగ్రహమువూని నాపై వజ్రం
బును వైచె దొడలు శీర్షంబును దానం గుక్షి నురము బోరనఁ జొచ్చెన్. 839

క. దానఁ గబంధుఁడనై నను, మానక వధియింపు మనుచు మఘవుఁ వేఁడం
గా నతఁడు చంపఁడయ్యెఁ, దా నబ్జజువరముఁ జక్కఁగఁ దలపోయుటచేన్. 840

క. అమరేంద్రుని వేఁడితి నో, యమర్త్యనాథా! యిఁకెట్లు లాహారము నా
కమరుం జెప్పుమ యన నా,దు మనవి యాలించి కరుణతో నీకరముల్. 841

ఆ. యోజనాయతమ్ము లొసఁగె వీని స్పృశింప,బోవఁ జాలవెల్ల భూతము లని
వరమొసంగె వీని వనభూమి కేతెంచి, రాముఁ డెపుడు త్రుంచు భీమగతిని.

క. శాపాంతమద్దియే యని, యాపురుహూతుండు తెలిపె నట్లాటను ద
చ్ఛీపతి నీవే యగుదువు, భూపాలకమాత్రుఁడ వెటు పురుషవతంసా!. 843

క. ఈతనువుఁ గాల్చి వైచిన, నాతనువు లభించుఁజుమ్మనంతరమే దేఁ
జేతనయిన సాయంబును, బ్రీతిగ నొనరింతు ననిన శ్రీరాముఁ డనున్. 844

క మావృత్తాంతము వింటివి, రావణువృత్తాంతము మఱి రామారత్నం
బెవడువున లభియించునో, యావిధముం దెల్పి పుణ్య మార్జింపు మనన్. 845

తే. పలికె నిట్లు కబంధుఁడు పరమపురుష!, యీశరీరముఁ జక్క దహింపఁబడినఁ
బ్రాక్శరీరము లభియించుఁ బరఁగునవల,దివ్యమగుజ్ఞాన మద్దానఁ దెరవవిధము.

సీ. వచియింపఁజాలుదు వైశమ దహియింపుఁ, డనఁ నన్నుదమ్ము లాయంగ మెట్లొ
పర్వతప్రదరంబుఁ బ్రాపింపఁగాఁజేసి, యనలున కాహుతి యానటు లొగిఁ
గావించి రంతటఁ గడు రమ్యమగువ్యోమ,యానంబునందుండి యార్యవర్య!
జానకి లభియించు సాధువార్త వచింతు, నాపదఁ గూరిన యట్టినృపతి
తే. తనకు నీడగువాని మిత్రునిగఁ జేసి, కొని స్వకార్యము సాధించుకొనుట నీతి
యట్లె భార్యాహరణరూపార్తి గనిన, వాఁడవగుటను నీవంటివాని నొకని.

క. చేకొనవలయుఁ సఖునిగ, నీకడకుం గొంతదూరమే గలపృథ్విఁ
వీఁక్షం దగుకపి యున్నాఁ, డాకపి నీవలెనె యార్తుఁ డని యెన్ను మెదన్.

తే. అన్న రాజ్యంబునందుండి యవలఁ దోల, గిరిపయిఁ వసియించుసుగ్రీవుఁడనఁగ
హితము గావించు నీవట కేగు మతఁడె, కపివరుల సీతకొఱకు నల్గడలకనుపు.

తే. అతఁ డెఱుంగని భాగంబు లవని లేవు, మార్గమిద్దానిఁబట్టి యామాన్యుఁగనఁగ
నేగుమా దివ్యవన మొక్కఁ డీనడుమను,గానఁబడునందునున్నట్టి మానివరులు.

క. సురపురి కరిగిరి; వారల, పరిచారిక శబరి యనఁగఁ బరఁగునది మహా
పురుషా! నిన్నుం గాంచియె, పరమపదంబుం గనంగఁ బయనము చేయున్. 851

తే. పంపయనెడు సరస్సు తత్పశ్చిమమునఁ, దగినదారినె పోవంగ । నగపడు నట
ఋశ్యమూకాద్రి కనఁబడు । దృశ్యములగు, భాగములుగల్గి వెలయు । నప్పర్వతంబు
క. అని తెలిపి యచటికరిగెడు, వనమార్గం బిదియె యనుచుఁ । బలికి తదాజ్ఞం
గొనిచనియె దేవలోకం, బున, కంతట రాఘవులును । బోఁబూని రాగిన్. 853
తే. త్రోవ నరుగుచు లక్ష్మణా! । రోష మెంత, చెడుగొ కంటివె గర్వంబుఁ । జెప్ప నేల?
యెంతవాఁ డెట్టులయ్యె నిం । కేమనంగ, వచ్చుఁ గర్మమునకు లేదు । భంగ మెందు.
క. పెద్దల నవమానింపఁగ, నెద్దియు మేలొందరా దహీనతరార్తుల్
పద్దుగొని చేరులక్ష్మణ, పెద్దల సేవింప రాని । ప్రీతియుఁ గలదే. 855

రాముఁడు తమ్మునకుఁ దపోనియమములఁ దెలుపుట

సీ. ఒకరిహానిం గోరి । యొనరించు తపమది, ఫలియించినఁ దుది దు । ష్ఫలముల నిడు
గావున సాధుసం । కల్పపూర్వకముగఁ, దప మొనరింపంగఁ । దగినఫలము
ల నిడు నయ్యది యుంచు । మనమునననుపమా, యీపల్కు లీతని । వృత్తినుండి
తెలుచున్న వికద! । తెలిపెద నొకవిష,యము; మంత్రముం గొను । నవసరమున
తే. నొరులకుఁ హాని చేసెదు । నుద్యమమును, బూనియుండినఫలమించు । కేనొసఁగదు
కాదుకూడ దటంచు నొక్కరణి నియతి, గని జపించిన నెత్తిగొట్టును నిజంబు.
చ. మనువన మంత్రమంచు బహు । మానమువిూఱ నెఱుంగవయ్య యో
యనుజ! తదీయసిద్ధికయి । యాత్మను దాఁచి దురూహ దానినిం
గొనఁదలపోయ దేవతయె । కుత్సితుఁ డీతఁ డటంచు నెంచి యా
తని వెఱపించు నెన్నియొప । థంబుల విభ్రమ మొందఁజేయుచున్. 857
క. దేవీమంత్రంబులు గొన, నేవేళనొ మోసగించు । నెవ్వనినైనం
గావున వానిని వదలం,గావలయు నటండ్రు మూర్ఖ । గణపతు లొకటన్. 858
క. మనువెద్దియే నుపాసకు, మనసునఁ గలకాంతఁ నెఱిఁగి । మన్నించుటయో
మనముం గలవిలపాటొం,దను జేయుటయో యొనర్చుఁ । దగునటు సహజా!
క. తనకాంతఁ దాఁచి మంత్రం,బును దిట్టిన నేమిఫలము । పుట్టును? చిత్తం
బునఁ గల్గుకాంతఁ దేవత, కనుఁగొనఁగాఁ జాలదే? య । ఖండమహిమచేన్. 860
చ. కనుక నుపాసకుం డమల । కాంతను బూని జపింప ఘోరమా
మనువని పేరుగాంచినను । మంచిఫలంబుల నిచ్చు; దుష్టవాం
ఛను గొనఁ దూలఁజేయు ని । జసత్యము దీని నెఱుంగ లేకయే
జను లొగి దూఱుచుండ్రు మను । జాలము దుష్ట మటంచు స్వేచ్ఛగన్. 861
సీ. వశ్యమంత్రమ్ముల । వరుస లోభముపైన, మారణముం జేయు । మంత్రములను
మాత్సర్యగుణముపై । మహిమచే వెలుఁగునా,కర్షణమంత్ర ని । కాయములను
మోహమ్ముపై నిట్టు । లూహించుచుం బ్రయో,గింపనొ దాననె । పెంపుగలుగు
స్త్రీవశ్యమును గోరి । చేయు నుపాసన, తన్ను నాశము చేయఁ । దలఁచుఁ గాని

తే. శుభ మొసంగఁగఁదలఁచు నేసురలుగారె, మన్వధిష్ఠాన దేవతలో మహిమ వెలయఁ
దెలిసికొనఁ జాలరొక్కొ కాంక్షల నుపాస, కుని మదిం గలవానిని గూఢములను.

చ. తనమదిఁ గల్గువాంఛయె నిదానము తత్ఫలసిద్ధి కంచునా
త్మను దలపోయఁగా వలయు మంత్రముఁ దిట్టిన నేఫలంబు గ
ల్గును? గడు నీచబుద్ధిఁ గనుకోర్కు లవెట్లు ఫలింపనేర్చు దీ
నిని దలపోయువాఁడు గననేరఁడు మంత్రము దూఱుమార్గమున్. 863

క. ఈవిధమును మది నిల్పుము, పోవుద మిఁక శబరిఁ జూడఁ బూనిక నని సీ
తావిభుఁడు సహజుతోడన్, జీవనసాంద్రస్థలములఁ జిత్రతరువులన్. 864

మ. కనుచుం బోవ మహాతపోవనము వృక్షవ్రాతసాంద్రంబుగాఁ
గననయ్యెం బ్రమదావహం బగుచు నాకాంతారమం దాశ్రమం
బునయోగాభిరతిం జెలంగువనితం బూతాత్మఁ గాంచెన్ మునీం
ద్రనికాయైకపరాయణన్ శబరి నాదైవాఱు సాధువ్రతన్. 865

ఉ. కాంచినయంతనే మనుజకాంతుఁడు రాముఁడు చెంతకేగి నీ
యంచితయోగనిష్ఠ ఫలమందెనె విఘ్నము లేవిలేక సే
వించితివే మునీంద్రుల వివేకము పేర్మి వచింపు మన్న నా
లించి మహాత్మ! నీవయినలీలల నేర్తునె యే నెఱుంగఁగన్. 866

చ. అనిశము నభ్యసించెడు మహాత్తరయోగఫలంబుగాఁగ ద
ర్శనము నొసంగి తీవు ఫలసంతతి దీనికిఁ దుల్యమౌనె; ము
క్తిని గనఁబోదు నింక మునిధీరుల వెంటనె పోవకుండ ని
ల్చినకత మేమియం చనెదొ శ్రీరఘునాయక! విన్నవించెదన్. 867

ఆ. చిత్రకూటగిరి వసింపఁగ నీవేగు, దెంచినట్టి పుణ్యదినమునందె
యిందుఁ గల్గుమాను లేగిరి వ్యోమయానములఁ బుణ్యలోకసమితికెలమి.

క. ననుఁగాంచి యనిరి శబరీ!, నినుగానన్ వచ్చుఁజుమ్ము నీ రేజాక్షుం
డనుపమ కరుణాసింధువు, మనువంశసముద్రశశిసమస్తవిదుండున్ 869

క. యోగైకఫలము మఱియును, యాగాభిరతుండునైన యా రాముని న
భ్యాగతపూజలఁ దన్పుము, యోగిని! నీకిచ్చు ముక్తి యుండుమ యిందున్.

క. అని తెల్పి చనిరి సత్ఫలములను బొందఁగ నూర్ధ్వలోకములకు రఘుపతీ!
నినుఁగాంచి యాతిథేయంబునఁ గొల్వఁగ నెంచుదాన భూతశరణ్యా! 871

క. పంపాతీరస్థలముల, నింపారుఫలాళి మదికి నింపగువానిన్
సంపాదించితి రామా!, యింపుగ భుజియింపవయ్య యినకులతిలకా! 872

తే. భాగ్యవశమున నీపాదపంకజములఁ, గాంచఁగల్గితిఁ బూజింపఁగాఁ గలిగితి[ము.
నింతియే చాలుఁగృపఁజూడుమీ ననునిఁక, బోయెదన్ నీవు సెలవీయఁ బుణ్యపద

మ. నిను సేవించినవారికిం గలుగవే నీరేజపత్త్రాక్ష! పా
వనలోకంబులు; మానుషాకృతిని విశ్వంబందు నిండున్ దురా
త్మనికాయంబు వధింప శాశ్వతముగా ధర్మంబు నిల్పన్ మనం
బున నూహించి చరింతు వంచు వినుతిన్ భూతేశ్వరా! యీశ్వరా! 874

క. నే నీకుఁ జేయందగినది, కానన్ నినుఁ దృష్టిదీఱఁగంటిన్ వింటిన్
నీనుడులు పనుపు మీశ్వర!, నే నరిగెదఁ బుణ్యలోకనిచయముఁ గనఁగన్.

మ. అని ప్రార్థింపఁగ యోగినిన్ శబరి నెయ్యంబొప్పఁగాఁగాంచి యి
ట్లనియెన్ రాఘవుఁ డమ్మ! యింకఁ జనుమా యాత్మేచ్ఛమై శాశ్వతం
బనువిఖ్యాతిని గన్నచోటికి జగంబం దెన్నఁడున్ నీయశం
బున కేహానియు రాకయుండఁగ వరంబుం బ్రీతి నే నిచ్చితిన్. 876

క. చిత్తమ్మున నీకోరిక, హత్తింపకయున్న దానవట్లౌట సతీ
యుత్తమశర్మము గని యావృత్తియె యిఁక లేనియట్టి హితపదమందున్ 877

క. స్మరియించుచు నన్నున్ సుస్థిరముగ నానందవారిధిన్ మున్గుచు వే
సరక వసింపుము పొమ్మిఁక, గురువరసందేశమటు సుగుణగణనిలయా! 878

క. అని శ్రీరాముఁడు పల్కిన, విని శబరి వినీతయగుచు వింతగఁ గుబుసం
బును ఫణి వదలెడుచందం,బున దేహము వాసి యరిగె పూజ్యవసతికిన్. 879

తే. దివి విమానము దోఁపంగ దీప్యమాన, తనువు చెలఁగంగ దివిజులు వినుతిచేయ
రామ! పంపాసరోవరభూమి కరుగు, మందు సుగ్రీవుఁ గూడంగ నగును బిదప.

క. అవతారఫలముగా నా, లవణాబ్ధిం దాఁటి త్రిదశులకు వైరిగఁ బా
పవిహితకృత్యము లొనరుచు, నవినీతు వధింపనౌ మహాత్మా! యనుచున్. 881

ఆ. తెలిపి వ్యోమయానమెలమిఁ బోవఁగఁ బోయె,నంత రామచంద్రుఁ డనుజుఁ జూచి
కంటివిగద శబరి గైకొన్నమార్గంబు, సుంత వినుము నీవు శుభచరిత్ర! 882

సీ. సాధుమానులసేవ సల్పి సదాచార, పద్ధతుల్ నేర్చి పట్టుదలను
వానిని వదలక వర్తించి యవ్వల, యోగమార్గము శ్రద్ధతో గడించి
యంచితముగ నభ్యసించి జితేంద్రియ, వృత్తి సంపాదించి యుత్తటి నిటు
లాతిథేయమ్మున నర్హాపద్ధతి మీఱ, మనలఁ బూజించి చొక్కనిపలుకులఁ

తే. గార్యముం దెల్పి పుణ్యలోకముల కరిగె, శబరి నీచాన్వయమ్మున జననమంది
యుండియున్ సాధుసంగతి నొందియిట్టి,యపునరావృత్తిపదము నేయందఁగలిగె.

చ. మనుజుఁడు సాధుసంగతిని మానసశుద్ధిని గాంచు యోగని
ష్ఠను బరమేశ్వరుం దెలియఁజాలును శాస్త్ర మెఱింగి నంతనే
గనఁదగు నెట్లు సత్ఫలము కష్టపరంపర కోర్చి యోగవి
ద్యను గ్రహియించి దాని మరియాదను దప్పక యభ్యసించుచున్. 884

ఆ. ఇంద్రియములనెల్ల నెసఁగు శ్రద్ధ జయించి,యీహలెల్లఁ బాయ నేగుఁ బరమ

పదమునకును, గానఁబట్టుదలం బూని, యోగ మభ్యసింప నొప్పు ముక్తి. 885

తే. కుడిచికూర్చుండి మాటలు గొదువలేక, యుండ వదరెడువారల కురుఫలంబు
లొదవునే మోక్షమనునది సదమలాత్మునకు లభించును వేఱొకనికి దొరకునె.

క. సోమరిపోతులు కొందఱు, తా మిలఁ బండితుల మనుచుఁ దలఁచుచు మఱియుం
బామరుల మోసపుచ్చుచు, హేమము నార్జించి నిరయమే కాంతురుగా. 887

సీ. వేషమ్ములను దాల్చి వీఱిఁడులను మోసపుచ్చినచో ముక్తిఁ బొందుటెట్లు
లేనివిజ్ఞానంబు నూని విత్తముఁగూర్పఁ, బరమపదం బదిపడయుటెట్లు
మంచియాచార్యులమంచు వంచించిన, నానందసాగర మందుటెట్లు
వాదంబులనుగెల్చి వసుధ గర్వించిన, సతతశర్మము గనఁజాలుటెట్లు

తే. సాధుచరితా! మనస్సు వశంవదముగ, నిలిచి పరమేశుఁ గొల్వక లలితముక్తి
పదముఁ బ్రాపింతు మనియాశపడిన నెట్టి, ఫలముగల్గదు దుర్గతులలముకొనును

వ. అనిబోధించుచుం జనిచని మహారణ్యంబులు గడచి పంపాసరోవరంబుఁ జేరి
తత్తీరంబున లక్ష్మణునితో నుపవిష్టుండై యవతారఫలంబుఁ జూపుసమయంబు
నకు వేచియుండె. 889

క. సురవిహితాచారా! భూ, సురమానిహితాచరణవిశుద్ధచరిత్రా!
కరధృతమనుజాకారా!, పురుషోత్తమ ధర్మకర్మపూర్ణవిచారా!

చ. అతిశయమోహకర్దమ మహాంబుధిమగ్న జనవ్రజావనా
దృతిసుగృహీతకర్బుర మహీధరసన్నిభపోత్రిరూప! దు
ర్మతవిషభూజ మూలగణమర్దన తీవ్రకుఠార! భక్తస
ష్మతధృతగాత్ర! దేవమునిమండల పాలనసంతతప్రియా!

సింహరేఖ.—

మేరుశైలనాథ ధీరా, ఘోరదేవవైరిపాపా
చారకర్తనాతిమోదా, సారధర్మగేహవాసా.

గద్య. ఇది శ్రీమత్త్రిపురసుందరీకరుణావాప్త గీర్వాణాంధ్రకవితాప్రాభవ కాశ్య
పాన్వయప్రభవ, శ్రీజనమంచివంశాంబురాశి కుముదినీమిత్ర, సుబ్రహ్మణ్యమనీషి
పుత్త్ర, తాండవకృష్ణాపరాభిధేయ, శేషాద్రినామధేయవినిర్మితంబైన శ్రీధర్మ
సారరామాయణంబను మహాప్రబంధంబునందు నారణ్యకాండము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

# శ్రీధర్మసారరామాయణము

## కిష్కింధాకాండము.

శ్రీవర! నిజపద సరసిజ
సేవానిరతాశ్రితాళిచిత్తనివాసా!
పావనచరితా! సూనృత
భావామోదా! పరంతపా! శ్రీరామా! 1

వ. మహాప్రభూ! తరువాతివృత్తాంతం బవధరింపుము.

### సుగ్రీవుఁడు రాముం గాంచి భీతిల్లుట.

చ. అనుజునితోడఁ బంప యనుఖ్యాతి నెసంగుసరస్సు నొద్దునన్
వనిత వచించినట్టినుడి వారక నెమ్మది సంస్మరించుచున్
జనకజవార్తలం దెలియఁజాలు నుపాయ మిఁ కెద్దియంచు నె
మ్మనమున నెంచుచున్ నిలిచె మానవనైజము వెల్లడించుచున్. 3

క. దానికిఁ జేరువ భూమిం, గానంబడుచుండు శిఖరకాండయుతంబై
మానితము ఋశ్యమూకము, నా నగ మొక్కండు మానినాథాశ్రయమై 4

ఉ. ఆనగవర్యమందు సుగుణాకరుఁడై భుజవిక్రమంబునం
దానగభేది నుద్దియయి యర్కతనూజుఁడు తా వసించుఁ బెం
పూనినవాఁడెయయ్యుఁ దనకొప్పనికాలము ప్రాప్తమౌట స
మ్మానము తూల మిత్రకపిమండను లండను బాయకుండఁగన్. 5

శా. ఆనాఁ డాతఁడు తద్గిరీంద్రమున మిత్రాళిం దమింగూడి యొం
తేనైజం బగుచాపలంబు తగఁగా నిచ్ఛారతిన్ దిర్గుచున్
భూనాథోత్తమపుత్రయుగ్మమును రూపుం గాంచు శౌర్యం బనం
గా నొప్పారుధనుశ్శరాంకము వెసం గాంచెన్ భయం బుబ్బఁగన్. 6

చ. శతమఖుసూనుఁ డానృపతిసత్తములం దనుఁ జంపఁ బంపె నీ
క్షితిధర మెక్కరామి నని చెందిన భీతి వడంకి వర్ణ్యమౌ

మతివిభవంబు దూరమయి మ్రాన్పడఁగాఁ బరువెత్తె వేలుప
ర్వతమున దాఁగియుండుటకు వానిపిలుందనె వానరాగ్రణుల్. 7

చ. పఱుగిడి;రంత స్పర్శనుని పట్టి మహామతియయ్యు నైజమున్
ద్వర విడనాడఁజాలమిని వారలవెంబడి పోయి నిల్చి యి
క్కరణిని బాఱనేల యని క్రమ్మఱి చూపుచెలంగ నాత్మలో
సరసి కపీంద్రుఁ గాంచుచు నయంబున నిట్లని పల్కె నేర్పునన్. 8

ఉ. వానరనాథ! యీవఱకుఁ బ్రాభవ మింతయులేక సాధ్వసం
బూనిన మానసంబుతగ నూఱటమాని పలాయనక్రియం
బూనిన దింతెచాలు భయముం గను కారణమేదొ తోఁప దె
ట్టినను నాదుచిత్తమున నయ్యది తెల్పుము చెప్పవచ్చునేన్. 9

మ. అనుమాటల్ చెవిసోఁక నర్కసుతుఁ డార్యా! చూచితే పంపచెం
తను వెల్గొందెడు రాజసూనుల మహాత్రాసంబు గల్పించు బా
ణనికాయంబు ధనుర్వితానము మహానిస్త్రింశపూగంబు దా
ల్చినయమ్మేటుల; నన్నుఁ జంపుటకు వాలిన్ బంపె నిచ్చోటికిన్. 10

క. అరుదెంచి రనుచు నెన్నుము, ధరణీశులు పన్నుచుందు తంత్రము లిట్లే
పరఁగును; నీ వెఱుఁగవొకో, వరమూర్తులఁ జూడు మెట్లు భాసిలువారో? 11

క. అనుటయు హనుమంతుం డి, ట్లనియెన్ భయహేతు వించుకైనను నాకున్
మనమునఁ దోఁపదు వారలఁ, గనినన్ సంతోష మొలసెఁ గంజాప్తసుతా! 12

ఆ. శ్వసనసూనుఁ డిట్లు చక్కఁగాఁ బల్కిన, పలుకు లాలకించి భానుసుతుఁడు
దీనవేషమూని తెలియంగఁదగువారి, భావములను దొలుతఁ బవనతనయ!

చ. తనువుల దృగ్విశేషములఁ దత్పరతం గనిపెట్టి యేతలం
పున నిట వచ్చినారొ తగుపోలిక మాటల వారిభావముల్
కనుఁగొని మాటలాడఁ దగుకాలముతోఁచిన నాశుభార్థమై
వినయమునన్ భజించి తగువేగమునం జనుదెమ్ము పావనీ! 14

### హనుమంతుఁడు రాముం గానఁబోవుట.

చ. పరులహృదంతరాళములఁ బర్వినయూహల నెల్లఁ దేటఁగా
నరసి గ్రహింపఁజాలు మహిమాఢ్యుఁడ వీ వని సాగనంప దా
శరథులఁ జూచువేడుక యొసంగఁగఁ బోవఁదలంచె; దాన భా
స్కరసుతరక్షణంబు కొనసాగు నటన్నతలంపు గల్గగన్. 15

చ. రవిసుతునానతిం దనశిరంబునఁ దాలిచి మ్రొక్కి పోవుచోఁ
బవనతనూజుఁ డెంచె మది భానుజుకోరికఁ దీర్పఁజాల దీ
యవయవరాజిగల్గినమదంగము దీనిని దాఁచి భిక్షుమూ
ర్తి వటులఁ బోయి చెప్పఁదగుతీరునఁ జెప్పి ఫలింపఁ జేసెదన్. 16

క. రూపంబది సంపూజ్యము, తాపసులకుఁ గూడఁ గాన ǂ దానిం గని యా
భూపకుమారుల కడ కిపు, డే పోయెద ననుచు నట్టుǂ లే రూపమరన్. 17

చ. చని రఘుభూపవంశ్యులను ǂ జాపశరాసిముఖాయుధాళిఁ దా
ల్చినమునివేషులం గని స్వǂశీర్షము వంచి నమస్కరించి యి
ట్లనియె మహాత్ములార! సురǂలట్లు మహీశులపోల్కి సద్వ్రతం
బునఁ దగుమౌనులట్లు తనుǂవుల్ చెలువారఁగ నీవనంబునన్. 18

చ. తిరుగుచునున్న మీ రెవరొ ǂ తెల్పుఁడు; మి మ్మొగిఁ గాంచి యామృగో
త్కరములు భీతిఁ బాటెడి జǂగంబుల నెల్లను బ్రోవఁజాలు మీ
రిరువురు మౌనివేషముల ǂ నేటికిఁ దాల్చితిరో స్వరూపమే
స్థిరమహిమంబుఁ దెల్పునని ǂ చెప్పెడు వేదము లట్లు మీరునున్. 19

క. అవయవసంస్థానంబుల, దివిజుల మించంగఁజాలి ǂ తేజోరాశిన్
బ్రవహింపఁజేయుచున్ మా, నివరులఁ బోలుచును గాన ǂ నిలువఁగ నేలా? 20

క. తెలుపుఁడు నావగు ప్రశ్నం, బులకు సదుత్తరము మీరు ǂ పూజ్యు లటంచుం
దెలిపెడు మీఘనతేజం, బులు నాపయిఁ గల్గుప్రీతిఁ ǂ బుధనుతులారా! 21

ఆ. ఉత్తరమ్ము లిందు ǂ చిత్తముత్తలపడు, వానివినఁగ ననుచుఁǂబల్కి మఱియుఁ
నిట్టులనియె వానǂరేంద్రుఁడు సుగ్రీవుఁ, డద్రి నిందు నుండుǂనన్న తఱుమ 22

క. మతిమంతుఁ డతఁడు వీరుం, డతులితగుణశాలి నేను ǂ నాతనిసఖుఁడన్
యతివేషము కార్యార్థవి, ధృత మని తలపోయఁజనును ǂ ధీనిధులారా! 23

క. అనిలాత్మజుండ వానరుఁ, డనఁగాఁ దగువాఁడఁ గోరిǂనట్టులు రూపం
బును బొందఁజాలుదున్ వల, సినచోటికిఁ బోవ నేర్తు ǂ శ్రీనిధులారా! 24

తే. ఇంతమాత్రముపల్కి మǂఱేమియనక, యూరకుండెను; శ్రీరాముǂఁడూహ చెలఁగఁ
దమ్మునిం గాంచి పల్కె నీǂతనిచరిత్ర, మెల్ల వింటివి కద యీతǂఁ డెంతొ హితుఁడు.

సీ. మతిమద్వరేణ్యుఁ డీǂమారుతి, వేదశా, స్త్రజ్ఞాననిధి సాధుǂజనహితుండు
సూనృతవాది యింǂచుకయు వంచన చేయు, నూహయే లేకుండǂనుండు ననుచు
ముఖలక్షణంబులే ǂ ముందుగఁ దెల్పెడు, మనకు హితుండనుǂమాట నమ్మి
పలుకంగఁ దగినది ǂ తెలుపుమా యని హెచ్చ, రింపంగఁ రామాజ్ఞǂనింపుమీఱ

తే. సాగినట్టి వృత్తాంతము ǂ సర్వ మింత, దనుక నిట్లని తెల్పి మేǂమును గపీంద్ర
సద్గుణంబులు విని చూడఁ ǂ జనునటంచు, వచ్చియిందున్న వారమో ǂ వానరేంద్ర!

క. సౌమిత్రి యిట్లు తెల్పఁగ, నామాటలఁ నాలకించి ǂ యర్కతనూజుం
డా మహి నదృష్టవంతుం, డామఘువుని కొడుకు గెల్వǂనగు నిఁక ననిలోన్.

క. మది నెంచి రామమూర్తికి, సదమల తేజోనిధికిఁ బ్రǂసంగవశమునన్
ముదితం గోల్పోయినయది, మొదలుగ సుగ్రీవుచరితǂమున్ సర్వంబున్. 28

సీ. వినిపించి సుగ్రీవు గన మిమ్ముఁ దోడ్కొని, యరుగుదు నని తనయతివ వీడి
నైజరూపముఁ గొని యాజగన్నాథుని, దదనుజుఁ గొంపోయి తపనతనయు
కడ డించి వీరలే కద నీకుఁ బగవారు,గఁ దలంపఁబడిన విక్రమధురీణు
లని తెల్పి వీరిమహాత్త్వ మనూనంబు; దేవతాప్రతిములు భూవరాత్మ
తే. భవులు దాశరథులు ప్రతాపమున నసదృ,శులు నటంచు నెఱుంగుము లలనదనుజ
పాలకుఁడు వీర లాశ్రమపదమునందు, లేనితఱి బల్మిఁ గొంపోవ జాలిదూలి.

క. వనులను వెదకుచుఁ గొందఱు, నినుఁగూర్చి వచింప నిప్డు నీచెంగటికిం
జనుదెంచి రీశరణ్యులఁ, గని మైత్రిని నెఱపవయ్య కపికులతిలకా! 30

క. మది నిన్నె నమ్మివచ్చిన, సుదర్శనుల భూపమౌళి సూనులఁ గొని స
మ్మదమార స్నేహ మొనరిచి, సుదతిఁ వెదకింపవయ్య శుభగుణనిలయా! 31

ఉ. వీరలసాయ మూని కపివీరు మహేంద్రకుమారు నోర్చి వి
స్తారకపీంద్ర రాజ్యరమఁ జయ్యనఁ బొందు మటంచుఁ బల్కు సా
మీరిహితోపదేశము సమృద్ధనయోన్నత మంచు నెంచి యా
శ్రీరఘువీరుతోఁ జెలిమి చేసి ధనంజయసాక్షికంబుగాన్. 32

సీ. తనయుదంతం బెల్ల వినిపించి లక్ష్మణు, మూలంబునఁ సీతమూర్ఛ దనుజుఁ
దొంటిగా నున్నప్పు డుద్ధతిఁ గొనిపోయె, ననుచు నెఱింగి నెమ్మనము గుంద
నేను సాధింతు నీనెలఁత యెందున్న నీ, మాట నమ్ము మటంచు దేటపఱచి
వగఁ గుంద శ్రీరఘువరుఁ డొగి నోదార్చి, నీసతి రాజ్యంబు నే నొసంగు
తే. వాఁడ నమ్ము మటంచును బాసయిచ్చి, విగతఖేదుని జేసె; నవ్విధిని వార
లందు నామోదమున నున్న యప్డు సూర్య, తనయుఁ డల్లన రామున కనియె నిట్లు.

క. వానరులఁ గూడి యీగిరి, సానుతలంబందు నుండు సమయంబున మా
వీనుల నార్తస్వర మొకఁ, డో నాథా! చొచ్చె నంత నురురవ మలరన్. 34

తే. ఆభరణముల మూట మాయగ్రభాగ, మందుఁ బడియెను వేగంబ యరిగె నెవఁడొ
దీననిస్వన మొక్కింత మానకల్లె, వినఁబడుచు నుండె నని రామవిభుని మ్రోల.

క. తెలుపుచు నాయాభరణం, బుల మూటను దెచ్చి యీయఁ బొగులుచు రాముం
డల రావణుఁ జంపఁగ ని, స్తులపౌరుష మూని నుడివె సుగ్రీవుండున్. 36

క. తనకున్ వాలికి వైరము, జనియించిన విధ మ దెల్ల సత్యంబుగఁ దె
ల్పినవిని రాముం డోదా, ర్చెను భీతిని బాపి కపులు చెలఁగుచునుండన్. 37

ఉ. అప్పుడు సూర్యపుత్త్రుఁడు మహాత్మ! రఘూద్వహ! వాలిశౌర్య మి
ట్లొప్పు నటంచుఁ దెల్పుటయు నూహల వాని నెఱింగి లక్ష్మణుం
డెప్పనిచేయ రాఘవు సమిద్ధపరాక్రమ మిట్టిదంచు నీ
వొప్పుదువో యటం చడుగ నొక్కెడ నున్న కళేబరంబునున్. 38

చ. కరమునఁ జూపి దుందుభి య।ఖండపరాక్రమశాలి రక్కసుం
డురుగతి నేగుదెంచి మహి।మోన్నతు వాలి నెఱుంగలేక సం
గరమున కిప్డు రమ్మనిన। గాఢరుషం గొని వానితోడ భీ
కరసమరంబు చేసి యసు।కాండముఁ దీసె సురల్ బళీయనన్. 39

ఉ. వానిశరీర మొక్కగతిఁ। బాదతలంబునఁ దన్నె రక్తముల్
మౌనివరోటజంబును సమస్తము నిండఁబడెన్; మతంగుఁ డ
ద్దాని నెఱింగి యిప్పనిని। దర్పముపొంగఁగఁ జేసినట్టి యా
వానరుఁ డీతపోవనము।వైపును జొచ్చినఁ జచ్చు నప్పుడే. 40

క. చొరరాదు దీని యోజన, పరిమితదూరంబు నంచుఁ। బలుకన్ విని య
త్తరుణమునుండియె రాఁ డీ,ధరణికి నిందున్న వాఁడ। దాననె నేనున్. 41

వ. ఆశరీరం బిప్పు డస్థిమాత్రశిష్టంబై యున్న దనవుడు శ్రీరాముఁ డద్దానిఁ
బాదాంగుష్ఠంబునం జిమ్మి సుగ్రీవుశంకఁ బాప సప్తతాళంబుల నొక్కతూపున
భేదించిన విగతసంశయుండై సుగ్రీవుం డుండ రాముం డిట్లనియె. 42

### సుగ్రీవుఁడు రామునుపదేశంబు నాలకించుట.

ఉ. కర్మముశక్తి యిట్టిదన।గాఁ దగియుండరు ధాతృముఖ్యులే
శర్మమునో వితాపమునొ। చాలుగఁ గూర్చును జంతుకోటికీ
మర్మము శాస్త్రముల్ తెలుపు। మానవులైన నమర్త్యులైన నీ
వర్మముఁ గర్మరూపమును। భగ్నము చేయఁగఁజాల రెవ్విధిన్. 43

ఉ. ఎప్పుడొ పొందనున్న ఫల। మిట్టిదె యౌనని హెచ్చరించుఁ దా
నిప్పుడె దానినిన్ మఱచి। యెప్పటియట్టులె యుండఁజేయు నీ
చొప్పున నుండుఁ దద్గతులు। చూడఁగఁ జాలితిమంచు నెవ్వరేఁ
జెప్పఁగఁ జాలనట్లుగఁ బ్ర।సిద్ధి వహించును గర్మ మద్దిరే! 44

చ. ఉన్నటులుండి సత్ఫలము। లొక్కట మాఱి భయంకరంబులై
యెన్నటికిన్ నశింపక య।దేగతి నుండునటంచుఁ దోఁపఁజే
యున్నియమంబులేక తన।యుద్యమమున్ ఫలియింపఁజేయు నిం
కెన్నఁదరంబె కర్మము న।దేరికి నే నని యెంచనొప్పఁ దాన్. 45

చ. ధనికు లటంచు బీదలని। తా నెద భేదముబూనుఁ గర్మమం
చును దలఁపంగ ధాతకును। జొప్పడరా నటులే గతుల్ పొసం
గను జరియించు బ్రహ్మమును।గాఁ దలపోయుదు రాత్మవేత్తలా
మునులును గానఁ గర్మ మది। పొల్చు దురూహము గాఁగ నెప్పుడున్. 46

చ. ఒరులకు సాయ మే నయితి। నొక్కపుడే నొకహానిచేయ నె
వ్వరికిని దుష్టకాలమిది। వచ్చె నదెట్టులొ నాకు నంచుఁ బా

మరులు తలంత్రు పూర్వజని మత్కృతకర్మఫలంబె యిద్ది యి
క్కరణిని మార్చఁ గాలము నిఁకన్ వగ వేలని యున్నఁ డొక్కఁడున్. 47

ఉ. తాను యదృశ్యపాశసముదాయము పర్వఁగఁ జేసి ప్రాణిసం
తాన గళంబులం దగుల దానిని లాగును గర్మశక్తి యీ
మానము గల్గియున్నదని మాత్రము బ్రహ్మహరుల్ హరుండు సుం
తైనఁ దలంపఁజాల రని యర్కతనూభవ! నిశ్చయింపుమా. 48

సీ. ఏదంపతులకు నీవెత్తరుణమున వి,యోగంబు గల్గున ట్లొనరిచితివొ
దాన వారెట్లు చింతలపాలుగా నెంత,కాల ముండిరొ దానికంటె నాలు
గంతలకాల మట్లార్తి నొందదగు, దీవును; దీనికై యింతచింతఁ
బూనఁగా నేటికిఁ? బురుహూతసుతునకుఁ, గాలము డగ్గఱఁగాని నీవు
తే. దానికిం గారణంబవే కాని కర్త, వెంతమాత్రము కావు నే నెన్న నట్లె
మచ్ఛరాగ్రమునన్ నిల్చి మ్రందఁ జేయు, నతనిప్రాక్కర్మ మేయని యాత్మఁ దలఁపు.

క. ఈనియమంబును దైవమె, తా నొనరిచెఁ గాదనంగ దానిని దరమే
యేనికి నైనం బౌరుష, మూనకు మేఁ గర్త ననుచు నో సూర్యసుతా! 50

క. మానుము పగఁ బురుహూతుని, సూనునిపై నతనిపూర్వసుకృతమె ఫలముం
గానంబడంగఁ జేసెదు, నీనెలవున నుండఁ డంచు నెఱుఁగుము మదిలోన్. 51

క. కపిరాజ్యభార్గవియు నా, నెపమున నినుఁ బొందఁదగిన నెమ్మిఁగనెదు నా
దుపలుకు నమ్ముము రవిజా!, వ్యఃగతఖేదుండ వగుచు నర్తిలు మింకన్. 52

క. తా నొనరుచు కర్మమునకుఁ, దానే కర్త నని సమ్మదమ్మును గను న
జ్ఞాని యదిమానియుండులె, యా నిల సన్న్యాసమున గృహస్థులలోనన్. 53

చ. మనమున శాస్త్రమందు బహుమానముగల్గియొ సాధుకర్మముల్
బొనరిచి వానినుండి ఫలముల్ గనఁగోరక యీశ్వరార్పణం
బని తలపోయునాతఁడె గృహస్థులలోఁ బ్రవరుండు; భిక్షుతు
ల్యునతని మెచ్చుకొంద్రు మహిమోజ్జ్వలులై తగుపండితేంద్రులున్. 54

క. చిత్తము వైరాగ్యంబను, నుత్తమధనయుక్త మగుచు నొప్పదయేఁ గిం
చిత్తును సన్న్యాసము ఫల, మెత్తఱినే నీయఁజాల దిది సూనృతమా. 55

క. అని తెలియునట్లు చెప్పిన, విని సుగ్రీవుండు రాము వీక్షించి మహా
త్మ! నినున్ సమాశ్రయించితి, మనమునఁగల గర్వమెల్ల మానెన్ నాకున్. 56

క. హితబోధ మిద్ది వానర,పతికృత్యము సైపు మనెడుభావము తోఁచెన్
క్షితినాథకుమారా! యెది, హితమని తోఁచునొకో దానినే చేయుమిఁకన్.

సీ. మాటలఁధోరణిఁ బాటింప నిఁక యుద్ధ, మనుమాటలే దనునట్లు తోఁచె
నని యేమియును బల్క కట్లున్నసుగ్రీవుఁ, గని రాముఁ డిట్లను గలఁతనొంద

నేల యీరాముని వృత్తి మార్పం గన, దంచు నమ్ముము; సమయానుకూల
ముగ మాటలాడుట తగనట్లు పల్కుట, యింతదాఁకఁ లే దదింక నుండ
ఆ. దనుచు విశ్వసింపు మనృతమాడనుజుమ్ము, పయనమగుము నీదు పౌరుషంబు
గనఁబడంగఁ జేయు మనుమానమును విడి, మచ్ఛరంబు వాలి మ్రందఁ జేయ.

### వాలిసుగ్రీవుల తొలియుద్ధము.

చ. చనుమని ప్రోత్సహింప నృపచంద్రుని పల్కుల నాదరించి య
వ్వనచరనాథుప్రోలికి నవార్యపరాక్రమ మొప్పఁ బోయి పి
ల్చెను మృగనాథునాద మని చెప్పఁగ నొప్పినకంఠనాదముం
గనఁబడ; దాని కాగ్రహముఁ గైకొని వాలియు సత్వరంబుగన్. 59
సీ. అరుదెంచి తోరణపరిసరంబునఁ బూన్కిఁ, బోరనున్నట్టి తమ్ముని మించి
మార్కొనియెను శతమఖసూను నర్కజుఁ, డెదిరించె; నిట్లు వారిరువురుఁ దమ
పౌరుషంబులు చూపఁ బటుతరహుంకృతుల్, చెలఁగఁ బోరాడఁగ జిష్ణుతనయుఁ
డనుజుని జానుప్రహారంబులన్ ముష్టి, ఘాతంబులన్ నొంచి కడుబడలఁగఁ
తే. జేయ నించుక యోర్చియు శ్రీరఘువరు, శరము రామికిఁ జింతిల్లి సంగరంబుఁ
జేయఁజాలక యొడలెల్లఁ జిల్లులుపడఁ, దాళఁజాలక వ్రీడ వదనము వంచి. 60
చ. తనుఁ గన రామచంద్రుఁడును దమ్ముఁడుఁ బావనితోడ రాఁగ ని
ట్లనియెను భూపవర్య! సమరావనిఁ గూల్తును వాలి మార్కొనం
జనుమని నన్నుఁ బంపి యలశక్రతనూజుఁడు చావఁగొట్ట నే
మనకరెయుంటి తావకమహాశయ మెద్దియొ తోఁప దింతయున్. 61
చ తొలుతనె వాలిఁ జంపనని తోఁపఁగఁ బల్కియె యున్న నించుకే
యలయక యుండె యుందుఁ గద యప్పలు కించుక యేని పల్క కా
ర్తులఁ బడఁజేసి నన్నుఁ గపిధూర్తులు నవ్వఁగఁ జేసి తీవు నీ
తలఁపిది యం చెఱుంగక వృథా యవమానము పొందితిం గదే. 62
చ. నృపతులలోన మిన్నవని నిర్మలశేముషి నొప్పువాఁడ వం
చపరిమితప్రతాపనిధి వంచు సతంబును సత్యవాక్య మెం
చి పలుకువాఁడ వంచుఁ బదసేవకరక్షణదీక్షుఁ బూని యొ
ప్పుపరమవిక్రమస్వమునఁ బొల్చెడు ధీరుఁడ వంచు నెంచితిన్. 63
ఉ. అంతియ కాని శాత్రవకరాంఘ్రిసమాహతులన్ నలంగి బల్
వంతలఁ గుందుచుండు నను వారక చూచుచునుండు వంచు నే
నింతయు నెంచనైతి; విధి యేరికినైన నలంఘ్యమే కదా
స్వాంతమునందు నింక నెది సల్పఁగఁ బూనితివో వచింపుమా. 64
చ. తనువి దశాశ్వతంబని సతంబుఁ దలంతును నిందయున్ స్తవం
బును సమమంచుఁ గన్గొనఁగ బోలునటంచుఁ దలంతు; నైన జ్ఞా

తిని గనినంతనే యొదలు తీవ్రహుతాశనునట్లు మండు దా
నిని మఱువంగఁ జాలకయ నీపలుకుల్ విని మోసపోయితిన్. 65

క. రామా! వచింపుమా యిఁక, నీమదిఁ గలయిష్టమేమొ నిజముగ నట్లే
యేమఱకయ వర్తించెద, స్వామీ! పనిదేనిఁ జేయఁ బంపఁ దలఁతువో? 66

మ. హరిదశ్వప్రియపుత్త్రుఁ డిప్పగిదిఁ జింతావేశతం బల్క నా
హరిదశ్వాన్వయవార్ధిశీతరుచి యస్థాలించి తద్భావమున్
సరిగా నాదృతిమై గ్రహించి విమలస్వాంతుం బ్రశాంతున్ నిరం
తరవిజ్ఞానవిచారవంతునిగఁ బంతంబూనెఁ జేయం ద్వరన్. 67

చ. కరములు సాఁచి ప్రీతిమెయిఁ గౌఁగిటఁ జేర్చి దివాకరాత్మజా!
యరిదృఢముష్టిఘాతముల నంగములెల్లను నొచ్చెనే కటా!
శిరమున వైరిఁ గూల్పమికిఁ జాలఁ దపించితి వద్ది తప్పుగా
దురుశర మేయఁ జాలమికి నొక్కఁడు హేతువు గల్గెఁ జెప్పెదన్. 68

మ. పరితాపంబునఁ గుంది నీవనినయప్పల్కుల్ మదాత్మన్ గ్రుధన్
బొరయం జేయఁగఁజాల విల్లు పలుకంబోలున్ నిసర్గం బిదే
నరసంఘంబున కంచు నేఁ దెలియుదున్ నాపల్కు లాలించి యొ
క్కరణిం దోఁచునొ యట్టులే తలఁపు; మింకన్ జక్క నాలింపుమా. 69

మ. ప్రతిపక్షాంతక మైనయంబకముఁ దీవ్రస్ఫారకోదండసం
యుతిమించం బొనరించి చూచుతఱి మీ రుగ్రంబుగాఁ బోరు నా
ఱతనంబం దొకరీతిగా నొడలమచ్చంబుల్ కడుం దోఁచె నెం
చితి నిట్లీశర మేయ నేగి యొవనింజెం డాడునో యుగ్రతన్. 70

మ. మన మూహించిన దొండు దైవ మనుకర్మం బెన్ని చేయంగ నెం
చిన దొక్కండయినన్ బ్రయత్నమిది నేఁ జెప్పంగనేలా ఫలం
బును గాంచంగ నవర్హ్మమా ననుచు నీబుద్ధిన్ విచారింపు మిం
కను నేఁ జేయఁదలంచినట్టిది కపిక్ష్మాపాల! యాలింపుమా. 71

ఆ. గుఱుతు నొక్కదానిఁ గూడిన తనువొప్ప, మరలఁబోయి వాలిమారుకొనుము
కనకపుంఖశరము కదలించుఁ దత్ప్రాణ, పంచకంబు రాముప్రతినఁ గనుము.

క. అనృతము వచింపలే దన్యియును జెప్పం బోవననియు నోసుగ్రీవా!
వినిపించితిగాదే మును, మనువంశభవుండు పల్కుమాట నిజంబౌ. 73

క. చిత్తంబున ననుమానము, హత్తింపకు చూడు రాముఁ డాడినమాటన్
వత్తుము సీతో మూవుర, ముత్తలపాటొందకుండ నురుగతిఁ బొమ్మా. 74

క. వాలి వధింపంబడె నని, నీలోఁ దలపోసికొనుచు నిర్భరశౌర్యం
బాలమునఁ జూపు మించుక, కాలంబునఁ గోర్కి దీఱఁగా నొనరింతున్. 75

ఆ. అనుచు హెచ్చరించి యనుజుని బంపియా, చెంతఁ జూచి మిగుల గాంతమగుచు
క్రాలుచున్న యొక్క గజపుష్పికా లతఁ, దేరఁ బంచి తెగు విచార మనుచు. 76

ఆ. గళమునందు వైవఁగాఁ బంచె లక్ష్మణుఁ, డట్లు వైచె; దాన నర్కపీంద్రుఁ
డధిక తేజ మొప్ప నప్పుడు వెలుఁగొందె, జయముఁ గాంచు మాశిషమున దీన.

తే. అనుచు దీవించి యాతని వెనుకొని చని, యొక్క పాదపవరమున నొదిగి యుండె
ననుజమారుతిసహితుఁడై యా రఘుపతి, యంతఁ గిష్కింధ కరిగి తదంతికమున.

తే. నిలిచి సింహనినాదంబు వెలయఁజేయ, దాని నాలించి శతమఖతనయుఁ డట్టు
కోపసంరక్తనయనుఁడై యేపుమీఱఁ, గలహమున కేగఁ బూనంగఁ గాంచి యొంచి.

తే. తాను వినినది తలపోసి తార ప్రియము, మీఱ నడ్డముగా నిల్చి మిగుల న్యాయ
సమ్మతంబుగఁ బల్కె నో శక్రతనయ!, మద్వచనముల నాలించి మదిఁ దలంచి.

ఆ. పిదప నీకుఁ బోలు నిది చేయ నని యెద్ది, తోఁచు నట్లు చేయు మీచను వన
నీ వొసంగినట్టిదే వల్లభా! యని, చెంత కేగి పలికె వింతనుడుల. 81

తే. తొలుత మార్కొని నిన్ను దెబ్బలు తినివడిఁ, బాఱిపోయిన యనుజుఁ డిప్పట్టణమ్ము
ద్వారమం దొగి మరల దుర్వారభయద, సింహనాదము చేయుట చిత్రమె కద.

తార వాలికి హితము తెల్పుట.

ఆ. వింటి రాముఁ డనెడు వీరశిరోమణి, దశరథాత్మజుండు తండ్రి పనుప
నడవి కేగుదెంచి యసురుల ఖరదూష,ణాదిదుర్జయుల మహాహవమున. 83

ఆ. మిగులకుండఁ జంపి మేటివిక్రమమునఁ, బొదలుచుండ దనుజపూగనాథుఁ
డోర్వలేక మోస మొప్ప నాతని పత్ని, సంగ్రహించి చనుట చారులనుడి. 84

ఆ. తెలిపె నాకు నిన్న ధీరవరేణ్య! దే,వాంశజనితులైన యా నృపాత్మ
జన్ము లటవి నెల్ల జానకి వెదకుచు, వచ్చి పంపకడ నివాసము గన. 85

క. రవిసూనుతోడ సఖ్యము, పవమానసఖాంతికమునఁ బాటించి నినున్
బవరమునఁ జంపి రాజ్యవి,భవ మా సుగ్రీవు నొందఁ బ్రతిన నెఱపుటన్. 86

క. శ్రీరఘువరు సాయంబునఁ, బోరన్ సమకట్టి హేతువున దేన నొకో
సారము చెడి పరుగెత్తెను, శ్రీరాముఁడు మరలఁ బంపఁ జెందినపూన్కిన్. 87

క. మరలం జనుదెంచెను మది, నరయం జనదొక్క కారణాంతర మేదేః
బరఁగం జను నని నీమదిఁ, బురుహూతసుతా! తలంపఁ బోలును గాదే. 88

క. వెనుక సహాయమె లేదే, నని మును దా నోడిపాఱి యిప్పుడ మరలం
జనుదేర హేతు వుండం, జనుఁ గద యించుక తలంపు స్వాంతమునందున్. 89

క. ఇంకొక మాటను వింటిన్, శంకింపఁగ నెగినయదిగ స్వాంతము తెల్పన్
బంకరుహాక్షుండే రా,మాంకము ధరియించి దుష్టులై తగు వారిన్. 90

క. పొలియించి మించువిక్రమ, మిలపై వసియించువార కెల్లం జక్కం
దెలుపంగ నవతరించుట, పలుకుల నవ్వానిఁ బట్టి భావించితిఁ జూ. 91

క. ఆరఘునాథునితోడన్, వైరము నీకేల? యతఁడు భగవంతుఁడె ని
స్సారుఁడు నీతమ్ముం డా, ధీరునిసాయంబు గల్గ దీనత తొలఁగన్. 92
క. నిను మార్కొన నరుదెంచెను, వనితావాక్యం బటంచు భావింపక నా
కనుమోదము చేకూర్పుము, చన మానుము మనకు నిది యసమయముగానన్.
ఆ. పలుకు వినవె దీని "బాలాదపిసుభాషి,త" మ్మటంచు మనువె తా వచించె
దానినైన నూని తగువిన నామాట, నిర్జితారివీర! నియతసార!. 94
సీ. సామదానము లనఁజను రెంటఁగాని కార్యము భేదమున దాననైనఁ గాని
పని దండమున నృపతులు సాధింపఁగఁ, జనునంచు శాస్త్రముల్ చక్కఁదెలుపు
నివిగొల్ల నీవెఱుంగవె యైనఁ దెల్పితిఁ, గార్యభారమ్మునఁ గలుగుచుండు
చింతచే నాపల్కుఁ జిత్తంబునన్ వేఱుగాఁ దలంపక భీత గాఁగ నన్నుఁ
ఆ. దలఁప కిపుడు చేయఁదలఁచినపని మాను, మిద్దిహితమునాఁగ నింతిఁ గాంచి
సంతసించి ధర్మసరణిఁ దెల్పితి విది, చను నొనర్ప నైనసాధ్వి! వినుము 95

తారకు వాలి ప్రతివచనం బిచ్చుట.

క. ఇల వెలయు ధర్మమార్గం,బులు నాల్గుతెఱంగులు గను బూఁబోఁడిరో! రా
జుల కందుఁ జేయఁదగనవి, కల వవ్వానిన్ వచింతుఁ గలఁగక వినుమా. 96
చ. ఒరులకుగాను దెబ్బదిన నోర్చి సహాయము చేయఁ జాలుటన్
దరుణిరొ క్షత్రియుండనఁగఁ దాఁ జను; నాతఁడు వైరివచ్చి సం
గర మొనరింప రమ్మనినఁ గా దిదికాలము దానికంచు నె
వ్వరుసను జెప్పరా దని యభంగురరీతి స్మృతుల్ వచించెడున్. 97
ఉ. దానికిఁ గాల మిద్ది యని తక్కినకష్టము లెన్నియుండినం
గాని వచింపరా దనియు క్షత్రియుఁ డట్లు వచింపఁ బాపసం
తానము చుట్టుముట్టియె యధఃపతితుం బొనరించు నంచు నో
మానిని! పల్కుచుండు స్మృతిమండల మెంతయు శ్రద్ధమీఱఁగన్. 98
ఉ. నీవనినట్టి వేఱునుడినిం బరికించితి రాముఁడే నను
జేవచెలంగఁ జంపునని చింతిలనేటికి? రామమూర్తికే
నేవిధమైన కీడు నొకయింతయుఁ జేసినవాఁడఁగాను ద
ద్భూవిభుఁ డేల చంపు రవిపుత్త్రునికై యిటు లెన్నఁ జెల్లునే?. 99
మ. జలజాక్షుం డని రామునింబలికి తోసాధ్వీ! యదే సత్యమేఁ
గలఁగం గారణమేమి? ధర్మముఁగదా కాపాడుదైవంబు నా
వలనం దప్పొకయింత లేనియెడ నన్వంచించి చక్కాడఁగాఁ
దలపోయం దగునంతయల్పమతియే తన్వీ! యదే ధర్మమే. 100
మ. ధరణిన్ ధర్మము నిల్పఁ బుట్టినకృపాధాముండు రాముండు మం
దిరమం దూరకయున్ననన్ బిలిచి ప్రోదింపంగఁ దాఁ బూనునే

దనుజేశ! ధర్మము నిల్పుమార్గ మిది యేతన్మార్గమం దెల్లరుం
జరియింపందగునంచుఁ దెల్పినటులెం జాల్చాలు నీవాక్యముల్. 101

చ. హరియవతార మెత్తి యిటులందఱు ధర్మమువీడి చంపునే
స్థిరత నధర్మమే కనును జెప్పెడి దే మిఁక నిట్టిశంకలం
బురికొలుపంగ నెమ్మదిని బూనకుమా; యపరాధహీను శ్రీ
హరి వధియింపఁబూనఁడు తనంతన యాతఁ డెఱుంగు నెల్లరన్. 102

మ. తనయిల్లాలిని దుష్టరాక్షసుఁ డెదం ధర్మంబుఁ జింతింపకే
చనియెం బల్మిని గొంచు నం చనితి; వీచందం బధర్మంబయా
ననవచ్చుంగద! యట్టిచో రఘువరుం డర్కాత్మజుం జేరు టే
మనవచ్చుం ననుఁ బిల్వనంపి యిది యిట్లంచుం దగం జెప్పునే 103

ఉ. రావణుఁ బిల్వఁబంచి యిటు రామునిపత్నిని దెచ్చు టొప్పునే
యీవిటుచేసిన న్నగరె యెల్లరు దేవిని దెచ్చియిచ్చి యా
భూవిభు వేఁడుకొమ్ము కృపఁబూని నినుం శరణార్థి వంచుఁ బెం
పావహిలంగఁ గాచునని యాజ్ఞయొసంగెద దాన నాతఁడున్. 104

మ. మతిమంతుండయి జానకిం దశరథక్ష్మాపాలపుత్రాళి జ్యే
ష్ఠతఁ బెంపొందెడు రామచంద్ర పదకంజాతద్వయిం జేర్చి స
న్మతి రక్షింపుమ యంచు వేఁడుగద యమ్మాడ్కిం బ్రయత్నంబు నో
యతివా! చేయక యల్పవీర్యుఁడగు నీయర్కాత్మజుం జేరుటన్. 105

చ. తనదురవస్థ కీడయినతద్దురవస్థను వీనులారఁ దా
వినుటయె కాని సత్ఫలము వేవిధులం దలపోసిచూచినం
గనఁబడ దించుకంతయును గల్గునటంచు నిఁ కేటిమాట లా
జనపతి తన్ను మార్కొననిశౌర్యసమగ్రుని నన్నుఁ జంపునే?. 106

ఉ. తమ్ముని ప్రోత్సహంబున హితంబు తలంపక నన్ను మార్కొనం
నెమ్మది నిశ్చయించి ధరణీపతి పుత్త్రుఁడు వచ్చెనేని రా
నిమ్ము; ఫలంబు తోడనె యనింద్యచరిత్రత వీడిపోవఁగాఁ
గొమ్మరొ! కాంచు నన్నెదిరికోల్పడకుండునె శౌర్య మెవ్వఁడేన్. 107

చ. అని హితమారఁ జెప్పిన నితంబిని యేమనఁ జాలకుండఁ జ
య్యనఁజని ముష్టిఘాతముల నంగములెల్ల నలంగియున్నఁ జే
కొనినపరాక్రమంబునను గుందుచుఁ గుందనియట్టు లార్చునా
యనుజుని జూచి సిగ్గెడలి యాహవముం బొనరింప వచ్చితే. 108

మ ఫలముం గాంతువు లేర తమ్ముఁడ! మహాభాగ్యంబు నాకబ్బె నం
చెలమిం బొంగెద యుద్ధభూమిని రవంతే నిల్వ మం చుగ్రుఁడై

పలుకుల్ రామిని మార్కొనన్ రవిజుఁడుర్ బాహాబలంబూని యి
ష్ములఁ బోరాడఁ దొడంగె; నివ్విధిని దర్పమ్ముండన్న యుఁన్ బోరఁగన్. 109

### శ్రీరాముఁడు వాలిని వధించుట.

ఉ. కాలము ప్రాప్తమౌట రఘుకాంతుని బాణము తీవ్ర రూపముం
దాలిచి తూణమున్ వదలి తానయి పైకుబికెన్ గృపాబ్ధియై
క్రాలెడు రాముచిత్తమున గాఢరుడగ్ని సముద్భవిల్లి యిం
కేల శమంబు వాలి నిపుడే వధియింపు మటన్న యూహలే. 110

ఉ. మానసమందుఁ దోఁచె ననుమానము వీడుము రామభద్ర! యీ
వానరుఁ డీయనంత నిలువందగ దీవును బాణమోక్షణం
బీనిముసంబునం దగినయేపునఁ జేయుమటంచుఁ గర్త మెం
తే నినదంబు వీనుల కరదెట్లొ వినంబడఁ బల్కెఁ బూనికన్. 111

చ కరుణను జూపఁగాఁ దగినకాలము కాదిది తీవ్రమూర్తివై
శరమును బంపు మయ్యదియె శక్రతనూజుని గావఁబూనుటౌ
నరవర! వాలి పొందఁదగునాకము దాని నొసంగు టేకృపా
పరత గనంగఃజేసినటు పద్ధతి దీని సమాశ్రయింపుమా. 112

చ. అను నశరీరవాక్కులు క్రమాగతవాక్కులుగా వినంబడన్
మనమున లేని కోప మణుమాత్రము రేఁగ నొనర్చి కన్నుల
గ్నిని గురియింపఁ బూనినటు కెంపుఁదనంబు వహింపఁ దీవ్రప
త్త్రిని గ్రహియించి జ్యాలతికఁ దేఁకువఁ గూర్చి సురేంద్రపుత్త్రునిన్. 113

ఉ. చేతమునందునిల్పి కృపచేఁ గపిదేహవిముక్తిరూపభ
వ్యాతతభోగభాగ్యసతతానుభవప్రద నాకలోక మి
ట్లీతఁడె నిచ్చువాఁడ మది నేమియుఁ గుందక పొమ్ము నన్నెదం
బ్రీతిఁ దలంతు వందు సురరీకృతభోగుఁడవై క్రమంబునన్. 114

క. అని హిత ముపదేశించువి,ధిని బాణమువైచె నదియు ధీరవరుండౌ
వనచరపతియురమును జొ,చ్చెను దానం గ్రిందికొరఁగెఁ జెచ్చెర నంతన్.

క ఇఁక నిల్వఁగూడ దిచ్చో, సకలజ్ఞుఁ డెఱింగనేని సమయింపక యూ
రక విడువఁ డంచుఁ దేజం, బొకయింతే నిల్వకేగ నుద్యమ మొప్పన్. 116

క. పౌరుష మాతేజోయుతి, నేరికినేఁ దెల్పకుండ నెందో చనియెన్
సారంబు వదలె నంగం, బీరీతిం బడినవాలి యేమి పలుకకే. 117

### వాలి రాముని బ్రశ్నించుట.

ఉ. ఒక్కమువహార్తముండి తనకోపిక యించుక రాఁగఁ జేరువం
బొక్కచునున్న సోదరుని భూమిరుహాంతరసీమ వీడి త

న్నక్కడఁ జూడవచ్చిన మహాత్ముని రాముని గాంచి దీనతం
జక్కఁ దొలంగఁద్రోచి గళశబ్దము మందత నొందుచుండఁగన్. 118

చ. అనుపమనీతి రాట్పథము నాచరణంబును సుంతయేఁ గొఱం
తను గనకుండఁ బల్కె; నృపతల్లజ! రాజులధర్మ మెల్లనే
టను గలియంగ న్యాయము కడంకను బూని యదెందొ మ్రుంద న
న్ననిఁ బడనేసినాఁడవు మహాద్భుత మీయది చక్క నెంచినన్. 119

చ. ఇరువుర మిందుఁ బోరునెడ నెందొ మఱుంగుననుండి తీవ్రమా
శరమున నన్నుఁ గొట్టితివి శాస్త్రమునం దిదియెందునేని భూ
వరులకు ధర్మమంచు నుడువంబడియున్నదె చెప్పఁజాలుదే?
యరసిన నిద్ది లోకమున నాచరణంబున నుండునద్దియే? 120

చ. తెలుపఁగఁజాలుదే నరపతిప్రియమై తగుధర్మ మిద్ది యం
చిల మును పీమహాత్ము లిటులేయొనరించిరిగాదె యంచు నీ
పలుకుల నే వినం దలఁతు బాలిశుఁడే యిటుచేయు నీ వనన్
జలరుహవంశవారినిధిచంద్రుఁడ వంచుఁ బ్రసిద్ధిఁ గాంచియున్. 121

చ. పితరునిమాట దాఁటక విభీతమృగాక్షినిగూడి కానకున్
మతియుతు లౌనన్ దపసిమాడ్కిని దమ్ముఁడు వెంటరాఁగ వ
చ్చి తిరుగుచున్ మునీశ్వరులు చేరి నుతించుచునుండ నిద్ధియుం
గృతక మటంచెఱింగియున దెట్టులు చేసితివో వచింపుమా. 122

క. తన కపకారముచేయని, మనుజుని రిపునైన నెప్డుమార్కొనరా దం
చనుదురు విద్వద్వరులు వ,చనమ్ము దానిన్ వినంగఁ జాలవయేమొ? 123

క. రదనములు నఖము లస్త్రస,ముదయముగాఁ బోరు కపిసమూహమ్మును ని
న్నుఁ దలంపకుండు దాసిం, గదనము చేయకయె కొట్టఁగాఁ దగ వగునే. 124

క. విరథుని రథికుఁడు మార్గణ,విరహితుని ధనుర్ధరుండు వేడుకకే సం
గరమునఁ గొట్టఁగరా దను, పురాణవాక్యములనైన భూప! యెఱుఁగవో.

మ. నిను నిందింపక నిన్నుఁ గానక రిపున్ నేమార్కొనన్ రాఁగ నెం
దొ నిలీనస్థితిఁబూని నింద్యమనియే యూహింప కారీతి న
న్ననుకంపన్ విడనాడి కొట్టితివి బాణంబుం బ్రయోగించి యే
మనవచ్చున్ నిను క్షత్రవంశగురుమర్యాదాంతకా! రాఘవా! 126

చ. సమరము చేయుకోర్కి మదిఁజాలఁగఁ గల్గినవాఁడవైన యు
ద్ధమునకు రమ్ము వాలి యని దర్పమునూనియె పిల్చియున్న న
స్త్రములును నీవు నింతకును ధర్మునియింట వసించియుంద్రు వే
షమునన విక్రమాఢ్యుఁడవు సన్నుతిపాత్రుఁడవే తలంపఁగన్, 127

ఆ. ఎదుటనిలిచి యుద్ధ ఽ మేలచేయవు రామ!, చేసియున్న నీవిఽచిత్రశౌర్య
మస్మదీయబలము ఽ నఖిలలోకములకుఁ, దెలిసియుండుఁగాదె ఽ పలుకులేల. 128

చ. నరపతివేషమూనితివి ఽ న్యాయము దూరముగాఁగవైచి తీ
వరిజనమర్దనుండ వనుఽనానుడి మిథ్యయటంచుఁ దోఁచె భా
స్కరసుతుపక్ష మూనుట యఽసంగతమంచుఁ దలంప నైన సం
గరమొనరింపవేల? నృపఽకాంత! భయంబు సమాశ్రయించితో! 129

తే. ఒరునితోఁబోఽరుచుండంగఁఽనొకట డాఁగి, శరమునవధించితేవాలిఽశౌర్యమెయిది
చెప్పుమని యెవ్వరేని ప్రశ్నింప నేమి, బదులుపలుకుదువో యిప్డుఽపలుకువిందు.

ఉ. పౌరుషమున్న సంగరముఁ ఽ బూని యొనర్చుటమేలుగాని ధా
త్రీరమణుండవై వినినఽధీరులు నవ్వఁగఁ బొంచియుండియే
క్రూరశరంబువైచి మృతిఁ ఽ గూర్చఁగఁజేయుట పాడియయ్య! ము
న్నేరును రాజు లిట్టిపని ఽ యెన్నఁడు చేసినయట్లు వింటివే. 131

చ. కులగురువౌ వశిష్ఠుఁడును ఽ గ్రూరపుఁగార్యము దీనివిన్న ని
న్నలుక శపింపకున్నె? యిది ఽ యర్హమె? చేసితివౌర! యంచొగిం
బలుకులఁ బ్రస్తుతించునని ఽ స్వాంతమునం దలపోయఁ జాలుదే
తొలఁగె మదాయు వింక నినుఽదూఱిన నేమిఫలంబు రాఘవా! 132

ఉ. చెప్పెనుగాదె తార యనిఽచేయుట మాను మటంచు ధర్మముం
దప్పనె రామచంద్రుఁ డని ఽ దానికి నుత్తర మిచ్చివచ్చి యా
తప్పునకున్ ఫలంబు నిట ఽ ధర్మవిరుద్ధముగాఁగ నొందితిన్
జెప్పెడిదేమి యింకఁ గడుఽశీఘ్రమ దేహముఁ బాయుఁ బ్రాణముల్. 133

చ. అనిమొనఁ జచ్చుటే నృపులఽకర్హము దానినె కోరుచుంద్రు రా
ఘనులు; తలంపు నాకటులె ఽ కల్గియెయుండు; సతంబు తమ్మువం
క నదియె కల్గియుండిన నిఽకామముదంబును జెందియుండు; వం
చనమెయి బాణమేయ నిటఽజచ్చుటకే దురపిల్లెదన్ మదిన్. 134

శా. వీరస్వర్గముఁ గాంచఁగోరుదురుగా ఽ వీరాగ్రణుల్ యుద్ధమం
దారూఢస్థిరశర్మ మబ్బు మృతియే ఽ యబ్బంగ నాకీయెడన్
క్రూరంబౌ మృతియబ్బె; దీనికయి నాఽకుం జింత లబ్బెంగదే
ప్రారబ్ధం బది యెట్టులే ననుభవింఽపం జేయు నంద్రుత్తముల్. 135

మ. తనయుంగూరిచి ప్రేయసిం గుఱిచి సంఽతాపంబు నేనొంద భో
గనికాయంబు తొలంగె నంచు నెదలోఁ ఽ గాసంతయేఁ జింతనొం
దను శౌర్యంబునఁ బోరుచో నహితదుఽర్దాంతాంబకౌఘంబు చ
య్యన ఱొమ్ముం బగులింపఁ జావమికి నఽత్యంతంబు దుఃఖించెదన్. 136

క. ఏనరపతియుం జేయని, యీనీచపుఁబని నొనర్చితే భూపాలా!
యేనెలవునయైన నినున్, మానసమున మెచ్చుకొనెడుమానిసి యున్నే? 137

క. అనివచియించుచు నింకే,మనువాఁడ నటంచు నాత్మ నలయుచు రాముం
గనుచుం గన్నుల జలములు, పనివడి ధారలుగఁ బాఱఁబలుకకయుండెన్.138

శ్రీరాముఁడు వాలికి సముత్తరము లిచ్చుట.

ఉ. రాముఁడు వాలిపల్కు లవిరామముగా వెడలంగ వించుఁ జే
కూరినజాలిఁ గుంది తనకుం గలభారము తీర్పకుంట యా
చారముగామి నెంచి కపిసత్తము నంతికసీమఁ జేరి త
ద్దారుణబాధకుం గలఁగి ధైర్యముఁ బూని వచించె నివ్విధిన్. 139

చ. కపివర! నీకు నిత్తఱిని గల్గినబాధకు నిట్లుపల్కుటల్
వ్యపగతతత్త్వమంచు ననయుం బనియున్ వచియింపఁజాల; నీ
కపకృతిఁ జేసినాఁడ నని నాశయ మింతయు లేదు నాకు; నీ
దుపలుకు లీశ్రుతిద్వయముఁ దూఱుటకే బదు లియ్యనోఁ జుమీ! 140

తే. వగచువారికి నెవ్వరివలననైన, నపకృతుల్ గల్గెనని తోఁచు టదిసహజమె
కానియెయ్యదిన్యాయ్యమో దానిఁ దెలుపకుంట ధర్మంబదెట్లు గాకుంటనిపుడు.

క. పలుకంగఁ బూనితిన్ నీ,పలుకులు న్యాయ్యంబు లనుచు భావించితి వె
ట్టులు నాదుపలుకులందుం, గల న్యాయము సుంత తలఁపఁగాదగు నటులే.142

క. పరబుద్ధి యెవ్విధంబునఁ, బరికింపందగునొ యద్దిస్వవ్యాపార
స్థిరతం జేయఁగనోఁ దత్పరతన్ వి[illegible]స్య నాదుభావము నింకన్. 143

మ. నను నిందించితి వంచుఁ గోపమును బొందన్ నమ్ము మీమాట క
ర్మనిబద్ధంబగు జంతుకోటియని సత్యంగాఁదగున్ నీ వొన
ర్చినపాపంబులఁ దొల్త నెన్నఁదగు నేఁ జెప్పంగనేలా స్వక
ర్మనికాయంబె సుఖంబు దుఃఖమును గూర్పంజాలు నెల్లప్పుడున్. 144

క. ఒకపక్షమూని నీకు న,పకృతిన్ నేఁ జేసినట్లు పల్కితి వదిన్యా
యకలితముగామిఁ దెలియుము, యిఁక నీవొనరించినట్టియెల్లపనులనున్. 145

క. మతిఁదలఁచుకొనుము చక్కవిజితమగు; సుగ్రీవుఁ డనఁగఁ దెలియుదువుగదా
కృతదారపరిగ్రహుఁ డని, యతనిం బోఁదోలి తత్ప్రియాంగన రుమనున్.146

క. చేకొంటి విద్ధి ధర్మం, బేకరణిగ నగునొ చాలుదే తెల్పంగా
నోకీశశా! యాతం, డే కొండల గుహల వనుల నెందో వసింపన్. 147

క. బలిమిని గ్రహియించిన నా,వెలఁదియు నేదుఃఖజలధివీచికలందుం
గలఁగుచుఁ దపించుచుండునొ, పలుకన్ వలెనే యిదిట్టిపద్ధతి యనుచున్. 148

చ. పతియొకచోటఁ గష్టములపా లగుచుండఁ దదీయపత్ని యొ
ట్లితరునిఁగూడి భోగముల నిష్టగతిన్ గనుచుండు నద్దియున్
సతతము నాథునిన్ గుఱిచి స్వాంతము పొక్కఁగ నార్తినొంద నే
వితమున దానితో సురతవృత్తి నెసంగఁ దలంచినాఁడవో? 149

చ. దురితములందు నెల్లఁ బరతోయరుహాక్షిని బల్మిఁగొంటయే
పరమ మటంచుఁ బల్కుదురు పండితు; లియ్యది నీ వెఱుంగ వం
చరయఁగఁజాల; నట్లయియు నారుమ నింటనె యుంచుకొంటి వా
దురితఫలంబు నొందఁదగుఁ దోడనె కావున నిన్నుఁ జంపితిన్. 150

మ. ఇది నీకేటికి? నీకుఁ జేయఁగద నే నేబాధ యం చాడెదో
యది న్యాయ్యం బెటులైనఁగాదు; నృపు లన్యాయంబుసాగంగనో
ర్వఁదరం బెట్లగు నట్టికార్యముల సంవర్ధించిన ట్లౌఁజుమీ
వెదకంగాఁదగు వాని యత్నమున దోర్వీర్యంబు గన్పట్టఁగన్. 151

మ. తనరాజ్యంబున నట్టివే జరగినం దాల్మిం గొనంబూన కొ
య్యన నప్పాపులఁ జెండి యుర్వరను న్యాయంబున్ స్థిరత్వంబు గాం
చను జేయందగు నట్లుచేయనిక్షితిస్వామిం దదీయాఘమె
ల్లను బ్రాపించు నటంచుఁ బల్కు స్మృతులెల్లన్ వాని నాలించుచున్. 152

చ. క్షితిపతినయ్యుఁ బాపితతి శిక్ష యొనర్పక మాననేర్తునే
శతమఖపుత్త్ర! నీ విపుడు క్ష్మాపతి వెట్లని యందువేమొ మా
క్షితి భరతుండె యేలెడిని జెప్పద నే వనరాజ్య మేలఁగా
నతనియనుజ్ఞ నొందితి నవార్య మదాఁగద యెట్టివారికిన్. 153

మ. తనదౌ ధర్మము సల్పనట్టికుజనున్ దండించునాతం డదె
వ్వనినైనన్ విడువండు శాస్త్రహితముం బాటించుఁ దప్పున్న చో
ననుజుం డంచును లోఁ దలంపఁడు కదున్ న్యాయంబు రక్షింపఁ జూ
చును గానన్ వనరాజ్యభాగమున కీశుండంగదా కీశపా! 154

చ. పురముననుండి సోదరుని పొమ్మని త్రోచి; విట్టి వెన్నఁగాఁ
దరమెటులౌ; మదీయమగు ధర్మము నే నెఱవేర్చినాఁడ; సం
గరమున నిన్ను మార్కొనక గాఢశరంబునఁ గొట్టరా దటం
చురుతరధర్మముం బలికితో కపినాయక! పెక్కురీతులన్. 155

చ. మనుజుల కుండుధర్మ మది మానఁగరానిదెయౌను; నీవనన్
వనచరజాతి వట్లగుటఁ బల్కఁగరా; దిది తప్పటంచు; ధా
త్రిని నృపులెల్లరున్ మృగతతిం బొలియింతురు పొంచి వేఁటయం
దని తలపోయు; మీయది సమంచితధర్మమె యెన్ని చూచినన్. 156

సీ. మృగములఁ బతుల నొగిఁ బిల్చి యుద్ధము, చేయు నాచార మీక్షితినిఁ గలదె
యేకాలమందైన నిట్టిదియున్నట్లు, విన్నదియును లేదు; వీరులైన
ధాత్రీపతులు వేఁటతమకంబునం బోయి, మృగపతత్త్రులనెల్ల నెగిచి యొగిచి
చంపుచుందురు; తదాచార మేనుం బూని, యొనరించినాఁడ; నీవును దలంప
ఆ. విటపమృగమవౌట వేఁటయందలి ధర్మ, మాశ్రయించినాఁడ నద్ది దూష్య
మనఁగరాదు; ధర్మ మాశ్రయించిననన్ను, దూఱుటరయ నీకు దోషమెయఁగు.

చ. తొలిజనిఁ జేసియున్న స్మృతిదూషితకర్మము లీభవంబునన్
బలువిధులన్ వగంబొరయఁ బట్టుదలం బొనరింప నొక్కనిన్
బలుకుల నిందసేయుటయుఁ బాపమె కాని ఫలంబు సుంతయేఁ
గలుగునె తత్ఫలంబుఁ గలఁగంబడకే భుజియించు టొప్పుఁగా. 158

మ. తమదుష్కర్మమె కీడుఁ గూర్పు; నపు డాత్మం జింతిలంగా ఫలం
బమరం జాలునె; చేయునప్పుడు మహాహర్షంబు తద్భూరిక
ష్టము ప్రాప్తింపఁగ దుఃఖమున్ గనుట యజ్ఞానంబునంగాదె; చి
త్తమునన్ సుంతదలంచి శాంతిగనుమా దానన్ సుఖం బబ్బెడున్. 159

చ. నరపతిధర్మముల్ తెలిసినన్ నను దూఱఁగవచ్చుఁ గాని వా
నరపతిధర్మముల్ తలఁచి న్యాయము కాదిది యంట ధర్మమె
క్కరణినగున్; స్వకీయఖలకర్మఫలంబులు పొందునప్డు తీ
వరపడి యొక్కనిం బదరవచ్చునె యించుక యెంచిచూడుమా. 160

చ. మనమునఁ జింతనొందకుము మానవు కర్మఫలంబులొందకె
వ్వనికిని నైజ; మీయది స్వవర్ధితభూమిరుహంబుఁ దాను ద్రుం
పనుజను నే? సహోదరుని భార్యను బల్మిని గొంట కీవుచిం
తనుగడుఁబూను; మయ్యదియు దానికిఁ బాచితమౌఁ గపీశ్వరా! 161

క. తనచేసిన పాపములను, మనమునఁ దలపోసి యొక్కమాఱేక నిటు చే
యను నేనని దృఢనిశ్చయ, మునుబూనినఁ దఱుఁగుఁ గొంత మునిమత మిదియే.

క. దీనిరహస్యం బిదియే, తా నింతకుమున్ను చేసి దానిఁ దలంపం
బూనని యాదుష్కర్మవి, తానము మది నెన్నుచుఁ బరితాపముగనుటన్. 163

ఆ. మరలఁ జేయకుండు మతిగల్గునదియె కావలయుఁగాదె గుణముగలితమగును
దానఁ గొంతయనుట తలఁపు మంచిది గల్గవలయుననుట యొకఁడె వాంఛితంబు.

క. పరమేశుఁడు కరుణాంబుధి, పరితాపముగనుట నింకఁ బాపపుఁబని యే
తరుణమునఁ జేయ ననుటయుఁ, బురుషునకుం గల్గునేని పూతాత్మునిగన్. 165

క. ఒనరించును; గావున నీ, యనుజునివిషయంబునన్ దురాగ్రహమునఁ జే
సినయపకృతి మదిఁ దలఁపుము, చన దిటు చేయంగ ననుచుఁ జాలఁ దలఁపుమా.

క. దానం జేసినపాపము, తానుగ నశియించు బుద్ధిధర్మం బిదియే
కానం గపిరాజా! వగఁ,బూనకు మిఁక నన్ను దూఱఁబోలునె చెప్పుమా. 167

క. మృతికాలము చేరువ కా, జతనం బెవ్వనినొ చేయఁజాలినవానిన్
మతిఁదలఁచి ప్రోత్సహించును, క్షితిఁగర్మ మెయంచు నెఱుఁగు చిత్తమునందున్

క. ఈవిధము చక్క నెఱిఁగిన, నేవానిం దూఱుబుద్ధియే పుట్టదు సు
మ్మా వానరేంద్ర! కోపం, బావంతయు నీదునుడుల నాత్మం బొందన్. 169

ఆ. ఇంకఁ జేయఁదగిన దేదియేనుండినఁ, బలుకవయ్య చేయఁ బాలుపడుదు
నాయువేగఁబూనఁ జేయంగఁగలవె యీ, తరుణమందె యెంచి దానిఁ జెపుము.

క. మరణాంతము వైరం బను, పురాణవాక్యంబు వినవె పురుహూతసుతా!
సరసిజమిత్రాత్మజు సోదరు వీనింజూడు బుద్ధి ధర్మముఁ జెపుమా. 171

ఆ. పగలఁ బోగులు వీనిఁ దగుమాటలం దేర్పు, మింకఁ జేయఁదగినది యటంచు
నాజ్ఞచేయు మీతఁ డద్దానిఁ జేయఁడే, జేయువాఁడఁ దగినశిక్షఁ బూన్కి.

సీ. రాజధర్మంబులనోజఁ దెల్పఁగ నిది, సమయంబుగాదు నీస్వాంతమందు
నెట్టికార్యంబుల నెట్లు చేయఁగఁ దగు, ననితలంచితివొ వానిని దెలుపుము
సహజన్మునకు వానిఁ జక్కఁగా నట్టులే, చేయంగ నేనాజ్ఞ సేయువాఁడ
దెలిపితి ధర్మ మీతెఱఁగు ననుండు నం, చారాముఁ డనునయమలరఁ బలుకఁ

ఆ. దెలివినొంది వాలి ధీవిభవం బొప్పఁ, జెంతనున్న రాము వింతరూప
మట్టె చూచి భక్తి యప్పు డుప్పొంగఁగ, నిట్లు వినుతిచేసె హితమటంచు.

### వాలి రాముని నుతించి కర్తవ్యముం దెల్పుట.

మ. వనజాక్షా! భవదీయతత్త్వ మెఱుఁగన్ వాంఛింప కజ్ఞానతన్
నిను నిందించితి నీమహాపకృతి మన్నింపం దగున్ దీనుఁడన్
జననం బిద్ది జగంబునన్ మరల నేచందంబునం గాని లే
క నితాంతస్థిరశర్మముం గనెదు లోకం బీయవే సత్కృపన్. 174

మ. కరుణావార్ధివి జ్ఞానమూర్తివి స్వభక్తత్రాణసంక్రీడనా
దరముం గాంచు మహానుభావుఁడవు క్రోధస్ఫూర్తి నే నన్నయ
ప్పురుషోక్తుల్ మదిసైఁచి నాదురిత మొబ్బంగిన్ నశించున్ మహా
పురుషా! యట్టికృపం గనంబఱచుచుం బూతాత్ముగాఁ జేయవే. 175

క. శరమిది నీపావనకర, సరసిజముక్తంబు నన్నుఁ జక్కఁగఁ దాఁకెన్
నిరుపమభాగ్యం బిదియే, పరమాత్మా! ముక్తిపదముఁ బ్రాపింతు నిఁకన్. 176

క. అసువుల వదలెదు నిత్తఱి, బిసరుహనయనా! సమీపపృథ్విన్ నీవుం
ట సమధికమోద మొదవున్, గసిదీఱఁగఁ దిట్టినాఁడఁ గనుకఁ దదఘముల్.

క. నను బాధింపఁగ నేరవు, తనిసితి నీలలితవాక్సుధాధారలచే
మనసొగిన్ దృప్తిం గాంచెను, వినుమా నాప్రార్థనంబు వివరింతు నిఁకన్. 178

సీ. ప్రాణాళికంటె నాకపట్టియంగదుఁ డధికుండుగా నా కెప్పుడుండుఁగాన
నతనికి నేమియు ॥ ననుజుమూలంబునఁ, గీడు మూఁడకయుండఁ జూడవలయు
నిదియె మనశ్చింత ॥ యని విన్నవింతు దీ,నినిమించినది నాదుమనమునందుఁ
గనఁబడకున్న దంచనినమ్ముమా రామ!, తారయు సుస్వాంత ॥ ధర్మనిరత
తే. దానిమానసమన్న నత్యంతకోమ,లమ్ము సుంతయు నడికి నాయమె మైలాడి
యోర్వఁజాలదు గాన సహోదరుండు, దానినలరింపఁ జేయను ॥ త్తరువానఁగుము
క. తనయుని నంగదు యువరా,జును జేయఁగఁ జిత్తగింపు ॥ క్షోణీధవ! పా
వనతావకకరసరసిజ,మున నన్ను స్పృశింపవయ్య! ॥ భూతశరణ్యా! 180
వ. ఇంక విశేషించి పలుకఁజాల నని తన్నుం జూచుచున్న వాలిం గాంచి రామ
చంద్రుం డిట్లనియె. 181
చ. శతమఖపుత్ర! సుంతయును ॥ సంశయ మొందకు నీకునెద్ది స
మ్మతమగు నట్లుచేయఁదగుమాడ్కిఁ బ్రయత్నముచేయువాఁడ దు
ష్కృతములు నిన్నునంట విఁకఁ ॥ గేవలమోదము నీకుఁ గల్గు నీ
సుతుఁడును భార్యయుణ్ వగలఁ ॥ జొక్కి తపింపకయుండఁ దేర్పమా. 182
మ. అనుచుండణ్ దపనాత్మజుండు రఘునాథాజ్ఞణ్ దలందాల్చి పా
వనసోదర్యపదద్వయంబు నయనద్వంద్వంబునం గ్రాల మ్రొ
క్కినఁగైదోయిని బట్టి రాఁదిగిచి దుఃఖింపంగ నేలా యిఁకణ్
మనుమీ రామునినాశ్రయించి కపులణ్ ॥ మన్నించి యోతమ్ముఁడా! 183
ఉ. అంగదు నాదరింపుము; ప్రియాంగనఁ దారను గారవింపు; చే
యంగల కార్యసంతతి మహామతి రాముఁడు చెప్పినట్ల చే
యంగఁ గడంగు; మంత్రుల మహాదరణంబునఁ జూచుచుండు నీ
కుం గడుఁగూర్పువారలనుగూడియె మంతన మెప్పుచేయుమా. 184
క. అనునంత నంగదుండును, వనితామణి తారయుం బ్లవంగబలంబుల్
చను దేర నూఱడించుచు, వనజాక్షుని రామచంద్రు ॥ వదలనిభక్తిన్. 185
క. పరికించుచుఁ బ్రాణంబుల, శరీరముం బాయఁజేసి ॥ శాశ్వతపదముం
జొరఁ బోయెను; శ్రీరాముని, కరుణం బడయంగరాని ॥ కలుములుగలవే? 186

## సుగ్రీవపట్టాభిషేకము.

ఉ. అంతట రామమూర్తి తగునట్టులె యెల్లర నూఱడించి లో
కాంతర మొందువాలికిఁ బ్రియం బొడఁగూడెడుభంగిఁగర్మమా
వంతయుఁ నంత లేనియటు ॥ లర్కభవుం డొనరింపఁజూచి యిం
కింతయు నాలసింపఁదగ ॥ దెల్లియ రాజ్యపదంబు నొందనా 187
క. అని కపినాథున కత్తఱి, ననుజ్ఞనిడియెం గవీంద్రుననుఁగుసచివు లా
వనజాప్తవంశభూషణు, ననుమతి నభిషేకమునకు ॥ యత్నము చేయన్. 188

క. తపనాత్మజుండు రాముని, కృపఁగని సౌమిత్రి రాఁగ నేగి పురమునన్
గపులెల్ల సమ్మతింపఁగఁ, గపిరాజ్య మహాభిషేకకలితుం డయ్యెన్. 189

క. శ్రీరాముఁడు మాసద్వయ, మారమ్యమహీధ్రవరగుహావలి నుండన్
దారాపతి సుగ్రీవుం, దారూఢసుఖంబు లొంద సప్పురియందున్. 190

క. నివసించుచుండె; శ్రీరాఘవు కార్యముచేయుతలఁపు గానక కామం
బవరోధింపఁగ దృక్పాటవమింతయు లేక మిగులఁదక్కరి యనఁగన్. 191

చ. అనిలతనూజుఁ డప్పుడపు డాతెఱఁగించుక చెప్పి చూచినన్
వనితలగోష్ఠినుంట సుఖవర్ధితమై మనసుంట దానినిన్
వినఁగఁ దలంపఁడయ్యె; రఘువీరునిశౌర్య మెఱింగియుండియున్
వినరుగదా హితోక్తులను వీఱేఁడులెల్లఁ గృతఘ్ను లౌటచేన్. 192

క. అరుదెంచె శరద్రాత్రులు, విరహాగ్నుల మండఁజేయువిధమున నంతన్
బరికించి రాముఁ డంపఁగఁ, బురికిం జని లక్ష్మణుండు భూతభయదుఁడై. 193

వ. రాజమందిరంబుఁ జేరి మహాగ్రహంబున. 194

క. ఎచ్చటనుండును గపిపతి, సచ్చరితుం డతఁడు కాఁడె శతమఖతనయుం
డెచ్చటనుండఁగఁ బుచ్చెనొ, యచ్చటులశరంబు రామునంతికమందున్. 195

క. నాలుకలు గోయుచున్నది, యాలో నాఁకలినిదిర్ప నేదియులేదే
చాలఁగ నేచెడుతుత్తని, యాలోచింపఁడు రవంతయైన రవిజుఁడున్. 196

క. తెలుపుఁడు నారాకను భార్యలతోడం గూడియుండున త్తరుణము రా
దిల నింక నతని కనున, ప్పలుకులు విని పోయి తెలుప భయము పొడమఁగన్.

ఉ. తారనుబంపి లక్ష్మణుని దారుణకోప మడంగఁజేసి చే
కూరినభక్తి రాఘవుని కూరిమితమ్మునిఁ గానఁబోయి యా
శ్రీరఘురాము కార్యమును జేయఁగ నెంచియె పిల్వఁబంచితిన్
జేరుదు రింతలోనఁ గపిశేఖరు లిచ్చట శౌర్యమేర్పడన్. 198

ఉ. వారలతోడ వచ్చి రఘువర్యుని యానతిఁ బంపువాఁడ; న
వ్వీరులు చూడనట్టి పృథివీస్థలరాజియె యుండ దల్లది
గ్వారము నంచు నమ్ముఁ డిదె వచ్చెద నాపయి శాంతమూని యా
భూరమణుండు కాచునటు పోలవచింపు సుమిత్రనందనా! 199

క. అనిపనిచి మఱుదినంబున, వనచరులంగూడి రాఘవప్రభుఁ జేరం
జని తప్పు సైఁప వేఁడఁగ, విని రాముఁడు సంతసించి విశ్వాసమునన్. 200

తే. కపివరా! కోపమూననిక్కముపచింతు, విషమహీరుహమైనఁ దాఁ బెంచి త్రుంపఁ
జనదటన్న నుడిన్ నేను విన్నవాఁడ, నౌట నీకు నెఱిఁగింతు నార్యపథము.

క. దానినివిని బాగని యెది, మానసమునఁ దోఁచు దానిమాడ్కి నడువఁగాఁ
బూనుము; వేఱొక త్రోవం, బోనగునే; దానఁ గీడు ǂ మూఁడదె నీకున్. 202

## శ్రీరాముఁడు సుగ్రీవునకు సంసారయాత్రాపద్ధతిం దెలుపుట.

సీ. వినవయ్య! కపివర్య ǂ విషయసుఖముల కాధారమైయొప్పు సంసారయాత్ర
చేయుపద్ధతియెట్లొ ǂ చెప్పెద సంగ్రహముగ; దేహిప్రాక్కర్మము దనుఁ బ్రోత్స
హింపఁగా జన్మించి ǂ యెట్టిఫలంబుల, నొందఁగాఁదగు వానికిం దగునటు
తనువమరంగఁ దదనుగుణవాంఛలు, పొలయంగ వర్తింపఁ బూనుఁ గాని
తే. వేఱువిధముగ వర్తించు వృత్తి గల్గు, వాఁడు కాఁజాలఁ డెవ్వఁడే ǂ బద్ధకర్మ
పాశుఁడౌట స్వతంత్రతఁబడయ లేఁడు, తలఁచుమూ సత్తఁ దానుస్వతంత్రుఁడనని.

చ. తనదగు కర్మమెట్టిదటె ǂ దారుణదుఃఖము లొందఁజేయునో
మనమునఁ గుందుచుండు; మఱి మంచిఫలంబులఁగూర్చు దేహమే
తనదనియే నెఱుంగక సతం బిటుసౌఖ్యములుండునంచు నెం
చును; దలపోయఁ డిందుఁగల ǂ సూనృతమెద్ది యటంచు సుంతయున్. 204

చ. తలఁపనిదుఃఖసంతతులు ǂ తన్నలయించుట కోరునట్లు వాం
ఛలు ఫలియింపకుండుట వెసన్ సుఖసంతతి పోవుచుంట తా
వలదని వేఁడినన్ వెతలు ǂ వారక తన్నెడబాయకుంట యిం
దుల కగు కారణం బెదియొ ǂ తోఁడనె యెన్నఁ గడంగఁ డొక్కఁడే. 205

మ. బలవంతంబగు హేతు వుండును దలంపం జెప్పఁగాఁ జూపఁగాఁ
దలమే గాక యటంచు బుద్ధిఁ దలఁపం ǂ దత్త్వజ్ఞులన్ వేఁడఁగాఁ
దెలియన్ వచ్చు ఁ వంతయే న దెపఁడీతీరొప్ప నూహింపఁడ
గ్గలమా నజ్ఞత తన్నుఁ బైకొన వనౌకస్స్వామి యాలించితే. 206

ఉ. దీనికిఁ గారణం బె దనిధీరులు చక్కఁదలంతు; రట్టి చో
మానసమందుఁ గర్మమె యమానుషశక్తిఁ జెలంగు నంచు న
ద్దాని మరల్పరా దనుచుఁ ǂ దప్పక తోఁచును; దాని సంతసం
బూని శరణ్యమంచుఁ దలయొగ్గుటయే తగినట్టి కార్యమా. 207

చ. పలుకులు పెక్కులేల? కపిపాలక! దుఃఖసుఖంబులందు వ
ర్తిలునొకరీతి నెవ్వఁడు ధరిత్రిని ధన్యుఁ డతండె; వానికిం
గలుగవు నెవ్వగల్; పరమకర్మరహస్య మతం డెఱుంగుటన్
సులలితశర్మముం గనెడు చొప్పు నెఱింగిన వాఁ డతం డగున్. 208

చ. భవమనునద్ది సాగరనిభంబని పెద్దలు పల్కుచుంద్రు; త
ద్భవగురుభంగసంతతులవంటివె కర్మఫలంబులౌటచే

నెవఁడును వానిఁబొంది యిఁక । నీయవి చాలును దృప్తి నొందితిన్
జవమున వీని దాఁటఁగను । జాలితి నంచు వచింప లేఁ డిలన్. 209

చ. శరణము నీవె; నిన్నెఱుఁగఁ జాలను; మూఢుఁడ నన్ను బ్రోవుమా
పరమశివా! యటంచు బలుభంగుల నాభగవంతు నాత్మహృ
త్సరసిజపీఠసంస్థునిఁగ । జ్ఞానయుతిం దలపోసి ధ్యానయో
గరతిని గొల్చుటెన్న భవకంధిని దాఁటునుపాయమై తగున్. 210

సీ. తనకుఁగల్గిన ఫలతతులయం దాసక్తిఁ, బూనకుండుటయె సోపాన మాద్య;
మనుభవించెడు వేళ । నది మేలునకె తన, కనితలంచుట ద్వితీయమగుభంగి;
యీరెంటి నెవ్వఁ డెంతేని శ్రమంపడి, యభ్యసించునొ దాఁట । నతని కరయ
భగవదారాధనఫలముతప్పకకల్గు; మార్గాంతరము లేదు । మాననీయ
తే. మైన దనినమ్ము చక్కఁగ । వానరేంద్ర!,విషయసుఖములు నమ్మించి । వెఱ్ఱివానిఁ
జేసి విడనాఁడు నెవనినే । గాసినొందు, నవలనాతఁడు దీని నీవాత్మ నిలిపి. 211

క. చేకూరిన సౌఖ్యములం,దే కూరిమి నుంప కెట్టులేఁ బొందుచు న
ప్రాకృతుఁడ వగుచు మెలఁగుము, శ్రీకలితుఁడ వగుదు వేల । చెప్పఁగ నింకన్.

మ. వనితాగోష్ఠి పొసంగినన్ మనము తద్వ్యాపారలీనంబుగా
క నితాంతప్రమదాంబురాశియె యనంగాఁ గ్రాలు దైవంబునం
దె నెఱిన్ నిల్వఁగఁజేసి ప్రాప్తమగునేదేఁ బ్రీతిగా నెంచి నీ
వనుభూతిన్ లయ మొందఁజేయుము సుఖం । బబ్బున్ గదన్ దానిచేన్. 213
తే. మనము చక్కఁగ నిలుపనేర్చిన యతండె, కర్మదృఢపాశబద్ధుండుగాకయుండు
మనసు చపలతఁగాంచనిమాడ్కి నిలుప,దగినదొక యోగమే యనితలఁపదగును.

క. మనసునకుఁ జంచలత్వం, బనునది సాజంబ దాని । నరికట్టంగా
ననువైనది యోగంబే, యనవలయున్ వేఱొకటియు । నన లే దెందున్. 215

క. గురుమూలముగా యోగము, పరిగ్రహింపంగఁ దగును । బటుతరదీక్షా
నిరతిమెయి నభ్యసింపఁగఁ, బరమఫలం బబ్బు; హృచ్చపలత తొలంగున్. 216

క. వేదాంతవాక్యపఠనము, పోఁద్రోలును జపలత నని । పోరాడుదు రా
వేదాంతులె యోగంబున, నేదియొ తెలియంగ లేమి । నిటు లనుటెల్లన్. 217

చ. గురువు యథా విధానమునఁ గూర్చెడుశిష్యుఁడటంచు యోగ మె
క్కరణిగ నభ్యసింపనగుఁ? గానిపథంబన నెద్ది? యందు నె
వ్వరుసఁ దదీయచిత్తగతిపర్వును? వీని నెఱింగి తెల్ప నా
దరమున నట్టులే గురువుదాపుననుండియె యభ్యసింపనా. 218

సీ. గురువు తెల్పినయట్టి గుఱుతు తప్పకయుండ, సంతతాభ్యాసనిష్ఠను వహించి
శిష్యుఁడు విసుఁగు నేచెందక యయ్యది,సిద్ధినొందినదాఁక । చెలఁగుశ్రద్ధ

నభ్యసించుచుఁ దన యంతఃకరణచంచలత స్వానుభూతి నేవితమునఁ దగి
యున్న దంచు నెఱింగి మన్న సమీఱంగ, నది సిద్ధినొందు పర్యంత మెల్ల
తే. యభ్యసించుచుఁ జంచలత్వాఘరహిత, ముగ మనస్సుండు నెత్తఱిఁ దగు నటు ఫలి
యించె నిప్పటికి యోగ మంచు నెంచి, ధ్యాననిష్ఠ సేవింపనౌ దైవముఁ దమి.

క. ఈపథము మాని వేఱొక, కాపథమున మనసు నిల్పఁగల్గుదు మని త
ద్వ్యాపారపరత నుండినఁ, జేఁడు నే సత్ఫలంబు చింతింపు మెదన్. 220

క. నీవును భవసాగరమున, నేపథమున మున్గకుండ నెది యుత్తమమా
త్రోపయొ దానిని వెదుకం, గావలయును; లేనిచో సుఖం బభ్రంబౌ. 221

క. దైవంబున లభియించిన, దేవిధమగు సౌఖ్యమైన నిది స్థిరమనుచున్
భావింపక నిస్పృహతన్, నీవుండుటె సత్పథంబు నీతియు నిదియే. 222

క. నళినీపత్రగతంబగు, జలము వలెన్ జీవితంబు చాలఁ జపలమౌఁ
దలఁపం దగ జేస్థిరపద, మలరునొ యెయ్యదిగ నంచు నాత్మబలమునన్. 223

క. దినములు రాత్రులు సంధ్యలు, చనుచున్నవి వేలకొలఁది సమయమ్మునకున్
జనుదెంచుచున్నయవి మఱి,యును జీవిత మెల్లఁ గడచుచున్నయది కదా!

క. మనయాయు వెంత యనుచున్, మనుజులు తలపోయ; రిది శమనుఁడు సహింపన్
బనివూనఁ; డెప్పుడో తాఁ, జనుదెంచుం జంపు నట్టి సమయమునందున్. 225

క. చనినట్టిది తలచిన నే,పనియగు; జీవితమదింత పరిమిత మనుదా
ని నెఱుంగమిఁ ద్వరపడి యే, పని యొనరుపఁ దగునొ ధర్మపథ మద్దానిన్.

ఆ. అప్పు డుండు వెతల నాత్మ గణింపక, యెల్లియుండు నన్న యీప్సితంబుఁ
బాఱ దోలి భక్తి భగవదారాధన, పరతఁ గనుటె ముక్తి కరుగు తెరువు. 227

చ. అని శాంతమొప్పఁ జెప్పఁ విని యర్కతనూజుఁడు రామచంద్ర! నే
వనచరరాజి యుత్తఱిని వచ్చికినంబడుఁ డంచు నాజ్ఞచే
సిన సమయంబు నిన్నటికిఁ జెల్లెను; సర్వదిగంతరస్థులౌ
వనచరులెల్లఁ జేరి; రిఁక వారిని బంపెద నీవు చూడఁగన్. 228

## సుగ్రీవుఁడు వానరులఁ బంపుట.

సీ. అని నచ్చఁజెప్పి మహావీరులైతగు, ప్లవగవరేణ్యుల బలరిపుసమ
విక్రములౌ వారి వీక్షించి శ్రీరాము, కార్యము వినిపించి కడఁగి మీరు
కామరూపులు కాన క్ష్మాపుత్రి యెందున్న, వెదకి రండని ప్రీతి వెలయఁ దెలిపి
మరలి వచ్చుట కొక్క మాసంబు గడువని, యాజ్ఞమీఱినశిక్ష యతికఠినము
ఆ. గాఁగఁ దెల్పి క్రమముగా మహేంద్రునిదిక్కు, మొదలుగాఁగ నాలుగు దెసలకును
బంపె వారిలోనఁ బవనాత్మజప్రభృ,తు లొగి దక్కినంపుఁ ద్రోవఁ బోవ. 229

క. సెలవొందఁగ శ్రీరాముఁడ,నిలతనయుని జేరఁబిల్చి నెమ్మిని ముద్రాం
గుళినిచ్చి సాగ నంపఁగఁ, దలఁదాల్చి తదాజ్ఞఁ జనియె దక్షిణమునకున్. 230

తే. అంగదాదులు వనచరు । లల్లి జాంబవంతుఁ డాదిగఁగల్గిన । భల్లుకములు
రాముకార్యము నెఱవేర్ప । రమణఁజనిరి, వెదకి రయ్యైయితావుల । వేడు కలర.

క. తక్కినదిక్కుల కరిగిన, యక్కపు లం దెందుఁగాని । యవనీసుత లే
దక్కజముగ వెదకితి మని, యక్కపిరాజునకుఁ దెల్పి । యం దుండంగన్. 232

వ. హనుమదాదు లయ్యైతావుల వెదకి యెందును గానక మహాద్రిగుహం బ్రవేశించి మహాంధకారబంధురంబగు నాగుహాంతరాళంబున వెదకుచు నొకవిచిత్రవనముం గాంచి యచ్చెరువందుచు నందొకసుందరిం గని యాతపస్వినిం బ్రార్థించి యాగుహావార్తల నెఱింగి తమవచ్చినవార్తలం దెలుప నాస్వయంప్రభయు వారలదీనత్వంబు నెఱింగి వనచరవరులారా! యీగుహం బ్రవేశించినవారు ప్రాణంబులతో మరలి పోవ శక్యంబుగాకుండు. నాతపశ్శక్తి మిమ్ము వెడలించెద. కన్నుల మూసికొండనిపలికి వారట్లసేయ నిజతపోమహత్త్వంబున వారల వెడలించి యిఁకఁబోయి రండని తెలిపి మరల నాత్మగుహం బ్రవేశించె. అంత వారు రాజిచ్చిన గడువు దాఁటుటయు సీత గానరాకుండుటయు విచారించి దుఃఖసాగరనిమగ్నులై రంత జాంబవంతుం డిట్లనియె. 234

చ. వనచరులార! మాస మని । వానరనాథుఁడు పల్కె నంతలో
జనకజఁగాంచి రావలయు । శాసనమీయది దాఁటిరేని మే
దిని మనఁజాల రంచును బ్ర।తిజ్ఞనొనర్చెను; వాలికంటె నీ
తనిమది క్రోధయుక్త మతి। దారుణరూపము నొఁగదా యిఁకన్. 235

తే. చేయవలసినపనియేమి । చిత్తములను
దలఁచినారలె! యీకొండ। బిలముఁ జొచ్చి
యందుఁ దిరుగుచు గడు వెప్పొడనువిషయము
తెలియకుంటిమి కృత్య మి।ద్దియని యిపుడు 236

క. తలపోయఁ జనును గాఁదే, పలుకుఁడు మీతోఁచుదానిఁ । బలుకకయున్నన్
గలుగునె ఫల మెద్దియు; రాజులనెయ్యము నమ్మఁదగని।చొప్పునఁ దగుఁగా.

ఆ. ఇపుడు మాటలాడె । నెంతొహితముగాఁగ, ననుచు నమ్మరాదు । వినుఁడు పిదప
నశని సదృశ మగుచు । నమరు నాతనిమది, కార్యభర మె త్రిప్పఁ।గలుగు దాని.

చ. అనిలకుమారుసందుఁ బ్రియ । మత్యధికంబని యెన్ని జానకిం
గనుఁగొనఁ జాలమైతిమని । క్రమ్మఱిపోయినఁ గ్రూరదండనం
బునఁ గడతేర్చు నీమనల । భూపతులెల్ల నిదే విధంబునన్
గనఁదగియుండ్రు గానఁ జన।గా దని నామదిఁ దోఁచు నిత్తఱిన్. 238

క. ఊరకయుండినచోఁ జేకూరునె ఫలమెద్దియన్నఁ । గూడినవ్యథ చే
నోరు మెదల్పక యంగదుఁ, డోరిమిఁగని యుండె నట్లె।యుండి రితరులున్.

క. మారుతపుత్త్రుం డత్తఱిఁ, జేరువఁ దగు భల్లుకేంద్రు చిత్త మెఱిఁగి నీ
వీరీతిఁ బల్కినట్టి ది, క్కేఱిక మాకెల్ల నిద్ది హితమని తెలుపన్ 240

క. ఐన మఱొక్కటి యడుగం,గా నెంచితి మిమ్ము; నంధకారావృతమై
పోనేరి కశక్యంబుగఁ, గానంబడు బిలమునందుఁ గంటి మొకసతిన్. 241

క. మునివేషమూని కరుణా, వననిధియే యీమె యనెడు వడువునఁ దగు నా
వనితారత్నము మనలన్, గొనివచ్చెం జిత్తశక్తిఁ గొబ్బున వెలికిన్. 242

సీ. ఇందుఁ జొచ్చిన వార లెవ్వరైనను బ్రాణ,ములతోడ మరలంగఁ బోల దనియె
నాగుహావృత్తాంత మామె చెప్పినయట్లు, సత్యమే యని నాదు స్వాంతమునకుఁ
దట్టె; నందున్నట్టి తరువరంబుల సృష్టి, నెందైనఁ గంటిమే యెన్నఁడేని
యాఁకలిదప్పుల నయ్యవి పోకార్చు, జిత్తశాంతిని గల్గఁ జేయుఁ జాలు

ఆ. హేమభూరుహమ్ము లిలనుంట వినలేదు, వెలయునను చు నెపుడు వలఁప లేదు
జాంబవంత! తద్విషయమున నీవేమి, పలుకుదువో వినంగ దలఁచినాఁడ 243

మ. అని ప్రశ్నింపఁగ జాంబవంతుఁడను నార్యా! దానివృత్తాంతమున్
మును వింటిన్ మును లేరొ చెప్పుకొనఁగాఁ బూర్వంబ దెవ్వారొ యే
మనుజుల్ దేవత లింకఁ గల్గునెవ రేమాడ్కిం జొరన్ రానిరీ
తిని నిర్మించిరి యోగశక్తిమెయి సంతృప్తిన్ వసింపన్ గిరిన్. 244

ఉ. అందఱమందె యున్న మనయార్తి తొలంగియెయుండు; నాతిమి
న్నం దగ వేఁడ యోగినియు నైజతపోవిభవంబు చేత నీ
యిందఱనున్ క్షణార్ధమున నే గొని తెచ్చి మృదూక్తులాడి పో
యెం దనయాశ్రమంబునకు నెంత మహత్త్వమొ యెన్న మారుతీ! 245

సీ. త్రిజగంబులందు నేదియుఁ దపశ్శక్తికి, మించినయదియె లే దెంచిచూడఁ
జిత్తశుద్ధిఁ జెలంగి చేసినచోఁ దప, మాపరాత్పరునిఁ బ్రీతాత్ముఁ జేయు
దాన దివ్యంబయి మాననీయంబగు, తేజస్సు ప్రాప్తించుఁ దేరిచూడ
నలవిగాకుండ నయ్యది శీర్షమును జుట్టి, పామరులకు గానఁబడనియట్లు

తే. వెలయుచుండును దాన నే తలఁచినట్టి, కార్యములు సాగు భగవంతు కరుణ యనఁగ
నద్ది యేసుమ్ము దానికి సుద్దియైన, దెద్దియును గానరాదని యెఱుఁగు మీవు.

క. అని తెలుపుచుండఁ దక్కిన, వనచరు లంగదుని గూడి వదలం దగు నిం
దె నిలిచి ప్రాణంబుల నిఁకఁ, జన రాదు కపీంద్రుఁ డున్న చక్కటి కనుచున్. 247

క. ప్రాయోపవేశ మూనఁగ, నాయెడ దృఢనిశ్చయాత్ము లైనం గని వే
యాయనిలాత్మజ భల్లుక, నాయకు లారితిగను మనంబులతోడన్. 248

### సంపాతి వానరులకడకు వచ్చుట.

ఆ. పవ్వళించియుండఁ బక్షియయ్యును దగ్ధ, పక్షమౌట వారిఁ బాఱఁజూచి
మెల్ల మెల్ల నడిచి యల్లవా రుండెడు, వసతిఁ జేరనపుడు వచ్చుచుండి. 249

క. ఆహా! యెన్నాళ్లకు నీ,యాహారము నాకుదొరకె నాఁకలిమిగులన్
దేహము పీడించెడు రిపు, లాహవమునఁ జిక్కియున్నయనదం బోలెన్. 250

క. అని చెంతకు వచ్చుటఁ గని, వనచరనాథాత్మజుండు వరుసఁ గపితతిం
గని పల్కెను దుర్మరణం,బును గాంచఁగవలయు మనము భూరివిధిహతిన్. 251

తే. వచ్చుచున్నది యీపక్షి వరుస మనలఁ, దినఁగ శ్రీరాముకార్యమీతీరునఁ జెడు
సమయ మీయది యతనికిసాయపడిన, యాజటాయువుపలె మనకంత మిదియె.

క. చేరువనున్నది కాదే, దారుణపక్షిస్వరూపతన్ మనమింకన్
శ్రీరామునికై ప్రాణము, లీరీతిం గోలుపోవనే విధివ్రాసెన్. 253

చ అనిపలుకంగ నాపతగ మల్లన నోఘనులార! రామకా
ర్యనిరతి నాజటాయువు గతాయువుగాఁ బలుకంగ వింటి నా
యనుజుఁ డతండు చచ్చినది యంతయు నాకెఱిఁగింపుఁడన్న నా
తని కెఱిఁగించె నవ్విధము నంతయు నంగదుఁ డోర్పుమీఱఁగన్. 254

శా. ఆవార్తల్ చెవిసోఁకఁ బక్షియుగ మత్యాశ్చర్య మేపార రాఁ
గా వానింగని వానరోత్తములు పొంగన్ గాంచి సంపాతి మీ
యీవాక్యంబులు విన్నఁ బక్షియుగ మిప్డేవచ్చెఁగాదే మిముం
గావంబూనెద నాజటాయువు తెగెంగా రాముకార్యార్థమై. 255

చ. అని యనుజాతవర్తనము నంతయు వారికిఁజెప్పి తర్పణం
బొనరిచి రావణాసురునియుద్ధతిఁ జెప్పుచు సీతఁగొంచు నా
దనుజుఁడుపోయె లంక కని తత్పురి సీతయు నున్న దిప్పుడం
చు నెఱుఁగఁజెప్పి మార్గమును జూపఁగ వానరు లాత్మఁ బొంగుచున్. 256

చ. పతగమహేంద్రునిం బొగడి పర్వతముం దిగి దక్షిణాంబురా
శితటముఁ జేరి యందఱును సీతను జూడఁగఁబోయిరాఁగ న
బ్ధితరణశక్తి ముఖ్యమగు దీని నెఱుంగఁగఁబోలు నంచు స
మ్మతి నిఁకఁ గైకొనందగు నమానుషకృత్య మిదౌట నిత్తఱిన్. 257

చ. పదిపదులన్నియామడలపాటి విశాలత నొప్పు సంద్ర మీ
యది; భయదాకృతింబొలుచు నంబుధి; దీనిఁ దరించి యవ్వలం
బొదలు నిశాచరేంద్రపురముం గని యందు విదేహరాట్సుతన్
గదిసి యనామయం బడిగి క్రమ్మఱి రాఁదగు నిద్ది కార్యమౌ. 258

ఉ. ఇంతటిసాహసంబునకు నెవ్వఁడు శక్తుఁడొ వానిఁ బంప ధీ
మంతుఁడు జాంబవంతుఁడె సమస్తవిధంబులఁ జాలువాఁ డటం
చెంతయుఁబూన్కిఁ బల్కుటయు నెల్లరవాక్యము లాలకించి మా
కింతటిశక్తి గల్గునని యెల్లరు పల్కుఁ డటంచు నత్తఱిన్. 259

సీ. జాంబవంతుఁడు పల్కె సత్వంబుఁ గొలఁదుల, నెఱిఁగించి రంద ఱట్లేము సంద్ర
మెగురఁగాఁ జాలుఁదు మిన్నియామడలని, తెలుపఁగా విని సన్మతిని జెలంగు
భల్లుకేంద్రుం డను ప్లవగవల్లభులార!, నేఁడాఁటఁ జాలుదు నీరరాశిఁ
గ్రమ్మఱి యిటకురాఁ గల్గుదునను వార్త, సంశయాస్పదమగు జరయె దీని
తే. కారణంబని తలపోయఁగాఁ దగు మును, పిట్టి కార్యము లెన్ని యో యేను జేసి
నాఁడనంగదుఁడితఁడు వానరవిభుఁడగుఁ, గానఁబనుపంగ రాదు నిక్కము వచింతు.

ఉ. ఇంతకు మున్ను పేర్కొనవ దేటికొ యీహనుమంతునంచు మీ
రెంతయు నూహసేయుదురొ యేమొ వచించెదఁ గార్యభారమా
వంతయు లెక్కసేయక క్షణార్ధమునం బొనరించు శక్తియే
చింతయు లేనిబుద్ధియును జేపడియుండఁ దనర్చు నీఘనున్. 261

మ. హనుమంతుం దలపోయ కెవ్వరికి నేయర్థంబునం దెంతశ
క్తిని దైవం బొనగూర్చెనో తెలియుకోర్కిం గాంచియుట్లుంటి; నీ
తనిశక్తిం గొనియాడ నాతరమె భూధ్రవ్రాతముం గొంచుర
మ్మనఁ దెచ్చున్ బవనాత్మజుం డితఁడహార్యప్రక్రమం బొప్పఁగన్. 262

మ. సురలెల్లం బరమేష్ఠియుం దొలుత నీశూరాగ్రణిన్ సద్వరో
త్కరభూషాన్వితుఁ జేసి; రీమహితువంశకున్ మేలుచేకూరు ని
ర్జరకార్యంబుల కంచు; నీతని నవేశస్త్రాస్త్రముల్ చంప నే
వరుసం జాలవు నొంపఁజాలవు సుఁడీ! వర్ణింప నిం కేటికిన్. 263

మ. తనదౌశక్తిని దా నెఱుంగనటు లుద్యద్ద్యోగశక్త్యున్నతిన్
మును లొక్కప్డు శపించి; రీఘనుఁడు తమ్ముం గాంచి భీతిల్లకొ
క్కని మేషంబు స్థిరత్వముం గనక తత్కాంతారమందున్ జవం
బున సంచారము చేయుచున్ శిశుత తన్ బూన్పంగఁ దద్వస్తువుల్. 264
ఆ. కొనుచుఁబోయి సంద్రమున వైచుచుండంగ, నేమిచేయఁ జాల కితనివలనఁ
గలుగనున్న యుపకృతుల నెంచి తనశక్తి, యెఱుఁగకుండు నని శపించి రంత.

క. తనశక్తి యిట్టిదని చెప్పనయే నొక్కం డెఱుంగఁబోలు ననుచు ము
క్తిని దానికిఁ దెల్పిరి నే, విని నాఁడం గాన మీకు వినఁగఁ బలికితిన్. 266

చ. వననిధి దాఁటి సీతఁగని వచ్చుజవంబునఁ గాన వాయుపు
త్త్రు నితని వేఁడుకొంద మనఁ దోరపుఁబ్రీతిని వార లెల్ల నీ
పని నొనరించి మావయిన ప్రాణములన్ నిలుపంగఁ బూను మో
యనిలతనూజ! యన్న విని యాదృతి లేచి సముద్రుఁ గాంచుచున్ 267

చ. అరిగెద లంక కే నిపుడె యంబుధి గోష్పదమట్లు దాఁటి యా
శరవరు మస్తకంబుల నెసంగెదు శక్తిఁ బదంబుఁ బెట్టి రా

ద్వరుసతిఁ గాంచి క్షేమమును ౹ బల్కి యనామయవార్తఁ దెత్తు; మీ
రురుముద మావహిల్ల నిటనుండుఁడు; దీవన లిందు పోయెదన్. 268

ఆశీర్వచనఫలములను హనుమంతుఁ డెఱింగించుట.

ఉ దీవనలన్న నెట్టివనుతీరు మహాత్ములు చెప్పవింటి మీ
కే వివరింతుఁ జాపలము ౹ నెంచక యించుక యాలకింపుఁ డే
యేవిషయంబు లందయిన ౹ నింతులు పూరుషు లవ్వి గోరనాఁ
బావనచిత్తులై సుఖము౹పాటిల జింతలుపాయఁ గోరుచున్. 269

చ విమలమనీషులై తపము ౹ విశ్వహితార్థ మొనర్చుచుఁ మనః
కమలపదంబునం బొలయు౹ కాంచనవర్ణు నిరంజనుఁ సమ
స్తము దనరూపమైవెలయు౹దైవము ధ్యానవిధానపూజలఁ
బ్రముదితుఁజేయుచుఁ ఫలము ౹ రాఁదగునంచుఁ దలంప కించుకే. 270

మ. పరమేశుండు ప్రసన్నుఁడౌటయె తపస్సంతానలాభం బటం
చరయం జాలినపెద్దలం గని మనం౹బానందసాంద్రంబుగాఁ
బరఁగుం గావున నార్యులార! యిపు డీ౹భారంపుఁగార్యంబుఁ జే
యుపతిం గాంచితి సాగు నీయ దనిమీ ౹ రూహించినఁ బండెడున్. 271

క. అని వేఁడవలయు వారలు, పనియది భగవంతుకృపను ౹ ఫలవంతంబౌ
నని పల్కుదు రద్దియె దీవన యని చెప్పంగఁబడును ౹ బ్రాజ్ఞులచేతన్. 272

క. ఇది సత్కార్యము దైవము, పదిలముగా దీనివేగ ౹ పండఁగఁజేయం
గఁదగు నని యెంచువారలె, గద భక్తులు వారెమునులు౹గాఁదగుదురిలన్ 273

ఆ అట్టివారివాక్కు ౹ లవె ఫలించునుగాని, కపటచిత్తులగుచుఁ ౹ గలుషరహితు
లట్లు లభినయించు౹నాతుచ్ఛు లాడిన, పల్కులెట్లు ఫలముఁ ౹ బడయఁజాలు.274

క. ధనమిచ్చిన నైశ్వర్యం, బున దీర్ఘాయర్దాయమునను ౹ బొలుతువు గాకం
చును దీవించెడుజాల్ము వ, చనములు ఫలియించు టెట్లు ౹ సన్మతులారా! 275

క. ఇతరులకు మేలుగలుగఁ, బ్రతినిమిషముఁ దలఁచుచుండు౹భక్తుల వగువా
క్యతులె ఫలించును దక్కిన, కృతకమతుల్ పల్కునుడు ల౹వెట్లుఫలించున్.276

క. చిత్తవిశుద్ధియె ఫలసం,ప్రత్తికి మూలంబు నదియె ౹ పాటిలకున్నఁ
రిత్తయెయగు వచనం బని, యెత్తటి నేఁ దలఁపవలయు ౹ హితమతులారా! 277

ఉ. ఉత్తమమానసం బనిన ౹ నొండుతలంపులు మాని యీశ్వరా
యత్తముగా సమస్తజగ ౹ మంచుఁదలంచుచు యోగశాస్త్రసం
పత్తి తగంగ నొప్పునదె ౹ పావనచిత్తు లనంగ నద్ది స్వా
యత్తముగాఁగ నుండు నరు౹లంచుఁ దలంపుఁడు మీర లెప్పుడున్. 278

ఉ. మీరిపుఁ డారఘూద్వహుని ౹ మించినభక్తిని లోఁదలంచి యీ
భారపుఁగార్యమెల్ల మును౹వారమ రేశ్వరమోదదంబుగాఁ

గోరఁగ నర్హమైతగుట । గొబ్బున నిద్ధిఫలించునంచు గం
భీరవరాశిషంబు విడి । పెంపునుగాంచఁగఁ జేయుఁ దేగెదన్. 279

ఉ. రామునికార్యమాటఁ గపిరాజహితం బదియాట దేవతా
కామముఁ బండఁజేయఁగ నొకం డిదె సాధనమాట మీరు శ్రీ
థామునిభక్తులై సువిహితంబుగ దీవనలీయఁబూనుటల్
నామది యుత్సహింప జతనంబును బూనక యెట్టులుండెదున్. 230

క. సాగరమీయది యల్పము, గాఁగఁ గణుతించి వాయుగతి మించంగా
నేగెద లంకాపురిలో, నేగతినో సీత వెదకి । యెల్లవిషయముల్. 281

క. కనుగొని క్షేమంబున వత్తును మీకుం దెల్పువాఁడ । దొయ్యలికుశలం
బని నమ్మఁబలికి రాముని, మనమున ధ్యానించి వంచి । మస్తక మెలమిన్. 282

తే. రాముపాదాంబుజంబులు । రమణసోఁకి, నట్లు చింతించి వాలంబు । నలరి పెక్కు
సార్లు త్రిప్పుచునూఁగుచు శ్రవణయుగముఁ, జక్కనిక్కించి మదియందు జనకునిలిపి.

సీ. మునివరేణ్యుల మూలమున సంగ్రహించిన, యోగవిద్యాశక్తి నూని కాయ
మునకు నట్లాకాశమునకు సంబంధసం,యమమున లఘుతూలమట్లు తేలి
కగనుండు తనువు నగాధజలంబులఁ, బాదంబులఁ జరింపవలనుపడుట
సాలెపురుగు సేయు । సన్నని తంతువు,లందుఁ గూడఁ జరింప । ననువుపడుట
తే. రశ్మిసంతానమున సంచరణముసల్పు, శక్తియలవడుఁ గానవా । శ్వసనసుతుఁడు
వ్యోమమునసంచరింపంగ నోపునట్టు, లగుటనా యోగమూని దేహమును లేపి.

క. తూలము లేశమువలెఁ దను, వాలోనం దేలికయయి । యమరుట చేతన్
గాలికిఁ బోయెడు రీతిగ, నాలవణాంబుధిఁ దరించు నాశయ మలరన్. 285

క. చనియెను గగనంబున నా,తనిరూపము జలములందుఁ । దద్దయుఁ బొడవై
గనఁబడియె నడ్డముగ వే, చనుచుండుట సురలు చూచి । సంతసపడఁగన్. 286

ఆ. చిత్రమిద్దియేమి । గాత్రమీయది తాళ, తరువుమీఱి సురపథమున వాయు
గతినిమించి యడ్డ । మితరమేదియు లేని, యట్లుపోవుచున్న । దనుచు సురలు.

క. పరికించుచుండఁగా సా,గరమా మైనాకభూధ్రకాంతుఁ బిలిచి యో
ధరమా! నాపైఁ జను కపి, వరునకు దోడ్పడఁగ లెమ్ము । త్వరగా ననుచున్.

ఆ. మఱియుఁ బలికె నితఁడు మహితాత్ముఁడగు రాము, కార్యమునకుఁ బోవఁ గడఁగెఁ గాన
సుంత నిలిచిపోవ । నంతయాయాసంబు, గలుగకుండు ననుచుఁ । దెలియఁజెప్పి.

### సముద్రుఁడు మైనాకుని హనుమంతునకు సాయపడఁ బంపుట.

క. వినుమా మైనాకా! నీ,కనుమానము లేక నామహాశయమునె తాఁ
గొని తెచ్చి వైచెఁగాదే, యనిలుఁడు మును తత్సుతుండు హనుమ యితఁడగున్.

క. ఆయుపకారము మదిఁదల,పోయుము శ్రీరాముఁ డనఁగఁ । బూర్వము సగరుం

డీయవని బ్రోచెఁ దత్సుతు, లేయభివృద్ధిం గనంగఁ । నీ ననుజేయన్. 291
ఆ. సాగరంబనంగఁ । జాలితి నేనది, మొదలు వారివంశమున జనించె
రాముఁడట్టి ఘనునిరమణిని రావణుఁ, డెత్తుకొని చనంగ । నీఘనుండు. 292
క. ఆతరుణీ వృత్తాంతము, నీతఁడె నెఱుఁగఁగఁ బోవ నెంచి జవమునన్
వాతగతి నరుగుచున్నాఁ, డీతనికిం దోడుపడుట । యొప్పదె మనకున్? 293
ఆ. నీకు నాకు నెంతొ లోకప్రసిద్ధిగా, నుపకృతుల నొనర్చియుంటఁ బూజ్యు
లిరువు రందు నీతఁ । డీనీకు నుపకృతిఁ, జేసియున్న ఘనునకే సుతుండు. 294
క. కావునఁ ద్వరపడి పొమ్మా, నావిని మైనాకుఁ డడిగె । నాకు నుపకృతిం
గావించిన మారుతునకు, నేవిధమున నితఁడు సుతుఁడొ । యే నమ్మఁజుమీ. 295

హనుమజ్జననము.

సీ. వాయువు దేవతావర్యుండు తత్సుతుఁ, డనఁబడు నీతండు । వనచరుండు
చిత్ర మాయది నాకుఁ జెప్పు మీతని జన, నాదికం బంత మహాజవమునఁ
బోయి యూఱటఁ గల్గ । నీయెడఁ గావించి, నీకు సంతోషంబు । నే నొనర్తు
నని ప్రశ్నమును జేయ । నంబుధి సంతస, మావహిల్ల వచించె । నద్రివర్య!
తే. ప్రశ్న మీయది యుత్తమపద్ధతి దగి, యున్న దనవలయును గాని । యొప్ప దిప్పు
డనఁగ రాదువదింతు నీయనఘుఁ డేల, వాయుసుతుఁ డయ్యెనయ్యెనో వనచరుఁడుగ.
క. ఏదోషంబున నీతని, కీదేహము గల్గ వేదహీనగుణుండౌ
శ్రీదయితునకున్ భక్తుం, డై దైవాసను మహాత్ముఁడై వినుతిఁ గనున్. 297
ఉ. దేవత లెల్ల భూతములఁ । దేజము సొంపున నగ్రగణ్యులై
పావనతం జెలంగి స్తుతిపాత్రులుగాఁ దనరారి; రందుఁ బెం
పావహిలంగ వాయుగణ । మప్రతిమానబలాధికంబుగా
నేవిధి నెంచిచూచిన మహిన్ దివిఁ బూజ్యముగా నెసంగెడున్. 298
క. దానికి నధినాథుఁడు పవ, మానుండగు లోకవితతిమర్యాద తగం
గా నెల్ల దేవతలలో, దా నధికుం డగుచు సుగుణతతిఁ బెంపొందున్. 299
క. బలపౌరుషముల నాతనిఁ, దలకడచు నమర్త్యుఁడెటు వెదకినం గనరాఁ
డలఘుమతిం దగుచు మహా, బలుఁడను పేరం జెలంగెఁ । బర్వతవర్యా! 300
ఉ. ఆపవమానుఁ డర్థిఁ దనయంఘ్రులఁ గొల్చెడు వారి వాంఛ లే
యేపగిదిన్ ఫలించు నటులే కృపమీఱఁగఁ గాంచుచుండు న
ట్లాపద లెల్లఁ బోనడచి । యర్హవిశాలయశంబు నొందు న
ట్లాపరమాత్ముఁ డుండుపద । మందఁగఁ జేయుఁ దుదన్ గిరీశ్వరా! 301
మ. వినుమా మేరుమహీధరం బనఁగ నుర్విన్ ఖ్యాతి మించుం గదా
కనకక్ష్మాధరమన్న నద్దియె యనంగా వింటివే కాదె; దా

నినిబోలఁదగు పర్వతం బొకఁడు వర్ణింపంగ లేదంచుఁ బ్రా
జ్ఞనికాయంబె వచించు నున్నతియు మింౕచం బోల్చు నాయద్రియున్. 302

ఉ. దానిగుహాంతరాళములు । ధామములై తగ నిర్వికారతన్
మౌనులు హృత్పదంబున నమానుష తేజుని బ్రహ్మమున్ సదా
ధ్యానముఁ జేయునిల్పి విధిౘదప్పక కొల్తురు చారువస్తుసం
తానము లేకయే కలుగు । దానన సత్ఫల మన్న నమ్మికన్. 303

క. అదె సంప్రయోగాచారం బన, విదితంబగు విధులయందు । వినుతిం గన న
య్యదిలేమి తగియుండెడు; నిం,పొదవన్ యోగులకు దాన । నుర్వీధేంద్రా!

తే. వస్తుబృందంబు సేకరింపంగఁ దగిన, కష్ట మించుకయే లేక । యిష్టదమగు
పథము దొరకిన దాని నేపగిది వదలి, యల్పఫలదపథంబుల । నాశ్రయింత్రు.

క. తిరుగుచుఁ బ్రపంచంబుల నెక్కరణినొ శ్రమమొంది కూర్చి । కావించెదు శ్రీ
వరునారాధన మయ్యది, పరికింపఁగ నల్పమైనఫల మిడఁ జాలున్. 306

క. మనసొక్కటి చంచలతం, గనకుండినఁ జాలు నెట్టి । కాలంబున నై
నను ధ్యాననిష్ఠ యుండం, జను నద్దియె మోక్షదంబు । క్ష్మాధరవర్యా! 307

సీ. డంబమే లేక కండంక వస్తువులను, గూర్పయత్నింపక । కోర్కిదనర
నిష్ఠదైవము నాశ్రయించి భావనచేత, సకలవస్తువులను । సమధికముగ
సేకరించినయట్లు । చింతించి యవ్వాని, నర్పించినట్టులే । ధ్యాననిష్ఠ
భావించుచుం బ్రీతిఁ । బరమాత్ముఁ దేజస్స్వ,రూపునిగా నెంచి । యాపరేశుఁ

తే. గనుచు నిశ్చలమగు చిత్తమున సతంబుఁ,దలఁచుచుండుటయే మహాఫలదమైన
పూజ యనఁబడు; దానినిబోలు పూజ, వేఱొకటి యుండఁబోలదు విశ్వమందు.

క. యోగం బెద్దియు శ్రద్ధా,యోగమె లేకున్న ఫలము । నొదవింపంగా
నేగతిఁ గనినం జాల ద,దేగద యిష్టార్థద మ్మహీనముసుమ్మీ. 309

మ. చిరకాలంబు గుహాంతరాళములలో । సిద్ధాత్ములౌ మౌను లీ
శ్వరుఁ దేజోనిధి నవ్యయుం దలఁచుచున్ । బాహ్యప్రపంచం బదే
పరుసన్ సాగుచునున్నదో మఱచి యేవాంఛల్ మదింగూర్ప కీ
శ్వర!రక్షింపవె యంచు వేడఁ దగు శాస్త్రం బద్దియే తెల్పెడున్. 310

ఉ. ఇట్టియుపాసకుల్ మిగుల । నిద్ధసువర్ణగిరీంద్రమందు నే
పట్టునఁ జూచినన్ నయనపర్వముగాఁ దనరాయచుందు ర
ట్టిట్టులమైనభాగ్యమున । నెంతయుఁ బోల్చును స్వర్ణభూధరం
బట్టిగిరీంద్రమందు నొకభాగమునన్ గపివీరుఁ డొక్కటన్. 311

క. కేసరియను నామముని,కే సరి యౌనంచు మౌను లెన్నఁగఁ దమిచే
వాసము చేయును దత్సతి, భాసురరూపంబు మెఱయ । భర్తృవిహితయై. 312

ఆ. అంజనాఖ్య నలరి యాపతివ్రత భర్తృ,హితచరిత్రయగుచు నెల్లయువతు
లకు నుదాహృత మగులలితశీలంబున, వినుతయగుచు నుండి వేడ్క నొకట.

చ. అనిలునిఁ జిత్తపంకజమునం దొగి నిల్పి మహాత్మ! నిన్నుఁ గొ
ల్వను దమిఁగాంచుదానను భవద్వరదానమునన్ భవాదృశుం
దనయుని గాంచుకోర్కి సతతంబు చెలంగెడుఁ గాన లోకమం
దనుపమసద్గుణాఢ్యుని మహాబలునిం దయచేయవే సుతున్. 314

క. పేరు మహాబలుఁడని యో, మారుత! నీకొప్పియుండు మామకతనయుం
డీరేడులోకముల ముని,వారము దేవతలు మెచ్చ వఱలన్ వలయున్. 315

క. జగదుపకారమ్మును జక్కఁగఁ జేయఁగఁ జాలువాఁడు కావలయు నతం
డగణితబలవిక్రములఁ, బొగడొందఁగ వలయు నట్టిపుత్త్రకు నిమ్మా. 316

చ. అని మరియాద భక్తియు మహాదృతి శ్రద్ధయుఁ గల్గునట్టు లా
యనిలుని వేఁడుచుండె; మదిరాక్షి యొకప్పుడు భర్తతోడ వాం
ఛను దెలుపంగఁ గేసరియు స్పర్శనుఁ గొల్చుట చాలుమేలు దే
వనికరమందు మేటి బలవంతుఁ డతం డగు నోతలోదరీ! 317

తే. భక్తిమీఱఁగ నామహాబలుని గొల్వు, మంచు నానతియిడి వానరాళి గొల్వ
హేమగిరినుండె నాతనికోమలాంగి, తత్పరతఁ గొల్చె మది సదాగతిని నిలిపి.

సీ. సుచరిత్ర యొకనాఁడు శుచియు ఋతుస్నాత,యునయి యాదేవుని నొప్పమీఱఁ
దలఁచెఁ గేసరియు నత్తఱి రాజకార్యంబు, గలిగి యెందో చనిక్రమ్మఱు నద
నదియాట వాయు వామదిరాక్షికిం బతి,యట్ల దర్శనమిచ్చె నంతఁబతియు
నరుదెంచె నెఱుఁగ దాయమ దానితత్త్వంబు, కేసరిరాఁ గాంచియాసమయము
తే. నందు క్షణమునకున్ ముందె యరుగుదెంచి
నట్టిజాడ గనంబడె నార్య! యనిన
నతఁడు మదినెంచి వాయువే యపుడు తోఁచి
యుండఁదగు నీకు వరమీయ నువిద! యనిన. 319

క. తలవాంచి యూరకున్నన్, జలజాయతనేత్ర చిత్తసంశయమును లోఁ
దలపోసి లజ్జ నొందకు, మెలమిం గనఁదగినసమయమిదెగద సాధ్వీ! 320

చ. సతిని స్పృశింపరా దనెడుశాస్త్ర మెఱింగినప్రోడగాన నీ
మతిఁ గలవాంఛఁ దాఁ నెఱిఁగి మామకరూపమునం గనంబడెన్
బతిపయి భక్తి నీకుఁగలవార్త నెఱుంగును గాన నద్దియే
హితమొనఁగూర్చు నన్న హృదయేష్టముఁ దెల్పె నదేల చింతిలన్. 321

ఆ. నీదుశీలమునకు నియతికి మెచ్చి తా, దర్శనం బొసంగె దాన నీకు
వరమొసంగె ననుచు వనితామణీ! తలంపుము మఱొండుచింతఁబూనకు మిఁక.

క. అనిహిత ముపదేశింపన్, వనజానన హృదయపద్మవాసుం బవనున్
వినుతించి నాయకునితో, ననురాగముమించ నుండె నంజన యంతన్. 323
క. చూలాలై సమయంబున, వాలికచూపుల్ చెలంగ వానరతరుణీ
జాలము గొల్వంగాఁ బుర,టాలయ్యె మరుద్వరంబు నట ఫలియింపన్. 324
చ. తనయునిగాంచె నంజన నితాంతమనోహరరూపసంపదన్
వనచరరాజియెల్లఁ దను వారకచూడఁ దలంపఁగా బలం
బున జవవిక్రమంబుల విభుత్వమునం దనసాటిలేఁడు మే
దిని నని యెల్లవారు వినుతింపఁగ లక్షణరాజి యొప్పఁగన్ 325
వ. కేసరియుఁ బరిజనులకెల్లఁ బారితోషికంబులొసంగి విధ్యుక్తక్రియల నిర్వర్తించి
యుండు నంత. 326
క. ధరణీధర! యాసత్సుతుఁ, దరుణీరత్నంబుఁ గాంచి తత్పరమతియై
వరఫలములఁ దన్పఁగఁ దా, నరిగెన్ వనసీమ కంత నాఁకలితోఁపన్. 327
ఆ. బాలుఁ డతఁడు క్షుత్తు బాధింప నేడ్చుచు,నుండెఁ దల్లి చెంతనుండకుంట
నేడువకుర వత్స! యనువారు లేకుండి, రపుడె యుదయమయ్యె నబ్జసఖుఁడు.

### హనుమంతునకు దేవతలు వరములిచ్చుట.

ఆ. వయసుచిన్నదగుట వదలక క్షుత్తు బా,ధించుచుంట, యుష్ణదీధితి యపు
డంతికమున రక్త మట్టియంగముతోడఁ, గానఁబడుట యనెడు కారణముల.
క. ఫలమేయగు నిది యొకఁడను, తలఁపున నవ్వాయుదేవుతనయుఁడు వేగం
బలరార నెగిరె వ్యోమ,స్థలమునఁ జరియించు దేవతలు వెఱఁగందన్. 330
చ. విసుఁగనలేక యిప్పగిది వేలకువేలగు యోజనంబు లా
క్కసరణిఁ బాలునాకపిని గాంచి సురప్రముఖుల్ సెబాసురా!
శ్వసనుఁడుగూడ నిప్పగిదిఁ బర్విడఁజాలఁ డటంచు మెచ్చునా
సుసమయమందు మారుతుఁడు సూనునివెంబడి పోయె సాయమై. 331
శా. ఆయాసంబు తొలంగ వాయువు కుమారాంగంబుపై మెల్లఁగా
వాయిం గూర్పఁగ వీవ దాన జవసత్త్వాదుల్ వివృద్ధంబులై
సాయం బొప్పఁగఁ జేయ మించినక్షుధాజ్వాలాపరీతాంగుఁడై
పోయెన్ భానుని చెంతకున్ ఫలముగా బుద్ధిన్ దలం పుబ్బఁగాన్. 332
ఉ. భానుఁడు కాలవేత్తయయి భాసిలుటన్ హితకారియౌ మరు
త్సూనునిరాకఁ గాంచి తనచోటు దహించెడునట్టిదౌట లో
నూనిదహించునాఁకలికి నోర్వక పండని మ్రింగవచ్చు నా
మానసధీరుఁ గాంచి రుచిమండల మోర్వఁగవచ్చు నట్లుగన్. 333
తే. బుద్ధిబలమున నొనరించి పూనికకు నె,సంగుసంతోషమును గాంచ జాలియుండె;
నాకుమారుఁడు రవిచెంత కరుగుచుండె, నుడుగరానిజవంబున నొక్కరీతి.

క. ఆనాఁడు పర్వమగుటన్, దా నూనిన వేడ్కన్ మీఱి ధాత్రీచ్ఛాయా
నూనాకృతి గలరాహువు, నా నెసఁగెడు భూత మొక్కఁ డాసమయమునన్.

క. సరసిజమిత్రుని గప్పం, బరుగెత్తుచునుండె వాయుపట్టియు నతనిన్
గరమున స్పృశించెఁ బఱ్వడు, తరుణంబున మార్గవశత దానికి నదియున్. 336

క. భీతిల్లి నన్ను మ్రింగెడు, భూతంబిది క్రొత్తదనుచు బుద్ధిఁ దలఁచి య
ప్డే తరలి యింద్రు చెంతకు, నాతతగతిఁ బాఱి తెల్పె నాత్మావస్థన్. 337

క. పురుహూతా! నాకొసఁగిన, సరసిజబాంధవునిఁ జంద్రు సరగన్ నూత్నా
శరునకు నిపు డిచ్చితివే, సరియగునే యిద్ది దేవసంఘాధిపతీ! 338

క. ఆతని బట్టంబోవఁగ, నాతఁడును బోవుచుండి హస్తంబున న
న్నే తూలికవలెఁ ద్రోయఁగ, భీతుఁడనై వచ్చినాఁడ వృత్రవిరోధీ! 339

తే. నాకు నిచ్చినయాహార మేకరణిని, బఱల కిడవచ్చునయ్యా! యోబలనిషూద
నా! యిదెక్కడిన్యాయమో నాయథార్థ,ముగ నెదానిని భావించియగహరుండు.

క. నేనెప్డు మఱొక రాహువు, నే నెలవున గాంచినట్టులే లేదుసుమీ
నీనుడు లచ్చెరువులుగాఁ, గానంబడుచున్న విప్డు కదలుము వత్తున్. 341

చ. కనఁబఱుపంగ నోపుదువె గాఢతరాశనిపాతనంబునన్
గనుఁగొనరాని దుస్థితిని గాంచుమహీరుహమట్లు వజ్రధా
రను దలవోవ నాతఁడు దురంబున నాత్మకబంధ మాడఁగా
గనుచు సురాలయంబునకుఁ గ్రక్కునఁ బోవును గాక నీ విటన్. 342

చ. నిలువక వేగపొమ్మనుచు నే నిదె వచ్చెద వెంట నంచు నా
ప్పలుగుల కంగఁ బల్కుటయుఁ బొంగుచు రాహువు వేగ మేగి యా
జలరుహమిత్రమండలము సంగతిఁ జేరఁదలంచు నంతలో
పల హానుమంతుఁ డాతపనుఁ బట్టఁగ వచ్చెదు రాహువుం గనెన్. 343

సీ. పరికించి యిదిమంచిఫలమంచు యోజించి, చెంతనున్నట్లు భావించి యర్క
వదలి రాహువుఁ బట్టఁ బాఱినఁ దనపైకిఁ, బరువిడు నా గాలిపట్టిని గనిఁ
యిఁక నిటనుండ మేలింతయుఁ గల్గదు, ప్రాణమ్ములుండ వీపాడుభూత
మెటనుండి వచ్చెనో యెవఁడు సృజించెనో, నాకొఱకే వీఁడు ప్రాఁకులాడు
తే. నట్లుతోఁ చెదునని రయించి యాత్మముఖము, త్రిప్పుకొని పాఱె నంతలో దేవవిభుఁడు
మత్తదంతావళము నెక్కి మహిమ వెలయ, వచ్చుచుండెను భానునివంక కపుడు.

క. భీతిం బర్విడి యోపురుహూతా! నను గావవయ్య! యుగ్రాకృతితో
భూతంబిదె రవి మ్రింగఁగ, నీతఱిఁ బోవంగ నన్నె యేత్తెఱ మ్రింగన్. 345

క. అరుదెంచెదు నేఁ బ్రాణో,త్కరముం గరతలమునందుఁ గనుఁగొనుచున్ నీ
పరిసరమున కరుదెంచితిఁ, బరిరక్షింపుము మహేంద్ర! పరమదయాబ్ధీ! 346

క. అనుచుఁ జే వేఁడఁగ భయమును, గనకుము నీరిపు వడంతుఁ గనఁబఱుపుము నా
కనునంతలోన నిది పం, డని మ్రింగినఁ దీఱు నాదునాఁకలి యనుచున్. 347

క. పవనాత్మజుండు రాఘవు, రవి మాని మహేంద్రహస్తిరాజముఁ బట్టం
దివురంగ నాతనిం గని, దివిజాధీశుండు క్రోధదీప్తులు పర్వన్. 348

చ. ఉడుగని గర్వయుక్తి నితఁ డొక్కని లెక్కయె చేయకుండఁ బ
ల్విడుఁ దనశక్తి యెట్టిదని వేడుకకైనఁ దలంపఁ డీతఁ డే
పుడమి వసించు నేని సురపుంగవు లెందొ చనంగనొప్పు; ని
ప్పుడ పొరిపుత్తు వీని క్షణముం సహియించినఁ జేటు మూఁడెడున్. 349

క. ఐరావత మీయది దు,ర్వారోద్యము వీనిఁగాంచి పడఁకెడు నిఁక నీ
వీరుని మార్కొనఁజాలిన, ధీరుని నేఁ గాంచఁజాలఁ ద్రిజగములందున్. 350

చ. అని తలపోసి భూధ్రనివహాంచితపక్షగణంబుఁ జెచ్చెరం
దునుమఁగఁజాలు వజ్రమును దోడనె వైచిన దానిఁ దాఁకుచే
ననిలజుఁ డట్టి పోలి గిరియందుఁ దటాలున వ్రాలె; వామమా
హనువు మహీధ్రమందుఁ బడునప్పుడు నొచ్చెను; వాయు వత్తఱిన్. 351

ఆ. బాలుఁ డప్పుడట్లు పవిమహాఘూతవి, హ్వాలతఁ బడినఁగాంచి వజ్రి యిట్టి
క్రూరకార్యరతిని గూడెఁగా యని యాగ్ర,హమునఁ దనదుశక్తినందఱకును.

క. తెలుపంగఁ దలఁచి దేహం,బుల నన్నిఁట నిండియున్న పూజ్యాత్మచ్ఛా
యల నాకర్షించుచు ని, మ్ముల భూధరబిలమునందుఁ బుత్త్రాన్వితుఁడై. 353

క. నివసించియుండె నంతటఁ, బవమానుఁడు సంచరింప భావింపక శై
లవివరమున నుండుట భూ,తవితానము సంచరింపఁ దగుశక్తి చనన్. 354

క. కదలంజాలక యుండఁగఁ, ద్రిదశుల సంతృప్తికై విధిని జన్నములిం
పొదవఁగ మానవు లొనరిం,పఁ దగక యుండిరి నితాంతబాధలఁ గనుచున్.

ఆ. ఎట్టిక్రియలు లేక యెల్లతావులనున్న, వార లట్టెయుండి రార్యయంగ
నిష్క్రియం బనంగ నిఖలప్రపంచంబు, దగినయట్టు లుండె వగచి సురలు.

సీ. పరమేష్ఠిచెంతకు గరువంబుమాని కష్టములకుఁ బాలయి చని జగములఁ
గల్గినయలజడి కడఁగి వచించి యాపవనుని సంచారపరతఁ గనఁగఁ
జేయువే యని వేఁడఁ జిత్తమ్మునఁ వారి, దీనభాషణములఁ దెలిసి గదెల్లఁ
జింతించి యింద్రుఁడు చేసినయపరాధ,మునఁ గల్గె నలజడి భూతవితతి

తే. కనుచుఁ దలపోసి సురలార! వినుఁడు వజ్రి, రాహుపక్షంబునం జేరి రవినిబండు
గాఁగఁ దలపోసి క్షుద్బాధ కడు నలంప, వచ్చు పాపనిఁ గొట్టెను వజ్రమునను.

ఉ. దానఁ గుమారకుం డతఁడు తద్దయు నొచ్చి మహీధరంబుపైఁ
దా నవశుండుగాఁ బడియె దానికి వాయువు కోప మూనె; నా

సూనుఁడు తద్వరంబున వసుంధర కెంతయొ మేలుచేయఁగా
వానరకాంతకుం బొడమె వాయుసుతుం డని వాని నెన్నఁడీ. 358

చ. సుతుఁడు మహీధరంబుపయి సోలి పడం గని వాయుదేవుఁ డీ
శతమఖుపైఁ గ్రుధం గనుచు సర్వజగంబుల నిండియుండు స్వీ
యతనువు సుజ్జగించి బిలమందు సుతాన్వితుఁడై వసించె; మీ
రతి బలవంతులయ్యు నిపు డార్తిని బొందితి రేమి చెప్పుదున్. 359

చ. అనిలుని సంగతిన్ విడినయంతన భూతగుణమ్ము వ్యర్థమే
యనఁజను వాయువే సదయ యథార్థముగాఁ దలఁపంగ ముఖ్యమై
తనరుఁ బ్రపంచరాజికి; సతం డొకయించుక సేపు సంచరిం
పను దలపోయ కున్నెడఁ బ్రపంచము శూన్యమెయౌ నిజంబుగన్. 360

మ. సురకార్యంబు ఫలింపఁజేయఁగనె యీసూనుండు జన్మించె నం
చరయం జాలక వజ్రతీక్ష్ణహతి మృదంగంబు నొవ్వంగఁ దీ
వ్రరుషం జేసెను వృత్రసూదనుఁడు కార్యం బిట్లుసాగంగ సం
చరణం బయ్యనిలుండు మానె జగముల్ స్తంభించె నద్దాననే. 361

మ. కనుకన్ వాయువు సుప్రసన్నుఁడగు సత్కార్యంబె చేయంగ నౌ
నని వారల్ తనవెంటరాఁగ మునివర్యస్తోమముల్ వెంబడిం
ప నితాంతాయతవేగ మొప్పఁ జని యప్పద్మాసనుం డద్రినిం
గని తద్భూరిగుహాంతరాళమున దుఃఖప్రాప్తుఁ బుత్రాన్వితున్.

ఆ. గంధవాహుఁ గాంచి ఘనపవితాడన, కర్శితాంగు దనయుఁ గడుఁ బ్రియంబు
దనర నంకగతుని దాఁగని వగచుచు, నుండు తెఱఁగెఱింగి యూహలొప్ప.

క. కరుణావలోకనంబులఁ, గురియించెన్ వాయుదేవుకొమరునిపై నే
సురుచిరదృష్టులు కష్టో,త్కరములఁ దొలగించునో నిరామజవమునన్. 364

చ. వనజభవుండు దేవయుతి వచ్చుటగాంచి సమీరణుండు త
త్తనయుని మూర్ఛితున్ మృతువిధంబున నుండెడువానిఁ జూచుచున్
వనటఁ గృశించుచుండియును వైళమ లేచి తనూజయుక్తి మ్రొ
క్కను విధి నామగోత్రములఁ గీర్తనచేయుచు మూఁడువారముల్. 365

ఆ. వందనమ్ముచేసి భక్తిని వేదవా,క్యముల సన్నుతించి యంతికమున
నిలువఁబడఁగఁ బ్రహ్మ నెమ్మిమీఱఁగఁ గర,ద్వయముఁ జాఁపి నిమిరె బాలుమేను.

క. ధాతృకరస్పర్శమునన్, జేతస్సమ్మోదమునను జిత్రంబుగ నా
వాతాత్మజుని శరీరం, బాతతశర్మంబు గాంచె నందఱు చూడన్. 367

క. జీవితుఁడైన సుతుంగని, యావాయువు సంతసించి యాత్మనిరోధం
బేవిధమున మానునొ యటు, లావిధి చూడంగఁ జేసె నంత జగమ్ముల్. 368

క. ఉక్కిరిబిక్కిరిగాఁ దగు, నక్కటికివగల్ దొలంగ హాయిం గనియో
నిక్కము పల్కుదు వినుమో, చక్కనిభూధ్రంబ! యిచటి సారం బెల్లన్.

## భావనాశక్తి.

చ. అనిశము యోగనిష్ఠగలయట్టి మహాత్ములు దేవదేవు స
జ్జనహృదయాబ్జవాసుని, విశాలమనోహరదివ్యతేజమే
తనువుగ నొప్పువాని శ్రుతిధర్మము లెందుఁ జెలంగు నందుఁ బ్రీ
తిని గనువానిఁ జూతు రతితృప్తిగ జ్ఞానమయైకదృష్టిచేన్. 370

క. సమదర్శను లన వారే, క్షమాధరా! యాలకింపు శ్రద్ధాయుతి సా
రము దీని; మేలు దీననె, యమసంజుష్మా! పరాత్పరాంగ మ్మెదియా. 371

క. అనువిషయముఁ దర్కింతురు, మునివరులుం గూడఁ దేజమునె తత్తనువం
చని రుత్తమయోగులు; దానినివాసము శీర్షమనుచు నీవు తలఁపుమా.

సీ. దివ్యతేజం బది భవ్యప్రమోదదం, బయియుండు శీర్షమ్ము నాశ్రయించి
వలయాకృతిం గాంచుఁ గలుషకర్మంబులఁ, గావించువారిని గడుజవమున
వదలి యల్పంబుగ వ్యాపించు నచ్చోట, సాధుకర్మముల శ్రద్ధనూని
జరపుచుఁ దత్ఫలసంతతిఁ గోరని, వారియం దభివృద్ధి సారెసారె
ఆ. కగుచునుండు సుమతులగువారు పరికింతు, రెందువృద్ధినొందు నెట నశించు
ననుచు; మదిని గల్గునాశయభేదంబె, కారణమగు దీనిసారమునకు. 373

ఉ. ఆరుచిరంపుఁదేజ మెపు డట్టిమహాత్ములు కర్మసంగతిన్
జేరినకష్టముల్ గనఁగఁ జెడ్పడుఁగాదె; శరీర మత్తఱిన్
సారము గల్గఁజేయఁగ వెసం జొరఁబాఱును శీర్షమందుఁ ద
ద్దారుణకష్టముల్ గడచి దాననె గాంతురు వారు శర్మమున్. 374

క. ఈతేజమె బ్రహ్మంబని,యే తెలియం జెప్పు శ్రుతు; లవెల్లప్పుడు త
త్పూతాశయంబు తెలియక, భ్రాంతిగఁ గైకొనరుసుమ్ము పామరు లెపుడున్.

తే. పుణ్యపురుషులు తేజస్సుఁ బొదలఁ జేయు, సాధుకర్మంబు లొనరించి చక్కఁ దానిఁ
గాంచుచున్ మోదమందంగఁ గలరధీరు, లద్దియెఱుఁగక యజ్ఞత నడఁగుదు రిల.

చ. శతధృతి వాయుపుత్త్రకుని శర్మయుతుం బొనరింపఁ బూని యు
న్నతనిజతేజమందును మనంబును నిల్పి తదీయపూత సం
గతి మెయిఁ బొల్చుదృష్టులను గాంచెను; దాననె వానితేజ ము
న్నతిఁ గనఁజాలె; దాననె గనందగి యొప్పెను జీవితం బొగిన్. 377

క. పరమేష్ఠితేజ మత్తఱి, మరుదాత్మజుమస్తకమున మ్రాన్పడుతేజం
బురుతరముగఁ జేయఁగ న, త్తరుణంబున లేవఁజాలె ధైర్యస్ఫూర్తిన్. 378

క. కొందఱు మూర్ఛిల్లిన వెనుకం దగుయత్నంబులేక । కాంతురు మృతిఁ గ
ర్మందులు లోనగువారలు, పొందుగఁ జూడంగ లేచి । పొదలుదు రపుడే.

క. తనయంతన స్మృతి రాఁగా, గనుదురు సౌఖ్యంబు కొంత । కాలమునకుఁ ద
త్తనుగత తేజము లోఁ జొ,చ్చును మెల్లఁగ సుంత యగుట । క్షోణీధ్రపతీ!

తే. తేజ మయ్యది యధికమై । యీజగమున, గల్గు నాపదలం జెంది । కాచుచుండు
దానిఁ జక్కనుపాసింప । మాననీయుఁ, డగును దానిని మఱచిన । నగుఁ గుజనుఁడు.

సీ. మైనాకభూధర! । మాననీయుండగు, నాశతానందుఁ డ।య్యెదనునఁదు
హనుమంతుపై దయ । యగపడఁగా దృష్టి, వ్యాపింపఁ జేయుచు । నందుఁగల్గు
తేజము వృద్ధియా । తీరు గావించుట, భవ్యతేజ స్సది । పవనతనయు
నుత్తమాంగముచుట్టు । నుండి వృద్ధింగాంచి, లోనఁ బ్రవేశించె; । దాన నడఁగి
తే. యుండు ప్రాణాలి తద్యుతి । నొక్కమాఱు, శక్తిగనియెను గాన నా । శ్వాసనజుండు
మేలుకనినట్లు లేచె; నా । లోన వాయు, వాత్మసంతోష ముప్పొంగ । నలరఁజాలె.

క. విను భావనాబలం బని, ఘనులందురు దీని; మంత్ర । కాండమ్మును దీ
నినె యాశ్రయించియుండును, మనమున నూహింపు మిద్ది । మహితం బనుచున్.

చ. సరసిజసంభవుండు కృప । సంధిలఁ జేసెదుదృష్టిఁ బుత్త్రుపైఁ
బరఁగఁగఁ జేయ నత్తఱినె । బాలుఁడు లేచి చెలంగుచుంట న
మ్మరుదధినాయకుండు గని । మానసమందుఁ బ్రహర్ష మొప్ప సం
చరణముఁ జేయ లోకముల । స్తంభన మప్పుడె వాయఁగా సురల్. 384

ఆ. సంతసించి రపుడు । శతధృతి వారలఁ, గాంచిపలికె భావి । కాలమందు
నీకుమారకుండు । మీకు మేలొనరింపఁ,గలఁడు శక్తియుక్తిఁ । గ్రాలు నితఁడు.

చ. అమరులకార్యసంతతు ల । వన్నియు నీతనివంక నే ఫలిం
చు మఱియు దేవదేవునకు । శూరశిఖామణి కీకుమారుఁడే
యమసను బ్రాణతుల్యుఁడుగ । నట్లగుటన్ ధర నిస్సమానుఁడై
యమలయశంబు గాంచునటు । లాదృతిఁ జేయఁగ యుక్త మిత్తఱిన్. 386

మ. వరదానంబున నీతనిం దనుపఁగా । వాంఛింతు; మీరొక్కరొ
క్కరుగా నీపవమానసూనునకు నొక్కాలంబునం దృప్తి నీఁ
దరమై యుండువరంబు లిం; డవియె మో । దం బియ్యఁగాఁజాలు నీ
మరుదధ్యక్షున కంచుఁ బల్కఁ దలలన్ । మన్నించి యావాక్కులన్. 387

తే. వరము లీయంగఁ దలఁచి రా । సురలు తొలుత
శతమఖుం డిట్లుపల్కె నీ । సుతుఁడు నాదు
వజ్రహతిచేత నొకచెంప । వక్రతఁ గన
నలరుటన్ హనుమంతుఁడన్ । పిలుపుఁగాంచు 388

క. నావజ్రము నేఁడాదిగ, నీవాయుసుమారుఁ జంప ఽ నేవిధముననే
జేవ గలదిగాకుండెడు, నీవరమిచ్చితి ననంగ ఽ నినుఁ డిటు పలికెన్. 389

చ. తమము నడంచురశ్మిసముఽదాయము నేఁగలవాఁడ; నాప్రకా
శమున శతాంశ మీతని కోఽసంగెద; నాకడ విద్యనేర్చు నా
సమయమునందుఁ దోడుపడఽజాలుదు; విద్యలనెల్ల నేర్పుదున్
విమలవచస్కుఁడీతఁడగు ఽ వృద్ధిని గాంచునుగాక దాననే. 390

చ. జలముల నాదుపాశములఁ ఽ జావకయుండ వరంబొసంగుదున్
గలుషహరుండునౌ నితఁడు ఽ గాంచుఁ జిరాయువనంచుఁ బాశి తాఁ
బలికె; యముండు దండహతిఁ ఽ బ్రాణవియుక్తుఁడుగాక! యామయా
వళికిని లొంగకుండుమదిఁ ఽ బర్వకయుండు విషాద మెత్తటిన్. 391

చ. ధనపతి మద్గదాయుధము ఽ దా ననిఁ జంపకయుండుఁగాక! యీ
తని ననుచున్ వరం బొసఁగె; ఽ దర్పకహర్తయు మామకాస్త్రరా
జిని మృతిఁ గాంచఁడీతఁ డని ఽ చెప్పఁగనేటికి? నాదువంకఁ జా
వనునదిలేక యుండు నని ఽ హర్షమునన్ వరమిచ్చె; నవ్వలన్. 392

ఉ. పంకజసంభవుం డనియెఁ ఽ బావని నాదగు బ్రహ్మదండమె
ట్లంకమునందు నొచ్చునటు ఽ లంగము చేసినఁ జావులేకయే
శాంకునిరీతి వృద్ధిఁగను ఽ నాయువు దీర్ఘముగాఁ జెలంగ నే
సంకటముల్ తనుం గదియఁఽజాలనిరీతిగ నావరంబునన్. 393

సీ. అనిపల్కఁగా విని ఽ యాదట విశ్వకర్మయుఁ బల్కె; నాచేయుఽమహితచిత్ర
శస్త్రంబు లేయవి ఽ చంపఁజాలకయుండుఁగాక! యీధీరునిఽగాలిపట్టిఁ;
జిరకాలజీవియై ఽ స్థిరధర్మమార్గావలంబియై యుండఁగఽలం డటంచుఁ
బలికె; నాదట బ్రహ్మఽవాయువుఁగని నీదు, తనయుఁ డింక నమిత్రఽతతుల కార్తిఁ
ఆ. గలుగఁజేసి మిత్రఽకాంక్షలఁ దీర్చుచు, మిగులఖ్యాతిఁగాంచిఽమించుచుండు
నని నజేయుఁడగుచు ఽ నాత్మకామానురూపతనుధారియగుచుఽబరఁగుఁజుమ్ము.

క. రావణు ననిఁ బొలియింప న,దేవారికిఁగాని పులకఽలెగయం జేయన్
దేవత లభివర్ణింపన్, వేవిధులన్ మెచ్చుఁ దగుచు ఽ వెలసెడుపనులన్. 395

క. ఒనరించు నీదుకొమసుం, డనిపల్కి సురాళిఁగూడి ఽ యరిగెఁ గమలజుం;
డనుమోదంబున నింటికిఁ, దనయునిఁ దోడ్కొనుచుఁబోయి ఽ తరుణీమణికిన్.

చ. కొమరుని విక్రమంబునకుఁ ఽ గొంకి సురేశుఁడు వజ్ర మెత్తివై
చి మరల సద్వరంబొసఁగెఁ ఽ జెప్పెడి దేమిఁక దేవతాధిపుల్
సుమనసు లీశ్వరుండు పరిఽశుద్ధవరంబుల నిచ్చి రంచుఁ దె
ల్పి మనసుమెచ్చఁజేసి సుతు ఽ పెంపుఁ దలంచుచుఁ బోయెఁ బొంగుచున్. 397

క. మరుదధిపుం డీగతిఁ దన, వరసుతువృత్తాంతమెల్ల । వదలక చెప్పన్
దరుణీమణి యంజన యవ్వారములఁ దలపోయఁ జొచ్చె । బహుభంగులుగన్.

క. మారుతి కపితకుఁ దోఁచుగ, సారసభవుఁ డాదియైన । శక్తియుతులు దు
ర్వారబలం బొనఁగూడెడు, తీరున వరముల నొసంగ । దృప్తుం డగుచున్. 399

క. మౌనుల యుటజములకుఁ జని, పూనిక నజినాదివస్తు । పూగములను వా
రేనెలవున వైచినచోఁ, గానంగా లేరొ యట్టి । కడలన్ వైవన్ 400

ఆ. తండ్రి కేసరియును । దగదిట్లు చేయంగ, ననుచు మందలింప । నాజ్ఞమీఱి
యిచ్చవోలఁది మెలఁగ । నెంచుచుమునులకు, బాధగూర్పఁ గోపపరతఁ గాంచి.

చ. మృతియనలేని యీకపి సమీరకుమారుఁడుగాన శాపదూ
షితనిజశక్తిమంతునిగఁ । జేయుట న్యాయ్యమటంచు నెంచి యీ
యతులితశక్తిశాలి మతి । యంతయు మే మిడు శాపవాక్యసం
గతి నిజశక్తి యిట్టిదని । కన్గొనలేకయె యుండుఁ గావుతన్. 402

క. చిరకాలమునకు వేఱొక్కరు భావంబలర వినుతిఁ । గావించిన న
త్తరుణమునుండియె వృద్ధిని,వరుసంగాంచెడు మటంచుఁ । బలుకహనుమయున్.

చ. తనగురుశక్తి బ్రహ్మముని । తల్లజశాపవశంబునం గ్రమం
బునఁ బరిహీనతం గనుట । బుద్ధిహరించెడుగర్వమెల్లఁ బో
వ నయముమీఱ సన్మునుల । భక్తిని గొల్చుచునుండె; నిట్టులీ
హనుమ చెలంగ వాలియను । నాతఁడు వానరరాజ్యనాథుఁడై. 404

క. పరిపాలింపఁగ నతని క, వరజుఁడు సుగ్రీవుఁ డనెడు । వనచరుఁ డారా
జ్యరమన్ యువరాజుగ నొం, దె రహిన్ గపిరాజ్యమద్ది । త్రిదివముభంగిన్.

క. అలరారుచుండె; హనుమయు, బలశౌర్యములందుఁ బేరు । వడసియు నెట్లో
జలజాప్తతనయుఁ జేరం, గలిగెన్ గారణము విధియొ గాఁదగుఁగాదే. 406

చ. ఇరువుర కెంతొ మైత్రి విధి । యే గలిగించెను; బర్వతేంద్ర! యీ
నిరుపమశౌర్యశాలి గని । నీరజమిత్రకులాంబురాశిశీ
తరుచియు హర్షమొందె; గుణ । ధాముని రాముని గొల్చు కోర్కె నీ
మరుదధిపాత్మజుండు గని । మానసిపూనికఁ గొల్వ రాముఁడున్. 407

చ. జనకకుమారికన్ వెదుకఁ । జాలిన వీరుల సూర్యసూనుఁ డం
పునపుడు రామచంద్రుఁ డరి । పూగము నొంచఁగట్టివానిఁగా
హనుమఁ దలంచి యాశిషము । లాదృతిమీఱ నొసంగి పంపె నీ
వననిధిదాఁటఁ జాలు కపి । వర్యులశక్తినిగాంచు వేడుకన్. 403

తే. జాంబవంతుఁడు ప్రశ్నింప । సత్త్వమింత, మాకుఁగలదని చెప్పిరి । మర్కటులందు
దిరుగుమృగములు పావని । ధీరుఁడయ్యుఁ, బలుకకుండెను శాపంబు । బలిమి శిఖరి.

సీ. శాపమోక్షమ్ము ప్రసాదించి రమ్మాను, లావాక్య మెట్టులో యట్టె సాగుఁ
గావున భల్లూకకాంతుఁడౌ జాంబవంతుఁడు లేచి కపితతితోడఁ దెల్పె
నితనిశక్తిని శాపమేగెఁ; గావున నబ్ధి, దాఁటి లంకకుఁ బోయి ధరణితనయఁ
గనుఁగొని వత్తును క్షణమాత్రమున నని, పంతంబుపూని యీపగిదిఁ బోవు
తే. చున్న వాఁడిట్టిమహితాత్ముమన్ననదగఁ, గొలుచుటేభాగ్యమనఁగఁదగుంగ దామ
హీధరాయంచుబోధించిరియొలమిమఱియుఁ, బల్కెసాగరుఁ డత్తఱిఁబర్వతమును.

క. పరమోపకారులనుగ స, గరపుత్త్రుల నెన్నఁదగునుగాదే నాకుఁ
మరుదధిపుఁ డల్లి నీకుఁ, బరమాప్తుం డగును మిగులఁ బల్కఁగ నేలా? 411

క. సగరాన్వవాయజనితుం, డగు రాముఁడు వాయుపుత్త్రుఁడగు హనుమయు నీ
జగమున నుపకారము చేయఁగఁ బుట్టిన వారలంచు నరయం దగదే. 412

క. అల రామునిపని యీతని, తలపై నున్నయది వాయుతనయుం డితఁడౌ
నలయక ననుదాఁటంగాఁ, గలఁ డీతం డట్టులైనఁగాని మన మిటన్. 413

క. చేయందగు నాతిథ్యం, బేయెడలకు ధర్మతతి నదేయుత్తమమా
న్యాయజ్ఞులందు రిట్లీ, నాయాశయ మద్రివర్య! యగుఁ జేకొనఁగన్. 414

చ. అనుటయు సంతసంబు పొలయక మరుదాత్మజు సత్కరింపఁగాఁ
జనునను శ్రద్ధతోఁ ప రఘుసత్తము కార్యము తీర్చిపొంటెఁ బో
వునతనికన్న నుత్తముఁ డపుంగద యీతఁ డటంచుఁ జెప్ప నో
ప్పునతఁడు భూమి నుండఁ గనఁబోలునె యంచు దలంపు గల్గుటన్. 415

చ. జలములనుండి లేచి తనశైలశరీరము భూతరాజి కి
మ్ములఁ బులకాంకురావళిని బుట్టఁగఁ జేయ లతాగ్రపూవళుల్
ఫలతరుసంతతుల్ వెలయ భక్తిభరంబునఁ బోయి నిల్చెఁ జు
క్కలుదగుమార్గమందును బ్రకంపనసూనున కడ్డమౌనటుల్. 416

చ. దనుజులు మాయికుల్ సకలధర్మవిఘాతుకు లంచుఁ జక్కఁగా
వినిన ప్రభంజనాత్మజుఁడు వింతగ నయ్యది యడ్డమౌట శా
త్మను దలపోసి యిద్దియొకమాయగదా యని నిశ్చయించి రా
ముని మది సంస్మరించి తనభూరిపరాక్రమ మప్డు చూపఁగన్. 417

క. తలపోసి యాలసింపక, బల మొప్పఁగ వక్షముననె పర్వతమును ని
స్తులధైర్యసార మొప్పఁగ, బలసూదనముఖ్యదేవపతు లరుదందన్. 418

క. పొడిచెను దాననె భూధర, మడలుచు మున్మాఱు తిరిగె నంబరమున న
ప్పుడుపల్కె దీననిస్వన, ముడుగక వీనులఁ జొరంగ నోహనుమంతా! 419

క. మారుతవిభునకు మిత్త్రుఁడఁ, గోరిక సాగరముపంపఁ గుతుకంబున నా
శ్రీరాముకార్యమునకుఁ, వారిధిపైఁ బోవు నీకు బల మఱుకుండన్. 420

క. వచ్చితి నాతిథ్యము నీ, కిచ్చుతలంపూని యార్య! । యీనాపయి నీ
విచ్చమెయి విశ్రమింపుమ, యిచ్చటిఫలమూలముల య । థేష్టముగాఁగన్. 421

తే. అనుభవింపుము బడలిక । లడఁగ నంత, లంకకుం బొమ్ము కార్యఫ । లంబుఁ గాంచి
వేగరమ్మని ప్రియమార । విమలభణితిఁ, బలుక నాలించి విశ్వాస । మలర హనుమ

చ. పలికె మహాత్మ! భూమిధర । భవ్యభవద్ధృదయం బెఱుంగ కీ
జలనిధిమధ్యభాగమున । శాత్రవు లెన్నియొ మాయలూని నా
కలజడిఁ గూర్పనెంతు ర । నునాశయమూనుట నిన్ను మార్కొనం
దలఁచితిఁ దప్పుసైఁపు మిఁక । ధన్యునిగాఁ దలపోయుదుర్ ననున్. 423

ఉ. నీదగునాతిథేయము వి । నీతుఁడనై గ్రహియించినట్లె యి
ష్టాదృతిమైఁ దలంపు మినుఁ । డస్తమయాద్రిని జేరకుండ నేఁ
బోఁదగు నబ్ధిదాఁటి రఘు । పుంగవుకార్యము సిద్ధినొందఁగా
నీఁదగునాశిషంబె గిరి । నిర్జరనాయక! తృప్తి నిచ్చెదున్. 424

తే. ఆతిథేయంబు గ్రహియించి । నట్లె తలఁపు, మింతమాత్రమునకె శ్రమ । మేల కల్గు
రాముకరుణయు మీవంటి । ధీమహితుల, యాశిషంబులు నాకున్న । నంతె చాలు.

క. అనిపల్కి ప్రేమమొప్పఁగఁ, దనకరతల మామహీధ్ర । తల్లజుశిఖరం
బుననుంచి ప్రీతిమీఱం,గను బల్కెం దృప్తి యయ్యెఁ । గాదె మహాత్మా! 426

సీ. ఆతిథేయంబన । నర్ఘ్యంబు పాద్యంబు,మొదలగువస్తుస । మూహమునను
జేయుపూజయె కాదు । చిత్తంబు హర్షాబ్ధి,మునుగంగ వాక్కులు । ఘనకృపార్ద్ర
ములుగాఁగఁ జక్కని । తలఁపులు వెలయంగఁ, జేయునాశీస్సులే । సిద్ధిదమగు
నాతిథేయంబని । యార్యులందురుసుమ్ము; పర్వతనాయకా! పరమకరుణఁ

తే. దెలుపువాక్కుల నత్యంత । తృప్తిదమగు, కార్యమున నీవొనర్చితి । గాదె పూజ
యిద్ది చాలదె యిఁక సెల । విమ్ము మరలి, వచ్చుతఱిఁ గోర్కెదీఱ ని । ల్వఁ గలనిందు.

చ. అనికొనియాడి యాగిరియు । నాత్మచరిత్రము సంగ్రహించి చె
ప్పిన విని సంతసించి మఱి । ప్రీతియొసంగఁగఁ గేలుదాఁకి చ
య్యనఁ బవమానవేగమున । నభ్రపథంబునఁ బోవుచుండఁగాఁ
గని సురలెల్ల మేలని పొ । గడ్తల నించిరి తన్మనం బొగిన్. 428

చ. సురలపొగడ్తలన్ వినుచు । శోభనవృద్ధికి మూలమా నిదే
పరమజయంబుఁ గాంతు నను । భావముతోఁపఁగ నింగిఁ బాఱె; నా
తరుణమునందుఁ దత్తను వు । దన్వదనూనజలంబులం దొగిం
బరుగిడునట్లు దేవసమ । వాయము లెల్లఁ దలంపఁ బోయెఁ దాన్. 429

చ. నిలుకడలేనిచిత్తమన । నీరధితుంగతరంగమాలికా
వళిగురుడోలికాప్రతతిఁ । బర్విడుచున్ దరణిక్రియన్ జలం

బులపయి హెచ్చుతగ్గులుగఁ । బోయెడుచందముతోఁపఁ జేయుచున్
బలుగతులన్ వడింబఱచె । వాయుపథంబున స్వేచ్ఛమీఱఁగన్. 430

సురస హనుమంతుని బరిశీలించుట.

ఉ. అంతట దేవసంతతు లయారె! యితం డిటుపోయి లంక మ
ర్త్యాంతకరాజగేహమున । నారయఁజాలునొ చాలఁడో పథి
శ్రాంతివహించునో యనుచు । స్వాంతమునం దలపోసి యంత నొ
క్కాంతపరీక్ష చేయఁగ నిదే సమయంబని నిశ్చయించుచున్. 431

మ. సురసానామమునం జెలంగుసుదతిన్ । శుంభన్మహామోఘశా
బరియందుం గడుదక్షతన్ మెఱయు నవ్వామాక్షి రావించి యీ
మరుదోఘేశ్వరు నాత్మజుం డిపుడు రామస్వామికార్యంబు ని
ర్జరకాంక్షాఫలదంబుఁ దీర్పఁ జనెడున్ । సత్వంబు పొంగన్ దివిన్. 432

చ. దనుజపురంబుఁ జేరి ఖలదానవకోటి కగమ్యుఁడై జవం
బున రఘురాముపత్నిఁ గనుఁబూన్కికి నర్హమనంగఁ జాలు శ
క్తినిదగువాఁడొ కాదొ పరికింపుము నీ వనిపంప నామెయుం
బనివడి భీకరాకృతిని । బర్వుచు నిట్లు వచించె వానరా! 433

మ. పరమేశుం డిటు లిన్నినాళ్లకు క్షుధాబాధాపనోదార్థమై
కరుణించెన్ నిను నాకు భక్ష్యముగ నింకన్ జక్క భక్షించి భీ
కరమౌ నాఁకలిఁ బాపుకొందు; నిలు వేగంబూని పోఁజాల వె
క్కరణిన్ వానర నన్నుమించి యని పల్కన్ వాయుపుత్త్రుం డెదన్. 434

తే. సుంతతలపోసివిఘ్న మీచొప్పున నను, బాధలంగుందఁజేయఁగఁ బాటిలెఁగద
యైనసామోక్తులం బల్కియరుగువాఁడ, వినని చోఁజూతునవ్వలివిధముఁగడఁక.

చ. అనితలపోసి యిట్లనియె । నమ్మరొ! నీదగుక్షుత్తుఁ దీర్పఁటొ
ప్పును మరియాద యద్ది యనిబుద్ధి నెఱుంగుదు నైన నొక్క ప
ల్కును వినిపింతు నీకది యగున్ విహితంబు; సమస్తలోకనా
థుని రఘువంశభూషణుని । ధూర్తజనాంతకు రామచంద్రునిన్. 436

క. వినియుందు వనుచు నమ్మెద, వనితా! దుష్టాసురాళిభయమును బాపం
గనుదలఁచి రాముఁ డిప్పుడు, ననుఁబంపన్ లంకకేఁ జనం దగు జుమ్మీ! 437

తే. కార్యమీయది లోకరక్షకునిదౌట, నీకు భాగంబు గలదిందు । నాకు నల్లె
గాన మనపని యిది యాటఁగడఁగి చేయ, వలయుఁగా దేజవంబునఁ బరుగిడియట

చ. అసురపురంబునన్ వెదకి । యారఘురామునిపత్నిఁ గాంచి యా
బిసరుహపత్త్రనేత్ర దగువింతచరిత్రము రామమూర్తికిన్
వెస నెఱిఁగించి వచ్చి సురవీరులయార్తులు పోయె నన్నసం
తసమును గాంచి నీయుదరతాపముఁ దీర్చెద నమ్ము మీనుడిన్. 439

చ. అతివ! పరోపకారమె మహార్హము కృత్యములందునెల్ల నం
చతిశయబుద్ధిమంతులన నాత్మ నెఱుంగుదు నీవుగూడ నీ
వితముఁ దలంపఁగాఁదగును వేయినుడుల్ పలుకంగనేల శ్రీ
పతిదగుకృత్య మన్న మనపాలి యదృష్టమెగాదె కావునన్. 440

క. నీవును నేనును జేయం,గావలయునుగాదె శీఘ్రగతిఁ బొమ్మనుచున్
నీవేఁ పలుకం దగుఁగా, నావుడు నాసురస పెద్దనవ్వి వచించెన్. 441

ఉ. జాతిని వానరుండవు ప్రశస్తవచస్కులఁబట్టి దేవతా
వ్రాతము మించువాఁడ వనవచ్చునటంచును దోఁచె నాకు; నీ
చేతము నేనెఱింగితిని చిత్రగతిన్ నను దాఁటిపోవఁగా
నీతఱి నెంచి ధర్మమన నెట్టిదియో వచియించి తివ్విధిన్. 442

మ. కపిమాత్రుండవుకావు నేర్పఱివి నీకంటెన్ ననున్ హీనఁగాఁ
గపటంబంచుఁ దలంచి పల్కితివి నిక్కం బాత్మ యోజింపఁగా
నుపకారంబు మహోత్తమంబె యగు నందొప్పందగుం గాని యా
త్మపదంబున్ మును గాచుకొంట తగు నా మాన్యోక్తి నాలింపవో. 443

సీ. రహి "స్వయంతీర్ణః పరాన్ తారయంతి" య,నం జను నిర్మలన్యాయ మొండు
ప్రథితమౌ జగమునఁ బాటింపవలదె య,ద్దానిని వానరా! కానఁ దొలుత
నాత్మోదరముఁ దృప్తినలరించి యవ్వల, రాముకార్యముఁజూడఁగా మనంబు
దలఁచుచున్నది యింకఁ దడవేల మాటల, రమ్ము నాకుక్షిఁ జొరంగఁదలఁపు
తే. మన్యగతి లేదు నీకు నందాస్య గహ్వ,రమ్ము యోజనమాత్ర దూరమ్ము నావ
రింపఁ జూఁపిన హనుమయుఁ బెంపఁజాలె, నంతమాత్రము స్వీయదేహమ్ము నపుడు.

చ. కనియది యోజనద్వయముగాఁ దనవక్త్రమునుండఁ జేసెఁ బా
వని యొనరించె నట్లె యిటువారనిపూనిక లూని వారలున్
దనువులఁ బెంచుచుండి రటదర్పముపొంగఁగఁ దొంబదామడన్
దనవదనంబు విస్తృతి నితాంతము గానఁగఁజేసె నింతియున్. 445

చ. మరుదధిపాత్మజుం డపుడు మాననిపంతమువీఱి మోముఁ బెం
చు రమణియాశయం బెఱిఁగి చోద్యముగాఁ దనదేహ మల్పమై
పరఁగనొనర్చి కుక్షిఁ జొరఁబాఱి వడిం బయికేగుదెంచి యో
తరుణి! త్వదీయకుక్షిగతతాపముతీఱెనె పోయివచ్చెదన్. 446

చ. అనుటయు మాయవాసి తనయాకృతిఁ దాలిచి మారుతాత్మజా!
చను మిఁక రాముకార్యమును జక్కనొనర్పుము నీదు శౌర్యముం
గనుఁగొన నిర్జరుల్ పనుపఁగాఁ జను నెంచితిఁ దృప్తి నొందితిన్
నను సురసాఖ్యచే నెసఁగు నాగులతల్లిగ నెన్నుమా మదిన్. 447

క. పరికించితి నీశౌర్యము, పరిపంథిదురాసదముగ భావించితి నీ
వరుగుము మేలయ్యెడు శ్రీ, వరుకార్యముఁ దీర్చి ఖ్యాతిఁబడయుము జగతిన్.

ఉ. ఎంతటిపాండితిం గనిన నించుకయే సమయోచితజ్ఞతన్
జెంతను జేరియుండునటు చేసికొనం దగుశక్తిలేక యా
క్రాంతదిశాసమూహ మగు ఖ్యాతిని మాత్రము గోరువాఁడు తా
సంతతఖేదముం గనుట సత్యమె యందురు నీతికోవిదుల్. 449

ఉ. నీయెడ నట్టిపాండితి యనింద్యముగాఁ దగియుండఁ గాంచితిన్
న్యాయవిదుత్తముండవు సనాతనధర్మము నూని వర్తిలన్
గాయజుబారికిం దగులఁగాఁ దలపోయక సంచరింపఁగా
నీయెడలం దలంచుసుగుణాఢ్యుఁడ వంచు మదిం దలంచెదన్. 450

ఉ. త్రోవశుభంబు లీఁగలుగుఁ దోయధి నీవవలీలదాఁటి యా
రావణపాలితంబయి దురాపముగాఁ దగులంకఁ జేరి సీ
తావరరత్నముం గని ప్రతాపముఁ గాంచి సురారులెల్ల నెం
తే వడఁకంగ వత్తువు మహీశుని చెంతకు సంతసంబునన్. 451

ఉ పొమ్మని సాగనంపఁ బ్రియముం గని మారుతసూనుఁ డాత్మలో
నిమ్మెయి దేవతల్ తలఁతురే; నను నిందుఁ బరీక్షసేయఁగా
నిమ్ము; రఘూద్వహాంఘ్రియుగనీరజముల్ భజియించునాకుఁ గా
ర్యమ్ము ఫలింపకుండునొకొ యంచుఁ దలంచుచుఁ బోయె రివ్వనన్. 452

హనుమ సింహికం జంపుట.

చ కడచె సముద్రమందున సగంబగు భాగము మింటఁ బోవఁగాఁ
బొడవుగ నాకపిప్రవరుపూతతనుద్యుతి ఛాయపోల్కి నొ
క్కొడఁ గఠినంపురక్కసి యదెట్టిమహత్తరజంతువైన నే
ర్పడ నిలుపంగఁజాలు గురుపౌరుష మూనియె ఛాయ నంటుచున్. 453

చ. తనకనుదోయికిం దగులఁ దాఁకును జేతనె దానిఛాయ నం
తనె పయిఁబాఱు భూతమది తత్తరమందుచు నిల్చియుండు; శ
క్తినిగొని పోవఁజాలదు సుకీర్తిని గాంచెను దాన నామె; కం
ధిని వసియించియుండు నది దేవవిరోధులజాతిరై తగున్. 454

తే. పేరు సింహికయనఁబడు భూరిశక్తి, కలిగి జలములఁ దేలుచు నాత్మ నెప్పు
డాఁకలియటంచుఁ దోఁచునో యప్డు వెదకు, జంతువెద్దాని నేఁబట్టు సత్త్వమమర.

సీ. ఆనాఁడు వాయుప్రసూనుండు వడిఁబోవ, నాతనిదౌ ఛాయ యంబుధి సలి
లములపైఁ బర్వంగఁ గ్రమమునఁ బోవంగ, నిదిమహాభూతమానీతుధకిది

తగినయాహారమా । దైవవశంబున, దొరకె నంచుఁ దలంచి । గురుతరమునఁ
దగుశక్తిఁ బట్టె నోర్ద్దాని; నంతనె జవ, మప్డు నశించిన । హనుమ యిద్ది
తే. యేమి సాగదు పయనము । చెంచి క్రిందఁ, గాంచెఁ దననీడఁ బట్టిన । చంచలాక్షి
భయదదానవి కన్పట్టె । బలముదీని, కింతయుండునె యని యెంచు । నంతలోన.

ఉ. దానవి పల్కె నోరి యిఁక । దర్పము నీయదిసాగ దాఁకటన్
మేను గృశించుచున్నయది । మ్రింగుదు నిన్ను క్షణంబులోన నె
ద్దాని స్పృశింతు ఛాయ నది । దర్పము బ్రుంగఁగ నిల్చియుండు; నిం
తైనఁ జనంగఁజాల దది । యావిధి యిచ్చిన సద్వరంబునన్. 457

మ. అని భాషించుచు వక్త్రగహ్వరము నత్యంతార్తిదం బౌనటుల్
హనుమంతున్ గ్రసియింప విప్పినఁ దదీయాహంకృతిం గాంచి చ
య్యన నత్యల్పశరీరుఁడై వదనగేహం బప్డుడే చొచ్చి రా
మునిఁ జింతించుచుఁ బెంచె మేనును మహాభూమీధరంబో యనన్ 458

తే. తనదుదేహంబు దానికిఁ దగినయట్లు, పెంచఁ దలపోయునంతలోఁ । ప్రేవులెల్లఁ
దెగఁగఁదను వెల్లఁజీలంగఁ । దెగియె దనుజ, వనితరక్తంబునదిగాఁగఁ । బాఱుచుండ

క. సురలెల్ల సన్నుతించిరి, పరమాద్భుతకార్య మిద్ది । పావని దని; భీ
కరదానవి మరణించుట, పరికించి ప్రమోదమంది । పఱచె జవమునన్. 460

చ. అనిలకుమారుఁ డిట్లు జవ । మారఁగ నంబరవీధిఁ బోవఁగాఁ
గని సురలెల్ల నింక రఘు । కాంతుని కార్యముఁ దీర్చి వచ్చునీ
హనుమ యటంచు సాధువచ । నావళిఁ దన్పిరి; దాని వించు వి
ఘ్ననికర మింక నుండదను । నమ్మికఁ బోయెను లంకఁ జూడఁగన్. 461

క. పవమానుఁడు సూనునకున్, జవమింకను వృద్ధిగాఁగ । స్వాంతంబున నెం
చి విసరె నీవిధి ననుగతి, నీచె వెన్కొనుచు విబుధ । నిచయము పొగడన్. 462

క. ఇనుఁడస్తశిఖరి చెంతకుఁ, జన నెంచుచునుండ హనుమ । సాగరమును దాఁ
టెను గోష్పదంబుకరణిన్, దనమదిఁ గలరామభక్తి । దైవారంగన్. 463

క. శ్రుత్యంతప్రతిపాదిత, నిత్యశ్రీభాసురా! వి । నీలశరీరా!
సత్యనిశాంతనివాసా!, కృత్యవిరహితా! విశాల । కీర్తికలాపా!. 464

చ. వివిధవిధాప్రకల్పిత సు । విస్తృత దైవవరాభిపూజిత
ప్రవిమలవాంఛితార్థద! వి । భాసుర పాదసరోరుహద్వయా!
కవివరగీయమాన! గురు । కల్మషభూరిమహీధరోల్లస
త్పవిసమనామధేయ!, గుణ । వారవిభూషిత లోకసంచయా!. 465

మణిగణనికరము.—

మనఃకులజలధిహిమరుచిసదృశ! స
జ్జనసుతసుచరిత! సరసవిహితవా
క్యనిచయపరిహృతకలుషజనతతీ!
మనువరజపరత మతిఘనఫలదా!. 466

గద్య. ఇది శ్రీమత్త్రిపురసుందరీకరుణావాప్త గీర్వాణాంధ్రకవితాప్రాభవ కాశ్యపాన్వయప్రభవ, శ్రీజనమంచివంశాంబురాశి కుముదినీమిత్ర, సుబ్రహ్మణ్యమనీషిపుత్త్ర, తాండవకృష్ణాపరాభిధేయ, శేషాద్రినామధేయవినిర్మితంబైన శ్రీధర్మసారరామాయణంబను మహాప్రబంధంబునందుఁ గిష్కింధాకాండము సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ ర స్తు.

# శ్రీధర్మసారరామాయణము

## సుందరకాండము.

శ్రీరామా! దుష్టాసుర
వారమహాభీమ! సాధువరహితకామా!
భూరిమహీధ్రస్థేమా!
సారసభవ ముఖ్యదివిజసన్నుత మహిమా!. 1

వ. మహాప్రభూ! తరువాతివృత్తాంతం బవధరింపుము. 2

### హనుమంతుఁడు లంకను జంపుట.

చ. జలనిధి దాఁటి యవ్వలివిశాలతటస్థసువేలనామ కా
చలమున వ్రాలి లంకఁగని స్వాంతమునం దిసుమంత యెంచి యా
స్థలమున దాఁగియుండి ఖలదానవసంతతి గానకుండ ని
శ్చలమతినుండెఁ బశ్చిమపుసంద్రమునన్ రవి క్రుంకినంతటన్. 3

మ. పురముం జొచ్చి మహీసుతన్ వెదుకఁగాఁ బూనందగున్; నాకు భా
స్కరుఁ డిచ్చో నొకకొంత సాయపడనో సర్వేశుకార్యార్థమై
త్వరగా నస్తగిరీంద్రశృంగమును బొందం బూనినం జాలు నే
నరయం జొచ్చెద లంక; నిద్దియె సమయం బంచు యోచించుచున్. 4

ఉ. నాలుగుప్రక్కలం గనుచు నాకపురంబును గూడ దీనికిం
జాలదు సాటిసేయ; దనుజప్రజనాయకుఁ డిందు నుండుటన్
మేలని సన్నుతింపఁ గడు మించును బాపము లంకలోన దే
వాళియె యున్న నిట్టిదని యాఫణిరాట్టు వచింపఁ జాలునే! 5

మ. కమలాకాంతయుఁ బక్షపాతమున నే గ్రాలుంగదా యంచు నీ
సమయంబందుఁ దలంపనౌఁగద మనుష్యవ్రాతముల్ మ్రింగునీ
యమరారుల్ వసియించుచోటఁ గడు నైయ్యం బొప్పఁ దానుండుటల్
క్రమమే? దుర్జనసంగతిం గనుటయే కాదొక్కొ దోషం బిలన్?. 6

క. ఖలులకుఁ దోడ్పడ నేలొకొ, జలజాక్షునిరాణి పుణ్యఽచరితులపొంతన్
నిలువకయుండుట యేలొకొ, తెలియంబడ దించుకే నిఽది యిటో ననుచున్. 7

క. కర్మగతి గహనమంచున్, నిర్మలమానసులు పల్కు ఽ నేవింటి నదే
కర్మద మగుసిద్ధాంతము, కర్మమె దైవంబటంచుఁ ఽ గడు నమ్మఁదగున్. 8

క. పరమేశుఁడు ఫలదుండనఁ, దరమెట్లొఁ గష్టతతులు ఽ తార్కొను వేళన్
బరికించి కర్మ మిట్లే, తరుణంబున ఫలమొసంగె ఽ దారుణరీతిన్. 9

క. అనియేకద నిందింతురు, జనులెల్లం గాన ఫల మొఽసంగెడునది యూ
జనసేయఁ గర్మమేయని, మనమునకుం దోఁచుచుండు ఽ మానక యెపుడే. 10

క. ఎది సత్యమగునొ యాపద, లొదవిన నాకస్మికముగ ఽ నయ్యదె తోఁచున్
గద; యిద్ది మానిసమ్మత, మిదియే సిద్ధాంతమనక ఽ యెటు పోవచ్చున్. 11

క. సందియములు డెందమునం, గ్రందుగఁ దోపంగ సుజనఽకాండము చిత్తం
బందు జనించుప్రవృత్తుల,నుం దగిన ప్రమాణముగఁ గఽనుంగొనుఁ గాదే. 12

క. దనుజులు పాపాత్ములు నాఁ, జనువారలుకారె యిందు ఽ సందియమున్నే
ధనసుఖ జయమదములు వా,రిని పొందుట చిత్రకర్మఽరీతియె యననొ. 13

చ. పరజనసత్కళత్రముల ఽ బల్మిని దెచ్చినఘోరపాపక
ర్మరతుఁడు దీనిపాలకుఁడు ఽ మానవులం దినుదుష్టుఁ; డిట్టియా
శరపతి రావణుం డసదృఽశస్థిరశర్మము లందుచుండ నీ
శ్వరు నిఁక నేమనందగు; నఽవార్యము కర్మ మటంచు నెంచనొ. 14

చ. మునుల వధించి సత్క్రతుసఽమూహము సాగకయుండఁజేసి తోఁ
చినగతి సంచరించి సరఽసీరుహనేత్రల బల్మిఁ బట్టి త
ప్పని తలపోయ కిష్టముల ఽ బల్విడి నొందుచు నుండుఘోరపా
పిని సిరి పొందె నేమనుదుఁ ఽ బెంపువహించిన దైవముం గటా!. 15

తే. ధరణి "సుకృతీ గతాయు"వన్ ఽ దారుణోక్తి
పుడమిఁ "బాపీ చిరాయు"వన్ ఽ బెడఁగునుడుగు
వింటి మున్నిటఁ జక్కఁగాఁ ఽ గంటి నకట!
దైవముతలం పదెట్టిదోఽ తలఁపఁజాల. 16

ఉ. బంగరుమేడ లెల్లెడల ఽ బాలులీజె చెలంగుచుండ దు
ష్టాంగన లిందు నందుఁ బ్రమఽదాంబుధి మున్గుచు సంచరింపఁ దా
మంగళదేవతామణి సఽమస్తవిదుత్తమురాలెయయ్యు దు
స్సంగతి గోరియుండునన ఽ సత్యమె యంచుఁ దలంప నొఁ గదా? 17

ఉ. కొందఱు దైవమే బలము ఽ కూడదు దాని నెఱుంగఁ గోరఁగా
నందురు; పౌరుషంబె యఖిఽలార్థద మందురు కొంద; ఱిందు నా

మందమనీష కెద్ది యనుమానము లేని వినిశ్చయంబుతోఁ
పం దడవౌచునున్నయ దపారముగాదె విధీష్ట మెప్పుడున్. 18

చ. అని తలపోయుచుం సరసిజాప్తునిసత్కృప నందఁగోరుచుం
మనమున జానకిం వెదకుమార్గము నెన్నుచునుండుసంత శి
ష్యునిదగు కోర్కి తా నెఱిఁగి సూర్యుఁడు పశ్చిమశైలమందు ము
న్గినఁ గని మోదమంది తమకీర్తిని వెల్లడి చేయఁ జీకటుల్. 19

తే. గుహలు లోనగుతావులఁ గూర్కియుండి, శత్రుసగుభానుఁ డస్తాద్రిసానుభాగ
మున నడంగినవార్తలు వినఁబడంగ, వెడలె నత్తఱి నెల్లెడ విస్తరిల్ల. 20

మ. హరి యస్తాద్రిని జేరఁ జీఁకటు లవార్యస్ఫారశౌర్యంబునం
బరితస్సంచరణాభిలాషములఁ బర్వం గాంచి యమ్మారుతే
శ్వరసూనుండు స్వగాత్ర మల్పతరమౌ భంగిం మహాశక్తిఁ గా
ర్యరతిం జేసి పురంబుఁ జేరఁ జనియెం రామాంఘ్రులం గొల్చుచున్. 21

తే. ఉత్తరద్వారసీమఁ గాపున్నదనుజ, కాంత యొక్కర్తు సునిశితఖడ్గ మొప్ప
హస్తమున భీకరంబుగ నగపడునది, కానఁబడ నంజనాత్మజుఁ డానిశాటి.

క. పరికించి దానిదౌ భీకరరూపము దుస్సహముగఁ గనఁబడకున్నే
యరివీరుల కని తలఁచుచు, వరణము దాఁటంగనెంచె వడిలంకఁ జొరన్. 23

క. కనుఁగవ నిప్పులురాలఁగ, హనుమంతునిఁ దానెఱింగి యదలించుచు ని
ట్లనియెం రూపాంతరమున, జన నెంచెద వెవ్వఁడవు నిశాటపురి యిదౌ. 24

తే. ఆదితేయులకే నగమ్యమ్ము సుమ్ము, నాదునానతి గొనక చనంగ వెఱతు
రబ్జసుతముఖ్యులైన నీవనఁగ నన్నుఁ, లెక్కసేయకపోనెంచె దుక్కుమిగిలి. 25

క. ఏకార్యమునకుఁ బోయెదు, నీకథ యెఱిఁగింపు సత్యనిర్మలముగ న
ట్లుకాకయున్నఁ జొచ్చెద, వీకరతలతాడనమున నిపుడె యమపురిన్. 26

క. నేనీలంకానగరం, బూనిన శక్తిం నిరంతరోత్సవములఁ బెం
పూనినదానిం గాచెద, దానవపతియాజ్ఞ మౌళిఁదాల్చి సతంబున్. 27

క. నాకెఱుఁగ రాకయుండఁగ, నీకుం జొర శక్యమగునె నిర్జరవరులే
వీకఁ జొరఁజాల రనఁగా, నీకథ యింకేల పల్కు నిజమని యడుగన్. 28

ఉ. కేసరిపుత్రుఁడిట్లనియెఁ గీశకులంబునఁ బుట్టినాఁడ; లం
కాసదనంబులం గనఁగఁ గౌతుకమొప్పఁగ వచ్చినాఁడ; నా
కోసుదతీమణీ! తెలియ దుజ్జ్వలతావకశాసనంబులే
కేసరణిం జొరం దగనియీనియమంబు; నిజంబుఁ జెప్పితిన్. 29

క. నేననఁగ వనౌకసుఁడను, గానం జొరవచ్చు నెల్లకడల ననియె నా
లో నెంచువాఁడ నగరము, గానం దగదే మనంబు కౌతుకమందన్. 30

క. సురలకు దానవులకు నె, త్తరుణంబునఁ గాని మాన్పఁ దగనిపగ తగున్
శరణంబడవిగఁ దగు వా, నరులకుఁ జొరరానిపట్టణం, గలవా కోఁతీ!. 31

క. పగ మాజాతికి మీకుం, దగియున్న విధంబు మును వినంబడియెనె యో
వగలాడి! లంక నేఁ గాంచఁగఁ గోరుట న్యాయమె కద శత్రుత లేమిన్. 32

ఆ. అనుచు హాస మాస్యమందు నటింపఁగాఁ, బలుకు హనుమఁ గాంచి భయదదంష్ట్ర
లఁదగు నోరు దెఱచి లక్షించి యాతనిఁ, బలికె లంక యపుడు పౌరుషమున.

శా. ఓరీ వానర! నీచబుద్ధిఁ గొని లంకోద్యానముం జొచ్చి దే
వారివ్రాతవిభూషణంబగుచు భాగ్యస్ఫూర్తిఁ జెన్నొందు దు
ర్వారప్రాభవ మొప్పు నీనగరమున్ వంచించి నన్నుం జొరన్
గోరం జాలితి; వంతె కాక నుడులం గూడన్ ననున్ మించఁగన్. 34

క. తలపోసితి వీఁకఁ జాలును, బలుకుల వే తొలఁగి పొమ్ము వంచింపంగాఁ
దలఁచి మఱుమాట పల్కినఁ, బొలియింతున్ నిన్ను నొక్కపోటునఁ గోఁతీ!.

మ. దితిజాధీశ్వరునాజ్ఞ లేక చొరఁగా దేవాళికేఁ గాదనన్
మతిసంపత్తియె లేనివానరుల దౌ మాటన్ దలంపంగ నే
ల తొరన్ బొమ్మన నాంజనేయుఁడను నేలా యింత కాఠిన్యమో
యతివా! పత్తనసంపదం గనఁగ నేనాసించితిన్ నమ్ముమా. 36

తే. వేఱుకోరిక లేదు గంభీరవార్ధి, దాఁటి శ్రమముల కోర్చి పత్తనము దీనిఁ
గనఁగ వచ్చితి విశ్వాసమునిచి నాదు, వాంఛ తీర్పుము సెలవిమ్ము వత్తు వేగ.

చ. అని వినయంబు గన్పడఁగ నాడిన వానరవర్యవాక్కులన్
విని పయి కుబ్బు కోపమున భీమముఖం బమరంగ వానరా!
ననుఁ బరిహాసవాక్కులను న్యాయము తెల్పినయట్లలం చెదే
కనుమిఁక నాదువిక్రమము గ్రన్ననఁ జొగి రక్తనేత్రయై. 33

మహాస్రగ్ధర —

పురముం జూడంగ వాంఛల్ పొడమెనె మదిలోఁ బోయి వేగంబ రాఁగన్
మరియాదన్ బల్కుదే యీమహిఁ గలసిరులన్ మానకీక్షించి యోరీ!
పరువెత్తం జూచితే నా పలుకులఁ గొన కిప్పాటి నేర్పానితే వా
నర! యిప్డే పోయిరమ్మా నగరముఁ గని యానంద ముప్పొంగ నంచున్. 39

చ. పలుకుచు ముష్టిఘాతమునఁ బావని వక్షము నొంచినన్ మదిం
గలఁగుచు నోసి దుష్టమతి! కాలముఁ దీఱెనె నీకు నంచు దృ
ష్టుల భయదాగ్ను లప్పుడె కడుం గురియంగ నితంబినీమతిన్
విలయము నొందఁగాఁ బొడిచె విక్రమ మొప్పఁగ గాఢముష్టి చేన్. 40

చ పిడికిటిపోటు వక్షమును ƒ బెంపఱఁజేయఁగ సొమ్మసిల్లి య
ప్పుడె స్మృతిరాఁగ నంజలిని ƒ బూని మహాత్మక! నన్నుఁ గావుమీ
పడఁతి యటన్న హేతువును ƒ బట్టియె; నాదగుశాపముక్తి నీ
పిడికిటిపోటునం గలిగెఁ ƒ బ్రీతి వచించెద భావికార్యమున్. 41

సీ. ఎప్పుడు వానరుచేత ƒ నపరిమితవ్యథ, కలుగునో కదె శాపకాలముక్తి
యని బ్రహ్మపలికె; నోƒవనచర! నాకెంతొ, యుపకారివగు నీకు ƒ నుపకృతిఁ దగు
నట్టులొనర్పనౌ; ƒ గుట్టు తెల్పెదనింక, లంక కదృష్టకాƒలంబు తీరె;
నేన సుమ్మీలంకఁ ƒ గాన నామృత్యువు,వలన నీపురభూతి ƒ విలయమొందె;
తే. నిష్టమగునట్టు లీపురƒమెల్ల వెదకు, మిష్టసిద్ధిని బడయు; మƒహీనశౌర్య!
రాముదూతవు హనుమనా ƒ నామమొప్పు, వాఁడ వీవెక దాయనిƒవేడుకలర.42

క. పావనిఁ గని పలుకుచునే, యావనిత యసువ్రజంబు ƒ నత్తఱిఁబాసెన్
దేవనితంబినిరై దివి,జావళి గొల్వంగ నప్పు ƒ డరిగెన్ దివికిన్. 43

తరళము.—

అనిలసూనుఁడు భూరివిక్రముఁ ƒ డావిధంబున కెంతయున్
మనము చిత్రసముద్రవీచుల ƒ మగ్నమై పొలుపొందఁగా
దనుజవైరిపురంబుఁ జూడఁగఁ ƒ దా మనంబునఁ దొందఱం
గనుచు నాతినుడుల్ తలంచుచుఁ ƒ గ్రక్కునం జనె నవ్వలన్. 44

మ. ఒకచోƒనిల్చి రఘూత్తమాంఘ్రుల మహోƒద్యోగంబునన్ భక్తితో
నకలంకాత్మపదంబునన్ నిలిపి న్యాƒయ్యంబొప్ప ధ్యానించి భీ
తికరప్రాభవమొప్పు రక్కసులభీƒతిం బాసి ప్రాకారపం
క్తికడున్ స్వల్పముగాఁగఁ దోఁప వడి లంƒఘించెన్ సురల్ మేలనన్. 45

చ. వరణగణంబు దాఁటి భటƒవారము హెచ్చరికన్ సతంబుగా
వరిపుభయంకరంబగుచు ƒ వర్ణ్యమునై తగు లంకఁ గాంచి భూ
వరుసతి యెందునుండఁదగు ƒ వైరులకుం గనరాకయుండ నే
నరుగుట యెట్టు లంచుఁ దనƒయాత్మఁ దలంచుచుఁ బోయె లోనికిన్. 46

యోగమహత్త్వము.

సీ. ఒక్కహర్మ్యంబెక్కి ƒ యుత్తమయోగనిష్ఠను రాముఁజింతించిƒస్వాంతమంతఁ
బావనతమమయి ƒ భాసిల్లఁ దలపోసెఁ, బరమేశ్వరకటాక్షƒపాత్రుఁడ నగు
నాకు లభింపని ƒ దేకోర్కియుండును, వాంఛనాఁ జనునది ƒ వరమనీషి
మానసవిహితమై ƒ మహితమై యుండనౌ,నందురు పెద్ద లƒయ్యవియు యోగ
తే. నిరతిఁబరిపక్వమానసƒధరణిఁబొలయు, ఫలమునొందును; లేకున్నƒవిలయమొందు
నాదువాంఛయునాజగƒన్నాథుసేవ, యాటఁ దప్పక ఫలియించుƒననుటయరుదె.

చ. గురుతరయోగసంవృతిని ౹ గుప్తశరీరుఁడనై గృహావళిం
దిరుగుచునున్న నన్నుఁ గన౹ దేవతలేని సురారులేని యె
వ్వరును సమర్థులౌదు; రిది౹భద్రదయోగఫలంబు నాఁదగుల్;
బురుషులు యోగముల్ సతత౹ముల్ నియమంబున నభ్యసింపనౌ. 48

ఉ. గారడివిద్యగా దది ని౹కామవిశుద్ధమనంబు గల్గఁగాఁ
గోరియె యభ్యసింప నగుఁ ౹ గొందఱు లోకుల మోసపుచ్చ గం
భీరమనోవిలాసమున ౹ వేడుకలూరఁగఁ గూరుచుందు; రా
తీరు నెఱుంగఁజాలక య౹ధీరులు గొల్తురు వారి భక్తితోన్. 49

ఉ. వారలు లోకవంచకులు ౹ వాంఛలు పండవు వారి కేవియున్
ధీరులు యోగమూను టది౹తేటపడం దగకుండఁ గందరా
గారములందొ యెవ్వరును౹గానఁగ రాని స్థలంబులందొ ని
ష్కారణనిష్ఠఁ బూని కల౹కాలము చేయుదు రేదికోరకే. 50

చ. కనుకనె వారియోగము జ౹గద్ధితమైతగు; వంచకాలికిన్
ధనము లభించుఁగాని యది ౹ దగ్ధము చేయును దన్మనంబు; నా
మనము పరాత్పరాంఘ్రియుగ౹మండితమై తలఁపన్ నిరీహమై
తనరుట నీజగద్ధితముఁ ౹ దా నొడఁగూర్పక యూరకుండునే. 51

తే. అనుచుఁదలపోసి శ్రీరాము౹నాత్మ నిలిపి, యోగసంవృతిఁ గనబడ౹కుండఁదనువు
వెలయ లంకాపురంబునఁ౹గలయఁ దిరిగె, జానకిం గాంచు నూహలు౹సంచరింప.

ఆ. తిరిగితిరిగి యొకట౹దివ్యసౌధముఁ గాంచి, యందుఁజొచ్చి యట మహా౹నసమునఁ
గాంచె వివిధజంతు౹గణ మాంసముల నపక్వములఁ బక్వములను౹బవనసూతి.

సీ. కొన్ని జంతువులను ౹ గోసియుఁ గొన్నింటిఁ, గొంతభాగమ్మును౹గోసి మఱియుఁ
గొన్నింటిఁగాళ్లను౹గుదియఁగట్టియుఁ గోయ, నిశితఖడ్గము చెంత౹ నిలిపియు నతి
భయదమౌగతి నుండె౹నంటయి ల్లది యప్పు, డపవిత్రమై హేయ౹మనఁగ నొప్పి
యద్దానిగాంచిన౹యంతన పావని, దుఃఖాబ్ధిభంగాళిఁ౹దోఁగి దిక్కు

ఆ. దెలియకుండనుండి ౹ తెల్వి యంతట రాఁగఁ, గనులు విప్పిచూచి ౹ కళవళించి
తలఁచె నివ్విధమున ౹ దారుణ మీకృత్య, మాత్మఁ దలఁప నిట్టి౹యఘమె లేదు.

### అహింసాతత్త్వము.

ఉ. జంతువులందు మానవులు ౹ స్తవ్యులు జ్ఞానము గల్గియుంట యా
వంతయుఁ బుణ్యపాపగతు ౹ లారయఁజాలనిమర్త్యు లెంచఁగా
వింత మృగంబులే యనఁగ ౹ వీలగు నంగవిభేద మొక్కటా
సింతయొకాని జ్ఞానమున ౹ నిర్వురు తుల్యులె నిశ్చయంబుగన్. 55

ఉ. మానవజాతికంటెను సమస్తవిధంబుల నాదితేయులే
గానము చేయ నర్హులుగఁ ౹ గానగనౌదురు; వారియందు వి

జ్ఞానము మించియుండు మఱిసత్త్వము తేజము హెచ్చియుండదుం
గాన నమర్త్యులన్ మనుజకాండము గొల్చుచునుండు భక్తితోన్. 56

ఉ. భేదము జ్ఞానమందె కద విగ్రహనిర్మితియందు సుంతయేఁ
గాదనవచ్చు; నుండినను గల్గదు దానఁ బ్రయోజనంబు; నే
త్రాదులయందె యద్దిగన నౌనని చెప్పుదు రార్యు; లద్దియున్
సూదిమొనంతయైన ననుచుఁ జొప్పడుఁ జెప్పఁగ నెంతచూచినన్. 57

చ సురలకు రాక్షసావళికిఁ జూచిన జాతిని భేద మింతయుం
బరఁగదు; వృత్తిఁబట్టి యదివచ్చినదే యనవచ్చు; నాశరుల్
విరహితసాధువృత్తులయి వీఱిఁడులై రనవచ్చు నక్కటా!
తరమె విరించికైన ఖలదానవవృత్తి నెఱుంగ నెట్టులే. 58

చ. కనఁబడు వేదరాసుల నఖండవిచారము శాస్త్రసంతతిన్
మనమున నెన్నశక్య మణుమాత్రము కాని యభిజ్ఞతాగుణం
బనుపమసద్గుణంబు లివి యన్నియు భూతదయావిహీనతన్
జనియెను నిష్ఫలంబులయి సాధువినిందకుఁ దావలంబులై. 59

మ. అనుకంపాగుణసంపదం బొదలునే నత్యంతపాత్రంబులై
తనరుం దక్కినసద్గుణావళులు; సిద్ధాంతం బిదే; మానిరా
ద్వినుతం బాకృప యొక్కఁడే కలుగదే వేవేలుగానున్న వం
చను నాసద్గుణముల్ శవోపమకు నత్యంతార్హముల్ చూచినన్. 60

చ. అతివల కుందుభూషణములందుఁ బ్రధానమె యాద్యభూషణం
బితరము లెన్నియుండి యదియే కనరానియెడన్ వికారతన్
సతతముగాంచు నవ్వియె పొసంగక మంగళసూత్ర మొక్కఁడే
చ్యుతిగనకుండఁ గన్పడిన శోభిలు నాయమ స్తోత్రపాత్రమై. 61

క. ఆరీతిసద్గుణంబుల, కారయఁగా భూతదయ మహామహిమముఁ జే
కూరుచు నది లేకున్నన్, గారవమును గాంచఁజాలకయె నశియించున్. 62

ఉ. తావియె లేనిపుష్పము నితంబిని లేనిగృహోత్తమంబు స
ద్భావము లేనిపల్కు ఫలభారవినమ్రముగాని భూరుహం
బావిధి కందనట్టిబహుశేష్టదకర్మము నాఁగ సర్వభూ
తావితథానుకంపఁ గననట్టిగుణావళి నిష్ఫలంబెయా. 63

మ. కరిపాదంబున జంతుజాలచరణౌఘం బించుకే మించ కం
తరముం దే సరిపోవుచందమునఁ బుణ్యవ్రాతముం గూర్చున
వ్వరకర్మంబు లహింసయం దిమిడిపోవం జాలు; నట్లౌట ను
ర్వర ధర్మంబులయం దహింసయె మహార్హం బంచు నెన్నందగున్. 64

ఆ. భూతదయను మించుపుణ్యము గల్గునే,దానిమాని చేయుధర్మము లవి
భస్మహోమమున కుపమ చేయఁదగు నంచు,మునులు పలుకుచుండ వినినవాఁడ.

చ. సురలను మించఁజాలుదురు శూరత నీదనుజుల్ దయాగుణం
బురహితమౌట వీర లిటు భూతభయంకరులైరిగాదె; వీ
రరయఁగ ధర్మనిష్ఠఁ జెలువారియు హింసకు జంకకుంట భీ
కరులయి సాధుదూష్యులయి కాంతివిహీనులునౌట యేర్పడెన్. 66

ఉ. పాండితి యెంతగల్గినను బౌరుష మెంత చెలంగుచుండినన్
భండనభీము లన్నుడి వర్ధిలఁగాఁ దగు శక్తియున్న ను
ద్దండమదంబు గల్గుటను దారుణకర్మము లాచరించుటన్
జండమనస్కులన్న యయశంబును గాంచిరి వీర లక్కటా! 67

ఉ. వీరల కెప్డు హింసయె యభిప్రియకర్మ మటంచుఁ దోఁచెడున్
వారక దీనిఁబూని స్మృతివర్ణితకర్మము లెల్లమాని దు
ర్వారపరాక్రమంబున ధరాస్థలిఁ గ్రుమ్మరి సాధుబాధలం
గోరి యొనర్చుచున్ యశముఁగోల్పడి రేమనవచ్చు వీరలన్. 68

ఉ. ఒక్కయహింసనే నియతినూని స్వకర్మము లాచరింపఁ బెం
పెక్కఁగ మూఁడులోకముల నేలఁగఁజాలుదు రంచు నెంతు; నే
నిక్కడఁజూచినంత మృగహింసయె కన్పడెఁగాన శీఘ్రమే
యుక్కఁడగించ మ్రందఁగల రుగ్రరణంబున నంచుఁ దోఁచెడున్. 69

ఉ. దేవతలన్ భజింపనని తేటగఁబల్కుచు జంతుహింసలం
గావలె నంచుఁజేయు ఖరకర్ముల దేవతలే సధింత్రు; భూ
తావళిఁ దన్నుఁగాఁ దలఁచి యాదృతిమీఱ నభీష్టదేవతా
సేవయొనర్చినన్ ఫలముచేకుఱు; నిద్దియె శాస్త్రరీతియౌ. 70

చ. అవయవరాజియొక్కటి మహాపదపాలయియుండఁ దక్కిన
య్యవి ముదమందునంచు మదినారయు మోఱకురీతి భూతరా
జివధముచే నభీష్టఫలసిద్ధినిగూర్చెడు నిష్టదైవ మం
చెవఁడు తలంచు నాతనినె హింసకుఁ బాల్పడఁజేయు దైవమే. 71

చ. అమరులఁ దృప్తిచేయుట నసర్వవిధంబునఁ బూజచేయుటే
కమలజువాక్కులందుఁ గలకమ్రతరార్థము దానినే మహా
గమములు నిర్వచించు; స్మృతికాండము లెల్లను దెల్పుదానినే
క్రమమని మానివర్యులు శిరంబులఁ దాల్చి భజింత్రు దైవమున్. 72

చ. దనుజులు వీరు మత్తులయి తత్క్రియ మించుకయైన నాదృతిం
గనకయె కుక్షిపోషణము కార్యమటంచుఁ దలంచి జంతురా

జిని వధియించి తృప్తిగ భుజింతురు దీనిని మించుపాతకం
బనఁగలదే ప్రపంచమున। నారసిచూచిన నక్కటక్కటా! 73

ఆ. పాపసంచయమునఁ। బ్రథమగణ్యమె హింస,దానిమాన మిగులుధర్మకార్య
ముల నొనర్చినట్లు। వెలయుదు రందఱుఁ,జిత్తశుద్ధి హింసఁజెఱచు నిజము. 74

చ. దితిజులు ఘోరకార్యవితతిం దగునంచు నొనర్చువార లం
చతిశయమత్తతం బొదల। నాదృతిగాంచెడువార లంచు దు
ర్మతి దగువారలంచు నిట। మాంసపురాసులె తెల్పెఁజొచ్చె; నీ
వితమునసుండు వీరు రఘువీరునిసాధ్విని నేమిచేసిరో! 75

తే. అనివిచారించి యందందు। నరసి,యరసి.సీతగానక యెంతయుఁ। జింతపూని
రావణుని సౌధమును జేరిరమ్యతల్ప,మందు శయనించియున్నట్టిసుందరిఁగని.

క. వనచరనైజమ్మున సీ,తనుగా భావించి సమ్మదము పైకొనఁగా
ఘనవాలముఁ ద్రిప్పుచు దా,నిని ముద్దిడుకొనుచు సుంతనిల్చుచు మరలన్. 77

క. ఎగురుచు దుముకుచు జానకిఁ,బొగడుచుఁ బాడుచును గాలమును సుంతక్రమం
బుగఁబుచ్చి మరలఁ దనమదిఁ,దగునే యిట్లనుచు నెంచితాఁ జింతించెన్. 78

క. పరమపతివ్రత జానకి,పరపురుషుని చెంతనిట్లు। పవళించునె? యె
క్కరణిఁ దలంచితి? నీసుం,దరి రావణుభార్య యనఁగఁ। దగు సత్యముగన్.79

చ. పతిహితచర్యయే సతికిఁ। బాత్రత నియ్యఁగఁజాలు; నద్దియే
యతివతొలంగి యిష్టగతి। నన్యునిగూడి చరించుసజ్జనా
దృతి కతిదూరమై కులటయీపె యటంచు హసింప దుగఖసం
తతిఁ గనుఁగాని శర్మమును। దా నెపుడేఁ గనఁజాల దిమ్మహిన్. 80

క. అని తలపోయుచు నటఁగల,వనితల వీక్షించుచుఁ విగవస్త్రలుగా నుం
టనుజూచి యేవగించుచు,మనమున శ్రీరామచంద్రు। స్మరియించి తగన్. 81

తే. అంత యోజించె నాకిపుడఘముగలదొ,యద్ది లేదొ యెఱుంగ శాస్త్రాళిఁగనిన
పెద్దలందఱునిటుచూడఁదద్దయునఘ,మంటునందురున్యాయ్య మోయదనితోఁచె.

## ఆకార్యములు.

సీ తనభార్యతో భుజింపనురాదు సతిభుజి,యింపఁ జూడఁగరా దదెట్టులైన
నావులించెడుతఱి। నల్లి తుమ్మెడునప్పు, డింతిఁ జూడఁగ నాయువే చలించు
దిసమొలతో సుఖమెసఁగఁ గూర్చుండిన, నంగనఁ గనఁ బాపమబ్బు నంద్రు
కనులను గాటుకఁగ్రొగ్గై సేయుతఱిఁ దైల,చర్చ నున్నప్పుడు స్తనముఖముల

తే.వస్త్రమునఁగప్పకుండినఁబ్రమదమఱియుఁ,బ్రసవముననున్నతఱిఁజూడఁబలము తేజ
మంత మొందును గామార్తయగుతరుణిని,గనిననాయువుక్షీణించునను దురుగద!

క. తనసతి యేఁ బరసతియేఁ,దనయంత విలాసయుక్తిఁ § దా నుండినఁ జా
డను రాదని యాయువు దా,నను తగ్గునటండ్రు మానిసనాయకు లెల్లన్. 84

తే. మఱియునాత్రేయు ప్రియమునకు నెఱిఁగనంగ,నా మెగవయంగననురాగ§మతిశయిల్ల
బలుకసాగంగఁ దేజము§బలముఁ గుందు,నందు రార్యులు పూర్వశా§స్త్రాళి నరసి.

క. వనిత నిదురించుచుండినఁ,గన దోషం బబ్బునంచుఁ § గామాతురతం
గొని మరులు గొలుపుమాటలు,వినిపించిన నాయువెల్ల§విలయమునొందున్. 86

క. పరమామోదంబునఁ బర,తరుణులతో మాటలాడు§తనసతితో నె
వ్వరుసం బలుకఁగ రాదని, రురుమతు లద్దాన దోష § ముండు టెఱిఁగియే. 87

చ. పురుషుఁడు కాంతలం దమియుఁ § బొంగఁగఁగూడి విలాసయుక్తిమై
స్మరశరవార మెంతయుఁ బ్రమారణకర్మము నాచరించునా
దరణము పూనఁగాఁ గుసుమ§తల్పమునన్ § శయనింపఁ బ్రీతినే
నరుఁడు గనంగఁ బాల్పడు వి§నాశము నొందు నతండు వేగమే. 88

క. సతితోఁ బ్రియ ముప్పొంగఁగ బతి సంభాషింప దాని§పద్ధతి వినఁగా
మతిఁ దలఁచి మఱుగునను బొం,చి తగన్ వినునతఁడు వేగ§చెడునండ్రు మునుల్.

చ. వనితలు క్రూరవాక్యములు§పల్కిన భర్తలతోడ వాని నె
ల్లను వదలంగఁబూనక వి§లాసమునన్ వచియించి సూనృతం
బును బలుకంగఁ బుణ్యమగుఁ§బో యని యెంచు నతండు పాపపం
కనిబిడ కూపమందుఁ గల§కాలము కాపురముండు నండ్రుగా! 90

క. పరిహాసోక్తులనే నె,ప్పురుషుఁడు పరకాంతఁ గాంచి § పోలు నటంచున్
గరువమునఁ బల్కునాతఁడు, నిరయంబున నుండునండ్రు§నియతస్వాంతుల్. 91

క. తనసతితోనైనను వినఁ, నసహ్యములుగాఁ బొసంగు§నావాక్కులఁ బ
ల్కిన నవ్వి యాయువడఁచున్, జన దటు పల్కంగ నండ్రు § సాధుమనీషుల్.

క. ఈనీతుల నేనెఱిఁగియు, నీనెలఁతలఁ జూచినాఁడ § నిందు మహాఘం
బీనాకుఁ గల్గకుండునె, మానస మీపాపభీతి§మగ్నం బయ్యెన్. 93

ఆ. ఏమి చేయువాఁడ § నింకనీపాపంబు, తొలఁగునెట్టు లనుచుఁ § గలఁగి హనుమ
యెంచియెంచి మరల § నిట్లని తలపోసె, బుద్ధివైభవంబు § పొదలుచుండ. 94

క. నామనసు సత్యమార్గము, నేమఱక యెఱుంగఁజాల § కిట్టివిచార
స్తోమమునకు గుఱియయ్యెన్, గామినులం గాంచఁదగిన§కాంక్ష గలుగమిన్. 95

క. పరమేశ్వరకార్యమునన్, నిరతిం దగునట్టి నాకు § నెలఁతల వీరిన్
బరికింపఁ బాప మేలగు, నరయక యీభీతినొంద § నర్హుఁడనైతిన్. 96

సీ. కావలెనని చేయు§కార్యమునకె ఫల, మబ్బునం చందు రా§యార్యులట్లు
గాక కార్యాంతర§కలితచిత్తంబునఁ, జరియించునాకు నీ§తరుణు లిట్లు

కనఁబడి రంతియే కాని చూడందగు, నన్న వాంఛను జూడ; నట్టులొంట
నఘ మంట దీనన్ను నరసిన శాస్త్రాళి, హృదయమిట్లేయని యెల్లమునులు
ఆ. పలుకుచుండ వింటిఁ బలుపోకులఁ దలంచి, వంతఁగుంది చేయవలసినపని
మానినాఁడ; నిద్ది మర్యాదయే నాకు, నెట్టులగును దూత కిద్ది హితమె? 97

ఉ. శ్రీరఘురాముపాదములఁ జెందిననామది దుష్టకార్యముం
గోరియొనర్చు నెట్టు! లఘుకూటము తత్స్మృతి నాశ మొందుఁగా
దే రయమొప్ప సాదియము లేటికి నాకిఁక? సీతఁ జూడఁగా
నీరమణీయపత్తనము నెల్లెడలన్ వెదుకం దొడంగెదన్. 98

క. అనితలఁచి శ్రీరఘూత్తము, మనమున ధ్యానించి సుంత మ్రాన్పడి నట్లుం
డి నియతి వెదకుచు నందే, కనుఁగొనియెన్ రావణున్ నికామబలాఢ్యున్. 99

క. వదనబిలంబులనుండియు, సదాగతుల్ వెడల వాని సంసర్గమునన్
జదిసి వెతఁబాఱు సత్త్వసముదయము లింకేల యన్యముల లెక్కింపన్. 100

క. ఇరువదిచేతులు పృథువిషధరములపోలికను భీతిదంబులె యగుచున్
బరజనవిధ్వంసనకార్యరతిం బొలుపారునటు విరాజిల్లెఁ గడున్. 101

తే. పార్శ్వములయందు దేవతాభామినులు లోగి, బవ్వళించియుండంగ వనకరేణు
నికరముల యంతరంబున నెగడుమత్త, దంతిపోలిక నత్తఱిఁ దా వెలింగె. 102

ఉ. ఆతనిఁ గాంచి రావణుఁడె యీతఁ డంచు నెఱింగి తత్తనూ
ద్యోతము చిత్రమైయలర నొక్కట నచ్చెరువందుచుం గటా!
యీతనుకాంతి దేవతలనెల్లను మించి వెలుంగు; వీనిదు
ర్నీతి యొకండె దూష్యమని నిందకుఁ బాత్ర మటంచుఁ జెప్పనౌ. 103

ఉ. ఈతనుకాంతి దేవపతికేఁ గలదంచు వచింపఁజాల; వి
ఖ్యాతశరీరకాంతి సుగుణాళికి హేతువటంచు సజ్జన
వ్రాతము పల్క వింటి; నిట వారలపల్కులు వ్యర్థమయ్యె నం
చీతఱి నెంచనయ్యె; నిపు డేమనువాఁడ విధాత నక్కటా! 104

చ. అవినయమొక్కఁడే యితనియందుఁ గనంబడకుండునేని లో
కవితతి నేలఁజాలు ననఁగాఁ దగియుండెడు నొక్కదుర్గుణం
బు విమలసద్గుణప్రతతిఁ బోల నశింపగఁ జేసె; నక్కటా!
భువిఁగలదే మఱొండు రిపుభూతము దుర్గుణ మొందు దక్కఁగన్. 105

### వినయమహత్త్వము.

చ. వినయమె యీదశాస్యునకు వృత్తిని సుంతయునైనఁ గల్గు నే
దనుజులఁగాదు దేవసముదాయముఁగూడను బాలనక్రియం

దనియఁగఁ జేయఁజాలు నిది। తథ్యము తద్గుణ మొక్కఁ డుండమిన్
వినుతికి మాఱుగా జగతి। వేయివిధంబుల దూఱుఁ గాంచెడున్. 106

చ పురుషులకెల్ల రత్నమయ। భూషణరాజి మహో త్తమంబుగాఁ
బరఁగునుజూ; మ్మడంకువయె। పద్ధతి; దాని నెఱుంగఁజాలున
ప్పురుషుఁడు లోకజాలములఁ। బూజ్యుఁడెయౌ; నొకసంశయంబు లే
దరయఁగ దానిమాన నిసు। మంతయు లేదు ప్రయోజనంబొగిన్ 107

చ. అడఁకువ నా సమస్తసుగు। ణాళిఫలం బని యార్యులందు; రే
యొడికము లేకయున్న విన। యోత్తమభూషణభూషితుండయేఁ
బుడమి సమస్తకార్యములఁ। బొందు ఫలంబును; వేయునేల యె
క్కుడువినయంబు గల్గునటు। కోరికయుండుట మేలు చూడఁగన్. 108

క. సకలతపస్సారంబయి, వికలతయే లేకయుండ। వెలయించుచు నె
ల్లకడల గౌరవ మిచ్చుచు, సుకమొసఁగున్ వినయమనెడు। శుభగుణ మొకఁడే.

చ. వినయము గాంచి దేవతలు। వేగ వరంబులొసంగుచుంద్రు; స
న్మునులు మహాశిషప్రకర। మున్ గురియించుచునుంద్రు; మర్త్యులా
ఘనగుణ మెన్ని గౌరవము। గల్గఁగఁ జూతురు; వేయునేల యా
వినయముఁ బోలుసద్గుణము। విశ్వమునం గనరాదు చూచినన్. 110

ఆ చంపఁదలఁచి వచ్చు। శత్రువు నైనను, వినయ మట్టియడఁచి। వేగ మరలి
పోవఁజేయు; నదియొ। పో సాధుతేజ మ,నంగ; దానిఁ గాంచి। నర్ భయంబెకలుగు

ఉ. చిత్తము శాంతమైనయెడఁ। జేకుఱు నవ్వినయంబు నెప్పు డు
న్మత్తతఁగాంచుఁ జిత్త మణు। మాత్రము నిల్వక యాగుణంబు పో
నుత్తలపాటునొందు; మఱి। యొక్కయుదాహరణం బిఁకేల స
ర్వోత్తమ మంచు జెప్పుటయె। యొప్పుఁగదా వినయంబ గట్టిగన్. 112

చ. దితిజగణేంద్రుఁ డీతఁ డతి। ధీరుఁడు బాహుబలైకనిర్జితా
యతబలసాంద్రవైరిగణుఁ। డన్న ప్రసిద్ధిని గాంచి శంకరున్
శతదళసంభవాద్యమర। సత్తములన్ దనియింపఁజేసి సం
స్తుతవరజాలముం బడసి। తోరపుశక్తి నెసంగుచుండియున్. 113

తే. ఒక్కవినయంబుఁ బడయమి। నిక్క మెల్ల,సాధుదూషణములనొందఁ। జాలెఁగాదె
తపమువరములు శౌర్యము। తలఁపనిష్ఫలము లెవినయంబు లేమిన। చుమదిఁదోఁచు.

క. ధనమన వినయంబగు; దా,నినిమించిన ధనమనంగ। నెఱి వెదకిన లే
దనవచ్చు; నాధనంబును, గనఁజాలఁడయేని నిస్వు। కల్పుఁ డతండే. 115

సీ. ఆజానుబాహువు। లతిపీవరాంసమ్ము, లతిదీర్ఘనేత్రంబు। లతివిశాల
వక్షము భయదమౌ। వక్త్రసమూహము, పృథులజంఘులు శ్రుతి। పేయములగు

వీరిచరిత్రముల్ । వెలయనొప్పారియు, నవినయగుణమున । నవని నితఁడు
దుష్టుఁ డనంబడి । దుర్జనసుతుఁడయి, కుందనున్నాఁ; డిఁకేమందు నితని

తే. నిట్టివానిని బడఁగొట్టినట్టిదొక్క,యవినయమెగాదె; వరము లత్యంతనియతిఁ
జేసినతపస్సు నేమయ్యెఁ । జెప్ప నేల,వినయమే భూషణంబగునను చు మరల.

క. అనితలపోయుచుఁ గేసరి,తనయుండా సౌధమందు । ధాత్రీపుత్త్రిం
గనఁజాలక విసుఁగక వే,చనియెన్ వేఱొండుచోట్లఁ । జక్కన్ వెదుకన్. 117

## హనుమ దేవతల వేఁడుట.

క. తిరుగుచు నొకచోటను బ్ర,స్తరమట్టులు నిల్చి సీతజాడ తెలియునా
వెర వూహించుచు దేవో,త్కరమును స్మరియించి యిట్లుతలఁచెన్ మదిలోన్.

క. కనినాఁడ నెల్లతావుల, జనకజ గనరాదు మున్ను । సంపాతి వచిం
చెను లంకయందు జానకి, కనఁబడుచున్నదని దానిఁ । గాదన నెట్లా? 119

ఆ. మానవులకు నాశ । మన్నించునలవాటు,గలదు; పక్షివంశములకు లేదు;
పక్షినాథుఁ డెట్లుపలుకు నబద్ధంబు, దాని నమ్మకుంట । తగు నదెట్లు?. 120

చ పతగవిభుండు చెప్పినటు । భామిని గానఁగరాదు నాకు; నే
వితమునఁ గాంచ దీని కొకవింతయనంగదగు హేతువుండు నే
నతిశయశక్తిఁ బూని పురమందు ధరాసుతఁ జూడఁ బూనున
ట్టితరుణమందు నాదగుకడిందిమగంటిమి నాశ్రయించితిన్. 121

ఉ. అంతియగాని నాదుమరియాదకుఁ బాత్రులుగాఁ జెలంగియ
త్యంతమహత్త్వయోగమున । నందఱికిన్ భజియింప నర్హులై
దాంతులునైన దేవతల । ధ్యానముచేయఁ దలంపనైతి నా
చింతయు పూననైతి నెటుసిద్ధి తగున్ బనియందు నాకిటన్. 122

ఉ. దేవతలం దలంప గురుతేజము దానుగఁ బొందు భక్తునిన్
జేవచెలంగుఁ జిత్తమునఁ । జేకుఱు దానను క్రొత్తశక్తి పెం
పావహిలంగఁ జేయు నది । యట్లగుటన్ సకలార్థసాధనం
బెవిధిఁ గాంచినన్ సురల । నెంతయు భక్తి భజించుటే యగున్. 123

ఉ చిత్తసమాధి గల్గుతఱిఁ । జెందినవేడుక నిష్టదైవ ము
త్యుత్తమతేజ మొప్పఁ దగుచుండుపరాత్పరుగాఁ దలంచి యే
యుత్తలపాటులేక స్థిరయోగమునన్ మదిఁ గాంచుచుండ నా
యుత్తమతేజ మొక్క మొగి । నొందును భక్తుని నిర్మలాత్మునిన్. 124

తే దానిసంసర్గమున నె యాతండు మిగుల, వెలుఁగు; నాతనిగాంచినభీతి యొదవు
నల్పమతులకుఁ; బగవానినైననదియు,వశతఁగాంచఁగఁ జేయు సర్వహితముగుట.

సీ. దేవతాతేజ మాధివ్యాధులం బాపి, యారోగ్యభాగ్యంబు । నందఁజేయు
నిర్మలచిత్తంబు । నిర్మించు; సత్కార్య, సంగతి సతతంబు । సాగఁజేయు
దుష్టవాంఛలనెల్లఁ । ద్రోలఁగించు; భగవదా,రాధనమున ననురక్తిఁ గొలుపు
వరుస వాంఛలనెల్ల । వదలించి నిష్కామ, యోగనిరతుఁగాఁగ నొనరుచుమఱి
తే. సర్వసమత చేకూరెడు । చంద మలవ,రించుఁ గావున దేవత నెంచి మదిని
పిదపఁ గార్యంబునకుఁ బూనఁ బ్రియముగల్గుఁ,గాక యుండిన ఫలసిద్ధి గల్గు నెట్లు?

చ. మనకు నభీష్టదైవ మణుమాత్రము కీడొదవంగనీక కా
చును; భయమేటి కింక ననుఁ జొక్కపుధైర్యము గల్గు నట్లు గా
వున భజియింపఁగాఁదగు సుబుద్ధిని దైవము నిష్టరూపతన్
దనరు మహాత్ము సర్వగతు । ధన్యు నిరంజను నద్వితీయునిన్. 127

సీ. భగవంతుఁడే కార్యభంగులఁ బరికించి, యొక్కొక్కదైవముఁ జక్కనిల్పి
యాకార్యమున సిద్ధి నందఁ గోరినవారు, తద్దేవతను గొల్వఁదగును; దాన
నాకార్యసిద్ధియౌ । నని దానిదౌరహ,స్య మనంగ నెద్దియౌ । ననఁగ నట్లు
భజియించు చుండియు భగవంతుఁడీరూప,మున నుండి జనులకు । భూరికార్య
తే. సిద్ధి చేకుఱఁ జేయు; నాసిద్ధి స్వీయ,కర్మమున కనుకూలమై । కలుగుచుండు
నని యెఱుంగుటయేగద । యని వచించి,రార్యజను లెల్లఁ దత్త్వంబు నరసియరసి.

క. కనుకన్ భక్తుఁడు దైవం,బును దేనినకాని కొల్వఁ । బూనునపుడె యీ
తనునామచిహ్నముల నొ,ప్పిన బ్రహ్మముఁ గొల్తు ననుచుఁ బ్రియ ముప్పొంగన్.

క. తలఁపంజను నద్దానన్, గలుగును విజ్ఞాన మదియొకద భేదంబున్
గలుగంగనీక సమతను, వెలయంగాఁ జేయు ననుచు । వినుతింత్రు బుధుల్.

తే ఆయుపాసనయేకద । యాగమాళి, సమ్మతంబగు; నద్దాని । జాఱవిడిచి
భేదమార్గంబు నూనుచు । నాదితేయు, నొక్కనిం గొల్వఁ గోరిక । లొప్పునెట్లు?

క. భేదజ్ఞానము వదలిన,నే దైవము ప్రీతిఁ గాంచు । నిది లేకున్నన్
గా దేదియుఁ గార్యము గురు, మోదం బొక్కప్పుడేని । పొదలదు మదిలోన్.

క. కానన్ దేవవరేణ్యుల, ధ్యానించెద నిశ్చలమగు । నంతఃకరణం
బూని యని పవనతనయుఁడు, తా నెలమిం దలఁచె శివుని । ధాతను హరినిన్.

సీ. దిక్పాలకుల మఱి । దేవవరేణ్యులఁ, బరమభక్తుల ముని । ప్రవరుల నతి
భక్తితో ధ్యానించి । పరమేశ్వరుని కార్య, మిది సిద్ధియగునట్టు । లెంచవలయు
నదె నాకు మిక్కిలి । యాశిషం బగునంచుఁ, బ్రార్థించి రఘుపతి । నర్థి వేఁడి
పవనుని మదినిల్పి । భావికార్యము నెంచి, యవలీల నొక్కహర్మ్యవర మెక్కి
తే. నలుదెసలు గాంచి కొంత చెంతను నితాంత,భూరుహాక్రాంతమగు నొక । సారవనము
గోచరంబౌట నటఁ జూచు । కోర్కి యలర, వాలముం కించి యెగిరె న । వార్యగతిని.

చ. వనమది యభ్రచుంబితరువారము సత్ఫలభారనమ్రపా
వనవిటపవ్రజంబు హితవాక్తిమంజులపత్త్రిరాజరా
జినిబిడనీడసంతతివిజృంభితచారుమహాలపంబు దై
త్యనికరసాధుపాలితమునై తగుఁ జూడ విచిత్రరీతిగన్. 135

వ. మఱియు నవ్వనంబు బహుశాఖాసమాయుక్తశాఖినికరంబగుట సామవేదంబు
చాడ్పునను, బ్రహ్మానందసంధాయకనాదప్రధానంబగుట యజుర్వేదంబుకర
ణిని, వైరిమారణచణభయంకరశబ్దప్రయోగబహుళద్విజవాక్ప్రపంచంబగుట
ఋగ్వేదంబుభాతిని, భాసిల్లుచు దినరాత్రిచరసంతతసంచరద్విజరాజసమాక్రాంత
శాఖశాఖాప్రశాఖంబై సాధ్వసావహవాజ్నినాదప్రధావితమృగకదంబదివా
భీతప్రముఖక్రూరనీడోద్భవ సంకులంబై, సర్వకాలప్రఫుల్లపుష్ప సంభారసం
భృతప్రతానవితానంబై దీర్ఘశాఖావలంబి భూరిశిష్టానుకారివిషధరపటల
పరిపూర్ణభూరుహాంతరంబై భూరుహలతావిలీనశాఖామృగసంచయంబై, వైరి
మారణకార్యపర్యటన సమాకులచిత్తపరుషవాక్పతత్రిపత్త్రసంచలన జాతవాత
ప్రధూత ధూళిధూసరితకుసుమవిసరంబై, ప్రకంపనప్రచాలనప్రచలిత మహా
శాఖాసమాయోగసంజాతభూరినినాదబహుళంబై, యుత్తుంగతరంగమాలికా
ప్రచలనస్థలాంతరప్రాప్తనిద్రాముద్రాపగమసమాకుల కారండవప్రముఖజల
పత్త్రరథపటల సంచలనశబ్దితసరోవరనికరంబై, భూమిరుహ లతాగ్రపరిచుంబిత
నక్షత్రమండలంబై, దానవవీరపరిరక్షితంబై, భీతికృద్ధిలిజాంగనాసన్నిధానవిష
మంబై, విషానలజ్వాలాభీలభూరివ్యాళజాలసంచారదగ్ధతృణధూమసాంద్రంబై
దర్శనీయంబై, సశోకవనితాలయంబయ్యు నశోకవనితాలయంబై, దురారాధ్యం
బయ్యు సదారాధ్యంబై, దుర్జ్ఞేయస్థానంబయ్యు సజ్జ్ఞేయస్థానంబై, యపుణ్యజన
నివాసంబయ్యుఁ బుణ్యజననివాసంబై, యప్రమదావనఖ్యాతంబయ్యుఁ బ్రమదా
వనఖ్యాతంబై, యసుహృత్ప్రాణినిలయంబయ్యు సుహృత్ప్రాణినిలయంబై,
యసంఫుల్లకమలాకరంబయ్యు సంఫుల్లకమలాకరంబై, యసంగతహంసంబయ్యు
సంగతహంసంబై, యసాన్నిధ్యచక్రంబయ్యు సాన్నిధ్యచక్రంబై యప్రతి
మాస్పదంబయ్యుఁ బ్రతిమాస్పదంబై, యవిగణనీయసాలంబయ్యు గణనీయ
సాలంబై, యప్రకృతియుక్తంబయ్యుఁ బ్రకృతియుక్తంబై, యమానంబయ్యు
సమానంబై, యమానవతీబహుళంబయ్యు మానవతీబహుళంబై, నేత్రపర్వంబై
యుండు. 136

చ. హనుమయు నవ్వనంబుఁ జొరనాత్మఁ దలంపఁగ గంధవాహుఁ డొ
య్యన సుఖశీతలంబయినయాత్మను సోఁకఁగఁ జేసి కార్యసి
ద్ధిని మదిఁ జెక్కఁజేసె; నిటు దివ్యసమీరకిశోరసంగతిం
గని మదిసంతసం బొలయఁగా ఫలమబ్బు నటన్న నమ్మికన్. 137

చ. రవికులవార్ధిసోము రఘురాముఁ దలంచుచుఁ జేరి దానవా
వివిధమనోజ్ఞవీథులను వీరుదనూపమగేహసంతతిన్
బ్రవిమలపుష్పభూమిరుహవాటికలన్ గని సంచరించుచున్
సవిధమునందుఁ గాంచె దితిజాతవధూగణసాంద్రభాగమున్. 138

హనుమ జానకిం గాంచుట.

చ. కనియట దానవాంగనల గాఢగళస్వన మొప్పుచున్న; దీ
వనితలయంతరంబుననె భామిని రాజనయిత్రి యుండనో
పును; జని చూచువాఁడ; నని బుద్ధిఁ దలంచుచు దక్షభాగ మొ
క్కనియతిఁ జక్కఁగా నదురఁగా మది సంతస ముబ్బుచుండఁగన్. 139

తే. ఎద్దియో మేలుగల్గు నంచవిధమునఁ, దెలుపుచున్నవి శకునముల్ పలుకులేల
దేవకార్యముఫలియింప కేవిధమునఁ, జెడును? మాస్వామికృపనాకుసిద్ధినిడదె?

క. అనితలఁచి వృక్షషండంబును దాఁటి విశాలవిటపముల జొంపంబై
కనఁబడు నశోకభూరుహ,ము నెక్కి యందొక్కచో నిముడుతను వొప్పన్.

ఆ. అడఁగియుండెఁ గ్రింద నాదానవాంగన, లార్తిఁ గూయుపలుకులాడ వినఁగ
నేవగించుచున్ విహీనరక్షకయయి, కుందుచుండు సీత క్షోణిమీఁద. 142

ఆ. కూరుచుండియుండె మారుతాత్మజుఁ డట్టి, క్రిందఁగూరుచున్న యిందువక్త్ర
నతికృశాంగిఁ జూచి యార్తనాదము సుంత, వినఁబడంగ సీత యని తలంచె.

క. అంతట వినఁబడె దుఃఖ,స్వాంతముగల దీనమెయి నెదుభావముఁ దెలుపం
బంతముఁబట్టిన యటుపిన, నెంతయుఁ దగనట్టి నుడు లనెన్నోవిధములన్. 144

చ. పతివిరహంబు దుర్భరము పావనచిత్తముగల్గు మానినీ
వితతికి నంచుఁ దెల్పునుడి వేమఱు వక్త్రమునుండి వెల్వడన్
సతి గురుకష్టసంతతులఁ జాల శ్రమంపడియున్నదంచు ధీ
రతతికిఁ దోఁపఁజేయునని రామునిదూత తలంచి యాత్మలోన్. 145

ఉ. ఇందఱు సంతసంపడఁగ నీవనితామణి రామరామ! యం
చుం దగుదిక్కులే గనుచుఁ జొక్కుచు నేడ్చుచు బాష్పధారలొ
ప్పం దనమోము వంచి క్షితిభాగము నార్ద్రమొనర్చుచున్ దనున్
నిందలపాలుచేసికొన నిత్యము నెంచఁగతిన్ వచించుచున్. 146

చ. దరియనలేని యంబుధివిధంబున నొప్పదురంతదుఃఖసా
గరమున మున్గుచున్ గడువఁగాఁగలనన్న తలంపు గల్గుచో
ప్పరసినలేక యుండుపథ మంతయుఁ దెల్పుచునుండు నేడ్పుతోఁ
బరుషమహీస్థలంబు స్థిరవాసముగాఁగ మదిం దలంచుచున్. 147

మ. తనకుఁ దైవము తోడునీడయు నగుఁ ధాత్రీశ్వరేశుండు ధ
ర్మనిబద్ధాత్ముఁడు రామచంద్రుఁ డనుచుఁ మన్నించి తత్పాదపం
దనమే దిక్కని యెంచుచుఁ మఱొకచింతం బూనకే యుండురే
తిని దాఁ గాంచి మరుత్సుతుండు క్షితిపుత్రింగాఁ దలంచెన్మదిన్. 148

ఆ. ఆమెయుండువిధము నంతయుఁ దలపోసి, కర్మగతి యనంగ గహనమెయగు
ననుచు నిశ్చయించి యన్వయనైజమౌ, చపలతను గ్రహించి యపుడు తలఁచె.

ఉ. ఆపదలందు ధర్మమను నట్టిది దోడ్పడు నందు రార్యులీ
కోపనయందు నయ్యదియుఁ గుంఠితమయ్యె నటంచుఁ జెప్పఁగా
నోపునుగాదె? యీసతికి నొప్పనె యీదురవస్థ యిప్పు రాఁ;
బాపులకే సహాయమగు బల్విడి ధర్మ మటంచు నెంచెదన్ 150

చ. తనదగు సువ్రతంబు వనితాతతి కెల్లను లక్ష్యభూతమై
తనరఁగ భర్తృదైవతముఁ దా సతతం బెద నిల్పి కొల్చుచుఁ
మునిజన మద్దిరే! యనఁగఁ బొల్చు మహీసుత కిట్టియాపదల్
కనుఁగొని దుర్భరంబులయి కాఁటియఁ బెట్టెడు నేమి చెప్పుదున్. 151

చ. కరుణ యనంగ నేజగతిఁ గన్పడునో యని యెంచి క్రూరక
ర్మరతిని మించి దానవు లమానుషభోగము లొందుచుండ నీ
ధరణికుమారి యిప్పగిదిఁ దల్లడమందెడు దీనిఁ జూడ ను
ర్వర నిఁక ధర్మమే నిలుచు భాగము లుండ వటంచుఁ దోఁచెడున్. 152

తే. పరమపాపాత్ము లెప్పుడు నిరుపమాన, సుఖము లందుచునుండ ధర్మ్మమని నాశ్ర
యించి యుండుపుణ్యాత్మకు లెల్ల దుఃఖ, భాగులగుచుండఁగనుచుఁడ వలసెనకట!

క. ఏ నేపాప మొనర్పను, గానం గష్టాళి నన్నుఁ గాఱింప దటం
చేనరుఁడు పల్కఁజాలఁడు, కానమిఁ దనపూర్వజన్మకర్మగణంబున్. 154

తే. అనుచు యోజించి కర్మసిద్ధాంతతత్త్వ, మిదని గ్రహియింప రాదంచు నెంచియచటి
వార్తలను జక్కఁ బరికింపవాంఛ యలర, వేచియుండె శాఖాంతరవిషయవసతి.

ఉ. జానకిశోక మింక దనుజప్రభు వీతఁడు వాపఁబూనియే
యానెలతం గనంజనెడు నాశయ మూనెను; గర్మసంగతిఁ
గానఁడు; స్వక్షయంబును నికామముదంబును బూనియుండునం
చూనిన శ్రద్ధఁ దెల్పునటు లొప్పె మహాధ్వని యొక్కఁ డత్తఱిన్. 156

క. హాలహాలశబ్దము నాల్గుదె, సలందు వ్యాపింప విటపసముదయమందుఁ
గలవిలపాటొందుచుఁ జొచ్చుకొని బర్వం జేయుచుండెఁ గొంకనిమదితోన్.

క. తను వత్యల్పముగాఁ దగ, హనుమంతుం డుండె నితరు లరయఁదగని మా
డ్కిని; రావణుండు పశ్చిమ, మనఁబడెడు త్రియామయందు నాభూకన్యన్.

క. కనుఁగొన నదె కాలంబని, మనమున ధ్యానించి దారమండల మెల్లం
దన వెంటరాఁగఁ దరలెను, మనమా యంబాపదాబ్జమగ్నం బగుటన్. 159

## ధ్యానకాలము.

చ. తనమన మెప్డు సంసృతినిఁ దార్కొనఁబూనకయుండు నప్పుడే
కనుఁగొన నిర్మలంబగుచుఁ గ్రాలుచునుండు నదే తలంప ధ్యా
ననియతిఁ బూన నుత్తమ మనంజను సంసృతిసాగ రాంతరం
బునఁబడి పొర్లుచుండ నెటుల బుద్ధి వినిర్మలమై చెలంగెడున్. 160

తే. ఎపుడు నిర్మలమై చిత్త మెసఁగుచుండు, ధ్యానయోగంబుఁ బూనఁగాఁ దగునపుడని
యార్యులందురు న్యాయ్య మేయదియుఁ జంచ, లాత్మ ధ్యానంబు పూన నెట్లది ఫలిం

క. ధ్యానమె యోగఫలంబని, మానులు వచియింత్రు దానిమంత్రం బదియే [చు
యానా ననవచ్చు విచంచల, మానసమే ధ్యానమునకు మహితంబగుటన్. 162

సీ. నిశ్చలచిత్త మేనిముసంబునం జిక్క, నపుడె ధ్యానము చేయనగు నటండ్రు
బ్రాహ్మముహూర్త మిప్పగిది నాలోచింప, నుత్తమమే యనఁ నొప్పియుండు
నట్టి కాలంబునఁ నాచరించిన సాధు, కర్మము సత్ఫలం బర్మిలినిడఁ
దగియుండు; మఱి దైవతంబు నుపాసింపఁ, ద్రోవలు నాల్గని పావనాత్ము
తే. లాజ్ఞ చేసిరి; భక్తునకందు నెద్ది, కర్మవశమున నిష్టమై కడుసుఫలద
మగునటంచును దోఁచునయ్యదియె పూన్కి, నాచరింపఁగ నర్హమై యమరియుండు.

వ. జపహోమన్యాసపూజాఖండంబులని వానినామంబులు. ఇవియన్నియు నొక్కొ
క్కటియు సమానఫలదంబులైయుండు. ఇందెవ్వరి కెద్దిహితంబగు వాఁడు
దాని ననుష్ఠింపవచ్చు. రీతిభేదంబె కాని ఫలభేదం బింతయుఁ గానరాదు. కాన
సమాహితమనస్కుండై భక్తుం డిష్టదేవతోపాసన చేయవలయు హోమాది
ఖండత్రయంబునం దెయ్యది యనుష్ఠింపఁబూనినను మంత్రజపంబు వదలరాదు.
అయ్యది సంఖ్యానియమవిరహితంబుగ యథోచితంబుగ నుండు. జపప్రధానుఁ
డగునుపాసకునకు న్యాసపూజాఖండప్రతిపాదితనియమంబులు యథోచితంబు
లుగనుండు. హోమము సంఖ్యాబద్ధంబైయుండు ఈయుపాసనాఫలము ధ్యా
నంబె యని యెన్నఁదగియుండు. ధ్యానమే యోగైకఫలంబని స్మృతులు
ఘోషించు. బాహ్యపూజానిరతికంటె మానసికపూజానిరతి యత్యుత్తమంబని
శాస్త్రహృదయంబు అట్టులగుట రావణుం డుచితకాలమునందు మేల్కాంచి
సీతాంబాసందర్శనముచేసి పిదప నిత్యకర్మానుష్ఠానముచేయువాఁడై కరదీపికా
సహస్రంబులు గొని దేవకాంతలు వెంటరా సుగంధవస్తువారంబులఁ దాల్చి
ప్రమదామణు లిరుప్రక్కలం గొలువ నశోకవనంబున కరుగుదెంచె నప్పుడు.

ఉ. సీతయు రావణాసురునిచిత్త మెఱుంగును గాన సుంతయేఁ
జేతము చూచువారలకుఁ జెప్పఁదలంపఁగ నైనఁ దోఁపనీ
కాతతభీతి నొందినటు లారయనై తనభర్తురాక నే
యాతఱిఁ గోరుచుండెఁ బవనాత్మజుచిత్తముఁ దా నెఱింగియే. 165

ఉ. దానవకాంత లావిభుఁడు తమ్ముఁ గనన్ బదులేమియాయఁగా
నౌనో, యటంచు భీతిఁ గొని యత్తఱినుండిరి; రావణుండు చిం
తానిలయంబుగాఁ దగునితంబిని శ్రీపరదేవిఁ జూడఁగాఁ
దా నెద నెంచి వచ్చినవిధంబును దోఁపఁగఁ జేయఁబూనుచున్. 166

క. పదములు తడఁబడ నడుచుచు, మది జానకియందె యెంతొ మగ్నముగాఁగన్
మదనోన్మాదము పైకొన, మదవతులెల్లరును రా సముంచితగతితోన్. 167

ఆ. అరుగుదెంచె నంత నాతనిరాకసు, గని భయంబుమిగులఁ గాంచినట్లు
జనకతనయ దేహమును జక్కఁగనఁబడ,కుండ నొదిగి కూరుచుండియుండె.

సీతారావణసంభాషణము.

క. చనుదెంచి రావణుం డా, జనకసుతం గాంచి యిట్టిచందము గనఁగాఁ
బనియేమి నీదుచిత్తం,బునఁగలవాంఛలను దీర్పఁబూనిన నన్నున్. 169

చ. పరమకృపం గనంగఁ దలఁపం బనిపూన వదేమి జానకీ!
సురతరుణీకదంబములు చూడఁగ సేవలొనర్తు నీకు; నీ
తరుణులు దాసికల్ గనుము తామరసాయతనేత్రయుగ్మ మా
దరమున విప్పి నాదయితత్త్వము నీవె తలంపుమా మదిన్. 170

ఉ. నామనమెట్టిదో యరసినం దెలియందగు నీకు దేవి! నీ
కోమలపాదపద్మములకుం బ్రణమిల్లుదుఁ బెక్కుసారు లా
రామునిరాక నెన్నుచును రావణుసంతసమందఁజేయ కా
రామమునందు నుండఁగ సురవ్రజమైనను మెచ్చఁ జాలునే. 171

మ. ధనరాసుల్ మణివారమింకను సమస్తంబున్ భవత్సన్నిధిన్
జనులెల్లం గన నుంచువాఁడ నను రక్షాకార్యయోగ్యాత్ముగా
మనమందుం దలపోయుమంతట మహామాన్యుండనే యైతి నం
చు నితాంతంబుఁ దలంచువాఁడఁ గొనుమా శుభ్రాంగి! నా మ్రొక్కులన్. 172

ఉ. నాపతి చెంతలేఁడు వసనంబులు రత్నవిభూషణంబులే
లా పరమంబులయ్యె నవి యన్నియు వ్యర్థములే యగుంగదా
యీపలుకుల్ మఱేల యని యెంతువొకో యనురక్తిఁ గొల్వఁగా
నోపిన నన్నుఁ బో విడుచు టొప్పునె నీవె తలంపు మాత్మలోన్. 173

చ. అనిశము దైత్యరాజ్యమున కంతకు నేలిక వీవయౌచు నీ
మనసున కెక్కువర్తిలెదు మాన్యుని సేవకుగా గ్రహించి పెం

పును గనఁజేయవమ్మ ననుఁబోలినభక్తుని నీసడింపఁగాఁ
జనునె త్వదంఘ్రిసేవకులు చాలుదురంట విముక్తి నొందఁగన్. 174

ఆ. ఒండుతలఁపు మాని యుర్వీసుతా! నన్నుఁ, బాదసేవకునిగ నీదుదయకుఁ
బాత్రునిగ గ్రహించి భవబంధమోక్షంబు,చేయఁ బూనవమ్మ న్యాయమెన్ని.

మ. చిరకాలంబుగ నీమహాభుజములన్ శీర్షవ్రజంబుల్ మహా
దరమొప్పన్ భరియించినాఁడ విసుఁగొందంజాలితిం జాలునీ
కరుణం బొందఁగఁగోరినాఁడ గతమాకాలంబుఁ జింతింప భీ
కరరీతిం గనుపట్టు సంసృతిమహాకాలాహి మ్రందింపుమా. 176

ఆ. వర మనుగ్రహింపు సరసిజాక్షీ! నీకు, సేవచేయుభాగ్యసిద్ధి నాకు
గలుగునట్లు దానఁగలుషముల్ వాయంగ, ధన్యుఁడనయి సత్పదంబుఁ గనుదు.

క. అనుటయు జానకి పావని, మనమానసి స్వాశయంబు మట్టుపఱచి యి
ట్లనియెన్ దృణకల్పునిగా, నినుఁ దలఁతున్ రామమూర్తిని గన నెంతున్.

క. ఎవిఁయే ధనములురత్నస,మవాయముం జూడనైన మామకచిత్తం
బవధానము గలదగునే, శవతుల్యము లవ్వి నాకుఁ జాలుం బొమ్మా 179

క. శ్రీరాముఁడు నా చెంతం, జేరిన నీభవసుఖంబు క్షీణించునుజు
మ్మూరక పలుకకు నాకడ, నోరావణ! నీదువాంఛ లోగి నశియించున్. 180

చ. త్వరపడనేల యింక రఘువంశమహోదధిశీతరశ్మి భీ
కరతరవిక్రముండు పరకాండలయాంతకుఁడౌను రాఘవుం
డురుతరతచ్ఛరాభిహతి నొక్కక్షణంబున సర్వశూన్యతం
బొరయఁగలావు మాటలిఁకఁ బోలునె తోఁచినయట్టు లాడఁగన్. 181

ఆ. మరలిపొమ్ము దారమండలమును గాంచి, కాంక్షదీఱ రత్నకాండముగని
యాశలన్ని యడఁగనరయుచుండుము రాము, దర్శనంబు చేయఁదగు నెపుడని.

క. భవబాధలు తొలఁగింపఁగ, శివమును జేకూర్పు రాముశ్రీపదయుగళం
బె వసుధ దక్షంబన నీ,వవధానముమీఱఁ దలఁపుమా దితిజేంద్రా!. 183

చ. శరణమువేఁడు మింక నృపచంద్రుని శ్రీరఘురాము నెవ్వరే
వరుస హితంబువల్కినను వానినిసుంతయు నాలకింప కీ
శ్వరు ననిశంబుఁగొల్వు మెద సందియమందకు మేలుగోరి ని
క్కరణి వచించుదాన రఘుకాంతునిఁగూర్పుము నన్ను నిత్తఱిన్. 184

ఉ. పౌరుషమూని మర్త్యునిగ భావమునం దలపోసి మార్కొనం
గోరుదువేని శీర్షములఁ గూల్చు కరంబుల రూపుమాపి నీ
సారమడంచి కూల్చు నిను శాతశరంబులు రామముక్తముల్
పారసంభవాదిసురసత్తములే నినుఁ గావలేరనిన్. 185

చ. పలికెద నీదు క్షేమమును । బల్మఱుఁగోరుచు రావణా! వినం
దలఁచితివేని మేలొదవు । దానికి సందియమింతలేదు ప్రా
క్కలుషము నిన్విసందలఁపఁ।గా నొడఁగూర్పదయేని మృత్యువే
కలుగు నిజంబు సంగరము।ఖంబున శ్రీరఘురామువంకనే. 186

మ. పరదారం గొనివచ్చు టొక్కటియె పా।పశ్రేణి నుత్కృష్టమౌ
పరిసేయం దగునట్టి దెద్దియు నదే।చందంబునం గాంచినన్
ధరణిన్ దానికి లేదొకండు మఱియుం । దత్కార్యసంసిద్ధికై
గరువంబూని యొనర్చుయత్నమది యొ।క్కాలంబునన్ బంచునే. 187

సీ. కలవు పాపము లనేకములు; వానిం, బరదారపరిగ్రహ । మారయంగ
నురుతపంబని చెప్పు।నొప్పును శాస్త్రముల్, కారణం బేమన।గా వచింతుఁ
గులధర్మగణము మి।గిలినధర్మంబులు, స్త్రీమూలమున వృద్ధిఁ । జెందుచుండు
నట్టియుత్తమకాంత । యాత్మఁగలంచిన, ధర్మంబు నశియింప।దగు నటన్న
ఆ. తలఁపుగలిగి నల్లి । దానహానియె కాని, సుఖముగలుగునట్టి।చొప్పు లేదు
ధర్మహానిఁగోరఁ । దగుపాపమునకంటె, నధికపాప ముండ।దనుట నిజము.

ఉ. కావున నన్యపత్నిఁ దన।కాంతగఁ గావలెనంచుఁ గోరఁగా
నావహిలున్ మహాఘు; మది । యార్తిని గూర్పక పోవ దంతటన్
బోవక వంశనాశనము । భూరితరాపయశంబుఁ గూర్చు నో
రావణ! యీవిధం బెఱిఁగి । రామునకున్ ననుఁ గూర్చు మేర్పడన్. 189

క. మనుజుండు ప్రమాదంబున, నొనరించిన పాతకమున । కుండును స్మృతు లె
ల్లనుజూడఁ బాచితం బెం,దును లేదది బుద్ధినెఱిఁగి । దోషముచేయన్. 190

చ. శ్రుతులఁ బఠించి శాస్త్రముల।చొప్పు నెఱింగి తపంబుసల్పి యా
శతధృతి మెప్పుగాంచి గురు।శౌర్యమునన్ ద్రిజగంబులందు వి
స్తృతయశమున్ గణించి దితి।జేంద్రుఁడవై తగునీకు న్యాయమే
సతిఁ బరకీయఁ గోరు టది । స్వాంతమునం దలపోయు మొక్కటన్. 191

తే. ఇంతచెప్పంగ నేలని । యెంతువేమొ, నీదుభాగ్యంబుఁ బాండితి।నింగనంగ
జాలిగల్గుట హేతువౌ । బాలిశత్వ, మింకనైనను మాని సు।ఖేచ్ఛఁగనుము.

క కానిపథంబునఁ బోయినఁ, గానంబడు నయ్య! దితిజ।గణనాయక! యే
మేని సుఖ మెప్పుడైనను,మానసశాంతియును జను।లమన్న నరైనన్. 193

ఆ ఇంకనైనఁ బాప।కృత్యము సేయక, పరమరామపాద।పంకజములఁ
గొలువు పద్దినీకుఁ । గోర్కు లొసంగునీ, జనినిబట్టి యింత । యనఁగవలసె 194

క. ఇఁకఁబొమ్ము జాలు; నీనుడు,లకు నుత్తరమిచ్చితిని గ।లంగక శాంతిం
బ్రకటింపఁ దలఁపు మింతట, సుకిమమ్మఁ గ్రమంబునన్ వి।శోకత పొలయన్.

క. అనిపలికి తృణాంతరముగఁ, జను మింటికి నంచు లోనఁ శాంతముఁ గోపం
బును బైకిఁ గానరాఁ బల్కిన నావాక్కులనుగల్గు కీ కెఱిఁగి త్వరన్. 196

ఉ. చిత్తమునందు ఫుల్లసరసీరుహలోచనయందుఁ గల్గున
త్యుత్తమభక్తి కానఁబడకుండఁగ దాఁచి భయంకరాకృతిన్
జిత్తములెల్ల నే మిదని భీతిని బాఱఁగఁ బండ్లుగీఁటుచున్
గృత్తిచలెం గనుంబడుచుఁ గేకలువేయుచు దుర్నిరీక్ష్యుఁడై. 197

ఉ. జానకిపల్కులం గుఁగలసారము లోనఁదలంచి యిట్లనున్
దానవకాంతలార! యిఁకఁ దాళుట తప్పనితోఁచెఁ గావునం
జాన యటంచు నోర్పుఁగనఁజాలనుజాలను; మాసయుగ్మమున్
నే నవకాశ మిచ్చెదను నీరజలోచన యీమె యంతలోన్. 198

తే. నాకు లోఁబడునట్లు యత్నమునుసల్పుఁ,డద్ది సాధ్యమెకాకున్నఁ నపుడెఁ దినుఁడు
సంతసముమీఱఁగా నిదె శాసనంబు, తిరుగనేరదు నామాట తెల్లమిద్ది. 199

తే. అనుచునింటికిఁబోయె నిత్యంబులైన, కృత్యముల కద్దియద ననియెఱిఁగి యిట్లు
దానవాధీశుఁ డరుగంగఁ జానకియును, వానిభావం బెఱుంగునుగాన నపుడు.

క మనమునఁ దలంచె రానగు, ననిలాత్మజుఁ డింక ననుచు నంతట వృక్షం
బుననుండి హనుమ యూహిం,చెను నాయాగమన మెఱుఁగఁ జేయుటతగుఁగా.

క. పరికించితి రావణువా,క్సరణిన్ భూపుత్రినుడులచందము; నింకం
ద్వరపడఁదగు భూనాయక,వరుకుశలం బెఱుకపఱుప వలయుంగాదే. 202

ఆ. అనుచు నాత్మఁదలఁచు నత్తఱి సీతయు, శోక ముప్పతిల్లఁ జొప్ప నొరుల
కెఱుకపఱుపఁదలఁచి యేడ్చుచు లేచి యా, విటపివిటపమునకు విమలవేణి.

ఆ చుట్టి చావఁబూనునట్టి విధంబట్టి, కానఁబడఁగఁ జేసె నానెలంత
లందు నున్నత్రిజట యతివేగమున లేచి, దనుజకాంతలార! వినుఁడు మీరు.

త్రిజట స్వప్నముం దెల్పుట.

సీ. కలఁగంటి నదిభయంకరము రాక్షసులకు, జానకి కానందజనకము నగు
రావణేశ్వరుఁడు ఖరంబెక్కి తైలంబు,నందు దేహముమున్గయమునిదిక్కు
నకు నల్లచీరఁ గనందగునొకయోష, యీడ్వఁగా నవశుఁడై యేగినట్లు
కుంభకర్ణాదులు కోరికలూరంగ, నవ్వుచు నెగురుచు నాతియొకతె

ఆ. జుట్టుపట్టి యీడ్వ నెట్టన శమనుని, దెసకుఁ జనిరి; దానవసమితి కెదొ
కీడుమూఁడ నున్నజాడ కన్పడు విభీ,షణుఁడు మాత్ర మెలమి సంఘటిల్ల.

చ సితకరినెక్కి శీర్షమున శ్వేతమహాతపవారణంబు నొ
క్కతరుణి పట్టఁ జామరయుగం బిరువంకలఁ గామినీమణుల్
హితపవనంబు గల్గునటు లెంతయుఁ బూనిక వీఁచుచుండఁగన్
స్మితముఖపంకజాతము ప్రసిద్ధమరీచుల నీనఁ గన్పడెన్. 206

చ. సురరిపుకాంతలార! కనఁ జోద్యము స్వప్నము చక్క నెన్న నా
శరులకు నాశనం బొదవుఁ జాడను దెల్పెడు రామచంద్రుఁ డీ
తరుణినిగూడి పుష్పకము తద్దయుఁ దన్ను భజింప నెక్కి సుం
దరముఖలీలఁ గన్పడఁగఁ దాఁ జనఁ జూచితి నుత్తరంబుగన్. 207

క. దానవగణభీకర మీ, జానకికిన్ రాఘవునకు శ్వశ్శ్రేయస సం
తానప్రదముసు నగుకల, నేనిప్పుడె గంటి; భీతినిం గంటి నెదన్. 208

ఉ. మీరును జానకిం గొలిచి మేలుగనుం; డిఁక నీమె వేగమే
ధారణిరాజ్ఞి కాఁగలదు దానవజాతికిఁ గీడుఁగల్గు నే
దారిని గాంచినన్ శుభము తప్పదు సీతకు వేయునేల యీ
సారసనేత్రఁ గొల్చుటయె సన్నుతమార్గము మీర లెంచుఁడీ. 209

చ. అనుటయు భీతినొంది దనుజాంగనలెల్ల వడంకుచున్ మహా
జననిరో! మమ్ముఁ గావఁదగు సాధ్వసమేమియుఁ గల్గకుండ మే
మొనరిచినట్టితప్పుల మహోత్తమురాలవుగాన సైఁచి నీ
తనయలఁబోలె నెంచి సతతంబును గావుము మ్రొక్కు లివ్వియే. 210

క. దాసరితప్పులు దండము,తో సరి నాఁగింవదంతి తోయజవదనా
నీసన్నిధిఁ జెప్పఁగ నేలా సల్పెద మిదిగో సేవ లాదృతిఁగొనుమా. 211

క. అని ప్రార్థింపఁగ జానకి, విని యంతఃకరణమందు వెలయుకరుణ పైఁ
గనఁబడనీయక యిట్లను, దనుజుల నమ్మంగఁజాలఁ దథ్య మిది యగున్. 212

ఆ. పాముకాళ్ల నెఱుఁగఁ బాములే చాలును, గాని యెరు లెవరును గారు శక్తు
లంత మొందనున్నయట్టి వారిని వేఁడుకొనుట నవ్వులాట కనుట వినరె 213

క. అనిపల్కి రామనామంబును జక్కంబాడుచుం బ్రభూతార్తిని బ్రుం
గినయట్లు తలఁపఁ బోలిన, యనువునఁ దానుండె నిల్చి యామ్రాకుకడన్ 214

## సీతామహత్త్వము.

చ. జనకకుమారిహృద్వికచసారసమంజుపదంబునుండి చ
క్కనిగతిఁ దంతువొండు చని క్ష్మారుహపత్త్రవిలీనుఁడైన పా
వనిహృదయంబుఁ జేరె నదె స్వాంతమునం దలఁపుల్ ఘటింపఁ జే
యు నభినవంబుగాఁగ నదియొప్పును బేరను బ్రేమతంతునాన్. 215

సీ. మర్త్యలోకంబున మానవుం డే దైవ,మును గూర్చి ధ్యానము ననుదినంబు
చేయు నాతనిదగు చిత్తపద్మమునుండి, తలఁపు నాఁ బడునట్టి తంతు వట్టె
సాగి యా దైవము స్వాంతము నొందును, దాన నెఱుంగు నాతని తపంబు
నా తంతు వతిదృఢమౌ నంత నా దైవ, మద్దానిసోఁకున నతనికథకుఁ

తే. జనఁ దలంచు నాకర్షణమను ప్రయోగ, మదియె యందు రాగమవేత్తలైన పెద్ద
లదియె యభిలాషతంతువౌ నంద్రు యోగ, శాస్త్రవేత్తలు భేదమోసంగ దిందు.

క. ప్రతికార్యంబున నీయది, యితరేతరభావముల నహీనబలమునం
దతివేగమ తెల్పును దీ, నితత్త్వ మీరీతినని మునివ్రజ మెఱుఁగున్. 217

చ. ఒకఁ డొకచోటనుండి తనయూహను దూరమునందునుండు మి
త్రుకడకుఁ బంపఁజాలు; మదిఁ దోరపుఁబూనికఁ గార్యమిట్టిదం
చకలుషవాంఛమైఁ దలఁచి యాతనిఁ జక్కఁ దలంచినంత నీ
ప్రకటతమాత్మశక్తి యొకపట్టున వానిమనంబు నప్పుడే. 218

ఆ. చొచ్చి మార్పుగలుగు సుముఖతఁ గనఁజేయఁ, జాలియుండు నెవని స్వాంతమస్థిర
తను జెలంగు నదియె తగును జేయఁగనట్లు, చంచలతను గాంచఁ జాల దట్లు.

సీ. ఇదె దృఢసంకల్ప మిదియె దారుణరూప, మిదె ప్రయోగమునాఁగ నిట్టిపేరు
లందియుండును జను లాచరించెడుకర్మ, ములు దేవతల కెక్కఁగల వనుటకు
గారణంబిదియె సంకల్పశక్తి యటంచు, దీనినే వినుతింత్రు మాననీయు
లట్లు గావున దీని దగురహస్యం బిది, యనియెఱింగినజనుఁ డనుదినంబు
తే. సాధుసంకల్పములఁ జేయఁ జాలియుండు, నజ్ఞుఁ డాత్మనుగలయూహలరయఁ జాల
రితరు లెవ్వారు నని తనయిచ్చకొలఁదిఁ, దలఁచుచుండును జెడిపోవుఁ దాన నతఁడు.

క. తలఁపెట్టిదైన దానిం, దెలిసికొనంజాలునట్టి దేవత యుండం
గలఁడంచు నెఱుంగందగు, గలరుగదా సాక్షు లాత్మఁ గనుఁగొను వారల్.

తే. చెడుతలంపైన నయ్యది చేరఁదగిన, యచటు చేరుఁ దద్దైవమే యతనికిఁదగు
శిక్ష చేయును సూర్యుండు శీతకరము, ఖులగు దేవత లెల్ల సాక్షులన వినరె.

చ. తనమదిఁగల్గు నూహలను దైవముగూడ నెఱుంగఁడంచు దు
ర్జనుఁడు తలంచు నాత్మగతు సర్వజగత్పతి నీశ్వరున్ మహా
త్ముని దలపోయఁజాలఁ డతిమూర్ఖత సాధుతతింగలంచు నా
తనిగతి నారకంబునకె తత్ప్రభవుల్ తగు సాక్షు లచ్చటన్. 223

క. ఈవిషయమెల్ల నెఱిఁగిన, పావనసుచరిత్ర సీత భావించె మదిన్
బావని తత్ప్రేరణమున, శ్రీవిభు కుశలంబుఁ దెలుపఁ జింతించెఁ ద్వరన్. 224

క. క్షితితనయాప్రేరణమున, దితిజాంగన లెల్ల నిద్ర తీవ్రముగా శీ
ర్షతతిపయిన్ నటియింపఁగ, ధృతిపోవఁగఁ దూలి పడిరి స్థిరపై నంతన్. 225

ఉ. పావని యిద్దియే యదను పార్థివచంద్రుని క్షేమవార్త లె
ట్లో వినిపించి యీమెదగు నుద్యమమున్ మరలింతు నించుకే
భావిని యాలసింప వెతఁ బర్వఁగఁ జచ్చునటంచుఁ దోఁచు ని
ష్ఠే విధి మాటలాడుచు నదెట్లు తలంచునొ నన్ను నక్కటా! 226

క. ఏభాష మాటలాడుదు, నీభామిని నమ్ము నన్నదెట్లు? జగతిలో
నాభాష వేఱుగద సా,ధ్వీభావము మాఱునొక్కొ యింతగఁ బల్కన్. 227

క. వనచరులకు సంస్కృతమం, దనూనపాండిత్య మెట్టులలవడు; నిదియా
దనుజులమాయయె యని న,న్ననుమానించునొకో యెద్ది యర్హమొ నాకున్.

చ. పురుషసమూహ మెల్ల నొకపోలిక నాశయ మెల్లఁ జక్కఁగా
నొరులకుఁ దెల్పభాష యొకఁడుండఁగ నిర్మితిఁ జేసియుంచె; న
క్కరణి పఠింతుఁ దొల్త రఘుకాంతుని చిత్రచరిత్ర మెల్ల నే
నరసినరీతిఁ బల్కెద నహా! యని యాయమ సంతసింపఁగన్. 229

చ. పతికుశలంబు శ్రోత్రయుగపర్వ మొనర్పఁగ నన్నుఁగాంచు నే
నతిశయభక్తి సన్నిధి మహాత్మునియాశయ మెల్లఁ దెల్ప న
ప్రతిమకృపాతిరేకమున రామునివార్తలఁ జెప్పుమంచు న
న్నతివయె ప్రశ్న చేయు నగునత్తఱి నాదగురాక మెచ్చఁగన్. 230

చ. త్వరపడకుండ నిందె పలుభంగులఁ గార్యముచేయురీతి యె
క్కరణి నటంచు నూహలను గాలముపుచ్చుచునుండ దానవే
శ్వరుని కఠోరశాసనము వైళమ సార్థక మెట్టులౌనొ యి
త్తరుణులు చేయఁబూనుదురు తాళఁగరామి మహీజ కుందుచున్. 231

క. మృతినొందుఁ దప్పదని నా, మతికిం దోఁచెడు నృపాలమండనునాజ్ఞం
జ్యోతి గాంచఁ జేసినట్లగు, హితదూతయెగాఁడు కుమతియే యంద్రు ననున్.

ఉ. ఇట్టి యనేకహేతువుల నియ్యెడ జాలము చేయ కింక నేఁ
బట్టుదలన్ మహీతనయఁ భవ్యరఘూత్తమనామసన్నుతిం
బుట్టినమోదసారమున మున్గఁగఁ జేసెద నిద్దియొక్కఁడే
యిట్టితఱిం బొనర్పఁదగి యెంతయు మేలొనఁగూర్పనయ్యెడున్. 233

ఉ. మానుషభాషఁ బల్క ననుమానము నొందునటంచు జంకఁగా
నౌనె సురేంద్రకార్య మిదియాట ఫలింపకపోదు రాఘవున్
మానసమందు నిల్పుకొని మంజులతచ్చరితంబుఁ బాడెదన్
జానకి నన్నుఁజూడఁ గడుసంతసమందక పోవ దయ్యెడన్. 234

చ. అనితలపోసి దేవతల నారఘురామునిఁ జిత్తపంకజం
బుననిడి భవ్యనాదమునఁ బొంగుచు నివ్విధిఁ బాడె; భూమిపై
వినుతికిఁ బాత్రుఁడై విజితవీరుఁడు పంక్తిరథుండునాఁగ స
జ్జనులకు గమ్యుఁడై పొదలు క్షత్రకులాభరణంబు వింతగన్. 235

సీ. అతనివంశమున శ్రీహరి నాల్గుభాగము,లుగఁ బుట్టె ననసుతులు చిరకాల
మునకు జనించిరి; తనయవర్యుఁడు రాముఁ, డతనిభ్రాతలు భరతాఖ్య లక్ష్మ

ణాభిధానమ్మున నల్లశత్రుఘ్నాఖ్యఁ, గాంచిరి రామలక్ష్మణులు భరత
శత్రుఘ్ను లెంతయు జతగాఁ జరింతురు, దానవులను భూరిదర్పయుతుల

తే. మానిజన్నము గావంగ మ్రందఁ జేసి, కౌశికాజ్ఞను బాలించు కాంక్ష మీఱ
లక్ష్మణునిగూడి రాముఁడు లలితగతిని, శివుని చాపము ద్రుంచియు సీతఁ బడసి

క. తనదగు నయోధ్యఁ జేరెను, జనకుఁడు యువరాజుఁ జేయ సమకట్టఁగ దా
నినిమాన్పి కైక వనముల, కనిపెన్ రాఘవుని వరములను పేరఁ గ్రుధన్. 237

ఉ తమ్ముఁడు భార్య వెంబడిని దా వలదన్నను రాఁగ సజ్యచా
పమ్మును దాల్చి క్రూరమయి పాపచరిత్రమునైన దైత్యవా
రమ్మును ద్రుంచుచున్ సుజనరాజిని బ్రోచుచు రామమూర్తి పం
తమ్మున దండకాటవిని ధైర్యము మీఱ వసించియున్నెడన్. 238

ఉ. దానవి యోర్తు కామమునఁ దన్నొగిఁ గోరఁగ నాసికాశ్రుతుల్
మానుగఁ గోయ నామెకయి మాఱ్కొనుచుం బదునాల్గువేలదు
ర్దానవు లంత మొంది; రల దానవి లంకకుఁ బోయి యన్నతో
దా నొగిఁ దెల్ప రావణుఁడు దారుణకర్ముఁడు గాన మాయచేన్. 239

ఆ. రామలక్ష్మణుల నరణ్యమునకుఁ బోవఁ, జేసి యొంటినున్న సీత బలిమిఁ
దెచ్చుచుండఁ గాంచి ధీరుఁడైన జటాయు, వతని నిల్వరించి యంత మొంద.

చ. అసురవరుండు రాముసతి నార్తను దెచ్చి పురంబునందు నుం
చె; సరగ రామలక్ష్మణులు చేరి కుటీరము శూన్యమౌట దుః
ఖసరిదధీశునందుఁ బడి కానలనెల్లఁ బరాకులేకయే
విసుగును లేక చూచుచు రవిప్రియసూనుని వానరేంద్రునిన్. 241

తే. కానవచ్చి సుగ్రీవునితో నితాంత, సఖ్యమొనరించి యాతని శత్రువైన
వాలి వధియించి రవిసుతు వానరేశ్వ,రునిగ నభిషేక మొనరించె జననుతుండు.

మ. కృతకృత్యుండయి సూర్యపుత్త్రుఁడు జగత్కీర్తిం గనం బొల్చి కీ
శతతిన్ జానకిజాడలం దెలియు నాసం బంపె నల్దిక్కులన్
వితతాటోపమునం గపీశ్వరులు వేవే సీతఁ గానంగఁ బో
వుతఱిన్ మేమును దక్షిణాశ వెదుకం బూనంగ వింధ్యాద్రిలోన్. 243

చ. కనఁబడియెన్ బిలంబొకఁడు గాఢతమోనిబిడంబు దానిశ
క్తిని వినకుంటఁ జొచ్చితిమి తీఱెను మాగడు వంతలోఁ దప
స్విని మముఁ గాంచి వెల్వడఁగఁ జేసెను స్వీయతపోవిభూతి నం
త నొకపతత్త్రి మమ్ముఁ దినఁ దానయి వచ్చెను భాగ్యయుక్తిచేన్. 244

క. ప్రాయోపవేశమూనిన, మాయందఱఁ దినఁగవచ్చు మాడ్కిం గని చిం
తాయాసంబుల రామున, కై యొవ్వరు మడిసిరో యది కపులు వచింపన్. 245

తే. అందువినఁబడు పక్షిరా § జనుజుఁడౌట, మమ్ముఁ జంపక శ్రీరాము§మహితచరిత
మెల్ల మామూలమునవిని § యల్లనఁదన,పక్షములురాఁగ మోదంబు§పట్టరామి.

క. వినిపించె మాకు రాముని, వనితామణియుండు తావు § వారకమే మ
బ్ధినిదాఁటఁ గోరితిమి నేఁ, జనుదెంచితి నబ్ధి దాటఁ§జాలినకతనన్. 247

చ. పురముననిందు నెల్లెడలఁ § బూనికమై వెదకంగ నివ్వనాం
తరమున నిష్ఠగన్పడియెఁ§ దామరసాయతనేత్ర సీత; రా
ఘ్వరుఁడు సహోదరుం గలిసి § వైరినిజంపఁగ ఋశ్యమూకసుం
దరతరసానుదేశముల § నాదగురాకను గోరుచుం గడున్. 248

క. నివసించియున్న వాఁ డని, పవనాత్మజుఁ డింతదనుకఁ § బలికి మరల నే
మివచింపకయుండెను; రాఘువు క్షేమము శ్రుతులఁ జొరఁగ§క్ష్మాసుత యంతన్.

క. తలయెత్తిచూచి వానర, కులజుం డీతండు కనుల§కుం బ్రీతినిగూ
ర్చు లలితశరీరుఁడై కొమ్మలసందునఁ గానఁబడియె § మ్రుందెడు నన్నున్ 250

క కరుణాసింధువు మృత్యువు, ధరణి న్నిల్వంగఁజేయఁ § దలఁచెనొ యేమో
విరహాగ్నిబ్రుంగు నాకి, త్తరుణంబున వానరంబు § దర్శన మొసఁగెన్. 251

క. ఏకీడు గల్గనున్నదొ, నాకిఁక దుస్స్వప్నమనివి§నంబడె మున్నే
యీకాల మెంతదుష్టమొ, కాకున్నె యభాగ్యవతికిఁ § గాల మసదుగన్? 252

క. రామునకుఁ సౌమిత్రికి, క్షేమంబే కలుగుఁగాక! § కీశుని గనియుఁ
నామది యేలొకొ దుఃఖం, బాముకొనం బగులకున్న § దతిచిత్రముగన్. 253

క. పలుభంగుల నీగతి నీ, యిలాత్మభవ యెంచుచుండ § వృక్షముదిగి యా
స్థలమున నిలువఁగ నాతని, కలరూ పెఱఁగియును మాట § కలఁతపడంగన్.

చ. మనము విశాకుచెందినటు § మాటలు తోఁపఁగఁజేయ వానరా!
దనుజుఁడవీవు; మాయగొని § తత్పరతం బతి నెన్నుచున్న నన్
మునుపటు మోసపుచ్చఁ దల§పోసితి; వియ్యది మేలుగాదు సు
మ్మనిమొన రామసాయకము § లంతము నొందఁగఁజేయు దుర్మతిన్. 255

ఆ. ఇంకనైనఁ దెల్వి § యించుకేనియుఁగల్గి, 'బ్రదుకఁ దలఁతువేని § పార్థివేంద్రు
శరణుచొరుము సర్వ§శరణదుఁ డాతండు, నిన్నుఁ గాచుఁజుమ్ము § నిర్మలకృప.

క. అనియేమొ పల్కుఁజూచెదు, వనజాయతనేత్రఁ గాంచి § వందన మిడి చెం
తను జేరఁబోవ భయమం, దినగతిఁ గంపంబు నొంది § దీనతదోఁపన్. 257

చ. కలఁతను బల్కుఁబూను రఘు§కాంతునిపత్ని ని గాంచి మ్రొక్కుచుం
బలికెను దల్లిరో! దనుజ§వర్యుఁడ నేనని సందియంబునన్
గలఁగకు మింక నంజన య§నంజను వానరకాంతకున్ మహా
బలునివరంబునన్ గలిగి § వాయుసుతుండను పేరుఁగాంచితిన్. 258

క. హనుమంతుఁడంచు నన్నున్, మునులెల్లం బిల్చువారు పూర్వకథయుఁ గ
ల్గును దీనికి నదియేటికి, నను శ్రీరాఘవునిదూత నమ్ముము తల్లీ! 259

క. కపివరులకోట్లు కొల్వఁగఁ, దపనాన్వయవార్ధిశీతధాముఁడు రాముం
డిపుడే వచ్చెదు; నేఁజని, రిపునాశకుఁ దోడితెచ్చురీతిం గనుమా. 260

క. దనుజుని బాంధవసుతమిత్రనికరయుక్తునిగ యుద్ధరంగంబున జం
పును నిన్నుఁదోడుకొనివే, చను రాముఁ డయోధ్య కిద్ది సత్యము జననీ! 261

క. దానవనాథుఁడె యిట్లీ, వానరరూపంబు నొంది వచ్చె ననుచు నీ
మానసమునఁ దలపోయకు, మో! నారీమణి! రఘూద్వహునిదూతనుగా. 262

క. తలపోయవమ్మ! నావాక్కులు సత్యము లనుచు నమ్మఁగూడును; నారీ
తిలకమ! త్రిశుద్ధిగా నీ, ఖలుమరణము దాపునందె కల దోతల్లీ! 263

చ. ధరణిధరోత్తమంబుల కదంబము వ్రయ్యలుచేయఁజాలు భూ
వరు నిశితాంబకంబులు సువర్ణవిభూషితపుంఖముల్ సురే
శ్వరరిపుకంఠలుంఠన మొసంగెడు వేడ్కనొనర్పనున్న వో
ధరణితనూజ! నమ్ము మిది తథ్య మటంచుఁ ద్రిశుద్ధిగా మదిన్. 264

చ. అనుటయు సీత యాహనుమదాశయ మెల్ల నెఱుంగుఁగాన నా
తనిమది సంశయించి మఱి తద్వచనంబులధోరణిం దొలం
గినయనుమాన మత్తఱిని గీశగణాగ్ర్యునిగా నెఱుంగఁజే
సినగతి కన్పడంగ సరసీరుహలోచన! మందవాక్కులన్. 265

చ. క్షితితలముం గనుంగొనుచుఁ జింత దొలంగని యట్లు పల్కె స
న్మతివని తోఁపఁజేసెడిని మాటలు నీయవి; కానిసంశయ
ప్రతతి తొలంగకున్నయది పావని! మీకును రామమూర్తి కె
వ్వితమున సఖ్యమయ్యె రఘువీరుగుణంబులు దేహచిహ్నముల్. 266

చ. తెలిసియెయుండు నీకనుచుఁ దెల్లము చేసెను నీదుమాటలే
పలుకుము లక్ష్మణాంగమునఁ బర్విన గుర్తులు; వానిఁబట్టి నేఁ
దెలిసికొనంగఁజాలుదును దేటఁగ రామునిదూత వంచు నా
కలరెడుఁ బ్రీతి వాని విన నార్య! వచింపు మటంచుఁ బల్కినన్. 267

హనుమంతుఁడు శ్రీరాముని గుణములఁ దెల్పుట.

చ. పవనజుఁ డానుడుల్ శ్రవణపర్వము చేయఁగ నాలకించి భూ
ధవునకు దూతయే నితఁడు తద్గుణపుంజము దేహచిహ్నముల్
వివిధములైనయూహలను వేమఱు చూచుట నాలకించుటం
బ్రవిమలరీతిఁ దేటపడి పల్కఁగ నొప్పియెయుండు నంచెదన్. 268

తే. తలఁచి కాఁబోలు నన్ను నీ మ్ములనడిగెను, జక్క వచియించి యీ సాధ్వి సందియముల
డిందుపడఁ జేయువాఁడ నమ్మం దరమగు, దాన; నద్దియె నా భాగ్య మహా నిజముగ.

చ. జననమనంగ సజ్జనులు స్వాంతమునం దలపోయఁ జాలు చ
క్కని సుకృతంబు చేసిన దెకాని, దురాత్ములు సంస్మరింప మె
చ్చనమరు పాపపుంజములు సల్పిన వారిది కాదు నీపతి
వ్రత నను విశ్వసించుటయె భాగ్యము దానికి మిన్నయున్నదే 270

క. అని తలఁచి ర మునకు వం, దనమాత్మ నొనర్చి భూమితనయం గని యి
ట్లనియెం గల్లీ! వినుమా, జననుతుఁడగు రామచంద్రు చరితం బెల్లన్. 271

క. ఆతనికి సాటి యతఁడే, యేతద్విశ్వంబునందు నెందే లేదం
చేతఱిఁ జెప్పందగు వి, ఖ్యాతియు నట్టిదియె భూతగణవిహిత మెయా. 272

సీ. సకలంబు తాసుగా సంతతంబుఁ దలంచి, యానందమునఁ దేలియాడుచుండుఁ
దనయం దెసకలంబుఁ గనుచు సర్వమునందుఁ, దనయున్కి నెంచుచుఁ దనియుచుండు
సంపన్నతఁ దనసాటి లేరని మిట్టిపడువారిఁ గని దుఃఖపడుచునుండు
నితరలకష్టమ్ము లెల్ల స్వీయములని, తలఁచు వారిం గని యలరుచుండు

తే. పక్షపాతంబునం దీర్పుఁ బలుకు దుష్ట, మతులఁ దలపోసి యెంతయు వెతలగనుచు
వారికర్మ మెయని తగఁ బలుకుచుండు, నన్నృతమును రూపుమాపంగ నరయుచుండు.

చ. తనదుమతంబె శ్రేష్ఠమని తక్కినవారిమతంబు లన్నియుం
ఘనతను గాంచఁజాలక జఘన్యములే యగు నంచుఁ బల్కునా
మనుజుల సంస్మరించి యభిమానము మాసినఁగాని ధన్యమౌ
జని గలవారుగాఁ బలుకఁ జాల రటంచు వచించుచుండెడున్. 274

ఆ. బాహ్యశుద్ధికంటెఁ బరమ మంతశ్శుద్ధి, యగుట నద్దిగల్గునట్టివారె
యార్యులనఁగఁ బడుదు రది లేని బాహ్యశు, ద్ధియె జఘన్యమంచుఁ దెలుపుచుండు.

క. అంతశ్శుద్ధియె గలదని, చింతింపఁగ నెట్టులన్న శీలమె దానిం
బంతమ్మునఁ దెల్పును; గో, రంతయు శంకింపకుఁ డని యాడుచునుండున్. 276

తే. భగవదారాధనము చేయు పద్ధతియిదె, దీని మానినదయఁ జూపమానునతఁడు
నన్ను సేవింపుఁడని ధనాశ నన్ని తాంత, మఱచు వారిని దలఁచి తానార్తుఁ డగును.

సీ. హరిదాసులము మేము హాటకదానార్హు, లము మమ్ము సంతృప్తులనుగఁ జేయు
వారల శ్రీహరి గారవంబునఁ గాంచి, రక్షింపఁబూను నష్టాక్షరంబు
మంత్రరాజంబగు మామూలమున దాని, నుపదేశవిధిఁ గొని యుద్యమమున
జపియింప హరి యస్మదపఘనముం దాల్చి, ప్రత్యక్షమయి వారి బాధ లుడిపి

ఆ. వసములొసఁగి కాచు భక్తుఁ డీతండని, మేము తలఁపవలయు మిమ్ముఁ దొలుతఁ
గాన మమ్ముఁ దృప్తిఁ గాంచంగఁ జేయుఁడీ, యనెడు ఖలుల నెన్ని యటమటించు.

క. తనగొప్పఁదనము సతతం, బును దెల్పుకొనంగ మార్గముల నెల్లపుడు౯
మనమున గడించు నీచునిఁ, గనఁజాల నటంచుఁ దేటగా వచియించున్. 279

క. దీనులఁజూచిన వడఁకు౯, మానసమున నైన నజ్ఞమండలిఁ గూడం
గా నెన్నఁడు సజ్జనసం, తానమ్ముఁ దలంచుచుండుఁ దమి మిగులంగన్. 280

క. అనృత మధర్మము విశ్వం, బునఁ గ్రాలెడువాని మాపఁబూనఁగ భూజా
నికరము పూనఁదగు నం, చనుదినము వచించుచుండు నందఱు వినఁగన్.

సీ. పరదారలం గూడఁ బరికించువారల, నంతంబు నొందింప నరయుచుండు
వంచకులను దుష్టవాంఛాతిదూష్యులఁ, గనఁ బాప మని కట్టిగ ననుచుండుఁ
దాఁటదమ్ముఁడు లనుమాట నాలించినఁ, గను లెఱ్ఱఁ జేయఁగాఁ గడఁగుచుండు
హరిహరులకుఁ గల్గుదంతరంబను జాల్ములను దూఱుచుండుఁ దా ననుదినంబు
తే. సతుల దూషించువారల సంగతిఁ గొనఁ, దలఁపఁబూనక యుండు సత్యమున రక్తిఁ
గలుగువారల నెప్పుడుఁ దలఁచుచుండు, వారె బంధువు లనుచుండు వారిజాక్షి.

క. కృత మెన్నుచు వర్తించెడు, మతిమంతుల సంతతంబు మన్నింపఁదగు౯
గృతముఁ దలంపని దుర్జన, తతిఁ ద్రుంపఁగవలయు ననుచుఁ దగ వచియించున్.

క. పరులకు దేహం బుపకృతి, నరసి యొనర్పంగఁ బ్రీతి నర్పించెడు స
త్పురుషులఁ దలంచుచుండును, ధరణికి సద్భూషలనఁగఁ దగుదు రటంచున్.

చ. అనృతముపల్క నింతవఱ కాడఁదలంప నిఁక౯ మనంబునం
దనుచుఁ బరాకులేక కడు హర్షమున౯ వచియింపఁజాలు స
జ్జనునకు వందనం బెపుడు సల్పుదు; నాతఁడె పుణ్యమూర్తి నాఁ
దనరు జనుండనంగ నని తద్దయుఁ బల్కుచునుండుఁ దల్లిరో!. 285

క. ఆపదగల్గఁగ ననుకం, పాపరవశుఁడగుచుఁ దోఁడుపడు నెవ్వండా
దీపితసంతతిఁ బ్రోచు౯, శ్రీపతియని ప్రీతి వెలయఁ జెప్పుచునుండున్. 286

క. కులధర్మంబుల వదలుచు, ఖలపద్ధతులను సమస్తకార్యములందు౯
జెలఁగి గ్రహించు దురాత్ములు, విలయమ్మును గాంచి రనఁగ విన నుంకించున్.

ఉ. సంగరరంగమందు శరజాలము తూఱఁగ మేను వ్రయ్య నా
లింగితభూతలుండయి విలీనపరాక్రముఁడై తనంత లే
వంగనుజాలకున్న భటవర్యుని జేరఁగఁబోయి తోడ్పడం
గం గడుఁబూను సజ్జనశిఖామణిఁ గానఁగఁ బూనియుండెడున్. 288

ఉ. ఆడినమాటతప్పని మహాత్ముఁడె పూజ్యుఁ డనంగనొప్పు నే
నాఁడును ధాత్రిపై నపఘనంబును దాల్చి తదీయసద్యశం
బాడుచునుండుఁ గల్గ దిసుమంతయు లోపము దానికంచుఁ దాఁ
గూడఁ జరింతు నల్లియని కోరిక లూరఁగఁ బల్కుచుండెడున్. 289

చ. ఒరునిధనంబుఁ గైకొనఁగ నుద్యమమెంతయుఁ బూని దానికై
నిరతిశయైకధర్మమున నిష్ఠగలట్లు నటించి యద్దిరా
గరువముఁబూని బంధులకుఁగా నిసుమంత వ్యయించి సంతసం
బరుదుగఁ గాంచు క్రూరుఁ గననైనఁ దలంపక యుందు నంచనున్. 290

క. కాకులను జంపి గృద్ధల, యాఁకలిఁ దీర్పంపఁగోరునటు లుత్కోచం
బేకొని దానంబిడు పలు,గాకులఁ జెండాడ నెంచుఁ గమలదళాక్షీ!. 291

క. తపమనఁ బరకాంతను మా,తపగిదిఁ గాంచుటయె కాని తడిబట్టలఁ దా
ల్పి పరుగువాఱుట గాదని, తపనాన్వయవార్ధి శీతధాముఁడు పలుకున్. 292

చ. తనపని కన్యకార్యసముదాయము హాని గనంగఁ జేయుచున్
ఘనత వహించుకార్యమదిగాఁ దలపోయుచు నుబ్బుచున్ దనుం
గనుఁగొన నీసడించువారుఁ గాంచి హసించుచునుండు క్రూరచి
త్తుని దలపోయ రాదనుచుఁ దోఁచెడు నంచు వచించు నిచ్ఛలున్. 293

ఉ. కారణమేమి లేకయె పగంగొని సజ్జను నీసడించుచున్
నేరములెన్ని పన్నుచును నింద్యచరిత్రుఁడటంచుఁ దెల్పుచుం
గోరికలెల్ల పండినటు కొంకక యాత్మఁ దలంచుచున్ మహా
సారునిగాఁ దనుం బలుకు శౌండునిఁ జూడఁగ నోడుచుండెడున్. 294

చ. ఒరులకు ధర్మమార్గముల నొక్కవిధంబునఁ దెల్పి వానియా
చరణమునందు దాను నొకచందమునం జనుదుష్టచిత్తునిం
బరులకు హానికల్గునటు భావమునం దలపోయుపాపి నె
త్తరుణమునందు నేఁగన నెదం దలపోయ నటంచుఁ బల్కెడున్. 295

ఉ. విత్తసమార్జనంబున సువిస్తృతమై తగు శ్రద్ధనూని యే
యుత్తమునైన దూఱుచు మహోన్నతపాపము లెన్ని చేసినం
జిత్తమునం దలంపక స్వసిద్ధియె చాలునటంచుఁ బాచితం
బెత్తఱినైనఁ జేయు ఖలు నించుకయే స్మరియింప నంచనున్. 296

క. ధర్మవ్యాజంబుననే, భర్మము గడియించి కూర్చి బంధువులకుఁ దా
బేర్మి నొసంగెడు దుష్టుని, కర్మమునకుఁ జాల వగపు గాంచుచు నుండున్. 297

తే. ఆత్మభూషణ మెత్తఱి నన్యదూష
ణము మహాకార్యములుగ నుత్తమఫలప్ర
దములుగా నెంచి చేయు నధములపేరు
వినినఁ దలనొప్పిగా నుండు ననుచు నుండు. 298

క. పెద్దల శాస్త్రాచార, మ్మెద్దియు యుక్తంబుగాకయే యుండునటం
చద్ది హితంబని తలఁపని, మొద్దులఁ గన నంచుఁ బలుకుఁ బూర్ణేందుముఖీ! 299

క. శరణు పగవాఁడు చొచ్చిన, మరియాదం గాంచి వానిమాటలు విని సో
దరునివలె నెంచినదలుదుఁ, బరుఁడని దండింప ననుచు భాషించు సతీ!. 300

క. శరణాగతపరిపాలన, మరయఁగ నాజన్మమునకు నగుభూషణ మె
క్కరణిం దాన దోసంగులు, పరఁగిన సహియింతు ననుచుఁ బలుకన్ దేవీ!. 301

క. అనృతము పల్కకయుండుట, మనమునఁ దోఁచినవిధంబు మాటలమూలం
బునఁ దెల్పుట నావ్రతములు, చన వీనిన్ మాని యుంచుఁ జక్కంబల్కన్. 302

క. నను నాశ్రయించువారలఁ, గనుచుందు సహోదరులనుగా వారలు కో
రిన రాజ్యమిత్తు మోదంబున వారలకొఱకుఁ బ్రాణముల నిత్తు ననున్. 303

క. శ్రుతులఁ దదర్థముఁ దెల్పెదు, స్మృతులఁ బురాణముల నమ్మి సేవించెదు వా
రతిశయపుణ్యులు నాకును, హితులనఁగా వారె యంచు నెలమి వచించున్.

క. తనుఁ దా ధ్యానించుచు నెప్పనినైనం దనదియంచు భావింపక స
జ్జనహితమని తలఁచుచు దానిని జేయుట విధిహితముగ నీరజనేత్రా!. 305

క. లోకహితం బెద్దానం, జేకూరుం గార్య మదియె చేయం దగు నే
యేకార్యము తనకొక్కనికో కార్యము కా దదంచు నొగి భాషించున్. 306

చ. కలుములఁ గాంచి దుర్మతిని గాదన కెంతయు గారవించు నీ
చులు తమకార్యసిద్ధికయి చూపెడుభక్తి మదాత్మ కింతయేఁ
గలుగఁగనీదు ప్రీతిఁ గృపకల్గఁగ నిష్కపటైకభక్తియే
యిలఁ దగియుండు నంచుఁ బృథివీశుఁడు పల్కు సరోజలోచనా!. 307

ఆ. నేల విడిచి సాము చేలిలఁ జేసినఁ, జేటుగల్గు నట్లు స్మృతులవదలి
తోఁచినట్లు చేయు ధూర్తుల పూజలు, నిష్ఫలంబులనుచు నెఱి వచించు.

చ. తనకులధర్మముల్ విడిచి తక్కినజాతికినొప్పు ధర్మముల్
బనివడి యాశ్రయించి కడుఁ బట్టుదలంగొని యాచరించినన్
వినుతఫలంబు గల్గదని వేయివిధంబులఁ దెల్పు పెద్దలం
గనుఁగొనఁ జాల నట్టివ్రతములకల్పుల నాకడఁ జేర్ప నంచనున్. 309

క. కరుణాహీనులు భూసుర,వరులైనన్ గారవింపవలయు నటంచుం
బరికింపదు నాయంతఃకరణంబని యెల్లరువినఁగా గణియించున్. 310

క. సవదంభంబున మృదుభూ,తవిసనముం జంపుచుండు ధాత్రీసురపుం
గవులను భక్తులఁ గాఁ దల,పవచ్చునే యంచు నొక్కి పల్కున్ సాధ్వీ!. 311

క. పంచమహాయజ్ఞమ్ముల, నెంచక విడనాడి విత్తమే కూర్పంగాఁ
జింతించి యజ్ఞములఁ గా,వించిన ఫలమబ్బ దనుచు వేమఱుఁ బలుకున్.

సీ. సంధ్యనుపాసించి సవిధిగాఁ బంచమహాయజ్ఞముల జక్క నాచరించి
స్మార్తాగ్నిసిద్ధికై శాస్త్ర మేకర్మము, నాచరింపఁగ విధియనువదించె

నట్టి సత్కర్మాలి । నవధానమునఁ జేసి, యంతట జపయజ్ఞ । మాచరించు
చును దాని ఫలములఁ । గనఁగోరకే భగవంతున కర్పించి । యంతరాత్మ
తే. నిర్మలంబుగ నుండంగ । నియతి మాన, వీశ్వర ధ్యాన మొనరింప । నిచ్చగించు
మాననీయులు నావారు । గా నితాంత, మెంతు ననిపల్కు రామభూ । కాంతుఁడంబ!.

క. ఇరుసంధ్యల జపియింపక, పరమేశ్వరి సవిధిగా ను । పాసింపక యె
వ్వరు కామ్యకర్మముల నిర్జరులను సేవింతు రట్టి । జనులఁ గన నసున్. 314

ఆ. నిత్యకర్మములను । నిరతి నుపాసించి, యవలఁ గామ్యకర్మ । నివహనిరతి
గన్న ఫలముగల్గుఁ । గాని లేకున్న దుష్ఫలమె కల్గుననుచుఁ । బలుకుచుండు.

చ. సురలను మంత్రమూలమునఁ । జూడ్కులముందఱ నిల్చునట్టు లె
క్కరణి నొనర్పనౌ నటులు । గట్టిప్రయత్నముఁ జేసి కొల్చి సుం
దరులను లోఁబడంగనె యొ । నర్పఁగఁ బూనెడు నాయుపాసకో
త్కరము నడంప నెంతునని । తా వచియించు రఘూత్తముండొగిన్. 316

చ. జపమొనరించుచందమునఁ । జక్కఁగఁ గన్నులు సుంతమూసి యో
గపరతఁ గాంచినట్లు పొసఁ । గం దగుదృష్టిని నాసికాగ్రమం
దుపరతచంచలత్వముగ । నుండెడునట్లు నటించుచున్ హిర
ణ్యపరతచే బకవ్రతులు । నాఁ దగు దుష్టుల నెంచ నంచనున్ 317

ఆ. అతిథిపూజమాని । యాకట నకనక, పడుచు నతిథిపోవఁ । బ్రమద మొంది
కుక్షిపోషణమున । కుం దృప్తినొందెడు, కుజనుఁ జూడ నైన । గోర ననును. 318

చ. ధరణితనూజ! రాఘవుఁడు । తన్నెడఁ బాయనితమ్ముఁ గూడి యు
ర్వరఁ గలదుష్టమానవుల । వారక లెక్కిడు నష్ట సత్యవా
జ్నిరతి గలట్టివానిని గ । ణించును దొల్తఁ బరాంగనానిరం
తరరతు నవ్వలన్ వినుము । తామరసాయతనేత్ర! యీనుడిన్. 319

ఉ. పెద్దలఁబోలి వాక్కులను । బెంపువహింపఁగఁ బల్కుచున్ మదిన్
సుద్దియనంగ లేక పర । సుందరులం దలపోయుచున్ హితం
బెద్దియటంచు నైన క్షణ । మెంచక యాసవ మాను కాంక్షచే
సుద్దియచేయు దుర్మతుల । నోడుదు చూడ నటంచుఁ బల్కెడున్. 320

ఉ. ఆసవమిద్ది కాదు మన । మందుఁ బొసంగు జడత్వమేగఁగాఁ
జేసెడు నౌషధంబనుచుఁ । జెప్పుచు రాత్రులయందు మాత్రఁ బే
రాస చెలంగ నెట్టిహితు । లైనఁ గనుంగొనఁ జాలకుండ ద్రా
క్షాసవ మాను వంచకుల । నాత్మనొకప్పు దలంప నంచనున్. 321

క. సురఁ గ్రోలుట పలలాశన, మరయఁగఁ బాపంబులందు । నాద్యము లనుచుం
బరిగణితములయ్యును వా, నిరతిం గలవారిఁ జూడ । నే నని నుడువున్. 322

క. దేవతలకుఁ బ్రీతియగుం, గావున మాంసంబు మద్యకలితముగ విధిఁ
నైవేద్య మీయఁదగు నను, దేవానాంప్రియులనా మదిం దలఁపననున్. 323

క. ఏది జాత్యుచితాహారం, బదియే తద్దేవతలకు నర్పింపఁగఁ దృ
ప్తిదమగు నని విధి తెల్పెడుఁ, గద వానిఁ మానువారిఁ గనఁజాల ననున్.

తే. గృహిణి ప్రాచీనపద్ధతి గ్రహణతత్ప, రత్వమున నుండ మాన్పించి రాదు దాని
వలన సత్ఫలమం చొగిఁ బలుకు క్రూర, మతని గన్నెత్తిచూడ నేమాడ్కిఁ గనను.

సీ. ప్రాఁతయాచారముల్ పదముల్ గావని, గ్రొత్తపద్ధతి మార్పఁ గూడుననుచు
ఫలములబ్బును వాని వలనఁ దప్పదటంచు, మార్పకయుంటఁ బ్రమాద మనుచుఁ
బ్రాచీనశాస్త్రముల్ పనికిరా విపుడంచు, సృష్టియే మార్పును జెప్పు ననుచు
శాస్త్రముల్ యుక్తికి సరిపడఁ దగునంచు, లేనిచో మేలెయా మాన ననుచుఁ

తే. దోఁచినట్టులు పల్కుచు ధూర్తజనులఁ, గూర్చుకొని పామరులకును గూడద నెడు
భావముదయింపఁ జేయుచుఁ బండితులటు, పలుకుశుంఠ లస్మరియింపఁ బాపమనును.

క. ఆచారము మంచిదియని, తోఁచును హృదయంబునందె తోలఁగని శ్రద్ధా
సాచివ్యముగాంచిన శా,స్త్రాచారం బేల యను దురాత్ముల నెదలోన్. 327

క. తలఁపంగఁజాల ననుచుం, బలుకుఁ భూపుత్రి! సుగుణ వారమునందుఁ
దొలివందనమున కర్హము, పలుకులనూర్దవమె యంచుఁ భాషించు సతీ!. 328

క. మానసమృదుతయె గుణసం, తానంబున శ్రేష్ఠమనుచుఁ దలఁపని వారిఁ
మానవు లనరా దనుచుఁ, జానకి! వచియించు రామచంద్రుఁడు పూన్కిన్. 329

క. వేదాంతోపన్యాసము, లూఁది వచింపంగ నేర్చి యొక్కటియే నం
దేదియొ సమాచరింపని, యాదస్యుని పేరు పల్కననని భాషించున్. 330

ఆ. భూతరాజిఁ గృపను బూనుటకంటెను, వేఱ పుణ్య మేది విశ్వమందుఁ
గలదె చూపువారు గలరే యటంచని, పరుషభాషణములఁ బలుకుఁదల్లి!. 331

క. మతమను పేరున దుర్మతి, యుతమై పెద్దలను దూఱుచుండెడు దుష్ట
ప్రతతిఁ గని భాషణంబుల, మతిఁ దెలుపంజాల ననుచు మానిని! తలఁచున్.

చ. తనవచియించు ధర్మములఁ దాఁ దలపోయక భిన్నమార్గ మూ
నినడుచు నాప్రవర్తకుని నిందితకర్మరతుఁ దురాత్ము దు
ర్జనునుతవర్తనుం గనిన స్నానముచేసి పవిత్రవస్తురా
జిని గన దేవునిం దలఁపఁ జెల్లు నటంచు వచించు నెంతయున్. 333

ఆ. కుటిలవర్తనమునఁ గూర్పవిత్తముఁ గోరి, యివె నిమిత్తములని యిపుడుగల్ల
వచ్చు దుష్ఫలముల నిచ్చు నిత్తెఱఁగున, ననివచించుఁ నీచుఁ గనుఁగొననను 334

సీ. కరపాదతలములఁ గల్గు రేఖల నెంచి, కలుగు నీఫలము లఖండరీతి
ననిపండితుని బోలి జనులకుం దెలిపెడు, ననభిజ్ఞుఁ గృత్రిము నర్థకాముఁ

గనఁగ దోషం బబ్బుఁ గాంచనమును జేయు, నాస్తి రసవాదమాశ్రయించు
నతిలుబ్ధు గ్రహగతు లరసి యీయీఫలములు గల్గుఁదప్ప దీపలుకటంచు
తే. నసువదించెడు సన్మృతవాదిని ధరిత్రి, నిట్టియుత్పాతములుగల్గు నెఱిఁగినాఁడ
జ్ఞానదృష్టి నటంచుఁ బెంపూనిపలుకు, నఘమయాత్ముని స్మరియింపననుచుఁ బలుకు.

ఉ. దానములన్ గ్రహింప మఱిదార్కొను నాశయె ప్రోత్సహింప వి
జ్ఞానము పెంపుగల్గు మునిచందమునన్ దనునమ్ము గేస్తునిన్
మానసశుద్ధి గల్గుగుణమండితుఁ జేరి వృథాప్రయాసముం
గానఁగ జేసి విత్తమును గైకొను దుష్టునిఁ జూడ నంచనున్. 336

మ. పితృకార్యంబుల కర్హుఁడౌ ద్విజుఁడు ప్రాప్తింపంగఁ బోఁదోలి దు
ర్మతి నింకొక్కని బంధుసన్ని బిలిచి భస్మప్రాప్తి కల్గింపఁగా
నతనిం బెక్కువిధంబులం బొగడి కార్యంబద్ది సాగించి దు
ష్కృత మార్జించు ద్విజాధమున్ మనమునం గీలింపఁ బాపంబనున్. 337

ఉ. మంచికులంబు విత్తమును మానితశీలముఁ గల్గు కన్యని
ప్పించిన నేమియిచ్చెదవొ పెండిలికిన్ మునుపే యటం చొగిన్
వంచకుఁడై యనర్హుఁడగువానికిఁ గన్యకఁగూర్చి విత్తమా
ర్జించు నికృష్టు దగ్గరను జేరఁగ రాదనిపల్కు దల్లిరో! 338

క. పతి మృతిచెందిన వెనుక వి,హితమార్గము వీఁడి గర్భ మెట్లో వదల నిం
దితయన కర్థముగొని పా,చిత మెద్దియొ చేయుదుష్టుఁ జింతింప ననున్. 339

క. ఒకచో నిమంత్రితుండయి, సకలక్రియ లొప్పునట్లు జరపి కుమతివే
ఱొకచో నిమంత్రితుండయి, సుకర్మముం బాడుచేయుశుంఠఁ గన ననున్.

క. ప్రతిదిన మొక్కొకచోటం, బితృకార్యనిమంత్రితుఁడయి పెక్కురు నవ్వన్
మతి లజ్జింపక తగుకు,త్సితుమాటఁ దలంప నంచుఁ దెగి వచియించున్. 341

తే పర్వములయందు నొరులఁ దర్పణము చేయ
వలయునని ప్రోత్సహించి ద్రవ్యమ్ము గొనుచుఁ
దాను జేయక భుజియించు ధర్మదూరు
పంక్తి భుజియింప నఘమని పలుకుచుండు. 342

తే. ఒరులయాపదకుబ్బుచు వరుసభీతిఁ, బెంచుచున్ విత్తమార్జింప నెంచుచుండు
దురితకర్ముని మోమునఁ దొలఁగకుండు, నఘములాతనిఁ జూడ రాదనుచుఁ బలుకు.

క. తనకష్టములకుఁ దోడ్పడు, జనులకుఁ గష్టంబులెన్నొ సమకుఱఁ దోడ్పా
టునుజూపక తొలఁగెడు దు,ర్జను నాతని జేరనీయ రాదని చెప్పున్. 344

ఆ. కూటసాక్ష్యమిచ్చు కూళనభోజ్యభో, క్తను నృశంసు మఱికృతఘ్నుఁ గూడ
దుష్టశీల మెంతొ తొందరఁ జేకులు, నంచునొక్క చెప్పు నవనితనయ!. 345

చ. తనభుజియించువస్తువుల దాపుననే భుజియించువానికిన్
మనమలరంగఁ బెట్టుపని మానఁగఁజేసి యథేష్టరీతిఁగు
తీని దనుపంగఁగోరు ఖలుఁ గృత్రిమవర్తను నింటఁ జేర్పరా
దని పలుమాఱు పల్కె వనజాయతపత్రసమానలోచనా!. 346

క. ఒరులకు వినిపింపఁగ రా,దురహస్యం బిద్ధియుంచుఁ దోఁపుమిత్రుం
డరయఁగ నని చెప్పిన దాఁ, బరులకు వినిపించు దుష్ప్రవర్తకుఁ డూఱున్

తే. విశ్వసించినవానిని విషముబుద్ధి, మోసపుచ్చెడుపాపాత్ము నేసరణిని
జూడ దోసముగల్గు నంచున్ వచించుఁ, దరళలోచన! సద్గుణధాముఁ డెపుడు.

క. స్త్రీవిత్తము బల్మిఁగొని, తావలసినయట్లు వ్యయము తనయంతన దు
ర్భావమునఁ జేయునీచుని, నేవిషయంబున స్మరింప నేనని తెలుపున్. 349

చ. సతి ననురూపఁ బాసి యొరుచానను గూడి మహాసుఖంబు సం
తతమును గాంచుచున్ బరమధర్మము సుంత తలంపకుండు దు
ర్మతి కిలఁ బాచితంబు కనరా దది యేస్మృతియందునైనఁ ద
త్స్మృతియు ననర్హమంచుఁ దరళేక్షణ! రాముఁడు నొక్కిపల్కెడున్. 350

క. పలుగాకుల మాటలువిని, తులువలకొఱ కార్యజనుల దూషించుచు వా
రలకున్ హానియొనర్చెడు, ఖలు మోముం జూడనంచుఁ క్ష్మాపతి నుడువున్. 351

క. అపవిత్రాన్నముఁ దినదో,షపటల మంటెడు నటన్న శాస్త్రము సుంతే
నెపుడైనఁ దలంపని దు,ష్టపురుషుఁ గనరా దటంచుఁ జక్కఁగ నుడువున్.

క. ఇది శ్రీరామునియాశయ, మిదియె సుశీలైకఫల మహీనగుణగణా
స్పద మిదియె పురంధ్రీ!యె, న్నఁ దగినవిషయంబిదే యనందగుఁ గాదే?. 353

చ. వినుమికఁ బౌరుషాదికము విస్తృతిగాకయె సారభూతమే
యనఁదగినట్లు తెల్పెద; మహాశ్యపరాక్రమశాలి రాముఁడే
ధనువును గైకొనం దలఁప దత్తఱమందును శత్రురాజి; కై
కొని తుదముట్టఁగాంచిననె కోరును బద్ధ్వయ మాశ్రయింపఁగన్. 354

చ. శరమరివోయ నాధనువు సజ్యముచేసినయంత మేరుభూ
ధరముఖముల్ వడంకు; నహితప్రకరంబులఁ జెప్పనేల? రా
ద్వరుఁడగు రామమూర్తి శరవర్యము నారినిగూర్చి దవ్వునన్
బరఁగినదానిఁ గూల్పఁదగుపాటి మనఃపటిమం జెలంగెడున్. 355

ఉ. చంపఁగ నర్హుఁడౌ ప్రబలశత్రువు సంగరరంగమందు ని
ర్జింపఁగఁ దన్నుఁబూని యెదిరించి శరంబుల నొంచి మించి బా
ధింపఁ దలంచి దైవగతి దీనతనొంది శరణ్య! రాఘవా
చంపక కావుమాయనిన సంతసమంది భయంబు లేదనున్. 356

ఉ. అంతియకాక యాతనిమహాధనరాశి సమాక్రమింప నో
క్కింతయుఁ గోర కాదరణమెంతయుఁ జూపి నయంబు నేర్పి నీ
వింతట నిర్భయుండవయి యీశ్వరునిన్ భజియించుచున్ మహిన్
సంతసమొప్ప నేలుమని చయ్యన నాతని సాగనంపెడున్. 357

చ. కినుకవహించు నేని యది కేవలధర్మవినాశనార్థ మే
పనియొ జగంబునందు నొకభాగమునందున సాగియుండు నం
చనియెడుఁగందగున్; జననమెత్తుట ధర్మము గాచుపొంటె నం
చనయముఁ బల్కుచుండు నటులాత్మఁ దలంచును సత్యరక్షుఁడున్. 358

మ. తరుణీ! సువ్రత మంతమొందునటు యత్నంబాదృతిం జేయున
ప్పురుషుం డెంతటిబంధువైన నిఁకఁ బోషమ్మంచుఁ బోఁడోలు; నీ
ధరణవ్వానిని మించఁజాలు నఘయుక్తస్వాంతుఁడేయుండఁ ద
క్కరణిం గాంచిన నంచుఁ బల్కు జనకక్ష్మాపాలచంద్రాత్మజా!. 359

చ. హితముగఁ బల్కు సుస్మిత మదెప్పుడు నాట్యముచేయువక్త్రమం
దతిశయమోద మారఘుకులాగ్రణి కారయ ధర్మమందు సూ
నృతమున; దీనరక్షణమదెయ్యెడలం దగుకృత్యమంచు నా
దృతి వచియించుఁ గృత్యతతి నెంచఁగ దానిని మించ లేదనున్. 360

క. తనసువ్రతములఁ గావఁగ, వనితామణిసోదరులను వదలుదు; నాకుం
దనివినొసంగెడు నవ్వియె, యని పల్కున్ రామచంద్రుఁ డవనీతనయా!. 361

మ. కరుణానీరధి సత్యధర్మయుగముం గావంగ సద్బంధువౌ
దరుణీరత్నము! మేరుధీరుఁడు సముద్రఖ్యాతగంభీరుఁ డా
శరకాలాంతకుఁ డార్తరక్షణ మజస్రంబాత్మకృత్యంబె యం
చురుబుద్ధిం దలపోయు మాన్యుఁడు మహాయోధాగ్రగణ్యుం డగున్. 362

ఆ. గర్వ మెన్న లేని ఘనసంపదున్నతుం, డాడితప్పనట్టి యనఘమూర్తి
రామచంద్రుఁ డనఁగ రామాశిరోమణీ!, వినుతి సేయఁజాలుదునె తలంప.

క. పరమేశ్వరుఁడే రాముఁడు, ధరణిన్ సత్యంబుఁగావ ధర్మముఁ బ్రోవన్
నరరూపముఁ దాల్చెనటం, చరయం జనుమౌనివరులకైనన్ సాధ్వీ!. 364

క. వనమునఁ గబంధముఖులకుఁ, దనదర్శనముననె సత్పదముఁ బ్రాపింపం
గనుజేసి శైలమూర్ధంబున నారాకకును గీశభూపతితోడన్. 365

ఆ వేచియుండు నంబ! వినుమిఁక వేగమ, మన్ముఖమునఁ గుశలమండితమగు
నీదువార్త విని మహోదధిఁ దరియించి, మించువేడ్క నేగుదెంచు నిటకు. 366

క. దనుజుల కందఱ కింకను, మనఁజాలెడు నాశ తీఱె మహిపై నని నీ
మనమున నమ్ముము; సత్యం, బని దీనిన్ నమ్మవమ్మ యవనీతనయా!. 367

చ. తనమరణంబె కోరియు ముదంబున నిర్గొనివచ్చె రావణుం
డనుజయుతంబుగా సమరమందు నమర్త్యులు చూచి సంతసం
బునఁ బొదలంగఁ జచ్చె నిది భూతహితంబగు వార్త; చక్కఁగా
వినఁదగు దీని; వంతలను వేగ యడంచు నటంచు నమ్ముమా. 368

చ త్రిదశులు తత్ప్రభుల్ శతధృతిప్రముఖత్రిదశేంద్రరక్షకుల్
మదమున విఱ్ఱవీఁగెడుసమస్తనిశాచరవర్యు లింకనుం
బొదలెదు దేవయోనులసమూహము నెంత ప్రయత్నమూనినన్
సుదతిరో! రావణాసురుఁడు చూఱఁగొనున్ సుపదంబు రాముచేన్. 369

మ. నిను దుఃఖంబులపాలు చేసినసదానీచాత్ముఁ డీరావణుం
డనయఖ్యాతుఁడు దుష్టదానవకులంబై యొప్పుగాత్రంబు చ
య్యనఁ బాయంగ మహావిపద్దశకుఁ బాలై రాక్షసస్త్రీలు భి
క్షుని కాయంబునుగూడి బిచ్చ మిడుఁడంచున్ బోవు వారెల్లెడన్. 370

క. చింతింపకుమా యింకను, స్వాంతంబున సంతసంబు సంధిల్లఁగ భూ
కాంతునిరాకను గోరుచుఁ, బంతము నెఱవేఱఁగోరు పద్ధతిఁ గొనుమా. 371

క. అనిపల్కిన విని యంతట, జనకాత్మజ విశ్వసించుచంద మెఱుఁగఁ జే
సెను మోము నెత్తి కరుణా,వననిధిగా నతనిఁ దలఁచి భాషించె నిటుల్. 372

### సీత హనుమంతునితో సంభాషించుట.

మ. హనుమంతా! మతిమద్గణాగ్రుఁడవు నిత్యానంద మింపొంద రా
మునిపాదాబ్జము లాశ్రయించితివి; నాపుణ్యమ్ము పండెన్; మహా
త్ముని సేమంబులు నాకుఁ దెల్పి బ్రదుకన్ బోలుంగదా యింక నా
థుని దర్శింపఁగ నంచు నాదు మదికిం దోఁపంగ నీ వివ్విధిన్. 373

తే. చేసినాఁడవు కాపున సిద్ధతపము, బలిమి దీవించుదాన ని న్నెలమిమీఱ
సూర్యచంద్రులు నిల్తురే క్షోణి వెలయఁ, జేయ నెందాఁక నందాఁక క్షితిని మనుము.

మ. నిను దర్శించిన నీదునామమును సుస్నేహంబునన్ సన్నుతిం
చినఁ బాపంబులు పోవ శర్మములు సంసిద్ధంబులై చేర మే
దిని విఖ్యాతివహించి రామునికృపాబ్ధిన్ మున్గుచున్ బొల్తు రో
హనుమంతా! వరమిద్ది నీకొసఁగితిన్ హర్షంబు నేఁగాంచుటన్. 375

ఆ. అనఁగ నాలకించి యల్లనఁ బ్రణమిల్లి, తల్లి! నీదుకరుణ యుల్లసిల్లె
నదియచాలు నాకు నాత్మేశు నంగుళీ,యకము దీనిఁజూడ వమ్మ యనుచు.

క. కటివస్త్రంబునఁ గలము, ద్దుటుంగరము ప్రీతినొసఁగఁ దోయజముఖియుం
బటుకున నక్కున నిడుకొని, పటుతరహర్షంబుమీఱఁ బలికె నతనితోన్.

చ. అనిలకుమార! నాకు నిపు డబ్బినహర్షము పెండ్లివేళఁ గ
ల్గినయటు దోఁచు; నిత్తఱిని గేవలదుఃఖసముద్రమగ్ననా

నను నిది యుద్ధరించుటను నాథుని జూచినయట్టు లయ్యె నే
మని నిను సన్నుతింతు సుగుణాకర! ఖ్యాతిఁ జెలంగుమా యిఁకన్. 378

క. దీనిచరితంబుఁ జెప్పెద, మానాయన పెండ్లివేళ మన్నాథుని వే
రీనెలవునఁ జిత్రించెను, మానితమణికలయోగమండితనునుగన్. 379

క. పరులకగమ్యముగా న,క్షరరూపతఁ బొల్చి మణిగణములు వెలయం
గరకౌశల మేర్పడఁగ,స్వర కారుఁడు చేసె నిది యమూల్యముసుమ్మా. 380

క. కన్నియదానం బిడుతఱి, సన్నుతిపాత్రంబుగా; నొసంగెను జామా
త న్నెఱిఁబూజించుచు వి,ద్వన్నుత! నీయుంగరము ముదంబున నిచ్చెన్. 381

క. అల్లునకు నంగుళీయక, మిల్లాలుగ నాత్మజాత నిచ్చెదుతఱి సం
ఫుల్లహృదబ్జుండై భూ,వల్లభుఁ డీయంగఁ దగును పావని! వింటే. 382

క. పూర్వుల యాచారంబులు, సర్వశుభాకరము లంచు స్వాంతమ్ములయం
దుర్వీశులు నమ్ముదు రవి, పర్వనిశాకరులరీతిఁ బ్రమదదము లగున్. 383

క. ఆయాచారంబును మా, నాయన పాటించి రామునకు న న్నిడుచున్
న్యాయంబని యీయుంగర, మోయనిలకుమార! యిచ్చె నొప్పు దలిర్పన్. 384

చ. పదినెలలయ్యె దీనిఁ గనుభాగ్యము లేక భవత్సహాయసం
పదఁగని నేఁడు రామజనపాలుఁడు పంపెను దీనిగాంచితిన్
ముదమును గంటి రావణునిమూర్ధము లింక ధరిత్రిఁ బండు నం
చెదకును దోఁచె నింతటికి నీవె కదా తగుకారణం బనన్. 385

తే. "చిరతరాయుష్యభాగ్య సంసిద్ధి రస్తు, రామజనపాలపాదసరసిజయుగళ
సంతతధ్యానయోగనితాంతసిద్ధి, రస్తు తే" యని దీవించి యవనితనయ. 386

క పావనిఁగని యిట్లనియెన్, నీవలెఁ గార్యంబుఁ దీర్పనేర్పఱి జగమం
దేవాఁడు లేఁడటంచున్, భావించెద, నింక మఱఁదిపల్కులఁ జెపుమా. 387

చ. గొనములరాశి శీలమునఁ గుర్ జననాలయ మాసుమిత్రపు
త్త్రుని దలపోయఁగా నొడలు తోపకయుండును బుణ్యసాగరం
బనఁదగుఁగాదె యాతని గుణాళిఁ దలంచిన నట్టివాని నా
ర్తిని గనఁ జేసితిన్ దురితతీవ్రఫలంబును గంటి నివ్విధిన్. 388

ఉ. సీత వచించుచుండ నిటు చేష్టలుదక్కినయట్టి లక్షణ
వ్రాతము కన్పడెన్ లలితవర్ష్మమునం దపుడే తనంతనా
వాతతనూజుఁ డట్టితఱి వారిజలోచన యార్తిఁ బాపఁగాఁ
జేతమునం దలంచి వడిఁ జేతులు మోడ్చి వచించె నిట్లుగన్ 389

ఉ. అన్నసమీపభాగమునయందె వసించుచు నూఱడిల్లఁగా
నెన్నియొ నీతులం బలికి యిప్పునిఁ జేసినవానిఁ జంపఁగా

నెన్నుట పాటిగాని ధృతి ♦ నీయెడఁ బాసి విచారవారిరా
శి న్నెటిమున్గుటల్ తగునె ♦ శ్రీరఘునాయక! యంచుఁ బల్కుచున్. 390

తే. చెంతఁబాయక నిలుచుండి ♦ చిత్తమొక్క, యింతయూఱట చెందన ♦ త్యంతనియతిఁ
జేయుచుండును గాని య ♦ దేయెడలను, విడిచియుండఁడు జానకీ ♦ వేయునేల!.

తే. అట్టిసౌమిత్రి నీసేమ ♦ మడుగఁబాద, వందనముల నివేదింప ♦ వలయు ననుచు
నన్ను నర్థించె నేమందు ♦ నన్ను తాంగి, నీదుచింతకు దుఃఖించు ♦ నిత్య మతఁడు.

చ. తలఁచినయప్పుడెల్ల గుణ ♦ ధాముఁడు లక్ష్మణుఁ డోపతివ్రతా
తిలకమ! యిట్టి పాట్లొదవ ♦ దేవుఁడొనర్చెనె నిర్ఘృణుండుగాఁ
దలఁపఁగ నౌనుగాదె సత ♦ తం బతని న్నినుఁబోలు సాధువృ
త్తులకు దురంతకష్టసము ♦ దాయము కల్గ నొనర్చినందునన్. 393

చ. అని విలపించుఁదమ్ముని మ ♦ హార్తినిగాంచి రఘూద్వహుండు తా
ననునయమందఁ జేయఁ దగు ♦ నట్టినుడుల్ పలుకంగలేక మే
దినిబడి తమ్ముఁడే తనమ ♦ దిం గలతాపమువాయఁ బల్కునే
మనక యె కౌఁగిలించుకొను ♦ నమ్మరొ! యిర్వురవర్తనం బిదే. 394

చ. నరపతి నిన్నుఁబాసినది ♦ నంబుననుండియె నేఁటిదాఁక నే
సురను గొనండు మాంసమును ♦ జూడఁడు వేడుకనైన జానకీ!
సురుచిరకందమూలములు ♦ సుందరికిం బ్రమదంబు నిచ్చుటన్
గురుతరదుఃఖహేతువు లగుం గనుకన్ గొనఁ డంచుఁ బల్కెడున్. 395

చ. అసువుల నిల్పుకొంట హిత ♦ మా నను శాస్త్రము నమ్మి యొద్దియో
యసమయమందు సుంత దిను ♦ నంతియకాని పరాకుమాని కీ
శసమితినాయకుండు సహ ♦ జన్ముఁడు వేఁడిననైన మంజుకం
దసహజపక్వ సత్ఫల వి ♦ తానమునం దొకఁడేఁ గొనం డెటుల్. 396

ఉ. ధాత్రికుమారి! నాపలుకు ♦ తప్పదు రాముఁడు వానరేంద్రుఁడున్
జైత్రమనం బ్రసిద్ధమయి ♦ క్ష్మాపతిజాతికి నెంతొ యర్హమౌ
యాత్రకు వే ప్రయాణమయి ♦ యంబుధిదాఁటి సమస్తవానరుల్
గోత్రము లాయుధంబులుగఁ ♦ గోరిక వెంబడిరాఁగ నిప్పురిన్. 397

క. నాలుగుదెసలం బర్వుచు, జ్వాలావళి గ్రక్కుతీవ్ర ♦ శరవహ్నులచేఁ
గాలుతురు నీవ చూతువు, జ్వాలామాలనిగ నుండు ♦ స్థానీయంబున్. 398

క. ఈరీతిఁబల్కు పవనకుమారున్ వీక్షించుచుఁ బ్రమద ముప్పొంగన్
వారిజలోచన యిట్లనుఁ, గోరిక నీకున్న యట్లె ♦ కొనసాగుఁగదా. 399

క. విమలమనస్కుల తలఁపులు, క్షమ సత్ఫలమిచ్చుఁగాని ♦ సమసి చనవు నీ
చమతులయూహలవలె నే, సమయమునందైన ననుచు ♦ సంభావింతున్. 400

క. బిసరుహనయనుఁడు రాముం, డసదృశదోర్బలము మెఱయ ॥ ననుజునితోఁ గీ
శసముదయాధీశునితో, వెస వచ్చుంగాక! దనుజవీరులఁ జంపన్. 401

క. ఇందుంగల దనుజాంగన, లందఱు ననుఁ జంప మాని ॥ యార్తనినాదం
బెందును వ్యాపింపఁగఁ బో,వం దమి నేఁ గాంతుఁగాక ॥ వాయుకుమారా!.

సీ. రెండుమాసములె నేనుండఁగ శాసించె, దనుజనాథుఁడు నీవు ॥ వినియెయుందు
వవ్వల వీరు నన్నంతము నొందించి, భక్షింతురనియును ॥ బల్కెనతఁడు
ననుఁగాంచి యట్టులే ॥ యగుఁ గాన రాముండు, వచ్చి వీరలనెల్ల ॥ వరుసఁజంపి
పంక్తికంధరుని నేఁ॥బడిపయిఁ ద్రొమ్మిద,న దినంబునం జంప ॥ వలసియుండుఁ
ఆ. గాన నీవుపోయి ॥ కాంచిన దానిని, విన్నదాని నెల్ల ॥ విన్నవించి
నాయవస్థఁ దెల్పి ॥ నాథుని దోడ్తెమ్ము, చెప్పవలెనె నీ కుచితవిదునకు. 403

క. నను ననపాయినిగా నె, మ్మనమున నూహించి రమ్ము ॥ మానవనాథా!
యని నేఁ దెల్పినయటులే, వినయంబునఁ బల్కవయ్య ॥ విశ్వేశునితోన్. 404

తే. నీదుహృదయమునందుందు॥ నేనటంచుఁ, దలఁచుదానను గాని యీ॥తరుణమందు
బాహ్యదృష్టివిలోకింప॥వలయు ననుచు, గోరుదానను జెల్లింపు ॥ కోర్కె దీని.

క. జగమున సీతారాముల,కుఁ గల్గె నెడఁబాటటంచుఁ ॥ గొంకు గనకయే
వగఁబల్కుదు రానుడి విం,తగఁ దోఁపం జేయ రమ్ము ॥ త్వరఁగొని నాథా!. 406

క. అని నే మనవియొనర్చితి, నని విన్నప మీవు చేసి ॥ యందఱితో న
బ్ధినిదాఁటి వచ్చి యీవా, ర్తను నాకుం దెల్పవయ్య ॥ రాఘవభక్తా!. 407

వ. ఇవ్విధంబున సాభిప్రాయంబుగా జనకతనయ పల్కిననాలకించి యంజలిఫాలం
బునఁగీలించి యిట్లనియె. 408

ఉ. రామనృపాలుఁ జేరి నిను ॥ రావణుఁ డాడినమాటలెల్ల నే
నేమియు మానకే తెలుప ॥ నెంతయు వేగమ యుద్ధయాత్రకై
క్షేమముగల్గు భల్లకపి॥ధీరులఁగూడి ప్రయత్నమూను నీ
కోమలహృత్సరోరుహము ॥ గొబ్బునఁ జక్క వెలుంగునట్లుగన్. 409

క. ఏణాక్షి! నీహృదీశుఁడు, కోణపులం జంప సురలోకుం దమిఁగూర్పం
వాణీశముఖులు పొగడఁగఁ, బాణిం గోదండమూని ॥ వచ్చుంజుమ్మీ. 410

ఆ. భూమి యీనినటు కపుల్ వెల్లివిరిసెనో, సాగరంబు లనఁగ ॥ శైలభూరు
హాదిసాధనముల ॥ నలరుచు వచ్చి యీ, లంకఁజొచ్చువారు ॥ శంకలేక. 411

మ. దివిషద్బృందము వ్యోమయానములపై ॥ దీపించుచున్ రామదై
త్యవరాభీలరణంబు గాంచి బెగడొం॥దన్ రామబాణంబు లెం
తో వడిం బర్వుచు రూపుమాప దితిజ॥వ్యూహంబు భస్మాకృతిన్
భువిఁ గన్పట్టఁగ నీవ చూచెదవు పో ॥ భూపుత్త్రి యీవేడుకన్. 412

ఆ. అనుచుఁ దెలియఁబలికి యాదేవిఁగని । యింక, నరుగవలయు నస్మ । దాగమనము
గొఱకు వేచియుంద్రు । గోఁతు లవ్వలిదరిఁ, గాన్క యేదియేఁ ద । గంగ నిమ్ము.

క. దానిం గని శ్రీరాముఁడు, జానకి! నిన్ గాంచినట్లె । సంతోషమ్ముం
బూను నను నమ్ము చక్కఁ, గానం గానుక యదెద్ది । గాని యొసఁగవా. 414

క. మరుదాత్మజుండు గోరిన, దరయంగా న్యాయ్యమైన । దగు ననుచు మనో
హరభాషణముల నిట్లనుఁ, గరుణాంభోరాశి వీవు । గనుక వచింతున్. 415

వ. సమాహితాంతఃకరణుండవై యాలకింపుము. 416

### సీత హనుమంతునకు శిరోరత్న మిచ్చుట.

చ. పవనకుమార! పుత్త్రునిగ । భావనచేసితిఁగాన నీకడన్
దవిలి వచింప రాని దిది । నాఁ దగు వార్తయు లేదు గాన నీ
వవహితచిత్తతన్ వినఁగ । నర్హుఁడవంచు వచింతు నేను రా
ఘవుఁడును బర్వతాగ్రమున । వాయువు చల్లఁగ వీచుచుండుటన్. 417

తే. దాని సేవింపఁగోరియో । కానొకదిన; మందు నెక్కటి మాకొండ । నందునుండ
శిలలఁ గన్పడు నాధాతు । వులను దీసి, తిలక మిడి యెను నాకుఁ బ్రీ । తినివిభుండు.

క. ఈవార్త నెఱింగింపుము, పావని! నాథుండు నమ్ము । పరమప్రమదం
బావహిల నంచు వేఱొక, టౌవార్తను జెప్పఁబూని । యనియెన్ మరలన్. 419

సీ. చిత్రకూటాద్రికిఁ । జేరువగానుండు, పర్వతంబున నుమా । పతిదిశఁ దగు
భాగంబునన్ సుర । వాహినికిం జెంత, నొక్కస్థలంబున్న । దొప్పుగులుకు
చును దానియందుఁ గు । సుమఫలాదికములు, దొరకు నవ్వారిగా । నిరుపమాన
సుఖధామముగ నుండు । చోటది యనఁదగు, నందుఁ గూర్చుండ ని । ద్రాంబ నన్ను

తే. నాశ్రయించిననాథుని । యంకసీమఁ, బవ్వళించితి నిద్దుర । బరువుదీఱ [నను.
లేచి కూర్చుండ ననుఁ గాంచి । యాచతురుఁడు, నడిగెశయనింపనిత్తువెతోడపయి

క. ఆపలుకులు నాచెవులకు, నే పరమామోదదములు । విమలామృతధా
రాపాతసన్నిభమ్ములు, నై పర్వనఁ బ్రాణనాథ! । యట్లే యంటిన్. 421

ఉ. మోమున నుండి యానుడులు । బోరన వెల్వడునంతలోన నా
స్వామి మదంకభాగమునఁ । జక్కఁగ వ్రాలి సుఖాబ్ధివీచికా
స్తోమమునందుఁ బోలెఁ దమిఁ । జొక్కి జవంబున నిద్రవోయినన్
గోమలవాతపోతములు । గూడ సుఖం బొడఁగూర్చె భర్తకున్. 422

ఉ. అంతట నొంటిదాన నని । యచ్చట మాంసముగోరియుండి దు
ర్దాంతమదంబునం బొదలి । తా నొరులం గనలేని కాక మ
త్యంతజవంబునం గదిసి । తప్పనియెన్నక నాయురోజమం
దెంతయుఁ గోమలంబగుచు । నిద్ధమునౌ పలలంబుఁ గైకొనన్. 423

ఆ. అరుగుదెంచి నాసికాగ్రమునం బొడువంగ నార్తినొందియుం గడంగి
నిదురఁబోవు నాథునిన్ లేపఁ జాలక, కదలకుండి తాళఁగా నదియును. 424

క. అటుపోయి మరలవచ్చుచు, నిటుపోవుచు మరలి వేగ యేతెంచు చాగిన్
బటుతీవ్రతుండమున నొక్కటఁ జీరుచు రక్తమయముగాఁ జేసెఁ గడున్.

తే. అరుగుదెంచుట చీరుట యపుడపుడట, జరగుచుండుట నాయురోజమ్మునుండి
ధారలుగఁ బాఱెసాంద్రరక్తంబు దానఁ, దడిసి శ్రీరాముఁడా నిద్ర తన్నువదల.

ఆ. కూరుచుండి యేలకువలయాక్షీ! యురోజమ్మునుండి నల్ల చిమ్మినట్లు
వెడలివచ్చు నేల వివరింపుమా నీకు, నపకృతిం బొనర్చె నతఁ డెవఁడొకో.

క. వినిపింపు వేగ యాతనిఁ, బని పెద జమునింటి కతిథివర్యునిగా నం
చని ప్రశ్నించుచు నుండఁగఁ, జనుదెంచెన్ మరల నతఁడు శక్రసుతుండౌ.

చ. పతగకులేంద్రుఁడై యతఁడు పర్విడుచుండును ధాత్రియందు ను
ద్ధతుఁడయి; రామచంద్రుని ప్రతాపము సుంత యెఱుంగకుంటఁ దా
నతిశయశక్తిమంతుఁ డనునాశయమూనుటవచ్చె నన్ను నం
చితగతిమీఱఁగాఁ బొడువ శ్రీరఘునాథుఁడు చూచి కాకమున్. 429

తే. రక్తసిక్తాగ్రమైన యారాతిత్రోటి, గానఁబడినంతనే పట్టరాని కోప
మంకురించుటఁ దామ్రనయనము లొప్ప,నొకయిషీకంబుఁ గైకొని హుంకరించి.

క. వదలెన్ దానిం జంపఁగ, మదినెంచి యిషీక మది కమలజన్మాస్త్రం
బిదెయని తోఁపం జేయుచుఁ, దుదముట్టింపం దలంచి తోడనె కవిసెన్. 431

క. కని దాని నతఁడు భీతిం, జని దేవేశ్వరులనెల్ల శరణమనుచుఁ బ్రా
ర్థనచేసియు ఫలమేమియుఁ, గనరామిన్ మరలి వచ్చి క్ష్మాపతిఁ గనియెన్. 432

చ. చరణములందు వ్రాలి మతిచాలక చేసినతప్పు సైపుమా
శరణము వేఁడినాఁడ ననిసాధ్వసకంపితదేహ మొప్పఁ బ
త్సరసిజయుగ్మమున్ విడువఁజాలని దీనుని గాంచి రామభూ
వరుఁడు కృపాతరంగయుతభావనుఁడౌట భయంబు వాపుచున్. 433

సీ. పతఙవర్యా! మదంబకము వ్యర్థముగాఁగ, మరలదు నీదువర్ష్మమున నొక్క
యవయవంబును దానికాహారముగ నిచ్చి, నిర్భయంబుగఁ బొమ్ము నెలవుచేర
ననవిని కాక మాత్మాక్షిని దానికి, నాహుతిగాఁ జేసి యరిగె నిచ్చ
బ్రహ్మాస్త్ర మయ్యది వైరిగర్వమువాపి, శాంతించె నీపహాస్య విషయంబు
తే. రామమూర్తికి నెఱిఁగింపు మోమరుత్సు
తా! యటంచు వచింప నాహనుమభక్తిఁ
బ్రణతియొనరించి యిమ్మాడ్కిఁ బల్కెఁ దల్లి
ప్రశ్న మొక్కఁడు కలదు సర్వజ్ఞవౌట. 434

ఉ. దానికి నుత్తరంబిడుము దాసుఁడు దానఁ గృపార్థుఁ డౌనటఁ
జానకి యిట్లుపల్కఁ గృపసంధిల నో హనుమంత! సంశయం
బేన యెఱుంగుదుర్ వినఁగ నీవును బాత్రుఁడవే కదా మనం
బౌనె సమాహితంబు వినునర్హత యప్పుడె యం చెఱుఁగుమా. 435

అస్త్రవిద్యోపాసన.

సీ. హనుమ! వస్తుస్వరూపోపానపేక్షముఁ బురు, షేచ్ఛైకతంత్ర మహీనమునగు
నట్టి మనఃప్రవాహంబె యుపాసన, యనఁబడు; మంత్రోదితార్థ మిట్టి
కరణి భావింపఁగఁ గలుషంబు లడఁగు వాం,ఛలు పండునని తెల్పఁజాలునది,యు
పాసనాకాండతఁ బరఁగుఁ దద్రీతి న,భీష్టదేవత మది నెన్ని నిల్పి
ఆ. గురుముఖమునఁ గొనిన వరమంత్రమును విధి, ననుసరించి భక్తి యెలర జపము
నేయవలయుఁ గాని చిత్త మా దేవతా, పదయుగంబు నుంత వదలరాదు. 436

చ. మనుజపసంఖ్యయందు నల మంత్రవిభుండగు దైవమందు నొ
క్క నియతి బుద్ధినిల్పఁదగుఁ గాని ఫలంబును బొందఁగోరు నా
శను విడనాడఁగా వలయు సంధిలదే నది సత్ఫలంబుఁ దాఁ
గనఁగ ననర్హుఁడే యగుఁ దగంగ నుపాసనయన్న నిద్దియే. 437

ఉ. భానువరప్రసాదగత పావనమంత్రగణా! మరుత్సుతా
మానస మెద్ద హంకృతి విమర్దనలక్ష్యముగాక యుండునో
ధ్యానము సేయ నప్డె సమయంబని నమ్ముము వేఱుకాలమే
దానికి నర్హమై తగదు దాన ఫలంబొడఁగూడ కుండమిన్. 438

క. అట్టు లుపాసించినచోఁ, బుట్టును సత్ఫలము మంత్రమును మాత్రము తా
నెట్టో జపించిన మానస, మిట్టట్టు చలింప సిద్ధియెటులగు హనుమా! 439

చ మనుజపసిద్ధి నాఁదనరు మంత్రవిభుప్రియదర్శనంబె సం
ఖ్య నదియుఁ గాదు మంత్రజపకాలము సిద్ధుల నీయఁజాల దిం
క నియతిఁ జిత్తముండిననె గాని య దొప్పదు మంత్రరాజద
ర్శన మయినంత కోరుదురు క్ష్మాపతు లుత్తమశాస్త్రపద్ధతిన్. 440

చ. సమయమురాఁగ భక్తిమెయి సంస్మరియింతును నిన్ను నో ప్రభూ!
యమలినదర్శనం బొసఁగు మత్తఱి వేఁడఁగ నట్లెయంచు దై
వము చను; నప్పుడే తపముఁ బండినదానిగ నెంచవచ్చు నా
క్రమమున నేయుపాసకుఁడు కాంక్షఫలింపఁగ మంత్రసంఘమున్. 441

క. వరుసనుపాసించుచు ని,ర్జరులను మంత్రాధిదైవసత్తములను గొ
ల్చురతిం గాంచుచు శక్త్యను,సరణముగా సిద్ధినొందఁ జాలుంజుమ్మీ. 442

మ. ఇదియేమార్గము దేవతోత్తములఁ దానే వేళఁ బ్రార్థించు నా
యదనుం ద్రోయక దర్శనంబు గన నిష్టార్థంబులం గాంచ నా

పదలంబిక్కక సౌఖ్యముంగనఁగ; నాపద్బాంధవుల్ గారొకో
త్రిదశుల్; భక్తుఁడు కోర దర్శనము సంప్రీతిం గటాక్షింత్రుసూ. 443

ఉ. ఎప్పు డుపాసకుండు తన కెద్దిహితంబయియుండు దానికై
విప్రగుభక్తి దేవతను వేగమ రమ్మని సంస్మరించి తా
నప్పటి కెద్దిచెంతఁదగు నయ్యది గైకొని మంత్ర మెన్ని నా
యిప్పని దీర్పుమా యనుచు నెంతయు వేఁడుచు మంత్రసంయుతిన్. 444

క. కలిగించినంత నయ్యది, వెలుఁగుచుఁ జని యస్త్రమంత్రవిగ్రహమున వై
రులఁజంపు నస్త్రవిద్యకుఁ, గల లక్షణ మిదియె యిందుఁగల సారమిదే 445

ఉ. భక్తుని కార్యముల్ సుఫలవంతములై తగునట్లు చేయఁగా
శక్తి యొసంగకుంట నవి చయ్యనఁ బొలును గాదె యందువో
యుక్తివిరుద్ధ మయ్యదియు నొక్కపుడైనను గాదు గాని యా
సక్తిని నాలకింపుము ప్రసన్నమతిన్ మరుదాత్మసంభవా!. 446

సీ ఒక్కదేవతనె శాస్త్రోక్తమార్గంబున, నిర్వురుపాసింతు రేకరీతి
నందు నిర్మలభక్తియెల్ల ప్రాశస్త్యము, నెవరియాత్మను జూడ హెచ్చుగాఁగ
నుండునో యతనికి నొప్పుఁ దత్సిద్ధియు, నొక్కయస్త్రముసె మహోగ్రభంగి
నమరునాత్మలుగల యట్టిరువురువైవ, నొకఁడు నిష్ఫలమగు నొకఁడు గెలుచు
తే. దానికిం గలకారణమాను బూర్వ, పుణ్యకర్మమె యద్దానఁ బుట్టుఫలము
వీనిరెండింటికిం గలభేద మిదియ, యని తలంపఁగ సందియ మంతమొందు.

చ. ఇరువురయందు శ్రద్ధసమమే యగునే నపిశాంత మొందు నె
వ్వరిఁ జెనకంగ మాని చను వాయుకుమార! మఱొండు వార్త నీ
వరయఁగ నర్హమా; మనువులం దధమోత్తమభేదముండు దా
ని రహి నెఱుంగనొఁగద; యనింగల మర్మము దానఁ దెల్లమా. 448

మ పరమేశుం డొనరించు సర్గమున నేపాటన్ నశింపంగ నె
క్కరణిన్ శక్యముగాని దెయ్యదియు నేకాలంబునం దుండ;దె
వ్వరిమూలంబున నెద్ది ద్రుంగఁదగు నిర్భంగిన్ దదర్హంబుగాఁ
బరఁగుం గాల మిదంచు బ్రహ్మయె తలంపం జాలు నాత్మం గడున్. 449

తే. అద్ది వేఱుగ మాఱనిదగుట నొక్క, యస్త్ర మద్దాని కంతకమైనయట్టి
యస్త్రమునఁద్రుంగునాగ్నేయమబ్ధినాథు,నస్త్రమునఁజెడునిట్టులేయన్నియునగు.

క. ఏయస్త్రంబునఁ ద్రుంగక, యేయెడలన్ దీప్తిమీఱనెసఁగునదియు ది
వ్యాయుధములలోఁగల దా, న్యాయం బెటులంచు నడుఁగ నాత్మఁ దలతువో.

ఉ. ఎవ్వనిబుద్ధియందుఁ బరమేశ్వరుఁడే జగదోఘమందుఁ దా
నివ్విటిలున్ విచిత్రము గణింపఁగ రాకయె యప్రతర్క్యమై

యివ్విధమంచుఁ జెప్పఁ దర మెవ్విధిఁగాక యనేకరూపతన్
దివ్వివిధంబునన్ వెలుఁగు తీరొనఁగూర్చెదునన్న భావముల్. 452

చ. నెలకొనియుండునో యతని నిర్మలచిత్తుని నార్తిముంపఁగాఁ
దలఁపక యెల్లయస్త్రములు తామె యడంగు; నతండు వైవఁగాఁ
దలఁచెడు నస్త్రమయ్యది నితాంతము భాసిలుచున్ మహాస్త్రపం
క్తుల నడఁపంగఁజాలుచును దుస్సహమై వెలయున్ జగంబునన్. 453

ఆ. సకలదేవతలును సర్వేశునంశంబు, లగుట వారివైనయస్త్రతతులు
దానినేమి చేయఁబూననైనను లేక, యూరకుండు ననుచు నొగిఁ దలఁపుము.

క. దానికిఁ గారణ మేమన, మానసమునఁ గల్గునాసమత్వమె యని యో
ధీనిలయ! తలఁపవయ్యా!, దేనం జెడనట్టి దదియె దివ్యం బదియే. 455

క. శ్రీరాముని బ్రహ్మాస్త్రము, సారతమంబౌట దానిసత్త్వ మనూహ్యం
బారయ ననన్యభేద్యం, బై రహిఁ జెల్వొందుచుండు నసదృశ మగుచున్. 456

వ. అని హనుమంతునకు నస్త్రవిద్యామహత్త్వంబుఁ దేటపఱచి కాకాసురవృత్తాంత
రహస్యంబుఁ దెలుపం దలంచి యి ట్లనియె. 457

చ. శతమఖసూనుఁడౌ నతఁడు చారుపతత్రియుఁగాక వాయసా
కృతిఁ దిరుగంగ నేల? యమరేంద్రుని కెన్న జయంతనాముఁడౌ
సుతుఁ డలరారు నంచు వినుచున్ బహురీతుల నొప్పు నప్పురా
ణతతిఁ బఠించుచుండుదు వినం గనరా దిది యంచుఁ బల్కెదో. 458

తే. దేవయోనులలోఁ బతత్త్రితతి యొండు, గలదు శతమఖునింగని కామవృత్తిఁ
బక్షి యాతనిగ నెనంచుఁ బవనతనయ!, తలఁపవయ్య మనంబునఁ దొలఁగు శంక.

సీ. ఇంద్రసూనుఁడ నని యెంతొ గర్వంబున, మదురోజగతమంజుమాంసముఁదిన
నెంచి యాతండు బాధించె నద్దానికిఁ, దగినఫలంబును దానె గుడిచెఁ
గర్మమన్నది మిన్నఁగా గడింపంగనౌ, దానిగతుల్ సాధుమానులకును
దెలియరాక యెసంగుఁ బలుకులు వేయేల, యేవేళ కేఫల మెట్టులీయఁ
తే. దగునొ యారీతి నొసఁగుచు దానినితరు, లెఱుఁగకుండంగఁ జేయుచు నీశ్వరాకృ
తిని జెలంగుఁ ద్రిమూర్తులు ననఁగ దాని, త్రిప్పలకులోను గాఁగ వర్తింతురుగద.

చ. అని వచియించి మస్తకమునందు నితాంతముగుప్తమై మనం
బున కతిహర్షముం గలుగుపోలిక నున్నతశక్తిగల్గి కాం
తినిచయపేటికాకృతిని దేజరిలం దగియుండు సన్మణిన్
గొని పవమానసూనునకుఁ గొంకక యింతయు లేనిప్రీతితోన్. 461

ఆ. ఒసఁగి యిట్టులనియె నో పావనీ! శిరో,మణిని దీనిఁ దాల్చి గణనకెక్క
రానికష్టములకు నే నోర్చుకొని యున్న, దానరాఘవునకు దీని నిమ్ము. 462

క. ఇది లేకయున్న నేనిం, కదయాశూన్యతనుమించు క్రవ్యాదులలో
బ్రదుకంజాలను రామున, కిదియుఁ విన్నపము చేయుమీ చక్కంగన్. 463

చ. జలనిధిసంభవం బిది విశాలమరీచులమించుచుండు దు
ష్టులు పొనరించుబాధలు కడుంగడు నొంపకయుండ నాత్మశ
క్తుల వెలయించి కాచు మఱిటుత్తు నడంచును దృష్టిఁ బాపు నీ
యిలఁగల రత్నజాలములకెల్లను మేటి యనంగ నొప్పెడున్. 464

చ. శిరమున దీనిఁ దాల్చి రఘుశేఖరు పాదసరోజయుగ్మముఁ
స్థిరముగఁ జిత్తసద్మమునఁ జేర్చి ప్రాణము నిల్ప జాలితిఁ
మరుదధినాథపుత్త్ర! యిఁక మాసయుగంబె యిటఁ వసింప నా
శరవరునాజ్ఞ గాదె వినఁజాలిటి వీవును దాని నంతయున్. 465

చ. జరగినదెల్ల రాఘవునిసన్నిధి విన్నప మీవు చేసి యీ
సురరిపునిఁ వధింపఁ గడుశూరుల వానరయోధులఁ మహా
త్తరబలసంయుతుఁ రిపువిదారణదక్షుని సూర్యపుత్త్రు భూ
వరులను రామలక్ష్మణుల వైళమ తోడ్కొనిరమ్ము లంకకున్. 466

క. పనిసాధింపం బూనిన, ననిలాత్మజ సాగకుండు నదియుంగలదే
మునిజనకరుణాపాత్రుఁడ, వనఘా! నీకడ్డ మెద్దియైనఁ గలుగునే. 467

ఆ. ఇంకఁబొమ్ము నగరి కినకులాభరణుల, రామలక్ష్మణుల నరాతిభయద
విక్రమాఢ్యులను నవక్రజవంబునఁ, దోడితెమ్ము నన్నుఁ జూడ రమ్ము. 468

చ. నినుఁగొనియాడ వాక్కు లపనిం గలవే పవనాత్మజా! హితుం
డన సచివుండనంగ సుసహాయుఁడనంగ మహాప్తబాంధవుం
డనఁ బ్రియమైనదూతయన నన్నియు నీయెడఁ జెల్లుఁ జుమ్ము రా
మునికరుణైకపాత్రుఁడవు పొమ్ము శుభంబగు నీకు నెత్తఱిన్. 469

క. భూతనయ యిట్టులాశీః, పాతంబునఁ దన్ను హర్షపరవశుఁ జేయఁ
వాతసుతుం డతిభక్తిని, సీతాంబకు దోసిలొగ్గి చెందిన వేడ్కన్. 470

చ. నతు లొనరించి రామజననాథుని లక్ష్మణుతోడ వానర
ప్రతతులుగొల్వ సూర్యసుత భల్లుకనాయక వాలిపుత్త్రసం
యుతముగఁ దోడితెత్తును; రిపూత్కరముం బొరిపుత్తు; నీదుక
ష్టతతుల దానవేశప్రియజాయల పాలొనరింతుఁ జూడుమా. 471

క. సెలవిమ్ము పోయివచ్చెదఁ, గలుగవు నీకింక మీఁదఁ గష్టంబులు కోఁ
తులరాక వేచియుండుము, జలజాయతనేత్ర! సంతసమునఁ బనుపుమా 472

ఉ. అంగదముఖ్యకీశనివహాధిపు లెప్పుడు క్షేమవార్త లిం
పుం గలిగింపఁ దెచ్చునొకొ భూధవభక్తుఁడు వాయుపుత్త్రుఁ డం

చుం గనిపెట్టియుందు రటఁ జొక్కపుభక్తిని రామమూర్తికై
యంగదుఁ జిక్కియున్న సుగుణాధికులం గనఁబోవు టొప్పుగా. 473

ఉ. నీకుశలంబుఁ గోరి జననీ! కపులెందఱొ వేచియుందు ర
ట్లే కపినాయకుండు నీకు నెందఱొ ప్రాణములెల్లఁ జేతులం
దే కడు నిల్పి నాకొఱ కదేపనిగాఁ గనిపెట్టియుందు ర
స్తోకముదంబుఁ గూర్పఁ జనఁ గోరుదు వారలచెంత కోసతీ!. 474

క. తెలవాఱుజాము గావున, జలజాక్షీ! రాక్షసవ్రజంబు తిరుగశ
య్యలనుండి లేచుచిహ్నంబులు నిస్వనములను గర్ణములఁ జొరనయ్యెన్.

మ. అరవిందాయతలోచనా! భవదమోఘాశీస్సులం గాంచి ని
ర్భరమోదంబున గోష్పదంబుక్రియ శ్రీరామాంఘ్రిసందర్శనా
దరమెంతో పురికొల్ప సంద్రమును నే దాఁటంగ నేర్తున్ గపీ
శ్వరులన్ రంజిలఁజేయఁజాలుదును బోవన్ నన్ను దీవింపుమా. 476

చ. అని హనుమంతుఁ డెంతయును హర్షముపొంగఁగ మాటలాడఁగా
విని జనకాత్మజాత కడువిస్మయమందుచు నిట్లుపల్కె నో
యనిలకుమార! శర్మములనందుచుఁ బోయి జవంబుమీఱ ర
మ్మని తగునాశిషంబులిడి యల్లన మో మరవంచెఁ జింతచేన్. 477

ఆ. ఆవిధంబుగని మహాత్ముఁడుగావునఁ, దల్లి! వగపుమాని యుల్లమలర
నుండవమ్మ! [illegible] కపులు వార్ధిదాఁటి. 478

చ. కలకలశబ్ద మెప్పుడు [illegible]గానగునో యని వేచియుండుదు మ
వ్వలఁ గననౌను సూర్యసుతు బాహుపరాక్రమ మోసతీమణీ!
విలయము రాక్షసావళికి వేగమ కల్గునటంచు నాత్మలోఁ
దలఁపుము సత్యమిద్ది గుణధాముని రాముని గానఁ బోయెదన్. 479

సీ. అనిపల్కి సెలవంది యాయంబకుం బ్రదక్షిణపూర్వకంబుగాఁ జేసి ప్రణతి
మరలి చూచుచుఁ బోయె; క్ష్మాపుత్త్రి యంతట, నాత్మఁ జింతించె నీయనిలతనయు
వంకఁ జావందగువారు కొందఱుగల, రప్పనిఁ దీర్పక యరుగువాఁడ
ననిపల్కెఁగాదె యీతని కింత గర్వంబు, గలిగింతు నయ్యదె కార్యమెల్లఁ
ఆ. జక్కఁబెట్టు ననుచు సాధ్వి తలంచిన, యంతలో సమీరునాత్మజుండు
వనధిదాఁటు త్వరను వడల యువ్విధి నెంచె, సీతఁ గంటి దనుజనేతఁ గంటి.

చ. అరుగఁదలంచి తల్లి దగునానతిఁ గొంటిని గాని రావణా
సురునకు నాదు రాకయును శూరతయుం గనఁ జేసిపోవు టి
త్తరుణమునం దొనర్పఁదగు దానినొనర్పక పోవుటన్నఁ గా
పురుషుల లక్షణంబె గద పోలునె యూరక నేనుబోవఁగన్. 481

చ. మనమున నిట్లు లెంచి బహుమానము దానఁ బొసంగు నన్న యా
హను మదిఁ జేర్చి యావనమునం దొకచోట వసించి యెంచి యా
దనుజుని జూచి రాఘవుని దర్పము నెల్ల వచించి మించు శ
క్తిని గనఁ జేసి పోవుటయె కీర్తికరంబని నిశ్చయించుచున్. 482

తే. మూఁడుసారులు కార్యంబుఁ బోలుఁ జేయ, ననుచు నెంచుచు నే కార్యమైన దీర్ఘ
కాల మాలోచనలతోడఁ గడపరామి, పెద్దలన్నదియే కదా తద్ద దలఁచి. 483

తే. ఇట్లుపాయంబు నూహింప నీయపాయ
మొదవు నీయపాయమునకుఁ గుదురు నీయు
పాయ మనియిట్టు లూహాలు పన్నుచుండ
నెక్కడికి మంచల? యటంచు నెంచి యతఁడు. 484

మ. వనభంగం బొనరింపఁ బాలకులు దుర్వార ప్రతాపంబుఁ జూ
పను బూనంగలవారు వార లనిలోఁ బాఱంగ దైత్యోత్తముల్
చను దెంతు ర్గద! యిట్లు సంగరమునన్ జంపంగ దైత్యావళిం
గనవచ్చుం దుది రావణాసురుని రక్షఃపాలకున్ దుష్టునిన్. 485

తే. అతని భాగ్యముగని నీతు లాదరమునఁ, దెల్పి నా పౌరుషముఁ జూపి ధీరుఁడీతఁ
డనుచుఁ దెలియంగఁ జేసి నీరనిధి దాఁటి, యరుగువాఁడను; నిర్జరులార యనఁగ.

క. మానసమున నిట్లెంచుచు, దానవులకు నెల్ల స్వీయదర్పముఁ జూపం
గా నెంచి పెంచి దేహము, దానవరాజేంద్రిరాపదం బగు వనమున్. 487

హనుమ వనభంగము చేయుట.

సీ. భూరుహంబులఁ గొన్ని మూలముట్టుగ లాగి, దక్కు వృక్షములపై దగుల వైచి
పెనుఁ గొమ్మలం గొని పెళపెళనాదంబు, గలుగంగఁ జిన్ని వృక్షములఁ గొట్టి
తాళ ప్రముఖములౌ తరువులఁ బెకలించి, వీరుదాలయముల సార మడఁచి
యులపసంతతుల మహోద్ధతిఁ బోఁ గొట్టి, సలిలాశయంబులు గలఁగ వైచి
తే. ఖాండవోద్యానమును మించఁగాఁ గలట్టి, యాదితీంద్రుని యుపవనమందము చెడి
తాఱుమాఱుగఁ గన్పడ దాని గాంచి, దనుజులెల్ల వగం జెందఁగ నె యొనర్చె.

చ. ఒరసికొనంగ నొండొకటి నుక్కుటఁ బుట్టిన నిస్వనంబు భూ
మిరుహసమూహముల్ విఱిగి మేదినిపైఁ బడఁ బుట్టు రావముల్
పరుషతరోరుసంగతిని బల్విడి శాఖలు వ్రాలు చప్పుడుల్
కరము భయం బొసంగుటకుఁ గాఁ బనిపూనె లయంబు చాడ్పునన్. 489

చ. కొలఁకుల వ్రాలు వృక్షములకుం బెగడొందుచుఁ గూయుచుండు ప
క్షులవగు నార్తనాదములు కూళలకైనఁ గృపారసం బెదం
గలుగఁగఁ జేయునన్న నికఁ గ్రమ్మఱఁ జెప్పఁగ నేల యచ్చటం
గల దనుజాళికిన్ గరుణ గల్గఁగఁ జేసె నటన్న వింతయే. 490

చ. తరువులు సారసాకరవితానములం బడువేళ భీతిచేఁ
బరుగిడు పక్షినాదములు పాటెడు దానవరాజ్యలక్ష్మి యీ
పురమును వీడి యంచుఁ గడుఁబూనికఁ దెల్పెదునన్న భావమే
పరఁగనొనర్చె ఖేచరులు పావని మెచ్చుచుఁ జూచుచుండఁగన్. 491

క. ఎక్కడి కేగఁగవలయునొ, దిక్కే తెలియంగరామి దిటవు నదలి తి
ర్యక్కులు తోఁచినగతి నల్, దిక్కులకుం బాఱె బ్రదుకుతెరువు తెలియమిన్.

చ. స్వనమది కర్ణరంధ్రములఁ బర్వినయంతఁ దదీయపాలకుల్
దనుజులు దిక్కుదోఁపమి వితాకున నూరకనిల్చి యంతలో
వనమునఁ జక్కఁ బెంపఁబడు భవ్యతనూరుచివెల్గు నేణము
ఖ్యనిఖిలసాధుజంతువులు గాఢరయంబునఁ బాఱఁ జూచుచున్. 493

క. ఇదియేమి ప్రళయమో కన్నదియే లేదింతదాఁక నమరవరులు దీ
నిదెసం జూడం జాలరు, గద యేమిది కాలమహిమగాక యటంచున్. 494

చ. కలవరపోవుచున్ నిమిషకాలము చూచుచు నుండ నంతలో
"విలయమిదే సురారులకు వీరవరుండగు రాముదూత ని
స్తులబలమొప్పువాఁడ రణశూరుఁడ లంకఁగలంచి సీత కం
జలి ఘటియించి పోయెదను సంద్రము దాఁటి మహాసురుల్ గనన్." 495

సీ. అనుపల్కు లొక్కట వినఁబడఁ గ్రుద్ధులై, పరశుపట్టిసభల్లబాణముఖము
లగు సాధనంబుల నార్చుచు హనుమంతుఁ, దాఁకి రాతండు నోదనుజులార!
హనుమంతుఁడను వాఁడ నల్ల సుగ్రీవుని, బంటను మిముఁ జంపువాఁడ; మీరు
తొలఁగిపోయినఁ జావుకలుగదు లేకున్న, నద్ది తప్ప దటంచు నదరి పలికి
తే. వారలాయుధములఁ గ్రుమ్మఘోరభంగి, నార్చి వాలమునం జుట్టియవనిఁజావ
గొట్టి యమునిగృహంబునకుం బనుపఁగ, హతులుగానట్టి కొంద ఱట్లరిగి వడిగ.

క. నిదురించియుండు రావణుఁ, డదరిపడన్ లేపి మనమహారామము చే
టొదవఁగ నిర్మూలము భీ,తిద వానర మొకఁడు చేయఁ దెగి మార్కొనఁగన్.

క. ఆరామపాలకుల ఘో,రారావము మీఱఁ జంపె నది మర్కటమం
చూరక వదలంగూడదు, శ్రీరామునిదూత ననుచుఁ జెప్పుం గానన్. 498

శా. ఆమాటల్ చెవులంబడంగ లయకాలాదిత్యబింబంబు నా
మోముల్ రక్తిమగాంచ నేత్రనివహంబుల్ వహ్నిగోళంబులే
యీమాడ్కిం గనుపట్టు నంచుఁ గనువారెల్లం దలంపంగ సు
త్రామాదుల్ కలఁగంగ లేచి కపిమాత్రం బిట్లుగాఁ జేయునే. 499

ఉ. ఊరకయుండ రాదు సుర లుద్ధతులై దనుజాళి నేఁచఁగాఁ
గోరుచునుంద్రు వార లిటు కోఁతిని బంపిర యంచుఁదోఁచు దు

ర్వీరభుజాబలంబున నరాతులఁ జెండుచమూపతుల్ జవం
బారఁగఁ బోయి మర్కటము నంతము నొందఁగ జేసి రాఁదగున్. 500

ఆ. అనుచు నాజ్ఞచేయ నట్టులే చనివార, లంత మొంది; రంత నార్తనాద
మొప్పవచ్చి కొంద రప్పని నెఱిఁగించి, రాశరాధిపతికి నంత నతఁడు. 501

వ. అవుడుగఱచి పటపటంబండ్లుగీటుచు లయకాలాంతకుం బోలి దుర్నిరీక్ష్యుండై ప్రళయకాలార్కబింబంబుచాడ్పున భయంకరుండై సర్వలోకనాశనప్రసక్త రుద్రరూపంబువడువున ప్రాణోపద్రవకరుండై యటునిటుచూచుచు వానర మాత్రుండు సేనాపతులం జంపెనేయని తెంపునం బలుకుచు మహాబలులగు రాక్షసవీరసప్తకంబుం బనిచి క్షణమాత్రంబునఁ దన్మరణవార్త రా నదరిపడి పెదవు లదురుచుండ భండనంబులం జండపరాక్రమంబున నాఖండలాదుల బెండువడం జేయు దండిమగని నక్షకుమారుం బనిచి యతని మృతి యతి వేగంబ యాతుధానులమూలంబున నాలకించి యించుక యోజించి యామర్క టుపరాక్రమం బెంచి సాహసించి సేనలంబంపుట పాడిగాదని తలంచి సముచిత శౌర్యంబున రణమర్మంబుల నెఱింగిన వీరవరేణ్యు మందోదరీప్రియనందను బృందారకాధీశపరాభవకారణు వైరిమారణు రావణి రావించి యిట్లనియె. 502

ఇంద్రజిత్తు హనుమ బంధించి తెచ్చుట.

ఉ. వింటివె యక్షకుమార! రణవీర! పరాజితశూరవార! మున్
గంటివె యిట్టి చిత్ర మొకకాలమునన్ సురవర్యులైనఁ గ్రీఁ
గంటను జూడనోడుదురు గాదె మహాశరులుండు లంక నీ
కింటక లేశ మొందు సురకాంతుని పంపున నెట్టొ యిత్తఱిన్. 503

చ. మనపురిఁ జేరి దివ్యతరుమండితమౌ వనరాజ మింతయుఁ
గనుఁగొన రానిచందమునఁ గాఱియ పెట్టి తదీయపాలకుల్
చని యదలింప వారలను జంపె మహాసురయోధసంతతిం
బనుపఁగ రూపుమాపె; సురపాలకభీతిదు నక్షుఁ జంపెఁ దాన్. 504

చ. తరుచరమాత్రుఁడంచు నెదఁ దట్టదు నాకిపు డోకుమార! యా
శరుల వధింప దేవత లెసంగుపరాక్రమ మొప్పువాని భీ
కరుఁ గపిరూపధారి నిటు గాఱియ పట్టఁగఁ బంపిరంచు నే
నరసెద నింకనున్ విడువ నాశరులన్ వధియించు నాతఁడున్. 505

చ. దనుజుల పెంపు నాఁగఁ గడుఁ దాళఁగ లేని సురేంద్రు కార్యమే
యని తలపోయఁగాఁదగు; మహాభుజ! నీవన దేవనాథునో
ర్చిన బలశాలి వౌట నిఁక, జెప్పఁగ నేటికి? విక్రమంబుఁ జూ
పను సమయం బిదే గద యభంగురసంగరవిక్రమక్రమా! 506

క. నాకంటె మించువాఁడవు, నాకేశునిబట్టితెచ్చి । నాకిచ్చిన నీ
కీకరణి ననియొనర్పుమ, యాఁకపినిర్జింపుమ యని । యననేల యిఁకన్. 507

తే. అస్త్రశస్త్రంబులందు నేర్పందియున్న, నీకు యుద్ధంబు సాగింపు । మీకరణిగ
ననుచుఁ దెలుపంగనేల? వయస్సుకొంత, చెల్లినందున నే నీకుఁ । జెప్పువాఁడ.

క. ఆతఁడు సామాన్యుండని, చేతంబునఁ దలఁచి చెంతఁజేరకు మస్త్ర
వ్రాతమును నమ్మియుండకు, దైతేయులు సాయమంచుఁ । దలఁపకు పుత్త్రా!. 509

మ. కపిమాత్రుండని చేరఁబోయి క్రుధచేఁ । గిలించి ప్రేళ్లన్ బరం
తప! నీవాతని నొంపఁ బూనకుము వాతంబున్ వడిన్ మించు కీ
శపతిన్ బట్టుకొనంగఁ బాఱకుము సుస్వాంతుండవై యెట్టులో
యుపమాశక్తిని జూపి పట్టుకొనుమా । యోధావళుల్ తోడ్పడన్. 510

చ. అని మొన నొక్కవేళ మది । కందవు మంత్రము లట్టులౌట శ
స్త్రనికరసంప్రయోగమున । శాత్రవునిన్ గెలువంగనౌ నటం
చనుమతి నిచ్చుచుండురు మహామతు; లాపథమూని వానరుం
గనుఁగొని తద్బలం బరసి । కార్యము పండఁగఁ జేసి రాఁదగున్. 511

చ. అమరులపంపునన్ మనల । నందఱ గెల్వఁగ వచ్చినట్టి చం
దము గననయ్యెడున్ గనుకఁ । దత్కృతకర్మము నీవెఱింగి శ
త్రుమరణసాధనంబు మదిఁదోఁచునొ యప్పటికేది యర్హమం
చమరెఁడుదాన వైరివిజయంబును గైకొనుమా కుమారకా!. 512

ఉ. రావణుఁ డిట్లువానరు సురవ్రజముల్ పురికొల్ప వచ్చిన
ట్లావిధమంతయుం దెలిసినట్లుగఁ బల్కుచుఁ బ్రోత్సహింపఁగా
రావణి తండ్రికూఱట యరాతిజయంబునఁ గల్గునంచుఁ ద
ద్భావ మదే యటంచు బహుభంగుల నెంచి వచించె నివ్విధిన్. 513

ఉ. వానరుఁ బట్టితెచ్చెద ప్రభాయుతశస్త్రనిబద్ధుఁడై మొగిన్
దా నొదుగంగఁజేసి యదితప్పిన నస్త్రములన్ వధించెదన్
గాని కృతార్థతం గనక । క్రమ్మరి రానని యెంచియుండు మో
దానవనాథ! వానరుని । దర్పము నెంచి కలంగు టేటికో. 514

సీ. సురలు తారె రణశూరులుగాకుంట, మున్నె యేర్పడియె నట్లున్నవారు
పంపిన యతఁడు దుర్భరవిక్రమాఢ్యుఁడై, యతిశయిల్లుట చూడనచ్చెరువుగఁ
దోఁపకమాన; దాధూర్తుఁ డెవ్వండైన, మాయాబలంబున । మ్రాన్పడంగ
నొనరించి కట్టి తేనోపుదు సంశయ, మించుకంతయుమాని । యీకుమారుఁ
తే. బనుపు మనినఁ జింత । పాయంగఁ గౌఁగిట, జేర్చి యాశిషముల । సిద్ధిఁ గాంచి
రమ్మటంచు నొసఁగ । రావణి జయమిచ్చు, నరద మెక్కి వెడలె । నని యొనరుప.

శా. ఆరామంబున కేఁగి పాదుపడి నట్లుందందుఁ జూపట్టు వి
స్తారజ్యావృతిసంప్రదృశ్య విటపస్ఫారావనీరుట్తతుల్
ధీరత్వంబుఁ దొలంగఁ జేయ నకటా! తీతెంగదా నేఁటికీ
యారామ స్థిరసంపదల్ గనెడుభాగ్యం బాశరశ్రేణికిన్. 516

కం. అనుచుం దలఁచుచుఁ జచ్చిన, దనుజేంద్రకళేబరములఁ దాఁ గని దుఃఖం
బునమున్గి యోడుగఱచుచు, మనమున నుప్పొంగువ్యథను మాన్పఁగ రామిన్.

కం. అరిమారణకర్మం బిటఁ, దరమా నాకంచు నంతఁ దలఁచి మహాస్త్రో
త్కరమున్ స్మరించి ధైర్య, స్ఫురణంబున స్యందనంబుఁ బోవం బంచెన్. 518

చం. అసురకళేబరంబుల మహాసిముఖాఖిలసాధనంబులన్
దుసికిలిపోవ నెవ్వరుసఁ దోఁపమిఁ జచ్చిన సత్త్వసంతతిన్
వెసవెసఁ బాఱి పైఁబడినవృక్షములం గడుఁబాదజానుహ
స్తసమితి వ్రయ్యలౌటఁ జనఁజాలనిజంతుతతిం గనుంగొనెన్. 519

సీ. కనియిట్టిఘోరమహాకార్యంబు నిర్భీతి, నొనరించువాఁ డెవ్వఁడొక్కొ కీశ [దిరిగి
మాత్రుండు కాఁడని మదికిఁ దోఁచెడు నొక్కఁ, డరుదెంచి యీలంకయందుఁ
వనభంగ మొనరించి దనుజులఁ బెక్కండ్ర, నక్షకుమారుని నని వధించె
ననుట యొక్కటిచాలు ఘనపరాక్రమశాలి,యనుదాని కింక సాక్ష్యంబు వలదు
తే. తండ్రి చెప్పిన భంగిని దప్పకుండ, హెచ్చరికమీఱఁ బోరాడ నిచ్చగింతు
ననుచుఁ బోవంగఁ బావనియును బరిఘము, హస్తమునఁ గ్రాలరావణికగపడుటయు.

ఉ. ఆకపిరూపముం గనినయంతనె రావణి క్రోధమూర్ఛితుం
డై కను లగ్నిగోళములయాకృతి మించఁగ హుంకరించి మున్
పాకవిరోధి నొంచినయభంగురకార్ముక మెత్తి నారి బల్
పోకల దీటుచున్ శరసమూహమునన్ వడి నొంచెఁ బావనిన్. 521

ఉ. శరములు మేనసోఁకుటయు శత్రుపరాక్రమ మింతమాత్ర మం
చరసి ప్రమాదమేఁ గనిన నంతముగల్గును వీనివంక వీఁ
డురుతరశౌర్యశాలి యనుటుగ్రశరంబులె తెల్పుచున్న వా
శరవరుఁ డీతఁడౌ ననుచు స్వాంతము తెల్పెడు నాకు నిత్తఱిన్. 522

చం. అని తలపోసి తండ్రిఁ గొనియాడి తదాయతసాయకాంతరం
బునఁ దిరుగంగ సాగెఁ; గడుఁబూనిక నాతెఱఁ గెల్లఁ గాంచి యీ
తనిజవమప్రతర్క్యముగఁ దద్దయుఁ దోఁచెడు నస్త్రసంపదం
గనఁబడఁ జేసి చూచెద నిఁకన్ దుర మెట్టులు సాగునో కదా! 523

కం. రావణసూనుఁడు తనమదిఁ, బావని నిట్లెంచి క్రోధపరవశుఁడగుచున్
దేవత లనైన నొంచుప్ర, భావముగల యస్త్రముల నభంగముల నొగిన్. 524

ఆ. మంత్రసహితములుగ మానససంశుద్ధి, గలిగి వైచె దాన ఫలము సుంత
యైనఁ గలుగకుండె నవ్వాని హనుమంతుఁ, డలఁతినవ్వు మీఱ దలఁగఁద్రోచె.

సీ. దివ్యాస్త్రజాల మీతెఱఁగున వృథయైన, నాశ్చర్యకోపమ్ము లంతరంగ
మందుఁ బెనఁగొన నాయింద్రజిత్తుఁ, డిఁక నూరకుండిన నితఁడు నన్నుఁ
జంపక మానఁ డసురకుమారుకడ కేనుఁ, బోవం దగియెయుండుఁ గావున నెది
యెట్టులుండినః గాని యిపుడు బ్రహ్మాస్త్రంబుఁ,దప్పఁ దక్కినయస్త్రతతులు వీని

తే. దేహసంస్పర్శమునఁ దూలి స్థిరఁబడియెను, దానవోవ్వాండు వీఁడు సుంతయును గాన
బ్రహ్మ కరుణించి యిచ్చిన వైరిహరణ, దక్షతందగు నస్త్రంబు తగును వైవ.

క. ఆయస్త్రము వృథయగునే, నీయసురుల కంత మిప్పుడే యగు నంచున్
బాయనిపూన్కిఁ దలంపన్, న్యాయంబగుఁ జూతు నవల నని యెట్లానో. 527

వ. అని తలపోసి జ్వాలతిక నయ్యజువస్త్రముఁ గూర్చి వేర్చి వై
చ నదియుఁ బోయి యప్పవనసూను బాలను సంగము శక్తిహీనతం
గనునటు చేసెఁ బావనియుఁ గ్రన్నన భూమిని వ్రాలెఁ జేష్టలె
ల్లను దమయంత దామయి కలంగి యెటో చనినట్టు లత్తఱిన్. 528

ఉ. మారుతియంత నాత్మ బహుమానము మీఱఁగ నప్పితామహున్
జేరిచి నీవరంబుఁ గృపఁ జేయుము బద్ధుఁడ నైతి; నీదుప
త్సారసముల్ తలంతు; నను దాసునిగాఁగ ననుగ్రహింపుమా
యారఘురాము కార్య మిది వ్యర్థముగాక ఫలింపఁ జేయుమా. 529

తే. అనుచు వేఁడిన యంత నాయస్త్రబంధ,ము లొఁగి వీడిన నెఱఁగి యాజలజసూతి
నాత్మఁ గొనియాడి వందనమాచరించి, మఱియుఁ దలపోసె నిట్లని మానసమున.

ఉ. చిక్కినయట్లయుండి నృపశేఖరు కార్యము పండఁజేయఁగా
నెక్కుడు సంతసంబు మది నిప్పుడు కల్గెడు బంధరశ్ము లే
దిక్కునకో చనెంగద! విధిప్రియ కార్య మిదౌటఁ గర్మ మె
ట్లుక్కఱఁ జేయు నన్ను మహిమోజ్వలు రాముని నాశ్రయించుటన్. 531

ఉ. వీనికి బ్రహ్మదేవుఁ డల వృత్రహరున్ విడిపింపఁగోరియే
తాను స్వకీయమై పరఁగి తద్దయుఁ బొల్చెడు నస్త్రమిచ్చె; న
ద్దానినఁ జంపఁ జూచెను పితామహభక్తుఁడ నంచెఱుంగఁ డీ
దానవవీరుఁ డయ్యది వితాకుగనన్ వడిఁ జేసె నన్నిటన్. 532

క. స్మరియించినమాత్రంబునఁ, బరమేష్ఠి యనుగ్రహించె బంధము వెడలన్
బరికింపఁ జాలఁ డీయది, దురితాత్మకుఁడౌటఁ జింతతో నుండు నిఁకన్. 533

క. నను నేమిచేయఁ బూనునొ, గనుఁగొనియెద మించు వేడ్కఁ గాఱింపం బూ
నినచోఁ బొగ రడఁగించెద, ఘనతరముష్టిప్రహారకాండమువలనన్. 534

క. శాంతిప్రయోగమను నది, దాంతుఁడు కాకుంట దెలియఁదగఁడనియును దా
నింతకు మును పెఱుఁగండని, స్వాంతము తెల్పెడిని వీఁ డశాంతుండగుటన్.

మ. ననుదండింపఁగఁ బూను నెట్లయిన నీనాకార్య మా రావణుం
గనుచే యిప్పటిదాట నోర్చుకొని యాక్రవ్యాదసంఘాధిపుం
గని భాషించి వినీతులం దెలిపి దోర్గర్వంబు రూపించి రా
మునిసామర్థ్యముఁ దెల్పి నాదగుబలంబుం జూపి పోవందగున్. 536

మ. ఇపుడే సాగరముం దరింప జతనంబేఁ జేసినన్ సాగు నీ
రిపు వేమాత్రము నన్ను మార్కొనమి నిర్భీతిక్రియారూపబు
ద్ధిపరాక్రాంతిగొ తెల్పుచున్నది; మదాంధీభూతులన్ దైత్యులన్
గృపలేనట్టిమృగంబులం గలఁచియే యేఁబోవుటే న్యాయమౌ. 537

ఉ. ఘాతుకులైన యీదనుజకాంతుల కాత్మపరాక్రమంబు భూ
జాతకుఁ గల్గుశీలము ప్రశస్తకపీశ్వరపౌరుషంబు వి
ఖ్యాతరఘూత్తమప్రకటకార్యపరత్వమహత్త్వముల్ ధరి
త్రీతలమందుఁ దెల్లమగుతీరునఁ జేయుట న్యాయ్య మిత్తఱిన్. 538

ఉ. మారణతంత్ర మిద్ది రఘుమండనదివ్యపదాబ్జభక్తి చే
కూరుట స్తంభనక్రియనుగూడ నొనర్పఁగఁజాలదయ్యె; న
బ్జాతభవున్ స్మరించితిని బ్రాగ్వర మిట్టులుగాదె; దీన ని
ర్భీతిఁ జెలంగునన్నుఁ గని వీఁడొనరించు నదేమొ చూచెదన్. 539

ఆ. మారణప్రయోగ మీరీతి వ్యర్థమై, చనుట యేలయను విచారమూని
శత్రువున్న యట్టిజాడ నాకుందోఁచు, చున్న దిపుడు చూచుచుందు నింక.

చ. అనిపవమానసూనుఁడు నిజాత్మఁ దలంచుచు నుండునంత నా
దనుజపతిప్రియాత్మజుఁడు తా వెతఁగుందుచు నక్కటా! కపిం
బనుచు యమాలయంబునకు బల్విడి నంచుఁ దలంచి వైవ నీ
వనజజునస్త్ర మూరకయె బద్ధునిఁ జేసె నిదేమి మాయయో?. 541

చ. ప్రతిహత మింత లేనిదగు బ్రాహ్మమటంచుఁ దలంచియుంటి నా
మతిఁగల నమ్మకంబిడి సమస్తవిధంబుల భగ్నమయ్యెఁ గీ
శతనువుఁ దాల్చి యున్న సురసత్తముఁ డీతఁ డటంచుఁ దోఁచెడున్
హితమగు కార్య మేదియని యెంచినఁ దోఁపక యున్న దక్కటా!. 542

తే. షట్ప్రయోగంబులందు నస్త్రముల కొక్క, మారణ మెవర్యమై తగు మానులందు
రిట్టి బ్రహ్మాస్త్రమే మృతియిపుడు గూర్పఁ, జాలదనఁగ నస్త్రాంతరమేల వైవ?.

క. కాలము పరాఙ్ముఖంబై, చాలఁగ దుష్ఫలము లిచ్చు సమ్యగ్దృష్టిం
గ్రాలిన సత్ఫలము లిడం, జాలును దద్గతుల నెఱుఁగఁజాలర దెవరున్. 544

క. అని తలపోయుచు దీనా, ననుఁడై యుండంగఁ బవననందనుఁ డస్త్రం
బునఁ బడియెనంచు నెంచుచు, దనుజులు పెక్కండ్రు రజ్జుతతులం గొనుచున్.

సీ. పావని నొక్కట బంధించి తిట్టుచుఁ, గొట్టుచునుండంగఁ గోపఘూర్ణి
తాత్ముఁడయ్యును సమయంబు గాదని సహిఁ, చియె యుండె శతమఖజిత్తపుడెద
వారిప్రయత్నము వారింపఁబూనక, దానవేయాయస్త్రతల్లజంబు
శక్తిహీనంబైన చందంబుఁగాంచుట, తెలిసి చింతించుచు నిలిచియుండె
తే. నంత దానవులాహనుమంతుఁ గొనుచు, రావణాంతికమున కేగ రావణియును
దండ్రి కడఁ జేరి మ్రొక్కి శాత్రవునిబట్టు, కొనిన తెఱఁగెల్ల వినిపింపఁ గొడుకుఁగాంచి

చ. కరములుచాఁపి గ్రుచ్చి తమకంబున బిగ్గనఁ గౌఁగిలించుచున్
శిరమును మూరుకొంచు ఫలసిద్ధినిగాంచఁ బొనర్చితీవు ని
ర్జరవరగర్వసంహరణశక్తియుతుండవనంగ నీవె యం
చరయఁగ నయ్యె నేఁడు సురలందఱు భీతిలు నట్టిపుత్త్రకా! 547

చ. అని కొనియాడి మించెడునహంకృతి మంత్రినిఁజూచి వీనివా
ర్తను గనుఁగొమ్ము నావుడుఁ బ్రధానుఁడుగాఁదగు మంత్రియన్న ఖ్యా
తినిగను నాప్రహస్తుఁడు మతిప్రభ మించుమరుత్తనూభవుం
గని యిట వచ్చి తెవ్వఁడవు కార్య మదెయ్యది చక్కఁ జెప్పుమా. 548

చ. పురమును జొచ్చుటే లసురపుంగవు గాదిలితోఁట మించుక
ర్బురపతిమించువేడ్క సుఖముం గనుదోఁటను బాడుసేయ నె
వ్వరు నినుఁబంపి రేర్పడఁగఁ బల్కుము ప్రాణము లుండఁ గోరినన్
హరితనుధారణంబునకు నో కత మెయ్యది దెలుంగఁ జెప్పుమా. 549

హనుమ రావణునకు హితముఁ దెల్పుట.

చ. అనుటయు నాంజనేయుఁడు స్మితాంకుర మోష్ఠమునందుఁ నర్తనం
బును సలుపంగ నిట్లనియె భూతభయంకరరీతిఁ బొల్చునా
దనుజవిభుం గనుంగొనుచు దానవనాయక! నావచించు వా
ర్తను విను మవ్వలన్ మతిహితంబగుచొప్పున సంచరించుమా. 550

సీ. మరుదీశవరమున మానినీమణియగు, నంజనాదేవికి నాత్మజుండ
నైతిఁ గేసరియనునాతఁడు నాతండ్రి, కపివంశభవుఁడ నే కాని కృత్రి
మాకారమును గొన నంచుఁదలంపుము, రఘురాముదూత సూర్యసుతుఁడైన
సుగ్రీవుబంటను సువ్రత సీతను, వెదకంగ వచ్చితి విమలదుఃఖ
ఆ. సాగరమున మున్గుజానకి దర్శించి, వచ్చినట్టి వార్త నిచ్చిపోదలఁ
దెలిపినాఁడ నంచుఁ దెలియుము నీకింక, హితముఁ బల్కువాఁడ నించుకంత.

మ. వినవే మున్ను భుజాంతరంబున నినున్ వ్రేలాడఁగాఁజేసి పా
వనసింధూదకపూరమందు విధిమంతంబైన స్నానంబు చే

సి నిజస్థానముఁ జేరి క్రిందఁబడ వైచెం గాదె ని న్నట్టికీ
శనికాయాధిపుఁడైన వాలి యె భవత్స్వాంతంబునం దెప్పుడున్. 552

మ. స్మరియింపంబడుచుండు నంచుఁ దలఁతున్ క్ష్మామండలంబందు నె
వ్వరుసన్ వాలికి నీడుగాఁదగిన యవ్వాఁడొక్కఁడే లేఁడు నీ
వరయంగాఁ దగువాఁడ; వీవిషయమం దావాలికిం దమ్ముఁడే
హరిదశ్వప్రియపుత్త్రుఁ డంచుఁ దలపోయంగాఁదగున్ నీమదిన్. 553

ఉ. ఆతనిసన్నిధానమునయందు వసించుచు మంత్రియన్నవి
ఖ్యాతిని గాంచినాఁడ ; నృపకాంతుఁడు రాఘవుఁ డేగుదెంచి ని
న్నాతఁడె నాల్గుసంద్రములయం దోగి ముంచినశౌర్యశాలిఁ బ్ర
ఖ్యాతశచీపదత్తకనకాంచితమాలి స్వధర్మరక్షకై 554

ఉ. భానుసుతార్తిఁబాప నొకబాణమునన్ వధియించి పౌరుష
శ్రీ నెలకొల్పి మిత్రసుతుఁ శీఘ్రమ వానరరాజుచేసి వే
జానకిజాడలం దెలియఁజాలిన శూరకపీంద్రులన్ గిరుల్
కానలు నింకనుం గలుగుస్థలులన్ వెదకంగఁ బంపినన్. 555

ఉ. వారలలో ననుత్తముఁడ వానరనాథునియాజ్ఞఁ బూని యా
శ్రీరఘునాథుదూత నయి సింధువుదాఁటి పురంబుఁ జేరి యా
ధారణి కన్నకూఁతుఁ గని దర్పముచూపి నినుంగనంగ వాం
ఛారతియొప్పఁటన్ వనము సర్వము నాశ మొనర్చితిం జుమీ. 556

చ. ననుఁ దలపడ్డదానవుల నాశ మొనర్చితి నీకుమారుఁ డా
వనరుహసూతియస్త్రమును వైవఁగఁ జిక్కితిఁ గాని దానిబా
ధను గనువాఁడఁగా నయిన దానికి లోఁబడి నిన్నుఁ జూడ నీ
దనుజులుగట్ట నోర్చితిని దానవనాయక! నమ్ము మీనుడుల్. 557

క. ఏయస్త్రంబులు నాదౌ, కాయము బాధింపలేవు కాని యజునిదౌ
నాయస్త్ర మొకఁడు క్షణమే, కాయము బంధింపఁగల్గుఁ గ్రవ్యాదేశా!. 558

చ. వరములు గల్గునాకు విధిబాణముగూడ శరీరభాగమే
వరుసను నొంపఁజాల దదిభక్తి స్మరించినయంత నంచు నే
నరసియు నిన్నుఁ జూచుటకు నర్కతనూజునియాశయంబు రా
ద్వరునియభీష్టముం దెలుపవచ్చితి నంచు నెఱుంగుమో ప్రభూ!. 559

క. నీసేనలు తదధీశులు, నీసుతుఁ డింకేల కొఱఁత నీవుంగూడన్
నాసరణిఁ బట్టఁజాలరు, గాసిల్లంగూడఁ జేయఁగ నశక్తు లెటుల్. 560

క. వినను నీవిభవంబును, గానందగునంచు నెంచి క్రవ్యాదులకున్
లోనైతిఁ గాని లేదే, నీనిర్జరరిపులఁ జంపియే యుండుఁగదా!. 561

క. ఆవిషయ మిప్పుడేలా, శ్రీవిభుఁ డారామచంద్రుఁ జేరి రవిసుతుం
డేవిధమున విఖ్యాతిని, భూవిభుతం గాంచెనో విశభూ!యరయు మెదన్. 562

సీ. నామాటలోకకొన్నిన్యాయ్యంబులనియెంచి, యాలకింపుము దానవనగుముదంబు
ప్రజలురంజిలునట్లు పాలించుటం జేసి, రా జను పేరు సార్థకముసుమ్ము
వేదశాస్త్రపురాణవిద్వర్యుఁడవు పరా,క్రమశాలి వీవు నిర్జరభయదుఁడ
విట్టి నీవే పాపమే యొనరించిన, నెల్లరు దానినే యెల్లకడల
తే. ననుసరింతురు; శంకరునాశ్రయించి, బ్రహ్మసేవించి వరములఁ బడయఁగల్గి
తివికదా! యిట్టి నీవె రాఘవునిసాధ్విఁ, దెచ్చు టనునది యచ్చెరువిచ్చునదియె

ఉ. దానవనాథ! రాముఁడనఁ దామసపాతుఁడు ధర్మరక్షకై
పూనె మనుష్యరూపమును భూతశరణ్యుని దేవదేవునిం
గా నెఱనమ్ముటొప్పు నదిగాదని మానవమాత్రుఁ గాఁగ నీ
మానసమందు నెంచి యవమానముగల్గ నొనర్పఁ బాడియే. 564

ఉ. రావణ! రాముపత్నియనఁ బ్రాకృతనారిగ నెన్నఁ జెల్లునే
వేవిధులం దలంచినను విశ్వములన్ సృజియింపఁ బెంప దు
ర్భావముగల్గువార లభివర్ధనముం గననెంచి ద్రుంపఁగాఁ
దావలమా మహాప్రకృతి తా నగు నంచుఁ దలంపు మాత్మలోన్. 565

ఉ. రాముఁడనంగ నాప్రకృతిరక్షకుఁడై తగు బ్రహ్మమంచు నే
మేమితలంచునో ప్రకృతి యెట్టు లొనర్పఁగ నట్లెచేయఁగాఁ
దా మహిఁ బుట్టె నంచుఁ బరతత్త్వము దానగుటం దలంచినం
గామము లెల్లఁ బండునటుగా నొనరింప సమర్థుఁ డౌఁజుమీ!. 566

ఉ. ఐన నిరంజనుండగుట నాత్మఁదలంపులె లేక సాక్షిగాఁ
దాను జెలంగుచుం బ్రకృతి తన్నెటు త్రిప్పిన నట్లెయుండఁగాఁ
బూనుచు నిర్వికారుఁడయి పొల్చుచు నుండును; నీ వనంగ దు
ర్మానివిగానఁ దత్త్వ మణుమాత్ర మెఱుంగవుసుమ్ము రావణా! 567

చ. జనకజఁ దెచ్చుటన్న గురుసత్త్వుఁడు వీఁడని ఖ్యాతిగల్గునం
చనుదిన మెంతువేమొ విను మయ్యది యజ్ఞతయే యటంచు లో
కనిచయమందుఁ దేటపడుఁగా యనినమ్ముము; వేదరాసులే
గనుఁగొనఁజాల వాప్రకృతికార్యము లన్న నీఁకేల సీవనన్?. 568

క. మదికిం దెలియఁగనీయక, యెదియేఁజేయంగఁబూను నెట్టివొ యట్లే
గద ప్రకృతి కెఱుఁగరానివి,ధిఁ దగన్ వర్తించుట యన దృష్టదనుజపా!.

చ. మనసు హరింప శక్య మణుమాత్ర మదెవ్విధిఁగాదొ యట్టులే
జనకభవన్ హరింపఁగను జాలవు తత్పదపద్మభక్తులై

వనజభవాచ్యుతేశ్వరులు వాసవముఖ్యులు లోకపాలురై
రనవినవాక్కొ? నీవు పరమాణువవే యనవచ్చు దానవా!. 570

శా. సీతారాములపాదపద్మములనే సేవించి యజ్ఞాన మన్
వాతవ్రాతగతిం జరింప మదిలో వాంఛింప కింకైన నీ
చేతస్సున్ బిగఁబట్టి తచ్చరణరాజీవంబులన్ ధ్యానవి
ఖ్యాతస్ఫీతపథంబునం గొలువఁగా యత్నింపు మేలొందెడున్. 571

శా. నీవేమాత్రము పూన్కి మానక మదాంధీభూతచిత్తుండవై
రావే నాహితమున్ గ్రహింపఁగ నృపేంద్రస్ఫారకోదండనా
గావిర్భూతనిశాతసాయకచలద్ధాలాహలజ్వాలమా
లావిద్ధాంగుఁడవై నశించెదవు క్రవ్యాదాధమా! రావణా!. 572

ఉ. శ్రీరఘురాముఁడెల్ల కపిశేఖరు లాదృతి నాలకింప గం
భీరతరోక్తులన్ దనుజవీరుని నే ననిఁ జంపువాఁడ వాఁ
డో రఘురామ! కావు మనకుండిన నంచుఁ బ్రతిజ్ఞ చేసె నా
సారవచస్సులన్ వినుటఁ జంపఁదలంపను నిన్ను దానవా!. 573

చ సతులను మేలుబంతియనఁ జాలినసీతఁ దృణాలయంబునం
దతిశయకీలముల్ వెలయునగ్ని ని జొన్పినయ ట్లెఱుంగ కు
ద్ధతి మెయిఁ బట్టియున్న వనితాతతి నొక్కటెగాఁ దలంచి దు
ష్కృత మటుసంగ్రహించితివి చెప్పెడి దేమిఁక నీదుదుర్గతిన్. 574

చ. పరవనితాపహార మతిపాపము దానినిమించఁజాలు న
ద్దరయఁగఁ గానరాదు దురితాత్మక! నిన్గన దోష మబ్బు నీ
దురితములెల్లఁ బాపుకొనఁ దోయజమిత్రకులాబ్ధిచంద్రు భూ
వరసురరాజుఁ జేరి గురుభక్తి భజింపుము మేలుగల్గెడున్. 575

క. నీమేలుఁగోరి చెప్పిన, నామాటల నాలకించి న్యాయపథమునన్
నీమది వర్తిలఁ జేయుము, భూమిన్ బ్రదుకంగ వచ్చుఁబో దితిజేంద్రా!. 576

క. వలయునని యెల్లవారికి, విలయము చేకుఱఁగఁ బట్టు వీడకయుండం
దలఁపకుము నాదుహితమున్, దొలుతన్ గ్రహియింపుమవలఁదోఁచుశుభంబుల్.

చ. కొలఁదిదినంబులందె వగఁగూరఁగ వానరసేన లెల్లెడం
దలఁపడ వీరదానవవితానము లార్తినిఁగూలుచుండ నీ
తలలు హరింప రాఘవునిదారుణబాణము లేగుదెంచు నా
పలుకుల నాలకించి సుతబంధుజనాదులఁ గోలుపోకుమీ 578

చ. మరణము దాపరింప హితమండల మెంతయు న్యాయయుక్తి నా
దరమునఁ జెప్పినన్ శ్రుతులదాపును జేరఁగనీయకుండు టె

వ్వారికి స్వభావమే యయినఁ బల్కితి సత్పథ మిద్దియంచు నా
శరవర! యింక నెవ్విధిని స్వాంతమునం దలపోయఁ జూతువో. 579

చ. కపియొకఁ డేగుదెంచె నొడికంబునఁ జంపఁగవచ్చు నంచు న
స్త్రపవర! యెంచఁబోకు సుగ్రీరాజు బలంబులతోడ నీకు సా
యపడఁగ వచ్చినన్ జెలఁగి యాహవరంగమునన్ వధింతు న
స్త్రపటల మెద్దియేఁ జెనకఁజాలదు నన్ను వరాళి పెంపునన్. 580

తే. చెప్పఁదగినన్ని మాటలు చెప్పినాఁడఁ, జేయఁదగు కార్యములనెల్లఁ జేసినాఁడ
నీబలంబుల నధిపులనే బవరము, నందుఁ గాంచితి భయమింతయైన లేదు. 581

చ. విను మొకమాటఁ జెప్పెదను వీరునిగా నిను నెంచుకొంచు దు
ర్మనమున మేలుగాన కణుమాత్రము పెద్దలఁ గొల్వనట్టి యో
దనుజవిభూ! క్షణార్ధమున దానవసంఘముఁ దోఁకఁజుట్టి యీ
వననిధిఁ బాఱవైవఁ గలవాఁడను; నాకు భయం బిఁకేటికిన్. 582

క. అంతఃకరణమునఁగల యు,దంతం బెల్లన్ వచింపఁ దగునని న్యాయా
క్రాంతమనస్కులు చక్క వ,చింతురు తత్పద్ధతిఁగొని చెప్పితి నీకున్. 583

క. కామెల యను రోగము కనుఁ, బ్రామిన నొకరీతి నుండువస్తువు భిన్నం
బౌమాడ్కిఁ గాంచునటు నా, వౌమాటలు నీకు వెగటులై తోఁచినచోన్.

చ. దెసలను మండఁజేయుచు తీవ్రతన్ వడఁకించుచు నాకసంబు సా
ధ్వసమున బ్రద్దలై చెడువిధం బొనరించుచు రామమూర్తి తీ
వ్రసకలమార్గణాస్త్రము లరాతిశిరంబు లనంగ నేడ యం
చు సమరభూమినిన్ వెదకఁజూచెదు నీవె వితాకునం గటా!. 585

ఉ. నీతనయుం డితం డెఱుఁగు నిర్భరమామకపౌరుషంబు నీ
చేతమె హెచ్చరించు నిదె సీత భవన్మృతిహేతు వంచు నా
చేత వధింపఁగాఁబడినసేన లుదాహరణంబు; నాదుదో
స్స్ఫీతభుజాబలంబునకుఁ జెప్పఁగ నేటికి నింక వేలుగన్. 586

మ. ఇది యాత్మస్తుతిగాఁ దలంపకుము దేవేంద్రాదులేసాటు; లి
య్యదియిట్లే యని తెల్ప నీకు వరదుండౌ బ్రహ్మఁ బ్రశ్నించినన్
మదిదాఁకన్ వచియించు నింకనయినన్ దోషాచరేంద్రా! వినం
గఁదగున్ నానుడి యవ్వలం దలఁచినం గాఁబోదు మే లెద్దియున్. 587

చ. అని మరియాద యించుకయు నాత్మఁదలంపక శ్రీరఘూత్తమున్
జనకజనుం దలంచి నిజసత్త్వమునం గల నమ్మకంబునన్
దనుజులకూట మిద్దియని తాఁ దలపోయక మేలుగోరి చె
ప్పిన హనుమంతు వాక్కులను వించు రుడుగ్రదవానలాకృతిన్. 588

మహాస్రగ్ధర.
కనులెల్లం జేవుఱింపం గ్రకచదశనసంఘాత నిష్పేషణోద్య
ద్ఘనరావం బభ్రునాదక్రమమున వెడలంగా శ్రుతుల్ నిక్కఁజూపన్
గనదుద్యద్దీర్ఘబాహాహూత్కారము ధనువులం గైకొనం బూనిక్కఁ బూనన్
హనుమత్తీక్ష్ణోక్తిజాలం బతిశయముగఁ గోపాగ్ని మండంగఁ జేయన్. 589

తే. పెదవు లదరంగఁ గొలువెల్ల నుదిలఁగొనఁగఁ
బ్రళయతపనాత్మజుఁడు వీఁడె నచ్చె నిచటి
కేమి కారణమునన్నొ యంతచెల్ల దనుజు
లట్టె వడఁకంగ రావణుఁ డనియె నిట్లు. 590

చ. వనచరమాత్రుఁడంచు గురుబాహుబలంబును జూపరా దటం
చు నడుగు మీతఁ డిప్పురిని జొచ్చుటయేలని యాజ్ఞచేయ మం
త్రినికరనాయకుం డడుగఁ దెంపున నేమియు కూసె వీఁడు నిం
క నితనిఁ జంపఁగా వలయుఁగాని కృపన్ వదలంగరా దిలన్. 591

క. అనిహుంకరించిమంత్రిని, గని వీనింజంపఁ బంపఁగాఁదగు భటులన్
దనుజుల దూషించెడు వీ,నిని భూమిని సంచరింప నిలుప నఘంబౌ. 592

చ. త్వరగ వధింపుఁడీ యని నితాంతము క్రోధవిఘూర్ణచిత్తుఁడై
హరిగతి హుంకరించు దనుజాధిపతిం గని శాంతరూపతం
బరఁగు విభీషణుం డపుడు పావనివాక్ప్రచయంబు వీనులం
జొరఁబడ సంతసించి వినుచున్ గడు మెచ్చుచు నుంట నత్తఱిన్. 593

విభీషణుఁడు రావణునకు నీతిఁదెల్పుట

ఉ. దూతను జంపుమన్ననుడి తోడనె చింతనెసంగఁ జేయఁగా
నాతఁడె లేచి న్యాయపథ మన్నకుఁదెల్పఁ దలంచి భక్తిచేఁ
జేతులుమోడ్చి యిట్లనియె; శ్రీయుత! కీర్తిధురంధరా! సుర
వ్రాతశిరోధృతార్చితవిభాసురపాదసరోరుహద్వయా!. 594

ఉ. ఏలినవారిపాదముల నెల్లపు డేను వసించుచుండుటం
జాల నయాగమంబున విచారము చేయుతలంపు గల్గుటం
గ్రోలితి న్యాయరూపసుధఁ గొందఱు జ్ఞానులు తెల్ప వాని నీ
యోలగమందుఁ దెల్పఁదగునూహ జనించెను విన్నవించెదన్. 595

క. వానరుఁ డీతఁడు దూతగ, దానవనాథా! తలంపఁ దగియుండుఁగదా
తానుగఁ జెప్పిన దొక్కటి,యే నుండదుగాదె కాన నితఁ డెట్టితఱిన్. 596

సీ. అపరాధ మొనరించినట్టు లూహింపఁగఁ, దగదని పెక్కుశాస్త్రములు తెల్పు
దూత లవధ్యు లందురు న్యాయవేత్తలు, నరపతులెల్ల రాన్యాయము గొని

వర్తించుచుండు రావరుస యనాదియౌ, నద్దానిఁ బాటించు టర్హ మనుచుఁ
జెప్పఁగా నేల మీ రొప్పియే వర్తించితిరి గాదె యిందాఁక దీని మఱచి

తే. దూతను వధింపు మని ప్రహస్తునకు నాజ్ఞ
యిడితి; రీయది యెట్లని యేను సంశ
యించుచున్నాఁడ; రాద్ధర్మసంచయములు
మార్పరాకుండు ననుచు ధర్మవిదు లండ్రు. 597

చ నరపతి ధర్మమార్గము ననారతమున్ భగవత్స్వరూపతన్
బరమముదంబునన్ మది నభంగురభక్తి భజింప నొఁగదా
సురరిపునాథ! నీ దయిన చొప్పు ప్రమాణముగా గ్రహించి యు
ర్వరఁ దగు నాయకుల్ సతము వర్తిలఁగాఁ దగియుండఁగాఁ దగున్. 598

ఆ. అట్టి నీవె యిప్పు డాధర్మమార్గంబు, వదలి యిచ్చకొలఁది వర్తనంబు
జరప ధర్మహాని ధరణి నొఁగద; దాని, మదిని దలఁపు మింత మాత్రమేని.

క. క్షితిపతులు చెప్పుమా యని, జతనము మీఱంగఁ బంపఁ జనుదురు దూతల్
మతివిభవము వారికి లే, దితరోక్తుల నట్లె తెల్పుటే విధియగుటన్. 600

క. దూతయెడ దోష ముండిన, భూతలపతి మీఁదఁ జూపఁ బోలుఁ గ్రుధను వి
ఖ్యాతపరాక్రమమును దద్రీతిగ నూహింప నితఁ డరిప్రహితుండౌ. 601

ఆ. కాన వైరియందుఁ గాన్పింపఁ జేయఁగా, వచ్చు శక్తినెల్ల నిచ్చకొలఁది
దూతయైన యట్టి యీతనిపై దాని, జూపఁ బూనరా దసురశరణ్య. 602

ఉ. వీరుఁడ వీవు నిర్జరుల భీతులఁ జేసిన సాహసుండ వీ
శ్రీరఘురాముదూతఁ గపిశేఖరుఁ జంప ననుజ్ఞ సేయఁగా
నారయ న్యాయదృష్టి యిసుమంతయు లేదని తోఁపవచ్చు ధా
త్రీరమణాళికిన్ మరల దీనిని జిత్తమునం దలంపనౌ. 603

చ. అనివినయంబు భక్తియును న్యాయసమార్జనదృష్టియుం గడుం
గనఁబడఁజేయఁ బల్కు గుణగణ్యు విభీషణుఁ గాంచి రావణుం
డనియె; సహోదరా! సుజనుఁడై తగు దూత వధింపరా దటం
చును వినినాఁడ; శాస్త్రముల చొప్పదియే యని విశ్వసించెదన్. 604

ఉ. కాని యితండు నన్నుఁ దృణకల్పునిగాఁ గొని పల్కె నట్టి యీ
వానరు పల్కులన్ వినఁగ వచ్చునె దూతయె యంచు నమ్మఁగా
రాని దురుక్తులన్ వినియు రాముని దూత యటంచు నూరకే
మానము దూలఁ బొమ్మనుట మంచిదియే మది సుంత యెన్నుమా. 605

ఉ. దూతయె యైన నివ్విధిని దోఁచినరీతి వచించునే నిజ
ఖ్యాతి బయల్పడంగఁ దమకంబున "నిన్ను వధింపఁ జాలుదున్

స్ఫీతభుజాబలంబునఁ బ్రసిద్ధరఘూత్తమశాసనంబునన్
భీతుఁడనై క్షమించితిని బెంపఱఁ జేయక" యంచుఁ బల్కెనే. 606

ఉ. కావున దూతగాఁ డితఁ డఖండభుజాబలగర్వ మొప్ప న
న్నేవిధినైన దూఱుటకె యీపురిఁ జేరె నటంచు నెన్ని యే
యీవధరూపదండనమె యీతనికిం దగుపాచితంబుగా
నే విధిమీఱఁ జేసితి నహీనమతీ! తలపోయు మెంతయున్. 607

చ. అని యిసుమంత శాంతము నయంబును గన్పడఁబల్కు రావణుం
గనుఁగొని యవ్విభీషణుఁడు కార్యము జేయువిధంబు న్యాయదృ
ష్టిని గని యిట్లుపల్కె సురసేవితపాదసరోజపీఠ! దూ
తను వధియింపరా దనెడుధర్మ మనుత్తమ మెల్లభంగులన్. 608

ఉ. ఈకపియందు దోష మొకయించుక నిష్ఠురవాక్యరూపతన్
వాకొన నా నదొక్కటియె వచ్చినదూతకు శిక్షచేయఁగా
నూఁకొను ధర్మశాస్త్ర మననొప్పును దానవనాథ! దానిచేఁ
గాక మఱొక్కమార్గమునఁ గానఁగరాదు విధింప శిక్షయున్. 609

సీ. దూతకుఁ జేయుశిక్షాతతు లెన్నియో, గలవందు నంగ; వైకల్య మొకఁడు
తాడనరూపమౌ దండన మొక్కఁడు, మఱియును గల విట్టిమార్గములను
గాని వధించుట గానరా దెందును, ధర్మస్వరూపతఁ దనరు మీరె
తగినశిక్ష యొనర్పఁదగు నని ప్రార్థింతు, దాన ధర్మము గావఁబూను నల్లె
ఆ. యగు నటంచుఁ దెలుప నసుజునిమాటల, కలుక తొలఁగ వానరులకు వాల
మందుఁ బ్రీతిమెండు హర్షద మదియొగా, కాన దాని నిప్పు గాల్పఁ దగును.

క. అని యాజ్ఞాపించిన నా, దనుజులు సచివాజ్ఞయుఁ గొని తత్కపి బలిమిం
గొనిచని వాలమునకుఁ దోఁచినరీతిని వస్త్రములను జెందినకినుకన్. 611

తే. గట్టిగాఁ జుట్టి తైలసంకలితముగ నొనర్చి ముట్టింప దహనుఁడు నైజశక్తిఁ
జూప నెంచెడువాఁడౌటఁ జూపఱులకు, నద్భుతం బావహిల్లఁ జేయఁగఁదలఁచి.

క. కడువడి మండుచుఁ బ్రక్కల,నడరుచు జ్వాలావళుల మహాత్తరభీతిన్
గడలుకొనం జేయుచు నల్లడలన్ వ్యాపించెఁ జూడఁగాఁ దగనట్టుల్. 613

ఉ. ఆపురిఁ గల్గుదానవులయారె వనంబును బాడొనర్చె నీ
పాపపుఁగోఁతి యర్హమగు పాచితముం గనుచున్నవాఁ డిదే
దీపితకీలముల్ వెలయఁ దృప్తిగ హవ్యవహుండు తాండవం
బోపికఁ జేయువాఁ డిదిగొ యొయ్యనఁ జూడుఁ డటంచుఁ బల్కుచున్. 614

తే. ఒకరికొక్కరు చూపుచు హుతవహుండు
మండుచుండఁగఁ గాంచి ప్రమదముఁ గనుచు

బాహువుల నప్పళించుచు వానరేంద్ర!
తగినశాస్తి యిదే గద పొగ రడఁగెనె 615

వ. అని మఱియు ననేకప్రకారముల నుపాలంభించుచుండ నాహవ్యవాహనుం డపారమోదంబు గనంబడఁజేయువడువున నలుదెసలకు నింగికి నెగఁబ్రాఁకుచు, భావిభోజనసంతృప్తి నెఱింగించుచాడ్పున హేతిజిహ్వలఁ జాఁపుచు, గృహకబళంబులన్ మ్రింగుచందంబునఁ దిర్యగూర్ధ్వార్చిఃప్రసారంబు గనఁబఱచుచు, దానవప్రాసాదహర్మ్యసౌధగృహంబుల భస్మంబుచేయునూహాలం దెలుపుకరణి మిణుఁగుఱుల రాల్చుచు స్త్రీబాలవృద్ధంబుగా నిప్పురి నిట్లు హాహాకారంబు లెసంగఁగలవని యెఱింగించుతెఱంగున మహాభయంకరశబ్దం బుద్భవిల్లఁ జేయుచుఁ గవాటద్వారగోపురస్తంభాదికంబు లీరీతిం బ్రజ్వరిల్లునని తేటపడం జేయు తీరునఁ బటపటాదిధ్వనుల నుద్భవిల్లంజేయుచు లేచుచు వ్రాలుచుఁ బలుదెసలకు నిగుడుచుఁ ద్రుళ్లుచు ననేకమార్గంబులఁ దనయుల్లాసంబు నెల్లర యుల్లంబులకుఁ దెల్లంబు చేయుచుండు నంత. 616

చ. దనుజనితంబినుల్ చని ముదం బిసుమంత మనంబునందుఁ దోఁ
చినయటు గూరుచున్న నృపశేఖరుపత్నిని సీతఁ గాంచి నిన్
గనుఁగొని మాటలాడి చని గర్వమునన్ వనరాజభంగముం
బొనరిచినట్టి వానరుని పొం గడగించిరి సుమ్ము దానవుల్. 617

ఉ. తోఁకను వస్త్రబద్ధముగఁ దోరపుఁబూనికఁ జేసి యగ్నినిం
బ్రాఁకఁగఁ జేసి రెమనఁగవచ్చు; నిఁకన్ బురమెల్లఁ ద్రిప్పఁగా
నీకడఁ జేర్ప నెంచి యిదె నిర్భరతూర్యరవంబు లెల్లెడన్
వీఁక నెసంగఁ జేయుచును వీథులఁ గ్రుమ్మరఁ జూచువా రహా! 618

తే. దుష్టులగు వారలకు నెప్డు తోఁచుచుండుఁ, గాని చేఁతలు; సీత! యాకపి యెవండొ
వచ్చినందుల కేకత మిచ్చదనర, వనముఁ గూల్చుట యేలొకో వరుసఁ జెపుమ.

హనుమకు సీత యగ్నిబాధకలుగకుండఁ జేయుట.

చ. అనవిని సీత యిట్లనియె నమ్మక చెల్లి! 'భుజంగపాదముల్
గనుఁగొనఁ బాములే తగును గాని మఱొక్కరి కద్దిశక్యమే'?
వనచరుఁ డెవ్వఁడో వనముభంగమునొంద నొనర్చు నేటికో
గన వినఁ జాల నేను; 'వగఁగాంచిననాతికి నూహ లుండునే'. 620

శా. మీరే చేయను జెప్పఁ జూప మఱి నిర్మింపంగ వేఱొండుగాఁ
గారే శక్తిగలట్టివారు వగలం గాలంబుపుచ్చంగ నే
యీరీతిన్ లిఖియించె ఫాలమున నెంతేఁ బద్మజుం డక్కటా!
చేరన్ వచ్చెడువార లున్ననిటు లీరించి నాగ్ని నన్ గాల్చునే. 621

చ. తొలఁగుఁడు చాలునింక నిటుǂతోఁచినమాటలు పల్కకుండ మీ
పలుకులభావ మేఁ దెలియుǂపాటిమహామతి గల్గుదాన నే
ఖలమతు లెట్టిచేఁతలకుఁǂగాని భయంపడకుండఁ బల్కఁగాఁ
గలరని వారిఁ బంపి మదిఁ ǂ గాంచి తదీయవిచేష్టితంబులన్. 622

మ. పరికింపంగఁ దలంచితే దహన! నాǂపంతంబు నట్లైన నీ
గరువంబెల్ల నడంతు నొక్కత్రుటిలోఁ ǂ గానిమ్ము కానిమ్ము వా
నరవర్యున్ దహియింపఁజాలుదువె పంǂతంబిట్లె సాగింపు నీ
యురుశక్తిం గనుదాన నంచు మదిలో ǂ నూహించి మోదంబునన్. 623

చ. అనలునిదాహశక్తి యదుǂగంటును గాక తృణంబులోనఁ బా
వనికి సుశీతలుండగుచు ǂ వారక సేవలొనర్చుఁగాక యం
చనునయ మొప్ప లోఁదలఁచు ǂ నంతటిలో దహనుండు తల్లియా
హాను దలపోసి భీతిలుచు ǂ నయ్యె సుశీతలుఁ డద్భుతంబుగన్. 624

క. మూలప్రకృతి తలంచిన,నే లోకములెల్ల గల్గు ǂ వృద్ధింగను న
ట్లే లయమొందు ననంగా,జ్వాలముల దహించుశక్తి ǂ సమయుట యరుదే.

## శాంతిప్రయోగతత్త్వము.

మ. వినుఁడీ యిందలితత్త్వ మెవ్వఁడయినన్ ǂ విశ్వంబు క్షేమంబు నె
మ్మనమందుం దలపోసి భక్తియుతి సమ్మానార్హు సర్వేశ్వరున్
దనరూపంబె సమస్తమైతనర నుద్దామాత్మ తేజంబునన్
గనుపట్టం దగువాని నిల్పి యిది యీǂకార్యంబు విశ్వేశ్వరా! 626

చ. పరహితమిద్ది చేయఁదగుǂపాటి దలంపుము ధర్మమంచు నీ
వరమతిఁ దోఁచునే ననుచుఁ ǂ బ్రార్థనముం గడుఁ జేయ నద్దియే
పరఁగును శాంతి నాఁబడుచు ǂ భావుకదంబగు సుప్రయోగ మీ
శ్వరహిత మద్దియే యనుచు ǂ శాస్త్రములెల్ల నెఱుంగఁ జెప్పెదున్. 627

చ. పరమపవిత్రభావనయె ǂ భావుక మియ్యఁగఁ జాలు నద్ది యీ
శ్వరకరుణన్ లభించు ననǂవచ్చు నతండును సాధుకర్మసం
వరణనిమగ్నచిత్తులకు ǂ బంధువుఁగాఁ దగియుండు సాధుక
ర్మరతియుఁ బూర్వపుణ్యమున ǂ మైకొనుఁ గల్గఁగ నిశ్చయంబుగన్. 628

ఉ. భావన మంచిదేయయిన ǂ భావుకదానరతుండు ప్రీతుఁడౌ
భావన కృత్రిమంబయినఁ ǂ బాపఫలం బొనఁగూడుఁ గాన నా
దైవము సమ్మతిం గనక ǂ దాని నడంగఁగఁ జేయుచుండు స
ద్భావముగల్గువారలె ǂ తపఃక్రియ కర్హులు సూనృతం బిదౌ. 629

సీ. మంచియుపాసకుం ǂ డంచితవిధిఁ గూరు,చుండి సుశాంతచిǂత్తుండు నగుచు
నిష్టదైవము సకǂలేష్టద మనినమ్మి, హిమకరశిలవలె ǂ నెసఁగుమూర్తిఁ

గలవానిగా మనఃకమలంబునఁ జక్క, భావించి నిల్పి య।ప్పరమదేహ
కాంతిపుంజం; బెల్ల।కడల వ్యాపింపఁగాఁ, దదమృతబిందుసం।పదఁ దడిసిన
తే. యట్లుగా నార్తులగువారి । నతిదృఢమగు, శ్రద్ధ భావింపవలయు నా।శక్తివలన
వారితాపము లెల్లను । వదలిపోవు, నిదియె శాంతిప్రయోగ మ।హీన మిలను.

క. ఏపనిఁగోరిన నిట్లే; తాపసులెల్లరుఁ బలంత్రు । దాన ఫలంబుల్
చేపడు దుర్భావనయే, నాపన్నివహంబె కలుగు।నందురు సుజనుల్. 631

క. శాంతిప్రయోగ మిది వ,స్త్వంతరమును గోర దొక్క।యమలినవాంఛన్
సంతతముఁ గోరు దానికి, నింతయు సరిపోలఁదగిన।దెది లేదుధరన్. 632

సీ. మంత్రబీజాక్షర।మండలముం జేర్చి, జపహోమముల విధి । సంఖ్య యమరు
నట్టు లొనర్చి దశాం।శ తర్పణమార్జ,నముల బ్రాహ్మణభో।జనమును దీర్చి
చేయందగుం గామ్య।సిద్ధికరప్రయో,గము ననుశాస్త్రము । గల దదియును
పామరులకు దృఢ।భక్తిఁ గల్పింపఁగ, విధియింపఁబడియె; నా।విధి ఫలాభి
ఆ. సంధిరహితకర్మ।సమితిఁ గావింపఁగ, శ్రద్ధగల్గు నట్టి।సాధుమతుల
విషయమునను గాదు।వేయేల భావనా,బలమె బల మటంచు।దెలియవలయు.

క. అరి నాకు నితఁడు వీనిం,బొరిపుచ్చు మటంచు దైవ।మును వేఁడి జపం
బురుభక్తిఁ జేసి హోమాం,తరమునఁ దత్ఫలముగల్గఁ । దగు ననుసూహన్,

క. తనయిష్టదేవతను గొ,ల్చునతఁడు పూర్ణాహుతి యను।చున్ వర్ణితమై
తనరారు కాన్క నొసఁగును,దనవైరిం జంపు నన్న।తాత్పర్యమునన్. 635

ఉ. కొందఱ నట్లుచేయ నొక।కొంకును లేక వధించు దైవ; మీ
చందము శాస్త్రసిద్ధ మని । జాల్ములు పల్కుదు; రద్ది శాస్త్రని
ష్యందరసంబుగాదు విమ।లాత్ముల నట్టిప్రయోగపద్ధతుల్
చెందవు; స్వీయహాని నవి।చేయ సమర్థములై చెలంగెడున్. 636

ఉ. ఎల్లెడలన్ స్వతేజమె య।హీనగతిన్ వెలుఁగొందుచుండఁగా
నెల్లర యుల్లముల్ తనకు । నింపగువాసపదంబు లౌచు రం
జిల్లఁగ నొప్పునీశ్వరుఁడె । సేవ్యుఁ డభీష్టదదైవ మాతఁడే
యెల్ల శరీరముల్ తనవి।యే యయియుండఁగ నెల్లకాలమున్. 637

ఆ. ఒక్కరీతినుండు । నొక్కమార్పును లేక,యనెడుబుద్ధి యెవరి । కలరు వారి
నేప్రయోగములు న।దెవ్విధిఁ జెనకలే,వనుట నిశ్చయ మను।నాగమములు.

క. సమదృష్టి యీవిధంబున, నమరున దెవ్వారి కట్టి।యార్యులను బ్రయో
గము లెవ్వి చెనకఁ జాలవు, సమతం దగియుండుఁగాదె । సర్వేశ్వరుఁడున్.

చ. కనుకఁ బ్రయోగభేదములు । కామ్యము లల్పఫలప్రదంబులౌ
వినకయె యిట్టిసత్పథము । విశ్వమునంగల దంచు దుర్మతుల్

దనదువిరోధిఁ జంపఁదగు । దారుణకర్మము లాచరింత్రు గ
ల్గునె ఫలమింతయేని వగ।గూఁడటతప్ప మఱొండ దెద్దియున్. 640

ఉ. జ్ఞానధనాఢ్యులై వివిధశాస్త్రరహస్య విశేషవేదులై
ధ్యానరతాత్ములై సుజనతల్లజులై పొలియింపఁ గృత్రిమం
బూని ప్రయోగ మేది కడుఁబూనికఁ జేసిన వారిఁ జంపఁగాఁ
బూనక చేసినట్టిఖలబుద్ధి వధించును దైవ మద్దిరే! 641

ఆ. పామరులకుఁ దెల్పుపద్ధతుల్ జ్ఞానుల,కించుకంతయైన । నేప్రయోజ
నమును గల్గఁజేయ । నమలాత్ములాటయే,కారణంబు వేఱుగలదె యొకఁడు.

ఉ. నిర్మలమానసుల్ సతము । నిశ్చలభక్తిఁ దలంచుటే జగ
చ్ఛర్మదమైన పూజయగు । శాస్త్రరహస్య మనంగ నిద్దియే
వర్మముగాఁగ దుర్విషయవాంఛ చెలంగిన నాపరేశు స
త్కర్మరతుం దలంచుటకుఁ । గారుసమర్థులు పామరుల్ ధరన్. 643

తే. స్త్రీయమనుమాటమానిదుర్విషయరతిని,దూరముగఁదోలి లోకోపకారనిరతిఁ
బాదుకొల్పిన సంకల్పఫలము గలుగు,వేఱుమార్గము తోఁప దేవిధిని గనిన.

చ. కనుకనె రామపత్ని యనుకంప చెలంగఁగ వహ్నిబాధయే
హనుమకుఁ గల్గకుండు నని । యాత్మఁదలంచెను సర్వరూపముల్
తనవియె గాన వహ్నిదగుదాహిక నాఁదగుశక్తి శీతలం
బనఁదగు వేఱుభావము తనంతన పొందెను; దాన నయ్యెడన్. 645

ఉ. వాలమునందు హవ్యవహుజ్వాలము లట్టి చెలంగుచుండినన్
గాలినయట్లుగాని యిఁకఁగాలుఁ గదాయనుభీతియే నదే
మూలను గానరామిఁ గపిముఖ్యుఁడు సుస్మిత మాస్యపద్మముం
దోలి నటింప నుండె మది । నొప్పెడు రాఘవభక్తి పూర్ణతన్. 646

చ. మనమున నిట్టులెంచె హనుమంతుఁ డయారె! యిదేటి చిత్రమో
కనుఁగొన నగ్ని యిప్పు హిమకల్పుఁడుగాఁ దగియున్నవాఁడు హే
తినికర మట్టిమండెడు మఱిం గనుపట్టదు బాధయున్నయ
ట్లనుపమజానకీకృపయె । యాఁ దగు కారణ మంచుఁ దోఁచెడున్. 647

క. ఎదిచేయుటకైనను మా,ర్పొదవించుటకైన నున్నదున్నటు లునుపన్
గుదిగొన విరుద్ధధర్మం,బొదవఁగఁ జేయంగఁ బ్రకృతి యొక్కతెయొకదా. 648

చ. తొలుతను గాల్పఁజూచి కడుధూర్తులు నవ్వఁగఁ బ్రజ్వలించి యి
ట్టలముగ మీఁదఁ బ్రాఁకుచుఁ గడంగి క్షణంబున బాదిచేయఁగాఁ
దలఁచినయట్లు రేఁగి తనధర్మము శూన్యతనొంద నిప్పు డా
ర్తులఁ గలిగింప కీసరణి । దోఁచుట తత్కృపచేతనే యగున్. 649

తే. సాధుసంకల్ప మఖిలార్థ।సాధనంబు, గాఁగ వచియింత్రు పెద్దలు । గాదనంగ
నేరికేని దరంబగు।నే యిదెల్ల, ననుభవంబుననేఁ దెల్ప । నర్హుఁడఁ గద. 650

## లంకాదహనము

చ. అనుచు నెదందలంప జన।కాత్మజయూహ మనంబుమార్పఁగా
హనుమ తలంచె నివ్విధి న।యారె మహాగ్నికి దీని కాహుతిన్
గొనకొని యీయకుండు టది।కూడునొకో నగరోత్తమంబు దీ
ని నొసఁగువాఁడఁ దృప్తిఁగని । నింగిని దాఁకెడు దీన నగ్నియున్. 651

చ. పురవరమిద్ది భర్మగృహ।ముల్ దగ రత్నమయోరుహర్మ్యముల్
వరుసఁ గనంబడంగ రుచి।భాసురసౌధము లొప్పమీఱ ని
ర్జరులకునైనఁ జిత్రముగ । స్వాంతము లొప్పఁగఁ జేయుచున్న ది
త్తరుణమునందు రూపఱఁగ । దగ్ధముచేయుట యుక్తమౌఁగదా! 652

ఉ. దానఁ బ్రమోదమందు నృప।తల్లజుఁ డారయ దేకదా శుభం
బౌనది; దీన రాఘవుఁడు । హర్షము నొందఁగలాఁడు; దుష్టులౌ
దానవు లింకఁ జేయు నది । ధర్మముగామి నశింతుమంచు దు
ర్మానముదూలఁ జేడ్పడుచు । మానుదు రాసతి బాధచేయఁగన్. 653

ఉ. ఇన్ని ప్రయోజనంబులకు । నిప్పురదాహమె మూలమౌట సం
పన్నగృహాళి వాలమున।భాసిలు నగ్నిని దొత్తఁ గాల్చెదం
గ్రన్నన వార్ధిదాఁటి రఘు।కాంతున కియ్యది విన్నవించినన్
నన్ను బహూకరించుఁ గరు।ణన్ రిపుగర్వము తూలఁబుచ్చుటన్. 654

సీ. గృహములఁగాల్చుట । యెంతోదోషంబగు, దాన నందలి ప్రాణి।తతులు చచ్చు
నది పాపఫలదంబె । యగు నన్నసందియ, మిందుఁబొందంగ రా । దెట్టులన్న
బాపకార్యము చేయ । బహుపుణ్యములుగల్గు, నట్లుతోఁచినఁ జేయ।నౌను దానిఁ
బుణ్యకార్యంబులఁ।బూనిచేయఁగఁ బాప, ములుగల్గు ననితోఁచ।బుద్ధిమంతు
తే. లట్టె విడనాడవలయుఁ గా।ర్యముల వాని, ధర్మసూక్ష్మంబు లన నిట్టి।దారినుండు
వీని నెఱుఁగక చేయంగఁ।బూన మేలు, గనఁగ వలనుపడదని సు।జను లనుదురు.

క. మరుదాత్మసంభవుం డిక్కరణిం దలపోసి పెక్కు।గతులన్ దనుజో
త్కరము తనుఁ జుట్టుకొని భీకరరవముల దిగ్వితాన।కముఁ బగులింపన్. 656

క. కనుగొనలం జూచుచుఁ దన, తనువును సూక్ష్మముగఁ జేయఁ।దలఁచి మహాయో
గనిరతిఁ బ్రాణంబున నొయ్యన బిగియంబట్టి శక్తి । యలవడుచుండన్. 657

తే. తగినసంయమ మొనరించి।తత్ఫలముగ, దేహమణుమాత్రమై యుండఁ।దివిరి చేయ
రశ్మిసంతతి బంధింప।రాని యల్ప, తనువు సిద్ధించె దాన నా।తండు వేగ. 658

చ. అపగతబంధరశ్మియయి । యంతటఁ బ్రాక్తనదేహ మొప్పఁగా
వ్యపగతఖేదుఁడై యెగసి । హర్మ్యముపైఁ దగ వ్రాలి గట్టిగాఁ

గపివరమంత్రి రామజనకాంతుని దూతను వాయుపుత్త్రుఁడక్ష
విపులతర ప్రతాపుఁడను । వీటిని దీనిని గాల్చి వైచెదన్. 659

ఆ. అడ్డపడినవారి । నంతకుచెంతకుఁ, బనిచి రాఘవేశపత్ని కెరఁగి
ధన్యుఁడనయి రామదర్శనమున కేగు, వాఁడ ననుచుఁ బలికి । బరవసమున 660

సీ. వాలాగ్రభీతదజ్వాలావళి స్ఫార, దహనుని గేహసంతతులఁ జొనిపి
మంటలు సోఁకినమాత్రమ్ముననె మహా, శబ్దమ్ము లొప్పఁగ । స్వర్ణముఖ్య
లోహముల్ గరఁగి పెల్లున మండఁజొచ్చిన, నందలివారు హాహారవమ్ము
లొనరించుచుం బోర । నుంకించువారును, మంటలలోఁబడి మ్రందువారు
ఆ. పరుగువాఱువారు । పరుగెత్తఁజాలక, కాలి కూలఁబడి విగతశరీరు
లైనవారు మఱియు । నగువారు కాఁగల, వారుగాఁగ దనుజవార మపుడు.

చ. ఎవరికివారె దిక్కునఁగ । నెల్లెడఁ బాఱుచుఁ దమ్ముఁ బిల్చు దా
నవులకు నుత్తరంబిడక । నారులఁ బిల్లల నైనఁజూడ కొ
క్కవడిని బాఱె రంతరఘుకాంతునిదూతయు హర్మ్యరాజిపై
వివిధగతుల్ చెలంగఁ గడువేడుకమై విహరించె నెంతయున్. 662

సీ. హర్మ్యాంతరాళంబులందుఁ బరుండియుఁ, గాలక బ్రదుకంగఁజాలువారు
వీథులవెంబడి । వెసవెసఁ బాఱుచు, మంటలు సోఁకుట మ్రందువారు
ప్రమదలఁ గాపాడఁ । బరువెత్తి నడుమనె, యగ్ని పైఁబడ మృతి । నందువారు
ధనధాన్యములపయిఁ । దగిలినయాశల, లోనఁబోవఁగ భీతిఁ । బూనువార
ఆ. లిన్నివస్తువు లిపు । డివ్విధి భస్మమై,పోయె ననుచు వగలఁ । బొగులువారు
కపి యిదేల వచ్చెఁ । గ్రవ్యాదు లిద్దాని,తోఁకఁ గాల్పనేల? । తొందఱపడి.

వ. అని యనేకప్రకారంబులఁ బలుకుచు, జ్వాలల కులుకుచు, దిక్కులకుం బఱచుచు హనుమత్ప్రతిజ్ఞకు వెఱచుచు, దానవేంద్రుల దూషించుచు, దనుజుల కిదె ప్రళయమని భాషించుచు, జానకిం బ్రస్తుతించుచు, రావణపత్నుల నిందించుచు, రాముని బొగడుచు, రావణుం దెగడుచు, దెసలకు నరుగుచు,హాహాకారంబులు చేయుచుండ నాలంకానగరంబెల్ల హాహాశబ్దమయం బయ్యె నంత. 664

ఆ. మేలిగృహము లెల్ల । జ్వాలాళి కాహార, మయ్యె రాజగృహములెల్లయయ్యె
సాధుమతియెగాన । సౌధ మొక్కఁడు విభీ,షణుని దల్లియుండెఁజారుతఁగని.

### లంకానగరనిర్మాణప్రశంస

సీ. వాస్తుశాస్త్రమున నేవరుసఁజెప్పంబడె, నద్దాని మించనియట్లు పూన్కి-
మందిరవర్యనిర్మాణంబుఁ జేసిరి, పురముల నిర్మింపఁబూను నప్పు
డారామవనములయంతరంబున హర్మ్యములు చెన్నువిరాఱంగ । నమరఁగట్టు
టర్హమౌటను;వాల । మందలియగ్ని యే, హర్మ్యమునంబడు । నదియె కాలు

ఆ. నంతికంబునందు ౹ నమరుగృహంబును, జుట్టి తోఁటయుండు ౹ నెట్టులైన
వానిఁగాల్ప నెట్టిభంగి శక్యముగాక, యుండుఁ గాన నాగృహోత్తమంబు.

క. అనలున కావహుతిగాకయె, తన రారుచునుండెఁ గర్మతత్త్వం బిదియే
యని తెలియఁగలసియుండును, ఘనసీతిధురంధరుండు గద తలపోయన్. 667

క. కావున దానికి విలయం, బావిధమున లేకయుండె ౹ నత్తతి నెందే
నేవి నశింపఁగవలయునొ, పోవునవియె తక్కినవి విభూతిదలిర్పన్. 668

ఆ. పూర్వమున్నయట్లె ౹ పొదలుచునుండును, చెడినవానిఁగాంచి ౹ పుడమిజనులు
పల్కుచుంద్రు; కర్మపథములు తెలియని, వారలనుచుఁ దలఁపవలయు వారి.

ఉ. మారుతియంత నెల్లెడల ౹ మాటికిమాటికిఁ గాంచి భీతిఁ జే
కూరఁగఁజేయు నాశిఖశిఖల్ వియదంతరమావరించి యా
దారిని గాల్చుచున్నయటు ౹ తప్పకతోఁపఁగఁజేయుచుంట లో
నారసి దుఃఖ ముప్పతిల ౹ నంతట జానకి సంస్మరించుచున్. 670

ఉ. వానరబుద్ధి కానఁబడుపద్ధతిఁ గార్యము నిర్వహించితిన్
జానకి యేమియయ్యెనొకొ ౹ సాంద్రమహాతాశనకీలజాల మా
కాననవర్య మేఁచ వెతగాంచెనొ? మ్రందెనొ? యే నెఱుంగ నిం
కేనెటు రామునిం గనఁగ నేఁగుదు నేమని చెప్పఁ జాలుదున్. 671

క. అని క్షణకాలము నెమ్మన,మున నార్తింబొంది జ్ఞానమునఁ దోఁచినయూ
హను గొని తలంచె నిట్లని, జనకజకృప నన్నుఁ గాల్పఁజాలక శుచియే. 672

క. శీతలతం గనఁజేయుచు, నాతత నన్నాదరించె ౹ నట్టిమహాసా
ధ్వీతిలకము బాధించునె, యేతాదృశశక్తి వహ్ని ౹ కెవ్విధిఁగలుగున్. 673

సీ. అగ్నియం దుండెడునట్టిదాహికయను, శక్తి తానేయయి ౹ సకలలోక
నిర్మాణపోషణనిధనంబులన్ జేయు, సర్వేశ్వరికి జగజ్జనని కిట్టి
దహనబాధాపనోదనకార్య మేపాటి, తెలివిచాలమి నిట్లు ౹ కలఁగినాఁడ
నింతకుమించెడు ౹ నేయపరాధంబు, గలదు పాచితమిట్టి ౹ కార్యమందుఁ
తే. బరమశక్తిని బరమేశి ౹ భక్తకలుష, సంహరణకార్యతత్పర ౹ స్వాంతమందుఁ
దలఁచి మ్రొక్కుటయే పాచితం బనంగ, ననుచుఁ దలపోసి సీతాంబనాత్మనిలిపి

శా. తల్లీ! నీదగుశక్తి నెన్నక కపిత్వంబె గనంజేసి భీ
తిల్లం జాలితి నింతకంటెఁ గలదే ౹ ధీమాంద్య మీతప్పిదం
బెల్లన్ సైఁచి త్వదంఘ్రిసేవకుని దాసనిష్టంబు పండంగ నీ
యుల్లంబందుఁ దలంపుమా కరుణ నాకొప్పన్ మహాశ్రేయముల్. 675

చ. అనితలపోయుచుండుతతి ౹ నభ్రమునుండి మరుత్తనూజుఁడీ
దనుజులపత్తనంబు గురుదర్పముపొంగఁగఁ గాల్చెఁ గాని యా

జనకజ క్షేమయుక్తయయి । సంతసమందెడు నన్నుశబ్దమొ
య్యన శ్రుతిరంధ్రముల్ మిగుల । హర్షమునొంద వినంబడెం గడున్. 676

ఉ. అనుడు లాలకించి గురు।హర్షమునొంది మహాబ్ధిఁ దాటఁగా
మానసమెంతయుం గడఁగు।మాడ్కిఁ గనంబడ భూరినాదముల్
దానవభీతిదంబులయి । తత్పురి నంతయు నావరింప శ్రీ
జానిఁ దలంచుచున్ జనక।జాపదయుగ్మముఁ జేరి మ్రొక్కినన్. 677

క. చరణములకు మ్రొక్కినయా, మరుత్సుతుఁ గాంచి సబహు।మానంబుగ ని
క్కరణింబల్కె మహాత్మక!, సురవైరిమదంబు నెల్ల । స్రుక్కించితివే. 678

క. వనభంగ మ్మొనరించితి, దనుజులు మార్కొనఁగ వారి।దర్పము డిపి యా
దనుజేంద్రునకున్ సాధ్వసమును గల్గంజేసి శౌర్య।మును జూపితిగా. 679

చ. అని బహుమానయోగమున । నాజనకాత్మజ పల్కఁ నాలకిం
చి నిలిచి ఫాలభాగమునఁ । జేతులు చేర్చి సురారిపుత్త్రుఁడ
య్యనిమొనఁ జూపినట్టి వివి।ధాస్త్రమహత్త్వము విన్నవించి యా
తనికిని జిక్కి రావణుని।దాపున కేగిన వార్తఁ దెల్పుచున్. 680

తే. సభను దాఁజేసినట్టి ప్రసంగములను, విడువకుండంగఁ దెలిపి వి।భీషణాఖ్యు
నీతిమార్గంబుఁ జెప్పి యగ్నినిడఁ దాను, జేసినట్టి విధానంబుఁ।జెప్పి మఱియు.

చ. కరుణ మనంబునందుఁ గలఁ।గన్ నను బాధలపాలుచేయ నె
వ్వరుసను జాలకుండగను । వహ్నినొనర్చితి వీవె; తల్లి! నీ
చరణసరోజభక్తునకు । సంధిలునే యశుభంబు లెందునే
నరిగెద రామచంద్రుకడ । కర్మిలి క్షేమము తెల్ప వేగమే 682

చ. శ్వసనతనూజుఁ డెత్తఱిని । జానకి క్షేమము తెల్పునో యటం
చెసఁగెడునాతురంబున మహీ।పతి వానరరాజుఁ గూడి చెం
త సహజుఁ డుండఁగా నయన।తామరసంబుల విప్పి చక్కనీ
దెసఁ గనుచుండు; నారఘుప।తిం గన వేగమ పోవు టొప్పుగా. 683

చ అరుగుదు గోష్పదీకృతమ।హాంబుధినై పరతీరమందు నా
తురపడుచుండు మిత్త్రులకుఁ । దోరపుసంతస మబ్బఁజేయుచున్
హరిపతు లుల్లసిల్లుచు ది।గంతరసంవృతసింహనాద మొ
ప్ప రమణరాఁగఁ బోయి నర।పాలకుఁ గాంచి వచింతు క్షేమమున్. 684

ఆ. పూస గ్రుచ్చినట్లు । భూపుత్త్రి! నీవార్తఁ, దెలుపువాఁడఁ; గీశ।బలము గొలువ
రాముఁ దోడితెత్తు; । రావణుఁ బరిమార్చు, కార్యమందు శ్ర।ద్ధగలిగియుండు.

క. కొలఁదిదినంబులలో దైత్యులనిలయముఁ జొచ్చువార। లొగిఁ గోఁతు లటం
చెలమిం గన దానింగన, నిలాసుతా! కోరుచుండు । మిఁక సెలవిమ్మా. 686

చ. అనిలతనూజుఁ డిప్పగిది హర్షముఁ బొంగఁగఁ బల్క ధారణీ
తనయ ముదశ్రుబిందుపరీత సమలంకృతగండభాగసుం
దర ముఖపద్మయై స్మితము దానయి కన్పడఁ బోయి రమ్ము; సు
స్థిరసుఖ మబ్బఁజేయుము ప్రసిద్ధగుణాకర! నీతిసాగరా!. 637

మ. క్షితిపై నెల్లెడ నీసుకీర్తియశముల్ కీర్తింపుచుందు ర్జనుల్
శతపత్రాసనసత్పదంబు గొనునాసత్త్వంగనంజాలు యో
గ్యత నీకొప్పు; ఫలించు వాంఛయది; సత్యంబిద్ది; నావాక్కు భూ
పతిదౌ వాక్కు ఫలింపకుండునె జగత్ప్రాణాత్మజా! యుత్తటిన్. 688

తే. అనుచు దీవించి పంప నాయాంజనేయుఁ, డంబపాదారవిందద్వయంబుఁ గొలిచి
మూఁడుమాఱులు తిరిగి నేఁబోయివత్తుఁ, గపిబలంబులతోడ భూకాంతుఁ దెత్తు.

క. అనిపలికి సెలవుగైకొని, వననిధి గోష్పదముగాఁగ భావించుచు నె
క్కొనుప్రీతి రామచంద్రుని, గనువేడుక సందడింపఁగా నియతుండై. 690

మ. కనుఁదమ్ముల్ ముకుళించి మానసమునన్ శ్రీకాంతునిన్ నిల్పి నీ
యనుకంపాతిశయంబునన్ మరలి రానైయున్న వాఁడన్ విభూ!
వనరాశిం దరియించి వానరయుతిన్ భద్రప్రదున్ నిన్ను గొ
ల్వ నిరాతంకముగాఁగ వచ్చునటు నన్ భావింపుమా నెమ్మదిన్. 691

సీ. అనివేఁడి పవమాను నర్థి సంప్రార్థించి, దేవతావరులకు దివిరి మ్రొక్కి
సాగరునర్థించి చయ్యన మోమును, నిక్కించి యాకాశ మెక్కరీతిఁ
గబళింపఁబూను నక్కఅగల్గిపోయెడు, గతిమనోవేగంబుగానఁబడఁగఁ
జని యంతరమ్మున శైలేంద్రుకోరిక, నెఱవేర్చియతఁడు సుస్నిగ్ధరీతిఁ
తే. బూజ సలుపంగ గ్రహియించిపోయి యవలి, తటముఁ జేరియటంగలతనసఖులను
బంధువులఁ బెద్దలంగని వారికెల్ల, సీతకుశలంబుఁ దెల్పి సంప్రీతి గొల్పి. 692

వానరులు మధువనముఁ గొల్లగొట్టుట.

ఉ. వారలఁగూడి లంకఁగలవార్తలఁ దెల్పుచుఁ బోయిపోయి బృం
దారకరాజమోదదము నందన మన్వనరాజ మట్టులా
ప్పారుచుఁ బూవుతేనియలవాహినులం జెలువారుచున్ మనో
హారి లతాళిమించి యలరారు కపీంద్రువనోత్తమం బటన్. 693

చ. కనఁబడ నంగదానుమతిఁ గైకొని తేనియలానువూనికల్
మనముల నుల్లసిల్లరఘుమండనుఁ బాడుచుఁ జొచ్చి వృక్షరా
జిని దమినెక్కి తేనియలఁ జిత్తమువచ్చినయట్లు త్రాగుచున్
వనపరిపాలకుల్ వలదనంగ మహోద్ధతి వారిఁ దోలుచున్. 694

తే. మధువనంబను దానినామము యథార్థ,ముగ నొనర్పఁగఁ బూనినట్లుగఁ దనర్పు
తేనెపట్టులఁ బిండుచుఁ దృప్తిదీఱఁ, ద్రాగుచుండఁ దదీశుండు దర్పమూని.

చ. వలదని నొక్కి నొక్కి కపివర్యుని యానతి నెంత తెల్పినన్
బలుకక త్రాగుచుండ నొకపల్కు గ్రహింపక యుంటఁ గాంచి వే
యలుకవహించి పోయి తపనాత్మజు నంఘ్రుల వ్రాలి యంగదా
దుల జతనంబుఁ దెల్పి వగతో నిలుచుండఁగ నుంత యెంచుచున్. 696

ఉ. భూపతి వర్యుఁ గాంచి ముదమునుం గనఁ జేయువచస్తతిం బ్రభూ!
యాపవనాత్మజాదులు కృతార్థులు గాఁదగి వచ్చినార లం
చీపనియే వచించెడి; నిఁక కేమియు సందియ మిందు నాయెదం
దోఁపదు వారి నిచ్చటికిఁ దోడ్కొనిరమ్మని పంపుదున్ వడిన్. 697

చ. అనవిని రామచంద్రుఁడను నయ్యనిలాత్మజుఁ దోడి తేర నీ
వనచరనాథుఁ బంపు మన భాస్కరసూనుఁడు కీశవర్య! యే
మనుకొనరాదు నీదుమది నందఱఁ దోడ్కొనిరమ్ము పొమ్ము రా
మునిఘన కార్యమిద్ది ఫలముంగను టే మనవాంఛయౌఁగదా. 698

ఉ. వారలపల్కులెల్ల విను వాంఛను గాంచెను రామభద్రుఁ డ
వ్వారల వేగ తోడుకొని వచ్చుట మేలు మనంబు సంతసం
బారఁగఁ బొమ్మనంగఁ జని యాయినసూనుని యాజ్ఞఁ దెల్ప న
మ్మారుతపుత్రముఖ్యు లొకమాటయుఁ బల్కక వే ప్రయాణమై. 699

ఉ. ఆకసమెల్ల బ్రద్దలగునట్లుగ నార్చుచు ధ్వాంతమయ్యె నా
కాకసు లేగుమార్గమునఁ గాఁ దగునట్లుగ నొక్కమాఱుగా
వీఁక చెలంగఁ బోయి రఘువీరుని ముందఱ వ్రాలి రంత న
స్తోకరవంబునం బవనసూనుఁడు 'క్షేమము సీత కచ్చటన్'. 700

ఆ. అనుచుఁ దెలిపెనంత నందలివార్తల, వదలకుండ బ్రీతిపొదలుచుండఁ
దెలిపి సీతదైన లలితచూడామణి, నొసఁగె రాముఁ డంత నుద్యమమున. 701

క. దాని గ్రహియించి యదియే, జానకి యని యెంచి బాష్పసందోహ మొగిం
దానయి ప్రవహింపఁగఁ జిం,తా నీరధి మున్గె లోకధర్మముఁ దెలుపన్ 702

తే. ఊఱడించెను లక్ష్మణుం డొక్కరీతిఁ, గర్మ సిద్ధాంతముం దెల్పి కపివిభుండు
తెలుపరఘురాముఁడనికి దోర్బలము మెఱయ, వెడలనుంకించె దుష్టులు విహ్వలింప.

సీ. కపిరాజు నానతిఁ గడఁగి వానరులు గో,లాంగూలములు నుభల్లములు లోను
గాఁగల జాతులఁ గల్గినసురవీరు, లాదానవులఁ జంపు నాతురమున
భూమి యీనినరీతిఁ బోయిరి సంగ్రామ, కౌతుకంబున దానిఁ గాంచి నిర్జ
రాధిపుం డెంతయు హర్షించె నిఁక వైరి, నశియించు ననియెడు నమ్మకమున
ఆ. నట్టులరిగి యరిగి యంబునిధిం జేరి, దాని దాఁటుపథము మానసములఁ
దలఁచుచుండి; రంత ధరణీశ్వరుఁడు రాముఁ,డబ్ధిమూర్తిగఁ దగు నాత్మమూర్తి.

రాముఁడు సాగరుం బ్రార్థించుట.

చ. మది నిలువంగఁ జేసి జనమండల మెల్లను దన్నుఁ గాంచి యి
య్యది యొనరింపఁగాఁ దగినదౌ ఫలమున్నది దీన నంచు స
మ్మదమున నట్లు చేయఁ దగుమాడ్కిఁ బ్రయత్నము చేయువార లం
చుఁ దలఁచి మౌనమూని పరిశుద్ధమహీస్థలిఁ బవ్వళించెఁ దాన్. 705

ఉ. మౌనము పూనుటన్న నొకమాడ్కి మనం బరికట్టఁబూను టే
యౌనని పెద్దలందు రది యాదృతిపాత్రము గాకయుండు నే
మానసశుద్ధి గల్గుటకు మౌనమె మూలమటండ్రు యోగవి
జ్ఞానముగల్గు మాన్యు; లది సాధుహితంబగు భావమేయగున్. 706

సీ. మాటలాడుటఁ దనమానసస్థిరతను, గోలుపోవుటయని కోవిదోత్త
ములు పల్కుదురు; దానఁగలయర్థ మేమని, ప్రశ్నించుకొనుటొప్పఁబలుకుచుండ
మానస మెన్ని యోమార్గంబులం బోవుఁ, బూర్వోత్తరార్థసంభూతవిహిత
విషయసిద్ధాంత మీవిధిఁ జేయఁదగునను, నూహాలు పొలయుచునుండుఁగాదె
తే. దానమదిఁగల స్థిరత యంతయు నడంగి, విషయపరిశోధనంబున విహ్వలతను
గనుచుఁ దికమకపడుచుండుఁగానఁ జంచలత్వము నెయభ్యసించినట్లయగుఁగాదె.

చ. మునిపతు లీవిధం బెఱిఁగి మూకతతిం బురుడించుచుందు; రొ
క్కనియతి మాటలాడుటయుఁ గాదు విరోధము మౌనవృత్తి కం
చనుదురు కొంద; ఱద్దియు యథార్థమె యౌనన వచ్చు లోకచ
ర్యను వదలంగ రాదుగద! యయ్యది సాధ్యము గాకయుండెడున్. 708
తే ముఖముగలదని మాట్లాడఁ బూనరాదు, దేని కెంత యవశ్యమో దాని కంత
భాషణము చేయఁగాఁదగు వాఙ్నియతిని, సత్యముంగొంతఁగాపాడఁజనును గాదె.

చ. కనుకనె మౌనమూని చిరకాలము దైవముఁ గొల్చుచుండు యో
గినికరమం చెఱుంగనగుఁ గేవలమౌనమె సత్తపంబుగాఁ
జనునని కొంద ఱందు; రదిశాస్త్రహితంబగు నంచుఁ జెప్పరా
దనిరి పురాణవేత్తలగునార్యులు స్వానుభవంబునం గడున్. 710

సీ. మౌనంబుపూని యమానుషతేజుని, భగవంతు నవ్యయుఁ బరమపురుషు
నాత్మ ధ్యానించుచు నఖిలకర్మంబు లాతనికి నర్పించుచుఁ దనవశమున
మనసు వర్తిలఁజేయు ఘనునకు సర్వేష్ట, సిద్ధియౌ ననుచుఁ బ్రసిద్ధశాస్త్ర
విహితసిద్ధాంత మీవిధము లోకులకుఁ దా, నెఱిఁగింపఁదలఁచి ధాత్రీశమౌళి
తే. దర్భలను సైకతంబు మీఁద నునిచి యటఁ, బవ్వళించి మహాత్మ కపిబలము లెల్ల
నవలి తీరంబునకుఁ బోవునట్టి తెరువుఁ, దెలుపుమా యంచు నబ్ధిఁ బ్రార్థించుచుండె.

క. ధరణిపయిన్ శయనించుట, కర ముగ్రంబైన వ్రతము గా నెన్నఁదగున్
బరమాత్ముఁ డయ్యు రాముఁడు, నరులకు నద్దానిఁ దెలుప న్యాయ్యంబనుచున్.

ఉ. చిత్తమునం దలంచి ఘనసింధువుఁ గొల్చెదునట్లు స్వీయమా
నుత్తమరూపముల్ దలఁచుచుండె; దినంబులు రాత్రులట్లె యే
యుత్తమలాభముం గలుగునూహలుగల్గఁగనీక దాఁటె; రా
జోత్తముఁ డంత సాగరమునుద్ధతి మాపఁగ నెంచి యాత్మలోన్. 713

ఆ. మంచికార్యమునకుమానకతోడ్పడు, టుత్తములకుధర్మమెత్తఱినటు
చేయకుంట పాపచిత్తులదౌవృత్తి, యనెడుపూర్వవాక్యమునధరించి. 714

చ. నియమముమాని లేచి గురునీరధిఁగాంచుచు నెంత వేఁడినన్
స్మయ మిసుమంతయే వదలఁజాలక నన్నుఁ బరాభవింపఁ బూ
ని యకట! మాటలాడుమదినిం గొన కివ్విధి విఱ్ఱవీఁగి నా
నియమమునైనఁ జూడ విటు నీరనిధీ! నిను నింక నేమనన్. 715

చ అనితెగనాడి సోదరుమహామతిఁ గాంచి ప్రియానుజా! తనం
తన యుపకారబుద్ధిఁ గొన ధర్మము; చెప్పిన యప్పుడైన దా
నిని స్మరియింప మధ్యమము నీరధి యీతఁడు భక్తి వేఁడినన్
నను నిసుమంతయేఁ గొనక న్యాయము నెంచక విఱ్ఱవీఁగెడున్. 716

ఉ. రామునిశక్తి లెక్కిడక రాతులపక్షము నూని వేదులే
తా మదినెంచ కొక్కగతి ధైర్యము తెల్పుచునున్నవాఁడు; నా
యీమహితవ్రతంబు ఫలియింపఁగఁ జేయఁదలంపఁ డక్కటా!
యీమదశాలిఁ గొల్వదగు నెట్టులొ సుంతయుఁ దోఁప దాత్మకున్. 717

ఉ. నీవును జూచినావుగద నీరధిగర్వము హెచ్చుచుంట; యిం
కేవిధిఁ గార్యసాధనము లేవియు నున్నటుదోఁపలేదు; నే
నీవిషయంబునన్ శ్రమ మొదించుకయేఁ బనిసేయదంచు నీ
సేవ నెఱింగినాఁడ; నిఁక సింధువు రూపఱఁజేయు టొప్పుఁగా. 718

ఉ. ఇంకొకమార్గ మున్నయటు లేవిధిఁగాంచినఁ గానరామి నే
శంకలులేక తీవ్రశరజాలముల్ బరఁగించి సాగరం
బింక నొనర్చెదన్; హరివిధీశముఖుల్ చనుదెంచి కావఁగా
బింకము పూనినన్ జలధిపీచ మడంచెదఁ జూడుఁ డందఱున్. 719

క. తనుదాఁటఁ జాలుశక్తిం, గనఁజాలనివానిగా నికామము నన్నెం
చెను గాన వీనిఁ ద్రుంచెద, ననుజా! కోదండ మంబకావళి నిమ్మా. 720

క. శరములరుచి యించుకగాఁ, బరికించుంగాక జలధివల్లభుఁ డెంతో
గరువమునఁ ద్రుళ్లిపడియెడు, నరయఁడు నాశక్తి యించుకైన నితండున్. 721

చ. కనుదురుగాక నాదువిశిఖంబులసత్త్వ మిదిట్టిదంచుఁ గీ
శనిచయనాయకుల్ సురలు సాధ్యులు దైత్యులు నింకఁగల్గు య

క్షునిశర మింక నోర్వఁగనఁగాఁ దగ దోసహజన్మ! కార్ముకం
బనుపమభర్మ పుంఖనిశితాస్త్రవితానముఁ దెమ్ము నావుఁడున్. 722

సీ. సౌమిత్రి కోదండశరము లందీయఁగ, దృగ్గోళములనుండి దీప్తవహ్ని
కణములు రాలంగ నణుమాత్రమైనను, జలియింపకున్న యాజలధిగాంచి
బ్రదుకుదుఁగాని యీబాణఘాతంబునఁ, గన్నుమిన్ను నెఱుంగకున్న నిన్ను
నుండ నిచ్చుట కాత్మయొప్పకున్నది యని, పలుకుచుఁ దీవ్రమౌబాణ మొండు
తే. నారిసంధించి బ్రహ్మమంత్రమ్ము దాని
యందుఁ బూరించి తచ్ఛక్తి నద్దిమిగుల
వెలుఁగఁ గాంచి ప్రయోగింపఁ దలఁచియుండు
తఱిని ఘూర్ణిల్లె నేడుసంద్రములు గిరులు. 723

క. ఎన్నియొ యుత్పాతంబులు, మిన్నునఁ గన్పడియె నల్లమేదినిపై రా
నున్నది ప్రళయంబను వార్త న్నెఱి నెఱిఁగించుచిహ్నతతులుం దోఁచెన్.

ఉ. అంతట సాగరుండు ప్రళయం బిదినా కని నిర్ణయించుకొం
చెంతయు నార్తిమున్గి తనయేపు నశించుక్షణంబులో నన్య
చింతయొసంగ గర్వమును జెచ్చెరఁ బాసి జలోర్ధ్వమందు బల్
వింతనుగొల్పు రూపమున వీరశిఖామణి రాము వేఁడఁగాన్. 725

చ. కనఁబడి రామచంద్ర! ననుఁగావుము కావుము భీతరక్షణం
బనునది నీప్రతిజ్ఞయొకదా! శరణాగతు నన్ను సత్కృపం
గనుఁగొనుటొప్పుఁ దీవ్రతరకాండము వే యుపసంహరింపు నా
మనవి గ్రహింపుమా మనుజమాత్రుఁడ వంచుఁదలంచి యుండితిన్. 726

ఉ. దారియొసంగువాఁడ ననుదాఁటఁగ రాదను బ్రహ్మశాసనం
బారయ నీకుఁగాదు; పరమాత్మవు నీవెకదా! మనుష్యసం
చారము నాపఁబూను విధిశాసనమంచుఁ దలంచుటొప్పు నో
శ్రీరఘువర్య! మార్గమును జెప్పెదఁ జక్కఁగ నాలకింపుమా. 727

తే. వానరులయందు నళుఁడనువాఁడు కలఁడు, విశ్వకర్మవరంబున వెలయునతఁడు
తాఁకివైచిన పాషాణతరుముఖములు, పైనఁ దేలుచు మున్గక గానఁబడును.

ఉ సేతువు వానిమూలమునఁ జిత్రముగా రచియింపవచ్చు మీ
రాతతసేనతోడ దితిజాకరమై తగులంక కేగి దు
ర్జాతులఁ జంపి సీతఁగొని చయ్యన నీనగరంబుఁ జేరి సం
ప్రీతి వసింపవచ్చు గతభీతునిగా నొనరింపు నన్నిటన్. 729

క. అనివేఁడిన నారాముం, డనియెఁ సాగర! మదీయమగు నస్త్రము దీ
నిని వదలువాఁడ నెచ్చట, వినిపింపుము రిత్తచనదు వేడుకకైనన్. 730

ఆ. రాముబాణ మిది యరాతులఁజంపక, మరల దనెడుమాట । మఱువరాదు
తెలుపు మన్నభక్తిఁబలికె సాగర మిట్టు, లుత్తరమున భాగ । మొప్పు నొకఁడు.

సీ. ద్రుమకుల్యమనెడు పేరుననొప్పు నయ్యది, విఖ్యాతమే సర్వ । విశ్వములను
గాని యందుఁవసించు । మానవుల్ దానవ,సములు చోరులుభూరి । సత్త్వలుగ్ర
కర్మరతుల్ గానఁ । గడఁగి వారింజంపఁ, బంపు మీయస్త్రంబుఁ । బార్థివేంద్ర!
యవ్వారిమృతియన । నఖిలలోకక్షేమ,కరమని ప్రార్థింపఁగా రఘూత్త

తే ముండు స్వాంతంబునం దెంచి । దుండగీంద్ర, జంపులే యుత్తమంబని । సరగ దాని
వైచె నవ్వారిఁ బొలియించి । వచ్చి చేరె, రాముసన్నిధి నాయస్త్ర । రాజమంత.

క హరిబలము ప్రీతినొందెను, హరివర్యుఁడు తృప్తినొందె । నర్కకులుఁడు దు
ష్కర కార్యము సులభంబుగఁ,బరమఫలంబిచ్చె ననుచుఁ । బ్రమదముఁ గాంచెన్

క. శరణాగతరక్షణత,త్పర! దుర్జనదమన!, మానిపాలక!, క్రతుభు
గ్వర కార్యనిర్వహణద,క్ష! రమాధీశ్వర! స్వభక్త । గణకల్పతరూ!.

చ ప్రకృతిపరాత్మ కార్య!, పరి । పాలితసాధ్వభిలాషధుర్య!, శా
స్త్రకలితమార్గతత్పరకృ । తస్వపదాంబుజసేవనాదరా!
యకలుషవృత్తి సంశ్రయమ । హాత్తరకీర్తియశోధురంధరా!
సకలవిముక్తమోత్తమ!, ప్రశ । స్తగుణాంబుధిపూర్ణచంద్రమా!.

విచిత్రపదవృత్తము:—
భానుసమానసుతేజా!, మానసశంకరపూజా!
మానిమనోధృతపాదా!, గానకళాత్తవినోదా!.

గద్య. ఇది శ్రీమత్త్రిపురసుందరీకరుణావాప్త గీర్వాణాంధ్రకవితాప్రాభవ కాశ్య
పాన్వయప్రభవ, శ్రీజనమంచివంశాంబురాశి కుముదినీమిత్ర, సుబ్రహ్మణ్య
మనీషిపుత్త్ర, తాండవకృష్ణాపరాభిధేయ, శేషాద్రినామధేయవినిర్మితంబైన
శ్రీధర్మసారరామాయణంబను మహాప్రబంధంబునందుఁ సుందరకాండము
సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ ర స్తు.

# శ్రీ ధర్మసారరామాయణము

## యుద్ధకాండము.

శ్రీమద్గుణగణసంప
న్నా! మౌనిధ్యానఫలదనామ మనోజ్ఞా!
భూమానందవిహారా!
కాముకజనదూర! మోక్షకాంతాధారా! 1

### అభయప్రదానము.

వ. మహాప్రభూ! అనంతరకథ నవధరింపుము. 2

ఉ. చారులవంక రాఘవుఁడు సైన్యసమేతముగా సముద్రముం
జేరి వసించె నంచు విని జిష్ణువిరోధి దశాననుండు దు
ర్వారభుజాబలుండు తనవారల నెల్లర రాఁగఁబంచి య
వ్వారిప్రయత్న మంతయు నభంగముగా నెఱిఁగించి యిట్లనున్. 3

ఉ. వింటిరిగాదె రామపృథివీపతి రాకయు వానరేంద్రుఁడున్
జంటగనుండి భూరికపిసైన్యముతో నని సేయువేడ్కమై
నుంటయు గూఢచారులు మహోద్యమమూని వచింప నింక మీ
వంటిభటేంద్రవాక్యములె వారక కైకొన నర్హముల్ గదా 4

చ. అరిబల మేగుదెంచి దనుజాలయమున్ విదళింపనుండ ని
ర్భరతరపౌరుషం బుడిగి వారలనే శరణంబు వేఁడుటో
సురవరులన్ జయించి రణశూరులు దానవులన్న ఖ్యాతి చేఁ
బరఁగినవారమౌటఁ దెగువన్ జని మార్కొనుటో యొకం డిటన్. 5

ఆ. నిర్ణయింపవలయు నిర్జరులకు నోడి, పరుగువాఁగినను నోపంబు లేదు
కపులకోడిరన్నఁ గడునీచముగనుండ, యుక్తమెదియొ దాని నొప్పఁ జెపుడు.

చ. అనివివరించి ప్రశ్న మతఁ డత్తఱిఁ జేయఁగ నాలకించి యా
దనుజవతంసులెల్ల మది ధర్మమటం చెది దోఁచునో యటే

వినయముమీఱఁ దెల్పి రది । విక్రమసంపదఁ జూపుచొప్పనే
గనఁబడఁజేసెఁగాని రఘు । కాంతుని స్నేహముగోరఁ డించుకే. 7

చ. బలవిభు లెల్ల రామజన । వల్లభుఁ దూలఁగఁ జేయు టబ్రమే
కలసున నంచుఁ బల్కి రిటు । కాలము చెల్లుటఁ బల్కి రంత న
ప్పలుకుల నాలకించి ప్రియ । భాషణుఁడైన విభీషణుండు చే
తులు ముకుళించి యిట్లనియె । ధూర్తులమాటలఁ ద్రోసిపుచ్చుచున్. 8

ఉ. వానరమాత్రుఁ డొక్కఁడల । భానుకుమారుని మంత్రి రామభూ
జానికి దూత నంచు మన । సద్మము లన్నియుఁ జూచి సాధ్విని న్
జానకిఁ గాంచి రమ్యము వి । శాలము నా వననిష్కుటం బొగిం
బూనికఁ బాడుచేసి భట । పుంగవులన్ వధియించి యక్షునిన్. 9

చ. సమరమునన్ వధించి సుర । సత్తము గెల్చిన మేఘనాదున
స్త్రమునకు బద్ధుఁ డైనయటు । తా నటియించి నినుం గలంచి న్యా
యమును వచించి లంకఁ గల । హర్మ్యములన్ దహియించి పోయె; నా
సమయము నిన్న మొన్న యనఁ । జాలుఁగదా పలుమాట లేటికిన్. 10

క. ఒక వానరమే యివ్విధి, సకలసురాదుల్ గనంగ । శౌర్యమహిమముం
బ్రకటించి లంకఁ గాలిచె, నిఁక నేమగు నట్టి వార । లెందఱో రాఁగన్. 11

క. ఈసూరతఁ గనఁబఱచెడు, నాశరవరు లెల్ల నప్పు । డాకపి నొకని న్
వే శస్త్రపాతనిహతుం, గా శమనునిపురికిఁ బంపఁ । గాఁ బూనరుగా. 12

క. కారణమిందుల కేమని, యారయఁబని లేదు శక్తి । యల్పమగుటయే
యా రావణ! యివ్వారల, శూరత నే నమ్మియుంట । చోద్యము కాదే. 13

సీ. ఆకపి కంతసా । హసవిక్రమంబులు, గలుగఁ గారణమేమి । తలఁపు మీవె
నామదికిం దోఁచు । న్యాయమువచియింతుఁ, బాపకార్యముఁ జేయఁ । బాలుపడితి
వం దన్యదారా । హరణరూపాఘము, సాటిలేనిది పాప । శైలమందు
నని తలంపుము దాన । నాయుర్వైశ్వర్యముల్, యశము కీర్తియుఁ జెడు । నందులకును

తే. సందియం బింతయే లేదు । సత్త్వహీన, తను సురారుల కొసఁగి యా । వనచరునకు
నిండఱకుఁ గల సత్త్వంబు । నిచ్చెఁ జుమ్ము, పాప మద్దియె యని తెల । సంగఁ దగును.

ఉ. దేనికిఁ గాని కర్మమె వి । ధిప్రహితంబగు హేతు వంచునో
దానవనాథ నమ్ముము శ । తక్రతు నొంచినవిక్రమం బదే
వానరునందు నిష్ఫలతఁ । బర్వఁగఁ జేయుటెగాక యోటమిం
గానఁగఁ జేసె; లంక నిటు । గాల్చుట యోటమిఁ గూర్చు టేకదా? 15

ఉ. ఇంకొక కారణంబు వచి । యింపఁగ నేటికి? నీదు మ్రోల నీ
కంకమునన్ జయమ్మగుట । యభ్రమె నాకిటు తోఁచుచున్న దే

ణాంకవిభూషణుండయిన నబ్జజుఁడైన శుభంబులియ్యఁగా
జంకుదు రిట్టికార్యము లెసంగెడువేడుకఁ జేయుటం గటా! 16

ఉ. సాగినకార్యముంగుఱిచి చాలఁ దపించుట నిష్ఫలంబు బా
గోగులు స్వీయకర్మగతి నొప్పుచునుండును గాన నింక నే
బాగుగనెంచి న్యాయమగువర్త్మముఁ ద్రొక్కుటమేలు రాముని౯
వేగమ కొల్వనేగఁదగు విశ్వనుతిం గనవచ్చు దాననే. 17

చ. నరపతిపాదయుగ్మభజనం బొనరింపఁగ నన్నుఁ బూన్చెదే
సురవరజేత నంచు నొకచొప్పున నెంతువా యేమొ రావణా!
సరసిజనాభుఁ డబ్జజుఁడు శంకరుఁ డీరఘురామరూపత౯
ధర నవతారమందిరని తత్పరతం దలపోయుమా మదిన్. 18

శా. నిన్ను౯ మించఁగఁజాలుశూరవరుల౯ నీమేలుగాంక్షించువా
రన్న౯ మేమె యటంచుఁ బల్కఁదగు నెయ్యం బొప్పు దైతేయుల౯
విన్న౯ నమ్మఁగవచ్చునే యెపుడు నీవృత్తాంత మం చాత్మలో
నున్నట్లే తగువారల౯ ఖరముఖోగ్రోత్సాహుల౯ రావణా! 19

ఉ. ఒక్కఁడె రాఘవుండు సమరోత్సవరంగమున౯ ముహూర్త మం
దొక్కఁడు దక్కకుండ విపులోరుభుజాబల ముల్లసిల్లఁగాఁ
దక్కిన మేలు దేవతను దర్శనమొప్పఁగఁజేసి రాఁగఁ బె
న్మక్కువఁ బంపె దానినొకమాఱు తలంపుము జ్ఞాన మొప్పెడున్. 20

ఉ. రాముఁడనంగ నెవ్వఁడని రావణ! నీకనుమానమున్న ను
ద్దామబలంబున౯ నిను నితాంతబలుం దనచంకనొక్కి సు
త్రామముఖామరుల్ కని ముదంబునుగాంచఁగ సాగరావళి౯
వేమఱు ముంచినట్టి ఘనవీరుని వాలిని ద్రుంచె నాకథన్. 21

క. తలఁచుకొను మొక్కమాఱుఁగఁ, గలిగినసందియము లెల్ల గడువడిఁ దొలఁగం
గలవట్టి లోకనాథుని, జలజాక్షుని శరణుచొరఁగ సంశయమేలా? 22

మ. కుమతీ! రాముఁడు సర్వకారణుఁడు దిక్కుల్ వ్యోమము౯ భూమి నీ
రము వాయ్వగ్నులు సూర్యచంద్రములు తారాసంఘ మింక౯ బదా
ర్థము లేవేవియొ యన్నియుం దనశరీరంబై చెలంగ౯ మహో
త్తముఁడై యొప్పు పరాత్పరుం డనుచుఁ జిత్తంబందు నూహింపుమా. 23

ఆ. సాటివానికడకుఁ జని శరణని వేఁడఁ, బాడగా దటంచుఁ బలుకుటొప్పుఁ
గాని పరమపురుషుఁ గనఁబోవు టర్హమే, కాదె సంశయంబు గలదె యిందు.

క. అతఁడె లోకశరణ్యుం, డైతగు బ్రహ్మాదు లతనియంఘ్రికమలముల్
ప్రీతి నుపాసింతురుగద, దైతేయేశా! చనంగఁ దగదే యిపుడే. 25

చ ధరణికుమారి భక్తిమెయిఁ । దల్లినిగాఁగఁ దలంచి తోడుకొం
చరిగి మహాపరాధి శర।ణాగతుఁడన్ ననుఁ బ్రోవవయ్య! శ్రీ
వర! రఘువర్య! యంచు భయ।భక్తులతోడ శిరోవ్రజంబు త
చ్చరణసరోరుహద్వయము।సన్నిధి నుంచినఁ గాచు నాతఁడున్. 26

క. పరిపంథి యీతఁడని యె,త్తరుణంబునఁ బల్కఁ డతఁడు । తత్త్వజ్ఞుండై
నిరుపమకృపాబ్ధి యగుటన్, ద్వరపడుమా యింకనైన । దానవనాథా! 27

చ. మనమున లజ్జఁబూనకుము । మాధవుఁ డాతఁడుగాని భూమిభృ
త్తని యిసుమంతయేఁ దలఁప । నర్హుఁడు కాఁడుసుమీ మదీయవా
క్కును విని నిన్ను మమ్మసుర।కూటము బాగుపడంగఁ జేయు నా
వనరుహపత్త్రలోచను నభంగురయత్నుని వేఁడఁ బొమ్మికన్. 28

క. నీమానస పదమందున్, భూమానందుండు సర్వ।భూతావాసుం
డేమాడ్కిఁ గనఁగరాకయె, స్వామి యనందగి వసించు । సతత మసమతన్. 29

క. ఆపరమపురుషుఁ గనఁగా, నోపుదువే యతఁడెసుమ్ము । హుతవహురీతిన్
రూపము తేజస్సంవృతిఁ, జూపట్టఁగ నవతరించె । క్షోణి మనుజతన్. 30

ఆ. అట్టిరాముకడకు । నరుగుట లజ్జయే, తపముబలిమి కలిమిఁ । దగినమును లె
దర్శనంబు గోరి।ధన్యులుగాఁదగ, నెంచుచుందు రనఁగ । నెంత మనము. 31

క. మూలప్రకృతియె జానకి, శ్రీలలన యనంగ ధర్మ।సిద్ధిగలుగు న
ట్లోలి దురాత్ములఁజంపఁగఁ, జాలిన రూపమునఁ బుట్టె।క్ష్మాపుత్త్రి యనన్. 32

సీ. ఈరహస్యం బింత।యే నెఱింగితిఁ, నామాటలాలించి । న్యాయ్యమెంచి
సీతామహాదేవి । యీతతిఁ గొనిచని, రాముని కర్పించి । యామహాత్ము
పాదముల్ నీశిరః।పటలమునం జేర్చి, శరణాగతుండ నీ।చమతి నన్నుఁ
గాపాడుమాయని । కడుభక్తివినయముల్, గ్రాలఁ బ్రార్థింపుమా। కాంతుఁడతఁడు
తే. నిన్నుఁ గాపాడు దాన మే।మున్న యట్లె, యగును దైత్యకులంబిల।యందునుండఁ
జాలునొకకొంత కాలమో।శౌర్యధుర్య, పౌరుషముమానవయ్య నా।పలుకువినుము.

చ. అని బహురీతులం దెలుపు।నార్యు విభీషణు నీతిపారగుం
గనుఁగొని నేత్రగోళములు । గాఢహుతాశనకీలజాలముల్
కనఁబడఁజేయ రావణుఁడు । కాలవిదుత్తముఁడయ్యుఁ గర్మమే
తనునొగిఁ బ్రోత్సహింపఁ గడు।దారుణమూర్తిగఁ జూడ నొప్పుచున్. 34

చ. పలికెద వేలయిట్లు కుల।పాంసన! నీకడ నేర్చుకొందు నీ
తుల నిఁకమీఁద బాలిశత । ధూర్తత నీయెడఁ గాననయ్యె నీ
చులఁ గనఁబొమ్ము నీవనుచుఁ । జుల్కన నేసితి నన్ను నింక నీ
తులువతనంబు మాపఁదగు।దోషము లబ్బును దాని మానినన్. 35

చ. పరునిపదంబులందుఁ బడి § ప్రార్థనచేయుము నీవటంచు సో
దరుఁడవుగానఁ బల్కితివి § దానవసంఘము గావఁబూని యీ
శ్వరుఁడిల రాముఁడయ్యెనని § చాల ముదం బొనఁగూడుపల్కులా
దరమునఁ దెల్పితీవు నిను § దైవతమట్లు తలంపఁగాఁ దగున్. 36

ఉ. మానులుగూడ నీకడకు § మానకవచ్చి గురూపదేశవి
జ్ఞానము నొంది పోవఁదగు § సన్నుతశీలుఁడవన్న నీవె నే
నీనుడు లింతదాఁకఁ గొన § నేరకయుండుట పెద్దతప్పుగా
మానస మిప్డు తెల్పెదు సమస్తవిదుత్తమ! సోదరోత్తమా! 37

ఉ. చాలును నీదువాక్కులిఁక § సంతసమబ్బెను నాదుసన్నిధిన్
గ్రాలు దురాత్ములందు క్షణ § కాలము నిల్వఁగరాదు నిన్ను నుం
బోలు మహాత్ములంచు నొక § పోలికఁ బల్కి దురాత్మ! జ్ఞాతివై
మేలునుగోరుచందమున § మిక్కిలి నీతులఁ దెల్పితివ్విధిన్. 38

చ తొలఁగుము నాసమక్షమునఁ § దోఁచుట కర్హుఁడవెట్లుగావు నీ
వలన సురారివంశ మిల § వర్ధిలఁజాలక యంతమొందఁగాఁ
గలదని తోఁచెడుం గులముఁ § గాల్పజనించినవాఁడ వీవు; నీ
తులువతనంబుఁ జూపితివి § దుష్టనిశాచర! యోవిభీషణా! 39

క. చాలునిఁకన్ నీవలనన్, మేలేచేకూరు దాని § మించిన వేడ్కన్
బాలింపఁ బూనువాఁడను, బాలకుఁ డారాఘవుండె § పరశివుఁ డతఁడే. 40

ఉ. మ్రొక్కెద రాఘవాంఘ్రులకు § మోములువంచి నయంబుమీఱఁగా
దిక్కఁకనీవె నాకనుచు § దీనతతోఁపఁగ వేఁడుకొందు; నీ
తక్కను దోఁడుకొంచుఁజని § యాతని కప్పనచేయువాఁడ నీ
వొక్కఁడవే హితుండవన § నుర్వినిఁ కెవ్వఁడు లేఁడు తమ్ముఁడా! 41

చ. అని పరిహాస ముట్టిపడు § నట్లుగఁ బల్కుచు వంశదూషకా!
చనుమిఁక నాదుసన్నిధి పొ § సంగదు నీకువసింపఁ జోటుగా
దనుజకులంబుఁ గావ గురు § దర్పుని రాముని నాశ్రయింపు నీ
వినుతికిఁ బాత్రుఁ డాతఁడె సావిత్రియనంజను సీతయుంగదా. 42

క. అని పలుకుచుఁ జీచీయిఁకఁ, జనుమని మోములను క్రోధ § సాంద్రంబులుగాఁ
గనఁబఱచుచుఁ బల్కిన నా, తనిఁజూచుచు లేచి ఘనగ § దాహస్తుండై. 43

ఆ. అంబరమున కెగసి § యన్నవు నీవని, నీతిఁ దెలిపినాఁడ § ఖ్యాతిగల్గు
దాన ననుచు నీవు § దర్పంబునన్ దాని, వినవు మేలుసుంత § గనవు నిజము. 44

ఉ. నిన్నిట నాశ్రయించి యవి § నీతిపథంబును నీవుద్రొక్కఁగా
మన్ననచేయుచున్ సభల § మంచి దిదంచు వచించుచున్ సుసం

పన్నతఁగాంచి నట్లు బహు।భావుకముల్ లభియించినట్లుగా
నెన్నుచు నుంటకంటె జగ।దీశునిగొల్చి తరించు టొప్పుగా. 45

క. ఇదెపోయొద సర్వేశ్వరు, సదమలపాదారవింద! । జలజయుగము స
మ్మదమునఁ గొల్చెద స్థిరశ,ర్మదపదముం గనఁగఁగోరి । మన్మంత్రులతోన్. 46

చ దనుజవరేణ్య! నీసుఖము । తప్పక కోరి వచించినాఁడ దా
నిని గొనవైతి వింక నల।నీరజనేత్రునివంక లంక నీ
దనుజులపొందుమానును; ని।దానము దానికి నీవె; యింక నేఁ
జనియెద శర్మముం గనుచుఁ । జాలయశస్సును బ్రోగుచేయుమా. 47

వ. అనిపలుకుచు ననలశరభసంపాతిప్రఘసు లనునల్వురు మంత్రులుకూడ రాఁగదలి దివ్యాంబరభూషణభూషితాంగుఁడై చనిచని సముద్రంబు దాఁటి యవ్వలి తీరంబుఁ జేరఁబోవ నాతనిరాకంగాంచి కపితల్లజు లుల్లంబులఁ బరిపరివిధంబుల నాలోచించి; రంత వారలకల్లోలంబు వినియు నార్తత్రాణపరాయణుండు రాముండని తలంచి యవ్విభీషణుండు తదాశ్రయంబుఁగోరి యభ్రముననుండి యందఱువిన నిట్లనియె. 48

చ. వనచరులార! రావణుని।వర్తన మెల్ల నధర్మమాట వా
నిని విడనాడి సత్కృపకు।నీరధియంచు ననాథరక్షకుం
డనుచు జగత్ప్రసిద్ధిగను । నారఘురాముని రక్షణంబు గో
రను జనుదెంచినాఁడను బు।రప్రహితుండని యెన్నఁబోకుఁడీ. 49

క. శరణాగతుఁడని దైత్యే,శ్వరునకు ననుజన్ముఁడనని । వానిపదలి మీ
పరిసరముఁ జేరితి ననియు, సరగున రామునకుఁదెల్పఁ।జను నిఁక మీరల్. 50

క ఆమాటలు చెవిసోఁకిన, ధీమంతులు నయ్యుఁగపులు । దీనివిధం బా
రామున కెఱిఁగింత మతం, బేమనునో యట్లచేయ । నెన్నుదమవలన్. 51

తే. అనుచుఁ దలపోసి శ్రీరాము।నంతికమున, కరిగి చేతులుజోడించి । యతనిపలుకు
లున్నవున్నట్లు వినిపించి । రన్నరాధి,నాథుఁ డాలించి వారినం।దఱను గాంచి.

సీ. మీ కెట్లుతోఁచునో । నా కెఱిఁగింపుఁడీ, యనిన సుగ్రీవాదు । లరులు మోస
మూని యివ్వీధిఁ జేరి । యొక్కెడ నంతర, మెఱిఁగి హింసింతు; రీ।తఱి నితండు
శత్రుపక్షమువాఁడు । శరణుసొచ్చిననైన, వదలక చంపఁగా।వలయునిదియె
మామతంబని; కపి।త్మాపతి మొదలగు,వా రొక్కరీతిని । బలుక హనుమ

తే. యతని నీతివిశేషంబు।లాసభఁ దనుఁ, గూర్చి చెప్పినవిధమెల్ల । గొంక కెఱుఁగఁ
బలికె నంతట శ్రీరామ।భద్రుఁ డెల్ల, వారు వినఁ జెప్పె నిట్లాత్మ।భావ మెల్ల.

చ. కలవు స్మృతివ్రజంబున ని।కామము మోదము నిచ్చుధర్మముల్
పలువురు వానిఁగొల్చి యఘు।పంకముఁ జక్కఁగ బాసి పుణ్యవా

ర్థులను మునింగి తేలుచు విధూతమనోరథులై క్రమంబునన్
లలితపదంబునొందుచుఁ జెలంగుచు నిప్పుడు నున్నవారటన్. 54

తే. వానియం దెక్కుఁడనఁబడు వానరేంద్రులార! శరణాగతత్రాణమారయంగ
నుత్తమోత్తమఫలదమై యొప్పుచుండు, రాజధర్మంబులం దది ప్రబలమతము

చ. అరియయినన్ సమక్షమున నంజలిఁబట్టి క్షమించుటొప్పు నీ
శరణము వేఁడినాఁడ ననుసాధువచస్తతిఁ బల్కెనేని సో
దరునిగ నెంచి కావఁగ ముదంబును గాంచితి; నా ప్రతిజ్ఞ యి
క్కరణియె; దీన రాజ్యము సుఖంబులు పోయిన మాన నెత్తెఱిన్. 56

క. దానిని మించిన దేదియు, మానసమున కింపుగూర్పమాడ్కిఁ గనఁబడం
గానైనది లేదనియే, నానిశ్చయ మిద్దియే దినంబునకైనన్. 57

క. ఇదిమార్పునొందఁ జాలదు, సదయాత్ములు మీరలౌటఁ జక్కనిధర్మం
బిదియే యని నెఱనమ్ముఁడు, ముదమునఁ దోడ్తెండు దైత్యముఖ్యుని నతనిన్.

క. ఈతనువున నేఁ జేయఁగఁ, బ్రీతిం గను కార్యమిదియె వేఱొక్కఁడు నా
చేతస్సునకుం దోఁపదు, దైతేయుం దోడితెండు దైవము తోడా. 59

సీ. ధర్మమార్గమున వర్తనముఁ బూనుట మేలు, గలదందు వర్తింపఁగా శుభంబు
లొదవు నాకని యెంచి సదమలరీతిచే, వర్తింపఁగాఁ గల్గుబాధ లెల్లఁ
బరమేశ్వరానుకంపావిశేషమ్మునఁ, దమయంత తొలఁగు నంతట సమస్త
శుభములు పొడచూపు సుజనులు మెత్తు రా,యమలాత్ముని పెద్దలనుట వినరె
తే. ధర్మమును నమ్మువారికి ధర్మరూపుఁడైన పరమేశ్వరుండు తోడై సమస్త
కష్టరాసులఁ దొలఁగించి కాచు వారి, కక్షయపదంబు చేకురునట్లు చేయు 60

క. తనువిది యస్థిరమని మీ, మనముల నమ్ముదురుగాదె క్ష్మాస్థలి ధర్మం
బునునమ్మి కష్టసంతతి, గనువారలెఁ గీర్తిరూపకాయము వెలయన్. 61

ఉ. ఇప్పటికున్నవార లిఁక నెప్పటికిన్ నశియింపకుండ రా
చొప్పున మీరు వర్తిలఁగఁ జూడుఁడు; తుచ్ఛశరీర మిద్ది యా
నెప్పుడు పోవునో తెలియ దింతకు మించు యశశ్శరీరమే
యొప్పటికుండఁ జాలును గపీశ్వరులార! యెఱుంగుఁ డీవిధిన్ 62

చ. వదలుదు సోదరాళిఁ బ్రియబంధుజనంబును మిత్రులన్ సతిన్
వదలుదు నీప్రతిజ్ఞ నెటువంటివిపత్తులయందుఁ గాని నే
వదల నటంచు నమ్మఁదగు వైళమ యాదితిజన్ముఁ దోడితెం
డిదె యద నంచు నమ్మఁదగు సర్వవిధిం బొనరింప నాకిటన్. 63

క. అని పలుక నెల్లవానరు, లనూనమోదంబునొంది యప్పుడె చని యా
దనుజేంద్రుని సోదరునిన్, వినయగుణాభరణునిన్ విభీషణుఁ గడఁకన్. 64

క. శ్రీరామునాజ్ఞఁ దెల్పుచుఁ, జేరంగాఁ దెచ్చి రంత । స్మితముఖుఁ గరుణా
నీరధి దాశరథిం గని, కోరికమీఱంగ మ్రొక్కి । కోరెం గావన్. 65

మ. పరమేశా! నిను దిక్కుగాఁగ మదిలో । భావించి నీపాదపం
కరుహంబుల్ శరణంబు నాకనుచు నిక్కంబెన్ని నే వచ్చితిన్
శరణార్థి న్ననుఁ బాదసేవకునిగా । సమ్యక్కృపం గాంచు దు
ర్భరసంసారమహాబ్ధినుండి తరియింపం జేయవే యుత్తటిన్. 66

ఉ. రావణుఁ డాడినట్టి వినరానివచఃపవులం గలంగి న
న్నేవిధిఁ గాచువా రవని । నెందును లేరని యార్తరక్షకుం
డా వసుధాధిపుండు కరుణాంబుధి శ్రీరఘురాముఁ డంచు నే
భావనచేసి నిన్నుఁ గనవచ్చితి నన్ననుకంపఁ బ్రోవుమా. 67

క. నేనేదిక్కుగ నెవరే, మానసముల నమ్మి కొల్చుమహితాత్ములకున్
నేనే యోగక్షేమము, లూనిన శ్రద్ధన్ జెలంగ । నొగిఁ జేకూర్తున్. 68

క. అనివచియించితి వీవే, వనజాక్షా! భక్తరక్ష! । వరమునిపక్షా!
ననుఁగాచుట నీపనియే, యని సంప్రార్థింతు ననుచు । నంజలిఁగూర్పన్. 69

చ. అసురకులైకభూషణు మహాఘవిశోషణు నవ్విభీషణుం
వెసఁ దనుఁ జేరఁగాఁ దిగిచి । విశ్రుతకీర్తివిగమ్ము వత్స! న్యా
యసమధికాంతరంగమున । నన్వహమున్ దిరుగంగ నేర్చునీ
కసురత నామమాత్ర మగుఁగాని సురత్వమె నీకుఁ జెల్లుగా. 70

క. రావణు దుర్భాషణముల, భావము దురపిల్ల నిటకువచ్చితి విఁక నీ
కేవిధముగ బాధలు లే, కీవిశ్వనుతిం గనంగ । నే తగుదువుగా. 71

క. నాకనుజులు నల్వురు గల, రీకడ నీవొక్కఁడవుగ । నెన్నఁబడితి వో
శ్రీకరవృత్త! విభీషణ!, నీకిఁక భయమేమి కల్గ । దేవిషయమునన్. 72

సీ. అని రాఘవుఁడు పల్కి । యంత లక్ష్మణుఁ గాంచి, సహజ! తెప్పింపుమా సాగరోద
కముల లంకారాజ్యకమల నొందెడునట్టు, లభిషేక మొనరింతు ననఁగ నాతఁ
డట్లు చేయంగ మహాసురరాజ్యమునకు రాజుగాఁ జేసె । సకలకపుల
మ్రోల నంతటఁ గపీంద్రుఁడు చెంత కరిగి శ్రీ,రాఘవా! యిట్టులే రావణుండు
ఆ. నరుగుదెంచి శరణమని వేఁడ నేమందు, రనిన నతని భావ మరసి స్మితము
వెలయ నార్య! యతఁడు । వేఁడు నే గోసల, జనపదంబు నిత్తు । సంతసమున. 73

చ. భరతుఁడు నాదుమాటలకుఁ । బల్కఁడు వేఱుగ నుత్తరంబు సో
దరు లిటు బుద్ధిమంతులయి । ధాత్రి విశాలయశంబు గాంచుటే
పరమశుభంబు నాకనుచుఁ । బల్కిన మాటల నాలకించి య
చ్చెరువు గనెం గపీశ్వరుని సేనలు రామునిబుద్ధి నెన్నుచున్. 74

మ. కలదే యిట్టివిచిత్రముల్ జగతి నెక్కాలంబునం దున్నయ
ట్టులు గా వింటిమె యెన్నఁడే ననుచుఁ జోట్టుల్ మూఁగి కొండాడి ర
ప్పలలాశాగ్ర్యుఁడు మంత్రియుక్తుఁడగుచున్ భావించె శ్రీరాముఁడే
కలిగెన్ నాకిట రక్షకుండుగ జగత్కల్యాణముం గూర్పఁగన్. 75

క. అనితలఁచె నంత సాగరు, ననుమతిరీతిగఁ గపీంద్రులాభల్లుకముల్
చని గండశిలలు కొండలు, కొనితెచ్చిరి సంభ్రమందుఁ గోరికవైవన్. 76

చ నలుఁడను వానరుండు జతనంబున వాని స్పృశించుచున్ జలం
బులఁ బడవైచు నయ్యవియు భూమిపయిం బడవైవ నుండురీ
తులఁదగి యుండె; నచ్చెరువుతోఁపఁగఁ జేయుమహోద్యమంబునన్
జలధిని గట్టి రెల్లత్రిదశప్రవరుల్ గని మేలుమే లనన్. 77

ఆ. బ్రహ్మసృష్టిఁబోలి వనచర సృష్టి య,య్యబ్ధి విచిత్రరీతి నమరియుండె
సేతు విట్లుకట్ట శ్రీరామలక్ష్మణు, లావిభీషణాదు లరిగి దాని. 78

క. పరికించి మహాద్భుతముఁగఁ, బరఁగెడునద్దానిమీఁద బహుమోదమునన్
దరుచరవరులం దోడ్కొని, యరిగిరి దేవతలు చూచి యచ్చెరువందన్. 79

చ. కపిబల మింతమాత్రమని కన్గొనశక్యము గాకయుండె; దా
నిపరిమితిన్ గణింపఁగను నిశ్చయ మింతయెయంచుఁ జెప్పనా
గపతికి బ్రహ్మదేవునకుఁ గా దనశక్యము; దక్కవారిఁ జె
ప్పుపని యదేల? ధాత్రి కనఁబోలును వీరల నంచుఁ జెప్పనా. 80

ఉ. సేతువుమీఁదఁ బోవుతఱిఁ జెప్పగ సాధ్యముగాదు వానర
వ్రాతము చేయుచేష్ట లిటువంటివటంచు నదేరికైన ని
ట్లాతతశక్తిమీఱఁ జని యంబుధిదక్షిణసీమఁ జేరి భూ
జాతను గాంతు మెప్పు డనుసంతసమొప్పఁగ నుండి రంతటన్. 81

క. శ్రీరాముఁడు సౌమిత్రియు, సామీరియు లోనుగాఁగ సకలకపీంద్రుల్
శ్రీమహిత నివాసంబై, భూమికి శృంగారమగుచుఁ బొలిచెడు లంకన్ 82

క. కనుఁగొన సువ్విళ్లూరుచు, దనుజుల మార్కొనఁగ స్వీయదర్పముఁ జూపం
గను సమయ మెప్పు డనుచిం,తనుగూడి వసించిరంత దనుజపురమునన్. 83

సీ. రావణుఁ డత్తఱి రాముని రాకను, విని కపిసేనలఁ గనెడు కోర్కెఁ
బ్రాసాదమెక్కి సారణుఁడు శుకుండను, చారులు చెప్పంగఁ జక్కఁగాంచి
యచ్చెరుపడియె సంఖ్యకుమించి యయ్యది, కనఁబడుటను, సైన్యమునకు నెవరు
నాయకులో వార లేయెడ నుందురో, యట్టివా రెందఱో హరివరబల
తే సంఖ్యయెంతయుఁ దెల్పెనుసారణుండు, దానిగాంచియు నిస్పృహతను బొరయక
మంతనముచేయ నేగె సామంతదైత్య, పతులుగొల్వంగ జయకాంక్షపరిఢవిల్ల

క. అదట రాముఁడు సుగ్రీవాదులుతో నడువ లంకయంతికమున నె
త్తాదివమును దాఁకఁగ స, మ్మోదంబునఁ బెరిగినట్లు పొలుచు నగంబున్. 85

చ. జలధి తరంగబాహువుల సంతతమున్ దను సంస్పృశింపఁ గాఁ
జెలఁగుచుఁ దారకాగణముఁ జేరఁగఁబోవఁగ సాగియున్న కొ
మ్మల కనురూపమూలముల మండితమైతగు వృక్షరాజి యి
మ్ములఁ గనుపట్టనొప్పు గురుభూధరమున్ దమి నెక్కఁబోయెఁ దాన్. 86

చ. ధరమది యున్నతం బగుచుఁ దావులతావలమైన పట్టులన్
బరిసుతమాచు నిట్టిగిరివర్యము చూడము ముందు నెన్నఁడే
సరియన దీనికిం గలదె త్ర్యాధర మీయిల నంచుఁజెప్పఁగాఁ
దరమయియుండ నెక్కెఁ గపితల్లజు లెక్కరి మోద ముబ్బఁగన్. 87

క. ఆలంకాపురవరము మ, హాలంకృతిఁ జూడఁ దగినయట్లుండె మహీ
పాలుఁడు రాముఁడు దానిని, జాలన్ వీక్షించి సంతసంబునఁ బొదలెన్. 88

ఆ. ఒకనికారణమున నొప్పులకుప్పయౌ, పురవరం బిదియును బొలుపుదక్కి
చెడఁగ నున్న దకట సిద్ధించునే యెందు, ఖలులమైత్రివలనఁ గలుములెపుడు.

క. దీనికిఁ జెడుకాల మ్మిగా, దానవవిభుదుష్టకర్మతతిఁ బ్రాపించెం
గాని నుతింపందగి మ, న్మానససంతృప్తి గూర్చె మాట లిఁకేలా? 90

క. అనితలపోయుచు నందే, యనుజాదులుగొల్వ నుండె నంత నచట దు
ష్టనికరపరివేష్టితుఁడై, వనచరపతిగూడి భూపవర్యుఁడు రాఁగన్. 91

తే. ఏమిచేసిన వీరెల్ల నిందె చత్తు
రనుచు రావణుఁ డెంతయు నాత్మ నెంచి
శాంబరిని జూపఁదగునట్టి సమయ మిదియె
యగును వేఱొక్కపనిచేతఁ బగ యుడుగదు. 92

చ. అని తలపోసి మాయయనునట్టి మహాద్భుతవిద్యయందు నే
ర్పును గనువాఁడుగాన మదిఁబుట్టినయాతలఁపున్ ఫలింపఁ జే
యను దగువాఁడు భూరిబలుఁడై పురిలోపల ఖ్యాతిఁగాంచి మ
న్నన గనువాఁడు నొదితిజనాథుని నొక్కని బిల్వఁ బంచినన్. 93

క. ఆవిద్యుజ్జిహ్వుఁడు ప్రియ, మావహిలం జేయ రాఁగ నసురవరేణ్యా!
భూవిభుపత్నిని సీతను, గావింతము మోసపోవఁగా నిచ్చోటన్. 94

సీ. దాన నాకార్యము మానుగ ఫలియించు, మాయచే శ్రీరామమస్తకంబు
సశరసాయకమును జక్కఁగ నొనరించి, తెమ్ము నాకడకు వేగమ్మున నని
పనిచి తానాయుపవనసమీపంబున, నుండ నాతండట్లె యొనరిచి వెసఁ
దెచ్చిన వానికి దివ్యభూషణమొందు, పారితోషికమిచ్చి పంపివైచి

ఆ. యుపవనంబుఁ జొచ్చి తపనపుత్త్రాదుల, రాక వినుచుఁ దనదుశోక మింత
విడిచియుండు సీతఁ కడకేగి కళ్యాణి, యెంత వేఁడుకొనిన నెలమిఁగనక. 95

చ. మనమున నెవ్వనిన్ నిలిపి మాపయిఁ గోపమునూని యుంటివో
జనకజ! యట్టినీమగఁడు సంగరమందు మృతిం గనెంగదా!
యనుజునితోడఁ దక్కిన మహాకపులందఱు రాక్షసాళిచేఁ
దినఁబడి రంట వాయుజుఁడు దృష్టనిశాటుని నోటనే పడెన్. 96

చ. హరిబలమెల్లనున్ మదగజాంఘ్రులఁ ద్రొక్కుచుఁ జూర్ణమయ్యెని
త్తరుణమునందె నంచు నొకదానవిఁ బిల్చి రణంబునుండి భూ
వరు తలఁ దెచ్చినట్టిగురుబాహుని విక్రమధుర్య భూరిసం
గరమునఁ బేరుగన్న హరికల్పుని మామకమిత్రు నిప్పుడే. 97

ఆ. తోడుకొనుచు రమ్ము వాఁడె విద్యుజ్జిహ్వ, నామకుం డటన్న నాతిమిన్న
పరుగువాఱి దనుజవరుని వానింబిల్చి, కొనుచు వచ్చె నంతఁ గ్రూరభణితి. 98

క. పౌలస్త్యుఁ డిట్టుపలికెన్, బాలామణి సీత నమ్మపాటిగఁ దద్భూ
పాలుని శిరముం జూపుము, వాలికతూపు గలయట్టి బాణాసనమున్. 99

క. సీతకుఁ గనఁబఱపుము నా, నాతం డవ్వానివైచె నంతట వానిం
జేతము శోకాంబుధిలో, నాతతి మునుఁగంగ, నేడ్చె ననదయుఁబోలెన్. 100

క. మనమున సర్వమెఱింగిన, వనజానన మాయయనఁగ వ్రాలుప్రకృతి యా
దనుజుని భావం బెఱుఁగుట, వనితల కాసరణిఁ దెలుపువాంఛయె లేమిన్. 101

క. పలుభంగుల విలపించెన్, పలాశనస్వామి యంత భామామణి యూ
హల నెఱుఁగువాఁడు కావున, నిలువక పురికేగె నచట నిలువఁగ రామిన్. 102

ఉ. దానవుఁ డేగినంత వనితామణిఁ గాంచి విభీషణాఖ్యుఁ డా
మానిని చెంతనుండి యనుమానములన్ నశియింపఁ జేయుచున్
మానసవృత్తిరీతి బహుమానముగాఁ జరియింపనుంచెఁ బెం
పూనినపుత్త్రికన్ సరమ నూహలఁ జక్కనెఱుంగు నేర్పఱిన్. 103

తే. న్యాయముగ సంచరించుజనంబులకును, మృగములుంబక్షులుంగూడ మేలు చేయఁ
దోడుపడు నన్న సూక్తికి జాడనిద్ది, తగినదృష్టాంతమనిచూపఁదగునుగాదె.

క. ఆసరమయు సీతంగని, మోసంబిది కృత్రిమంపుముఖ మిదె కనుమా
యూసరణిఁ గాంచుచుండిన, నీసాయక చాపశిరము లెందే నరుగున్. 105

క. నామాటలనమ్ముదు వపు,డో మానిని! రాక్షసేంద్రునూహల నెల్లన్
వేమాఱు లెఱిఁగియుండుట, నీమాటలు పల్కవెరవునేఁ గంటి సతీ! 106

క. అని తెలుపుచుండ నయ్యావి, చనియె నదృశ్యంబులగుచు జానకియు మనం
బున సంతసంబు గదురఁగ, వనమున నటనుండె; రాఘవప్రియకాంక్షన్. 107

### యక్షిణీదేవతా ప్రభావము.

ఉ. రామునిశీర్షమెట్టు లనరానియటుల్ కనుఁగొన్న వార లా
రామునిమస్తకంబె యిది ప్రాణముపోయిన దిప్పుడే యగుం
గోమలతం దొలంగమి యగుంగద దాననె యంచుఁ జెప్పఁగా
నీమహి నొప్పుచందమున నెయ్యది చేసె నెఱుంగనౌఁగదా! 108

ఉ. దీనికె మాయయన్న ప్రథ తెల్లముగాఁ ధరఁ బర్వియుండు కా
దేనిది దేన నయ్యెనని యెన్నఁగనౌఁగద మంత్రసిద్ధియే
దీనికి మూలమౌ ననుచు ధీమహితుల్ వచియింతు రెట్టిచం
దాన ననంగశాస్త్రమె నిదానము దీనికి నుత్తరం బిడన్. 109

సీ. పామరజనులకు భక్తిని గల్గింప, శంకరుఁడే మంత్రసమితిఁ దెల్పె
శాబరములు నాఁగఁజను నట్టిమంత్రముల్, శబరవేషంబున శంకరుండు
నరునకు వరమీయ నరిగినప్పుడు హైమవతియుఁ దత్పత్నియై పతివెనుక నె
యరిగె నప్పనితీఱ నగజాత శంకరా!, వేదాధికారంబు విధిగ లేని
తే. జాతులకు నీదుదర్శన మే తెఱఁగునఁ
గలుగువారికి నినుఁగొల్వఁగాదగునటు
మంత్రముల నిర్వచింపుమా తంత్రములను
యంత్రములఁ దెల్పుమా వానికనుచు వేఁడ. 110

మ. కరుణానీరధి శంకరుండు హిమవత్కన్యామణిప్రశ్నముల్
ధరణిం బొల్చెడుపామరావళికి సంతానద్రుమంబట్లు దు
స్తరసంసారమహాపయోనిలయముల్ దాఁటింపఁగాఁ జాలు నో
ధరణీధ్రేంద్రకుమారికా! వినుము మంత్రశ్రేణులం దెల్పెదన్. 111

క. అవి శాబరము లనంగా, నవనిం బ్రఖ్యాతిఁగాంచెనౌ శబరుఁడ నై
వివరింతుఁ గాన నాహ్వాయ, మవితథముగ నల్లిచెల్లు నమ్మనుతతికిన్. 112

చ. కలుగును దంత్రయోగములు కాంతరో వానికి నంచు శంభుఁడే
తెలిపెను; యక్షిణీగణము తీవరమే ఫలమిచ్చు యంత్రతం
త్రలలితపూజ లందు బహుధావినుతంబులు తత్ప్రకారముల్
సులభము లందుఁ జిత్తపరిశోధన మొక్కటియే ప్రధానమౌ. 113

సీ. వానింజపించిననౌ నిష్టసిద్ధియం, చొకరీతిఁగనఁబడుచుండు నందుఁ
గొలఁదిదినంబు లిమ్ముల నద్దిసాగిన, దేవత కనఁబడి యేవరంబు
కోరుదువో తెల్పు మారసి యనిపల్కు, నేమికోరిన నది యిచ్చి చనును
గాని తద్దర్శనకాలంబునం జిత్త, మత్యంతభక్తిచే నమరియుండ
తే. వలయు నం దింతలోపంబు కలుగునేని, ప్రాణహానియౌ తజ్జపఫల మగునని
నియమమొప్పెడుజపమల్లి నెగడనేని, కామ్యఫలములుకొఱంత లేకయె చెలంగు.

క. ఎందున్నవారి వార్త వి, నందగియేయున్న మంత్రనాయిక నడుగన్
బొందుగఁ జెప్పు నుపశ్రుతి, గం దానిం బిల్వవలయు క్షణసిద్ధి యదే. 115

చ తనువెది చూడనౌనను ముదం బెదఁగల్గిన యక్షిణీన్ విధిం
చినయటు పూజలం దనిపి చిత్తమునం దిదికోర్కి నాకు సి
ద్ధినిగనఁ జేయు మా యనుచు ధీవిభవంబలరార వేఁడ దా
నిని గనఁ జేయు యక్షిణియె నేర్పుతగంగ నిదా నదే యనన్. 116

క. ఈసిద్ధి క్షణికనామక, మేసరణిం గనిన ననుచు నెన్నందగు ని
ట్లే సకలసిద్ధులం గనఁ, గా సమయము లెల్లఁ జెప్పఁగాఁబడె నందున్. 117

ఆ. వానిఁదలఁచి విధుల వదలక భక్తిమై, యక్షిణులను గొలువ నభిమతములు
సిద్ధి నొందుచుండుఁ జిత్రమ్ములుగ నవి, కానఁబడుచునుండుఁ గనుల కవ్వి.

చ. మతివిభవంబు పేర్మి గను మాన్యులు స్వల్పఫలంబు బొసంగి దు
ర్గతికిని మూలమై తగి పరవ్రజహాని నొనర్పఁ జేయ స
మ్మతి గొలుపంగ నర్హమగు మంత్రగణంబును దాని మాని స
ద్గతి గనఁ జేయు మంత్రములఁ గైకొని భక్తి జపింతు రెత్తతిన్. 119

సీ. శాబరమంత్రముల్ శంకరుఁడే తెల్పె, హానిగూర్చెడునట్టివాని నేల
యని సందియంబొంద ననువుగాకయొయుండు, నుత్తమఫలములిట్లొప్పకుండు
నచిరకాలమున నట్లొట నెవ్వరువానిఁ, గోరక శీఘ్రంబె కోరినట్టి
వాంఛలఁదీర్చు నవ్వాని గ్రహింతురు, దాన నాస్తికతయె యూనకుండు
తే. మది ననుచు నెంచి భక్తియన్ మార్గమందు
మనసు నడువంగఁ జేయ నీమంత్రములను
దెలిపెఁ గామ్యంబులం గోరి తివిరి వాని
నాశ్రయింతురు పామరు లైనవారు. 120

చ. ఫలములనొందుపొంటె గురుభక్తిని దేవత నాశ్రయించుటల్
కలుగును; దాన భక్తియు నికామము వృద్ధినిగాంచు; దానికే
విలయమునొందు దుర్విషయవృత్తులు దాననె నిర్మమత్వ మ
ట్లలవడుఁ గోరఁగాఁదగిన దద్దియె కాదె తలంచిచూచినన్. 121

క. ఇన్నింటికిఁ గారణమే, మన్నన్ గామ్యంబె కాదె యద్దానికి ని
ట్లిన్ని తెఱంగుల మంత్రము, లెన్ని మహేశ్వరుఁడు తెల్పె నిదె హేతువుగాన్.

చ. కనుక నుపాసకుండు చిరకాలము కామ్యఫలాళిఁ గోరియై
నను మది దేవతం గొలిచినం దదుపాసనచేతఁ గామ్యమే
లను నొకయూహ కల్గఁజను నయ్యదియే ఫలమెల్ల దేవతాం
ఘ్రినళినయుగ్మమందు నురరీకృతభక్తి నిడంగఁ జేసెడున్. 123

ఆ. ఇట్టిసిద్ధిఁగోరి యీశుండు శాబరీ, మంత్రములను నిలుచు మాడ్కిఁ జెప్పె
వానినే సతంబు వదలక సేవించు, వారె యల్పమతులు ధారణిపయి. 124

చ. దనుజవిభుండు రావణుఁడు తత్సచివోత్తములందుఁ గొంద ఱ
మ్మనుగణసిద్ధి నొంది రది మానసధైర్యము నిచ్చుచుండు నీ
తను వగపాలుచేయ సతిధర్మమువీడు నటన్న నమ్మికం
గని జతనంబువూని రఘుకాంతుశిరంబును జూపి రత్తఱిన్. 125

క. అదిదేవతాప్రసాదత, నుదయించిన దగుటఁ జూడ నొప్పు నిజముగా
నిదిరాముని తలయే యని, మదిఁ దోఁపం జేయుచున్ సమస్తవిధములన్. 126

తే. ఇట్టిమోసపుఁగార్యమ్ము లెల్లనామ, హాప్రకృతికడ ఫలమీయ నర్హములగు
టెట్లు? సర్వజ్ఞగాదె యహీనశక్తి, నెఱుఁగఁజాలదె నిది తగు నెట్టులనుచు.

వ. అంత రావణుండు మంత్రులతో యోజించి పురరక్షణముచేయ నియోగించె. శ్రీరాముఁడు నటఁ బ్రాకృతునిచందంబున సేనారక్షణంబు గావింప నియమించె. మాల్యవదాదిరాక్షసులు సీతాదేవి రామునకొసంగ రావణునకు హితముం దెల్పి రాతం డవ్వానిఁ జేకొనఁడయ్యె నత్తఱుణంబున. 128

## సుగ్రీవరావణుల యుద్ధము.

సీ. లలితరీతిని సువేలధరణీధర మది, కనఁబడ శ్రీరఘుకాంతుఁ డద్రి
శృంగముపై నిల్చి పొంగుకాంతిన్ లంకఁ, గనుచుండ గోపురాగ్రముననిల్చి
మంత్రులతోఁ గపిమండలముం గాంచు, రావణునిం గని రవిసుతుండు
పట్టరానట్టికోపమున రామునియాజ్ఞఁ, గొనకలంఘించి యాతని సమీప

ఆ. మందు నిల్చి నీతికనుకూలముగఁ గటు, వాక్కులాడి మకుటవరము లిలను
బడఁగఁ దన్ని శక్తిద్వంద్వయుద్ధంబున, నతనినొంచి చేరె నద్రివరము. 129

క. ఆతనికృత్యమునకు మది, భూతలపతి ప్రీతినొంది పోవఁదగునె యి
ట్లీతఱి నొక్కఁడవే యల, దైతేయునిమీఁది కనినఁ దపనాత్మజుఁడున్. 130

ఉ. తావకపాదపద్మములు దాపుననుండఁ గొఱంతయేమి యీ
రావణుఁడేల యింతకుఁ బరాక్రమవంతులు పెక్కురైన నే
భూవర! గెల్వనోపుదును బొంగెడునాత్మవిభూతి నీకు గ
ర్వావిలమానసుండగుచు నాతఁడు తెల్పెఁగఁ బూనెఁ గాననే. 131

క. తొలిశకునంబుగ మకుటంబులు ధరపైఁ బడఁగఁ దన్నఁ బోలు నటంచున్
దెలిసికొని యట్లుచేసితి, బల మెఱుఁగం బోరినాఁడఁ బ్రభువర! నేనున్. 132

చ. మకుటగణప్రపాతనమె మానక నీకశుభంబుగల్గు నీ
దుకతమునన్ బురంబిదియుఁ దోడనె సంపదలెల్లఁ బోవఁగా
నిఁక నడఁగున్ ధ్రువంబనుచు నేర్పడఁ దెల్పెదు నిద్ది యుల్లఁ దా
వకకృపఁగాదె నేననఁగఁ బాదసరోరుహసేవకుండఁ గా 133

చ. అనవిని రామమూర్తి హృదయంబున నెంతయు మోదమంది చ
క్కనిపని చేసినాఁడ వని కౌఁగిటఁజేర్చుకొనెన్ నితాంత మం
తనతఁడు సంగరంబునకు దాపున నీతిఁజెలంగువార్త నం
పిన తరువాత యుద్ధమున బీరముఁజూపఁగ నౌఁగదా యనన్. 134

చ రవికులవార్ధిశీతరుచి రాముఁడు దానికి సంతసించి యి
ప్డవనిని బంపనౌ మరల నీహనుమంతుని బంచుటొప్పు దం
చవితథవాక్కులం బలుకనామనుజేంద్రునితోఁ గపీంద్రుఁ డి
ట్లువలికె వాలిపుత్త్రుఁడు గడున్ బలశాలియు వక్త గావునన్. 135

చ. తెలుపఁగలండు కార్యమును దేకువమీఱఁగ రాఁగలండు దో
ర్బలమున మార్కొనంగఁ దడబాటొకయింతయు లేక గెల్వరాఁ
గలఁడని నొక్కిచెప్పఁ దగుఁగా యిటు సేయఁగ నంచు నంగదుం
బిలిచి వచింపఁగాఁ దగినవృత్తముఁ దెల్పి బహూకరించుచున్. 136

చ. త్వరపడి పల్కకుండ సమతం గనిపల్కఁగ మందలించి పం
ప రహితసాధ్వసుండయి ప్రభంజనసూనుని మించు వేగమున్
గురుబలమున్ సహాయములగుం గద నా కిట నంచు నెంచుచుం
బరుగిడె నంగదుండు రఘువర్యునిమాటలఁ దెల్పువానికన్. 137

చ. అరిగి మహేంద్రపౌత్త్రుఁడు మహాదనుజుల్ గొలువంగ వానరో
త్కరమును గెల్చుపద్ధతులు గాఢరుషం గొని యూహచేయు నా
శరపతిఁగాంచి రామనృపసత్తము పల్కులఁ దెల్పి యింకనున్
దరమగునే జయింపఁ బరతత్త్వము రాముని నీకు రావణా! 138

తే అన్యరమణీహరణదోష మద్దియొకఁడె, చాలు నిన్నువధింప నింకేలయాశ
లీమముం గెల్వఁదరమగునెట్లు క్రూర,దానవా! యంచు నీతులెన్నేని తెలిపి.

ఉ. వారలనాశనంబు రఘువర్యపరాక్రమమెల్లఁ జక్కఁగా
సారవచస్తతిం దెలిపి చయ్యనఁ దన్నును బట్టఁబూన దు
ర్వారజవంబునం ద్రిదశవల్లభపౌత్త్రుఁడు వారిదాఁటి వే
సారక గొల్వుకూటమును సత్త్వమునం బడదన్ని యంతటన్. 140

ఉ. పట్టుఁడు కట్టుఁడంచుఁ దనుఁబల్కుచు రాక్షసులెల్లఁ బూన్కిమై
నిట్టటు సంచరింప భయమేది జవంబున మింటికేగి యా
కట్టడిరక్కసుల్ కనఁగ గాలియవోలె సురల్ నుతింప నా
దిట్టఁడు రాఘవాదులు నుతింపఁగ వ్రాలి వచించె నంతయున్. 141

ఉ. అంతట రామచంద్రుఁడు లయాంతకునాకృతిఁదాల్చి లక్ష్మణుం
జెంత వసించుసూర్యసుతు సేనల లగ్గలుపట్ట నంపుఁడే

చింతలుమాని యంచు జయ । సిద్ధిని దెల్పుముహూర్తమంచు మీ
రింతకు యుద్ధరంగమున । కేగఁగ లెండని యాజ్ఞ చేసినన్. 142

యుద్ధారంభము.

ఉ. భానుకులైకభూషణుఁడు । పంతమునం బలుకంగ నిట్లు లా
భానుసుతుండు సైన్యపతి । పంక్తిని జీరి మహీశునాజ్ఞ చే
వానరసేన లంక గరు । వంబునఁ దేలు నిశాటపత్తనం
బూనిన వేడ్కఁ బట్టఁదగు । నొక్కక్షణంబున నంచుఁ దెల్పినన్. 143

క. ఆయోధనచిహ్నంబుల, నాయానతిఁ దెలుప బలము । లన్నియుఁ దమిమై
నాయసురవర్యపురముం, బాయనిపూన్కిం గలంపఁ । బరుగిడె నంతన్. 144

సీ. ద్వారముల్ భేదింప । వీరులవధియింపఁ, బరుగెత్తివచ్చి వా । నరులవీఁక
మార్కొని దానవుల్ । మార్గణంబులఁ బ్రాస, కుంతతోమరములఁ । గోఁతులగుమిఁ
జంపఁగా వృక్షపా । షాణశైలంబుల, దనుజుల వధియించి । దర్పమెల్లఁ
గనఁబడఁగాఁ జేయ । దనుజవీరులు మాన, కతిపౌరుషంబున । వితతశస్త్ర
తే. శక్తి కనఁబడ వానర । సమితిఁ జంపి, రిట్లు సురలకుఁ గూడ రో । మాంచ మొదవఁ
జేయు ద్వంద్వాహవము కొంత । చెల్లెసమసి, రిరుదెగలవీరు లొకకొంద । ఱేపు దఱుగ.

క. అని కొంతసేపు సాగఁగ, దనుజులు చని రాహవమున । దర్పము లుడుగన్
దినమది గడువఁగ రాతిరి, చనుదెంచెన్ భీమకార్య । సంతతి జరపన్. 146

రాత్రియుద్ధము.

క. ఆరేయి సంగరమ్మున, శూరతఁ గనఁబఱుపఁ దగిన । చొప్పు మనములం
దారసి రావణుసేనలు, వీరాగ్రణు లొక్కకొంత । వేడుకఁ జూపన్. 147

ఉ. వానరవీరులందఱును । వజ్రసమాయతముష్టిఘాతసం
తానములన్ శిలాతరువి । తానములన్ మఱికొందఱన్ మహా
దానవవీరులం గదిసి । దర్పముచూపి వధించుకోర్కులం
బూని చరించి రెప్పుడగుఁ । బోరని యెంచుచు రాముఁ గాంచుచున్. 143

ఉ రాతిరియందు రాక్షసు ల । రాతివధంబున దోర్బలంబు హె
చ్చి తగ విక్రమింతురను । నాఖ్య ప్రసిద్ధమె కాన నిశ్చల
ప్రీతి భుజాబలంబు కడుఁ । బెంపువహింపఁగఁ బోరఁబూని రా
సీతతలంపు వెఱ్ఱులను । జేయగ రోషము వృద్ధినొందఁగన్. 149

ఆ. అంధకార మంత । నావరింపఁగ మాన, కరులఁ జంపునూహ । లతిశయింపఁ
బోరి రొకరినొకరు । పూని వధించుచు, సురలకే భయంబు । సొరిదిఁ గలుగ. 150

క. దితిజులు కొందఱు మడిసిరి, క్షితిఁ బాసిరి కొంద ఱనిని । కీశవరులు సం
జాతమహాగ్రహమున నా, దైతేయాధీశు లంతఁ । దలపడి రొకటన్. 151

క. ఆశరవీరులు మాఱొక్కనఁ, గీశవరుల్ వారి నెల్లఁ గీడ్పఱచెడు నా
యాశలఁ దాఱొక్కని రంతట, దాశరథులు దివ్యచాపధరులై పూన్కిన్. 152

### ఇంద్రజిత్తు రామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేయుట.

ఉ. అంగదుఁ డంతమాఱొక్కనియె నయ్యమరారితనూజు రావణిన్
సంగరకౌతుకంబు మదిసంధిలుచుండఁగఁ దక్కవీరు లా
యంగదురీతి శత్రువుల నట్టులెమాఱొక్కని పోరఁ జొచ్చి రు
త్సంగమునందె యావిజయసంపద యున్నయటుల్ తలంచుచున్. 153

చ. దితిజవరాత్మజుండు నదితిప్రియపుత్త్రతనూజపుత్త్రు ను
ద్ధతుఁడని యెంచి ప్రాఁతపగ తఱబురికొల్పఁగ హుంకరించి తీ
క్ష్ణతరశరాళి నొంపఁ గినుకం గొని యొక్కటఁ దాఁటి సారథిన్
వితతజవంబునం బొదలుపీతిచయంబు రథంబుఁ ద్రుంచినన్. 154

మ. విరథుండై భయకాల దండధరుఁ డీవీరుండుగాఁ బుట్టి సం
గరముం జేసెడు నంచుఁ జాపములు తత్కాలంబునం దెన్నఁగాఁ
గర ముప్పొంగు క్రుధన్ రథాదికముఁ ద్రుంగం జేసె వీఁడంచు యు
ద్ధరతిన్ మాయను గైకొనందగును బ్రచ్ఛదం జేయఁగా నీరిపున్. 155

చ. అని తలపోసి మాయ గొని యంబరమందు వసించె నింద్రపౌ
త్త్రునిదగు విక్రమక్రమము తోషముగల్గఁగఁ జేయనౌర! యి
ట్లొనరుపనేర్చె నీతఁడని యొక్కమొగిం గొనియాడి రంత నా
జనకసుతాధవుండు సురసత్తముపౌత్త్రుని శక్తి మెచ్చెఁదాన్. 156

మ. అవమానంబు భరింపరామిఁ ద్రిదశేంద్రారాతిపుత్త్రుండు మం
త్రవిభుత్వంబుఁ గనంగఁ జేసి రిపుదోర్గర్వంబు మాయింతు నం
చవధానంబు వహించి యెవ్వరి కదృశ్యంబైన రూపంబుతో
వివిధాస్త్రంబుల వైవఁబూనె నవియున్ వేధించె రామాదులన్. 157

చ. అరి యెటనుండు నంచెఱుఁగ నత్తఱి శక్యముగామి రాఘవుల్
శరవరపంక్తి వైచుటకు శక్యముగామిఁ దదీయమార్గణో
త్కర మెటనుండి వచ్చునో నికామగుణధ్వని యెందుఁ గల్గునో
యరదముపోవు చప్పుడది యంబరమం దెట నుప్పతిల్లునో. 158

చ. తెలియఁగఁ జాలకుండి రొకతీరున నంతట రావణాత్మజుం
డలుకవహించి మంత్రయుతి నంబకముల్ పరఁగించి వానరా
వళులను రామలక్ష్మణుల వ్రాలఁగఁ జేసెను భూమిపైన ధా
రలుగ నసృక్కణంబులు పరంపరగాఁ బ్రవహించె నత్తఱిన్. 159

క. కూలఁబడి రెల్లవానరు, లోలిం బీనుఁగులపిండు లుర్విఁబడఁగ నా

భీలంబై కనఁబడున, ట్లాలము గన్పడియె నిట్టు లనరానిగతిన్. 160

చ. తనువులనుండి రక్తమొగి ధారలుగాఁ బ్రవహింప రాముఁడా
తనియనుజుండు భూమిఁబడి తద్దయుఁ గుందుచునుండ నాగపా
శనికరయుక్తిచేఁ గదలఁజాలనియ ట్లొనరించె నింద్రజి
త్తునిఖిలవానరేశ్వరులఁ దోడనె చేసెఁ దదస్త్రబద్ధులన్. 161

ఆ. కదలమెదలలేక కపులార్తి నొందఁగఁ, రామలక్ష్మణులు నగారిపాశ
బద్ధులై పడంగ బవర మయ్యది సురత్రాసకర మనంగఁ దగియె యుండె. 162

సీ. నాగపాశము లిలానాథునిఁ దమ్ముని, గట్టిగా బంధించె గాఢశరము
లందర నొప్పించె నట్టిట్టుకదలక, పడియున్న యాకపిమాపతులఁ గాంచి
సుగ్రీవముఖులెల్ల శోకించి రావిభీ,షణుఁడు తద్దశకు విస్మయమునొంది
మాయాబలంబున నీయెడ నింద్రారి, యీరీతి బంధించె వీరి ననుచు

తే. మాయ నెఱుఁగుటనంబరమధ్యమమున,దనుజవర్యులుగొల్వంగఁ దనరువాని
నింద్రజిత్తును గనుఁగొని యినతనూజుఁ, జేరఁగాఁ బిల్చి యిట్లు వచించెనపుడు.

క. వగవకు మో కపిరాజా!, తగునిది మాయాబలంబు దారుణరూపం
బగు నాగపాశబంధన,ముగఁ దోఁచెడుఁ బ్రాణహానిఁ బొందదు దీనన్. 164

ఉ. వీరలపాటు గాంచి కపివీరులు పాఱఁదలంచుచున్న వా
రోరిమిమీఱ వారిఁ గడునూఱడిలంగ నొనర్పుమీవు గం
భీరత నుండఁగాఁదగినవీరుఁడవయ్యును భీతినొందనో
నే రయమార నల్గడలకేగి బలంబులఁ బ్రోత్సహింపుమా. 165

ఉ. నేనును గొందఱిన్ బిలిచి నింగిని జూపెదుశక్తి మాయదే
యానని హెచ్చరించి భయమంతయుఁ బాయఁగఁ జేయువాఁడ నో
వానరనాథ! నీవిపుడు వందురఁగా ఫలమేమి ధైర్యముం
బూనుము కార్యనిర్వహణముం బొనరింపుము లెమ్ము నావుడున్. 166

చ. హరిపతి యావిభీషణు మహామతిఁ గాంచి భవన్ముఖోక్తి ని
బ్బరమును గాంచినాఁడ గురుబాహుబలుల్ ధరపైఁ బడంగ సం
గరమిది ధర్మపక్షమును గాల్పఁగఁబూనె నటంచు నెంచితిన్
బరుగిడువాఁడ నింక భయవారణకార్యము నిర్వహింపఁగన్. 167

క. అనిపలికి తానుసైన్యం,బును గాంచి భయంబుపాయుపోలికఁ బల్కం
గనుబూనె విభీషణుఁడును, చని మాయ యిదంచుఁ జంపఁజాల దటంచున్. 168

క. పలుకుచు వారలభయముం, దొలఁగించుచు రణము చేయు దోర్బలమెల్లం
గలిగించుచుండె నంతట, విలసిల్లెడు తార్క్ష్యమూర్తి వేగమ వచ్చెన్. 169

### గరుత్మంతుఁడు వచ్చుట.

సీ. పక్షసంచాలనసంభవ వాతనిర్ఘాత, భూమిధరవ్రాత ♦ భూరిశక్తి
వైనతేయుఁడు రామసంభద్రుఁగానఁగ వచ్చె, నాతనిరాకకు ♦ నతిశయిల్లు
సమ్మోదమున విభీషణుఁడు సుగ్రీవాదు, లరుగుదెంచిరి రామునంతికమున
కాపక్షినాయకుఁ ♦ డరుగుదెంచినమాత్ర, నాగపాశములు వినష్టదనమాని
తే. సడలి వడిఁబాఱ లేచిరాక్ష్మాపతీంద్ర, నందనులుసైన్యములవెల్ల ♦ డెందములోగిఁ
బులకముల నుల్లసిల్లంగఁ ♦ జెలఁగువేడ్క, లంది మిన్నంది రంత ఖగాధిపతిని.

క. పరికించి రాముఁడిట్లనుఁ, బరమదయాబ్ధీ! నిష్ప్రత్తపాశులమైయి
క్కరణిని బ్రదికితిమిగదా, నిరుపమకృపఁ గల్గునిన్ను ♦ నేర్తునె పొగడన్. 171

క. కలిగెను జీవితములు నీ,వలనన్ మాకందఱకు స్వభావంబున నీ
కలరెం బరులకు నుపకృతి, సలుపం దగుబుద్ధి; పుణ్యచర్యా! యార్యా! 172

చ అనుటయు వైనతేయుఁడు మహావినయంబున నిట్లుపల్కె నో
వనజదళాక్ష! నీదుసఖవర్గమునం దొకరుండ నేను; నా
పనియిది నీదెగాఁగఁ దలఁపందగు సంస్తుతికే ననర్హుఁడన్
గనుమిదె నాదురాక భుజంగంబులు పాఱెదు నాల్గువంకలన్. 173

చ దితిజవరాత్మసంభవుఁడు ♦ దృప్తుఁడు మాయను బన్ని మిమ్ము నొం
చి తనకుఁ గల్గుశాంబరిని ♦ సిద్ధినిగాంచిన సర్వమంత్రసం
యుతి గురుపాశజాలముల ♦ నొక్కట మిమ్మునె గట్టివైచెఁ బా
శతతులు వీర్యహీనత వెసం బరువెత్తెను నన్నుఁ గాంచుటన్. 174

చ. మరల మిముం గలంప నణుమాత్రము చాలవటంచు నమ్ము మో
సరసిజనాభ! నిన్నుఁగనఁ ♦ జాలితి ధన్యుఁడనైతి నానతిన్
శిరమునఁ దాల్చిపోయెదను ♦ సేవయొనర్పఁగ నీకె సర్వదా
చరణసరోజదాస్యమున ♦ స్వాంతము నిల్వ వరం బొసంగుమా 175

చ. చనియెద నంచు మ్రొక్కుచు విశాలలసచ్ఛదపక్షయుగ్మ మొ
య్యన గదలించి లేచి గగనాంగణసీమను బోయె దిక్కులం
దనగురుపక్షసంచలనజం దగువాయువు పర్వుచుండ దై
త్యనికర మట్టిచూచి దిగులందఁగ దేవత లుబ్బి యార్వఁగన్. 176

ఉ. వ్యాళమయోరుపాశతతి పర్వులువాఱఁగ రామలక్ష్మణుల్
చాల శ్రమంబుగాంచియుఁ బ్రసంగతిఁ దార్క్ష్యుఁడు కల్గఁజేయ సం
క్షాళితసంగరశ్రమజఘర్మ పయఃకణమండలాంగులై
శ్రీలఁజెలంగి పూర్వబలసిద్ధుల నొప్పిరి విస్మయంబుగన్. 177

ఉ. కీశవరేణ్యు లస్త్రగణకీలితగాత్రము లప్డు సూర్యసం
కాశములై వెలుంగఁ దమకంబున నార్చుచు మిన్నుముట్టి యో

యాశరులార! రండు సమరాంగణ మందొక యాటయాడ మా
యాశయమల్ చెలంగు మరియాదయె మీరిటు లూరకుండఁగన్.    178

చ. అని పెలుచన్ విరోధులగు నాశరవీరులఁ బిల్చుచున్ మహా
ధ్వనులను దిగ్విదిక్కుల నభంబును బ్రద్దలుగాఁగఁ జేయుచున్
దనుజుల సంగరంబునను దార్కొన రమ్మని హెచ్చరించుచున్
మనుజపతి ప్రియాత్మజుల మాటికిమాటికిఁ గాంచి మ్రొక్కుచున్.    179

తే. యుద్ధమున కాయితంబుగ నుండి రంత, నావిధంబును శుకసారణాదిగూఢ
చారు లోగిఁ దెల్పవిని మది సాధ్వసంబు, గాంచె రావణిరిపుశక్తి నెంచియపుడు.

## నాగపాశప్రయోగవిధి

సీ. మంత్రగణంబున మహితశక్తిం గ్రాలు, క్రూరమంత్రములు దుర్వారములుగ
నమరియుండును; వాని కార్తిగూర్చెడుసత్త్వ, మొక్కటియే గాని తక్కినట్టి
శక్తు లెవ్వియు లేవు సాధకుం డవ్వాని, యంకిష్టమైన దేయ్యది యొ దాని
జపియించి తగ నభిచార హోమము శ్రద్ధ, నొనరించి సిద్ధియై యొప్పె ననుచు
తే. ననుదినము దానిఁ గొల్చుచు నస్త్రరూప, ముగను బూజించుచున్ దానిఁ దగినసమయ
మందునమ్మాడ్కి హోమంబు నాచరించి, యస్త్రరూపంబునం బొల్చునట్టిదాని.

క. అరిబాధార్థముఁ బంపం, దరుణంబిది నాదుకోర్కి తగఫలియింపన్
బరమాదృతి నొందుమ యని, శరమును బ్రార్థించి మంత్రశక్తి కలుగఁగన్.

క. ఒనరించి ప్రయోగింపం, జను నయ్యది స్వీయరూపశాలియగుచు వై
రిని శక్తికొలఁది బాధిం,చు నశక్తుండైన వైరిఁ జూర్ణముచేయున్.    183

క. అసురతనూజుఁడు ఫణిమను,విసరంబున నొక్కదాని వితతజపమునన్
స్వసమీపమ్మున నుండఁగ, స్వసదృశఫలమీయఁ గొల్చి వరముంబడసెన్. 184

క. వానిఁ బ్రయోగించి మహీ,జానికుమారులను గూల్పసమకట్టెను; ద
జ్జానకివల్లభుఁ డాత్మను, ధ్యానించెన్ గారుడము నితాంతసమాధిన్.    185

ఆ. గాధినందనుండు కాలత్రయజ్ఞుఁడై, పొలుచుచుంట మంత్రపూగమెల్ల
రామునకును దెల్పె రాముఁడు సోదరు,నకును దెల్పెఁ దార్క్ష్యనామకంబు.

తే. వ్యాళమంత్రంబులకు నెల్లవైరి గాన, నింద్రజిత్ప్రహితాహిపాశేషుచయము
గరుడసన్నిధి నించుక గాని ఫలము, గలుగఁ జేయంగఁజాలక విలయ మొందె.

సీ. అస్త్రంబులెల్ల నీయనువునఁ బ్రత్యస్త్ర,ములచేత విలయంబు గలుగఁజెడును
గావున నాగపాశావలి గరుడసం,దర్శనంబున శక్తిహతిగ విడిచె
నిదె విధానమ్మస్త్ర మెదిరైన మరలిపోఁ, జేయఁగా నని చిత్తసీమనిల్ప
వలయు నింకొకరీతి గలదు మంత్రంబెది, యిరువురచేత నభీష్టసిద్ధిఁ
తే. బడయుకోరిక జపియింపఁబడున యేని, వార లిర్వురు వైరులై బవరమందు
దానినే వైవ నదియేరి నేని బాధ, చేయకయె శాంతినొందును సిద్ధమిద్ది 188

చ. ఇరువురు భక్తులాట నది § యెవ్వనినైనను బాధచేయకే
మరలును దానివైచుఁగద § మానక రెండవవాఁడు రెండు నం
బరమునఁ దాఁకి శాంతిపడుఁ § బక్షియుగంబును దానినొక్కఁదృ
ష్టిరమణఁ గాంచుఁ గాన సమ§సిద్ధినిగల్గ నొనర్చువారికిన్. 189

వ. అందుఁగొన్ని యస్త్రంబులు పునఃప్రయోగంబున కర్హంబులుగాకయుండు. అట్ల గుటకుం గారణంబు గురువాక్యంబ. అస్త్రవిద్యోపదేశకాలంబున నిది ప్రాణ విపత్తు పొసంగినతఱిఁ బ్రయోగింపఁదగుననియు నట్లుగావునఁ బునఃప్రయోగ యోగ్యంబుగాదనియు నాదేశించు. ఆయస్త్రంబులు లోకావళి దగ్ధంబుచేయఁ జాలియుండు. వానిం గొనసమర్థుండనితోఁచిన నీనియమంబొనర్చి గురు వుపదేశించు. గుర్వాజ్ఞాతిక్రమణంబున మంత్రంబుఫలింపదనియెఱుంగవలయు. 190

క. గురుభక్తిలేని వారల, కురుతరమంత్రంబులైన § నొక్కఁ ఫలం బె
వ్వరుసన్ లభింపఁజేయక, కర మశుభఫలంబు గూర్పఁ§గడఁగును గాదే. 191

క. కనుకన్ సద్గురుభక్తిన్, గని దానిన్ వదల కెల్ల§కాలము మంత్రం
బును జపియింపఁగ సిద్ధిం, గను సాధకుఁ డొందురీతి § కల్గవృఫలముల్. 192

ఉ. ఈసరణిన్ బృథాకుమను § వెంతయుఁ దోడ్పడునంచు నెంచియే
వాసవునిన్ జయించి పటు§బాహుబలంబున విఱ్ఱవీఁగి మా
యాసమశక్తి నొప్పుదను§జాధిపపుత్త్రుఁడు నాగపాశముల్
గాసిలఁజేసి చంపు రఘు§కాంతుని నం చెద నమ్మి వైచెఁగా. 193

ఉ. గారుడమంత్ర మాత్మ రఘు§కాంతుఁడు సంస్మరియింపఁ బూర్వమే
కోరినయప్డు వత్తునని§కోరిక దీర్ప వరంబులిచ్చి యా
శ్రీరఘురాము నాజ్ఞఁగొని § చేరెను స్వస్థల మట్టులాట నా
గారి రఘూత్తముం గనఁగ§నప్పుడె వచ్చెను విచ్చె బంధముల్. 194

మ. పరమేశుండయియున్ మఱొక్కరిని సం§ప్రార్థింప నేలా యటం
చురుసందేహము నొందరాదు; జను లా§త్మోద్యోగముంగాంచి య
క్కరణిన్ వర్తిల నౌనటంచుఁ దెలుపం§గాఁ గోరియే రాముఁ డె
వ్వరిఁ గొల్వంగ బహూకరింప మదిలో § వాంఛించె నం చెన్న నౌ. 195

చ. జనకకుమారియున్ నృపతి§సత్తము లిర్వురు నాగపాశబం
ధనమునఁ జిక్కి రంచు విని § దానవకాంతలు తోడుకొంచుఁ బో
వను వగఁగుందె సర్వమును § భావనచేసెడునాదిశక్తియై
తనరియు మానవాకృతిని§దాల్చుట శీలముఁ దెల్పఁబూనుటన్. 196

ఉ. వారలచిత్తవృత్తు లిటు§వంటివిగా నగునం చెఱుంగ నె
వ్వారికి శక్యమా హరియుఁ § బంకజసూతియు శంకరుండు వృ

త్రారియు లోనుగాఁగల మ।హాత్ములె వీఱేఁడు లిందునాఁగ నిం
కేరు సమర్థులౌదు రిదె। యెన్నఁగ నావిషయం బదెప్పుడున్. 197

ఉ. రావణి నాగపాశని।కరంబు ఫలంబిడజాల కెట్టులో
పోవఁగఁ గుందుచుండె; నిదె। పో విధియే బలవంత మంటకున్
దావలమైన చక్కని యు।దాహరణంబగుఁ బౌరుషంబునా
దైవమె మించు దానిదగు। తత్త్వము గన్పడ దేరికేనియున్. 198

ధూమ్రాక్షాదులు మృతినొందుట.

సీ. అంత నా రావణుఁ। డాగ్రహంబునఁ బంప, ధూమ్రాక్షుఁ డనిసేయఁ। దోఁపహనుమ
యాతనిఁ బొలియించె। నట్టులే వజ్రదం, ష్ట్రుని నంగదుండు న।రూపుఁ జేసె।మున
హనుమంతుతోడ నా।హవము చేయు నకంప,నుఁడు సుయమనిఁ జేరెఁ। గడుముద
నాతని వెన్కఁ బ్ర।హస్తుండు నీలుతోఁ, బోరాడి మింటికిఁ। బోయె వేడ్క
ఆ. వారిపోకఁ గాంచి। యా రావణుఁడు తానె, యరుగుదెంచెఁ బోరు।నాశయమున
నతని వెంట వచ్చి।రనిమ్రంది రెందఱో, భటులు పూర్వకర్మ।ఫలములఁ గన. 199

చ. వనచరసేనఁ గూల్చుచు న।వార్యభుజాబల మొప్పుచుండ నా
దనుజవిభుండు తీవ్రరణ।ధాత్రిపయిన్ విహరింప నింద్రపు
త్రుని యనుజుండు తాఁకి తన।దోర్విభవంబును జూపె నాతఁ డా
తనిపయిఁ గల్గు కోపమున। దారుణబాణము లేసె నేర్పునన్. 200

ఉ. మిత్రసుతుండు యుద్ధమున। మించెను రావణునంచుఁ జెప్పఁగాఁ
బాత్రుఁడుగాఁ జెలంగె నది।వైరికి మిక్కిలి దుస్సహంబుగా
నై త్రపగల్గఁ జేసె నమ।రారివిభుండును దోర్బలంబునన్
స్తోత్రము గన్నవాఁ డగుటఁ। దోరపుశక్తిఁ గనంగఁ జేయుచున్. 201

చ. తనువిదియన్న సంస్మృతిని। దాఁగనకుండ నొనర్చెఁ దక్కన
వ్వానచరవీరు లాతని న।వార్యపరాక్రముఁ దాఁకి నిల్వకే
చని రఘునాథుపార్శ్వమున। సాధ్వసముం దొలఁగించి కావుమా
యని శరణంబు వేఁడి రట।నాతని తమ్ముఁడు లక్ష్మణుం డెదన్. 202

క. అనిసేయు నుత్సవము పొం, గ నరేంద్రుం గాంచి మ్రొక్కి। క్రవ్యాదేంద్రున్
గనదురుబాణంబున నే, నని జంపెద నియకొనుమ। యని వేఁడంగన్. 203

క. నెమ్మదిఁ దలంచి రాముం, డమ్మాడ్కిం బోవ నొప్పి।యతనికి రణధ
ర్మమ్ములు తెల్పుచుఁ దద్భల, మిమ్ములఁ గని పెట్టి పోరు।లే తగ వనుచున్. 204

ఆ. నచ్చఁ జెప్పి పంపె। నుచ్చకోదండము, దాల్చి పోరఁ బోవు।తఱి సమీర
తనయుఁ డడ్డపడుచు। దనుజేంద్రుమార్కొని, నేనె పోరువాఁడ। నీవు వలదు.

క. అని వాని మార్కొనంగా, సునిశితబాణాళి నొంచె । సురవైరియు నా
తని నొంచె హనుమయుర్ ముష్టిని శైలమహీరుహములఁ । జెడ్పడఁ జేసెన్.

సీ. మఱియు వీర్యంబున । మారుతి రావణుఁ, బిడికిటిపోటున । భీమనినద
మొప్ప నొప్పింపఁగ । నురుతాపమున సంచ,లించె దానిని విను । తించి రెల్ల
వానరుల్; రావణుఁ । డానినదంబున, కులికి యోహనుమంత! । యురుబలుఁడవె
యని మెచ్చుకొందు దా । యగ నుండియుర్ నేను, నన మరుదాత్మజుం । డకట! దని

ఆ. వినుతిచేయ నేల । విగతజీవుండవు, గాక బ్రదికియున్న । కారణమున
నద్ది యడఁగుఁగాక । యని మఱియుం బల్కె, నన్ను ముష్టిఁబొడువు । మన్న నీవు.

క. మరలం బొడిచెద నిన్నుఁ గ్, బరుషంబగు ముష్టి దానఁ । బంపుదు నిను ని
త్తరుణముననె యముఁ డుండెడు, పురమునకన రావణుండు । బొంగెడు క్రుధచేన్.

చ తనకుడిచేతిముష్టిని ని । తాంతము పావని ఱొమ్ము నొంపఁగా
ననిలుసుతుండు మూర్ఛగనె । నంతట నీలుఁడు తాఁకి రావణుర్
ఘన శిలలర్ మహీజముల । క్ష్మాధరశృంగములం గలంచి త
త్సునిశితబాణజాలముల । సోలి ధరంబడె; నంత దుర్మదున్. 209

క. సౌమిత్రి మార్కొనెర్ సం,గ్రామంబది యద్భుతముగఁ । గ్రాలెర్ త్రిదశ
గ్రామణులు మెచ్చుచుండిరి, భీమాంబకముఁ నను వైచి । వీర్యముపొంగన్. 210

క. రావణు వెఱగొందంగా, భూవిభుననుజుండు చేసి । భూతభయంబే
యావహిలంగాఁ జేసెఁడు, రావణు శక్తిం బడెర్ ధరర్ మూర్ఛితుఁడై. 211

క. భీతిల్లి దానఁ గీశ,వ్రాతంబులు రాము కడకుఁ । బరుగిడి తెలుపం
జేతమునఁ గ్రోధ మత్తఱి, నాతతముగఁ బ్రజ్వరిల్ల । నరి మార్కొనఁగన్.

చ. సరగున లేచి చాపమును । సజ్యముగా నొనరించి ప్రజ్వల
చ్ఛరమును గూర్చి మారుతియె । స్యందనమై తగ నెక్కిపోయి యా
శరవరు మార్కొనెర్ దనుజ । చక్రవిభుండును సాయకాళి నం
బరమును గప్పుచుర్ రణము । పౌరుష మొప్పఁగఁ జేసె నత్తఱిన్. 213

చ. క్షితిపకుమారుఁ డంత నతి । శీఘ్రముగాఁ బరువెత్తు నంబక
ప్రతతిని వైచి రథ్యరథ । పాలకులం బడలంగఁ జేసి య
ప్రతిహతబాణపంక్తి మణి । భాసురదివ్యకిరీటరాజియుం
జ్యోతిగని భూమిపైఁబడఁగ । నొక్కక్షణంబునఁ జేయ నార్తుఁడై. 214

తే. యాతుధానేశ్వరుండును । భీతుఁడగుచు, నూరకుండంగ రాముఁ డో । రోరి నిన్ను
నలసినాఁడ వటంచు వ । దలిన వాఁడ, నింటి కేగుము నావిని । యెద రఘుపతి.

క. పలుమాఱులు పొగడుచు ని, స్తులశక్తికి నబ్బురంబు । తోఁపఁగఁ జనియెర్
గలవిలపాటొందుచుఁ దన, విలయము దృఢపఱచుకొనుచు । వెస లంకఁగనన్.

ఆ. అరిగి కుంభకర్ణు ♦ నాత్మఁ దలంచుచు, మేలుకొలుపఁ బనిపె ♦ మించుభీతి
నసమయమున లేపుటతనికిఁ బ్రళయమే,యనుచు నెఱిఁగియును మహాసురుండు.

కుంభకర్ణుని మేలుకొలుపుట.

క. నెలలాఱు నిద్రయతనికిఁ, గలుగఁగ వరమిచ్చె బ్రహ్మకర్త్యానుగతిన్
బలవంతము దైవమ్మను, పలుకు యథార్థంబు సేయ ♦ భావించినటుల్. 218
చ. తపమొనరించు కాలమున ♦ ధాత వరంబొసఁగంగ రాఁగ దే
వపటలి బ్రహ్మవెన్కఁ జనె ♦ వారలె తేఁ బురికొల్పుటన్ విరిం
చి పరమమోదమంది వడిఁ జేరి దశాననుకోర్కిఁ దీర్చి య
ట్లి పరమభక్తిఁ దన్నుహృదయేష్టదుగాఁ దలపోయు నాశరున్. 219
సీ. కుంభకర్ణుని గనఁబోవునప్పుడు మహేం, ద్రాదులిట్లని కోరి ♦ రావిరించి
నీతఁడు బలవంతుఁడెల్లర నొకసారి, మ్రింగఁ జాలినయట్టి ♦ మేటివక్త్ర
బిలము గలట్టివాఁడలఘుపరాక్రముఁ, డెల్లలోకంబుల ♦ నేచఁజాలు
మూర్ఖుఁడు కావున ♦ భూతాళికుశలంబుఁ, గోరెదుమీ రిట్లుకోరిన వర
తే. ములనొసఁగిన మమ్మెల్ల ♦ విలయమందఁ, జేసినట్లగు యోజింపు ♦ చిత్తమందు
ననుచుఁ బ్రార్థింప బ్రహ్మయుమనమునందు,నతనికర్మముగతి నెంచియమరులఁగని.
చ. వినుఁడు సుపర్వులార! బలువేడుకఁ గన్పడుఁ జూచుచుండుఁ డా
దనుజుఁడు కోరినట్టివరదానముచేయక తప్పదెట్టులై
నను మఱుమాటలాడక మనంబుల దిట్టతనంబుఁబూని నా
వెనుకనె రండు వానిదగువృత్తమదెట్టిదొ యంచునెంచుచున్. 221
చ. అలరఁగఁజేసి బ్రహ్మవిబుధావళి నాత్మసతీమణిన్ గరం
బుల నభయాంకముద్రయును ♦ బుస్తకమున్ గనుపట్టుచుండ వా
క్కులఁగలిగించు దేవి యనఁ ♦ గోరినకోర్కులఁదీర్చుతల్లి నా
లలితయశంబు గాంచిన విలాసవతిన్ బరదేవి భారతిన్. 222
చ. తలఁచె మనంబునన్ సుగుణధామవిభూషితయైనవాణి యా
జలరుహసూతిముందు సురజాలముచూడఁగఁ దోఁచె బ్రహ్మయున్
బలికెను దేవి! యీఖలునివాక్కుల నిల్చి తదీయకర్మమే
ఫలముల నీయఁగోరనొ నోపం బదిగా ననుఁ గోరఁ జేయుమా. 223
చ. సరసిజసూతి యిట్లుసురసన్నిధిఁ బల్కినవాలకించి వా
క్తరుణియు నట్లకాక యని ♦ తద్వదనంబున నిల్చి కర్మమే
వరుసఫలంబు లీయఁదగుభంగిఁ దలంచునొయట్లె ధాతయున్
వరములవేఁడఁ జేయ మది వాంఛఁ గొనెన్ బరమేష్ఠియుం జనెన్. 224
చ చని యల దైత్యనాయకునిసన్నిధి నిల్చి భవత్తపంబు నా
మనమును సంతసంబుగనుమాడ్కి నొనర్చె వరంబు గోరుమా

యనుటయు లేచి నిల్చి తనహస్తములన్ ముకుళించి దేవ! నీ
పనుపునఁ గోరువాఁడ ననుభక్తునిగాఁ గొని దాని నీయవే. 225

చ. జననము గాంచినందులకు శర్మము గాంచుటయే ఫలంబు కా
వున సుఖనిద్ర నిమ్ము; తనువున్ బలముం గలయట్టిదానిగా
నొనరుపు; మిద్దియే మదికి నొప్పినయట్టి వరంబు నాఁగ నా
వనరుహసూతి యట్లయగు భద్రము లంపుము దాన నర్భకా! 226

సీ. ఒకమాట వినవయ్య యోకుంభకర్ణ! నీ, వాఱుమాసములు సుఖాబ్ధి మున్గఁ
జేయు నిద్రంగాంచి యాయాసమే లేక, మేల్కాంచి యాహార మోలి నాఱు
మాసంబులకుఁ దగుమాత్ర భుజించి నా,యుచ్ఛ్వాసాలం బంది యెవరిపైకి
నని చేయఁ బోదువో యాహవం బయ్యది, విజయంబొసంగు నేవీరుఁడైన

ఆ. నిన్ను నొంపఁజాలఁడన్న యీవరమును, గోరకున్న నీయఁ గూర్మిఁ గంటిఁ
గొఱఁతనిద్ర మేలుకొలుపంగఁ బడుదేని, యంత మపుడె కలుగునంచుఁ జనియె.

క. తనుదాఁటి బ్రహ్మ యవ్వలఁ, జనఁగా వాగ్దేవతయును సన్నిధిఁ బాయం
దనయవివేకపు వాంఛను, మనమునఁ దలపోసి దుఃఖమగ్నుం డయ్యెన్. 228

సీ. బంధువులందఱు బ్రహ్మయిచ్చినవర, మదియచాలును గృప కదియె సాక్షి
యని యూఱడించి రాదనుజవరేణ్యుండు, సమరంబునకు ముందె శర్మధామ
మనఁబడు నిద్రాగృహంబున శయనించె, నాఱుమాసములకు నవలిదినము
నందు మేల్కొలుపనో నను నియమంబు నా, రావణుం డెఱుఁగు నిద్రకురవంత

తే. భంగమే కల్గఁ జచ్చునంచుం గనుంగొ,నంగలండయ్యు దుష్కర్మసంగతి నది
మదికిఁ దోఁపమి నిద్రలేపఁ దగఁ బనిచె,నతని మృత్యువు పురికొల్ప నరయలేమి.

చ. జనులకు వెన్క మృత్యువు పొసంగ వసించియె యుండు దానినిం
గనుఁగొనఁజాల రెవ్వ రది కాలము రాఁ దనమూర్తిఁ జూప వ
చ్చును; క్షణమైన నిల్వఁ దగు చొప్పును గాంచదు కర్మసంగతిం
గొనిచను వానికిన్ ఫలముఁ గూర్ప స్వతంత్రత లేదు దానికిన్. 230

మ. మృతికాలంబున నాపరాత్పరుని నెంతే భక్తి ధ్యానింప దు
ష్కృతముల్ పాయును ముక్తియబ్బునని సంకీర్తింత్రు ధీరుల్; పురా
కృతకర్మంబది యట్టిబుద్ధి నిడినం గీర్తించు లేదేని త
త్స్మృతి యెట్లబ్బు స్వతంత్రతం దగిన యద్దే దంచు నెన్నం దగున్. 231

ఉ అన్నియుఁ గర్మమూలము లెయెయా; నదిగానిది లేద దేదియున్
గొన్నిఁట నస్వతంత్రతయుఁ గొన్నిఁట నయ్యది కల్గియుంట యె
న్నెన్ని విధంబులం గనిన నెన్నిన న్యాయహితంబటంచుఁ దోఁ
ప న్నెటి హేతువుండునొకొ ప్రాజ్ఞులు మెత్తురొకో యదెప్పుడే. 232

ఉ. ఒక్కొకవేళ మేలగు సదూహకుఁ గీడుగఁదోఁచుచుండు వే
ఱొక్కతఱిన్ మహార్తికర ముత్తమలాభముగాఁగఁ దోఁచు నిం
కొక్కపు డెన్నియోగతుల నూహలు వెల్వడుచుండు నక్కటా!
యక్కటికమ్ము కర్మమున కాత్మను గల్గదయే నొకించుకేన్. 233

క. వేదాంతవాక్యములచే, నేదియు లేదనుచుఁ జెప్పనెంచినఁ గర్మం
బే దిక్కుఁదోఁపకుండఁగఁ, బోఁదట్టున్ గార్యరూపమున నవ్వారిన్. 234

మ. స్మరియింపందగు నిద్దియిట్టితఱిఁ గర్మంబేమి చేయంగనోఁ
బరతత్త్వంబుఁ దలంప నయ్యదియగున్ భస్మం బటంచున్ వచిం
తురు; వేదాంతులమంచుఁ జెప్పుకొను ధూర్తుల్ కొంద ఱాకర్మమా
పరతత్త్వంబుఁ దలంప నిచ్చునఁగదా పల్మాట లేలా యిఁకన్. 235

మ. కృతకర్మంబు శుభప్రదంబగునయే నీశున్ స్మరింపంగ బు
ద్ధితగున్ లేనియెడం దదిచ్ఛయెటు వీతెంచున్ మనోవీథి నీ
వితమున్ సుంత తలంపరాదె యొకచో వేదాంతులెల్లం గృతా
ర్థత యొద్దాననొ తోఁచుగా మదులఁ గర్మంబెట్లు దుర్భేద్యమో. 236

సీ. కర్మముఁ దరియింపఁగాఁ దగుపద్ధతి, యెట్టిదైయుండు నంచెన్నఁ దగును
సత్కర్మముల శాస్త్రసరణిఁగఁ జేయుచుఁ, దత్ఫలంబులఁ బరతత్త్వపాద
పద్మార్పణముచేసి "పాహిమా"మ్మనుచు నే,కాంక్షలఁ జిత్తంబు గాసినొంద
కుండఁ జేయుచు నిట్టులుండఁగాఁ దత్కర్మ,ఫలములే జ్ఞానసంకలితుఁ జేయు

తే. నట్టివిజ్ఞానఫలముగ నమరుసాంద్ర,మైన వైరాగ్య మదియె యజ్ఞానలేశ
విరహితంబుగ నొనరించి విమలబుద్ధి, కలుగఁజేయును ముక్తిని వెలయఁగూర్చు.

క. క్రమమగుమార్గం బిది య,క్రమమార్గము లెన్నొయున్న కరణిగఁ దోఁచున్
సమగతి నవికల్పింపవు, విమలజ్ఞానం బదెట్లు వెలయం జేయున్. 238

చ. తెలియఁగ నర్హ మీవిధము తేటపడుం జిరకాలచింత న
వ్వలిదగు సాధుమార్గ మెది భద్రము దేనఁబోసంగు నంచు; ని
మ్ములఁ దలపోయు టొక్కటియె మూలము దానికి దానిమాన నే
ఫలములుగల్గకుండు నొకభంగిగ భుక్తిలభించు మాటలన్. 239

చ. స్మరణపథంబునన్ దనుజసత్తముతమ్ముని గుంభకర్ణునిన్
సరిగ నుదాహరింపఁ దగు సత్తప మెట్లొ యొనర్చి యెన్నియో
వరములఁ గోరఁగాఁదలఁచి వారనినిద్రను గోరెఁగాదె యె
వ్వరికి స్వతంత్రతన్ దిరుగవచ్చునొ యియ్యది తెల్పుఁ దేటఁగన్. 240

చ. తపమది వాంఛలన్ ఫలయుతంబులుగా నొనరింప కేరికే
ని పనికిరానిమార్గమున నిల్వఁగఁ జేసెను గుంభకర్ణు నే

మిపలుకవచ్చు నింకఁ గను౹మేరను జూచినఁ గానరాదు మం
చిపథ మిదౌను గన్మది౹సీ! యని యెంచెడు నద్ది యేరికేన్. 241

ఉ. కావునఁ గుంభకర్ణకృత౹కర్మము రావణుఁ బ్రోత్సహింపఁగా
నీవిధ మాసహోదరున౹కెంతయుఁ గీడును గూర్పఁజాలు నం
చావిలచిత్తుఁడౌట దనుజాధిపుఁ డెంచఁగఁజాలఁడయ్యె నా
రావణునాజ్ఞఁ గష్టపడి౹రాక్షసు లాతని మేలుకొల్పఁగన్. 242

కుంభకర్ణుఁడు రావణునకు హితముఁ దెల్పుట.

ఆ. నిదురనుండి లేచి౹నీలిగి నాలుగు,దెసలు కలయఁజూచి౹దితిజవర్యు
సేవకులనుగాంచి౹చెప్పుఁడీ మాయన్న, కుశలియే యటన్నఁ౹గొంకమాని.

చ. తెలిపిరి వారలిట్టులని౹ధీరవరేణ్య! మహాభయం బొగిం
గలుగఁగఁజేయు సంగరము౹కల్గెను గోఁతులమూఁకతోడ దై
త్యులకుఁ బ్రధానమంత్రి మతి౹యుం గలదైత్యవరేణ్యు లెందఱో
కలనునఁ జచ్చి రొక్క మొగిఁ౹గాలము నేమనవచ్చు నక్కటా! 244

సీ. నాగపాశముల నిం౹ద్రజి రామలక్ష్మణు,లను జక్కబంధించెఁ౹గనినకపులు
పరుగెత్తిరెల్ల దిక్పాలకులడఁగిరి, కాని వారిద్దరు౹కాంచరైరి
మరణ మంతియకాక౹మ్రాన్పడరైరి సు,మ్మంతకాకారులై౹యార్భటింప
సాగిరి వానరసత్తముల్ చెలరేఁగి, రద్దానికోర్వక౹యగ్రజుండు

ఆ. సంగరమున కేగె౹సమయింపవారల, నేమిచెప్ప నింక౹నినకులుండు
రావణునివధింప౹రణమున కేతెంచి, విరథుఁ జేసి తఱిమె౹వేయునేల. 245

చ. మనమును జిన్నపుచ్చుకొని౹మావిభుఁ డిల్లును జేరి నిన్నుఁ దో
డ్కొనిచను దేర నాజ్ఞయిడెఁ౹గూర్మిసహోదరుఁ డంచు; నిత్తఱిం
జనదు సుఖార్థనిద్రగను౹శౌర్యసమగ్రుని మేలుకొల్ప నం
చును దలపోయఁడయ్యెఁ గడు౹జోద్యము కాలమటంచు నెన్న నో. 246

చ. పలుకులు వేయునేల కడు౹పౌరుషమూని చెలంగువారు దో
ర్బలమున విఱ్ఱవీఁగుచు నరాతులఁద్రుంపఁ గడంగువారు కోఁ
తులనిన సిగ్గుగా మదికిఁ౹దోఁపదె యెవ్వనికైన నింక ని
స్తులయశ మొప్పు దైత్యకుల౹సూరుల మాట వచింపనేటికిన్. 247

చ. అని తెలుపంగ నంతయుని౹నారసి యారసి చప్పరించి యెం
చినగతియయ్యె నేమనినఁ౹జేకుఱు సత్ఫలమింక నంచు లే
చి నిలిచి శంకపోవిడిచి౹చెచ్చెర మేదిని చంచలింప వ
చ్చెను దనయన్నఁజూచుటకుఁ౹జెందిననిస్పృహఁ దెల్పునూన్కితోన్. 248

ఉ. వచ్చినకుంభకర్ణుఁ గని౹ప్రాలినప్రీతిని గౌఁగిలించి యో
సచ్చరితా! మనం బెరియఁ౹జాడ్పున సాగెడుసంగరంబు ము

న్నెచ్చటఁ జూడ నట్టిదియె యియ్యది యంచు నెఱుఁగు మీవునున్
బొచ్చెము లేక తెల్పెదను బొంగెడు వీరులు ద్రుంగి రేమనన్. 249

క. కాలము విపరీతంబై, చాలన్ దుష్ఫలముఁ గూర్ప సమకట్టెను నీ
యాలమునఁ గోఁతులే లయ, కాలాంతకు రీతిఁ జూడఁ గాఁబడు ననుజా! 250

క. పాలిసిరి ధూమ్రాక్షాదులు, తలఁపఁ దగనంత శౌర్యధనులు మహేంద్రా
దులకు నజేయులు నయ్యును, దలమగు నే యింకఁ గాలతత్త్వ మెఱుంగన్. 251

ఉ. నేనును సంగరంబున ననేకభటాగ్రణులొప్పఁ బోరితిం
గాని జయంబు గల్గునటు కానఁగ నైతి రవంతయైనఁ బెం
పూనిన మత్కిరీటములు భూమిఁ బడెన్ రఘురామబాణసం
తానజవంబునన్ సహజ! దారుణ మిద్ది తలంచి చూచినన్. 252

ఉ. ఒక్కయెడం బరాక్రమ మహాదూరకసత్ఫల మిచ్చుచుండు వే
ఱొక్కతఱిన్ ఫలింపకయ యొప్పుఱఁ జేయును దీనికారణం
బొక్క స్వకీయకర్మమను టొప్పును గాని మఱెద్దియైన నే
దిక్కునఁ జూచినం గనఁగ దేవునకైన నశక్యమే యగున్. 253

చ. అని వదనంబు వంచి యిసుమంతయుఁ బల్కకయుండు రావణుం
గనుఁగొని కుంభకర్ణుఁ డనఘా! తగునే మిముఁ బోలువార లి
ట్లని మొన నోడినందులకు నార్తి మునుంగఁగఁ గాల మొక్కరీ
తిని జరపంగ నేరికిని దెప్పరమే యగు వేయునేటికిన్. 254

ఉ. జానకిఁ దెచ్చినాఁడ వది సాధుహితంబగు కార్యమెట్టులౌ
దానవనాథ! పాపముల దారుణమౌఁ గద యద్ది యింక నే
మానిని గొంచుఁ బోయి నృపమండనుఁ జేరిచి వేఁడుకొంటయే
కాని మఱొండు కార్య మెటు గాదు హితంబని నమ్ము మిత్తఱిన్. 255

ఉ. చెల్లెను గొంతకాల మని సిద్ధినొసంగుచుఁ బేరు మ్రోయఁగా
నెల్లెడఁ జూచినన్ దనుజులే విజయంబొగిఁ గాంచుచుండఁగా
మళ్లెను గాల మయ్యది సమస్తవిధంబుల నాపదంబుధిం
ద్రెళ్లఁగఁ జేయఁ బూనెను విధిన్ మఱలింపఁగ శక్యమే విభూ! 256

ఉ. కాలము దాఁట నెవ్వరికిఁ గాదు తరం బెటులెంచి చూచినన్
జాలము దాని మార్పనెటు సాహస మూనినఁ గాని రావణా!
యీలయ మెల్ల నీకతమ యేర్పడియెన్ దనుజాళికిం గటా!
యాలలనన్ గుఱించి కద యంతయు రాక్షసరాజి కిత్తఱిన్. 257

తే. కీడు గల్గించు వస్తువు చూడఁగా న,మూల్యమైనను వదలంగఁ బోలునంద్రు
సీతమూలంబునం గల్గెఁ జేటు మనకు, నామె వదలంగఁ దగుఁగాదె న్యాయరీతి.

మ. వినినాఁడన్ మును దేవదేవుఁడు మహావిష్ణుస్వరూపుండు ధ
ర్మనిబద్ధాత్ముఁడు మానవాకృతి నిదేమర్త్యంబునన్ బుట్టి దు
ర్జననిర్మూలనకార్యదీక్ష గొని సుత్రామాదులన్ భీతివా
సి నెఱిన్ వర్ధిలఁజేయ నంచు మునులే చెప్పంగ రక్షఃప్రభూ. 259

మ. సురలం దోలఁగనాఁడు స్వర్గపురమున్ జుట్టంగ నింద్రుండు శ్రీ
హరిఁగానం జని తోడుసూపు మల దైత్యస్వామి నాపత్తనం
బురుసేనాయుతి ముట్టడించె నన నోహో! యిప్పు డేఁదోడుసూ
పురతిం బూనను భావికాలమున నేఁ బోకార్తు మర్త్యాకృతిన్. 260

మ. అని వాగ్దానముచేసెనంచు మును వేనాలించితిన్ రాముఁడై
వనజాక్షుండు జనించినాఁడనుచు నేభావించెదన్ గోఁతు లా
తనిచెంతన్ వసియించి దుర్గముల దైత్యశ్రేష్ఠులం జంపు లే
గన దృష్టాంతము వేఱుగాఁ దలఁప నింకన్ విన్నదే సత్యమా. 261

చ. వరములఁ గోరుకాలమున వానరులన్ నరులం దలంప వీ
వరయఁగ భావికర్మము మహత్తరశక్తిని దోఁపనీయమిన్
సురరిపునాయకా! యిఁకను శూరతఁ జూపఁగఁ బూన కీశ్వరున్
శరణము వేఁడఁగాఁ దగును శత్రువుగాఁ డతఁ డెన్న మిత్త్రుఁడే. 262

మ. రమణిన్ దొంగిలికొంచుఁ బోయెనని యా రాముండు భావింప కా
ప్రమదారత్నముఁ గైకొనున్ నిను దయం బాలించు నామాట నీ
దుమదిన్ నిల్పుము శిష్టదానవులు నీదోషంబునం జావ కీ
క్షమ భార్యాసుతయుక్తిఁ జాల సుఖముల్ గాంతుర్నినున్ గొల్చుచున్ 263

సీ. నాగపాశములు సుంతయు వారిఁ బాధింపఁ, జాలకుండుటయది చాలదొక్క
రాముఁ డా భగవంతుఁ డా మహావిష్ణువం, చనువదింపఁగ నట్టులాట విక్ర
మముఁ జూపఁగాఁ దగుసమయ మీయది కాదు, పరమేశ్వరునితోడఁ బంతమూని
గెలువఁగాఁ దరమా నె పలుకులు వేయేల, సత్వరమే పోయి జనకతనయ
తే. నర్థిఁ బ్రార్థించి నాచేసినట్టి దుష్టకార్యమింతయుఁ దలఁపక కరుణఁ బూని
రమ్ము శ్రీరాము కడకని సమ్మతింపఁ, జేసి తోడ్కొని పోవయ్య శ్రీపతిఁ గన.

క. కులమును రక్షింపుము దుర్బలులన్ బలియాయఁ బోకు బవరంబున నీ
యిలకున్ నామాటల వినఁ, దలఁపుము చా లింక మనకుఁ దప్పదు పోరన్.

చ. అరిబల మేగుదెంచి పురమంతయుఁ బాడొనరించుచుండ ని
బ్బరమునఁ బోరఁ బూనక యభవ్యమనందగు సాధ్వసంబుఁ గాఁ
తురె నరపాలు రెందయిన దుర్మతి యీయది యెట్లుగల్గె సో
దర! యనియందు వేమొ యది ధర్మము కాదని యెన్ని పల్కితిన్. 266

తే. ఎదిరి తనయంతవాఁడైన । నెదురుకొనఁగ, శక్యమగుగాని దైవమే । సమర మొనరు
పంగఁ జను దేర శక్యమే । భంగి యగునొ, యతని వేఁడుట యవమాన । మనఁగఁ దగునె

తే తోలుబొమ్మలరీతిని । దోఁచునట్టు, లెల్లవారల నాడించు । నీశ్వరుండె
మనకుఁ నెదుటను దోఁపఁ బ్రథనమదెట్లు, చేయఁదరమా నాతోఁ బదు । చిత్తమునకు.

చ కడపటిమాటఁ జెప్పెద నిఁ । కం బరమేశ్వరుతోడ వైర మీ
వడువునఁ గాంచి రక్కసులఁ । బౌరుషమూని మహారణంబునన్
బడ నొనరింపఁబూనకుము । భద్రము నీకగు రామునంఘ్రులం
బడి శరణంబు వేఁడుము కృపామతి యాతను గాచు నిన్నునున్. 269

క నినుఁ గాచుకొనుటయే మ, మ్మును గాచుట యగును గానఁ । బొమ్మిపుడే సీ
తను దోడ్కొని రాముని కడ, కనవుడుఁ గ్రోధాగ్నికణము । లతుల వెడలన్.

చ. పటపట పండ్లు గీటుచు నృపాలకు నన్ శరణంబు వేఁడు మ
క్కటికమునూని కాచునని । కాఱులు పల్కితి వింతదాఁక నీ
పటుతరవిక్రమంబె గొని । పంక్తిగళుం డిలఁ బ్రాణయుక్తి నుం
డుట కనువయ్యె నింకను గడుంగడు దుర్దశ నొందకుండునే. 271

క. చనవయ్య! నిద్రఁగనఁగ శయనగృహమున కేనుబోయి । యా రఘువీరుం
గని మ్రొక్కి నీదు వాక్కుల, వినిపించెదఁ గాచునతఁడు । విడువక నన్నున్. 272

చ. తెలిసికొనంగఁ గల్గితి సుధీవర! నీదగునీతివాక్యముల్
తొలఁగెను సంశయంబు లిఁక । ధూతకళంకుఁడనైతి దైత్యవీ
రులు నినుఁ గూడి శర్మ మను । రూపముగాఁ గనుచుండ్రు గాక! నేఁ
దెలియనివాఁడ మూర్ఖుఁడను । దేట పడెం గద నాదురంతముల్? 273

చ. పదపద శయ్యపైకిఁ గడు । బాలిశుడం గనుకన్ సుఖంబుగా
నిదురను గాంచు నిన్ను నప । నిందలపాలొనరింప లేఁకగా
నదయతఁ బంపినాఁడ సుభ । టాళిని దానికి సైఁచి నన్ను నీ
మదిని మఱొండుగాఁగ నను । మానమునొందక పొమ్ము ప్రాజ్ఞుఁడా! 274

చ. అని మదినున్న యాగ్రహము । నంతయు నీవిధి గర్భితంబుగాఁ
దన హృదయంబు దెల్పుటయు । దానవనాథుల నింక మృత్యువే
కనుఁగొన వేచియున్నదని । క్రమ్మఱ నెమ్మది నిశ్చయించి యి
ట్లనియె భయంబునొంది దనుజాధిప! యీగతిఁ బల్క నెంతునే. 275

చ. అరిగెద యుద్ధభూమికిఁ జయంబొడఁగూర్పఁగఁ బోరువాఁడ నే
మరలి భవత్పదాబ్జముల । మస్తకమానఁగఁ జేసి మ్రొక్కి ఘోరసం
గరమును జెప్పఁగల్గుదునొ । కాలభటుల్ పిలువంగ వారితో
నరుగుదునో యెఱుంగ మనమారఁగ మ్రొక్కెదఁ గౌఁగిలింపుమా. 276

మ. చిరకాలంబుగ నన్నుఁ బెంచితివి; లక్ష్మీసత్కృపం గల్గు న
ట్లరయం జాలితి; వింతదాఁక నిను సేవనర్థింప నెద్దాని నేఁ
దరుణం బిద్ది దురంతమైతగుట నర్థం బేదియేఁ గోరఁగాఁ
బురికొల్పెన్ మది కౌఁగిలింపు మదియే పూర్ణార్థ మంచెన్నెదన్. 277

క. ఎదఁ గనఁడు కుంభకర్ణుం, డెదిరిభయం బింతదాఁక నిప్పుడుఁ గనఁడం
చిదె పయనముచేఁ దెల్పెడు, మది నన్మలువకు మటంచు మఱియున్ వేఁడున్.

చ అనిమొనఁ జచ్చినన్ సురపురాంగణమం దఖిలార్థసిద్ధిచే
మనము ప్రమోదవారినిధిమగ్నముగాఁగ సుఖింపవచ్చు; శ
త్రునిచయ మోర్చినన్ జయముతో ముదమొందుచు నుండవచ్చు; రెం
టను సుఖమే కనంబడుఁ గడంగెదఁ బోయి పరాక్రమింపఁగన్. 279

శా. అన్నా! నానుఁడు లాలకింపక మహాహాస్యోక్తులం బల్కి నీ
వెన్నండేసియుఁ గాంచనట్టి క్రుధ నిద్దేకాంచి తేపందు సం
పన్నత్వం బిదియేమిగాఁ దలఁచియో పల్కించె నీనోటఁ గా
కున్నం బల్కెదె కుంభకర్ణు నిటులే యోజింపుమా యింక నేన్. 280

మ. అనిపాదంబులపైన వ్రాలిన పులస్త్యబ్రహ్మవంశాబ్ధిచం
ద్రుని సోదర్యుని భూరిబాహుబలనిర్ధూతారివీరాళిమా
న్యునిఁ గుంభశ్రవు లేవనెత్తి మనమందున్ వేఱుగా నన్ను భా
వనచేయం జనదిద్ది కాలకృతమౌ వ్యాపార మంచెన్నుమా. 281

మ. పలుకుల్ పెక్కులిఁకేల రాముని జయింపం బొమ్ము నామాటలం
దొలుతం గల్గినయాశయంబు మనమందున్ నిల్వ లేకెట్టులో
తలఁగం జేయు మభీష్టసిద్ధియగు నీధర్మంబె నిన్గాచు నం
చలుకన్ మాని వచింప సోదరునిదౌ నాజ్ఞం దలం దాల్చుచున్. 282

మ పదసంఘట్టన భూమియెల్ల వడఁకన్ బాహోధు లుప్పొంగ దు
ర్మదమాఱంగ ననంతుఁడేమగునో యీక్ష్మామండలం బంచుఁ గుం
దొదవన్ శీర్షములల్లె వంపఁ బ్రమదంబూడంగ శైలంబు లా
ర్తిఁ దగంబొందఁగఁ గుంభకర్ణుఁడు మహాధీరుండు యుద్ధార్థియై. 283

చ. చరణరజంబునన్ జలధిసప్తక మెంతయుఁ బంకిలంబుగాఁ
గ రయమునం బొసంగు పెనుగాలిని భూరుహవారమంతయున్
ధరణిఁబడంగ సాలసముదాయము జంఘలఁ జక్క వానరో
త్కరములు గాంచఁ జేయఁగ వికారమహాకృతి గల్గ నంతటన్. 284

క. తనకనిమొన మృత్యువు కల్గును దప్పదటంచు నెంచికోరిక రాముం
గనవచ్చు నతనిచేఁ జచ్చినముక్తియె వచ్చునన్న చింతయె కలుగన్. 285

క. పరుగిడె నాతని యాకృతి, కరమాశ్చర్యంబు భీతిఁ గలుగఁ జేయన్
హరివీరు లాకులతఁ గాంచిరి భల్లూకములు బెదరు చెందినమదులన్. 286

ఆ. పాదములకు బుద్ధి పాటవం బెఱిఁగించె, నావిధంబు గాంచి యసురవర్యుఁ
బిలిచి రామమూర్తి వింతయే మిదితోఁచె, వీరికెల్లఁ బఱచువార లిపుడు. 287

చ అనవిని యవ్విభీషణుఁ డహార్యపరాక్రము రాముఁ గాంచి యి
ట్లనియెను గుంభకర్ణుఁడు మహాబలుఁ డింద్రుఁడులోనుగాఁగఁ గ
ల్గినసురనాథులన్ గరము గెల్చెను సంగరరంగమందు నీ
తనిచరితం బిదౌననుచుఁ దా సకలంబును జెప్పి యత్తఱిన్ 288

ఆ భూరియంత్ర మిద్ది పురమున నెత్తిరి, భయపడంగ నేల వనచరేంద్రు
లార! యంచు నెల్లవారలకుం దెల్పఁ, బంపుఁ డిపుడె యన నృపాలవరుఁడు.

సీ. హనుమదాదులఁ బిల్చి యావార్త నెఱిఁగింపఁ, బంచినవారు సాటించి రల్ల
శరభాంగదగవాక్షసామీరి ముఖకపి,నాయకుల్ వెలుచన నగరివాఁకి
టను నిల్చియుండిమాఱొ్కను కౌతుకంబుల,నరయుచుండిరి వానియాగమనముఁ
బటువాద్యనాదముల్ పరఁగఁ బురంబును, వెలువడి బలములు వేనవేలు
ఆ కొలువ వచ్చె నపుడు కుంభకర్ణుఁడు రణాంగణము చేరఁ గపులు కలఁతనొంది
యును సమీరపుత్త్రుఁడును శరభాదులు, ముందు నిలిచిపోరఁ బూనియుంట.

చ. పరుగులువాఱ కొక్కవిధిఁ బ్రాణగణం బఱచేత నుంచుకొం
చురుతరవిక్రమాఢ్యు పురుహూతసుతాత్మజుఁ డాదిరైనయా
హరివరు లెల్లముందు దనుజాగ్రణి మాఱొ్కన నూల్కొనంగ నం
తరముల నిల్చియుండి రాకనాఁడును మాఱొ్కన నెంచ కార్తులై. 291

## కుంభకర్ణునియుద్ధము.

చ. నగరమునుండి వెల్వడి ఘనధ్వని దిక్కులు పిక్కటిల్లఁగా
నొగి నొనరించుచున్ గపుల నొక్కటఁ గాంచి స్మితం బదెంతయున్
వెగటుగఁ గన్పడంగఁ బది వేవురఁబట్టి విశాలవక్త్రమం
దగణితశక్తి వైవఁదగునంచుఁ దలంచుచు నుండునత్తఱిన్ 292

చ హరిహయపౌత్త్రుఁ డాదియగునట్టిమహాకపు లార్భటించి భూ
ధరములవైవ నించుకయుఁ దాను జలింపక నిల్చియుండె; న
త్తరుచరు లంత మాఱొ్క నిరి దారుణసంగర మయ్యె నంత వాఁ
డురుబలమెల్ల గూల్చుచు మహోగ్రరవంబును బర్వఁ జేయుచున్. 293

చ. తనుఁ గనినంతనే భయము తమ్మొగిఁ గప్పఁగఁ బాఱఁజూచు న
వ్వనచరులం గనుంగొనుచు బాహువు లల్లనఁ జాఁచి పట్టుచున్

వననిధివైచుచుఁ నలిపి । వందుఱఁ జేయుచు విక్రమించె నా
తని దగుసాహసంబు గని । తారును బూనిరి విక్రమింపఁగన్. 294

మ. హనుమంతుం డొకకొండ వైవ నదిదే।హస్పర్శమాత్రంబునన్
గనువారల్ వెతఁగుందఁ జూర్ణమయి భూ।గర్భంబునన్ రాలెఁ ద
క్కినకోఁతుల్ పడవైచుగండశిలలే। కించిత్తనూబాధయే
నొనరింపం దగకుండె; దేవవరు లో।హో యంచు బిట్టార్వఁగన్. 295

క. ఆతని నొంపాదగు విధ, మీతీరున నుండు నంచు । నెఱుఁగక కపుల
త్యాతతశక్తిం బోరుచు, భూతలపతిసేవఁ జేయఁ।బూనిరి మదులన్. 296

క. వారల బలపౌరుషముల, నా రావణుతమ్ముఁ డొక్క।యణుమాత్రం బే
నారయ కంతట బలమున, వారిం దోలంగ సాగె । బటువేగమునన్. 297

చ. తలఁపడువార లెల్లఁ దన।దర్పమునం బొలివోవ నెవ్వరేఁ
దలఁపడువారు లేమికి ని।తాంతము కోపము ప్రజ్వరిల్లఁ గోఁ
తులఁ గని రండు రండు త్వర।తోఁ జనవచ్చు యముంగనంగ నం
చలరుచు నాచ్చునాదనుజు । నర్కకుమారుఁడు మార్కొనెన్ వెసన్. 298

సీ. శైలముల్ వైచి యేఁచఁగఁ జాలకే గండ,శిలలఁ దరువ్రాతములను వైచి
యించుకయే జంకోలించున ట్లొనరింపఁ,గను లేక యెట్టులో । యని యొనర్చు
సుగ్రీవునింబట్టి । శూరత్వ మేర్పడ, బాహ్వంతరమున న।బ్బా! యనంగ
నొక్కిన నవ్విధిఁ।జిక్కి ప్రతిక్రియ, తోఁపమి సుగ్రీవుఁ । డేపుమీఱ
తే. నతనినాసిక కర్ణము । లపుడు కొఱికె, దానఁగోపించి బల్విడి । ధాత్రివైచె
నంత నొప్పించి రెండవో।యాతుధాను,లక్కజుఁడు శక్తియలరంగ।నవలదాఁటి.

చ. కడువడిఁబోయి రామనృప।కాంతుని జేరెను వానిరాకకున్
బొడమినమోదబాష్పములు । భూతలముం దడుపంగ నాయనా!
యిడుమలఁజిక్కివచ్చితివె । యెట్టులొ దైవగతిన్ దురాత్ముచే
బడలితివయ్య చూడు మిఁక । వానిగతిన్ గనుఁబోయి విందుగన్. 300

ఉ. రామునియుద్ధకౌశల మ।రాతిభయంకరమై చెలంగు నం
చోమహితాత్మ! యిప్డెఱుఁగు । మొర్వి జరింపఁగ లేఁడు వీఁడు సు
త్రాముని గెల్చినాఁడ నని । రాముని నల్లి జయింపవచ్చు సం
గ్రామమునందు నంచుఁ గడు।గర్వమునం జనుదెంచె సన్నసై. 301

ఉ. ఆయువు తీఱె వీనికి మ।హాహవమిత్తఱి సాగనున్న; దీ
వీయెడనిల్చి చూడు మదె । యేత్తెఱఁ జూపఁగ వచ్చుచున్న వాఁ
డీయవనిం బడంగఁ గపు।లెల్లరు చూతురుగాక! నాథను
స్సాయకశక్తివేగముల । సర్వవిధశ్రమముల్ తొలంగఁగన్ 302

### రాముఁడు కుంభకర్ణుం జంపుట.

చ. అని తనపౌరుషోక్తులకు । నర్కజుఁ డెంతయు సంతసించుఁగా
కని తలపోయుచుం బలుకు।నారఘురాముని మార్కొనంగఁ జ
య్యనఁ జనుదెంచె వేడుకఁ ద।నంతన పొంగఁగఁ గాల మెంతయుం
దనుఁబురికొల్పి తోడుకొని । తద్ధరణిం గదియింపఁ జేయఁగన్. 303

ఉ. కాలుఁ డదృశ్యపాశములఁ । గంఠముఁ జక్కబిగించి లాఁగఁగాఁ
జాలఁ డెవండు వానిదగు।శక్తి మరల్పఁగ నంతె కాక తా
నేలొకొ పోవువాఁడ నని।యేఁ దలపోయక గొత్తవోలెఁ బ్రా
ణాళి దొలంగుచోటికి మ।హాదృతిఁ బోవు నెఱుంగఁ డింతయున్. 304

తే. ఇట్టివాఁడయ్యుఁ దనశక్తి । యెంతొ యనుచుఁ
దాస్వతంత్రుఁడ ననుచు నొత్తఱిని దనకుఁ
దెలియనిదె లేదటంచును । బలుకుచుండు
నింతకంటెను వెఱ్ఱివాఁ । డెవఁడు కలఁడు?. 305

చ. చదివినవారికంటెఁ గన।జాఁకలి మేలనుపల్కు నిక్కమే
చదివినవారలే పలుకఁ।జాలెదు వారు స్వతంత్రశక్తిచేఁ
బొదలితి మంచు మూఢులనఁ।బోలినవారలు వారె యించుకేఁ
జదువనివారె కర్మమది । చాలును సర్వమొనర్ప నంద్రుగా 306

ఉ. జ్ఞానులమంచుఁ గర్మమది।చాలు స్వతంత్రత మించ వేఱెదేఁ
గాని కనంగరాదనరు । కావున వారలె యజ్ఞులౌదు రెం
దేని స్వతంత్రుఁడన్న నుడి । యెవ్వనియందును జెల్లునే పరా
ధీనులె యెల్ల రొక్కపర।దేవతయే యగు నట్లు చెప్పఁగన్. 307

క. పరదేవతయ యనంగాఁ, బరతత్త్వం బనఁగ నొకఁడె । భావింపంగా
నిరువురు వే ఱనువారలు, కర మజ్ఞులు వారితోడఁ । గలహ మఫలమా. 308

తే. కుంభకర్ణుని నదిగొ వెన్కొనుచు మృత్యు
వేగుదెంచుచున్నది । హితమె యనుచు
వచ్చుచున్నాఁడు నాపైకి । బలముచూపి
గెలుతు ననునాశతో వీఁడు । తులువయగుట 309

క. ఈసాయంకాలమునకె, యాసంయమనీపురంబు । నంతికమున నొ
ప్పాసరణిఁ బోవు స్వర్గమ,హాసౌఖ్యము లనుభవింప । నర్కకుమారా! 310

క. నీవిప్పుడు నాచెంతనె, భావించుచు దీని న్యాయ।పద్ధతి యిదెయం
చావిధము సాగు నెట్లని, ప్రావీణ్యముమీఱఁ జూడఁ।బట్టువదలకే. 311

చ. కనుఁగొనుచుండు మంచు రఘు।కాంతుఁడు పల్కుచునుండు నంతలో
ఘనరవ మంబరంబు శత।ఖండములై పగులంగఁ జేయ నా

దనుజవరానుజుండు గురుధైర్యము మీఱఁగ రామభద్రు మా
ర్గాననఁ జనుదెంచెఁ దన్నుఁ గని కోఁతులు భీతిని బాఱిపోవఁగన్. 312

ఉ. వచ్చెడు కుంభకర్ణుఁ గని వాసవపౌత్రమరుత్తనూభవుల్
ముచ్చటదీఱ రమ్ము జవమున్ బలముం గనఁజేయుమింక మే
మిచ్చటనుండి చూచెద మదెంతటిలోఁ బడువాఁడ వంచు లో
హెచ్చెడు కిన్క నుండఁగ నృపేంద్రుఁడు దానవుఁ బిల్చి యిట్లనున్. 313

శా. రమ్మా! దానవవర్య! యియ్యెడనె సంగ్రామంబుఁ గల్పింప సి
ద్ధమ్మై యున్నది దైవ; మద్దియొకదా తాత్పర్యమౌ నాకు నీ
కిమ్మై లొందఁగఁ జేసి నందులకు సంతృప్తిన్ భజింపంగ దై
వమ్మే ముఖ్యము నీదు బాహుబలమున్ వర్ణింతు రాదిత్యులున్. 314

ఉ. వింటిని మున్నె నీదుఘనవీర్యము వానరులెల్లఁ జెప్పఁగాఁ
గంటిని నిన్ను నిప్డె బహుకాలమునుండియుఁ గోరుచున్న నీ
బంటుతనంబు చూడ నిదె వచ్చె నదృష్టము చెంతకింక వా
ల్గంటులు దేవలోకమునఁ గాంతురుగాక నినున్ ముదంబునన్. 315

క. కని పెట్టియున్నవాఁడవు, జనుదెంతువొ యెప్పుడనుచుఁ జాప మ్మిది ని
న్ననఁగోరుచున్న దెంతయు, దనుజవరా! యుద్ధభిక్ష దప్పక యిమ్మా. 316

చ సునిశితబాణజాలములు సోఁకి భవత్తనురక్తపూరముల్
తనివిసనంగఁ ద్రావు ప్రమదంబును గాంచుచుఁ దూణవక్త్రమొ
య్యన విడఁదీసికొంచు వినయంబును వీడితి దానిసైఁపుమా
యని నను వేఁడుచున్న విదె యల్లనఁ దీవ్రమరీచిజిహ్వలన్. 317

చ. నరపతి యిట్లుపల్కఁగ మనంబున సాహసమట్టె నిల్వ క
బ్బురముగ నుబ్బ నిట్లనియె భూతభయంకరనాదమొప్ప ని
న్నరయుచు వచ్చినాఁడ సమరాంగణమం దెచటం గనంగనౌఁ
బరుఁడగు రాముఁడంచు నిదె వచ్చితిఁ జూచితి నిన్ను నిచ్చటన్. 318

ఉ. కన్నులపండువయ్యె నృపకాంత! రఘూత్తమ! రామచంద్ర! నీ
వన్నిటనేర్పుకాఁడ వనియందఱు చెప్పఁగ నెన్నిసారులో
విన్నను దృష్టివాయమిని వేగమ వచ్చితి నిన్నుఁ గాంచి సం
పన్నుఁడనైతి నాదయినభాగ్యము పండెను ధన్యుఁడన్ ధరన్. 319

చ. నిలువుము చక్కఁగా నెదుట నిన్నుఁ గనుంగొనఁ గోరినాఁడ గో
ర్కులు ఫలియింపఁజేయు మిదె కోఁతులమూఁకలు సంగరంబునన్
నిలుచునె నాదుమ్రోల నతినీచులతో సమరంబు చేయఁగాఁ
గలుగునె చిత్తమెత్తఁటిని గావున నీకడ కిప్డు వచ్చితిన్. 320

క. నినుఁగంటిఁ గోర్కి దీఱఁగ, ననిసేయుద మింక ననుచు । నతిభయదరవం
బును బర్వఁజేయ రాముఁడు, సునిశితబాణంబు లేసె । శూరత మెఱయన్. 321

క. అవి మేనుసోఁకి పరమా,ణువులవలెం ద్రుళ్లిపడిన । నూత్నోత్సాహం
బున నల రాముఁడు దనుజే,శువపువు భేదింపఁదగు నిషువుల్ వైచెన్. 322

సీ. కుంభకర్ణుం డంతఁ । గోపవహ్నితాశన, జ్వాల సమావృతస్వాంతుఁ డగుచుఁ
గరతలగతతీక్ష్ణ । ఖడ్గంబు వైచిన, నడుమనె త్రుంచె భూనాయకుండు
గద భిండివాలముఁ । గడఁగి వైవఁగ వాని, ఖండించె రాముఁ డఖండశక్తి
మఱియును గల్లుతో । మరముఖంబులఁ గొట్ట,నవి తాఁకకుండ వ్యర్థ్యలయి పడఁగ

ఆ. సాయకంబు లేసె । క్ష్మాపతి యంతట, సకలసాధనములు । సమసిపోవ
శైలఖండ మెత్తి । సరగున వైవంగ, వజ్రసాయకమును । వైచి యడఁచె. 323

వ. ఇట్లు ఘోరంబుగా యుద్ధంబు సాగుచుండ రామభద్రుండు రౌద్రాకారుండై రౌద్రబాణంబులం బ్రయోగించి యవయవముల ఖండించి తుదకు శిరస్సు భేదింపఁగా హాహాకారపూర్వకంబుగా నది యవనిం బడియె. అంత వానరు లెల్లరు మహానందంబునం బొదలిరి. దేవతలు రామునిపయిం బూలవాన గురియించి రప్పుడు. 324

చ. వనచరు లందఱుం గనఁగ । వానిశరీరమునుండి లేచె న
త్యనుపమ తేజ మొక్కఁడది । వ్యోమపథంబున సూర్యమండలం
బును జొరఁబాఱి యెచ్చటికొ । పోయెఁ గనంబడదయ్యె; నంత నా
జనపతిచెంత కేగి తమ । సందియముల్ దెలుపంగ రాముఁడున్. 325

చ. కలకలనవ్వి క్రూరుఁడని । కాంచఁగ రా దితనిన్ స్వదుష్కృతం
బులకు ఫలంబుగా వికృత । భూరిశరీరము గాంచె; లోన ని
ర్మలమగు తేజమున్న యది । రావణుతమ్ముఁడు భూమిపైఁ బడన్
దొలఁగెను మేనునుండి యదె । తోఁచెను మీకు విచిత్రరీతిగన్. 326

క. ప్రవిదారణమునఁ జచ్చిన, బ్రవిమలయోగంపుశక్తి । బ్రహ్మవివరమున్
సవిధిగ భేదించిన వా, రవితథఫలదానదక్ష । మగు సత్పదమున్. 327

క. కనఁబోదురు; రవిమండల,మును జొరఁబడి మధ్యభాగ । మును భేదింపం
గను శక్తిగల్గి యాత్రో,వను బోదురు సత్పదమున । వాసముచేయన్. 328

చ. దనుజుఁ డటంచుఁ గ్రూరుఁడని । దారుణరూపుఁ డటంచు నెంచరా
దని తెలియంగఁ జేయునిదె । యారయుఁ డీ కపులార! పుణ్యమూ
ర్తిని ధరియించె దుష్ఫలము । తీఱిన వెన్క నటంచు నమ్మఁగాఁ
జనుగద; యెవ్వఁడేని క్షితిఁ । జాలభయంకరకర్మసంగతిన్. 329

ఆ. ఏవగింపుగల్గు । నావపువుం దాల్చు, దత్ఫలంబు తీఱఁ । దారుణాంగ
మద్ది వదలుఁ గాన । నాతని నిందింపఁ, దగదు పిదపఁ బుణ్య । తను వలరుట. 330

క. మరణాంతమ్ములె వైరము, లరయంగా ననుటకిదియె । యగుఁ గారణ మో
హరివరులారా! ద్వేషము, పరఁగుం దనువుండుదాఁకఁ । బయి నది తొలఁగున్.

చ. అరి యని దూఱరా దతఁ డొకప్పుడు చేసినదుష్కృతంబె భీ
కరఫల మిచ్చె నయ్యఘము । కాలమునన్ నశియింప సజ్జనో
త్కరమునఁ జేనఁగాఁదగును । గాదె యతం డరియన్న భావ మా
తరుణమునందు నుంచుకొన । ధర్మమె దూష్యముగాదె యద్దియున్. 332

ఉ. ఇత్తఱిఁ గుంభకర్ణుఁడు మహాసుఖధామమునొందె సంగరం
బుత్తము లోకవాసమున । కూఁతగనుండును వీరరాజికిన్
సత్తము లైనభూవరులు । చత్తురు సంగరభూమిపైన న
త్యుత్తమలోకవాసమునె । యొప్పుగఁగోరుచుఁ బౌరుషంబునన్. 333

చ. అని రఘునాయకుండు తని । వారఁగ నాతనిస్వర్గకారణం
బును దెలియంగఁజెప్పి తను । వున్ విడనాడినకుంభకర్ణుపైఁ
గినుకవహింప రాదనుచుఁ । గీర్తిశరీరునిదూఱరా దటం
చునునయమొప్పఁ జెప్పి రణ । మందు శ్రమంపడువారిఁ దేర్చుచున్. 334

క. తానుండె నంతలో లం,కానగరమునందుఁ గుంభ । కర్ణునిమృతి యా
దానవనాథుని శ్రుతులన్, దానుఁగఁ జేరంగ నతఁడు । ధైర్యము దూలన్.

సీ. కొలువుకూటంబునఁ । గూర్చుండి విలపించెఁ, దద్గుణంబులు శ । క్తిధైర్యములను
బలుమాఱు దలఁచుచుఁ । బౌరుషంబిది వ్యర్థ,మేయగు దైవంబె । యెన్నఁ బ్రబల
మనుదానిఁదలపోయు । చును మీఁదఁ జేయంగ,దగినట్టికార్య మే । యయ్యెదియటంచు
సచివులతో నెంచి । శత్రువులను బురిఁ, జొరనీక నిల్పెడు । శూరవరుల

తే. దానవుల ద్వారములఁ గావఁ । దగు నటంచు,నిలిపియంతమహాపార్శ్వ । నిర్జరాంత
కాదులంబిల్చి మీశక్తి । యనిని జూపి,శత్రువులఁజంపి రాఁదగు । సరగున నన.

ఉ. వారలుపోయి విక్రమ మ । హావార్యముగాఁ గనుపట్టుచుండఁగాఁ
బోరిరి వానరోత్తములు । పూనికమీఱ నెదిర్చి సంగరం
బారయ ఘోరరూపమున । నయ్యమరాళికిఁగూడఁ దోఁచు న
ట్లారఘునాథుఁ డాత్మ ముద । మందెడునట్లుగఁ జేసి రత్తఱిన్. 337

క. ఒకఁడొకఁడే హనుమన్ము, ఖ్యకపీశులచేతఁ బడిరి । కడు ఘోరముగా
సకలనిశాచరు లవ్విధిఁ, బ్రకటించిరి దేవలోక । వాసగమనమున్. 338

అతికాయుఁడు మృతినొందుట.

చ. దితిసుతవీరు లప్పగిది । దృప్తవనాటులచేతఁ జావఁగా
నతిశయదుఃఖ మొంది దను । జాధిపపుత్త్రుఁడు సేనతోడ దో
ర్వితతబలంబుచూప హరి । వీరులఁ జంపఁగఁ బూని సంగర
క్షితి కపుడేగుదెంచె సుర । కీర్తితవిక్రముఁ డౌట నత్తఱిన్. 339

మ. అతికాయుం డిటు చాపమూని రణకాంక్షాయత్తచిత్తంబునన్
ప్రతిలేనట్టిధనుర్విలాసమునఁ జేరన్ రాఁగ భల్లూకసం
తతి శాఖామృగవీరసంచయము నత్యంతంబు భీతిల్లి సూ
నృతవాగ్భూషణు రాముఁ జేరి త్రిదశారిం జూపి దైన్యంబునన్. 340

చ. శరణుచొరంగ వచ్చితిమి శాత్రవునిం బొరిపుచ్చుమా విభూ!
కరము భయంకరుం డితఁడు గాఁ గనుపట్టెడు నన్న రాముఁ డా
హరితతిభీతి వాయువచనాళిని బల్కుచుఁ జాపమూని భీ
కరగతివచ్చు వానిఁగని కార్ముకమున్ ధరియించి వీరుఁడై. 341

తే. సుగుణభూషణుఁడయి రణశూరుఁడు నగు, నవ్విభీషణుఁ గనుఁగొని యడిగె నిట్టు
లెవ్వఁ డీతఁడు స్యందనమెక్కి యద్భుతాకృతిం బూనివచ్చెడు నద్భుతముగ

సీ. అరదమ్ము భాస్కరునరద మట్లొప్పెడు, చాపమాఖండలుచాప మట్లు
పొలిచెడు తూణముల్ విలసిల్లుచున్నవి, బాణపూర్ణములయి ప్రకటకాంతి
ఖడ్గయుగ్మము సూర్యకాంతుల నెగఁజిమ్ము, కరణి నున్నది వీనియిరుదెసలను
తక్కినయాయుధోత్కర ముల్లసిల్లెడు, శత్రురాజికి సాధ్వసంబు నిడుచు

ఆ. జెప్పవయ్య! యితఁడు సేనలతో వచ్చెఁ, గపిబలంబు లెల్ల కడలఁ బఱచె
నేను మార్కొనంగఁ బూనియున్నాఁడ నా, నసురవర్యుఁ డిట్టు లనియెఁ బతికి.

క. అతికాయుఁ డితఁడు రామా! దితిజేంద్రుని సుతుఁడు తీక్ష్ణదీధితివలెన
ప్రతిహతతేజుఁ డుదారుఁడు, శతమఖుని బరాభవింపఁజాలు బలమునన్. 344

చ. మునుపు సురేంద్రు దేవబలముల్ గొలువంగ రణంబు చేయ వ
చ్చినయతనిన్ జయించె రణసీమను వీనిజయింపరా దటం
చు నుతినిగాంచె నీయసురశూరుఁడు బ్రహ్మను సత్తపంబు పెం
పున గరఁగించి మంచివరముల్ గ్రహియించెను రామభూమిపా! 345

క. నిను మార్కొను వేడ్కను వచ్చెను రామా! వీనితోడఁ జేయందగుఁజు
మ్మని సంతసంబు గల్గించును సంగర మద్ది శాస్త్రశోభితమగుటన్. 346

ఆ. పెక్కుశరము లెఱుఁగుఁ బెంపును గాంచిన, వాఁడు నీతిశాస్త్రవార మెఱుఁగు
భక్తిఁ గొల్చినాఁడు పరమేష్ఠి విజ్ఞాన, ధనుఁడు సుమ్ము రామ! దస్యుభీమ! 347

చ. అని తెలుపంగ రాముఁ డపుడాతనితో బవరంబు చేయ నూ
ల్కొనె; నతికాయుఁ డంతఁ గపికూటము పాఱఁగఁ జూచి నవ్వుచున్
జనపతియుండు చక్కటికి స్యందనమున్ వడిఁ దోలఁబంచి చెం
తనుదగు చాపధారి రణధర్మవిదుత్తము రాముఁ గాంచుచున్. 348

చ. పలికె ఘనస్వరంబు తగఁ బాఱెడునీచులతోడఁ బోర నే
నిలిచి పరాక్రమంబు రణనీతిని దప్పక చూపువారితోఁ

గలహమొనర్తునిం దేవఁడుగాని ననుం గృతకృత్యుఁ జేయఁగాఁ
గలుగునయేని మార్కొనునుఁగాక! రణోత్సవ ముల్లసిల్లఁగన్ 349

చ. అని గరువంబునం బలుకునాశరు మార్కొనఁగోరి లక్ష్మణుం
డనియె; వికత్థనంబుల మహాత్ములు పల్కరు; మాటలేల న
న్నని మొన నిల్వరింపు; మసురాధిపుమన్నన నిష్ఫలంబుగా
నొనరుతు నంచుఁ దాఁకెను; రఘూత్తముఁ డాత్మ నెఱుంగుఁ గావునన్. 350

ఉ. ఊరక చూచుచుండె; దనుజోత్తముఁ డాతఁడు మార్కొనంగ నీ
ధారణినాథనందనుఁడు తద్దయు బాలుఁడు యుద్ధకౌశలం
బారయ నేరఁ డట్లగుట నందఱఁ జూచినయట్లు నన్ను దు
ర్వారపరాక్రముం గనుచుఁ బౌరుషమూని యెదుర్కొనెం గటా! 351

క వియ్యము మఱి నెయ్యంబటు, కయ్యము ననునిర్వ మూఁడుఁగలిగిన సముతోఁ
నెయ్యెడ నిరుపద్రవముగ, నొయ్యనసాగు నదిలేమి నొప్పవు సరిగన్ 352

చ. అని తలపోయుచుం బలికె నయ్య! కడుంగడుఁ బిన్నవాఁడ వీ
దనుజునిశక్తి యెట్టిదని తావకచిత్త మెఱుంగఁజాల; ద
ట్లని నను మార్కొనంగడఁగు టయ్యదియే తెలియంగఁ జేసెడుఁ
గనుకఁ దొలంగు మవ్వలికి గర్వసముగ్రుఁడె నన్ను మార్కొనున్. 353

తే. యుద్ధమర్మంబు లెన్ని యోయుండు వానిఁ,జక్కఁదెలిసిన వానితోనుక్కుమిగిలి
మారుకొనవచ్చునయ్యా నామాటవినుము, తొలఁగుమవ్వలబాలతఁగలిగియుంట.

సీ. సకలాస్త్రశస్త్రనిష్ణాతుని బహువిధ, యుద్ధమర్మజ్ఞుని నురుబలాఢ్యు
బాలుఁడు మార్కొనఁబోలునే యదియేటి, సంగరం బద్దాన జయముగల్గి
నను సన్నుతింపఁగా ననువగునే సమ,త్వముగల్గ నద్దియే ధర్మహితము
గాఁదగు సామాన్యుఁగాఁ దలపోసి యి,క్కార్యంబునకుఁ బూనఁగల్గితీవు
ఆ. వలదు వలదు నన్నుఁగలసున మార్కొన, దలఁగు దలఁగు మేటిపలుకు లింకఁ
బిన్నవానితోడ నెన్నక సమరంబు, చేసె నన్నదూఱు చెందు నన్ను 355

చ. అరిజనకాలుఁ డంచు వినయాదికసద్గుణవార్ధియంచు భీ
కరబలవిక్రమాఢ్యుఁడని కారణజన్ముఁ డటంచు సత్యవా
క్నిరతుఁ డటంచు మౌనివరనిశ్చలచిత్తసరోజవాసుఁ డం
చురుయశ మెల్లదిక్కులకు నొయ్యనఁ బర్వఁగఁ జేయు వీరుఁడే. 356

ఉ. నన్నని మార్కొనంగలఁడు నాథునిఁగాఁ దనునెల్ల దేవతల్
మన్ననమీఱ నెన్నఁగ నమానుషతేజము దిగ్విదిక్కులం
దున్నతిమించఁ బర్వ మహిమోజ్జ్వలుఁడై తగుధీరవర్యుఁడే;
యన్నరొ! చిన్నవాఁడవుగదా రణమేటికిఁ బొమ్ము వేగమే. 357

ఉ. వేదములుం దదంతములు వేదహితార్థముఁ దెల్పుచున్ మహా
మోదముఁగూర్చు సచ్చరితముం గలిగించుచు మించునా స్మృతుల్
వేదగణాశయంబును వివేకులు మెచ్చఁ గథాచ్ఛలంబునన్
బ్రోదిగఁ దెల్పుచున్ విహితబుద్ధిని దెల్పు పురాణరాజముల్. 358

ఉ. ఇంకను గల్గు గ్రంథములలో వేవియుఁ దెల్పఁగఁజాలనట్టి శ
క్త్యంకుఁడు వంశరూపముల కాఖ్యకుఁ జిక్కకయుండఁ జాలియే
యంకములేని వాఁడనుచు నార్యులు చెప్పఁగ నొప్పియుండు మ
ర్త్యాంకుఁడు నన్ను మార్కొనఁగ నర్హుఁడు; నీవు తొలంగు బాలకా. 359

చ. సమరమునందు నిల్చి గురుసత్త్వముఁ జూపఁగ నెంతశక్తియే
నమరియు లేనివానివలె నందఱకుం గననౌచు నెవ్వరె
ట్టిమహిమముం గనంబడఁ గడింది ప్రయత్నము మీఱఁ జేయ దా
ని మఱచునట్లు చేయఁగల నేర్పఱి యెవ్వఁడొ వాఁడె మార్కొనున్. 360

ఉ. ఎద్దియుఁ జేయఁజాలకయె యెల్లపనుల్ జరపంగఁజాలి న
ట్లొద్దిక మీఱఁ జెప్పుకొను నుద్యమ మెల్లరు పూనఁ జేయుచున్
బుద్ధికిఁ దోఁపకుండ నొకపోలికనుండఁగ నేర్చి సర్వసం
పద్ధయితుండుఁ గాఁ దగినభద్రుఁడు డీననుఁ దాఁకుఁ గావుతన్. 361

ఉ. అందఱకంటెఁ దా నధికుఁడై మఱియందఱు తానెయయ్యుఁ దా
నందఱియందునుండి యెవరైనను దన్నెఱుఁగంగ రాని దా
చందమున న్మెలంగుచు నసంగతరూపుఁడు తానెయౌచు నొ
ప్పం దగియుండువాఁడు ననుఁ బౌరుషమొప్పఁగఁ దాఁకుఁ గావుతన్. 362

సీ. అస్త్రశస్త్రంబులయందుఁ దానే శక్తి, గలుగంగఁ జేయుచుఁ గ్రమ్మఱింపఁ
దగుశక్తి వానియందుఁ గలుగఁ జేయుచుఁ, గ్రమ్మఱింపఁగఁ జాలకయె తనర్చు
శక్తియు వానికిఁ జాలునట్లుగఁ దానె, కల్పించి సుంతయుఁ గదలకుండఁ
బ్రకృతియే సర్వకార్యము లొనరించెడు, నని తేటపడఁ జేయుచును నసంగుఁ
తే. డనియు నద్వంద్వుఁడనియు నహార్యశక్తి
మంతుఁ డగుననియును బల్వురెంతొ వేడ్కఁ
జెప్పుకొనఁ జాలియుండఁగఁ జిత్రవర్త
నమునఁ దగువాఁడు నన్ మార్కొనంగఁ గలఁడు. 363

చ. మునిజనులెల్లఁ దన్ను నొకమూర్తియు నామము భూరిచిహ్నముల్
తనరెడువానిఁగాఁ దలఁచి తన్ను భజింపఁగ వారివారికిన్
మనముల నల్లి తోఁచి బహుమానము మీఱఁ దరింపఁజేయ నే
ర్చిన బహుకార్యదక్షుఁడు ప్రసిద్ధుఁడు నన్నుఁ దాఁకుఁగావుతన్! 364

క. సుకృతాత్ములకున్ మఱిదు,ష్కృతచిత్తులకున్ సమస్తసిద్ధులుగలుగన్
జతనమ్ము వేలుగా ను,న్నతిమీఱం జేయఁగల్గు నాథుఁడు నాతోన్. 365

క. సంగర మొనరించు తఱిం, బొంగి కనంబడునుగాక ముందఱ; మఱి యే
యంగదయందుం దలఁపం,గం గల్గిన ప్రోడ తాఁకుఁగా కని నన్నున్. 366

క. అపజయమును విజయము నొ,క్కపగిదిఁ దలపోయువారికడ నెల్లపుడుం
గృపమీఱ నిల్చునాభూ,మిపతియె యెదిరించుఁగాక మించి నను ననిన్. 367

చ. కనఁబడుచుండు నెల్లెడలఁ గాని కనంబడఁ డెందునంచు నిం
దు నిలుచుఁ బ్రీతిమై నిచటఁ దోఁపఁ డదెప్పుడునంచుఁ జెప్పఁగా
ననువుపడుంగదా యనుచు నమ్మును లే వచియింప నొప్పున
మ్మనుజవరాకృతిం బొలుచు మాపతి తార్కొనుఁగాక నన్ననిన్. 368

చ. జలముల దాఁగియుండుటకుఁ జాలుచు నంబువులందు మేదినిన్
నిలువఁగ శక్తిఁ గాంచుచు ననింద్యపరాక్రమమే ప్రధానమై
యలరెడుజంతురూపమున నందఱకుం గననౌచు నంతటన్
మెలఁగుచు మర్త్యభావమున మించెడు మార్గత నొంద నేర్చుచున్. 369

చ ఒరులకుఁ జూడ నూత్నముగ నొప్పెడు వామనరూపమున్ మహ
త్తరమహిమంబుఁ గల్గునది దాల్పఁ బ్రియంబును గాంచి భీతికృ
త్పరశువుఁ బూని భూమిధవ పాలకులై తగువారిఁ జంపు నా
దరమును గాంచి మించు రణదర్పసమగ్రుఁడు నన్ను మార్కొనున్. 370

చ. మునులకు మేలుచేయుపనిఁ బూని విధిం దలపోయఁ బూన కం
గనకు మహార్తిఁ గూర్పదమిఁ గాంచుచు శాంబరి చేతఁ బ్రస్తరం
బును వధువై చెలంగునటు పూనికఁ జేసి నితాంతభక్తిఁ బూ
జన మొనరించు సాధనముఁ జయ్యన రెండుగఁ ద్రుంచి నవ్వుచున్. 371

ఉ. తన్నుజనుల్ మహాపురుషతల్లజుఁగాఁ గొనియాడ నేది యో
గన్నకుమారి భార్యయనఁగా గ్రహియింపఁగ సమ్మతించి రా
నున్న మహావిభూతి నొక యొప్పని యంగనమాటమీఁద న
భ్యున్నతి మాయఁ బోవిడిచి యుగ్రవనంబుల సంచరించుచున్. 372

చ కనఁబడునిండ్లఁ దూఱుచు నిశాటము బిచ్చముఁ గొంచు నాకులం
దినుచును దిక్కులేక యొక తెన్ను ననుండియు సిగ్గులేనియం
గనను బరాభవించి యిది కార్యమె చేసితివేల యిట్లటం
చు నడుగవచ్చు వారలను క్షోణిఁ బడన్ వధియించి యొక్కటన్. 373

చ. హరిణముఁ జంపఁ జాలక మహాటవి కజ్ఞత నేగి తమ్ముఁడున్
బరువడి రాఁగ దానవుఁడు భార్యను గైకొనిపోవ నేడ్చుచున్

బఱుగిడియొండుఁగానకయొ । భార్య మఱొక్కఁడు సంగ్రహింప ని
బ్బరముసుమాని కుంది విటపస్థితిమించుమృగంబుఁగొల్చుచున్. 374
తే. చంపరానట్టిమృగపుని । జంపివైచి, యపయశంబును గాంచియు । నలరుచుండఁ
జాలి తనవిక్రమంబున । సకలదనుజ, పతులఁ జంపఁదలంచు భూ । పతియె యిపుడు.
క. ననుఁ బూనిక మార్కొనుఁగా, కని యుల్లాసంబుమీఱ । నాత్మకు నెది తోఁ
చినదో యట్టులె పల్కెఁడు, దనుజగ్రామణిని గాంచి । దర్పముపొంగన్. 376
ఆ. పొగడుకొనఁగనేల । బుద్ధిలేనట్టి య,వ్వారె యాత్మనుతికిఁ । బాత్రులమని
తలఁచుచుంద్రు, నేను । దర్పంబుఁ జూపంగ, వచ్చినాఁడ నన్ను । వైరిఁ గనుము.
చ. దనుజుని హెచ్చరించి యిటు । దారుణచాపము బాణసంయుతం
గనఁబడ నారిలాగుటయుఁ । గన్నులనిప్పులరాలఁ జూచి దై
త్యనిచయనాయకాత్మభవుఁడౌ నఁతికాయుఁడు సారెసారెకుర్
గనుచు సుమిత్రనందనుని । గాఢధనూరవ మొప్పుచుండఁగన్. 378
మ. పవిసంఘప్రతిమానసాయకములం । బల్మాఱునొప్పింప రా
ఘువుతమ్ముండును దీవ్రమార్గణముల్ । గాయంబు భేదించె దా
న విరోధిప్రబలప్రతాపమును మాన్పం జాలఁగష్టంబె యం
చవధానంబున నెమ్మదిం దెలిసి దివ్యాస్త్రంబులం గైకొనన్. 379
ఉ. వానిని మాన్పనస్త్రముల । వైచుచు నుంతయుఁ దగ్గిపోనిచం
దాన రణంబుచేసె; నిటు । దానవు లక్ష్మణుఁడుర్ సుమిత్రసం
తానము దైత్యుఁడుర్ గెలువఁ । దా రెటుచాలక తుల్యబాణసం
ధానపరాయణత్వమునఁ । దద్దయుఁ బ్రొద్దు రణంబుసేయఁగన్. 380
చ. వరబలగర్వయోగమున । వానిని లక్ష్మణుఁ డట్టిఘోరసం
గరమునఁ జంపఁజాలఁడని । కాలవశంబును గాంచనున్న వా
డరయఁగ దైత్యుఁడంచు మది । నప్పు డెఱింగి మహాబలుండు భా
స్కరకులవార్ధిచంద్రునకుఁ । గన్పడి యిట్లని తెల్పె లక్ష్మణా! 381
సీ. ఆయోధనంబిల్లె । యమరుచుండిన బహు,వర్షముల్ గడచును । వైరిఁజంప
శక్యంబుగాకుండు । సకలాస్త్రసంవేది, బ్రహ్మవరంబులఁ । బడయుట నితఁ
డెవ్వారికిం జంప । నెవ్విధిఁ దరముగా,కుండును గాన నీ । వుద్యమమున
బ్రహ్మాస్త్రమున వీనిఁ । బడఁగఁ జేయుము రణ,మూర్ధంబునమఱొండు । మాడ్కి వీనిఁ
ఆ. జంపఁ దరముగాదు । సత్య మీవాక్యంబు, త్వరగ వైవు మనఁగ । వాయుసూక్తి
దైవవాక్కె యనుచుఁ । దానమ్మి మదిఁగల్గు, భక్తి బ్రహ్మదేవు । పాదములకు.
ఉ. వందనముల్ పొనర్చి యరి । వారవిమర్దనదక్షమైన శ
క్తిందగి నిత్యపూజల న । తిప్రియముం గనియుండు నస్త్రముర్

డెందమునందుఁ గొల్చుచుఁ గడిందిమగంటిమి నారిఁగూర్చి వై
వం దలపోసి నంతటనె  వార్ధులు ఘూర్ణిలె భీతి పెంపునన్. 383

ఉ. చాపవిముక్తిగాంచి కడుఁజ్వాలలముల్ వెడలించుచున్ జవం
బాపఁగ రానిచందమున  నాచతురాననునస్త్రవర్య మెం
తో పనివూని రాఁగఁ గని  యుజ్జ్వలమార్గణరాజివైచి యా
రోపము నిల్వరించి కడుఁరూపఱఁజేయఁగఁ జాల నుగ్రుఁడై. 384

చ. తనకడఁ గల్గియుండువివిధ ప్రథనాయతసాధనంబులన్
గొనకొని వైచి వైచి తుదకుం దనమే నదివ్రక్కలింప మే
దినిబడి వ్యోమయానమున  దేవనివాసముఁ జేరఁబోయె; నా
తనిమృతిఁ గాంచి రాక్షసులు  తల్లడమందుచు నేగి రార్తులై. 385

పౌరుషమునకంటె దైవ మధికము.

మ. చిరకాలంబు తపంబుచేసి పరమేష్ఠిం జాలమెప్పించి స
ద్వరముల్ గాంచుటెకాక పెద్దలకుసేవల్ చేయఁగా నేర్చి సం
గరముల్ పెక్కులొనర్చి యింద్రముఖులన్  గాఱించి పోఁదోలి యీ
శ్వరుచేఁ జావఁగఁగోరి యల్పమగుకీశశ్రేణి వీక్షింపకే. 386

చ. తన కని శాశ్వతంబయినధామమునిచ్చు రఘూత్తముం డటం
చును మదిఁగోరుచున్ బవనసూనుముఖాఖిల కీశవీరులన్
గనుఁగొన కొక్కవేగమునఁ  గన్గొనవచ్చెను రామచంద్రు నా
తని కని మృత్యువై నిలిచెఁ  దారఘునాథునితమ్ముఁ డద్దిరే. 387

చ. పిలువఁగ లేదు రమ్మనుచు  భీతుఁడఁ గావుము నన్నటంచు నే
పలుకు వినంగ రాదు నరపాలశిఖామణి రాముఁడైన నీ
కలహము నీవొనర్పుమనిగాని రిపున్ వడిఁజంపుమంచుఁ గా
ని లలి వచింపలేదు పరునిం దునుమంజను మన్న దెవ్వరో! 388

ఉ. చనుమని ప్రోత్సహించినది  శాత్రవుకర్మమె మృత్యురూపమై
దనుజుని జూచి నంతటనె  దా నొగి మార్కొన నిచ్చగింపఁ జే
సినయదియుం బితామహునిచే వరమొందెను గాన బ్రాహ్మమై
తన రెదునస్త్రముల్ వయివ  దానవుఁ డీతఁడు చచ్చునిప్పుడే. 389

క. అనిపవమానునిరూపం,బునఁ బ్రోత్సాహంబుఁగల్గి  భూతభయదమా
వనజభవాస్త్రమువైవం,గను జేసిన దెన్న నతని  కర్మమెకాదే. 390

ఆ. బ్రాహ్మమైనయస్త్రవరము ప్రయోగింపఁ, జత్తుననియతండు  స్వాంతమందు
నెఱిఁగియుండియును మహేషువులన్ వైచి,మరలుపంగ నెంచె  నరయమిఁగద.

సీ. అట్లు యత్నింపఁజేయంగఁ బూనినయది, కర్మమేయని యెఱుంగవలయు మది
ప్రాణిజాలంబెల్లఁ బ్రాణంబు రక్షింపఁ, గోరుచుండు నటంచుఁ  గోరకున్న

సృష్టి యంతయును నశించుఁ గావున నట్లు, చేయంగఁ గర్మమే చిత్తమందు
వెలయించు నూహలఁ గలిగినయయ్యవి, ఫలియింపకుండ దుష్ఫలముల నిడు
తే. నట్టులొనరించు గుణపాళి మరసి నేర్పు, దైవ మెక్కుడుగా మదిఁ దలఁపవలయుఁ
బురుషకారముకంటెనం చరయుఁడనుచుఁ, జక్కనమ్ముఁడు మీరని యొక్క మొగిని
క. తెలుపంగఁ దలఁచి యీవరు; సలఁ బ్రోత్సాహంబు చేయ సమకట్టును ని
స్తులశక్తిఁ బొల్చుకర్మమె, బలవంతము నాఁగ నదియె పరికింపంగన్. 393
ఉ. దానినిమించునట్టిది శ్రుతంబును దృష్టమునైన లే; ద దె
వ్వానిని గష్టశర్మముల వారక నొంచును దేల్పుఁ; గర్మమే
మేని యొనర్పఁజాలదని యేర్పడఁ బల్కఁగఁ జాలువార ల
జ్ఞానులె యంచుఁ జెప్పఁదగు సంశయ మింతయు లేదు దీనికిన్. 394
చ. హరిహరధాతృముఖ్యదివిజాధిపు లెల్లరు కర్మబద్ధులే
యరసినఁ గష్టసౌఖ్యములనంది తపించి హసించి కర్మమే
యురుతరశక్తిమంత మని యొప్పినవారలె యాపరాంబయుం
బరమశివుండుఁ గర్మమునఁ బాల్కొనకుందు రటంచుఁ జెప్పనా. 395
ఉ. పౌరుషమింతయైనఁ దలఁపంగను దైవము మించలే దటం
చారయఁ దోఁచుఁ బంక్తిగళునాత్మజుఁ డేమనియెంచెఁ గార్యమే
తీరునసాగె దీనిఁగని ధీరులుపల్కినమాట నమ్మినా
పౌరుషమెన్న గొప్పదనుపల్కుట మానఁగ నొప్పియుండెడున్. 396

### ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమున రామాదులమూర్ఛిల్లఁ జేయుట.

చ. దనుజవిభుండు రావణుఁడు తత్సుతుఁ డీల్గుట నాలకించి లం
కను బదిలంబుగా నరయఁగాఁ దగువారల హెచ్చరించి యా
ర్తిని దిగులొంది యంతిపురి దీనతఁ జేరఁగ నింద్రజిత్తు వే
చని తనపౌరుషంబుననె శాత్రవు లోడుదురంచుఁ దెల్పుచున్. 397
ఉ. రావణునాజ్ఞఁ గైకొని యరాతిబలంబులఁ గూల్ప నెంచి మా
యావిభవంబునం బని య దౌ ఫలవంత మటంచునమ్మి దు
ర్భావము గల్గువాఁడగుట వహ్నిముఖంబునఁ బద్మజన్ముఁడే
దేవతగాఁ జెలంగి రిపుధీరుల నొంచఁగఁజాలు నస్త్రమున్. 398
ఉ. స్యందనవర్యముఙ్ మిగులసత్త్వముగల్గినఘోటకాళి ద్వి
ద్బృందము నేఁచు చాపమును భీషణబాణముఖాయుధంబులఙ్
బొందఁగఁగోరి సేనలను భూతము లెవ్వియు విఘ్నమింత చే
యం దగనట్లునిల్పి విధినాదృతి నారసి భక్తియుక్తుఁడై. 399
సీ. అభిచారమనుహోమమందు నెవ్విధిఁ గర్మమును జేయఁదగునట్లు దనుజవరుఁడు
వస్తువులంగూర్చి వహ్నిని బ్రణయించి, హోమంబుచేయంగ హుతవహుండు

సవ్యగతుల్ మీఱితె జ్వాలము లొప్పారఁ, బ్రత్యక్షమయ్యెఁ గావలసినట్టి
పరికరములఁ గోరి భావించి యవ్వాని, హోమముచేసె నట్లొప్పియద్ది
తే. యంతరాయవిహీనమై యపుడు సాగ, నగ్ని యానతి హోమకుండాంతరమ్ము
నుండి బ్రహ్మాస్త్ర మట్టు లత్యుగ్ర చాప, బాణములుస్యందనంబు వెల్వడియెనొకట.
క. మనుహోమసిద్ధి యివ్విధ,మున సాగిన సంతసించి భూతములెల్లం
దనుఁజూచి వడఁకఁగాస్యం,దన మెక్కెను విజయకాంక్ష తను బురికొలుపన్.
చ. అసురులఁగాంచి పల్కె నిఁక నంబరభాగమునందునుండి శ
త్రుసమితిఁ జెందువాఁడ నిదె తోరపువేడుక సాదడింప మీ
రసదృశదోర్బలంబు దగునట్టులుగా మెఱయించి వానరా
ళి సమయఁజేయుఁ డీ నృపకులీనులఁ జెందుదు నేను బూనికన్. 402
చ. అని తగ హెచ్చరించి తనయాకృతి యేరికినే నదృశ్యమై
పని కురవైనయ ట్లమర వహ్నిసమాగతచాప మూని బా
ణనికరసంయుతిన్ బటునినాదముగల్గ నొనర్చి చిత్తమీ
సునను మలీమసంబగుచు సూనృతమార్గవిదూరమై తగన్. 403
క. శరపంక్తి వృష్టికరణిం, గురియించెన్ సేనపై నకుంఠితగతి న
చ్చెరువంది యెల్లవారలు, పరికింపఁగ రామభీతి బర్విడుచుండన్. 404

## అభిచారహోమరహస్యము.

సీ. కామ్యకర్మ ప్రయోగములందు నభిచార,హోమ మొక్కండుగ నొప్పియుండు
నాగమంబులె దీని ననువదించెను జక్క, సాధకుండు గురూక్తసరణి మంత్ర
జపహోమముఖ్యపంచకమున సంసిద్ధిఁ, బడసి యా దేవతాపరమకరుణఁ
దనుఁజూడఁగా ననంతరము కామ్యప్రయో,గముల నొనర్పంగఁగడఁగునతఁడు
తే. కార్య మెట్టిదియో ముందుగాఁ దలంచు
గానదానికి ననుకూలమైనరీతి
వస్తువులఁ గూర్చి నియతిమై వహ్నియందు
హోమమును జేయుఁ గామ్యమైయొప్పు నదియె. 405
చ. పరులకు హింసఁగూర్పఁగలభావము పూనియొనర్చు హోమమే
ధర నభిచారకర్మమని తాఁ బిలువంబడుఁ గ్రూరకర్మమై
పరఁగుటఁ బాపహేతువగు బాలిశులే యొనరింత్రు దానిఁ ద
త్పరమరహస్యముం దెలియుపాటివివేకములేమి నక్కటా! 406
తే. ఆగమంబులు క్రూరకర్మాళి నేల, తెలుపఁగావలెనంచు నధీరులండ్రు
దాని తత్త్వంబు నెఱుఁగమిఁబూనియడుగు, వార లంచుఁదలంపనొధీరు లెపుడు
క. తనశక్తిని బరికించిన, మనమెప్పుడు వశముగాదొ మంత్రబలమ్ముం
గొని దాని నిగ్రహింపం, జను నయ్యదె దానిఫలము చక్కఁదలంపన్. 408

సీ. కామముఁ గ్రోధంబు గడునశింపం జేయ, మారణహోమకర్మమ్ము తగును
దానిఁగోరియె చేయుతపముత్తమంబగు, నభిచారహోమాఖ్య నదె వెలయును
నట్లె లోకమునకు నార్తిఁగల్గించెడు, పాపాత్మునిఁ బొలియింపఁగఁ గోరి
యది లోకవిహితమౌ నంచెఱింగి మహీశుఁ, డాకర్మమును జేయ నర్హ మంద్రు
తే. గాని యద్దియుమధ్యమంబౌను గాని, యుత్తమముగాదు నాఁగ సర్వోత్తములగు
జనులుభావింతురింక నాసరణిఁ దెలియ, వలసియుండును దత్త్వంబుఁ దెలుపుగాన.

మ. పని క్రూరంబగునేని వస్తువులు నప్పాటం బ్రవర్తిల్లుఁ గా
న నితాంత క్రుధఁ గల్గఁ జేయునవిగా నానావిధప్రోక్తవ
స్తునికాయంబునుగూర్చి హోమమును నిర్ధూతారివీరంబుగా
నొనరింపందగు నంతరాయము లవే వోప్పారరా దప్పునిన్. 410

క. ప్రత్యూహంబులు కల్గిన, నిత్యాశ్రితుఁ జంపు నదియె నిముసములోనఁ
బ్రత్యయ మెడలక చేసినఁ, ద్యక్త ప్రత్యూహమైన నది ఫలియించున్. 411

ఉ. హోమము పూర్ణమైన దివిజోత్తముఁ డామనుసంప్రహృష్టుఁ డెం
తో మరియాదఁ దోఁచుచుఁ దదుద్యమమెల్ల ఫలింపఁ జేయఁగా
నేమముఁబూను శత్రువుల నీఱొనరించును గొన్ని తావులం
గామము పండకుండు నొక కారణమున్నది దాని కుద్దియై. 412

ఉ. ఘోరహుతాశనోత్థమె యగుఁ సమరోచిత సాయకాదు లా
వైరియు మృత్యువక్త్రమునఁ బండఁగఁ జాలినకర్మసంగతిం
జేరకయుండు నప్పు డది సిద్ధి నొసంగ దుపాసకాంతకం
బై రహిమించుఁ గావుననె యయ్యది కూడ దటంద్రు కోవిదుల్. 413

క. వైరికిఁ గాలము మిక్కిలి, చేరువకుఁ రాఁగ హోమసిద్ధిం జెడు న
ట్లారయఁ గర్మము చేసిన, చోరయమునఁ బండు నద్ది చోద్యముగాఁగన్ 414

చ. ఇరువురు మంత్రసిద్ధిగనియే యొనరించెడు దుష్ప్రయోగముల్
త్వరగ నశించు నిర్వురకు వానిఫలంబులఁ గల్గనీయ వం
చరసిన పెద్దలే యనుదు; రయ్యదియుం దగు భావనాఖ్యశ
క్తి రహి చెలంగ నయ్యది విధిప్రహితం బెటుగానిచోఁ జెడున్. 415

ఉ. మానసమందు సాధకుఁడు మంత్రసురేశ్వరునిం దలంచి నీ
యానతికై హుతాశనునియందు భవత్ప్రియవస్తురాజి ని
ట్లూనినభక్తి శాస్త్రవిధి నొక్కట సుంతకొఱంత లేనిచం
దాన యజించువాఁడ మదుదంతము నెల్లఁ దలంచి యాత్మలోన్. 416

ఉ. నే నెదికోరినాఁడనొ యనిందితరూప! యదేవిధంబుగా
గానఁబడంగ నూల్కొనుము కామ్యము నాది ఫలింపఁ జేయుమా

నానిఖిలార్థసిద్ధులు కనందగియుండును నీదువంక నిం
కైన హుతాశనాంతరమునందుఁ గనంబడు మూర్తివాయఁగన్. 417

మ. ఇవిగో! నీకు ముదావహంబులయి యొంతే శాస్త్రమొప్పంగఁ దృ
ప్తిదముల్ గాఁ దగువస్తువుల్ గొను; సమర్పింతున్ గృపం దాల్పు; నా
కెదియిష్టంబొ తదాకృతిం ద్వరగ నంచెంతో సమాధిస్థితిం
బొదలం గాంచినచిత్త మొప్ప నడుగంబోలున్ గతాహంక్రియన్. 418

ఆ. తోఁచునట్లు యగ్నితో సరిపోలిన, తనువు వెలయ నిష్టదైవతంబె
కోరినట్టి వస్తుకూటం బొసంగును, దానవిజయసిద్ధి తప్ప దెపుడు. 419

సీ. విజయంబు సిద్ధించు వెరవు లేకుండిన, నాహోమకార్యంబె యంతరాయ
మున దూషితంబగు మునుకొని చక్కఁగా, నెఱవేఱునే నది నిశ్చయముగఁ
గార్యంబు ఫలియించుఁ గాదు దానింద్రిప్ప, నెవ్వరికే నంచు నెఱుఁగవలయు
నిది క్రమంబైయుండు నెందునే నభిచార, హోమంబునకు; మఱియును విభేద
తే. ములు కనంబడు దేవతామూర్తిఁ బట్టి, కార్యమును బట్టి శాత్రవగణముఁ బట్టి
బలివిధానంబునందు నిమ్ములఁ గనంగఁ, దక్కువిషయంబులందు భేదంబు లేదు.

ఉ. భూతబలిప్రధానముగఁ బొల్చెడుహోమము లొక్కకొన్ని వి
ఖ్యాతమహాగమంబులను గన్పడుచుండు; నుపాసనాబలం
బే తగ ముఖ్యమైనయది యెల్లవిధంబుల నొక్కరీతిఁగా
నాతతసుప్రయోగముల నయ్యవి తుల్యములై చెలంగెడున్. 421

ఆ. భూతబలియె ముఖ్యముగ నొప్పు హోమముల్, హానిసంయుతము లెయనఁగవచ్చు
రావణాత్మభవుఁడు బ్రహ్మాస్త్రలబ్ధికై, చేసినది తపోవిశేషయుక్తి. 422

క. బలిముఖ్యము గాకయె తగు, బలియే ముఖ్యంబు గాఁగఁ బరఁగెడునది శ
క్తులు దేవతలై యుండఁగ, వెలయును సాబాధమగుచు వేయు నిఁ కేలా?

మ. పరమాత్మున్ భజియించువారలకు నీభంగిం బురశ్చర్యచే
యురతుల్ గల్గవు; సర్వభూతసములై యుందుర్గదా వార లీ
శ్వరు కారుణ్యమె గోరువార లగుటన్ జందం బిదెబ్బంగి నా
దరపాత్రంబగుఁ దుచ్ఛమాఫలమె యిద్దానం బొసంగు దుదిన్. 424

ఉ. రావణి యిట్లు బాణముల రాతుల మూర్ఛమునుంగఁ జేయఁగా
వావిరిగాంచుచున్ సకలవానరవీరులు రక్తసిక్తదే
హావళు లొప్ప గుట్టలుగ నాహవరంగమునం బడంగ దు
ర్భావుఁడుగాన సంతసము పర్వఁగ నార్చుచునుండె నింగిపై. 425

ఉ. భూపవతంసుఁ డత్తఱి విభుత్వము మీఱఁగ సంచరించుచుం
దేపకుఁ దేపకున్ వివిధతీవ్రశరంబుల వైచుచున్ మహో

ద్దీపితశక్తిసంయుతిని దేజరిలందగు నస్త్రసంఘముల్
గోపతిముఖ్యులెల్లఁ గలఁగుందుపడన్ వడి నేపుచూపుచున్. 426

చ. మనమున నెంచి లక్ష్మణ! యమానుషతేజముగల్గి బ్రహ్మయి
చ్చిన మహితాస్త్రమూని కపిశేఖరులం బడఁగొట్టుచున్న వాఁ
డని మొనఁ గానరామిఁ గపులాతురులై యెదిచేయ నేర కా
ర్తినిగని భూమిపైఁబడిరి తీవ్రశరంబులు మేను లేఁచఁగాన్. 427

మ. పరికింపంగ జగత్త్రయంబున మహాబ్రహ్మాస్త్ర మత్యుత్తమం
బరిదోస్సారవిభంజకంబునగుచున్ హార్వోందు; నీయస్త్రముల్
బరమేష్ఠిన్ ముదమందఁజేసి కనియెన్ బాపాత్ముఁ డీరక్కసుం
డురుహింసారతుఁడౌట నిప్పునికి దానూహించు ధన్యాత్ముగన్. 428

చ. వనజభవోక్తియెట్టితఱిఁ బావనమై సకలోత్తమాంగపం
క్తిని నిలుపంగనర్హమయి కేవలపూజకుఁ బాత్రమై తగుం
గనుకఁ దదీయబాణములు కాఱియపెట్టుచునుండ నోర్చి చెం
తనె వసియింపు మేనును నితాంతశరవ్యథ నొందువాఁడనే. 429

క మన మేమిచేయఁ బూనక, యనిమొనఁ బడియుండఁ జూచి హర్షంబునఁ బో
వును వీఁడు లంకకున్ మఱి, కనఁజాలుద మట్టితఱిని గార్యముఁ దీర్పన్. 430

ఆ. బ్రహ్మయందుఁ గల్గుబహుమానబుద్ధిని, బాధనొందుచుండ వలయుఁగాదె
యనుచుఁ బలుక నాతఁడప్పుడు చేయంగఁ, దగినదెద్ది లేమి వగచుచుండె. 431

చ. సమరమునందు రావణి నిశాతశరావళి తమ్ము నేఁచనం
గములు దురంతతాపమునఁ గందుచు రక్తమయంబులౌచు యు
ద్ధమున కనర్హతం గనఁగఁ దాళఁగఁజాలక మూర్ఛమున్గి సం
యమునిని జేరఁబోయి రభియాతిజనంబులు నవ్వుచుం గనన్. 432

క. రాముఁడును లక్ష్మణుండును, భీమబ్రహ్మాస్త్రబాధఁ బెంపుదఱిగి య
ట్లే మూర్ఛమున్గి యుండిరి, క్షేమము గనఁజాలుశక్తి చెకుఱియు ననిన్. 433

చ. అసురవరాత్మజుండు సమరాంగణమం దొకఁడైన నిల్చి పెం
పుసడలనీయ కాహవముఁ బూనియొనర్చెడువాఁడు కానరా
మి సకలసేనలం గలిసి మించిన వేడుక లంకకేగె; ద్వి
డ్విసరము చచ్చె నం చెఱిఁగి వీఱిఁడియాటను విఱ్ఱవీఁగుచున్. 434

చ దనుజవరేణ్యు నస్త్రమున దాశరథుల్ స్మృతిదప్పి మేదినిన్
దనువుల వైచి యుండఁగఁ గతంబెది యంచును శక్తిగల్గినన్;
వనజజువస్త్రముల్ మఱలుపంగ సమర్థులుగా రటంచు శం
కను గనరాదు వార లోఁగి గర్మగతుల్ కనువారలౌటచేన్. 435

సీ. హోమప్రభావ మహత్త్వోచ్ఛ్రియం బసదృశ, మప్రతిహతమునౌ నని వచించు
నాగమశాస్త్రవాక్యముల ప్రమాణంబు, లని లోకులకు దోఁపనట్లుచేయ
నతనిచేఁ జావంగ నర్హులౌ వారికి, నంతంబుగల్గింపనౌ నటంచు;
విధియానతిఁ బరాభవింపకుండఁగఁ దారు, శస్త్రబాధలగుంద సకలజనులు
తే. కర్మమతిబలవంత మెక్కరణినైన, ననుచుఁ దెలియంగఁదగు ననునాశయంబు
గల్గియుండుట నయ్యస్త్రగాఢబాధ, లనుభవించిరి వారుశక్త్యధికులయ్యు.

క. ఇది యిట్టులంచు నెఱిఁగిన, సదమలకర్మప్రయోగసరణిఁ దెలియఁగాఁ
గుదురును జ్ఞానము లేదే, నెదితోఁపమి నజ్ఞత తలకెక్కున్ మిగులన్ 437

ఉ. అంతట నవ్విభీషణుఁడు నాహనుమంతుఁడుఁ గూడి వచ్చిన
ట్లెంతయు భీతిఁగొల్పుగతి నెంచఁగరానివిధంబునన్ గదన్
వంతలఁగూర్చునట్లు కనవచ్చుచుఁ బీనుఁగులట్టు లున్న యా
ధ్వాంతవిరోధిపుత్త్రసముదాయముఁ జక్కఁగఁ గాంచి చింతచేన్. 438

తే. తెలివిలేకుండి యెట్టులో తెలివిరాఁగ, జాంబవంతుని వెదకుచుఁ జనిచని యొక
చక్కి బాణార్దితాంగుఁడై చిక్కియున్న, భల్లుకేంద్రుని గనిరి సప్రాణు నెలమి.

చ. వితతగళస్వనంబున విభీషణుఁ డాతనిఁబిల్చి ప్రాణసం
గతిఁ దగువాఁడవే యనినఁ గంఠరవంబునుబట్టి నిన్ను నా
దితిసుతవర్యుఁగాఁ దెలిసితిన్ మతిమంతుఁడు వాయునందనుం
డతిశయపుణ్యమూర్తి యిపు డామయహీనతఁ గాంచియుండునే. 440

చ. తెలుపుము నా విభీషణుఁడు తీక్ష్ణమరీచికుమారు నంగదున్
దలఁపక రామలక్ష్మణుల దర్పసమగ్రుల నెన్నఁబూన కో
సులలితచిత్త! వాయుసుతు చొప్పు నెఱుంగఁదలంచి తేలకో
తెలుపఁగలావె నేఁ దెలియదెల్లముగా నన నాతఁ డిట్లనున్. 441

ఉ. ఎందఱువానరేంద్రు లని నీల్గిన వాయుసుతుండు ప్రాణయు
క్తిం దగునేని యెల్లరును క్షేమముగాఁ దగువార లేసుమీ!
యందఱునుండి యాహనుమ యంతముఁ నొందినఁ జచ్చినట్టులే
యందఱు నెన్నఁగాఁ దగుమహాత్మ! విభీషణ! నీ వెఱుంగవే. 442

క. ఉన్నాఁడా క్షేమంబుగ, నన్నా! హనుమంతుఁ డొక్కఁడల్లనఁ జెపుమా
యన్నిపనుల్ సమకూరు విపన్నులు సంపన్నులెయని భావింప జనున్. 443

మ. వినుమా యింక విభీషణా! జగతి నేవీరుండు జీవింపఁగా
జను లెల్లన్ సుఖయించువారొ యతఁడే శ్లాఘాభాగమం దెన్నఁగాఁ
జను జీవించినవాఁడటంచు నొరులన్ జావంగ లేదంచుఁ జె
ప్ప ననర్హంబని నిశ్చయింపు మదిలో భవ్యాత్ముఁ డాతం డెసూ. 444

ఉ. భల్లుకనాయకుం డిటులు పల్కఁగఁ బావని చేరి మ్రొక్కి నే
నల్లసమీరనందనుఁడ నస్త్రభయంబును వీడియుందు; నీ
యుల్లమునందుఁ జొప్పడిన యూహలఁ దెల్పుము చేయువాఁడ; నీ
వెల్లవిధంబులన్ దగు నహీనగుణాఢ్యుఁడ వోమహాత్మకా! 445

క. అన జాంబవంతుఁడిట్లను, వినవయ్యా! యిప్పు సంజ వేళఁగఁ దోఁచున్
వనచరులు పంచమాంశము, చనిరనియే వింటి నేను సంయమనికనన్. 446

ఆ. ఇంకజాగు చేయ కీవు హిమాద్రికి, నరిగి యచట నున్నతాచలంబు
ఋషభనామకము గిరిప్రధానముఁ గన,కమయమైనదాని గడచి పోవ. 447

సీ. కైలాసమును గాంచఁగలవు వానికినంత,రమున నోషధపర్వతము చెలంగు
గాన దానిం జూడు కలవందు సకలౌష,ధులు శక్తిసంయుక్తములుగ నొప్పు
నాకొండశిఖరంబునందు జనిం గాంచి, కాంతులచే దిశాగణము వెలుఁగఁ
జేయుచు భక్తులసిద్ధిఁ గాంచఁగఁ జేసి, వెలయు నాజ్యోతిర్లతలసమితిని
తే. బేరుఁగాంచెను నాలుగుఁ బృథ్విఁ జచ్చి, నట్టివారిని బ్రదికింప నర్హమైన
శక్తిగలిగినయది గాన సాధువినుతిఁ,గనియెను మృతసంజీవనియనఁగ నొకఁడు.

వ. శల్యములందీసి చక్కఁదిరుగంగూర్చుటం జేసి విశల్యకరణి యనిపేరంది
యొక్కటి చెలంగు. ఖండితచర్మభాగముల యథాపూర్వకముగఁ గూర్చుటచేత
సంధానకరణి యన నొక్కండు వెలయు. బాణవ్రణజనితదేహవైవర్ణ్యమును
దొలంగించి పూర్వవర్ణముం బొందించుకతన సావర్ణ్యకరణియన నొక్కటి
పరఁగు. వానిం దేవలయు. కపీంద్రుబలంబులకుఁ బ్రాణదానంబు చేయవలయు
ననుటయు 449

చ. అనిలకుమారుఁ డప్పలుకు లాదృతిమీఱఁగ నాలకించి చ
య్యనఁ బరువెత్తె నభ్రమమున నాహిమవద్గిరి నిర్గమించి చెం
తనుదగు నోషధాద్రిని నితాంతముదంబునఁ జూచి వానినిం
గన వెదకెన్ గిరీంద్రమునఁగల్గు స్థలంబులనెల్ల నొక్కటన్. 450

క. పరికింపఁజాలవయ్యెను, వరలత లవి యెంతసేపు వాయుసుతుం డ
గ్గిరిఁ దిరిగిన నంతట గ్రోధరతిం బలికెన్ మహీధ్రతల్లజ! వినుమా. 451

చ. జనకకుమారికాధవుని సాధుమునీంద్రనమస్కృతాంఘ్రిపా
వనవనజాతయుగ్ముని నవారితసత్త్వుని నాలకింపవో
వినుము తదీయకార్యమిది విశ్వహితంబగు దీనఁ గాననా
తనిపయిఁ బ్రీతిగల్గదొకో దర్పముచూపకుమింక నైననున్. 452

ఉ. ఇప్పటిరీతినుండఁదగు నేమియొనర్చునొ చూతమంచు నీ
వొప్పుల నెంతువేని విను ముగ్రకరంబుల శక్తిఁ జూపి నే

రొప్పుఁగ నిన్ను లాగి ధరనొక్కటెఱుంగునఁ బర్వఁ జల్లెదన్
దప్పక చూతుఁగాక మదుదారభుజాబలమున్ క్షణంబునన్. 453

ఉ. మారుతసూనుఁ డంచుఁ బవమానజవాధిక వేగుఁడంచు నా
శ్రీరఘురామపాదయుగ సేవకుఁ డంచు ననుం దలంచి నా
సార మెఱుంగఁగోరక యొసంగెదు భక్తిని వానిఁ జూపఁగాఁ
గోరము లేకయున్న నిదిగో నిను నాశమొనర్తు నిప్పుడే. 454

చ. అనిపలుమాఱులుం బలికి యయ్యది యూరకయుండ శక్తిచే
తనె కడునూఁచి యూఁచి బలదర్పము లొక్కటఁ గన్పడంగ నీ
డ్చెను గిరి; నద్దిహస్తమును జేరి వెలింగెను గందుకం బునాఁ
గ నతఁడు దానిఁగొంచు వడిగాఁ జను దెంచి సముద్రదాఁటుచున్. 455

తే. వానరబలంబునడుమఁ బర్వతము డించి, పెద్దలకు మ్రొక్కెఁ దల్లతాపృథులగంధ
వాసనల్ సోఁకినంతట వానరు లాగి, విగత శరపీడితాంగులై విక్రమముల.

ఉ. ముందటిరీతి వెల్గుచును బోయెఁగదా మనశత్రువంచు ని
ట్లుందఱు మోసగించి వితతాంబకపంక్తిఁ గలంచినొంచె నిం
కం దరమానె మాఱ్కొనఁగఁ గ్రమ్మఱ మమ్మరుదెంచియంచు నా
నందమునొంది పల్కుచు రణస్థలి నెల్లెడలం జరించుచున్. 457

క. మరలన్ రమ్మా దనుజా!, పోరిపుత్తుము ముందునిల్చి పోరుము మాతోఁ
బురుషుండవైన నంచున్, బరుషోక్తులు పల్కుచుండ భల్లుకగణముల్. 458

ఉ. నాలుగుదిక్కులం గనుచు న్యాయరణంబును జేయమాని మా
యాలసమానశూరత మహావిశిఖంబుల మమ్మునొంచెఁ జం
డాలుఁడు వీఁడు కానఁబడినన్ నఖదారుణవజ్రరాజిచేఁ
జీలుతు మాతనిన్ జమునిఁ జేరఁగఁ బంపుదు మంచు నార్వఁగన్. 459

సీ. ఓషధుల్ తనుసోఁక నొయ్యన మారుతుం, డగు దెంచి భగవంతులైన రామ
సౌమిత్రులం దాఁకి శరణాగతుండ నన్, బాలింపుఁడీ యని పరమభక్తి
నర్థించె నంతట నామారుతస్పర్శమున నస్త్రతాపముల్ చనఁగ హాయి
చెంది యంతటనె లేచిరి; వారిఁ గన్గొని, వనచరుల్ సంతోషవార్ధిమునిఁగి

తే. రపుడె కొనిపోయి యాకొండనచటనునిచెఁ, బవననందనుఁ డాయనిఁ బడినదనుజ
బలము నారావణుండు వైవంగఁ బనిచి, యుండె జలధిని గాననొక్కండెరైన.

క. లతలప్రభావంబున నా, మృతినుండి సజీవుఁడగుట యే లేకుండెన్
మృతులైన హరిబలంబులు, చ్యుతియే లేనట్టు లప్పు డొప్పిరి చూడన్. 461

ఓషధులమహత్త్వము.

ఉ. చచ్చినవార లందఱును సంయమనీపురినుండి వేగమే
వచ్చి రనంగఁ జిత్ర మనవచ్చుఁగదా యనుసందియంబు వా

క్రుచ్చెదు వారలుందు రది కూడ నిపల్కనవచ్చు; వానిదౌ
నుచ్చతరప్రభావ మది యొప్పు నమేయముగాఁ దలంచినన్. 462

క. జ్యోతిర్లతలన నయ్యవి, ఖ్యాతిం జెలువారుచుండు గనుగొన నట్లే
రాతిరి నుండును బగ లవి, యీతీరున నుండుననుచు నెటుపల్కనగున్. 463

సీ. పగలవి యెరిఁగేఁ బరికింపరాకుండు, కుపలయం దవి మండు కరణి నుండుఁ
జెంతకుం బోయిన నంతకు దూరము, గాఁ గనంబడుచుండుఁ గైకొనంగఁ
దరముగా దెరికి మరుదాత్మజుం డది, యెఱిఁగి యాభాగంబు నెల్లఁ దెచ్చెఁ
దద్వ్యాయుసంయోగ తర్క మృత్యుబాధయే, తొలఁగును బ్రాణముల్ తూఱుమరల

తే. నంగమందును వానిమహత్త్వ మిద్ది; సృష్టివైచిత్ర్య మిదియని చెప్పవచ్చుఁ
నోషధులకిట్టిమహిమ మెట్లొప్పెననుట, యజ్ఞతయె యంచుఁ జెప్ప శాస్త్రాళు లెపుడు.

చ. గరళమునన్ మృతింగనినఁ గ్రమ్మఱఁ బ్రాణములం గనంగ ను
ర్వరఁ దిరుగంగఁ జేయు నొకభవ్యమహౌషధి రక్తపూరముల్
దొరఁగుచునుండ నొక్కలత తోడనె నిల్పును వాని; కృత్రిమం
బురుభయదంబునౌ విషము నొగిరమం దిడ బ్రుందు వానినిన్. 465

క. ఒకలత బ్రదికించును; వేఱొకలత మూర్ఛిల్లఁ జేయు నొగి మూర్ఛోకనఁగా
నొకవీరుత్తు తటాలునఁ, దికమక నొందంగఁ జేయుఁ దెలియక తాఁకన్. 466

ఉ. వాసనచూచినంత నొకవల్లరి కుఱుఁగ తాన్న మెల్ల నా
యాసము లేక వెల్వడెడునట్టు లొనర్చు; మఱొక్కతీఁగయున్
నాసికయందుఁ జేర్చు జతనంబును బూనఁగ వెఱ్ఱివానిగా
నాసమయంబునం దె తనదౌపటుశక్తి నొనర్పఁ జాలెడున్. 467

తే. ఈక్షణంబుల కొక్కింతయే లతాంత, మంజనంబుగ నమరింప నపు డదృశ్య
వస్తువులఁ గాంచఁ జేయు నవార్యశక్తిఁ, దామ్రము నుభస్మముగఁ జేయఁదగు నొకలత

చ. కనకముగాఁగఁ దామ్రము నికామమహత్త్వము మీఱఁగా నొన
ర్చును లతయొండు; పాదముల సోఁకఁగఁ జేసినయంత నే ప్రతా
నని యొకఁ డద్భుతంబుగ మనంబు తదీయవశంగతంబుగా
నొనరుచు నొక్కతీవ తనుయుక్తిని స్తంభితుఁ జేయు నాతనిన్. 469

చ లతయొకఁ డొక్కలేమఁ దగులంగ నొనర్చిన వానివెంట నే
మి తెలివి లేక పోవునటు మించుమహత్త్వమునం బొనర్చు ని
ట్లతిశయశక్తి మీఱునటు లచ్చెరువుం గలుగంగఁ జేయుచున్
క్షితి మహనీయమై తగిన కీర్తిని గన్నలతావితానమున్. 470

క. కొనియాడందగుఁ దద్గత, ఘనశక్తి నెఱుంగఁజాల కరయి కొందఱు దు
ర్జను లొగి మాఱుచునుందురు, మునిజను లవ్వానిమహిమముం గనుచుంటన్.

ఉ. వానిని యుక్తకాలమున భక్తిభరంబునఁ బూజచేసి స
న్మానముమీఱఁ దెత్తు; రభిమానముగల్గిన వారి కవ్వి సుం
తైన ఫలంబునీయకయె యంత నడంగును గావునన్ మహా
మానులు నిర్జనాటవుల మ్మాపతులం దనియింతు రెంతయున్. 472

సీ. ఆఁకలిదప్పులఁ బోకార్చునొకలత, యవయవశైథిల్య మపుడె మాన్పి
యంగవైకల్యమే యగపడకుండ య,థాపూర్వముగనుండఁ దను వొనర్చు
నొకయోషధీరత్న మింక నిట్టివెన్నియో, చిత్రగుణంబులఁ జెలఁగు; లతలు
ప్రతిపర్వతంబున భాసిల్లు నన నింక, నోషధులకు నెల్లనునికి పట్టు

ఆ. గాఁ జెలంగుశైలకాంతునియందుండు, వానిశక్తియెట్లు వఱలుచుండు
ననుచుఁ జెప్పనేల? యనుపమానం బది, యప్రతర్క్యమునయి యలరుచుండు.

చ. కనుకనె బుద్ధిమంతులు ప్రకామలతామహిమంబు స్వానుభూ
తిని గుఱుతించి మెచ్చుచు నతిస్థిరభక్తిని వానిఁగొల్చి త
జ్జనితఫలం బమానుషము శాశ్వత మారయనౌ నటంచు నె
మ్మనముల నమ్మిలోకమున మాన్యులుగాఁ జెలువారుచుం ద్రొగిన్. 474

చ. తరువులకున్ లతావళికి దైవతముల్ గలరట్టి వారలన్
నిరతిశయైకభక్తి విధినిం బరికించి యజించుచున్ మనో
హరతరువీరుదోఘము తదాకృతియే యని నమ్మి కొల్వఁ ద
త్కరుణకుఁ బాత్రులౌదు రదికానకయున్న ఫలంబ దెట్టులౌ. 475

క. సురవరులు మంత్రములచేఁ, దరువులు నోషధులు మంత్రతంత్రంబులచేఁ
బరితుష్టి నొందిభక్తుల, కురుఫలముల నిచ్చుచుందు రొగిఁ గర్మగతిన్. 476

మ. పరిశీలింపకయే వనస్పతులు తీవల్ దేవతారూపతం
ధరణింబొల్చుచు నప్రతర్క్యఫలసంతానంబుఁ గల్పించు ని
ర్భరశక్తిం దగియుండు నన్న పలుకుల్ పాటింప కవ్వానిపైఁ
బరుషోక్తుల్ పచరించుమూఢులకు విశ్వాసంబ దెట్లబ్బెడున్. 477

మ. కనులారం బరికించుచుండియును దత్కార్యంబు హేత్వంతరం
బున సాగెంగద యంచు స్వాశయములం బూన్కిన్ నిరూపింప నెం
చినమూఢాగ్రణులం దలంచినమహాచింతల్ ఘోసంగున్ మదిం
గనుకన్ వారల నమ్మఁజేయఁ దలఁపంగారాదు విద్వద్వరుల్. 478

సీ. తరువు లోషధులు రత్నంబులు మహనీయ,ఫలదంబులై యుండు భక్తివానిఁ
గొల్చిన వారల కోర్కులుఫలియించు, నమ్మనివారల నమ్మఁ జేయఁ
బూన వయ్యవి సురపూగంబు నట్టులే, కదభక్తియుక్తులై ముదమునఁ దరు
వరములఁ దీఁగల నిరుపమమణులను, దేవతామూర్తులుగా వచించు

తే. నాగమంబులఁ బఠియించి । యందుఁగల్గు, పద్ధతులనాశ్రయించినఁ । బరమతత్త్వ
పావిశేషముగనుటకుఁ । బాత్రులగుదు,రదియెయిందలితత్త్వమం । చెఱుఁగనగును.

## వానరులు లంకం గాల్చుట.

ఉ. వానరు లాలతానుగతి । వాయుసమావృతి నష్టకష్టులై
దానవులన్ వధింపఁ బటు । దర్పముపూనఁగ రామలక్ష్మణుల్
మేనులు పూర్వరీతి రుచి । మించఁగ నొప్పిరి బ్రహ్మదైనవా
గ్దానము నాదరించితిమి । గా యనుసంతస మట్టె యుబ్బఁగన్. 480

చ. రవి తనయుండు వాయుసుతు । రాక్షసవర్యుని జాంబవంతునిం
బ్రవిమలయుద్ధశాస్త్రమునఁ । బండితులై తగు వానరేంద్రులన్
దివిరి వచించె నిట్లు రణ । ధీరులు సోదరముఖ్యులెల్లరున్
బవరమునన్ మృతింగనుట । వాసవవైరి తలంచి దీనతన్. 481

చ. పురి వెడలంగ నిచ్చఁగొనఁ । బూనఁడు కావున ద్వారరక్షణా
దరముననుండు నట్లగుటఁ । దత్పురిఁ గాల్పఁగ నర్హమియ్యెడన్
ద్వరగని సాలలంఘనముఁ । దత్పరతం బొనరించి యిమ్మహా
పురమును గాల్పఁగాఁ దగును । బో ప్రతిసేయుట ధర్మమేయగున్. 482

చ అని పలుకంగ నందఱు మ । హామతు లట్టులె చేయనౌ నటం
చనుమతినొంది వేగమున । నప్పురిసాలము నెక్కి పత్తనం
బును బరికించి చొచ్చి కడుఁ । బూనిక నుల్కల దానిఁ గాల్చిరా
దనుజులు మాఱ్కొనంగ వడి । ధర్మనిఁ జేరఁగఁ బంపి రేపునన్. 483

సీ. లంకాపురంబది । లలితహర్మ్యంబులఁ, బ్రాసాదముల సౌధ । రాజములను
వర్ణింపఁగాఁదగి । వఱలునయ్యదియప్డు, వనచరవీరులు । వహ్నిఁ జొనుపఁ
గాలఁగాఁ జొచ్చె నొక్కఁడికేని పోవంగఁ, దరముగాకుండుట । దనుజు లెల్ల
నుక్కిరిబిక్కిరై । యొదుగఁ జేసెను నగ్ని, కీలములం బడి । కాలు ప్రోలి
తే. కరిగి రంతట నికుంభాదు । లాగ్రహించి, మాఱుకొని పోర వానరుల్ । మహితశక్తి
ముష్టిజానుప్రహారముల్ । మొదలగు రణ, సాధనంబుల వారలఁ । జంపి రలుక.

క. తుమూలంబుగ నత్తఱి బవరము సాగెం జూచు ఖేచ । రప్రముఖులు చి
త్రమిదే యని మెచ్చఁగ భీ,మముగా నొకకొంత సేపు । మ్రందఁగ దైత్యుల్ 485

క. జరగెను దుములాహవమున, సురవైరులలోన మిగుల । శూరులనంగాఁ
బరినుతిఁ గాంచిన వారలె, యరిగిరి స్వర్గంబునందు । హాయి గనంగన్. 486

క. మకరాక్షాదులు ధీరులు, ప్రకటాహవవిజయభాగ్య । రాజితు లయ్యున్
సుకరముగ నాకలోకము,నకుఁ బోవఁగఁ జాలి రవ్వ । నచరనిహతులై, 487

వ. ఆమహారణంబు భీషణంబుగా సాగుచుండుటయు నందు మహావీరులగు దానవు
లుక్కడంగుటయుఁ గపులు పైకొని వధించుటయుం జూడ బెండ్లుమునిఁగి
గుండ్లు తేలినట్లయ్యె నంత. 489

ఇంద్రజిత్తు హోమముచేసివచ్చి రామాదుల నొప్పించుట.

ఆ. యాతుధానవర్యు లని జంపఁబడుటకుఁ, జాలఁ గోపమంది కూళరావ
ణాసురుండు కొడుకు హరిహయుని జయించి, నట్టిప్రోడఁ బనిచె నంత నతఁడు.

ఉ. హోమముచేయఁబూని మహిమోజ్జ్వలుఁడై తగునగ్నినుండి యా
రామునిలక్ష్మణుల్ వనచరప్రభుముఖ్యులఁ జంపఁజాలి సం
గ్రామజయావహంబు నగుకార్ముకముల్ శరపంక్తియుల్ మహా
భీమరథంబుఁ బొందుతమి వేగమ యాస్థలికేగి యంతటన్. 490

చ. అరుణములైన వస్త్రముల నంగన లీయఁగఁ గట్టి తోమరో
త్కరమును బాణజాలములు దర్భలుగాఁ దలపోసి వేదిపైఁ
బరమవిధిప్రకారమునఁ బర్వఁగఁ జేయుచు హోమకార్యముల్
జరపి ధనంజయం డొసఁగుస్యందనముఖ్యముల్ గ్రహించుచున్. 491

ఉ. వ్యోమమునందు నెవ్వరికినున్న విధంబును గానరానియ
ట్లోమెడు స్యందనంబుపయి నుండియె బాణగణంబు వైచుచున్
ధీమహితాగ్రగణ్యులయి ధీరులుగాఁదగు భూపపుత్త్రులన్
రాము సుమిత్రపుత్త్రుఁ గపిరాజును వాయుతనూజు నొంచుచున్. 492

ఉ. ఒక్కొకచోటునుండి వివిధోగ్రశరంబుల నారిఁగూర్చి పే
రుక్కున విఱ్ఱవీఁగు కపులొక్కటఁ జావఁగ వైచుచున్ రథం
బొక్కదెసం గనంబడి ముహూర్తమునందె మఱొక్కదిక్కునన్
జక్కఁగఁజూడఁగాఁ బడఁగజన్యము చేసె ననంతశక్తిచేన్. 493

చ. ఒకతఱిఁ గాననౌచు మఱియొక్కతఱిం గనరాకయుండి యిం
కొకమఱి వేఱుదిక్కున నిదో యిట నున్నటు దోఁచునంచుఁ జె
ప్పఁగొనఁగఁ జాలి వానరచమూతతి భూమిఁబడంగఁ గొట్టె న
ట్టి కపటసంగరంబునఁ గడిందివిరోధి గనంగ రామికిన్ 494

క. మనమునఁ గుందుచు రాముం, డను లక్ష్మణ! చూచితే మహామాయుఁడు తాఁ
గనఁబడక దాఁగియుండియు, మనలన్ గొట్టెడు నిశాతమార్గణములచేన్. 495

క. హరివరులు దిక్కుదోఁపమి, శరబాధిత దేహులగుచుఁ జచ్చిపడిన య
క్కరణిం గనఁబడుచున్నా, రరిమర్దన! కానఁబడిన నతనివధింతున్. 496

ఆ. ఒక్కచోటనుండి యుద్ధముసేయునే, నతనిబాణపాత మరసిదాని
గుఱుతుపట్టి కొట్టఁగూడును నియమంబు, మాని తిరుగువీఁడు మనల నొంప.

చ. అనియతమార్గగామియయి యస్త్రబలంబునఁగాక శాంబరిం
గొని మనసేనలన్ బ్రదుకఁగూడనియట్లు గలంచుచున్న వాఁ
డనిఁ గనరాకయున్న నిశితాంబకముల్ చనుదెంచుమార్గముం
గనఁబడునేని తీవ్రతర కాండమునం బడవైచి యుందుఁగా. 498

క. ఏమియుఁ జేయంజాలక, యీ మెయినున్నాఁడ వానరేంద్రులు వీర్యం
బేమాడ్కిఁ జూపఁ జాలక, యే మిన్నుం జూచి శరము లేచఁగ నదిగో. 499

క. పుడమిం బడుచున్నా రిపు, డుడుగక యాతండు శరము లొప్పఱవైవం
గడుఁబూని తిరుగుచున్నాఁ, డెడ కన్పడకున్న దిందు నే మొనరుపనా. 500

చ. తెలియఁగ రామి నూరకయె తీవ్రశరావళి కోర్చి యుండఁగా
వలసెను లక్ష్మణా! యనినఁ బట్టఁగ రాని మహాగ్రహంబునన్
బలికె విరించనాస్త్రమున వైరివధించెద నింకఁ దాళినన్
విలయముఁగూర్చు సేనలకు వీఁడు నయంబునఁ బోరఁ డెప్పుడున్. 501

మ. చిరకాలంబు సహించియుండితిమి గాసిం జెందుచేగాని దు
ర్భరదోస్సారముఁ జూపుమార్గముఁ గనన్ రాకున్న దెట్లైన నా
శరుఁ డీతండు దురాత్మకుండగుట నస్త్రంబుల్ వడిన్ వైచియం
బరమం దుండి వధించువాఁడు కపులన్ భవ్యాత్ములన్ రాఘవా! 502

చ. కనుక విరించనాస్త్రమునఁ గాలునివీటికిఁ బుచ్చువాఁడ నీ
దనుజు దురాత్ము నంచుఁ దనధర్మము నెక్కుడువూన్కిఁ గాంచి యి
ట్లనియెను లక్ష్మణా! తగునె యబ్జభవాస్త్రము వైవ నిప్డు డొ
క్కనికయి పల్వురన్ మృతులఁగానొనరించుట యెట్లు పాడియా. 503

చ. పలువురఁ గావఁ బూని యొక బాలిశుఁ జంపఁగవచ్చుఁగాని య
ప్పలుగురఁ జంప నొక్కరుని బాగొనరింపఁగ న్యాయమౌనొకో
తెలియుదువీవె ధర్మములతీ రిడియంచు వచింపనేల నీ
యలుకకు వేళగా దిది యహంకృతిదూరులకే కదా వగల్. 504

తే. అనపకారులఁ జంప న్యాయంబు కాదు, మఱియు మనవైరి యంబరమార్గమందు
దాఁగియుండుట సంగరధర్మమునకు, ననువుగాకుండుఁగద వైరి నట్టివాని 505

తే. ఓడిపోయినవానిగా నూహచేయఁ, దగును; బాఱెడువానిని దాఁగినట్టి
వానిఁ గొట్టంగ రాదని మాననీయ,చరితు లందురు కైకొనఁ జనదె దాని?

చ. మతివిభవంబుగల్గి గుణమాన్యుఁడవై తగు నీవె యిట్టు ల
ప్రతిహతపద్మజాస్త్రము నరాతివధంబునకై ప్రయోగప
ద్ధతి మెయి వైవ నద్ది యొకదస్యునిమాత్రమె కాక యందఱన్
జతనము మీఱఁ జంపు రఘుసత్తమవంశవిరుద్ధ మద్దియా. 507

క. భీతుని బరాఙ్ముఖుల్ మన,జాతిన్ జన్మించియున్న । సన్మతు లెవరే
నేతఱిఁ జంపఁగ లే దిపు, డా తెఱఁగుం బూన నేల? । యనుజా! చెపుమా. 508

ఉ. ఆపదలందె ధర్మమున । కార్తిలవంబును గల్గనీక యే
భూపతి కాచు నాతనికె । పోలును భూపతిశబ్దమంచు జ్ఞా
నాపగలందు మున్గిన మ।హాత్ములు పల్కుదు రట్టులౌట నీ
వోపికమీఱ నుందుము మ।హోగ్రశరంబులఁ జంప నెంచెదన్. 509

క. వీనింజంపుట యొట్లని, యే నెంచుచునున్న వాఁడ । నెద నిప్పుడు నీ
వూనికమానుము చూడుము, దానవుఁ బొరిపుచ్చువిధము । తగునటు లెంతున్.

క. సౌమిత్రి కీవిధంబున, సామోక్తులు చెప్పి యతని।స్వాంతస్థమహో
గ్రామర్ష ముడిపి తనమది, రాముఁడు తలపోసె నయ్య।రాతి మృతిగతిన్ 511

ఆ. అంబరముననుండి । యాకపిసేనల, మ్రుందఁ జేసి దనుజ।రాజసుతుఁడు
రామలక్ష్మణాద్య।రాతుల నందఱ, మిగలకుండఁ జంపఁ।దగు నటంచు 512

చ. మతిఁదలపోసి దానికగు।మంత్రము నెంతయు నేర్పుమీఱఁ బ
ద్ధతి యిది యంచు నెంచి పుర।తల్లజ మల్లనఁ జొచ్చి దానవ
ప్రతతులచావు చిత్తమును । బ్రద్దలుచేయఁగఁ గోపమంతలో
హుతవహుమాడ్కిఁ గొల్చుతమి । నొక్కతెఱంగునఁ బూన నుగ్రుఁడై. 513

చ. కనులరుణంబులై వెలయఁ।గా రణభూమిని గానవచ్చి సై
న్యనికరయుక్తిఁ బశ్చిమము।నం దగుద్వారముదాఁటి రాఘవుల్
వనచరవీరులున్ రణమ।హావార్యపరాక్రమ మూనిచేయఁ బూ
నిన తెఱఁ గెల్ల నారసి య।నిం బొనరించెదు వేడ్క మాన్పఁగన్. 514

చ. ఉపమఁదలంచి యుద్ది యిపు । డొప్పును జేయఁగ దీనదుఃఖమం
ది పరవిదారణాక్షమత । దీనతఁ గుందుచు రామలక్ష్మణుల్
తపనతనూజముఖ్యులు గ।తత్రపవిదారణదీక్షులౌదు ర
ట్టిపనికి సాధనం బిదె క।డిందిమగంటిమి నిర్వహింపఁగన్ 515

తే. ఇట్టు లిప్పుని జేయంగ । నెల్ల కార్య,ములు ఫలించును గావున । ముందు దీని
నాచరించెద ననిపూన్కి । నవధరించి, మాయనిర్మించె జనకకు।మారి నపుడె 516

చ. కనుఁగొను వార లీమె జన।కప్రభుకన్యయె సందియంబు లే
దనియె తలంతు రట్టిదగు।నద్భుతశక్తి నొనర్చి దాని స్యం
దనమున నుండ జేసి తన।దాపున సేనలు నిల్చియుండఁ జం
పను దలపోసినట్లు తన।పంతము దానఫలించునట్లు నె
మ్మనము నటింపఁ జేయుటయె । మంచిదటన్న వినిశ్చయంబునన్. 517

### ఇంద్రజిత్తు మాయాసీతను జంపుట.

ఉ. ఎందుఁ గపీంద్రసేన లని యెప్పుడుకల్గునో యంచునున్నవో
యం దె రథంబునిల్పుఁ దగునంచు వచించి శతాంగ మట్టులా
పం దనచుట్టు రాక్షసులు పంతముపూనినయట్లు నిల్వ నొ
ప్పం దమి హెచ్చ; నంతరిపుభీకరుఁ డాదనుజేంద్రుఁ డచ్చటన్. 518

చ. కనఁబడినంతనే కపినికాయము క్రోధరసంబు పొంగ మా
ర్కొనఁ దమకించె హస్తములఁ గొండలు భూరుహముల్ తగంగ నా
హనుమయు భూరిశైలశిఖరాగ్రము హస్తమునన్ ధరించి య
వ్వనచరసేనమీఁద నిలువంబడియెం గడు విక్రమింపఁగన్. 519

చ శతమఖజిద్రథంబుననె జానకి యుండఁగఁ గాంచి సంశయ
ప్రతతి యడంగు నట్లు బహుభంగులుగాఁ బరికించి మున్ను తా
నతివను జూచెఁగాన నటు లారయఁగాఁ దగియున్న కాశ్యపీ
సుతగని యామెయే యగును శోకపరిప్లుతగాత్ర మద్దియే. 520

ఉ. సందియమిందులేదు దనుజప్రభుపుత్త్రుఁడు యుద్ధభూమి కా
యిందునిభాస్యఁ దోడుకొని యేటికివచ్చెనొ తోఁప దాత్మ కీ
సందియ మేల పూన ననిఁ జంపెద వీనినటంచు వానరా
ళిం దనవెంటరాఁ బనిచి లీలఁ జనెం గడు విక్రమింపగన్. 521

ఉ. సీతయు నింద్రజిద్రథముఁజేరి వెతంగనుచున్నరీతి గా
నాతఁడెఁ దోఁచె నట్లగుట కార్తి మఱింత తనుంగలంప నా
వాతతనూభవుండు గరువంబడఁగన్ బవరంబొనర్చి దు
ర్జాతుని వీనిఁ జంపెదను సాధ్విపగం దొలఁగంగఁ జేసెదన్. 522

చ. సమరము చేయ రండనుచు శౌర్యమునం దగువీరరాజి వి
క్రమమునఁ బోర నూల్కొలిపి రావణిఁ జంపఁ దలంచి చెంతకున్
సమదమృగేంద్రనాదమునఁ జయ్యనఁ బోయెను గొండకొమ్ము హ
స్తమునఁ గనంబడంగ; నట దానవవీరుఁడు క్రోధపూర్ణుఁడై. 523

చ. హనుమ కనంగ భూమితనయాశిర మొయ్యనఁబట్టెఁ జేతఁ గో
శనిహితఖడ్గ మొక్కగతిఁజయ్యనలాగి వధింపఁబూనె; నం
త నియతిమీఱ దీనజనతావనదీక్ష! రఘూత్తమా! జవం
బున ననుఁ గావుమా యనుచు బోరున నేడ్చు మహీసుతం గ్రుధన్. 524

మ. కరవాలంబునఁ జెండనూల్కొనియె నక్కార్యంబు వీక్షించి య
మ్మరుదీశాత్మజుఁ డోరిపాపమతి! రామక్ష్మాపతీంద్రప్రియా
శిరముం బట్టితివే కరంబున నిసీ! సీ! ఘోర పాపం బిదే
కరుణాహీనుని నిన్నుఁ ద్రుంపఁగల దికార్యం బిటన్ మానవేన్. 525

చ. కులమును రూపుమాపు గుణకూటము నెల్ల నడంచు నాయువున్
దలఁగఁగఁజేయు నిట్టిదగు దారుణపాపము దుర్మదాంధ! యీ
జలరుహనేత్ర వే విడువు చంపఁగఁ బూనెద వే నిరున్ జనం
బలర వధింతు నిప్పు డనునంతనె వాఁడు వధించె ప్రేల్మిడిన్. 526

చ. తలదెగి భూమిపైఁబడినఁ దత్తనునిర్గతరక్తపూరముల్
పలలభుగీశనందనునిపజ్జఁ బ్రవాహమురీతిఁ బాఱె; న
వ్వల జనకాత్మజాతదశవాయుకుమారుఁడు గాంచి శోకవా
ర్ధుల మునిఁగెన్ గపీంద్రబలతోయధి యింకినయట్లు కన్పడెన్. 527

ఉ. ఆవిధమెల్లఁ గాంచినమహాబలనందనుఁ డుగ్రుఁడై రిపుం
జేవచెలంగ మార్కొనఁగ జిత్తము తన్ బురికొల్ప రామునిన్
భావమునందు నిల్పి వెతబాఱెడు కోఁతుల నిల్వరించి దు
ర్భావముగల్గు నింద్రరిపు రావణి మార్కొనిపోరె నెంతయున్. 528

క. గిరులం బాషాణంబులఁ, దరువరముల వైచి వానిదర్పము చెడఁగా
బరువెత్తఁ జేయఁబూనెను, సురవైరివరాత్మజుండు శూరతవెలయన్. 529

సీ. దివ్యాస్త్రములవైచి దివికేగఁ గొందఱఁ, గపులనొనర్చి వేర్గలుగువారి
దీనులఁగాఁ జేసి తివిరి మార్కొనువారి, నంతకుచెంతకు ననిపి యనిపి
సంగరమొనరించె జానకీమృతిగన్న, హనుమకు నుత్సాహ మంతకంత
కొకరీతి సడలంగ యుద్ధకార్యముమాని, కపులార! మనచేయు కార్యమిద్ది

ఆ. వ్యర్థమగును సీతవార్త రామున కిడ్డ, తెలుపవలయుఁగాదె పలుకులేల
యీమెకొఱకుగాదె యింతయుద్ధము సాగె, నామె చచ్చె నింక నేమిగలదు.

చ. చని యలరామలక్ష్మణులసంగతినుందము; సీతవార్తఁ జె
ప్పనుదగుఁగాదె యిప్డు; మనపంతము లంతమునొందె దైవమే
మనకు విరుద్ధరీతిగను మార్తునకుం గడుమేలుగా ఫలం
బును గలిగెంచె నేమనినఁ బుట్టదు లాభము సుంతయేనియున్. 531

క. పరుగిడి రాముని చెంతకుఁ, దరుణీమృతివార్తఁ దెల్పి ధర్మవిదునితో
జరపుదము కాల మనవిని, హరివీరులు దీనవదనులై శోకమునన్. 532

చ. చలనము నొర్వనట్టిపదసంగతి రామునిఁ జూడలేక యే
పలుకులు పల్కలేక రణపౌరుష మింతయుఁ జూపలేక యా
త్మలు వగఁగుండఁ బోయి; రభిమానము లన్నియు నంతమొంద న
బ్బలములపోకఁ గాంచి సురవైరికుమారుఁడు కార్యసిద్ధికై. 533

క. చనియెం జైత్యనికుంభిల,కును హోమం బందుఁజేయుకోర్కి వెలయఁ జ
య్యన నాహోమము సిద్ధిం,చినచో విజయంబు దాన సిద్ధించిన దే. 534

### మాయాసీతావధరహస్యము.

క. ఈయుపమ యింద్రజిత్తపు, డేయర్థముఁగోరి పన్నె నించుక తెలియన్
మాయాప్రభావ మెట్టిదొ, యేయెడ నదియెట్టి ఫలంబు నిచ్చునొ తెలియన్.

చ. జనకకుమారి యౌవనవిశాలమహీరుహమూలమందుఁ దన్
దనుజవరాంగనల్ గొలువ దారుణసంగరకేళిఁ గాంచునె
మ్మనమున నెంచె వానరులు మారుతపుత్త్రుఁడు శోకసాగరం
బున మునుఁగంగ నౌననుచు భూపకుమారులు దుఃఖ మేఁచఁగన్. 536

క. పలవింపవలయు నంచుం, దలఁచెం దత్క్షణమ తోఁచె దానవపతిపు
త్త్రులలోన మేటియై దోర్బలమున విలసిల్లునింద్ర వైరికి మదిలోన్. 537

చ. అనిమొన మాయపన్ని జనకాత్మభవన్ సృజియించి కోఁతు లా
హనుమయుఁ గాంచఁ జెండెద భయంకరఖడ్గము కేలఁ దాల్చి యం
తన కపులెల్ల రేడ్చుచు వినాశము నొందెను గాదె సీత యీ
యని యిఁక నేల యంచుఁ జని యా రఘువీరుని జేరి యార్తులై. 538

ఉ. విన్నప మొప్పఁ జేయుదురు వీరినుడుల్ విని రాఘవుండు సం
పన్నుఁడునయ్యు మూర్ఛగని పౌరుష మేటికిఁ గంచుఁ జిత్తమం
దెన్నుచు నుండుఁ గాని మఱియేత్తెఱఁజూపఁగ మాను నింతలో
నన్నియుఁ దీర్చి సద్వరము లంది యొసంగెడు వేడ్క వచ్చెదన్. 539

చ అని తలపోసె; నవ్విధిగ నా మెతనూవిభవంబు గల్గగా
నొనరిచి చంపె; దానఁ గపులొక్కటఁ గుందిరి; రామలక్ష్మణుల్
మనముల నేడ్చి; రింత యనుమానము నొంద రదెవ్వరే; జగ
జ్జననితలంపులం దెలియ శక్యమె యేరికి నే నదెట్టులేన్. 540

చ. శతమఖజిత్తు హోమమునఁ జంపఁగ నర్హములైన ప్రాణిసం
తతి తఱివేచియున్నయది దానికిఁ గారణభూతుఁ డాతఁడే
యతఁ డలహోమకార్యమున కాదృతిపూనఁగఁ గారణంబు కీ
శతతియు రాఘవుల్ వెతలఁజాలఁ దపింపఁగ నిశ్చయంబుగన్. 541

చ. అరిబల మంతరాయముల నందఁగఁ జేయఁగఁ బూననంచు నా
ధరణికిఁ బోయి క్రూరమగుదైవముఁ గూరిచి చేయుహోమ మా
దరమున నందుఁ జంపు వివిధంబులు గాఁదగు జంతురాజి నం
తరమున విఘ్న మేర్పడినఁ దానుమృతింగను నట్టులౌటకున్. 542

క భగవతితలంపు చొప్పునఁ, దగురీతిని హోమకార్యతత్పరమతియై
వగలొందఁ జేసె హరుల, నగణ్యమాయాబలమున నా రావణియున్. 543

ఆ. ఇన్ని పనులు సాగ నెంచె నా జనయిత్రి, యంతలోనె యట్లె హనుమదాదు
లద్దిమాయ యనుచు నాత్మఁ దలంపక, వగలఁబొగిలి రజ్ఞులగతి నకట!. 544

చ. అతనిరథంబుమీఁద నొకవ్యక్తియు లేదితరుల్ కనంగ భూ
సుత యటనుండునట్లు తగుఁజాడ్కికి నట్టు లొనర్చు నిష్టదే
వతయని నమ్మఁగావలయు వస్తువులేనియెడం జెలంగున
ట్లతిశయశక్తిఁ జేయు; నదియట్టులె కన్పడు మాయ నా నదే 545

ఉ. జానకిశీల మెట్టిదని శాప మొసంగెడుశక్తి యొప్పునా
మానినియందు నంచుఁ బవమానసుతుం డెఱుఁగంగనోపు; వై
శ్వానరుఁ డామెయాజ్ఞఁ గడుఁజల్లఁదనంబు వహించి వాలమున్
మానెను గాల్పకుండ నని మానసమం దెఱుఁగండె యత్తఱిన్. 546

చ. కనియు నెఱింగియున్ నిజముగాన కెఱుంగక పోవునట్టు లా
జనని యొనర్చు; నామెదగుశక్తి నెఱుంగుట కల్ల యంజనా
తనయుఁ డనంగ నెంత హరిధాత్రుమహేశులశక్తు లన్న నీ
వనచరుమాట యేటికిట వాకొన నూఁకొన నద్భుతంబుగన్. 547

చ. ఎదియెటు సాగఁగాఁదగునొ యెప్పుడు తప్పక యట్లసాగుఁ; ద
ప్పదు రవిశీతరశ్ములు నభంబునఁ బోవుట తప్పనట్టులే
యదియొకవేళఁ దప్పిన మహాప్రకృతిస్థిరవాంఛ తప్పు; దె
య్యది యెటులున్న నంచు మదియందుఁ దలంపఁగనౌ బుధాళికిన్ 548

## చైత్యనికుంభిలావృత్తాంతము.

సీ. చైత్యనికుంభిలాస్థలమది యొక దేవ,తానామధేయంబుఁ బూని తెలుపు
నందు నికుంభిలాహ్వాయ దేవతామూర్తి, యర్చింపఁబడుచుండు ననుదినంబు
వలసినతఱిఁ బోయి భక్తుండు తద్విధి, ననుసరించుచు హుతాశనముఖమున
వేల్వఁగాఁ దగునందు వివిధజంతువులను, వధియించి తదవయవములయందుఁ
తే. గొన్నిటం గలమాంసంబుఁ గొని తదీయ,మంత్రము నెయుచ్చరించుచు మదివిచంచ
లముగనుండఁగ నగ్నికీలముల వైవఁ;దగును దద్విధిహోమంబు తగువిధమున.

క. హోమంబది విఘ్నంబున, నేమాత్రము కొఱఁతగాంచు నే మృతిగల్గున్
గామములుపండుఁ జక్కని,దౌ మార్గమునన్ ముగింప నని తెల్పువిధుల్ 550

సీ. క్షుద్రదేవతయె నికుంభిలయగు నల్ప,కామంబు లొసఁగంగఁ గల్గునేని.
దానినే ముక్తినిగానంగ సేవింపఁ, దద్దేవతామూర్తితల్ బరాత్ప
రుఁడు తోఁచి దానిదరుణమున నొసఁగును, సర్వరూపములఁ దాసంతతంబు
వెలయుచుండుటఁ గర్మములఁబట్టి కల్గెడు, వాంఛలఁ దీర్ప దేవతల నెల్లఁ
తే. దనదునంశములన్ నిల్పి దానితత్త్వ, మరయఁగాఁ దగుక్షుద్రదేవాళివెలయు
ననుట దానినుపాసింప నాత్మఁగోరు, టనఁగఁ గర్మఫలంబును గనుటకె యగు.

చ. మనమున నెట్టివాంఛఁగొని మంత్రము భక్తిఁజపింప దానికే
దొనయగు రూపముంగొని మహేశ్వరి దైవి వరంబొసంగు; నీ

తనువొకఁడే యటన్నయది । తప్పక యజ్ఞతయే మఱొక్కఁడేఁ
గనుగొనలేమ తత్త్వమిది । గాదన బ్రహ్మకునే నశక్యమా. 552

దేవతావర్ణఫలములు.

చ. హృదయమునం దుపాసకుఁ డభీష్టఫలంబులఁ గోరువేళస
మ్మదమున నిష్టదేవతను । మానసపద్మమునందు నిల్పి యి
ష్టదుఁడవు; నాదువాంఛయిది । చక్కఁ ఫలింపఁగఁ జేయ నిన్నుఁ గొ
ల్చెద నని వేఁడుచుఁ జపముఁ చేయఁ దగుంగద కామ్యసిద్ధికై. 553

సీ. ముక్తినిగోరుచో । ముగ్ధశశిజ్యోత్స్న, వలెఁ దనువొప్పదైవముఁ దలంపఁ
దగు; వశీకరణవిద్యను గొల్చుచో దైవ, తమునుసంధ్యారక్తతనువు దాల్చి
నట్లుపాసింపనౌ; । నమలకవిత్వము, సిద్ధింపఁగోరుచో । శుద్ధమైన
స్ఫటికవర్ణాంగము । భాసిల్లునట్లుగా, ధ్యానింపఁ దగియుండు; । ధనముగోరి

తే. స్వర్ణవర్ణంబుగా నెంచి । జపము చేయ, వలయు; సకలసంపత్తుల । వలచి చేయు
జపమునం దిష్టదైవంబు । శ్యామలాంగ, మలరు నట్లుతలంపనౌ । ననిరి మునులు.

క. నీలశరీరము దగఁగాఁ, గ్రాలెడుగతి నెంచి శత్రుగణమును బలుకం
జాలనియటు చేయు మటం, చోలి జపింపంగఁదగు మనూత్తమ మెలమిన్. 555

క. అరితతిసంస్తంభింపఁగఁ, గర మిష్టంబైన దేవతాకాయమ్మును బీ
తరుచిఁ గల్గినదానిగ, బరికించి జపింపవలయుఁ । బద్ధతి యిదియే. 556

సీ. పరమమాణిక్యదీపమువలె దేవత, తగునట్టిరీతి నాధారచక్ర
మాదిగా బ్రహ్మరంధ్రాంతము వ్యాపించి, నట్లు తలంచుచు । ధ్యానయోగ
నిరతి నుపాసింప । నిఖిలసిద్ధులు గల్గు, నపుడు తేజఃపుంజమా నభీష్ట
దేవతయని మదిఁ దెలియంగ నగుఁగాదె, యిట్టిభేదంబులు నెల్ల కోర్కు

తే. లమరుచుండు నుపాసకుఁ । డవ్విధంబు, నెఱిఁగి సేవింపఁదగియుండు । నిష్టదైవ
తమును శాస్త్రోక్తమార్గంబుఁదా నెఱింగి, దాన సిద్ధించుసుఫలసంతతి యటంచు.

క. చనవలయు శాస్త్రమార్గం,బును బట్టియె వేఱుమార్గమునఁ బోయినఁ జే
కొనరాదు సత్ఫలంబుల, నని తెలియందగు నుపాసకావళి కెల్లన్. 558

ఆ. రావణాత్మజుం డరాతివధంబును, గోరి విఘ్నము లెవి । కూడకుండ
జేయుతలపు నూని । సీతాకృతిని మాయ, జక్కఁ జేసి దానిఁ జంపి యపుడు.

వ. చైత్యనికుంభిలకుం బోయి వివిధజంతువులం జంపి వాని రక్తమాంసంబుల
హోమంబు చేయుచుండె; దానియందు లోపంబులు రాకయుండఁ దద్విధుల
నెఱింగిన రాక్షసులు చూచుచుండి రంత. 560

విభీషణుఁడు లక్ష్మణునిఁ బంప రాముని వేఁడుట.

చ. జనకకుమారి రావణియుఁ । జంపఁగఁ గాంచిన వానరుల్ జవం
బునఁ జని తెల్ప రాఘవుఁడు । భూమిపయిం బడి యంగలార్చుచుఁ

దనగతి యింక నేమియని తత్తఱపాటును బొందుచుండె; నా
తనియనుజుండు లక్ష్మణుఁడు తా నటులే పడియుండె; నంతటన్. 561

చ. హరివరు లార్తిఁగుంది రటులాహనుమంతుఁడు జాంబవంతుఁడున్
హరిహయపౌత్రుఁ డాదియగునాకపివీరులు మూర్ఛమున్గి ర
త్తరణమునన్ విభీషణుఁడు తద్విధమంతయు లోన నెంచి సం
గరమున గెల్పునొందుటకుగా దితిజాగ్రణి చేయుమాయగన్. 562

మ. మదిలోఁ జక్కఁగ నిశ్చయించి రఘురామా! యిట్లు దుఃఖింప నీ
యదనుం బాడుగఁజేసినట్లియగు; లెమ్మా! యింక నీచింత లె
ల్లఁ దొలంగున్; దనుజేంద్రనందనుఁడు రాలచ్చిం దమింబొందు నా
శ దనుం బెల్లుగఁ బ్రోత్సహింప సుదతిం జంపెన్ మహాక్రోధియై. 563

మ. ఇదియెల్లం బరికింప మోసనుగుఁగా యిందెద్దియున్ సత్యమా
నదియే లేదని నమ్ముమీ మనల నిట్లార్తిం గనంజేసి దు
ర్మదుఁడౌనాతఁడు హోమకార్యమును శాస్త్రప్రక్రమంబొప్పఁ జే
యఁ దమింబూని చనెన్ యథార్థ మిదియా నంచాత్మ భావింపుమా. 564

క. నేనెఱుఁగుదు హోమంబది, పూనిక నిర్విఘ్నమగుచుఁ బూర్ణంబగుచో
దానవు నాతని బ్రహ్మయు, దానవవైరియును మన్మథద్విణ్ముఖులున్. 565

చ. అనిమొనఁ జంపఁజాలరని యాత్మ నెఱుంగుము; సీతగాదు మా
యను మననేత్రమార్గమున నాజనకాత్మజగాఁ గనంబడం
గను దగునట్లొనర్చె; నిటఁ గాంతను గూరిచి చింతచేయుచున్
దనను స్మరింపకుందు; రట దానవసంతతి మేలుగోరుచున్. 566

క. హోమము సాగింపఁగ దగుఁ, నామానసవాంఛ లొక్కనాఁడె ఫలించున్
రామాదులఁ జెండెద నని, యేమో తలపోసి పోయె నిపుడు రఘుపతీ!. 567

తే అది నికుంభిలయందుఁ జేయంగఁబడును, యజ్ఞభూమియెయగునద్దియందుఁగలదు
దేవతాలయ మొక్కండు తీవ్రహోమ, మద్ది హింసాలయంబగు ననఁగఁదగును.

సీ. బహువిధజంతువుల్ వధియింబపఁడు వాని, రక్తమాంసమ్ములే ద్రవ్యములగు
హోమంబునకు విఘ్నమొప్పక సాగునే, నది యగ్నికుండంబునందునుండి
వెలువడుసాధనంబులు యుద్ధమునకని, వానిసాయమునొంది బవరమునకు
వచ్చినవాని బ్రహ్మాదులే గెల్వఁగ, జాల రియ్యది సత్యసమ్మతంబు
తే. విఘ్నమొక్కింత పొడసూప విలయమతని, కిద్ది తప్పదు తద్వ్యాధియిట్టిదనుచు
నేనెఱుంగుదు సాగునద్దాని కిప్పు, డంతరాయమ్ము గల్పించు టర్హమగును.

చ. దనుజు లనేకసంఖ్యదగిదానిన గాచుచునుందు; రించుకై
నను గొఱఁతంగనంగ జతనంబునఁ జేయఁగఁజచ్చు నాతఁ; డా

దినముననే యటంచును మదిం గదియించి మదీయవాక్యముల్
బనుపుము లక్ష్మణుం గపులబాహుబలాఢ్యులఁ బెక్కురం ద్వరన్. 570

చ. సమరముసాగు నందుఁ దమసత్త్వముఁ జూపుదు రద్దురాత్మసై
న్యమునఁ గలట్టివీరులు మహాత్మ! రఘూద్వహా! సీతఁగూర్చి దుః
ఖము నిపుడొందనేల జనకప్రియపుత్త్రిని జంపుమాట స
త్యమనుచు నమ్మఁబోకు మదిదబ్బఱ నానుడు లాలకింపుమా. 571

చ. క్షితిపయి మిత్త్రవాక్యములె క్షేమముఁగూర్చు నటంచుఁబల్కు శా
స్త్రతతుల విశ్వసించి యిఁకజాలము చేయక లక్ష్మణుల్ బలో
ద్ధతులగు కీశవీరులను దస్యుభయార్థము పంపవయ్య! యా
క్షితి నిపు డగ్నికార్య మది చెల్లుచునుండు యథావిధిం దగన్. 572

సీ. అసురవరుల్ పూన్కినందుండి యేవిఘ్న,మావహిల్లకయుండ నరయుచుంద్రు
గావున లోనికిఁ బోవంగ రాకుండుఁ, బౌరుషమూని యప్పని నొనర్ప
వలసియుండుం గాన బలవంతులగు కపుల్,సౌమిత్త్రిఁగూడి రాజును జవమునఁ
దోడుగానేన యుందును విఘ్న మొనరించు, కార్యము సాగింపఁగాఁ గడంగు
ఆ. వాఁడ నిఁకఁ బెక్కులాడంగఁ జాలను, జాలమునకు నిద్ది కాల మగునె
యనుచు నొక్కి చెప్పనాలించి శ్రీరాముఁ, డలమియున్న మౌగ్ధ్యమవలఁ దోలి.

ఉ. తమ్మునిజీరి యీసహజధర్మునిమాటలు వింటివే కదా
యిమ్మహి నిట్టివారుగలరే యని తోఁచెడుఁ జాపమూని బా
ణమ్ముల నస్త్రవర్యముల నాదగుదీవనలన్ గ్రహించి సై
న్యమ్ములఁగూడి పొమ్ము జతనంబది యీతనివంక ధన్యమా. 574

మ. మనకున్ మిత్త్రుఁడు బాంధవుండు నన నిమ్మాన్యుండె సోదర్యుఁడే
యననౌఁగాదె యితండు చెప్పినటు కార్యంబెల్ల సాగించి దు
ర్మననున్ నీచు దురంతపాపరతు సంగ్రామంబునం గూల్చిన
న్ననరమ్మా ప్రియసోదరా! యనుచుఁ జక్కం గౌఁగిటం జేర్చుచున్. 575

క. శిరమున్ మూర్కొని యింకం, ద్వరపడుమా యన్న రామువాక్యంబుల ని
ర్భరపౌరుషంబు పొదలన్, హరివీరులఁ బ్రోత్సహించి హనుమంతునితోన్.

ఉ వింటివిగాదె యిప్పటి విభీషణువాక్కుల; రామచంద్రుఁడా
తుంటరి చేయు హోమమును ధూర్తమహాసురరక్షితంబు నా
వింటి బలంబునం జదిపి వీరుఁడ నేననిపిట్టుకోఁగ వా
ల్గంటి వధించు వ్యాజమునఁ గార్యముపూనిన దుర్మదున్ రిపున్. 577

ఉ. నీమముపాడు చేయుచు ననిన్ వధియించి మదగ్రజన్మునిన్
క్షేమముమీఱ వచ్చితిమి చెండితి మాజి విరోధినంచు సం

గ్రామజయోక్తులం బలుకఁగావలయున్ బయనంబు చేయుమా
భీమబలాఢ్య! యన్న రఘువీరునిజేరి నమస్కరించుచున్. 578

ఉ. చేతులుమోడ్చి యాజ్ఞదయచేయుము శ్రీరఘురామ! యంచు సం
ప్రీతిమెయిం బదాబ్జముల వీతకళంకతఁ గూర్చువానినిం
జేతముపొంగఁ దాఁకి విధిఁ జేసి నమస్కృతు లాజ్ఞనొంది సం
జాతమహాగ్రహంబున నసంఖ్యలు వానరు లేగుదేరఁగన్. 579

క. సౌమిత్రివిభీషణు లుద్దామప్రక్రమముమీఱఁ దరలఁ గపీంద్ర
స్తోమము వెంబడిరాఁగా, నామారుతి నడిచె దానవాలి వధింపన్. 580

చ. చనిచని యావిభీషణుఁడు చక్కనిమార్గముఁ జూపఁబోయి గా
దనుజులు తన్నికుంభిలకు దాపున సాయుధపాణులౌచుఁ జే
ర్చినగురువిక్రమంబునను జేరి యరాతుల రూపుమాపఁగాఁ
జనునని కోరుచున్నగతి సాంద్రముగా నలుదిక్కులం దొగిన్. 581

తే. క్రమ్ముకొనియుండ రవ్వారిఁ గాంచి పలికె
నవ్విభీషణుఁ డీదానవాలి నొక్క
కబళముగ మ్రింగఁదగియుండుఁ గాన మిగులఁ
బౌరుషంబున మార్కొనవలయుఁజుండి! 582

ఉ. పేరలఁ బిల్కుమార్పకయె వృత్రహరారిఁ గనంగరాద దె
వ్వారికిఁగాని మీర లిఁకఁ బౌరుషమొప్పఁగ నొక్కసారి యీ
ధీరుల మార్కొనుం డనుచుఁ దెంపు వహింపఁగఁ బల్క నప్పుడే
దారుణభంగిఁ బైఁబడిరి దానవు లెంతయుఁ గిన్కఁజూడఁగన్. 583

క. పెనుసంకులసమరం బది, వనచరులకు దైత్యరాజభటులకు సాగెన్
దనుజబలంబుల మ్రందం, గనుసాగెఁ గపీంద్రులట్టి కాఁతియపెట్టన్. 584

క. ఒక్కముహూర్తంబున నే, యుక్కడఁగించిరి కపీంద్రు లోహో! యని నల్
దిక్కులనుండి రవంబులు, పిక్కటిలెన్ సన్నగిల్లెఁ బీరములెల్లన్. 585

చ. హరివరు లేగుదెంచి సమరాంగణమందుఁ స్వసైన్యమున్ వధిం
చిరి గరువంబుమీఱ నిటఁజేరఁ దలంచుచు నున్నవారు భా
స్కరసుతుసేన లన్నుడి కర్ణములం జొర హోమకార్యమున్
జరపుటమాని భీమగతిఁ జండశరాసనమూని యుద్ధతిన్. 586

ఉ. అంతకుముందె సిద్ధమయియచ్చట నున్నరథంబునెక్కి యా
వంతయు శంకలేక యదియంతరమందె చెడెంగదా? ఫలం
బెంతయుదారుణంబగుచు నిప్పుడె తోఁచు నటంచునెంచ క
త్యంతపరాక్రమంబున జయంబును గాంచెడు కౌతుకంబునన్. 587

క. జ్యావల్లికాస్వనం బది, యావాసవముఖులకే భయం బొదవింపం
గా వచ్చె యుద్ధభూమికి, రావణి హతశేషమైన రాణువ గొల్వన్. 588

చ. అని నొనరింప వచ్చె దనుజాధిపుసోదరుఁ డౌ విభీషణుం
డనువుగ డంగ లక్ష్మణున కాతనిఁ జంపువిధంబుఁ దెల్పి మా
ర్కొనఁ బురికొల్పె; నింతకును గూఢ విరోధి పితృవ్యుఁ డేకదా!
యని తలపోసి రావణి కులాంతక నీవనఁ బిన్నతండ్రివై. 589

చ. అరులకు గుట్టులెల్ల ముదమారఁగఁ దెల్పుట న్యాయ్య మయ్య! సో
దరునకు హానిచేయుట నితాంత మఘంబని పెద్దలంద్రు; పా
పరతుఁడ వీవు; యుద్ధమునఁ బాల్గొనియున్న నెఱుంగవచ్చు; నా
గురుతరవిక్రమం బిపుడు కూళవు గానఁ దొలంగి తేమనన్. 590

చ. అని బహుభంగులన్ బదరు నా శతమన్యు విరోధి గాంచి ధ
ర్మనియతి వీడ కెట్టు నయమార్గముఁ జూపునొ యట్టు లుత్తరం
బు నిడి విభీషణుండు రఘుభూపకులాభరణంబుఁ బ్రోత్సహిం
చెను శతమన్యుజి న్నృపతిశేఖరసోదరు లొక్కరీతిగన్. 591

చ. కలహ మొనర్ప సాగి; రది కాంచెడు వేడ్క విమానరాజిపైఁ
నిలిచి యమర్త్యులెల్లఁ గని నిర్భరమోదముపొందు నట్టులా
కలహముసాగె లక్ష్మణుఁడు గాఢపరాక్రమ ముల్లసిల్ల న
మ్ముల జడివాన ముంచె నతిమూర్ఖుని రావణు నగ్రపుత్త్రునిన్. 592

మ. గురునారాచపరంపరానిహతమై కూలంగ సైన్యంబు కుం
జరవాజివ్రజ మంతముం గనఁగ రోషస్ఫారయుక్తాత్ముఁడై
కర మార్తింగని యుర్ ధనుర్బలమునన్ గ్రవ్యాదరాట్పుత్త్రుఁ డం
బరమందుండు సురల్ సెబాసనఁగ దుర్వారోద్యమం బొప్పఁగన్. 593

మ అనిసేయంగని యవ్విభీషణుఁడు మాయావీర్యసంపన్ను నీ
తని వే చంపురటంచు నూల్కొలుప దుర్దాంతప్రతాపం బొగిం
గనఁ జేయంగను బూని లక్ష్మణుఁడు భక్తవ్రాతమం దాద్యుఁడే
యనుఖ్యాతిం గనువాఁడు గావున మహేంద్రాస్త్రంబు సంధింపఁగన్. 594

మ. తలపోసెన్ మది; నస్త్రవర్యమది నిత్యం బర్చితం బౌచు శ
త్రులయం బొక్కటఁ జేయు నెప్పుడనుచున్ రోషస్వరూపంబుగాఁ
దుల లేకుండఁ జెలంగుచుండు నదియే ధూర్తారివీరాగ్రణిం
బొలియింపందగు నంచు నెంచి జతనంబుం బూని వే కైకొనెన్. 595

చ. శరమది నారిఁ గూర్పఁగ విశాలమరీచులు ప్రజ్వరిల్ల నా
శరవరమస్తకగ్రహణసాంద్రముదంబును గాంచినట్టు ల

త్తరుణమునందుఁ జూడఁబడెఁ దానిని నారినిఁగూర్చి రాముప
త్సరసిజముల్ స్మరించి సురసత్తమమాత్రయుతంబుగాఁ దగన్. 596

క. ఒనరిచి యాశరవరము,ర్దనదీక్షుదృఢంబుగా నోదం బక్వంగా
ధనువుం జూచుచు నివ్విధ,మున శపథంబూని పల్కె భూపతనయుఁడున్. 597

తే. దాశరథి రాముఁడెప్పుడుఁ ధర్మమతియు,సత్యసంధుఁడు మఱి పౌరుషమునఁ దనకు
నెదిరి లేకుంట నిశ్చయమేని యీశ,రము వధించును గాక! యీరావణి నని.

చ. అనితలపోసి వైవ నది యగ్నికణంబుల నెల్లఁ గ్రక్కుచుం
జని దితిజాధిపాత్మజుని శక్రజితుండని పేరుఁగాంచి యొ
ప్పిన గురువిక్రముం గదిసి పెంపఱ వానిశిరంబు దేహమం
దు నిలువనీకఁ గ్రిందఁబడఁ ద్రోసెను దేవత లుల్లసిల్లఁగన్. 599

సీ. ఇంద్రుని యుద్ధమం దెన్నిసారులో జయించిన మేటి దానవె యింద్రజిత్తు
నాఁబడునని పద్మనందనుఁడే పల్కె, నట్టిశూరాగ్రణి నని మొన నపు
డింద్రమంత్రంబున నెసఁగునస్త్రంబది, ఘాలియించె నేమని పలుకవచ్చు
నింద్రమంత్రంబది యింతశక్తిం దగి, యుండునే నింద్రుఁ డోట్లోడిపోయె
తే. ననుచు సంశయమందుదు రనఁగవచ్చుఁ,గాదె యేమంత్రమైన నికామశక్తిఁ
గను నుపాసకుచిత్తశక్తి నని నమ్మ,వలయు నత్తఱి లక్ష్మణుపలుకు లెల్ల. 600

మ. తలపోయం దగియుండు రాఘవుని పాదంబుల్ మదిన్ నిల్పి ని
ర్మలరామప్రియధర్మసత్యములు దర్పంబున్ ప్రమాణంబులై
యలరంగల్గుట నిశ్చయంబయిన నీయస్త్రప్రయుక్తాస్త్ర మి
మ్ముల వైరిం దెగటార్చుఁగాక! యనుచుం బూన్కిం బ్రయోగించుటన్. 601

క. చని యతనిమనోబలమునఁ, గని యెంతయు శక్తి నసురకాంతునిఁ ద్రుంచెన్
గనుక నుపాసకుచిత్తం,బును బట్టియె మంత్రశక్తి పొలుచుచునుండున్. 602

ఆ. ఎట్టిమంత్రమైన గట్టిభక్తిం గల,మనుజువంక శక్తిమంత మగును
నీచువంక నదియె నిర్గతశక్తియై,యల్పశక్తిగలిగి యట్టె యడఁగు. 603

ఉ. మంత్రములెంత గొప్పవయి మాననిశక్తిఁ జెలంగుచుండినం
దంత్రములెల్ల మంత్రసముదాయమహత్త్వముఁ బెంపఁజాలినన్
యంత్రము లర్చనాదికము లందుట మంత్రముశక్తిగల్గి యా
మంత్రణమాత్ర సత్ఫలము మానక యీయఁగఁ జేయఁ జాలినన్. 604

సీ. దానినుపాసించు మానవుం డత్యంత,నియతిమంతుఁడు గాక నిచ్చలు తన
యిచ్చచొప్పునఁ జరియించు వాఁడైనచో, నిష్ఫలం బేయయి నెగడకుండు
భక్తియుక్తుండయి పరమేశుగా నమ్మి, నిర్జితేంద్రియుఁడయి నిర్మముఁడయి
చక్క నుపాసింప సర్వశక్తులుగల్గి, ఫలములనిచ్చును భవ్యకరుణఁ

తే. గాన మంత్రంబులకు శక్తిఁగలుగఁజేయు,వాఁ డుపాసకుఁడేయనిస్వాంతమందు
విశ్వసింపంగఁ దగియుండు వేయునేల,భక్తియే మూల; మదిలేమిఁ ఫల మలరదు.

క. మంచిదె లోహంబైనం,జంచలమతి త్వష్టయైన శస్త్రంబును గా
వించెడుతఱిఁ జెఱచు మఱి య,చంచలమతియైన దానిఁ జక్కఁగఁ దీర్చున్.

క. ఆవిధమున సాధకుఁడుఁ,బావనమతియైన వీర్యవంతము మంత్రం
బౌ; వాఁడు దుష్టశీలుం,డే వడి నశియించు నట్టిదే యగు నదియున్. 607

ఉ. భావనయే ప్రధానమని పల్కుదు రార్యులు సత్యమే యగుం
గా విషయాభిలాషములఁ గాలముపుచ్చునతండు మంత్రవి
ద్యావిధి నేర్చినన్ ఫల మదారయఁ గన్పడకుండు మంత్రమె
ట్లావిధ మొప్పనుండనగు నాతనిభావనయే ప్రధానమౌ. 608

చ. శతమఖుఁ డోడిపోవుటకు స్వాంతము చంచలవృత్తినుంటయే
హితమగు కారణంబెయగు నెంతయు భక్తి నిరీహతల్ తనన్
జతనముమీఱఁగొల్వఁ దగుక్ష్మాపతిపుత్త్రుఁడు లక్ష్మణుండు సం
తతనియతుండె యౌట న దుదారమహత్త్వము గాంచఁజాలెగా. 609

ఆ. గొప్పమంత్రమనుచుఁ గోరి కైకొని విధి,దాని జపముచేయఁబూనకున్న
నల్పమంత్రమెయగునది ఫలంబును బట్టి,గొప్ప కొలఁది యనఁగఁగూడదుఁగాదె.

క. సురసుందరియే క్లీబున,కరయ ఫలంబందఁజేయ నర్హము గాన
ట్లురుమంత్రమే నభక్తున,కరితంగను నిష్ఫలంబె యది వాని కగున్. 611

క. కనుకన్ మహేంద్రునస్త్రం, బనుపమశక్తిం జెలంగి యరి మ్రందించెన్
వినుతమతిస్థిరతం గను,మనుజేంద్రకుమారువంక మహితం బయ్యెన్. 612

చ. సుతు నని లక్ష్మణుండు కడుసూరతఁ జంపుట నాలకించి వి
స్తృతమగు దుఃఖవార్ధిఁబడి చిత్తమ దుక్కిరిబిక్కిరై చెడన్
గతమగుకార్యముం దలఁపఁగాఁ దగదంచుఁ దలంచి వే యమా
త్యతతిని రాఁగఁబంచి దనుజాధిపుఁ డిట్లనుఁ బౌరుషంబునన్. 613

మూలబలంబుల రామమూర్తి దునుమాడుట.

ఉ. సేనలనెల్లఁగూడి కపిశేఖరుసేనలఁ జుట్టుముట్టి రా
ట్సూనుల కించుకేఁ దెలిపిచూపఁగరానియటుల్ దురంబు మీ
రూనినపౌరుషంబున మహోద్యమ మొప్ప నొనర్చి యిత్తఱిన్
దానవవంశగౌరవము ధాత్రిని నిల్పుఁ డటన్న వారొగిన్. 614

ఉ. రావణుశాసనంబును శిరంబులఁ దాల్చి సమస్తసైన్యముల్
దేవతలే భయంపడెడుతీరున నుండఁగఁ బోయి రేపునన్

భూవరుఁ డున్నచక్కటికి । భూమివడంకఁగఁ గీశనాయకుల్
చేవ చెడంగఁ బర్విడఁగ । శీఘ్రగతుల్ మెఱయంగ నంతటన్. 615

ఉ. చెంతవసించువానరులు । చేతుల వృక్షము లద్రిశృంగముల్
వింతగఁ బూని మార్కొనిరి । వేవురఁ జంపిరి చచ్చి రెందఱో
ధ్వాంతము పర్వవచ్చు రణ।దర్పుల వారలఁ గాంచి రామభూ
కాంతుఁడు మార్కొనం గడఁగి । కార్ముకశబ్దము పర్వఁ జేయుచున్. 616

మ. ఇదియా మూలబలంబు సాగరము నా । నిట్లొప్పి యేతెంచె దు
ర్మదు లిందుం గలయోధవీరులు మహా।మత్తద్విపేంద్రంబులం
బొదువం బట్టుకొనంగఁ జాలుదురు; తెం।పుం బూని యీసేనలం
బ్రదరంబుల్ పఱఁగించి త్రుంచెద నిదే । బాహాబలం బేర్పడన్. 617

ఆ. ఇంద్రజిత్తుతోడ । నీసేనలెల్లను, బెల్లుపోరి యలసి । యుల్లముల వి
కాసమింత లేక । యీసేనలం గాంచి, భయము చెందినట్లు । పటుత లేక. 618

ఉ. ఎట్టులొ పోర నూల్కొనిన । యేత్తెఱగల్గినయట్టులున్న వా
రిట్టియెడం బరాక్రమ ఘ।దీరిపుసేనలపైనఁ జూపకే
చట్టువలెం గనంబడుచు । సైన్యములం బురికొల్పఁ బాడియా
నెట్టు? లరాతిసైన్యముల । నిత్తఱి మార్కొని రూపుమాపెదన్. 619

మ. అని యూహించి ధనుర్నినాదమది క్రాం।తాశాంతమై యొప్ప బా
ణనికాయం బెపుడైన నిండఁదగు తూ।ణద్వంద్వ మంసద్వయం
బునఁ గానంబడ మూలసైన్యమని పెం।పుం గాంచు నద్దాని మా
ర్కొనియెం దా నొకరుండె మార్గము పయిం । గుప్పించు వ్యాఘ్రంబునాన్. 620

శా. పారావారమువోలు సైన్యమది ద్రుం।పంగా మరల్పంగ నె
వ్వారేఁ బూననియట్టు లొప్పుటను గ।ర్వం బెన్నరానట్లు దు
ర్వారంబై బహుళాంధకారమును బో।ర్వం జేయు దానిన్ మహా
వీరుం డా రఘునాయకుండు క్రుధచే । వీక్షించి తా మార్కొనెన్. 621

ఆ. పంక్తికంధరుండు । పంపఁ దదాజ్ఞను, రాముఁ జుట్టుకొనిరి । భీమగతుల
నెసఁగు మూలబల మ।దెంతో జయేచ్ఛచే, రాజమాత్రుఁ డితఁ డ।రాతి యనుచు.

చ. పరభటవార మిట్లు నలు।ప్రక్కలఁ దన్నపు డావరింప భూ
వరుఁ డెదనెంచి నన్నొకని।వచ్చినవానిగ నెన్ని క్రమ్మె నా
శరబల మిద్దియంచుఁ దన।స్వాంతమునం దలపోసి మార్గణో
త్కరములఁ బర్వఁ జేసెఁ దను।గాంచి యమర్త్యులు పొంగి యార్వఁగన్. 623

ఉ. అత్తఱి రామమూర్తి దను।జాధిపవీరభటాళికెల్ల రా
జోత్తము లెందఱో కవిసి । రొక్కమొగిన్ శరపంక్తివైచి మ

మ్ముత్తలపెట్టు వార లని యూహలు గల్గెడునట్టు లందఱం
దత్తఱమందఁ జేయుచు నితాంతపరాక్రమమూర్తి నాఁ దగెన్. 624

మ ఇదె రాముం డిటనున్న వాఁడు; నను నెంతే నొంచెఁ; దీవ్రంబులౌ
ప్రదరంబుల్ పరఁగించి పట్టుకొనఁగా రం డొక్కఁడే గావునన్
ద్రిదశుల్ పాఱఁగఁ బట్టుకొంచు దితిజశ్రేష్ఠుండు మెచ్చంగ స
మ్మద మొందం జెఱసాల నుంతమని యమ్మాడ్కిన్ రుషం బల్కుచున్. 625

చ. తనుఁగని యెల్ల రాక్షసులు దస్యు వొకండగు నన్నె మార్కొనెం
వెనుకొను సైన్యమెల్ల నొకవీరుని బట్టుట యేమిలెక్క యం
చును దలపోయ నెల్లరకుఁ జూడఁగ ముందఱ నున్న యట్ల తోఁ
చెను భటులెల్ల రిప్పగిదిఁ జిత్తములం దలపోసి రెంతయున్. 626

ఉ. అందఱికన్ని రూపులయి యారఘువీరుఁడు మార్గణంబులం
జిందఱవందఱౌచుఁ బ్రతిసేయఁగఁ దోఁపకయుండఁ జేయుచున్
మందమనీషుఁడై తనను మార్కొనఁ దానె ప్రయత్నమొందఁ జే
యందగునట్లొనర్చెఁ దనదౌ ఘనశక్తి చెలంగుచుండఁగన్. 627

చ ప్రతివీరుండును రాముఁ డీతఁ డిచటన్ బాణావళిన్ వైచె; ను
ద్ధతు నీవైరిని జంపఁగాఁదగు; నిదే దర్పంబుఁ జూపంగ రం;
డితనిన్ మార్కొనువాఁడ నంచు మది యందెంచంగఁ గన్పట్టె; జీ
వతతిన్ నిండినయాత్మశక్తిని బయల్వాఱంగఁ దాఁ జేసె నాన్. 628

తే సాంద్రమగు నంధకారంబు సమయ బాణ,వహ్ని దీప్తులు పరఁగంగ వారలందు
నొకని కొక్కఁడుగాఁ దోఁచె సకలవీరు,లట్లె తలఁచి పెనంగి రయ్యవసరమున.

చ. శిరములు భూమిపైఁబడఁగ సింధురముల్ తురగంబు లెల్ల భూ
ధరములమాడ్కి నిల్చి రణధర్మ మిదంచు నెఱుంగఁ జూపి స
త్వరగతి నూర్ధ్వలోకముల వాసము చేయఁగఁ బోవుచుండు న
క్కరణి శరీరశేషములఁ గ్రమ్మఱ వైచె బలీయనన్ సురల్. 630

తే. ఖేచరులు చూచి యిదియేమి క్రిందఁబడుచు
రామునిం బట్టుకొను డంచు రాక్షసు లొగిఁ
బల్కుచుం బోవువా రూర్ధ్వభాగములకు
గణనసేయఁగరాని యక్కరణి ననుచు. 631

తే. ఒకరికొక్కరు చెప్పుచునుండునంత, నింతయని లెక్కపెట్ట ననంతునకును
శక్యమేకాని యామూలసైన్యమెల్ల, నిరవశేషంబుగా ధరణి శయనించె. 632

ఉ. ఒక్కఁడెయయ్యు రాముఁడు మహోద్యమమొప్పఁగ రాము లెందఱో
నొక్కనినైన జీవయుతునుండఁగ నీయక చంపి రంచు నే

యిక్కనుజూచినన్ బలుకుకేఁ వినవయ్యెను; భూతరాజి కే
దిక్కననైనఁ బీన్గు లవి తెట్టెలుగట్టె ఖగాళి యుబ్బఁగన్. 633

ఉ. మారిమసంగినట్లు క్షణమాత్రమునన్ దనుజేంద్రుఁ డంపఁగాఁ
బోరికి వచ్చి మూలబలముల్ తుదముట్టనశించె నొక్కఁడే
వీరుఁడుగా మృతింగనక వీతభయుండయి నిల్చియున్న య
ట్లేరునుజూడఁ జాలరయి రేమివిచిత్రపుఁగర్మతంత్రమో? 634

ఉ. ఊరకయున్నఁ జంపుటకు నొక్కని కెన్నొ శతాబ్దులౌను దూ
ణీరములూని బాణముల నిబ్బర మొప్పఁగ వైచునిందఱన్
గోరి గణింపనింద అనికూడ వచింపఁగ శక్యమెట్టు; లే
వారికిఁగాని మూలబలవారము నొక్కఁడె చంపు టెట్టులో. 635

ఉ. వారలకర్మజాలమె యభంగురమృత్యువుగాఁగఁ దోఁచి యీ
శ్రీరఘురాముఁడే సమరసీమ వధించెను బూని యిందఱన్
వీరుఁ డనంగ నీతఁ డనువిస్తృతకీర్తిఁ జెలంగఁజేసె నం
చారయఁ దేలునట్టివిషయం; బిదె సమ్మత మార్యకోటికిన్. 636

చ. ఎవనికినైన మ్రోలనొకఁడే రఘురాముఁడు తోఁచి సంగరం
బవితథరీతిఁ జేయునటు లారయ నయ్యెడుఁ గానఁ గర్మమే
దివిజవిరోధి సేనలకుఁ దీవ్రరణంబున నొక్కసారి మృ
త్యువు కలిగింపఁబూనె ననితోఁచెడు వేఱొకఁ డొప్ప డియ్యెడన్. 637

సీ. ఈవార్తలంకలో నెల్లతావుల నిండె, దానవాంగన లెల్లఁ దమతమపతు
లను దలంచుచును రోదనముచేయఁగసాగి, రటవీర భటవార మంత మొంద
నిట విభర్తృకలయియింతులందఱు నేడ్వఁ, గాఁ జేసినది వారికర్మ; మనక
వేఱుకారణమును వివరింప శక్యమే, బ్రహ్మాదులకునైనఁ బ్రకృతిచర్య
తే. లిట్లువిలసిల్లుఁ; గర్మము నేము వదలి, నార; మయ్యది బాధింప నేరదింక
మమ్ము; ననియెడువారు కుమతులెయనఁగ, సందియంబుండ రాదుసుజ్జనుల కెపుడు.

క. ఇదె సంఘమరణ మనఁగా, విదితంబె యగుం బురాణవితతిని గన స
మ్మదమూరఁ జేరువారెం, దొదవున్ మృతి నచటికెల్ల రొక్కతలఁపునన్. 639

చ. మృతిగనువారలం దొకట నెద్దియొ కార్యముగల్గియున్న ప
ద్ధతిఁ దెలియంగఁజేయుచు నితాంతముదంబునఁ దేలుచుండు రా
వితమునఁనుండు వారలను వేడుక నేదియొ కార్యమూనఁ జే
సితగిన పాచితంబుగను జేకుఱఁజేయును గర్మమే మృతిన్. 640

తే. ఒక్కక్షణమునఁ జావంగ నొప్పుకర్మ, మెంద ఱొనరిచిరో వారలందుఁ జేరు
దురు; మఱొక్కరు వారిని బురికొలుపరు, కర్మమే కారణం బిట్టికార్యములకు.

క. ఇది యొక్కయుదాహరణం, బిదిచాలదె కర్మగతుల నెఱిఁగింపఁగ నే
నిదిచేయ ననుట కెవఁడైనఁ దగునె లోకప్రజంబునం బట్టుదలన్. 642

ఉ. ఆరయఁ గర్మతత్త్వమను నట్టిదెయా గహనంబు; చెప్పఁగా
నేరుతు మిట్టి దంచనుట నింద్యము; గర్వము తోడునీడఁగాఁ
జేరుటఁజేసి పల్కుదురు; చిత్తములం దెటుతోఁచు నట్టులే
దారియనంగఁ దోషమిరయి దానికిఁ గారణమంచు నెన్న నా. 643

తే. గర్వమూనుచు నిద్దియేకర్మ తత్త్వ, మని వచింపక సర్వేశుఁడగును గర్మ
రూపుఁడని నమ్మి తత్సేవనోపికఁ గొని, చేయఁజూపట్టు విజ్ఞానచిత్రపథము.

క. దానిని బరమార్థముగా, మానసమున నమ్మఁ జిత్తమద మడఁగెడు; న
ద్దానం గర్మఫలంబుల, గానందగునూహ తొలఁగఁగల దద్దానన్. 645

చ కనఁబడు రాజమార్గమది కర్మఫలంబుల నొందనీక ము
క్తిని గనఁబోవు త్రోవయిది దీనినిజక్కఁగ నాశ్రయింపుఁడీ
యని తెలుపంగఁజాలు; నదియారయ జ్ఞానపథంబునాఁగ నె
మ్మనము విరాగితం బొదలుమాడ్కిని జేయ సమర్థమైతగున్. 646

రావణుని రెండవయుద్ధము; లక్ష్మణమూర్ఛ.

ఉ. రాక్షసనాథుఁ డప్పుడవిరామముగా శ్రుతులందుఁ జొచ్చు ధూ
మ్రాక్షముఖాంగనామణులఁ దైనవిలాపరవంబు దుర్నిరీ
క్ష్యాక్షునిగా నొనర్పఁగ నహంకృతిమానియు నున్నయట్టు లా
త్ర్యక్షుఁడు తా లయంబున నహీనరుషం జెలఁరేగుచాడ్పునన్. 647

వ. యుద్ధంబుచేయ సన్నద్ధుండై మంత్రులరావించి ప్రయాణంబున కాజ్ఞాపించి
యంత. 648

సీ. ప్రళయకాలార్కబింబప్రక్రమంబున, భయదాకృతిఁ వక్త్రపటల మొప్ప
జగదోఘదహనకాంక్షాసమాదృతి మించ, నగ్నిచాడ్పున దృష్టులమరియుండ
కోపసంక్షుబ్ధాక్షిగోళయుగళ దుర్ని,రీక్ష్యార్కజుఁడు నాశరీరము తగ
నసమయాక్రాంత వేలాంబురాశిస్ఫూర్తి, భయదాట్టహాసంబు పరఁగుచుండ
తే. నశ్వతరములఁ బూన్చిన యరద మెక్కి, మంత్రివర్యులు గొలువంగ మానసీయ
చాపములుహస్తములయందు సందడింప, వెడలె రావణుఁడని సేయు వేడ్క మీఱ.

వ. ఇట్లు వెడలి వానరానీకంబుం గాంచి వారిమార్కొన సేనల కాజ్ఞాపింప వారే
చినకినుక నావనచరవీరుల మార్కొని ఘోరయుద్ధంబుచేయ సుగ్రీవాదులు చెల
రేఁగి మంత్రివర్యులఁ బొలియించి రంత రావణుండు రాము మార్కొనియె
నంత, 650

క. పౌలస్త్యుఁడు చాపంబులఁ, నోలిని లాగంగ నప్పుడొప్పిన నినదం
బాలించి భల్లవనచర,జాలము మూర్ఛిల్లెఁ గొంతసచ్చెఁ భీతిన్. 651

ఉ. రామునిముందు నిల్చి యసురప్రజనాథుఁడు రావణుండు సం
గ్రామము చేయఁబూను నెడ రామునితమ్ముఁడు లక్ష్మణుండు సు
స్థేమమునం జెలంగి స్వవశీకృతతీవ్రతరాస్త్రుఁడౌట నా
భీమపలాశనేంద్రుఁ గని వీతభయుండగుచుం జిగీషువై. 652

చ తలపడె; నంతలోన ధనదప్రియసోదరుఁడౌ దశాస్యుఁ డ
మ్ములజడివాన ముంచె రఘుభూపకులాభరణానుజన్ము; ని
స్తులశరపంక్తి నొంచె దనుజుం గడురోషముమీఱ లక్ష్మణుం;
డలయక పోరి రిద్దఱు సురావళి మెచ్చఁగఁ బెంపు హెచ్చఁగన్. 653

చ. ఇరువురు నొక్కరీతి శరవృష్టి వడిం గురిపించుచుం బర
స్పరజయకాంక్ష లొక్కమొగిఁ బర్వఁగ నస్త్రములంది వీనిచే
దురమున నీవిరోధివరుఁ ద్రుంపఁగవచ్చు నటంచు నెన్నుచుం
గరువము మీఱఁ బోరి రలకాలయమాకృతు లొప్పునట్లుగన్. 654

చ. అరి జతఁ గూర్చునస్త్రము లహార్యనినాదము మీఱఁ బోయి వే
మరలెడునస్త్రముల్ మఱియు మానక వింటిని గూర్చునస్త్రముల్
సురపథమెల్లఁ దీక్ష్ణరుచి శోభిలఁ జేయుచు రాఁగ వానికా
వరమడఁగించు నస్త్రములు వారక లెక్కడరాక యుండఁగన్. 655

మ. తనదివ్యాస్త్రము వ్యర్థమైపడఁగ దుర్దాంతాత్మతం రేఁగి చ
య్యన వేఱొక్కమహాస్త్రముం గొని ధనుర్జ్యావల్లికం గూర్చి చ
చ్చినవాఁడే యరి యింక నౌ ననుచు నక్షీణప్రతాపంబునం
మనుయోగంబుతగంగ వైవ నదియుం మధ్యప్రదేశంబునన్. 656

మ. పరిపంథిప్రహితాస్త్రదర్శనమునం బ్రధ్వంసితంబౌట వే
సర కద్దానిని మించునస్త్రమును వేసంధించి యిద్దాననే
మరణంబంచు వచించి వైవ నదియుం గోమధ్యాంబరంబందె దు
ర్మరణంబందినఁ జూచి ఖేద మణుమాత్రంబేని లేకుండఁగన్. 657

సీ. పునరస్త్రసంధానపూరితతుష్టులై, మఱియును దివ్యాస్త్రమండలంబు
వైవంగఁ బూనుచు వారిర్వు రొప్పంగఁ, గనుఁగొను ఖేచరగణము వింత
పడి చూచుచుం వారిపౌరుష మిట్టులో, ప్పునె యంచు మఱిమఱి పొగడి రంత
రామానుజుం జంప రావణుం డాతనిఁ, బొలియింప లక్ష్మణుం డలుక వెల్లి
తే. విరియఁ బెనువూన్కినుండి రాతరుణమందు, నుభయసేనలు పోరంగ నూలుకొనక
చూచుచుండెను బవమానసూనుఁడాది,యైనవీరాగ్రణులు నల్లియసమరియుండ.

వ. శ్రీరాముండు తమ్మునకుం దోడై యుద్ధంబు చేసె. విభీషణుండు రామాస్త్రంబుల ధనుస్సారథులు పొలిసిన నాగ్రహించు రావణుని రథ్యంబుల గదచేఁగూల్చె లక్ష్మణుం డనేకాస్త్రంబులంబరఁగించుచుండె నంత. 659

మ. దనుజేంద్రుండు నిజాస్త్రసంతతులు వ్యర్థంబైన గోపించి యా
తని నింకన్ బ్రదుకంగ నిచ్చిన దురంతంబైన తాపంబు గ
ల్గునటంచుం దలపోసి పూర్వ మరులం గూల్పన్ మయుం డీయ న
ర్చనలం గాంచుచుఁ బంపు లెప్పుడని కాంతుల్ మీఱఁ జెల్వారుచున్. 660

ఉ. వైరినిజాపు మిప్పుడె యవార్యబలంబునఁ ద్రుంచివైచెదన్
గోరిక యిద్దియే యనుచుఁ గోరెడు శక్తి గ్రహించి లక్ష్మణా!
ధారణినుండు వింక రణదర్పముఁ జూపుదుగాని యంచుగం
భీరరవంబునం బలికి విక్రమమేర్పడ వీచివైచినన్. 661

చ. అదియును వీతిహోత్రుని మహాస్త్రకీలములే యటంచు నెం
చఁదగిన రోచులన్ దెసలఁ జల్లుచు నుగ్రతరాకృతిన్ వెసం
గదియఁగ రాఁగఁ దమ్మునకుఁ గల్గుత భద్రములంచు రాఘవుం
డెదఁ దలఁపన్ విభీషణుఁ డహీనభయంబున వెచ్చనూర్చుచున్. 662

మ. కనుచుండన్ సురలంబరంబున నిఁకం గాలంబు దీఱెన్ సుమి
త్రను సంతోషము నందఁ జేయుటకు నీతం డింకఁ జాలం డటం
చు నితాంతార్తిని గుంద శక్తియది యాక్షోణీంద్రపుత్రానుజ
న్ము నురంబట్టి పగిల్చి కొంచుఁ బవమానున్ మించు వేగంబునన్. 663

మ. ధరణిం దూఱెఁ దదీయశక్తి యురమున్ దాఁకంగ నంగమ్ము లా
తురతం గాంచఁగ మోముకాంతి యపుడే దూరంబుగాఁ బోవ వా
నరులెల్లం గని యక్కటా! యనుచు సంతాపంబునన్ మున్గ భూ
వరుఁడున్ విస్మృతిగాంచ లక్ష్మణుఁడు మైవైచెన్ ధరన్ బండఁగన్. 664

మ. అనుజుం డివ్విధి మూర్ఛమున్గి శవమేయం చెన్ననౌ పద్ధతిం
గని భూమిం బడియుండ రాఘవుఁడు దుఃఖం బాపఁగా రామిఁ గ్రిం
చుని చందంబున నేడ్చె; వాయుసుతుఁడున్ సూర్యాత్మజుం డింక గ
ల్గిన కీశేంద్రచమూపతుల్ వగచి రీల్గెన్ లక్ష్మణుం డంచొగిన్. 665

క. తమ్ముని జూచుచు రాముం, డిమ్మహి నిట్టింద్రు గలరె యొందైనను; ద్ర
వ్యమ్మును భార్యను బంధుగ,ణమ్ముం బడయంగఁదగు నరన్ సహజంబే 666

క. సోదరుల నెవ్విధి నదే, మేదినిఁ గనవచ్చునెట్లు మేటిగుణాఢ్యున్
నాదగు మేలున కెంతయు, మోదముగను తమ్ము నెట్లు పొడఁగనువాఁడన్. 667

క. అనిపల్కి యేడ్చుచున్ జెం,తనునిల్చు సుషేణునిగని తమ్ముఁడు పోయెన్
గనఁబడుచున్నాఁ డరివరుఁ,డనఘా! యీవైరిఁ జంపి యరుదెంతుఁ జూడీ, 668

ఆ. అంతదాఁక వీని ననుజన్ము ననుఁబోలెఁ, గాచుచుండుఁ డనుచుఁ గార్ముకంబుఁ
దాల్చి పరుగువాఱె దానవేంద్రునిదాఁకి, నిల్వు మింక నెదుట నిర్జరారి!. 669

చ. యమపురిఁ గాంచ నేగుగతి నందఱుచూడఁగఁ జేయువాఁడ నీ
సమరమునందు రాఘవుని శక్తి సురల్ గనుచుండ్రుగాక! యం
చమరవిరోధిదుర్గుణము లన్నియుఁ దేటపడంగఁ జెప్పి గ
ర్వము నశియింపఁ జేసెదను బాణముఖంబున నిప్డు దానవా!. 670

క. అనిపలుకుచు దీవ్రాంబక,మున వానియురంబుఁ జీల్చి మూర్ఖా! నిలుమిం
కను రాముశక్తిఁ గాంతువు, దనుజులు పొగడంగ నొప్పు దర్పము పేర్మిన్.

మ. పరభార్యాహరణంబు పాపమనియే భావింపకే చేసిని
ర్భరమోదంబున విఱ్ఱవీఁగు నిను మద్బాణాగ్నిలో వేల్చెదన్
సురవర్యుల్ గని సంప్రమోదమొలయన్ జూడంగ నీశీర్షముల్
ధరణిం దొర్లఁగఁ జేసెదన్ నిమిషమాత్రంబె ననిన్ నిల్చినన్. 672

మ. అనుచున్ బాణము లెక్కుపెట్టి శ్రుతిపర్యంతంబు జ్యావల్లి రాఁ
గను లెంతే నరుణంబులై కనఁబడంగా వైవ రక్షోవిభుం
డనుమానించుచు భూరిచాపముల సజ్యంబుల్ శరాపూర్ణముల్
గను వేవే యొనరించుచున్ రఘుపతిం గాఱింపఁ గుప్పించినన్. 673

చ. ప్రతినిమిషంబునన్ దనుజపాలకుఁ జంపఁగఁ బ్రోత్సహించుభూ
సుతదగు వార్తనెమ్మదిని జొక్కఁగఁ జేయఁగ నాగ్రహంబు సం
తత మెదఁ దొందఱింప నిశితప్రతిపక్షవిదారణక్షమా
ప్రతిహత శస్త్రజాలములఁ బర్వఁగఁ జేయుచు నొంచె నాతనిన్. 674

ఉ. ఒక్కముహూర్తకాల మిటు లొక్కరికొక్కరు తీసిపోవకే
యెక్కువతక్కువల్ తెలియ నెవ్వరికేని తరంబుగానియ
ట్లొక్కతెఱంగునన్ జరగె యుద్ధము; రాఘవుఁ డంతఁ గ్రోధమే
యిక్కడ రామమూర్తి ధరియించె ననం గర ముగ్రుఁడై రిపున్. 675

చ. అని మొనఁ జంపనెంచి నిశితాశుగముల్ పరఁగించి వేగ స్యం
దనమును సారథిన్ హరుల దారుణరీతిఁ జెలంగునాధ్వజం
బును శకలంబులై ధరణిఁ బ్రుంగఁగఁ జేసి శరీరమంతయుం
గనుఁగొనఁ జాలనీవిధముగాఁ దగియుండ నొనర్చి యంతటన్. 676

చ. శర మరివోసి రావణుని సంయమనిం గనఁబంప నెంచు నా
దరమును బూను నంత నిఁకఁ దక్కువు ప్రాణములన్న యూహ లే
పొరయఁగఁ బాఱె రావణుఁడు భూరిబలుండయియున్ రఘూత్తముం
డరిజన కాలుఁడౌ ననుచు నాత్మకుఁ దోఁచిన కారణంబునన్. 677

క. దితిజేంద్రుఁ డిట్లు పాఱఁగ, క్షితిపతి సూనుండు దివ్యశితబాణము డిం
చి తరలి లక్ష్మణుఁ జూడఁగ, నతిజవమునఁ బోయె దుఃఖితాత్ముం డగుచున్ 678

చ చని యటఁ జచ్చినట్లు గనఁజాలిన లక్ష్మణు నార్తిపైకొనం
గనుఁగొని మూర్ఛమున్గి కపికాంతులు చేయుమహోపచారముల్
తను నొగి మేలుకొల్ప నెద దారుణతాపము ముంప వారితో
ననియె నిఁకేటి రాముఁడు తనంతనచచ్చు నికామవేదనన్. 679

చ అడవుల కేను రాఁగ నను నాదృతిఁగొల్చుచు నేగుదెంచె నె
య్యెడలను గాని యేమఱక యెల్లవిధంబుల నాదుసేనుమే
ర్పడఁ దనసేమమట్లు తగుపద్ధతి నెంచి మహోపచారముల్
విడువక చేయువాఁడు రణవీరుఁడు నన్నిట డించి పోయెఁగా 680

చ. పలుకఁగ నేమియున్న యది పల్వురు నాకొఱ కెన్నియాపదల్
గలిగిన సైఁచి యుద్ధమునఁగాఁ దమపెండ్లిగఁజూచి నాకుగాఁ
గలనునఁ బ్రాణముల్ వదలఁగాఁ దమకించెడువారు వారిచ
ర్యల జపమొప్పఁ జేయఁదగు నట్టిమహాత్ముల వీడిపోయెదన్. 681

చ. అనుజునితోడఁ బోవ కిలయందు మనం దలఁపండు రాఘవుం
డని నెఱనమ్మి పోవఁదగు నార్యశిఖామణులార! యింక నఁ
గని మసలంగ రాదు రఘుకాంతుఁడు లక్ష్మణు వెంటఁబోయినాఁ
డని తెలుపుండు సోదరున కాతఁడు కుందకయుండఁ జేయుఁడీ 682

చ. అరుగుఁడు మీపురంబులకు న్యాయము వృద్ధినిగాంచ దింక నె
త్తరుణమునందు నే ననుచు ధర్మము నే నెఱనమ్మి యిట్టు లా
తురులమె యైతి మంచు ననుదూఱుచు నిచ్చటనుండ నాశరో
త్కరములు చంపఁ జూచునని కంథినిదాఁటి జనంబు మీఱఁగన్. 683

క. స్మరియింపుఁడు రాఘవుఁ డిక్కరణిఁ మముఁగష్టపెట్టి కాలునిపురికిం
బరుగిడె ననుజనితో నని, తరుణంబున నందునందు దస్యునటంచున్. 684

చ. దనుజవరా! విభీషణ! నిశాంతము న న్నెద నమ్మి యగ్రజ
న్మని విడనాడియుండితివి మోసము చేసితి; నిన్ను నైన నా
యనుజునిఁ గానఁబోయి యిటు లర్థి నొసంగెను నాకు రాజ్యమో
యనఘ! యొసంగెదే యనిన నాతఁడు దోసంగు మఱొండు పల్కకే. 685

క, అరుగుము వేగమ యని యీకరణిఁ వెతఁగుంది పల్కఁగా రఘునాథుం
బరికించి యాసుషేణుఁడు, పరితాపం బింక నేల పార్థివవర్యా!. 686

ఉ. మోమునఁగల్గు లక్షణసమూహము లన్నియు జీవ మున్నయ
ట్లే మనకెల్లఁ దెల్పెడి నిదేస్మృతిదప్పినజాడ తోఁచెడుఁ

రామ! మఱొండుగాఁ దలఁపరాదు నిజం బిది ధైర్యమూనుమా
యీమరుదాత్మజుం డరిగి । యిప్పుడె తేఁదగు నోషధుల్ తగన్ 687

ఉ. ఆతఁడుతప్ప వేఱొకని । కయ్యది సాధ్యముగా దటంచు నా
చేతము తెల్పుచున్నయది । శీఘ్రమె పోఁదగు రాత్రి దాఁటఁగా
నే తెఱఁగైననుం ఫలము । నీయదు; పంపుము జాంబవంతుఁడే
యీతఱిమార్గముం దెలుపు నింకను గాలముపుచ్చరా దనన్. 688

చ. అనుజుఁడు చావలే దనెడు నానుడి యప్డు సుధారసంబునాఁ
జని శ్రుతియుగ్మముం జొరఁగఁ । జయ్యన లేచి సమీరనందనుం
గని బిగిఁగౌఁగిలించుకొని । కావుము నన్నిపు డార్తరక్షకుం
డను బిరుదంబు చేకొనుమ । యంజనముద్దుకుమార! నన్నిటన్. 689

ఉ. సోదరుప్రాణదానమున । నుర్విపయిం దిరుగంగఁ జేయుమా
సోదరుమించువాఁడవు మహోత్తమచిత్తుఁడ వాంజనేయ! పెం
పేది మృతిం గనందలఁచు నీననుఁ గావుము లక్ష్మణుండు నా
నాదగు ప్రాణమే యని మనంబున నీవు నెఱుంగుదే కదా!. 690

సీ. మున్ను దెచ్చినరీతి । సన్నుతిపాత్రమా, జ్యోతిర్లతావలి । నొకముహూర్త
మాత్రఁ గైకొనివచ్చి । క్ష్మామండలంబున, భూరిరజంబున । బ్రుంగియున్న
నాచిన్నితమ్ముని । ననుఁ గౌఁగిలింపఁగఁ, జేయుమా యనుచును । జేతు లొగ్గి
ప్రార్థించు శ్రీరాము నంఘ్రులకుం మ్రొక్కి, జాంబవంతుఁడు చెప్పు చందమునను
తే. బవనవేగంబునం బోయి । పర్వతమును, గాంచి ప్రార్థించి యాలతా కాండ మరసి
వానిఁ గానక శిఖర మవ్వానిఁ దాల్పు, నిదియె యని దానిఁ బెకలించె నేపు మీఱ.

క. కరతలమున శృంగముఁ దా, ధరియించి మహాజవమున । దాశరథి యదే
ధరనుండు నందు డించెను, మరుదాత్మజుఁ డంత వింత । మదిఁ బూని త్వరన్. 692

ఆ. ఓసుషేణ! వేగ । యుర్వీధరము నెక్కి, లతలఁగాంచి తెచ్చి । లక్ష్మణునిఁ స
జీవుఁ జేసి నన్ను । జీవింపఁ జేయుమా, యనిన శిఖర మెక్కి । యాతఁ డందు. 693

క. పరికించి గుఱుతుమీఱఁగఁ, బరమౌషధులను గ్రహించి । పద్ధతి మీఱం
గర మర్చించి పరిగ్రహ, పరతం బ్రాపించి భక్తిపరవశుఁ డగుచున్. 694

వ. సుమిత్రానందనుం దాఁకించి వాసనచూప నాయోషధులమహత్త్వంబున నెప్పటి
యట్ల నీరుజుండై లక్ష్మణుండు లేచి రాఘవునకు మ్రొక్కిన నానందబాష్పధారల
నాతనిందడిపి రాముం డానందసాంద్రమానసుం డయ్యె నంత. 695

## రామరావణులమహాసంగ్రామము.

చ. వనచరు లార్పుచుండ శ్రుతిపర్వమునం జొర రావణుండు శ
క్తిని హతుఁడైనలక్ష్మణుఁడు । తెప్పిఱిలంగను జాలె నేమొ యా

నినదము లట్టులే తెలుపు నీరజగర్భనియాంశయం బదే
మని గణుతించువాఁడ మృతుఁడయ్యును లేచుట చోద్యమౌఁగదా. 696

ఉ. ఇంక మనంగఁజాల ననియే మదిఁదోఁచెడుఁ గుంభకర్ణుఁడే
ణాంకునిఁ జెండువాఁ డనఁగ నర్హుఁడు వాఁ డని నీల్గె; రాముచే
నింక మహేంద్రునిం గెలిచి యెన్నియొ మాయల నేర్చిలోకమం
దంకమునందు గెల్పుఁగొనునట్టి కుమారుఁడు చచ్చె నేమనన్. 697

చ. నలువకునైన లెక్కిడ మనంబున నేఁ దలఁపంగరాని య
బ్బలములు మూలనామమున భాసిలునట్టివి రామమూర్తిచేఁ
గలనునఁ జంపఁగాఁబడియెఁ గ్రమ్మఱి రాఁ డొకఁడైన సంగర
స్థలముననుండి యేమనఁగఁజాలుదు నాదగుకర్మముం గటా!. 698

చ. దురమునఁ జచ్చి రిందఱని తోఁపదు లెక్కిడ నాకె; లంకయం
దరసిన నొక్కమానిసియు నైనఁ గనంబడఁ; డెట్టు లెక్కిడం?
గరము తలంచినం బ్రదుకుకాలము తీఱె నటంచుఁ దోఁచె; ని
ప్పురముననుండు భాగ్యమది పోయి విభీషణు నొందె నేమొకో?. 699

ఉ. చచ్చినవానరుల్ మరల శౌర్యముచూపఁగ వచ్చుటెట్లొ? నే
నిచ్చఁ దలంపఁదోఁప దొకయింతయు దేవునిమాయయేమొ నే
నిచ్చటనుండ రా దనుచు నెంచెనొ దైవ; మిఁకేమి చేయఁగా
వచ్చును; సంగరంబునను వైరి వధింపఁగఁ జచ్చుటే కదా!. 700

చ. బ్రదికియుఁ జచ్చినట్లుగనె భావనచేయఁగవచ్చు నన్ను; నే
నదయతఁ బంప సోదరుఁడు నాత్మజవర్యులు చచ్చి రెందఱో
మదిఁ గలతాపమాఱ గురుమార్గణముల్ పఱగించి శత్రువుం
జదుపుటయో యనింబడుటో సర్వవిధంబుల నొప్పు కార్యముల్. 701

చ తొలుతటి కార్యమే యిచటఁ దోఁచెడు సాగునటంచు నిప్పుడే
నలుకవహింప నేమిఫల మందఁగనౌ వరదాన మప్పుడా
జలరుహసూతి నే నడుగఁజాలక పోయితి; మర్త్యవాన రా
వళి మృతిఁ గాంచకుండ దయవర్ధిల నిమ్ము వరంబటంచు నేన్. 702

క. అడుగక కపిమానవులన్, విడిచితి లెక్కింపకుండ విలయం బిది యి
ప్పుడు సాగె వారివంకనె, తడఁబడఁ జేయంగఁదరమె దైవ మెవరికేన్. 703

చ. కలుగదు మృత్యు వింక ననగాఁ దర మెవ్వరికైనఁ గాదు; ని
స్తులమహిమంబునం బొలుచుజుమ్ము విధాత యనంగ; నాతఁడే
యలిగిన నూత్నసృష్టి తగునంచు నొనర్చును; గాన దైవమే
బలమని చెప్పవచ్చుఁ బలుభంగులుగాఁ దలపోసిచూచినన్. 704

చ. వరములఁ గాంచితిం దపము బల్మి; సురేశ్వరుఁ దక్కు దిగ్విభూ
త్కరమును బెక్కుసారులు నితాంతపరాక్రమ ముల్లసిల్ల సం
గరముల నోడఁగొట్టితిని గాని నరుల్ కపిభల్లుకంబు లి
త్తరుణమునందుఁ జంపి; రిఁకఁ దారుతలంచిరి నన్నుఁ జంపగన్. 705

చ. కలహము సేయుకోరికలు గ్రాలఁగఁ బోయితి రెండుసారు; లా
బలుమగఁ డేఁచె నన్నుఁ బటుబాణపరంపరలన్ నిగుడ్చి; దో
ర్బల మడుగంటె నిత్తఱిని గ్రమ్మఱఁబోయెదఁగాని ప్రాణముల్
నిలువఁగరాను లంకఁ గన నేఁటికిఁ దీఱె ఋణంబు దీనితోన్. 706

చ. మునుపె సనత్కుమారుఁ డిటు మోఱకుతీరున నిట్టికార్యముల్
పొనరుపఁ బుట్టు నీశ్వరుఁడు భూమిపయిన్ నినుఁజంప నంచుఁ జె
ప్పెనుగద! తత్ప్రకారమునఁ బ్రీతిగఁ జేసితిఁ బాపకార్యముల్;
పెనువెతఁగల్గఁ జేసితిని బృథ్విజనించినరామమూర్తికిన్. 707

చ. వదలుదు నెన్నఁ డీతనువు భారముగా నిటుతోఁచుదాని నం
చెదఁ దలపోసి యావిభుని యింతిని దెచ్చితి; మాతృభావనన్
మది నెఱుఁగంగఁ జాలెదు నమానుషశక్తి గలట్టిరాముఁ డీ
యది నను నుద్ధరించుటకె యేర్పడియున్నది దైవ మెంచుటన్. 708

చ. తనువిది వాయ దుఃఖసము వాయము మాయ నితాంతశర్మముం
గనఁదగుచోఁటి కేగెదను గాని మదర్థము పోరిచావఁగా
జని గనియున్న దైత్యులను జంపఁగఁ జేసి యనంతరంబె నే
నని యొనరింతు రామభువనాధిపు మార్కొని చావనెంచియే. 709

చ. పరిపరి యిట్టులెంచి తన పార్శ్వములందగు వీరరాక్షసో
త్కరమును గాంచి యీదిన మఖండపరాక్రమ మేనుఁజూపు నా
దరమును గాంచినాఁడ రణతత్త్వమెఱింగిన మీర లెల్లరున్
శరముల వైరినాశనము సల్పఁగఁ బూనిక రండు పొం డనన్. 710

ఉ. వారలు సజ్యకార్ముకులు బాణకృపాణముఖాయుధోత్కర
స్ఫారభుజుల్ పరాక్రమవిపాటితవైరులునాఁగ మున్నువి
స్తారయశంబు గన్నదితిజాతవరేణ్యులు నౌట వచ్చి; రా
వైరుల రూపుమాపెద మవార్యబలంబున నంచుఁ బల్కుచున్. 711

క. అరిగిరి లంకాపుర మా, తరుణంబున వారివైన తనువులఁ దానే
ధరియించి పోయినట్లుగ, నరుడుగఁ గన్పడియె శూరుఁడనలేమి నటన్. 712

మ. చతురంగంబులుగాఁ జెలంగుపృతనాసంఘంబు సంద్రంబు నా
నితరాభేద్యముగాఁ గనంబడుచు రా నిద్దాని నోర్వంగఁ గీ

శతతుల్ భల్లుకరాజి యర్హ్యముగునే జన్యం బిదెబ్బంగి నీ
త్రుటిపశ్రేష్ఠజయావహంబగునో వీక్షింపందగుం జక్కఁగన్. 713

చ. అని పురికొల్పుకొంచు నమరావళి నింగి వసించి చూడఁగా
వనచరవీరు లందఱును వాయుతనూజపురస్సరంబుగా
దనుజవరూథినిన్ నిలిపి దారుణసంగర మొప్పఁజేసి; రా
యని భయదంబుగాఁ దగియె నంతకుఁబూర్వము చూడకుండుటన్. 714

చ. జలధులు మారుకొన్నయటు శైలవరంబులు దాఁకునట్లు దో
ర్బలముల నుల్లసిల్లుకపివర్యులు రాక్షసు లొక్క రొక్కరుం
దలపడిపోరి, రందుఁ గపితల్లజు లేఁచి సురారివీరసే
నల నలయించి నిర్జరగణంబులు మెచ్చఁగఁ జంపి రేడ్తెఱన్. 715

మ. పరుగుల్ వాఱెడు నాత్మసైన్యముల నొంపన్ వెంబడిం బోవు వా
నరులం గాంచిన బెండ్లుమున్గినటు గుండెల్లం దేలియుండం గనం
బరమామోదము గాంచినట్లు తగియెన్ బాహాబలం బొప్ప సం
గరమబ్బంగి నొనర్చ ఖేచరులు తత్క్రవ్యాదులం గాంచుచున్. 716

ఉ. కొండలపిండునా నెగడు క్రూరసురారులఁ గోఁతిమూక లు
ద్దండపరాక్రమంబు తగ దండధరుం గనఁబంపు టారయన్
జండపరాక్రమం బది యసారమెయౌ సమయంబు వేఱుగా
నుండఁగ నంచుఁదోఁచెడు మహోత్తమశక్తి గలద్దికాలమే. 717

సీ. అనుచుఁ దలంచి రయ్యమరు లంతట నుంత, శేషంబుగాఁ దనసేన మడియఁ
గనుఁగొని రావణుం డనుమాన మంతఃక, రణమున నిలువంగరానియట్లు
తొలఁగించుచుం దనదోర్బలముం జూపఁ, గుతుక మింపొంద నాకోఁతులఁ గని
చాపముల్ పది దోర్దశకమునఁ గన్పట్టి, భూతాళిభయదమై పొల్చియుండ
ఆ. జ్యారవంబు లట్టి యాశావకాశంబుఁ, బగులఁ జేయ నిశితబాణములను
బరఁగఁజేసి వానిఁ బాఱఁదోలుచు రాము, నంతికమును జేరె నంత మొంద.

చ. అరదమునందుఁ బంక్తిగళుఁ డట్టె చెలంగుచునుంట రాముఁ డా
ధరణిని నిల్చి యుంట నది దారుణసంగరరంగమాట లో
నరసి రథోత్తమంబుఁ ద్రిదశాధిపుఁడంపెను నిశ్చయంబునన్
సురరిపునాథుఁ డింకఁ దనుఁ జూడఁగఁ జాలఁడటన్న యూహచేన్ 719

ఉ. మాతలి స్యందనోత్తమము క్ష్మాస్థలిఁ జేరఁగఁ దెచ్చి రాఘవా!
యీతఱిఁ గ్రింద నిల్వఁబడి యీదశకంఠునితోడఁ బోరుటల్
చేతమునందుఁ దృప్తిగనఁజేయమి నింద్రుఁడు పంపె నీరథం
బీతఱినే జయంబొసఁగ నెంతయుఁ జాలినదన్న నమ్మికన్. 720

మ. అనుచుం జేతులుమోడ్చి విన్నపము సేయన్ బ్రీతినాలించి నె
మ్మన ముత్సాహముఁగూర్ప నెక్కె రథ మమ్మాడ్కిన్ స్వకీయోద్యమం
బున కెంతో సహకారిగాఁగ రఘురాముం; డయ్యగస్త్యుం డొసం
గిన చాపంబుధరించి జ్యాలతిక నెక్కించెన్ సురల్ మెచ్చఁగన్. 721

చ. దనుజవరుండు రాఘవుఁడు దార్కొని పోరఁగఁ జూన ఖేచరుల్
మునివరులున్ జయం బొలయుఁ బో రఘువీరున కంచుఁగోరఁగా
సునిశితబాణజాలముల చొప్పునుతింపఁగ నౌ తెఱంగునన్
గనఁబడఁబోరి రిద్దఱును గాంతులు పొంగ భయంకరంబుగన్. 722

చ. ఇరువురబాణముల్ నడుమ నెంతయు ఘోరముగాఁగఁదాఁకి స
త్వరముగఁ జూర్ణరూపమున ధాత్రిపయిం బడుచుండెఁ దొల్తనే
పరుగిడుబాణ మవ్వలనుబంపిన బాణము నొక్కసారి నా
యిరువురఁ దాఁకుచుండె జవ మెన్నఁగరానివిధంబుగా ననిన్. 723

ఉ. కాండములిట్లు నింగిఁ దమకాంతులు నిండఁగఁ బాఱి వైరివా
కాండములల్లి వచ్చి తముఁగాఱియ పెట్టఁగఁ బోరిపోరి భూ
మండలమందు ధూళియయి మాటికిమాటికి రాలుచుండ రా
ముం డసురేశ్వరుండు జయముం గలిగించెడు నస్త్రజాలమున్. 724

సీ. పరఁగింప సాగి రప్పగిది వైచుచు నవి, తమకువైరులుగాఁగఁ దగినయస్త్ర
ముల నడంగఁగఁ జిత్తముల విస్మయంబందు, చుండి రత్తఱి రఘుమండనుండు
దశకంథరుఁడు మును తనబాణములకోడి, పరుగెత్తె నవ్విధిఁ బాఱిపోవ
కుండఁజేయందగు నూహాలుకల్గుటఁ, జెంతకుఁబోయి నీపింతపనులు
తే.సాగవిఁక నిల్వుమాయని చక్కఁబలికి, బాణమొక్కఁడు సంధించివైరియురము
బ్రద్దలుగఁ జేయ సోలినపగిది నాతఁ,డుండ సారథి రథము వేఱొండుకడకు.

క. తోలిన నంతట స్మృతిరాఁ,జాలఁగ దూషించి యతనిస్యందన మిట్లే
తోలుకొనిరాఁగఁ దగునే,యాలంబును విడిచి నవ్వరయ్యా! వైరుల్. 726

చ. అనితను హెచ్చరింప దనుజాధిపతిం గని మంచిమాటలం
దనదగుధర్మముం దెలిపి తానటుతెచ్చిన దింతయేని స
జ్జనతతిదూషణార్హ మనజాలనిదే యని విన్నవింప నా
తనిహిత మెంతయున్ మది ముదంబొనఁగూర్పఁగ మెచ్చి సారథిన్. 727

మ. చననిమ్మా రథ మెందు దాశరథి నాచాయంగనంగోరు వే
దిని కన్నన్ రయమొప్పఁ దోలె రథమాదిత్యాభ; మారాముఁడీ
దనుజుం జంపుట గొట్టులో యనుచు స్వాంతంబందు నూహింప దా
ని నెఱింగెన్ మది నాయగస్త్యుఁడను మౌనిశ్రేష్ఠుఁ డప్పట్టునన్ 728

చ. సమరముఁ జూచువేడుక యొసంగఁగ వచ్చినవాఁడు కాక కా
ర్యముమదిఁ దోఁపవచ్చిన మహాముని గావున రాముచిత్తప
ద్మమునన యంకురించిన విరోధంబది లోకహితంబటంచు సూ
క్ష్మమునను మోక్షమన్నయటు మంచియుపాయము చెప్పఁగోరికన్. 729

అగస్త్యముని యాదిత్యహృదయమును రామున కుపదేశించుట.

ఉ. రావణుఁ డేగుదెంచి సమరంబున కాయితమై భయంకరా
స్త్రావళి వైవఁ బూనుసమయంబున కించుకముందె రామునిన్
భావన చేయు మిట్టులని పద్ధతిదానిని జెప్పఁ జెంతకుం
బోవఁగ మ్రొక్కి రాముఁడును బూజ్యమతీ! యిటురాక యేటికో. 730

చ. అనుటయు నమ్మునీంద్రుఁడను నాశరవర్యునిఁ జంపఁజాలు న
వ్వనరుహమిత్రదైవతము వర్ణ్యమునౌ హృదయంబుఁ దెల్పెదన్
విను మది శత్రునాశనము వేగమ చేయసమర్థమై తగున్
మనమున సంస్మరింపుము సమస్తశుభంబులుగూడు దానిచేన్. 731

క. ఆదిత్యహృదయ మనఁగా,నాదివ్యస్తోత్ర మలరు నద్దాని జనుం
డౌదలఁ దాలిచి సూర్యుని,నాదిత్యు భజించి భక్తి యలరుచునుండన్. 732

చ. మనమున సూర్యమండలముమధ్యమభాగమునందు వెల్గునా
యనుపమమూర్తి నచ్యుతు నజాండవిభుం బరమేశ్వరుం గృపా
వననిధి ధ్యానయోగమున భావమునం బొడసూపఁ జేసి చ
క్కనివిధిఁ గొల్వఁగావలయుఁ గామములెల్ల ఫలింపఁ గోరుచున్. 733

క. అని యాదిత్యహృదయమును,గొనియాడుచుఁ దెల్పె దానిఁ గొదువఁ గననిరీ
తిని నుపదేశించె మహా,దనుజేంద్రుని జంపఁగోరి తగుశక్తి గనన్. 734

క. ఆరాముఁడు తద్ధృదయము,సారము నాలించి మానిసత్తముఁ డెలమిం
జేరి యుపదేశ మీయగ,వారిచి శుచిగ్యై జపించె భక్తిభరమునన్. 735

ఉ. దాననె దివ్యతేజము నితాంతబలంబును రాఁగ దుర్జయ
శ్రీ నెలకొన్నరీతి రఘుశేఖరుఁ డెంతయు వెల్గి రావణుం
గానఁగఁగోరుచుండె మునికార్యముతీఱఁగఁ బోయె నాశ్రమ
స్థానముఁ జేరి కృత్యములఁ జక్కఁగఁదీర్చె జగద్ధితార్థమై. 736

ఆదిత్యహృదయతత్త్వము.

మ. పరమేశుండగు రామచంద్రున కొగిన్ బాహాబలంబున్ బరో
త్కరనాశక్షమశౌర్యమున్ వెలయఁగా దా నిచ్చె; నమ్మానిభా
స్కరుఁగొల్వన్ హృదయంబుఁ దన్మహిమచేఁ గల్గెన్ బలస్థైర్యముల్
పరునిం జెండుపరాక్రమంబు ననఁగా బల్చోద్యమే యౌఁ గదా. 737

ఉ. దైవమె రామరూపమున ధాత్రినిబుట్టె ననంగ నట్టివాఁ
డావిధి భీతుఁడయ్యె ననుటూరయఁ జిత్రమెగాదె యంచుఁ బ్ర
శ్నావళి నింపు కోవిదుల యాశయమున్ మరలింపఁ గోరియే
యావరమౌని యచ్చటికి నాతఁడె వచ్చి వచించె దానినిన్. 738

సీ. ఆచారమని పెద్ద లాచరింతురొ దేని, నాచరింతురు; పిన్న లదియె మంచి
యాచారమని యిట్టు లనువదించెను వాసు, దేవుఁడే కావునఁ దీవ్రకష్ట
జాలముల్ తనుఁ గ్రమ్మ సాధుశరణ్యుఁడౌ, భగవంతు నాశ్రయింపంగ నవ్వి
తొలఁగు నన్ భావంబు గలుగఁగఁ జేయంగ, మంత్రతంత్రంబులు యంత్రములను
తే. సర్వజనులకు క్షేమంబు సతముగోరు, పూజ్యులరుదెంచి యుపమ చెప్పుదురిదిట్టు
లనుచుఁ దత్కర్మవశమున నమలచిత్తమున నుపాసింప సత్ఫలములు గలుగును.

చ. మునిపతియౌ నగస్త్యుఁ డని భూరిరిపున్ వధియించు టెట్టులో
యని మది నెంచు రాఘవున కత్తఱిఁ దోఁచి విపన్నివారణం
బున కనుకూలమై దినవిభుం గరఁగించు మహాస్తుతిం దనుం
గని యుపదేశమిమ్మనుచు క్ష్మాపతి గోరకయున్నఁ దానుగన్. 740

క. అరిగి యుపదేశ మిచ్చెను, సరసీరుహమిత్రుఁ గూర్పఁ జాలినహృదయం
బరిజనసంహరణక్షమ, మురుకష్టనివారకమను నూహ చెలంగన్. 741

ఉ. దానిని సంస్మరించె నృపతల్లజుఁ డాహృదయంబు దాని నే
మానవుఁడైన భక్తిరసమండితమానసమొప్పఁ భాస్కరున్
జ్ఞాననిధిన్ ద్రయీమయుని శాశ్వతతేజుని గొల్చినన్ గనం
గా నగు నిష్టసిద్ధి గురుకష్టములెల్లఁ దొలంగ నప్పుడే. 742

క. భానుని గొల్చినకతమున, గానందగుఁ దేజ మదియు గాదే రూపం
బౌ నిఖిలాంతర్యామికి, జ్ఞానదునకు సర్వలోకశరణదున కొగిన్. 743

క. ఆగురుతేజం బొదవిన, చోఁ గూల్పందగును మిగుల శూరుని వైరిన్
బోఁగొట్టవచ్చు నఘముల, భోగంబుల నొంద వచ్చుఁ బో సతతంబున్. 744

క. పామరులకు సూర్యునిమది, వేమాఱు స్మరింప సిద్ధి వెలయు నటంచున్
రాముని యాచరణమె యీ, భూమిం దగునంచు మౌని పోలఁ దలఁచియే. 745

ఆ. తెలిపె నంచు నెఱుఁగవలయును రామున, కన్యదేవతార్చనాదికమ్ము
లేల? యతఁడె కాఁడె యెల్లలోకములకుఁ, గారణం బతనికిఁ గారణమెది? 746

చ. తనకెపుడార్తిగల్గునటు తప్పక తోఁచునొ యప్డు సూర్యునిన్
వనరుహబాంధవున్ మదిని భక్తిని నిల్పి తదాకృతిం గనుం
గొనుచును ధ్యానయోగమునఁ గొల్చిన నాతనిదివ్యతేజ మా
తనువున నొప్పఁ జేయు రవి ధైర్యము దాననె కల్గఁజాలెడున్. 747

క. తనకెల్లదిశల రక్షకుఁ, డనఁగా సూర్యుండె యనుచు నన్వహము ముదం
బున భావింపందగు నని, మునియే యాదిత్యహృదయమున నెఱిఁగించెన్. 748

క. ఆపద్బాంధవుఁ డనఁగాఁ, జూపట్టును సూర్యరూపశోభితుఁడగు నా
శ్రీపతియే తద్భావన,యే పరమఫలప్రదం బదే పూజ్యంబౌ. 749

చ. మన మెపు డెంతో స్వచ్ఛమయి మానముఁ బాసి నయోత్తరంబుగాఁ
గనఁబడు నప్పుడే తగినకాల మిదౌనని యాచమించి యా
త్మను భగవంతునిల్పి సతతంబగుభక్తిని జూడఁగాఁ దగున్
మననము చేయుచున్ మహితమంత్రము సద్గురులబ్ధ మాదృతిన్. 750

ఉ స్నానముచేయఁగాఁదగుమనంబపుడే పరిశుద్ధమౌనటం
చూనినశ్రద్ధనెన్నుచు మహోత్తమకాలముఁ బుచ్చరాదుగా;
మానసశుద్ధియొక్కటియె మంత్రజపంబున కర్హ; మద్దిలే
దేని మహాబ్ధిఁగ్రుంకిన నదేమియుసత్ఫల మీయదెప్పుడున్. 751

క. ఎదికాలం బుత్తమ మె,య్యది యుత్తమజప మటన్న నెక్కాలమునన్
మది నిర్మలముగఁదగు న,య్యదె కాలము ధ్యానమె వరమగు జపమునకున్.

క. మనసునకు వెలుపలం దగు,నని చేయుసదాచరణము లనునవి శాస్త్రం
బునఁ జెప్పఁబడినవే య,య్యును ముఖ్యము లనఁగఁజెల్లునొకొ యొప్పగిదిన్.

చ. అవయవరాజి తృప్తిగనునట్టు లొనర్చునవెల్ల బాహ్యదృ
ష్టివిషయముల్ మహాత్ముఁ గనఁజెల్లవు మానసశుద్ధి యొక్కఁడే
ప్రవిమలపద్ధతిం దనరి భద్రదతేజుఁ బరాత్పరుం గనం
గ వరుస జ్ఞానమిచ్చునది గాదె సదాచరణంబు నాఁదగున్?. 754

సీ నదముల నదులను హ్రదముల సరసుల, స్నానముచేయుట సమయ మిదని
జపముచేయుట మనస్సంశుద్ధిఁ గూడిన,నే ఫలంబిచ్చును హెచ్చుగనది
యొదవకయే చేయనురుఫలం బీఁజాల,వని యెఱుంగందగు నదియె యొదవ
నొనరింప సత్ఫలంబొదవించు ననఁ జిత్ర,మగునెట్లు? శాస్త్ర మిట్లనువదించుఁ
తే. గాన రాముఁడు వడిఁ బోయిస్నానమాచ,రింపకయె వార్చి మదిని నిలింపవర్య
పూజితునిసూర్యరూపంబుఁబూనియున్న,పరముధ్యానించెబోధింపఁబామరులకు.

ఉ. దానినె శాస్త్రసిద్ధమని తద్దయునమ్ముచు నెప్డు శుద్ధమౌ
మానసమొప్పు నత్తఱినె మంత్రము ధ్యానయుతిం బొసంగఁగా
నూనినశ్రద్ధఁ జేయఁదగు నొప్పు నదే పరమార్థ మీయఁగాఁ
గాన మనస్సె ముఖ్యమనఁగాఁ దగియుండును వేయునేటికిన్. 756

చ. తనను బరాత్పరుండనుచు ధ్యానముచేసిన రామచంద్రునిం
గనఁ జనుదెంచి యేరికినిఁగన్పడ నట్టితనూవిలాసతన్

వనరుహబాంధవుం డనియె భావుకముల్ తగునింక నీకు; నీ
దనుజుని జంపవయ్య! నృపతల్లజరూపధరా! పరాత్పరా! 757

చ. సరసిజమిత్రుఁ డిప్పగిది సర్వహితంబుగఁ జెప్పి పోవ దా
శరథియు రావణాసురుని జంపఁగ వేచియెయుండెఁ గాల; మె
త్తరుణమునందు నాతనికి దారుణరూపఫలంబొసంగు నం
చరసెడు చిత్తమొప్ప దనయాత్మను సర్వమెఱుంగుఁ గావునన్. 758

సీ. సాధకుం డాత్మైకసంశుద్ధి తగియుండ, ధ్యానించునో యిష్టదైవము నెపు
డపుడె సాక్షాత్కారమనునుడి సార్థకంబుగఁ జేయ నొక్కరూపుఁ గొనితోఁచి
యతనియిష్టముఁ దీర్చు ననియెల్లరకుఁ దోఁపఁ, జేయఁగా రామునకాయనిరవి
భగవానుఁడే తోఁచిఫలసిద్ధి నీకగు, నని చెప్పిపోయె నంచరయఁ దగును;
తే. రాముచరితంబె మనకు శాస్త్రమయియుంటఁ
జక్కఁగ్రహియింపగాఁ దగుసద్విషయము
నంత రామునిసంకల్ప మదిఫలింపఁ
జేయుకర్మము పురికొల్పఁ జిత్తమలర. 759

చ. అసురవరుండు రావణుఁ డహార్యబలుం డని రామమూర్తిఁ ద
న్ను సమయఁ జేయఁగాఁ దగిననూతన రూపముఁ దాల్చియున్న దు
ష్టసమితి నాశకుండయిన చక్రధరుండని లో నెఱింగియున్
వెస నరుదెంచె యుద్ధమున విక్రమముంగనఁ జేసి చావఁగన్. 760

### రావణుఁడు శరీరమువదలుట.

క. తేరప్రదక్షిణముగ సురారియుఁ దోలంగఁ జేయ నడిగని రాముం
డారయుమా మాతలి యా, వైరిస్యందనము వచ్చు వైఖరి యిచటన్. 761

క. అపసవ్యముగా రిపురథ, మిపు డేతెంచెడిని జావనెంచినయటు తే
టపడం జేసెడు; నీయది, నిపుణత సవ్యముగ దీనినిం బోనిమ్మా. 762

చ. అనుటయు నింద్రసారథి సురారిరథంబునకుం బ్రదక్షిణం
బనఁ జనునట్లుతోలెఁ దనస్యందనవర్యము; నంత దానవేం
ద్రునియరదంబుమీఁదఁ గనఁ దోఁచెను గృధ్రము లప్రదక్షిణం
బనుగతిమీఱఁగాఁ దిరిగినట్టులు తోడనె వచ్చినట్లుగన్. 763

చ. మఱియును దుర్నిమిత్తములమండల మెంతయుఁ దోఁచుచుండెఁ దా
నెఱఁగియు వానినెన్న కసురేశ్వరుఁ డాహవదోహలంబునన్
గుఱుతుగ రాముస్యందనముఁ గూడఁగఁ దెచ్చె రథంబు; నంతలో
నెఱకలుగల్గు బాణములు నింగినిబర్వెడ సాగె వేడుకన్. 764

తే. రాముఁడిట్లనె మాతలీ! రాఘవుండొ, రావణుఁడొ నిల్చువారు ధరణిని నేఁడు
కనఁగ నిర్వురు మెలఁగుటకల్ల నాదు, శపథ మీయది చూడుమా సంగరమిఁక.

చ. అని తెగిపల్కి జ్యానినద మాశలనిండఁగ బాణవృష్టిచే
దనుజుని ముంప నాతఁడును దారుణమార్గణవృష్టిచేత రా
ముని గనఁజాలనట్లు పలువూనికఁ జేసెను; వారలిర్వురం
త నిశితదివ్యబాణములఁ దార్కొనఁజేయుచుఁ బోరి రా ననన్. 766

మ శరవృష్టిం గురియించి తృప్తిగని యస్త్రవ్రాతమున్ వైచు నా
దరముంబూనిరి దివ్యమంత్రయుతి నుద్దామప్రభావంబుఁ దీ
వ్రరయంబుం దగియుండు నస్త్రముల వైవన్బూని రయ్యస్త్రముల్
మరలింపం బడుచుండె నొండొరులచే మంత్రప్రభావంబులన్. 767

ఉ. అంతట రామమూర్తి ప్రళయాంతకురీతిని మండి ధర్మకా
ర్యాంతకు రావణాసురుని నంతకుఁజెంతకుఁ బంపుకోర్కి య
త్యంతము రేఁగ వజ్రసమధారల నొప్పెడుసాయకంబునన్
వింతగఁ ద్రుంచె లోకములు వేడుకఁజూడఁగ వైరిశీర్షమున్. 768

చ. శిరమది భూమిపైఁ బడఁగ శీర్షము వేఱొకఁ డద్భుతంబుగాఁ
బరఁగె యథాప్రకారముగ బాణములన్ వెస ద్రుంచె దాని; న
వ్వరుసనె శీర్షముల్ వెలయ బాణహతిం బడఁజూచువారి క
చ్చెరు వొదవింపఁజాలె; నది చెప్పఁగ నేరి కశక్య మౌనటుల్. 769

క. తల లవి మొలుచుట రాలుట, తలఁపఁగ నూటొక్కసార్లు తద్యుద్ధమహీ
స్థలిసాగె నేడుదినములు, కలుగదు విశ్రాంతి యొక్కక్షణ మయ్యెడలన్. 770

చ. కనుఁగొను దేవతావళికి కల్గెను నిస్పృహ; రామమూర్తినె
మ్మనమునఁ గల్గకున్నె? యది మ్రాన్పడఁజాలె నతండు; నంత దే
వనిచయ పాలకుండయిన వాసవు సారథి రాముతోడ ని
ట్లనియె మహాత్మ! పామరులయట్లు తలంచెద వేల యిత్తఱిన్? 771

క. దేవతలు వీనికంతము, భావించినకాల మిదిగో వచ్చెడు వీనిన్
దేవహితార్థము ద్రుంపుము, పావనతమమైన యట్టి బ్రహ్మాస్త్రమునన్. 772

చ. అని స్మృతిగల్గఁజేయ విని యారఘువర్యుఁ డగస్త్యమౌని యి
చ్చినమహనీయసాధనముఁ జెందినవేడుక నంది నారిఁగూ
ర్చె; నదియె సూర్యవంశ్యనృపశేఖరసంతతి కెల్లఁ బ్రాణమై
తనరు; నికామపూజల సుతంబును దృష్టిని గాంచి యొప్పెడున్. 773

చ. సరసిజమిత్రవంశమున సంభవమందిన వారికెల్ల నా
నిరుపమశక్తిమంతమగు నీరజసంభవు నస్త్రవర్య మె
త్తరుణమునందు వశ్యమయి దారుణయుద్ధములన్ శరణ్యమై
స్థిరజయ మిచ్చు భక్తగణశేఖరులై తగియుంద్రు వారలున్. 774

క. అది వంశపరంపరగా, సదయత విజయంబుగూర్పఁజాలుచు నుండున్
విదితమది రామమూర్తికిఁ, బ్రదరం బద్దానిఁగూర్చెఁ బ్రత్యర్థితెగన్ 775

చ. మనమున బ్రహ్మదైవతము మంత్రముఁ జక్క స్మరించి యస్త్రమం
దు నిలిచి వైరిఁజంపఁగ మునుల్ త్రిదశుల్ పరిపూర్ణమోదముం
గనుదురుగాన లోకహితకర్మము దీని నొనర్పుమంచుఁ బ్రా
ర్థనఁ దమిఁజేసి వైచె; నది గ్రక్కునఁమంటలు మింట నంటఁగన్. 776

చ. త్వరఁజని రావణాసురునివక్షముఁ జొచ్చి పగుల్చి ప్రాణముల్
నిరతిశయప్రమోదమున నిష్ఠురశక్తిని బీల్చి తద్వపుః
పరిణతరక్తసిక్తమయి బల్విడి వీఁపుననుండి భూమిలోఁ
జొరఁబడి కొంత శాంతిగని చొచ్చెను దూణముఁ బూర్వమట్లుగన్. 777

చ సురరిపునాథుఁ డిప్పగిది క్షోణిఁబడంగని సిద్ధచారణుల్
గరుడులు దేవతల్ మఱియుఁగల్గినసాధువులెల్ల రామునిన్
బరినుతిచేసి; రిట్టిబలవంతుని రాక్షసరాజుఁ జంపి యీ
ధరణిని శాశ్వతంబుగను ధర్మమునిల్పితి వోరఘూత్తమా! 778

చ. క్షితిపతినామమాత్రుఁడవె శ్రీపతి వీవె మహాత్మకా! జగ
ద్ధితమునుగోరి మర్త్య తను విష్మెయిఁ దాల్చితి వచ్యుతా! భవ
త్సతి నిటుదెచ్చినట్టి సురశత్రువు పుత్రహితాళితోడ నీ
క్షితిఁబడియెన్ బతివ్రతలచిత్తము లార్తిని బొందఁ జేయుటన్. 779

చ. అనివినుతించి; రంత దనుజాధిపుఁ డుర్వర నిర్గతాసువై
తనువును వైచియుండఁ గని తద్దయుదుఃఖమునన్ విభీషణుం
డనుజుఁడ వచ్చినాఁడ నను నాదృతిఁ గౌఁగిటఁజేర్పు మంచు నే
డ్చెను; రఘురామలక్ష్మణులు చేరి వచించిరి దుఃఖ మార్పగన్. 780

క. జ్ఞానియె గాన విభీషణుఁ, డానిర్జరవైరి కప్పుడగ్ని నిడంగా
నొనని మిత్రులు తెల్పఁగఁ,దానప్పుడు లంక కేగెఁ దత్సుతులఁ గనన్. 781

చ. అరిగినయంత లంకఁ గలయాతనిభార్యలు తత్సుతాంగనల్
ధరఁబడి యంగలార్పఁగ హితంబుగ వారల నూఱడించి చె
చ్చెర వనితాకదంబయుతిఁ జేరి యథావిధి నగ్ని నిచ్చె భూ
వరుఁ డటనుండియే విధులపద్ధతి దప్పకయుండఁ జేయఁగన్. 782

తే. ఆజ్ఞచేసెను; శ్రీరాము నమలధర్మ, బుద్ధి నెంతయుఁగొనియాడి పౌలఁతులెల్ల
నతని భగవంతుగా నెంచి రాత్మలందుఁ,బరమపురుషునిఁ జూడఁగోపమదియున్నె.

సీ. లంక కేగిరి రాజలక్షణంబులతోడ,నాచారమార్గమ్ము ననుసరించి
మందోదరీముఖమానినీమణు లంత,నౌర్ధ్వదైహికములు నసురవంశ

మర్యాద నించుక మానని యట్లుగా, సాగించె నవ్విభీషణుఁడు; పిదప
రాము చెంతకు వచ్చి నేమము మీఱఁగా, విన్నవించెను గార్యవితతి; నంత.
తే. నింద్రసారథి మాతలి హితము మీఱ, గారవించిన నతఁడును శ్రీరఘువరు
నాజ్ఞఁ గైకొని రథయుక్తుఁడై సురేంద్రు, నంతికముఁ జేరఁబోయెను వింతగనుచు.

## రావణశిరస్తత్త్వము.

చ. జనపతి బాణపాతమునఁ జయ్యన శీర్షము భూమిపైఁ బడం
గనె మునుపున్న యట్లుగనె క్రమ్మఱ శీర్షము నిల్వఁ గారణం
బును దెలియంగ నౌఁగద విభూతులు దేవవరంబులం గనం
జను నని విన్నవార మది సత్యము కాదొ యనంగఁ జెల్లునే. 785

తే. దేవతారాధనం బది పావనంబు, కామ్యఫలముల నెల్లను గలుగఁ జేయు
నవ్యయానంద మిచ్చు నట్లగుట నెద్ది, సాధకుఁడు కోరి సన్మంత్ర జపము చేయు.

క. అది ఫలియించును జక్కఁగ, గుదిరినచో జపము; విఘ్నకూటహతంబై
తుదిగాంచకున్న సత్ఫల, మొదవదు గద? దానవేంద్రుఁ డూహాదలిర్పన్. 787

సీ. క్షుద్రదేవత మదిఁ జొన్పి యుపాసించి, యేమి కావలెనంచు నెదుటఁ దోఁచి
యడుగ శత్రువ్రాత మని మొన నను జంపఁ, బూని నా దౌ శీర్షమును శరములఁ
జెండిన నది తెగి క్షితిఁ బడునంతలోఁ, బూర్వమున్నట్టులే పొలిచి శిరము
క్రొత్తదియే యనఁ గూడనియట్లుగా, నమరియుండం దగు నదియె వరము
తే. కరుణ నిమ్మని వేఁడంగఁ గలుగు నల్లె, నాదు వరదానమున నని నమ్మఁ బలికి
చనియె; నా దేవతా కృపఁ దనరుచుండు, నవియు నని యెంచ నౌ భక్తులవితథముగ.

వ. ఇయ్యది ఘుటికాంజన పాదుకాది సిద్ధులం బోలినది యని యాగమంబులు ఘోషించు. ఇది యత్యల్ప సిద్ధియే యగుం గాని యణిమాదిసిద్ధులం బోలి యుండదు. ఈ వరము లిచ్చు దేవతలు యక్షిణీగణంబులం బరిగణింపఁబడుదురు. బ్రహ్మాస్త్రం బవ్విధంబెఱింగి శిరముం గూల్పక వక్షము భేదించి ప్రాణంబులం బాపెనని తెలియందగు. 789

## విభీషణపట్టాభిషేకమహోత్సవము.

ఆ. ఔర్ధ్వదైహికంబు లన్నియు ముగియఁగా, హనుమదాదు లెల్ల రాశయముల
దెలుపఁ బూనియుండఁ దెలిసిన శ్రీరాముఁ, డనుజుఁ బిలిచి యిట్టు లనియె నపుడు.

క. పరమోపకారి, బంధూ, త్కరమున నగ్ర్యుండు, భక్త తతి నాద్యుండై
పరఁగు విభీషణు నిపుడా, శరరాజ్యాధీశుఁ జేయఁ జనుఁ గద సహజా! 791

చ. పురమున కేగి సాధుదితి పుత్ర సమూహముఁ గూడి యీ కపీ
శ్వరముఖు లెల్లఁ బాల్గొనఁగ శాస్త్రవిధానము నూని సద్గుణా

కరుఁడగు నవ్విభీషణుని గ్రక్కున నాశరరాజ్యనాథుగాఁ
బరమముదంబు నొందఁగల పద్ధతిగా నభిషిక్తుఁ జేయుమా. 792

చ. అని యొఱఁగింప లక్ష్మణుఁడు నర్కతనూభవముఖ్యులున్ ముదం
బునఁ జని యాసువార్త దితిపుత్త్రవరేణ్యుల కెల్లఁ జెప్పి వా
రనుమతినీయ గొప్పసభయందు విభీషణు ధర్మనిర్మితా
సనమున నిల్పి శాస్త్రవిధి సాగరముఖ్యపవిత్రనీరమున్. 793

క. కపివరు లాశరులు నొగిం, దపనీయమనోజ్ఞరత్నతతి నిర్మితపా
త్త్రపటలమునఁ గొని రాఁగాఁ, దపనాన్వయభూషణుఁడు ముదం బిగురొత్తన్.

సీ. అభిషేక మొనరించె నవ్వేలఁ బెద్దలు, శాస్త్రమార్గమ్మును జక్కనెఱఁగి
నట్టిప్రోడలుగాన నభిషేక మొనరించి, రంత లంకాపురమందుఁ గలుగు
పిన్న పెద్దలు చాలఁ బ్రీతిఁగాంచిరి; విభీ,షణుఁడు నాథుఁడుగాఁగ సకలదితిజు
లానందసాంద్రులై; రంతట శ్రీరాముఁ, డా కార్యమాలించి యధికతృప్తి
తే. నంది పవమానసూనుని నపుడు పిలిచి, సీతకడ కేగి విజయంబుఁ జెప్పి నేనె
రావణుని జంపితిననియు రావణి ననిఁ, జంపె లక్ష్మణుఁడనియును జక్కఁ దెలిపి.

చ. జనకకుమారి యేమనునొ సాధ్వియభీష్టము నాలకించి ర
మ్మనుటయు సంతసంబలర నప్పుడపోయి రఘూత్తమాశయం
బును వచియించె; జానకియుఁ బూర్ణమనోరథసిద్ధియౌట నె
మ్మనమున నిల్వకే యుబుక మైకొనుసంతస మాపఁజాలమిన్. 796

చ. పలుకఁగఁ జాల కశ్మమటు భామినియుండఁగ నమ్మరో ముదం
బలరఁగ నుత్తరం బిడక యంబరముం గనుటేలొకో యనన్
జలరుహనేత్ర! యిట్లనియె సాధుమనీష! భరింపరాకయే
వెలువడనున్న సంతసము వెల్లిని జొచ్చితి నేమి చెప్పుదున్. 797

ఉ. ఇంతకుమించు ప్రీతి నెటులే నిడఁజాలినవార్త యుండునే
యెంతతలంచి చూచిన నభీష్ట మిదేగద! నాదుకష్టముల్
వింతలె? నీవుఁ జూచితివి వేయివిధంబుల మున్నె యిప్డు నా
కాంతుజయంబుఁ దెల్పి కుతుకంబును నింపితి వీమదాత్మలోన్. 798

ఉ. ఏమని యుత్తరం బిడుదు నిష్ఠనియే తలపోయుదాన నా
భీమమహాసురుండు పృథివీస్థలిఁ ద్రెళ్లె సపుత్త్రమిత్త్రుఁడై;
రామజయంబు లోకములరమ్యగతిం జరియించు నింక నా
శ్రీమహితుం గనుంగొనుట చేకుఱునొ మఱి యేమి చెప్పుదున్. 799

ఉ. నీవలె మాటలాడఁగల నేర్పఱియుండఁడు; భక్తలోకసం
భావితకీర్తివై జగతి భాస్కరశీతమయూఖు లుందురో

యావిధిపంపు చేయుటకు । నాదృతి మీఱఁగ నెంతకాలమీ
వావిధి సాధుకీర్తితగ । నార్యనుతింగనుచుండుమా తగన్. 800

చ. అని తనభావముం దెలిపి । యాశిషముల్ తమి నీయ నంతటం
బనివిని వచ్చి పావని య।పారముదంబున విన్నవించె నా
జననివచించినట్టి స్మృతి।సమ్మతవార్తలి; రాఘవుండునుం
విని ముదమందె; నంతట వి।భీషణుఁ డారఘునాథునాజ్ఞ చేన్ 801

సీత శ్రీరామునిం జూచుట

చ. పురమునకేగి చింతవిడి । పొంగెడుజానకిఁ గాంచి రామభూ
వరుని మహాశయంబుఁ దగు।భంగిని దెల్పి తదాజ్ఞచే మనో
హరముగ సత్కరింపఁదగు।నంచు వధూమణి కాజ్ఞచేయ నా
తరుణియు మజ్జనాదికవి।ధానములం గయిచేసె నేర్పునన్. 802

సీ. పరమభూషణముల । భాసిల్లఁగాఁ జేసి, స్యందనోత్తమమునఁ । జానలెల్లఁ
గొలువంగ నెక్కించి । కొనివచ్చె నవ్విభీ,షణుఁ డంత సంగర।స్థలమునందు
భాసిల్లు శ్రీరామ।భద్రుని బరిపూర్ణ,శీతాంశుఁ డేయనఁ । జెలఁగువానిఁ
బదిమాసములకుఁబూ।ర్వము బాహ్యదృష్టిచేఁ, గనినట్టివాని శ్రీ।కరుని శ్రీశుఁ
ఆ. దనకభిన్నతత్త్వ । మనజెల్లునాథునిఁ, గఱవుదీఱ నపుడు।కాంచి ప్రమద
వార్ధిమున్గి చక్క।భాషింపనేరక, చూచుచుండె రామ।శుభతనువును 803

శ్రీరాముఁడు సీతను బరీక్షించుట

ఉ. రాముఁడు భూమిజాహృదయ।రప్యతరాశయ మాత్మనెంచి య
ట్లామె తలంచు టెన్న హిత।మా జనసంతతి కంచునెంచి యా
భూమిసుతం గనుంగొనుచుఁ । బొంగుచు రమ్మని చేరఁ బిల్వకే
మేమొ వచింపఁబూనెఁ దన।యింగిత మెవ్వరెఱుంగనట్లుగన్. 804

క. లోకాపవాదమున నేఁ, బోకార్పంబూని కీశ।పుంగవభల్లా
నీకముల సాయముం గొని, యీకడలిం దాఁటివచ్చి । యెల్లదనుజులన్. 805

చ. హతమొనరించినాఁడ; దితి।జాధిపు రావణు సంగరంబునం
క్షితిఁబడఁజేసినాడ; ననుఁ।జెందిననిందను బాపుకొంట కీ
జతనమువూనినాఁడ; సుర।సత్తములెల్లరు గాంచశత్రుసం
తతి ననిఁజెండి నాదయిన।దర్పము నేర్పడఁజేసితిం జుమీ!. 806

చ తనసతిబల్మిఁ గైకొనిన।దానవుఁ జంపక యూరకున్న వాఁ
డినకులజాతుఁడయ్యు నని । యెల్లరుపల్కుదు రన్న సాధ్వసం
బున జననిందకుం భయముఁ । బూనఁగనౌ ననుధర్మశాస్త్రముం
గని యిటుసంగరంబున ని।కామదురాత్ముల వైరినాథులన్. 807

చ. దురమున సంహరించి కడుఽదోర్బల ముల్లసిలంగఁ జేసితిన్
ధరణి మదీయపౌరుషము ఽ తద్దయునిండె; నిదే ప్రయత్న మి
త్తరుణమునందుఁ జేయుటకుఁ ఽ దన్వి! మదాశయమంచు నీవునున్
స్థిరమతినమ్ముమీ జయముఽచేకుఱె నాకిటు సంగరంబునన్. 808

ఉ. ఇంత ప్రసంగమేల యనిఽయింతి తలంతువొ యేమొ? వైరులం
బంతము మీఱఁ జంపఁగను ఽ బట్టిననాదు ప్రతిజ్ఞఁదీర్పఁగా
నింతటి యత్న మీయనికి ఽ నేనొనరించితిఁ; జెల్లెనద్ది; నా
వంతతొలంగె; నిన్నుఁగొన ఽ నాత్మఁదలంపనుజుమ్ము జానకీ!. 809

ఉ. కామవికారమత్తుఁడగు ఽ క్రవ్యభుగీశ్వరుఁ డెంతొ ప్రీతిమైఁ
గామిని బల్మి నెత్తుకొని ఽ కామగతిం జనిలంక నుంచె నా
భూమికుమారికన్ మరలఁ ఽ బూర్వమురీతి గ్రహించె నక్కటా!
రాముఁడె కాముకుండ నెదుఽరట్టు దొలంగఁగ నుండ నెంచితిన్. 810

చ. నరపతి చేయునట్లుగ జఽన వ్రజమంతయుఁ జేయుధర్మమున్
బరులకుఁ దా నుదాహరణఽభంగిఁ జెలంగఁగనర్హుఁడైన భూ
వరుఁడె యధర్మమార్గమున ఽ వర్తిల లోక మడంగకుండునే
తరుణిరొ! కాన నిన్వదలి ఽ ధర్మము నిల్పఁగ నేఁ దలంచితిన్. 811

చ. ఇతరునియింటనున్న మదిఽ రేక్షణ నొండొకరీతిఁ జూతు రే
వితమున గౌరవింప రొకఽవేడుకకైనను; లోకధర్మ మి
ట్లతివరొ! యున్న దిట్లగుట ఽ నాగసి నావలనన్ జగంబునం
దితరుల కెట్టిలోపము లఽవేగతి రాఁదగ వంచునెంచెదన్. 812

చ. మనమున కెట్లుతోఁచునొ సఽమస్తవిధంబుల నట్లెవర్తిలం
జనుఁగద! నీవు నవ్విధిని ఽ స్వాంతమునం దెదియుక్తమంచుఁ దోఁ
చునొ యట నిల్వవచ్చు; ననుఽజూడకయుండినఁ జాలు; నీకునా
కునుగలబాంధవంబు తుదఽకున్ ఫలియించె నిదేవిధంబునన్. 813

క. చనుమింక నీకు నిల్వం, గ నెందుయుక్తం బటంచుఁ ఽ గాంతా! తోఁచున్
మనమలర నుండు; నన్నుం, గనునాశన్ మానియుండఽగాఁ దగుఁజుమ్మీ. 814

చ. పరుషముగా నధర్మముగఁ ఽ బల్కిన రామునిభాషణంబు లా
సరసిజనేత్ర శ్రోత్రములఽజాలఁ దపింపఁగఁజేసె; నంత భూ
వరుని వచఃపవిప్రహతి ఽ బ్రద్దలువాఱఁగఁ జిత్తముల్ హరీ
శ్వరు లివియేటి మాటలని ఽ చాలఁదపించుచునుండి రార్తులై. 815

సీత సదుత్తరములిచ్చి యగ్నిఁ బ్రవేశించుట.

చ. నిముసము పల్కకుండి యలఽనీరదవేణి రఘూద్వహున్ భయం
బమరఁగఁ గాంచి న్యాయమున ఽ కర్హములౌనటు వాక్కులొప్ప వ

జ్రము ధరణీంద్రముంబలె విశాలమనంబును నీలుచేయఁగా
క్షమ నయనాంబుధారల నిశామము ముంచుచుఁ బల్కె నివ్విధిన్. 816

చ. మనుజవరేణ్య! యీనుడుల మామకచిత్తము నిట్లలంచెదే
యనఁదగునయ్య! యిట్లు నను నాఁడిపుచ్చుట ధర్మమయ్య! నా
మన సెటులుండు నంచు నొకమాఱయినం దలపోయ కిందఱుం
వినఁ గఠినంపుఁబల్కులను భీతిలఁజేయుదె నీవె యెన్నుమా. 817

సీ. ప్రాకృతపురుషుండు ప్రాకృతస్త్రీ నెట్లు, పలుకునో యట్టివౌపలుకుల ననుఁ
బలుకుట న్యాయ్యమా? లలనలు కొందఱు, దుష్టంబులైన యాచారములను
దూషితలే యగుదురు వారివలె నన్నుఁ, దలఁపఁగఁదగునయ్య ధర్మవిదుఁడ!
వయ్య నానైజంబు నాత్మ నెఱింగియు, నలుగురువిన నిట్లుపలికె నాదు
తే. శీలమదిదూష్యమానట్లుచేయఁదగునె, రక్కసునియింటనున్న మాత్రమున నాదు
చరిత మెవ్విధి దూష్యమా సకలసురలు, తెలియఁజాలరొకో నాదుధీప్రవృత్తి.

వ. అని యనేకప్రకారంబులం బలికి యంతకంతకు సుప్పొంగు దుఃఖబాష్పంబుల నాపుకొనంజాలక లక్ష్మణునింగాంచి యిట్లనియె. 819

చ. వినుతచరిత్ర! లక్ష్మణ! వివేకధనుండగు రాముఁ డివ్విధం
బునఁ బలుకంగ నే వినియు భూస్థలి జీవముల్ భరించియుం
డను జనదంచుఁ దోఁచెడు మనంబునఁ గావునఁ బ్రాచితంబుగా
ననలునియందుఁ జొచ్చి తనువల్లనఁ బాయుదుఁ బేర్పుమా చితిన్. 820

చ పతి విడనాడినంతఁ దగుపాచిత మీయదె యంచుఁదోఁచె నే
యతివయుఁ బృథ్విపై బ్రదుకునాశను గాంచఁగరాదు భర్తృసం
గతి విడినంత; నట్లగుటఁ గాంతునకుం బ్రియమైనయట్టి ప
ద్ధతి యిది తప్ప వేఱొకఁ డుదారపథంబెది లేదుగావునన్. 821

మ. చితిఁ బేర్పింపుము; దానియందు దహనుం జేర్పింపు; మందుంజొరం
హితమా; దాన మదీయశీలమది మీకెల్లం గనంగానగుం
జతనంబియ్యది యుక్త మిప్పటికనం సామీరిముఖ్యుల్ మహా
ర్తితిగం మోముల వంచియుండి; రచటం దీనోక్తులం బల్కుచున్. 822

ఆ. ఓసుమిత్రతనయ! యొగిఁ జితిఁబేర్పుమా, యనెడుసీతపలుకు లార్తిఁగొలుప
నన్నమోముఁజూచె నాతనిభావంబు, సంజ్ఞలవలనఁ గనఁగఁజాలి యపుడె. 823

ఉ. ఆరఘురాముభావ మదెయౌ ననియూహల నిశ్చయించుచుం
దారువులం గ్రహించి యుచితంబగుభంగిని జిత్యగాఁగ నె
వ్వారికిఁ జూడఁ జాలియొదవంగను బేరిచి యగ్నిఁజొన్పె; దు
ర్వారశిఖాకలాపమున వర్ధిలె నందు హుతాశనుం డొగిన్. 824

చ. నలుదెసలన్ మహాశిఖలు నాలుకలై తన కొప్పవెల్గు నా
జ్వలనునిఁగాంచి లేచి నృపచంద్రుని రామునిఁ గాంచి, సీతయ
ప్పలుకుల కుప్పతిల్లువగ భస్మముగాఁ దనువప్డు చేసినం
గలుగుసుఖం బనంతమని గాదిలిచిత్తమునం దలంచుచున్. 825

చ. అమరులకున్ మహీసురుల కంజలిపట్టి నమస్కరించి స
త్యము నెఱనమ్మి యిట్లనియె నందఱుఁ జక్కఁగ నాలకింపఁ జి
త్తము రఘునాథునందె సతతంబు చెలంగునయే నదేమువా
ర్తమునఁ బరుందలంపఁగ ముదంబును గాంచమి నిశ్చయంబయే. 826

చ. అనలుఁ డితండు నన్నుఁ గడునాదృతిమీఱఁగఁ బ్రోచుఁగాక! యం
చు నిటులు ఘోరభంగిఁ దగుచున్ భయదంబులునైనపల్కులం
దనదు సుశీలతం దెలిపి తత్క్షణ మగ్నిని జొచ్చె; నంత నా
యనలుఁడు మండుచుం దనదునాకృతిఁ దాఁకకయుండఁ జేయుచున్. 827

చ సతి హితశీల సాధుజనసన్నుత పూతచరిత్ర యీమె య
ప్రతిమమహత్త్వ మేనుదగుభంగి నెఱుంగుదు; నీమెఁ గాల్పనా
జతనముచాల; దింక ననుఁ జయ్యనఁ గాల్పఁగ నీమెచాలు; సం
స్తుతికిని బాత్రమైతి నిట ధూతకళంక ననున్ స్పృశించుటన్. 828

ఉ. కందకయుండుదేహము తగంగ సువర్ణశలాకవోలు ఛా
యందగి మోముఁదమ్మి వెలయంగ మదించినయట్టిపుష్పవి
ద్బృందముచాలుగేరు మృదువేణి కనందగియుండ నప్డు డొ
ప్పెం దరళాక్షి భక్తజనబృందము గోరెడుదేవియే యనన్. 829

క. కనుఁగొని దేవతలందఱు, వనజాసనముఖులఁ గాంచి వరవర్ణిని పా
వనతను రాముని కెఱఁగింపను జనుఁడీ యంచు భక్తిఁ బ్రార్థించి రొగిన్. 830

క. హరివరులు భల్లుకంబులు, తరుణీమణిదౌ మహత్త్వతత్త్వమ్ములు ని
క్కరణిం బొల్చునె యారా, పరదేవియె యీమెయంచుఁ బలికిరి భక్తిన్. 831

చ. అనిలసుతుండు నత్తఱి మహాప్రమదంబున వాలమెత్తి పెం
పును గనఁజేసి యభ్రమును బూనికఁ దాఁకనొనర్చి త్రిప్పి వే
డ్కను నటియించె నగ్నియిది గాల్పఁగఁజాలెనె? లోకమాతయౌ
జనకజ నంచు నార్చుచుఁ బ్రసంగము లభ్రమునిండఁ జేసెఁ దాన్. 832

ఉ. పావకుఁ డాత్మకీలముల భస్మముచేయకయుంటె కాక త
న్నే విధినే స్పృశింపక యహీనసపర్యలఁ బూజచేయఁగా
భావనచేసినట్లు తనజ్వాలములన్ బహుశీతలంబులై
సేవకు నర్హమౌనటులు చేయుట కాత్మనుమెచ్చి సీతయున్. 833

చ. అనలునిభక్తియోగమున కాదృతిఁగాంచి సపర్యలన్నియుం
బొనరిచినట్లు లెంచె; నదెపో మహితాత్మునిచిత్తవృత్తి నా
మనమున గారవించుటయె మంచిదిగాని వచస్సులం దమిం
గనఁబడఁజేసి దాని మదిఁగాంచకయుండుట నీచమౌఁగదా!. 834

చ. సరసిజసంభవాద్యమరసత్తము లెల్ల విమానరాజిపైఁ
గరమనురాగమొప్ప రఘుకాంతుని గాంచఁగ వచ్చియుండి య
త్తరుణమునందు భూతనయ తత్పరిశోధనరూపసంపదం
బరఁగుటఁగాంచి యచ్చెరువుఁబర్వఁగ మెచ్చుచు సన్నుతించుచున్. 835

సీ. శ్రీరాముఁ డేమనిచిత్తమందుఁ దలంచి, సాధ్వీమణిం దనశక్తి నట్టు
లనలకీలములఁ బ్రాయశ్చిత్తరూపమౌ, పరిశోధనమునకుఁ బాత్రభూత
గానొనర్చెనో యందుఁగల తత్త్వమెఱిఁగిన, వారు గావున భక్తిభావమలర
సన్నుతించిరి; ధర్మసంరక్షణంబిట్టు, లాత్మీయవృత్తిచే నగు నొనర్ప
ఆ. ననుచుఁ బలికి; రంత నవనిజ యెంతయు, సుస్మితాస్యమొప్ప శుచినడుమను
బంకజాసనమున భాసిల్లుశ్రీదేవి, యనఁగ నొప్పుచుండె నంత శుచియు. 836

అగ్నిదేవుఁడు సీతను శ్రీరామున కర్పించుట.

చ. పరమపవిత్రగాత్రయయి భాసిలు నాప్రకృతిన్ విదేహరా
ద్వరసుత నాఁ బ్రసిద్ధిగను వారిజనేత్రను స్వాంకపీఠమం
దురుతరభక్తి నుంచుకొని యొప్పిదమౌ మనుజాకృతిం గరం
బరుదుగ వానరుల్ గనఁగ వైశమ యాచితినుండి వెల్వడెన్. 837

చ. వెలువడి రాముఁజేరి గురువిక్రమధుర్య నృపాలవర్య నా
కలవియె యీమహత్త్వ మిటులంచు వచింపఁగ రామచంద్ర! ని
స్తులగుణరూపశీలముల శోభిలునీజగదంబఁ గైకొనం
దలఁపుమ యీమెమూలమునఁ దద్దయు శుద్ధుఁడనైతి నీకృపన్. 838

ఉ. సారతరంగిణీజల కృశానువు లిర్వురు పావనత్వవి
స్తారయశంబుఁ గాంచి సతతంబును వేఱొకదాని శుద్ధమౌ
తీరునఁ జేయువా రిపుడు తీఱెను సంశయ; మీపరాంబ నన్
జేరి పవిత్రుఁగా నొనరిచెం దనశక్తిమహత్త్వ మేర్పడన్. 839

శా. రామా! యీమెఁ బరిగ్రహింపు మిపుడీరాజాస్య శుద్ధాత్మ నా
భూమిన్ ఖ్యాతివహించె దోషమన నేప్పొల్కింగనన్ రా దటం
చీమెన్ నమ్మిరి దేవతాప్రముఖు లెంతే గౌరవంబొప్ప నీ
రామారత్నమె నీహృదంబుజమునన్ రాజిల్లుగా నెప్పుడున్. 840

చ. అని ప్రియమార నియ్యహృదయంబున సమ్మద ముప్పతిల్లఁ గై
కొని రఘునాయకుండు తనకూర్మికిఁ బాత్రముగా నొనర్చె నా

జనకసుతాంగముల్ దివిజసత్తము లత్తఱిఁ బుష్పవృష్టిచేఁ
దనిపిరి రామచంద్రువనితామణి జానకి నెంతొ వింతగన్. 841

## అగ్నిపరిశోధనరహస్యము.

ఉ. జానకి యగ్నిఁ జొచ్చె నన । సంశయమందుదు రొక్కకొంద; ఱిం
తేనియు భావనాబల మదెట్టిదొ యం చెఱుఁగంగఁ జాలమిం
గాని యదెన్న నల్పమగు । కార్యమె కాని, మహత్తరంబుగా
దూనినయోగవిద్యగల । యుత్తమచిత్తుల కెల్ల నారయన్. 842

క. ఎంతయుఁ దగుఁగా "యద్భా, వం తద్భవతి" యనుమాట । వసుధాస్థలిలో
వింతగఁ దోఁచును దొలుత న,నంతర మభ్యాసబలముల సహజముగాన్ 843

సీ. సర్వభూతముల హృత్సద్మసంస్థుం డీశుఁ, డను వాక్యమును నెల్లరును దలంపఁ
దగియుండుఁగా; దాని । నొగిఁ బదిలంబుగా, మనమున ధరియించి । వినుతయోగ
విద్యను భక్తిభావించుచు సతతంబు, నభ్యసించుచునుండ । నమలభావ
నాశక్తి యలవడు । నేశక్తిచే సర్వ, సమత స్థిరంబుగా । స్వాంతమందు
తే. నెలకొనునొయది యభ్యాసబలమున నొక,వస్తు వగపడ నందుండు । భవ్యతేజ
మాత్మగతతేజ మొక్కఁడే యనెడు భావ,మద్ది స్థిరతను గాంచిన । నవల ధరణి.

క తనకంటె భిన్నమైనది, గన రాకయె యుండు; భీతికరముగ నే తోఁ
చునొ యది యొరులకు నదియే,కనఁబడు సౌమ్యముగ నాత్మ । కళయయియుంటన్.

చ. అదియగు నన్యవస్తువను । నట్టి తలంపులు లేకయుండు నె
య్యదియును స్వీయమే యనెడు । నట్టి తలంపు పొసంగియుంటఁ జే
య దతని కెద్ది కీడు; తన । దాటనె కాదొకొ యట్టులౌట స
మ్మద మొనఁగూర్చుచుండు; మతి । మంతుఁ డనందగు నట్టివానికిన్. 846

సీ. భావనాబలమె సద్బలమనఁగాఁదగు, నద్దానిమించున । దరయ జగతి
నెందులే దనవచ్చు; । నీబలమునఁ దగు, వారల కెయ్యది । భయము నిడఁగఁ
జాలకయుండును; । సర్వగతం బొక్క, తేజమే యనెడుబుద్ధి దగియుంట
నిదె యోగసాధన । మిద్ధఫలం బీయఁ, జాలినయది పరీక్షయన నెట్టి
తే. దనుచు సందియమందెడు । జనులు తెలియ
దగినదిట్టులె; ఘోరసత్త్వ మది యెవనిఁ
గని వికారమునొందదో । చనునొ తనదు
దారినింబట్టుకొని యట్టి తతి ఫలించె
నితని కీభావనయనియె । యెన్నఁదగును. 847

క. సమదర్శను లనవారే, యమలాత్మకు లన్నవారె । యగుదురు; వార
న్యముగా దేనిఁదలంపరు, తమరే యవియంచు సతము । దలఁతురు మదులన్.

చ. జనకజయందు నీవిధముఁ జక్కసమన్వయమూని చేయఁగాఁ
జను; మది నెంచె నాజ్వలను జ్వాలములెల్ల మదీయ తేజమే
యని తగుభావనాబలమునంది చెలంగుట దాన స్వీయమౌ
తనువును గాల్పఁజూచునొకొ తా శుచి కావున గాలకుండెఁ దాన్. 849

చ. తలఁపది శుద్ధమైన నొకదానికి భీతిని గాంచకుండు ని
స్తులమన భావనాబలము తోఁచునుగా; తపమన్న నద్దియే;
కలుగదు దానిమించునది కాలమునం దెపుడైన; సర్వశ
క్తులు తదధీనముల్ గద! యకుంఠితశక్తి యనంగ నద్దియే 850

ఆ. మంత్రతంత్రయంత్రమార్గంబు లనునది, సిద్ధినొందఁబోదు చిత్తమును జ
యింప యోగసిద్ధియే వలంతి యటంచుఁ, దెలియవలయుఁ బండితులు సతము.

క. జనకజ యాభావనచే,తనె గాలకయుండఁజాలె ధాతృముఖులు ప్రీ
తినిబొంది వినుతిచేసిరి, ఘనశీలము సీతకలరెఁగా యనునూహన్. 852

ఉ. సీతయు రాఘవుండు వ్రతసిద్ధులు పూర్ణములై చెలంగ సం
ప్రీతిని గూడియుండఁ దగురీతి భజించెదువారె సత్కృతుల్
పూతమనస్కులౌదురనఁబోలుఁగదా ప్రకృతిప్రయోగసం
జాతమనుష్యరూప విలసత్పరమేశ్వరుఁ గాంచుటొక్కఁడే. 853

క. పరమపురుషార్థదం బగుఁ, బరమేశ్వరుదర్శనమగు పద్ధతి యిదియే
పరమేశుఁ డరూపుఁడె ప్రకృతిరతి సరూపుండె యగు సుధీహిత మిదియౌ.

### ప్రకృత్యుపాసన.

చ. ప్రకృతియు రూపహీనయె యభంగురమౌ భగవంతు నూహచే
సకలశరీరముల్ తనదుసంహననంబుగ నొప్పఁజాలు రూ
పకలితయౌఁ దదీయయుతి వర్షము దాల్చును; దైవ మద్దిరా!
సకలము వారిదే యయి యొసంగు నిదే పరమార్థ మీయెడన్. 855

ఉ. దానవనాయకుండు పరతత్త్వమనంజను సీత నెమ్మదిం
బూనినభక్తి సంతతము పూజలఁ దన్పుచునుండు; మంత్రమె
ద్దానిని జెప్పఁ దత్త్వముగ దానినె కోరిన వాఁడుగానఁ ద
న్మానససిద్ధిఁ గాంచె రఘునందనుచేఁ దెగుటన్ రణంబునన్. 856

సీ. ఆయశోకోద్యానమందు జానకియుండ, నామెపూజించె నెట్లసురవర్యుఁ
డనితలంపఁగఁజన దామె కారూపము, శాశ్వతమన రాదు సాధకుండు
షట్చక్రములయందు సమయమూర్తిగనొప్పు,పరమతేజంబును భక్తిఁగనుచు
నాగమోక్తవిధాన మలరఁ బూజించులే, పరదేవిపూజయౌ భద్రద మదె
తే. విగ్రహంబులఁ బూజింప విమలఫలము,గలుగనేరదు స్వల్పమౌ ఫలమె కలుగుఁ
జక్రమందాస్వరూపంబుఁ జక్కనివిధి,ధ్యానయోగమునం గనధన్యుఁ డగును.

చ. వనములనున్న కాలమున వచ్చుఫలంబులఁ జక్కనెంచి రా
మునిహృదయంబునన్నిలిచి మూర్తియొకండు కనంబడంగ ఛా
యను నిజశక్తి నిల్పినపరాంబను శ్రీరఘురాముఁ డగ్నిహో
త్రునివలనం దమిం బడసె ధూర్తులదూఱుఁ దొలంగఁ దోలఁగన్. 858

క. శ్రీరాము హృదయగతయా, సారసదళనేత్ర సీత ఛాయాంగముఁ ద
ద్ధ్వారిచితాగ్నిం బోనిడి, శ్రీరమ్యాంగమును దాను జెందెఁ మరలన్. 859

చ తనువదె కాలకుండ రుచితం దన రారుచు వచ్చె నంచుఁదో
చె; నదియె మాయనాఁబరఁగుఁ; జెప్పఁగ నేరరు తన్మహత్త్వ మి
ట్లనుచు హరీశధాతృముఖులైనను దక్కనవారిమాట యే
మనిపలుకంగ వచ్చుఁ; బరమాత్మ తలంపది యెన్న శక్యమే. 860

శంకరుఁడు దశరథుని రామునకుఁ జూపుట.

సీ. శంకరుం డంత దశరథభూనాయకు, వ్యోమయానంబున నుండఁజేసి
కొనివచ్చి రామునకుం జూపె; నాతండు, సంప్రీతుఁడైన దశరథుఁ గాంచె;
నంతఁ గుమారకా! యనిఁ జంపితివి దశ,కంఠుని సత్కీర్తిఁ గాంచి తీవు
జానకీదేవిని సంశుద్ధగా నమ్ము, మని ధర్మములు తెల్పె; నంతదేవ
తే. పతి సుధావృష్టినిగుడించి మృతులఁ గపుల, నప్డు బ్రదికించి శ్రీరామునాజ్ఞనొంది
స్వర్గపురికేగె; నెల్లరుఁ జనిరి స్వీయ,వసతులకు రామచరితంబుఁ బలుకుచుఁదమి.

క. మృతుఁడగు దశరథుఁ డత్తఱి, క్షితిపతికిం గానఁబడుట చిత్రముకాదే
యతనికిఁ బూర్వస్మృతియుఁగ, సుతుపై మోదంబునుంట చోద్యముగాదే. 862

సీ. అనుసందియంబున కాస్పదంబిచ్చుచుఁ, గొంద ఱాక్షేపింపఁ గోరుచుంద్రు;
మృతులగువారు సుగతుల నొందుదు రందు, శర్మము గాంచుచుఁ జాలకాల
ముందురు; మఱియును గొందఱు భక్తులై, యసమానసత్కర్మవిసరములను
జేసి తత్ఫలముల శ్రీహరికర్పించి, మరణకాలమునఁ దత్స్మరణముననె
తే. వదలుదురు ప్రాణములు; నట్టి వారలింత, కాలమన నేల స్థిరముగా లీల నుందు
రట్టివాఁడగు దశరథుఁ డమలకర్మ,నిరతుఁడగుటయె గాక రామరతిగల్గి. 863

చ. తనువుత్యజించెఁ గాన స్థిరతంగనె సత్పదవాసమందు; నా
తనికిఁ బరాత్పరుం డగు సుతాపతి దర్శనమిచ్చి రమ్ము రా
మునిఁ గననంచుఁ దోడుకొని భూమిపయిందగు రాముఁ జూపె; నం
దున సుతుఁ గోడలిం గనియెఁ దోఁచినరీతిని దెల్పె ధర్మముల్. 864

చ మృతిగనినంతనే మఱొకఁ దేహ శరీరము వచ్చునందు; రా
వితమది శాస్త్రదూష్యమన వింతయొయుండదు; చచ్చినంతనే
జతపడు దేహమొందు; గృహసంగతిఁ బాయకయుండు నద్ది; స
ద్గతిఁ గలిగించు శాస్త్రహితకర్మము లొప్పఁగఁ జేయఁగాఁ జనున్. 865

చ. చనియటఁ గర్మలబ్ధ ఫలజాలము నొందుచు నద్ది తీఱఁగా
జననము నొందు భూమిపయి సత్ఫలరాశినొ దుష్ఫలాళినో
గనఁదగు దేహ మొప్ప నిదె కర్మగతిం దెలుపంగఁజాలు; శా
స్త్రనిహితతత్త్వ మింకొకవిధం బది చెల్లదు సమ్మతంబుగన్. 866

చ. మరలజనించు టన్నయది మంచిదిగా; దది సత్యదూరమై
పరఁగునుగాన నీజనిని బాయక దుఃఖసుఖంబులొందనౌఁ
దరుణము వ్యర్థపుచ్చకయె ధర్మము చేసి సుఖంబుగాంచుఁ డం
చరయక పల్కుచుందు; రభియాతులు వారలె శాస్త్రరాశికిన్. 867

ఉ. ఇప్పటి దిప్పుడే కలుగు నిందుఫలంబుగఁ బూర్వజన్మమం
దొప్పనికర్మజాలముల నోపికఁ జేసితి; మీఫలంబు లి
ట్లుప్పతిలెంగదా యనుటయొప్పదు గాయని బౌద్ధులంద్రు; వా
రెప్పటికిం దరించుగతినే గనఁజాలమి నంచునెన్న నౌ. 868

సీ. ఒకకాలమున నెట్టులో కష్టముల్ రాఁగఁ, బూర్వజన్మంబునఁ బూని యెవరి
నో కష్టపెట్టితి మోర్వఁజాలక దాని, ఫల మొందె నిపుడంచుఁ గలఁగునుస్మృతి
యది తనంతకుఁదానె యొదవు నాస్తికునకు, నైననయ్యది తెల్పు మానక తన
ప్రాగ్జననంబును బలుకులు వేయేల, కర్మసిద్ధాంతమ్ముఁ గాదనంగ
తే. నేరికే శక్యమెటుగాక యే యొసంగుఁ, గాన గర్వంబుఁ బూనక కర్మగతి దు
రూహమనియెన్ని యెఱుగంగ నూహచేయఁ, బూనకే శాస్త్రమును నమ్ము బుద్ధిగలిగి.

చ పరమదయానిధిన్ సుజనపాలుని దైవము నమ్మి ధర్మత
త్పరత చెలంగ శక్తికనుబంధముగాఁ దగుసాధుకర్మముల్
నిరతి నొనర్చి తత్ఫలము నిర్మలతత్త్వసమర్పణంబుఁ జే
సి రహితపాపకర్ముఁడయి చేరఁగఁగోరఁదగుం బరాత్పరున్. 870

చ. ఇదియె సుఖైకమూలమయి యెన్నఁగ నర్హమునైన మార్గ మి
య్యదియె సనాతనంబనుచు నందఱు సన్నుతిచేయు త్రోవ; యి
య్యదియె మహామునిప్రకరహార్షదమైతగు పద్య; యిట్టిదె
య్యది కనరాదు లోకముల నన్నుతింగనఁజాలు వర్త్మమా. 871

ఉ. దేవత లాశచీపతియుతిం జన బ్రహ్మమహేశ్వరుల్ ముదం
బావహిలంగఁ జేసి తమయాలయముల్ గనఁబోవ వానరుల్
పావనచిత్తులై వెలయు పావనిముఖ్యులు రాముఁగొల్చి పెం
పావహిలంగ నుండి రభియాతివధంబున నిర్మలాత్ములై. 872

చ. గుణమణిహారభూషితుఁడు కోవిదవర్యుఁడు నైనయవ్విభీ
షణుఁ దరుదెంచి మేల్కొనిన సద్గుణధాముని రాముఁ గాంచుచుం

ప్రణతి యొనర్చి నిల్చి తగుభక్తివినయంబులు కల్గునట్టిభా
షణముల విన్నవించె సుఖశయ్యనువీడితి విప్పుడే ప్రభూ! 873

చ. పురమున కేగుదెంచి కపిపుంగవులెల్లను రాఁగ మీరె యా
దరముననిచ్చినట్టి గృహతల్లజ మంఘ్రిసరోజపూతమై
పరమశుభాస్పదంబునయి భాసిలఁజేసి భుజించి నన్ను ని
ర్భరకుతుకాబ్ధిమగ్ను నిఁక రామనృపేంద్ర! యొనర్పుమా కృపన్. 874

చ. అనివినయంబు భక్తియు మహాదరముం గనుపట్టి వేడఁగాఁ
గని సుగుణాలవాల! నినుఁగాంచినయంతనె తృప్తియయ్యె; నీ
వనుపమభాగ్యరాశివి దయాంబుధివై చిరకాలరాజ్యపా
లనమున మెప్పుగాంచి విపులన్ సుయశంబు చెలంగ నుండుమా. 875

సీ. ఒకమాట చెప్పెద నొండుగాఁదలఁపకు, మింక నాలస్య మేమేని చేయఁ
జనదనితోఁచెడు నసుజుఁడు భరతుండు, గుణములప్రోక నాకొఱకు వేచి
యుండును నియమంబు నొగిఁదీర్చివచ్చెద, నాలస్య మొనరింప నని పలికితిఁ
బదునాల్గువర్షముల్ వనముల వసియించి, యవధియబ్దము రాఁగ నాదినమున
తే. దర్శనం బీయఁదగు నాఁడు తడవు చేయ, నగ్ని శరణంబుగా నమ్మి నసువులవిడ
నాడువాఁడను నీయాన నాఁడె దృష్టి, పూతముగ దర్శనంబిమ్ము భూపవర్య!

చ. అని విడనాడిపోయె నను నాతఁడు మాటతొలంగువాఁడు కాఁ
డనితలపోయవయ్య! సుగుణాలయ! నీయెడ నాకుఁగల్గు ప్రీ
తిని గనుచుండియుఁ బిలువఁ దీవరపందఁగనేల మిత్రుం
మ్మని మరియాదచేయఁదగునా యది కైతవభాషణంబయా. 877

చ కలిగినసౌహృదంబునకు గాదిలిప్రేమమునుఁ జూపువృత్తియే
సులలితభూషణం బగునుజుమ్ము మఱొక్కఁడుగాదు సోదరా!
పలుకులు వేయునేల మృదుభాషణుఁ డాతఁడు మాటమీఁద నే
నిలుచును; మాటదప్ప శుచినిం జొరు; నవ్వలఁ జూతు నెవ్వనిన్. 878

చ. అనృతములాడ నంచు సమయంబొనరించితిఁ జిన్ననాఁడె; నా
యనుజుఁ డెఱుంగుదాని మునులందఱు నుండఁగఁబల్కినాఁడఁ; ద
ప్పనుజుము మాట! వచ్చెదను బ్రాణములుండిన నీదుచెంతకుం
జనుమని పంపినాఁడ; దనుజప్రవరా! యిఁక వేఁడ నేటికిన్. 879

ఉ. నావిని యవ్విభీషణుఁడు నాథ! మఱొక్కఁడు విన్నవించెదన్
నావలెనే యతండు జతనంబున నిన్ననఁ గోరుచుండు; స
ద్భావముగల్గియుంట నదిసుండు సుపాయముగల్గ దానిసం
భావనచేయఁగావలదె; పల్కెద దానికి సమ్మతింపుమా. 880

మ. అలరుం బుష్పకమన్ విమానమదియక్షాధీశు నోడించి దో
ర్బలచిహ్నంబుగఁ దెచ్చె రావణుఁడు; దివ్యంబైనయద్దానికిం
గలుగున్ మానసతుల్యమౌ జవము; చక్కన్ దానిపై నెక్కి పో
వలయుంజుమ్ము పురంబుఁజేర ననుచున్ స్వాంతంబునం గోరినన్. 881

చ. కనుఁగొనుచుండ ముందలరు క్ష్మాధరముల్ వెనుకంబడంగ నె
మ్మనముముదంబుధిన్ మునుఁగ మానసవేగము మించినట్లుగాఁ
జని పురమందు నిల్పుఁ గపిసత్తములన్ మనలన్ మహాప్రభూ!
కనుక మదాలయంబునకుఁ గాదన కిప్పుడె రాఁదగుం గృపన్. 882

ఉ. రామనృపాలశేఖరుఁడు రంజిలఁగా వచియించు సద్గుణ
స్తోమకలాపు నాతని విధూతరజస్కుని గాంచి చెంతకుం
బ్రేమముమీఱ రాఁ దిగిచి రీతియిదే సహజన్ము దేర్పఁగా
నేమముసాగఁజేయఁ దగు నేర్పని యెల్లరు మెచ్చ నిట్లనున్. 883

చ. తలఁపఁగవచ్చునయ్య! యిటు తమ్ముఁడు కుందుచు వల్కలాజినం
బుల ధరియించి నాళ్లకు భూరితరంబగు రాజ్యసంపదల్
గలుగఁగ వీడి నన్గనెడు కాంక్షల తెప్పలువాయఁ జూడఁగాఁ
దలఁపక వాని నిందు సుఖధామములన్ వసియించు టోసఖా! 884

చ. పలుకకుమింక నన్నిలుపు భావముగూర్పకు చిత్తమందు నీ
తలఁపు ఫలింపఁజేయక యితండు ప్రయాణముసేయఁబూనె నం
చలుగక సోదరుం దలఁచి యార్తిని బ్రుంగెడు నన్నుఁగూడి యే
తలఁపును పోవ వేగముగఁ దమ్మునిఁజూపుము నిల్పు ప్రాణముల్. 885

సీ. అని పల్క రాముని యనుజవాత్సల్యముఁ, గొనియాడి యందఱఁ గొని చనిపురి
కందుఁ గల్గినమనోజ్ఞాలయంబులు చూపి, పుష్పకముంగొని భూపవర్యు
పదములకడఁ జేరి పరమకృపాకరా!, పుష్పకం బెక్కంగఁ బూను మింక
నని వేఁడ శ్రీరాముఁ డద్దాని నెక్కుచు, నందఱఁ జూచి నెయ్యంబుమిగుల
ఆ. నార్యులార! మీసహాయంబు గల్గంగఁ, గార్యసిద్ధి నేను గాంచినాఁడ
నింక మీర లెందు నిష్టమౌ వసియింప, నందునుండి సుఖము లొందఁదగును.

చ. అరిగెద నే నయోధ్యకది యస్మదినాన్వయజాతులైన భూ
వరులు మహానుభావులయి వాసముచేయఁగఁ నేర్పఱింపఁగా
స్థిరతరశర్మసంతతులఁ జేకుఱఁజేయుచు నుండుఁ గాన న
ప్పురిఁగన నేగువాఁడ గుణపూజ్యుఁడు సోదరుఁ డుండు గావునన్. 887

చ పనివినువాఁడ నన్ను విని పావనిముఖ్యులు సూర్యసూనుఁడా
దనుజవిభుండు భల్లపతి తారసుషేణులు భక్తిమ్రొక్కి యే

మును బురికేఁగుదెంతుము విభూ! కనఁగోరికయయ్యె; నాఁగ మీ
మనములుగోరునేని బహుమానమె మాకది రండు మీరినన్. 888

చ. అదియె మహాప్రసాద మని యందఱు పుష్పక మెక్కి; రద్ది యే
యదనున నెందఱెక్కుదురొ యందఱకున్ వసియింపఁ దా విడం
గఁదగు మహత్త్వయోగమునఁ గ్రాలును; వేలకువేలుగాఁగ నె
క్కఁ దనదుమానఁ మంతదిగఁ గానఁబడంగనె చేయు నద్దిరా!. 889

మ. తొలుతన్ జానకి యంతరాఘవుఁడు తోడ్తో లక్ష్మణుం డవ్వలన్
జలజాప్తాత్మజ దానవాధిపతులున్ సామీరి ముఖ్యుల్ కపీ
శులు భల్లూకవరేణ్యు లింకఁగలకీశుల్ చక్కఁగా నెక్కి రు
జ్జ్వలయానంబది వారికిన్ సుఖనివాసంబౌచుఁ జూడం దగెన్. 890

ఉ. ఎల్లరుగూరుచుండఁగ మహీపతిచంద్రుఁడు రామమూర్తి తా
నుల్లము వ్యోమయానమునకుండెడు దైవతమందు నుంచి మే
మెల్లర మాయయోధ్యగన నేగఁగఁగోరెద మోమహాత్మ! రం
జిల్లఁగఁజేసి మమ్ముఁ బురిఁజేర్పుము శర్మముగూర్పు మేర్పడన్. 891

మ అని ప్రార్థింపఁ దదీయదైవత మహార్యప్రీతిఁ దద్యానమం
దు నితాంతంబు స్వతేజమున్ నిలుపుడుం దోఁచెన్ మహాకాంతిపెం
పున నాపుష్పక మంత సుంతకదలన్ భూరి ప్రమోదంబులన్
నినదంబున్ దెసలందు నింపిరి కపుల్ నింగిన్ సురల్ మెచ్చఁగన్. 892

క శ్రీరాముఁడు లంకాప్రాకారములం గాంచి వింతగడలుకొనంగా
నౌరా! యననిర్మించెను, సారమహత్త్వమున శిల్పశాస్త్రహితముగన్. 893

ఉ. హారిసువర్ణసౌధములు హర్మ్యములున్ గృహరాజముల్ గనం
గారమణీయతం జెలఁగుఁ గానఁగరా దొకఁడే ననర్హమా
తీరునఁగట్టియున్న యది దేవతలే రుచిరంపురత్నసం
భారములన్ రచించి రనవచ్చుఁగదా పలుమాటలేటికిన్. 894

చ. వలయముగా గృహంబునకు వర్ణ్యములౌతరువర్యముల్ తగన్
విలసితసాల మావివిధవృక్షములం దగునట్లుచుట్టి యిం
పలరఁగఁ గానఁగాఁ దరులయంతికమందుఁ గలట్టితీవ లు
జ్జ్వలతరునాయకోత్తములఁ జక్కఁ బెనంగిముదంబు నొందఁగన్. 895

చ. ఉపవనమధ్యభాగమున నున్నగృహంబుల నేత్రపర్వముం
గృపఁ గలిగించువానిఁ గని కీశపతుల్ ముదమందఁ జెప్పియా
నృపతిలకుండు తత్పురికి నీడగునెద్దియు లేదటంచు దే
వపురియు దీనిఁబోలదని వర్ణనమొప్పఁగఁజేయుచుండఁగన్. 896

చ. హనుమయు దానిఁ దాను జొరునప్పటితీ రెఱిఁగించి కాల్పఁగా
ననలుఁడు చూడకుండ నివియన్నియు దక్కెను; ముందునున్నతీ
రనుపమ; మద్దియెందుఁ గననౌనె? కుబేరుని భాగ్యమంతయుం
గొను నొకహర్మ్య మన్న విని కూరిమి నింకనుగాంచె నాపురిన్. 897

చ. పురమదె కాంచితే సుదతి పూర్వముచూచియె యుండవంచు నే
నరసెద భీతవై యసురుఁడాదృతిఁ జూపినఁ గన్ను లెత్తి సుం
దరముగ నున్న దేనినయినం గనకుందువు; నన్ను మాత్రమే
శరణము గోరుచుందు వనిచక్కఁ దలంచెదు సాధ్వివాటచే. 898

క. అని పలుకుచుండఁ ద్వరగాఁ, జనుచుండె విమాన మంత క్ష్మాపుత్రిక దా
నినడక యద్భుతమోదము, గనఁ జేయఁగ నిట్లుపలికెఁ గాంతునితోడన్. 899

విమానమహత్త్వము.

సీ. శ్రీరాఘవా! యిది శీఘ్రగతుల్ మీఱఁ, బాఱుచున్నది దీనిపరమశక్తి
కెద్ది కారణమని యెఱుఁగంగఁ గోరెద, ననుచుఁ బ్రశ్నింప నాయంబుజాక్షి
గని పల్కె; నో దేవి! గతి యిది యత్యంత, మందమంచుఁ దలంపు మదిని నీవు
నీకు నిందలివస్తునిచయంబులం దెల్పఁ, గోరితిఁ గాన నీచారుయాన
తే. మంతవేగముగాఁ బోవ నాత్మఁ దలఁప, నిద్ది చిత్రముగాఁ దగు నేని వినుము
దీని కీశక్తి గలిగిన తీరు; దాన, సందియంబులు తొలఁగి యానంద మొదవు.

క. మునువింటిమి గద కానన, మునఁ బోవుచు సరసిజములఁ బొల్చుతటాకం
బును దానినడుమ నర్తన, మునఁ గల్గిననిస్వనమును బొలఁతీ! యంతన్. 901

క. ఇది యేమన మౌనీంద్రుఁడు, సదయాంతఃకరణుఁ డపుడు చరితము దానిన్
మదవతులు నాట్యమాటఁగ, నొదవిన దన నద్భుతమ్ము నొందితిమి కదా. 902

సీ. అప్రాణమయ్యు నీయది యిట్లుపోవంగఁ, గలకారణము విను కమలనేత్ర!
వాంఛలు మెండుగా వర్ధిల్లుమనముల, నెవని కెయ్యది మంచిదిదని తోఁచు;
దాని నాతఁడు కోరి తప మొనరించును, దత్సిద్ధి వేగమ తనకు నీయఁ
గాఁ గోరి తపమది కడుఁ దమి సాగింప, దానినొందఁగ వాఁడు తగినసాధు
తే. కర్మమును బూర్వజనియం దఖండఫలద, మును విధింబూని చేసిన భూరివిఘ్న
ములకు లొంగక యది సాగు ఫలము గలుగఁ, జేయఁ దన్మంత్రదేవత చేరు నెదుట.

వ. తన్మనోగతం బెఱింగి యభీష్టవరంబు లిచ్చిపోవు. ఆకాశగమనసిద్ధి నొసంగు దేవతం బ్రార్థింప నాకాశంబున వలయునట్లు తిరుగ వరం బొసంగు. తత్సంకల్పనిర్మితం బీవ్యోమయానంబని యెఱుంగుము. సిద్ధు లనేకభేదంబులుగనుండు. అష్టసిద్ధులు ప్రసిద్ధంబులు గదా. రససిద్ధియు మోక్షసిద్ధియు బలసిద్ధియు ఖడ్గసిద్ధియుఁ బాదుకాసిద్ధియు నంజనసిద్ధియు వాక్సిద్ధియు లోహసిద్ధియు దేహసిద్ధియుం గలవు. ఖేచరసిద్ధియు

వీనియం దంతర్భూతంబగు పాదుకాసిద్ధికిం జేరినదని యెఱుంగుము. ఈసిద్ధుల నొసంగు దేవతలకు సిద్ధయోగినులను నామంబుగలదు. మహాపద్మాటవినుండి చింతామణిగృహోత్తమంబు నంతరంబున నణిమాదిసిద్ధిదేవతలు నివసింతురు. శ్రీచక్రార్చకుల కిది సువిదితంబై యుండు యోగులు తచ్ఛాస్త్రగతవిభూతిపాద ప్రోక్తమార్గంబున వాయునియమనంబు చేయ నాకాశగమనమున కుపయుక్త మగునట్లు తూలమువలె దేహ మొప్పుచుండ వలసినతావుల కరుగుదురు.మఱియు నోషధీసిద్ధులయందు నిదియుఁ జెప్పంబడు. అదియొక్కనికిమాత్రమే యుపకార కంబగు. తపస్సిద్ధియద్దానినారాధించునంత కాలంబంతయు నెల్లరకునుపయో గింపఁదగియుండు. కుబేరుండు దీనిందొలుత నీశ్వరారాధనంబున సంపాదించె.అది రావణాసురుండు తెచ్చుకొనియె. అదియే యీపుష్పకంబనినమ్ముము. దీని భక్తిఁ బ్రార్థింప మానసవేగంబునం బోవు. ఇది దీనివృత్తాంతంబు. కూరుచున్నవా రెందఱఁ బోవలయునని ప్రార్థించిన నచ్చటికింబోయి నిలుచు. తపఃఫలభూతం బీగమనసాధనంబని యెఱిఁగించి సాగరంబుం జూపుచు వానరుల యద్భుతశక్తిం బొగడుచు సాగరంబునుత్తరించి యుత్తరతీరంబుఁ జేరి యవ్వలం బ్రయాణంబు సాగకుంటం బరికించి రాఘవుం డేమికతంబని విచారించుసమయంబునందు. 904

## రాముఁడు శివలింగముఁ బ్రతిష్ఠించుట.

చ. ధ్వని యొకఁ డేగుదెంచి కపి।వీరుల నచ్చెరువందఁ జేయుచున్
మనుకులవార్ధిసోమ! రిపు।మండలభీమ! విమాన మిద్ది సా
గని కతమాదృతిన్ వినుము । కాదనఁబోకుము రావణుండనన్
వనజజునుండి నాలుగవ।వాఁడు గణింపఁగ వేదవేత్తయా. 905

చ అని మొన వానిఁజంపినది । యారయ న్యాయ్యమెయైన బ్రహ్మహన్
మునిమనుమండు గాన నఘ।ముల్ పొడసూపకపో వవేరికే
నని తగునట్లులోకమున । నంతట వెల్లడిచేయఁగాఁ దగుం
గనుక నఘుంబదిప్పు గతి।గాంచక నిల్వఁగఁ జేసె దీనినిన్. 906

సీ. జంతుహింసయె పాప।జనకంబగుం జుము, దానియం దెక్కు డు।దారజంతు
హననంబు దానికం।టెను హెచ్చుపాపంబ, దుత్తమజంతువు।నుగ్రబుద్ధిఁ
జంపుట; మానవ।సంహార మద్దాని, మించుపాపము; దాని।మించు నఘము
జ్ఞానయుక్తిం బొల్చు।వానివధించుట, మౌని వధం బెన్న।దానిమించు
తే. పాపమద్దానికంటెను।బాపమరయ, వేదవేదాంగతాత్పర్య।విద్వధంబు
దానిఁ జేసితి వీవు భూ।జానివర్య!,దానిఁబోలఁగఁగంగఁ ద్రోచి పోఁ।దగునునీకు.

క. అనుటయు సీతాహృదయం,బునఁ బొడవి।నయూహ యిదియో।పో యనితనయా
త్మను బూన్కిఁదలఁచి భూమికిఁ,జనినిల్వఁగఁ బుష్పకంబుఁ।జక్కనిభక్తిన్.908

ఆ. వేఁడియద్ది యఖిలవిశ్వంభరాస్థల, మందునిలువ బుద్ధి। నరసి బ్రహ్మ
హత్యఁబాపఁజాలు। నదిశివలింగప్రతిష్ఠ యనిజనులకుఁ। దెలుపఁదలఁచి. 909

చ. భరతునిగాంచు నుత్సవము। పర్వుట జాగొనరింపఁబూన కీ
శ్వర కరుణాకరా! జగతి।శాశ్వతధర్మము నిల్పఁగోరి యా
శరవరుఁ జంపినాఁడ నది। సర్వహితంబగునంచు నెంచితిన్
జొరఁబడెఁ బాప మీతనువు। సోమవిభూషితశీర్ష! ప్రోవుమా. 910

మ. నినుసేవించినఁ బాపభూధరము లౌ।నీహారలేశంబు లం
చును మౌనీంద్రులు శాస్త్రసంతతులనే। శోధించి పల్కంగ నే
వినినాఁడం గరుణించి యీదురితముల్। వేగంబ పోఁగొట్టుమా
జనసంఘోపకృతిం బొనర్చుటకె యీ।సంహారముం జేసితిన్. 911

క. శంకర! నినుఁగీర్తించిన, సంకటములు వాయుఁ బాప।సంఘమ్ములు ని
శ్శంకన్ భస్మములగు నీ,కింకరుఁడం బ్రోవవలయుఁ।గీర్తి యిదెగదా. 912

మ. సకలాఘంబులు నీపదాబ్జము లెదన్। సంధించి ధ్యానించినన్
వికలత్వంబును గాంచునంచు మునిరా।డ్బృందంబు బోధించు; నో
సకలజ్ఞా! ధర ధర్మము న్నిలుపు వాం।ఛం జంపితిన్ దైత్యనా
యకుఁ బాపంబిది పుష్పకంబుగతి మా।యం జేసె దుర్దాంతమై. 913

మ. త్వరఁ జేరంజనునే నయోధ్యకు విలం।బంబోర్వఁజాలం డెదన్
భరతుం; డాడినమాటఁ దప్పనను నా।పల్కుల్ నిరర్థంబులై
ధర ప్రీడం గలిగింపఁజాలు నిఁక నీ।తాత్పర్య మెట్లున్నదో
పరమజ్ఞానమయా! సదాశివ! ననుం। బాలింపుమా సత్కృపన్. 914

మ. శివనామంబె సమస్తమంగళములన్। జేకూర్చు భక్తాళి కం
చు వచించున్ మఱి శంకరాహ్వయము మిం।చున్ శర్మదంబై సదా
శివనామంబు సమస్తభద్రములె నీ।చిత్తం బటంచున్ వచిం
చు విశేషించి వచింపనేటికి శుభ।స్తోమంబె నీవాదుగా. 915

మ. హర! యన్నంత సమస్తపాపగణముల్। యత్నించుఁ బోవంగ; శం
కర! యన్నంతనె సౌఖ్యముల్ వలచురా।గా; నో మహాదేవ! యన్
పరమాఖ్యన్ స్మరియింపఁ దన్మయత వే।పాటిల్లుఁజు; మ్మింక నీ
శ్వర! యన్నంతఁ ద్వదన్య మెద్ది? యను భా।వంబుం గనం జేయుఁగా. 916

మ. అనుమానం బిఁక నేల సాంబశివ! నా।యత్నంబు వే పండఁగా
నొనరింపందగువాఁడ వీవెగద యం।హోమర్దనుం డన్ననీ
వనఁ జెల్లుంగద విఘ్నరూపమున నన్। బాధించు నీపాపముల్
గనరాకుండ నొనర్పుమా ననుఁ గృపం।గాపాడుమా మ్రొక్కెదన్. 917

మ. నిను ద్వేషించెడువాఁడె నీచుఁడనఁగా । నీతత్త్వ మూహింపఁజా
లనిపాపం బొనరించి యుండునని పల్కన్ వచ్చు నవ్వానికిన్
జని మర్త్యంబున జంతుసంఘమున నే । సంధిల్లు మర్త్యాంగముం
గనఁజాలం డతఁ డంచు నమ్మఁదగు నిక్కంబిద్ది సర్వేశ్వరా! 918

సీ. పరమేశ్వరత్వంబుఁ । బాటించి నీవుంట, నీనామములె తెల్పు । నిఖిలరూప!
సమదృష్టి యనెడుభూషణము నీవందుట, నీనివాసమె తెల్పు । నిర్మలాంగ!
యభయప్రదాత వీవనుఖ్యాతి గల్గుట, నీభూషలే తెల్పు । నిర్మలాత్మ!
సర్వకారణుఁడవన్ । సంజ్ఞ నీకుండుట, సప్రకృతిత తెల్పు । సాధువరద!
తే. నీదుమహిమము గొనియాడ । నే ననంగ
నెంతవాఁడఁ బరాత్పరా! । యఘౌఘంబుఁ
దొలఁగఁ ద్రోయుము నీయాజ్ఞ । మెలఁగువాఁడ
నౌటఁ గింకరుఁడనుగదా । యంబికేశ! 919

చ. అని వినుతించునంతఁ గపులందఱు చక్కఁగ నాలకింప నే
తనువు గనంగరాక నినదం బొకఁ డద్భుతరీతి మీఱఁగా
వినఁబడె; రామచంద్ర! నృపవీర! మహాత్మ! భయం బిఁకేల చ
య్యన శివలింగమున్ నిలిపి । యర్చనసేయుము పాపముల్ చనున్. 920

ఉ. నీవన నేనె నేననఁగ । నీవె కదా బహుభాషలేల? లో
కావనసంప్రమోదమున । నాతనిఁ జంపితి వింతె కాక నీ
పావనచర్య లోకమునఁ । బామరసంఘము నుద్ధరింపఁగా
నే విలసిల్లుఁగాక! నిను । నెవ్విధిఁ జేరును బాపసంఘముల్. 921

క. రాముఁడె శివలింగంబును, నేమమునఁ బ్రతిష్ఠఁ జేసె । నిఖిలాఘహరం
బౌమాడ్కి నంచుఁ దలఁతురు, పామరు లద్దానఁ గాంత్రు । భక్తిభరంబున్.

మ. నిను నెవ్వాఁడు మదన్యుఁగాఁ దలఁచు వానిం జెందు దుర్వారపా
పనికాయం; బిది సత్యమౌ; నిదియె తెల్పంబూను వేదంబు లె
ల్లను; శాస్త్రంబులమాటయేల యిఁక నుల్లంబందు నన్ నిల్పి పా
పనికాయక్షయదక్షలింగవరమున్ । బద్మాక్ష! నిల్పం దగున్. 923

క. ఆలింగము నీనామమె, యాలంబముగా జగంబునందు వెలసి పా
పాళిం జెందుచు నుండును, నీలలితయశంబు భూమిని నిల్పు స్థిరముగన్. 924

తే. రామలింగేశ్వరుఁడని ధరం బ్రసిద్ధిఁ, గాంచువాఁడను నేను; భక్తవ్రజంబ
గొలువ నీనామజపమును । గోరి చేయు,చుందుఁ బాపండులే గాక యుండఁ జేయ.

ఉ. నన్ను నుతించుభక్తులు మనంబున నిన్ను సమాశ్రయింప కే
వన్న మదంఘ్రిసేవకుఁడ వంచుఁ దలంతురు; నిన్నుఁ గొల్చు వా

రెన్నఁగ నన్ను నవ్విధిగ నెన్నుదు రట్లగు; వీరలెల్ల నిం
కెన్నటికిం దరింప రనియే యిది చాటును సర్వకాలమున్. 926

మ. నను సేవించిన నిన్నుఁ గొల్చినటు లెన్నన్ వచ్చు; నిన్గొల్వఁగా
నను సేవించినయట్ల యౌ; మనలఁ బంతంబూని యొక్కండుగా
మనమం దెన్నినవాఁడె భక్తుఁడనఁగా మాన్యుండనం బేర్గనన్
గనఁ బాషండులె చాలసంఖ్యగ ధరం గన్పట్టులే చిత్రమా. 927

చ హరిహరు లొక్కతత్త్వమని యారయువారలె భక్తులంచు నీ
ధరఁ దగువార లన్యులు నితాంతము వంచకు లన్న పేరునం
బరఁగుట కర్హులౌదు; రికఁ బాపహరంబగు లింగవర్య మీ
సరిదధినాథుతీరమున క్ష్మాపతివర్య! ప్రతిష్ఠ చేయుమా. 928

క. వారాణసినుండియె యీ, తీరమునకు వచ్చి గంగ దెచ్చి యిచటి లిం
గారాధనమున స్నానముఁ, గోరికఁ జేయింప నఘము కుందును రామా! 929

క. ప్రతిదినము గాంగతోయం, బె తగున్ నీపేరనుండు నీశంభున క
చ్యుతభక్తిఁ జేయుపూజకు, నితరజలం బొప్ప దెప్పుడే స్నానమునన్. 930

సీ. వారాణసికిఁబోయి వచ్చియీసేతువు,నందు మున్గక యీశు నమలభక్తి
సేవింపకున్నచోఁ జేరదు వానికి, యాత్రాఫలంబని యాజ్ఞ చేసి
నాఁడ; నేమిటికన్న నాయాత్ర నీయాత్ర, యగునన్న భావమే యమరియుండ
వలయు నెత్తఱినని పలికి నాయాజ్ఞను, దాఁటిన సత్ఫలతతి పొసఁగదు
తే. మఱి యధోగతి చేకుఱు మనల నొక్క,తత్త్వమని నమ్మి ధ్యానింపఁ దలఁచువారి
కిట్టి యాత్రలవలన మేలెద్దియుండ, దనిశమున్ వారు తలఁచుట యమలమాట.

చ. జనకజఁగూడి యీయుదధిసత్తముతీరమునందు లింగమున్
మనమునఁ బాపతూలములు మండు నటంచుఁ దలంచి నిల్పుమా
మనుజహితార్థ మంచు దివి మంగళనిస్వన మెల్లవారికిన్
వినఁబడె మోదమంది కపిబృందము గొల్చెను శంకరున్ హరున్. 932

సీ. అంత శ్రీరాఘవుం డవనిజ తనచెంత,నుండగా సైకత మొప్పఁ జేర్చి
శివలింగ మొనరించి సవిధిఁ బ్రతిష్ఠించి, చేతులు జోడించి సీత యట్లె
చేయఁగా శ్రీకంఠ శివ శంకరా మహా,దేవ లోకేశ్వరా పావనతమ
రూప నిన్నెఱుఁగ నేర్తురె బ్రహ్మముఖ్యులే, ననఁగ నేనెంతవాఁడను మహాత్మ!
తే. నిన్నుఁ గొలువంగ నేర్చిన నిపుణులెగద, ముక్తిఁ గాంతురు నీశక్తి భూరితరము
వేదవేద్యము మునివరబృందవినుత, మఘనికృంతనదక్ష మా హర! కపర్ది! 933

దండకము శ్రీకంఠలోకేశ లోకాధిపా స్తోక భక్త్యర్పితారాధన ప్రీత, ప్రీత్య
ర్పితాత్యల్పపూజాపదార్థా తిమోదప్రదత్తాఖిలైశ్వర్య సంతుష్ట, మానీంద్ర

రాజేంద్ర దేవేంద్ర మౌళిప్రకీర్ణాంఘ్రిపంకేరుహద్వంద్వనిష్యందపుష్పాసవార్ద్రీ
కృత స్ఫారభవ్యాసనా, వాసనాయత్త దుష్కర్మనిర్మూల నాత్మీయనామస్మృతీ,
నామస్మృతిప్రాప్తభద్రప్రమోదాంతరంగ స్వభక్తవ్రజా, దేవదేవా, మహా
దేవ, నిన్నెన్న నే నెంతవాఁడన్ బ్రభూ, పాలసంద్రంబు నాసక్తిచేఁ బూని దేవా
సురుల్ మందరాద్రిం ద్రమున్ మంథమట్లుంచుచుం ద్రచ్చుచుండంగ నందుండి
రత్నంబులుం గల్పవృక్షంబు లింకన్ మహామూల్యవస్తువ్రజం బట్టె యావిర్భవిం
పంగ మాకంచు మాకంచుఁ జేకొంచుఁ బెల్లుబ్బుచుం ద్రుళ్లుచున్ బుట్టు నింకేమొ
చూడంగనౌ వానిఁ గైకొంద మంచెంచుచుండంగ లోకంబులం గాల్చు హాలా
హాలంబట్టె యావిర్భవింపంగ లోకంబులం గాల్చు తద్భీకరజ్వాలమాలాకలాపం
బులం గాంచి యత్యంతవేగంబునం బాఱుదిక్పాలకశ్రేణి విష్ణ్వాదులం గాంచి
యింకేల యివ్వారి నాశింపఁ సద్వస్తువుల్ గైకొనం గాని వీరొండు కార్యంబు సాధింప
లేరంచు నూహించి నల్దిక్కులం బాఱుచుం గాల్చుచున్ సుంత యేనడ్డమే లేక వీఁకన్
జగద్వ్రాతముం గొల్చినం గాని సంతృప్తి కాదంచు లోనెంచు చందంబు గానం
బడం బొంగు కోపంబు దీపింప రూపింపఁగా రాని తాపంబుఁ బ్రాపింపఁగాఁ జేయ
నూహించుచుం గ్రేళ్లువాఱంగ నద్దానిపద్దున్ నివారింపఁగా లేరికేరంచు లోనెం
చుచున్ దేవబృందంబు లత్యంతదీనత్వ మేపాఱ వే పాఱి, తీపారు చూపుల్ పిసా
ళింపఁగా జేయుచున్ భక్తబృందంబులానందమున్ సంద్రమందూఁగుచున్
మున్గుచున్ లేచుచున్ జాలఁ గ్రీడింప నవ్వానియానందమే స్వీయమంచెంచి మో
దించుచుం బొల్చు నాపార్వతీజాని లోకాళి సంరక్షకుండంచు వీక్షించి రూక్షం
బుగా మమ్ము బాధింప నేతెంచు హాలాహలప్రజ్వలద్ధవ్యవాహ ప్రతాపంబు మాపంగ
నీవే సమర్థుండవంచున్ మఱొక్కండు లోకంబులన్ గానరాడంచు లోనెంచి
నీ చెంతకున్ జేరి నాయయ్య! మాయయ్య! మేయయ్యలుం గానరారియ్యెడన్
నీవె దిక్కింక మమ్మెల్లఁ జేకొంచుఁ గాపాడఁగాఁ బూనెదో, మృత్యువక్త్రంబునం బడఁ
గాఁ జేసెదో యంచు ఘోషించు వారిం బ్రసాదైకదృష్టిన్ విలోకించి హాలాహల
స్ఫారఘోరత్వమాత్మన్ విలోకించి యాలస్యముం జేయఁగా రాదు లోకంబులం
గాచుటే స్వీయకృత్యంబుగా నెంచకే యూరకున్నం బ్రభుత్వంబు రాణించునే
యంచుఁ జెంతం బ్రతీక్షించు లోకైకమాతం గృపాపూత వీక్షించి యే క్షోభమున్
మాన్పకే యూరకున్నం బ్రపంచంబు పంచత్వముం బొందు నేమందు వో యిందు
బింబాననా! యంచుఁ బ్రశ్నింప నింకేల యాలస్యమంచుం బ్రచోదింపఁగాఁ బోయి
యా క్ష్వేళముం బట్టి ద్రాక్షాఫలంబట్లు మ్రింగన్ జగద్వ్యూహముల్ గ్రుంగ
కుండంగఁ జేయంగ నీకంటె వేఱొక్కరుం డుండునే శంకరా! నీవు నాపాపతూలం
బులం గాల్చి నన్నుం గటాక్షించి కాపాడవే దీనబంధూ మహాత్మా నమస్తే నమస్తే
నమః. 934

చ. అని ప్రణమిల్లి శంకరు మహాత్ముని గొల్చెను సీత యవ్విధం
బున నుతిచేసె; నంతఁ గపిపూజ్యులు గొల్చిరి వాయునందనుం
డనుపమభక్తి వందనసహస్రములం బొనరించె నంత న
ద్దనుజవరుండు వ్యోమనినదంబున కెంతయు మోదమందుచున్. 935

క. వందనములు శంకరునకుఁ, బొందుగ నర్పించి నిత్యపూజ లొనర్పం
గం దమి నొందెను రాఘవుఁ, డందఱఁ గని పుష్పకంబు నధిరోహింపన్. 936

క సమయమరుదెంచె నెక్కుడు, గమనము సాగింత మనుచుఁ గడువేడుకతోఁ
బ్రమదామణితో నెక్కెను, సుమహితయానంబును సహజుఁడు కపివరుఁడున్.

క. ఎక్కిరి పవనాత్మజుఁడున్, దక్కంగల కపులు దనుజతల్లజముఖులున్
మక్కువ నెక్కిరి పుష్పక, మొక్కగతిం బోయెఁ బ్రీతి వ్యోమపథమునన్.

తే. కానఁబడియెఁ గిష్కింధ యక్కడ రఘుపతి, దానినిల్వంగఁ బ్రార్థించి భానుపుత్త్రు
గాంచి పలికెను గపిగణకాంత తార, మొదలుగాఁగల స్త్రీరత్నములను బ్రీతి.

చ కనుఁగొనఁగోరె జానకి; యిఁక జవమారఁగఁ బిల్వఁబంపు నా
ననిలకుమారుఁ డంగదుఁడు నప్పుడ పోయి కపీంద్రపత్నులన్
గని రఘురామునాజ్ఞ యిది క్రన్నన రండని పిల్వ వచ్చి; రా
వనితల గారవించి రఘువర్యునిపత్ని ప్రమోద మొప్పఁగన్. 940

చ. హరిపతిఁగాంచి యిట్లనియె నార్యవరా! ననుఁగూడి వీరు వ
త్తురు పురిదాఁక సమ్మతిని దోఁపఁగఁజేసిన మీరలన్న భా
స్కరసుతుఁ డంబ! యట్లె తమకింపె బ్రియంబునఁ బిల్చువారలుం
దురె ధర వత్తు రప్పురికిఁ దోడనె మీపదయుగ్మసేవకై. 941

చ. అనిమరియాద భక్తిభర మత్తఱిఁ గన్పడఁ బల్కె; నంత నా
వనితలమిన్నలందఱును బార్శ్వమునం దమిఁగూరుచుండ నా
జనకజ ప్రీతిపూర్వకవచస్తుతి వారల గారవించుచున్
జనిరె రఘూద్వహుండు తనసాధ్వికి బూర్వచరిత్ర మంతయున్. 942

క ఆదరమున వినిపించుచు,నాదట బలీంద్రునంగ మగ్నికిడినయా
మేదినిని జూపి యిట్లను,నోదయితా! యిట్టిబంధువుండునె జగతిన్. 943

క. పరులకు నుపకారముగా,శరీరమున్ వదలినట్టిజనుఁడె సుకృతి నాఁ
బరఁగును జగంబున నుదా,హరణ మ్మితండె దాని కరయం దొలుతన్. 944

సీ. అనిపల్కి మారీచు హరిణరూపముఁ బడ,నేసినతావు, నహీనదుఃఖ
ములఁబొక్కియుండఁ దమ్ముఁడు తన్నునూఱడిం,చినచోటు, నాశ్రమసీమనున్న
ఫలవృక్షములు చాలఁ బర్వఁగానున్నట్టి,పంచవటిని; మఱి పరమమౌను
లాశ్రయింపఁగ దనుజావళిఁ జంపంగ,శపథ మొనర్చినస్థలము, మఱియు

ఆ. నెందు నెందు నేమి హితకార్యములు సల్పె, నెంచినట్టి తావు లెల్ల నివిగొ
యనుచుఁ జూపుచును మహావేగమునఁ బోయి, చిత్రకూటశిఖరిఁ జేరి యచట

భరద్వాజాశ్రమమున రామాదులు నిల్చుట.

చ. మనమున వ్యోమయానమును మందగతిం జనునట్లు వేఁడి చెం
తనె మునివర్యు నాశ్రమవతంసము పొల్చుట యెల్లవారికిం
గనఁబడఁ జూపి యిందు మునికాంతుని జూచి చనంగ నొప్పు నా
మునికిని మాటయిచ్చితిని పూర్వమె దానిని మీఱవచ్చునే. 946

ఆ. అనుచుఁ బుష్పకంబు నవనికిఁ దిగునట్లు, వేఁడి యెల్లవారిఁ గూడి పోయి
యందు నున్న మౌని నా భరద్వాజుని, గాంచి మ్రొక్కె జనకకన్యతోడ. 947

క. అందఱు నమస్కరింపఁగ, సుందరతరువరములకడ సొరిదిగఁ గూర్చుం
డం దా నొనరిచి మునిపతి, యుం దమి క్షేమంబు లడుగ నుర్వీపతియున్. 948

సీ. చిత్రకూటము విడిచినదిన మాదిగా, నంత దాఁక సాగినట్టి చరిత
మంతయు వినిపింప నమ్ముని నీచరి, తం బెల్ల ముందుగఁ దత్త్వదృష్టిఁ
గనినాఁడ నీవిమ్మహిని బుట్టినట్టి కా, ర్యములు సాగెను జక్క నమరవరుల
వాంఛలు ఫలియించె వరమెద్ది యేఁ గోరు, మాశీర్వదించెద ననిన రాముఁ

ఆ. డాదరమున నందు నసమయమునఁ గూడఁ, దరువులెల్లఁ బుష్పభరితములయి
ఫలము లొప్ప వెలయవలయు నీకరుణ నా, నట్లె యనియె; నవ్విధి యపుడె యలరె.

చ. భరతుచరిత్ర మామునియె పల్కఁగ నెంతయు నాలకించి ని
ర్భరమగుచింత నాజ్ఞ యిడ వచ్చెఁగదా జవమారఁ బోయెదన్
వరగుణశాలిఁ గన్గొనెడు వాంఛయె నాయెడఁ గల్గె నన్న భూ
వర! యిట నేఁడు పుచ్చి చన వచ్చెఁగదా పురిఁ జేర రేపవన్. 950

ఉ. మౌనివరా! ప్రసాదని సమస్తకపీంద్రులఁ గూడి యాదినం
బానిలయంబునం దొగి మహాముని యాత్మతపోబలంబునం
బూని యొనర్చు విందునకుఁ బొంగుచునుండి తదీయహార్ద్యసం
తానము లెందు లేమి మునిధర్మమహత్త్వముఁ గారవించుచున్. 951

తే. గడిపె నాదిన మంతయుఁ గపులఁ గూడి, చని యెఁబదునాలుగైన వర్షములు నాఁటి
తోడ; నంతట లక్ష్మణుఁ గూడి యెంచి, భరతునకు ముందు దూతఁ బంపఁదగుననుచు.

చ. మరుదధిపాత్మజుం గని సమస్తభరంబు త్వదుత్తమాంగమం
దరసిన నిల్చియున్నయటు లౌఁగద వత్స! కృపానిధీ! మునీ
శ్వరుకడ నాశిషంబుఁ గొని వచ్చెద; ముందుగ నీవు పోయి యా
భరతున కస్మదాగమనవార్తను దెల్పుము దాన మేలగున్. 953

చ. అతఁడు వచించె నీనియమ మంతయుఁ దీక్షిచి యాలసింప కా
ధృతి నను జూడ రావలయు నించుక యేఁ దడవైన నగ్ని కా

పాలితిగ శరీరమిత్తునని ‡ యొప్పఁగబల్కిన వత్తునంటి న
వ్వితమున నేఁడెగా గడువు; ‡ వేగమ పోఁదగుఁగాదె మారుతీ! 954

ఉ. తప్పఁడు మాటయించుకయు ‡ దాఁపక చెప్పుమనస్సులోని దె
ల్లప్పుడు ధర్మమార్గమునయందె ప్రయాణముచేయుచుండు నా
యొప్పులకుప్ప నేమనుట ‡ కొల్లదు ప్రాణము పావనీ! జవం
బొప్పఁగబోయి మే మిచటనుండుట వచ్చుట తెల్పుఁగాఁ దగున్. 955

ఉ. మానివచించె వానినియమంబు విచారము గల్గఁజేసె; నా
మానసమందు నయ్య దనుమానము హెచ్చుగుచున్న; దిప్డు నీ
మానసవేగ మొక్కటియె ‡ మామకజీవితదానదక్షమౌ
నే నిఁకఁజెప్ప నేల? తగునీతుల నీవె యెఱుంగు దంతయున్. 956

మ. అని రాముండు వచింపఁ జిత్తమని యత్యంతప్రియంబొప్ప వం
దనముల్ చేసి క్షణంబునం జని యుదంతం బెల్లఁ దెల్లంబుగా
వినిపింతున్ భరతుం బ్రియంబుగనఁ గావింతుం బ్రయత్నంబు మీ
రనుమానింపక రాఁదగున్ బ్రభువరేణ్యా! రామచంద్రా! త్వరన్. 957

క. అని రాముసెలవుఁ గైకొని,చనియెన్ హనుమంతుఁ డంత ‡ సంయమివర్యుం
గని మాటలాడి పోవం,గను బూనెన్ రామమూర్తి ‡ కడు జవమలరన్. 958

తపఃప్రభావము.

చ. హరులకుఁ దద్వరేణ్యులకు ‡ నారఘువర్యులకున్ మనంబులం
దరుదిదియంచుఁ దోఁచునటు ‡ లమ్మునివర్యుఁడు విందుచేసె; నె
వ్వరుసఁ దలంచినన్ మునినివాసము వస్తువిహీన మౌఁగదా
పరమతపఃప్రభావమున ‡ భాసిలువస్తువు లవ్వియే యగున్. 959

చ. ఎవ రెదికోర నయ్య దపుడే కనుపట్టును వారిముందటన్
వివిధవిధప్రయోగముల ‡ వింతగఁ గన్పడు; నవ్వి బ్రహ్మసృ
ష్టివిధమునం దలంపఁబడి ‡ సృష్టిచమత్కృతిమించి యుండు; న
ట్లవితతతృప్తి నిచ్చునవి ‡ యచ్చట కెట్టులువచ్చె నం చెదన్. 960

చ. తలఁపఁగ సందియంబె తగుఁ ‡ దన్మునిశక్తియెగాని వేఱుగాఁ
దలఁపఁగరా దటం చనినదానికిఁ గారణ మెద్ది యన్న య
ప్పలుకు వినంబడున్ ముని తపఃఫల మెల్ల వ్యయించి యిట్లువా
రల నలరించె నన్న నుడి ‡ రమ్యముగా దిఁకఁ దత్త్వ మేమనన్. 961

సీ. ఇది యల్పమగు సిద్ధియే యనంజను దీని,కధిదేవతలగుదు ‡ రఖిలచిత్ర
వస్తువుల్ రప్పించు ‡ వాంఛగల్గిన వార,లాయక్షిణులయందునాత్మ కెద్ది

హితమంచుఁ దోఁచునోయిది కర్మసంగతి,కనురూపమగునో యయ్యాదియు వారి
కిష్టంబుగానుండు । సృష్టికార్యంబున,యశముగాంచఁగ వారలాస పడుదు

తే. రట్టి యక్షిణి నర్చించియద్దిసిద్ధి,యయ్యోనని యాత్మ నెఱఁగి నేయ్యమున దానిఁ
దఱినెఱింగి కనంబడఁ । దా రోనర్తు,రదియె కల్పించు నెవ్వార । లెది దలఁచిన.

వ. మర్త్యంబునంగల వస్తువారంబుల రప్పించుదానికి నింద్రజాలంబనియు, దేవాది
లోకంబులనుండి వస్తువుల రప్పించుదానికి మహేంద్రజాలంబనియు నామంబు
లొప్పియుండు. యక్షిణీనామక దేవతలే యీకార్యంబుల సిద్ధింపఁజేయఁజాలు
దురు తద్దేవతాసిద్ధి యత్యంతకష్టసాధ్యంబై యుండు. 963

చ. మనుజులు సంచరింపని తుహిమాధరమందో వనంబునందో రా
త్రి నిలిచి ధైర్యమూని పరదేవతగా మదినమ్మి సద్గురూ
క్తనియతి మంత్రముఁ జపవిధానమునన్ స్మరియించుచుండఁగాఁ
జను నొకయామమే మనసు చంచలతం గనకుండునట్లుగన్. 964

సీ అది యర్ధరాత్రమే । యగునట్టులుండనౌఁ,దాంబూలచర్వణ । తత్పరతను
గంధమాల్యాద్యలంకార పూర్వకముగఁ,దనువును గైచేసికొని జపింప
వలయు; దేహము చూడవలసినయట్లుగా,నుండఁగాఁదగు నంచు నొగివచించు
నాగమంబులు వాని । ననుసరించియె చేయ,నౌఁ గాని యార్ద్రవస్త్రాదికముల

తే దాను ధరియింప రాదట్లు । మౌనమూని
మంత్రము జపించుచుండ యామంబు కాఁగ
నెన్నియో చిత్రములు దోఁచు । నన్నిట మది
గదలకుండఁగ నియమింపఁగఁ దగు నతఁడు. 965

చ. మనమున భీతిఁగాంచ కనుమానము నొందక మన్మథార్తినిం
గనక పరాంబగాఁ దలఁచి । గాఢభక్తిఁ దదీయపాదచిం
తనమున నుండఁగావలయు । ధైర్యమె తోడుగ దండనుండు నా
తనివెఱపించుఁ గాముకుని । దద్దయుఁ జేయఁగఁ బూను నెంతయున్. 966

చ. అసదృశరూపసంపదల । హారివచస్సుల రమ్యగీతనృ
త్యసమయభేదభావములఁ । దన్మతిఁ జక్కఁబరీక్ష చేయు న
శ్మసమత గాంచునే నతనిస్వాంతము దా నపుడాత్మ మెచ్చి చెం
త సమధికాదృతిన్ నిలిచి । తాఁ జనుదెంచుట తెల్పి భక్తుఁడా! 967

ఉ. కోరెదవేమి నీవు మదిఁ । గుందకు; మింక జపంబు చాలు; నేఁ
జేరితి నీదుమ్రోల; జపసిద్ధి నొసంగితిఁ; గైకొనం దగున్
గోరికయొప్ప దుప్పతిలుఁ । గూడదు నీకొఱ కద్దియంచు నీ
వారసి యన్యులం దనుప । నాత్మఁదలంపుము నన్ను భక్తిచేన్. 968

క. ఏరీతి వినోదింపఁగఁ గోరుదువో వానినెల్లఁ । గొదువపడని య
ళ్లే రయమునఁ గూర్తును దు, ర్వారమ దెవ్వారి కంచుఁ బలుకఁగ నేలా. 969

క. నాసృష్టించెడు వస్తువు, లేసరణిం గొనఁగఁ బూనకే నీవుండం
గా సిద్ధించెడు నది లే, దే సమయున్ నాఁటితోడ । నిది తెల్లంబౌ. 970

చ. అని వరమిచ్చి చేయఁదగు నాచరణం బిది యంచుఁ దెల్పి పో
వును; గరుణాభరంబున విభూతుల నియ్యది యుం డటంచు న
మ్మనుదగు; నిట్టిసిద్ధులనె । మానులుకూడను దొల్తఁ గాంతు; ర
ప్పని గన నద్భుతంబనుచుఁ । బల్కఁగ నొప్పు ధరాతలంబునన్. 971

సీ. ఎవ్వి గోరిన వానినెల్లఁ గన్పడఁ జేయు, నెందఱు భుజియింప । నెమ్మిగనిన
నందఱకుం దృప్తియగు నట్లు చేయును, శయ్యాదులం గూర్పఁ । జాలు నదియె
క్షణసృష్టి యని దానిఁ జనుఁ జెప్ప నావస్తు, వులు కల్పితంబులే । వలసినన్ని
గొనవచ్చుఁ దినవచ్చు మనసున కెక్కంగఁ, జూడవచ్చును వాని సొంపు మిగుల

తే. వర్ణనార్హంబుగాఁ దగువచ్చు నవ్వి, యెచటనుండి యనంజన దెచటనుండి
యవ్వి రావని చెప్పంగ నగును; వారి, వారి కయ్యవి తోఁచుఁగా వలసినట్లు 972

చ. కనులకుఁ దోఁచు నాఁకలిని । గ్రన్నఁ బాపును దాఁపఁ గోరినన్
గనఁబడుచుండు; సృష్టియది । కల్పితమేయనఁ జెల్లుఁగాని లో
కనికరమందు నెందయినఁ । గాని యవుండవు; వానినెల్ల నొ
క్కనిముసమందు నున్నయటు । గన్నడఁ జేయు మహత్త్వ మొప్పఁగన్. 973

ఆ. దానిచిత్రగతులు తరమె వర్ణింపంగ, నెవరికైన నద్ది యే యొసంగు
నింద్రజాలమన మహేంద్రజాలం బన, యక్షిణియె సృజింప నర్హారాలు. 974

చ. తపము వ్యయించి రామునకుఁ । దన్ముని విందొనరించె నంచు నెం
చి పలుకరాదు; స్వల్పమగు । సిద్ధి యిదౌట మనంబునందు నా
నృపతికి నర్హాభోజనము । నేర్పున నిర్మితిఁ జేయు మంచు మా
నిపతి తలంచె; దాననె జనించెఁ బదార్థము లెల్లఁ దత్కృపన్. 975

క. ఇది క్షణసిద్ధియనం దగు, మది కెంతయు మోదమిచ్చు । మానకయిట్లే
పొదలెడు వేడుకఁ జేయం, గొదవపడు సిద్ధియద్ది । క్షుద్రంబగుటన్. 976

ఆ. ఇదియె దీనితత్త్వ మిట్టివానికి సిద్ధిఁ, గాంచ నాశ్రయింపఁ గలుగు దుఃఖ
మల్పఫలద మౌట । నందులకే మునుల్, పూన రిట్టిపనికి । మానసముల. 977

హనుమంతుఁడు గుహునకు భరతునకు రామునిరాకఁ దెల్పుట.

చ. నరపతిమౌళి యానతి మనంబునఁ గౌతుక మావహిల్ల నం
బరగతి నేగి యాగుహుని । భవ్యమతిం గని రామచంద్రుఁ డీ
పరిసరమందె యుండి తగుభంగిని ముందుగఁ జెప్పఁ బంచె; స

త్వరముగ వచ్చు నన్న శుభవార్తకు దేహము పొంగిపోవఁగన్. 978

చ. అనిలజుఁ గౌఁగిలించుకొని యామహనీయునిరాకఁ దెల్పి తే
మని మరియాదఁ జేయఁదగు నార్య! నినుం బరిరంభసత్క్రియన్
మన మలరింతు నింకొకటిమంచిది గాదనియే తలంతు నం
చని నుతిచేయ నాతఁడు క్షణార్థము నిల్వఁగ రామిఁ దెల్పుచున్. 979

ఉ. ఆతఁడు ప్రీతుఁడై పనుప నప్పుడపోయి మహర్షి నాఁగ నే
ప్రీతియు లేక చిక్కిన శరీరముతోఁ దనముందు వీతిహో
త్రాతతకీలముల్ వెలయ నగ్నిఁ జొరం దలపోయుచుం దమిన్
భ్రాతను జూడఁ గోరుచుఁ గృపానిధి నప్పరమేశు నెంచుచున్. 980

చ. జరగెఁ జతుర్దశాబ్దములు క్ష్మాపతి యీదిన మేగుదెంచు నో
భరత! నినుంగనంగ నని వారని ప్రీతిని మాటయిచ్చె; నా
దరమున నన్నుఁ దన్నుఁగ నెదం దలపోయుమహానుభావుఁ డీ
శ్వరుఁ డిటవచ్చు నెప్పుడని సంతత మెంచెడుభక్తిపూర్ణునిన్. 981

చ. నను విడనాడుకాలమున నాపయిఁ జూపులు పర్వఁజేయుచుం
గను లరమోడ్చి యశ్రుకణకాండ మలీమసగండభాగుఁడై
చనుమిఁక నంచుఁ బల్కఁగను జాలక యాశ్రమసీమఁ జొచ్చె; నా
ఘనకరుణాలవాలుఁ గనుకాల మిదేయని చూచు దీనునిన్. 982

క. పరికించి మహాత్మా! రఘువరుఁ డిదియే చిత్రకూటవసతి నలరు మా
నిరమణు కడనున్నాఁ; డిపు, డరుదెంచున్ సీతతోడ ననుజునితోడన్. 983

చ వనచరనాయకుల్ గొలువ వచ్చెడు నిప్పుడె నన్ను ముందుగాఁ
బనిచె భవత్సమీపమున భద్రము తెల్పఁగఁ; బుష్పకంబునాఁ
దనరువిమాన మెక్కి యన ధన్యుఁడనైతిఁగదా యటంచుఁ బా
వనిఁగని యాదరం బెసఁగ భవ్యమతీ! దయ రమ్ము చెంతకున్. 984

మ. తరుణీరత్నము సాధుశీలయగు నాథాత్రీకుమారిన్ సహో
దరు సౌమిత్రిని గూడి పుష్పకముపైఁ దాత్పర్యమేపార నీ
భరతుం జూడఁగ వచ్చువాఁడె; కృప నవర్ధిల్లఁగాఁ జేయు నే?
పరమామోదముఁగూర్చె నీవచనముల్ పండెం దపంబుల్ కడున్. 985

చ. వనచరవర్య! మిత్రుఁడన బంధువునాఁ దగుదీవె; ప్రాణముల్
తనువున నిల్పితీవు ప్రమదం బొనఁగూర్చెదుపల్కు చెప్పి; రా
ముని గనఁజాలనేని హుతభుగ్వరకీలములందుఁ జొచ్చెదే
వనిలయముం గనంజనఁగ వాంఛను గంటినిగా మహాత్మకా! 986

ఉ ఎప్పుడువచ్చు రాఘవుఁ; డదెప్పుడు నన్ దమిఁ గౌఁగిలించు; నా
యిప్పుని యెప్డు గైకొను; నదెప్పుడు పీఠము నెక్కు; నెక్కి తా

నెప్పుడు ప్రోచు రాజ్యము; నఽదెప్పుడు మాదగుకింకరత్వముం
దప్పక కైఽకొనుం; జెపుమ ఽ దైవ మనంగనునీవె నా కిటన్. 987

క. అనిప్రశ్నించిన మారుతి, యనుమానము పాయునట్టుఽలా రాముని చ
ర్యను దెల్పి పుష్పకం బదె, చనుదెంచెడు ననఁగ గాఢఽసమ్మద మలరన్. 988

చ. పరిజనయుక్తుఁడై సకలఽబాంధవులం గుమిగూర్చుకొంచు నా
దరము నయంబు భక్తియును ఽ దత్పరతం దనయందె నిల్వఁగాఁ
బరుగిడె; సోదరుండు తనఽపార్శ్వము వీడకరాఁగ భ్రాతృప
త్సరసిజయుగ్మదర్శనజ ఽ సంభ్రమ మెంతయుఁ బ్రోత్సహింపఁగన్. 989

మ. వినువీథిం దొలుతన్ గనంబడియెఁ బ్రాఽవృట్కాలవిద్యుచ్ఛటా
ఘనకాంతిప్రసరంబు నాఁదగు మహాఽర్ఘవ్యోమయానప్రభల్
వెనువెంటన్ మహనీయపుష్పకము, నాఽవెంటన్ శచీనాథము
ఖ్యనుతివ్రాతము, దానివెంట ధరణీఽకన్యాధవాంగద్యుతుల్. 990

ఉ. అంతట రామచంద్రు జనఽకాత్మజ లక్ష్మణు నింకఁగల్గుదు
ర్దాంతభుజాబలాఢ్యకపిఽతల్లజవారము భల్లుకవ్రజం
బింతయనంగఁ జాలనటుఽలేచిన దైత్యగణంబుఁ జూచి దుః
ఖాంతముగాంచినట్లు తనఽయాత్మ చెలంగఁగ నున్నతమ్మునిన్. 991

క. కనుఁగొని శ్రీరాముఁడు నెమ్మనమున ధ్యానించె నింక ఽ మహీకిం దిగుఁగా
కను నంతలోనఁ బుష్పక, మనుజుండగు భరతుచెంత ఽ నవనికి దిగియెన్. 992

శా. ఆనందాతిశయంబునం గనులు బాఽష్పాంబుప్రపూర్ణంబులై
గానన్ రాక చెలంగ యత్నమది యాఽకర్షింపఁ బాదాంబుజ
ధ్యానం బెట్లొ నమస్కరించునటు చేఽయన్ వ్రాలియున్నట్టి వి
జ్ఞానప్రాభవు భక్తవర్యు భరతున్ ఽ సాంద్రప్రమోదంబునన్. 993

చ. కరకమలంబులం దిగిచి ఽ కౌఁగిటఁజేర్చి బహూకరించి సో
దర! సుఖమున్నవాఁడవె? నిఽతాంతకృశత్వము నొంది నీకశే
బరము విచారముం గనఁగ ఽ వత్స! యొనర్చెదు నంచు రాముఁడా
దరణముమీఱఁగాఁ బలికి ఽ దస్యుహరుం బినతమ్మునిం ద్వరన్. 994

సీ. కౌఁగిటంజేర్చి యఽక్కడివారు వెఱగంద, లాలించి బాంధవుఽలను దగంగ
మన్ననలం దన్పి ఽ మన్నించి ప్రకృతుల, నందఱితోడ నాఽనందగమన
మునను నందిగ్రామఽమును జేరి పౌరులు, మంత్రులుహితులుసాఽమంతులుదనుఁ
బురికొల్ప జడలు విఽప్పుట తొల్త సాగఁగాఁ, బరిమళతైలంబుఽశిరము రాజ
తే. లక్షణంబులఁ జెలువార ఽ లలి నొనర్ప, స్నానమొనరించి ధౌతవఽస్త్రములఁదాల్చి
జానకియు నట్లియన్వయాఽచారముల నొనర్ప లక్ష్మణుఁ డట్లె యొఽనర్చినిలువ.

చ. మునిపతియా వసిష్ఠుఁడు ప్రమోదమునం జెలువారి మారుతిం
బును వచియింప నెల్లరును బొంగుచుఁ దత్ పురికొల్ప రాముఁడుం
జనఁ దమిఁబూనెఁ; దగ్గనఁగ సంతసమందుచు వచ్చియున్న యా
జనుల గారవించి వరుసం బ్రియమందఁగఁ జేసె నందఱన్ 996

ఆ. పుష్పకమును గాంచి పొమ్ము కుబేరుని, కడకు నాకుఁ దోడుపడితి వాత్మ!
మెచ్చుకొంటి నిన్ను నిచ్చట నుండఁగా, నేల పోవఁ జనును హితము మెఱయ.

చ. అని వచియింపఁ బుష్పక మదాదృతిమీఱఁగ నుత్తరంబుగాఁ
జని ధననాథుచెంత బలుసంతసమొప్ప వసించె; రాఘవుం
గని మునినాథుఁ డిట్లనియెఁ గాననవాసమహావ్రతంబు చ
క్కనివిధిఁ బూర్ణమయ్యె నికఁ గైకొనఁగాఁదగు రాజ్యభారమున్. 998

ఉ. తమ్ముల నాదరింపు మొగిఁ దల్లుల నెల్ల బహూకరింపు మో
దమ్మెసఁగంగఁ బౌరులను దన్పుము మిత్రుల నూఱడింపు; పం
తమ్మున బంధుజాలముల దానబహూకరణమ్ములన్ మనో
జ్ఞమ్మగు వార్తలన్ నృపతిజాలముఁ దన్పుము లెమ్ము పోవఁగన్. 999

ఉ. మారుత మింతలోన సుఖముం గలిగింపఁగవచ్చు; నంతలో
నోరఘువర్య! పత్తనము నొంది యథావిధి సింహపీఠికం
జేరి స్వధర్మముం గొనఁగ సిద్ధముగాఁ దగు; నన్న రాముఁ డ
వ్వారల నెల్ల మోదరసవారిధిముంచె యథార్హపద్ధతిన్. 1000

సీ. అంతట మానుల యాజ్ఞ భద్రగజంబు, పై నెక్కి రాముండు ప్రమదఁగూడి
సహజన్ము లవ్విభీషణకపిరాజులు, తక్కినవారలు తగినయాన
ముల నధిష్ఠించి; రా నెలమిమీఱఁగ నయోధ్యాపురంబును జేర నరిగె; నంతఁ
బౌరాంగనలు రామభద్రుని సీతను, గని తల్లిదండ్రులఁ గాంచినట్లు
తే. ప్రమదవారాశి మున్గి నేత్రములు గల్గఁ, గాంచఁదగు నెద్ది యద్దాని గంటిమనుచు
దంపతుల నింక నుం జూచి తరలిపోయి,రిగద యని చింతలం బూనిరి మదులందు.

చ. త్వరపడి రాఁ జనుంగద ముదంబును గూరుప నంచు నగ్రమం
దిరములవారు, మెల్లనిగతిం జనవచ్చును వేగమేల యం
చుటు ముదమొప్ప వెన్కఁదగి యుండు గృహంబుల వారలెల్ల ని
వ్వరుసలఁ జూచు వేడుకలఁ బల్కుచునుండఁగ నాలకించుచున్. 1002

శ్రీరామచంద్ర పట్టాభిషేకమహోత్సవము.

క. మంచిముహూర్తంబున ముని, సంచయములఁగూడి కీశసత్తమముఖు లా
లించుచుఁ దద్వాక్కుల రా, నంచితగతిఁ జొచ్చె రాజసౌధం బెలమిన్. 1003

క. అనుజులు తగుపరికరముల, నొనఁగూర్పఁగ వానరేంద్రుఁ డుదధినదనదీ
వనజాకరములఁ దగు పా,వనజలములఁ గలశములను వడిఁ దెప్పింపన్. 1004

క. సురుచిరమంగళవస్త్రా,త్కరములఁ గూర్పంగ మానిని । కాంతుని యాజ్ఞం
ద్వరపడి యందఱు శ్రీరఘు,వరు నభిషేకింపఁ గోర్కె । వర్ధిల్లంగన్. 1005

చ. జనకసుతాసమన్వితుని । సాధుమతిన్ రఘురాము భద్రదం
బనుపమ రత్నసంయుతము । నౌవరపీఠమునందు నుంచి శా
స్త్రనియతిచే వసిష్ఠముని । తల్లజుఁ డాకలశోదకంబులన్
గొని యభిషేకకృత్యమును । గోరికమీఱ నొనర్చె నవ్వలన్. 1006

చ. వరుసఁగఁ దత్ప్రయుక్తవిధి । నర్థిలు నట్లభిషేకకార్యమున్
జరపిరి; దేవతావళులు । సంతసమందెను; సాధుగీతముల్
పరఁగె నభంబునందు; నర । పాలకులెల్లరు నిర్భయంబుగా
దిరుగఁగవచ్చు నంచు నృప । ధీరుని మెచ్చిరి నిర్మలాత్ములై. 1007

క. వసువులు వాసవునింబలె, నసదృశభక్తిప్రమోద । హారి మనములన్
బిసరుహమిత్రాన్వయు మా,నిసమర్చితు రామచంద్రు । నిన్ శాస్త్రవిధిన్. 1008

క. మునిముఖులభిషేకించి ర,వనికిన్ క్షేమంబుఁ గోరి । వరధర్మస్థా
పనకార్యము సాగును దు,ర్జననాశం బగునటన్న । సంతోషమునన్. 1009

సీ. ఆసమయంబున । నఖిలభూతంబులు, మోదసాగరమున । మునిఁగి తేలె
మృగములు పక్షులు । మించినసంతోష,మున శాంతినివహించి । పొలిచె మిగులఁ
దరువులు లతలును । దమసంతసము ఫల, పుష్పరూపంబునఁ । బోలఁ దెలిపె
ధేనువుల్ క్షీరసం । తృప్తిని గలిగించె, ధర్మమ్ము నాల్గుపా । దములఁ దనరెఁ

తే. బతియె దైవంబటన్న భా । వంబు స్త్రీల, కమరె బహుభార్యలంగోరు । నాశ తొలఁగెఁ
బురుషులకు భేదభావంబు । పోయె నెల్ల, వారలకు నిత్యసంతృప్తి । పఱిలె జగతి.

మ. కరుణాసింధువు రామమూర్తి తనదౌ । కల్యాణలాభంబు త
ద్ధరణిం గల్గినవారికెల్ల నని ని । త్యం బెన్నుచుండెన్; మహీ
వరుఁడై యెల్లర కెన్నఁ దండ్రియయి హృ । ద్వాంఛాప్రదుండై తగన్
నరులెల్లన్ మునులై చెలంగిరి గురు । న్యాయైకసంసక్తిచేన్. 1011

చ. జనపతి పట్టభద్రుఁడయి । సంతసమొప్పఁగఁ దొల్తఁ గంఠసీ
మను వెలుగొందు హారము న । మర్త్యమణీగణభూషితంబు నా
జనకజకిచ్చె; నామెయు నె । సంగెడు వేడుక నాథుఁ గాంచి దా
నిని మరుదాత్మజన్మునకు । నిర్భరమోద మొసంగ నిచ్చినన్. 1012

ఆ. మోముఁదమ్మివిరియ । భూపుత్రిఁ గని సీకుఁ, గలుగుమోదమునకుఁ । గారణంబు
తలఁప నితఁడెసుమ్ము । ధరణిసీతనికంటె, బంధు వరయ లేఁడు । భక్తుఁ డితఁడు.

క. ఏమిచ్చెదవో చూచెద,నా మానిని యిట్టులనియె । నాథుఁడు వినఁగన్
ప్రేమభరంబున నెల్లర, కామోదము గూర్పఁ జాలు । నట్లు కొలువునన్. 1041

చ. అనిలకుమార; నీవు ధరయందుఁ జిరాయువుగల్గి నిర్మలం
బనుపమ మార్యమోదదము నా యశముంగని భక్తవర్యరా
జిని దొలుతన్ గణింపఁదగి శ్రీరఘురామయశంబు చాటుచున్
నినుఁ గొనియాడువారలకు నిత్యసుఖం బిడుచున్ జెలంగుమా. 1015

క. అనివరమిచ్చెను రాముం, డనిలకుమారా! ధరిత్రి యాత్మజ ప్రీతిం
గని పల్కినట్లు వెలయుము, వనజజుపద మొందఁగలవు బహుకాలమునన్.

సీ. అనివరమిచ్చి దైత్యాధిపసుగ్రీవ,ముఖులకుఁ బ్రియమున భూషణాంబ
రాదుల నొసఁగి నెయ్యమునఁ దక్కినవారి, నర్హగౌరవముల నలరఁజేసి
తండ్రియాశ్రితులకుఁ దగినచందంబునఁ, బారితోషిక మిచ్చి భరతు యావ
రాజ్యపదంబునఁ బూజ్యభంగిని నిల్పి, కొంతకాలము వారిఁగూడి గడిపి
తే. భానుపుత్త్ర విభీషణుల్ భక్తి నందె, నిలువఁగోరిన వలదని పలికి వారిఁ
బురములకుఁబంపి పావని పొందు గోరి, నిలిపి ధర్మంబుఁ దప్పని నియతి నలరె.

సీ. రామాయనమ యని భూమీశ్వరులు రామ, భద్రాయనమయని పౌరవరులు
సరసిజాక్షులు రామచంద్రాయనమ యని, మునివరుల్ వేధసే నమ యని
దశరథబంధుసంతతి యాదృతిన్ రఘు,నాథాయనమ యని నాతిపిండు
నాథాయనమయని యాధరాసుతచుట్టు, లెల్లసీతాపతయేనమ యని
తే. మ్రొక్క రాసింహపీఠిక నెక్కియుండు, భద్రుని లోకపూజ్యుని భావనమతి
ధర్మరక్షకు సూనృతతత్పరుఁ బర,మేశ్వరుం గని ముదులందు నెసఁగు ప్రీతి.

క. క్రమవిరహితమరణము ల,క్రమవర్తనములును లేక రాముని రాజ్యం
బమరెను ధర్మహితంబయి, యమలజన స్ఫీతమగుచు నభివర్ణ్యమునై. 1019

## రామరాజ్యము.

సీ. కనరారు పాషండులనఁదగువారలు, హరిహరభేదంబు నాత్మగల్గు
మూర్ఖులు పరమతముల దూఱువారలు, కామ్యవ్రతంబులకయి శ్రుతిహిత
కర్మముల్ విడనాడఁగల యనాచారులు, సద్వ్రతంబులఁ జేయుశక్తి గలిగి
భక్తిహీనత వానిఁ బాటింపఁబూనని, దుర్మతుల్ సాధుమతుల నసూయ
ఆ. నిందచేయునట్టి నీచులు ధర్మకా,ర్యముల పేరుచెప్పి యర్థమెంతొ
కూర్చి బంధువులకుఁ జేర్చి సంతోషించు, పాపమతులు మద్యపాన రతులు.

చ. ధనమున కాసపూని యనృతంబులు పల్కుచు సాధుకార్యముల్
పనివడిఁ బాడుచేయఁ బలుబాములకైన సహించి యత్నముల్
పొనరిచి యవ్వి నెగ్గినఁ బ్రమోదమునొందెడు శుంఠలున్ మహా
వినయముచూపి సత్కృతికి విఘ్నముచేసి హసించు దుర్మతుల్. 1021

చ పతివిడనాడి దుర్మతిని బాలిశునైన ధనాఢ్యుఁగూడి యు
వ్వితమున లజ్జనొందకయి వీధులవెంబడి సంచరించుచున్
సతులను దూలనాడుచు నసంగత వృత్తిని బెంపుగాంచఁగా
మతిఁ దలపోయుచున్ సుజనమండలమున్ దిగనాడు సుందరుల్. 1022

చ. మగనికి రాజసన్నిధిని మన్ననఁగల్గనొనర్ప నెల్లరం
దగనివిధిన్ వరించి ప్రమోదంబును వారికిఁగల్గఁజేసి వా
రొగి సహకారులై తనకు నొక్కరవంతగఁ దోడ్పడంగఁ బె
క్కుగతుల వారినెప్పుడును గోరి భజించెడు నంగనామణుల్. 1023

తే. అర్థవంతులు నీచులే నాశ్రయించి, మంత్రముల నుపదేశించి తంత్రములను
నేర్పిద్రవ్యముగైకొని నెమ్మిగనుచుఁ, బుడమినిజరించుబ్రాహ్మణబ్రువులుమఱియు

ఆ. దంభవర్తనులు నధర్మమార్గప్రచారకులు నతురతులు రాజహాని
కుద్యమించునమ్మహోగ్రపాతకులు నట్లంగనాసమాగతార్థరతులు. 1025

వ. మఱియు నా రామరాజ్య పాలనంబు సమయంబున. 1026

సీ. అతిథిపూజాసక్తులవిరళజపహోమ, దానసదాచార తత్పరులును
సత్యవాదులు ధర్మశాస్త్రతత్త్వజ్ఞులు, గురుపాదభక్తులు పరసహాయ
నిరతి గన్నట్టియనింద్యచరిత్రులు, దైవకార్యైకతత్పరులు మాని
వాక్యమాదరణ నిర్వహణప్రమోదులు, వేదశాస్త్రపురాణవిద్వరేణ్యు

తే. లాశ్రమోచితమితహితాహారతృప్త, లధ్వరాసక్తు లఖిలమంత్రాళి విహిత
షట్ప్రియోగానుసంధానసరణితత్త్వ,విద్వరుల్ పొల్చుచుందురుర్విఁదగుభంగి.

చ. అనుజులు తోడునీడలయి యయ్యయికార్యములన్ నితాంత ధ
ర్మనిరతిఁ బాయకుండఁ దగుమాడ్కిని దోడ్పడి నిర్వహింప త్మ
తనయ హృదాశయంబెఱిఁగి తత్క్షణమట్టులె చేయఁగా నిరం
జనుఁడయి మోదవారినిధిసంతతమగ్నుఁడైయి చెలంగుచున్. 1028

తే. కమలపత్రస్థజలబిందుగతిని దాను, రాజ్యభోగంబులం దగి ప్రాజ్యవిభవ
సంతతామోదమందుచు సర్వమునకుఁ, గారణంబగుసీత గొల్వఁగఁ జెలంగె.

క. మును లెల్లఁ బరబ్రహ్మము,గను సగుణబ్రహ్మమునుగఁ గరమనురాగం
బున మంత్రవిదులు ధ్యానింప నితాంతం బొప్పె రామభద్రుండు మహిన్.

క. ఎవ రేయేరూపంబులఁ, దవిలి తనున్ భక్తిమీఱ ధ్యానముచేయం
గ వివిధరూపంబులఁ దాన వారికిందోఁచుచున్ బొనర్చుచుఁ బ్రియమున్.

క. తనసర్వవ్యాపకతన్, గనఁజేయుచుఁ దనదుసర్వకార్యమ్ములు భూ
తనయయె సఫలముచేయంగ నిరంజనుఁడగుచుఁ బొల్చెఁ గాకుత్స్థుఁ డటన్.

## ఫలస్తుతి.

సీ. ఈకథ చదివిన నెల్లపాపంబులు, తొలఁగు నభీష్టసిద్ధులు పొసంగుఁ
బుత్త్రులఁ గోరినఁ బొడసూపుదురు; వారు, ధనముఁ గోరిన నెంతో ధనముగలుగు
విద్యను గోరిన వెలయు నయ్యది; వేగ, జ్ఞానంబుగోర నొసంగు నద్ది
ముక్తిని గోరెదు మోదంబు గన ఫలి, యించు నద్దియుఁ; గాలహితము గాంచి
తే. మఱియు నెయ్యది కోరిన మానక యది, సిద్ధి నొందును వేగమ; శ్రీరఘుపతి
కరుణ మెయిభక్తి యొక్కఁడు కలుగ నెద్ది, ఫలము గాంచక యుండు నొప్పగిదిఁ గనిన?
మ. కతఁ బ్రీతిం జదువంగఁ గాంక్షితము లోకాలంబునం దైన నే
గతి నూహించిన సిద్ధి నొంద వను శోకాకున్నె సిద్ధాంత మే
మతిమంతుండు కథారహస్య మెది యోమాడ్కిం దదీయార్థసం
గతిఁ జిత్తంబును పంగనౌ నని వితర్కంబుం దగం గాంచుచున్. 1034
మ. పరమేశున్ భజియించుచున్ సుజను లోపక్కిం బ్రవర్తించిరో
సరణిం దానినె యాశ్రయించి సుఖముల్ సాధింపఁగాఁ గోర కీ
శ్వర! నన్నుం గృపఁ జూడుమంచు నిను నోచందంబునం గొల్వనా
తెరువుం దాని నెఱుంగ నజ్ఞుఁడను నన్ ధీమంతుఁగాఁ జేయుమా. 1035
మ. అని సంప్రార్థన మొప్పఁ జేయ నగు శాస్త్రాచార మెట్లుండు జ్ఞా
నినికాయం బెటు లాచరించు నదియే నేఁ బూననౌ మార్గమం
చును జింతించి యచంచలత్వమును గాంచున్ బుద్ధి యేకాలమం
దని వీక్షించుచు నప్పుడ్ధ్యానమున సర్వాత్మున్ భజింపందగున్. 1036
చ. అదియె ఫలప్రదంబయిన యర్చన; కర్మగతిం బొసంగు నె
య్యది యదె యబ్బు దాననె; రవంతయు నాకిది చాలదంచు నెం
చఁదగదు, తృప్తి నొందఁదగు శాశ్వతశర్మ మొసంగు నద్దియే
సదమలచిత్తముం గనఁగఁ జాలును జేయఁగ నద్ది యెంతయున్. 1037
ఉ. అంతియ కాని రాముకథ యాదిదొరంకొని యంత్యభాగముం
బంతముపట్టి గాంచునటు పాడినయంతనె కోర్కెలన్ని యున్
వింతగదా ఫలించుటది వేఱేఁడి యూహయెగాక సత్యమా
వంతయు నుండఁబో దనుచు నారయఁగాదగు ధీరు లెప్పుడున్. 1038
తే. ప్రతిని మేషంబు శ్రీరామపదసరోజ, చింతనము భక్తిమీఱంగఁ జేయుట యనఁ
దపముటంచుఁ దలంపంగఁదగు ఫలాభి, సంధి విరహితమైనచో శాస్త్రహితము.
క. అనుపమరామచరిత్రం, బనుదిన మర్హప్రకార మాసక్తిఁ బఠిం
చిన వినినఁ దత్త్వసంయుతిఁ, గను టరుదే ముక్తి నతనికరుణ జవమునన్.
క. హరిహరవిరించిరూపా!, పరమేశ్వర! సాధుభక్తపాలనచతురా!
నిరుపమకరుణాసాగర!, గురుతరభవవార్ధిమగ్న కోలతనుధరా! 1041

శా. శ్రుత్యంతప్రతిపాదితాత్మవిభవాకారూఢా! మునీంద్రౌఘసం
స్తుత్యవ్యాపకతాది నిర్మలగుణా! సోమార్కనేత్రద్వయా!
సత్యశ్రీవిభవాన్వితా! విమలవిజ్ఞానైకసంపన్నిధీ!
ప్రత్యక్చిత్త సరోజహర్మ్యవసతీ! ప్రాచీనకర్మాకృతీ! 1042

సింహరేఖః—

సారసద్గుణాలిహారా!
భూరి ధర్మహృద్విహారా!
ధారణీసుతాకృతాంగా!
ధీరవారసత్ప్రసంగా!

గద్యము. ఇది శ్రీమత్త్రిపురసుందరీకరుణావాప్త గీర్వాణాంధ్రకవితాప్రాభవ కాశ్యపాన్వయప్రభవ శ్రీజనమంచివంశాంబురాశి కుముదినీమిత్ర సుబ్రహ్మణ్యమనీషిపుత్త్ర తాండవకృష్ణాపరాభిధేయ శేషాద్రినామధేయ వినిర్మితంబైన శ్రీధర్మసారరామాయణంబను మహాప్రబంధంబునందు యుద్ధకాండము సంపూర్ణము.

పూర్వభాగము సంపూర్ణము

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1937.